విద్యాసాగర్ గారి ప్రవచనాలు

http://sadhakudu.blogspot.in

https://groups.google.com/forum/#!forum/sadhakudu

'శరీరము నేను' అనే భావనను నిరసించడానికైనా, 'నేను ఆత్మ స్వరూపుడను' అనే భావనను స్థిరపరచాలన్నా "**అధ్యారోప అపవాదం**" అనే మార్గం తప్ప వేరే మార్గం లేదు. ఎందుకనయ్యా? అంటే, ఇప్పటి వరకు శరీరమే గొప్పది, శరీరమే విలువైనది, నేను శరీరమునే అనే పద్ధతిలో మనం మెలకువలో వున్నంత కాలం అలాగే జీవించాము. కాబట్టి అలా జీవించినది అంతాకూడా నిరసించాలి. నిరసిస్తే తప్ప సాధ్యం కాదు. అది నిరసించాలి అంటే, దాని కంటే గొప్పది అయినటువంటి అధ్యారోపము అధి ఆరోపము, దానికంటే అధికమైనటు వంటి దానిని దాంట్లో ఆరోపించాలి. అప్పుడే అది సాధ్యం అవుతుంది. దానికంటే అధికమైన దానిని ఆరోపిస్తే, దానికంటే తక్కువది అపవాదంగా నిరసించడానికి వీలౌతుంది. ఇది మన జీవితంలో మనం ప్రతినిత్యం చూస్తూనే వున్నాం. ఎలాగయ్యా?

బాల్యంలో వున్నది, బాల్యంలో మొట్టమొదట ఏం చేశాడు? ఆటలు ఆడుకున్నాడు. తరువాత దానికంటే అధికమైనది ఏమిటి? చదువు అధికమైనది. ఎందుకని? ఆ చదువు వల్ల బుద్ధి వికాసం కలుగుతుంది. ఆ బుద్ధి వికాసం కలిగినటువంటి దాని వల్లనే జ్ఞానం వస్తుంది అనేటటువంటి ఆధిపత్యం అధిష్ఠానంగా దానిని పెట్టాము. కాబట్టి దాని వలన ఏం జరుగుతోంది? అప్పుడు ఆ అధ్యారోపం ఆ చదువు కోసమని ఆ ఆటల్ని అపవాదంగా వదిలేస్తున్నాడు. వదిలేస్తున్నాడా? లేదా? ఆ చదువుకోసమని ఆటల్ని వదిలేశాడా? కాసేపు ఆడుకుంటున్నాడు, ఎక్కువ సేపు చదువుకుంటున్నాడు. కొంతకాలం అయ్యాక అసలు ఆటలు మానేశాడు, కేవలం చదువుకుంటూనే వున్నాడు. అలా ఎప్పుడైతే మీరు, జీవితం అంతా గమనిస్తూ వుంటారో అప్పుడు, "ఏ విషయమైనా ఇంతే. అది కొంత కాలం వుంటుంది. దానికంటే అధికమైనది మరొకటి వస్తుంది. ఇంతకు ముందు వున్నది అపవాదంగా నిరసించబడుతూ వుంటుంది" అనేది తెలుసుకుంటారు.

బాల్యమైనా, కౌమారమైనా, యవ్వనమైనా, వృద్ధాప్యమైనా ఏదైనా కూడా ఈ నాలుగు అవస్థలు ఇట్లాగే జరుగుతూవుంటాయి. అట్లాగే జాగ్రదావస్థ, అట్లాగే స్వప్నం, అట్లాగే నిద్ర.

ఇదే మానవ జీవితం మొత్తం అంతా వున్నదే అసలు ఈ అధ్యారోప అపవాదం. బుద్ధి అంతా దీనిమీదే ఆధారపడి వున్నదన్నమాట. కాబట్టి మీరు నిత్య జీవితంలో రోజువారీ చేసే ప్రతి ఆలోచన, ప్రతి చేత, ప్రతి మాట, ప్రతి కర్మ, ప్రతి సారీ కూడా '**నేను ఆత్మస్వరూపుడను**' అని ప్రారంభిస్తే తప్ప ఈ అభ్యాసం రాదు. అలా మీరు ప్రతి ఆలోచనని ప్రారంభించాలి. నిత్య జీవితంలో దానిని అలవాటు చేసుకోవాలి. అలా జీవిస్తున్నప్పుడు మాత్రమే '**నేను శరీరం కాదు**' అని స్థిరపడుతుంది. అప్పుడు మీరు ఏ పని చేసినా కూడా, ఏ సాధన చేసినా కూడా, ఏ విచారణ చేసినా కూడా ఆత్మభావనలో స్థిరపడడం కోసం మాత్రమే చేస్తారు. శరీరభావనలో స్థిరపడడానికి అవకాశం వున్నవి చెయ్యరన్నమాట. ఎందుకనీ? తెలిసిపోతూ వుంటుంది అప్పుడు. శరీరభావంలో స్థిర పడుతున్నాం అనంగానే వెంటనే పూర్వ దుఃఖాలు, పూర్వ అజ్ఞానం అంతా గుర్తుకొస్తుంది. మళ్ళీ అయ్యో నేను మళ్ళా అందులోకే పోతున్నాను అని తెలుసుకుని వెనక్కి విరమించుకో గలుగుతారన్నమాట. అట్లా విరమించు కోగలిగినప్పుడే సాధ్యమౌతుంది. ఎన్నైతే మనకి లోపల అహంతో కూడుకుని, అజ్ఞానంతో కూడుకుని వున్నటువంటి పంతాలు ఎన్నైతే వుంటాయో అవన్నీ దుఃఖానికి హేతువులే తప్పదు ఎప్పటికైనా వాటితో దుఃఖం తప్పదు.

ఎందుకయ్యా? దుఃఖం నీకు కలుగుతోంది అంటే, దుఃఖానుభవం వుంది అంటే, తప్పని సరిగా దానివెనుకాల అహం వుంటుంది. అంతే. దాని వెనుకాల అజ్ఞానం వుంటుంది. నిన్ను చూసుకో. ప్రతి అనుభవంలో చూసుకో. దుఃఖం కలుగుతోందండి ఈ విషయంలో, అయితే అహం వున్నట్లే. అయితే అజ్ఞానం వున్నట్లే.

ఎవరికైతే దుఃఖం నిశ్శేషంగా పోయిందో, వాడే జీవన్ముక్తుడు. దేనివలన కూడా అతనికి దుఃఖం కలుగదు. ముక్తుడైనటువంటి వాడికి దేని వలన కూడా దుఃఖం కలుగదు. అది మరణం వలన కూడా అతనికి దుఃఖం కలుగదు. శరీరాన్ని వదిలేస్తున్నానని సహజంగా వుంటాడు. అలాగే శరీరం పుట్టటం అనేది లేదు. శరీరం చనిపోవటం అనేది లేదు. నేను పుట్టలేదు. నేను చావలేదు. అని సహజంగా వుంటాడు. ఆ రెండిటికే లేనప్పుడు మధ్యలో వాటి గురించి అస్సలు చింతపడడు.

ఏది వచ్చినా ఏది పోయినా ఏది వున్నా ఏది లేకున్నా ఏది జరిగినా ఏది జరుగక పోయినా ఏది చేసినా ఏది చేయకపోయినా సహజంగా వుంటాడు. ఏ బాధను, ఏ దుఃఖాన్ని పొందడు. మరొకరెవరో తనకోసం ప్రవర్తించలేదని కానీ, ప్రవర్తించారని కానీ, సమాజం తనకు అనుకూలంగా వున్నదని కానీ, వ్యతిరేకంగా వున్నదని కానీ ఎట్టి దుఃఖాన్ని పొందడు. కాబట్టి ముక్తుడైనటువంటి వాడికి వున్న స్వేచ్ఛ ఎవరికీ లేదన్నమాట.

భగవద్గీత అంతా ఈ రెండు వాక్యాల మీదే మాట్లాడుతుంది. ఎంతసేపూ. నువ్వు ఎన్ని గుణాలనైనా నేర్చుకో, ఎన్ని ధర్మలైనా ఆచరించు, ఏదైనా చెయ్యి '**చేసి చెయ్యని వాడివి**' అవ్వాలి. విని వినని వాడివి అవ్వాలి. చూచి చూడని వాడివి అవ్వాలి. తిని తినని వాడివి అవ్వాలి. అన్నీ అంతే. జీవించి జీవించని వాడివి అవ్వాలి. జీవిస్తూనే వున్నావు. కానీ నేను ఆత్మస్వరూపుడను అనే భావంతో శరీరంలో వున్నాను. శరీరం అనే గృహంలో యజమానిగా, నేను ఆత్మ స్వరూపంగా వున్నాను. శరీరమే నా గృహం. అంతేకానీ, శరీరం నివసించే గృహం కాదు నా గృహం. ఎందుకని? ఎప్పటికైనా శరీరమనే గృహాన్నే విడిచిపెట్టి వెళ్ళాలి కదా నేను. అపవాదంగా నిరసించివేయాలి కదా దీనిని నేను. ఇది మధ్యలో తెచ్చుకున్నది కదా. మధ్యలోనే పోతుంది కదా. ఎల్లప్పుడూ వుండేది ఆత్మస్వరూపం కదా. మధ్యలో వచ్చిన గృహం మనతోనే చివరిదాకా వుంటుందా? ఎట్లా వుంటుంది? వుండదు కదా! శరీరం అనే గృహాన్ని విడిచిపెడుతున్నాను కదా మరీ. దేహమనే ఇంటిని దేహి విడిచిపెడుతున్నాడు కదా. అధ్యారోప అపవాదమంటే అర్థం ఇది.

"**అధ్యారోప అపవాదం**" అనే మార్గంలో తప్ప వేరే మార్గంలో ఆత్మజ్ఞానం లభియించదు. అది '**వాసుదేవ మననము**'లో చెబుతున్నటువంటి మొట్టమొదటి సూత్రం. ఎందుకనయ్యా? అంటే, నవవిధ భక్తి మార్గాలని ఆచరించాలి చిత్తశుద్ధి కోసం. నీలో వున్నటువంటి విషయాల యెడల వున్న అనురాగాన్ని తగ్గించుకోవడం కోసం నవవిధ భక్తి మార్గాలని ఆచరించాలి. విషయాల యెడల వున్న అనురాగం వల్లనే, నేను శరీరం అని బలపడిపోతున్నావు. ఆ విషయాలలో వున్న అనురాగం తగ్గాలి. అనురాగం తగ్గాలి అంటే రెండు పద్ధతుల్లో తగ్గుతుంది. ఎలాగ? మొట్టమొదట్లో పరోపకారం కోసమని చేయాలి. నీకేమీ ఫలాన్ని అపేక్షించకుండా పరోపకారం కోసమని సేవాభావంతో చేయాలి. అదొక పద్ధతి. దానికంటే ఉన్నతమైన పద్ధతి త్యాగం. కర్మఫలత్యాగంతో చేసే పద్ధతి ఒక పద్ధతి. విషయాలలో మనం జీవించాలి. కానీ రెండు పద్ధతులలో జీవించాలి. ఎట్లాగయ్యా అంటే, నిష్కామకర్మ, అమనస్కం. ఈ రెండు పద్ధతులు వుంటాయన్నమాట. నిష్కామ కర్మ అంటే కర్మ యొక్క ఫలితాన్ని ఆశ్రయించకుండా చేయడం నిష్కామకర్మ. దానికంటే ఉన్నతమైనది ఏమిటయ్యా అంటే అమనస్కం. మనస్సుతో పని లేకుండా, కర్మఫలత్యాగ బుద్ధితో, అసలు కర్తయే లేడు అనే పద్ధతిలో చేస్తే, అది అమనస్కభావానికి చేరుతుందన్నమాట.

ఈ స్థాయికి రావాలంటే కాస్త సాధన అయితే కానీ రాలేరు కదా?

అభ్యాసం – కామకర్మలో బాగా పరిణితి చెందాలి. కామ కర్మ చేసే అలవాటు రావాలి కదా ముందు. ముందు ఇప్పటి వరకూ ఎలా చేశాం మనం? ఫలితాన్ని అపేక్షించి చేస్తూ వచ్చాము. లలితా సహస్రము చదివాము. చదివితే ఫలశృతి చదివేశావు. చివరకు ఆ ఫలితం వచ్చింది, ఈ ఫలితం వచ్చింది అంటున్నావుగా. వ్రతంలో కూడా ఆ ఫలితం వస్తుంది, ఈ ఫలితం వస్తుంది అని ఫలశృతి చదువుకుంటున్నావుగా. ఆ ఫలశృతి చదివేప్పుడు ఈ ఫలంతో నాకు పని లేదు. నేను ఆత్మస్వరూపుడుని వీటితో నాకు పనిలేదు అనే భావం కలిగిందా అప్పుడు? కలుగలేదుగా. అందువల్ల ఏమైంది? ఆ నవవిధభక్తి మార్గాలు ఆచరించావు, కానీ ఏమైంది? కామ్యక కర్మలు అయిపోయినాయి. అంటే కోరికతో చేశావన్నమాట. ఇదిగో ఫలానా నిమిత్తమై ఈ పని చేస్తున్నాను. అని పెట్టుకుని చేశావు. నాకు జ్ఞానం ఒక్కటే కావాలి, నాకు మిగిలింది అవసరం లేదు, వైరాగ్యం ఒక్కటే

కావాలి, మిగిలింది అవసరం లేదు, జ్ఞానవైరాగ్యాలు తప్ప మిగిలింది నాకు అవసరం లేదు, అనేటటువంటి స్థితిలో స్థిరపడి ఎప్పుడైతే చేస్తావో, అప్పుడే అది నిష్కామ కర్మ అవుతుందన్నమాట. లేకపోతే అవ్వదు.

ప్రతీది అదే (అలాగే) చెయ్యాలిగా? మనమేమో కొన్ని చేస్తాం, కొన్ని చెయ్యము...

ఆఁ... అంటే అనువైనవి చేస్తావు, దానికి అనువైనటువంటివి చేస్తావు. ఆ విషయంలో ఆ పరిస్థితిలో ఆ సమయానుకూలంగా వుంటే, అలా చేస్తావు. లేకుంటే మామూలుగా చేసేస్తావన్నమాట. అదేకదా జీవుడంటే. శరీరభావమంటే. కాబట్టి ప్రతి అంశంలో, ప్రతి ఆలోచనలో కూడా 'నేను ఆత్మస్వరూపుడను' అనే భావంతో చేసినప్పుడే అహం లేకుండా పోతుంది.

జీవుడనే అహం వున్నంతవరకు అహంకారం తప్పదు. ఆ అహం వెనుక దుఃఖం తప్పనిసరిగా వుంటుంది. దాని వెనకాలే వస్తుందది ఎప్పుడూకూడా.

ఆ అహం ఎందుకు వస్తుంది?

అహం రాలేదు నీకు. అహం అంటే నేను. ఆకారం అంటే శరీరం. 'నేను శరీరమునే' – అనుకోవడం చేత అహంకారం అయ్యింది. ఆకార భావన తీసివేస్తే, నేనుకు వచ్చిన సమస్య ఏముంది అసలు? ఇప్పుడు గాఢ నిద్రావస్థలో వున్నావమ్మా... ఇప్పుడు ఆకారం వుందా నీకు? లేదుగా. సుఖంగానే వున్నావుగా. దుఃఖం ఎక్కడ వుంది నీకు గాఢనిద్రావస్థలో, ఏ జీవికైనా దుఃఖం వుందా? లేదు కదా! అవకాశమే లేదు కదా. ఎందుకని? ఆకారభావం లేదు కాబట్టి. మరి మెలకువలోకి రాగానే ఆకారభావాన్ని ఎందుకు తెచ్చుకున్నావు? తెచ్చుకోకూడదు కదా లెక్క ప్రకారం, ఇక్కడ కూడా అలాగే వుండవచ్చుగా. నేను నేనుగానే వుంటే, ఒక్కసారి ఎవరికి వాళ్ళు ఆలోచించుకోండి ఇది. గాఢనిద్రావస్థలో ఎలా వున్నావు? నేను నేనుగానే వున్నాను. సుఖంగా వున్నాను. పుట్టింది మొదలు, తల్లి గర్భంలో వున్నప్పటి నుంచి ఈ నిద్ర నడుస్తూనే వుంది. ఆఖరి పెద్ద నిద్ర దాకా. మరి అక్కడ ఎలా వున్నావు? నేను నేనుగానే వున్నావు కదా! నేను సుఖంగానే వున్నావుగా. ఏం చేశావట? మధ్యలో ఆకారాన్ని తెచ్చిపెట్టావు. తెచ్చిపెట్టేటప్పటికి ఏమయ్యింది? ఆకారమే నేను అయిపోయింది. అంటే ఈ నేనుకు ఒక లక్షణాన్ని

అభ్యాసాన్ని అలవాటు చేశావు. ఏమిటట? ఎందులో దూరితే అది నేనై పోతూ వుంటుంది. అర్థమైందా?

ఆటవస్తువులతో ఆడేటప్పుడు ఆటవస్తువులే నువ్వు. పుస్తకాలు చదివితే, పుస్తకాలే నువ్వు. విషయాల్లో చేరితే, విషయమే నువ్వు. జ్ఞానంలో చేరితే, జ్ఞానమే నువ్వు. ఈ నేనుకు ఆ లక్షణం వుందన్నమాట. ఎందులో చేరితే అది అదైపోతూ వుంటుంది.

జ్ఞానంలో చేరితే నేను, మంచిదే కదా ?

మంచిదే కదా మరీ. కానీ నిలబెట్టలేక పోతున్నావు కదా! అభ్యాసం లేకపోవడం చేత నిలబెట్టలేక పోతున్నావు అంతే. అభ్యాసం చెయ్యి. నిలబడుతుంది. నడవడానికి ఎంతకాలం ప్రయత్నం చేశావు? రెండు సంవత్సరాలు ప్రయత్నం చేస్తేనే కాని శరీరం నడవడానికి సిద్ధపడలేదు. అంతేనా కాదా? పరిగెత్తడానికి? ఇంకా కొంతకాలం. స్థిరంగా వుండడానికి? ఇంకా కొంతకాలం. ఇప్పుడు? కూర్చుంటే లేవాలంటే కుదరదు. అర్థమైందా? దానికి అభ్యాసం చేస్తున్నావు. కాబట్టి జీవితమంతా అభ్యాసమేనా? కాదా? ప్రతీదీ అభ్యాసమే. కానీ నిన్ను ఏ అభ్యాసం చేయమంటున్నారు? ఏ అభ్యాసం చేస్తే, దుఃఖం తొలగిపోతుందో అది. ఇప్పటివరకూ మిగిలినవన్నీ చేశావు, వాటివల్ల ఏం మిగిలింది? దుఃఖం మిగిలింది.

(అది దుఃఖం అనుకోలేదు కాబట్టి అట్లా చేస్తూ పోయాం....)

అదే సుఖం అనుకున్నావు. ఆ విషయసుఖమే శాశ్వతమనుకున్నావు. ఏమైంది కొంతకాలం అయినాక పోయింది. పోయిందనే అనుభవం వచ్చిందా లేదా? ఇప్పుడు. అప్పుడు చెబితే తెలియదు. అది కాసేపు వుండి పోతోంది అనేది నీకు నీకు తెలియాలి. ఇప్పుడు ఇందులోకి వచ్చిన తరువాత అది తెలిసింది.

అంటే అర్థం ఏమిటి? ఆత్మజ్ఞానం దృష్టితో చూస్తే గానీ, అది కాసేపు వుండి పోతోందిరా బాబూ అని తెలియడం లేదు. అంటే అర్థం ఏమిటటా? అందులోనే వుండి చూస్తే తెలియదురా నాయనా నీకు. కాసేపు పక్కకురా బయటకి. ఆ విషయంలోనుంచి కాసేపు పక్కకు వచ్చి, అసలు ఆ విషయం బలం ఎంతో చూడు ఒక్కసారి. ఆ విషయానికి శక్తి ఎంత? నిన్ను లాక్కుపోయేంత శక్తి ఎక్కడినుంచి వచ్చింది దానికి? నువ్వు ఆమోదిస్తేనే కదా! నిన్ను ఎవరు ఆమోదించమన్నారు? నిన్ను వెళ్ళి అందులో ఎవరు చేరమన్నారు?

(ఒకటుంది, ఇందులో ఆనందం వుంది అని భ్రమపడి) తెలియక చేరావు. తెలియకపోవడమే కదా అజ్ఞానం. వేరే ఇంకేం లేదయ్యా బాబూ. ఏం చేస్తే దాంట్లోనుంచి బయటపడతావో తెలియకపోవడమే అజ్ఞానం. తెలిసిందిగా మరి ఇప్పుడు. అభ్యాసం మార్చుకో. పోయినదానిని గురించి చింతపడతావే? అభ్యాసం మార్చుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదుగా నీకు ఇంతకుముందు కూడా. ఒక కొత్త అంశాన్ని నేర్చుకోవాలమ్మా, నేర్చుకున్నావా? నేర్చుకోలేదా? నేర్చుకున్నావు. అట్లాగే ఇప్పుడూ నేర్చుకోగలుగుతావు. నీ బుద్ధికి ఆ శక్తి ఎప్పుడూ వుంటుంది.

కానీ అది వచ్చినంత తొందరగా ఇది రావడం లేదు కదా?

ఎందుకనయ్యా అంటే దానికి బలం ఎక్కువ చేకూర్చావుగా మరీ! అవునా కాదా? ఇంతకాలం దేనికి బలం చేకూర్చావు? దానికి బలం చేకూర్చావా? ఇప్పుడు ఆ బలాన్ని నిరసించాలా? అవునా కాదా? ఉదాహరణ చెబుతా చూడు. మీ ఇంట్లో పెరిగినంత కాలం, వివాహం కానంత కాలం నువ్వు ఏమని అన్నావ్? మీ అమ్మగారి ఇల్లే నీ ఇల్లుగా వున్నావా? లేదా? వివాహం అయినాక కొంతకాలం పాటు ఏమన్నావు? అది మా అమ్మ ఇల్లు, ఇది మీ ఇల్లు, అది మా అమ్మ ఇల్లు, ఇది మీ ఇల్లు, ఇది మా అమ్మ ఇల్లు, ఇది మీ ఇల్లు అన్నావా? మీ అత్తగారు వగైరాలు అందరూ గతించి నువ్వే యజమానివి అయ్యావండీ, ఏమైంది ఇప్పుడు?

నాది అయిపోయింది. అంటే నీవు యజమానిగా వున్నప్పుడు అంతా నీదే. అర్థమైందా? అప్పుడు పుట్టిల్లు, మెట్టినిల్లు తేడా వుందా? లేదు. మరొకరు యజమానిగా వున్నప్పుడు మాత్రం ఏం చెప్పావు? మీ అత్తగారు, మామగార్లు యజమానులుగా వున్నప్పుడు ఏం చెప్పావు? మీ అమ్మానాన్నలు కూడా వున్నారుగా అప్పుడు. అప్పుడు నా పుట్టిల్లు వుంది, మెట్టినిల్లు వుంది. రెండు ఇళ్ళు వున్నాయి అప్పుడు నీకు. ఎప్పుడైతే పైన యజమాని పోయాడండీ, నువ్వే యజమానివి అయిపోయావు. ఏమైంది అప్పుడు స్వేచ్ఛ రాలా? అట్లాగే, ఇప్పుడేమయ్యావు? విషయంలోకి చేరావండి. విషయము యజమానియై కూర్చుంది. ఏమయ్యావు అప్పుడు? నేను యజమానిగా వుండాలి అసలు ఎప్పుడూ కూడా. కానీ ఏమయ్యింది? విషయం యజమానియై కూర్చుంది. అప్పుడు ఏమైపోయావు? సుఖం దుఃఖం అనే రెండు ఇళ్ళు వచ్చినాయి. విషయం ఎప్పుడైతే

యజమాని అయ్యిందో, సుఖం దుఃఖం అనే రెండు ఇళ్ళు వచ్చినాయి. మాటిమాటికి ఏమంటావు? నేను పుట్టింట్లో అయితే సుఖంగా వుండేదాన్ని, అత్తింటికి వచ్చి కష్టపడిపోతున్నాను. అంటున్నావా? లేదా? మళ్ళా ఇక్కడ సుఖం వచ్చినప్పుడు? అక్కడ దుఃఖం గుర్తుకు వస్తుంది. ఇట్లా ఏమయ్యావ్ ఇప్పుడు అట్లా రెండు ఇళ్ళు రెండు ఆశ్రయాలు ఏర్పడుతున్నాయి. అయితే, నేను యజమానిగా వున్నానండి ఇప్పుడు, ఇక విషయంలో వున్న సుఖం దుఃఖంతో నాకేం పని? స్వేచ్ఛ వచ్చేసింది ఇప్పుడు నాకు. స్వేచ్ఛ వచ్చేసినాక ఇప్పుడేమై పోయింది? అన్నీ పనుముట్లు అయిపోయినాయి. అన్నీ పనిముట్లు అయిపోయినాయి. ఎప్పుడైతే పనిముట్లు అయిపోయినాయో, అప్పుడు ఏమైంది సహజంగా? సమస్యలు లేకుండా పోయిందిగా. ఎప్పుడైతే నీవు యజమానిగా వున్నావో, అన్నీ నీ ఆధీనంలో వున్నాయి. దేనిని కావాలంటే దానిని పనిముట్టుగా వాడు. అది నువ్వు కామాకు. ఏనుగు నడిపే మావటివాడు, ఏనుగు వాడైతే వాడు ఎట్లా నడుపుతాడు? నడపగలడా? నడపలేడు కదా! గుర్రాన్ని నడిపే రౌతు, వాడు గుర్రమైతే నడుపగలుగుతాడా? నడుపలేడు కదా! మనం ఇప్పటివరకూ ఏమౌతూ వచ్చాము? నువ్వు దాన్ని నడపరా నాయనా అని భగవంతుడు పంపిస్తే, శరీరాన్నీ, ఇంద్రియాల్ని, విషయాల్ని, జగత్తుని అర్థం చేసుకో, వాటిని నడుపు. రాజు వలె నడుపు. యజమాని వలె వుండు. అని భగవంతుడు నీకు ఆ శక్తి సామర్థ్యం ఇచ్చి, మానవ ఉపాధిని ఇచ్చాడు.

కానీ ఆ మానవ ఉపాధిలోకి వచ్చినా, పూర్వ జంతు అభ్యాసము పోలేదు. అర్థమైందా? నీకు పాకే జంతువు నుంచి, నడిచే జంతువుకు వచ్చావా? రాలేదా? ఆవిధంగా రాబట్టేగా ఇక్కడ ఎవరూ నేర్పకుండా పాకడం నుంచి నడవడానికి వస్తున్నావు.

★ మానవ జన్మలలో చాలా జన్మలు అయిపోయినాయి కదా, ఇంకా ఆ జంతు జన్మల అభ్యాసాన్నే ఎందుకు తీసుకోవాలి?

ఎందుకు రాలేదు అంటే, నీ బుద్ధి వికాసంలో ఎప్పుడూ ఇలా విచారణని పెట్టలేదుగా. ఇప్పుడేగా మొదలు పెట్టావు. ఆ బుద్ధి వికాసం పూర్తయ్యే పని చేయలేదుగా. ఎంతసేపూ. బుద్ధి వికాసం ఎప్పుడు పూర్తయ్యింది? విచారణ జ్ఞానం పెడితే బుద్ధి వికాసం పూర్తై పోయింది. అప్పుడు నీకు మానవజన్మ ఎందుకు వచ్చిందో స్థిరంగా అర్థమయిపోయింది.

ఇప్పుడు మానవ ఉపాధిని అసలు ఎట్లా ఉపయోగించుకోవాలనే పద్ధతిలో జీవించడం మొదలు పెట్టావు. అప్పుడు కదా ఆఖరి మానవ జన్మ అయిపోయింది. ఎప్పటికప్పుడు నీకు జంతువు జన్మ ఎట్లా అయిపోయింది? ఆ జంతువు జన్మలో నీవు సాధించవలసినది, పొందవలసిన జ్ఞానాన్ని నీవు పొందేస్తే ఆ జంతువు ఉపాధి అక్కడితో అయిపోయి దాని పైస్థితిలోకి వస్తూ వచ్చావు. అట్లాగే, ఆఖరికి మానవ ఉపాధి లభించింది. ఈ మానవ ఉపాధికి ఆఖరు ఏమిటయ్యా? దీని తరువాత ఏమిటి? బుద్ధి వికాసం పూర్తవ్వాలి నాయనా! ఏమిటి పూర్తవ్వాలి? విచారణ జ్ఞానం చేత నేనే పూర్తిగా అంతటా వ్యాపించి వున్న వాడను. నేనే సత్యం, నేనే శాశ్వతం, నేనే సనాతనుడను, నేనే పరమాత్మను, నేనే ఆత్మస్వరూపుడను, నేనే భగవంతుడను. అనే జ్ఞానం కనుక నీకు లభిస్తే, మానవ ఉపాధి నీకు ఎందుకు వచ్చిందో దాని పని అయిపోయినట్లే. ఇంక అప్పుడు నీకు ఆ ఉపాధితో పనిలేదు. పనిలేదు కాబట్టి నీవు ఏం చేస్తావు? మళ్ళా పుట్టాల్సిన అవసరం లేకుండా పోయింది. ఎందుకు పుడుతున్నావు? (ఇది తీరలేదు కాబట్టి పుడుతున్నావు) ఈ జ్ఞానం లేదు కాబట్టి పుడుతున్నావు. మరల మరలా మానవుడిగానే పుడుతున్నావు. కానీ ఏమౌతావో తెలియదుగా. అందుకని మానవోపాధి నీకు ఎందుకు లభించిందో మొట్టమొదట నీవు తెలుసుకో. బుద్ధి వికాసం కోసం మానవోపాధి లభించింది. ఆ బుద్ధి వికాసం పూర్తి అవ్వాలంటే విచారణాజ్ఞానం కావాలి.

కానీ విచారణాజ్ఞానాన్ని విషయం వరకే పరిమితం చేసుకోవడం చేత, శరీరము, విషయము వరకే పరిమితం చేయడం వల్ల ఏమైపోయావు?

తాత్కాలిక సుఖాన్ని మాత్రమే ఆశ్రయించే పద్ధతిలో జీవించావు. అందువల్ల ఏమైంది? విషయాలు రాజై కూర్చున్నాయి. యజమానై కూర్చున్నాయి. అవి బలబడిపోయినాయి. అందువల్ల ఇప్పుడు ఏం చెయ్యాలట? అసలు నాకు మానవ ఉపాధి ఎందుకు లభించింది? ఈ విషయం కోసమేనా? నేను పుట్టింది దేనికోసం? అనే ప్రశ్న వేసుకో మొట్టమొదట. ఎవడికో ఒకడికి రోజూ ఒక వంకాయ కూర చేసిపెట్టడానికో, ఒక గోంగూర చేసిపెట్టడానికో, ఒక సాంబార్ చేసి పెట్టడానికో పుట్టానా? నేనేమన్నా? నేను దేని కోసం పుట్టాను? తోముకోవటం, అన్నం వండుకోవడం, గిన్నెలు తోముకోవడం, అన్నం వండుకోవడం, గిన్నెలు తోముకోవడం, తినడం, పడుకోవడం ఇంతేనా?

వేరే పని లేదా ఇంకా? ఎందుకు పుట్టా నేను అసలు? మనం రోజూ ఇదేగా పనిచేస్తోంది? వేరే ఇంకా ఏమన్నా పనిచేశామా? 40 ఏళ్ళు, 50 ఏళ్ళు వెనక్కి తిరిగి చూడండి, అందులోనే సుఖాన్ని వెతుక్కున్నావు. ఆ అంట్లు తోమడంలోనే శుభ్రంగా తోమాను, తళ తళలాడేటట్లు తోమాను, సర్ఫ్ పెట్టి తోమాను, విమ్ పెట్టి తోమాను... ఇట్లా ఏమైపోయావ్? తాత్కాలిక సుఖం, తాత్కాలిక ప్రాధాన్యత, తాత్కాలిక ప్రత్యేకత... ఎవరైన బాగుందంటే? అయిపోయే... మహదానంద పడిపోయావ్. మహదానందం అందులోనే వుందనుకున్నావ్ అంతే. అబ్బా! మీరు పెట్టిన సాంబారు అద్భుతమండీ అంటే, ఇకచాలు ఓ పొంగిపోయావు. ఏనుగంత అయిపోయావు అంతే. అవునా కాదా? మరి విషయం కదా ఇది. ఈ సాంబారు ఎంత సేపు వుంటుంది? రేపటికి ఏమైపోతుంది? ఎంత గొప్పదైనా తీసి దిబ్బలోకి కొట్టాల్సిందేనా? నువ్వు చేసినా, నేను చేసినా? మరి ఇందులో శాశ్వతత్వం ఏమైనా వున్నదా? లేదు. ఇవాళ పొగిడినవాడు, రేపు సరిగా నువ్వు చేయలేదండీ, ఏమన్నాడు? (తిట్లు) అప్పుడేమైంది మరీ? నిన్న బాగా చేశాను, ఇంకా బాగా చెయ్యాలనే భ్రాంతిలోనే వున్నాను. ఏమయ్యావప్పుడు? అర్థమైందా? అంటే అర్థం ఏమిటి? నాయనా విచారణా జ్ఞానం లేక చేయడం వల్ల ఇలా అయిపోయావ్. కాబట్టి అభ్యాస బలాన్ని మార్చుకో. అంతేకాని గతంలోకి వెళ్ళి ఊబికే చిక్కు పడమాక. గతం గడిచిపోయింది కదా! గడిచిపోయిన అనుభవాన్ని దృష్టిలో వుంచుకుని మళ్ళా అందులోకి పోమాక. అదీ చేయవలసినది.

కానీ మనమేమి చేస్తున్నాము? (అటు పోవద్దన్నా మళ్ళా మనసు వెళ్ళిపోతుంది కదా అక్కడికి) పోతేపోని మళ్ళా తిరిగి ఇక్కడికే వస్తుంది. నువ్వు స్థిరంగా వుండు. ఇంకా నేనంటే ఏమిటి? ఆఁ... అంటే ముందు ఏం చెప్పాలి? మనసు నేను కాదని చెప్పాలి. మనసుకు చెప్పాలి. అది. నువ్వు నా చేతిలో పనిముట్టువు కానీ, నేను నువ్వు కాదు. ఆ ఆలోచన వచ్చిన ప్రతి నిమిషం చెబుతూ వుండాలి దానికి. ఏయ్ నువ్వు మళ్ళీ వచ్చావా? చూస్తున్నాను నిన్ను. నేను గమనిస్తున్నా నిన్ను. మళ్ళా వచ్చావు నువ్వు. నేను గమనిస్తున్నాను. నాలో రజోగుణం పనిచేస్తుంది. నాలో తమో గుణం పనిచేస్తుంది. నాలో సత్వగుణం పనిచేస్తుంది. నాలో ఈ మూడు గుణాలు ప్రారంభమైనాయి, నేను

గమనిస్తున్నాను. నేను నిన్ను చూస్తున్నాను. నిన్ను గమనిస్తున్నాను. నేను గమనించేవాడను. నేను సాక్షిని. నిన్ను గమనిస్తున్నాను. నువ్వు నేను కాదు ఎప్పటికీ, నా చేతిలో నువ్వు పనిముట్టువి. ఈ వాక్యాలు నీ మనసుకి చెబితే, ప్రతి ఆలోచనకి దానికి నువ్వు ఇట్లా చెప్పాలి. ప్రతీ క్షణం ఇక అదేపనిలో వుండాలి. అప్పుడు అభ్యాసం మారిపోయింది. ఎంతసేపు ఎంతో టైం పట్టదు దీనికేమీ, ఒక్క సంవత్సరం గట్టిగా కష్టపడు ప్రతి ఆలోచనకు ఇట్లా చెప్పడంతో స్థిరపడిపోతావు అంతే. ఒక్క సంవత్సరం చాలు. విచారణా జ్ఞానంలో ఒక్క సంవత్సరం పాటు ఎవడైతే, త్రికరణ శుద్ధితో ప్రతి ఆలోచనకి నేను మనసును కాదు, నేను బుద్ధిని కాదు, నేను ఇంద్రియాలను కాదు, నేను శరీరమును కాదు, నేను ఆత్మ స్వరూపుడను, (ఇది ముందు గుర్తు వుండాలి కదా, పనిలో పడిపోయి ఇది మరచిపోతున్నాము కదా!) పని కంటే ముందు ఆలోచన. ఆలోచన కంటే ముందు విచారణ. అర్థమైందా? ఇలాగ చూసుకోండి. అలా ఆ పుస్తకం చదవండి. చక్కగా విచారణ చేయండి. ప్రశాంతంగా ఈ వారంపాటు ఆ '**వాసుదేవ మననము**' చదవండి. జరిగిపోతూ వుంటుంది. మళ్ళా మళ్ళా వింటూ వుండండి. అందరు తెచ్చుకున్నారు కదా! ఇది.

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే ||

ఓం తత్ సత్

ఓం సహనా వవతు సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై తేజస్వి నావధీతవస్తు మావిద్విషావహై ఓం శాంతిః శాంతిః శాంతిః

సాయిరాం,

మొదట్లో మనం ఇక్కడే కదా మొదలు పెట్టింది, ధర్మార్థకామమోక్షాల దగ్గరే మనం కూడా క్లాస్ మొదలు పెట్టాము. దానిని ఎలా విచారణ చేశాం?

ధర్మాన్ని ఆచరించాలి, ఎట్లా ఆచరించాలయ్యా?

మోక్షం దృష్ట్యా ధర్మాన్ని ఆచరించాలి.

అర్థాన్ని సంపాదించాలి, ఎట్లా సంపాదించాలయ్యా?

మోక్షం దృష్ట్యా అర్థాన్ని సంపాదించాలి.

కామాన్ని (కోర్కెని) అనుభవించాలి, ఎట్లా అనుభవించాలి?

మోక్షం దృష్ట్యా కోర్కెను అనుభవించవయ్యా!

అలా చేసినట్లయితే అవి నిన్ను బంధించవు. ఇప్పుడు మనని బంధించేవి ఏమిటి? ఈ ధర్మార్థకామాలే. వేరే ఇంకేమీ లేదు. చూడండి మీరు, ఏ పని చేయనివ్వండి, అది ధర్మం కాదు కదా! అవునా కాదా? లేకపోతే అది నష్టం కదా! ఇది లాభం కదా! అది ఇష్టం కదా! ఇది అయిష్టం కదా!

ఇష్టాయిష్టాలు ఎందులోవి?

కామంలోవి. కోర్కెలోవి. అర్థమైందా?

'అది లాభం కదా, ఇది నష్టం కదా' అనేవి అర్థం లోవి.

అది ధర్మం కదా, ఇది అధర్మం కదా అనేవి ధర్మం లోవి.

మనం మాట్లాడే వాటన్నిటిలోనూ ఇవేనా వున్నాయి?

అన్నీ రూల్స్ ఇవేగా మనం మాట్లాడేది, ఏదన్నా చేయనివ్వండి. మీరే పొద్దున్న లేచారండీ, ఏదో పొరపాటున కారణం చేత బొట్టు పెట్టుకోలేదండీ! ఇప్పుడేమైందట? ప్రమాదం ఏమన్నా వచ్చిందా? ఏం రాలేదుగా. వున్న నొసలును ఎవరూ తీసేయలేదుగా. అర్థమైందా? నిలువు బొట్టు పెట్టినా, అడ్డబొట్టు పెట్టినా, అసలు బొట్టు పెట్టకపోయినా వున్న నొసలను ఎవరూ ఏమీ మార్చలేరుగా. అవునా కాదా? కానీ అందరూ ఎట్లా అలవాటు పడిపోయారు? మీకు మీరే అద్దంలోకి చూసుకోగానే, ఏదో పెద్ద బ్రహ్మాండం బ్రద్దలైపోయినట్లు, ప్రమాదం వచ్చేసిందనే భావన మీకు కలుగుతుంది. ఎందువల్ల?

అది ధర్మం కాదు కదా!

ఏమిటి ధర్మం కాదు?

అది ఆచరించడం ద్వారా, నీవు మోక్షం మీద దృష్టితోనే ఆచరిస్తున్నావా దాన్ని?

ఆచరించడం లేదు కదా!

మరప్పుడు అది ధర్మం ఎలా అయ్యింది?

ధర్మం అంటే అర్థం ఏమిటయ్యా అంటే నువ్వు అది ఆచరించినప్పుడు నీకు మోక్షం గుర్తుకురావాలి నాయనా!

(ఇన్నాళ్ళు) ఆ వివరణ ఎవ్వరూ మాకు ఇవ్వలేదు కాబట్టి, ఇప్పుడు మార్చుకోవాలి.

చెప్పేది ఏమిటంటే, గతం గతః. ఇప్పుడు ఆచరించేటప్పుడు నేను ఈ పని చేస్తున్నాను ధర్మం అని. ఇది ధర్మం ఎప్పుడు అయ్యింది? ఇది చేస్తున్నప్పుడు నాకు మోక్షం యొక్క జ్ఞాపకం కనుక వచ్చినట్లయితే, నేను ఈ మానవజన్మ ఎత్తి ఈ ధర్మాన్ని ఎందుకు ఆచరించ వలసిన పరిస్థితి వచ్చింది? అంటే, ఈ మానవజన్మకు గమ్యం ఏమిటి? మోక్షమే గమ్యం, వేరే లక్ష్యం లేదు. మోక్షం అంటే ఏమిటయ్యా? మళ్ళా పుట్టడానికి వీలు లేదు, మళ్ళా చావడానికి వీలు లేదు. జన్మ మరణం రెండూ లేకుండా చేసుకోవడమే మోక్షం. అర్థమైందా అండీ? కాబట్టి నేను ఈ ఆచరణ చేసేటప్పుడు నేను ఆ దృష్టితో చేస్తున్నానా? ఆ శాశ్వతమైనటువంటి దృష్టితో కనుక చేస్తే, అది ధర్మం అయ్యింది. ఈ ఆచరణ ద్వారా నాకది లభించాలి. అంతేకదా!

ఏం చేసినా ఎవరైనా మోక్షాన్ని ఆచరించడానికి వీలౌతుందా?

వీలు కాదు కదా!

ఏం ఆచరించుతాం మనం?

ధర్మం అర్థం కామం. ఈ మూడింటిని ఆచరించేది.

ఆచరించేది ఈ మూడే, కానీ ఏ లక్ష్యంలో? ఆ మూడు ఆచరిస్తే ఫలితం ఏది రావాలట?

మోక్షం అనే ఫలితం రావాలి.

కానీ ఈ మూడు ఇప్పటి వరకూ ఆచరించ లేదా?

ఆచరించాం.

కానీ ఏం రాలేదు?

మోక్షం అనే ఫలితం రాలేదు.

అంటే ఏమనుకుంటాం?

అది నాలుగోది, ఈ మూడు అయిపోయినాక ఆ నాలుగోది చేద్దామని మన అభిప్రాయం. అంటే ఆ నాలుగోదాని యొక్క సంగతే లేదు, ఆ జోలే లేదు మనకి.

ప్రతి వాళ్ళు మీకు పెళ్ళిలో చెప్పనివ్వండి, నామకరణంలో చెప్పనివ్వండి, ఎప్పుడన్న చెప్పనివ్వండి ధర్మార్థ కామ మోక్షాలు నాలుగు చెబుతున్నాడుగా అక్కడ. నాలుగు పురుషార్థాలని జీవుడనేవాడు ప్రయత్నించాలి, పురుషార్థములు అంటే ప్రయత్న సాధ్యములు. సాధనతో సాధింపబడేవి. నీవు ప్రయత్నం చేసి సంపాదించాలి వాటిని. అని చెబుతున్నాడుగా. పురుషార్థములు అంటే పురుషులు చేసేవని కాదు. మానవ దేహం ఎత్తినటువంటి ప్రతి జీవుడికి ధర్మార్థ కామ మోక్షాలను ఆచరించేటటువంటి అర్హత వున్నది. ఆ మోక్షం అనే ఫలితాన్ని పొందే అవకాశం వున్నది. జంతువులకు లేనిది, మానవులకు కలిగినది ఇది ఒక్కటే. పరమాత్మ ఇవ్వగలిగేది కూడా ఇది ఒక్కటే.

ప్రతి నిమిషం నువ్వు పరమాత్మని నాయనా నువ్వు కొబ్బరికాయ ఇవ్వు, నాకు అది ఇవ్వు, నాకు ఇది ఇవ్వు అని అడగాల్సిన పనిలేదు. ఆయన చేసేదేదో ఒకసారే చేసేశాడు, ఏమిటి చేశాడు?

84 లక్షల జీవరాశులలో, వాటికి ధర్మం వుందా వాటికి?

ధర్మం అనే విచక్షణ వుందా?

ధర్మాధర్మ విచక్షణ లేదు.

లాభనష్టాల విచక్షణ వుందా?

లేదు.

కోర్కె ఒక పరిమితమైన దాని మేరకే అన్నం ఆహారం సంపాదించుకోవడం, నిద్రపోవడం, వాటి సంసారాన్ని చేయడం. ఇంతవరకే వాటికి పరిమితులు విధించి, 84 లక్షల జీవరాశులు జీవిస్తున్నాయి. కానీ,

ఈ ధర్మార్థ కామాలలో నూరుశాతం స్వేచ్ఛ ఎవరికి ఇచ్చాడు?

మానవుడికి ఇచ్చాడు.

కోర్కె అనేది వుంటుందా వాటికి (జంతువులకు)?

అయ్యో! కోర్కె లేకుండా సంసారం ఎలా చేస్తుంది అది? పునరుత్పత్తి ఎలా ప్రారంభిస్తుంది? జన్మని ఎలా ఇస్తుంది శిశువుకి జీవరాశులు? కోర్కె లేకుండా అసాధ్యం కదా!

కానీ పరిమితమైన స్థితి వరకే వుంది, వికసించలేదు. విచక్షణ చేయలేదు దానిని. కానీ ధర్మార్థకామాలని మూడింటినీ కూడా పూర్తి స్వేచ్ఛతోటి ఆచరించగలిగే సామర్థ్యం ఏ ఉపాధికి వుంది ఇప్పుడు?

మానవ ఉపాధికి వుంది.

ఇంక పరమాత్మ నీకు చేసే సహాయం ఏమిటి?

ఇదే మొదటి సహాయం, ఇదే ఆఖరి సహాయం కూడా. కానీ మనిషి భ్రాంతికి లోనై, నాయనా నాకు భోజనం లేదు, భోజనం పెట్టు. నాకు గుడ్డలేదు, గుడ్డ ఇవ్వు. నాకు అది లేదు, ఇదివ్వు. అదిలేదు, ఇదిలేదు, ఇలాగ ఏకరవు పెట్టుకోవడం అలవాటుపడిపోయాడు. నాకు ఆరోగ్యము లేదు, ఆరోగ్యాన్నివ్వు. మా అబ్బాయికి ఉద్యోగం లేదు, ఉద్యోగాన్నివ్వు. మా కోడలకు అది లేదు, ఇది ఇవ్వు. ఇట్టాగ వరుసపెట్టి ఏ కరువు పెట్టుకోవడం అలవాటు పడిపోయాడు. అందువలన ఏమైపోయింది? నువ్వు ఆచరించినటువంటి ప్రతీది, మోక్షమనే ఫలితం లేకుండా పోయింది. ఆఁ... ధర్మాన్ని ఆచరించావు, ఎందుకు ఆచరిస్తున్నావు? [అడిగితేనే ఇవ్వట్లేదు, అడగకపోతే అసలువ్వడేమో?] (పొరపాటు పడుతున్నావు అక్కడే) భగవంతుడు ఇచ్చేది మొదటిది, ఆఖరిది ఒక్కటే సారి ఇస్తాడు, మళ్ళా మాటి మాటికి ఇవ్వడం ఏమీ వుండదండీ. ఇదేం మనం పెట్టినట్టు కాదు కదా! పరమాత్ముడు జీవుడికి మొదటి సహాయం, చివరి సహాయం

ఒక్కటే చేస్తాడు. ఏమిటయ్యా అంటే, నిన్ను జంతువు శరీరంలోనుంచి పరిణామం చెందించి, మానవ ఉపాధికి వచ్చేట్టుగా చేయడమే, మొదటి, చివరి, ఆఖరి సహాయం. ఇక అంతకు మించి కొత్తగా చేసేది ఏమీ లేదు. (మరీ ఏమీ చెయ్యకపోతే మరి ఈ పూజలు ఇవన్నీ ఈ కోరికలన్నీ ఎందుకు?) ఇవన్నీ నీకు ఈ సత్యం తెలియజెప్పడం కోసమే. (కోరికలు కోరుతున్నాము కదా, సత్యం తెలియజెప్పడానికి) ఎందుకని? కోరగా కోరగా చాంతాడంత కోరావండీ, 30 ఏళ్ళ నుంచి కోరావు ఏమైంది? ఏమన్నా అయ్యిందా? ఏమీ అవ్వలేదు. ఏమైందిప్పుడు, ఏం తేలింది ఏతా వాతా? ఆయన విగ్రహం. అంటే ఏమిటి? నీవు చెప్పేది ఏమన్నా స్వీకరిస్తాడా? స్వీకరిస్తే విగ్రహం అవుతుందా అది? ఇప్పుడీ 40 ఏళ్ళ నుంచి రకరకాల నైవేద్యాలు పెట్టావండి, ఏమన్నా స్వీకరించిందా అది? నువ్వు పెట్టిన నైవేద్యమే స్వీకరించలేనటువంటిది, నువ్వు కోర్కెల్ని ఇస్తే, చాంతాడంత చెబితే అదేమి సమాధానం చెబుతుంది? చెబుతుందా? చెప్పదు కదా!

మరి ఎవరయ్యా చెప్పేది?

నీ హృదయంలో వున్నటువంటి పరమాత్మ.

వినేది ఎవరయ్యా?

నీ హృదయంలో వున్న పరమాత్మ.

సమాధానం ఇచ్చేది ఎవరయ్యా?

నీ హృదయంలో వున్న పరమాత్మే.

నీలో ఒక పరమాత్మ స్థితి వున్నది. అది సమాధానం చెబుతోంది. ఏది విచక్షణ, ఏది సత్యం, ఏది అసత్యం, ఏది నిర్ణయం, ఏది కాదు, ఏది ఏం చేయాలి? నీకు మార్గదర్శకత్వం లోపలి నుంచి అంతః స్ఫురణ ద్వారా ఇస్తుంది. కానీ మనం అంతఃస్ఫురణని మూసేశాం. (గమనించకుండా) దాన్ని వదిలేశాం. నువ్వు ఇట్లాగే చెబుతావులే. నాకు ఇదే కావాలిలే. అనడం అలవాటు చేశావు. అభ్యాసం ఇలా చేశావు.

ఇప్పుడు పరమాత్మ స్ఫురణ లేదా ఎవరికైనా సరే?

వుందది, లోపల ఎప్పుడూ పనిచేస్తూనే వుంది అది.

(ఒకే సారి చెప్తుంది కదా!)

మరి స్ఫూర్తి అంటే అర్థం అదేగా. నువ్వు దాన్ని ఆధారం చేసుకుని జీవిస్తే, అదే జీవితం అయిపోతుంది. మామూలుగా నీవు నీ మనసు మీద బుద్ధిమీద ఆధారపడి జీవించాల్సిన అవసరం లేదు.

(అదేమో ఒక్కసారి చెప్పేటప్పటికి, ఈ మనసేమో 10 సార్లు చెప్తుంది)

ఎవడు వినమన్నాడు నిన్ను? అంటే అర్థం ఏమిటి? ఏది స్ఫురణో, ఏది మనసో విచక్షణ లేదన్నమాట. అర్థమైందా అండీ? నువ్వు ప్రశ్న వేశావండి, ఎప్పుడైనా గుర్తు పెట్టుకోండి, ప్రశ్న వేస్తే ఏ పరిస్థితులలోనైనా ఒకే సమాధానం చెప్పేది అంతఃస్ఫురణ (మరలా మరలా చెప్పదు కదా అదీ!) రెండవసారి చెప్పదు. ఒకసారే చెప్తుంది, ఎప్పుడడిగినా ఒకే సమాధానం చెప్తుంది. ఎట్లా అంటే, చెబుతా వినండి. ఎప్పుడడినా అంటే అర్థం ఏమిటి? మనస్సేమో పరిస్థితులను బట్టి మార్చి సమాధానం చెప్తుంది. కానీ, అంతఃస్ఫురణ అనేది పరిస్థితులను బట్టి మార్చి చెప్పదు సమాధానం. నీ పరిస్థితి ఎలా వున్నా, తనదైన పద్ధతిలో సమాధానం చెప్తుంది. అంతేగాని నాలుగు సమాధానాలు ఇవ్వదు. నీ ఇష్టం. ఇలా కాకపోతే అలా చేసుకో, అలా కాకపోతే ఇలా చేసుకో, ఇలా కాకపోతే అలా కూడా చేయొచ్చుకదా! ఇలా ఏం మాట్లాడదు. అడిగిన ప్రతిసారి అదే సమాధానం repeat అవుతుందా? అవుతుంది. మళ్లా అదే సమాధానం చెప్తుంది. ఒకే సమాధానం కూడా మరళా మరళా వస్తుంది. ఎందుకని? ఎన్ని పరిస్థితులు వున్నా గుణాలు అవే కదా! గుణాల యొక్క వ్యక్తీకరణయే కదా పరిస్థితులు. అంతేనా కాదా! నీకు రజోగుణం కలిగినప్పుడల్లా విషయం మారవచ్చు. కానీ గుణం అదేగా. అంతేనా కాదా? సత్వగుణం – గుణం అదే, చేసే పని ఏదైనా కావచ్చు. జపం కావచ్చు, యజ్ఞం కావచ్చు, యాగం కావచ్చు, ధ్యానం కావచ్చు, పూజ కావచ్చు, తపం కావచ్చు, నువ్వు ఎన్ని పనులైతే చేస్తున్నావో, ధర్మ అర్థ కామాలనే మూడూ కూడా ఆ మూడు గుణాలతో కూడుకుని వున్నాయి. అందువలన పరిపరి విధాలుగా కనపడుతున్నాయి. కానీ, నీ లోపల వున్న అంతః స్ఫురణ ఏం చేస్తోంది? ఆ మూడు గుణాలనీ, ఈ ధర్మార్థ కామాలని సరియైన దిశగా నడుపుతూ వుంటుంది. ఆ అంతఃస్ఫురణ ఎప్పుడూ కూడా. అదే అంతర్యామి. అదే అంతరాత్మ. పైనున్న శరీరమేమో దేహాత్మ అయితే, దాని లోపల పనిచేసేది అంతరాత్మ. నీ అంతరాత్మను అడిగి చెప్పు అంటాం మనం అందుకే. అప్పుడేమిటి? నిర్ధారణగా

తెలుస్తుంది అని. వాడి హృదయంలో వున్నటువంటి అంతరాత్మ, వాడిని అడిగి చెప్పు, నీ గుండెలమీద చెయ్యివేసుకుని చెప్పు, నీ అంతరాత్మను అడిగి చెప్పు అంటున్నావు. కానీ అదసలు వుందని నీకు గుర్తు వుంటే కదా! ఎందుకని? నీ జీవిత ఆచరణలో దానిని ఆశ్రయించి జీవించడం లేదుగా.

ధర్మార్థకామాలను ఆచరించేటప్పుడు ఇవి మోక్ష ఫలితాన్ని ఇవ్వాలి కదా! మరి ఇవి మోక్ష ఫలితాన్ని ఇవ్వటం లేదు కదా! నేను ఎక్కడ తప్పుదారి పట్టి పోయాను అని ఎప్పుడైనా కానీ విచారణ చేశామా? చెయ్యలేదు కదా! విచారణ చేస్తే మేలుకొనేది ఎవరయ్యా ఇప్పుడు. అంతరాత్మ మేలుకొంటోంది.

ఆత్మ విచారణ చేస్తే ఏమిటయ్యా ప్రయోజనం? ఈ అభ్యాసం వల్ల ఏమిటి ప్రయోజనం? అంటే, ఇప్పటి వరకూ ఎవరినైతే నువ్వు పట్టించుకోకుండా వదిలేశావో, ఆ అంతరాత్మ మేలుకొంటోంది. అది నిరంతరాయంగా నిన్ను హెచ్చరిస్తూ వుంటుంది. అది గుణాలకి లొంగదు. అది పరిస్థితులకు లొంగదు. అది విషయాలకు లొంగదు. అది ఇంద్రియాలకు లొంగదు. అర్థమైందా అండీ! మిగిలినవి ఎంత బలమైనవి అయినా కానీ, అది దానికి లొంగదు. నేను అది చెప్పే సమాధానం ఎప్పుడూ చెబుతుంది. నువ్వు నీ మనస్సు ఎన్నన్నా చెప్పనీ, నీ బుద్ధి ఎన్నన్నా చెప్పనీ, నీ అనుభవజ్ఞానం ఎన్నన్నా చెప్పనీ, అది లాభం రానీ, నష్టం రానీ, ధర్మం గానీ, అధర్మం గానీ, ఫలితం రానీ, రాకపోనీ, దానీ సమాధానం ఎప్పుడూ ఒక్క తీరుగానే వుంటుంది. అంటే ఏమిటి అది అంతఃస్ఫురణ. అని మనం గుర్తుపట్టడం లేదు. అది అంతరాత్మ చెబుతోంది, అరె దాన్ని పట్టుకుంటే ఈ గొడవంతా వదిలి పోతుంది, అనేటటువంటి సూత్రం తెలియక పోవడం చేత, ఎంతసేపు నీకు అనువుగా వున్నటువంటి మనసునో బుద్ధినో ఇంద్రియాలనో పట్టుకుని వేలాడుతూ వుంటావు.

(అది ఒకసారి చెబితే ఇది 10 సార్లు చెబుతుంది కాబట్టి ఇదే గుర్తు వుంటుంది)

ఎందుకు వినాలి? ఈ పది సార్లు చెప్పేది వింటే దుఃఖం వుందిగా మరి! అప్పుడు దీనినే కదా విచారణ చేయవలసినది, అప్పుడు అంతరాత్మ ఏం చెబుతోంది? ఒక్కసారి ఆలోచించు. పూర్వం అంతా ఇలాగే చేశావు కదా! ఇలా చేస్తే దుఃఖం వచ్చింది కదా! మరి

ఎందుకు నువ్వు అటు పోతున్నావు? అని హెచ్చరిస్తోంది కదా అది. కానీ ఏం చేస్తోంది ఇది? అదే సుఖంగా వుంది అంటోంది. అర్థమైందా అండీ?

ఆ కారణం చేత, అభ్యాసబలం అటువైపు వుండటం చేత, ఆత్మ విచారణ లేకపోవడం చేత, రెండు సమస్యలు అన్నమాట. ఏమిటట? 1. తెలుసుకోవలసినది తెలుసుకోకపోవడము, 2. తెలుసుకోకూడని దానివెంట పడడం. రెండు చిక్కులు వున్నాయన్నమాట అందులో. ఏమిటట? దేనిని అనుసరించకూడదో, దేనిని ఆశ్రయించ కూడదో, దానిని ఆశ్రయించడం. దేనిని అనుసరించాలో, దేనిని గుర్తించాలో, దానిని గుర్తించక పోవడం. ఈ రెండూ నీ లోపలే వున్నాయి. చిక్కులు. బయట ఎక్కడా లేవు. మనం అన్నీ ప్రతీ సమస్యకు కారణం ఎక్కడ చెబుతాం? బయట చెబుతాం. ఇదిగో ఈ సమస్యకు కారణం వాడు. అని ఎప్పుడూ బయటకు చూపెడుతావు. నీ సమస్యకు కారణం బయట కాదు. నీ లోపల వుంది. ఏమిటి? నీ అంతరాత్మను సరిగ్గా పట్టించుకో మొట్టమొదట. వాడు (అంతరాత్మ) ఏం చెప్తున్నాడో విను. ఈ సమస్య మూలాన్ని వాడు పరిశోధిస్తాడు. పరిశోధించి ఏం చెప్పాడు? నీకు ఈ విషయంలో రజోగుణ ప్రభావం వుంది కాబట్టి నువ్వు ఇట్లా ప్రవర్తిస్తున్నావు. నువ్వు ఇట్లా ప్రవర్తించావు కాబట్టి పరిస్థితి ఇట్లా తయారైంది. నిన్ను రజోగుణంతో ఎవరు ప్రవర్తించమన్నారు? ఈ విషయంలో. అని నిన్ను నిట్టనిలువున నిలదీస్తుంది అంతరాత్మ ఎప్పుడూ కూడ. నీ తప్పును అదేం క్షమించదు అది. దానికేం తన మన పర భేదం వుండదు అక్కడ. అది నిట్టనిలువుగా మాట్లాడుతుంది. నువ్వు ఎందుకు చేయాలి ఇట్లాగ? నువ్వు ఇట్లా చేయడం ఎందుకు? వాడిది తప్పు అని అనడం ఎందుకు? నువ్వు వాడిది తప్పు అన్నంత మాత్రానా ఇప్పుడేమన్నా అయ్యిందా? (ఇంత విమర్శ చేస్తుందా?)

ఆః... ఎంతటి బలమైన స్ఫురణ వుంటుందంటే అది, అంటే నువ్వు దానిని ఆశ్రయించడం లేదు కాబట్టి నీకు ఆ స్ఫురణ తెలియడం లేదు. అంతే. అర్థమైందా అండీ. ఆశ్రయిస్తే ఏమౌతుంది? దానికే బలం పెరుగుతుంది. అదే నేను ఉదయం చెప్పింది కూడా. నేను అనేది నీలోపల వున్నది. ఈ నేను ఎటువంటిదట? నువ్వు బాల్యంలో వున్నావండీ! ఆట వస్తువే నీ ప్రపంచమా? ఎందువల్ల? 'నేను' అనేది ఆ ఆటవస్తువు విషయంలో చేరిపోయింది. చేరిపోతే ఏమయ్యింది? అదే ప్రపంచం అయిపోయింది.

తరువాత పుస్తక ప్రపంచం. ఆ తరువాత విషయ ప్రపంచం. ఆ తరువాత సంసార ప్రపంచం. ఆ తరువాత తాపత్రయ ప్రపంచం. వస్తున్నాయా లేవా? లైన్ లో అందరికీ. ఎలా వచ్చినాయి? అంటే నీ నేనుకు ఒక శక్తి వుంది. నువ్వు ఎటు చూపెడితే అందులో చేరిపోతుంది అది. ఈ అహం అనే నేను, నువ్వు ఆకారం వైపు చూపెట్టావు, అందులో చేరిపోతుంది. కాదు... పరమాత్మ వైపు చూపెట్టావు, అందులో చేరిపోతుంది. కాబట్టి తప్పెవరిదయ్యా? దానిని సరిగ్గా నడపలేకపోవడం, ఆ అహం అనే నేను అనే వృత్తి బుద్ధిలో వున్నదే, ఆ బుద్ధిని నువ్వు ఎటు నడపాలట? తన మూలమైనటువంటి ఆత్మ భావంలోకి, పరమాత్మ భావంలోకి కనుక నువ్వు నడిపితే, ఏమైందట అప్పుడు? నేను ఎప్పుడూ ఆత్మస్వరూపుడనే. కాదూ... సమిష్టిగా పరమాత్మ స్వరూపుడనే. నాకు ఏ భేద భావన లేదు కదా! ఎవరి యెడలా లేదు కదా! అందరి యెడలా సర్వ సముడుని కదా! నేను సాక్షీ స్వరూపుడుని కదా! నేను జ్ఞాన స్వరూపుడుని కదా! నాకు ఏ అజ్ఞానము లేదు కదా! నాకు ఏ దుఃఖము లేదు కదా! నాకు ఏ కోరికలు లేవు కదా! నేను శాశ్వత స్వరూపుడను కదా! నేను అనంతుడిని కదా! ఇలాంటి వాక్యాలు వుంటాయి అంతరాత్మలో. ఈ వాక్యాలు అన్నీ ఎక్కడినుంచి వచ్చానాయి? ఎక్కడి నుంచి విన్నారు ఈ పుస్తకాలలో వన్నీ, తన యొక్క అంతరాత్మయందు వున్నాయి ఇవి అన్నీ. ఆ స్ఫురణలో వున్నాయి. దానిని ఆశ్రయించి జీవించినవాళ్ళకు ఈ వాక్యాలు అన్నీ తోచినాయి. ఆయనేం చేశాడు? గ్రంథస్తం చేశాడు. నాయనా! నువ్వు ఈ వాక్యాలను నిరంతరం మననం చేయి, మననం చేస్తే ఏమిటయ్యా వుపయోగం? అంటే, నీ అంతరాత్మ ఇదే వాక్యాలు చెబుతూ వుంటుంది. ఆ వాక్యాలు చెప్పినప్పుడు ఈ వాక్యాలు అక్కడ తోస్తాయి కదా! వెంటనే నీకు తెలుస్తుంది నా అంతరాత్మ మేలుకుందిరా బాబు. లోపలనుంచి నీకు ఈ వాక్యాలు వినపడుతూ వుంటాయి. ఈ సమాధానాలు వస్తూ వుంటాయి. ఎవరు చెబుతున్నారు ఈ సమాధానాలు? నీ అంతరాత్మ చెబుతోంది. దానిని పట్టించుకో. ఇంతకుముందు ఈ వాక్యాలలో అది చెబుతుందని నీకు తెలియదు కదా! దాని ధోరణిలో అది చెబుతూ వుంటుంది. అది ఎట్లా చెబుతుందో నీకు ఆ విషయమే తెలియదు కాబట్టి ఏం చేశావు? అది మనసు చెబుతోందా? అంతరాత్మ చెబుతోందా అనే భేదాన్ని గుర్తించలేవు. అందుకని ఆత్మ విచారణలో భాగంగా నీకు ఏ వాక్యాలు చెబుతున్నారయ్యా అంటే, నీకు

నీ అంతరాత్మ ఎలా స్ఫురణను ఇస్తుందో, ఆ వాక్యాలే ఇక్కడ చెబుతూ వుంటారు. అందువల్ల ఏమౌతుంది? అనుభవజ్ఞుడు అయినటువంటి గురువుగానీ, శాస్త్రం గానీ ఆ అంతరాత్మ స్ఫురణ మీలోనుంచి ఎలా ఇస్తూ వుంటుందో ఆ వాక్యాలు నిరంతరాయంగా చెబుతూ వుంటారు. ఏమౌతుంది వినటం ద్వారా నీకు? నీలోపల స్థిరపడుతాయి. నీ అంతరాత్మ చెప్పే వాక్యాలు, నువ్వు బుద్ధిలో విన్న వాక్యాలు రెండూ కూడా ఒకటే అయిపోతాయన్నమాట. ఎప్పుడైతే ఒకటైనాయో, నువ్వు వెంటనే గుర్తు పట్టకలుగుతావు. ఓహో! నా అంతరాత్మ మేలుకొందిరా బాబు, దీనిని పట్టుకోవాలి నేను. ఇప్పటి వరకూ ఈ వాక్యాలు తెలియక పోవడం చేత ఏం చేశావు? మనసు చెప్పే వాక్యాలే సత్యం అనుకున్నావు. అర్థమైందా అండీ!

"దొండపండు రంగు చీర అండీ, అద్భుతంగా వుంటుందండీ!" ఎవరు చెప్పారు? అంతరాత్మ చెబుతుందా ఇలాగ? దానికేం పని? దొండపండు రంగైతే ఏమిటి? బంగారు రంగైతే ఏమిటి? దానికేమన్నా తేడా వుందా? ఏమీ లేదు. ఎక్కడైనా, ఏ శాస్త్రంలోనైనా ఇలా వుందా? లేదు కదా! ఎందుకని? అది మనసు చెప్పే వాక్యం కాబట్టి, విషయానికి సంబంధించిన వాక్యం, దృశ్యానికి సంబంధించిన వాక్యం, శబ్ద స్పర్శ రూప రస గంధాలు అనే ఐదు విషయాలకు సంబంధించిన వాక్యాలు నీ మనసులో వుంటాయి ఎప్పుడూ కూడా. వాటికి సంబంధించిన సాక్షిత్వానికి సంబంధించిన వాక్యాలు అంతరాత్మలో వుంటాయి. అంతరాత్మ ఎప్పుడూ సాక్షిగా ప్రవర్తించమని చెబుతూ వుంటుంది. నువ్వు గుణాలకు లొంగమాకు. ఇంద్రియాలకు లొంగమాకు. అవస్థలకు లొంగమాకు. నువ్వు సాక్షివి. నేను అనే సాక్షి అందులోకి చేరిపోకూడదు అని అంతరాత్మ ఎప్పుడూ నిరంతరాయంగా చెబుతూ వుంటుంది.

మీరు చూసుకోండి ఒక్కసారి, మీకు బాగా క్లిష్టమైన సమస్య వచ్చినప్పుడు లోపల నుంచి ఒక స్ఫురణ వస్తుంది. నీకేంపని దానితోటి? ఈ రెండు మాటలు అది చెబుతుంది. ఎవ్వరికైనా చెబుతుంది ఈ మాటలు. వెంటనే నీకు విచారణ కలుగుతుంది. అవును నాకెందుకు అసలు ఇందులో? నాకేం పని? వెంటనే వెనక్కు తగ్గేస్తావు. ఈ రెండు ప్రశ్నలు రాగానే, వెంటనే విరమించేస్తావు, వెనక్కి విరమించేస్తావు. పరిస్థితి ఎంత బలంగా అయినా వుండనివ్వండి. నీ లోపల స్ఫురణ ఈ రెండు ప్రశ్నలు వేయగానే, ఏం చేస్తావు?

అమ్మో! ఏదో ప్రమాదం వుందిరా బాబు. అని నా లోపల చెబుతోంది. ఆఁ... ఎప్పుడైనా గుర్తు పెట్టుకోండి. అది అట్లా చెప్పినా కూడా వెళ్ళావండీ, ఏమౌతావు?

(దానికంటే బలంగా ఈ మనసు చెబుతుంది)

నువ్వు చేయ్, నువ్వు చేయ్ నువ్వు పో! నువ్వు పో అంటుంది. అనేటప్పటికి ఏమయ్యావు? దీనిని ఆశ్రయించావు. పోయి ఊబిలోకి పడిపోయావు. అర్థమైందా? చెబుతోందిగా లోపలినుంచి, నీకెందుకు? నీపని కాదు కదా! నీ కర్తవ్యం కాదు కదా! నీ విషయం కాదు కదా! నీ విషయం కానప్పుడు నీకెందుకు? ప్రశాంతంగా వుండు నువ్వు. మౌనంగా వుండు. అని లోపలినుంచి చెబుతోంది కదా అది. చెప్పినా దాని మాట ఎందుకు పట్టించుకోవడం లేదు మనం? దానికి ఉల్టా మనమే చెప్తున్నాం. ఇప్పుడు నేను మాట్లాడకపోతే అదౌతుంది. నేను చెయ్యకపోతే అదౌతుంది. నేను చెప్పకపోతే ఇదౌతుంది. ఏమిటి అయ్యేది? ఎత్తి కుదేస్తే ముందు నువ్వేమౌతున్నావో చూసుకో అంటుందది. అది ఎప్పుడూ ఏం చెబుతుంది? ముందు నీ సంగతి ఆలోచించవయ్యా బాబు. (ఇది రజోగుణమా వెంటనే స్పందించడం అనేది?) అంతేగా మరి ఇప్పుడు కాంక్ష వుంటుంది కదా లోపల. విషయం మీద కాంక్ష వుంటే రజోగుణం. అంతే కదా! విషయం మీద కాంక్ష లేదు. అప్పుడు సత్వగుణం. విషయం మీద కాంక్ష బలపడిపోయింది తమోగుణం. అందువల్ల ధర్మార్థకామాలని అందుకే వాళ్ళేం చెబుతున్నారు? మోక్షము పరమపురుషార్థము. అంటే లక్ష్యము అన్నమాట. పరమపురుషార్థము అంటే అర్థం ఏమిటి? మోక్షాన్ని ఆచరించడానికి వీలౌతుందా ఎవరికైనా? మోక్షం అనేది ప్రత్యేకంగా ఆచరించడానికి ఏముంది అక్కడ? అక్కడేం లేదు మోక్షం అంటే. ధర్మార్థకామాలని మోక్షం అనే లక్ష్యంలో ఆచరించడమే మోక్షం. అంటే అర్థం ఏమిటి? ధర్మార్థకామాలలోనూ విషయరూపంలో బంధీవైపోయావు. దాంట్లోనుంచి విడుదల పొందు. అదే నయ్యా మోక్షం. ఎందుకు విడుదల పొందాలయ్యా? సర్వధర్మాన్ పరిత్యజ్య మాం ఏకం శరణం వ్రజ ఆ అన్ని ధర్మాలలోకెల్ల ఉన్నత ధర్మం ఏమిటయ్యా? అంటే నా శరణాగతి పొందటమే. సర్వ సమర్పణ భావం. నిన్ను నువ్వు నాకు అర్పించుకోవడమే. నీ నేనును నాకర్పిస్తే, నీ అహంకారాన్ని నాకు అర్పిస్తే, నీ అజ్ఞానాన్ని నాకు అర్పిస్తే అంతకంటే ఉన్నతమైన ధర్మం లేదు నాయనా!

అది అర్పిస్తామా మనం? అది అర్పించాలంటే నువ్వు దేనిని పట్టుకోవాలి? నీ అంతరాత్మను పట్టుకోవాలి. ఎందుకని? పరమాత్మకు దారి చూపెట్టేది అదే. ఎందుకని? ఆత్మ మూడు విధాలుగా పనిచేస్తుంది. శరీరంలో దేహాత్మగా పనిచేస్తుంది. దానిలోపల సూక్ష్మంగా అంతరాత్మగా పనిచేస్తుంది. దానిలోపల పరమాత్మగా పనిచేస్తుంది. ఆత్మ మూడు స్థితులలో పని చేస్తుంది. అంతటా ఆత్మ స్వరూపమే అని ఎందుకు అంటున్నాము? మీ అందరికీ సందేహము రావచ్చు, ఏవండి అంతటా ఆత్మ స్వరూపం అంటున్నారు ఎలా సాధ్యం? ఇదిగో ఇలా సాధ్యం. ఎందుకని? నీ శరీరం వుందా? అది దేహాత్మ. నీ లోపల ప్రాణము, బుద్ధి, మనస్సు పనిచేస్తున్నాయా? పనిచేస్తుంది కదా! దానిలోపల నేను అనేది అంటున్నావు కదా! నా ప్రాణము, నా మనస్సు, నా బుద్ధి అంటున్నావు కదా! అంటే నేను వుందిగా అక్కడ. ఆ నేను ఎవరయ్యా? అది అంతరాత్మ. అర్థమైందా అండి? ఆ నేను ఎవరు? అంతరాత్మ. మరి సర్వసృష్టి పనిచేస్తుందా లేదా? దానికి నీతో ఏమన్నా పని వుందా? నువ్వేమన్నా దానికి ఆధారమా? కాదు కదా! మరి ఈ అనంత సృష్టికి ఆధారం ఏదో, ఈ అనంత సృష్టి అంతా వ్యాపించి వున్నది ఏదో, ఏదో ఒకటి వుంది కదా! వుంటుంది అని ఒప్పుకుంటావా లేదా? ఒప్పుకోక తప్పదు. ఎందుకని? నువ్వేం చెయ్యడం లేదు కదా దానిని. కాబట్టి అది పరమాత్మ. నీలో నేనంటావా? అది అంతరాత్మ. నీ బయట చూసి అంటావా? అదే పరమాత్మ. కాదు శరీరమేనంటావా? అది దేహాత్మ. కాబట్టి ఈ జగత్తంతా ఆత్మలో భాగమై వున్నది. సృష్టి అంతా ఆత్మలో భాగమై వున్నది. నీ నేను అదీ ఆత్మలో భాగమై వున్నది. నీ శరీరం అంటావా? అది కూడా ఆత్మలో భాగమై వున్నది. కాబట్టి ఆత్మ సర్వవ్యాపకం అని ఒప్పుకుంటావా? లేదా? ఇప్పుడు. ఒప్పుకోక తప్పదు నాయనా! ఎందుకని? నీకు వున్నది ఈ మూడే కదా! నీ దగ్గర ఏమున్నాయి? నేను, శరీరం, జగత్తు. మూడే కదా వున్నాయి నీకు. ఎటుతిరిగి చూసినా ఈ మూడే. నువ్వు మెలకువలో చెప్పు, కలలో చెప్పు, నిద్రలో చెప్పు, ఎప్పుడు చెప్పినా నేను, శరీరం, జగత్తు ఈ మూడూ కూడా ఆత్మస్వరూపమేనా కాదా? అవును నాయనా! ఎలాగ? ఆత్మ అంటే నేను. ఎలాగ? శరీరం దేహాత్మ. నీలోపల వున్న జీవుడు? నేను కదా! వాడు అంతరాత్మ. అంతటా వ్యాపించి వున్నవాడు, జగత్తు అంతా వ్యాపించి వున్నవాడు వాడు పరమాత్మ. మరి సమస్య ఏమి వుంది? ఏం లేదు కదా! ఇప్పుడు ఆత్మ స్వరూపమే కదా!

అంతటా వున్నది? (అది గుర్తించటమే సమస్య). ఆఁ.... వేరే ఏమీ లేదు నాయనా! నువ్వు ఈ పద్ధతిలో గుర్తించడం నేర్చుకో. అప్పుడు ఏమైంది? అక్కడ కాజా పెట్టావండి. ఎక్కడినుంచి ఎవరో కాకినాడ నుంచి కాజా తెచ్చారు. ఏమిటట అయితే? ముందు నీలోపల నీ మనసు ఏం ప్రశ్నించుకోవాలి? కాకినాడ కాజా! ఓహో! అయితే ఏమిటట? ఏదైనా పంచదారతో తయారు చేసిందేనా? లేదా సముద్రంలో ఉప్పు తెచ్చి చేశావా? ఏమైందీ? పూర్వ జ్ఞాపకంలో అబ్బా! కాకినాడ కాజాలండీ, తింటే ఎంత అద్భుతంగా వుంటుందో నండీ అని జ్ఞాపకానికి బలం చేకూర్చావు. అభ్యాసబలం చేత అలా బలాన్ని చేకూర్చావన్నమాట. అందువలన ఏమైంది? ఆ వస్తువు గానీ, ఆ మాటగానీ, ఆ భావన గానీ ఎదురుగుండా రాగానే, ఆ జ్ఞాపకం మేల్కొంది.

మేల్కోగానే ఎవరు మేల్కోవాలి దాని ప్రక్కనే? ఆత్మ విచారణతో కూడిన అంతరాత్మ మేలుకోవాలి వెంటనే. నా మాట బయటకి రాక ముందే, అంతరాత్మ మేలుకోవాలి. మేలుకుని అయితే ఇప్పుడు ఏమిటట? అనంగానే ఏమైంది? ఇది శాంతంగా మాట్లాడుతుంది. అంతరాత్మ ఎప్పుడూ ఘల్లుఘల్లుగా మాట్లాడదు. ఆహా! ఓహో! కాకినాడ కాజా అద్భుతమని మనసు గొప్పలు చెప్పినట్టుగా ఇదేం చెప్పదు. ఒకటే మాట, అయితే ఇప్పుడు ఏమిటట? (అంటుంది, ఒక పక్కన మనసు తిను తిను అంటోంది)

అవునండీ! తింటే తిను, తినకపోతే మానేయి. దాని వలన అంతరాత్మకు ఏమీ ప్రమాదము లేదు. కానీ ఎట్లా చెయ్యమంటోంది ఆ పని? అయితే ఇప్పుడేమిటట? దాని ప్రత్యేకతను తీసేయి. కాకినాడ కాజా అద్భుతం అని అనుభవించావా? మళ్ళా మళ్ళా అనుభవించమంటోంది. అయితే ఇప్పుడేమిటట? అనంగానే ఏమైపోయింది? సామన్యమైపోయిందా? దాని ప్రత్యేకత పోయిందా? ప్రత్యేకత పోయినాక, అనుభవించినా, అనుభవించకపోయినా జ్ఞాపకం బలంగా పడడం లేదు. అర్థమైందా?

అంతరాత్మను ఆశ్రయిస్తే ఏమిటి ఉపయోగం అనంటే, దాని ఎదుట అంతా సామాన్యమే. నీ ఇంద్రియాలు కానీ, నీ ఇంద్రియ విషయాలు కానీ, నీ జగత్తు కానీ, ఆఖరికి నీ నేను కానీ అన్నీ కూడా దాని ముందు సామాన్యమే. దానికే ప్రత్యేకత లేదు. అన్నింటినీ సామాన్యం చేసేస్తుంది. అర్థమైందా అండీ! ఏవండీ 2 లక్షల రూపాయిలు పెట్టి కారు కొన్నాడండీ మనబ్బాయి, ఓహో! అలాగ! అయితే ఏమిటట ఇప్పుడు? అంటుంది

మనలోపల ఇప్పుడు. బయటకి అనమని కాదు, నువ్వు వెళ్ళి వాడితో అయితే ఏమిటట అన్నావంటే వాడితో తగాదా వస్తుంది. నీకు నీకు. నీకు తెలియాలి. ఓ అయితే ఏమిటట ఇప్పుడు? అందులో ఏమన్నా ప్రత్యేకత ఏమన్నా వుందా? వాడికి అవసరం వుంది, డబ్బు వుంది కొన్నాడు. నీకేమన్నా దానితో పనివుందా? మా అబ్బాయి కొన్నాడు. ఏమిటట అయితే? అసలు నువ్వు వున్నావా ముందు? నీ జన్మ మరణాల సంగతి నీకొకటి తెలియదు. ఎవరికి ముడిపెట్టావు నీవిప్పుడు? మీ అబ్బాయికి. వాడు కొన్న కారుకి. ఆ కారులో వున్న సుఖానికి. అర్థం వుందా? ఎక్కడికి పోయావు? కొంచెం విచారణ చేయి. ఏమైంది ఇప్పుడు? శాశ్వతత్వం వెంట ఆశ్రయించి పరుగెడుతున్నావా? అశాశ్వతం వెంట ఆశ్రయించి పరుగెడుతున్నావా? నువ్వు కన్నుమూస్తే నీ అబ్బాయి ఎక్కడో నీవెక్కడో నీకే తెలిసేది. వాడు కొన్న కారెక్కడ? ఆ కారులో వున్న ఏసీ ఎక్కడ? ఆ ఏసీలో కూర్చొన్న సుఖం ఎక్కడ? వున్నదా ఇదంతా? లేనిది కదా! మరి లేనిదాని వెంబడి ఎందుకు పరుగెడుతున్నావు? అని అంతరాత్మ మనసుకు బుద్ధి చెప్తున్నది కదా! ఎప్పుడు చెబుతుంది? నువ్వు దీనిని ఆశ్రయిస్తే. ఇంత బలంగా వుండి కూడా, నీవు సింహమై వుండి కూడా ఏమయ్యావు? దానిని గుర్తించకపోవడం చేత, దానికి వాయిస్ లేకుండా అయిపోయింది. దానికి బలం లేకుండా అయిపోయింది. దానిని పట్టించుకునే నాథుడు లేడన్నమాట ఇప్పుడు. ఎంతసేపూ మేక అయినటువంటి మనస్సు సింహం వలె చెలరేగిపోతున్నది. ఎందుకని?

అదే పట్టించుకుంటున్నావు, అదే దేవత అని కొలుస్తున్నావు. అందువల్ల ఏమైంది? దానికి బలం పెరిగిపోయింది. కాబట్టి అభ్యాసబలాన్ని మార్చుకో. ధర్మ, అర్థ, కామాలను మోక్షం దృష్ట్యా చెయ్యి, ఈ కోరికను ఎంతవరకూ అనుభవించవచ్చు? దీంట్లో నేను బంధం పొందనంతవరకూ అనుభవించవచ్చు. ఇది నాకు బందిఖానా జైలు అయ్యేటట్లైతే, ఆ జైలు అయ్యే పద్ధతిలో నువ్వు అనుభవించకూడదు. నీ స్వేచ్ఛ పోకూడదు. నీ ముక్త స్వభావం పోకూడదు. నేను ఆత్మ స్వరూపుడను అనే భావం పోకూడదు. నేను జ్ఞాన స్వరూపుడను అనే భావం పోకూడదు. ఆ సాక్షిత్వము పోకూడదు. కలిసిపోకూడదు అందులో. పరవశత్వం చెందకూడదు. కోర్కెలో పరవశత్వం

చెందకూడదు. పరవశత్వం అయితే ఏమైంది? పర+వశత్వం పేరులోనే చెబుతున్నావు. దానికి వశుడవు అయిపోయావు. అబ్బా! ఏం సినిమానండీ! ఏం తీశారండీ! అంతా అద్భుతమండీ! ఏమైంది ఇప్పుడు? పరవశత్వం అయ్యింది. పరవశత్వం అంటే ఏమిటి? మరి అదేగా జీవుడంటే. అదేగా శరీరం అంటే. కాబట్టి జ్ఞానికి ముక్తుడికి అనుభవజ్ఞానం ఎవరికైతే వుందో వాడికి పరవశత్వం వుంటుందా? వుండదు వాడికి. ఎందుకని? అన్నీ సామాన్యములే. ఎవరెస్ట్ పర్వతము చూశానండీ, నేనేమన్నా పరవశత్వం చెందానా? ఏమీ చెందలేదు, ఎందుకని? నాక్కిక్కడ దుర్గగుడి కొండ, హిమాలయ పర్వతము రెండూ ఒక్కతీరుగానే కనబడుతున్నాయి. ఏముంది తేడా? మహా అయితే దీనిమీద మంచు లేదు, దాని మీద మంచు వుంది. అంతేనా తేడా ఇంకేమన్నా వుందా? ఏమీ లేదుగా? ఏమన్నా వుందా తేడా? ఆహా! హిమాలయ పర్వతం, ఓహో! హిమాలయం అనంగానే పరవశత్వం వచ్చేసింది. ఆ మోహం వచ్చేసింది. దృశ్యజగత్తు అంతే కదా! ఏముంది? ఎంతసేపు వుంటుందది నీకు? మొదటిసారి చూసినప్పుడు వుంది, కాసేపయ్యేటప్పటికీ? చలి, ఇంకా కాసేపు అయ్యేప్పటికి ఆయాసం. ఇంకా కాసేపు అయ్యేప్పటికి అనారోగ్యం. ఇప్పుడు ఏది కరెక్ట్? అర్థమైందా? ఏమైపోయింది సుఖం? ఓహో! అద్భుతం అన్నావుగా, ఏమైంది నీ సుఖం? కాసేపట్లో దుఃఖంగా పరిణమించింది. అర్థమైందా అండీ! అదే సాక్షిత్వంలో వున్నావు. దాని వల్ల ఏమైంది? తరువాత నీకు ఆయాసం వచ్చినా, సరేలే శరీరానికి సరిపడని వాతావరణంలోకి వచ్చింది కాబట్టి ఇలా ప్రతిస్పందిస్తోంది. సరే! స్పందించని అనుకుంటాడు.

(అందరికీ ఎందుకు ఇట్లాంటి బాధలు ఇచ్చాడు భగవంతుడు?)

నువ్వు పట్టించుకునే జీవన విధానాన్ని బట్టి కదా! నీ దుఃఖానుభవాన్ని బట్టే, దుఃఖానుభవం లేదు. నీకే ప్రశాంతంగా బానే వున్నావుగా. ఆ విషయసుఖమే ఆనందిస్తూ వుంటావు. దుఃఖానుభవం వుంటే, ప్రశ్న వచ్చింది. నాకు ఎందుకు దుఃఖం కలుగుతోంది? నేను అన్నీ బానే చేస్తున్నాను కదా! అది దేని వల్ల వచ్చింది? విషయం మీద వున్న అనురాగం వల్ల దుఃఖం వచ్చింది. ఇప్పుడు దేని వల్ల వస్తోంది? విచారణ వల్ల. దుఃఖాన్ని విచారణ చేస్తున్నావు ఇప్పుడు. కొత్తగా దుఃఖం ఏమీ రాలేదు. పూర్వ దుఃఖాన్ని ఇప్పుడు

విచారణ చేస్తున్నావు. మరలా ఆ దుఃఖం రాకుండా వుండే పద్ధతిలో జీవస్తున్నావు. అర్థమైందా అండీ!

ఇంకొక విషయం, అందరి సంగతి నీకెందుకు? ఇప్పుడు వెంటనే ఈ ప్రశ్న వేసుకోవాలి. అందరి సంగతి నీకెందుకు? నీకు ఏమన్నా ప్రయోజనము వుందా? నువ్వు నిద్ర పోతే నీ అందరూ ఎక్కడ? నీ మరణంలో నీ అందరూ ఎక్కడ? నీ జన్మలో ఈ అందరూ ఎక్కడ? నీ అంతరాత్మకు ఈ అందరితో ఏమన్నా పనివుందా? లేదు కదా! నీ నేనుకు ఈ అందరితో ఏమన్నా పనివుందా? లేదు కదా! ఆ పరమాత్మకు ఈ అందరితో ఏమన్నా పనివుందా? ఏమీ లేదు కదా! మరి ఎవరికి వుందయ్యా? ఆ అందరూ గుర్తించేది నీ శరీరాన్ని. నువ్వు కూడా గుర్తించేది వాళ్ళ శరీరాన్నే. ఏమయ్యావు అప్పుడు? శరీరమే నేను. అందరినీ గుర్తించగానే ఏమయ్యావు? శరీరమే నేను అయ్యావు. ఎవరు అవమన్నారు నిన్ను ఇప్పుడు? ఇలా దాన్ని విచారణ చేస్తూ, నచ్చచెప్పాలి దానికి. ప్రతి అంశంలో కూడా. శరీరభావాన్ని నిరసించేయాలి. ఎప్పుడైతే శరీరభావాన్ని పూర్తిగా నిరసించేస్తావో, అప్పుడు ఆత్మభావమే మిగిలివుంటుంది. క్రొత్తగా అక్కడ తీసుకొచ్చి పెట్టేది ఏమీ లేదు. అందుకే దీనికి ఉపమానం ఏమి చెబుతున్నారు?

ఒక గాజుగ్లాసులో రంగు నీళ్ళు వున్నాయండి. గ్లాసు పగులకొట్టే అవకాశం లేదు. కానీ అందులో రంగునీళ్ళు పోయేట్లు చేయాలి. ఏం చెయ్యాలట అయితే ఇప్పుడు? ఎలా సాధ్యం? అదే రంగునీళ్ళు పోస్తే మారుతుందా? మారదు. వేరేరంగు నీళ్ళుపోస్తే మారుతుందా? అసలు మారకపోగా వింత వింత రంగులన్నీ వస్తాయి దానికి. ఇప్పుడేం చెయ్యాలట? మంచినీళ్ళు పోస్తూ వుండవయ్యా! రంగునీళ్ళు పొర్లిపోయి సొంతం మంచినీళ్ళు మిగిలేవరకు, పొయ్యవయ్యా మంచినీళ్ళు దాంట్లో. కాబట్టి, ఎంతవరకైతే నీకు నీ శరీరమేనేను అనే అభ్యాసబలం మిగిలి వుందో, ఆయా మిగిలి వున్నటు వంటి, మొత్తం అభ్యాసబలం అంతాకూడా పూర్తిగా మారిపోయేంత వరకూ, శరీరమే నేననే అభ్యాసబలం అంతా పూర్తిగా నిరసించబడే వరకూ దాన్ని అభ్యాసం చెయ్యి. అప్పుడు ఏమైంది? నేను ఆత్మస్వరూపుడు అనే భావన సహజమైపోయింది. ఎప్పుడైతే సహజమైపోయిందో నేను స్త్రీని, నేను పురుషుడను అనుకుంటున్నావా ఇక? అనుకోవడం లేదుగా. ఇప్పుడు ఎట్లా అయితే నేను స్త్రీని అని అనుకోకుండా జీవిస్తున్నావా

లేదా? అట్లా నేను ఆత్మస్వరూపుడను అనేభావంలో సహజంగా వుండాలి. రోజు అనుకుంటున్నారా? నేను స్త్రీని అని అనుకుంటున్నారా? అనుకోవడం లేదుగా. సహజంగా జీవించేస్తున్నారు. ఔనా కాదా? అట్లా నేను ఆత్మస్వరూపుడను అనే పద్ధతిలో జీవించాలి. ఔనా కాదా? నిజానికి మీకెవరికైనా కానీ బాల్యంలో మీరు స్త్రీ నా, పురుషుడా ఏమన్నా భావం వుందా? లేదుగా. తల్లి గర్భంలో వున్నప్పుడు వుందా? బయటకు వచ్చినాక వుందా? ఎనిమిది ఏండ్ల వయసు వచ్చేవరకూ వుందా? లేదు కదా ! బుద్ధి వికాసం కలిగినప్పటి నుంచి దానికి చెప్పడం మొదలు పెట్టావు. నేను స్త్రీని, నేను స్త్రీని. నేను ఇట్లా వుండాలి. నేను అట్లా వుండాలి. ఇలా దానికి మొట్టికాయలు వేసి, వేసి, వేసి దానిని అట్లా తయారు చేశావు. చేశావా లేదా? అభ్యాసబలమేనా కాదా? అదంతా? అలవాటేనా కాదా? అలవాట్లన్నీ పెట్టి నువ్వు స్త్రీవి నువ్వు ఇలాగే వుండాలి. నువ్వు పురుషుడివి నువ్వు ఇలాగే వుండాలి. అని గీతలు పెట్టావా? పెట్టలేదా? ఎవరు పెట్టారు ఇప్పుడు పరమాత్మ పెట్టాడా? లేదు కదా! శరీర భావన చేత నీవే పెట్టుకున్నావు. దీనిని ఏం చేయాలట ఇప్పుడు? అట్లా అభ్యాస బలం చేత నీకది సహజం అయిపోయిందా? అవ్వలేదా? ఎందుకని? అట్లా అనుకోకుండానే నువ్వు అట్లా వుంటున్నావు ఇక. ఇహ అంతకు మించి నిన్ను కొత్తగా మార్పు చేయాలంటే వీలుకాదు. నిన్ను పురుషుడు వలే జీవింపచేయాలంటే సాధ్యమౌతుందా? ఇహ ఇప్పుడు సాధ్యం కాదు, ఎందుకని? సొంతం సహజమైపోయిందది. అలవాటు ఆ చేయగా చేయగా చేయగా అదే సహజమైపోయింది. కాబట్టి నీ బుద్ధికి ఇప్పుడు ఆ శక్తి వుందా? లేదా? వుంది కదా! దానినే దీనికి వుపయోగించు. నేను శరీరం కాదు, నేను ఆత్మస్వరూపడను. అని నీ అంతరాత్మను మేలుకొలుపు. అంతరాత్మను ఆశ్రయించు. అప్పుడు ఆ ధర్మార్థకామాలను మోక్షం దృష్ట్యా చేసే అవకాశం వస్తుంది. అప్పుడు నీకు అసలు ధర్మం అంటే ఏమిటి? ఎలా ఆచరించాలి? ఈ విధమైనటువంటి అర్థం అప్పుడు కనబడుతుంది. ఆః... లాభం అంటే ఏమిటి? నష్టం అంటే ఏమిటి? యదృశ్చా లాభ సంతుష్టా అంటాడు అందుకని. ముక్తుడు అర్థంలో ఎలా ప్రవర్తిస్తాడయ్యా? జీవన్ముక్తుడనేవాడు అర్థ విషయంలో ఎలా ప్రవర్తిస్తాడయ్యా? యదృశ్చా లాభ సంతుష్టా లాభమా నష్టమా అని విచారణ చెయ్యకుండా, ఎలా జరిగినా అది ఆత్మస్వరూపంగానే భావించి, తనయందే

జరుగుతున్నదిగా భావించి, తనకు అన్యముగా తోచకుండా ఆచరించును. అంటే అర్థం ఏమిటి? తనలోనుంచి బయటకురాడు ఇక ఎప్పుడూ కూడా. అదేదన్నా అక్కడ జరిగితే ఓ! ఇది నాయందే జరుగుతున్నది. ఈవెడ ఎక్కడున్నారు? నాయందే వున్నారు. నేనెక్కడున్నాను? ఆవిడయందే వున్నాను. ఆత్మభావంలో ఇద్దరూ ఒక్కటే కదా! నేను ఒక్కటే కదా! అక్కడ నేనుకు, ఇక్కడ నేనుకు భేదం ఏమున్నది? ఏదన్నా ఆకారంలో భేదం వుందేమో కానీ, నేను దగ్గర ఏ భేదం వుంది? ఏ భేదమూ లేదు. అయితే అంతరాత్మ లేకపోతే పరమాత్మ. అంతరాత్మ స్థితిలోనూ భేదం లేదు, పరమాత్మ స్థితిలోనూ భేదం లేదు. మరి ఈ అనంత జగత్తులో జరిగేదంతా ఎక్కడ జరుగుతుంది? నాయందే జరుగుతున్నది. నాకంటే అన్యంగా జరగడం లేదుగా. ఏందుకని? నేను సర్వవ్యాపిని. నేను అనంతుడను. అప్రమేయుడను. సర్వకాల సర్వ అవస్థలలో వున్నవాడను. నేను శాశ్వతుడను. నేను గంభీరుడను. దేనికి చలించని వాడను. మరి ఇప్పుడు జరుగుతున్నవన్నీ ఎక్కడ జరుగుతున్నాయి? నాయందే జరుగుతున్నాయి. ఈ అనంత బ్రహ్మాండము నాయందే జరుగుతున్నది. ఎందుకని? నేను అంతటా వ్యాపించి వున్నాను గనుక. పిన్నిగారు వేరే వున్నారా? పిన్ని లేదు, నాయనా లేదు, అమ్మా లేదు, ఎవ్వరూ లేరు. మాతా నాస్తి, పితా నాస్తి, నాస్తి బంధు సహోదరః జీవన్ముక్తుడికి ఎవరున్నారయ్యా? ఎవ్వరూ లేరు నాయనా! ఎందుకు లేరు? వాళ్ళంతా ఆయనలోనే వుంటే, బయటనుంచి ఎక్కడనుంచి వచ్చారు? రెండోవాడనేవాడు ఎవరన్నా వుంటేనే కదా! తల్లో, తండ్రో, బంధువో అని చెప్పడానికి. 84 లక్షల జీవరాశులు అతడే అయివున్నాడు. చరాచర సృష్టి అతనే అయివున్నాడు. ఇప్పుడు రెండవవాడు ఎక్కడ? లేడు. ఈ స్థితి యందు అతనికి తండ్రి ఎవరు? లేరు. ఆత్మస్వరూపానికి తండ్రి ఎవరు? లేరు. పరమాత్మ స్వరూపానికి స్థితికి తండ్రి ఏది? తల్లి ఏది? బంధువులు ఏరి? ఎవ్వరూ లేరు. ఎందుకని? వాళ్ళంతా అందులో అంశీభూతములై వున్నారు. అర్థమైందా అండీ!

రాముడెక్కడ? కృష్ణుడెక్కడ? వాళ్ళెవరూ లేరు నాయనా! అంతా పరమాత్మయందు ఇమిడిపోయారు అంతే. అందుకనేగా భగవద్గీతలో ఏం చెబుతున్నారు? బ్రహ్మాండ మీశం కమలాసనస్థం ఋషీంచ సర్వానురగాంశ్చ దివ్యాన్ అనేక బాహూదర వక్త్ర నేత్రం పశ్యామి త్వాం సర్వతో అనంత రూపం న అంతం న మధ్యం న గుణస్తవాధిం పశ్యామి

విశ్వేశ్వర విశ్వరూపా – అది నీ రూపం. ఈ అనంత విశ్వము నీవే అయి వున్నావు. ఆ విశ్వరూపమే నీవై వుండగా, ఈ జానాబెత్తెడు వున్నటువంటి ఈ రూపం శరీరం నేనంటావేమిటి? అర్థం వుందా ఏమైనా? కొండని అద్దంలో బంధించడానికి వీలౌతుందా? ఎట్లా సాధ్యం? నీవెవరు? ఆ కొండవంటివాడవు. ఈ శరీరం ఎటువంటిది? అద్దంలో వున్న ప్రతిబింబం లాంటిది. ఇప్పుడు కొండ అద్దంలో వుందా? అదెట్లా సాధ్యం? సాధ్యం కాదు కదా! అట్లాగే విశ్వరూపుడైనటు వంటి పరమాత్మ యొక్క అణువు, ఈ శరీరంలో ప్రతిబింబిస్తున్నది. అయినంతమాత్రాన ఈ శరీరం పరమాత్మ కాకపోయిందా ఇప్పుడు? శరీరం కూడా పరమాత్మే. ఎప్పుడు? ఆ పద్ధతిలో వినియోగించు. విషయాల దృష్టిలో ఎందుకు వినియోగించావు? దుఃఖం వచ్చే పద్ధతిలో ఎందుకు వినియోగించావు? అజ్ఞానపద్ధతిలో ఎందుకు వినియోగించావు? ఇట్లా వినియోగిస్తే ఇదే ఈజీ. దృష్టిని మార్చు. జ్ఞానపద్ధతిలో వినియోగించు. అప్పుడు అవే ధర్మార్థకామాలే మోక్షహేతువులు అయినాయి. మోక్షానికి కారణం, మోక్షమనే ఫలితాన్ని ఇచ్చాయి. ఆ ధర్మార్థకామాలే విషయం దృష్ట్యా చేశావు, ఇంద్రియం దృష్ట్యా చేశావు, తాత్కాలిక సుఖాన్ని ఆశ్రయించి చేశావు బంధములు అయినాయి. వేరే ఏం లేదు. కాబట్టి మనఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయ అంటే అర్థం ఇది. ఆ మనస్సు ధర్మార్థ కామాలలో ప్రవర్తిస్తున్నది. ఆ మనసు ధర్మార్థకామాలలో ప్రవర్తించి నీకు ఆలోచనలు ఇచ్చేటప్పుడు, వాటిని ఏం చేయాలట? కారణం బంధ మోక్షయ. ఆ కారణమైనటువంటి మనసు, విషయమలు, ఇంద్రియములు చెబుతున్నప్పుడు నువ్వు దానిని ఆశ్రయించే గనుక చేస్తే బంధమవుతున్నది. అలా కాక సాక్షి అయినటువంటి ఆత్మస్వరూపాన్ని, పరమాత్మని గుర్తించే పద్ధతిగా గనుక విచారణ చేసి కనుక నువ్వు ఆచరిస్తే, ఆ ధర్మార్థకామములే మోక్షకారణములు అవుతున్నాయి.

ఈ మనస్సే ఆ మోక్షకారణం అవుతున్నది. సమస్య ఏముంది? పనిముట్టుని అటు తిప్పి వాడే బదులు, ఇటు తిప్పి వాడవయ్యా! లక్ష్యాన్ని మార్చుకో. దృష్టిని మార్చుకో. ఇదే జీవితమే, ఈ చేష్టలే, ఈ భోజనమే, ఈ కళ్ళు, చెవులు, ముక్కులు, ఈ ఇంద్రియాలే, కొత్తవి ఏమీ అవసరం లేదు. కానీ ఏం మారాలి? దృష్టి మారాలి. సృష్టిని మారమని చెప్పకూడదు ఎప్పుడూ కూడా. నేను ఇంతగొప్పవాడిని, నా బట్టి నువ్వు మారు, అది కుదిరే పని కాదు.

ఎందుకనిట? వాడు వేరైపోయాడుగా, నువ్వు మారు అని ఎప్పుడైతే చెబుతున్నావో, అప్పుడు నువ్వేమైపోయావు? ఇద్దరైపోయారా లేదా? ఇద్దరైపోతే ఏమౌతావు? పోయింది ఆత్మస్వరూపం. ఎందుకని? ఆత్మస్వరూపం సర్వవ్యాపకం. పరమాత్మ సర్వవ్యాపకం. రెండోవాడు ఎవరున్నాడు అక్కడ? నువ్వు మారు అని చెప్పాలంటే ఎవరుండాలి ఇప్పుడు? ఇద్దరు వుండాలా? నేను నువ్వు ఇద్దరుండాలా? నేను నువ్వు ఇద్దరు వుంటే ఏమయ్యారు? జీవుడైపోయాడు. శరీరభావం వచ్చేసింది. (రకరకాలుగా వున్నారుగా) ఇంకేమయ్యావు అప్పుడు? ఇంకా ప్రతిబింబ ప్రతిబింబాలు.

(ఇన్నాళ్ళిలా అలవాటు పడిపోయి, చెప్పేవాళ్ళు లేక) ఆఁ... ఇప్పుడు మార్చుకోండి. నేను ఎందుకు చెబుతున్నాను అంటే, గతం గతః అని మనవాళ్ళు ఊరికే చెప్పలేదు. ఈ క్షణానికి గతించిపోయిన క్షణం, ఇంతకు ముందు క్షణం గతమే. దాని జోలికి వెళ్ళమాక. వెళ్ళావా దుఃఖం తప్పదు నాయనా! ఎందుకని అంటే గతజల సేతు బంధనమేల? అక్కడ జలమే లేదు, వారధి ఏం కడతావ్? బ్రిడ్జ్ దేనికి కడతావ్? నీళ్ళు వుంటే కదా! బ్రిడ్జ్ కట్టడానికి, ప్రస్తుత వర్తమానాన్ని కోల్పోతున్నావే. రాని భవిష్యత్తునేమో ఊహిస్తున్నావు, గతించిపోయినటువంటి గతాన్ని జ్ఞాపకాల రూపంలో వెంటాడుతున్నావు, ప్రస్తుత వర్తమానాన్ని కోల్పోతున్నావు. అసలు ఈ మూడింటిలో వున్నది ఏది నీ దగ్గర? ఎప్పుడూ వర్తమానమే వుంది నీదగ్గర. గతం నీ దగ్గర ఎప్పుడూ లేదు. వుంటే ఎక్కడుంది? నీ జ్ఞాపకాల రూపంలో వుంది. ఆ జ్ఞాపకాలే కదా బుద్ధి. అది ఇంద్రియం కదా! పనిముట్టు కదా! నువ్వు కాదు కదా అది. అంతే కదా మరీ! అన్ని జ్ఞాపకాలు బుద్ధే. మనస్సు ఆలోచనలు, సంకల్ప వికల్పాలు అంతే. ఆ జ్ఞాపకాలే ఈ రూపంలో వస్తున్నాయి. ఆ జ్ఞాపకాలమేరకే ఈ ఆలోచనలు వస్తున్నాయి. వేరే ఏమీ లేదు. ఏనుగు ఇలా వుండాలి. ఎలా చెప్పావు? ఎప్పుడో ఏనుగును చూసి వుంటావు కదా! చూడకుండా చెప్పగలవా? చెప్పలేవుగా. నువ్వు ఎక్కడో దక్షిణాఫ్రికాలో ఒక దీవి వుందండి. మీకు నాకు తెలియదండీ! అక్కడ ఏదో దాని గురించి చెబుతున్నాడండీ, నువ్వు ఊహించగలవా? ఎందుకని ఊహించలేవు? చూడలేదు కాబట్టి. దానికి సంబంధించిన ఏ జ్ఞాపకం నీ దగ్గర లేదు కాబట్టి. అంతేనా కాదా? మీరు వంటలు బాగా అద్భుతంగా చేస్తారు కదండీ! మీరు urgent గా నాకొక పిజ్జా తయారు చేసిపెట్టండి. పిజ్జాకు సంబంధించిన జ్ఞాపకాలు నా

దగ్గర ఏమీ లేవు అంటుంది బుద్ధి వెంటనే. ఎందుకని? చూడలేదు, వినలేదు, తినలేదు కాబట్టి దాని జ్ఞాపకాలు అన్నీ దేనికి సంబంధించినవి? చూచుట, వినుట, తినుట నీ జ్ఞానేంద్రియాలకు సంబంధించినటువంటి వాటి ద్వారా జ్ఞాపకాలు బుద్ధి అవుతుందది. వేరే ఏముంది? అంటే ఏమిటి? వాటికి సంబంధించిన సమాచారం ఏమన్నా వుంటే వాటికి సమాధానం ఇస్తుంది. ఆ సమాచారం నువ్వు అవుతావా? సమాచారం నువ్వు కాదుగా. నా బుద్ధి ఇలా వుంది కాబట్టి ఇలా వున్నానయ్యా, నేను వేరే వున్నాను. నా బుద్ధి వేరే వుంది. (బుద్ధి సక్రమంగానే చెబుతుంది కదా!) ఎందుకు సక్రమంగా? దానికి సక్రమం, అక్రమం ఏమీ లేదు దానికి. వున్న జ్ఞాపకాన్ని చెబుతుందది. నా లోపల వున్నది ఇదయ్యా!

ఇప్పుడు నేను నిన్ను ఏమడిగాను? నీకు అన్నీ బాగా వంట చేయడం వచ్చు కదా! పిజ్జా చేసివ్వు నాకు అన్నాను. ఏమని చెప్పావు? ఆ పిజ్జాలేమిటో నాకు తెలియదు నాయనా! నేను ఎప్పుడూ చూడలేదు. వినలేదు, తినలేదు అన్నావు. ఇప్పుడు అది ఎక్కడి నుంచి వచ్చింది? బుద్ధి నుంచి వచ్చింది. ఆ ప్రశ్నకు సమాధానం ఎక్కడి నుంచి వచ్చింది? బుద్ధి మనసుకి అందించింది. దానికి సంబంధించిన సమాచారం నా దగ్గర ఏమీ లేదు అంది బుద్ధి. మనసు అదే ఆలోచన రూపంలో వ్యక్తీ కరించింది. వాక్కు అదే రూపంలో మాట్లాడింది. అర్థమైందా అండీ! అదే నీకు సంబంధిన అంశం మళ్ళా ఇంకోటి ప్రతిపాదించాడు, పిజ్జా వద్దులే ఊతప్పం చెయ్యి అన్నాడు, ఊతప్పం ప్రయత్నించి చూస్తాను, జీవితంలో ఓసారి చేశాను, మళ్ళా నువ్వు అడుగుతున్నావు కాబట్టి ఇంకోసారి చేస్తా. అంటే ఎప్పుడో ఓసారి చూశావు, ఓ సారి విన్నావు, ఓసారి తిని చూశావు, దానికి సంబంధించిన జ్ఞాపకాలు నీ దగ్గర వున్నాయి కాబట్టి ఆ జ్ఞాపకాలను వ్యక్తీ కరిస్తున్నావు, అంతే కదా! కాబట్టి బుద్ధికి దాంట్లో అక్రమం, సక్రమం ఏదైనా వుందా? ఏమీ లేదు. అది ఊరికే ఒక బీరువా లాంటిది, అది లోపల ఏమేమి వస్తువులున్నాయి, ఏ ఏ జ్ఞాపకాలున్నాయో తెరుస్తుంది. ఈ జ్ఞాపకాలున్నాయి, నా దగ్గర సమాచారం ఇది వుంది. అని చెబుతుంది అంతే. (మరి కొన్ని మరచిపోతూ వుంటాం కదా!) అవసరం లేనివి. (అవసరం వున్నది కూడా మరిచిపోతుంటాం) పోనీ. ఎట్లా అంటే అది, ఉపయోగించకపోతే అది ఏం చెబుతుంది? బాబూ! ఈ సమాచారాన్ని నువ్వు చాలా

కాలం నుంచి ఉపయోగించడం లేదు, కాబట్టి ఇది అనవసరం. నేను పడేస్తున్నాను అంటుంది. అర్థమైందా? బీరువా నిండిపోతూ వుంటుంది కదా! బీరువా నిండిపోతే ఏం చేయాలి మరి అది! వున్నవి తీసిపారేస్తేనే కదా! కొత్తవి అందులో పడేది. మరి బయట పడవేయటం అంటే ఏమిటి? ఇదే బయట పడేయటం. అది ఏమడుగుతుంది? నీకు ఈ సమాచారం కావాలా? అదే కల. వేరే ఎక్కడ నుంచి కల రాదండి. ఆ కల ఏమిటంటే ఇదే. బీరువా నిండిపోయింది. బీరువాలో నిండిపోయినవి బయటపారేసేవి అన్నీ కలలో వస్తాయండి. ఆ కలలో వచ్చేసి ఇక దీనికి స్థానం లేదు. నా దగ్గర బుద్ధిలో దీనిని నిక్షిప్తం చేయడానికి ఇక స్థానం లేదు, అవకాశం లేదు, (వివరణ వుండ కుండా వస్తాయి కదా!) అది వేరే విషయం. వివరణ నీకు తెలియదు, నీకు అప్పుడు తెలివి లేదు కాబట్టి వివరణ లేదంటున్నావు అంతే. మెలకువలోకి వస్తే వివరణ వస్తుంది. కలలో కాబట్టి వివరణ లేదు.(కొన్ని కలలకు అసలు అర్థం వుండవు, ఏమీ వుండవు) అవునమ్మా! నీ బుద్ధి ఇవాళ వచ్చిందా? 84 లక్షల జీవరాశుల నుంచి వచ్చిన జ్ఞాపకాలు అన్నీ ఎందులో వున్నాయి? అన్నీ అందులోనే వున్నాయి. నీ godown అంతా ఆ బుద్ధే. వుండబట్టే కదా! నువ్వు వెల్లకిలా పడుకున్నవాడివి బోర్లా ఎవడు పడేశాడు నిన్ను? ఆ బుద్ధియే. తల్లి గర్భంలో నీ శరీరాన్ని తయారు చేసింది ఎవరు? ఆ బుద్ధే. (ఇప్పుడు ఈ ఆలోచనలు ఇవన్నీ ఈ జన్మవి కాదు కదా!) జ్ఞాపకం. జ్ఞాపకం వ్యక్తీ కరించ బడుతున్నదండీ, అంతకుమించి వేరే ఏమీ లేదు. అందులో ఇది ఈ జన్మదా, ఆ జన్మదా అని నువ్వు లెక్కలు వేసుకోవడమే. దానికి, బుద్ధికి అసలు జన్మతో పనిలేదు. మనసుకు అంతకంటే జన్మతో పనిలేదు. సూక్ష్మం అది. ఇక్కడ అంశం ఏమిటంటే, సూక్ష్మానికి మరణం లేదు. స్థూలానికే మరణం వుంది. జన్మకూడా స్థూలానికే వుంది, సూక్ష్మానికి లేదు. సూక్ష్మం ఎప్పుడూ వున్నది. నీ ప్రాణ మనో బుద్ధులు ఈ ప్రపంచం వున్నంత వరకూ వుంటాయి అవి. సృష్టి వున్నంత కాలం ప్రాణ మనో బుద్ధులు వుండక తప్పదు. దానికి 'జయమ్మ' అనే పేరు లేదు. అర్థమౌతుందా? మీరు ఏదైతే నేను నేను నేను అని మీరు అనుకుంటున్నారో, అది మీ సూక్ష్మానికి లేదు ఆ పేరు. అర్థమౌతుందా? దాంట్లో ఏమున్నాయి? మూడు గుణాలున్నాయి, మూడు అవస్థలున్నాయి. దానికి సంబంధించిన జ్ఞాపకాలున్నాయి. అంతే. మూడు వాసనలు ఏమిటి? శాస్త్రవాసన, దేహవాసన, లోకవాసన. ఆ మూడు వాసనలు, మూడు గుణాలు,

మూడు అవస్థలు. అలా మూడు మూడుగా వున్నవి ఏవైతే వున్నాయో, అవి ప్రాణమనోబుద్ధుల రూపంలో వున్నాయండి. వాటికి ఏ పేరు లేదు, విద్యాసాగర్ అనే పేరు లేదు, జయమ్మ అనే పేరు లేదు, ఆది శంకరుడు అనే పేరుకూడా లేదు. వివేకానందుడు అనే పేరు అంతకంటే లేదు. అదేమిటి అసలు సూక్ష్మం. అర్థమైందా? ఆ బలం పెరగగానే ఏమైంది? నాకు స్థూలం కావాలి అంటే స్థూలం వచ్చింది. ఈ స్థూలం నాకు పనికిరాదు పో అంటే పోయింది. అంతే. కాబట్టి సూక్ష్మం చేతిలో కీలుబొమ్మగా వుంది, ఈ స్థూలం. మరి స్థూలాన్ని పట్టుకుని వేళాడుతావేమిటి నాకు అర్థంకాదు? అర్థం వుందా ఏమైనా?

ఆ ప్రాణ మనో బుద్ధులే లేకపోతే ఈ ఇంద్రియాలను పనిచేయమను. అనుభవించమను. ఏదైనా నీకు తెలియజెప్పమను. సాధ్యమేనా? మరేమైంది స్థూలం అంతా? అవి లేకపోతే ఎందుకూ పనికి రాదు ఇది. కానీ, విలువ అంతా దేనికి ఇచ్చావు? పోయే, అక్కడ పోయింది. అర్థమైందా అండీ? ఇలా అభ్యాసబలం అంతా కూడా, మార్పు చెందాలి. ప్రతిదీ ఇట్లా విచారణ చేయాలి. ధర్మార్థకామాల దృష్ట్యా ఆచరించే ప్రతీ దానిని ఇలా విచారణ చేయాలి. ఇలా విచారణ చేసి, ఆలోచన చేసి, ఏది సత్యము? ఏది శాశ్వతము? ఏది సనాతనము? ఏది అనంతము? ఏది జ్ఞానము? ఏది సర్వ వ్యాపకము? అనే పద్ధతిలో మనం చూడాలి. ఏది సాక్షిత్వాన్ని ఇస్తుంది? ఎట్లా చేస్తే నేను సాక్షిగా నిలబడకలుగుతున్నాను? అనే దానికే ప్రాధాన్యతను ఇచ్చి జీవితాన్ని నడపాలి. అప్పుడేమయ్యింది? ఆ ధర్మార్థకామాలే మోక్షాన్ని ఇస్తాయి.

తరువాత వాక్యం, (లోకములో వేరు వేరు పుణ్య కర్మలచే లభించు స్వర్గాది లోకములు కూడా క్షీణించునట్టివే, మోక్షము బ్రహ్మజ్ఞానము వలననే లభించును)

ఏమని చెబుతున్నారు ఇప్పుడు? నేను ఆ యాగం చేశా, ఈ యాగం చేశా, ఈ యజ్ఞం చేశా, ఆ పుణ్యం చేశా, ఈ పుణ్యం చేశా ఇవి అన్నీ వున్నాయా? అక్కడ ఎక్కడైనా? జ్ఞాపకాల రూపంలో బుద్ధిలో వున్నాయి. అంతేకదా! శతరుద్ర చండీ యాగానికి వెళ్ళి వచ్చానండీ! ఓహో! అలాగా అయితే ఏమిటట? ఏమన్నా వుందా? మోక్షం వచ్చిందా? దేంట్లో నుంచన్నా ముక్తి పొందావా? శరీర భావంలోనుంచి ముక్తి పొందావా? ఏమిటి దాని వల్ల ప్రయోజనం? అంటే ఏమైంది? పుణ్యం అనేది భావనేనా? బాహ్యం కాదుకదా! పదార్థం కాదు కదా! మరి భావనంతా ఎందులో వుంది ఇప్పుడు? బుద్ధి రూపంలోనే కదా

వుంది. జ్ఞాపకమేగా. ఇప్పుడు రేపొద్దున మరణం వచ్చేటప్పుడు నీ శతరుద్ర చండీ యాగం ఏమన్నా మరణాన్ని ఎదురించ కలుగుతుందా? లేకుండా చేయకలుగుతుందా? లేదే. పోనీ, ఏదైనా దుఃఖం వచ్చిందండీ, ఆ దుఃఖం వచ్చినప్పుడు ఈ శతరుద్ర చండీ యాగం ఏమన్నా దుఃఖాన్ని పోగొట్టిందా? పోగొట్టలేదే. పోనీ ఏమన్నా సాక్షిత్వం వచ్చిందా? రాలేదే. పోనీ ఏమన్నా జ్ఞానం వచ్చిందా? అదీ రాలేదే. మరి ఏమైంది ఇప్పుడు? అంతా యాంత్రికమే. ఆ పుణ్యం కూడా అనుకుంటున్నావే కానీ, అక్కడే ముంది? దానికేమన్నా రూపా పాడా? (లెక్క కొలమానమా?) వున్నాయా ఇవన్నీ? అన్నీ నీ బుద్ధిలోనే వున్నాయిరా బాబు. ఆ స్వర్గ నరకాలు కూడా నీ బుద్ధిలోనే వున్నాయి. నీ సూక్ష్మమే అంతా కూడా. ఇది స్థూలం, అది సూక్ష్మం. అంతే తేడా. ఎంత సేపు అలా వుంటావు? కొంతసేపైనాక అది పోతుందిగా. అది కూడా శాశ్వతం కాదు కదా! మార్పు చెందేదే కదా! కాసేపు అయినాక ఏమయ్యింది? నాకు ఇది మొహం వత్తింది అంది. ఏమైంది? మరో స్థూలం తీసుకో అయితే. ప్రకృతి ఏం చెప్పింది? నీకు అది చాలటం లేదు, అది అనుభవించడానికి వీలు కావడం లేదు, బయట పడటానికి వీలుకాదు, సూక్ష్మం సూక్ష్మంగానే వున్నంతవరకూ బయటపడడానికి వీలుకాదు. ఏం కావాలి మరినీకు? (సూక్ష్మం అంటే ఏమిటసలు?) ప్రాణ మనో బుద్ధులే సూక్ష్మం. వేరే ఏమీ లేదు. లోపల ప్రాణం పనిచేస్తుందా? ఆ ప్రాణం ఎలాగా? అక్కడ సమిష్టి ప్రాణం వుంది కాబట్టి నీలోపల ప్రాణం కొట్టుకుంటుంది. నీలోపల మనసు పనిచేస్తుందా? సమిష్టి మనస్సు అక్కడ వుంది. అందువల్లే నీలో మనస్సు పనిచేస్తుంది. (సమిష్టిగా వున్నప్పుడు అందరూ ఒక రకంగా వుండాలి కదా!) ప్రాణ మనో బుద్ధుల రూపంలో అదే నీకు చెబుతుంది ఇప్పుడు, ప్రాణ మనో బుద్ధులుగా వున్నప్పుడు అందరూ ఒక్కతీరుగానే వున్నారు. నీలో రజోగుణం వుందండి. ఈవెడలో రజోగుణం వుంది. రజోగుణ రూపంలో ఒకటే. విషయంలోకి వచ్చేటప్పటికి మార్పు వచ్చేసింది. ఇంద్రియాలలోకి విషయంలోకి దిగినప్పుడు మార్పును గుర్తిస్తున్నావు అంతే. తేడా వచ్చింది ఎలాగా? నాకు పిజ్జా కావాలి, నీకు ఊతప్పం కావాలి. ఎలాగా? (ఇవన్నీ ఒకటైనప్పుడు ఇవి కూడా ఒకటి కావాలి కదా!) ఆగు చెబుతా విను. నాకు పిజ్జా కావాలి అనేది రజోగుణమే. నీకు ఊతప్పం కావాలి అనేది రజోగుణమే. ప్రాణ మనో బుద్ధులు ఏం చెబుతున్నాయి? రజోగుణ ధర్మంలో అందరూ సమానమే. నువ్వు ఇంద్రియంలోకి

దిగావు. ఇంద్రియంలోకి దిగితే ఏమైంది? ఆ జ్ఞాపకం ఇంకా బలపడింది. జ్ఞాపకం బలపడింది, ఆ జ్ఞాపకం ఎట్లావుంటే ఆ తలుపు తెరిచావు, ఆ జ్ఞాపకంలో ఎట్లా వుంటే అట్లా చేశావు, వాడి జ్ఞాపకంలో పిజ్జా వుంది, నీ జ్ఞాపకంలో ఊతప్పం వుంది, అదే సూక్ష్మ దృష్ట్యా చూశావు, రెండూ ఒకటే. ఎందుకని? రెండింటిలో కూడా రసనేంద్రియం పనిచేస్తుంది అంతే. రుచి పనిచేస్తుంది. వాడు పిజ్జాని ఆనందించిన నీవు ఊతప్పాన్ని ఆనందించినా ఆ సుఖం ఎక్కడిది? నాలుక యొక్క రుచి వలన వచ్చిన సుఖం. ఏమిటట అయితే రజోగుణ సుఖం. అవి ఎక్కడున్నాయి? మనో ప్రాణ బుద్ధుల్లో వున్నాయి. ప్రాణ మనో బుద్ధుల్లో ఏం భేదం లేదు. అక్కడికి వచ్చేటప్పటికి సూక్ష్మంలో అంతా సూక్ష్మీకరించబడిపోయింది. అంతా వంద సంవత్సరాల జీవితం అంతా చిన్న ఒక సంఘటనలోకి మార్పు చెందేసింది. సూక్ష్మీ కరించబడిపోయింది మొత్తం అంతా కూడా. ఎంతసేపు బుద్ధి అలా నిర్ణయిస్తుందంటే, అందులో ఎలా, ఆ అరలో ఎలా సర్దుతుందయ్యా అంటే, సత్వగుణ జ్ఞాపకాలు అన్నీ ఒకప్రక్కన, రజోగుణ జ్ఞాపకాలన్నీ ఒక ప్రక్కన, తమోగుణ జ్ఞాపకాలు అన్నీ ఒక ప్రక్కన. సాక్షిత్వానికి సంబంధించినవన్నీ పై వరుసలో, అంతరాంతరాళలో వుంటాయన్నమాట సాక్షిత్వానికి సంబంధించినవి. పైవన్నీ రజో, తమో, సత్వగుణానికి సంబంధించినవన్నీ వుంటాయి. తలుపు తీయగానే అవి వచ్చేస్తాయి బయటకి. ఇవి అన్నీ అయితే గానీ ఆ లోపలిది రాదు. అయితే మనమేంటట ఇవి రాగానే ఇవి వచ్చినాయిగా అని ఇవే చేసేస్తున్నాం, ఇవే ఆచరించేస్తున్నాము. కాసేపు ఆగు నిదానించు, ఒక నిమిషం ఆగు, అది ఏం చేస్తుంది? రజోగుణానికి సంబంధించినవి, ముందు బలమైనవి ఇస్తుందండీ. ఏవి బలంగా వుంటే అవి ఇస్తుంది. నీ అభ్యాస బలంలో సత్వగుణానికి సంబంధించింది బలంగా వుందనుకోండి, ముందు అవే ఇస్తుంది. లేదు రజోగుణానికి సంబంధించి బలంగా వుంటే అవే ఇస్తుంది. లేదూ తమోగుణానికి సంబంధించినవి బలంగా వుంటే అవే ఇస్తుంది. ఆ జ్ఞాపకాలు ముందు ఇస్తుంది. కాసేపు నిదానించావనుకో ఏం చేస్తుంది? ఓహో! ఇవి కాదా నీకు కావలసింది? ఇంకా లోపల వున్నాయి, లోపల అరలను తెరుస్తుంది అప్పుడు. అప్పుడు సాక్షిత్వానికి సంబంధించినటువంటి జ్ఞాపకాలు బయటపడుతాయి. ఆ వాక్యాలు బయటకు వస్తాయి. ఆ అనుభవాలు బయటకు

వస్తాయి. అప్పుడు ఓహో! ఇది కదా నేను. (నిదానంగా ఆలోచించి) ఆఁ... నిదానమే ప్రధానము నాయనా! అంటే అర్థం ఇది. విచారణ చేసి, విచక్షణ తోటి, ఒక్కక్షణం ఆలోచించి, నిదానించి, ఏది తోస్తే అది చేసేయటమేనా? కొంచెం ఆగు. నిదానించు. విచారణ చెయ్యి. ఏమిటి విచారణ చెయ్? ఇదిగో ఇదే. అది ఏం చెబుతోంది? ముందు ఏది అందిస్తోంది? నాలో ఇది బలంగా వుంది కాబట్టి ఇది అందిస్తోంది. తర్వాత ఏది అందిస్తోంది? కాసేపు ఆగు. ఏమీ ఇవ్వలేదు. అంటే దానిలోపల ఇంకేం లేదు. ఇదే వుందన్నమాట. అర్థమైందా అండీ! అయినా నిదానించు. నిదానిస్తే పోయే నష్టం ఏం లేదు. (ఆ నిదానం రావాలిగా) ఆఁ.. అంటే ఏం చెయ్యాలి? నువ్వు ఇలా అభ్యాసం చెయ్యి. నిదానం రావాలంటే ఎక్కడినుంచో రాదు కదా! ఎక్కడినుంచి వస్తుంది?(automaticగా వస్తుంది) auto లేదు matic లేదు అసలు. ఒక్కటే గుర్తుపెట్టుకో! ఏదీ ఈ సృష్టిలో ఆటోమేటిక్ లేదు. అన్నీ ఒకపద్ధతి, ఒక సూత్రానికి లోబడే పనిచేస్తున్నాయి. (మొదటినుంచి ఇట్లా అలవాటు చేశాం కాబట్టి) అవును, ఇప్పుడు మార్చుకో! కాబట్టి జీవన రహస్యం అంతా కూడా ఇలాగ ఈ సూత్రానికి లోబడి పనిచేస్తుంది. కాబట్టి ఈ సూత్రాన్ని అర్థం చేసుకుని, జీవితాన్ని పరిష్కరించాలి. ఇప్పటి వరకూ గతంలో వున్నటు వంటి విధానాన్ని మరలా స్ఫురణకు తెచ్చుకోమాకండి. నేను ఎప్పుడూ మీకు చెబుతుంది అదే! నువ్వు సాధనతో కూడిన జీవితాన్ని జీవించాలి అనుకున్నప్పుడు, సాధనకు వ్యతిరేకమైన జీవితాన్ని మళ్ళా స్ఫురణకు తెచ్చుకోకూడదు. ఏమౌతుంది తెచ్చుకుంటే? మళ్ళా పడిపోతావయ్యా! నిన్ను బలవత్తరంగా లేపడానికి నా శక్తి అంతా వుపయోగించి నిన్ను లేపడానికి ప్రయత్నిస్తూ వుంటాను, నువ్వు దేనిని గుర్తు తెచ్చుకుంటావు? తద్ వ్యతిరేకాన్ని గుర్తుకు తెచ్చుకోవడం వల్ల, నువ్వు ఓడిపోతున్నావు, నాకు శ్రమ అవుతున్నది. కాబట్టి గురు సమక్షంలో, గురు సన్నిధానంలో వున్నప్పుడు, భగవంతుడి సన్నిధానంలో వున్నప్పుడు, నువ్వు వ్యతిరేకాన్ని ఆలోచించకూడదు. నీ పూర్వజ్ఞాపకాలను గురించి ఆలోచించకూడదు. నీ గతం గురించి ఆలోచించకూడదు. నూతనమైన జీవితాన్ని జీవించడానికి ఇక్కడికి వచ్చాను. అనేటటువంటి భావంతో భగవంతుని ఆలయంలోకి వెళ్ళాలి, గురువు దగ్గరకు వెళ్ళాలి. మీరు ఎప్పుడైనా గుడిలోకి వెళ్ళండి, వెళ్ళినప్పుడు ఏమైంది? ఇవాళ్టి నుండి నేను నూతనమైన జీవితాన్ని జీవించబోతున్నాను. భగవంతుని

దృష్టిలో పెట్టుకుని, పరమాత్మను దృష్టిలో పెట్టుకుని, జీవించడానికి నిశ్చయించుకుని భగవంతుని దగ్గరకు వచ్చాను. అనే భావంతో నువ్వులోపలికి వచ్చి, స్థిరపడి, అదే భావంతో ఇంటికి వెళ్ళాలండి. ఇదీ అసలు ఆలయానికి వెళ్ళడానికి ప్రధానమైనటువంటి కారణం. నిజంగా మనం అలానే వెళ్తున్నామా? ఏమైంది ఇప్పుడు అక్కడ? విచారణ లేదు. నేను చెప్పేది అది. నువ్వు ఆ పని చేస్తున్నావు, కానీ విచారణ లేదు. సంవత్సరంలో 365 రోజుల్లో 300 సార్లు దుర్గ గుడి మెట్లు ఎక్కి ఎక్కి ఎక్కి రాళ్ళు అరిగిపోయినాయి, కాళ్ళకు చెప్పులు అరిగిపోయినాయి. ప్రయోజనం ఏమి వచ్చింది? ఏమీ రాలేదు. ఎందుకని? ఈ భావన లేదు. అర్థమైందా అండీ! భగవంతుడు భావంలో వున్నాడు కానీ, బాహ్యంలో లేడే. నువ్వేం చేశావు, బాహ్యాన్ని పట్టుకుంటివి, భావాన్ని వదిలేస్తివి. అర్థమైందా అండీ! నువ్వు ఏ పూజారినైనా అడుగు. ఏవండీ మీరు ఆలయానికి వెళ్తున్నారు కదా! అమ్మవారిని నిజంగా చూశారా మీరు? ఆ అవకాశం లేదు నాయనా! ఎవరికో నూటికో కోటికో ఎవరికో నాయనా! అది సాధ్యం అవుతుందో లేదో కూడా నాకే తెలియదు నాయనా! ఇది కేవలం నా భోజన వృత్తి మాత్రమే. అన్నావా అప్పుడు ఏమైంది ఇప్పుడు నీకు? అప్పుడు భావం ఎక్కడకి బిగుసుకు పోయింది? నువ్వు ఎంత ఆ విగ్రహం ప్రక్కనే వుండి, మూల విరాట్ కు పూజలు చేస్తూ వున్నప్పటికీ, నీలోపల ఏం బలపడిపోయింది ఇప్పుడు? పరమాత్మ పద్ధతిగా జీవించాలనే తపహ లేదుగా. నేను ఆలయంలో వున్నాను, భగవంతుడిని లక్ష్యంగా పెట్టుకుని జీవిస్తాను. పరమాత్మ పద్ధతిలోనే జీవిస్తాను అనే నిర్ణయం లేదుగా. అందువలన ఏమైంది? నువ్వు ఎన్నిసార్లు ఆలయానికి వెళ్లినా మళ్ళా అక్కడ నీ శరీరమే స్ఫురించింది కానీ, భగవంతుడు స్ఫురించలేదు. ఎప్పుడైతే ఆ నిర్ణయంతో బయటకు వచ్చావో, అప్పుడేమౌతుంది? దేనినైనా ఎదురించ గలుగుతావు. ఏ పరిస్థితినైనా ఎదురించగలుగుతావు. ఏ మార్పునైనా ఒప్పుకుంటావు. జీవితాన్ని స్థిరమైన పద్ధతిలో నడుపుతావు. కాబట్టి ధర్మార్థ కామాలను ఇట్లా ఆచరించాలి. ఆ స్వర్గ నరకాలు కానీ అన్నీ నీ బుద్ధి రూపంలో వున్న జ్ఞాపకాలే. అవన్నీ ఎప్పటికైనా క్షీణించిపోయేవే. అవన్నీ లేకుండా పోయేవే. ఎప్పటికైనా సరే! శాశ్వతమైన బ్రహ్మజ్ఞానం లభించాలి అంటే, ఆత్మ విచారణ వల్లనే లభిస్తుంది. అది అధ్యారోప అపవాదం వల్లనే లభిస్తుంది. వేరేదాని వల్ల లభించదు. తరువాత వాక్యం అదే.

(అధ్యారోపం అనగా మోక్షం బ్రహ్మజ్ఞానము వలన లభిస్తుంది, వేరు మార్గము లేదు. ఆ బ్రహ్మం అధ్యారోప అపవాదం వల్లనే తెలియబడుతున్నది) తెలియబడుతున్నదట అంతే! గుర్తుపెట్టుకోండి. బ్రహ్మం అనేది ఎట్లా వుందట? తెలియబడుతుంది. ఇప్పుడు మనము సూర్యుడిని తెలుసుకుంటున్నామా? అనుభవిస్తున్నామా? సూర్యుడిని. సూర్యప్రకాశాన్ని కాదు. సూర్యుడిని తెలుసుకోవడమే. సూర్యుడిని అనుభవించడానికి కొత్తగా అక్కడేమీ లేదు. దాని యొక్క ప్రకాశ ప్రభావాన్ని మాత్రం అనుభవిస్తాము. అట్లాగే, బ్రహ్మానికి సంబంధించినటు వంటి బ్రహ్మజ్ఞానాన్ని తెలుసుకోవాలి మొట్టమొదట. అది జీవితం అంతా ఆక్రమిస్తే, ఆ జీవిత ప్రభావం ఏమిటో మార్పు చెందితే అప్పుడు అనుభవం వస్తుంది. కాబట్టి ముందు ఏం చెయ్యాలట? తెలుసుకో! "కని చేరి పొందవలయురా" అనేది సూత్రం అన్నమాట. కని అదేమిటో చూడాలి మొట్టమొదట. చేరి – ఆ స్థితికి చేరి, పొందవలయురా – నీ జీవితంలో దానిని ఆశ్రయించి జీవిస్తే అనుభవం వస్తుంది. కని, చేరి, పొందవలయురా! ఇదే సూత్రం, వేదాంతం మొత్తానికి ఇదే సూత్రం. కని, చేరి, పొంద వలయురా! నాలుగో స్థితి వుంది, 'అధిగమించ వలయురా'. పొందావయ్యా! అక్కడే ఆగిపోతావా ఏమిటి? దానిని కూడా అధిగమించాలి నాయనా! కని, చేరి, పొంది, అధిగమించవలయురా!

నిరంతరాయంగా నీ స్ఫురణలోనే వుంటాడు. పరమాత్మ ఎలా వుంటాడో, గురువుకూడా అలానే వుంటాడు. సర్వవ్యాపకుడు కాబట్టి. అందరిలో పనిచేసే సత్తా గురు సత్తాయే. కాబట్టి ఆ గురుసత్తా ప్రభావం చేతనే సర్వవ్యాపకంగా వుంటాడు. నువ్వు ఎప్పుడు తలిస్తే అప్పుడు అక్కడే వుంటాడు, పరమాత్మ కూడా అంతే. గురువు ఎలా వున్నాడో, పరమాత్మ కూడా అలాగే వుంటాడు. కానీ అతను నీకు ఎప్పుడు వుపయోగపడుతాడయ్యా? అని అంటే, నువ్వు నీ నిజ జీవితంలో ఆ స్ఫురణతోటి జీవిస్తూ వుంటే, గురువు ఆ విషయంలో ఎలా చెప్పాడు? ఆయన వాక్యం ఎలా చెప్పాడు? ఆ వాక్యంతోటి మనం ఎట్లా జీవించాలి? ఎట్లా మార్పు చెందాలి? ఏ మార్పు చెందితే గురువు గమనించగలుగుతాడు? నువ్వు ఎంతగా మార్పు చెందాలట? నువ్వు అక్కడకు రానక్కర్లేదు. నువ్వు ఆ గురువాక్యాన్ని అనుసరించి జీవిస్తూ వుంటే చాలు. నీ ఆర్తి ప్రభావం, నీ విచారణా ప్రభావం, నీలో కలిగే తపన అది గురువును మేల్కొలుపుతుంది. పరమాత్మను మేలుకొల్పుతుంది. నీలో అంతఃస్ఫురణ మేల్కొంటే చాలు నీ అంతరాత్మ చెబుతుందన్నమాట. నీకు నాకు వారధి ఎవరయ్యా? అంతరాత్మయే వారధి. ఎందుకని? నాలోపల వున్న అంతరాత్మ, నీలోపల వున్న అంతరాత్మ ఒక్కటేగా. ఆ అంతరాత్మ అనే వారధి ద్వారా తెలుస్తుంది. నువ్వు చెబితే నాకు తెలిసేదంతా వట్టిదే. ఎందుకని? ఇది ఇంద్రియాల సమక్షంలో జరిగేది. ఇప్పుడు నీకు ఏం చెప్పినా తాత్కాలికమే. శాశ్వతమైనది ఎలాగయ్యా అని అంటే, నువ్వు నీ అంతరాత్మని పట్టుకో! నీ అంతరాత్మ సాక్షి మేల్కొనేట్లయితే, ఆ సాక్షి అనే అంతరాత్మ ద్వారా, ఆ వారధి ద్వారా తెలుసుకునేదంతా సత్యం. అర్థమైందా అండీ! ఆ రకంగా తెలుసుకోవాలి. అయితే అప్పుడప్పుడూ నువ్వు మోసపోయే అవకాశం వుంది. ఏది అదో, ఏది మనసో, ఏది అంతరాత్మో స్పష్టంగా తెలియదు కాబట్టి ప్రాథమిక దశలలో అప్పుడప్పుడు మధ్యలో ఇలా వచ్చి విచారణ చేస్తూ, ఏవండీ ఇప్పుడిది ఇలా జరిగింది, ఈ సంఘటనలో ఇలా స్ఫురణ తోచింది, ఈ స్ఫురణ కరెక్టేనా? ఇది మనసా? అంతరాత్మా? (ఇది స్ఫురణ అనేది గుర్తుండడంలేదు కదా!) ఒకటి గుర్తు పెట్టుకోండి, చిన్న పిల్లవాడు ఇప్పుడే అక్షరాభ్యాసం మొదలు పెట్టాడండీ! ఏం గుర్తు వుంటుంది వాడికి? నువ్వు అప్పుడే వాడిని ఏదో, పెద్ద పండితుడి level లో చెయ్యాలి అంటే ఎలాగ?

అద్దం యొక్క ప్రతిబింబం, నీ లోపల సరిగా వుంటే, నీ బయటంతా ఎప్పుడూ సరిగ్గానే వుంటుంది. దానిని ఏం సరిచేయక్కర్లేదండీ! కానీ మనం జీవితం మొత్తం ఏం ప్రయత్నిస్తాము? బయట దానిని సరిచేయడానికే జీవితమంతా సరిపోతుంది. అది ఎప్పటికీ అది ఒక తీరు తెన్నుగా వచ్చినట్టు కనపడదు. అసలు ఎక్కడ సరిచేసుకోవాలట? నీ లోపల సరిచేసుకోవయ్యా! నీ లోపల వున్న మూడు గుణాలను సరిచెయ్యి. మూడు అవస్థలను సరిచెయ్యి. మూడు వాసనలను సరిచెయ్యి. వాటికి సాక్షిగా వుండటం నేర్చుకో. అప్పుడు నీ బాహ్యం నిన్ను ఏం చేసింది? ఏమీ చెయ్యలేదు. (మనం అనుకునే దానిని బట్టి అది వుంటుంది) అంతే, సద్భావంతో చూడు అంతా సద్భావంగానే కనబడుతుంది. వ్యతిరేకమైన దృష్టితో చూశావు, వాడు మంచికే చెప్పినా నీకు వ్యతిరేకం తోస్తుంది. అసలు అయినా ఇద్దరు లేరు ఇక్కడ. చెప్పేవాడు, వినేవాడు లేరయ్యా బాబూ! ఆత్మ స్వరూపంలో ఇద్దరూ నేనే. ఇద్దరు ఎక్కడున్నారు? నీ లోపల వున్న సూక్ష్మమే, ఆ జీవి యొక్క స్థూలాన్ని ఆశ్రయించి పలికిస్తోంది. ఇది సత్యం. అర్థమౌతోందా అండీ! నేను మొదట్లో కూడా చెప్పాను మీకు. మీరందరూ ఇప్పుడూ నేను మాట్లాడుతున్నాను, మీరందరూ వింటున్నారు అని మీ అభిప్రాయం అంతే కదండీ! ఎంతో దూరం నుండి మీరు హైదరాబాదు నుంచి ఎందుకొచ్చారు? నేనేదో చెప్తాను మీరేదో వింటారని అంతేనా అండీ? కానీ నాయందు పల్కుతున్నది నీ ప్రజ్ఞ. ఈ శరీరాన్ని ఆశ్రయించి పలుకుతున్నది ఎవరయ్యా? నీ అంతరాత్మయే. నీ అంతరాత్మ, నీ సూక్ష్మం, నా యందు చేరి, దీనిని పనిముట్టుగా వాడుకుని, నీకే వినిపిస్తోంది. ఈ జ్ఞానం, ఇప్పుడు నేను చెబుతున్న జ్ఞానం నాది అనేగా నీ అభిప్రాయం అంతేనా కాదా? నాలోపల వున్న జ్ఞానమైనా, నీ లోపల వున్న జ్ఞానమైనా రెండూ ఒక్కటే. నీ జ్ఞానమే ఈ శరీరాన్ని (ఉపాధిని) పనిముట్టుగా వుపయోగించుకుని నీకే వినిపిస్తున్నది.

(మరి మా జ్ఞానం ఇలా వుంటే మాకెందుకు తెలియడం లేదు?)

అదేగా చిక్కు. అదేగా సమస్య. తెలుసుకోలేక పోవడానికి కారణం నీ దృష్టి భేదం. నీవు మూడు గుణాలని, మూడు వాసనలని, ఇంద్రియాలనే పట్టించుకుంటూ జీవిస్తున్నావు. కాబట్టి అది కనబడడం లేదు, వినబడడం లేదు. అదే, సత్యం ఏమిటి ఇప్పుడు? నేను మీ అందరికీ సంబంధించి, నాకేమన్నా తెలుసా మీ జీవితాలు ఈ నలభై

యాభై ఏళ్ళు ఏం చేశారో? నాకేం తెలియదు కదా! కానీ నేను మాట్లాడుతున్నప్పుడు ఎలా మాట్లాడుతున్నాను? మీ జీవితాలన్నీ నాకు బాగా తెలిసినట్టే మాట్లాడుతున్నాను. మీ జీవితాలకు సంబంధించిన ఉపమానాలనే చెబుతూవుంటాను. మీకు సరిపడే ఉపమానాలే వస్తూ వుంటాయి. మీకు ఏం చెబితే మీకు అది కరెక్ట్‌గా తెలుస్తుందో ఆ ధోరణిలోనే మాట్లాడుతాం. ఇప్పుడు నేను ఎలా? నాకు ఎవరన్నా training ఇచ్చారా? ఎక్కడన్నా తయారయ్యానా? ఏదన్నా పుస్తకంలో చదువుకుని వచ్చానా? ఏం లేదు కదా! ఎలాగు చెప్తుంది అంటే, అదే సర్వసమర్పణభావం నాయనా! నువ్వు పరమాత్మకు సర్వ సమర్పణ భావంలో వుండు. ఎందుకని? సర్వత్రా వ్యాపించివున్న పరమాత్మకు సమర్పణ భావంలో నువ్వు ఎప్పుడైతే వుంటావో, ఎవరికి ఏది అవసరమో వాడు వస్తాడు, వాడికి నీ ఉపాధి, నీలో వున్న జ్ఞానం, నీ అంతరాత్మ, నీ సూక్ష్మ శరీరం, నీ స్థూల శరీరం అన్నీ ఆ పరమాత్మకు దాసోహం అయి వున్నాయి కదా! అప్పుడు ఏమయి వున్నదట? ఎవరొస్తారో నీలో పనిచేసేదీ ఆ గురు సత్తాయే. ఆ పరమాత్మ సత్తయే. నాలో పనిచేసేది, ఆ గురు సత్తాయే, ఆ పరమాత్మ సత్తాయే. ఇందులో చెప్పేది ఆ గురుసత్తాయే, ఆ పరమాత్మ సత్తాయే. నీలో వినేది ఆ గురు సత్తయే, ఆ పరమాత్మ సత్తాయే. అలా గనుక కాకపోయినట్లయితే నువ్వు వినలేవు, నేను చెప్పలేను. ఎందుకనిట? కాసేప్పటిలో నీకు ఇంద్రియాలు స్ఫురణలోకి వచ్చేస్తాయి, నాకు ఇంద్రియాలు స్ఫురణలోకి వచ్చేస్తాయి. ఏమైపోతుంది అప్పడు? ఇద్దరూ వేరు వేరు అయిపోయారు, భేద భావం వచ్చేసింది. అన్నీ తేడాలు వచ్చేసినాయి. ఎప్పుడైతే ఇద్దరూ ఆత్మభావంలోనే వున్నారండీ! ఎన్ని గంటలు చెప్పినా కానీ, నువ్వు వింటూనే వున్నావు, నేను చెప్తూనే వున్నాను. ఇన్ని గంటలు చెప్పడానికి ఏముందండీ? మిమ్మల్ని అడుగుతారు మీ ఇంటి దగ్గర, ఇన్ని గంటలు మీరు ఏం విని వచ్చారండీ? అంతాకలసి ఏం చెప్పారు మీరు? (మా కోడలు వెళ్ళంగానే అడుగుతుందండీ!) ఆత్మభావంలో జీవించడం ఎలాగో చెప్పారండీ! అంతేకదా! మరి ఎందుకని చెప్పలేకపోతున్నావు? అంటే, నీలో చెప్పే గురుసత్తా వుండి పనిచేయడంలేదు. వాడిలో వినే గురుసత్తా పనిచేయడం లేదు. ఎందుకుని? మీరు సమర్పణ భావంతో జీవించడం లేదు. నిన్ను నువ్వు సమర్పించుకో. నీ అహాన్ని సమర్పించుకో. నీ అహంకారాన్ని సమర్పించుకో. నీ నేనును సమర్పించు. నేను అనేది

లేకుండా చేసుకో. పరమాత్మభావంతో జీవించడం నేర్చుకో. అప్పుడు ఏమైంది? ఏం చెప్పారండీ? యథాతథంగా వచ్చేస్తుంది పాఠం. ఎక్కడుంది? అంతా పరమాత్మలో స్థిరం అయ్యి వుంది. ఎప్పుడయ్యా? నువ్వు సమర్పించబడిన భావంలో వుండు. అర్థమైందా అండీ! మా గురువు ఎట్లా నేర్పారయ్యా? అంటే, ఏ పాఠం మాకు ఎప్పుడూ ఏం చెప్పేవాళ్ళు కాదు. ఏం పుస్తకం చదివించేవాళ్ళు కాదు. ఇలా ఎవరో ఒకళ్ళు వచ్చేవారు, వాళ్ళేవో తెచ్చేవాళ్ళు పుస్తకాలు గట్రా వాళ్ళ సందేహాలు, ఇదిగో వాళ్ళేదో అడుగుతున్నారు గానీ చెప్పు, అనేవాళ్ళు అంతే. అంతే! నాకేమన్నా పనుందా? వాళ్ళేమి అడుగుతారు? నాకేం ప్రశ్నలు లేవు. అడిగేది ఎవరిని? గురువు గారిని. చెప్పేది ఎవరు? గురువుగారు. మధ్యలో నేను ఎవరిని? నిమిత్తమాత్రం పనిముట్టు. మధ్యలో నాకెందుకు? ఆయనేమి అడిగాడు? నేనేం చెప్పాను? ఆ రకంగా ఎప్పుడైతే నువ్వు సమర్పించబడ్డ భావంలో జీవిస్తావో ఏమైంది? అంతా జరిగిపోయింది సవ్యంగా. వాళ్ళు అడగడం అయ్యింది. చెప్పటము అయ్యింది. సంతృప్తి చెందడం అయ్యింది. అందరూ నమస్కారాలు పెట్టుకున్నారు, వెళ్ళిపోయారు. ఇప్పుడు ఎవరికి పెట్టారు నమస్కారాలు? అందుకని మన సిద్ధాంతంలో ఎక్కడా పాదనమస్కారాలు కానీ ఏమీ లేవు. ఎందుకని? నీ లోపలా పని చేసేది ఆ అంతరాత్మయే, నా లోపల పనిచేసేది ఆ అంతరాత్మయే. నువ్వు నేను పరమాత్మయందు ఒక్కతీరుగా వున్నాము. వేరుగా ఎక్కడ వున్నాము? కాబట్టి కలిసి జీవించు. కలిసి జీవిస్తే ఏమైంది అప్పుడు? నావలె నీవు జీవించే ప్రయత్నం చేస్తావు. అప్పుడు సహజంగా ఉద్ధరించబడిపోతావు. సహజంగా నీకు ఆ సమర్పించబడిన జీవితము వచ్చేస్తుంది. అప్పుడు ఏమౌతావు? నీ అహాన్ని కోల్పోయావు. నీ అహాన్ని రద్దు చేసేసుకున్నావు. అహం లేకుండా జీవించేటట్టు. అప్పుడు ఏమయ్యావు? సహజంగానే ఆత్మానుభవంలో వున్నావుగా అప్పుడు. అదేగా ఎవ్వరు చెప్పినా, ఎన్ని వేదాలు చెప్పినా, ఎన్ని శాస్త్రాలు చెప్పినా, ఎన్ని సారాంశాలు, ఎన్ని ఉపనిషత్తులు చదివినా. అట్లాంటి జీవితం కోసమేగా. మరి జీవితం కోసం ప్రయత్నించాలి కానీ, శాస్త్రం కోసం ప్రయత్నించ కూడదు ఎప్పుడూ కూడా.

జీవితం కోసం ప్రయత్నిస్తే సాధ్యం అవుతుంది. శాస్త్రం తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే, అది రాదు. ఎందుకని? ఏదేదో రకరకాల భాషాజ్ఞానం వ్యాకరణ సూత్రాలు,

బాగా ఆ సంస్కృత జ్ఞానం, భాషంతా నేర్చుకుని ఎప్పటికి అయ్యేది ఈ ప్రయత్నం? అవునా కాదా? యాభై ఏళ్ళు, అరవై ఏళ్ళ వయస్సులో ఇప్పుడు మొదలు పెడితే ఈ ప్రయత్నం ఎప్పటికి అవుతుంది? కాబట్టి శాస్త్రం నేర్చుకోవడానికి రావడం లేదు నువ్వు. జీవితాన్ని ఎట్లా మార్పు చేసుకోవాలో నేర్చుకోవడానికి వస్తున్నావు. సమర్పించబడినటువంటి, పరమాత్మకు సమర్పించబడినటువంటి విధేయతతో కూడిన జీవితాన్ని ఇప్పటి వరకూ విధేయత లేదు మనదగ్గర ఎంతసేపు తల ఎగరేయడమే. ప్రతిచోట తల ఎగరేయడమే. అహం నేను నేను తల ఎగరేయడమే. అందువల్ల ఏమయ్యావు? పరమాత్మ భావాన్ని కోల్పోయావు. గొప్ప మూల్యాన్ని చెల్లించుకున్నావు, తీవ్రంగా నష్టపోయావు. తెలుసుకోవడం లేదు. ఏదో సాధించాను, ఏదో సంపాదించాను అనుకుంటున్నావేమో, మొత్తం నష్టపోయావయ్యా బాబూ. అర్థమైందా అండీ! అందుకే పరమాత్ముడు ఏం చెబుతున్నాడు? మొత్తం ఇచ్చుట ఎందుకొరకయ్యా? సొంతం పొందుట కొరకే. సర్వం సమర్పించుకొనుట ఎందుకయ్యా? సర్వము పొందుటకే. పరమాత్మకు సమర్పిస్తే ఏమిటట వుపయోగం? నీవు పరమాత్మ ఒక్కడే అని తెలుసుకుంటావు. అప్పుడు ఏం పొందుతావు? దేని కోసం కొత్తగా ప్రయత్నిస్తావు? దేనిని విడిచిపెడుతావు? ఏది నువ్వు కాదు? అక్కడేమీ భేదం లేదు. అంతటా నేనే అయి వున్నాను. అర్థమైందా అండీ?

ఈ రకమైనటువంటి స్థిరమైనటు వంటి జీవితాన్ని కలిగివుంటావన్నమాట. ఇది స్వేచ్ఛ అంటే, ఇది ముక్తి అంటే. అప్పుడు జనన మరణాలకు ఏం భయపడవు, ఎందుకని? అవి నాలో భాగాలయ్యా. ఔనా కాదా? అంతటా నేనే అయి వుంటే, కొత్తగా పుట్టింది ఎక్కడ? కొత్తగా పోయింది ఎక్కడ? శరీరం అంటావా? కాసేపు వచ్చింది, కాసేపు వుంది, కాసేపు పోయింది. సూక్ష్మం దానికి చావు పుట్టుకలు లేవు. సూక్ష్మానికే లేనప్పుడు దానికి అధిష్ఠానమైన నాకెక్కడవి. ప్రాణ మనో బుద్ధులకే చావు పుట్టుకలు లేనప్పుడు, నాకు వున్నాయా? నాకెట్లా వుంటాయి? నేను వాటికి సాక్షిని కదా! ఇలా ఆలోచించాలి. సాయిరాం.

ఓమ్ పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఓం తత్ సత్

ఓమ్ సహనా భవతు సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై తేజస్వినావధీతవస్తు మా విద్విషావహై ఓం శాంతిః శాంతిః శాంతిః

మేలుకొలుపు (ఆత్మ)

1) తెల్లవారెను భ్రాంతి చీకటి | దీరిపాయెను జ్ఞానము
దయంబల్ల నాయెను| మనసు తిరమై | యెల్ల బయ లాయెన్ |
ఆత్మా మేలుకొనవే ||

2) ఉన్నదున్నట్లుండి పాయెను | విన్న కన్నది లేకపాయెను |
యెన్నగా యీ యెఱుక మూలము | యేమి లేదాయెన్ ||
ఆత్మా మేలుకొనవే ||

3) తోచు వృత్తులు దొలగి పాయెను | సూచనయు
గురువాక్య మాయెను | ఉచ్ఛ నీచంబనెటి పలుకులు
ఉత్తవై పాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

4) భూతపంచక శూన్యమాయెను | కూత లేమియు
లేకపాయెను | పాతకంబులు పారిపాయెను | పరమ
పదమాయెన్ ఆత్మా మేలుకొనవే ||

5) ఇల్లు బయలై తెల్లనాయెను | కల్ల బోధలు చెల్లి
పాయెను | పిల్ల లాటల పోలికాయెను | ప్రేమ
లేదాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

6) పిండ బ్రహ్మాండముల నుండెటి |
దండియహముల తెలివి బాయెను | ఖండ
ఖండములోను జూడ య | ఖండమై పాయెన్ ||
ఆత్మా మేలుకొనవే ||

7) హరిహరాదుల కందకుండెటి | గురుని
వాక్యము నమ్మికాయెను | పరమపదమే బట్ట
బయలై | భావమిక బాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

8) జనన మరణము జడుపు తీరెను | కనుల వేడుక
కాలిపాయెను | మనసు యింద్రియ చలము

లెల్లను | మాయామై పాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

9) జగతి విబుధుల స్వప్నమాయెను | పగలు రాతిరి
లేక పాయెను | ఒకటి రెంటి మూలమారెను |
ఊహా లేదాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

10) ఇంపుగా నలగండ్ల వెలిగెటి | వెంపటి నరసింహ్వా
గురువరు | పంపునను గోపాల కవిలో | బయలు
బయ లయ్యెన్ || ఆత్మా మేలుకొనవే ||

-★-★-★-

1) తెల్లవారెను మోహతిమిరం | బెల్ల బాయెను జ్ఞాన
వుదయం | బల్ల ప్రబలం బాయ | తన మనసెల్ల
స్థిరమాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

2) మూడు గుణములు | మునిగి పాయెను |
ఏడు ధాతువు | లెనుక బట్టెను | ఏడ యేమియు |
లేకపాయెను | ఎఱిగి మేల్కొనవే ||
ఆత్మా మేలుకొనవే ||

3) అష్ట తనువులు అడవి బట్టెను | అష్ట మదము లహామిక
మణగెను | కష్ట సుఖముల | కాంక్ష దీరెను |
ఘనత మేల్కొనవే || ఆత్మా మేలుకొనవే ||

4) అష్ట ప్రకృతుల ఆటలుడిగెను | అష్టపాశములపుడె
వీడెను | ఇష్ట మేమియు లేకపాయెను |
ఇపుడు మేల్కొనవే || ఆత్మా మేలుకొనవే ||

5) వాసనాత్రయ మొదలి పాయెను | ఈషణ త్ర
యమిపుడె వీడెను | విన్న దేమియు లేక పాయెను |
వేగ మేల్కొనవే || ఆత్మా మేలుకొనవే ||

6) సాగరంబుల చప్పు లుడిగెను | వాద భేదము

వదలిపాయెను | నాద మప్పుడె నశ్యమాయెను |
నయమె మేల్కొనవే || ఆత్మా మేలుకొనవే ||

7) మండలములనె మమతమానెను | కుండలస్థలి
కూలిపాయెను | పండు వెన్నెల భావమాయెను |
బరగ మేల్కొనవే || ఆత్మా మేలుకొనవే ||

8) మనసు బుద్ధియు మరల జనియెను | మాని పాయెను
జనన మరణము | మమత ఏమియు లేక పాయెను
మరియు మేల్కొనవే || ఆత్మా మేలుకొనవే ||

9) గురుడు శిష్యుండేక మాయెను | కులము గోత్ర
ము లేక పాయెను | కుడి యడమలు సమమె
ఆయెను | గురు తెఱుక బాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

10) పరశురాముని సీతరాముల | భజన నిత్యము
సేయుటాయెను | బాగుగా శేషమ్మ భావము |
బయలులో లే దాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

–★–★–★–

మేలుకొలుపు (జీవ)

1) కటకట మోసమాయెను |
మోసమాయెను జీవ చూడగ | మోహపాశము
లధిక మాయెను | గాశి జెందగ, జేసె నీగతి |
కర్మ మేమందూ || జీవా మేలుకొనవే ||

2) కల్పశతముల కన్న మిక్కిలి | కాల మాయెను,
తిరిగి చూడగ | అల్ప సుఖ మని, కలలో మురి
యుచు | ఆడుచున్నావు || జీవా మేలుకొనవే ||

3) కోటి జన్మము లెత్తియును | శతకోటి దుఃఖ
ము లనుభవించుచు | నాటి మాటలు దలచు

కొంటె నాటు నీ మదికి || జీవా మేలుకొనవే ||

4) ఇరువ దొక వెయ్యి ఆరు నూరులు | జరుగు హం
సలు తరుగు నాయువు | హరిహరాదులు వచ్చి
నిలచిన | ఆగదీ తనువూ || జీవా మేలుకొనవే ||

5) లేనిపోని దుఃఖజాలము | లోనబడి చెడి
పోవు టెందుకు | మాన అవమానంబు లని | నీ మమత
విడ లేవూ || జీవా మేలుకొనవే ||

6) నిజగురుండగు సూర్యుడిప్పుడు | నిజముగా
ఉదయించె చూడుము | త్రిజగముల వారంత
మేల్కొని | తెలివి గన్నారు || జీవా మేలుకొనవే ||

7. బట్టబయలును గురుడు జూపిన | నట్టు లేకను
పుడమి అంచున | పట్టు విడువక గుట్టు మరు
వక | దిట్టమై పోవె || జీవా మేలుకొనవే ||

8. మాయ తనువై మాయతానై | మాయ పను
లను జేయుచును మరి | మాయ తన మర్మం
బుగనే | మాయమై పోవున్ || జీవా మేలుకొనవే ||

9. ద్వాదశిషోడషులనె జలధార కర్ణములందు
సోకిన | బాధలన్నియు తొలగి నీవిక | భ్రాంతి
వొదిలెదవూ || జీవా మేలుకొనవే ||

10. భాగవత శ్రీకృష్ణ దేశిక ప్రభువరుండిటు
రానె వచ్చెను | వేగ గని తను మన ధనంబులు
వీడి | శరణనవే || జీవా మేలుకొనవే ||

11. పీలుఖాన శంకరుండని పిలిచి | ప్రభువరుం
డేలినారట | మూలమూ లేనట్టి యెఋకను |
ముంచి వేసిరటా || జీవా మేలుకొనవే ||

శ్రీ మద్రాజాధిరాజ మహరాజా యోగీంద్ర చంద్ర
భాగవత కృష్ణ దేశిక ప్రభు మహరాజుకీ
జై జై జై
ఓం
తత్‌సత్
శాంతిః శాంతిః శాంతిః
–★–★–★–

సాయిరాం! చెప్పండి, ఏమైనా అడుగుతావా?
ఇల్లు బయలై తెల్లనాయెను, కల్లబోధలు చెల్లిపాయెను, పిల్లలాటల పోలికాయెను, ప్రేమలేదాయన్ |ఆత్మామేలుకొనవే| ఇల్లు అంటే దీని అర్థంలో ఏంటి? ఇది ఇల్లుకాదు లేదంటే శరీరం ఇల్లు. కానీ అక్కడ ఏ ఇల్లు చెబుతున్నాడంటే, విశ్వం అనే ఇల్లు లేకుండా పోయిందయ్యా బాబు, (ఇది కాదు, అది కాదు) విశ్వమనే ఇల్లే లేకుండా పోయి, బయలైపోయింది అంతా! అటువంటి స్థితిలో కల్లబోధలు చెల్లిపాయెను – ఏ బోధైనా ఏం చెబుతోంది? ఇదిగో ఇది ఆధారం నాయనా, ఇది ఆశ్రయం నాయనా! ఇదిగో ఇది సిద్ధాంతం నాయనా! ఇది రాద్ధాంతం నాయనా! అని చెబుతోంది ఏ బోధైనా కూడా. విశ్వమే లేకుండా పోయినటువంటి స్థితిలో ఈ సిద్ధాంత రాద్ధాంతాలు ఎక్కడున్నాయి? ఈ ఆధార ఆశ్రయాలు ఎక్కడున్నాయి? కల్లబోధలు – ఇవన్నీ కల్లబోధలు, లేనటువంటి దానిని గురించి చెబుతున్నాయి. కల్ల అంటే లేనిది. లేని దానిని గురించి మాట్లాడుతున్నాయి. లేని విశ్వం గురించి వివరించేటటువంటి బోధలు ఇవన్నీ కూడా. విశ్వమే లేనిది. అటువంటి లేని విశ్వాన్ని గురించి బోధిస్తున్నాయి ఇవన్నీ కూడా. అటువంటి కల్లబోధలు చెల్లిపాయెను. ఇంకా ఈ వినేది ఏమిటి? లేకుండా పోయినాయి, లేని బోధలు లేకుండానే పోయినాయి.

ఇప్పుడేమిటట? విశ్వం ఎట్లా కనబడుతోంది? ఈ స్థితిలో విశ్వం ఎట్లా కనబడుతోందయ్యా నాకు అంటే? పిల్లలాటల పోలికాయెను, ఓహో! ఈ విశ్వమంతా పిల్లలాటల పోలికాయెను, అలా కనపడుతుంది, ఆడుకుంటున్నారు, ఆడుకోనివ్వండి.

కొంతకాలం అయినాక వాళ్ళుకూడా తెలుసుకుంటారు, ఇది కూడా లేనిదే! వదిలేస్తారు. ప్రేమలేదాయెన్ – ప్రేమ విశ్వజనీనమైనది అని కదా అందరూ అనేది? అంటే ఈ విశ్వానికి ఆధారం ప్రేమయే నండి. ఈ విశ్వం అంతా వ్యాపించి వున్నది ప్రేమేనండి. ఈ విశ్వంలో సత్యమైనది అంతా ప్రేమేనండి. మరి విశ్వమే లేకుండా పోయినప్పుడు మరి ప్రేమ ఎలా వుంది? కాబట్టి ప్రేమలేదాయెన్. ఆత్మా మేలుకొనవే. (అది మీకు ఇప్పుడే అందే అంశం కాదు) ఆత్మ ఆ స్థితిలో మేలుకోవాలట, రోజూ ఆ స్థితిలో ఉదయం మేలుకొనేటప్పుడు ఆత్మ ఆ విశ్వమే లేనటువంటి స్థితిలో మేలుకోవాలట. అది ఆ స్థితి నుంచి అన్నీ ఉత్పన్నం అయినాయి. ఏమీ లేని స్థితినుంచి అన్నీ ఉత్పన్నం అయినాయండీ! ఆ ఏమీ లేని స్థితిలో ఏదైతే వున్నదో, అదే ఉన్నది. ఎల్లకాలం అదే వుంటుంది. దాంట్లో ఏ మార్పు వుండదు. ఈ విశ్వమే లేకుండా వున్నప్పుడు కూడా ఒకటి వున్నది. ఆ వున్నది ఏదో వున్నది, దానికి ఏ వ్యక్తీకరణ లేదు. దానికి మార్పు లేదు. విశ్వం రావడం వల్ల దాంట్లో ఏ మార్పు చెందదూ. విశ్వం పోవడం వల్ల కూడా ఏ మార్పు చెందడం లేదు. ఎల్లకాలం ఒక్క తీరుగా శాశ్వతంగా వున్నది ఏదో అదే సత్యం. దానికే ఏ పేరు పెట్టుకున్నా! దాని పేరు అచలం కదలదు. విశ్వమేమో చలిస్తుంది, కదులుతుంది. అర్థమైందా అండీ!

మనం మాట్లాడుతున్నవన్నీ కదిలే దాంట్లోనే! కదలనిది మాట్లాడదు. తిరగదు, కరుగదు, మొరుగదు, విరుగదు. అదేమన్నా తిరుగుతుందా? తిరగదు. కరుగుతుందా? కరుగదు. విరుగుతుందా? విరగదు. మొరుగదు మనలాగా ఏమీ మాట్లాడదు అది. శాశ్వతమైనది, శుద్ధమైనది, బుద్ధమైనది, నిత్యమైనది, సనాతనమైనది, అనంతమైనటువంటిది, ఎల్లకాలం ఒక్కతీరుగా వుండేది అదే అచలం. కదలదు. అదే ఎప్పటికైనా ఆ స్థితే. ప్రతి దేవాలయంలో విగ్రహం కదులుతోందా? ఏం బోధిస్తోంది ఇప్పుడు? ఎందుకు అలా పెట్టారు? ఆ విగ్రహాలని. నాయనా! ఈ విశ్వమంతా ఏ స్థితి నుంచి వచ్చింది? కదలని స్థితినుంచి, కదలని దాని మీద ఏర్పడింది. అట్టి కదలని స్థితే సత్యమైనటువంటిది. ఎప్పటికైనా దేనిని తెలుసుకోవాలి నువ్వు? ఎప్పటికైనా దేనిని తెలుసుకోమని చెబుతున్నది విగ్రహము? కదలని స్థితి గురించి తెలుసుకోవయ్యా! కదలని స్థితి స్థిరంగా వుండి మాట్లాడు. కదలని స్థితి, నువ్వు కదిలే స్థితిలో వున్నావు. నన్ను

నువ్వు ఆశ్రయిస్తున్నావు కాబట్టి నీకు ఒక ఆశీర్వచనము చెబుతున్నాను. ఏమిటి? నా వలె నువ్వు వుండు. ఆ విగ్రహం వలె నువ్వు వుండు. ఏదీ స్వీకరించమాకు. ఏమీ చెయ్యమాక. ఎన్నన్నా ఏదన్నా జరగనీ, ఆ విగ్రహం ముందు ఏది జరిగినా ఏదైనా మాట్లాడుతుందా? ఏ మన్నా స్వీకరిస్తోందా? ఏమన్నా సమాధానం చెబుతోందా?

స్థిరం అంటే, సాపేక్షం. అంటే కదలికల ద్వారా ఆగిపోవడం. ముందు కదులుతూ వుంది. తరువాత ఆగింది. అప్పుడు స్థిరమైంది అన్నాము. అచలం అంటే అసలు కదలనే కదలనిది కదా అది. దాంట్లో కదలికలే లేవు. ఇక స్థిరం ఏముంది? నువ్వు కదులుతూ వుంటే, ఆగితే స్థిరం. (ఊరకే కదులుతూ వుంటే, స్థిరంగా కూర్చో అంటారు) అది, దీనికి అసలు కదలికే లేదుగా. విగ్రహానికి కదలికే లేదుగా. కాబట్టి ప్రతి దేవాలయంలో విగ్రహం ఏమి బోధిస్తున్నది? అది జీవుడైనా, రాముడైనా, దేవుడైనా, అమ్మ అయినా, అయ్య అయినా, ఎవరైనా, ఏ విగ్రహమైనా బోధిస్తున్నది, ఒకే బోధ చెబుతున్నది ఏమిటయ్యా? ఈ అనంత విశ్వమూ కూడా చిట్టచివరికి ఏమవ్వాలయ్యా? కదులుతూ వున్నదంతా, కదలకుండా పోక తప్పదు. మనమైనా అంతే కదండీ! నీ శరీరం కదలడంలేదా? తర్వాత ఏమైందండీ? చిట్టచివరికి ఏమైందండీ? కదలకుండా పోయింది. కాబట్టి అంత్యకాలమున ఏదైనా అది తప్పదు. చూడండి. ఎంత స్పష్టమైనటువంటి బోధను ఏర్పాటు చేశారో! ఆలయంలో.

ఈ బోధను కనుక ఎవరైతే స్వీకరిస్తారో, వాడు కదా! నిజమైనటువంటి ఆలయానికి వెళ్ళి వచ్చిన వాడు. వాడికి కదా భగవత్ దర్శనం అయినట్టు. వాడికి కదా అమ్మో, అయ్యో కనపడినట్టు. అంతే గాని, 18 చేతులతో అమ్మ కనపడిదండీ, 4 చేతులతో విష్ణువు కనపడ్డాడండీ. 66 చేతులతోటి శ్రీ కృష్ణుడు కనపడ్డాడండీ! ఇవన్నీ వట్టివే నాయనా! ఎందుకని? కల్లబోధలు అవి. లేకుండా పోతాయి కొంతకాలానికి. ఏమని? ఆ విగ్రహం ఏమని చెబుతుంది? ఇవన్నీ లేకుండా పోయేవని చెబుతుంది. నువ్వు అక్కడ ఎదురుగుండా కూర్చొని అష్టోత్తరాలు, సహస్రనామాలు, బోల్లెడు చదువుతున్నావు. అందులో నువ్వు అట్లా వున్నావనీ, ఇట్లా వున్నావనీ, అలా చేశావనీ, ఇలా చేశావనీ, స్తుతిస్తున్నావు. ఏమన్నది విగ్రహము? ఏమన్నా అన్నదా? నీ స్తుతులకు ఏ మన్నా

స్పందించిందా? నీ సహస్రనామాలకు ఏమన్నా స్పందించిందా? నీ లక్ష కోటి కుంకుమార్చనకు ఏమన్నా స్పందించిందా? ఏమని చెబుతోంది? కదలని దానిని పట్టుకో! అది సంగతి.

ఇప్పుడు దేనిని గురించి సహస్రనామం చదువుతావు? విగ్రహము గురించి చదువుతున్నావా? నీ గురించి చదువుతున్నావా? పొరపాటు. నీ గురించి నీవే చదువుకుంటున్నావు. కానీ, చిట్టచివరకు ఏం చెబుతోంది? ఆ సహస్రనామం కూడా చివరికి ఏం చెబుతోంది? కదలని స్థితే నాయనా!

చెప్పాగా మీకు ఇందాకే, ఏదీ తెలియనప్పుడు బాల్యంలో, నిన్ను బాల్యంలో సరియైన దారిలో పెట్టాలి అనంటే అవన్నీ అవసరం. అక్కడి నుంచి మొదలు పెట్టాలి నీకు. ఇవన్నీ ఎప్పుడు నేర్పారు? బాల్యంలో నేర్పారు. అప్పుడు నీకు ఏం తెలుస్తుంది నీకు? ఈ మాట చెప్పానండీ! ఎట్లా తెలుస్తుంది నీకు? నీకు 8 ఏళ్ళ వయస్సు, 10 ఏళ్ళ వయస్సు పూర్వ కాలంలో విద్యాభ్యాసం ఎప్పుడు?

(నేనేదో జపం చేసుకునేదానిని, అమ్మవారికి దండం పెట్టుకునే దానిని) ఏమైంది ఇప్పుడు? ఒకటి గుర్తు పెట్టుకోండి. అమ్మ తీసుకెళ్ళడం, అయ్య తీసుకెళ్ళడం లేవు ఇవన్నీ. ఇవన్నీ వట్టి మాటలు. సత్యాన్ని తెలుసుకోనంత వరకూ. నీవే సత్యము. నీలో వున్న ఆత్మ స్వరూపమే సత్యము అనే జ్ఞానంతో నువ్వు శరీరాన్ని విడవాలి. అంతేకానీ అమ్మ తీసుకుపోవడం, అయ్య తీసుకుపోవడాలు ఏమీ లేవు. వట్టివి ఇవన్నీ!

ఏమైందట? ఇక్కడొక అంశం ఉందండీ ! అంటే, అట్లా చెబితే తెలుస్తుందా? అట్లా చెబితే అస్సలు తెలియదు. ఇప్పుడు వాళ్లు అరుస్తున్నారు కదా అని మనం కూడా అరిచే చెప్పామండీ ! నీకు ఎట్లా తెలుస్తుంది? (అంటే వాళ్ళు ఇట్లా అరవడం తప్పితే దానికి అర్థం తెలియదు) అంటే అర్థం తెలియదంటే, నీ నిజజీవితానికి అన్వయం చేసుకోవడం లేదు. (అదే మరి) ఆఁ.. ఏమయ్యిందట ఇప్పుడు? అందుకే ఏం చేప్తున్నాడు? బోధించడం కూడా పొట్టకూటి విద్యలు అయినాయి. నీకు వేదాంతంతోటి ఆత్మానుగతమైన జీవితాన్ని, ఆత్మానుసారమైనటువంటి జీవితాన్ని పరమాత్మను దృష్టిలో పెట్టుకుని జీవితాన్ని జీవించడానికి ఉపయోగపడవలసిన విద్య భోజనానికి ఉపయోగపడింది. అయితే

ఇక్కడొక అంశం వుంది, జీవికి ఏదో ఒక ఆధారం అవసరమే, ఆహార సంపాదనకు నీకు ఏదో ఒక మార్గం అవసరమే, కానీ అదే సత్యం కాదు.

ఎట్లా అయితే వీడికి ఇహ లోక విద్యలు సత్యం కావో, పరలోక విద్యలు ఇహలోకానికి ఉపయోగపడుతాయి, ఉపయోగపడకపోవు. కానీ, అదే సత్యమై ఊరుకుంటే భ్రాంతి కలిగింది. అట్లా భ్రాంతి చెందకూడదు. దాని అర్థాన్ని దానికే వదిలెయ్యి. ఆత్మ పరమాత్మ సత్యమైనదనే భావనలో నువ్వు నీ జీవితంలో జీవించు. అప్పుడేమయ్యింది? అంతటా నీకు ఏం కనపడింది? ఆ పరమాత్మయే కనపడుతున్నాడు. ఆ ఆత్మ స్వరూపమే కనబడుతున్నది. అది దేహాత్మగా వున్నా, అంతరాత్మగా వున్నా, పరమాత్మగా వున్నా, సూత్రాత్మగా వున్నా, ఆత్మకు నాలుగు స్థితులున్నాయండీ! (సూత్రాత్మ అంటే అది ఆఖరు స్థితి). ఇప్పుడు అక్కడ మాట్లాడుతున్నది అది. విశ్వమే లేదన్న స్థితిలో వున్నటువంటి స్థితి పేరు సూత్రాత్మ. అలాంటి సూత్రాత్మ దాకా మాట్లాడుతున్నారు అందులో. ఆ మేలుకొలుపులో ఎక్కడి దాకా మాట్లాడుతున్నారు అంటే, నాల్గవ స్థితి, ముందు కిందది దేహాత్మ, అది జీవుడన్నమాట. దానిపైది ఏమిటి? అంతరాత్మ. దాని పైది ఏమిటి? పరమాత్మ. దానిపైది ఏమిటయ్యా? సూత్రాత్మ.

పరమాత్మ కూడా విశ్వం అంతా వ్యాపించి వున్నాడు. అంతవరకే ఆయన పని. విశ్వమే లేదయ్యా! అప్పుడేమిటి? అది సూత్రాత్మ. లేని ఎఱుక. దాని పేరే లేని ఎఱుక. తెలుసుకునే ఎఱుకే లేకుండా పోయింది. విశ్వమే వున్నది అనేటువంటి స్థితి ఏదైతే వున్నదో అది ఎఱుక. విశ్వమే లేదు అంటే, అది లేనెఱుక. అర్థమైందా అండీ! విశ్వమే లేనిది అయిపోయింది, అప్పుడు ఎఱుకే లేదు. ఎందుకని? ఉంటే కదా గుర్తించడం. విశ్వమే లేదన్నప్పుడు ఇంకేమైనా గుర్తించే అవకాశం వుందా? కాబట్టి, గుర్తు అంటే ఎఱుక. నువ్వు ప్రతీదానిని దేనితో చేస్తున్నావు? గుర్తు తోటే చేస్తున్నావు. ఆ గుర్తే లేకపోతే చెయ్యి చూద్దాం! కాబట్టి, జీవుడిగా వచ్చినప్పుడు నీలో వున్న బుద్ధి పనిచేస్తోంది. ఆ ఎఱుక ప్రభావం వల్లనే పనిచేస్తోంది. ఆ విశ్వశక్తి యొక్క ప్రభావం చేతనే నీ బుద్ధి కూడా పనిచేస్తోంది. ఆ విశ్వశక్తి ప్రభావం చేతనే నీలో ప్రాణం పని చేస్తోంది.

ఆ విశ్వశక్తి ప్రభావం చేతనే నీలో ఇంద్రియాలు పనిచేస్తున్నాయి. ఆ విశ్వశక్తి ప్రభావం

చేతనే ఇంద్రియాలు చలిస్తున్నాయి. విషయాలు పనిచేస్తున్నాయి. ఆనందం అంటున్నావే, ఆ ఆనందం కూడా ఆ విశ్వశక్తి ప్రభావమే. అంతా ఎఱుక ప్రభావమేనయ్యా! బాబూ! ఆ ఎఱుక ప్రభావం లేనిది ఏదైనా వుందా? ఏమీ లేదు. కారణం ఏమిటట? ఎఱుక చలిస్తూ వున్నది. విశ్వం చలిస్తూ వున్నది. అర్థమైందా అండీ?

ఎఱుక అంటే ఏమిటి? చలించేది. బయలు అంటే ఏమిటి? చలించనిది. బయలు అంటే, చలించదు, అచలం. ఎఱుక అంటే, చలించేది. కాబట్టి చలించేవన్నీ ఎఱుక క్రిందకే వస్తాయి. నువ్వు దేనినైనా తీసుకో. అన్నీ చలించేవే, చలించనివి అంటూ ఏమీ లేవు. (మరీ ఎఱుకతో వుండు, ఎఱుకతో వుండు అనేది ఎందుకు)

ఎందుకంటే ముందు ఇలాంటి జ్ఞానం రావాలి. జ్ఞానం వచ్చి పోవాలి ఎప్పుడైనా సరే! మీరు, పిల్లలు వున్నారండీ! ఆటలు ఆడుతున్నారండీ, ఎందుకు ఆటలు ఆడాలి? జ్ఞానం రావడం కోసం. ఆ ఆటల ద్వారా వాడికి జ్ఞానం కలిగింది. తెలివి పెరిగినాక ఏమైంది? ఆటను వదిలేశాడు. అర్థమైందా? ఆజ్ఞానం లేదా? అయిపోయింది. జ్ఞానం సహజమైపోయింది. ఇంకో తెలివిలోకి వచ్చేశాడు. మళ్ళా పుస్తకాల తెలివి. అది అయిపోయింది. ఇహ ఎంతకాలం చదువుతాడు, పుస్తకాల తెలివి అయిపోయింది. నిజజీవితంలోకి ప్రవేశించేశాడు. నీ జీవితంలో ఇప్పుడు విషయాల మీద ఆధిపత్యం, ఆనందం మీద ఆధిపత్యం కోసం పోరాడుతూ వున్నాడు. ఈ జ్ఞానం వచ్చింది ఇప్పుడు. ఇప్పుడు వృద్ధాప్యం వచ్చింది. ఇప్పుడింకా విషయాలు వున్నాయా? ఏమీ లేవు. ఎందుకని? ఉడిగి పోతూవున్నాయి. వాటి వల్ల జ్ఞానం వచ్చేసింది. అవి రాగానే ఇప్పుడు ఏమంటున్నావు? నాకెందుకు? నా కెందుకు? నాకేమన్నా పనా దాంతోటి? నాకేం పని లేదండి. అవేం నాకు అవసరం లేదండీ! ఎందుకని? అయిపోయింది. చేసేశావు, చూసేశావు, అధిగమించేశావు, ఆ జ్ఞానం వచ్చేసింది. ఇప్పుడు కొత్తగా అందులో నేర్చుకోవడానికి ఏం లేదు. (మరి అయినా ఇంకా కొన్ని విషయాలను పట్టుకుని వేళాడుతుంటాం కదా!) అంటే ఇంకా అందులో నీకింకా కొంత బాకీ వుందన్నమాట. అపేక్ష వున్నది. ఇంకా కొత్తదనం వున్నది. ఇంకా నీకు దానిని అనుభవించాలనేటటువంటి బాకీ వున్నదన్నమాట. లోపల ఇంకా గుర్తు చెబుతోంది.

ఇంకా నువ్వు అది చేయలేదు, ఇది చేయలేదు. ఇంకా నువ్వు అది చెయ్యాలను కున్నావు కదా! ఇంకా ఇది చెయ్యాలనుకున్నావు కదా! ఇంకా నీకది మిగిలే వుంది కదా! అని చెబుతోంది. ఎన్నింటిలో అయితే మిగలకుండా పోయిందో, అది అధిగమించేస్తావు. అర్థమైందా అండీ!

ఎన్నింటిలో అయితే మిగల్లేదో, అవన్నీ కూడా అధిగమించేసేయ గలుగుతావన్నమాట. ఇదే గుర్తు దానికి. కాబట్టి ప్రతి చోట ప్రతి దేవాలయంలో కూడా ఆ దేవాలయంలో నువ్వు ప్రవేశించగానే ఈ సత్యాన్ని తెలుసుకో. అని చక్కగా బోధిస్తున్నది. ఏమని బోధిస్తున్నది? ఈ కదిలే విశ్వమంతా కూడా, కదలకుండా పోవలసిందే! ఎప్పటికైనా సరే. నీతో సహా. నువ్వు నేననే భేదం లేదు. నేను నువ్వు అనే భేదం లేదు. ఎవ్వరైనా సరే. అదంతా కూడా కదలకుండా పోవలసిందే. కదిలేదంతా శాశ్వతం కాదు. కదలకుండా వున్నది ఏదైతే వుందో అదే శాశ్వతము. కాబట్టి ఏదైతే కదులుతూ వున్నదో అదంతా ఎఱుకకు సంబంధించిన విభాగము. ఏదైతే కదలకుండా వున్నదో, అదంతా బయలుకు సంబంధించినటు వంటి విభాగము. ఆ బయలు ఏదైతే వున్నదో అదే శాశ్వతము. అదే సత్యము. అదే సనాతనము. దానిని గురించే అన్ని వేదాలు, ఉపనిషత్తులు ఏవి చెప్పినా అంతా ఆ బయలు గురించే. ఆ కదలని స్థితి గురించే. కదలని స్థితే సత్యము అనేటటువంటిదే ఎప్పుడూ కూడా జీవితంలో గుర్తుపెట్టుకోవాలి. నువ్వు ఇప్పుడు ఏ పని చేస్తున్నా కూడా కదులుతూ చేస్తున్నావు. మనస్సు కదులుతోంది, బుద్ధి కదులుతోంది, ప్రాణం కదులుతోంది, ఇంద్రియాలు కదులుతున్నాయి. విషయాలు కదులుతున్నాయి. సుఖం కదులుతోంది. దుఃఖం కదులుతోంది. పుట్టటం కదులుతున్నావు, మరణం కదులుతున్నావు. అసలు ఆ కదిలిక లేనిదనేది నీ పుట్టుక నుంచి మరణం దాకా ఏదీ లేదు. కాబట్టి ఇదంతా అశాశ్వతం అయినటువంటిది. జననమరణముల జడుపు తీరెను - స్పష్టంగా చెబుతున్నాడు. కదలని దానిని పట్టుకున్నప్పుడు కదలిక నిన్నేం చేసిందయ్యా? నువ్వు దేనిని ఆశ్రయించాలట? ఆ శాశ్వతమైనటువంటి కదలని స్థితిని ఆశ్రయించు. అప్పుడు ఈ కదలికలన్నీ ఏమైపోయినాయట? లేకుండా పోయినాయి. తల్లి గర్భంలో కదలడం మొదలు పెట్టిన

దగ్గర నుంచి, పోయిన తరువాత కూడా కదులుతూనే వుంది, ఏది పోయింది? స్థూలం పోయింది, సూక్ష్మం కదులుతూనే వుంది. అది ఎక్కడికి పోయి చచ్చింది? అది కదులుతూనే వుంటుంది. కారణం అలానే కదులుతూ వుంటుంది. మహాకారణం అంతకంటే కదులుతోంది. ఎందుకని? స్థూలంలో వున్నటు వంటి ప్రాణ మనో బుద్ధులు సూక్ష్మం అవి కదులుతూనే వున్నాయి. స్థూలం విడిచిపెట్టిన తరువాత కూడా సూక్ష్మం సూక్ష్మంలోనే వుంటుంది. అది ఎక్కడికి విడిచిపెట్టి వెళ్ళదు. దానికి చావు పుట్టుకలు లేవు. (అది బయటకు వచ్చేసింది, అంతే!) మళ్ళా ప్రాణ మనో బుద్ధులు పంచభూతాల్లో అలాగే వుంటాయి. అవి ఎక్కడికి పోవు. మళ్ళా ఉపాధిని ధరించివేస్తాయి. మళ్ళా శరీరమును ధరించివేస్తుంది. ఇప్పుడు శరీరం పేరు రామలక్ష్మి, ఇప్పుడు శరీరం పేరు జయమ్మ, ఇప్పుడు శరీరం పేరు మరొకటి, ఇప్పడు శరీరం పేరు విద్యాసాగర్, మరొకటి ఇంకొకటి. శరీరానికే ఇవన్నీ కాని, ప్రాణ మనో బుద్ధులకు పేర్లు లేవు. నీలో వున్న ప్రాణానికి పేరు వుందా? లేదు కదా! నీలో వున్న మనసుకు పేరు వుందా? లేదు కదా! బుద్ధికి పేరు వుందా? దానికి అంతకంటే లేదు. శరీరానికే పేరు. ఏ ఎవ్వరు చేశారయ్యా అనంటే, నిజంగా చేస్తున్నదేమో ప్రాణమనోబుద్ధులు, శిక్షేమో శరీరానికి వేస్తున్నాం. అర్థమైందా అండీ! అసలు చేస్తుంది ఎవరు? ప్రాణ మనో బుద్ధులు సూక్ష్మం. తప్పంతా ఎక్కడ వుంది ఇప్పుడు ఆ సూక్ష్మంలో వుంది. సమస్యను ఎక్కడ పరిష్కరించాలి? సూక్ష్మంలో పరిష్కరించాలి. స్థూలంలో పరిష్కరిస్తున్నావు, ఏమైంది ఇప్పుడు? నేరం ఒకరికి, శిక్ష ఒకరికి. కారణం ఏమిటట? నిన్ను దానిని ఎవడు ఆశ్రయించమన్నాడు? నీ తెలివి ఏమయింది? నువ్వు తప్పుదారి పట్టే దానిని ఎందుకు ఆశ్రయించాలి? ప్రాణ మనో బుద్ధులను సక్రమంగా నడపాలి కదా! ఎటు నడపాలి? కదలని దానిని ఆశ్రయించమని దానిని నడపాలి. కదిలే సూక్ష్మాన్ని కదలిని స్థితిని ఆశ్రయించమని చెప్పాలి దానికి. కానీ నువ్వేమి చెప్పావు? కదిలే శరీరాన్ని ఆశ్రయించమని చెప్పావు. అర్థమైందా అండీ? ప్రాణ మనో బుద్ధులు ఎందుకు శరీరంలోకి వచ్చాయి అసలు? తమ కదలికను పోగొట్టుకోవడానికి, తమ మూలమైనటువంటి కదలని స్థితిని తెలుసుకోవడం కోసం శరీరంలోకి వచ్చాయి. ఎందుకని? అవి సూక్ష్మంగానే వుంటే తెలుసుకునే తెలివి లేదు

కాబట్టి. మరి వాటికి వ్యక్తీకరణ లేదు కదా! అనుభవం లేదు కదా! అనుభవం లేదు కాబట్టి, అనుభవం కావాలంటే శరీరం కావాలి. ఏ అనుభవం కోసం వచ్చాయి? తమ కదలికలను పోగొట్టుకునేందుకు కావలసినటువంటి సాధనమయ శరీరం కోసం, పనిముట్లు కోసం వచ్చినాయి. శరీరం పనిముట్లుగా పనిచేయాలి. కానీ ఏమైపోయింది ఇప్పుడు? శరీరమే సత్యమై కూర్చుంది. అందువల్ల ఏమైపోయింది? అన్ని వాతలు శరీరానికి పెడుతున్నావు. ప్రయోజనము ఏమి వుంది? దీనికే ఉపవాసాలు, దీనికే అన్నీ, అన్నీ దీనికే. ఏమన్నా ప్రయోజనము వుందా? ఏమిటి ప్రయోజనము? ఇంద్రియాలు క్షీణించిపోతున్నాయి. అంతకు మించి ఆ ఉపవాసం వల్ల ఏమీ ప్రయోజనము లేదు. కాబట్టి సాధకుడైన వాడు ఏం చేయ్యాలి? నిత్యోపవాస దీక్షను పట్టవయ్యా! జీవితకాలం దీక్షను పట్టు. ఈ ఒకరోజు, రెండు రోజులు 40 రోజులు, 3 సంవత్సరాలు, 2 సంవత్సరాలు ఇలా ఎన్ని పడుతావు? పట్టదలచుకుంటావా? వచ్చావుగా శరీరంలోకి, మళ్ళా పోయే వరకూ పట్టు. ఈ వచ్చిన శరీరం పోయేవరకు, నువ్వు పోవడం అనేది ఎప్పటికీ లేదు. ఎందుకని? ప్రాణ మనో బుద్ధులకే జనన మరణాలు లేవు. నీకు ఎలా వున్నాయి? నువ్వు వుంటే తప్ప ప్రాణ మనోబుద్ధులు పనిచేయవే? నీ ఉనికి వల్లనే ప్రాణమనోబుద్ధులు పనిచేస్తున్నాయి. ఆధారం నేను. ఆధారం ఎప్పుడూ నేను. నా మీద ఆధారపడి ప్రాణమనోబుద్ధులు పనిచేస్తున్నాయి. ప్రాణమనోబుద్ధుల మీద ఆధారపడి శరీరం పనిచేస్తుంది. కాబట్టి ఎవరు పుట్టు పోయే అవకాశం వుంది? శరీరం పుట్టు పోయే అవకాశం వుంది. ఎందుకని? నాకు చావు లేదు పుట్టుక లేదు. ప్రాణ మనో బుద్ధులకు అంతకంటే లేదు. కేవలం పనిముట్లకు వుందయ్యా బాబు. కాసేపు పనిముట్లు వచ్చినాయి. పనిచేసినాయి. పోయినాయి. (మరి శరీరానికి ఎందుకు బాధ కలగాలి? చేసేవి అవి కదా!) బాధ శరీరానికి కాదు. శరీరము నందు వ్యాపించి వున్న ప్రాణ మనో బుద్ధులే గుర్తిస్తున్నాయి. గుర్తించే ఎఱుక, తెలివి దానిది. చీమ కుట్టుందండి. కుట్టింది కాలుని. కాలుకి తెలివి వుందా? కాలుకి తెలివి లేదు. ప్రాణ మనోబుద్ధులు పనిచేస్తేనే. శవానికి చీమలు కుడుతున్నాయండి. ఏం తెలిసింది? (శవానికే కాదు) నిద్రపోతున్నావండి, అసలు నిద్రపోతున్నావు, నిన్నే తీసుకో! ఏం తెలిసింది? ప్రాణ మనోబుద్ధులు పనిచేసినంత సేపే

నీకు ఏదైనా తెలిసేది, ఆ ప్రాణ మనో బుద్ధులు పనిచేయక పోతే, ఏమీ తెలియదు. కాబట్టి నీ యందు అనుభవిస్తున్నదంతా ఆ ప్రాణ మనో బుద్ధులే. ఈ శరీరంలో ఇంద్రియాలనే పనిముట్లను ఉపయోగించి, అనుభవాన్ని సంపాదిస్తున్నదంతా ఆ ప్రాణ మనో బుద్ధులే. శరీరం కాదు. ఈ శరీరం కేవలం పనిముట్టు. గిన్నె లాంటిదది. గిన్నె లాంటిది అంటే, గిన్నె తప్ప దాంట్లో ఏమీ లేదు. గిన్నె అన్నం అవుతుందా? ఎప్పటికీ అవ్వదది. నువ్వు ఎన్ని సార్లు దానిని పొయ్యిలో పెట్టినా, లోపల బియ్యం వుడకనిదే గిన్నె అన్నం అవుతుందా? గిన్నె అన్నం అవ్వదు కదా! ఆ ప్రాణ మనో బుద్ధులు లేనిదే ఈ గిన్నెకు ఏమిటి ప్రయోజనము? కానీ ప్రాధాన్యత అంతా దేనికి ఇచ్చావు ఇప్పుడు? గిన్నెకి. పోయే! అక్కడ పోయిందన్నమాట. నువ్వు పనిముట్టుకు ప్రాధాన్యత ఇచ్చి, పనిముట్టును రాజును చేశావు. నీ ప్రాణ మనో బుద్ధులు అసలు దేనిని తెలుసుకోవాలట ముందు? దానికి ఆధారమైన నేనును తెలుసుకోవాలి. ఆ నేను పరమాత్మను తెలుసుకోవాలి. చూడండి. ఎట్లా వుందో రహస్యం. నేను అనే అంతరాత్మ. నేను అనేది ఏమిటి? అంతరాత్మ. అది ప్రాణ మనో బుద్ధులను ఆజ్ఞాపించే సామర్థ్యం వున్నటువంటిదన్నమాట అది. ఎందుకని? ఆ నేను వుంటే తప్ప ఈ ప్రాణమనోబుద్ధులు పనిచేయవు. అంతరాత్మ వుంటే తప్ప ఈ ప్రాణమనోబుద్ధులు పనిచేయవు. ఆ అంతరాత్మ ఏమి తెలుసుకోవాలట? పరమాత్మను తెలుసుకోవాలి. అంతరాత్మ ఈ ప్రాణ మనో బుద్ధులని పనిముట్లుగా వాడుతోంది. ఆ ప్రాణ మనో బుద్ధులు శరీరాన్ని పనిముట్టుగా వాడుతున్నాయి. ఈ అంతరాత్మ దేని నిమిత్తం ఈ రెండిటిని పనిముట్టుగా వాడుతోందయ్యా అని అంటే, పరమాత్మను తెలుసుకునే నిమిత్తమే వాడుతోంది. కానీ ఏమైపోయింది? ప్రాణ మనో బుద్ధులు శరీరాన్ని ఆశ్రయించగానే, ఈ అంతరాత్మతో సహా, శరీరమే సత్యమనే భ్రాంతిలో కూరుకుపోయాయి. పరమాత్మ భావాన్ని మరచిపోయి, ఈ శరీరం నేను ఎందుకు తెచ్చుకున్నాను అసలు? శరీరం తెచ్చుకున్నాననే భావనే లేకుండా పోయింది. శరీరమే నేనైపోయింది. (అంతరాత్మ నేనుకు సంబంధం లేదని అంటున్నాడుగా) ఎందుకని అంటున్నాడు? అందులో రెండు భాగాలున్నాయి. శరీరంతో కలిసి పనిచేసే భాగం ఒకటి వుంది, సాక్షి భాగం ఒకటి వుంది. అదే అంతరాత్మలో వ్యవహరించడం కోసమని,

సగభాగమేమో చైతన్య భాగం శరీరంలో కలిసి పనిచేస్తోంది. అందులోనే సాక్షి భాగం ఒకటుంది. అదేమో గమనిస్తూ వుంది. గమనించే సాక్షి ఏమైపోయాడు? గుర్తించకుండా పోయాడు. కాబట్టి ఏమైపోయింది? శరీరంతో కలిసిపోయినటువంటిదే సత్యమైపోయి, ఈ శరీరంలో ఇంద్రియాలు పనిచేసేదే సత్యమైపోయి, స్థిరమైపోయి వున్నది అన్నమాట. అలా ఎప్పుడైతే స్థిరమైపోయి వున్నదో, చివరకి ఏమైంది? శరీరమే సత్యంగా మారిపోయింది. అట్లా శరీరమే సత్యం కాకుండా వుండాలి అంటే, నీవేం చెయ్యాలయ్యా? నీవు ఈ సత్యాన్ని గ్రహించు. శరీరం తెచ్చుకున్నా నేను. మళ్ళా శరీరం విడిచి పెడుతాను. ఒక పని నిమిత్తమై ఒక పనిముట్టును తెచ్చావండి మీ ఇంట్లో. పని కాగానే తీసిపడేస్తున్నావు అంతేనా? కాదా? అట్లాగే పరమాత్మను తెలుసుకునే నిమిత్తమై, అంతరాత్మ ఈ పనిముట్టును తెచ్చుకున్నదండి. ఆ పనిముట్టుతో పని అయిపోయింది. విసిరి అవతల పారేసింది అంతే. దానికేమీ లెక్క, జమా లేదు. ఎందుకని? ప్రాణ మనో బుద్ధులు అంటేనే లెక్క జమా లేదు దానికి. సూక్ష్మం అంటేనే లెక్క, జమా లేదు దానికి. ఎందుకని? నేను వుంటేనే సూక్ష్మం పనిచేస్తుంది. నేను లేకపోతే సూక్ష్మం పనిచేయదు. నేను సర్వసాక్షిని. నేను ఆత్మస్వరూపుడిని. నీ అంతరాత్మయే లేకపోతే ఆ ప్రాణ మనో బుద్ధులు పనిచేయలేవు. నీ అంతరాత్మ ఆధారం. ప్రాణ మనో బుద్ధులు ఆధేయము. ఆశ్రయము అన్నమాట. ఆశ్రయము ఎవరు అంతరాత్మ. దానిమీద ఆధారపడి వున్నది ఏదీ? ప్రాణ మనో బుద్ధులు. ప్రాణ మనో బుద్ధులు ఆధారము. దాని మీద ఆధారపడి వున్నది ఏది? శరీరం. కాబట్టి ఏది ఆధారమో దానిని ఆశ్రయించాలి. ఈ మూడింటికి కూడా ఆధారమేది? పరమాత్మ. ఈ మూడు ఎవరిమీద ఆధారపడి వున్నాయి? పరమాత్మ మీద ఆధారపడి వున్నాయయ్యా బాబు.

పరమాత్మ మీద అంతరాత్మ ఆధారపడి వున్నది. అంతరాత్మ మీద ప్రాణ మనో బుద్ధులు ఆధారపడి వున్నాయి. ప్రాణమనోబుద్ధుల మీద శరీరం ఆధారపడి వున్నది. ఇప్పుడు మనం అసలు ఎవరిని పట్టుకోవాలయ్యా? పరమాత్మను పట్టుకోవాలి అసలు. లెక్క ప్రకారం నువ్వు శరీరాన్ని ఎందుకు తెచ్చుకున్నావు? ఆ పరమాత్మ స్థితిని తెలుసుకోవడం కోసమని శరీరం తెచ్చుకున్నావు. కానీ దేనిని పట్టుకున్నావు?

పనిముట్టును పట్టుకున్నావు. పనిముట్టే నువ్వు అంటున్నావు. ఇంతకంటే అజ్ఞానం ఏమైనా వుందా? నీదైనటువంటి స్వస్థితి, స్వరూపజ్ఞానం ఏమిటి? అంతరాత్మ. ఆ స్వరూపజ్ఞానంలో ఏమైవున్నావు? నేను ఆత్మస్వరూపుడునై వున్నాను. అని ఎప్పుడైతే గుర్తెరిగావో, అప్పుడు నీ చేతిలో పనిముట్లు అయిపోయినాయా లేవా? ఇవన్నీ? ప్రాణ మనో బుద్ధులు పనిముట్లు అయిపోయినాయి. శరీరం పనిముట్టు అయిపోయింది. నేను ఎవర్ని? నేను ఆత్మస్వరూపుడిని. ఇప్పుడు ఏం చెబుతోంది? ప్రాణ మనోబుద్ధులు ఇట్లా చేయి, అట్లా చేయి అని నీకు సూచన చెబుతున్నాయే, అలా పో, ఇలా పో అంటుందే లోపల నుంచి, అవి ఏమిటి? ప్రాణ మనో బుద్ధులు. నేను ఎవరిని? నేను ఆత్మ స్వరూపుడిని. నేను గమనించే వాడను. వాటిని గమనిస్తున్నాను. ఓహో! ఇప్పుడిది చేయాలా వద్దా? ఆత్మ స్వరూపుడు గమనించడం. ప్రాణ మనో బుద్ధులు చేయమని ప్రేరణ. (చేయించడం) ప్రేరణ. శరీరం చేయడం. శరీరమేమో చేయడం. ప్రేరణేమో ప్రాణ మనో బుద్ధులు. గమనించే వాడు అంతరాత్మ. ఇప్పుడు ఎక్కడ వుండాలి నువ్వు అసలు? గమనించేవాడి స్థానంలో వుండాలి. కానీ ఎక్కడికి వచ్చేశావు? ప్రేరణలోకి వచ్చేశావు. ఇంకేంచేశావు? చేతలోకి వచ్చేశావు. ఇప్పుడేమైంది? అంతరాత్మ అసలు ఏమన్నా చేస్తోందా? చెయ్యడం లేదుగా. ఏం చేసినా ఎవరు చేశారు? శరీరం చేస్తోంది. కాబట్టి వాతలు ఎవరికి పెట్టాలి? శరీరానికే పెట్టాలి. అందుకని శరీరానికే శిక్ష వేస్తున్నాము. కనీసం అట్లానైనా తెలుస్తుందేమోనని? కానీ అజ్ఞాన పూర్వకంగా చేస్తున్నావు కదా ఎలా తెలుస్తుంది? శిక్షణను ఇవ్వాలి. శిక్ష వేస్తే లాభం లేదు. Training ఇవ్వాలి దానికి. శిక్షణను ఇవ్వాలి. దానికి అభ్యాసం చెయ్యాలి. అభ్యాసం చేసి నేను ఆత్మస్వరూపుడను అని స్థిరపడాలి కాని, నేను దానిని నిలువునా కోదండం వేయిస్తానండి, తలక్రిందులుగా వ్రేళాడుతానండి, ఒంటికాలు మీద నిలబడుతానండి... ఇవన్నీ ప్రయోజనము లేదు నాయనా! ఇవన్నీ శిక్షలు. ఈ శిక్ష వేస్తే ప్రయోజనము వుందా? ఈ శిక్ష వేస్తే ప్రయోజనము లేదు. శిక్షణను ఇవ్వాలి. ఇంద్రియాలకు శిక్షణను ఇవ్వాలి. ప్రాణ మనో బుద్ధులకు శిక్షణను ఇవ్వాలి. నేను ఎవరిని? నేను ఆత్మస్వరూపుడిని. నేను గమనించే వాడను. నేను మేల్కొని వున్నంత సేపు కూడా నీవు ఏమీ చేయజాలవు. ఎలాగ? నువ్వు ఎట్లా అయితే మేల్కొని

వుంటే, కుక్క ఎట్లా అయితే ఇంట్లోకి రాదో, ఈ ఉపమానం ఎందుకు చెబుతున్నాడు? కుక్కకు వాసనాబలం చాలా ఎక్కువ. అది ఎక్కడ వున్నా కూడా వంటింట్లో వున్నటువంటి ఆహారపదార్థాన్ని తెలుసుకోగలిగినటువంటి సామర్థ్యం కలిగినటువంటిది కుక్క అన్నమాట. అలాగే మనప్రాణమనోబుద్ధులు కూడా దేనికి వశమై పనిచేస్తున్నాయట? వాసనాబలానికి లోనై పనిచేస్తున్నాయట. అంతరాత్మ వాసనాబలానికి లోనయ్యే అవకాశం లేదు. ఎందుకని? అది సాక్షి స్వరూపము. వాసనాబలానికి ఏది లోనై వున్నదట? ప్రాణ మనోబుద్ధులు లోనై వున్నాయి. ఆ వాసనాబలమే వ్యక్తీ కరించినప్పుడు మూడు గుణాలు అయినాయి. అర్థమైందా అండి?

వాసనాబలం అంటే ఏమిటయ్యా? శరీర వాసన (దేహవాసన), శాస్త్ర వాసన, లోక వాసన. ఏం చేసిన నీ జీవితమంతా, ఈ మూడింటి కోసమే. పెళ్ళి చేసుకున్నావండి, దేని కోసం? దేహవాసన? శాస్త్ర వాసన? లోకవాసన? మూడు కనపడుతన్నాయా? లేదా? శరీరానికి సుఖం కావాలంటావా? దేహవాసన. కాదండి లోకం కోసం, సృష్టి పునరుత్పత్తి కార్యంలో భాగం కోసం అంటావా లోక వాసన. కాదండి, శాస్త్రార్థం మేరకు ఐదురోజు పెళ్ళి చేశానండి అంటావా? శాస్త్ర వాసన. కాబట్టి ప్రతిపనిలో కూడా ఏమున్నాయి? ఈ మూడు వున్నాయా? లేవా? లేనిది ఏదో చూపెట్టు? (వాసన త్రయం అంటే అదే) ఇదే వాసనాత్రయం అంటే. అర్థమైందా అండి? వాసనా త్రయం అంటే ఏమిటి? శాస్త్రవాసన, లోక వాసన, దేహవాసన.

నిద్రపోతున్నావండి, నిద్రపోయే పనిని తీసుకో. నిద్రపోయే పనిలో ఏమున్నాయి? వుందా లేదా దేహవాసన? ఎందుకని నిద్రపోకపోతే దేహం పనిచేయదురా బాబు. విశ్రాంతి లేకపోతే దేహం పనిచేయదురా నాయనా! అనే భావం చేత లోపలికి పోయావనుకో అది దేహవాసన అయ్యింది. నేను ఆత్మస్వరూపుడిని అని గమనిస్తూ, నిద్రను కూడా నేను గమనించేవాడను, నిద్ర ఇంద్రియాలకే కాని, నాకు కాదయ్యా! నిద్ర ఇంద్రియాలకే కాని, నాకు కాదు. నేను ఆత్మ స్వరూపుడను. అవస్థాత్రయానికి సాక్షిని అనే పద్ధతిలో నిద్రలోకి వెళ్ళావయ్యా! అప్పుడు ఏమయ్యింది? నిద్రకూడా జ్ఞానమే అయ్యింది. అదే పద్ధతిలో మరణంలో కూడా వుంటావు. మరణం ఎవరికయ్యా? ఇంద్రియాలకయ్యా.

నాకు కాదు కదా! నేను సాక్షిని కదా! మరణానికి కూడా సాక్షిని. పుట్టుకలో సాక్షిగా వున్నవాడిని, మరణంలో సాక్షిని కాదా! ఎందుకని? నేనే లేకపోతే శరీరం ఎట్లా ఏర్పడింది తల్లి గర్భంలో? ముందు ఏది ఏర్పడింది తల్లి గర్భంలో? నేను వున్నాను. జీవుడనే నేను వుండబట్టి, నాకు ఆధారం ఆశ్రయం కావలసినదాన్ని నేనే కుమ్మరి పురుగు వలె, ఆ సాలె పురుగు వలె, ఈ ఇల్లు అట్లా అల్లాను. సాలె పురుగు అల్లడంలేదా? అల్లుతోంది గూడుని. అట్లాగే నేను నాకు కావలసిన జీవితం, భవిష్యత్తులో నా అనుభవానికి ఎలాంటి ఇంద్రియాలు కావాలో, అటువంటి ఇంద్రియాలను తల్లి గర్భంలో అల్లుకున్నాను. సాలె పురుగును ఊరికే ఉదాహరణ చెప్పడం లేదండి జీవుడికి. ఆ సాలెపురుగు ఎట్లా అయితే, తనలో నుంచే ఆ దారాన్ని తీసి తన గూడును అల్లుకుని, అందులోనే వుండి, ఆహారాన్ని అందులోనే సంపాదించుకొని అక్కడే చస్తుంది. ఆ సాలెపురుగు అదే. జీవుడు కూడా అంతే. తల్లి గర్భంలో వున్నటువంటి జీవపదార్థాన్ని వుపయోగించుకుని, తనలో వున్నటువంటి శక్తిని ఉపయోగించి, ఆ ఇంద్రియాలను నిర్మించింది. నిర్మించిన ఇంద్రియాలలోనే జీవుడు అలాగే వుంది. అక్కడే ఆహారాన్ని సంపాదించుకుంది. అక్కడే ఆనందాన్ని సంపాదించుకుంది. అదే సత్యమనుకుంది. అక్కడే చనిపోయింది. ఇప్పుడు మానవ జీవితం, శరీరమే సత్యమంటే, దేనితో సమానంగా జీవిస్తున్నావు? సాలెపురుగువలె జీవిస్తున్నావయ్యా! అదే గూటిలో చిక్కుకుని జీవిస్తున్నావు. ఎవ్వరూ నీకు జైలు సృజించలేదు. ఎవ్వరూ నీకు బంధాలు సృజించలేదు. ఎవ్వరూ నీకు కష్టాలు కలిగించడంలేదు. ఎవ్వరూ నీకు దుఃఖాలు కలిగించడంలేదు. నీ జీవితం అంతా ఇతరులను నిందించినది అంతా వట్టి వృధా. ఇతరులు ఎవరూ కారణం కానే కాదు. ఎందుకని? నువ్వు ఈ సాలె పురుగు వలె జీవిస్తున్నావు. తల్లి గర్భం నుంచి మరణం వరకూ కూడా నీ జీవితం సమస్తం అదే సాలెపురుగు వలె వాసనాబలంతో జీవిస్తున్నావు. ఆ దేహవాసనాబలం ఇంకా నిన్ను విడిచిపెట్టలేదు. మానవుడివి అయినా కూడా. ఎక్కడ క్రిమి కీటకాదులలో వున్నటువంటి సాలె పురుగు? ఎక్కడ మానవుడు? 84 లక్షల జీవరాశులలో అంతకంటే ఉత్తమమైనటు వంటి జన్మలు ఎన్నో అనుభవించి, ఆ నాటి క్రిమి కీటక దశను ఇంకా వదులుకోలేకపోతివే. చూడండి. మానవుడిగా ఏం

ప్రయోజనము? ఇంత ఉపాధి, ఉత్తమమైన ఉపాధి కలిగి, ఏమైనా ప్రయోజనము కలిగిందా? ఏమీ ప్రయోజనము లేదు కదా! తల్లి గర్భంలో ఇంద్రియాలు ఎట్లా ఏర్పడుతున్నాయి అనేటటువంటి జ్ఞానమే లేదు. ఆ ఇంద్రియాలు ఎట్లా ఏర్పడుతున్నాయి? ఆ సాలెపురుగు ఎట్లా అయితే నిర్మిస్తుందో అట్లా ఏర్పడుతున్నాయి. అందులోనే తన ఆనందాన్ని వెతుక్కుండి. అందులోనే తన ఆహారాన్ని సంపాదించింది. నువ్వు కూడా అలాగే చేస్తున్నావయ్యా! అని నీ ఆనందమంతా బయట నుంచి రావడం లేదు. నీ యందే వున్నది. ఆ ఆనందం ప్రతిబింబిస్తున్నది. ఈ పూట మజ్జిగ పులుసులో ప్రతిబింబిస్తే, రేపు ఉలవచారులో ప్రతిబింబిస్తుంది. అంతకు మించి ఏముంది తేడా? నీ యందు ఆ ఆనందమనే స్థితే లేకపోయినట్లయితే వున్నదా ఇంకేమైనా కానీ? అలాంటిది ఏమీ లేదు కదా! అందువల్ల ఏం జరుగుతోంది ఇప్పుడు? కాబట్టి ఆ క్రిమి కీటక జంతువు అవస్థ నుంచి, నువ్వు పరిణామం చెందాలి. ఈ ఉత్తమమైనటువంటి మానవ ఉపాధిని ఇవ్వడమే పరమాత్మ చేసేటటువంటి మొదటి, ఆఖరి సహాయం. ఇంతకు మించి ప్రత్యేకంగా నీ లలితా సహస్రనామాలకో, విష్ణు సహస్రనామాలకో, నీస్తుతిలకో, స్తోత్రాలకో ఆయనేదో పొంగిపోయి ఇచ్చేటటువంటింది ఏమీ లేదు. ఆయన ఇవ్వడం ఒకటే సారి ఇచ్చేశాడు. ఏమిటి? మానవ ఉపాధిని ఇచ్చేశాడు. ఉత్తమమైనటువంటి జన్మను ఇచ్చేశాడు. ఆ ఉత్తమమైనటు వంటి జన్మను సద్వినియోగ పరచుకోవడమే నీ పని. కానీ ఇది తెలియక ఏం చేస్తున్నావయ్యా అంటే, బాల్యంలో ఎట్లా అయితే కామ్యక కర్మలు, కోరికతో చేయటం, కోరిక కొరకే చేయడం అనేటటువంటి అజ్ఞానావస్థలో ఎట్లా అయితే వున్నావో, జీవితకాలం అక్కడే ఆగిపోయావు. అక్కడే వుండిపోయావు. ఎవరుండమన్నారు? ఒక్కొక్కటి జీవనదశలలో ఎట్లా అయితే, దాన్ని చూస్తూ, ఆ జ్ఞానాన్ని పొందుతూ, అధిగమిస్తూ, బాల్యం నుంచి ఎట్లా అయితే పరిణామం చెందుతూ వచ్చావో, అట్లా నీవు పరిణామం చెందాలి కదా! అన్నింటినీ వదులుకోవాలి కదా! వదులుకోకుండా ఎందుకువున్నావు? ఆ వదులుకోలేక పోవడం అనేటటువంటి, నిగ్రహం లేదన్నమాట. అందుకని ఏం చెప్పారు? సాధన సంపత్తి, సాధన చతుష్టయం అనే నాలుగు సంపదలు వుండాలంట. నీ ఈ జ్ఞానాన్ని పొందాలి అంటే, నీకు సాధన చతుష్టయ సంపత్తి వుండాలి

నాయనా! ఎందుకని? (సాధనాచతుష్టయ సంపత్తి సంపాదించిన తరువాతే వేదాంతం చెప్పమన్నారండి) కానీ ఎందుకు ముందు చెప్తున్నామంటే, దీని ఔన్నత్యం తెలియదు కదా! నీకు direct గా సాధన చతుష్టయ సంపత్తి చెప్తామే అనుకోండి, ఎందుకయ్యా నాకిది? ఏం చేసుకోను? అంటావు కదా! అందుకని, నువ్వు ఎందుకని సాధనాచతుష్టయ సంపత్తి సంపాదించాలో ముందు ఆత్మ విచారణ చెప్పాలి. చెబితే ఏమయ్యిందట? ఇప్పుడు నీకు తెలిసింది. ఓహో! జీవితంలో ఇప్పటి వరకూ ఏం కోల్పోయాను నేను? ఇప్పటి వరకూ సంపాదించింది ఏమైనా నావేనా అవి? అవేవీ నావి కాదు. మరి నీవైనవి ఎవయ్యా? నీవంటు కొన్ని సంపాదనలు సంపాదించవచ్చు. ఏమిటయ్యా అవి? అవి సాధన చతుష్టయ సంపత్తి. ఆ నాలుగు సాధనాలు కనుక, నీ దగ్గర కనుక వుంటే, వాటితో జ్ఞానాన్ని సంపాదించవచ్చు. ఈ జ్ఞానం మరణంలో కూడా పోకుండా నిలబడుతుంది. ఎలా నిలబడుతుందయ్యా? ఇంతకు ముందు జన్మాంతరంలో అనేక జీవులలో జంతు శరీరాలలో నువ్వు పరిణామం చెందుతూ, మార్పు చెందుతూ వచ్చావు కదా! అట్టి పరిణామం చెందినటు వంటి జంతు జ్ఞానం వుందా పోయిందా? వుంది కదా! వుంటేనే కదా! నువ్వు మానవుడిగా ఇన్ని చేయగలిగావు? లేకపోతే నిన్ను బోర్లా వేసింది ఎవరు? నిలబడేటట్టు చేసింది ఎవరు? మాట్లాడేటట్టు చేసింది ఎవరు? అవన్నీ ఎవరు నేర్పించింది? ఎవరూ నేర్పే అవకాశం లేదు, నీలో సహజంగా పూర్వ జన్మాంతరం నుంచి ప్రాప్తించిది అది. కాబట్టి జ్ఞానం శరీరం పోయినా నిలబడుతుందని తెలిసింది కదా! మరి అట్టి జ్ఞానాన్ని నిలబెట్టుకో. ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నం చేయి. ఎంత ప్రయత్నం చేసినా నష్టం ఏముంది? మధ్యలో పోతే పోతుంది ఈ ఉపాధి. వచ్చేజన్మకైనా ఉపయోగపడుతుంది ఆ ఆత్మవిచారణ జ్ఞానం. ఎక్కడికి పోదు. కాబట్టి జ్ఞానంలో ఎంతమేరకు కృషిచేసినా దాని వల్ల నష్టం లేదయ్యా! నిరాశ పడమాకు. అయ్యో! వృద్ధాప్యం వచ్చేసిందే, అయ్యో! ఇంద్రియాలు బలహీనపోయినాయే, అని నిరాశపడమాకు. ఈ చివరి కాలంలో అయినా కాని కనీసం కృషి చేయి. నీకు సాధ్యమైనంత మేరకు కృషిచేయి. వచ్చే జన్మలో ప్రారంభం నుంచే మొదలు పెడుతావు. ఆదినుంచే ఆస్థితిలో నిలబెడుతావు. అప్పుడు ఏమౌతుంది? ఆ జన్మతో కడతేరిపోతావు.

కనీసం ఈ జన్మ పోయిందని దుఃఖపడమాకు, జన్మ దేనికి? శరీరానికి కానీ నీకు కాదు. ఈ పనిముట్టులో శక్తి అయిపోయింది అనుకుంటున్నావేమో? ఏం కంగారు పడమాకు. బోడి పనిముట్లు పోతే వస్తాయి. ఎక్కడికి పోతాయి? ఈ పంచభూతాలతో ఏర్పడ్డాయి, ఈ పంచభూతాలతోనే పోతాయి. మళ్ళా ఈ పంచభూతల్లోనే ఏర్పడుతాయి. ఎక్కడికి పోతాయి? (ఇంత తెలివి వుండాలి కదా! పుట్టిన దగ్గర నుంచి) అదే నీకు చెప్పింది. ఆ ఎలా వస్తుందో చెబుతుంది అదే. ఆ జ్ఞానం నీతో పాటుగా, నీ ప్రాణ మనో బుద్ధులతో పాటుగా సూక్ష్మంలో వుంటుందన్నమాట. అదే సూక్ష్మం మళ్ళా శరీరాన్ని ధరించేటప్పుడు ఈ జ్ఞానంతో వచ్చేస్తుంది మళ్ళా. ఎందుకని అంటే? ఎప్పుడంటే, అందుకే చెప్పేది... అంతకాలేచ మాం ఏవ స్మరణ్ ముక్త్వా కళేబరం యః ప్రయాతి సమద్భావం నన్ను కచ్చితంగా చేరుతావు. నువ్వు కనుక మరణకాలంలో కనుక నన్నే గుర్తుపెట్టుకునే ప్రయత్నం చేస్తే. నన్ను గుర్తు పెట్టుకో అంటే, నన్ను అంటే ఎవరు? శ్రీ కృష్ణుడు కాదు, విశ్వరూపం 36 చేతులు కాదు. నేను అనే ఆత్మ స్వరూప జ్ఞానం. పరమాత్మ జ్ఞానం. ఆత్మ పరమాత్మలకు సంబంధించిన జ్ఞాన స్థితిలో కనుక నువ్వు మరణాన్ని విడిచిపెట్టినట్లయితే, మరణంలో విడువమంటున్నాడు శరీరాన్ని. నువ్వు శరీరాన్ని విడుస్తున్నావు అంతే. ఏమీ అవ్వడం లేదు అంతకు మించి. రోజు వస్త్రాన్ని విడిచి, నూతన వస్త్రాన్ని ఎట్లా అయితే ధరిస్తున్నావో, అట్లా శరీరాన్ని విడిచి ఇంకో శరీరాన్ని ధరిస్తున్నావనేటటువంటి, సాక్షిగా వుండేటటువంటి ప్రయత్నం మరణంలో ఎప్పుడైతే నీకు వున్నదో, అప్పుడు ఏమయ్యావు? అదే సాక్షిత్వజ్ఞానంతో మరల వచ్చేసింది ఉపాధి. ఇప్పుడు ఏమయ్యావు? నీకు అదే ఆఖరి జన్మ. Finish. దాంతో అయిపోతుంది జనన మరణాలు లేకుండా దాటిపోతావు. అట్టివారికి అన్నీ సాధ్యమే. కాబట్టి అలాంటి స్థితి నీకు రావాలి అంటే, ఈ సాధన చతుష్టయ సంపత్తి వుండాలయ్యా. ఇది నిజమైనటువంటి సంపద. ఎందుకని? ఈ సంపద మరణకాలంలో ఉపయోగపడుతుంది. నీవు ఇప్పటి వరకూ చేసినవన్నీ మరణకాలానికి ముందే వదిలేసినాయి. ఎందుకని? చిన్న నిద్రలోకి పోతేనే నిలువనటువంటి సంపదలు పెద్ద నిద్రలో ఎక్కడుంటాయి? తెలివి తప్పగానే, ప్రాణం కూడా పోవక్కర్లేదు, తెలివి తప్పగానే, నువ్వెక్కడో, నీ శరీరమెక్కడో, నీ

బంధుగణం ఎక్కడో, నీ సంపదలు ఎక్కడో, నీ వగైరాలన్నీ ఎక్కడో. నీదంతా వెళ్ళిపోయింది అంతే ఒక్క దెబ్బకి. రెప్పపాటులో గతించిపోయింది అంతే. తీసుకెళ్ళడానికి అవకాశం లేదు అంతే. మళ్ళా పేజీ తిప్పే అవకాశం లేదు అక్కడ. మరి దీని కోసం ఎంతో విలువైనటువంటి 100 సంవత్సరాల జీవితాన్ని వృథా చేశావే, ఒక్కసారి ఆలోచించు. మనం పావలా వృథా అయ్యిందని దుఃఖపడుతున్నావే, అయ్యయ్యో! ఎంత విలువైన జీవితం పోతోంది అని దుఃఖ పడటం లేదే, ఎవరు అజ్ఞాని? ఆలోచించండి? తోటకూర కట్టకోసం వాడితో పావలా బేరం ఆడుతావే, అయ్యో! జీవితం పోతోందే! జ్ఞానం లేకుండా పోయిందే, అజ్ఞానం వచ్చిందే, నలభై ఏళ్ళు, యాభై ఏళ్ళు గడిచిపోయినాయే, ఏనాడో, ఈనాడో మరణం ఎప్పుడొస్తుందో, ఏనాడు ఈ జీవితం పరిసమాప్తం అయిపోతుందో, పొందవలసినది పొందలేకపోయావే, అయ్యయ్యో! ఎంతో విలువైన మానవ ఉపాధి నేలపాలు అయిపోయిందే! ఎన్నో జన్మలు, ఎన్నో లక్షల సంవత్సరాలు జంతువు ఉపాధుల్లో తిరిగి తిరిగి తిరిగి తిరిగి అన్ని లక్షల సంవత్సరాలపాటు పరమాత్మను వేడుకుంటే, పరమాత్మ ఇచ్చిన దయతో వచ్చిన మానవ ఉపాధి కదా ఇది. అన్ని లక్షల సంవత్సరాలపాటు చేసిన శ్రమ, చూడండి. పావలా కోసం వృధా అయిపోతుందే. వెల లేనటువంటి ధనం కోసం, దానికి వెల ఎలా వచ్చింది? మనం ఇస్తే వచ్చింది. దానికి ఏం విలువ వుందండి? మనం ఈనాడు చెప్పున్నటువంటి విలువైన వస్తువులు, ఎవరిచ్చారు వాటికి? విలువ ఎలా వచ్చింది? నువ్వు ఇచ్చావు. ఆపాదించావు దానికి. పరమాత్మ ముందు అవి ఏ మూలుకు? ఈ విశ్వం ముందు ఏ మూలకు అవి? ఆ విశ్వానికి సంబంధించిన జ్ఞానాన్ని పొందితే, పరమాత్మకు సంబంధించిన జ్ఞానాన్ని పొందడానికి అర్హత వున్నటువంటి ఉపాధి లభించింది. పనిముట్లు లభించినాయి. కానీ ఆ పనిముట్లతోటి ఏం చేస్తున్నావు? కంట్లో ఆపరేషన్ చేయడానికి సాధ్యమైన సునిశితత్వం వున్నటు వంటి పనిముట్టుతో, బీరకాయలు తరుగుతుంటివి. ఏమిటయ్యా అని అంటే, నాకు ఇదే వచ్చు అంటుంటివి. ఇంతకన్నా అజ్ఞానం ఏమైనా వుందా? ఇప్పుడు దేనికోసం బాధపడుతావు? దేని కోసం దుఃఖిస్తున్నావు? అర్థం వుందా ఏమైనా నీ దుఃఖానికి. ఒకసారి ఆలోచించు? దుఃఖం కలిగినప్పుడల్లా ఈ మాటలు గుర్తుకు

రావాలండి. అయ్యో! నా జీవితం వృధా అయిపోంది. దుఃఖం కలుగగానే ఈ మాటలు స్ఫురించాలండి. దుఃఖం కలిగిందంటే అజ్ఞానం వుంది, అహంకారం వున్నది. పోయింది. అయ్యో! పోయిందిరా బాబు. ఇంతకాలం ఎన్నో సంవత్సరాల పాటు, ఈ నలభై ఏళ్ళు, యాభై ఏళ్ళపాటు జీవితం అంతా ఇలాగే కదా పోయింది. ఈ వెల లేనటువంటి అంశాల కోసం, ఎందుకూ కొరగాని అంశాల కోసం, దుఃఖించితినే.

ఒక మనిషి బాధ పెడుతన్నాడు, అతని చేత నేను బాధించబడుతున్నాను అనేదే కదా! అతను ఎక్కడున్నాడు? నేను ఆత్మస్వరూపుడను. అంటే నేను అంతటా, సర్వత్రా వ్యాపించి వున్నవాడను. అతనిలో వున్న అంతరాత్మ ఎవరు? నేనే. పరమాత్మ ఎవరు? నేనే. ఏం తేడా వుంది? శరీరం తేడా వుంది. అంతే కదా! ప్రాణ మనో బుద్ధులు? ఒకటే. ఏం తేడా వచ్చింది? గిన్నె తేడారా బాబు. అంతకు మించి ఏమీ లేదు. ఈ గిన్నె ఆ గిన్నెను ఎలా బాధించింది? (నన్ను కాదు అనుకోవడమేనా?) నేను ఒక్కటే ప్రశ్న అడుగుతా విను. మీ ఇంట్లో బోల్డు గిన్నెలు వున్నాయండి. ఈ గిన్నె ఆ గిన్నెను బాధించగలిగిందా? (అలా అనుకున్న మనసు ఊరుకోవడం లేదు కదా! మరి) అంటే అర్థమేమిటి అక్కడ? ఏదో ఒక వాసనకు లొంగింది అది. (అది కాదు ఎవరన్నా వచ్చి ఏమన్నా అన్నారనుకోండి, ఆ మాటకు ఈ మనసు నన్ను కాదు అనుకోవడం లేదు) విను చెబుతా విను స్పందిస్తోంది అక్కడ. ఎలా స్పందిస్తోందంటే, దేహవాసనకు లోబడి స్పందిస్తోంది. ఎందుకని? ఈ పెద్దగిన్నె వచ్చి ఆ చిన్న గిన్నెను కొట్టుకుందండి. గిన్నెలు సర్దుకునేటప్పుడు గిన్నెలు కొట్టుకుంటున్నాయా? కొట్టుకోవడం లేదా? ఏమన్నా గిన్నె దుఃఖపడిందా? దుఃఖపడిందా? దానికి ప్రాణం లేదుగా. ఎందుకు అనుకుంటున్నావు? నీకు కనపడడం లేదు అంతే. నీకున్న ప్రాణం నీకు వున్నట్లుగా దాంట్లో లేదు అంతే. దాంట్లో వుండే చైతన్యం దానికి వుండబట్టే దానికి గిన్నె అనే ఆకారం వుంది. లేకపోతే ఆకరం ఎట్లా వుంది? అంతేకదా! ఆ గిన్నె అనే ఆకారం చెడకుండా వుంచేటటువంటి శక్తి లోపల లేకపోతే గిన్నె ఆకారంలో వుంటుందా? ఎలా వుంటుంది? వుండదు కదా మరి. కాబట్టి నీ యందు ప్రాణ శక్తిగా వున్నది. దాని యందు చైతన్యం జడశక్తిగా వున్నది. (నన్ను కాదు అనేనా?) నన్ను కాదు అనేది కాదు అంశం అక్కడ గుర్తు పెట్టుకోవలసినది అతడు నా ప్రతిబింబం. అతను

ఎక్కణ్ణుంచో రాలేదు. నాలో వున్న ప్రాణమనోబుద్ధులలో వున్న రజోగుణమే, అతనిలో పనిచేస్తోంది. అతనిలో వున్న రజోగుణాన్ని నిద్ర లేపుతోంది. అతను అలా ప్రవర్తించేటట్లు చేస్తోంది. నా సూక్ష్మాన్ని ముందు సరి చేయాలి. నాలో వున్న ప్రాణమనో బుద్ధులలో వున్న రజోగుణాన్ని కనుక ముందు వదిలేసుకుంటే నేను, నాకు మూడు గుణాలలో కనుక స్పందన లేకపోయినట్లయితే, (అతను అలా అన్నారనే మాట వుండదు) అతను అసలు అనే పరిస్థితే రాదు. అర్థమౌతుందా అండీ!

అతను అంటున్నాడంటే ఎలా అంటున్నాడు? నీ లోపల సూక్ష్మం అందులో చేరింది. ఆ గిన్నెలో ఏం చేరింది? నీ ప్రాణ మనో బుద్ధులే వెళ్ళి చేరినాయి. నీ సూక్ష్మం వెళ్ళి అతని సూక్ష్మంతో సంయోగం చెందింది. నీకు రమణ మాస్టారు ఎట్లా నచ్చాడు? ప్రపంచంలో ఇంతమంది వుండగా? ఎట్లా నచ్చాడు? ఇక్కడ ఒక అంశం వుంది. అంటే అర్థమేమిటి? నీ తల్లిదండ్రులలో కూడా ప్రాణమనో బుద్ధులు అనే సూక్ష్మం వుంది కదా! ఆ సూక్ష్మం ఏం చేసింది ఇప్పుడు? మరొక జీవిలో, మరొక ఉపాధిలో వున్న సూక్ష్మంతో సంయోగం చెంది, నిర్ణయం చేసేస్తుంది. కానీ అసలు నిర్ణయం ఎవరు చేయాలి? అంతరాత్మ చేయాలి. సాక్షి చేయాలి నిర్ణయం ఎప్పుడూ కూడా! అంతే కదా ! కానీ ఏవి చేసేస్తున్నాయి? ప్రాణ మనో బుద్ధులు చేసేస్తున్నాయి. దేనికి లోబడి చేసేస్తున్నాయి? శాస్త్ర వాసన, దేహ వాసన, లోకవాసనకు లోబడి చేసేస్తున్నాయి. కాబట్టి తప్పు ఎవరిది? నాదే. నేను అంతరాత్మలో కనుక స్థిరంగా వున్నట్లయితే, అతను అరుస్తున్నాడండీ, నేను ఎవరిని? గమనించే వాడిని. సాక్షిని. అంతేకదా! ఎందుకని? అతనిలో వున్న అంతరాత్మ ఎవరు? నేనే. అక్కడా గమనించేవాడినే. ఇక్కడా గమనించేవాడినే. ఆ గమనించేవాడి దృష్ట్యా చూస్తే ఇద్దరు ఎక్కడున్నారు? ఇద్దరు లేరు. ఒక్కడే వున్నాడు. మరిప్పుడు ఎవరు ఎవరిని అన్నారు? ఎవరూ ఎవరిని ఏమీ అనలేదు నాయనా! పరిణామ సూత్రం మేరకు, ఒకరితో ఒకరిక్కడ పరిణామం చెందుతూ వున్నారు. ఒకరికొకరు పాఠం నేర్చుకుంటున్నారు. ఒకరికొకరు గురుశిష్యులుగా బోధ సంగతి జరుగుతుంది. ఎందుకండి? విను చెబుతా విను. నాలో వున్న రజోగుణం నాకు నేనే తెలుసుకునే అవకాశం లేదు కాబట్టి, పరమాత్మ ఏం చేశాడు? నీలాంటి జీవులనే నీ చుట్టుపక్కల ఏర్పాటు చేశాడు. నీలో వున్న రజోగుణాన్ని

వాడు ఎత్తి చూపుతున్నాడు. నీలో వున్న తమో గుణాన్ని వాడు ఎత్తి చూపుతున్నాడు. ఎందుకని? వాడు లేకపోతే నువ్వు తెలుసుకోలేవు. నీలోపల నువ్వు ఎంతసేపు తొంగి చూసినా అవి కనపడుతాయా? కనపడవు కదా ! అవి వాటిలో ప్రతిబింబిస్తేనే కదా! అద్దం ముందుకు వెళ్ళి నిలబడితేనే కదా! నువ్వు దానిని చక్కదిద్దుకునేది? కాబట్టి వాడు ఎవడయ్యా? నీ ప్రతిబింబం. అద్దంలో కనపడుతున్న ప్రతిబింబం. నీ ప్రతిబింబమే అది. నీలో ఎంత రజోగుణం బలంగా వుందో, వాడు అంత బలంగా మాట్లాడుతున్నాడు. నీలో తమోగుణం ఎంత బలంగా వుందో, వాడు అంత తీవ్రంగా ప్రవర్తిస్తున్నాడు. నీలో సత్వగుణం ఎంత బలంగా వుందో, వాడు అంత సత్వగుణంతో ప్రవర్తిస్తున్నాడు. (నా ఇది లేకుండానే వాళ్ళు అట్లా చేస్తుంటారు కదా!) నీ ఇది అంటే ఇప్పటి వరకూ శరీరం, మాట్లాడడం వరికే పెట్టుకున్నావు. శరీరం మాట్లాడక పోయినా, ప్రాణ మనో బుద్ధులు పనిచేస్తున్నాయా? పనిచేయడం లేదా? నువ్వు మౌనంగా కూర్చున్నావు, ప్రాణ మనో బుద్ధులు పని చేస్తున్నాయా? (పనిచేస్తూనే వున్నాయి) అంతే కదా! నోరు కట్టేసినంత మాత్రాన, అవి కట్టుబడలేదు కదా! అవి పనిచేస్తూనే వున్నాయి కదా! అలాగే ఆ ప్రాణ మనో బుద్ధులు, ఆ శరీరంలోకి వెళ్ళి అలా పనిచేస్తున్నాయి. (నా ప్రమేయం లేకుండా) ఏం పని లేదు. స్థూలంతో సూక్ష్మానికి ఏమీ పని లేదు. కల వుందండి, నీకు కల జరుగుతుందండి. నీ స్థూలానికి ఏమైనా పని వుందా, ఆ కలతో? కల జరుగుతోందా లేదా? జరిగిపోతూనే వుంది. అట్లాగే మెలకువలో వున్నప్పుడు నీవు శరీరాన్ని మాత్రమే గుర్తిస్తున్నావు కానీ శరీరం కంటే ముందు ఏది మేల్కొంది? సూక్ష్మం మేల్కొంది. నీ స్థూలం కంటే, సూక్ష్మమే ముందు మేల్కొంటుంది. కాబట్టి సూక్ష్మం మేలుకొన్నాకే కదా, ఈ స్థూలం మేలుకొంటుంది? కాబట్టి ఈ స్థూలం పని చేస్తున్నది అంటే ఆ సూక్ష్మం పనిచేస్తుంటేనే కదా! కాబట్టి ఈ సూక్ష్మం ఎప్పుడూ ముందు వుంటుందా? వుండదా? ముందున్నప్పుడు మరిప్పుడు ఏమైంది? దాంట్లోనుంచి మాట్లాడుతున్న సూక్ష్మం ఇప్పుడు ఎవరు? నీ సూక్ష్మమే. దాంట్లోనుంచి ప్రవర్తిస్తున్న సూక్ష్మం ఎవరు? నీ సూక్ష్మమే. దాంట్లో నుంచి పనిచేస్తున్న కర్మ ఎవరు? నీ సూక్ష్మమే. దానినుంచి వస్తున్న పరిణామం ఎవరికి? నీ వల్ల నీకే కలుగుతోంది. రెండోవాడు ఎక్కడున్నాడు ఇక్కడ? ఎవరూ లేనే లేరు ఎప్పుడూ

కూడా. (ఇటువంటి గురువుగారిని ఎదురుగుండా పెట్టుకుని ఏమీ తెలుసుకోలేక పోవడమే పెద్ద అజ్ఞానం). ఇక్కడొక అంశం వుందండి. ఏంటంటే ఎప్పుడూ కూడా ఇతరులను వేరుగా చూడడమే మనం ఇప్పటి వరకూ అలవాటు పడ్డాము. ఎందుకని? నేను వేరు, నువ్వు వేరు. నేను వేరు, నువ్వు వేరు. నేను వేరు, నువ్వు వేరు. అలా కాదు. నీలో వున్న ప్రాణ మనో బుద్ధులు, అక్కడ వున్న ప్రాణ మనో బుద్ధులు ఒక్కటే. ఎవరు ఎవర్ని అన్నారు? ఎవరూ ఎవర్నీ అనలేదు. గిన్నె గిన్నెను అన్నదండి. గిన్నెను గిన్నె అంటే గిన్నెకు ఏమైంది? ఇంకొకటి, అది వుపయోగమే. నాకు వుపయోగమే. ఎందుకని? గురువై బోధిస్తూ వున్నాడు. అర్థమైందా అండీ! లేకపోతే నన్ను నేను తెలుసుకునే అవకాశం వుందా? ఈ మనుషులు ఎవ్వరూ లేరు అనుకోండి, ఏం తెలుసుకుంటావు? ఎలా తెలుసుకుంటావు? సాధ్యమేనా? నీకు జ్ఞానం కలిగే అవకాశం వుందా? (అట్లా అనుకో బట్టేగా) తెలిసేదినీకు పోలిక. ఆ పోలికే లేకపోతే దేనితో పోల్చుకుంటావు? ఎట్లా సాధ్యం? ఒక్కడివే వున్నావండి. జ్ఞానం ఎట్లా వస్తుంది? కాబట్టి పరమాత్మ ఎంతటి ముందుచూపుతోటి ఈ సృష్టిని రచించాడు? నీకు మొత్తం గురువులనంతా నీ చుట్టూనే ఏర్పాటు చేశాడు. నువ్వు ఎక్కడికో పోకుండా. తెలుసుకోగలిగే తెలివి, జ్ఞానం కనుక నీకు వున్నట్లయితే, నీవే కదా సత్యం. నీవు సత్యమని, సాక్షివనీ తెలుసుకోవాలి అంటే, వీళ్ళందరూ అవసరమేనా కాదా? అందుకే కదా! నీ వాసనాబల ప్రభావం మేరకు, వీరందరినీ ఏర్పాటు చేసుకున్నావు. ఒక్కొక్కడూ ఒక్కో ప్రతిబింబం. ఒకడు రజోగుణానికి ప్రతిబింబం, ఒకడు తమో గుణానికి ప్రతిబింబం, ఒకడు సత్వగుణానికి ప్రతిబింబం. ఒకడు సాక్షికి ప్రతిబింబం. అర్థమైందా అండి? ఇలాగ ఎందుకని? అందరూ అవసరమే. "నీ చుట్టుపక్కల వున్న అందరూ గురువులే. నీవు శిష్యుడవు. ఈ సృష్టి గురువై బోధిస్తూ వున్నది. నేను శిష్యుడై, సాధకుడై నేర్చుకుంటున్నాను. అని ఎప్పుడైతే ఈ సృష్టిని గురువుగా స్వీకరిస్తావో, ఆనాడు నువ్వు కడతేరుట ఖాయము". గర్తుపెట్టుకోండి. ఇదే వాక్యము. ఈ సృష్టి బోధిస్తున్నదని ఎవరైతే స్వీకరిస్తారో, ఆ జన్మలో వాడు కడతేరుట ఖాయము. ఎందుకని? వాడు జనన మరణాలను అధిగమించేస్తాడు. కారణం ఏమిటి? సృష్టిని అధ్యయనం చేశాడు. తనని తాను అధ్యయనం చేశాడు. సృష్టిని, తనని ఏకంగా

సాక్షిత్వంగా అధ్యయనం చేశాడు. పరమాత్మ నిర్ణయంగా సృష్టిలో జీవించేస్తాడు ఇంకా. ఎందుకని? సృష్టి అతనిని బాధించలేదు. ఎందుకని? గురువై బోధిస్తున్నది అది. ఇంకా బాధించేది ఏముంది? శిక్షణను ఇస్తోంది, మంచి ట్రైనింగ్ ఇస్తోంది. మంచి పాఠం వచ్చేట్టు చేస్తోంది. జన్మ జన్మలకి గుర్తుండే పాఠాన్ని ఇస్తోంది. మరి అదే కదా జ్ఞానం అంటే. ఆ జ్ఞానం ఎట్లా వచ్చింది నీకు? ఆ సృష్టి నుంచే వచ్చిందయ్యా బాబు. ఈ సృష్టే ఈశ్వరుడు. ఈ సృష్టే పరమాత్మ. ఈ సృష్టే గురువు. సృష్టి గురువై బోధిస్తూ వుండగా, ఎక్కడ ఒక తలకాయి, రెండు కాళ్ళు, రెండు చేతులు వున్న గురువు కోసం వెతుకుతావు ఎందుకు? వెయ్యికోట్ల జనాభాలో ఎక్కడ వున్నాడని ఎట్లా వెతుకుతావు? ఈ అనంత సృష్టి నీ ఎదుట గురువై బోధిస్తూ వున్నది. సాలెపురుగు దగ్గరనుంచి కూడా నీకు బోధిస్తున్నది. నీవు ఎట్లా జీవిస్తున్నావనేది. కాబట్టి నీకు ఏం చేయగలడయ్యా? సశరీర గురువు నీకు స్ఫురణను ఇవ్వగలుగుతారు అంతే. ఒహో ! ఇలా కాదు, దృష్టిని ఇలా మార్చుకో. అని నీకు చెప్తాడు అంతే. మార్గ దర్శనం చేస్తాడు. జీవించేది ఎవరు? నువ్వే. కాబట్టి ఈ జీవితాన్ని ఎప్పటికైనా సరే, సాధకుడిగా జీవించడానికి మార్చుకో ఇప్పటికైనా. మరణ కాలంలో వుపయోగపడేటటువంటి సాధనాచతుష్టయ సంపత్తిని సంపాదించుకునేందుకు ప్రయత్నం చేయి. ఏం చేయాలయ్యా అని ఎవ్వరినీ అడుగమాకు. ఏ సాధన చేయమంటారు అని అడుగమాకు. ఏమి చెయ్యాలయ్యా అంటే జపం, తపం, యజ్ఞం, యాగం, హోమం నువ్వు ఏం చేస్తావో అనేది అనవసరం అక్కడ. కానీ నీ దగ్గర ఏముండాలయ్యా? మరణకాలంలో వుపయోగపడే సాధనచతుష్టయ సంపత్తి వుండాలి. ఎందుకని? ఈ నువ్వు చేస్తున్న జపం, యజ్ఞం, యాగం, హోమం ఇవన్నీ మరణ కాలంలో సాధ్యమేనా? అసలు అసాధ్యం నాయనా! ఎందుకని? కాళ్ళు చేతులు తెలివికి ఎగువ పడ్డాక యజ్ఞము లేదు, యాగము లేదు. కావన్నీ ఇవన్నీ స్థూలభాగంలో లేవు. యజ్ఞభావంతో జీవించాలట. నీ శరీరమే హోమగుండం. నీ యందు వున్నటువంటి ప్రాణమే హవిస్సు. నీ యందు వున్నటువంటి మనస్సు బుద్ధులే, నీలో వున్నటువంటి వాసనాబల సంస్కార బలమే సమిధలు. అందులో బయలుదేరినటువంటి అగ్ని వైశ్వానరుడు. నీలోపల వున్న వైశ్వానరుడే అగ్ని. నీ వాక్కులే

శ్రోతస్సు. నాదం నీలో వున్నదండి. ఓంకార నాదం నీలో ప్రతి ధ్వనిస్తున్నది. ఆ ఓంకార నాదం మేరకే నీలో ప్రాణం జరుగుతూ వున్నది. ఆ ఓంకార నాదమే మంత్రము. ఇట్లా యజ్ఞభావంలో నీ శరీరంలో యజ్ఞం జరుగుతూ వున్నది. కానీ ఈ యజ్ఞాన్ని గుర్తించలేక పోతున్నావు. ఈ యజ్ఞాన్ని ఎవరైతే గుర్తించారో, నేను ఎవరిని ఇప్పుడు? ఆ యజ్ఞపురుషుడైనటువంటి సాక్షిని. ఆ యజ్ఞపురుషుడైనటువంటి బ్రహ్మను. ఆ యజ్ఞం ఎవరినైతే చేరుతుందో ఇట్లా జీవించేవాడు కదా సాక్షి స్వరూపుడు. ఇప్పుడు ఏది ఏది? ఏది కాదు? అర్థమైందా? ఈ రకంగా ఎవడైతే జీవితాన్ని జీవిస్తాడో, ఇది యజ్ఞం చేయడం అంటే. ఇది సోమయాజిత్వం అంటే. ఇది మకర కుండలాలు. ధరిస్తారు చూడండి. ఎందుకు ఆ మకర కుండలాలు? మకరం దేనికి గుర్తు? నీలో వున్నటువంటి మూడు గుణాలకి గుర్తు అది. గజేంద్ర మోక్షంలో ఎవరు పట్టుకున్నారు? మొసలి పట్టుకుంది. ఆ మొసలి ఏంటయ్యా? నీ మనస్సు. మనస్సు చివరకు ఏమైపోయిందట? కుండలములు. చెవులకు ఆభరణములు. మనస్సు అనేది నా చేతిలో పనిముట్టు అయ్యా బాబూ. ఇదిగో కుండలములు ఎట్లా అయితే... (మరి శంకరాచార్యుల వారి మొసలి పట్టుకుంది అంటే అది ఏమిటి?) ఆయన పుడుతూనే కారణ జన్ముడిగా పుట్టాడు. సన్యాసనిమిత్తమై దానిని సంకల్పించాడు. అమ్మని అడిగాడు. బాల్యంలో సన్యాసం కాదంది ఆవెడ. కాదంటే మరిప్పుడు ఏం చెయ్యాలి? ఆవెడని ఒప్పించాలి. ఒప్పించాలంటే ఒకటి కల్పించాడు. కల్పించాడక్కడ. తను సంకల్పించాడు. ఆ సంకల్పమే మొసలి రూపంలో భ్రాంతి ఆవెడకు కలిగేటట్లు చేశాడు. ఆవెడకు కలిగేటట్లు చేశాడు, అక్కడేమీ మొసలి లేదు, పాడు లేదు. (నన్ను మొసలి పట్టుకుంది) ఏం చేయమంటావు? నేను సన్యాసం పట్టుకుంటేనే కానీ వదలనంటుంది అన్నాడు. ఆవెడకు బిడ్డ మీద ప్రేమ. కాబట్టి పో నాయనా తీసుకో! నీవు బ్రతుకుతావుగా అంది. సరే అయిపోయింది. ఆయన పని అయిపోయింది. అంతేగాని అక్కడ మొసలి లేదు. ఆవెడకి ఆ భ్రాంతి కలిగేటట్లు చేశాడు. చూడండి. ఎనిమిదేళ్ళ వయస్సులోనే తల్లికి, ఎట్లా అయితే శ్రీ కృష్ణుడు యశోదకు ఎట్లా చూపెట్టాడు? (లోకాలు అన్నీను) అంతే! అలాగ ఒకటి సంకల్పించాడు. ఆవెడకు ఆ మొసలి పట్టుకుంది అనంగానే ఒప్పుకునేటట్టు భ్రాంతి కలుగజేశాడు అంతే. అక్కడ

మొసలి లేదు, పాడు లేదు. అలాగ వాళ్ళందరూ కూడా కారణ జన్ములు. అందుకని మనం కర్మ జీవులం. కాబట్టి వాళ్ళకేంటి? జన్మతః జ్ఞానం వుంటుంది వాళ్ళకి. ఆ నిమిత్తమే వస్తాడు వాడు. అంటే ఉపాధిని ఎంపిక చేసుకోగలిగే సామర్థ్యం వుంటుంది. తల్లిని ఎంపిక చేసుకోగలిగే సామర్థ్యం వుంటుంది. అన్నీ ఏర్పాటు చేసుకుని వస్తాడు. ఉపాధిలోకి. మనం ఏం చేశాము? ఉపాధిలోకి వచ్చినాక ఏర్పాటు చేసుకుంటున్నాము. వీళ్ళందరూ కారణ జన్ములన్నమాట. వీళ్ళందరూ ఏమిటి? ముందే ఏర్పాటు చేస్తారు అంతాకూడా! వాళ్ళకు కావలసినవన్నీ. (ఈ మామూలు వాళ్ళు కూడా అనుకునే వస్తారు కదా! ఫలానా వాళ్ళు కావాలని) కర్మను ఆశ్రయించి. వాసనా బలాన్ని ఆశ్రయించి నువ్వు తల్లి తండ్రిని ఎంపిక చేస్తావు. వాడు జ్ఞానాన్ని ఆశ్రయించి ఎంపిక చేస్తాడు. అదీ తేడా. సాక్షిత్వ జ్ఞానాన్ని ఆశ్రయించి ఎంపిక చేస్తాడు. అర్థమైందా అండి? సాయిరాం.

(Next class సాధన చతుష్టయ సంపత్తి)

ఓం ఓం ఓం

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఓం పూర్ణ మదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఓం పూర్ణ మదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఓం తత్ సత్

ఓం సహనా భవతు సహనౌ భునక్తు సహవీర్యం కర వావహై తేజస్వి నావధీతమస్తు మావిద్విషావహై

ఓం శాంతిఃశాంతిఃశాంతిః

సాయిరాం

"ఇరువదొకవెయ్యి ఆరు నూరులు జరుగు హంసలు, తరుగునాయువు, హరిహరాదులు వచ్చి నిలచిన, ఆగదీతనువూ, జీవా మేలుకొనవే". అంటే అర్థం ఏమిటి? ఏమిటి అర్థం? తనువు ఎప్పటికైనా పోతుంది అంటున్నావే కానీ, ఆ తనువుని నమ్ముకోవటం మానేశావా? అది మాన లేదు కదా! ఇంకోటి ఏంటట? అది మానాలి అంటే, ఏం గుర్తించాలట? అది తెలుసుకోవాలి. అందులోనే రెండూ వున్నాయి. సమస్యా వుంది, నీ పరిష్కారం కూడా అందులోనే వుంటుందండి. ఏం చెయ్యాలి? నీ సమస్య ఏమిటి? నీ సమస్య ఏమిటి? తనువును ఆశ్రయించావు. తనువే నేను అనుకుంటున్నావు. ఈ తనువు నేను అనుకోకుండా జీవించాలి అంటే ఏం చెయ్యాలి? ఇరువదొకవెయ్యి ఆరు నూరులు జరుగు హంసలు, తరుగునాయువు, హరిహరాదులు వచ్చి నిలచిన, ఆగదీతనువూ. నువ్వు ఆ హరిహరాదులను ఎంతసేపూ ఏమి వేడుకొంటున్నావు? నేను చావకుండా చూడు, నేను చావకుండా చూడు, ఈ సుఖం వుండేట్టుగా చూడు, ఈ సుఖం వుండేట్టుగా చూడు, ఈ శరీరంతో కూడిన సుఖం వుండేట్టుగా చూడమనే కదా జీవితకాలం వాడిని బతిమలాడావు? బతిమలాడితే వాడేమన్నా చేయగలడా? ఏం చేయలేడు నాయనా! ఎందుకని నాయనా? వాడి చేతిలో ఏమీ లేదు నాయనా! ఎందుకని? మరణం ధృవం. పుట్టిన వాడు పోక తప్పదని పురాణాలు, అష్టాదశ పురాణాల్లో ప్రతీ దేవుడూ ఎన్ని తపస్సులు చేసినా కూడా చెప్పింది అదే! అయితే ఏమిటట? నువ్వు తప్పించుకోవచ్చు. ఎట్లా అయ్యా? ఆత్మజ్ఞానం తెలిస్తే, మరణాన్ని ధిక్కరించవచ్చు. మరణాన్ని అధిగమించవచ్చు. అట్లా సాధ్యం గాని, మరణ కాలంలో ఏ సాధన గనుక నీ దగ్గర వుంటే, మరణాన్ని నువ్వు సాక్షిగా చూడగలుగుతున్నావో, అటువంటి జ్ఞానం నీ దగ్గర వుంటే, నువ్వు దానిని అధిగమించవచ్చు. అంతే గాని దానిని లేకుండా చేయడం ఎవరివల్లా అవ్వదు. ఎందుకని? అది తనువును ఆశ్రయించి వున్నది. తనువు పుట్టింది, తనువు పోక తప్పదు. నువ్వు పోవడం అనేది అసాధ్యం అన్నమాట. అనే జ్ఞానం నీకు కలగాలి. కలగాలి అంటే దేనిని ఆశ్రయించాలి? అంటే ఈ తనువు నేను కాదు అని నిరశించాలి అంటే, ఈ తనువు దేనిమీద పనిచేస్తుందంట ఇప్పుడూ? ఆయుష్షు మీద పనిచేస్తుంది. అంతేనా? ఈ తనువు దేనిమీద ఆధారపడి వుంది? ఆయుష్షు మీద

ఆధారపడి వుంది. ఆయుష్షు దేని మీద ఆధారపడి వుంది? హంస మీద ఆధారపడి వుంది. ఆ హంసని గుర్తెరుగు మొట్టమొదట. ఆ హంసని గుర్తించే ప్రయత్నం చేస్తే, అది ఇరువది ఒక్క వెయ్యి ఆరు నూరులు జరుగతోందంట. క్రమం తప్పకుండా తల్లి గర్భం నుంచి మొదలు పెడితే, మరణ కాలం వరకూ కూడా ఆ హంస 21,600 సార్లు కొట్టుకొంటోందంట. ఎందుకని రోజూ అంత పెద్దపని మనలో జరుగుతూ వున్నా కూడా, మరి మనం ఎందుకు గుర్తించలేకపోతున్నాము? అర్థమైందా అండీ!

చిన్న చిన్న బయట ఆవగింజ కదిలినా, చీమ కదిలినా గుర్తుపడుతానంటున్నావే, కానీ ఏమి గుర్తించలేక పోతున్నావు? నీలోపల హంస, పుట్టింది మొదలు పోయేదాకా రోజూ కొట్టుకొంటోందే? దాన్ని గుర్తించు మొట్టమొదట. దాన్ని గుర్తిస్తే, నీ ఆయుష్షు ఎలా తరిగిపోతోందో తెలుస్తుంది నీకు. నీ ఆయుర్దాయం ఎలా క్షీణించిపోతుందో అప్పుడు తెలుస్తుంది నీకు. (ఇన్నాళ్ళు) నువ్వేం మోసపోయావో. దేని గురించి నీ ఆయుర్దాయాన్ని ఖర్చు పెడుతున్నావు? అర్థమైందా? నీ ఆయుర్దాయం ఇప్పటి దాకా దేని కోసం ఖర్చు పెట్టావు? ఒకసారి వెనక్కు తిరగి చూసుకో! భగవంతుడు నీకు ఆయుర్దాయాన్ని ఇచ్చాడు. అదే సంపద. ఆ 21,600 సార్లు హంస కొట్టుకోవడం అనే శక్తిని ఇచ్చాడు. ఈ హంస శక్తిని ఇప్పటి వరకూ దేనికి వుపయోగించావు?

వెలలేని, విలువలేని వాటిని సంపాదించడానికి వుపయోగించి, ఇది తరిగిపోయి, జరిగిపోయి, విడిచిపెట్టేసే సమయం వచ్చేటప్పటికి, అయ్యో, కుయ్యోమర్రో అంటే ప్రయోజనం ఏముంది? కాబట్టి 'నేను తనువు కాదు' అని నిర్ణయించాలి అంటే, నువ్వు హంసని గుర్తించాలి. ఆ ప్రాణశక్తిని గుర్తించాలి. నిరంతరాయంగా దృష్టిని, ప్రాణశక్తిని అదీ ఆనాపానసతి, అదీ పిరమిడ్ ధ్యానం అన్నీ అవే. ఆ ప్రాణశక్తిని గుర్తించే ప్రయత్నం చేస్తే, ఏం పోయింది నీకు? 'నేను శరీరం కాదు' అని స్థిర పడింది. నేను శరీరం కాదు. నేను ఎవరిని? నేను ప్రాణాన్ని. ప్రాణమే దైవం. ఎందుకని? ఆ ప్రాణమే, ఆ ప్రాణం పోతే అంతా పోయినట్టే. శరీరమే నేను అయినప్పుడు ప్రాణమే దైవం. ఇంకెక్కడో లేదు దైవం. హరిహరాదులు కానీ, ఎవ్వరైనా పెట్టుకో, ముప్పై మూడు కోట్ల దేవతలు ఆ ప్రాణంలోనే వున్నారు. ఎందుకని? నువ్వు శరీరంగానే వున్నావు కాబట్టి. నేను శరీరం కాదయ్యా అన్నావనుకో, నేను ప్రాణాన్ని అనే స్థితికి రావాలన్నమాట. నేను శరీరం కాదు, నేను

ప్రాణాన్ని. ఎందుకని? తరిగిపోతోంది ఏది శరీరమా? ప్రాణమా? ప్రాణం తరిగిపోతోంది. ఆయుష్షు తగ్గిపోతోందన్నమాట. నేను ప్రాణాన్ని అంటే అప్పుడు ఏమైంది? మనసు దైవం అయ్యింది. నేను ప్రాణమును అంటే, మనసు దైవం అయ్యింది. నేను మనస్సు అనే స్థితికి వచ్చావు ఇప్పుడు. ఈ హంసని గుర్తించడం ద్వారా అది యాంత్రికంగా కొట్టుకొంటోంది తప్ప దాంట్లో ఏముంది? వేరే ఏమైనా వుందా? పైకి కిందకి, పైకి కిందకి, పైకి కిందకి కొట్టుకొంటోంది అంతే! పంచప్రాణాల రూపంలో వున్నది. ఏమిటి ఆ పంచ ప్రాణాలు? ప్రాణ, అపాన, సమాన, వ్యాన, ఉదాన అంతే కదండీ! ఆ అయిదు వాయువుల రూపంలో నీకు శరీరంలో వున్న అన్ని ఇంద్రియాలు పని చేసేట్టుగా చేస్తోంది. మనం తీసుకునే గాలి, ఆ ఐదు భాగాలుగా విడిపోయి, ఐదు స్థానాలలో నిలిచి వుండి, ఆ ఐదు స్థానాలలో నిలిచి వుండి, అన్ని ఇంద్రియాలన్నీ పనిచేయడానికి అదే కారణం. ఒక్కసారి ఆ ప్రాణ వాయువు తీసుకోవడం ఆపు. ఏవీ, నీ ఇంద్రియాలను పనిచేయమను. నీ గొప్పతనమంతా ఎవరికి అప్పజెప్పావు? ఆహా! నా కళ్ళు గొప్పవి, ఆహా! నా చెవులు గొప్పవి. ఆహా! నా చేతులు గొప్పవి. అంటున్నావా లేదా? వెయ్యి కాయలైనా సరే నేను పెట్టేస్తానండీ మాగాయి. ఎలా పెట్టావు ఏమిటి? ఆ ప్రాణం పనిచేయకుండా పెట్టావా? నీ గొప్పతనాలన్నీ, నీ ఇంద్రియాల గొప్పంతా ఎక్కడినుంచి వచ్చింది? దేని మీద ఆధారపడి వచ్చింది? ఆ ప్రాణం మీద ఆధారపడి వచ్చిందయ్యా! ఆ ప్రాణం ఎలా పనిచేస్తుందో తెలిసిందా? అది తెలియలేదు కదా! ప్రాణం అంటే ఎక్కడున్నది? అపానం అంటే ఎక్కడున్నది? వ్యానం అంటే ఎక్కడున్నది? సమానం అంటే ఎక్కడున్నది? ఉదానం అంటే ఎక్కడున్నది? ఏ స్థానములలో ఆ ఐదు వాయువులు పనిచేస్తే, ఈ ఇంద్రియాలు పనిచేస్తున్నాయో గుర్తించు. పంచకోశ విచారణ అందుకే చేయమంటారండి. తప్పనిసరిగా ఈ అన్నమయ్యకోశం పనిచెయ్యాలి అంటే లోపల ఆ ప్రాణమయ కోశం పనిచేస్తేనే. ఆ ప్రాణమయకోశం అనే సూక్ష్మం పని చేయకపోతే ఈ స్థూలం ఎందుకూ పనికి రాదు. కాబట్టి దీనికంటే స్థూలమైనటువంటి దాంట్లో నుంచి సూక్ష్మమైనదానిని గుర్తించు. ఆ సూక్ష్మమైనదానికంటే మరింత సూక్ష్మమైనదానిని గుర్తించు. దానికంటే సూక్ష్మమైనది, దానికంటే సూక్ష్మమైనది, దానికంటే సూక్ష్మమైనది అట్లా గుర్తిస్తూ పోతే, ఏమైందట ఇప్పుడు? అప్పుడు అన్నమయ్య కోశము నేను కాదు.

ప్రాణమయకోశము నేను కాదు. మనోమయకోశము నేను కాదు. విజ్ఞానమయకోశము నేను కాదు. ఆనందమయకోశము నేను కాదు. నేను ఆత్మ స్వరూపుడను. అని చిట్టచివరికి తేలేటటువంటి నిర్ణయం అన్నమాట అది. కాబట్టి శరీరం నేను కాదు. ప్రాణం నేను కాదు. మనసు నేను కాదు. బుద్ధి నేను కాదు. నేను ఆత్మ స్వరూపుడను. ఇలాగ ప్రతినిత్యము మీరు విషయాలు వచ్చినప్పుడల్లా, ఆ ఆలోచన వచ్చినప్పుడల్లా, అనుభవం కలుగుతున్నప్పుడల్లా, ఏ పని ప్రారంభించబోయినా సరే, నేను శరీరం కాదు. నేను ప్రాణం కాదు. నేను మనస్సును కాదు. నేను బుద్ధిని కాదు. నేను ఆత్మ స్వరూపుడను. నేను ఇందులో స్థిరమయ్యే, ఈ పనిని చేశాను అంతే. ఇందులో స్థిరం కాలేదు, అప్పుడు ఏవో జరుగుతూ వుంటాయి. ఎదుటివాడు దుఃఖిస్తూ వుంటాడు, నువ్వు దఃఖిస్తూ వుంటావు, వాడి దుఃఖం చూసి నువ్వు దుఃఖపడుతూ వుంటావు, వాడి సుఖం చూసి నువ్వు సుఖపడుతూ వుంటావు, నీ సుఖం చూసి వాడు సుఖపడుతూ వుంటాడు. ఇలా అన్నీ జరిగిపోతూ వుంటాయి. ఇవన్నీ కూడా. ఇవన్నీ ఏ పరిధిలో జరుగతూ వున్నాయి? శరీరం పరిధిలో జరుగుతూ వున్నాయి. ఒక నిర్ణయం చేశాము, ఒక నిర్ణయం చేస్తే ఏమిటి? ఎవరికో ఒకరికి దుఃఖం కలుగవచ్చు దానిలో ఏముంది? దుఃఖం కలుగుతూ వుందంటే అజ్ఞానం వుంది వెనుకాల. అది ఏ రకమైన దుఃఖం అయినా సరే. ఏ నిర్ణయమైనా కానీ నువ్వు ఎందుకు ఆనందించలేకపోతున్నావు? (మనవల్ల వాళ్ళు బాధపడుతారేమో అని) మళ్ళా మొదటికి వచ్చావు అదే. ఆత్మ స్వరూపజ్ఞానం కోసం నువ్వు దేనినైనా త్యజించమంటున్నాడు. ఎందుకని? నువ్వు జన్మించిందే దానికోసమయ్యా! అసలుది పోయింది. అసలుది పోయి వాడు దుఃఖిస్తున్నాడని దీనిని వదిలేస్తివి. ఇప్పుడేమైంది? ప్రయోజన శూన్యం అయిపోలేదా? జన్మ వృధా అయిపోవడం లేదా? జన్మ వృధా అయిపోయినాక ఏం ప్రయోజనం? (మన వల్ల అవతల వాడు బాధ పడుతున్నాడేమో?) ఆ ధర్మాన్ని ఎందుకు పోషించమన్నారు? జ్ఞానం కలగడం కోసమని ధర్మాన్ని పోషించమన్నారండి. అదే నిన్న చెప్పింది. ధర్మాన్ని పాటించాలి. ఏ నిమిత్తమై? మోక్షం దృష్ట్యా పాటించాలి ధర్మాన్ని. ఉదాహరణ చెబుతానండి. ఇప్పుడు నేను మనం 6 గంటలకు లేచాం, మనపనిలో మనం వచ్చేశాము. మన పనిలోకి మనం వచ్చేస్తే ఏమైంది? ఈ గంటన్నర వీరి యొక్క సేవలు మనకు అందడం లేదే అని దుఃఖించేవారు లేరా?

వుంటారు కదా ! ఇప్పుడేం చెయ్యాలట అయితే? ఈ గంటన్నర ఆపేసి వారి సేవలు చేస్తున్నావే అనుకోండి, మోక్షం ఎప్పటికైనా వస్తుందా? ధర్మమే. గృహిణి ధర్మమే. నేను కాదనడం లేదు. 6 to 7.30 ఉదయం పూట ఏదో ఇంతకు ముందునుంచీ ఏ పనీ లేదు కాబట్టి ఏ గోల లేదు కాబట్టి ఏదో ఇంట్లో ఆ చీపురితో జిమ్మటమో, ఈ చీపురితో అటు జిమ్మటమో ఏదో చేస్తూ వుంటావు. ఇప్పుడు నువ్వు ఆ పని చేయడం లేదండి. ఏమన్నా బ్రహ్మాండం బ్రద్దలైపోయిందా? ఏమీ అవ్వలేదుగా. (మనం ఎప్పుడూ పక్కవాడి గురించి) అదేగా నేను చెప్తోంది? చిన్న ధర్మాన్ని ఆశ్రయించి, పెద్ద లక్ష్యాన్ని వదిలేస్తివే? జీవితం ఎందుకోసం వచ్చిందో, జన్మ ఎందుకు జన్మించావో ఆ లక్ష్యం పోయి, ఏం మిగిల్చుకున్నావు? గుమ్మడికాయ పోయింది, ఆవ గింజ మిగిలింది. అర్థమైందా అండి?

సేవే, ఎప్పుడు సేవ అయ్యింది? నీకు జ్ఞానం లభిస్తే సేవ అయ్యిందండి. ఎప్పుడైనా గుర్తు పెట్టుకోండి. ఈ పని చేయడం ద్వారా నీకు జ్ఞానం లభిస్తే, అది సేవ అవుతుంది. నేను అనే కర్తను త్యజించాలి. ఇప్పుడు నేను అనే కర్త బలపడ్డాడా? త్యజించాడా? ఏమైందప్పుడు? జ్ఞానం ఎలా అయ్యింది మరి? ఆ ధర్మాన్ని ఆచరిస్తే, నేను అనే కర్త పోవాలి. ఎందుకని? ధర్మమే పరమాత్మ స్వరూపం. నేను పరమాత్మ ఒక్కటే. ఆచరించేవాడను నేను ఎక్కడ వున్నాను? పరమాత్మ పద్ధతిలో ఆచరిస్తున్నాను. కాబట్టి చేసేది ఎవరయ్యా? పరమాత్మే. చేయించేది ఎవరయ్యా? పరమాత్మే. అనుభవించేది ఎవరయ్యా? అంతా పరమాత్మే. నేను ఏమీ చెయ్యని వాడను. ఆ భావంలో వుండి నువ్వు చేస్తే సేవ అవుతుంది. కానీ మీరు మీ ఇళ్ళల్లో చేసింది సేవ అవుతుందా? అవ్వదు కదా! ఎందుకని? నువ్వు చేశావని వాడు గుర్తించబట్టే, వాడు గుర్తించకపోతే నువ్వు దుఃఖించబట్టే. (అంతేకదా మరి) చూడండి. అర్థమైందా? ఇలాగ. అందుకని మీరు రోజువారి నిత్య జీవితంలో ఎప్పుడైనా సరే వీటిని గుర్తు పెట్టుకోవాలి. ధర్మ సంకటం వచ్చినప్పుడల్లా వెంటనే ఈ ప్రశ్న వేసుకోవాలి. ఈ ధర్మాన్ని ఆచరించడం ద్వారా నాకు ఆత్మజ్ఞానం కలుగుతోందా? నేను సాక్షిగా వుండగలుగుతున్నానా? లేకపోతే జీవుడిగా కర్తగా అందులోకి దూరిపోతున్నానా? విషయంలో దూరిపోతున్నానా? ఉదాహరణ చెప్తానండి. ఇప్పుడు నిన్నటి దాకా మీరు అక్కడికి వచ్చారు. అర్థమైందా అండి. అక్కడినుంచి ఇప్పుడు ఇక్కడికి మార్చాము. మారిస్తే ఇంట్లో వారికి దుఃఖం వుండదా?

వుండచ్చు దానిది ఏముంది? ఆవెడ దుఃఖపడుతారు కదా అని చెప్పడం మానేస్తామా? వినడం మానేస్తారా? మీరు కాకపోతే మరొకరు. నేను కాకపోతే మరొకడు. అంతే కదండి. చెప్పేవాళ్ళు దేశంలో, ప్రపంచంలో బోల్డుమంది వున్నారు. వినేవాళ్ళు అలాగే వున్నారు. అందుకని ఈ ప్రక్రియ బోధించడం, వినడం అనే ప్రక్రియ గురుశిష్య సాంప్రదాయం నీతో నాతో మొదలు కాలేదు. నీతో నాతో పోదు. అంతేనా కాదా? 12 ఏళ్ళ నుంచీ చెబుతూనే వున్నాము. ఎక్కడో ఒకచోట చెబుతూనే వున్నాము. ఎక్కడైనా ఒక్కటే. ఏ చెట్టుక్రిందైనా చెప్పేస్తాము. ఎక్కడైనా చెప్పేస్తాము. ఎందుకని? దానికి భూమండలం అంతా సమానమే దానికి. ఇక్కడ చెప్పడం, అక్కడ చెప్పడం అనే భేదం మాకేమీ లేదు. మీకు ఎక్కడ అనువుగా వుంటే అక్కడే చెప్తాం పో. ఇంకా అక్కడైనా ఏదో ఇల్లు కట్టారు కాబట్టి, అక్కడ నేను వుంటున్నాను కాబట్టి ఇక్కడకి రండి అంటున్నాము. అక్కడ ఆ విధానము ఏమీ లేదు ఎప్పుడూ కూడా. నీకు ఎక్కడ అనువుగా అనిపిస్తే నేను అక్కడికే వచ్చి చెప్తాను. ఎందువల్ల? నీకు అనువుగా వున్న చోట అయితే నువ్వు స్థిరంగా వుంటావు. నాకు అనువుగా వున్నచోట అయితే నువ్వు స్థిరంగా వుండవు. నువ్వు మనసేమో అక్కడ వుంటుంది. మనిషేమో ఇక్కడ వుంటావు. (నేను మటుకు స్థిరంగా వుండాలి). ఎందుకని? చెప్పేవాడు ఎప్పుడూ స్థిరంగానే వుంటాడు. వాడు ఆ స్థితికి వస్తేనే చెప్తాడు. లేకపోతే చెప్పలేడు కదా! అర్థమైందా? అందుకని మీరు ఎక్కడ అయితే స్థిరంగా వుంటారో, అందుకని ఆ విధానం మీకే వదిలేస్తాము. ఎక్కడ మీరు చేస్తే, ఎక్కడ మీరు వుంటే, మీరు ఏ స్థితిలో వుంటే, మీరు ఆ రెండు గంటల సేపు, స్థిరమైనటువంటి ఏకాగ్రతని నిలుపగలుగుతారు? Diversion వుండకూడదు అండీ మధ్యలో. మధ్యలో అది వచ్చీ, ఇది వచ్చీ, అది ఆపీ, ఇది ఆపీ. ఇది ఆపండి. చెప్పేవాడిని ఆపమనీ, వినేవాడిని ఆపమనీ రకరకాల పనుల మధ్యలో వస్తే ఏమైపోయింది అప్పుడు? మళ్ళా మామూలే. మిమ్మల్ని పైకి ఎత్తుకి ఎక్కించడం కష్టం కదా! అవునా కాదా?

ఇప్పుడు మీ అందరి మనసుని, హృదయాన్ని ఏం చేస్తున్నాము? ఈ రెండు గంటల సేపు? మీరు ఇప్పటి వరకూ ఎలా జీవించారో, ఆ జీవించిన జీవితానికి వ్యతిరేకం చేస్తున్నాము. ఉల్టా. తిప్పేస్తున్నాము అంతా కూడా. అది పనికి రాదు. అది అట్లా పనికి రాదు. ఇట్లా మార్చుకోవాలి అని చెబుతున్నాము. ఏమౌతుంది మీ కుటుంబ సభ్యుల

మధ్యలో చెప్తాం అనుకోండి ఏమౌతుంది? తగాదా రాదు? చాలా తగాదాలు వస్తాయండి. అని మీకు తెలియాలి. తెలియజెప్పడం వరికే నా బాధ్యత. దాన్ని ఎట్లా ఆచరించాలో, మీ తెలివిని ఉపయోగించి ఆచరించాలి. అందుకని అందుకనే చెప్పేదండి. 'వివిక్త వాసము' అని దీనికి అంటారండి. అంటే అర్థం ఏమిటి? (జనం) ప్రజల మధ్యలో ఎప్పుడూ చెప్పకూడదు నాయనా. కానీ ఇవాళ ఈ నియమాన్ని ఉల్లంఘించి, మైకులో కొన్ని లక్షల మందికి చెప్పేస్తున్నాము. ఎందుకనిట? అట్టా చెబితే అది రాదది. ఎందుకనిట? వివక్త వాసము. విడిగా పెట్టాలి వాళ్ళను. ఎట్లా అయితే (పిల్లాడిని) విద్యార్థిని స్కూలుకి పంపించినపుడు, వాడిని తీసుకెళ్ళి ఒక స్కూలు అని separate గా పెట్టావా లేదా? ఎందుకు పెట్టావు? మీ ఇంట్లోనే చెప్పవచ్చుగా? ఇంట్లోనే చదువుకున్న వాళ్ళు B.Sc, B.Ed లు బోల్డు మంది వున్నారుగా, చెప్పవచ్చుగా. పనికి రాదు నాయనా అలాగ. వాడికి విద్య నేర్చుకోవాలి అంటే కచ్చితంగా వివిక్త వాసము వుండాల్సిందే. వుంటేనే వాడు బాగుపడుతాడు. లేకపోతే వాడికి విద్య రాదు. ఎందుకనిట? చెప్పేటప్పుడు గురువు ఎప్పుడూ కూడా, పరమాత్మను దృష్టిలో పెట్టుకుని చెప్తాడు ఎప్పుడూ కూడా. తాను ఆచరించేది పరమాత్మను దృష్టిలో పెట్టుకుని, అనుభవ జ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకుని, స్పష్టంగా చెప్పేస్తాడు. ఆ చెప్పేటప్పుడు ఎన్నింటినైనా నిరసించవలసి రావచ్చును. నిరసించి కచ్చితంగా, ఖండితంగా చెప్తాడు. ఆ నిరసించడం వల్ల నీ చుట్టుపక్కల వున్నవాళ్ళకు గాని, నీ మీద అభిమానము వున్నవాళ్ళకు గానీ, నా మీద అభిమానము వున్న వాళ్ళకు గాని దుఃఖం కలుగవచ్చు. అర్థమైందా? ఆ దుఃఖం వల్ల వాడు ఏం చేస్తాడు? ఊరుకుంటాడా? ఊరుకోడు, వచ్చి అడ్డంగా నిలబడుతాడు. నువ్వేం చెబుతున్నావు అంటాడు. అర్థమైందా అండీ! కాబట్టి గురుశిష్య సాంప్రదాయంలో మూడో వ్యక్తికి తావు లేదు. పరమాత్మకు కూడా తావు లేదు. అక్కడ ఎవరినైనా సరే, గురువు ఇది తప్పు వదల వలసిందే అంటే ఖండితంగా చెప్పవలసిందే. ఇది వదలవలసిందే. అంతేగాని దీనిని మిగిల్చుకో నాయనా! అని చెప్పడానికి వీలుకాదన్నమాట. అలా చెబితే అది ఆత్మజ్ఞానం అవ్వదన్నమాట. ఆత్మజ్ఞానం అంటే దాని మీదే నిలబెట్టి మాట్లాడుతాడు అంతవరకే. ఎందుకని? అది లభిస్తేనే నీ జన్మ సార్థకమౌతుంది. లేకపోతే సార్థకం కాదు. నువ్వు ఎన్నన్నా చేసుకో, నువ్వు చెయ్యి,

మానేయి. నాకు అనవసరం. నువ్వు ఏ దృష్టితో చేయాలి? 'నేను ఆత్మ స్వరూపుడను' అనే భావంతోటే చేయాలి. లేకపోతే కటకటా మోసమాయెను – అనే దుఃఖం ఎప్పటికీ వుండిపోతుంది. ఆ చివరి కాలంలో మరణ వేదన అంతా కూడా ఈ జీవ చూడగానే నండి. గుర్తు పెట్టుకోండి. మరణకాలంలో అందరికి మరణ వేదన లభించే, దొరికే అనుభవం వస్తుందే ఆ మరణ వేదన అంతా కూడా ఈ చివరి జీవ చూడగనే.

తర్వాత 'లేని పోనీ దుఃఖ జాలములోన బడి చెడిపోవుటెందుకు? మానవమానంబులని నీ మమత విడలేవూ జీవా మేలుకొనవే' – లేని పోనీ – దుఃఖజాలము గూర్చి మాట్లాడుతున్నాడు. మనం అందరం ఎవరి గురించి, పది మంది కలిసిన చోటల్లా ఏం చెప్పుకుంటారండీ? (కష్టం సుఖం) లేని పోని దుఃఖం, దుఃఖజాలమట. ఎందుకని జాలము అన్నాడు? జాలం అంటే, సమూహము. ఒకటి చెబితే ఊరుకొంటావా? ఒకటి చెబితే పది చెబుతావు మళ్ళా. ఆ పదికి మళ్ళా వీడొక పది చెబుతాడు. ఈ పదికి మళ్ళా పది. ఏమైపోయింది ఇప్పుడు? ఎక్కడన్నా దానికి అంశం వుందా? ఫల్‌స్టాప్ వుందా? పుట్టింది మొదలు చెబుతూనే వుంటివి. ఎన్ని వ్రతాల్లో ఎంతమంది కలిసినా, అసలు వ్రతాలు, యజ్ఞాలు, యాగాలు, హోమాలు ఎందుకు పెట్టారు? ఎవరో ఒకరి ద్వారా నువ్వు ఆత్మజ్ఞానం నేర్చుకోవడం కోసమని పెడితే, ఇవన్నీ చేసి ఏం ముచ్చట్లు చెప్పావు? ఈ పది మందీ కలిసి, వీడి దుఃఖం వాడికి, వాడి దుఃఖం వీడికి. ఇప్పుడు జ్ఞానం వచ్చిందా? దుఃఖం వచ్చిందా? (దుఃఖమే) అర్థమైందా అండీ!

దుఃఖం తగ్గిపోవాలి. దుఃఖం లేకుండా పోవాలి. అవన్నీ ఆచరిస్తే. ఆ సత్కర్మలు ఆచరిస్తే, దుఃఖం లేకుండా పోవాలి. కానీ ఏం జరిగింది? (దుఃఖం పెరిగిపోయింది) ఎందువల్ల? దుఃఖ జాలము – జాలమంటే రెండో అర్థం వుందండి. వల. అర్థమైందా అండీ? అది ఎటువంటిదట? వల. ఆ దుఃఖజాలము ఎంతగా సమూహమైపోయిందంటే, ఆ వల అది అంతగా బిగుసుకు పోయిందన్నమాట ఇప్పుడు. ఎందుకని? ఇప్పుడు అందులోనుంచి బయటకు రాలేక, పక్షి ఎట్లా అయితే వలలో చిక్కుకుంటే తన్నుకుంటున్నావో, అలా దుఃఖం అనే వలలో తన్నుకుంటున్నావు. ఆ సమూహములో తన్నుకుంటున్నావు. ఎటువంటిదంట అది? లేనిది, పోనిది. దానికి

రెండు లక్షణాలు వున్నాయటండి. ఏమిటట అది? లేనిది. అసలు నిజంగా దుఃఖం వుందా? లేదయ్యా. మరి నువ్వు అనుభవిస్తున్నావు కదా! పోవడం లేదు. విచారణ చేసి చూస్తేనేమో, ఆ దుఃఖం లేనిది. కానీ పోతుందా? పోవడం లేదు. అర్థమైందా? అనుభవంలో వుంది కదా! లేనిదని ఎట్లా ఒప్పుకుంటావు? ఇప్పుడు గురువు ఏమంటున్నాడు? శాస్త్రం ఏమంటుంది? ఈ దుఃఖం అనేది లేనిది నాయనా! కలలోది లాంటిది. అది అసలు లేనే లేదు. నువ్వు ఎప్పుడూ ఆత్మస్వరూపుడివే. ఎప్పుడూ ఆనంద స్వరూపుడివే. నీకు అసలు దుఃఖమే లేదయ్యా! నువ్వు సాక్షి స్వరూపుడివి. నువ్వు జ్ఞాన స్వరూపుడివి. నువ్వు అనంతుడివి, నువ్వు అప్రమేయుడివి. నువ్వు సచ్చిదానంద స్వరూపుడివి. నీకు ఏ దుఃఖం లేదు నాయనా! ఆ పరమాత్మతో సమామైనటువంటి వాడివి. నీకు అసలు దుఃఖమనే ఛాయే లేదు నీకు. సుఖంలో కొంచెం ఎక్కువ, కొంచెం తక్కువ వుంటే వుండవచ్చేమో గానీ అసలు దుఃఖమనేదే లేదు నీకు. ఈ సృష్టిలో. నీవు కేవల జ్ఞాన స్వరూపుడివి. నీకు ఏ భేదభావాలు లేవు. నీవు సర్వసముడవు. సాక్షివి. అని చెప్పి చెబుతూ వుంటే, వీడు ఏమనుకుంటున్నాడు? ఏమిటి ఈయన ఇట్లా చెబుతాడు? పొద్దున లేచింది మొదలు రాత్రి దాకా దుఃఖమే కదా! ప్రతి పనిలోనూ దుఃఖమే కదా! ఇది చెయ్యకపోతే దుఃఖం. అది చేస్తే దుఃఖం. ప్రతి పనిలో ఏమిటండీ? చేస్తే ఒక దుఃఖం. చేయలేదంటావా? మరొక దుఃఖం. మరి ఏమిటట ఇప్పుడు నీ సుఖం? ఎక్కడ వుంది నీ సుఖం? వుందా? ఏది చూపెట్టు? ఎందుకని? చెయ్యలేదంటావా? చెయ్యలేదని వాడంటాడు. చేస్తివా నీకు దుఃఖం వస్తుంది. అర్థమైందా అండీ! కాబట్టి చెయ్యకపోతే వాడు మాటలు అన్నాడనీ దుఃఖం వస్తోంది. చేస్తేనేమో చేసిన తరువాత ఫలితాన్ని కూడా అంటాడు కదా! ఏదో ఒకటి? అనకుండా వుంటాడా? అంటే ఏమైంది? మళ్ళా దుఃఖం వచ్చింది. ఎందువల్ల అట ఇప్పుడు? అంటే, మానావమానములతో కూడుకుని వుందట అది. అదీ వచ్చిన చిక్కు అది. ఆ దుఃఖజాలమంతా ఎందువల్ల? ఎందులో ఇరుక్కున్నావయ్యా అంటే? ఇప్పుడు పక్షులను పట్టే వేటగాడు ఏం చేశాడట? వల పన్నాడు. వల కోసం పక్షి క్రిందకు దిగి వస్తుందా? రాదు. దాని లోపల గింజలు వున్నాయి. ఆ గింజలకోసం దిగింది. వలలో చిక్కుకుంది. అట్లాగే నీవు ఏం చేశావట? శరీరం అనేటటువంటి వలలో దిగావు. అర్థమైందా అండీ! ఎందుకు దిగావు?

మానావమానములు అనే గింజలకోసం దిగావు. ప్రతిచోట నీ అహం సంతృప్తి చెందుతూ వుందన్నమాట. అక్కడ. ఎక్కడెక్కడైతే నీ అహంకారం సంతృప్తి చెందడం లేదో, అక్కడంతా దుఃఖం వస్తోంది. వాడు నన్ను గుర్తించలేదు. వాడు నా ప్రత్యేకతను గుర్తించ లేదు. వాడు నన్ను ఒప్పుకోలేదు. వాడు నా మాట వినలేదు. వాడు నా మాట వినలేదు. ఏమిటి ఇందులో వున్నది రహస్యం? అంటే, మానావమానాలు వున్నాయి నాయనా అందులో. నీ మాట వింటే, పొంగిపోతున్నావు. మాట వినకపోతే కుంగి పోతున్నావు. అర్థమైందా? ఈ మానావమానాలు అనే గింజలు వున్నాయి ఆ వలలో. అందువల్ల ఏమైందట అవి లేనివి, పోనివి. మానావమానాలు వున్నాయా ఎక్కడైనా చూపెట్టు. అవి లేనివి కదా! పోతున్నదా మరి? పోవడం లేదయ్యా. అంటే ఇప్పుడు ఏం చెయ్యాలట? "మానావమానములను పోగొట్టుకోవాలి, అవి లేనివి అనే భావంతో చూచి".

దేని దృష్ట్యా చూస్తే అవి లేవు? నేను ఆత్మస్వరూపుడిని అనే భావంతో చూస్తే అవి లేకుండా పోతాయి. నేను ఫలానా అని ఏ ఉనికితో చూచినా కూడా, అవి పోవు నాయనా! అర్థమైందా అండీ? ఏ ఉనికితో చూసినా సరే! నీవు జీవితం మొత్తం మీద జీవించే, అన్ని పాత్రలు అహంతో కూడుకున్నవే. అంటే అర్థం ఏమిటి? నేను ఫలానా వారి భార్యనండీ? అహం వుంది అందులో. లేదా? నీ ఉనికిని చాటుకుంటున్నావు. అర్థమైందా అండీ! మరి ఎందుకు చాటుతున్నావు? నీవు ఎవరివి? ఫలానా వారి భార్య అనేది దేనిది? శరీరంలోదా? లేకపోతే ప్రాణంలోదా? మనసులోదా? బుద్ధిలోదా? ప్రాణ మనో బుద్ధులకి ఎక్కడైనా భార్యాభర్తలు వున్నాయా? ప్రాణ మనో బుద్ధులకే లేనప్పుడు, దాని సాక్షినైన నాకు ఎక్కడుంది? లేవు కదా! నేను అంతరాత్మను కదా! ఆ ప్రాణ మనో బుద్ధులకు సాక్షిని కదా! ఈ సాక్షికి భార్యాభర్తలు వున్నాయా? లేవు కదా! తల్లిదండ్రులు వుందా? లేదు కదా! బంధుగణం వుందా? లేదు కదా! కూతుళ్ళు, కొడుకులు మనమరాళ్ళు వుందా? లేదు కదా! నీ పాత్రలు అన్నీ ఇవేగా. పుట్టింది మొదలు పోయే దాకా, ఈ పాత్రలే సత్యమనుకుంటివి కదా! పాత్రలు సత్యము ఎలా అయినాయి? పాత్రలు సత్యము అవ్వవు కదా! ఆ పాత్రల ద్వారా నీ అంతరాత్మయొక్క సాక్షిని కదా గుర్తెరగమని చెబుతోంది. కానీ, నీవేమి గుర్తెరిగావు? నీ అంతరాత్మ సాక్షిని గుర్తెరగవయ్యా అంటే,

పాత్రలను గుర్తెరిగి, పాత్రే సత్యమంటివి. గిన్నె ఎట్లా సత్యమైంది? గిన్నె సత్యం కాదు కదా! ఎందువల్ల అటా? అలా నీవు గుర్తించడం వల్ల, నీవు రోజూ ఆ ప్రత్యేకత, అహం, ఆ సుఖం కలిగితేనేమో, ఆహా! ఆనందం. ఏమమ్మమ్మా! అంటూ మీ పిల్లలు వచ్చి కౌగలించుకున్నారనుకోండి. ఓ మహదానందం అబ్బా! నిన్ను పట్టించుకోకుండా అట్టాగే వాడెమ్మట వాడు పోయాడనుకో, ఓరినీ వీడు ఇటే పోతూ కనీసం నన్ను పట్టించుకోలేదు. అర్థమైందా? చూడండి. ఏమన్నా అర్థముందా? ఒక్కసారి ఆలోచించుకోండి. మనలో కలిగే భావములు అండీ ఇవన్నీ కూడా. ఎంత దుర్భావములు. ఔనా కాదా? ఆత్మజ్ఞానం దృష్ట్యా చూస్తే, ఎంతటి దుర్భావములు ఇవన్నీ? ఎప్పుడో వదులకోవలసినవి ఇవన్నీ కూడాను. ఏనాడో వదులకున్నట్లయితే, ఎప్పుడో జ్ఞానం వచ్చేసేది. ఈ వదులుకోక పోవడం చేత, పోనీ అదీ అందుకే చెప్పేదండీ. ఇవి పోకుండా పట్టుకున్నావు. అర్థమైందా అండీ? ఈ మానావమానములను అందుకే దేంతో పోలుస్తాడయ్యా అంటే, గబ్బిలం వంటివి. తల్లకిందులుగా కనీసం నిలువుగా కూడా కాదు. తల్ల కిందులుగా. ఆ గబ్బిలం ఎప్పుడూ తల్లకిందులుగానే వుంటుందండి. మనం కూడా అంతే. మనం మానవుడై ఎట్లా వుండాలంట? శిరస్సు పైకి పాదములు కిందకి కానీ ఈ మానావమానముల ప్రభావం చేత, ఏమైపోయావట? తల కిందకి కాళ్ళు పైకి. ఎందువల్ల? జ్ఞానం పోయి అజ్ఞానం వచ్చింది. ఆనందం పోయి దుఃఖం వచ్చింది. అర్థమైందా అండీ! నేను ఆత్మ స్వరూపుడు అని తోచే అవకాశమే లేకుండా పోయింది. పూర్తిగా కప్పివేసినాయి అవి. ఎంతగా కప్పివేసినాయయ్యా అంటే ఈ మానావమానములు, ఇక ఎప్పటికీ జ్ఞాన సూర్యుడు తోచే అవకాశం లేనంత గాఢాంధకారములో కప్పివేసినాయి. గబ్బిలం పగలు ఏం చేస్తుంది? పగలు బయట కనపడుతుందా? కనపడదు కదా! ఎక్కడికి పోతుంది? ఎక్కడ చీకటిగావుందో అక్కడికి చేరుతుంది. ఎందుకనిట? జ్ఞాన సూర్యుడు కనపడితే దానికి కళ్ళు కనపడవు. జ్ఞాన సూర్యోదయం కనుక జరిగితే గబ్బిలానికి కళ్ళు కనపడవు. అట్లాగే నీకు ఆత్మజ్ఞానం వుదయిస్తే, మానావమానములు లేనే లేవు. అవకాశమే లేదు అసలు దానికి. అయ్యో! ఇది నేనే, ఇట్లా చేయకూడదే. ఏమిటది నువ్వు అర్థం వుందా? నీవు ఎవరివి మొట్టమొదట? అది ఆలోచించు. నీవు పరమాత్మ స్వరూపుడవు. అథవా కాదు. ఆత్మ స్వరూపుడవు. ఈ

రెండూ వదిలేసి ఎక్కడికి వచ్చేశావు? నేను జీవుడు. నేను శరీరం. నేను ఫలానా ఇల్లు. నేను ఫలానా ఇంట్లో ఫలానా గది. ఫలానా గదిలో ఫలానా మంచం. చివరకి ఎక్కడి దాకా వచ్చేశావు? (జీవుడని కూడా తెలియదు, శరీరమనే భ్రాంతి) ఇంకా కూడా చెబుతా వినండి.

వృద్ధాప్యం వచ్చేసిందండి. మంచంలో పడ్డావండి. నీ ప్రపంచం ఏమైపోయింది అప్పుడు? మంచమే నీ ప్రపంచము. చూశా నేను అదికూడా చూశా. అట్లా కూడా చూశా. ఎంతో మందిని చూశా. ఆ మంచం తగిలితే చాలు. ఎరా ఎందుకు తగిలావు నా మంచాన్ని. గొడవపడే వృద్ధులు లేరా? ఎందుకని? మంచమే అతని ప్రపంచం. మిగిలిన ప్రపంచం అంతా అయిపోయింది. ఇంద్రియాల బలం క్షీణించిపోయింది. వెనక్కు తీసేసుకుంది. వృద్ధాప్యం వచ్చేసింది. చివరకు ఎంతకు వచ్చేసింది? మంచమే నీ ప్రపంచం. దుఃఖపడిపోతూ వుంటావు. అయినా సరే మార్చుకోలేవు. మీ కళ్ళ ముందు మీ పెద్దవాళ్ళను అందరినీ చూడండి. గతించినటువంటి పెద్దవాళ్ళను చూసి ఆహా! ఏమి జ్ఞానమును బోధించారు వీళ్ళు. వాళ్ళ చివరికాలంలో వాళ్ళు మనకి జ్ఞానమే బోధించి వెళ్తున్నారు. నాయనా! నావలె నీవు వుండమాకు. మానావమానములతోటి, పరిమితమైన భావంతోటి, దుఃఖపడిపోతూ ఎందుకు వెళ్తావు? ఆత్మజ్ఞానంతో సుఖంగా వెళ్ళిపో. సుఖంగా వెళ్ళాలి, సుఖంగా వెళ్ళాలి అని అందరూ అంటూ వుంటారండి. దేనిని ఆశ్రయిస్తే సుఖంగా ఈ శరీరాన్ని వదిలిపెట్టి వెళ్ళగలవో, ఆ పని చేయకుండా సుఖంగా వెళ్ళాలనే ఆశ మాత్రం వుండడం వల్ల ఏమి ప్రయోజనం వుంది? పేరాశ అది. ఎందుకని? జీవితకాలమంతా జ్ఞాన సముపార్జనకు ఏ ప్రయత్నమూ చేయలేదు. ఏ విచారణా చేయలేదు. ఏమీ మార్చుకోలేదు. మరి పేరాశ మాత్రం అట్లాగే వుండి పోయింది. ప్రతి ఒక్కరూ చెబుతున్నారా? లేదా? ఏదో లేండి. ఈ జీవితం ఇట్లా సుఖంగా జరిగిపోయి, సుఖంగా వెళ్ళిపోతే చాలు. పేరాశ అన్నమాట. ఎప్పటికీ తీరదు ఇది. ఎందుకనిట? చిక్కుకున్నావు వలలో. దుఃఖజాలము అనే వలలో చిక్కుకున్నావు. ఎందువల్ల? మానావమానములు అనే సంతృప్తి కొరకు. నీవు పొగడ బడటం, ఇతరులను తెగడటం రెండు సమస్యలు వున్నాయి. నువ్వు పొంగాలి అంటే ఎదుటివాడు కుంగాలి, నువ్వు ఆయన్ని అంటావు ఏదన్నా. వాడిని విమర్శిస్తావు. విమర్శిస్తే, ఏమిటయ్యా ఉపయోగం?

నీకు ఆనందం. ఎందుకని? వాడు కుంగిపోతూ చూస్తూ వుంటే నీ మానం అవమానం రెండూ నువ్వే. అక్కడ కుంగిపోతోంది నువ్వే. ఇక్కడ పొంగిపోతోంది నువ్వే. ఈ పొంగక, కుంగక వుండేటటువంటి జీవితం రావాలన్నమాట. అప్పుడే "లేని, పోని" అనే స్పష్టమైన అర్థం తెలుస్తుందన్నమాట. పుట్టింది మొదలు, పోయేదాక పోవడం లేదు. అనుభవంలో వుంటోంది. కానీ ఇది లేనిది అని తెలుసుకుని జీవిస్తే అదిపోతుంది. ఇది వున్నది అని గుర్తించినంతకాలం, ఎప్పటికీ పోదు. గుర్తుపెట్టుకోండి.

శరీరం గాని, విషయాలు కానీ, పంచకోశాలు కానీ వున్నవి అని నీకు తోస్తూ వున్నంత వరకూ వాటి వల్ల నీకు దుఃఖం తప్పదు. ఎక్కడికీ పోదు నాయన అది. కాబట్టి ముందు ఏమి నిర్ణయం చేయాలట? ఇవి లేనివి అని నిర్ణయం చెయ్యి. ఇవి లేనివి. ఆత్మ స్వరూపభావనలో ఇవి లేనివి. అని నిర్ణయం చేసి ఆ దృష్టితో చూడవయ్యా! అది పరిష్కారం దానికి. ఇది పోవాలి అంటే ఎట్లా? నేను ఆత్మస్వరూపుడను అనే భావంలో స్థిరపడి వుండి, ఆ అభ్యాసబలంతో, ఆ అలవాటుని వృద్ధి చేసుకుని, ఆ దృష్టితోటి ఎప్పుడెప్పుడైతే ఇవి కలుగుతూ వున్నాయో, ఇది లేనిది కదా! మళ్ళా తోస్తోందే, నన్ను మళ్ళా లాక్కుపోతోందే వలలోకి. నా స్వేచ్ఛను హరిస్తోందే. నా ఆనందాన్ని హరిస్తోందే, అది మళ్ళా వచ్చిందిరా బాబు. దీనికి జాగ్రత్తగా వుండాలి నేను. దీనికి జాగ్రత్తగా వుండాలి. దీనికి జాగ్రత్తగా వుండాలి. అని ఎప్పటికప్పుడు చూసుకుంటూ వుండాలి. ఒక రెప్పపాటు చాలు నిన్ను మానావమానాల్లోకి పట్టుకుపోవడానికి. ఒక రెప్పపాటులో లాక్కెళ్ళిపోతుందండి, అంతే ఏమీ వుండదు అక్కడ. (అటు పోంగానే ఇది మర్చిపోతున్నాము) పోయే! ఇంక ఏముంది? అర్థమైందా అండీ!

నిరంతరాయంగా, అందుకే చెప్పేది, నీకు మరణం ఎంతకాలంలో వస్తుంది? రెప్పపాటులోనే వస్తుంది. ఆ రెప్పపాటులోనే నీకు ఆత్మస్వరూపభావన నిలబడి వుండాలి నాయనా! అంతగా అభ్యాసము చేయి. సహజమైతే తప్ప ఇది సాధ్యం కాదు. అప్పటికప్పుడు ఏ నేను ఏదో బోల్డు సార్లు ప్రయత్నం చేశానండీ, లక్షకోట్లు జపం చేశానండీ ఏం ప్రయోజనం లేదు. నీ జపమాల ఎక్కడో దానితోపాటే అదీ పోయింది. నీ

జపం దేనితో పోయింది? దేనిమీద ఆధారపడి చేశావు? జపమాల మీద ఆధారపడి చేశావు. పోయే. ఆ జపమాల పక్కన పెడితే నీ జపము పోయే, నీ జపమాల పోయే. ఎందుకని? దానివల్ల ఏ అనుభవము లేదుగా. యాంత్రికం కదా! ఏం చెయ్యాలట? జపమాల విసిరేయ్. హంస జపం చేయి. నీ హంసతో సమంగా జపం చేయి. నీ ప్రాణంతో సమంగా జపం చేయి. కొంతవరకూ ప్రయోజనం వుంది. తరువాత ఆ ప్రాణం ఆగిపోతే ఏం చేస్తుంది? జపం ఆగిపోదా? అప్పుడేమి చెయ్యాలట? ప్రాణంతో పని లేకుండా జపం జరగాలట. గాలి విడిచిపెట్టేది లేదు, తీసుకునేది లేదు. కానీ మనసు మాత్రం జపం చేస్తూ వుండాలట. అది పరిస్థితి ఇంక. క్రమంగా చెబుతున్నా అందుకోసం పైకి. అర్థమైందా అండీ! ఇంకా పై స్థితి, మనసుతో కూడా పనిలేదు, ఏ ఆలోచనతో కూడా పనిలేదు. మౌనంగా జపం చేస్తావట ఇప్పుడు. అప్పుడు కూడా జపమే జరుగుతుంది. మౌనంగా జరుగుతుంది కాకపోతే. (జపం అంటే ఎలాగు, నామాన్నా లేకపోతే..) నీ ఇష్టం ఏదైనా సరే, ఏదైనా ఒకటే. సప్త కోటి మహామంత్రములున్నాయండీ, ఏడు కోట్ల మహామంత్రాలు వున్నాయి. అన్నిటి ఫలితం ఒక్కటే. అన్నీ మంత్రాల యొక్క ఫలితం ఒక్కటే. మనసుని ఒక స్థాయిలో నిలబెట్టడం వరకే. ఒక స్థితిలో మనసుని స్థిరంగా నిలబెడుతుంది. (మనసు లేని స్థితిలో వుండాలా? మనుసు...) అది తరువాత విషయం. అది తర్వాత విషయం. పై విషయాలు మాట్లాడుకుంటే ప్రయోజనం లేదు. ముందు సాధన అక్కడ దాకా రావాలి. వచ్చినాక అప్పుడు పై స్థితి.

తర్వాత. చూడండి. పైన ఏం చెప్పాడు. లేనిపోని దుఃఖజాలం చెప్పి, అది గబ్బిలం అన్నమాట. వెంటనే కింద ఏం చెబుతున్నాడో చూడండి. నిజగురుండగు సూర్యుడిప్పుడు నిజముగా వుదయించే చూడుము. ఆ మానావమానాలు విడిచి పెడితే గానీ నీకు గురువు కనపడడయ్యా! ఎప్పటికైనా సరే. నాకు గురువు కనపడలేదండి. నాకు గురువు కనపడలేదండి. నువ్వు ఎంత మొర పెట్టుకున్నా ప్రయోజనం లేదు. విడిచి పెట్టు మానావమానాలు వెంటనే గురువు కనబడుతాడు. నిజగురుండగు సూర్యుడిపుడు నిజముగా ఉదయించె చూడుము. త్రిజగముల వారంతా మేల్కొని తెలివి గన్నారు. జీవా మేలుకొనవే. అలాగ ఎప్పుడైనా కూడా ఏమిటి చేయాలట దానిని? ఆ మానావమానములలోనుంచి బయటకు రా. అది లేని పోని దుఃఖజాలమని తెలుసుకో.

బయటకు వచ్చి చూస్తే, నిజగురుండగు సూర్యుడిప్పుడు నిజముగా ఉదయించెను. చూడుము. ఎందుకని? సృష్టంతా గురువుగానే కనపడుతాడు. ఆ రెండింటి వల్లనే ఈ సృష్టి గురువుగా కనపడడం లేదు. పరమాత్మ ఈ సృష్టి అంతా తనయొక్క స్వరూపంగా ఎక్కడ చూచినా పరమాత్మయే ఈ సృష్టి అంతా కనపడేటట్లుగా సృజించాడు. కానీ నీకు మానావమానములు వుండడం చేత, వాటికంటే నేను అధికుడిని అనేటటువంటి అహంకారం వుండడం చేత, ఆ సృష్టిబోధించేటటువంటి బోధను స్వీకరించలేక పోతున్నావు నాయనా! అర్థమైందా అండీ!

అందుకనే ఏం చెబుతున్నారు? పరోపకారం కోసమే పుట్టాలి, పరోపకారం కోసమే ఈ శరీరాన్ని ఉపయోగించాలి అంటున్నారు. ఎందుకనిట? ఆ పశువులు, పక్ష్యాదులు లేకపోతే ఈ చెట్లు, చేమలు నదులు అన్నీ ఉపమానాలు చెబుతూ వచ్చారు. అవి అన్నీ దేనికోసం పారుతున్నాయి? దేని కోసం పుష్పిస్తున్నాయి? దేని కోసం ఫలిస్తున్నాయి? వాటికి ఏమైనా ఉపయోగం వుందా? ఏమీ లేదు కదా! అవన్నీ పరోపకారమే బోధిస్తున్నాయి కదా! నీకు. మరి నువ్వు ఎందుకు చేయవయ్యా పరోపకారము? ఈ అనంత సృష్టి ఏం బోధిస్తున్నది? రోజు ఎవరికో ఒకరికి ఉపయోగపడవయ్యా! ఎవరికో ఒకరికి ఉపయోగపడవయ్యా! అంటే ఏం చేస్తివి? (ఇంట్లోవాళ్ళకి ఉపయోగపడుతున్నాడు) అదీసంగతి! ఎక్కడైతే నీ అహంకారం సంతృప్తి చెందుతుందో, వాటికి ఉపయోగపడే ప్రయత్నం చేస్తున్నావే, నిన్ను గుర్తించని వాడికి చెయ్యి. నువ్వు ఎవరో తెలియనివాడికి చెయ్యి. నువ్వు ఎవరో తెలియచెప్పకుండా చెయ్యి. అది పరోపకారం అంటే. అర్థమైందా అండి? నేను ఫలానా అని వాడికి తెలియకూడదు. కానీ వాడికి ఉపకారం జరగాలి. నీకు అప్పుడు కర్తృత్వం వుండదు అక్కడ. నేను చేశాను అనే భావన వుండదు అక్కడ. అప్పుడు అహం పోతుంది. అదీ పరోపకారం, ఆ సేవ వల్ల ఉపయోగం. నేనును త్యాగం చేయాలి. ఆ నేనును త్యాగం చేయనంత వరకూ ఎప్పటికీ కూడా, నీవు గురువును గుర్తించలేవు. గురువుని గుర్తించాలి అంటే, ఎవ్వరైనా సరే, ఆ మానావమానములని విడిచి పెట్టాలి. నేను అనే కర్తను త్యజించాల్సిందే. అప్పటి వరకూ నీ గురువు వల్ల ఏం ప్రయోజనం లేదు.

తరువాత, “బట్టబయలును గురుడు జూపిన, నట్టు లేకను పుడమి అంచున, పట్టు విడువక గుట్టు మరువక, దిట్టమై పోవె, జీవా మేలుకొనవే!” – పరమాత్మ రహస్యం, రహస్యం, రహస్యమని అంటుంటారు కదా! కానీ పరమాత్మ ఎలా వున్నాడట? బట్టబయలుగా వున్నాడట. ఏ రహస్యం లేకుండా అంతటా, సర్వవ్యాపకమై, అణువు మహత్ అనే తేడా లేకుండా, అనంత సృష్టియందు విశ్వమంతా వ్యాపించి వున్నవాడు పరమాత్మ. బట్టబయలుగా వున్నాడట. మనం ఎందుకు చూడలేకపోతున్నాము మరి? (మన కళ్ళకే కనబడడం లేదు) అదీ సంగతి! సమస్య నీ దృష్టిలో వుంది కానీ, సృష్టిలో లేదయ్యా! ఆ సృష్టిని పరమాత్మభావంతో చూడవయ్యా! అప్పుడు పరమాత్మయే కనపడుతాడు. చూడకపోవడం చేత, బట్టబయలును గురుడు చూపిన, ఆ గురువు ఏం చేశాడయ్యా? ఇదిగో పరమాత్మ ఎలా వున్నాడో చూడు, అదిగో ఆ మల్లెచెట్టు పూస్తోంది కదా! ఆ పువ్వులు పూస్తున్నాయంటే, దాని వెనుక ఎవరి శక్తి కారణం? ఆ కారణం ఎవరయ్యా? పరమాత్మే. ఆ చైతన్యమే దాంట్లో పనిచేయకపోతే అది ఎట్లా పూస్తుంది? జడ పదార్థం కదా అది. నీవు ఇంత అందంగా మాట్లాడుతున్నావు. ఎవరి వల్ల ఏ ప్రభావం వల్ల? ఒకాయన అందంగా పాడుతున్నాడండీ, శ్రావ్యంగా పాడుతున్నాడండీ, ఎవరి ప్రభావం వల్ల? బాలమురళీ కృష్ణగారు పాడుతున్నారు కాదు. బాలమురళీకృష్ణ యందున్న సత్తా ప్రభావం చేత ఆ ఉపాధి అలా ఉపయోగపడుతుంది. అర్థమౌతుందా అండీ!

నేను చిరంజీవి favorite ని అండి. చిరంజీవి అలా నటించడానికి కారణం ఎవరు? అతనిలో పనిచేసే పరమాత్మ సత్తా. ఆ చైతన్యం, అలా ప్రవర్తిస్తూ వుంది. ఆ ఆ ప్రాథమికతతో పనిచేస్తుంది. నేను అద్భుతంగా వంట చేస్తాను. జయపిన్ని అద్భుతంగా వంటచేసే అవకాశం లేదు. అందులో వున్న పరమాత్మ సత్తా, ఆ చైతన్యం, ఆ రూపంలో, ఆ గేట్‌లోనుంచి పనిచేస్తోంది. (మరి ఒక్కొక్కళ్ళు ఒక్కోరకం వుంటున్నారు కదా!) ఆః... ప్రాణ మనో బుద్ధులలో వుంది అది. ఆ సూక్ష్మంలో వుంది అది. దీనిని బాగు చేయాలంటే ఎక్కడ బాగు చేయాలంట ఇప్పుడు? సూక్ష్మాన్ని బాగు చేయాలి అసలు. మనం దేనిని బాగుచేయాలయ్యా అంటే సూక్ష్మాన్ని శుద్ధి చేయాలి. నవవిధ భక్తి మార్గాల ద్వారా, ప్రాణ మనో బుద్ధులు శుద్ధి చెందాలి. కానీ, ఏవి శుద్ధి చెందుతున్నాయి? బాహ్య శుద్ధి. పదిసార్లు

నీళ్ళు పోసుకున్నావు కదా! పైనుంచి కిందకి? అంతేనా కాదా! 10 సార్లు స్నానం చేసేస్తే ఏమైందట? శరీరం శుద్ధి అయ్యిందని నీ అభిప్రాయం. అసలు ఆ భక్తి వలన ఏమి శుద్ధి అవ్వాలి? ప్రాణ మనో బుద్ధులు. వాటిలో వున్న వాసనాబలం పోవాలి. వాటిలో వున్న సంస్కార బలం పోవాలి. వాటిలో వున్న గుణబలం పోవాలి. (మనస్సు అప్పుడు ఈ మూడే చెబుతున్నారుగా... మనస్సుని) ఒక్కటే గుర్తు పెట్టుకోండి. మనసే బుద్ధి, బుద్ధే చిత్తం, చిత్తమే అహంకారం, అన్నీ మనసే! అయితే దాని యొక్క స్థితిని బట్టి, పనిచేసే పరిస్థితిని బట్టి, చెబుతున్నాడు. అలా విడగొట్టి చెప్పకపోతే ఏమౌతోంది? దానిని పట్టలేకపోతున్నావు కదా! నువ్వు పట్టడం కోసమని విడగొట్టి చెబుతున్నాడు. అర్థమైందా? అందుకని, ప్రాణ మనో బుద్ధులు అని తేల్చేస్తున్నాడు. ఎందుకని? స్పష్టంగా విడిపోయి వున్నాయి అవి. ఈ మనసూ బుద్ధే ఇంకా కొంచెం సూక్ష్మం అయితే, లోపలికి వెళ్ళి తిరిగి చూస్తే చిత్తము, అహంకారము అగుతున్నది. మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము. అది అక్కడి దాకా వెళ్ళాలి అంటే నువ్వు ముందు దీనిని బాగుచేయి. ప్రాథమిక వ్యవసాయం చేయి. ఇప్పుడు ఎలా వుందట? కొండలు, గుట్టలు, తుప్పలు, రాళ్ళతోటి వుంది. మన క్షేత్రం అంతా కూడా. దీనిని ఏం చేయాలి ముందు? బాగుచేయి ముందు. అప్పుడే విత్తనాలు వేస్తే ప్రయోజనం ఏముంది? కాబట్టి నీవు ఆ బట్టబయలు ఎట్లా అయితే వున్నాడో, వుందో అలా పరమాత్మ వున్నాడయ్యా!

ఏ రహస్యమూ లేదు నాయనా! కనపడకపోవడం అనే ప్రసక్తే లేదు నాయనా! నువ్వు అన్వేషించవలసిన అవసరమే లేదు. ఎందుకని? నీ లోపల, నీ బయట, అంతటా సర్వత్రా వ్యాపించివున్నవాడిని ఎక్కడని వెతుకుతావు? మనం పుట్టింది మొదలు ఏం చేశామండీ? ఇప్పటి వరకూ! కాశీలో వున్నాడా? రామేశ్వరంలో వున్నాడా? కేదార్‌నాథ్‌లోవున్నాడా? ఇంకా ఇప్పటికీ కూడా మనలో ఆలోచన కదులుతూనే వుంది కదా! గంగోత్రిలో వున్నాడా? యమునోత్రిలో వున్నాడా? వుందా ఎక్కడైనా? అక్కడెక్కడ వున్నాడు? అక్కడ వుంటే ఇక్కడ లేడా? అక్కడే వుండి, ఇక్కడ లేకపోతే పరమాత్మ ఎలా అయ్యాడు? ఒకసారి ఆలోచించండి? అతను దైవమే కనుక అయితే, దైవం సర్వవ్యాపకుడు కదా! కేదార్‌నాథ్‌లో మాత్రమే వుండి ఇక్కడ లేడా? ఎలా సాధ్యం? అలా అయితే దైవం ఎలా అయ్యాడు? అంటే ఏ భ్రాంతి వున్నది ఇప్పుడు నీకు? క్షేత్రభ్రాంతి

వున్నదన్నమాట. అంటే ఏమిటట? ఆ క్షేత్రానికి వెళితే పుణ్యం వస్తుందిగా. ఏం చేసుకుంటావు నీ పుణ్యాన్ని? (మళ్ళా జన్మవస్తే..) మళ్ళా సుఖమేగా. (మళ్ళా సుఖం ఎందుకని అనే ఆలోచన కూడా వుండదు.) అంటే అర్థం ఏమిటి? పుణ్యం వస్తే చాలని ఎందుకు? పుణ్యం వలన సుఖం వస్తుంది. నీకు పుణ్యాన్ని ఎందుకు కోరుతున్నావయ్యా? సుఖాపేక్ష. సుఖం మీద అపేక్ష (ఆశ) వున్నదన్నమాట. ఆ సుఖం ఏమిటి? శరీర సుఖమే కదా! ఇంద్రియ సుఖమే కదా! ఈ ఇంద్రియసుఖం కోసమని, మోకాటి పర్వతం ఎక్కి, మోకాలి చిప్పలు పగులగొట్టుకొని, ఆ తిరుపతి అల్లా వెళ్ళి, ఆ తిరుపతి దేవుడు ఇక్కడ లేడా? ఏడు కొండల మీదే వున్నాడా? ప్రతి దాంట్లో, ప్రతి క్షేత్రంలో కూడా వాళ్ళు స్పష్టంగా, ఆత్మజ్ఞాన నిరూపణ కోసమే అవన్నీ అలా పెట్టారు. అన్నీ కష్టాలు పడి నువ్వు ఎందుకు వెళ్ళాలయ్యా? అంత కష్టపడి వెళ్ళిన తరువాత అయినా కానీ నీకు తెలుస్తుందని. ఒరేయ్! అక్కడ వుంది, ఇక్కడ వుంది ఒక్కడేరా దేవుడు అని. ఎందుకని? ఎప్పుడూ ఏడుకొండల మీదే వుండు. సాధ్యమవుతుందా? వీలుకాదు కదా! కాబట్టి, దైవం అంటే, పరమాత్మ అంటే, సర్వవ్యాపకమై, బట్టబయలు వలె వున్నాడయ్యా! ఈ సత్యం తెలుసుకో.

'గురుడు జూపిన, నట్టు లేకను పుడమి' పుడమి అంటే సృష్టి, ఈ సృష్టిని అట్లా చూడవయ్యా! పరమాత్మ భావంతో చూడు. 'అందునను పట్టు విడువక, గుట్టు మరువక' ఈ పరమాత్మ సర్వవ్యాపకుడై వున్నాడనే గుట్టును మరువద్దు. అది మరచిపోతుంటావు, మాటిమాటికి శరీరభావంలోకి వస్తుంటావు కాబట్టి. మరువక పట్టువిడువక – పంతం నీకు ఏమన్నా పంతం వుంటే, ఇందులో పట్టు. ఆ, నీకు ఇప్పటి వరకూ, అన్నింటిలో, బోల్లెడు విషయాలల్లో పంతం వున్నది కదా! ఆ పంతం ఏదో ఇందులో పట్టు చూద్దాం. నీ సత్తా ఏమిటో తెలుస్తుంది. అంతటా వున్న పరమాత్మను దర్శించడంలో పట్టు పట్టు ఆ పంతమేదో. నాకు ఏమైనా సరే, అంతటా వున్న పరమాత్మ నాకు ఎందుకు కనపడడు? ఆ పరమాత్మ భావంతో చూడు, అంతేకానీ, అహంతో చూస్తే కనపడడు మళ్ళా. అక్కడ ఎవరైనా ఆత్మజ్ఞానం వున్న మహానుభావుడు దొరికితే, నీకు ఏమైనా ఇలాంటి వాక్యం చెబుతాడనే వుద్దేశ్యంతో పెట్టారు అవి (తీర్థయాత్రలు). పైగా దానికి ఒక నియమము వుందండి. ఈ క్షేత్ర సందర్శన సన్యాసికి లేదు, అర్థమైందా అండీ! బ్రహ్మచారికి లేదు. ఎవరికి వుందంట మధ్యలో. గృహస్థుకి ఒక్కడికే వుంది. వానప్రస్థుడికి అస్సలు లేదు.

ఎందుకని వనాల్లో వుంటాడు కాబట్టి. ఏకాంతంలో వుంటాడు కాబట్టి. సన్యాసికి అవసరం లేదు. బ్రహ్మచారికి ఆ వికాసం లేదు. కేవలం గృహస్థుకి మాత్రమే ఈ క్షేత్ర ఆరామ సందర్శన, తీర్థయాత్రలు అన్నీ కూడా. ఎందుకు పెట్టాడయ్యా అంటే, నీవు ఈ తీర్థయాత్రా ఫలితం వల్ల ఎవడైనా ఒక మహానుభావుడిని గుర్తిస్తే, వాడిని ఆశ్రయించి నీ మిగిలిన జీవితం వెల్లబోయడం కోసం. అంతేకాని అక్కడికి వెళ్ళి తిరుపతి ప్రసాదం తిని రమ్మని కాదు. గుండుకొట్టించుకోవడం, లడ్డూ తినడం, వచ్చేయడం. ఇంతేకదా! తిరుపతిలో వెళ్ళేది, మనం చేసేది ఇంకేమన్నా వుందా? ఎప్పుడైనా కానీ, ఎక్కడైనా ఆలయానికి వెళ్ళినప్పుడు, ఏదైనా, ఎక్కడైనా ఎవరైనా మహానుభావుడు వున్నాడా? ఆత్మజ్ఞానాన్ని బోధించే వ్యక్తి ఇక్కడ ఎవరైనా వున్నారా? అని అన్వేషించావా? ఎప్పుడైనా? (ఎదురుగుండా వున్నా గుర్తించే స్థితి లేదు) అవునమ్మా! అంటే ఏమిటి నువ్వు అసలు ఇక్కడ బయలు దేరే ముందే నేను ఎందుకు వెళ్తున్నాను? నేను ఎందుకు వెళ్తున్నాను అసలు అక్కడికి? ఆ మహానుభావుడిని వెతకడం కోసం వెళ్తున్నాను. నా జీవిన గమ్యాన్ని కడతేర్చే మహానుభావుడు ఎక్కడైనా ఇప్పటి వరకూ లభించలేదు, నాకు గురువు అక్కడెక్కడైనా లభిస్తాడా? అని అన్వేషణతోటి నువ్వు ఇక్కడ జీవిస్తే, ఆ దృష్టి వస్తుంది. అంతేగాని, ఇక్కడనుంచి అన్నీ సరాసరి, recommendation తోటి చివరాఖరి ద్వారా book చేస్తివి అన్నీ. ప్రశాంతంగా ఎక్కి పడుకుంటివి. అక్కడ లేస్తివి. వెళ్తివి. చూస్తివి. గుండుకొట్టించుకొనుకొంటివి. తిరుపతి లడ్డూ ప్రసాదం కూడా recommendation తోనే వెళ్ళి తీసుకొంటివి. వచ్చేస్తివి. ఏమిటయ్యా అంటే? మా అల్లుడండీ! సరాసరి బంగారు వాకిలా దాకా తీసుకుపోయాడండీ! 10 నిమిషాల్లో దర్శనం అయిపోయిందండి. ఆహా! అద్భుతంగా AC లాడ్జిలో పడుకున్నామండి, వచ్చేశామండి. ఏమైందట ఇప్పుడు? ఏమిటి ప్రయోజనం? ఇదే కదా మనం చెప్పుకునేది. ఎన్ని తీర్థయాత్రలు చూసుకోండి మీరు. (దేవుడి దర్శనం కంటే బాగా కూడా, తీసుకెళ్ళే వాళ్ళు బాగా తీసుకెళ్ళారండీ! చూపిచ్చారండీ! ఇదే ఎక్కువౌతుంది.) ఆఁ.. అర్థమైందా అండీ!

ఏమైంది ఇప్పుడూ? అర్థమైందా?

ఇలా ప్రతీ దాని వెనుకా గూడా ఇలా మోసపోతున్నావయ్యా! అందుకే ఇది మొదలుపెట్టినప్పుడే చెప్పాము. కటకట మోసమాయెను ఇలా మోసపోతున్నావు

తెలుసుకో! ప్రతి పద్యంలోనూ అందుకే చెప్పేది, అందుకే ఈ శీర్షక మొట్టమొదట అలా పెట్టింది, ఈ ప్రతి అంశంలో కూడా, నువ్వు మోసపోతున్నావయ్యా! ఏంటి మోసపోతున్నావు? ఆత్మజ్ఞానాన్ని కోల్పోతున్నావయ్యా! దేనికోసమైతే మానవ ఉపాధి వచ్చిందో, ఆ లక్ష్యం పోయిందయ్యా! ఆ గమ్యం పోయిందయ్యా! ఆ విధానం పోయిందయ్యా! ఇది తెలుసుకో!

'మాయ తనువై, మాయ తానై, మాయపనులను చేయుచును మరి, మాయ తన మర్మంబు గనినే మాయమైపోవున్ జీవా మేలుకొనవే' – మాయ మాయా అంటున్నావు అసలు మాయ వున్నదా? మాయ అంటేనే అర్థము లేనిదని. మాయంటే అర్థం ఏమిటి? లేనిదని. (మాయ చేశాడమ్మా అంటాం) లేనిది magic. అక్కడ వాడు ఏం చేశాడట? ఇంద్రజాలికుడు? గాల్లో చేతులు ఊపాడు. లేని వస్తువుని సృష్టించాడు. నీ చేతిలో పెట్టగానే మాయమైపోయింది. ఎలాగట? మాయ అంటే లేనిదయ్యా బాబూ! వున్నది కాదు అది. కానీ నువ్వు దేనిని ఆశ్రయించావట? వున్న పరమాత్మను ఆశ్రయించవయ్యా అని అంటే, నీ మానావమానాల యొక్క పోషణ కోసం, ఈ మాయను ఆశ్రయించావు. ఆశ్రయించి పైగా ఏం చెబుతున్నావు? చివరకు వచ్చేప్పటికి ఫలితం దుఃఖం అయినాక, ఏం చేస్తావు నాయనా! అంతా మాయ. అయ్యో! మోసపోయావు కదా! లేని మాయను ఆశ్రయించడం వల్ల మోసపోతున్నావు నాయనా! ఆ మాయకు ఒక రహస్యం వున్నదంటా. ఏమిటట అది? మాయ తనువై – నీ తనువు మాయే నాయన! అంటే లేనిది. మాయ తానై – నువ్వు ఎన్నింటినైతే నేను నేను అనుకుంటున్నావో, ఆ నేను లేనిదిరా బాబు. మాయ తనువై, మాయ తానై రెండూ స్పష్టంగా చెబుతున్నాడు, అందుకోసమే! నువ్వు తనువే అంటావా? అది అసలే లేనిది. తనువు కాదన్నావు. ప్రాణం. అది కూడా లేనిదయ్యా! మనస్సు. అదికూడా లేనిదయ్యా! బుద్ధి. అది కూడా లేనిదయ్యా! దానికి అవతల చిత్తం. అదికూడా లేనిదయ్యా! దాని అవతల అహంకారం. అదికూడా లేనిదయ్యా. తెలుసుకునేవాడు – వాడు కూడా లేడయ్యా బాబు. ఎన్నింటికైతే ఈ నేనును ముడేస్తున్నావో, లోపలికి వెళ్ళే కొద్దీ, అవికూడా లేనివే. మాయ తానై అంటే అదన్నమాట అర్థం. ఎక్కడిదాకా అంటే, పరమాత్మ దాకా. చివరకు అదికూడా లేనిదే. అది తర్వాత విషయం. అర్థమైందా అండీ! ఈ నేనును ఏఏ స్థితికైతే ముడేస్తూ వెళ్తున్నావో, అవన్నీ

లేనివే నయ్యా! ఎందుకు కిందకి చెప్పడం లేదు. కిందవన్నీ పైన చెప్పేశాడు. మాయ తనువై, శరీరము, శరీర గత సంబంధాలన్నీ మాయేనయ్యా బాబు. ఒక దెబ్బకు తీసి అవతల పడేశాడు. మిగిలినవి ఏం మాట్లాడుతున్నాడు? సాధనలో ప్రయాణం చేసేటప్పుడు, నేను శరీరం కాదు, నేను ప్రాణమును అనుకున్నావు కదా! నేను ప్రాణమును అనుకోగానే పోయింది మళ్ళా అదికూడా మాయే నాయన. మాయ తానై, ఈ నేనును ఎక్కడెక్కడైతే ముడేస్తున్నావో, అదికూడా లేనిదే నయ్యా! బాబూ! మాయతనువై, మాయతానై, మాయ పనులను చేయుచు – ఎందుకు చేస్తున్నావట? ఈ నేనును అలా మాయకు ముడేశావు. ఈ శరీరమే మాయ. అది తెలుసుకోలేకపోతున్నావు. అర్థమైందా అండీ! మీరందరూ తెలియకుండానే ఆ మాట అంటూ వుంటారు. తల్లిగర్భంలో ఎక్కడ పెరిగిందండీ శిశువు? ఎక్కడ పెరిగింది? నీ శరీరం ఎక్కడ పెరిగింది? దేని ద్వారా తయారైంది? దాంట్లో నుంచే తయారైంది. దాంట్లో నుంచే తయారైన దానికి దాని లక్షణం కాకపోతే వేరే ఏమి వుంటుంది? (మాయ లక్షణం). అంతే కదా! ఎందులో తయారైంది ఇది? (మాయలో) అక్కడే ఆ స్థానంలోనే తయారైంది. ఆ స్థానంలో, ఆ ఆహారంతో, ఆ లక్షణంతో, ఆ గుణంతో తయారైనటువంటి శరీరానికి, ఏమి వస్తుందయ్యా? లేని లక్షణమే వస్తుందయ్యా! ఎందుకని? తల్లికి దానితో తరువాత ఏమైనా పని వుందా? ఏం పని లేదు. గెంటి అవతల పడేసింది. శిశువుతో సహా! చూసుకోండి ఒకసారి. శిశువుతో సహా తల్లి శరీరం ఏం చేసింది? నీతో నాకు ఏం పనిలేదు పొమ్మంది అంతే! మాయను గెంటి అవతల పడేసింది. పడకపోతే అప్పుడు తల్లికి ప్రమాదం. అర్థమౌతుందా అండీ! సృష్టికి సహజలక్షణం ఎలా వుంది? ఏ జీవితోనైనా సరే, అలా గెంటి అవతల పడేస్తుంది. అంటే ఏమిటి మాయను ఆశ్రయించే అవకాశం లేదయ్యా! సృష్టిలో ధర్మం ఎంత చక్కగా బోధిస్తుందో చూడండి. కానీ మనం ఈ పాఠం నేర్చుకున్నామా? ఐదుగురు పిల్లల్ని, ఆరుగురు పిల్లల్ని, డజను మందిని కంటివి. పొరపాటునైనా కూడా ఇలా విచారణ చేశావా? చెయ్యలేదు కదా! ఎంతోమంది మన కళ్ళముందు పిల్లలు పుడుతున్నారు. వాళ్ళను చూస్తున్నావు. వాళ్ళకు సేవలు చేస్తున్నావు. కానీ, అయ్యో! ఈ శరీరం ఎక్కడ జన్మించింది. ఇందులో కదా జన్మించింది. మరి ఇది గెంటేస్తున్నాను కదా ! తరువాత. ఇది పనికి రాకుండా పోతోంది కదా! అంటే

పనికి రాని దాంట్లో పుడుతున్నది కదా ఇది. మరి దీనికి ఏ లక్షణం వుంటుంది? ఆ లక్షణమే కదా వుండేది దీనికి? మరి నేను దీనిని ఆశ్రయించానేమిటి? ఏమి అవివేకమిది? ఏమి అజ్ఞానమిది? ఈ శరీరమే నేను అనుకుంటున్నానేమిటి? కనపడుతున్న ఆ శరీరమే నా మనుమరాలు అనుకుంటున్నానేమిటి? వుందా? లేదు కదా! అర్థమైందా? కాబట్టి మీరు ఇలా విచారణ చేయాలి. అప్పుడేమైపోయారు? మనవరాలు లేదు. అమ్మమ్మ లేదు. ఎవరు? ఇద్దరు ఇద్దరు జీవులవి. వారి వారి జీవ ప్రయాణం కోసం, పరిణామ పాఠం కోసం, ఆ శరీరాన్ని తీసుకున్నారు. ఆ పరిణామ పాఠం ప్రకారమే అక్కడ జరిగిపోతుంటుంది అక్కడ అన్నీ. నీ ప్రభావం దాని మీద, దాని ప్రభావం నీ మీద. అంతా కూడా గుణ ప్రభావమే. తాత్కాలికం. నీ రజోగుణం, నీ తమోగుణం, నీ సత్వగుణం. ఆ జీవిలో వున్న రజోగుణం, తమోగుణం, సత్వగుణం. అందులో వున్న ప్రాణ మనో బుద్ధులు, ఇందులో వున్న ప్రాణ మనో బుద్ధులు. అందులో వున్న సూక్ష్మం, ఇందులో వున్న సూక్ష్మం. ఆ స్థూలాన్ని వుపయోగిస్తున్నాయి, పరిణామపాఠం అందులో స్థిరపడుతోంది. అంతకు మించి వేరే ఏముంది? జీవితం అంతా ఒకే ఒక వాక్యం వున్నది. ఏమిటయ్యా? ఆ ప్రాణ మనో బుద్ధులు అనే జీవుడు, గుణాలని ఆశ్రయించి, ఈ శరీరాన్ని పనిముట్టుగా వుపయోగించి, పరిణామపాఠం నేర్చుకున్నాడు. అంతే! మొత్తం జీవితమంతా, వేరే ఇంకా ఏం లేదు నాయనా!

మరి మిగిలినవన్నీ, అవన్నీ మాయతనువై, మాయతానై మాయపనులను జేయుచును మరి మాయతన మర్మంబు గననే ఇలా తెలుసుకోవయ్యా దాని మర్మం. తెలుసుకున్నావు. మాయమై పోవున్ – ఎక్కడుందో చూపెట్టు ఇప్పుడిక. మాయ ఎప్పుడైతే అంతరించిపోయిందో, అప్పుడు పరమాత్మ ఎదురుగుండా కనపడుతాడు. ఈ మాయను ఆశ్రయించినంతవరకూ పరమాత్మ కనబడడు. అర్థమైందా అండీ! కాబట్టి, ఈ మాయ యొక్క మర్మం విప్పి చెప్పేస్తున్నాడు, ఇలా తెలుసుకో దీనిని. ఈ రెండూ పోగొట్టుకున్నావా? ఆ మాయ అంతరించిపోతుంది. అంతరించి పోతే, పరమాత్మ సాక్షాత్కారం కళ్ళ ఎదురుగుండానే వుంటుంది. ఎక్కడో వెతుక్కోనక్కరలేదయ్యా నువ్వు. అర్థమైందా అండీ! నీవు మాయను ఆశ్రయించావు. ఎవరు ఆశ్రయించమన్నారు? లేని దానిని ఎవరు ఆశ్రయించమన్నారు? ఉన్న పరమాత్మను వదిలేసి, లేని మాయను ఎవరు

ఆశ్రయించమన్నారు? అర్థమైందా? (మాయ అంటే లేనిది) అది. అంతేకదా! మాయ అంటే అర్థం లేనిది.

'ద్వాదశీ షోడశులనే జలధార కర్ణములందు సోకిన బాధలన్నియు తొలగి నీవిక భ్రాంతి వదలెదవూ జీవా మేలుకొనవే' – 'ఈ ఉత్తబట్టబయలు ఏమీ లేదు' అనేది ద్వాదశి. ఈ ఉత్త బట్టబయలు ఏమీ లేదు. ఇందాక ఏం చెప్పుకున్నాము? బట్టబయలు అంటే పరమాత్మయే కదా ! ఈ ఉత్త బట్టబయలు ఏమీ లేదు. పైన ఏమి చెప్పాడు? మాయ విడువ మన్నాడు. విడిస్తే ఏం మిగిలింది? పరమాత్మే వున్నది. అంతేకదా! అదేమిటి? బట్టబయలు వలే వున్నది. ఈ ఉత్తబట్టబయలు ఏమీ లేదు. ఎప్పుడూ గుర్తుపెట్టుకో ఇదే వాక్యం. అక్కడ ఏమైనా వున్నట్టు తోచిందా వెంటనే నీకీ వాక్యం గుర్తుకురావాలి. ఈ ఉత్తబట్టబయలు ఏమీ లేదు, అది తోస్తోందయ్యా, ఇదిగో ఇక్కడ ఈ తులసి చెట్టుంది, తులసి చెట్టుకు రోజూ నీళ్ళు పోస్తే నాకు మోక్షం వస్తుంది. ఏమైంది? సాధ్యమేనా? ఎలా సాధ్యం? తులసి చెట్టు మోక్షాన్ని ఇచ్చేట్టయితే, ఆ మల్లె చెట్టు ఎందుకు ఇవ్వదు? అనే విచారణ రావాలి. ప్రశ్న రావాలన్నమాట. ఈ తులసి చెట్టు మోక్షాన్ని ఇచ్చేట్టయితే, ఆ మల్లెచెట్టు ఎందుకివ్వదు? (దీనికేదో ప్రత్యేకత) ఆఁ... నీకు వున్న అహమే దీనికీ తగిలించావు. (అంతేనా). ఈ తులసి చెట్టు విష్ణుస్వరూపం అండీ! మల్లె చెట్టుకాదా? సర్వ స్థితి కారకుడు విష్ణువు అయినప్పుడు, (అందులో వున్నది ఆ చెతన్యమే) ఇందులో వున్నదీ ఆ చైతన్యమే కదా! అందులో వున్న దైవం ఇందులో లేడా? (దాన్ని ఎండబెట్టి, దీనికి నీళ్ళు పోసి) ఏమైంది? అయ్యయ్యో! చూడండి ఒక్కసారి. ఎంతటి అజ్ఞానమో! ఇంతటి అజ్ఞానంలో కూరుకుపోయి, నేను పరమాత్మను వెతుకుతున్నానండీ! అంటే, అర్థముందా ఏమైనా? ఒక్కసారి మన ఆచరణ ఎక్కడున్నది? లక్ష్యం ఎక్కడున్నది? నేను రోజూ చూస్తావుంటా అందరినీ, ఈ పనిచేసేవాళ్ళను అందరినీ, అయ్యో! ఎంతటి అజ్ఞానంలో పడిపోతున్నాడు? తులసి చెట్టు దగ్గరకు వచ్చి దీపం పెడుతాడు. ఆ దీపం పెట్టేస్తే, పుణ్యం వచ్చేసినట్టే, మోక్షం వచ్చేసినట్టే. ఎందుకు పెడుతున్నావయ్యా దీపం? (భగవంతుడు) అయ్యో! అదేమరి చెప్పేది, ఎప్పుడు పెట్టాలట అదికూడా? సూర్యోదయం కాకముందు పెట్టాలట. అంతే కదండీ! ఎందుకు పెట్టాలండీ? సంధ్యాసమయం. కరెక్టుగా ఉదయ సంధ్య అన్నమాట. ఉదయ సంధ్యాకాలంలో, ఆ సూర్యోదయ కాలంలో

అటు చంద్రుడు, ఇటు సూర్యుడు ఏక కాలంలో వున్నప్పుడు, ఆ దీపం వెలిగించావు. ఏం తెలిసిందట ఇప్పుడు? ఆ సూర్య చంద్రుల సాక్షిగా నాలో ఆత్మజ్ఞానం వున్నది, ఆ ఆత్మజ్ఞాన జ్యోతి అలా ప్రకాశిస్తూ వున్నది అని తెలియడం కోసం. అది సంధ్యాసమయంలో నీకు సుషుమ్నానాడిలో ఒక క్షణం పాటు కొట్టుకుంటుంది. హంస. నీకు తెలియకపోవచ్చు. ప్రతిజీవికి కొట్టుకుంటుంది. అందుకని నాయనా! సంధ్యాసమయంలో నిద్రపోమాకండి. మేలుకొని వుండండి నాయనా! సహజంగానే పరమాత్మ నీకొక వరం ఇచ్చాడు. ఏమిటయ్యా అంటే, ఆ సంధ్యాకాలంలో నీవు కనుక మేలుకొని నీ హంసను గమనిస్తూ వుంటే, నీ ప్రాణాన్ని గమనిస్తూ వుంటే, ఇందులో ఇడా పింగళ, మధ్యలో సుషుమ్న నాడి వుంటుందన్నమాట. ఆ సుషమ్నా నాడిలో ఒక్క క్షణం పాటు హంస కొట్టుకుంటుంది. ఎప్పుడూ అందులో కొట్టుకోదు. ఇడాపింగళలో కొట్టుకుంటుందన్నమాట. ఈ సుషుమ్నానాడిలో ఆ క్షణం పాటు ఎప్పుడైతే కొట్టుకుంటుందో, ఆ కొట్టుకునే క్షణంలోనే నువ్వు తెలుసుకోగలుగుతావట. ఆత్మజ్ఞానాన్ని. ఆత్మసాక్షాత్కారం అప్పుడు జరుగుతుంది. ఒక్క క్షణంలో, ఒక్క రెప్పపాటులో జరిగిపోతుంది అది. అది ప్రతిరోజూ వుంది నీకు ఆ అవకాశం. ఆఁ.. అదండీ! సంగతి. ఎవరు చెప్పినా అదే. 6 గంటలకు చేయండి, 5.30కు చేయండి. బ్రహ్మముహూర్తంలో లేవండి, ఏమిటి? లేచి ఏం చేయాలి? ఇందాక పొద్దున రాగానే చెబుతోంది అదే. లేవగానే ఏం చేయాలి? ఇది చేయాల్సిన పని. ఐదు గంటలకు లేచి ఏంచేయాలి? లేచానండి, మళ్ళా అటూ ఇటూ దొర్లానండి. అది కాదండీ అక్కడ విషయం. లేచిన తరువాత ఏం చెయ్యాలయ్యా? నీ ప్రాణాన్ని గమనించవయ్యా! ఇడ, పింగళ, సుషుమ్న. పైకి క్రిందకి ఎలా కొట్టుకొంటోంది? కుడిలోంచి వెళ్ళింది. ఎడమకు తిరిగి వచ్చింది. మళ్ళా ఎడమలోంచి వెళ్ళింది, కుడికి తిరిగి రావాలి. కానీ అలా రావడం లేదు. ప్రయత్నం చేసి త్రిప్పుకో. తిప్పుకుంటే మధ్యలో సుషుమ్నా నాడి అలా తగుల్తుందన్నమాట. తగిలినప్పుడు నీకు ఆ స్పర్శయొక్క భేదం తెలుస్తుంది. ఇడా పింగళలో హంస పనిచేస్తే ఎలా వుంది? సుషుమ్నలో వుంటే ఎలా పని చేయాలి? (నాకు ఎందుకు ఉదయం కూర్చొంటే అస్సలు ధ్యానం కుదరదూ?) అదే చెబుతా వినండి. ఇవన్నీ అసలు ధ్యానం వగైరాల జోలికి వెళ్ళొద్దు. ఇక్కడి వరకే. ముందు ప్రాథమిక ప్రయత్నం. మీ అందరికీ ఏమిటంటే, అక్షరాభ్యాసం లేదు. పై క్లాసువుంది. ఈ

అక్షరాభ్యాసం లేకుండా ఆ పై క్లాసు రాదు. ముందు ఇవన్నీ set right అవ్వాలి. నీ నిజజీవితంలో వున్న సమస్యలు అన్నీ పరిష్కరించ బడితే ధ్యానం కుదురుతుంది కానీ, ధ్యానం కుదిరితే ఇవన్నీ పరిష్కరించబడుతాయంటే ఎప్పటికీ పరిష్కరించబడవు అన్నమాట. నువ్వు ఆత్మ విచారణ తోటి జీవిస్తే, ఉన్నత తరగతి. తరగతులు మారుతూ పాఠం మారే కొద్దీ, ఉన్నతమైన జీవనం వచ్చే కొద్దీ, ధ్యానం వుపయోగపడుతుంది. అంతేగాని, ఆ ధ్యాన అభ్యాసం ఎప్పటికో అప్పటికి ఉపయోగపడుతుంది. ఇప్పుడది ఉపయోగపడకపోవచ్చు.

షోడశి అంటే అర్థం ఏమిటంటే, 'మూలాన్ని గుర్తెరిగే శరీరం ఏమీ లేదు'. అక్కడ రెండు చెబుతున్నాడు కదండీ! ద్వాదశీ, షోడశీ అనే జలధార కర్ణములందు శోకిన భ్రాంతి వదలెదవు. బాధలన్నీ తొలగిపోయినాయి. ఎందుకు భ్రాంతి వదిలిందట? బాధలన్నీ తొలిగిపోయినాయి కాబట్టి. ఎందుకనయ్యా? అంటే, ఈ రెండూ గుర్తుపెట్టుకోవాలి. ఏమిటి? 'ఈ ఉత్తబట్టబయలు ఏమీ లేదు', 'మూలము లేని యీ గుర్తెరిగే శరీరం ఏమీలేదు'. అది 16 అక్షరాలు, ఇది 12 అక్షరాలు. వీటి యొక్క వివరం చాలా దూరం వుంటుంది. తరువాత నిదానంగా తెలుసుకోవచ్చు.

'భాగవత శ్రీ కృష్ణదేశిక ప్రభువరుండిటు, రానె వచ్చెను, వేగగని తనుమన ధనంబులు వీడి శరణనవే జీవా మేలుకొనవే' – ఏమి విడిచిపెట్టాలటండీ? మన దగ్గర ఏమున్నాయి? (తనుమన ధనంబులు). అది. నువ్వు ఏం విడిచిపెడితే గురువును గుర్తించగలుగుతావు? 'నేను తనువుని, నేను మనసుని, నాకున్న ధనము' – ఈ మూడు నీలో పనిచేస్తూ వుంటాయట. ఏమిటి నీ ధనం? ప్రాణమే నీ ధనం. గుర్తు పెట్టుకోండి. ఇల్లు వాకిళ్ళు చూసి గురువు రాడు. నీకున్న ఏడంతస్తుల మేడ చూసి అస్సలు రాడు. నీకు ఏడుకోట్లు వున్నా, డెబ్బై కోట్లు వున్నా, గురువుకి ఏమీ అవసరం లేదు. నీ తనువుతో అసలు అంతకంటే పనిలేదు. ఆయన తనువే అవసరం లేదని విసిరేసినటువంటి వాడు. నీ మనసుతోటి అసలు అంతకంటే పనిలేదు. ఎందుకని? మనసే జడమైనటువంటిది. మనసు అసలు జడ స్వరూపం. ఇది ఎట్లా అయితే స్వయంగా కదలలేదో, ఆ తనువు, మనస్సు, ధనము. ఈ ధనము అంటే ఏమిటి? ప్రాణము. తనుధనమనంబులు అంటే అవి. ఆ మూడు నువ్వు అనుకుంటున్నావు. నువ్వు అది కాదనే, నిర్ణయంతోటి రా. గురువు

దగ్గరకి. అవి శరణాగతి అంటే. నువ్వు, గురువు నీకు ఎప్పుడు ఉపయోగపడుతాడయ్యా అంటే, ఆ తను మన ధనములు విడిచి వస్తే, అప్పుడు ఏ స్థితిలో వస్తావు? ఆత్మ స్వరూపుడు అనే స్థితిలో వస్తావు. నువ్వు ఆత్మస్వరూపుడు అనే లక్ష్యంలో నువ్వు వస్తే, అప్పుడు గురువు ఉపయోగపడుతాడేకానీ, తను మన ధనములు అనే లక్ష్యంతో వస్తావా? ఏమీ ఉపయోగపడడు నాయనా! చిల్లికాసుకి ఉపయోగపడడు నాయనా! గురువుని ఆశ్రయించాలి అంటే, అవన్నీ విడిచి రావాలి.

'పీలుఖాన శంకరుండని పిలిచి ప్రభువరుండేలినారట మూలమూ లేనట్టి యెఱుకను ముంచి వేసిరటా జీవా మేలుకొనవే !' – అప్పుడు ఏం చేశాడట గురువు? శిష్యుడిని పిలిచాడట. ఆయన పేరు ఫీల్‌ఖాన్. ఆయన్ను ఏమని పిలిచాడట? శంకరా ఇలా రావయ్యా అన్నాడట. ఇప్పుడు ఏ భావంలో వచ్చాడు ఆయన? ఆయన తనువు పేరు కదా! ఫీలుఖాన్ వదిలేశాడు అది. తనుభావన వదిలేశాడు కదా! ఆత్మభావనలో వచ్చాడు. కాబట్టి ఇప్పుడు ఆయన ఏమని పిలిచాడు. శంకరా అని పిలిచాడు. ఆయన పేరు అప్పటినుంచి శంకర్. ఫీలుఖానా శంకరుండని పిలచి ప్రభువరుండు ఏలినాడట – ఇప్పుడు శంకరుడు ఎక్కడున్నాడు? వేరే ఎవరు లేరు నాయనా! నువ్వే శంకరుడవు. నువ్వే దైవం. గురు శిష్య సాంప్రదాయంలో ఉపదేశం పొందగానే, నీకు తెలియవలసినటువంటి మొట్టమొదటి స్థితి ఇదే. నేనే పరమాత్మను. నేనే భగవంతుడను. నాకూ దైవానికి ఏ భేదం లేదు. అని ఎప్పుడైతే తెలుసుకుంటావో, అప్పుడు ఏమైందట? మూలము లేనట్టి ఎఱుక లేకుండా పోయింది. ఎఱుకకు మూలం లేదు. ఆ ఎఱుకతోనే కదా వీటన్నింటినీ గుర్తిస్తున్నావు! నేను శరీరాన్ని, నేను అమ్మను, నేను తల్లిని, నేను అమ్మమ్మని, నువ్వు ఎన్ని గుర్తులు పెడితే, ఆ గుర్తులు అన్నీ ఎందులోవి? ఎఱుకలోవయ్యా బాబు. ఆ ఎఱుకకు మూలం లేదయ్యా బాబు. ఆ ఎఱుకయే మాయ. ఆ ఎఱుకకు మూలం లేదు. ముంచి వేసిరటా – అది ఎప్పటికైనా మునిగిపోక తప్పదు. దానిని ఆశ్రయించావు కాబట్టి నువ్వు కూడా ఎప్పటికైనా మునిగిపోతున్నావు. దానిని ఆశ్రయించమాకు. దానిని ఆశ్రయించకుండా వుంటే, నువ్వు మునిగిపోయే పరిస్థితి రాదు.

'శ్రీ మద్రాజాధిరాజ మహరాజా యోగీంద్ర చంద్ర భాగవత కృష్ణ దేశిక ప్రభు మహరాజుకీ జై జై జై' – (స ఏక ఏవ కల్పతే ముక్తైః అటు వంటి ముక్తి వస్తుందట. అట్టి

వానికి మాత్రమే ముక్తికి అర్హత కలదు.) ఎట్టి వాడు? అని పైన చెప్పాడు అదంతా. ఆ సూత్రమంతా, దానికి ఆధారమైనదంతా పైన చెప్పాడు. ఎట్లా వుంటే ముక్తి లభిస్తుందో, అది చివరి వాక్యం. స ఏవ కల్పతే పైన చెప్పినది అంతా కనుక నువ్వు వుంటే, ముక్తి లభిస్తుంది. (అంతేనా) అది. (ఏదైనా ప్రత్యేకత ఏమో) అది చివరి వాక్యం. పైన చెప్పినదానికి చివరి వాక్యం ముక్తాయింపుగా చివరికి చెప్తున్నాడు. పైనంతా చెప్పినట్టుగా నువ్వు వున్నట్లయితే, నీకు ముక్తి లభిస్తుంది. అది సంస్కృత భాషలో అలాగ ఆ మాట అంటున్నాడు. (నిన్న చదివాను, పంచప్రాణాలు, పంచేంద్రియాలు, కర్మేంద్రియాలు, స్థూల శరీరం అదే నిన్న చెప్పినదంతా దాని గురించే, స్థూల శరీరం గురించి) ఈ వివరణ బాగా తెలుస్తుందండి వివేకచూడామణి బాగా చదివితే మీకు. (ఒకటికి నాలుగు సార్లు చదివితే) స్థిరపడిపోవాలండి. వివేక చూడామణి సహజమైపోవాలి. అర్థమైందా అండి? భగవద్గీత కంటే కూడా వివేక చూడామణి బాగా పనిచేస్తుంది. ఎందుకంటే భగవద్గీత అంతా కూడా telephone directory లాంటిది అది. అన్నీ వుంటాయి అందులో. ఒకటి వుంది, ఒకటి లేదు అని చెప్పడానికి వీలుకాదు. భగవద్గీతలో అన్నీ వుంటాయి. కానీ అన్నీ సూచన ప్రాయంగా వుంటాయన్నమాట. వివరణ వుండదు పూర్తిగా. (దీంట్లో వివరణ వుంది). ఆఁ... నువ్వు ఒక ప్రశ్న వేశావనుకో, ఆ ప్రశ్నకి ఒక ప్రశ్న ఒక సమాధానమే వుంటుంది అంతే. మళ్ళా ప్రశ్న మీద ప్రశ్న వేస్తే అక్కడ సమాధానం వుండదు. అది ఎవరన్నా వివరించి చెప్పాల్సిందే. భగవద్గీత గ్రంథాన్ని వివరించి చెప్తే కానీ వీలుకాదు. అదే ఇప్పుడు మీరు చిన్మయా మిషన్ వాళ్ళ వివేకచూడామణి చదివారనుకోండి, ఎవ్వరూ అవసరం లేదు. (ప్రశ్న సమాధానం కూడా వుంది అందులో) ఇది మామూలుగా చదువకున్నా అర్థమయ్యేట్లు సామాన్యమైన భాషలో వ్రాసింది ఆవెడ. మహానుభావురాలు ఆవెడ అన్నపూర్ణగారు. ఆవెడకి ఆత్మానుభవంతోటి స్పష్టంగా రాసేసిందన్నమాట. ఆ చిన్మయానందుల యొక్క ప్రభావం అంతా ఆవెడలో వుందన్నమాట. అన్నపూర్ణగారు చేసినటువంటి సేవ అంతా ఇంతా కాదు. ఎందుకంటే ఆయన ఇంగ్లీషులో వ్రాశారు. (చిన్మయానందులు). మహానుభావులందరూ సంస్కృతంలో వ్రాస్తే, చిన్మయానందులు విదేశీయుల కోసమని, సంస్కృతాన్ని ఇంగ్లీషులో వ్రాశారు ఆయన. ఆ ఇంగ్లీషులో వ్రాశిన దానిని ఆవెడ తెలుగుసేత చేసింది. ఆవెడకు రెండు భాషలు వచ్చు. సంస్కృతము వచ్చు,

ఇంగ్లీషుకూడా వచ్చు. తెలుగు. అందుకని ఆ రెండింటినీ దృష్టిలో పెట్టుకుని తెలుగు సేత చేసిందండి. ఆదిశంకరులేమో సంస్కృతంలో రచించారు. అది ఈయన ఇంగ్లీషులో రచించారు. కాబట్టి ఎంతో మహత్ గ్రంథం అన్నమాట వివేక చూడామణి. దాని పేరులోనే వుంది చూడండి. వివేక చూడామణి. అది. (వివేకం) ఆఁ.. అద్భుతమైనటువంటి వివేకం కలుగుతుందండి. ఎటువంటి వివేకం అంటే నేను తనువు కాదని స్పష్టంగా తేలిపోతుంది. అది పూర్తయ్యేటప్పటికి నేను శరీరం కాదని స్పష్టంగా తేలిపోతుందన్నమాట. ఎట్లా కాదో నిరూపిస్తుంది అది. నీవేమిటో, నీ గురించి ఏమిటో స్పష్టంగా చెప్పేస్తుంది. అది అనంత మానవకోట్లకి అది సమానమే. అర్థమైందా అండీ! కాబట్టి నిత్యోపాసన అంటే, రోజూ చేసేది అని అర్థం. నిత్యము అంటే ఎప్పుడైనా గుర్తు పెట్టుకోండి. 24గంటలు. ఏ పనినైనా నువ్వు 24 గంటలు చేస్తే అది నిత్యం అవుతుంది. (అంతేగానీ రోజూ చేసేదికాదు) రోజూ అంటే ఉదయం ఆరు గంటలకు లేచి ఆరు గంటలనుంచి ఆరున్నర గంటల దాకా చేస్తే అది నిత్యోపాసన అవ్వదు, నీత్య పూజ అవ్వదు అది. నిత్యము అంటే అర్థం ఏమిటంటే, ఏ పనినైతే నీవు, అన్ని నియమాలని, అన్ని ధర్మాలని, అతిక్రమించి, 24 గంటలు, ప్రాణంతో సమానంగా చేయగలుగతావో, 24 గంటలు నీలో జరిగేది ఏమిటి? ప్రాణం ఒక్కటే. మిగిలినది ఏదీ జరుగదు. మనసుకూడా కాసేపు పడుకుంటుంది. బుద్ధిగా కాసేపు పడుకుంటుంది. మిగిలినవన్నీ పడుకుంటాయి. ఒక్క ప్రాణం మాత్రమే మేల్కొని వుంటుంది. అర్థమైందా అండీ ! ఆ ప్రాణంతో సమానమైనంగా నువ్వు ఏదైతే చేయగలుగుతావో, అది నిత్యోపాసన అవుతుంది. ఇంకా... ఊర్ధ్వరేతస్కుడు అంటే అది? అప్పుడే కాదు అది. (దానికి ఇంకా టైం వుందా?) దానికి ఇంకా టైంవుంది. (అర్థం కాలేదు మొన్న ఎక్కడో వచ్చింది). అప్పుడే ఎలాగ? (సరే!)

ఓం పూర్ణ మదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే

ఓం పూర్ణ మదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే

ఓం పూర్ణ మదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే

ఓం తత్ సత్

ఓం సహనాభవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై తేజస్వి నావధీతమస్తు మా విద్విషావహై
ఓం శాంతిఃశాంతిఃశాంతిః

ఎట్టి దోషమూ లేదనమాట దీనికి. కారణం ఏమిటంటే, శ్రవణ మనన నిధి ధ్యాసనములు అనే నాలుగు సాధనముల ద్వారానే ఆత్మ విచారణ స్థిరపడాలి, వేరే మార్గము లేదు. నవవిధ భక్తి మార్గాలలో అయితే మీకు, రకరకాల అంశాలు అక్కడ వుంటాయి. చెయ్యడానికి, వినడానికి, చూడడానికి, చెప్పడానికి, అనుసరించడానికి చాలా వుంటాయి. కానీ ఆత్మ విచారణ మార్గంలో కేవలం శ్రవణం, మననం, నిధి, ధ్యాస అంటే నేను ఆత్మస్వరూపుడని అని గురువు అనుభవజ్ఞానంతో చెబుతూ వుంటే నీవు విని, దాన్ని అలాగే విన్నదానిని స్థిరపరచుకొని, దానిని మననం చేయాలి. ధారణ చేయాలి మొట్టమొదట. వేరే మార్గం లేదు. ధారణ చేసి, ఆ ధారణ చేసిన దానినే మననం చేయాలి. ఆ మననం చేసిన దాని దృష్ట్యానే నీవు దానిని స్థిరపరచుకుని జీవించాలి. ధారణ అంటే ధరించడం. మనం వస్త్రాలు ధరించడం లేదా? శరీరం ధరించలేదా? అదే సహజంగా. దానికి ఆ గీటు దాటలేని నియమానికి లోబడి జీవించాలి. ఆ నియమం ఎవరూ చెప్పరు. నీవు ఎంత కఠినంగా ఆ నియమాన్ని పోషిస్తావో, ఎంత పటిష్ఠంగా ఆ నియమం మీద నిలబడి జీవిస్తావో, నీకు ఆ అనుభవం అంతతొందరగా కలుగుతుంది. ఆత్మానుభవం కలగడానికి ఎంత? రెప్పపాటే. ఏమీ లేదండి. దీంట్లో ఎక్కువ కష్టపడాల్సిన అంశం ఏమీ లేదు. ఆత్మసాక్షాత్కార జ్ఞానం కలగాలి అంటే, ఎంత సులభమయ్యా అంటే, శత పత్రములు కలిగినటువంటి పువ్వు, అంటే 100 రేకులు కలిగినటువంటి తామర పువ్వులోనుంచి, ఒక సూదిని ఎక్కించాలంటే ఎంత సులభమో, అంతటి సులభం ఆత్మసాక్షాత్కార జ్ఞానం. ఎందుకని? అది నీవే అయివున్నావు. అక్కడ వేరేదేమీ తెచ్చేది ఏమీ లేదు. కొత్తది బోధించేది ఏమీ లేదు. కానీ ప్రతివాళ్ళు ఆత్మసాక్షాత్కార జ్ఞానం చాలా కఠిన తరం, చాలా అసాధ్యం, జీవితమంతా పెట్టే వుంది, అది అయ్యేపని కాదు, ఈ జన్మకు అయ్యేపని కాదు, ఇలా అక్కడ ఏమనుకుంటున్నారంటే, అదే మీకు ఇక్కడ చెబుతోంది. మీరందరూ కూడా మనం ఒకదాంట్లో దిగుడు బావిలో పడిపోయామండి. ఊబిలో చిక్కుకున్నామండి. ఇప్పుడు మీకు ఏం కావాలి? నువ్వు ఎంతగా తున్నుకుంటే, ఎంతగా తన్నుకున్న కొద్దీ కిందకు పోతావు. స్వప్రయత్నంతో నువ్వు ఎంతగా తన్నుకున్న కొద్దీ, అంతగా కిందకి పోతావు. కాబట్టి నీకు ఏం కావాలట? ఒక బలమైన ఆధారం వుంటే తప్ప నువ్వు పైకి రాలేవయ్యా! వేరే మార్గం లేదు. ఆ బలమైన ఆధారం ఏమిటి? నేను

ఆత్మస్వరూపుడిని అనేటటువంటి భావన బలమైనటువంటి ఆధారం. అది ఎవరు చెప్తాడు? అనుభవజ్ఞానం వున్నవాడు చెప్తాడు. అది వేరే విషయం. కాబట్టి ప్రతి ఒక్కరూ కూడా, నేను ఆత్మస్వరూపుడిని అనే భావాన్ని గనుక నీవు ఆశ్రయించినట్లయితే, ఆ ఒక్క భావనే, నిన్ను ఇందులోనుంచి బయటకు లాగేటట్లు చేసేస్తుంది. అది తప్ప నువ్వు మిగిలినవి ఏవి పట్టుకున్నా, అవి మళ్ళానిన్ను ఊబిలోకే పడేస్తాయి. వేరే మార్గం లేదు. అందువల్ల తప్పని సరిగా నేను ఆత్మస్వరూపుడిని అనే భావంలోనే, మేల్కోవాలి. నేను ఆత్మస్వరూపుడిని అనే భావంతోనే నిద్రపోవాలి.

ముందు ప్రధానంగా నిద్రా సమయాన్ని ముందు చక్కగా వినియోగించాలి. ఈ నిద్రాసమయం సాధనగా ఎవరికైతే మారుతుందో, వాడికి ఆత్మసాక్షాత్కార జ్ఞానం తప్పనిసరిగా కలుగుతుందన్నమాట. చాలా మంది దీనిని, మిగిలిన నవవిధభక్తి మార్గాలు చేసినట్టుగా, మెలకువలో ఏదో ఉదయం పూట అరగంటో, గంటో చేసి విడిచి పెడుతారు. దానివల్ల ఏమీ ప్రయోజనము లేదు. పగలు రాత్రి అనే భేదం లేకుండా, నేను ఆత్మస్వరూపుడు అనే భావంతోనే, ప్రతి ఆలోచనని ప్రారంభించాలి. ప్రతి పని, ప్రతి ధర్మం, ప్రతి చేత, ప్రతి కర్మ, ప్రతి మాట నువ్వు ఏదైనా చెయ్యి, ఇంద్రియాలని ఉపయోగిస్తే ముందు నేను ఆత్మస్వరూపుడను అనే భావంతో మొదలు పెట్టాలి.

మొదలు పెడితే అప్పుడు నీకు ఆ గుణ దోషం అంటదు. అవస్థాత్రయదోషం అంటదు. నీకు ఏ దోషము అంటదు ఇక. అంటకుండా సహజంగా సాక్షిగా వుంటావు. ఒకవేళ అక్కడ ఏదన్నా గుణాలు ప్రవర్తిస్తూ వున్నాయి, ఓహో! సాక్షిగా చూస్తూ వుంటావు అంతే. ఆహా! కాని, ఇప్పుడు అబ్బాయి అనటం లేదు మనని, అబ్బాయిలో వున్న రజోగుణం, నీలో వున్న రజోగుణంతో ప్రవర్తిస్తున్నది. ఆ రజోగుణం ఈ రజోగుణంతో మాట్లాడుతున్నదండి. అంతే, అంతకు మించి ఏముంది? మనలో ఇంకా రజోగుణం బాకీ వుందని దాని ద్వారా తెలిసింది. ఓహో! మంచిదే కదా! దాని వలన నష్టం ఏముంది? ఒక దుఃఖం కలిగింది, ఎందువల్ల కలిగింది? అజ్ఞానం వల్ల కలిగింది. అజ్ఞానం వుంటే కలిగింది. అజ్ఞానం ఎందుకు వుంది? అహంకారం వుంది కాబట్టి. దుఃఖం కలిగింది అంటే వెనుక తప్పనిసరిగా ఇవి వున్నాయి అని తెలుసుకోవాలి. అజ్ఞానం అంటే ఏమీ లేదు. ఆ మూడు గుణాలలో దూరడమే అజ్ఞానం. పాపం అంటే ఏమీ లేదు, మూడు

గుణాలలో దిగటమే పాపం. మూడు గుణాలు అంటకుండా వుండడమే పుణ్యం. మీరు అంటున్నారు చూశారా, తీర్థయాత్రలు చేస్తే పుణ్యం, యజ్ఞం చేస్తే పుణ్యం. ఈ పుణ్యం అంతా ఏమిటంటే, నీవు మూడు గుణాలని అంటకుండా వుండే అవకాశం అప్పుడు వుంది కాబట్టి పుణ్యం. నువ్వు మూడు గుణాలను అంటితే పాపం. అంతకు మించి వేరే ఏమీ లేదు నాయనా! జీవుడు అనుకొనుటయే పాపం. నేను ఆత్మస్వరూపుడిని అని స్థిరంగా వుండటమే పుణ్యం. ఇంకా వేరే ఏమీ లేదు. ఆ పుణ్య ఫలితం అంతా ఇదే. అనేక జన్మార్జితమైనటువంటి పుణ్యఫలితమంతా కలిపితే, is equal to ఏం ఫలితం వస్తుందయ్యా అంటే, ఆత్మసాక్షాత్కారజ్ఞానం వస్తుంది. కాబట్టి అందరిని పుణ్యం సంపాదించమని పెద్దలు ఆచారంగా పెట్టారు. ఎందుకని? చేయగా చేయగా చేయగానైనా గానీ, నీకు ఆ స్ఫురణ కలిగి, నేను ఎందుకు చేస్తున్నాను ఇది? ఏ నిమిత్తము చేస్తున్నాను? వెనక్కు తిరిగి చూసుకుంటే, నేను ఏదో చాంతాడంత కోరికలు చదివాను. అవేమీ తీరలేదు. అవేమీ ఆయన చేయలేదు. ఎందుకు చేయలేదు? చేయడు కాబట్టి. చేయడు కాబట్టి అనే స్థిరం అయినా రావాలి కదా! చేయడు కాబట్టి అనే స్థిరం రాలేదు. ఇంకా చేస్తాడులే, ఇంకా చేస్తాడులే అని కోరుతూ పోవడమే గానీ, ఆయన చేసేది ఒకటే ఒక పని చేశాడు. నిన్న కూడా చెప్పాను. నీకు మానవ ఉపాధిని ఇవ్వడమే మొదటి, చివరి సహాయం. ఇంకా వేరే సహాయం ఏమీ లేదు. ఇదే మొదటిది, ఆఖరి సహాయం పరమాత్మ చేసేటటువంటిది. ఎందుకంటే ఎనుబది నాలుగు లక్షల జీవరాశులలో అన్నిటికంటే ఉత్తమమైన ఉపాధి మానవ ఉపాధి. భగవంతుడిని తెలుసుకోవడానికి, సృష్టి రహస్యాన్ని తెలుసుకోవడానికి, సృష్టిని అధిగమించడానికి, ఆత్మభావంలో జీవించడానికి, నేను పరమాత్మనే అనే సహజమైన స్థితిని కలిగివుండడానికి, అవకాశం వున్నటు వంటి ఉపాధి మానవ ఉపాధి ఒక్కటే. ఈ మానవ ఉపాధిలో ఏం తరతమ భేదాలు లేవు. ఆ మానవులందరికి అర్హత వున్నది. అయ్యో! ఇది నాకు లేదని నిరాశ చెందవలసిన అవసరమే లేదు. వివేక చూడామణి ఇచ్చే మొట్టమొదటి ఆశీర్వచనమిదే. నీవు మానవుడిగా పుట్టడమే దీనికి అర్హత. వేరే ఇంకేమీ అర్హతలు లేవు. ఈ జ్ఞానం పొందాలి అంటే, మానవుడికి ఒక్కడికే అవకాశం వుంది. అదే నాయనా మొదటిది, చివరిది నీకు పరమాత్ముడు ఇచ్చే ఆశీర్వచనము. పరమాత్ముడు చేసే సహాయం.

నీకు బుద్ధిని ఇచ్చాడు, చక్కగా విచారణ చేయగలిగే శక్తిని ఇచ్చాడు. ఈ విచారణాజ్ఞానాన్ని చక్కగా వుపయోగించుకో. ఎట్లా వుపయోగించుకోవాలో అనుభవజ్ఞుడైన గురువును ఆశ్రయించి తెలుసుకో. అంతేగాని శాస్త్రం మీద ఆధారపడి విచారణ చేయమాకు. ఎందుకని? విచారణ జ్ఞానం అనేది సరైన పద్ధతి వుందన్నమాట. అంటే ఏమిటి? అసలు గురువు అంటే ఎవరో తెలియదు కాబట్టి, ఏం తెలుసుకోవాలి? గురువును వెళ్ళి ఏం అడగాలి? అని తెలియడానికి ప్రాథమికంగా శాస్త్రం అవసరం. కాబట్టి శాస్త్ర దృష్టం, శాస్త్రం ఎట్లా చూపెడుతోందో మొట్టమొదట చదివి చూసి తెలుసుకో. తెలుసుకున్న దానిని మళ్ళా ఆ శాస్త్రాన్ని పట్టుకుని మళ్ళా ఎవరి దగ్గరకు వెళ్ళాలట? అనుభవజ్ఞానం వున్నటువంటి గురువు దగ్గరకు వెళ్ళి, గురోర్వాక్యం, దానిని ఎట్లా జీవించాలో చెబుతాడు. శాస్త్రం ఏం చెబుతుందంట? ఎట్లా జీవించాలో చెప్పదు. సిద్ధాంతం వరకూ చెబుతుంది. ఇదిగో నీళ్ళను విడగొడితే హైడ్రోజన్, ఆక్సిజన్ వస్తుంది. దాని వల్ల నీకు ఏమిటి ప్రయోజనం? ఆ హైడ్రోజన్, ఆక్సిజన్ వస్తోంది అంటే అదొక సిద్ధాంతం. నీకేం ప్రయోజనం? అది ఎట్లా వుపయోగించుకుని జీవిస్తే, నీకు ఆత్మానుభవం కలుగుతుందో, నీకు తెలియచెప్పాలి అంటే, అట్లా జీవించి వున్నటువంటి మహానుభావుడు దగ్గరికైనా వెళితే, వారు నీకు ఆ సిద్ధాంతాన్ని నిజజీవితంలో ఎట్లా వుపయోగించి, జీవించాలో చెప్తాడు.

ఎందుకునయ్యా? నిన్ను నువ్వు చూసుకోవడం నీకు చేతకాదు కాబట్టి. ఎందుకని? నిన్ను నువ్వు చూసుకున్నప్పుడు పక్షపాత ధోరణితో చూస్తావు. నీ మీద నీకు పక్షపాతం వుంటుంది కదా! నీలోపల మనసు ఎటువైపుకు ఓటు వేస్తుంది? దానివైపే ఓటు వేసుకుంటుంది. నిరసించే వైపు ఓటు వేస్తుందా? వెయ్యదు కదా! అదే గురువు అయితే ఏం చేస్తాడు? గురువు దగ్గరకు ఎందుకు వెళ్ళావు? నీ లోపాలను సరిచేయమనే కదా వెళ్ళావు. కాబట్టి గురువు ఏం చేస్తాడు ఎప్పుడూ కూడా నీకు దుఃఖం కలిగే అంశాలే చెప్తూవుంటాడు. అది విన్నప్పుడల్లా నీ మనసుకి దుఃఖం కలుగుతూ వుంటుంది. ఎందుకని? నిన్ను మారమంటాడు కదా! అది సరైనది కాదు, ఇది సరైనది కాదు. అది అట్టా పనికి రాదు, ఇది ఇట్టా పనికి రాదు. ఇవి మారితేనే నువ్వు అవుతావు, లేక పోతే నువ్వు అవ్వవు. ఇట్లా కఠినంగా చెబుతూ వుంటాడు. ఏమౌతుంది? దుఃఖం వస్తుంది.

ఎందుకని? ఎత్తి చూపెడితే. నీది నీకే ఎత్తి చూపెడుతేనే నీకు దుఃఖం కలుగుతోందే, మరి ఇంతకాలం నువ్వు చేసిన పని ఏమిటి? అదే కదా!

ఇతరుల వల్ల నీకు ఎందుకు దుఃఖం ప్రాప్తించింది? నువ్వు అదే పనేగా చేశావు. కానీ అక్కడేమో జ్ఞానం రాలేదు, అజ్ఞానమే వచ్చింది. ఈ లోపాన్ని సరిచేసుకుంటే, దానిని నిరసించేసేస్తే, ఏమయ్యావు? జ్ఞానం కలిగింది. మళ్ళా దుఃఖం ఏర్పడే అవకాశం రాలేదు. ఇక. కాబట్టి నీ యొక్క సంస్కార బలాన్ని బట్టి, ఏం చేస్తే, ఎలా జీవిస్తే, నువ్వు దాంట్లో నుంచి బయటపడగలవో, అందరికీ ఒకే రకమైన సంస్కార బలం వుండదు. ఈవెడకు బోధించే సంస్కార బలం వుంది. నీకు వినే సంస్కార బలం వుంది. నీకు కొంత చెప్పే, కొంత వినే సంస్కార బలం వుంది. అట్లా ప్రతి ఒక్క జీవికి, ఒక్కోరకమైన సంస్కార బలం వుంటుంది. ఆ సంస్కార బలాన్ని బట్టే, నిజజీవితంలో అన్నీ ఏర్పడుతాయి. అర్థమైందా అండీ!

నాకు కఠినాతికఠినంగా పనిచేసే సంస్కారబలం వుంది. కాబట్టి నిరంతరాయంగా అట్లా కఠినంగా పనిచేసేటటువంటి పరిస్థితులే వస్తూ వుంటాయన్నమాట. ఎందుకని? ఉపాధి ధరించినప్పుడు లోపల వున్న సంస్కారబలం అట్లా వుంది. అర్థమైందా అండీ! ఆ కఠినమైనటు వంటి శ్రమ కూడా రజోగుణమే. ఆ కఠినమనే శ్రమ లోపల వుండిపోవడం, దానితో దేహం ఏర్పడింది. అందువలన ఏమైంది? కఠినమైన పనులే వస్తాయి, ఇక ఎప్పటికీ కూడా, కఠినమైన పనులన్నీ ఇక చేయవలసిందే అంతే! పోయేదాకా చేయాల్సిందే. ఎందుకని? దేహం ఏర్పడిందే దాంతో ఏర్పడింది. దాన్నేమీ తప్పించడానికి వీలుకాదు. ఎంతటి సుఖంగా చేయగలిగిన పనైనా సరే, దీనికి వచ్చేటప్పటికి అత్యంత కఠినమైపోతుంది అది. ఎందుకని? అదే నాయనా రహస్యం. ఇదే సృష్టి రహస్యం. తెలుసుకోండి. అరె వాడు ఈజీ గానే చేస్తున్నాడు కదా! వాడికి అది ఈజీనే. ఎందుకని? అందులో వున్నటువంటి వాడి గుణ బలం అలావుంది. వాడి గుణబలం. సత్వగుణంతో వున్నాడు, సుఖంగా పూర్వజన్మ. నిదానంగా జరిగిపోతూవుంటుంది. అర్థమైందా అండీ!

రజోగుణం, తమోగుణంతో వుంటావు. కఠినం అంతా వుంటుంది అందులో. కాఠిన్యం అంతా మరి ఎక్కడికి పోతుంది? బాగా మెడలు వంచి పనిచేస్తే కానీ, అది పోదది. అందుకని ఏమౌతుంది? (ఏ పని చేద్దామన్నా ఆటంకమే నాకైతే). ఇదే కదా నేను

చెబుతోంది. అది తమోగుణ ప్రభావమన్నమాట. తెలుసుకోవాలి మనం. ఓహో! మనలో తమోగుణ ప్రభావం వుంది కాబట్టి, ప్రతిదానికి ఆటంకం వస్తున్నది. తమో గుణాన్ని నిరసించేస్తేగానీ అది పోదు. అర్థమైందా అండీ!

అట్లాగే, దేహం ధరించడానికి ప్రధానంగా మూడు నాలుగు సంస్కారాలే కారణం అవుతాయి. మన మిగిలిన జీవితం అంతాకూడా చాలా ఇతరత్రా సంస్కారాలు చాలా వుంటాయన్నమాట. అవన్నీ కూడా మనం విచారణ చేసి పోగొట్టవచ్చు. కానీ దేహం ధరించడానికి కారణమైన ప్రారబ్ధం ప్రారబ్ధం అంటున్నావే, ఆ ప్రారబ్ధం – ఆరబ్ధ కర్మ అంటారండి. ప్ర+ఆరబ్ధ. పూర్వం నుంచి ఇప్పుడు వచ్చింది అని అర్థము. ప్రారబ్ధము అంటే ఏమి లేదు అక్కడ అర్థం. సంస్కృత పదం కదా అది. ప్ర అంటే ముందు. ఆరబ్ధం ముందు నుంచీ ఇప్పటివరకూ వచ్చింది. అని అర్థము. అర్థమైందా అండీ! ఆ ప్రారబ్ధం అంటే ఏమిటయ్యా అంటే, దేని చేత అయితే ఈ దేహం ఏర్పడిందో, ఏ సంస్కార బీజములచేత దేహం ఏర్పడిందో, అదే ప్రారబ్ధం.

ఇక అది అంతే. ఎందుకనయ్యా? ఆ దేహం దానితోనే ఏర్పడిందయ్యా! బాబు! దానిని ఏం చేయాలి? ఆత్మజ్ఞానంతోనే శుద్ధిచేయవచ్చు. వేరే మార్గం లేదయ్యా! ఎందుకని? వేరే నువ్వు ఎంత ప్రయత్నం చేసినా దేహం దానితోనే ఏర్పడింది, అది వచ్చి కూర్చుంటుంది ముందు. అర్థమైందా అండీ! నేను ఎన్నో ప్రయత్నాలు చేశానండీ, ఏదీ ముందుకు సాగలేదండీ! అని చెప్పేవాళ్ళు చాలా మంది వుంటారు. కారణం ఏమిటి? ఆ దేహం అట్లాగే ఏర్పడింది. అదొచ్చి ముందు కూర్చుంటుంది. అది పోగొట్టాలి అనంటే, వేరే ఇతరత్రా జ్ఞానాలతో దానిని శుద్ధి చేయడానికి వీలుకాదు. నిన్నటి నుంచి చెబుతున్నది ఇదే. ప్రాణ మనో బుద్ధులు అనే సూక్ష్మంలో వుంటాయి సంస్కారాలు, వాసనలు. వేరే ఎక్కడా వుండవు. ఆ ప్రాణ మనో బుద్ధులను ఆశ్రయించే ఈ శరీరం పని చేస్తోంది. నువ్వు శరీరానికి వాతలు పెడితే ప్రయోజనము లేదు. దానిని సరిచేయాలి. దానిని సరి చేయాలి అంటే నువ్వు విచారణ చెయ్యాలి. ప్రాణ మనో బుద్ధులని శుద్ధి చేయాలి అంటే విచారణ చేయాలి. అర్థమైందా అండీ! దేహాన్ని 10సార్లు తోమినంత మాత్రాన ప్రాణ మనో బుద్ధులు బాగుపడుతాయా? బాగుపడవు కదా! పోనీ దీనికి పైనుంచి కింది వరకు తడిబట్టలు బురఖా వేస్తే ఏమన్నా మారిందా? ఏమన్నా ప్రాణ మనో

బుద్ధులు మారవు కదా! కాబట్టి సూక్ష్మాన్ని సూక్ష్మంగా బుద్ధిని బుద్ధితోనే పరిష్కరించాలి. ముల్లుని ముల్లుతోనే తియ్యాలి. వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి అనే సామెతలు అన్నీ ఇందులోంచి వచ్చినవే. బుద్ధి యొక్క సమస్యను బుద్ధితోనే పరిష్కరించాలి. దానిని ఎటు తిప్పితే విచారణని ఏ లక్ష్యం దృష్ట్యా తిప్పితే దాని పరిష్కారం వస్తుందో, అట్లా విచారణను తిప్పాలి. అంతేగాని ముడిపడిపోయే పద్ధతిలోకి తిప్పకూడదు.

ఇప్పుడు మనం ఎలా జీవిస్తున్నాము? మరింతగా సంస్కార బంధాలు బలపడిపోయేట్లుగా, ముడులు వేసుకుంటున్నావు ఇంకా. బాగా ముడులు వేసుకుంటున్నావు. ఎంతగా ముడులు వేసుకుంటున్నావు అంటే, ఇక విప్పడానికి వీలుకానంతగా ముడులు వేసేసుకుంటున్నావు. మళ్ళా ఉత్తర జన్మకు విప్పాల్సిందే, మళ్ళా వచ్చేజన్మకు విప్పాల్సిందే. వీటిని. ఈ జన్మకు విప్పడానికి వీలు కాదు ఇక. అంతగా ముడి వేసేసుకున్నావు. మరి ఈ జన్మకు కనీసం విప్పే జ్ఞానం అన్నా వుండాలి కదా! (విప్పాలి అని) అది ఆ తెలివితేటలు అన్నా రావాలి కదా! అదైనా కనీసం ఈ జన్మలో స్ఫురిస్తే, అది ఏమౌతుంది? వీలైతే ఈ జన్మలోనే బంధ రాహిత్యం కలుగుతుంది. బంధాలనుంచి బయటపడవచ్చు. లేదయ్యా అధవా, ఏం నష్టం లేదు నాయనా! ఈ జ్ఞానం తప్పని సరిగా వచ్చే ఉపాధికి ఉపయోగపడుతుంది నాయన. ఎలాగ నాయనా? బాబూ ఎనభైనాలుగులక్షల జీవరాశుల్లో నువ్వు జీవించినప్పుడు ఏ జ్ఞానాన్నైతే ఒక్కొక్క ఉపాధిలో సముపార్జించావో, ఆ జ్ఞానమంతా నీకు మానవ ఉపాధిలో ఉపయోగపడుతుంది కాబట్టే, అవి చేయగలిగిన అన్ని పనులూ నువ్వు ఇప్పుడు చేయగలుగుతున్నావు. అర్థమైందా అండీ! అన్ని జంతువులు చేయగలిగిన అన్ని పనులూ మానవుడు చేయగలడు. ఆ జ్ఞానం అంతా మానవుడిలో వుంది. అందుకే చూడండి ఒక్కొక్కడికి ఒక్కో విద్యలో రాణింపు వుంటుంది. ఒకడు తీగల మీద నడువ గలడు. వాడు ఎట్లా నడువగలిగాడు? మనం ఎందుకు నడువ లేకపోయాము? (చీమలు, బల్లి నడుస్తాయిగా). వాడిలో ఆ తెలివి, ఆ సంస్కార బలం బలీయంగా వుంది. ఆ పని చేయగలుగుతున్నాడు. అర్థమైందా అండీ! ఈ రకంగా ఆ ఉపాధిని ధరించేటప్పుడు నీకు ఏ సంస్కారబలమైతే వున్నదో, దానిని బట్టే నీకు ఏర్పడుతూ వున్నాయి. కొంతమంది వికలాంగులుగా, కొంతమంది సకలాంగులుగా పుడుతున్నారుగా. మరి వాళ్ళెలా

పుడుతున్నారయ్యా? ఆయా ఇంద్రియ ధర్మాలను, ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా, అంటే ఏమిటి? మానవ ఉపాధిగా కాకుండా జంతువు ఉపాధిగా దానిని వుపయోగించి నట్లయితే, సృష్టి యొక్క వినాశనానికి, సృష్టినియమానికి తప్పి వుపయోగించి నట్లయితే, గాఢ తమోగుణంతో గనుక వుపయోగించి నట్లయితే, అప్పుడు ఆ ఇంద్రియ లోపం ఏర్పడుతుంది. సృష్టి నియమం అన్నమాట అది. సృష్టిలో ధర్మంగా అలా వచ్చేస్తుంది అది. కాబట్టి అందుకని ఏం చెప్పారు? నాయనా! చేతులతో మంచి పనులే చేయి. చెడ్డపనులు చేయమాకు. ఉత్తరోత్తరా ఏమౌతుందట? వచ్చేజన్మకు? ఇంద్రియాలు ఏ నియమం నిమిత్తమై ఈ సృష్టిలో ఏర్పరచబడ్డాయో, ఆ నియమం మేరకే వాటిని నీవు ఉపయోగించు నాయనా! నియమం తప్పి వుపయోగిస్తే, అవి బలహీనం అయిపోతాయి. ఉత్తర జన్మకైనా బలహీనం అయిపోతాయి. అవి లేకుండా పోలేదు. వున్నాయి. కానీ వుపయోగపడవు. అర్థమౌతుందా అండీ! వికలాంగుడు అంటే ఏమిటి? వాడికి లేదా? మానసిక వికలాంగుడు వున్నాడు, వాడికి బుద్ధి లేదా? వుంది, కానీ ఉపయోగపడదు. గ్రుడ్డివాడు కళ్ళు లేవా? వున్నాయి, కానీ వుపయోగపడవు. అర్థమైందా అండీ! ఇలా ప్రతిదీ అంతే. అలా ఆ వికలాంగత్వము ఎలా వచ్చిందయ్యా నీకు? ఆ ఇంద్రియాలను సక్రమంగా సృష్టి నియమాలకు లోబడి వినయోగించలేదు కాబట్టి, సృష్టి ఒక నిర్ణయం చేసింది, ఒక రహస్యం, ఇదే సృష్టి రహస్యమంటే నండి. అదేం చేసింది? వచ్చే ఉత్తర జన్మకి, సంస్కార బలమంతా వచ్చే జన్మకు ఏం చేసిందంటే, ఆ అనుభవ పాఠం రావాలి అంటే, ఆ పరిణామ పాఠం రావాలి అంటే, ఆ ఇంద్రియం బలహీనపడిపోయేట్టుగా తల్లి గర్భంలో ఇంద్రియాలను సృజించింది. ఎక్కడ సృజించిందంట? తల్లి గర్భంలోనే సృజిస్తున్నది. మా అబ్బాయికి మూడో ఏడు వచ్చినాక పోలియో వచ్చిందండి. పొరపాటు. మూడో యేడు వచ్చిన తరువాత పోలియో రావడం, మూడోయేడు వచ్చినాక మానసిక వికలాంగుడు అవ్వడం ఏమీ వుండదండీ! మూడేళ్ళ వరకూ బాగానే వున్నాడండీ! తరువాత వచ్చిందండీ అంటారు. ఎలాగ? అది లోపల already వుంది. తయారయ్యేటప్పుడే వుంటుంది. అలాగే. ఉదాహరణ చెబుతా మీకు. బందరులో మా ఇంటి పక్క ఒక అమ్మాయి వుండేది. ఆ అమ్మాయి M.Sc చదివింది. ఏమీ లేదు ఒక రోజు వున్నట్టువుండి జ్వరం వచ్చి పడిపోయింది అంతే! హాస్పిటల్‌కు పట్టికెళ్ళారు. జ్వరమే కదా అనుకున్నారు,

ఊరుకున్నారు. ఏమీ కోలుకోలేదు. మంచంలో పడిపోయింది. ఎందుకు మంచంలో పడిపోయిందో తెలియదు. శరీరం నల్లబడిపోయింది. ఎందుకు నల్లబడిపోయిందో తెలియదు. వెంటనే ఎవరో చూసిన వాళ్ళు అన్నారు, ఈ అమ్మాయికి heart disease వున్నట్టుగా వుంది, చూపెట్టండి. అన్నారు. వెళ్ళి చూపెట్టారు. చూపెడితే అప్పటికి గుండె పాతిక శాతమే పనిచేస్తోంది. 75% పనిచేయడం లేదు. మరి మొన్న M.Sc చదివేవరకు బాగానే వుంది కదండీ! వారంలోనే గుండె పనిచేయడం 75% ఎలా పడిపోయింది? మొన్నటిదాకా బానే వుంది కదండీ! (అది క్రమేపీ క్షీణిస్తూ వచ్చింది) క్రమేపీ కాదు. లోపల వున్న సంస్కార బలానికి సమయం, time scale వుంటుందన్నమాట. ప్రతీదానికీ కూడా సమయం మేరకు రాసి వుంటుంది. ఇదిగో ఇన్ని ఆయుర్దాయములు, ఇన్ని ఆయుష్షులు, ఇన్ని హంసలు పూర్తి అయ్యేటప్పటికి ఇది వ్యక్తీకరించబడాలి. తల్లి గర్భంలోనుంచి శిశువు బయటకు ఎలా వస్తోంది? లెక్క ఎలాగ? సమయం లెక్క ఎలాగ దానికి? దానికి ఎలా తెలిసింది? చెప్పండి. బయట వున్న వాళ్ళకు, మీకైతే సమయం లెక్క తెలుస్తుంది. గడియారం చూసుకుంటున్నారు. తల్లిగర్భంలో వున్న శిశువుకు ఎలా తెలిసింది? ఆయుష్షు. (ఏమో దేవుడికే తెలియాలి) అదే పొరపాటు. ఏడవ నెల నుంచి స్వీయ శ్వాస పనిచేస్తూ వుంది. ఆ 21,600 హంసలు జరుగుతూ వున్నాయి. అప్పటినుంచే దానికి లెక్క మొదలయ్యింది. ఆ లెక్క మొదలయ్యేటప్పటికి ఆ లెక్క ప్రకారం సంస్కార బలం, ప్రారబ్ద బలం చెబుతోంది. నీ టైం అయిపోయిందిరా బాబు. బయటకు రా ఇక. నీ లోపల వున్నటువంటి అంతరాత్మ, సాక్షి అక్కడినుంచే పనిచేస్తుంది. మరి ఇప్పుడు ఎవరు పనిచేశారు? ఇదీ అదే! అంతరాత్మ సాక్షే. టైం అయిపోయింది రా బాబు. ఒక్క సారి 75% గుండె పనిచేయడం తగ్గిపోయింది. ఎన్నో ప్రయత్నాలు చేశారు. అటు తిరిగారు, ఇటు తిరిగారు. ఎన్ని చేసినా సరే, నేను కూడా వెళ్ళాను. ఓహో! సమయం అయిపోయింది. ఆ అమ్మాయికి చెప్పాను. అమ్మాయ్! నీ సమయం అయిపోయింది. మిగిలినటువంటి సమాయాన్ని నువ్వు ఇప్పుడు దుఃఖంతో కాకుండా, సుఖంగా వుండే పద్ధతిలో చూసుకో నువ్వు. అని ఆ అమ్మాయికే స్వయంగా చెప్పాను. ఆ అమ్మాయికి తెలుసు, నా టైం అయిపోయిందని ఆ అమ్మాయే చెబుతోంది. నా టైం అయిపోయింది, మీరు దుఃఖపడవద్దు అని తల్లిదండ్రులకు చెబుతోంది. ఇప్పుడు ఎవరికి జ్ఞానం వుంది? (ఆ

అమ్మాయికే వుంది). అయ్యో! మరి చూడండి. అర్థమైందా అండీ! మానవుడికి లోపల సహజంగా జ్ఞానస్వరూపుడంటే ఇదే నేను చెప్పేది. ఆ సహజజ్ఞానం తప్పనిసరిగా వుంటుంది ఎప్పుడూ కూడా. అది ఎక్కడికీ పోదు. కానీ నువ్వు దానిమీద విషయావరణ చేత, ఇంద్రియావరణ చేత కప్పుకున్నావు. నీవే కప్పుకున్నావు. అన్నమయ్యకోశాన్ని, ప్రాణమయ కోశాన్ని, మనోమయకోశాన్ని, విజ్ఞానమయకోశాన్ని, ఆనందమయ కోశాలు అనే పంచకోశాలని నమ్ముకుని, ఆ పంచకోశాలే నీవు అనే పద్ధతిలో జీవిస్తూ, ఐదు దుప్పటిలు కప్పుకున్నావు. ఐదు ఆవరణలు కప్పుకున్నావు. ఆ జ్ఞానం మీద. అంతరాత్మ అనే జ్ఞానం మీద. అందువల్ల ఏమైపోయింది? ఏదో ఒక కోశ పరిధిలో చేరిపోవడమే అలవాటు పడ్డావు కానీ, నేను సాక్షిని, ఈ ఐదు కోశాలకి అనేటటువంటి స్ఫురణని మర్చిపోయావు. తద్వారా ఏమైంది? సహజంగా అలాంటి పరిస్థితి ఎదుర్కోగలిగే స్థితి వచ్చినప్పుడు గానీ, ఆ జ్ఞానం బయటకు రాదు. అంటే రామకృష్ణ పరమహంస అంటారు, '**దారి లేనటువంటి సందులోకి వెళ్తే కానీ నీకు ఈశ్వరస్ఫురణ కలుగదు**'. నీకు అసలు మార్గమే లేదు, బయటపడే అవకాశమే లేదు అన్నప్పుడే అన్యథా శరణం నాస్తి అన్నప్పుడే ఈశ్వరుని యొక్క స్ఫురణ కలుగుతోంది. అప్పుడే నీకు ఆత్మ స్ఫురణ కలిగే అవకాశం వున్నది. నీకు ఆత్మజ్ఞానం అప్పుడే తోస్తుంది. అప్పటి వరకూ తోచే అవకాశం లేదు నాయనా! ఎందుకని? ఇదిగో ఇవన్నీ పెట్టుకున్నావు కాబట్టి. కాబట్టి ముందే మేలుకో! ముందు మేలుకొని ఈ ఐదు దుప్పటిలను, ఈ ఐదు ఆవరణలను విసిరి అవతల పారేయ్! ఆ భావం, ఆ ఐదు ఏమిటి? భావములు. బాహ్యాము కాదు అవి ఏవీ కూడా. ఆ భావంలో వాటిని తోసి రాజు అనవయ్యా! సాక్షిగా నిలబడవయ్యా! అప్పుడు నీ ఇంద్రియాలు నిన్ను ఏమీ చెయ్యవు, నీ విషయాలు నిన్ను ఏమీ చెయ్యవు, నీ పంచకోశాలు నిన్ను ఏమీ చెయ్యవు. నీ మూడు అవస్థలు నిన్ను ఏమీ చెయ్యవు. అవన్నీ అలా వుంటాయి. నీ ఇంట్లో అన్ని వస్తువులు లేవు? ఏ సమయానికైతే ఆ వస్తువును తీసి వాడటం లేదా? మళ్ళా ఆ వస్తువు అక్కడకు పోతుంది, ఏమౌతుందట ఇప్పుడు? ఆ వస్తువును ఉపయోగిస్తున్నావు, శుద్ధి చేస్తున్నావు, మళ్ళా అక్కడ పెడుతున్నావు, మళ్ళా అవసరం వచ్చినప్పుడు ఉపయోగిస్తున్నావు, శుద్ధి చేస్తున్నావు, అక్కడ పెడుతున్నావు. ఇదీ అంతేనయ్యా బాబూ! ఆ ఇంద్రియంతో అవసరం వచ్చింది, వాడావు, శుద్ధి చేశావు, పక్కన

పెట్టావు, భావంతో అవసరం వచ్చింది, ఈ భావాన్ని వాడావు, దీనిని వుపయోగించావు, తీశావు, పక్కన పెట్టావు.

కానీ ఎప్పుడైనా గానీ, వుపయోగించేవాడవు కదా నువ్వు. సాక్షివి కదా నువ్వు. కానీ గిన్నె నువ్వు ఎందుకు అయ్యావు? అర్థమైందా అండీ? గిన్నె నువ్వు అయితే ఏమైపోయావు? అప్పుడు మంట మీద కాలక తప్పదు నాయనా! దానిని ఎవరూ తప్పించడానికి వీలుకాదు. నువ్వు అదేగా చేస్తున్నావు. నువ్వు వంట చేసేటప్పుడు నువ్వు వెళ్ళి మంట మీద కూర్చున్నావా? కూర్చోలేదు కదా! ఎందుకని? నీ పనిముట్టును ఉపయోగించావు అక్కడ. అలాగే ఇది పనిముట్టుగా చూశావు, అప్పుడేమైంది? శరీరం పనిముట్టు అయిపోయింది. నువ్వు శరీరం కాదన్నమాట ఇక. అదే శరీరం నువ్వు అయ్యావు. అప్పుడు కచ్చితంగా మంట మీద కూర్చోక తప్పదు. ఆ దుఃఖానుభవం పొందక తప్పదు. దానిని తప్పించడానికి వీలుకాదు. ఇలాగ నీ జీవితం అంతా పనిచేస్తూ వున్నది. (మొన్నకటి చెప్పారు, శివుడు వేరు, ఈశ్వరుడు వేరు అంటారేమిటి?) ఎట్లాగయ్యా అంటే, ఈ సృష్టి అంతాకూడా ఎలా వున్నది అనేదానికి విధాన నిర్ణయం వున్నదన్నమాట. అంటే మనం అందరం ఎట్లా అయితే తల్లి తండ్రి కొడుకు మనవడు అని నువ్వు ఎట్లా అయితే ఇక్కడ చెప్పుకుంటున్నావో, అలాగే ఇక్కడ పనిచేయడానికి రాజు, మంత్రి వగైరా ఎలాగైతే పరిపాలనా విధానం వున్నదో, అలాగే పైన కూడా సూక్ష్మంలో కొన్ని విధాన నిర్ణయాలు వుంటేనే కదా, ఈ సూక్ష్మం సరిగా పనిచేసేది? అందుకని వాటిని ఏం చేశారయ్యా అంటే, ఈ సృష్టి సరాసరి వ్యక్తమైందా అవ్వలేదు కదా! ముందు ఇంద్రియ అధిష్టాన దేవతలు వ్యక్తమైనారు. ఆ దేవతల నుంచి ఇంద్రియాలు వ్యక్తమైనాయి. అంటే అర్థం ఏమిటి? మీరు రోజూ చదువుకుంటూ వుంటారు, '**చంద్రమా మనసో జాతః సూర్యో చక్షురజాయతా**' అని, అంటే అర్థం ఏమిటి? మనస్సు యొక్క అధిష్టాన దైవం ఎవరు? చంద్రుడు. అంటే చంద్రుడు సృష్టిలో ఏర్పడ్డాక, చంద్రుని ప్రభావం చేత జీవులకు మనస్సు ఏర్పడింది. అర్థమైందా అండీ! చంద్రుని ప్రభావం చేత, జీవులకు మనస్సు ఏర్పడింది. అలాగే సూర్యో చక్షు రజాయతా! నీ కన్ను పనిచేస్తుందయ్యా అంటే, ఈ కన్ను యొక్క అధిష్టాన దైవం ఎవరు? సూర్యుడు. సూర్యుడు వుండబట్టి కన్ను పనిచేస్తుంది. కాబట్టి సూర్యుని ప్రభావం చేత నీకు కన్ను ఏర్పడింది. కళ్ళు లేనటువంటి జంతువులు

లేవా? క్రిమి కీటకాదులు ఎన్నో వున్నాయి. కొన్ని లక్షల జీవరాశులు. కోట్ల జీవరాశులకు కన్ను లేదు. అర్థమైనదా అండీ? ఆ సూర్యదేవుని యొక్క అనుగ్రహము, ఆ సూర్యాధిష్టాన దైవం, ఆ దైవం యొక్క అనుగ్రహం చేత నీకు కన్ను పనిచేస్తుంది. ఇట్లా నీ యొక్క ప్రతి ఇంద్రియానికీ కూడా ఒక అధిష్టాన దేవత వున్నారన్నమాట. ఆయా అధిష్టాన దేవతల ప్రభావం చేత నీ ఇంద్రియాలు పనిచేస్తున్నాయి. అనేది మీకు పంచీకరణలో చెబుతారన్నమాట. ఆయా పంచీకరణలో చూసినప్పుడు, ఏమిటయ్యా మరి, బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదా శివుడు. ఈ ఐదుగురూ కూడా పంచబ్రహ్మలు అని పిలువబడుతారు. ఈ ఐదుగురు పంచ బ్రహ్మలు. వీళ్ళే ఈ సృష్టి మొత్తాన్ని నడిపేది. ఎవరయ్యా? బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివులు. రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు ఒక్కరు కాదా? అంటే ఏమిటి? పూర్వం భక్తి భావంలో చూసుకొన్నప్పుడు నీకు ఈ జ్ఞానంతో పనిలేదు కదా! అంతా ఒక్కటే. నీకు బ్రహ్మ, విష్ణువు, శివులు వుంటే చాలు అప్పుడు. (అంతేకదా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు). అంటున్నావు. కానీ, వివరణ చెప్పమంటే, తెలీదు. బ్రహ్మ ఎలా పనిచేస్తాడు? ఏ స్థితిలో వుండి పనిచేస్తాడు? ఏ శక్తితో పనిచేస్తాడు? ఎలా ఈ సృష్టిని నియమించగలుగుతున్నాడు? ఎలా సృజించ గలుగుతున్నాడు? తెలుసా నీకు? తెలియదు. అలాగే విష్ణువు ఎలా పోషించగలుగుతున్నాడు? అలాగే రుద్రుడు ఎలా లయించగలుగుతున్నాడు? లయకారకుడు రుద్రుడు కదా! లయించడం అంటే అర్థం ఏమిటి? మనందరి దృష్టిలో? లేకుండా చేయడం. నాశనం చేయడం. అని కదా మనందరి అర్థం. కానీ లయించడం అంటే నాశనం చేయడం అని అర్థం కాదు. దీనికి ముందు వున్న స్థితి, సృష్టికి ముందు వున్న స్థితికి సృష్టిని పట్టుకు వెళ్ళేవాడు. మరలా సమయం వచ్చినప్పుడు సృష్టి వ్యక్తీకరించబడుతుంది. అర్థమైందా అండీ!

కాఫీలో పంచదార కలిపారండీ! పంచదార కాఫీలో లయం అయ్యిందా? లేకపోతే లేకుండా పోయిందా? లయం అయిపోయింది. ఎందుకని? కాఫీకి ఆ లక్షణం వచ్చిందిగా. వచ్చిందా రాలేదా? నీళ్ళల్లో ఉప్పు కరిగిందండి. లయం అయ్యిందా అవ్వలేదా? (లయం అయిపోయింది కదా!) లయమయిపోయాక నీళ్ళకు ఇప్పుడు ఆ లక్షణం వచ్చిందా రాలేదా? (ఉప్పగా వుందిగా ఉప్పు లక్షణం) అలాగే, ఈ సృష్టి

లేకముందు స్థితి నుంచి ఈ సృష్టి వచ్చింది. అంతే కదా! ముందు ఈ సృష్టి లేదు కదా! అందులోంచి ఈ సృష్టి వచ్చింది. ఆ రావడానికి బ్రహ్మ కారణం. అలా తయారు చేయడానికి బ్రహ్మ కారణం. వచ్చిన సృష్టిని సరిగ్గా నడపడానికి కారణం విష్ణువు. ఈ నడిపేటటువంటి సృష్టి మరలా సృష్టి ముందు వున్నటువంటి స్థితికి పోవడానికి రుద్రుడు. అయిపోయిందిగా మరి. మరి మహేశ్వర, సదాశివులతో నీకేం పని? అంటే, ఈ రెండు స్థితులు కూడా ఇంకా పై మెట్టులో వున్నాయి. అంటే ఎక్కడిదాకా మాట్లాడుకుంటున్నావు? స్థూలము, సూక్ష్మము, కారణము వరకే మాట్లాడుకుంటే, బ్రహ్మ విష్ణు రుద్రులే. కారణం పైన ఏమీ లేదా? మహాకారణం వున్నది కదా! మహాకారణం పైన ఏమీ లేదా? దానిపైన ఇంకా కేవలం వుంది కదా! మరి వీటన్నింటికి సంబంధించిన పంచశక్తులు చెప్పుకుంటున్నాం కదా! పంచశక్తులు అంటే ఏమిటి? ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి, ఆది శక్తి, పరాశక్తి. మరి ఐదు శక్తులు వున్నాయి కదా! పంచబ్రహ్మలు, పంచశక్తులు. అర్థమైందా అండీ?

బ్రహ్మ దగ్గర ఏముండాలి? సృష్టించాలి అంటే ఇప్పుడు? ఇచ్ఛాశక్తి వుండాలి. సృష్టించాలి అంటే ఇచ్ఛాశక్తి వుండాలి కదా మరీ! విష్ణువు దగ్గర ఏముండాలి? పోషించాలి అంటే? (క్రియాశక్తి) అంతే కదా మరీ! క్రియ లేకపోతే ఆయన ఏమన్నా పోషించ గలడా? ఏమన్నా పనులు చేయగలుగుతాడా? చేయలేడు కదా! కాబట్టి క్రియాశక్తి ప్రభావం చేత కదా విష్ణువు. మరి లయించాలి అంటే సృష్టికి ముందువున్న జ్ఞానం వుంటేనే కానీ, ముందున్న స్థితికి తీసుకెళ్ళలేరు కదా సృష్టిని. కాబట్టి రుద్రుడికి ఏముండాలి? జ్ఞానశక్తి వుండాలి కదా! మరి మహేశ్వరుడికి ఏముండాలయ్యా? ఆ సృష్టికి ముందువున్న స్థితిలో మహేశ్వరుడు వున్నాడయ్యా! అదయ్యా ఆదిశక్తి. అందుకే కదా ఏమంటున్నావు? ఆదిశక్తి నుంచే అంతా ఉద్భవించిందండి అని అంటున్నావుగా. అంటే సృష్టికి ముందు వున్న స్థితి ఏమిటి? ఆది శక్తి. ఈ సృష్టి ఏమీ ఏర్పడలేదండి. ముందున్న స్థితిలో ఏముంది? ఆది శక్తి వుంది. ఆ ఆదిశక్తే ఇన్నిశక్తులు అయ్యిందయ్యా! అంటున్నాము కదా ! మాటకు అంటున్నావు. కానీ జ్ఞానంలోకి వచ్చేటప్పటికీ మాత్రం అట్లా నిలబడటం లేదు. అట్లా చూడటం లేదు. అట్లా చూస్తే ఏమైంది అప్పుడు? ఈ సమిష్టి అంతా ఎలా పని చేస్తుందో అవగాహన అయ్యింది. సృష్టి రహస్యం అంతా బోధపడింది.

ఇప్పుడు ఏమైంది? ఆదిశక్తికి అధిష్టానం మహేశ్వరుడు. దానికంటే ముందున్న స్థితి వుందయ్యా! సృష్టి ఏర్పడే ముందున్న స్థితి కంటే కూడా, అసలు ఏమీ కదలకుండా వున్న స్థితి ఒకటుందయ్యా! దానికి సదాశివుడయ్యా. ఆ సదాశివుడి దగ్గర ఏముందయ్యా? పరాశక్తి వుందయ్యా బాబు. శక్తికి పరమైనటువంటిది. అంటే శక్తే ఏర్పడలేదయ్యా అసలు. ఆది శక్తి అనే శక్తి ఏర్పడ్డాక సృష్టి ఏర్పడింది. అసలు శక్తి కూడా ఏర్పడక ముందు ఏముందయ్యా? అది పరాశక్తి అయ్యా. శక్తికి పరమైనటువంటిది. అక్కడ ఎవరయ్యా అధిష్టానం? సదాశివుడయ్యా! అని ఏర్పాటు చేశారు. కాబట్టి నీవు ఏ లక్ష్యంతో జీవించాలట ఇప్పుడు? ఈ కనీసం సదాశివత్వం, పరాశక్తి స్థితి సదాశివత్వం వరకూ నీకు అనుభవానికి, అవగాహనకి వస్తే, నీకు బ్రహ్మానుభవము అంటే ఏమిటో తెలుస్తుంది. బ్రహ్మ విద్య అంటే ఏమిటో తెలుస్తుంది. బ్రహ్మజ్ఞానము అంటే ఏమిటో తెలుస్తుంది. ఇది నాయనా బ్రహ్మానుభవము అంటే. పంచబ్రహ్మలు, పంచశక్తులతో ఈ అనంతసృష్టి ఎట్లా జరుగుతోంది, ఎట్లా వస్తోంది, ఎలా పోతోంది? చివరకు పోయిన తరువాత మళ్ళా ఏమౌతుంది? ఇదంతా నీకు అనుభవానికి వస్తే, ఈ సమిష్ట్యానుభవం కలిపి బ్రహ్మానుభవం అంటారు. కాబట్టి, నువ్వు అనుకునే రూపాలు అవికావు. నువ్వు అనుకునే బ్రహ్మ అంటే చతుర్ముఖ బ్రహ్మ, లేకపోతే నాలుగు చేతులు ధరించిన విష్ణువు, లేకపోతే ఎప్పుడూ మెడలో పాములు వేసుకునే శివుడు ఈ ఆకారాలన్నీ నీవు భక్తి మార్గంలో ఏర్పాటు చేసుకున్నవే గానీ, యథార్థంగా అలా లేవు అవి. అవన్నీ స్థితులే కానీ అక్కడ ఆకారం లేదు. అవన్నీ కేవలం స్థితులు. బ్రహ్మ అనే స్థితి, విష్ణువు అనే స్థితి, రుద్రుడు అనే స్థితి. ఇవన్నీ నీలోపల కూడా వున్నాయి నాయనా! మీరు లలితా సహస్రనామంలో చదివేటప్పుడు చెబుతున్నారు కదా! బ్రహ్మగ్రంధి విభేదిని – ఎక్కడుందండి? మణిపూరాం తరుదితా విష్ణుగ్రంధి విభేదిని, అవునా అండీ! దాని కంటే క్రింద ఏముందండీ? మణి పూరక చక్రం ముందు బ్రహ్మ గ్రంధి విభేదిని, మూలాధారం స్వాధిష్ఠానంలో వున్నాడు బ్రహ్మగ్రంధి. అర్థమైందా అండీ? మణిపూరాం తరుదితా విష్ణుగ్రంథి విభేదిని. అవునా అండీ! మరి ఎక్కడున్నారు వీళ్లు అంతా? నీలోపలే వున్నరయ్యా! వాళ్ళందరూ నీలో వుంటేనే నీ శరీరం పని చేస్తోందయ్యా. నీవల్ల నువ్వు ఏదో చేస్తున్నావు అనుకుంటున్నావు, నీ వల్ల నువ్వు ఏమీ చేయడం లేదు నాయనా! ఈ అధిష్టాన దేవతలు అందరూ నీలో

పనిచేస్తేనే, నీ శరీరం అనే యంత్రం పనిచేస్తోంది. నీ ప్రాణ మనో బుద్ధులకు అధిష్టాన దైవంగా వుండి వారందరూ నీ సూక్ష్మాన్ని నడిపితే నీ స్థూలం నడుస్తోంది. నువ్వు కర్తను అంటావేమిటి? నేను చేశాను అంటావేమిటి? నేను పెట్టానండీ 150 కాయల ఆవకాయి. ఏంటి నువ్వు పెట్టింది ఆవకాయి? ఎలా పెడతావు? ఆ కర్త, క్రియ, కర్మ ఎవరు? నీవు కాదు కదా! నీ ఇంద్రియాలకు అధిష్టాన దేవతలు. అయితే వాళ్ళు. కాదంటావా? బాహ్యంలోకి వస్తావా? నీ ఇంద్రియాలు. నువ్వు ఎలా అయ్యావు? నువ్వు కాదు కదా! నీవు ఎవరివి? ఈ పంచబ్రహ్మలకి, ఈ పంచశక్తులకి కూడా అధిష్టానం అయినటువంటి బ్రహ్మస్వరూపుడవు. '**ఏకమేవాద్వితీయం బ్రహ్మ**' - ఒకేఒక్కడుగా వున్నటువంటి స్థితిలో వున్నటువంటి బ్రహ్మజ్ఞానం ఏదైతే వుందో అది నీవైవున్నావయ్యా. ఆ పరమాత్మ నీవయ్యా బాబు. ఆ పరమాత్మ నుంచి, ఈ పంచ బ్రహ్మలు, ఆ పంచశక్తులు ఉత్పన్నమైనాయి. ఈ సృష్టి అంతా నడుస్తూ వుంది. ఆ పరమాత్మవు నీవు అవుతావు గానీ, ఈ ఐదు బ్రహ్మలు నీవు కాదు, ఆ ఐదుశక్తులు నీవు కాదు. మరి ఎందుకని? అది నువ్వైతే సూక్ష్మం నువ్వు అవుతావు. సూక్ష్మం నువ్వు కాదు కదా మరి! నేను ఎవరిని? సాక్షిని కదా! కాబట్టి ఇలా విధాన నిర్ణయం తెలుసుకోవాలి. ఇలా తెలియనంతవరకూ కూడా (ఈశ్వరుడికీను, శివుడికి ఇదీ తేడా) ఆః.. అంటే అర్థం ఏమిటంటే, సాధరణ నామంలో ఈశ్వరుడు అని వాడేస్తాము. ఎందుకని? జగదీశ్వరుడు, జగత్తంతా వ్యాపించి వున్నవాడు ఈశ్వరుడయ్యా. అని సాధారణ నామంలో వాడేస్తారు. శివుడు అన్నారు, శివుడు అంటే శుభము కలిగించేది, అదీ సాధారణంగా వాడేదే, ఆ ఈశ్వరుడు అన్నవాడికీ స్పష్టత లేదు, ఈ శివుడు అన్నవాడికీ స్పష్టత లేదు. ఎవరికైతే ఈ పంచీకరణ క్రమం తెలుస్తుందో, వారికి తెలుస్తుంది. ఓహో! ఎక్కడ మాట్లాడుతున్నాడు? దేనికి సంబంధించి మాట్లాడుతున్నాడు. ఏ స్థితి గురించి మాట్లాడుతున్నాడు? ఈ జ్ఞానం వున్నవాడికి తెలుస్తుందన్నమాట.

వ్యష్టిగా ఆత్మజ్ఞానం వుండాలి, సమిష్టిగా బ్రహ్మజ్ఞానం వుండాలి. ఈ రెండు అనుభవ జ్ఞానాలు వున్నవాడికి, అతను ఏ స్థితి గురించి మాట్లాడుతున్నాడని అంచనా తెలుసుకోగలుగుతాడు. కాబట్టి బ్రహ్మవిద్యయే అన్నిటికి మూలమైనటువంటి విద్య. చావు లేని విద్య చదువంగ వలయు. విద్యలన్నీ చదివామా ఇప్పటికి? అందరూ బోల్లెడు

certificates సంపాదించారా? ఏం చదువుకోలేదు? చావు లేని విద్యను చదువుకోలేదు. అర్థమైందా అండీ?

చదువులన్నియు చదివి చదివి చావంగ నేటికి చావులేని విద్య చదువంగ వలయు అని వేమనార్యుడు చెప్పాడు. అర్థమైందా అండీ! కాబట్టి ఎన్నో డిగ్రీలు, మన జీవితంలో ఏం చేస్తామంటే, రెండు డిగ్రీలు సంపాదిస్తాము. ఇంకా ఖాళీగా వున్నాం కదా అని ఇంకో రెండు డిగ్రీలు సంపాదిస్తాము. ఇంకా ఖాళీగా వున్నాం కదా అని ఇంకో రెండు కట్టమంటాము. ఇంకో రెండు కట్టావు. ఏమైంది? వరుసగా రాసుకోవడానికి ఆరు డిగ్రీలు వున్నాయి. కానీ తరువాత ఏం చేస్తావు? మరణకాలంలో ఇవేమీ పనికిరావే. కాబట్టి మరణకాలంలో నీకేదైనా పనికి వచ్చేది వుందయ్యా అని అంటే, సాధన చతుష్టయ సంపత్తి తప్ప, మరేదీ పనికి రానిదే.

ఈ సాధన చతుష్టయ సంపత్తిని తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పొందవలసిందే. సాధించవలసిందే. అదేమిటయ్యా? మొట్టమొదటిది నిత్యానిత్య వస్తు వివేకము. మొదటిది నిత్యానిత్య వస్తు వివేకము. ఏమిటయ్యా? అది, నిత్యానిత్యవస్తువివేకము అంటే, ఏది నిత్యము, ఏది అనిత్యము? నిత్యము అంటే ఎల్లకాలము వుండేది, ఏ మార్పు చెందనిది, శాశ్వతమైనటువంటిది. అది నిత్యము. అర్థమైందా అండీ! దానికి ఆద్యంతములు లేవు. రాకడా పోకడా లేవు. అది నిత్యమైనటువంటిది. అనిత్యమైనటువంటిది దానికి వ్యతిరేకం. రాకడాపోకడా వున్నది, మార్పుచెందేది. శాశ్వతం కానిది. స్థిరం కానిది. చలించేది. దీనికి ఎన్ని లక్షణాలైనా మనకు తెలిసినవన్నీ పెట్టుకోవచ్చు దానికి. ఇప్పుడు మనకు బాగా తెలిసినది ఏది? అనిత్యం. అనిత్యంలోనుంచి ఏం తీసేయాలట ఇప్పుడు? అనిత్యంలో నీకు స్ఫురిస్తున్నవాటన్నిటినీ ఉల్టా, వ్యతిరేకంగా జీవించాలి. వ్యతిరేకంగా భావనను మార్చి నిరసిస్తే తప్ప, అది పోదు. అంటే అర్థం ఏమిటి? నీకు స్ఫురిస్తున్నవన్నీ కూడా అనిత్యమని తెలుసుకుని, వాటిని భావనలో నిరసించాలి. నిరసిస్తేనే, అది సాధ్యమౌతుంది. (ఆ భావన కూడా బలపడిపోతున్నది కదా!) ఎందుకని? అట్లాకాదు, నిరసించాలనుకున్న కొద్దీ అంటే అక్కడ ఏం చెయ్యాలట? అదే నీకు చెప్పింది, నీలో నువ్వు తన్నుకుంటూ వుంటే ఊబిలో

క్రిందకు దిగిపోతావు, నువ్వేంచేయాలట అసలిప్పుడు ముందు? అలా నిరసించాలి అనుకుంటే, నిరసించాలి, నిరసించాలి అంటే నిరసించలేవు. దానిని ఏ భావన, ఏ వాక్యాన్ని దాని ఎదురుగుండా పెడితే, అది నిరసించబడుతుందో, అది తెలుసుకుని దానిని పెట్టాలి. అంటే అర్థం ఏమిటి? ఉదాహరణ చెబుతాను చూడు.

ఒకడికి మౌనంగా వుండడమే వాడి సంస్కారబలంలో వుందండి. వాడికి ఆ సంస్కారబలం వదిలిపోవాలి, జ్ఞానం రావాలి అంటే ఏం చెయ్యాలి? బాగా మాట్లాడించాలి. నిరంతరాయంగా మాట్లాడడం అభ్యాసం చేయాలి. అభ్యాసం చేస్తే గాని, ఆ మౌనంలో వున్నటువంటి తమోగుణం పోదు. (మౌనంలో కూడా తమోగుణం వుందా?) ఆఁ... . వుంది కదా! ప్రతిదాంట్లో వుంటుంది. అర్థమైందా అండీ! ఒకడికి విపరీతంగా మాట్లాడే అలవాటు, వీడిని ఏం చెయ్యాలి ఇప్పుడు? వీడినేంచెయ్యాలి? వీడికి మౌనాన్ని పెట్టాలి. (రజోగుణమా అది?) అంతేకదండీ మరి! మాట్లాడాలి అంటే రజోగుణం కావాలి. (విపరీతంగా మాట్లాడుతాడు) అంతే కదా! దానికేంచెయ్యాలయ్యా సాధన? మౌన సాధన చెయ్యాలి. నీకు నువ్వే చూసుకోవాలన్నమాట! నీ సంస్కార బలం ఎలా వుంది? నీ ఆలోచన ఎలా పనిచేస్తుంది? దానికి ఏం చెయ్యాలట ఇప్పుడు వెంటనే? వ్యతిరేకం చెయ్యాలి. దానికి వ్యతిరేకంగా నువ్వు జీవించాలి. వ్యతిరేకంగా జీవిస్తేనే కానీ అది balance అవ్వదన్నమాట. అదిపోదు అది. మీరు ఒకటి గుర్తుపెట్టుకోండి. ఈ అనంత సృష్టిమీదా ఒక రహస్యం వున్నదండి. ఏదైనా సరే, నీవు ఒక పక్కకి వెళ్ళిపోతూ వుంటావు, సృష్టి ఏం చేస్తుందంటే, దానిని balance చేయడానికి వ్యతిరేక దిశలో ఏర్పాటు చేస్తూ వుంటుంది ఎప్పుడూకూడా. ఎందుకని? సృష్టి అంతా ఎప్పుడూ సమత్వంలోనే వుంటుంది. అసమతౌల్యంగా ఎప్పుడూ వుండదండి. అది జీవుడైనా, భావమైనా ఏదైనా సరే! కాబట్టి, ఈ నడక అంతాకూడా సమత్వంగా వుండేటట్టు చేస్తుంది. అదే పరిణామ పాఠం అంటే, వేరే ఏమీ లేదు. అర్థమైందా అండీ! కాబట్టి నీవు సాధన ద్వారా తెలుసుకుని, ఆ దిశగా ప్రయత్నం చేస్తే, తొందరగా సమత్వం వచ్చేస్తుంది. '**సర్వసమత్వం రానిదే ఆత్మసాక్షాత్కారం రావడం అసాధ్యం**'. ఇది గుర్తుపెట్టుకోండి.

నీకు అడ్డం ఏమిటయ్యా? భేదభావమే అడ్డం నాయనా! ఆత్మ నీలో వున్నటువంటిది, నీది నీకు తెలియకపోవడానికి, నిన్ను నువ్వు తెలుసుకోలేక

పోవడానికి, నీకు నువ్వు కనపడక పోవడానికి, కారణం ఏమిటయ్యా అని అంటే, భేదభావములే కారణం. అది తీసేస్తే, సర్వసమత్వాన్ని గనుక నీవు నిజజీవితంలో సాధిస్తే, నీవు జీవించేటప్పుడే సాధించాలండి, ఇదేదో నేను పుస్తకం చదివాను, రాత్రి సినిమా చూశాను, టీవిలో చూశాను, అంతమంది కట్టిన ఆశ్రమాల దగ్గరకు వెళ్ళాను, నువ్వు ఎన్నైనా చెయ్యి, నీకు నిజజీవితంలో సర్వసమత్వభావన రావాలి.

అందుకే స్పష్టంగా రామకృష్ణ పరమహంస దగ్గరకు వచ్చి ఒకాయన ఉపదేశం అడుగుతాడన్నమాట, నాకు ఉపదేశం చేయండి అని, ఈ వీధి చివర ఒకాయన వుంటాడు, ఆయన దగ్గరకు వెళ్ళు పో, అంటాడు. అక్కడ ఒకాయన కుప్పతోటి ప్రక్కన భోజనం చేస్తూ వుంటాడు. చెత్తకుండీ వుంటుంది కదండీ! దాని పక్కన విస్తరాకులో భోజనం చేస్తూ వుంటాడు. ఆయనతోపాటు ఒక కుక్క విస్తరాకులో భోజనం చేస్తూ వుంటుందన్నమాట. ఆయన దగ్గరకు వెళ్తాడు ఈయన. ఈయనేమిటి? మంచి సన్యాసి, జటలు వగైరా అన్నీ రెడీ చేసుకుని వచ్చాను కదా నేను. Tip top గా తయారయ్యి వచ్చాడు ఉపదేశం తీసుకుందామని. ఆయన దగ్గరకి వెళ్ళాడు. వెళ్తే ఆయన పైకీ, క్రిందకీ చూశాడు, ఆయన పనిలో ఆయన వున్నాడు. ఈయన స్వామీ, మరి ఆయన చెప్పినాయన ఎవరు? పరమహంస. ఈయన ఇక్కడ చూస్తే, ఏముంది? ఇక్కడ పరిస్థితి ఎలా వుంది? ఆయన ఉపదేశం అంటే ఆయన ఏమనుకుని వచ్చాడు? ఏదో ఆశ్రమము, విధానము, పీఠము, మహానుభావులు వుంటారు, వెళ్ళి కాళ్ళమీద పడితే, ఏమన్నా చెబుతారు, ఏదో ఉపదేశం చెబుతారు అనుకొని, మంత్రం చెబుతాడని అనుకొని వచ్చారు. కానీ ఇక్కడ ఈయన ఎలా వున్నాడు? చెత్తకుండీ పక్కన విస్తరాకులో భోజనం చేస్తున్నాడు, ఈయనతోపాటు కుక్క తింటోంది, ఈయన అలా వున్నాడు. ఈయన దగ్గరికి పంపించాడు ఏమిటి? ఆయన అసలు? ఆయనకు బుద్ధి వుందా? ఈయన ఆలోచన చూడండి! ఆ పరమహంసగారికి ఏమన్నా బుద్ధి వుందా? ఈయన దగ్గరకు నన్ను పంపడమేమిటి? ఇలా తోస్తుందండీ! ఒక్క క్షణంలో తెప్పరిల్లాడు. పరమహంస అంతటి మహానుభావుడు ఈయన దగ్గరకి పంపించాడు అంటే, ఇందులో ఏదో రహస్యం వుంది, మర్మం వుంది. లేకపోతే ఎందుకు పంపిస్తాడు నన్ను? సరే చూద్దాం ఇప్పుడు ఏం పోయింది అనుకున్నాడు ఆయన. అడిగాడు మహానుభావా, పరమహంసగారు నన్ను

పంపించారండీ, మీ దగ్గర ఉపదేశం తీసుకోమని అని. ఆయన పైకీ కిందకీ చూసి మళ్ళా తనపనిలో తాను వున్నాడు. ఎందుకని? ఉపదేశం చెప్పేంత సమయం రాలేదు. ఎందుకని? అంతకు ముందు ఏం తోచింది ఈయనకి? పరమహంస గారిని బుద్ధి హీనుడు అనుకున్నాడు కదా! ఆ భావన ఆయనకు తెలియదా? సరే! మళ్ళా ఆయన పనిలో ఆయన వున్నాడు. మళ్ళా కాసేపు ఆగాడు, ఆగిన తరువాత మళ్ళా అడిగాడు. పైకీ కిందకీ చూచి, ఈయన చేతిలో ఏముందట? కమండలం వుంది కదా! అన్నీ పట్టుకుని సిద్ధమై వచ్చాడు కదా! ఉపదేశానికి. అందులో ఏముంది అన్నారట? పవిత్రగంగానదీ తీర్థం వుందండీ ఇందులో అన్నాడట. ఓహో! ఇదేమిటి అన్నాడట, అది చీచీచీ మురికి కాలువలో వున్నటువంటి నీరు అండీ! అన్నాడట. ఆ గంగానదీ తీర్థము, ఈ మురికి కాలువలో నీరు రెండూ ఒకటిగా నీకు ఎప్పుడు తోచినచో, అప్పుడు రా పో! అన్నారట. అర్థమైందా? ఉపదేశం పొందడానికి అర్హత ఏమిటట ఇప్పుడు? (ఆ నీరు ఈ నీరు ఒకటే) ఆ౯.. సర్వ సమత్వభావమే ఉపదేశానికి అర్హత. అంటే అర్థం ఏమిటయ్యా అని అంటే, ఉపదేశం పొందిన వెంటనే నీకు ఆత్మసాక్షాత్కార జ్ఞానం కలగాలి. కనీసం సంవత్సరంలోపు కలగాలి. అది చాలా ఎక్కువ సమయం. ఉపదేశం పొందిన సంవత్సరంలో ఆత్మసాక్షాత్కార జ్ఞానం కలిగితీరాలి. అలా కనుక కలుగక పోయినట్లయితే ఆ ఉపదేశం వృధా అయిపోతుంది. నీ జీవితకాలానికి అది ఉపయోగపడదు. మళ్ళా వేరే మార్గం ప్రయత్నం చేయాల్సిందే నువ్వు ఇక. అప్పుడు ప్రయత్నించిన విధానం సరిపోలేదన్నమాట. కాబట్టి అందరూ ఉపదేశాలు తీసుకుంటారు, అది ఎందుకు కలుగలేదయ్యా అంటే, నీకు సర్వ సమర్పణ భావం ఏర్పడలేదు. అది ఏర్పడేటట్టుగా ముందు నిన్ను నువ్వు బాగు చేసుకోలేదు. అర్థమైందా అండీ! విత్తనాలు వేయాలంటే ఏం చెయ్యాలండీ? క్షేత్రాన్ని బాగుచేయాలి కదా! భూమిని దున్ని, బాగా చదును చేసి, నీళ్ళుపెట్టి ready చేయాలి కదండీ! మనం అలా చేయలేదన్నమాట. ప్రాణ మనో బుద్ధులను చక్కగా, వ్యవసాయం చేయడానికి అనువుగా, తీర్చిదిద్దలేదన్నమాట. ఆ విత్తనాలు, జ్ఞానబీజాలు మొలకెత్తడానికి కావలసినటువంటి విధంగా దానిని తయారు చేయలేదు. మొదటినుంచి చేయలేదు కదా! ఇప్పుడేగా మొదలు పెట్టావు. చేయి ఇప్పుడు. అందుకని ఉపదేశం కావాలని ఎవరి దగ్గరకైనా

వెళ్ళేముందు అది తీసుకనే అర్హత నీకు వుందో లేదో చూసుకో! ఏముండాలంట అర్హత? గంగానదీ తీర్థము, మురికి కాల్వలోని నీరు రెండూ ఒక్కతీరుగా ఎప్పుడు తోస్తే, అప్పుడు నీకు అర్హత వచ్చేసినట్లే. ఎందుకనిట? సర్వ సమత్వ భావన. అప్పుడు ఈయన ఇక్కడినుంచి తిరిగి వెళ్ళిన తరువాత ఆయన అడిగారట. అయ్యా! వారు ఎవరండీ అని? వారు సదాశివబ్రహ్మేంద్రులు నాయనా! అవధూత వారు. అదేమిటండీ? మరి అలా వున్నారు? అదే నాయనా! అవధూతలు అంటే. వారికి సర్వ జీవుల యెడలా ఒకే ప్రేమ. వారిని వారు ఎట్లా చూసుకుంటారో, ఆ కుక్కలో కూడా వారే వున్నారు. వారు ఇద్దరూ కలిసి చక్కగా భోంచేస్తున్నారు కదా! విస్తర్లో. మరి అదేమిటండీ? అది అంతే నాయనా! వారే కదా ముక్తులంటే! వారికి ఏ భేదభావన లేదు. ఏ జీవి యెడలా లేదు. ఈ అనంత సృష్టి పరమాత్మగానే తోస్తుంది ఆ ముక్తుడికి. అన్యంగా తోచదు. ఎంతటి హీనుడైనా సరే, వారికి పరమాత్మగానే తోస్తాడు. అర్థమైందా అండీ! హత్యలు చేసినవాడైనా సరే, వ్యభిచారి అయినా సరే, ఆత్మహత్యకు పూనుకున్నవాడైనా సరే, ఎంతటి హీనుడు, ఇహలోకంలో ఎంతటి హీనుడు, ఎంతటి నీచుడు అని నీవు అంటున్నావో, వాళ్ళందరూ పరమాత్మ స్వరూపులుగా తోస్తారు ముక్తుడికి. ఈ అవధూతలు కానీ, ఈ ముక్తులు అందరూ ఎవరి కోసం వున్నారని ప్రశ్న అడిగాడు, వీళ్ళంతా ఎవరు? వాళ్ళ లాంటి వాళ్ళకోసమే వున్నరయ్యా! నీలాంటి వాళ్ళ కోసం లేరు పో! అన్నారాయన. అర్థమైందా అండీ!

ఎవరైతే హీనుడు, దీనుడు వున్నాడో, ఆ హీనుడు హీనుని యొక్క హైన్యాన్ని, దీనుడి యొక్క దీనత్వాన్ని పోగొట్టడమే ఆ ముక్తుల యొక్క పని. వేరే ఏమీ లేదండి. వాళ్ళు ఎవరి పక్షం వహిస్తారయ్యా? వాళ్ళు వాళ్ళ పక్షమే వహిస్తారయ్యా! ఎందుకని? వాళ్ళు సృష్టిచేత బాధించబడినటువంటి వాళ్ళు. ప్రారబ్ధ కర్మచేత బాధించబడుతున్నటువంటి వాళ్ళు. ఆ గుణ ప్రభావం చేత, ప్రారబ్ధ కర్మ ప్రభావం చేత, అలా హీనుడు, దీనుడు అయిపోయాడు. ఆ హీనుడు, దీనుడుని ఉద్ధరించడమే వాళ్ళ పని. ఎందుకని? మిగిలిన వాళ్ళ వల్ల ఎవరి వల్ల అవ్వదయ్యా! అది. మామూలు సామన్య మానవుల వల్ల అయ్యే పని కాదు. సమాన్యజ్ఞానం వున్నటువంటి వాడివల్ల అయ్యేపని కాదు. ఎవడైతే సహజంగా ముక్తస్థితిలో వున్నాడో, వాడు ఎవరి పక్షం వహిస్తాడయ్యా అంటే, ఇదిగో ఇలాంటి హీనుడు, దీనుడు అయినటువంటి వాడి పక్షం వహిస్తాడయ్యా! భగవద్గీతలో

వున్నటువంటి అర్జున విషాదయోగం చెబుతున్నది ఇదే. ఎందుకు శ్రీ కృష్ణుడు అర్జునిని పక్షం వహించాడయ్యా? అతను దీనుడై శరణుజొచ్చాడు. ఎంతో సవ్యసాచి అయ్యుండి, ఎంతో శస్త్రాస్త్ర బలం వుండి, దైవీ సంపత్తి వుండి, అన్ని రకాల లక్షణాలు వుండీ కూడా, ప్రారబ్ధ కర్మ వశం చేత దీనుడు అయిపోయాడు. రాజ్యం కోల్పోయాడు, అడవులపాలు అయ్యాడు, అజ్ఞాత వాసం చేశాడు, సర్వం హరించిపోయింది. అంత దీనత్వం వచ్చిన తరువాత కానీ, నీవే సర్వస్వం అని అనలేదు. అందుకని ఆ అర్జున విషాదయోగ ప్రభావం చేత, తరువాత భగవద్గీత బోధించవలసిన అవసరం వచ్చింది. లేకపోతే అర్జున విషాదయోగంతో పనిలేదు. అర్థమైందా అండీ! కాబట్టి నీవు కూడా, నీ గొప్పలన్నీ విడిచిపెట్టి, నీ ప్రత్యేకతలు అన్నీ విడిచిపెట్టి, సామాన్యంగా క్రిందికి దిగివచ్చి, సర్వసమత్వభావంతో నీవు ఎప్పుడైతే వుంటావో, వెంటనే నీకు ఉపదేశ అర్హత కలుగుతుంది.

ఉపదేశాన్ని కనుక నీవు ఉపదేశపద్ధతిలో జీవిస్తే, సంవత్సర కాలంలో లోపల కచ్చితంగా ఆత్మానుభవం కలిగి ముక్తుడవు అవుతావు. సద్గురువు సచ్ఛిష్యుడు గనుక, అర్హత కలిగినటువంటి సద్గురువు, అర్హత కలిగినటువంటి సచ్ఛిష్యుడు లభిస్తే, ఆరునెలల కాలంలో, ముక్తి సిద్ధము. ఆరు నెలలు చాలా ఎక్కువ అంటాడు పరమహంస. అర్థమైందా అండీ! ఎందుకనిట? నీకు అర్హత లేదు అంతే! సచ్ఛిష్యుడు అనే అర్హత పొందు నువ్వు మొట్టమొదట. దానికి ప్రయత్నం చేయ్. నువ్వు సచ్ఛిష్యపదవికి ప్రయత్నం చేస్తే, అన్నీ సాధ్యమే. ఎందుకని? సద్గురువుతో సమానంగా, అనుభవాన్ని పొందగలిగే అర్హత ఆ ఒక్కడికే వుంది. మిగిలిన వాళ్ళు అందరూ అనుసరించే వాళ్ళు. అనుసరించే వాళ్ళకి అవకాశం వుండదు. ఈ అనుసరించే వాళ్ళల్లో వీళ్ళందరినీ దాటుకుంటూ ఒకడు వెళతాడు. ఎవడు వాడు? వాడు సచ్ఛిష్యుడు. వాడు మొట్టమొదటివాడన్నమాట. వాడు రెప్పపాటు కూడా గురువాక్యంలోనుంచి అవతలికి వుండడు. వాడి అర్హత అది. వాడి సామర్థ్యం అది. నిర్ణయం చేసేస్తాడు అంతే! గురువాక్యం ఇంతవరకే వుంది కాబట్టి, ఇంతవరకే జీవిస్తా. ఏదైనా కానీ. అనంత సృష్టిని త్యజిస్తాడు. త్యాగేనైవ అమృతత్వ మాసీత్ అని అందరూ చెప్పుకుంటున్నారు. దానికంటే ముందు వున్నాయి. న ధన – నిర్ధనేన, న ప్రజయా, నర్ధనే అని ముందు వాక్యం వుంటుంది. అంటే ప్రజల వల్ల కానీ, ధనం

చేత గానీ, మరేదాని చేతగానీ నీకు అమృతత్వం కలుగదు. కేవలము త్యాగము చేతనే కలుగుతుంది. ఏమిటి త్యజించాలయ్యా? నీ గుణాల్ని త్యజించు, నీ అవస్థలను త్యజించు, నీ పంచకోశాలను త్యజించు, నీ ఇహాన్ని త్యజించు, నీ జ్ఞానాన్ని త్యజించు, నీ సర్వాన్నీ త్యజించవయ్యా! నీవు అనుకుని ఇప్పటివరకూ ఎన్నైతే పెట్టుకున్నావో అవన్నీ త్యజించవయ్యా! (త్యజించు త్యజించు అంటున్నారు కానీ...) భావనలో. (భావనే అంత తేలికగా బలపడడంలేదు కదా!) అభ్యాసబలం. ఒక్కటే గుర్తుపెట్టుకోండి, (ఎక్కడికక్కడ అదే వచ్చేస్తుంది కదా!) ఎప్పటికప్పుడు అభ్యాసం. అందుకే భగవద్గీత అంతా దేని చుట్టూ తిప్పుతుంది? '**అభ్యాసయోగయుక్తేన**' స్పష్టంగా చెబుతోంది. నీకు రెండు వుండాలి. అభ్యాసం అంటే ఏమిటి? విద్య నేర్చుకోవడం అభ్యాసం. కొత్తగా జీవించడం. నూతన జీవితం. ఒక్కటే గుర్తుపెట్టుకోండి, మనం గురువును ఆశ్రయించాము అంటే మనం నూతన జీవితాన్ని తీసుకున్నాం. అర్థమైందా అండీ! పూర్వకాలం నుంచి ఉపదేశం తీసుకునేవాళ్ళు ఏం చెప్పేవాళ్ళో తెలుసా? ఏమండీ మీకు ఎంత వయసండీ అని చెబితే, ఉపదేశం తీసుకున్న దగ్గరనుంచి ఎంతకాలమైతే అంత వయసే చెప్పేవారు. అర్థమైందా అండీ? ఒక పదేళ్ళు అయ్యింది అనుకోండి, నా వయస్సు పదేళ్ళే అని చెప్పేవాళ్ళు. వాళ్ళకు 60 ఏళ్ళు వుండచ్చు. ఏవండీ మీరు అరవైయేళ్ళవాళ్ళా? అది శరీరం వయస్సు. నూతన జీవితం ప్రారంభించి ఎంతకాలం అయ్యింది? నా వయస్సు పదేళ్ళేనండి. కాబట్టి గురువును ఎప్పటినుంచైతే నీవు ఆశ్రయించావో, నీ పూర్వ జీవితాన్ని నీవు మరచిపో! అర్థమైందా అండీ! మరచిపోవడం నీ చేతులోనే వుంది. నీ చేతిలో లేకుండా పోలేదు అది. నీ పూర్వ జీవితాన్ని నీవు మరచిపో. నూతన జీవితాన్ని జీవించు గురువు చెప్పినట్టుగా. నూతన జీవితం ప్రాప్తిస్తుంది. ఆత్మానుసార జీవితం ప్రాప్తిస్తుంది. ఆత్మానుభవం సాధ్యమౌతుంది. అందుకని గురువు ఎప్పుడూ ఏం చెబుతూ వుంటాడు? నీ పూర్వజీవితంలో వున్నటువంటి సంస్కారాలన్నీ అంచనా వేసే, అవన్నీ చెబుతూ వుంటాడు. అవన్నీ మరచిపో, అది వదిలేసుకో, ఇది వదిలేసుకో. అట్లా మారు, ఇట్లా మారు అని చెబుతూ వుంటాడు. ఇలా అన్నీ కూడా. అది నీకు నువ్వే విచారణ చేసినప్పుడు ఏమౌతుంది? అందుకని రోజు నిద్రపోయేటప్పుడు విచారణ చేయమంటున్నాము. నీకు నువ్వే విచారణ చెయ్యాలి. ఏది నిత్యము, ఏది అనిత్యము? ఇది నాయనా నువ్వు రోజు

నిద్రపోయే ముందు చేయవలసిన పని. అది అప్పుడు నిద్ర అంతా సాధన అవుతుంది. ఆ నిద్రా సమయము అంతా సాధనా సమయం ఎవరికైతే అవుతుందో, ఎవడైతే ఈ నిత్యానిత్య వస్తువివేకాన్ని విచారణ చేస్తాడో, వాడయ్యా సాధకుడు. ఏమిటి వాడు సాధించేది? ముక్తిని మాత్రమే సాధిస్తాడు. ఇంక మిగిలినవి ఏవీ సాధించే అవకాశమే లేదు. ఎందుకనిట? అది ఒక్కటే సాధ్యం, అది ఒక్కటే సాధించవలసినది కూడా. మిగిలినవి ఏవీ సాధించనక్కర్లేదు. అవన్నీ నీ సంస్కారబలం మేరకు ఏవి రావాలో అవి వస్తూ వుంటాయి, ఏవి పోవాలో అవి పోతూ వుంటాయి. అర్థమైందా అండీ! నువ్వు ఏదో ప్రయత్నం చేసి బ్రహ్మాండం బ్రద్ధలు కొట్టాననంటే వట్టి అబద్ధం. One town లో నా పాత ఇల్లు వుంది, ఓహ్! నేను 30 యేళ్ళు వున్నానండీ అంటావా? దాన్ని వదిలేసి ఇక్కడ మూడు అంతస్థుల మేడ కట్టానండి. ఓహో! అలాగా. అది పోవడమూ ప్రారబ్దములో భాగమే, ఇది రావడమూ ప్రారబ్దములో భాగమే. అది సంస్కార బలములో భాగమే, ఇది కూడా సంస్కార బలములో భాగమే. అది గుణబలములో భాగమే. ఇది గుణబలములో భాగమే. నేను అనేది దాంట్లోను లేదు, దీంట్లోను లేదు. కట్టింది నీవు కాదు, పడగొట్టింది నీవు కాదు. అర్థమైందా అండీ! (అదీ శాశ్వతం కాదు, ఇదీ శాశ్వతం కాదు). ఎందుకని? నిత్యానిత్య వస్తు వివేకంతో చూడు ఒక్కసారి. ఏది వదిలేశావు? ఏదీ వదిలెయ్యలేదు. అన్నీ జ్ఞాపకంలో భద్రంగా దాచిపెట్టుకున్నావు. ఇంక వదిలేసింది ఏమిటి? (వదిలేద్దామన్నా వదలడం లేదు కదా!) అదే చెబుతున్నది. వదిలేటటువంటి వాక్యాలు నీ దగ్గర వుండాలి. ఆయా స్ఫురణ కలిగినప్పుడు దానికి వ్యతిరేకవాక్యం నీకు స్ఫురించాలి. అందుకని వేదాంత వాక్యాలు ఏకరువు పెట్టి చెప్పేది. ఎందుకు ఇంత వరుసగా ధారా ప్రవాహంలా మాట్లాడుతారు? అంటారు. ధారాప్రవాహంగా ఎందుకు మాట్లాడుతున్నాడయ్యా అంటే, ఈ మాట్లాడేటప్పుడు ఈ వరుసక్రమం మాట్లాడుతున్నాడే ఇందులో వేదాంత వాక్యాలు వచ్చేస్తూ వుంటాయన్నమాట. ఆ వాక్యాలను పట్టుకో. ఆ వాక్యాలను కనుక మనసులో స్థిరం చేత, శ్రవణ మనన నిధి ధ్యాసలు ఆ వాక్యాల యెడ చేయాలన్నమాట. చేస్తే ఏమౌతుంది అప్పుడు? నీకు బలంగా ఇవి స్ఫురించగానే ఇటు కూడా ఇవి బలంగా స్ఫురిస్తుందన్నామట. స్ఫురించగానే ఏమౌతుంది? దీనికి దీనికి పోటీ వస్తుందన్నమాట. ఇప్పటి వరకూ నీకు పోటీ లోపల లేదు. ఒక పక్షమే వుంది. రెండో పక్షము లేదు.

ఎందుకని బలవంతంగా గురువు ఇటుపక్క ఎక్కిస్తున్నాడు తన శక్తినంతా ధారపోసి? నీ మనసులో వీటిని నిక్షిప్తం చేస్తున్నాడన్నమాట. ఎందుకని? దానిని అధిగమించే బలం కావాలి నీకు. నీ దగ్గర ఏమి లేదు? ఏమి లేక నా దగ్గరకు వచ్చావు? దాంతో పోరాడుతున్నానండీ, ఓడిపోతున్నానండీ, నా దగ్గర శక్తి లేదు అన్నావు. ఏం చెయ్యాలి ఇప్పుడు నీకు? దాన్ని ఏ వాక్యాన్ని ఆశ్రయిస్తే, ఏ భావాన్ని ఆశ్రయిస్తే దానిని అధిగమించగలవో వాటిని నీకు చెప్పి, వాటిని నీలో స్థిరపడేటట్టు చేస్తే, వీటిని ఆశ్రయించి, వీటిని అధిగమించే ప్రయత్నం చేయగలుగుతావు. ఇది గురువు చేయాల్సిందే కానీ, శాస్త్రం చేయలేదు. వచ్చిన చిక్కు ఇది. శాస్త్రం కూడా వాక్యాలు ఏకరువు పెడుతుంది. కానీ ఏ క్రమంలో చెబితే నీకు అది శక్తిగా స్థిరపడుతుందో, నీకు అంటుకుంటుందో, అది శాస్త్రం చెప్పలేదు. శాస్త్రం జనసామాన్యంగా చెబుతుంది. (పది మందికి ఉపయోగపడేటట్లు) ఎంతమంది చదివితే ఏ, లక్ష మంది చదవమనండి, లక్షమందికీ సరిపడినట్లే వుంటుంది అది. కానీ అందులో నీకు సరిపడ్డట్టుగా మార్చడం దానిని నీవల్లే వీలౌతుంది. అందుకని గురువు అవసరం. కాబట్టి గురువు అనేవాడు ఏం బోధించాలయ్యా? ఆత్మజ్ఞానాన్నే బోధించాలయ్యా! ఇహలోకానికి సంబంధించినవి నీవు అడిగినా, వాటిని నిరసించవలయునే కానీ, వాటికి అది చేసుకో, ఇది చేసుకో అని చెప్పరాదు. దీనికి భగవాన్ రమణులు ఒక సూత్రం చెబుతారండి. ఎవరికయ్యా ఈ విచారణ మార్గం? అంటే, వాడికి ఒక పరీక్ష పెట్టాలట. ఏంటట? వచ్చిన తరువాత అడుగుతావు కదా! అడిగితే నేను ఏదైనా చెప్పి పంపిస్తాననుకోండి, తిరిగి వచ్చి మళ్ళా నువ్వు ప్రశ్నిస్తే, విచారణ మార్గం చెప్పాలి. తిరిగి రాలేదనుకో ఇక అక్కడితో సరి. అర్థమైందా అండీ! అందుకని ఇప్పుడు ఎవరైనా కూడా మీరు ఎవరి దగ్గరికైనా వెళ్ళారనుకోండి, ఇదిగో ఈ మంత్రం జపం చేసుకోండి, తగ్గిపోతుంది అన్నాననుకోండి, మీరు ఏం చేస్తున్నారు? తిరగి వచ్చేస్తున్నారు అంతే. అంతేగానీ మరలా తిరిగి వెళ్ళి ఏవండీ, why Mantra Japam? మంత్రజపం ఎందుకు చేయాలి? ఈ మంత్రజపం అర్థం ఏమిటి? ఈ మంత్రజపం నేను చేస్తే ప్రయోజనం ఏమిటి? నాకు కావలసింది ఆత్మజ్ఞానమైతే మంత్రజపం చెప్పి పంపించారు నాకు. అని తిరిగి వెళ్ళి ప్రశ్నించావా? ప్రశ్నించలేదు కదా! కాబట్టి ఆయన తప్పు ఏమీ లేదు. తిరిగి ప్రశ్నిస్తే విచారణ మార్గం

చెబుతాడు. వీళ్ళైనా అంతేకదా! పాఠం చెబుతారు, తిరిగి ప్రశ్నిస్తే, (దానికి అర్థం) వివరాలు చెబుతారు. అంతేకదా! లేకపోతే ఎంతవరకూ చెబుతారు? కొంతమేరకే చెబుతారు. అంతే! లోకసహజమైన విద్య అయినా అంతే. బ్రహ్మవిద్య అయినా అంతే. అంటే నీవు విచారణ మార్గంలో స్థిరపడాలి అంటే, ప్రశ్నించడం సరిగ్గా నేర్చుకో. అర్థమైందా అండీ! నీ మనసుని, నీ బుద్ధిని ప్రశ్నించడం రావాలి. ఇప్పటి వరకూ బయటకి ప్రశ్నించావు అందరిని. నువ్వెంతా, నువ్వెంతా? నువ్వేమిటి, నీ లెక్కేమిటి? బయటకి ప్రశ్నించావు. బయటకి కాదు. బయటకి మౌనం. అర్థమైందా అండీ! బయటకు అంతా మౌనం. ఎందుకని? మౌనంగా వుంటేనే సాక్షిత్వం వీలౌతుంది. దానికి వీలౌతుంది. ఎంతసేపు మౌనమే. ఎందుకని? లోపలికి వేస్తావు అప్పుడు ప్రశ్న. నిన్ను నువ్వు వేస్తవు ప్రశ్నలు. వాడు అలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడు? ఇప్పటివరకూ ఏం చేశావు? వాడిని చూశావు. వాడిని అడగడం కాదు, నిన్ను అడుగు. వాడు ఆ జీవి అలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడో, (వాడు కాదు ఆ జీవి, 'వాడు' అనేది పోవాలి ఇప్పుడు నీకు, వాడు అంటే మళ్ళా ఒక సంబంధం ఏర్పరచుకున్నావు) ఆ జీవి ఎందుకు అలా ప్రవర్తించింది, ఈ జీవితో? ఇప్పుడు వీడి పేరు ఏమిటి? వీడు జీవుడే. అర్థమైందా అండీ! నేను పోయింది ఇప్పుడు. ఆ జీవి ఈ జీవితో ఎందుకు అలా ప్రవర్తిస్తున్నది? అక్కడున్న శరీరం జడం. ఇక్కడున్న శరీరం జడం. అక్కడున్న ప్రాణమనో బుద్ధులు సూక్ష్మం. ఇక్కడున్న ప్రాణ మనో బుద్ధులు సూక్ష్మం. అక్కడున్న అంతరాత్మ సాక్షి, ఇక్కడున్న అంతరాత్మ సాక్షి. ఈ మూడింటిలో ఏమైనా భేదం వుందా? ఏమీ లేదు. శరీరం అంటావా? సప్త ధాతు నిర్మితం. శరీర, అస్థి, మజ్జ, మేధో, రోమ అంతే కదండీ! ఏమున్నాయి అందులో, ఏముంది మాంసము, ఎముకలు, రక్తము, నరాలు, రోమములు ఇవే కదా వున్నాయి. నీకు ఏమున్నాయో, దానికి అదే కదా వుంది. కొత్తది ఏముంది? ఏమీ లేదు కదా! సప్తధాతు నిర్మితం శరీరంలో ఏమైనా భేదం వుందా? ఏమీ లేదు. అర్థమైందా అండీ! పొట్టి బీరకాయి, పొడుగు బీరకాయి. అంతేకదా! బీరకాయలో difference వుందా? ఏమీ లేదు. లక్షణంలో ఏమీ భేదం లేదు. అదే. కానీ పొట్టి, పొడుగు చేత ప్రభావితం అవుతున్నావు నువ్వు. అవునా కాదా? ఆవెడ అలా వుందండి, ఈవెడ ఇలా వుందండి. ఆయన అలా వున్నాడండి, అబ్బా! మా అల్లుడుగారు ఎంత అందంగా వున్నాడండి? ఏమిటి అందం? ప్రాణ మనో బుద్ధులదా? బయటవున్న

శరీరానిదా? లోపల వున్న అంతరాత్మదా? ఏమైంది ఇప్పుడు? పొట్టిబీరకాయ, పొడుగు బీరకాయ. బీరకాయ అదే ఏతావాతా. అంతేకదా! లక్షణం ఏం మారింది? ఏమీ మారలేదు నాయన. కేవలము పైనున్నటువంటి సప్తధాతునిర్మిత ఆకార భ్రాంతికి లోనయ్యావు బాబూ. ఈ ఆకారం అనిత్యం కదా! అని ఇట్లా విచారణ చెయ్యాలి. ఎవరికి వాళ్ళు నిన్ను నువ్వు, లోపల విచారణ, ఈ ఆకారము అనిత్యము కదా! మరి ఆ సూక్ష్మమో? అది మూడు గుణాలు, మూడు వాసనలు, మూడు అవస్థల చేత నిర్మితమైనది కదా మరి! మరి దానికీ దీనికి మూడు అవస్థలు ఒకటేగా. జాగ్రత్ స్వప్న సుషుప్తిలు ఒకటే. సత్వ రజస్తమో గుణాలు ఒకటే. లోకవాసన, దేహవాసన, శాస్త్రవాసన దానికీ ఒకటే, దీనికీ ఒకటే. మరి ఎందుకు స్పందిస్తోందయ్యా? అది దానికి లోబడింది కాబట్టి. ఎవరు లోబడమన్నారు నిన్ను? నేను రజోగుణానికి లోబడబట్టి అది అట్లా ప్రవర్తిస్తున్నది. నేను దేహవాసనకు లోబడబట్టి అది అలా ప్రవర్తిస్తున్నది. అంతేనా అండీ! మీరందరూ మీ అమ్మాయిలకు పెళ్ళిచూపులు బాగా చూశారా? ఎందుకు చూశారు? ఎలా చూశారు? ఎలా నిర్ణయం చేశారు? చివరకు ఏమైంది పరిణామ ఫలితాలలో? చేసినప్పుడు అంతా అద్భుతమే అన్నామా? తర్వాత ఏమైందండీ? తరువాత ఏ జీవి ప్రారబ్దానుసారం పరిణామ ఫలితం ఎలా వుందో, అలా అవుతూ పోతూ వుంది. నువ్వు ఏమనుకున్నావు? అప్పుడు అంతా అద్భుతమనే చేశా కదా అన్నావు. అప్పుడు అంతా అద్భుతమే ఇప్పుడు దిబ్బ అని ఎవరన్నారు? ఏ ఇప్పుడు కూడా మంచే, పరిణామ పాఠం వస్తోంది చక్కగా. జీవన పాఠం రావాల్సింది వస్తోందిగా. మంచిదేగా జరుగుతోందిగా. జరిగేదంతా మంచికే అని పెద్దలు ఎందుకు చెప్పారు? పరిణామపాఠం నీకు జ్ఞానం వస్తోంది నాయనా! ఈ సుఖాపేక్ష తగ్గిపోయింది నాయనా! శరీరం, ఆకార భ్రాంతి తగ్గిపోతోంది నాయనా! ఏది తగ్గిపోవాలో, అది తగ్గిపోయేట్లుగా ఏర్పాటు చేయడమే సృష్టి ధర్మం. సృష్టి తన ధర్మాన్ని చక్కగా పోషిస్తున్నది. ఎక్కడా లోపంలేదు దాంట్లో. నీవే వ్యతిరేకంగా ఆలోచిస్తూ వున్నావు. అసహజ పద్ధతిలో జీవిస్తూ వున్నావు. ఆ సృష్టి రహస్యాన్ని తెలియక, జీవన రహస్యాన్ని తెలియక, వ్యతిరేకంగా బుద్ధిని పెట్టుకుని, నా బుద్ధి ప్రకారం జీవితం లేదే అంటున్నావు. నీ బుద్ధి జీవితం నీది అంతా కూడాను సృష్టి ప్రకారం మారవలసిందేగాని, సృష్టి నీ ప్రకారం మారుతుందా? ఎలా సాధ్యం? మనం ఎంత సేపు

ఏమి అడుగుతున్నాము. నాకు బుద్ధి చెప్పినట్టు సృష్టి అట్లా మారలేదండి, ఎట్లా సాధ్యం? అసలు సృష్టి ఎంత? నీ బుద్ధి ఎందులో భాగం అసలు? ఆ సృష్టిలో భాగం కదా! అర్థమైందా అండీ! సముద్రంలో వున్న ఉప్పును తెచ్చి బొమ్మ చేశామండి. ఈ ఉప్పుబొమ్మ అందట. సముద్రం ఉప్పగా వుంది. నువ్వు ఎక్కడి నుంచి తయారయ్యావేమిటి? ఈ ఉప్పుబొమ్మ ఏమంటుంది? సముద్రం ఉప్పగా వుంటుందంట. నువ్వు ఎక్కడినుంచి తయారయ్యావు? నువ్వు దాంట్లోనుంచేగా తయారయ్యావు. నీకు అదే లక్షణమేగా వుంది. నువ్వు ఏమవ్వాలట ఏతావాతా? నిన్ను తీసుకెళ్ళి దాంట్లో పడేస్తే ఏ గోలా లేదు. (అది తెలుసుకో లేక, అది ఉప్పు అంటుంది). నేనేదో సత్యం, నువ్వు ఉప్పు అంటోంది. అర్థం వుందా ఏమైనా? కాబట్టి ప్రాణమనోబుద్ధుల వ్యవహారం అంతా ఇలా వున్నది. ఈ సత్యం తెలుసుకో! ఇప్పుడు నేను ఎవరిని? నేను అంతరాత్మని. నిత్య స్వరూపుడను. నాకు ఏ భేదము లేదు. నాకు మార్పులేదు. పరిణామము లేదు. శాశ్వతమైనటు వంటి వాడను, సాక్షిని, సనాతనమైనటువంటి వాడను. ఆద్యంతములు లేనటువంటి వాడను. ఇలాంటి వాక్యాలు నీలోపల కనుక స్థిరపరచుకున్నట్లయితే, ఇప్పుడు అక్కడ ఎదురుగుండా ప్రవర్తించేది ఏమైపోయింది? ఓహో! ఇంకా మనలో రజో తమోగుణాలు వున్నాయి. ఎత్తిచూపెడుతున్నాయి. సరే కాని. ఎప్పటికైనా సాధన చేసి వీటిని అధిగమించాలి కదా! నాకు మేలే చేశాడుగా. సంస్కారం రద్దైపోతుంది కదా! ఈ జీవితో నాకు సంస్కారబంధం రద్దైపోతోంది కదా! ఒకటి గర్తుపెట్టుకోండి. గురువు తనయొక్క జీవితాన్ని, అనుభవజ్ఞానాన్ని, మీ ఎదురుగుండా వుంచి, తాను ఎట్లా జీవిస్తున్నాడో చూపెట్టి, నీకు బోధిస్తున్నాడు. ఎందుకు అలాగ? నీ పూర్వం అలా లేవని అతనికి తెలియదా? తెలుసు. పిల్లాడికి అక్షరాభ్యాసం. అక్షరాలు వస్తే అక్షరాలు బోధించే ప్రయత్నం ఏముంది? అక్షరాలు రావనే కదా బోధించింది. అర్థమైందా? అక్షరాలు రావని స్ఫురణకు తెచ్చుకుంటే మళ్ళా వచ్చింది పోతుంది. ఎప్పుడూ మీరు వెనక్కి వెళ్ళకూడదండి. మీకు మొదటినుంచి ఇదే చెబుతున్నాను. మిమ్మల్ని ఎంతో కష్టపడి ఇటుపక్కకి ఎక్కిస్తాము. ఎక్కించిన తరువాత మీరు కిందపడడానికి ఎంత సమయము కావాలి? ఒక రెప్పపాటు చాలు. నీ గతాన్ని స్ఫురణకు తెచ్చుకుంటే చాలు వెనుకబడిపోతావు. కాబట్టి గతాన్ని స్ఫురణకు తెచ్చుకోమాకు. నాకు చేతకావడం లేదు అనుకోమాకు. నీకు

చేతనయ్యేదేమిటి? చేతనయ్యే గురువు వున్నాడు. నిన్ను పైకి లాగడానికి. అర్థమైందా అండీ! భారం పరమాత్ముడిమీద వెయ్యి. భారం గురువుమీద వేసి ప్రయత్నం చెయ్యి. నీ మీద వేసుకుంటున్నావు, అందుకని కచ్చితంగా కిందపడిపోతావు. ఇప్పటి వరకూ ఏంచేశావయ్యా? నీమీద వేసుకుంటున్నావు. ఈ అనంత సృష్టిని నడుపుతున్నటువంటి పరమాత్మమీద భారం వెయ్యకుండా నీ మీద వేసుకున్నావు. ఏమైంది? పడిపోయావు. నువ్వు పడిపోవడానికి కారణం ఎవరు? నువ్వే. నువ్వు పడిపోవడానికి లక్ష్యం ఎందుకు పెట్టుకున్నావు? పరమాత్మ మీద భారం వేసి చెయ్యి. అప్పుడు ఏమైంది? సహజంగా అధిగమించేస్తావు. గురువు మీద భారం వేసి చేయి. సహజంగా అధిగమించేసేస్తావు. ఎందుకని? అది అంతే నాయనా! ఆ అనుభవజ్ఞానం అందులో వుంది సత్తా. ఆ వాక్యంలో వుంది సత్తా. బలంగా చెబుతున్నాడు, తన సత్తా అంతా వుపయోగించి చెబుతున్నాడు. తన శక్తినంతా ఆ వాక్యంలో నిక్షేపిస్తున్నాడు. ఆ శక్తిని, ఆ ప్రభావం చేత నీలో బలమైనటువంటి జ్ఞాపకం ఏర్పడేటట్లు చేస్తున్నాడు. ఈ బలమైన జ్ఞాపకం ప్రభావం చేత నీకు ఆ వాక్యం స్ఫురణకు వస్తుంది. ఆ సమయం వచ్చేటప్పటికి. నీకు చెప్పడం లేదు. నీ లోపల వున్న ప్రజ్ఞకు చెబుతున్నాడు. చైతన్యం మీద ముద్ర వేస్తున్నాడు. ఎప్పుడూ గుర్తు పెట్టుకోండి. గురువు దగ్గర మీరు వినేటప్పుడు శ్రద్ధ వున్నట్లయితే, ఆ శ్రద్ధ ప్రభావం చేత, అవి మీకు బుద్ధిలో పడవండి. బుద్ధికి అవతల పడుతాయి. బుద్ధిలో పడితే మళ్ళా నువ్వు వాటిని manage చేసేస్తావు. నీకు లోబడిపోతుంది అది. నువ్వు చెప్పినట్టు వినేస్తుంది. కానీ, అవి అట్లా వుండకుండా వుండానికి ఏం చేస్తాడంటే, బుద్ధికి అతీతంగా, బుద్ధికి అవతల వున్నటువంటి ప్రజ్ఞాస్థితిలో ఈ వాక్యాలను నిక్షిప్తం చేస్తున్నాడు. తన శక్తితోటి. అతను తనకు వున్నటువంటి ఈ అతీతమైన ప్రజ్ఞచేత, ఆ అతీతమైన సత్తా చేత, ఆ వాక్యం ద్వారా, ఆ శబ్దం ద్వారా, నీలో ప్రజ్ఞాస్థితిలో వీటిని నిక్షిప్తం చేస్తున్నాడు కాబట్టి నీకు ఆ సమయం రాగానే ఈ వాక్యాలు స్ఫురణకు వస్తాయి. అది నీ ప్రభావం అనుకుంటావేమో, అది నీ ప్రభావం అయితే, బుద్ధిలో పెడితే మర్చేపోతావు. కాబట్టి గుర్తు పెట్టుకోండి. గురువు దగ్గర పాఠం నేర్చుకునేటప్పుడు శ్రద్ధ చాలా అవసరం. వేరే అన్యధ్యాసే పనికిరాదండి. ఎందుకని? నీకు అన్యధ్యాస కలిగితే, తప్పనిసరిగా అది నీ బుద్ధి స్థితిలోకి వచ్చి పడిపోతాయి. మళ్ళా ఇదంతా పాఠం అంతా మళ్ళా వినవలసిందే. కాబట్టి

ప్రతిరోజూ నిత్యానిత్య వస్తు వివేకాన్ని, చక్కగా విచారణ చెయ్యాలి. నిత్యవస్తువు ఏది? అనిత్యవస్తువు ఏది? అనే విచారణ తోటే, నిదులోకి వెళ్ళాలి. ఇవాళ నేను ఏం చేశాను? నిత్యాన్ని ఆశ్రయించానా? అనిత్యాన్ని ఆశ్రయించానా? నిత్యము సత్యము అని చేశానా? అనిత్యము సత్యమని చేశానా? Thumbs Up సత్యమా? Pepsi సత్యమా? ఈ రెండూ సత్యం కాదు. మంచినీళ్ళు సత్యం. అలాగ ఎప్పుడూ కూడా, దాహం సత్యమే కదా! కానీ ఆ దాహం కూడా అసత్యమే కదా! ఎందుకని? ప్రాణ ప్రభావం చేత ఏర్పడుతున్నదది. అంతరాత్మ ప్రభావం చేత ఏర్పడుతన్నదా? ఏర్పడడం లేదు కదా! ప్రాణం. నేను ప్రాణాన్నా మరి ఇప్పుడు? కాదు కదా! ఆ ప్రాణానికి సాక్షిని. కాబట్టి దాహం చేత నేను చలించిపోవడం ఏమిటి? దాహమేస్తే ఆగలేరు మనుషులిక. ఎందుకని? ఆ ప్రాణానికి లోబడి వున్నావు కాబట్టి. అదే అంతరాత్మ స్థితిలో వుంటే, నిన్ను ఏది చేరేది? నువ్వు గాఢనిద్రావస్థలో వున్నవండీ, దాహం నిన్ను ఏమన్నా చేసిందా? (లేదు) ఎందుకని? ప్రాణాన్ని అధిగమించేసి వున్నావు. ఆ మనసు బుద్ధి దాటేసి వున్నావు. కాబట్టి అది నిన్ను ఏమీ చెయ్యలేదు. కాబట్టి అధిగమించిన స్థితిలో వుంటే ఈ ప్రాణ మనో బుద్ధులు నిన్ను ఏమీ చేయజాలవయ్యా. ఈ సత్యాన్ని తెలుసుకుని జీవించు. సాయిరాం.

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే

ఓం తత్ సత్

ఓం సహనాభవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై

ఓం శాంతిః శాంతిః శాంతిః

సాయిరాం.

అంతరాత్మ నిర్ణయం మేరకు ప్రవర్తించాలి. కానీ స్వయంగా ప్రవర్తించేస్తున్నాము. ఎలా ప్రవర్తిస్తుంది ఇది? 'శరీరమే నేను' గా ప్రవర్తించేస్తున్నాము. అందువల్ల ఏమైపోయింది? నేను నిర్ణయం చేశాను, నువ్వు ఎందుకు పాటించవు? నువ్వు నిర్ణయం చేస్తే వాడు పాటించడం ఏమిటి? నువ్వు కదా పాటించాల్సింది. ఎవరు అసలు ఎవరి నిర్ణయం పాటించాలి? నీ అంతరాత్మ చేసిన నిర్ణయాన్ని నీ బుద్ధి పాటిస్తోందా? అదే పాటించడం లేదు. నువ్వు నిర్ణయం చేసింది ఇంకొకరు పాటించడం లేదు అంటావేమిటి? అర్థముందా ఏమైనా? మన దుఃఖాల్లో సగం దుఃఖాలు ఇవే నండి. సగభాగం ఇదే గొడవ. నేను చెప్పాను నువ్వు వినలేదు. నేను చెప్పాను నువ్వు వినలేదు. ఏమిటి నువ్వు చెప్పేది, వాడు వినేది? అర్థముందా? నువ్వు చెప్పింది ముందు నువ్వు విను. నీ అంతరాత్మ నీ లోపలినుంచి బోధిస్తున్నది. దానిని విను నువ్వు సరిగ్గా ముందు. ఇది వినటం చేతకాదు కానీ, వాడు వినలేదు అంటావేమిటి? నీలోపల సంగతి నీకొకటి తెలియడం లేదు. అదేం బోధిస్తుందో గుర్తుపట్టే తెలివితేటలు లేవు. నీకున్న ఆ కొంచెం తెలివితేటలతోటి, ఇంకెవరో కొంచెం తెలివితేటలు వున్నవాడికి చెబితే, ఆ కొంచెం తెలివితేటలు వున్నవాడు, ఈ కొంచెం తెలివితేటలు వున్నవాడు చెప్పినది వినలేదంట. ఏమిటట నాకు అర్థమైంది ఏమైనా...?

పూర్ణ జ్ఞానం వీడికి వుందా? వీడికి లేదు. పోనీ వాడికి వుందా? వాడికీ లేదు. ఇద్దరూ అజ్ఞానులే కదా! మరి అటువంటప్పుడు వీడు చెప్పింది, వాడు చెప్పింది ఒక్కటే కదా! నీకు ఏమైనా పూర్ణజ్ఞానం వుంటే, నువ్వు దానిని సాంగంగా వాడికి అర్థమయ్యేటట్టు చెప్పగలిగే సామర్థ్యం వుంటుంది. ఎందుకు వినటం లేదు వాడు? నువ్వు వాడికి సాంగంగా వాడికి ఎందుకు అర్థమయ్యేటట్లు చెప్పలేక పోతున్నావు? వాడి గుణబలాన్ని అర్థం చేసుకుని, వాడు సత్వం గుణంలో ఎప్పుడు వుంటే, అప్పుడు చెబుతావు నీకు పూర్ణజ్ఞానం వుంటే. ఆ పూర్ణజ్ఞానం లేకపోవడం చేత ఏమైంది? వాడు తమోగుణంలో వున్నప్పుడు ఎదురెళ్ళి చెబుతున్నావు. ఏమైంది? వాడు విరుచుకుపడుతాడు. నువ్వు అసలు వాడు తమోగుణంలో వున్నాడనే గుర్తెరిగే తెలివితేటలు లేవు నీ దగ్గర. ఏమైందిప్పుడు? అంతా వ్యతిరేకమే. దుఃఖమే. దుఃఖం ఎట్లా వచ్చింది నీకు? అందుకే. ఆ తెలివితేటలు లేవు. ఆ జ్ఞానం లేదు. నువ్వు ఈ అనంత సృష్టిలో జీవులంతా ఏ గుణబలానికి

లోంగి వున్నారో, ఆ గుణబలాన్ని గుర్తించి నువ్వు ప్రవర్తిస్తే, అసలు సమస్య ఎక్కడ వచ్చింది? రాలేదుగా! వాడు కళ్ళు, ఫెళ్ళు స్పీడుగా వున్నాడు, ఏం చెయ్యాలి ఇప్పుడు? వాడికి అప్పుడు చెబితే ఏమి ఎక్కుతుంది? ఏమీ ఎక్కదు. కాబట్టి జ్ఞానం వున్నవాడు ఏం చెయ్యాలట అప్పుడు? వాడికి అది దిగిపోయేంత వరకూ వేచి చూడాలి. దిగిపోయినాక సత్వగుణంలోకి వస్తాడు. అప్పుడు సూచనగా ముందు చెప్పి చూడాలి. వినే పరిస్థితి వుంది, వాడు అడుగుతాడు అప్పుడు. ఇందాక అంటే నేను స్పీడులో వున్నాను, అప్పుడు పట్టించుకోలేదు, ఇప్పుడు చెప్పు అని అడుగుతాడు. అప్పుడు చెబితే అర్థం అవుతుంది. అప్పుడు కూడా మళ్ళా కొంచెం స్పీడులో వున్నాడు, వదిలేయ్! మళ్ళా తగ్గుతుంది ఎప్పుడో! తగ్గినప్పుడు మళ్ళా సూచన చేయ్. నాయనా! నీకు ఇంతకు ముందు ఒకసారి చెప్పిచూశాను, మళ్ళా ఇప్పుడు చెబుతున్నాను. నీ సంగతి ఏమిటి? ఏమన్నా విచారణ చేశావా? ఈ ధోరణిలో మాట్లాడుతామా మనం? మాట్లాడము. అది అట్లా కదా! ఇది ఇట్లా కదా! ఏమైంది అప్పుడు? అంతేకదా! వాడికి అనుభవ పాఠం వచ్చినాక కదా! లొంగేది వాడు. వాడికి అనుభవ పాఠం రాక ముందే, అడుగక ముందే ఎదురు వెళ్ళి వాడికి చెబుతుంటే, ఏమైంది ఇప్పుడు? వాడు అసలే అజ్ఞానం, మనం అంతకంటే పెద్ద అజ్ఞానం. ఎందుకని? వాడి స్థితి గుర్తించలేక పోవడం నీ తెలివితక్కువ తనం కదా! కాబట్టి పెద్దవాళ్ళు సర్దుకోవాలా? చిన్నవాళ్ళు సర్దుకోవాలా? అసలు ఇప్పుడు. (పెద్దవాళ్ళే సర్దుకోవాలి). ఎందుకు? (వాడి బుర్ర ఎలా వుందో చూసి) కాదు. జీవితం యొక్క అనుభవజ్ఞానం అంతా ఎవరిదగ్గర వుంది? నీ దగ్గరే కదా వుంది. కానీ మనం ఎప్పుడు ఎవరిని సర్దకోమని చెబుతాం? (నేను పెద్దవాడిని నేను చెబితే నువ్వు వినాలి) ఎందుకు వినాలి వాడు, అసలు ఎట్లా వింటాడంట? వాడికి తెలియదు కదా! (అనుభవ జ్ఞానం) అవునండి. అసలు తెలియదు కదా! వినటానికి. ఇప్పుడు చిన్నపిల్లాడున్నాడమ్మా! వాడు ఉయ్యాలలో ఆడుకుంటున్నాడండి. వాడు ఏం విన్నాడు? విన్నాడా? వినలేదు కదా! వాడికి తెలియదు కదా! ఆ తెలియదు అనే లక్షణం వాడికి ఎప్పుడూ వుంది కదా! ఇప్పుడు లేదా? ఇప్పుడు కూడా వాడికి తెలియదు కదా! తెలియదు కాబట్టే కదా వాడు ఆ స్థితిలో వున్నాడు. తెలిస్తే నీ లాగానే వుంటాడు కదా! తెలిసినవాడివి అంటున్నావు. కానీ ఎవరిలాగా ప్రవర్తిస్తున్నావు నువ్వు మాత్రం? వాడి వలనే ప్రవర్తిస్తున్నావు కదా! తెలిసిన

వాడివైతే ఎలా ప్రవర్తించాలి? వాడికి ఎప్పుడు చెబితే జ్ఞానం అబ్బుతుందో తెలిసి నువ్వు చెప్పాలి. అంతే కదా! నేను నా దగ్గర జ్ఞానం వుంది కదా అని, నా దగ్గర అన్నీ వున్నాయి కదా అని, నీకు బోధిస్తాను అంటే నువ్వు వస్తావా? రావు కదా! నీకు ఎప్పుడు దాని అవసరం వస్తే అప్పుడు వస్తావు. అప్పుడే చెప్పాలి నీకు. అంతే కానీ ఎప్పుడు పడితే అప్పుడు చెబితే, ప్రయోజనం లేదు కదా! అది వుపయోగపడదు. అర్థమైందా అండీ!

అలాగే, కానీ ఏంటంటే సూచన ప్రాయంగా చెబుతూ వుంటాం. ఇదిగో ఇది ఇట్లాగా, అది అట్లాగ, ఇది ఇట్లాగ. నీకు సమయం వచ్చినప్పుడు ఈ జ్ఞానంతో అవసరం వస్తుంది. అవసరం వచ్చినప్పుడు నా దగ్గరకు వస్తావులే నువ్వేం కంగారు పడమాకు. ఆ సమయానికి చూద్దాంలే అని దాట వేస్తూ వుంటాడు. ఎందుకని? వాడికి ఒక బీజం, ఒక స్ఫురణ వేస్తూ వుంటాడు. ఆపద కాలంలో నన్ను స్మరించు నాయనా! నేను వస్తాను అప్పుడు, సమయానికి సహాయమో, సలహానో చెబుతాను. ఉపయోగపడుతాను ఎప్పటికైనా. దాంట్లోనుంచి బయటపడుతావు. కాబట్టి నన్ను గుర్తు పెట్టుకో. అని అనుభవజ్ఞానాన్ని అనునయంగా చెబుతాడు ఎప్పుడూ కూడా. కానీ, ఎప్పుడైతే ఫెళ్ళు, ఫెళ్ళుగా చెప్పావనుకో, ఏమైందప్పుడు? ఇప్పుడూ అదే అజ్ఞానమే. అర్థమైందా అండీ! ఇప్పుడు ఎవడు పెద్దా? ఎవడు చిన్నా? అజ్ఞానంలో ఇద్దరూ పోటీ పడుతున్నట్లేగా. ఒకడు పెద్దా ఒకడు చిన్నా ఏముంది?

కాబట్టి ఎప్పుడైన నిజజీవితంలో మీరు ఈ ప్రాథమిక సూత్రాలను గుర్తు పెట్టుకోవాలి. మనం మనుషులతో ప్రవర్తించే టప్పుడు, ప్రతి మనిషి, ప్రతి జీవి కూడా ఆ మూడు గుణాలకు లొంగి వుంటుంది. ఆ మూడుగుణాలకు వున్న లొంగుబాటులోంచి విడివడటమే ముక్తి. అర్థమైందా అండీ! కర్మబంధం అంటే వేరే ఏమీ లేదు. ఈ మూడు గుణాలే కర్మబంధం వేరే ఇంకేమీ లేదు. ఈ మూడు గుణాలకు అతీతంగా వుండగలగడమే ముక్తి. ఆ మోహం అనేది ఎందువల్ల ఏర్పడింది? ఈ మూడుగుణాలవల్లే ఏర్పడింది. ఆకర్షణ ఎందువల్ల ఏర్పడింది? మూడుగుణాల వల్లే ఏర్పడింది. అన్నీ మూడు గుణాలవల్లే ఏర్పడ్డాయి ఈ సృష్టి మొత్తం అంతా కూడా. ఎలాగండీ నిర్ణయం?

ఆవు చూడండి, సాధు జంతువు కదా అది. సత్వగుణం. దాని పక్కన ఎద్దు వుంది కదండీ! అది ఏమిటి మరి? రజోగుణం. అర్థమైందా అండీ? ఇలా ప్రతీ దాంట్లోను

వుంటాయన్నమాట. సత్వగుణం, రజోగుణం జంతువుల్లో కూడా వుంటాయి. అలాగే మనుషుల్లో కూడా వుంటారు. అయితే ఏమిటి? మనిషికి వచ్చేటప్పటికి ఏమిటంటే, ఎప్పుడూ ఒక గుణంలో వుండడు. (అది మారుతూ వుంటుంది.) ఆఁ... నీకు ఆ గుణ ప్రేరణ, అవి (జంతువులు) ఎప్పుడూ ఒకే గుణంలోనే వుంటాయి, అందుకని జంతువుని పంజరంతో పోల్చింది. ఒక జైలు అది, ఆ జైలు, ఆ శరీరం జైలు, ఏ జైలు వస్తే ఆ జైలు వరకే వుంటుంది అంతే. ఆ జైల్లో వుండి, వాటికి తెలిసినంతగా పరమాత్మ మనిషికి తెలియదు. జంతువులకు తెలిసినంతగా దైవం, మానవుడికి తెలియదు. ఎందుకని? వాటికి ఒక పరిమితమైన జ్ఞానమే వుంది. నిరంతరాయంగా అవి పుట్టింది మొదలు, పోయేవరకూ పరమాత్ముడిని వేడుకొంటూ వుంటాయి. నాయనా! ఈ జంతువు పంజరం నుంచి నన్ను విముక్తి కలిగించు. దానికి ఒక్కటే కోరిక వుంటుంది. నేను ఈ జంతువు పంజరం నుంచి ముక్తిని పొందాలి. అని. దైవం సహజంగా కనబడుతుంది వాటికి. (మరి ఆ కోరిక వున్నప్పుడు అవి) జంతువు పంజరం నుంచి ముక్తి పొందింది కదా! మానవ ఉపాధికి వచ్చింది కదా! (చివరికి కదా వచ్చేది) అంతేగా మరి ఎనుబది నాలుగు లక్షల జీవరాశుల్లో చరించి రావలసిందే. (ప్రతి జీవి అట్లా రావల్సిందేనా?) ఆఁ.. అలా రావాల్సిందే. అది లేకుండా నీకు మానవ ఉపాధి లభించదు. మరి ఇందాక ఏం చెప్పాడు? ‘కల్పశతములకన్నా మిక్కిలి కాలమాయెను’ – అమీబా నుంచి మానవుడి వరకూ, అమీబా నుంచి మానవుడి వరకూ కూడా అనేక జంతువుల జన్మలలో కదా నువ్వు తిరుగుతూ వచ్చావు. మరి ఎంత టైం పట్టి వుంటుందంటావు? ఒకసారి ఆలోచించు? (లక్ష జన్మలంటే ఎన్ని..?) లెక్క ఏముంది దానికి లక్షో, కోటో! కాబట్టి మనం అన్నీ కూడాను ఇప్పటి వరకు గతించిన 50 సంవత్సరాల గురించి ఆలోచించమాకు. ఈ 50 సంవత్సరాలు అనేది నువ్వు ఇప్పుడు లెక్క వేసుకుంటున్నావు. ఈ 50 సంవత్సరాలలో ఏం జరిగింది అనే దానికంటే కూడా సమస్య ఏమిటయ్యా అంటే అసలు ఎన్నో లక్షల సంవత్సరాల నుంచి ఎన్నో జన్మలలో దేహాన్ని ధరిస్తూ వున్నావు, వదిలిపెడుతూ వున్నావు. ఇదేం కొత్తకాదు నీకు. కాకపోతే ఎందుకు దుఃఖిస్తున్నావు మరి? దేహం పోయిందని దుఃఖిస్తున్నావా? లేదు దేహం వున్నవాళ్ళతో సంబంధాలు పోయిందని దుఃఖిస్తున్నావా? లేదూ అంతరాత్మను గుర్తెరగలేదు అని దుఃఖిస్తున్నావా? లేదు దేని నిమిత్తమై, పరమాత్మ కోసమై వచ్చావు కదా

మానవ ఉపాధిలోకి అది లభించలేదు అని దుఃఖిస్తున్నావా? నీ దుఃఖం దేనికి అసలు? కాబట్టి అర్థం వుందా ఏమైనా? మరణాన్ని కోసం దుఃఖించడం ఏమిటి? అసలు మరణం దుఃఖించదగిన అంశమేనా? దాని అంత పవిత్రమైనది ఏదీ లేదు కదా! మరి దానిని అశుభంగా ఎందుకు చూశావు? తప్పు కదా! దృష్టి భేదం కదా అది. పరమాత్మ మృత్యువును ఎందుకు సృజించాడు? ముందు మృత్యువును సృజించినాక జీవునకు జన్మను ఇచ్చే విధానాన్ని సృజించాడు. అర్థమైందా అండీ! పంచీకరణలో చెబుతాడు అందుకోసమే. మృత్యుదేవత 25వది మొట్టమొదట సృజించబడిందండి. 1st మృత్యు దేవతను సృజించిన తరువాతనే, మిగిలిన అధిష్టాన దేవతలను అందరినీ ఏర్పాటు చేస్తూ, ఇంద్రియాలను ఏర్పరిచాడు. ఎందుకని? నీకు పరిణామం రావాలి అంటే, అదే కారణం. కొంతకాలం జీవించేశావండీ! ఇంక ఈ ఉపాధి పనికిరాదు పరిణామానికి. ఇప్పుడు ఏం చెయ్యాలి మరి? ఈ ఉపాధిని విడిచిపెట్టి వేరే ఉపాధిలోకి వెళ్తే కానీ నీకు పాఠం, జ్ఞానం రాదు. పరిణామం రాదు. మరి అసలు మృత్యువే లేకపోతే ఏమైపోతావు? (ఇట్లాగే వుండిపోవడమేగా) ఎట్లా? ప్రయోజనం ఏముంది? ఉన్నదాంట్లో పరిణామం రాదు. ఆ పాఠం రాదు. పరిణామం రాదు. జ్ఞానం రాదు. ఎప్పటికీ. వాడు ఏమైపోవాలి ఇప్పుడు? కాబట్టి ఏం చేశాడు? ఎంతో ముందుచూపుతో ఆలోచించాడండీ! నీకు అజ్ఞానం చేత మృత్యువుని, మరణాన్ని అశుభం అని అనుకుంటున్నావు. మైలు అని అనుకుంటున్నావు. నిష్ప్రయోజనం, అజ్ఞానం. శుద్ధ అజ్ఞానం. కేవలం తమోగుణ అజ్ఞానం అది. అందుకనే దాంట్లోనుంచి ఎప్పటికీ బయటకు రాలేనంతగా కూరుకుపోయావు. నిజానికి దానిని మించిన పవిత్రమైన ప్రదేశమే లేదు, దానిని మించిన పవిత్రమైన స్థితే లేదు. ఎందుకని? (సన్యాసం పుచ్చుకుంటే మళ్ళీ మైలు వుండదట) అర్థం లేదండి. ఏమండీ! సన్యాసం అంటే ఏమిటి? అనేది ముందు లేకపోవడం అన్నమాట. సమ్యక్ న్యాసము, సమ్యక్ న్యాసము అంటే సన్యాసము అని అర్థము. న్యాసము అంటే ఏమిటి? జీవితం ఎలా మొదలౌతున్నది, జీవితం ఎలా అంత్యం అవుతున్నది. జీవుడి యొక్క రాకడ, పోకడ తెలిస్తే న్యాసము అని అర్థము. మహన్యాసము అంటున్నారా? మీరు. శివాభిషేకం చేసేటప్పుడు ఏం చెబుతారండీ? మహన్యాసమేనా? ఏమిటి మహన్యాసమంటే? మహత్ అనేటటువంటి సృష్టి ఎలా వచ్చింది? ఎలా పోషించబడుతున్నది? ఎలా పోతుంది? చెబితే

మహన్యాసము అయ్యింది. అర్థమైందా అండీ! మరి సమ్యక్ న్యాసము అంటే ఏమిటి? ఆ జీవుడి యొక్క రాకడ ఎలా వుంది? ఎలా జీవిస్తున్నాడు? ఎలా పోతున్నాడు? ఏది మిగుల్తుంది చివరకి? ఆత్మస్వరూపం మిగుల్తుంది. అని ఎవరికైతే తెలుస్తోందో, ఎవరైతే ఆ కర్మఫలాన్ని త్యజిస్తున్నాడో వాడు సన్యాసి. దానికి కాషాయం గుడ్డలు కట్టక్కర్లేదు, రుద్రాక్షలు ధరించనక్కర్లేదు, విభూది అంతకంటే పెట్టక్కర్లేదు. (ఆ సన్యాసిపోతే మైలు వుండదు) ఎందుకంటే, ఒకానొకప్పుడు మహానుభావులు అలా జీవించారు. ఎవరు? దాని కోసమే జన్మించి, సిద్ధాంతాన్ని ఉద్ధరించి, లోకోద్ధరణకే జన్మించినటువంటి వాళ్ళు, వాళ్ళ జీవన విధానాన్ని తీసుకుని, వాళ్ళు చేసిన దానిని ఆధారంగా తీసుకుని, నీకు అనువుగా పెట్టుకున్నావు. అర్థమైందా అండీ! వారెవరో ఆ మహానుభావునికి వర్తింపజేసింది, నీకు ఎలా వర్తింపజేయడానికి వీలౌతుంది? సాధ్యమేనా? నీవు కర్మజీవివి. వారు కారణజన్ముడు. కారణజన్ముడు పుట్టుకనుంచే కర్మఫలత్యాగం అనే జ్ఞానాన్ని కలిగివున్నాడు. ఆ స్థితిలో వుండి జీవిస్తున్నాడు. అలా జీవించేటటువంటి వానికి, వానికి సన్యాసం అంటే ఏమిటో తెలుసు. వాడు పుట్టుకతోనే ఆ స్థితిలో వచ్చాడు వాడు. మరి అటువంటప్పుడు వాడికి, వాడు పోతే అంటే, వాడి జీవన విధానం ప్రకారం మరణానంతర శుద్ధి అనేది ఎలా అయితే వుంది. వాడికి తెలుసు, దేహం వాడు తెలిసి విడిచిపెడుతున్నాడు. సమస్య ఏమీ లేదు కదా ! దేహము తెలిసి విడిచిపెట్టినవాడు అనే జ్ఞానంలో వున్నాడు వాడు. వాడికి మరణానంతర విధి లేదు. వాడికి సమాధి కట్టమన్నాం. వాడికి దహన క్రియలు లేవు. వాడికి, జీవన్ముక్తుడైనటువంటి వాడికి సమాధిని నిర్మించి, వాడు జీవించి వున్నప్పుడు ఎలా అయితే గృహస్థులు వారిని ఆశ్రయించారో, అట్లాగే అతని సమాధిని ఆశ్రయించినా కూడా నీకు జ్ఞానం కలుగుతుంది పో! అన్నారు. (మరి నీళ్ళల్లో వదిలేది ఏమిటి?) అదే చెప్పేది, రకరకాల సమాధులు ఇవన్నీ కూడా. జలసమాధి, భూసమాధి ఇవన్నీ రకరకాల సమాధులు. ఇవన్నీ సమాధి నిర్ణయం. సరే! అది ఎలా వున్నా కూడా, ఇదంతా కేవలం బాహ్య ఆచార ఆడంబర ప్రక్రియే కానీ, దాంట్లో ఏమీ లేదు. సమాధి అంటే కట్టినటువంటి అది కాదు. అర్థమైందా అండీ! ఏదైతే ఇప్పుడు అక్కడ ఒకటి కడుతున్నారుగా అదా సమాధి అంటే? అది కాదండి. అతను నీకు ఉపయోగపడాలి అంటే, ఏ స్థితిలో వున్నాడు? పరమాత్మ స్థితియందు వున్నాడు, ఆత్మభావంలో వున్నాడు.

నీవు సమ+ధీ సమాధి స్థితిని నీవు కూడా పొందితే, అతడు అశరీర రూపంలో వున్నాడు కాబట్టి, సశరీరుడిగా లేడు కాబట్టి, ఆ అశరీరుడుగా వున్న మహానుభావుడిని అలాగే దర్శించగలిగే సామర్థ్యాన్ని పొంది నీకు అట్లా వుపయోగపడుతాడు ఆయన. అని చెప్పడం అక్కడ వుద్దేశ్యం. అదిపోయి చివరికి సిమెంటుది మిగిలింది. అర్థమైందా అండీ! ఇలా అంతా కూడా బాహ్యం మిగిల్చుకోవడం చేత, ఆ బాహ్యం, ఆంతరిక జ్ఞానం అసలు లేదు, విచారణ అసలు లేదు. ఎందుకు పడుతున్నావో తెలియదు, ఎందుకు విడుస్తున్నావో తెలియదు. కాబట్టి కేవల తమోగుణ జ్ఞానంచేత, ఆచరించడం చేత మరింతగా కూరుకుపోయారు. కాబట్టి తప్పనిసరిగా ఆత్మవిచారణలోకి వచ్చినవాడు అందుకే ఈ లోక ధర్మాలను అన్నింటినీ తోసిరాజు అంటాడన్నమాట. ఎప్పుడూ కూడా. ఎందుకని? అవి అజ్ఞానపూర్వక కర్మానుష్టానములు. వాటిని చేస్తాడు, కానీ జ్ఞానపద్ధతిలో చేస్తాడు. అజ్ఞానపూర్వకంగా చేయడు. ఆచరణలో భేదం వుంటుందన్నమాట ఇతనికి, అతనికి. జ్ఞానపూర్వకంగా చేస్తాడు. అది తెలిసి చేస్తాడు. ఏం చేస్తున్నాడో, తెలిసి చేస్తాడు. దానివల్ల సాధించబడేది ఏమిటో తెలిసి చేస్తాడు. స్వయంగా అందరకీ చెబుతాడు. ఇదిగో దీని వల్ల చేస్తున్నది ఇది. ఇది ఆ నిమిత్తమై చేయబడడం లేదు. ఇదిగో ఈ నిమిత్తమై చేయబడుతోందని, పాటించి మరీ, చెప్పి మరీ చేస్తాడు. అది జ్ఞానబలం వున్నటువంటివాడు చేసే విధానం. అదే అజ్ఞానంలో వున్నవాడు ఏం చేశాడు? బాహ్యకర్మాచరణలో బంధితుడు అయిపోయి, అదే సత్యంగా చేసేటప్పటికి మరింత శరీరమే నేనుగా బిగుసుకుపోయాడు. కాబట్టి మీరందరూ కూడా విచారణ చేసేటప్పుడు ఏ పనినైనా సరే, అది ఆచారం కావచ్చు, సాంప్రదాయం కావచ్చు మరొకటి కావచ్చు. ఏదైనా సరే, ఆత్మజ్ఞానం అనే గీటురాయిమీద సాధ్యమైతేనే దానిని ఆచరించాలి. అలాకాక లోకుల కొరకు నేను ఆచరిస్తాను అనుకున్నావే అనుకో, ఎప్పటికీ నీవు ఆ పరిమితులలోనే వుండక తప్పదు. పూర్వ జంతువు లక్షణం పోలేదన్నమాట.

భయపడడము, భయపెట్టడము రెండూ జంతువు లక్షణాలండి. గుర్తు పెట్టుకోండి. అది నీవు లోకులకు భయపడ్డా, పరమాత్మకు భయపడ్డా, ఎవరికి భయపడ్డా భయపడటం అనే లక్షణం జంతువు లక్షణం. మనిషి లక్షణం కాదు. అంటే, మానవ దేహంలో వున్నటువంటి జంతువుగానే వున్నావు. మానవుడు అనే వికాసమే రాలేదు

ఇంకా. భయపడుతూ వున్నంత కాలం, ఇదే నిర్ణయం గుర్తుపెట్టుకోండి. నువ్వు భయపెట్టరాదు, భయపడరాదు. ఎందుకంటే, పరమాత్మను ఆశ్రయిస్తే కలిగేటటువంటి మొట్టమొదటి ఉపయోగం అభయం. అర్థమైందా అండీ! ఏ దేవుడినైనా చూడండి. ఏ హస్తం కలిగి వుంటారండి? అమ్మవారు గానీ, అయ్యవారు గానీ అభయహస్తమేనా అండి? ఇంకేమన్నా వుంటుందా? కాబట్టి అసలు భగవంతుని యెడల నీకు విశ్వాసము, భక్తి వున్నాయి అంటే, మొట్టమొదటి వుపయోగం ఏంటయ్యా అంటే అభయం. నీకు ఆ లక్షణం పోవాలి. అంటే భయపడే లక్షణం పోవాలి, భయపెట్టే లక్షణం పోవాలి. ఎందుకని? అది జంతువు స్వభావం కాబట్టి. నువ్వు మానవదేహంలోకి వచ్చావు కాబట్టి. భయపడరాదు, భయపెట్టరాదు. భయపడితే కచ్చితంగా భయపెడతావు. గుర్తుపెట్టుకోండి. భయపెడితే కచ్చితంగా భయపడతావు. అందులో సమస్యే లేదండి. ఎందుకని? రెండూ తమోగుణ లక్షణాలు అవి. ఒకటి వుంటే, ఒకటి వుంటుంది కచ్చితంగా. (భయపెట్టకపోయినా, భయపడుతూ వుంటాం) భయపడితే నువ్వు కచ్చితంగా ఎవరినో ఒకరిని భయపెడతావు. ఎందుకంటే, నువ్వు భయపెట్టే పరిస్థితి, నీకు లొంగివుండే వాడు రాలేదు కాబట్టి, నువ్వు భయపెట్టకపోయివుండవచ్చు. కానీ నీలోపల అది బలవత్తరముగా పనిచేస్తూ వుంటుంది. నీలోపల భయపెట్టే లక్షణం వుంటేనే, నువ్వు భయపడతావు అసలు. గుర్తుపెట్టుకోండి. బయట భయపెట్టే లక్షణం వున్నవాడు, వాడంత పిరికివాడు వుండడండి. లోకంలో వాడు చాలా పిరికివాడు, అన్నిటిల్లో కూడా. అందుకని బయట భయపెడుతూ వుంటాడు. అర్థమైందా అండీ!

భయపెట్టే వాడికంటే భయపడే వాడు ఒకింత మెరుగు అన్నమాట. ఎందుకని? (పక్కవాడిని బాధ పెట్టడు) వాడిని వాడే బాధపెట్టుకుంటాడు. కానీ లోపల ప్రతీకారేచ్ఛ వుంటుందన్నమాట. దానిని తీర్చుకోవాలనే కక్ష, ప్రతీకారేచ్ఛ వుంటుందన్నమాట. వీడు నన్ను భయపెడుతున్నాడు. వీడిని అధిగమించాలి ఏమైనా సరే! వీడిని అధిగమించాలి. దీనిని అధిగమించాలి. వాడిమీద ప్రతీకారేచ్ఛ వుంటుందన్నమాట. అది మరింత ప్రమాదం. అర్థమైందా అండీ! వాడికేమో పిరికితనం, లోపల పిరికితనం వుండి, పిరికితనం వల్ల ఎక్కడ ప్రమాదం వస్తుందో అని బయట గాంభీర్యంతోటి భయపెడుతూ వుంటాడన్నమాట. కానీ, నిజమైన సందర్భం వచ్చినప్పుడు వాడు పారిపోతాడు. వాడు

నిలబడలేడు. సామర్థ్యం వుండదు వాడి దగ్గర. అదే నిజంగా భయపడుతూ వుంటాడు ఒకడు. కానీ సరైన స్థితి వచ్చినప్పుడు వాడు నిలబడుతాడండి. వాడు భయపడేవాడు అయినా కూడా, అసలైన విషయము వచ్చినప్పుడు వాడు నిలబడుతాడు. ఎందుకనిట? లోపల భయపెట్ట గలిగే సామర్థ్యం వుండి కూడా, బయటకి భయపడుతున్నాడు. కాబట్టి సమయం వచ్చినప్పుడు వీడు నిలబడగలుగుతాడు. కానీ, లోపల భయపడుతూ, బయటకి భయపెట్టే వాడు వుంటాడు, వీడు పారిపోతాడు. అర్థమైందా అండీ! కాబట్టి ఇందులో ఒకటి వుంటే, రెండవది తప్పనిసరిగా వుంటుంది. ఈ రెండూ కూడా జంతువు యొక్క లక్షణాలే. మానవుడి లక్షణాలు కావన్నమాట. కాబట్టి నీవు దైవాన్ని ఆశ్రయించాలి అంటే మొట్టమొదట విడిచిపెట్టవలసినది ఈ రెండు లక్షణాలు. (భయపెట్టడం, భయపడడం). దేనికీ భయపడవద్దు, ఎవరికీ భయపడవద్దు. ఎవరినీ భయపెట్టవద్దూ. దేనినీ భయపెట్టవద్దు. ఏ జంతువునైనా కావచ్చు. ఏ పరిస్థితినైనా కావచ్చు. ఏ మనిషినైనా కావచ్చు. భయపెట్టరాదు, భయపడరాదు. అలా వుంటేనే, దాని వల్ల ఎన్నో సమస్యలు వస్తాయండీ! అయితే దైవాన్ని విడిచిపెట్టవలసిందే. నువ్వు భయపడే లక్షణాన్ని విడిచిపెడుతావా? దైవాన్ని ఆశ్రయించడం అనే లక్షణాన్ని విడిచిపెడుతావా? ఇప్పటివరకూ ఏం చేశావు? (భయపడుతూ వచ్చాను) దైవాన్ని వదిలేశావు. దైవాన్ని విస్మరించావు అంతే. దీనికి లొంగావు అంటే, కచ్చితంగా దైవాన్ని విస్మరించక తప్పదు. ఎందుకంటే, దైవాన్ని విశ్వసిస్తే మొట్టమొదటి లక్షణం అభయం. భయపడడు వాడు. దేనికీ భయపడడు. ఎందుకని? ఏంపోతుందండీ? ఏం తెచ్చావు గనుక? ఏం పోతుంది? ఏమన్నా తెచ్చావా? ఏమీ తేలేదు. శరీరం. ఈ శరీరం ఎవడో కొల్లగొడతాడని భయం. ఏమిటి కొల్లగొట్టేది? అయ్యో! ఏం చేస్తాడు వాడు నీ శరీరాన్ని? ఏం చేసుకుంటాడు? ఏం ప్రయోజనం ఏముంది? కాబట్టి దేనికి భయపడుతున్నావు? శరీరం మీద వేసుకున్న వాటికోసం. అంతేనా? అయ్యో! ఒక్కసారి ఆలోచించుకోండి. అందుకే చెప్పేది. ధనము ఎచ్చటనుండునో అచ్చట సర్పభయం, చోరభయం, సర్పభయం తప్పదు. (ఎందుకొస్తుంది ధనమున్నచోట). ఆఁ... ఎందుకు వస్తుందంటే, అక్కడ ఒక అంశం వున్నదండీ! ధనానికి కాపలా ఎప్పుడూ సర్పం. (ధనం ఎవరి ఇంట్లో వుంటే, అక్కడికీ వస్తుందా?) కాదండి. అక్కడ ఉద్దేశ్యము అదికాదు. అంటే ఉపమానం

అన్నమాట అది. దాని వెనుకాల రహస్యం వుంటుంది ఎప్పుడూ కూడా. ఎక్కడైతే నీవు, అధర్మార్జన వుంటుందో, ఆ అధర్మార్జనకు మొదటి వారసుడు ఎవరయ్యా? అంటే దొంగ. మొదటి వారసుడు ఎవరయ్యా అంటే దొంగ. నీ దగ్గర వున్న అధర్మార్జన తప్పనిసరిగా నిన్ను విడిచిపెట్టి వెళ్ళక తప్పదు. ఏ పరిస్థితిలో నైనా సృష్టి నియమం అండి. మీరు ఎంతగా కాపాడుకున్నా, ఎవరు ఎంతగా కాపాడుకున్నా. ఎంత కోటీశ్వరుడైనా సరే! అధర్మార్జన ఏదైతే వుంటుందో, ఆ అధర్మార్జన అంతాకూడా తప్పనిసరిగా పోవలసిందే. అధవా పోలేదనుకోండి. దొంగవచ్చి తప్పనిసరిగా దానిని తీసుకుపోతాడు. నువ్వు ఏదో ఒక రూపంలో అన్నా దానిని పోగొట్టుకుంటావు. సప్తవ్యసనాలలో ఏదో ఒక రూపంలో దానిని పోగొట్టుకుంటావు. ఒక వేళ సప్తవ్యసనాలలో నీకు అధర్మార్జన పోలేదనుకోండి, తప్పనిసరిగా దొంగైనా సరే దానిని పట్టుకుపోక తప్పదు. ఈ రెండూ కూడా తప్పిందనుకోండి. మూడవది అగ్నిభయం. అగ్నిప్రమాదం తప్పనిసరిగా జరిగితీరుతుందండి. కచ్చితంగా అగ్నిప్రమాదంలో వెళ్ళిపోతుంది. అంతాకూడా. స్వాహా! ఈ అగ్ని ప్రమాద సూచిక సర్పం. అర్థమైందా అండీ! అందుకని పూర్వం ఏదైనా ఇళ్ళల్లోకి పాము వచ్చిందంటే, శాంతులు చేయించాలి, శాంతులు చేయాలి అంటుంటారు. పెద్దవాళ్ళు అంతా కూడా. కారణం ఏమిటంటే, (వీళ్ళ అమ్మగారు వున్నారు, పైన గరుడ పక్షి వాలింది అంటే శాంతులు చేయించాలి అంటారు, ఇంట్లో గబ్బిలం వచ్చిందంటే శాంతి చేయించాలా? తేనెతుట్టె పడితే శాంతి చేయించాలంట, మొన్న 10 తేనెతుట్టెలు పట్టినాయి, మల్లె చెట్టుకింద, పొగపెట్టాము, పోయినాయి, ఎందుకని అది) ఏవండీ! ఇదే చెప్పేది. ఇదంతా సూక్ష్మం. పూర్వకాలంలో సూక్ష్మజ్ఞానం వున్నవాళ్ళు వున్నప్పుడు సంగతి ఇదంతా. ఇప్పుడు మీకు అసలు స్థూలజ్ఞానమే లేదు. కాబట్టి మీకు అసలు శాంతే లేదు. (శాంతి అక్కర్లేదు) అసలు ఇదేమీ అక్కర్లేదు మీకు. (మాకు ఏం లేదు) అసలు ఆ భ్రాంతే లేదు మీకు. (ఏమో ఏమౌతుందో అనేది లేదు) ఆ:.. ఆ భ్రాంతి వుంటేనే కదా శాంతి. (ఈ భయం వుంటే శాంతి). ఒకటి గుర్తుపెట్టుకోండి, దేనికైనా భయం వుంటే, ఆ భయానికి శాంతి. నేను అందుకే చెప్పేది. ఎన్నింటికని ఇట్లా చేస్తావు? అవునండీ, ఇక్కడొక అంశము వుందండి. ఎన్నిటికని ఇట్లా భయపడుతావు? గబ్బిలానికి భయపడి, గురుడపక్షికి భయపడి, కాకికి భయపడి, పిల్లికి భయపడి ఎన్నిటికి భయపడతావు?

సృష్టిలో. ఇప్పుడు వాటిలో నువ్వు ఏం చూశావు? 84 లక్షల జీవరాశులలో వున్నది పరమాత్మే అయితే, నువ్వు దేనిని గుర్తిస్తున్నావు ఇప్పుడు? అర్థమైందా? ఆ నోరు లేని జంతువులలో కూడా చెడునే చూస్తుంటివి. ఇది అపవిత్రమైన జంతువు, ఇది పవిత్రమైన జంతువు. ఇప్పుడు ఏమైంది? భేదభావం పెరిగిందా తగ్గిందా? ఈ భయాలు శాంతులు వల్ల ఎప్పుడూ నిష్ప్రయోజనం అండీ! ఇదంతా కూడా శరీరపద్ధతి. ఆత్మానుసారమైనటువంటి జీవితంలో వీటికి తావు లేదు. చోటు లేదన్నమాట. అర్థమైందా అండీ!

కాబట్టి ఏమీ, ఇవన్నీ కూడా, ఇదంతా కూడా కేవలము శరీరానుసార జీవితమన్నమాట. శరీరమే నేను అనుకున్నప్పుడు, నీకు జంతువు లక్షణమే వుంటుంది. నీవు భయపడుతావు. భయపడ్డ పిల్లవాడిని అనునయించడం కోసం, నువ్వు ఎట్లా అయితే వాడిని ఓదార్చుతున్నావో, ఆ ఓదార్పు చేసే ప్రక్రియలు ఈ శాంతులన్నీ కూడా. దాని వల్ల ఏదీ జరిగేది, జరుగబోయేది, జరుగుతున్న దాంట్లో మార్పు ఏమీ వుండదు. అర్థమైందా అండీ! ఇంకా కూడా చెబుతా. నీకు ఎంతగా దాని వెంబడి పోతావో, అవి ఇంకా మళ్ళా మళ్ళా వస్తూ వుంటాయండి. ఎందుకు వస్తయయ్యా అంటే, ఆయా జీవుల యెడల నీకు కలిగిన వ్యతిరేక భావం చేత, వాటి చేత ఆకర్షించబడుతూ వుంటాయి. ఆ జీవుల యెడ నీకు సమత్వ భావన రాగానే నిన్ను విడిచిపెట్టేస్తాయి. నీ జోలికి రావు అవి ఇక. (మరి గ్రహస్థితి బాగుండలేదు, దీనికి ఇది కాబట్టి వీరికి ఇలా బుద్ధుల పుడుతాయి, ఇది చేయిస్తే ఈ బుద్ధి పోతుంది, ఈ కపట బుద్ధి పోయి మంచి బుద్ధి వస్తుంది) అంతేనా? ఒక్కటి చెబుతా మీకు వినండి. ఇదంతా కూడా కేవలము, పొట్టకూటి విద్యలు ఇవన్నీ కూడా. అంటే ఏమిటి? ఏం చెబితే నీ ఇహలోకంలో నువ్వు ఉపశాంతి పొందుతావో, ఆ ఉపశాంతికోసం చెప్పేటటువంటి, మానసిక ఉపశాంతి మార్గాలు మాత్రమే. (రాత్రి వీళ్ళు కూర్చుని పినతల్లి, కొడుకు ఓ జాతకాలు తిరగేసుకున్నారు, నువ్వు రాలేదుగా రాత్రి) కర్తవ్యప్రభావాన్ని, కర్మప్రభావాన్ని మార్చగలిగే సామర్థ్యం దేనికీ లేదు. బ్రహ్మజ్ఞానికూడా దేన్ని కూడా మార్చడు. ఒక్కటే విధానం. కర్మ ప్రభావానికి నువ్వు లోబడకుండా చేయగలుగుతాడు. ఎలాగ? జ్ఞాన ప్రభావం చేత. నీకు జ్ఞానం వచ్చేట్టు చేస్తాడు అంతేగాని, తానేదీ స్వయంగా సంకల్పించి, నీకు ఈ కష్టం రాకుండా చేయాలని

ఆలోచించడానికి వీలుకాదు. (ఆ కష్టం ఆ బ్రహ్మజ్ఞానికి వుండదు కదా!) అతను అనుభవించే తీరులో తేడా వుంటుంది. ఎట్లా వుంటుందంటే, నువ్వు అనుభవించడానికి, నేను అనుభవించడానికి తేడా ఇందాకే చెప్పా నేను. ఎట్లా అంటే, నీవు అది అయిపోతావు. అది వచ్చినప్పుడు నువ్వు అది అయిపోతావు. (అయిపోయి నేనే బాధ పడుతూ వుంటాను) దుఃఖించేస్తావు, అనుభవించేసేస్తావు. అంతా నాకే వచ్చింది, నేనే అనుభవిస్తున్నాను, అని కృంగిపోతావు పాతాళంలోకి. జ్ఞానం వున్నవాడు ఏమిటంటే , ఓహో! అనారోగ్యం వచ్చింది. ఎవరికి వచ్చింది? శరీరానికి వచ్చింది. శరీరానికి ఎందుకు వచ్చింది? క్షయ, వృద్ధులు దాని సహజధర్మం. వృద్ధి చెందడం ఎలాగో, క్షయించడం కూడా దాని ధర్మమై వున్నది. ఎందుకని? షడూర్ములున్నాయి. ఆరు రకాల కష్టాలు వున్నాయట మనకి. ప్రతి మానవుడికి కూడా, ప్రతి జీవికి కూడా. అవి ఏమిటయ్యా? అస్తి – పుట్టటం, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే అన్నీ సంస్కృత పదాలు తెలుగులో చెప్పుకుంటే, పుట్టటం, పెరగటం, వృద్ధి చెందటం, స్థిరపడటం, కృశించటం, లేకుండా పోవటం. ఈ ఆరు లక్షణాలు ఎవరివట? శరీరానివి. అందులో భాగంగా జరుగుతోంది. జరగని. నేను ఎవరిని? అనారోగ్యానికి కూడా సాక్షిని. అనారోగ్యం అంటే ఏమిటి? రెండు ఆరోగ్యస్థితుల మధ్య వున్న భేదమేగా. సమత్వంలో వచ్చిన లోపం అనారోగ్యం. సమత్వంగా వుంటే ఆరోగ్యం. అంతే కదా! ఆరోగ్యం అంటే ఏమిటి? ఆయుః + యోగము. ఈ రెండూ కలిస్తే ఆరోగ్యమండి. వేరే ఏమీ లేదు. నీ ఆయుష్షు, నీ యోగము ఈ రెండూ నీకు తెలిస్తే, అది ఆరోగ్యము. నీ ఆయుష్షు ఎంతో నీకు తెలుసా? తెలియడం లేదు. నీవు ఏ యోగ స్థితిలో వున్నావో తెలుసుకుంటున్నావా? అదీ లేదు. ఇహ ఆరోగ్యం ఏమిటి ఆరోగ్యం? ఎంత అనారోగ్యంలో వున్నావు? అదీ ఆరోగ్యం అనుకుంటున్నావు. ఇది కాదయ్యా బాబు. ఆరోగ్యము, అనారోగ్యము అంటే అర్థం ఏమిటంటే, నిన్న చెప్పుకున్నాం, ప్రతిరోజు మేలుకొలుపులో పాడుతున్నారా ఇరువది ఒక వెయ్యి ఆరు నూరులు జరుగు హంసలు, ఆ హంసలు గుర్తెరిగినవాడికి తెలుస్తుంది. ఓహో! నా ఆయుష్షు ఎలా క్షీణించిపోతుందో వాడికి కనపడుతూ వుంటుందండి. ఆ meter reading తెలిసిపోతూ వుంటుంది. అలాగే యోగస్థితి, యోగసాధన చేసినవాడికి, యోగం అంటే ఎప్పుడైనా గుర్తుపెట్టుకోండి. యోగము అంటే వున్న స్థితిని కాపాడటం. క్షేమం. యోగక్షేమం

అంటారు కదా! అంటే ఏమిటి? ఉన్నతమైన స్థితి కలగటం, ఆ వున్నతమైన స్థితి చెదరకుండా స్థిరంగా వుండటం. క్షేమంగా వుండటం అన్నమాట. ఈ యోగక్షేమములే యోగంగా మాట్లాడుతూ వుంటాము. ఆయుః యోగము. అర్థమైందా అండీ! ఆ రెండూ కలిపితే ఆరోగ్యము అయ్యింది. ఈ రెండూ వున్నవాడికి, అది తెలుస్తుంది. అనారోగ్యము అంటే ఏమిటి? ఆ యోగస్థితిలో మార్పు వచ్చింది. అందువల్ల ఆయుష్షులో భేదం వచ్చింది. ముందు ఏం చెడిందట? యోగం చెడింది. అర్థమైందా అండీ! నేను ఆత్మస్వరూపుడిని, నేను పరమాత్మస్వరూపుడిని అనే స్థితిలో సహజంగా వుంటే, నాకు ఏ అనారోగ్యము రాలేదు. అర్థమైందా అండీ! ఆ యోగం చెడింది. ఆ భావన చెడింది. దేహభావనలోకి వచ్చాను. రాగానే ఏమైంది? ఆ సుఖదుఃఖాదులు అన్నీ పనిచేసినాయి. పని చేయగానే, శరీరం తల్లడిల్లిపోయింది. అందువల్ల 21,600 జరిగే హంసలు కాస్తా ఏమైంది? ఆ గుర్తు పోయింది, ఆ తెలివి పోయింది. అజ్ఞానంలోకి వచ్చేశాం. అప్పుడేమైంది? ఇంద్రియాల యొక్క దుఃఖాలే నీ దుఃఖాలు అయిపోయినాయి. కాబట్టి నీవు ఈ విచారణంతా చేసి, ఇదంతా శరీరానికి సహజం. ఇవి క్రమ వృద్ధి, క్షయాలు పొందుతూ వుంటాయి. ఇది నా సహజమైనటువంటి సృష్టి ధర్మం. నాది కాదు ఇది. ఇది కేవలం ఈ పనిముట్టును వాడటం కోసం వచ్చాను. పనిముట్టు చిల్లుపడకుండా చూసుకోవడమే నీ పని. అంతవరకే. దానిని వుపయోగించావు, విసిరి అవతలపారేసి వెళ్ళిపోతావు రేపొద్దిన. ఏముంది అందులో అంతకు మించి? అంతకు మించి ఏమీ లేదయ్యా. ఈ కాస్త ప్రయత్నానికి ఓ బ్రహ్మాండం బ్రద్దలు కొడుతూ వుంటివి. ఒక గిన్నె, ఒక పాత్రను తెచ్చుకొంటివి, పాత్రను వుపయోగించి, పాఠం పొందాలి. పరిణామం చెందాలి. పరమాత్మనేను అనేటటువంటి పాఠం నేర్చుకోవాలి. ఆ జ్ఞానం కోసం ఈ పాత్రను తెచ్చుకున్నావు. ఈ పాత్రను వాడుతావు, విసిరి అవతల పారేసి వెళ్ళిపోతావు. ఇంతే జీవితం అంటే. ఒక్కమాటలో చెప్పాలి అంటే. మానవ జీవితం ఇంతకు మించి ఏమీ లేదు. ఈ మాత్రం ఒక్క వాక్యానికి, దాన్ని ఓ సాగలాగి, అటు పీకి, ఇటు లాగి, దాన్ని గ్రహాలు లెక్కేసి, గడులు లెక్కేసి, ఇళ్ళు లెక్కేసి, దాన్ని అటు చేద్దామా? పోనీ ఏమన్నా ఆ ఇళ్ళు ఏమన్నా మారుస్తావా? ఆ గ్రహాలను ఏమన్నా నీకు అనువైనట్టుగా కూర్చోబెడుతావా? ఆ సామర్థ్యం వున్నటువంటి రావణాసురుడి వల్లే కాలేదు దాన్ని తప్పించటం. ఎందుకు

రామాయణం చదువమంటారంటే, ఇందుకే చెప్పేది. గ్రహాలని శాసించగలిగేటటువంటి సామర్థ్యం వున్నటువంటి మహామహుల వల్లనే సాధ్యం కాలేదు. కాబట్టి అటువంటి ప్రయత్నాలు చేయమాకు. అదంతా వృధా ప్రయాస. అవన్నీ వట్టివే. లేనివే. ఆ లేనిపోని దుఃఖజాలంలో పడిపోవడం ఎందుకు? అర్థమైందా అండీ! అందువలన ఏమౌతుంది? నీకేమన్నా దుఃఖం పోతోందా? పోవడం లేదు. పోకపోగా ఏమైంది? మరింత వృద్ధి చెందింది. అర్థమైందా అండీ! కావాలంటే చూసుకోండి మీరు, ఇదిగో ఈ కెంపురాయ పెట్టుకోండి, కెంపు రాయ పెట్టుకుంటే మీకు అంతా మారిపోతుంది. ఏమిటి మారిపోయేది? ఏమిటి మారిపోయేది? (ఏమీ మారల) అయ్యో! ఏవండీ! ఈ భూమండలం మొత్తం మీద, రత్నగర్భ అయినటువంటి భూమండలంలో ఎన్నో వేల, లక్షల, కోట్ల జాతి రత్నాలన్నీ దీంట్లో వున్నాయండి. ఏమైనా భూమండల గమనం మారిందా? (మరి పెట్టుకుంటారు కదా!) నేను ఒక్కటే అడుగుతున్నా! (ఓ నమ్మకం... మారుతుందేమో అని) భ్రాంతి. నీకు ఆ భ్రాంతి వుంది. అంతకు మించి వేరే ఏమీ లేదు. ఏమీ మార్చటం ఏమీ వుండదమ్మా! నిన్ను ఏమార్చుతున్నారు అంతే!

చిన్న పిల్లవాడు పడ్డాడండీ! ఏం చేశావు వాడిని? ఏంచేశావు? వాడి దుఃఖాన్ని ఏమన్నా తగ్గించావా? తగ్గించలేదు. బాధను నువ్వు ఏమన్నా తీసుకున్నావా? తీసుకోలేదు. వాడిని ఏమార్చావు. వేరే వైపు దృష్టిని మార్చావు. దృష్టిని మార్చడం కోసం ఏం చెబితే వీడు దుఃఖాన్ని మరిచిపోతున్నాడో అట్లా ఏమార్చావు. నిన్ను అదే చేస్తున్నారు. (యద్భావం తద్భవతి అంటారు కదా !) ఏమీ లేదు, యద్భావం తద్భవతి జ్ఞానానికి సంబంధించినది. ఆత్మజ్ఞానానికి సంబంధించినది అది. అంతేగాని, నువ్వు కెంపు రాయి పెట్టుకున్నంత మాత్రాన 'యద్భావం తద్భవతి' ఏమౌతుంది? ఏమి అవ్వదు. (ఏమో తగ్గుతుందనే నమ్మకమే..) అబ్బే! సర్వశక్తి స్వరూపుడవు నీవే. సర్వజ్ఞాన స్వరూపుడవు నీవే. పరమాత్మతో సమానమైనటువంటి శక్తి సామర్థ్యాలతో మానవుడిని సృజిస్తే, మానవులు రాయి, రప్పనీనూ, మూలికలను పట్టుకుని, తాయిత్తులను పట్టుకుని వేళాడంలో అజ్ఞానమా? భ్రాంతా ఇది. నీవు పరమాత్మతో సమానమైనటువంటి వాడవయ్యా! అనంతమైనటువంటి శక్తి సామర్థ్యాలు నీయందే వున్నాయయ్యా! అని పరమాత్ముడు

చెబుతూ వుంటే, నువ్వు ఏం చేశావు? అర్థమైందా? ఇలాగ ఎప్పుడైనా గుర్తుపెట్టుకోండి, ఇవన్నీ కూడా నిన్ను ఏమార్చడానికి చేసేటటువంటి పనులన్నమాట. నీ బాల్యంలో నీకు దుఃఖం కలిగితే, నువ్వు మీ చిన్నపిల్లల్ని, పిల్లవాడిని ఎలా ఏమార్చారు? ఆటబొమ్మల వైపో, పుస్తకాల వైపో, బొమ్మల వైపో, వాడిని ఏది ఆకర్షింపచేస్తే దుఃఖాన్ని మరిచిపోయాడో, అలా నీకు ఏమార్చే ప్రయత్నం అన్నమాట. కాసేపు. తాత్కాలికం. కాసేపు ఆ విషయాన్ని మరచిపోతావు. మళ్ళా దుఃఖం వస్తుంది. మళ్ళా మామూలే. ఈసారి కెంపు కాకపోతే ఇంకొకటి పెట్టు. ఇప్పుడు అదీ ఇదీ మార్చుకోకుండా, తొమ్మిదీ వున్నవి ఒకేసారి పెట్టారు. గొడవే లేదని. ఇది మరీ బాగుంది. అర్థమున్నదా అండీ! ఏమైనా? ఒక్కటి గుర్తుపెట్టుకోండి. (దేనినుంచీ ఏమీ ఉపయోగము లేదంటారు) సర్వశక్తిమంతుడవు నీవే. నీకు నీవు ఉపయోగపడనంతకాలం, నిన్నునీవు తెలుసుకోనంతకాలం, అన్నీ వృధానే. గుర్తుపెట్టుకోండి. నిన్ను నువ్వు తెలుసుకోగలగాలి. నీయందు వున్న శక్తి సామర్థ్యాలు నీకు తెలియబడాలి. అది ఏమైనా వుపయోగం. అంతేతప్ప మిగిలినవన్నీ వట్టి వృధా. ఎందుకని? జ్ఞానం ముందు ఇవి ఎందుకూ కొరగావు. నలుసు అంత కూడా, ఆవ గింజ అంత కూడా వీటికి విలువలేదు. ఆత్మజ్ఞానంలో. అందుకే చెప్పేది. ఆత్మవిచారణ ఎవరికి చెప్పాలయ్యా? అంటే, ఎవరికైతే భ్రాంతి లేదో, ఏ భ్రాంతి లేదో, తీర్థభ్రాంతి అర్థమైందా అండీ? తీర్థ భ్రాంతి లేదో వారికి చెప్పాలి. ఆహా! దేహభ్రాంతి పోగొట్టడం కోసమే కదా! ఈ జ్ఞానం చెప్పేది. ఆ దేహభ్రాంతి ఇన్నింటితో ముడిపడి వచ్చింది. ఒకటికాదు ఇది. ఈ దేహభ్రాంతికి ఎన్నిముడులు వేశారు ఇప్పుడు? (మ్రొక్కులు, వ్రతాలు, యాత్రలు) అన్నీ ఇన్నీ కాదు. అబ్బే! అసలు ఎన్ని వస్తే, అన్నిటికి అన్ని ముడులు వేసుకుంటూ కూర్చొంటివి. అర్థమైందా అండీ! కాబట్టి నీవు శరీరమే సత్యము అనుకున్నంత కాలము, ఇలా నువ్వు అజ్ఞానము చేత ఏమార్చబడుతూనే వుంటావు. తప్పనిసరిగా. దానిని ఏమీ మార్పు చేయజాలరు ఏమైనా సరే! ఏం చేస్తారు మహా అయితే? నీ స్వభావం ఏమిటో, నీ లక్షణమేమిటో చెప్పవచ్చు. జాతకం వలన ఉపయోగం ఏమిటంటే, ఫలానా ఫలానా గ్రహాల వల్ల, నక్షత్రాల వల్ల, ఫలానా కాలాల్లో జన్మించినటువంటి వాడికి ఏ రకమైన స్వభావం వుంటుంది అని ఊహించే ప్రయత్నం అది అంతే. అసలు నిజంగా అవన్నీ ఎందుకు పెట్టారయ్యా అని అంటే, మృత్యువు యొక్క అవగాహన కలిగించడం కోసం

పెట్టారు, అర్థమైందా అండీ! విశ్వం అంటే ఎలా వుంది? అది ఎంత విశాలంగా వుంది? దానికి ఆద్యంతములు లేకుండా ఎలా వున్నాయి? పరమాత్మ ఆ విశ్వాన్ని ఎట్లా నియమించాడు? ఆ పరమాత్మ ఎట్లా విశ్వనియమంతో ఈ సృష్టిని పోషిస్తున్నాడు? ఈ సృష్టిని పరమాత్మ పద్ధతిగా ఎట్లా నిర్వహిస్తున్నాడనేది తెలియజెప్పడం కోసమని ఏర్పడిన జ్యోతిషం, చివరకి ఏమైపోయింది? నువ్వు తూర్పుకు అడుగు వేయాలా? పడమరకు అడుగు వేయాలా? దొంగతనానికి ముహూర్తం పెట్టాలా? హత్యకు ముహూర్తం పెట్టాలా? దాకా వచ్చేసింది. అర్థమైందా అండీ! (వాటికి కూడా ముహూర్తాలా) ఆఁ.. అయ్యో! వాడు వచ్చాడు, డబ్బు ఇస్తే ముహూర్తం పెడతానన్నాడు, డబ్బు ఇచ్చాడు, తప్పేముంది అందులో, నా వృత్తి అది అని అంటాడు ఆయన. ఇప్పుడు ఒక్కటి మీరు అడగండి. మీరు ఎవరైనా ఇవన్నీ చెప్పేవారిని, ఏమండీ మీ జీవితం ఏమైనా మారిందా? అని వాళ్ళను అడగండి. ఒకసారి. ఒకసారి మీరు అడిగి చూడండి. వాళ్ళే చెబుతారు, ఏమీ మారలేదు నాయనా! ఏమీ మార్పు చెందలేదు నాయనా! ఎందుకనయ్యా? మారడానికి ఇది చాలదు. ఆత్మజ్ఞానం వల్ల మారడానికి సాధ్యం అవుతుంది కానీ, వీటివల్ల ఏమీ మార్పు చెందదూ. ఉదాహరణకు నేను ఒకటే అడుగుతానండీ! నవరత్నాల షాపు వాడు వున్నాడండీ! వాడు ఏం మారాడు? వాడికి ఏ అద్భుతం జరిగింది? మరి 9 రత్నాలను వాడు పుట్టి, బుద్ధి ఎరిగిన దగ్గర నుంచీ అమ్ముతూనే వున్నాడు కదా! ఏమైందట? వాడికి రాలేదా మరణం? వాడు పోలేదా? (మరణాన్ని గురించి కాదు కదా! వాడు ఎంత వున్నత స్థితికి వస్తాడు...) మీరు అడిగి చూడండి. ఏవండీ! మీకు ఏ దుఃఖాలు లేవా? వాడు ఏకరువు పెట్టిన దుఃఖాలు అన్నీ ఇన్నీ కాదండి. (అవును). ఎందుకనిట? ఇప్పుడు వాడికేమీ దుఃఖాలు వుండకూడదు కదా మీ లెక్కప్రకారం? (వాడిది వ్యాపారం అండీ!) ఏమైంది మరి? ఎవరి మీద వ్యాపారం? నీ అజ్ఞానం మీద వ్యాపారం. వేరే ఏమీ లేదు. అంతకు మించి. అర్థమైందా అండీ! ఇదంతా కూడా కేవల భ్రాంతి నిర్ణయాలు, శరీరం నేను అనేటటువంటి పద్ధతిలో జీవించే జీవన విధానము. వీటిని ఆశ్రయించి వున్నంత వరకూ నీకు ఆత్మ విచారణ ఎప్పటికీ అబ్బదు. ఆత్మవిచారణలో వున్నవాడు, వీటిని ఎన్నటికీ పాటించడు. ఒకటే గుర్తు పెట్టుకోండి. మీరు ఇవి పాటిస్తారు, మీరిక తరువాత ఆత్మవిచారణలో నిలబడే అవకాశమే వుండదు. కచ్చితంగా ఏ పరిస్థితులలోనూ

వుండదండి. ఎందుకని? మళ్ళా వాటిజోలికే వెళ్తావు. ఆ తాత్కాలికమైనటువంటి పద్ధతిలోకే వెళ్తావు. ఆ తాత్కాలిక సుఖాన్నే ఆశ్రయిస్తావు. చిన్నపిల్లల్ని ఎట్లా అయితే నువ్వు, వాడికి దెబ్బతగిలినప్పుడు, ఏమార్చినప్పుడు వాడికి తాత్కాలిక సుఖము ఎట్లా కలుగుతోందో, అలాగే నీకు ఆ బాల్యావస్థలో వున్న బుద్ధే వుంటుంది తప్ప, ఎప్పటికీ కూడా బుద్ధి వికాసము పూర్తి అవ్వదు. కాబట్టి, అన్ని భ్రాంతులని నిరసించాలి అనుకున్నవాడికే, ఈ ఆత్మజ్ఞానం వుపయోగపడుతుంది. నేను శరీరం కాదు, నేను ఆత్మస్వరూపుడిని అనే నిర్ణయానికి జీవించాలనుకునే వాడికే ఈ వుపయోగం అంతా. ఈ వివేక చూడామణిగానీ, ఆ అష్టావక్రగీత గాని, ఈ భగవద్గీతగాని ఇవన్నీ వాళ్ళకు మాత్రమే. అంతేగాని వేరే మార్గం లేదు. (జాతకాలు చూపించామా, రాళ్ళు చూశామా, ఉంగరాలు చేయించామా...) అబ్బే! ఇవన్నీ వట్టి మాటలండి. (మన ఆచార వ్యవహారాలు అన్నీ మారితే కానీ..) అంతే! కచ్చితంగా మారవలసిందే నండి. మీరు మీ ఆచార వ్యవహారాలు అనే పంజరంలో చిక్కుకుని వున్నంత కాలము నువ్వు శరీరంగానే వుంటావు కచ్చితంగా. ఎందుకని? అవన్నీ శరీరానుసారం ఏర్పాటు చేసుకున్నావు. ఆత్మానుసారంలో వాటికి చోటులేదు. భ్రాంతికి చోటే లేదు అసలిక్కడ. అర్థమైందా అండీ! ఎందుకని అంటే, అవన్నీ నువ్వు ఎలా ఏర్పాటు చేసుకున్నావు? వాటికి అర్థమే లేదు. వాటిని ఏ లక్ష్యంతో పెట్టుకున్నావు? ఆ లక్ష్యమే సిద్ధించలేదు. ఎన్నో ఏళ్ళు వాటిని అనుభవిస్తూనే వున్నావు, ఆచరిస్తూనే వున్నావు ఏం సాధించావు? ఏతావాతా ఏమీ సాధించలేదు. కాబట్టి వాటిని వీలైనంత మేరకు తగ్గించుకుని, ఆ తగ్గించుకున్నవాటిని కూడా ఆత్మజ్ఞాన పద్ధతిలో ఆచరిస్తే, అవే నిన్ను వదిలేస్తాయి. కాబట్టి వాటిని నువ్వు వదుల్చుకోవడం ఒక ఎత్తైతే, అవి నిన్ను వదిలేట్టుగా జీవించడం మరో ఎత్తు. అవి నిన్ను వదిలేట్టు జీవించాలి అనేది సరైన విధానం. వాటిని నువ్వు వదిలేస్తే మళ్ళా వస్తాయి. ఎవడో ఒకడు పక్కనుంచీ చెబుతాడు, అయ్యో! మీరు అది కదండీ! (అవే మనల్ని వదిలేట్టుగా చూడాలి) ఆః... అవే నిన్ను వదిలేట్టుగా జీవించాలి. అది శాశ్వతమైన పద్ధతి అన్నమాట. అంటే అర్థం ఏమిటి? ఉదాహరణ చెప్తాను చూడండి.

ఇప్పుడు మొన్న నేను ఆబద్దీకము పెట్టాలి. అంతే కదండీ! ధ్వంజం కావాలా వద్దా అప్పుడు? వేసుకున్నాను. మరలా దాంతో పని అయిపోయింది. ధ్వంజం విసిరి అవతల

పారేశాను. ఎందుకని? రోజువారి జీవితంలో నాకేమీ దానితో అవసరం లేదు. ఎందుకని? ఏదైతే నువ్వు నవావరణ సహితమైన శక్తి స్వరూపము అని, ఏదైతే ఆ ధ్వంజాన్ని ఏదైతే పెట్టావో, ఆ నవావరణ అంశలకు మూలమైనటువంటి బిందు స్థానము ఏదైతే వున్నదో, ఆ బిందు స్థానంలో వున్న పరమశివుడు ఎవరో, అట్టి పరమశివుడికి మీరినటువంటి స్థితి ఏదైతే వున్నదో, అక్కడిదాకా జ్ఞానం తెలిసిన వాడికి, ఈ ధ్వంజంతో ఏం పని? ఎందుకు పెట్టారు నీకు అది? ఈ స్థితిని సూచించడం కోసం అని, ఒక సూచనగా అది పెట్టారన్నమాట. అర్థమైందా అండీ! మీ అందరికీ కూడా అంతే. మంగళసూత్రం ఎందుకు పెట్టారు మీకు? మీ ఆయన కట్టాడు కాబట్టి వేసుకున్నావు. తీసి గట్టున్న పెడితే, మీ ఆయన ఎక్కడ పుటుక్కుమంటాడో అని నీ భయం అంతా కూడా. కానీ నీ మంగళ సూత్రానికి, ఆయన ఆయుర్దాయానికి ఏమన్నా సంబంధం వున్నదా? (లేదు). ఒక్కసారి చూపెట్టండి. అంటే గతించినవారందరూ (మరి ఆ మంగళ సూత్రం ఎందుకు కట్టారు?) అదేనండి, గతించినవారందరూ కూడానూ మంగళ సూత్రం గట్టున పెడితే పోయారా? ఈవెడేమన్నా పోనీ పలుకు తాడంత మంగళ సూత్రం వేసుకుంటే, ఏమన్నా కలకాలం నిలిచి వుంటాడు. వాడి ఆయుర్దాయానికి, నీ మంగళ సూత్రానికి ఏం సంబంధము లేదు. ఇదే భ్రాంతి అంటే. కానీ దాని వెనుక ఒక రహస్యం వున్నది. ఏమిటంటే, బిందుస్థాన నిర్ణయం చెప్పడం కోసమని పెట్టారు.

పూర్వకాలంలో ఎవరైతే భర్తలు వున్నారో వాళ్ళకి జ్ఞానం వున్నది. అర్థమైందా అండీ! వాళ్ళు బ్రహ్మచర్యం పాటించేవారు. గురుకులాన్ని ఆశ్రయించి, బ్రహ్మజ్ఞానాన్ని పొంది, గురువు అనుజ్ఞ మేరకు గృహస్థ ఆశ్రమంలో ప్రవేశించేటప్పుడు ఆ భర్తయే, ఈ భార్యకి గురువు అన్నమాట. మరి అప్పుడు వాళ్ళు భార్యాభర్తలు కాదు. గురుశిష్యసాంప్రదాయ పద్ధతిలో గృహస్థాశ్రమాన్ని స్వీకరించేవాళ్ళు. అప్పుడు ఆయన ఆ బిందువు నిర్ణయపద్ధతిని, ఈ బిందువునుంచి సృష్టి ఎలా వుద్భవించింది అనేటటువంటి రహస్యాన్ని తెలియచెప్పడానికి సూచనగా దీన్ని ఏర్పాటు చేశారు. అర్థమైందా అండీ!

ఏనాటి నుంచి, కృతయుగకాలం విషయం. కృతయుగ కాలంలో అందరికీ ఆత్మజ్ఞానం వుండేది ఆ కాలంలో. అందరూ ఆత్మస్వరూపులుగానే వుండేవాళ్ళు. కేవలం పరమాత్మ నిమిత్తమే జీవించేవాళ్ళు. వాళ్ళకు ఏ ఇబ్బందీ లేదు. ఆ పరమాత్మ నిర్ణయపద్ధతి

చెప్పడం కోసం, సృష్టి రహస్యాన్ని బోధించే నిమిత్తమై, భర్త భార్యకు ఈ బిందువు నిర్ణయాన్ని చెప్పి, ఈ బిందువునుంచి సృష్టి ఎలా వుద్భవించింది, మరళా బిందువులో ఎట్లా లయమైపోతుంది అనే దాని నిర్ణయం చెప్పే పద్ధతిలో ఆ సూచన నిమిత్తమై, ఈ మంగళ సూత్రం యొక్క గుర్తును వాడారు. అర్థమైందా అండీ!

మీరు చూసుకోండి కావలసి వస్తే, బయట ఒక సున్నా వుంటుంది, మధ్యలో ఒక బిందువు ఉంటుందండి. ఆ బయట వున్నదేమో సృష్టి అన్నమాట. ఆ మధ్యలో వున్నది బిందువు అన్నమాట. ఆ బిందువు నుంచీ సృష్టి వ్యక్తీ కరించబడింది, మళ్ళా అదే బిందుస్థానంలో లయం అయిపోతుంది. అని ఆ గుర్తును వాడాడు. ఒక పేపరు మీదో లేకపోతే ఒకదానిమీద గీసి చూపెట్టి దీనిని వివరించడాన్నమాట దీనిని. ఇదే మీకు కామకళావిలాసము అని శ్రీవిద్యారహస్యము అనే పుస్తకము ఒకటి వుందండి. దాంట్లో ఇది వుంటుంది. ఇదే ఈ మంగళ సూత్రం గుర్తు వుంటుందన్నమాట. ఆ గుర్తును ఉపయోగించి, అప్పట్లో శ్రీ విద్యారహస్యాన్ని బోధిస్తారు. అది బోధించడానికి ఎవరికి అర్హత వుందయ్యా అంటే, భర్తకి భార్యకు బోధించే అర్హత వుందన్నమాట. శ్రీవిద్యారహస్యం బోధించాలి అంటే, భర్తే బోధించాలన్నమాట దానిని. అందుకని అలా పెట్టారు దానిని. అలా పెట్టి వాళ్ళు ఆ బోధ కోసం వుపయోగించిన గుర్తుని, తర్వాత కాలంలో ఆ శ్రీవిద్యపోయింది, రహస్యం పోయింది, భర్త గురువు పోయింది, భార్యశిష్యులు పోయింది, అన్నీ పోయి చివరకు ఏమి మిగిలింది? మంగళసూత్రం కట్టటం, అది మిగిలిపోయింది. ఆ గుర్తు ఏదైతేవుందో ఆ గుర్తురూపంలో ఒక రూపు తయారు చేసి, ఆ రూపు నీకు గుర్తుండాలనే వుద్దేశ్యంతో మెడలో కట్టడం తయారైంది. ఈ మెడలో కట్టడమే బోధించడం ఇక. వీడికి తెలిస్తే కదా వాళ్ళకి బోధించడానికి అసలు. అర్థమైందా అండీ! ఇలా ఆ మంగళ సూత్రం వెనుకాల వున్న రహస్యం ఇది. అందుకే మీరు 9 తంతువులు పోసిది దానికి. 9 దారాలు పోస్తారండీ కచ్చితంగా. ఆ 9 దారాలు పోయడం వెనుకాల వున్న రహస్యం ఏమిటంటే, ఆ నవావరణ సహితమైనటువంటి శ్రీవిద్యారహస్యాన్ని బోధించడం అన్నమాట అది. ఆ బోధించే నిమిత్తంకోసమనే అప్పుడు ఐదు రోజులు పెట్టారు పెళ్ళి. పూర్వకాలంలో ఐదురోజులు ఊరకే పెట్టలేదు. ఆ ఐదు రోజులు అందరూ ఊరకే భాజాభజంత్రీలతోటి అందరూ వచ్చి, భోజనం చేసి వెళ్ళడానికి

కాదు పెట్టింది. ఆ ఐదురోజుల్లో క్రతువు వుంటుందండీ! ఆ క్రతువులో, ఆ ఐదురోజుల క్రతువులో ప్రతిఘట్టమూ కూడా ఇప్పుడు మనం ఏదైతే మూడుగంటల్లో మొత్తం పూర్తి చేసేస్తున్నామో, ఈ మూడు గంటల్లో పూర్తి చేసేది, ఐదురోజుల్లో చెయ్యాలి అది. ఆ ఐదు రోజుల్లో ఈ భర్త గురువుగా స్థిరపడతాడన్నమాట. భార్యకు బోధిస్తాడు అన్నీ! ఒక్కొక్కటీ వివరించి చెప్పి బోధించే విధానం అంతా ఐదురోజుల్లో వుంది. ఐదురోజుల పెళ్ళి అందుకోసమే పెట్టారు. ఆ ఐదురోజుల పెళ్ళిలో ఈ బ్రహ్మగారు ఎవ్వరికీ బోధించరండీ! బ్రహ్మస్థానంలో ఈ భర్తగారే వుంటారు. ఈయనే మొత్తం అంతా, ఎట్లా అయితే యజ్ఞం చేయాలి? ఎలా అనుసరణ చేయాలి? గృహస్థాశ్రమ ధర్మంలో ఎలా వుండాలి? ఇవన్నీ ఈ విధివిధానాలన్నీ, ధర్మాలన్నీ, నియమాలన్నీ ఆ శ్రీవిద్యారహస్య సహితంగా బోధిస్తారన్నమాట. ఎప్పుడో కృతయుగకాలంలో వుండేది అది. ఇప్పుడు ఆ పనంతా పురోహితుడు చేస్తున్నాడు. వీళ్ళు చేతులు త్రిప్పుతున్నారు. అర్థమైందా అండీ! వీళ్ళు చేతులు తిప్పుతున్నారు అంతే! ఆ తమలపాకు ఇక్కడ పెట్టయ్యా? ఎందుకు పెట్టాలో వీడికి అనవసరం. అంతే! పెట్టేస్తాడు అంతే. (మంత్రాలలో వచ్చేది కూడా ఇదేనా?) అంతేకదా! మంత్రాలలో చెప్పేది అంతాకూడా ఇదేనండీ! ఆ మంత్రాలలో వచ్చేదంతా కూడా ఈ విద్యే. జీవుడు ఎలా వస్తాడు? జీవుడు ఎలా పోతాడు? సృష్టి ఎలా వస్తుందో, సృష్టి ఎలా పోతుందో చెప్తాడు అంతే. అందువలన ఏమైపోయింది? అదంతా పోయి చివరికి, అన్నీ గుర్తులు మాత్రమే మిగిలిపోయినాయి. కాబట్టి నీ మంగళ సూత్రం మీద ఆధారపడి ఈ భూమండలంలో ఏదీ లేదన్నమాట. అర్థమైందా అండీ!

కాబట్టి నీకది మంగళసూత్రం ఎప్పుడైంది? నీకు శ్రీవిద్యారహస్యం బోధపడితే, ఆ గుర్తు చూడగానే అది స్ఫురణకు రావాలన్నమాట. ఆ వుద్దేశ్యము అది. అది తెలిస్తే ఇది ఉపయోగపడుతుంది. ఇప్పుడు అందరికీ ధ్వంజం కూడా ఇలాగే అయిపోయిందండి. ఈ ధ్వంజం కూడా ఇలా ఎందుకు అయిపోయింది అంటున్నానంటే, 'జగమెరిగిన బ్రహ్మణుడికి ధ్వంజమేల?' అంటే అర్థం ఇదేనండి. ఎవరికైతే సృష్టి రహస్యం తెలిసిందో, తెలియటం కోసమని ఈ విద్యను పెట్టాము. ఇక్కడ ఒకటే అంశం గుర్తుపెట్టుకోండి. నీవు ఎప్పుడైతే విద్యను పొట్టకూటికి ఉపయోగిస్తావో, లక్ష్యం పోతుంది. నీవు పొట్టకూటికోసం విద్యను ఉపయోగించకూడదు. అందుకే వేదాంత విద్యను

బోధించేవాళ్ళు శిష్యుల దగ్గరనుంచి నక్షత్రం విలువ కూడా స్వీకరించకూడదని నియమం వుంది. అంటే అర్థమేమిటిట? తమలపాకు తొడిమనుకూడా గ్రహించరాదు. (ఆశించరాదు) గ్రహించరాదు, ఆశించరాదుకాదు గ్రహించరాదు. నీ దగ్గరనుంచి నేను తొమలపాకు తొడిమను కూడా గ్రహించరాదు. అందుకని స్పష్టంగా ఏం చెబుతున్నాము? అందుకే మీరు వట్టి చేతులతో రండమ్మా! మీరు ఏమీ తేమాకండి. ఏమీ సాగిల పడమాకండి. ఎవరూ నమస్కారాలు చేయడానికి కాని, ఎవ్వరూ నమస్కారాలు స్వీకరించడానికి కూడా ఎవ్వరికీ అర్హత లేదు. (ఊరికే రాకూడదు అని అంటారు కదండీ!) ఊరికే రాకుడదు అంటే ఏమి తీసుకురమ్మని? ఏ గురువుగారైనా? నీవు ఇందాకడినుంచీ చెబుతున్నావే భ్రాంతితో కూడుకున్నటువంటి వాడు. శరీరమే సత్యమని, నిన్ను ఏమార్చి, తాత్కాలిక ఉపశమనం చెప్పే గురువులు వేరే. అర్థమైందా అండీ! ఆత్మజ్ఞానానికి సంబంధించిన గురువులు అందరూ ఇలానే వుంటారు. (ఆ రోజుల్లో కూడా వున్నారు కదండీ!) ఏ రోజుల్లో? (ధనాలు పంపించేవాళ్ళు కదా!) ఎవరు పంపించారు? వశిష్ఠ మహర్షి ఏమి స్వీకరించాడు? ఏమీ స్వీకరించలేదు. బ్రహ్మజ్ఞానం వున్నవారు ఎవ్వరూ ఏదీ స్వీకరించరు, వాళ్ళు ఏదీ అవసరం లేదు వాటితోటి. దశరథ మహారాజు రాముడికి విద్య బోధించమని పంపించాడండీ! ఆ విద్య బోధిస్తే రాముడు ఏమి ఇచ్చాడు? ఏమీ ఇవ్వలేదు. దశరథ మహారాజు ఏమి ఇచ్చాడు? ఏమీ ఇవ్వలేదు. మణులా, మాణ్యాలా, రాజ్యాలా? ఏమి ఇచ్చాడు? ఏమీ ఇవ్వలేదు. అందుకే యోగవాసిష్టం చదువమని చెప్పేది. అందులో ఏమీ ఇవ్వడం అనేది ఏమీ వుండదండి. నీవు జ్ఞానం కోసం వచ్చావు. జ్ఞానాన్ని సంగ్రహించు. పో! నీకు జ్ఞానం వచ్చింది, పది మందికి నేర్పు. ఇంతే. (అదే దక్షిణ) అసలు గురు దక్షిణతో పనిలేదు. ఎందుకని? గురువు శిష్యుడు ఏకమైపోతేనే నువ్వు ఇక్కడి నుంచి వెళ్తావు. బ్రహ్మవిద్యను పోషించినవారికి ఎట్లా వుంటుంది అంటే, గురువుతో సమానం అవుతావు. బ్రహ్మలో ఇద్దరూ సమానమే. మరి ఇద్దరూ సమానమైనప్పుడు ఇచ్చేవాడు ఎవడు? పుచ్చుకనే వాడు ఎవడు? గురు దక్షిణే లేదు ఇక్కడ. గురు దక్షిణ సాంప్రదాయం క్షత్రియ రాజ విద్యలలోనే వున్నది. బ్రహ్మవిద్యలో లేదు. అంటే అర్థం ఏమిటి? బాణాలు వేయడం, యుద్ధం నేర్పడం అలాంటి చోట గురు దక్షిణ విధానం

పెట్టారు. క్షత్రియ – రజోగుణంతో కూడికుని వున్నదన్నమాట అది. ఆ రజోగుణ విద్యా విధానం నుంచీ పుట్టింది గురుదక్షిణ. అర్థమైందా అండీ!

అందువల్ల బ్రహ్మవిద్యా సాంప్రదాయంలో ఎక్కడా గురుదక్షిణ లేదు. (అవును అప్పుడున్నాయి మన గురుకులాలు వేదం నేర్పినారు, స్మార్తం నేర్పినారు, అన్నం పెట్టి, తింటం, నేర్చుకోవడం) అదేమిటది? మధూకర వృత్తి. వృత్తి అయితే మధూకరం. మధూకరం అంటే అర్థం ఏమిటి? మధువు అంటే అమృతం అండీ! కరము – పెట్టే చెయ్యి అమృత హస్తము. నువ్వు ఏం పెడుతున్నావట ఇప్పుడు? అన్నం పెట్టడం లేదు, జ్ఞానం. నిన్ను ఏమి అడుగుతున్నాడు? నేను ఏ వృత్తి నిమిత్తమై వచ్చానండి? మధూకర వృత్తి. నీది అమృత హస్తం అయితే పెట్టు. అమృత హస్తంతో నువ్వు ఏం పెట్టాలి? అమృతాన్ని అందించాలి కదా! అమృతం అంటే అర్థం ఏమిటి? జ్ఞానమే అమృతం. నీ దగ్గర వున్న జ్ఞానాన్ని అడుగుతున్నాను నేను. నీ దగ్గర వున్న అన్నాన్ని అడగడం లేదు నేను. (ఇక్కడ రెండు భావాలు లేవు, ఇచ్చిన వాడు లేడు, తీసుకునే వాడు లేడు.) ఏమైంది అప్పుడు? వాడి కడుపు నిండాలి కాబట్టి అన్నం పెడుతున్నాను, వాడేమో అన్నం తినాలి కాబట్టి తింటున్నాడు. అది. అర్థమైందా అండీ! ఇలా ప్రతిదాంట్లో అసలుది పోయి, శరీరభావం నిలిచిపోయింది. అట్లాగే అతను ఏమి అడుగుతున్నాడ? మాధవ కబళం. అర్థమైందా? మాధవకబళం. మాధాకోళం కాదండి. 'మాధవ కబళం' అది. (మాధవ కబళం) ఆఁ.. నువ్వు తినే వాటిల్లో, భగవంతుడి నిమిత్తమై ఏదైనా తీసిందంటూ వుంటే, అది నాకు పెట్టు. నేను ఎవరిని ఇప్పుడు? పరమాత్మ స్వరూపుడను. అడిగేవాడు ఎవడు? ఆ మాట. పరమాత్మ స్వరూపుడు. ఏమి అడుగుతున్నాడు? నువ్వు పరమాత్మ నిమిత్తము ఏమైనా నిలిపి వున్నది ఏమైనా వుంటే, అది ఇవ్వు నాకు. (అలా వచ్చే వాళ్ళూ లేరు, ఇలా పెట్టే వాళ్ళూ లేరు). అసలు ఇప్పుడు ఎందుకుపోయింది? ఎలా పోయిందిది? లక్ష్యం పోయింది కాబట్టి. అసలు విషయం పోయేటప్పటికి, మీకు ఆచరణలో ఎక్కువ కాలం నిలబడదండి. నేను చెబుతున్నాను కదా! ఈనాడు మీరు చెబుతున్నవి ఏమైనా సరే, ఒక్కటి చెబుతున్నా వినండి. మీ తాతల తరం నాడు, మీరిప్పుడు ఆచరిస్తున్న ఆచార సంప్రదాయాలు ఎలా వున్నాయి? ఇప్పుడు ఎలా వున్నాయి? ఎంతో మార్పు వచ్చేసిందండి. ఇప్పుడు చూస్తున్నారు మీరు. నాలుగు తరాల తరువాత చూడండి. ఏమీ వుండదండి. ఎందుకని?

జ్ఞానలక్ష్యం లేకపోతే ఏ ఆచార, సాంప్రదాయం నిలబడదు. సమస్యే లేదండి. మహా అయితే ఒక 100 ఏళ్ళు వుండచ్చు. ఒక 50 ఏళ్ళు వుండచ్చు. ఒక 200 ఏళ్ళు వుండవచ్చు. అంతే తప్ప జ్ఞానలక్ష్యంపోతే ఏ ఆచరణా నిలబడదండి. మీ మంగళ సూత్రం ఇవాళ ఎంతమంది కడుతున్నారు? అయిపోయింది దాని బ్రతుకు కూడా అయిపోయింది. ఎందుకుని? వేసుకునే వాడికి ఆ భావన లేదు. కట్టే వాడికి ఆ భావన అస్సలు లేదు. బోధించగలిగే సామర్థ్యం లేదు. వీరికి శిష్యుడు అనే భావన లేదు. గురుశిష్య సాంప్రదాయమే లేదు అసలిప్పుడు. భార్యాభర్తల మధ్య అస్సలు లేదు. ఒకరు బోధించడం, ఒకరు వినడం అనే విధానం అసలు లేదుగా ఇప్పుడు. ఎవరికి వాళ్ళే. ఎవరికి వాళ్ళే గురువులు. శిష్యులు ఎవరూ లేరు. శిష్యులు లేకుండా గురువులు ఎలా వున్నారు అసలు? వినేవాళ్ళు లేకపోతే చెప్పేవాళ్ళు ఎవరు? అర్థమైందా అండీ? గురునిర్ణయం ఎవరు చేయాలి? శిష్యుడు చేయాలి. వినేవాడు వుంటేనే కదా! అయ్యా! నాకు జ్ఞానాన్ని బోధించమని అడిగితే, గురు నిర్ణయం అయ్యింది. జ్ఞానాన్ని బోధించమని అడుగకపోతే, శిష్యులే లేరు, గురువు ఎక్కడ? కాబట్టి అంతాకూడా ఇప్పుడు ఇలా మార్పు చెంది, కాలమే పరిష్కరించేస్తుందండి వీటన్నింటిని. మీరు ఒక్కటి గుర్తు పెట్టుకోండి. ఏ సమాజంలో అయినా సరే, గాఢతమోగుణమైనటువంటి ఆచార, సాంప్రదాయాలు ఎప్పుడైతే వచ్చేస్తాయో, దానిని బ్రద్ధలు కొట్టేది కూడా దాని పక్కనే వచ్చేస్తుంది వెంటనే. దాని వేరు పురుగు దాని పక్కనే వచ్చేస్తుందన్నమాట. అది ఎంతగా వెళ్ళి, ఆ మనిషిలో వున్నటు వంటి అహం అంతా చేరిపోతుందండి. చేరిపోయి అంతా అది బిగుసుకుపోతుందన్నమాట. ఎప్పుడైతే బిగుసుకుపోయిందో, మానవుడు దాంట్లోనుంచి వెంటనే ఉద్భవిస్తాడు. స్వేచ్ఛాగత మానవుడు ఉద్భవిస్తాడండి. దానిని వెంటనే బ్రద్ధలు కొడుతాడు. (ఒకాయన వున్నాడు, అది మెడలో వుండడం వల్ల వచ్చింది ఏమిటి? పోయింది ఏమిటి అంటాడు) ఎట్లాగో చెబుతా వినండి. దుఃఖ నివృత్తి దాని వల్ల నీకు వాదనకు మాత్రమే తీసేశావు అది. వాదనకు తీసేస్తే నీకు దుఃఖ నివృత్తి వుండదు. దుఃఖం కలుగకుండా వుండదు. (దాని వల్ల ఏమిటి ఉపయోగం) ఉపయోగం లేదు. నేను చెబుతున్నాగా. ఆ౯.. ఇప్పుడు ఉపయోగం లేదు కరక్టే. నీకు ఉపయోగించుకోవడం తెలిసి నువ్వు విసర్జించడం వేరు. తెలియక విసర్జించడం వేరు. ఇప్పుడు ఉదాహరణ చెబుతానండి. ఇప్పుడు కర్మకాండ చేయాలి. మా

అమ్మగారు గతించారు. ఎవరి కోసం చేశావు? ఎవరికోసం చేస్తున్నారు అని చేయించే ఆయన అడిగారు. నాకోసం చేస్తున్నాను నాయనా! నీ కోసం చేయడమేమిటి? మీ అమ్మకోసం కాదా? మా అమ్మకోసం నేను కాదు నాయనా! హరిహరాదులు వచ్చినా చెయ్యటం కుదరదు నాయానా! ఎందుకని? ఒకసారి శరీరం విడిస్తే, దానికి addres లేదు మరో శరీరం ఈ పాటికి వచ్చి వుంటుంది. నువ్వు దానిని వెతికి పట్టడానికి వీలుకాదు. నువ్వు చెప్పేదంతా నాకు, చేసేది నాకోసం. ఆత్మజ్ఞానం బోధిస్తున్నావు, జీవుడి యొక్క రాకడ, పోకడ బోధిస్తున్నావు. ఇదంతా సత్యం నాకు తెలుసు. నువ్వు చెప్పే సంస్కృత వాక్యాల అర్థం అంతా, తెలిసి నేను చేస్తున్నాను కాబట్టి నాకు తెలుసు నువ్వు ఏం చెబుతున్నావో, ఏం చేస్తున్నావో. కావాలంటే నువ్వు అడుగు. నీకు కూడా చెబుతా. (పోయిన వాళ్ళకోసం కాదు) పోయినవాడికి అడ్రెస్ ఏది? శరీరం విడిచిపెట్టిన తరువాత నీ అడ్రెస్ ఎక్కడ? (మరి వీళ్ళంతా కలల్లోకి రావడం ఇదంతా ఏమిటి అసలు?) నీ జ్ఞాపకాలు. నీవే. నీ జ్ఞాపకాలే. నీ ప్రాణమనోబుద్ధులే. నీ లోపల వున్న స్ఫురణే. వాళ్ళు ఎవరు, మరొకరు ఎవరూ నీ మూడు అవస్థలలో ప్రవేశించే అవకాశమే లేదు. (మా అమ్మమ్మ రేపు చనిపోతుందనంగా నేడు కలలోకి వచ్చింది) ఇవన్నీ వట్టిదేనండి. అంతా భ్రాంతి గతం. శరీర నిర్ణయం. నీ జ్ఞాపకాలు. నీకు బలంగా ఏవి వుంటే, అవే వస్తాయి. వేరే ఏమీ లేదు అందులో. ఈ జీవుడైనా అంతే. ఎవ్వరైనా అంతే. దేవుడైనా, దెయ్యమైనా, అన్నీ అంతే. అవి ఏమైనా, నీ కలలోకి మరొకరు ప్రవేశించే అవకాశమే లేదు. ఒక్కడికి వుంది అవకాశం. ఎవడయ్యా అంటే, సచ్ఛిష్యుడు, సద్గురువుకు వుంది ఆ అవకాశం. ఎందుకనయ్యా అంటే, సచ్ఛిష్యుడు అవస్థాత్రయాన్ని అధిగమించే స్థితిలో వుంటాడు. మూడు అవస్థలని దాటిపోయినటువంటి స్థితిలో వస్తాడు సచ్ఛిష్యుడు. వచ్చినప్పుడు గురవు ఒక పరీక్షపెడుతాడు. వీడికి కల వుందో లేదో తెలుసుకోవాలి. కల ప్రభావం వుందో లేదో తెలియాలి అంటే, నీవు గాఢ నిద్రావస్థలో వుండగా, అశరీర పద్ధతిలో నిన్ను మేల్కొల్పుతాడు. అది ఒక పరీక్ష అన్నమాట. అశరీర పద్ధతిలో మేల్కొలిపితే, నీకు తెలియాలి అప్పుడు. తెలియాలి అంటే నీకు తెలివి వుండాలి. గాఢ నిద్రావస్థలో కూడా తెలివి వుండాలండి. తెలివి వుంటేనే గురువు మేల్కొలిపింది తెలుస్తుంది. లేకపోతే తెలియదు. అది ఆ పరీక్ష పెడతాడన్నమాట. నువ్వు ఆ స్థితికి వచ్చావో లేదో

తెలుసుకోవాలంటే ఈ పరీక్షపెడతారు. అంతకు తప్పితే, ఎవడికైతే అనంత సృష్టికి సంబంధించినటువంటి సృష్టి సంకల్ప బీజం అంటే ఓంకారం దాటినటువంటి స్థితి కలిగినటువంటి మహానుభావులు, సద్గురువులు ఎవరైతే వున్నారో, వారికి ఈ పరీక్షపెట్టే సామర్థ్యం వుంటుంది. వాళ్ళు సంకల్పంతో, ఎప్పుడూ సంకల్పం లేకుండా వున్నటువంటి వాళ్ళు, సంకల్పంలోకి దిగి వస్తారు. దిగివచ్చి ఆ శిష్యుడిని ఉద్ధరించే నిమిత్తమై, సంకల్పంలోకి దిగివచ్చి, ఆ గాఢనిద్రావస్థలో వున్న శిష్యుడిని అక్కడ మేల్కొల్పుతాడు. అశరీర పద్ధతిగా మేల్కొల్పుతాడు అది కూడా. ఏమీ శబ్దాలు వుండవు, ఏమీ వుండవు. నువ్వు తట్టి లేపినట్టుగా వుండడం ఏమీ వుండదు. ఒక్క సంకల్పమాత్రంతో, ఎక్కడో వుండి సంకల్పిస్తాడు. అతడికి వెంటనే తెలుస్తుంది. అతడు గాఢనిద్రావస్థలో వుండే సమాధానం చెప్తాడు గురువుకి. బాహ్యం నిదురపోతూనే వుంటుంది. కానీ అంతరంగం మాత్రం, ప్రజ్ఞమాత్రం గురువుతో లీనమౌతుంది. అలాగ తురీయావస్థను, తురీయానుభవాన్ని పొందుతాడు. ఇలా వీటన్నింటికీ నిర్ణయభేదాలతోటి, రకరకాల పరీక్షలు, రకరకాల ఫలితాలు, రకరకాల నిర్ణయాలు వుంటాయి. ఇదంతా ఆత్మజ్ఞాన విషయం జరుగుతూ వుంటుంది. (అంటే కొంతమంది అంటుంటారు దేవుడు కనపడుతుంది, దెయ్యము కనపడుతుంది) ఒక్కటే గుర్తుపెట్టుకోండి, ఇక్కడొక అంశముందండి. కనపడ్డాయి అన్నవాళ్ళకి కలే అది. కనపడలేదు అన్నవాడికీ కలే. కనపడలేదు అన్నా కలే. కనపడుతోంది అన్నా కలే. ఒకటే గుర్తుపెట్టుకోండి. (కనపడేవాళ్ళంతా భ్రాంతుల్లో వున్నారన్నమాట) అదేం లేదండి. నీదో ఏది ఎంత బలంగా వుంటే, అది అంత బలంగా అక్కడ కనపడుతాయి. మెలకువ అయినా భ్రాంతే. కల అయినా భ్రాంతే. నిద్ర అయినా కూడా భ్రాంతే. కాకపోతే కలలు ఎక్కువగా వచ్చేవాడికి చంచలత్వం ఎక్కువ వుంటుంది. కలలు తక్కువ వచ్చేవాడికి చంచలత్వం తక్కువ వుంటుంది. చంచలత్వం తక్కువ వుండే దాంట్లో మళ్ళా రెండు గుణాలు వుంటాయి. ఒకటి శుద్ధ తమోగుణంతో కూడినటువంటి తెలివి వుంటుంది. శుద్ధ సత్వగుణంతో కూడిన తెలివి వుంటుంది. శుద్ధ సత్వగుణంతో కూడిన తెలివి అయితే, కలలు ఏవీ రాకపోయినా కూడా తెలివి వుంటుందండి. అర్థమైందా అండీ! కలలు ఏవీ రావు వాడికి. కానీ తెలివి వుంటుంది. సహజజ్ఞానం వుంటుంది కలలో కూడా. వాడికి సాధ్యం. కానీ శుద్ధ తమోగుణంలో వున్నవాడికి కలలు

ఏమీ రావు. వచ్చినా వాడికి తెలియబడదు. కేవలం మొద్దు నిద్రగా వుంటుంది. ఇలాగ ప్రతీ దాంట్లో కూడాను, మెలకువలోను మూడు గుణాలు వుంటాయి. కలలోనూ మూడు గుణాలు వుంటాయి. నిద్రలోకూడా మూడుగుణాలు వుంటాయి. (మరి కలలు ఎక్కువ వచ్చేవాడికి?) రజోగుణం బలంగా వుంది. పనిచేస్తూ వుంటుంది. కలలో కూడా, నిద్రలో కూడా వాడు స్థిరంగా వుండడు. ఇటూ అటూ పరిగెడుతూ వుంటాడు. పరిగెడుతూ వుంటాడన్నమాట ఆ నిద్రలో కూడా. అది. అందుకని మనసు పరిపరి విధాలుగా అక్కడ ప్రయాణం చేస్తూ వుంటుంది. ఆయా గుణ ధర్మాలను బట్టి, విషయాలను బట్టి, ఏ విషయాలు బలంగా వుంటే, ఆ విషయాలు విమర్శిస్తూ వుంటుంది కలలో. తద్వారా అవి బయటకు రావడమో, లోపలికి పోవడమో, ఆయా వాసనాబలం మేరకు జరుగుతూ వుంటాయి. కలలో ఏం జరుగుతూ వుంటుందంటే, కేవలం వాసనాబలం నిరూపణ. అంతవరకే తప్ప వేరే అందులో ఏమీ లేదు. ఈ రకంగా మూడు అవస్థలు... (తెల్లవారు ఝామున కలవస్తే జరుగుతుంది, అదేమిటి మరి?) ఒక్కటి చెప్తా వినండి. తెల్ల .. వారు.. ఝాము.. అంతేనా అండీ! మొన్న చెప్పాను మీకు. సంధ్యాసమయము. సంధ్యాసమయములో ప్రతిజీవికీ కూడా హంస సుషుమ్నా నాడిలో పనిచేస్తూ వుంటుంది. ఆ తెలివి వున్నటువంటి వాడికి, ఆ సుషుమ్నా నాడిలో హంస పనిచేసేటప్పుడు ఆత్మ సాక్షాత్కారం కలిగే అవకాశం వుంది. ఆ జ్ఞానం వున్నటువంటి వాళ్ళు అందరూ బ్రహ్మముహూర్తంలో కూడా పనిచేస్తూ వుంటారు. కొంచెం తెలివి కలిగి, నిష్ఠ, ఉపాసనను కలిగి వుంటారు. ఎవరైతే పూర్తి మెలకువలో వున్నాడో, వాడికి కల వచ్చే అవకాశం లేదు. కల అంటే అర్థం ఏమిటి? సగం నిద్ర + సగం మెలకువ. అర్థ జాగృతి అంటారండీ దానినే. అంటే సగం తెలివి వుంటుంది, సగం నిద్రపోతూ వుంటుంది. కల అంటే లేనిది అని నిర్ణయం. అది తెల్లవారు ఝాము కానీ, మిట్టమధ్యాహ్నం కానీ, అర్థరాత్రిగానీ, పగలు గాని. కల అంటే లేనిది. అంతవరకే. అది తెల్లవారు ఝామైనా, మరొకటైనా ఏ భేదమూ లేదు. కల అంటే లేనిదే. అంతకు మించి వేరే ఏమీ లేదు. ఎందుకంటే ఇవన్నీ కూడా బండరాతి మీద పెట్టిన గుర్తుల వలే, మానవజీవితంలో మనం, శరీరానుసారంగా పెట్టుకున్నటువంటి గుర్తులన్నమాట. ఆయా శరీరాను సారంగా చేసిన నిర్ణయ ఫలితాల వల్ల, వాటి చుట్టూ తిరగుతూ వుంటావు ఎప్పుడూ కూడా. ఎప్పటికప్పుడు తిరగుతూ ఏం

చేస్తూ వుంటావు? అది అలా అయ్యింది, ఇది ఇలా అయ్యింది అని బేరీజు వేసుకోవడం తోటే జీవితం సరిపోతుంది. (మంచి కల వచ్చింది అని) మళ్ళా రేపటికోసం ఎదురు చూస్తూ వుంటావు. రేపు ఏ కల వస్తుందా? రేపు ఏం జరుగుతుందా? ఏమైంది ఇప్పుడు దానివల్ల? వర్త మానంలో జీవించవయ్యా బాబు, నిత్యవర్తమానుడవై జీవించవయ్యా! ఆత్మ జ్ఞానంతో జీవించవయ్యా! అంటే, ఏమైంది ఇప్పుడు? మెలకువలో వుండే మామూలు తెలివితేటలుకూడా పోయినాయి ఇప్పుడు. ఎంతసేపు గతించిన కాలాన్ని తలచుకోవడమే సరిపోతుంది. ఆ కల ఇప్పుడుందా? లేదు. గతించిన కల ప్రభావం, మెలకువ మీద చూపెడుతుందనే భ్రాంతి చేత, మెలకువలో వున్న వివేకాన్ని కూడా కోల్పోయావు.

(సుషుమ్నా నాడి అంటే...)

కుడిముక్కు, ఎడమ ముక్కు మధ్యలో సుషుమ్నా. అలాగే వెనుక వెన్నుపాములో కూడా మధ్యలో సుషుమ్న, అటు ఇటు ఇడా, పింగళ. అవేమో అంతర ఇడా పింగళ సుషుమ్నలు అంటారు. ముక్కులో వున్నవాటినేమో బాహ్య ఇడా పింగళ సుషుమ్నలు అంటారు. ఈ అంతర సుషుమ్నా, బాహ్యసుషుమ్నా రెండూ ఒక స్థానంలో కలిసిపోతాయి. ఆ స్థానం పేరే బ్రహ్మరంధ్ర స్థానము. అదే ఇంద్రయోని, అదే అన్నీ కూడా. అది ఎక్కడయ్యా అంటే, కొండనాలుక దగ్గర కలిసిపోతాయండి ఇవన్నీ కూడాను. రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు ముక్కులు ఇవన్నీ ఈ జ్ఞానేంద్రియాలకు సంబంధించినటువంటి నాడులు అన్నీ కూడా, కలిసేటటువంటి నాడీ గ్రంధి ఎక్కడుందయ్యా అంటే, కొండనాలుక దగ్గర వుంది. గోమాంసభక్షణం అనే యజ్ఞంలో చెప్పేది ఏదైతే వున్నదో, ఆ 'గో' అంటే అర్థం ఏమిటంటే జీవుడు, ఆ వ్రేళాడుతున్నటువంటి మాంసఖండం ఏమిటయ్యా అని అంటే కొండనాలుక. ఆ కొండనాలుక దగ్గర నుంచి, ఆ నాడీ గ్రంథ భేదనము జరిగినప్పుడు, జ్ఞానప్రభావం చేత, ఆ నాడిగ్రంథభేదనము జరిగినప్పుడు ఒక అమృత బిందువు శ్రవిస్తుంది. అది 24 గంటలకు ఒకసారి. ఒక బిందువు పడుతుంది. ఎవరికయ్యా ఇది అంతా అంటే, ఎవరైతే హఠయోగ సాంప్రదాయికులు వున్నారో, వాళ్ళకి. అందరికీ కాదు. ఇది కేవలం మీరు అడిగారు కాబట్టి మాట మాత్రంగా చెబుతున్నా. ఇది ఆచరణకు పనికిరాదు. ఎవరికైతే లంబికా

శివయోగ దీక్ష కలిగినటువంటి వాళ్ళు ఎవరైతే వుంటారో, ఆ లంబికా శివయోగ దీక్షితులు వాళ్ళ యొక్క విధాన నిర్ణయంలో అలా చేస్తుంటారన్నమాట. అంటే ఈ నాలుకను వెనక్కు తీసుకుంటారు వాళ్ళు. ఈ జిహ్వాగ్రాన్ని తీసుకెళ్ళి, తాళు మూలంలో అంటే కొండనాలుకకు తగిలించి వాళ్ళు ఉపాసన చేస్తారన్నమాట. ఆయా ఉపాసనా విధానం, తాంత్రిక విధానం కలిగివున్నటువంటి వాళ్ళకి మాత్రమే అది ఉపయోగపడుతుంది. కేవలం మీకు యోగ పరిచయం వుండాలన్న వుద్దేశ్యంతో ఇడా పింగళ సుషుమ్న విషయం చెబుతున్నారు. కానీ యోగాన్ని ఆచరించడం కంటే, కేవలము ప్రాణాన్ని గుర్తుపట్టి, శ్వాస ఎలా వెళుతోంది, ఎలా వస్తోంది, సమవేగంతో శ్వాసను నడుపుకోవడం చాలా అవసరం. జ్ఞానం కోసం. కాబట్టి ప్రతివారు వారి యొక్క శ్వాస ఎలా నడుస్తోందనేది మాత్రం గుర్తించాలి. తప్పనిసరిగా. (ఈ రెండు ముక్కులలోంచే గుర్తించాలా? మామూలుగా అయినా గుర్తించవచ్చా?) నువ్వు ఎలా అయినా గుర్తించు. కుడి నుంచి ఎడమకు వెళ్ళాలి, ఎడమ నుంచి కుడికి రావాలి. (అట్లాగే రావాలా?) అలా తిరిగి రావాలి. (మాములుగా వస్తే) మామూలుగా రాదు, కుడికే వెళ్తుంది, కుడికి తిరగివస్తుంది. ఎడమకు వెళ్తుంది, మళ్ళా ఎడమకు తిరిగి వస్తుంది. ప్రయత్న సాధ్యం చేసుకుని దీనిని తిప్పుకున్నట్లయితే, జ్ఞానానికి ఉపయోగపడుతుంది. అథవా తిప్పుకోవడానికి వీలుకాలేదు, కనీసం సమవేగంతో ప్రాణం జరుగుతూ వుందో లేదో చూసుకో! అంటే, ఒకసారి ఎక్కువ తీసుకోవడం, ఒకసారి తక్కువ తీసుకోవడం కాకుండా, పూరక రేచక కుంభకాలు మూడూ కూడా సమంగా వుండేటట్లు చూసుకుంటే, అది నీకు జ్ఞానానికి ఉపయోగపడుతుంది. కారణం ఏమిటంటే, మనసు వాయువు మీద ఆధారపడి వుంది. అర్థమైందా అండీ! ఆ మనసు వాయువు మీద ఆధారపడి వుండడం చేత.

అంతాకూడా ఆత్మ ఘోష, ఆ సారాంశం అంతా యోగవాశిష్టములో వుంది. అలాగే తరువాత జ్ఞానవాశిష్టము. అది కూడా వశిష్ట మహర్షి రామచంద్రునకు బోధించినట్టే వుంటుంది. అది బ్రహ్మానుభవం. ఎట్లాగ, మొదటిది యోగవాసిష్టము ఎట్లాగైతే ఆత్మానుభవము వరకూ మాట్లాడుతుందో, అట్లాగే జ్ఞానవాశిష్టము బ్రహ్మానుభవము, పరమాత్మవిషయము మాట్లాడుతుంది. అయితే దానిపైది బృహద్వాశిష్టము. ఈ బృహద్వాశిష్టాన్ని శివరామదీక్షితులు రచించారు. దానిని తెలుగు సేత భాగవత కృష్ణదేశిక ప్రభువులు చేశారు. ఇది పరమాత్మ విషయం పైన మాట్లాడుతున్నారు. బృహద్వాశిష్టము అనేది, పరమాత్మ విషయము పైన అంటే పరమాత్మ ఎట్లా ఏర్పడ్డాడు? విశ్వం ఎట్లా ఏర్పడింది? విశ్వం ఎట్లా లేకుండా పోతుంది? అనే పై ఆఖరి స్థితిలో విషయం మాట్లాడుతారు. అయితే అద్వైతము, అచలము, ద్వైతము అని మూడు విధానాలు వున్నాయన్నమాట. ద్వైతము అంటే ఏమిటి? యోగవాశిష్టములో జీవుడు – దేవుడు అనే పద్ధతిలో జీవుడు – ఈశ్వరుడు. శరీరము – నేను ఇట్లాగ రెండు రెండుగా వుండేవాటి అన్నిటిమీదా మాట్లాడుతూ దాన్ని ఏమంటున్నామంటే ద్వైతం. అదన్నమాట ద్వైతం. ఎవ్వరైన మనం ప్రారంభించేది, ద్వైతం దగ్గరనుంచీ ప్రారంభిస్తాము. అంటే ఏమిటి? మనమందరము వున్నాము. నేను వున్నాను, భగవంతుడు కూడా వున్నాడు. నేను భగవంతుడిని పూజచేయాలి. భగవంతుడు సృష్టి కర్త. వాడిని పూజిస్తే నాకు ఉపయోగం వుంటుంది. నాకు అతని దయవలనే నేను జీవిస్తున్నాను, నేను ఎప్పటికీ భగవంతుడిని కాను, భగవంతుడు ఎప్పటికీ దేవుడు కాడు. ద్వైతం అంటే అర్థం అదన్నమాట. అంటే భగవంతుడు ఎప్పుడూ భగవంతుడే. నేను ఎప్పటికీ జీవుడినే. నేను పుడుతూ వుంటాను, పోతూ వుంటాను. భగవంతుడిని ప్రార్థిస్తూ వుంటాను. కానీ నేను ఎప్పటికీ భగవంతుడిని కాలేను. భగవంతుడు ఎప్పటికీ జీవుడు కాదు. విడిపోయి వుంటాయన్నమాట. ఎప్పటికి కలవవు ఇవి. అది ద్వైత పద్ధతి. ఇది ఇక్కడి నుంచి ప్రారంభించి యోగవాశిష్టము అలా కాదు నాయనా! నీవే అద్వైత స్వరూపుడివి, నీవు ఆత్మ స్వరూపుడివి, ఆ దైవత్వం అంతా కూడా ఆత్మలోనే వున్నది, అదే నీలో కూడా ఆత్మస్వరూపముగా వున్నది. అని చెబుతుంది. అది అద్వైతంలోకి దారి తీస్తుందన్నమాట. ఈ అద్వైత బోధ ఆఖరి స్థితులకు వచ్చేటప్పటికి, ఆత్మానుభవం, బ్రహ్మానుభవం, సమిష్టిగా

బ్రహ్మానుభవం, వ్యష్టిగా ఆత్మానుభవం కలగటం, పరమాత్మ విషయం, పరబ్రహ్మ విషయం చెబుతూ, నిరూపించి వదిలేస్తుంది. ఇది అద్వైతానుభవం వరకూ మాట్లాడుతుంది. ఎవరైనా సాధారణంగా ఇక్కడి వరకూ మాట్లాడుతారు. అయితే అద్వైతానుభవం వచ్చిన వాళ్ళకి, ఇంతేనా అసలు, దీని అవతల ఇంకేమైనా వున్నదా? అంటే పరబ్రహ్మ, పరమాత్మ అనుభవం రావడం, అది లేకుండా పోవడం అనే అంశం గురించి మాట్లాడేది బృహద్వాశిష్టము అన్నమాట. కాబట్టి ఇలాగ మూడు వాశిష్ట సాంప్రదాయాలు వున్నాయి.

అంటే మనకు సాధారణంగా వశిష్టుడు, రాముడు అంటే మనకు ఏం కనబడుతారంటే, ఎవరో గడ్డం పెంచేసుకున్నాయన వశిష్ట మహర్షినూ, కోదండం పట్టుకున్నాయన రాముడని మన పద్ధతి. కానీ అవన్నీ కూడా అవేమీ కావు. అవన్నీ కూడా పౌరాణిక పద్ధతిలో అలా చిన్న పిల్లలకి అర్థం అవ్వడం కోసమని, వాటికి రూపాలు అలా పెట్టి ఏర్పాటు చేశారు. వశిష్టుడు అనే ఆయన ఒక మహర్షే. కానీ వాశిష్టం – అందులోనే వుందండి. శిష్టము అంటే నువ్వు ఏది ఆశ్రయిస్తే జ్ఞానాన్ని పొందుతావో అది శిష్టం. అర్థమైందా అండీ! నీవు ఏ ఆచారాన్ని పాటించాలయ్యా? అంటే శిష్టాచార్యము అని అంటున్నాము కదా! ఆ శిష్టాచార్య సాంప్రదాయం అంటే ఏమిటంటే, ఆ ఆచార సాంప్రదాయములు ఎక్కడినుంచి ప్రారంభం అయినాయి అంటే, దాని లక్ష్యం ఆత్మజ్ఞానమై వున్నదన్నమాట. ఏ ఆత్మజ్ఞానాన్ని ఆచరణలో పెడితే, అది నీ సాంప్రదాయం అవుతుందో అది శిష్టాచార్య సంప్రదాయం అయ్యిందన్నమాట. మనవాళ్ళు అందరూ ఇవాళ ప్రతీదానికి చెప్పుకునేది ఏమిటి? మాది శిష్టాచార్య సాంప్రదాయం అండీ, మాది వైదికమండీ అని అంటుంటాం కదా! అదంతా ఏమిటయ్యా? అని అంటే, ఆ ఆచార సాంప్రదాయాలలో ఆత్మజ్ఞానం ఆచరణలో వుండాలన్నమాట. అది దాని అర్థం. వాశిష్టము అంటే విశిష్టమైనటువంటిది. అందులో కూడా ఆత్మానుభవం నుంచి బ్రహ్మానుభవం చేరడానికి, ఎటువంటి ఆచరణ కావాలో, అటువంటి ఆచరణ, సాంప్రదాయం కలిగి వుండటం వాశిష్ట సాంప్రదాయం అన్నమాట. అలా ఏర్పడింది వశిష్టం అనేటటువంటి పేరు. అంతేగానీ అదేదో ఒక మనిషి పేరు కాదు, ఒక స్థితి. అలాగే రాముడు అన్నా కూడా ఒక స్థితే. మనిషి పేరు కాదు. అర్థమైందా అండీ!

రాముడు అనే మహారాజు పరిపాలించాడు భారత దేశంలో అది వేరే అంశము. కానీ ఈ రెండు స్థితులనీ ఆధారంగా చేసుకుని, ఈ వేదాంత విద్యని అందరికీ అందుబాటులోకి తెచ్చారన్నమాట. ఉపనిషత్తులలో, 108 ఉపనిషత్తులలో భాగంగా, అతి రహస్యంగా వున్నటువంటి దానిని, దాన్ని బయటకు తీసుకువచ్చారు. బయటకు తీసుకువచ్చి, అనేకమైనటువంటి సాంప్రదాయాలలో అంటే కర్మ, భక్తి, యోగ, జ్ఞాన సాంప్రదాయాలు నాలుగింటిలో కూడా అనేక రకాల మానవులు వున్నారు కాబట్టి కర్మ సాంప్రదాయంలో వున్నవాడికి కర్మ, అంటే వాడి శక్త్యాను సారము, వాడు ఏ మేరకు ఆచరించగలడు అనే దానిని బట్టి వీటిని ఏర్పాటు చేస్తూ వచ్చారు. వేదభాగములలో అన్నీ వున్నాయి. కర్మమార్గానికి సంబంధించిన మార్గమూ వుంది, భక్తికి సంబంధించినదీ వుంది, యోగానికి సంబంధించినదీ, జ్ఞానానికి సంబంధించినదీ వుంది. అట్లాగే బ్రహ్మచర్యము, గృహస్థము, వానప్రస్థము, సన్యాసము అనే నాలుగు ఆశ్రమ ధర్మాల వాళ్ళు, వాళ్ళు వాళ్ళు ఎలా ఆచరించాలనే పద్ధతిలో కూడా, ఆ పద్ధతిలో కూడా ఉపనిషత్తులు చెబుతూ వున్నాయి.

అయితే సాధారణంగా మనమందరం వైదికం అని అంటున్నది ఏదైతే వుందో, వేదము అంటే ఏమిటంటే వ+ఇదమ్ ఉన్నది ఏదో తెలిపేది అన్నమాట. అంటే లేనిది లేనట్టుగా నిరూపించి, ఉన్నది ఉన్నట్లుగా నిరూపించడమే కదా సత్యము అంటే.

సత్యము అంటే అర్థం ఏమిటి? లేనిది ఎలా లేదో నిరూపించాలి, ఉన్నది ఎలా వున్నదో నిరూపిస్తే అదే సత్యము. కాబట్టి 'వ ఇదమ్' ఉన్నది ఏదో నిజంగా తెలుపుతుందన్నమాట. సత్యాన్ని తెలిపేది అని అర్థము, వేదము అంటే అర్థము. కాబట్టి దానికి మనం రకరకాల భాగాలు, అనేక రకాల శాస్త్ర పద్ధతుల్లో మాట్లాడితే చాలా, దానికి పెద్ద విషయము. సరే అలాకాకుండా మనకు అవసరమైనంత వరకూ మాట్లాడుకుంటే వైదకము, అవైదికము అంటే అర్థము ఏమిటంటే, ఉన్నది మాత్రమే తెలిపేది, సత్యాన్ని సత్యంగా తెలిపేది ఏదైతే వున్నదో అది వైదికము. సత్యాన్ని మరుగుగా తెలుపుతూ, మరొక పద్ధతిలో తెలిపితే అది అవైదికమ్. అంటే సత్యాన్ని వున్నది వున్నట్టుగా చెప్పడన్నమాట. వేరే పద్ధతిలో చెప్తారు. ఏమని? నువ్వు దేవుడివేరా! నువ్వు పరమాత్మవేరా! అని చెప్పరు. నువ్వు శరీరమే నాయనా! ఈశరీరంలోనుంచే బయటపడు. ఈ

శరీరంలోనుంచి ముక్తి చెందు. ఈ శరీరంలోనుంచి ముక్తి చెందితే సరిపోతుంది నీకు. శరీరంలో వున్నంతకాలం జాగ్రత్తగా వుండు. శరీరంతో చేసే పనుల్నీ జాగ్రత్తగా చేయి. శరీరంతో చేసే పనులన్నీ కర్మకాండలో జాగ్రత్తగా చేయి. ఆ భగవంతుడిని వుద్దేశ్యించి చేయి. ఇట్లా కర్మకాండకు సంబంధించనటువంటి విధానం అంతా చెబితే అది అవైదికము. అర్థమైందా అండీ! జ్ఞాన పద్ధతిగా చెబితే అది వైదికము. అదే కర్మపద్ధతిగా చెబితే అది అవైదికము. కాబట్టి మనలో మనం చెప్పేవాటన్నింటిలో ఏం చెప్పారు? అపర కర్మ అనీ, పరకర్మ అనీ రెండు భాగాలుగా విభజించుకుని, మళ్ళా కర్మను రెండు భాగాలు చేసుకుని ఇలా ఎక్కడికక్కడ ప్రతీదానిని రెండు రెండు భాగాలుగా చేసి పడేశామన్నమాట. జ్ఞానాన్ని కూడా రెండు భాగాలు చేసేసేటప్పటికి ఏమైపోయింది? ఇలా రెండుగా విడిపోయేటప్పటికి మనలో మనకే లేనిపోని తగాదాలు అన్నీ వచ్చేసినాయన్నమాట. ఇలాగ ఇవన్నీ కూడా పరిష్కరించాడు శంకర భగవత్పాదులు. ఆయన అన్నీ పరిష్కరించి నాయనా! తగాదాలు పడాల్సిన అంశమేమీ లేదు, అందరూ ఎట్లాగైనా గానీ, చిట్టచివరికి అద్వైతాన్ని తెలుసుకోక తప్పదు. మీరు ఎన్ని మతాలలో వున్నాకూడా, ఆ మతమంతా మీ మతిని బట్టి ఆధారపడి వున్నది. దాంట్లో ఏమీ లేదు. నీకు ఏది ఇష్టమైతే అది మతమై కూర్చుంది. కాబట్టి నీకు ఇష్టమైనట్టు ఆచరించు, ఏ ప్రమాదము ఏమీ లేదు. ఆ ఆచరించే దాంట్లో ఆత్మానుసారము జీవించవయ్యా! వచ్చిన తగాదా ఏమీ లేదు. నువ్వు శాక్తేయమైనా, వైష్ణవమైనా, శంకరాద్వైతమైనా లేదూ నేను శైవమైనా, మరకొటైనా, గాణాపత్యమైనా ఏదైనా కానీ సగుణం కానీ రకరకాల మతాలు భారతదేశంలో వున్నాయి. మీరెవరైనా ఏదైనా ఆచరించండి. ఆత్మానుసార జీవితాన్ని జీవించండి. ఆత్మను దృష్టిలో పెట్టుకుని జీవిస్తే, మీరు చేసే పనులు గానీ, అవన్నీ గాని, మిమ్మల్ని ఏమీ అంటకుండా వుంటాయి. కర్మను అంటకుండా చేయగలిగేటటువంటి స్థితిలో మీరు వుంటారు. మొట్టమొదట మానవుడు సాధించివలసినటువంటి ప్రాథమిక లక్ష్యం ఇది. నువ్వు ఏదైనా చేయి, అది చేసినప్పుడు అది నిన్ను అంటకుండా వుందో, లేదో చూసుకో. అంటకుండా వుండటం అంటే ఏమిటి? అంటకుండా వుండటం అంటే ఏమిటంటే, మీకు ఇదే సర్వవేదాంత శిరోభూషణంలో ఇలా నాలుగు శివుని యొక్క స్థితులలండి, విరాట్ హిరణ్యగర్భ అవ్యాకృత పరమాత్మలని నాలుగూ శివస్వరూపాలే ఇవి.

అర్థమైందా అండీ! ఇలాగ దీంట్లో ఒక చిత్రం వేశారన్నమాట. ఈ చిత్రం కూడా మీకందరికీ కూడా ఉపయోగపడేదే. తెలుసుకోవలసినదన్నమాట ఇదంతా కూడా. విరాట్ హిరణ్యగర్భ అవ్యాకృత పరమాత్మలనే పద్ధతిలో ఈ ప్రపంచమంతా వున్నది. ఈ విశ్వం అంతా నడుపబడుతున్నది వాళ్ళ నలుగురి చేత. ఎవరైతే ఈ అనంత విశ్వాన్ని నడుపుతున్న వారి స్థితులు ఏవైతే వున్నాయో, అవి ఏమిటయ్యా అంటే, విరాట్ – ఈ అనంత విశ్వం స్థూలంగా కనబడుతున్నది కదా! అదంతా ఎవరయ్యా? విరాట్. దానికి సూక్ష్మం వుంటుంది కదా! దాని పేరు హిరణ్యగర్భం. దానికి కారణమైన స్థితి వుంటుంది కదా! దానికి ఆకారం లేదు కాబట్టి అది అవ్యాకృతం. ఇప్పుడన్నీ ఆకారంతో వున్నది కదా! విశ్వం అంతాకూడా. సూక్ష్మానికి కూడా ఆకారం వున్నదండి. దానిని ఆ సూక్ష్మము, స్థూలము లేకుండా వున్న స్థితి అవ్యాకృతము. ఆ అవ్యకృతము ఎక్కడినుంచి ఏర్పడిందయ్యా అంటే, పరమాత్మ స్థితినుంచి ఏర్పడిందయ్యా! ఈ నాలుగు స్థితులలోనే విశ్వం నడుపబడుతున్నది. ఈ సత్యం తెలుసుకోండి మీరు. ఇది తెలుసుకుని నీలో ఎలా పనిచేస్తున్నాయి ఇవి తెలుసుకో! ఈ అనంత విశ్వంలో భాగమే కదా నువ్వు. మరి నీలో కూడా ఇవి వున్నాయి కదా! ఎలా వున్నాయి నీలో అంటే, విశ్వ తైజస ప్రాజ్ఞ ప్రత్యగాత్మలు. ఆ నలుగురు ఈ నలుగురిగా వున్నారు. అక్కడ విరాట్ ఇక్కడ విశ్వుడిగా వున్నాడు. అంటే విశ్వాన్ని గుర్తిస్తున్నాడు. నీలో వున్న నేను విశ్వాన్ని గుర్తిస్తూవుంది కదా! మెలకువలో. కాబట్టి మెలకువకి సాక్షి ఎవరయ్యా అంటే విశ్వుడు. నువ్వు మెలకువలో నువ్వు ఆత్మస్వరూపుడు అంటే, వాడి పేరు ఏమిటి? విశ్వుడు. కలలో నేను సాక్షిని అన్నావే అనుకో, ఆ కలలో వున్న జగత్తుకి సాక్షి ఎవరు? ఆ స్వప్న జగత్తుకి సాక్షి ఎవరయ్యా అంటే తైజసుడు. తేజస్వరూపుడన్నమాట. అంటే నీలో ఆ తేజస్సు, కలలో లైట్ వెలిగితేనేనా? నీలోపల వెలుగు వుంటేనేనా? కల కనపడేది? లేకపోతే వెలుగు లేకపోతే కనపడుతుందా? గాఢనిద్రావస్థలోకి వెళ్ళేటప్పటికి ఏమైపోయింది? ఆ వెలుగును గుర్తించే తెలివి పోయింది. కాబట్టి. కలలో మాత్రం నీకు ఆ తెలివి పనిచేస్తుంది. ఏ రూపంలో? వెలుగు రూపంలో పనిచేస్తుంది. ఆ వెలుగే సాక్షి. అది తైజసుడు. అది లేకపోతే కలలేదు. కాబట్టి ఆ తైజసుడన్నమాట, నీ కలలో సాక్షి ఎవరయ్యా అంటే తైజసుడు. అలాగే కారణమైనటువంటి, కారణ జగత్తు అయినటువంటి

గాఢనిద్రావస్థలోకూడా ఒక నేను వున్నాడు. వాడు ఎవడయ్యా? ప్రాజ్ఞుడు. ప్రజ్ఞాస్వరూపుడు అన్నమాట. ఆ కలలో, గాఢనిద్రావస్థలో మేల్కొనివున్న సాక్షి ఎవడైతే వున్నాడో వాడే ప్రజ్ఞాస్వరూపుడు. ఆ ప్రజ్ఞే నీకు కలలో పనిచేస్తుంది. మెలకువలో కూడా పనిచేస్తుంది. కాబట్టి నీవు ఎవరివయ్యా? ప్రజ్ఞాస్వరూపుడవు. నీవు ప్రజ్ఞానం. అంతేగాని, శరీరం అనుకుంటున్నావు. కానీ నువ్వు శరీరం కాదు. నీ నేను ఎవరు? ఆ ప్రజ్ఞానం. ఏదైతే గాఢ నిద్రావస్థలో ప్రాజ్ఞుడిగా, ప్రజ్ఞానఘనంగా వున్నదో, అదే కలలో, మిగిలిన వాటిల్లో, మెలకువలో మిగిలిన వాటిల్లో ప్రతిబింబిస్తూ వున్నది. ఆ స్వప్రకాశ జ్ఞానమే కిందవాటిల్లో ప్రతిబింబిస్తూ వున్నది. ప్రతిఫలిస్తూ వున్నది. ప్రకాశిస్తూ వున్నది. ఈ సత్యం తెలుసుకో! మరి దీనికంటే అవతల ఒకటున్నది కదా! ఏమిటది? తురీయం. నాల్గవ స్థితి తురీయం. అయితే ఇది నాల్గవ స్థితా? నాలుగో స్థితి కాదు. ఈ మూడు అవస్థలలోనూ అంటే మెలకువ, కల, నిద్ర మూడు అవస్థలలోనూ ఒక సాక్షి ఎవడైతే వున్నాడో, ఈ సాక్షి మూడు అవస్థలలోనూ గనుక సాక్షిత్వం పొందితే అప్పుడు వాడికి ఏం లేకుండా పోయినాయి? మెలకువా, కల, నిద్ర లేకుండా పోయినాయి. అలా లేకుండా పోయినటువంటి స్థితి. ఎఱుక. దానినే ఎఱుక అన్నారండీ! ఆ ఎఱుక స్థితి పేరేమిటంటే తురీయం. దాని పేరు ఏమిటండీ? తురీయము. దాంట్లో వున్న సాక్షి ఎవరయ్యా? ప్రత్యగాత్మ. ప్రత్యక్ + ఆత్మ. నీ యందు వున్నది ఆత్మ, నా యందు వున్నది ఆత్మ. ఆవెడ యందు వున్నది ఆత్మ. అంతటా వున్నది ఆత్మ. ఇట్లా ప్రతిచోటా ప్రత్యక్ ఆత్మ. అది ప్రత్యగాత్మ. అర్థమైందా అండీ! అంతా ఆత్మ స్వరూపముగా చూడగలగడమే ప్రత్యగాత్మ. ఆత్మానుభవం కలుగుతుందన్నమాట అప్పుడు. కాబట్టి వ్యష్టిగా చూస్తే నేమో, విశ్వ తైజస ప్రాజ్ఞ ప్రత్యగాత్మలు. మీరు ఎప్పుడైనా సరే జగత్తుని చూశారు, ఓహో! ఈవెడ చాలా అందంగా వున్నదండీ అనుకున్నారు అనుకోండి, అప్పుడు ఏం చెయ్యాలి? ఓహో! నాలో ఎవరు పనిచేస్తున్నారు ఇప్పుడు? అయితే కన్ను పనిచేస్తోంది, కన్నుకు దృశ్యవిషయం పనిచేస్తున్నది. ఈ దృశ్యవిషయం ద్వారా నాకు ఆనందం కలుగుతున్నది. మెలకువలోనే కదా! కానీ ఈ ఆనందాన్ని గమనిస్తున్నవాడు ఎవడు? ఈ ఆనందాన్ని గమనిస్తున్నవాడు ఎవడు? నేను. ఈ నేను పేరు ఏమిటి? విశ్వుడు. సాక్షిగా వుంటేనేమో విశ్వుడివి అయ్యావు. లేకపోతే ఒక మెట్టు కిందకు దిగి, ఆనందంలోకి దిగేశావు అనుకో, విషయంలోకి వచ్చేశావు. ఇంకా ఒక

మెట్టు దిగావనుకో, ఆ దృశ్యమే సత్యం. అందంగా వుండడమే సత్యం. ఇంకా ఒక మెట్టు దిగావనుకో, ఈవెడతో పాటు నేను స్నేహం చేస్తే బాగుండు, ఆవెడను అలా చూస్తే బాగుండు, ఇలా చూస్తే... ఇంకా దిగిపోయావన్నమాట. ఇంకా కిందకి దిగావు, ఇలాగ ఇలా దిగిపోతూవుంటావన్నమాట. కాబట్టి ఎప్పుడైనా సరే, ఉదాహరణ చెబుతున్నాను మీకు. ఏదైనా ఒక దృశ్యజగత్తు, ఈ జగత్తు అంతా దృశ్యమే కదండీ! ఏదైనా సరే! ఒక దృశ్య జగత్తు వున్నదండీ! ఆ దృశ్యజగత్తులో దృశ్యాన్ని చూశావు. చూడగానే ఏమైంది? (ఆనందం) వెంటనే ఆనందం కలుగలేదు. ఇదంతా ఒక రెప్పపాటులో లోపల జరుగుతూ వుంటుంది. ఈ రెప్పపాటు కాలాన్ని నువ్వు చక్కగా విచారణ చెయ్యి. విభజించు. ఏం చెబుతున్నాడు? నేను ఎవరిని? నేను ఆత్మ స్వరూపుడిని. మెలకువలో ఎవరిని? విశ్వుడిని. అంతేకదా! ముందు మెలకువలో విశ్వుడు రావాలండీ! తరువాత తైజసుడి సంగతి, ప్రాజ్ఞుడి సంగతి. మెలకువలో సాక్షిత్వము రాకుండా వస్తుందా బయట? కలలో, నిద్రలో రాదన్నమాట. కాబట్టి మెలకువలో ఎదైన ఒక పనిలో నువ్వు దిగే ముందు, ఒక ఆలోచనలో దిగే ముందు, అది తప్పనిసరిగా ఎదో ఒక జ్ఞానేంద్రియానికి సంబంధించిన విషయమై వుంటుంది తప్పనిసరిగా. అంతే కదా! ఒకడు ఎవరో మంచిగా వాయిద్యం ఏదో వాయిస్తున్నారండీ! సంగీతం విన్నాము. ఓహో! అద్భుతంగా వాయిస్తున్నారు. అనుకున్నావు నీకు భావన కలిగింది. కలగంగానే ఏమయ్యింది? ఎవరి విషయం ఇది? (శ్రవణానందం) శ్రవణేంద్రియ విషయం. అంతేకదా! శ్రవణేంద్రియం శబ్దాన్ని గ్రహించింది. నేను ఎవరిని? దాని పక్కన ఏం జరిగింది? శ్రవణేంద్రియం వుంది. ఆ ఇంద్రియం శబ్దాన్ని విన్నది. ఆనందించింది. మూడు స్థితులు వున్నాయా లేవా? ఇప్పుడు. ఇంద్రియము వున్నది, దాని విషయము వున్నది, దానికి సంబంధించిన ఆనందము వున్నది. నేను ఎవరిని? నేను గమనించేవాడను. ఆనందాన్ని కూడా గమనించాను. నేను ఎవరిని? సాక్షిని. నేను ఆత్మస్వరూపుడను. ఇప్పుడు ఎవరిని నేను? సాక్షిగా వున్నంత సేపు విశ్వుడు. సాక్షిత్వం పోయింది, ఆహా! ఏం పాడిందండి అద్భుతంగా అన్నమాచార్య కీర్తన. ఈవెడలాగా ఎవరూ పాడలేదండి అన్నావు. ఏమైంది ఇప్పుడు? ఆనందంలోకి దిగావు కదా! ఇంకేం చేశావు? ఈ పాడే ఆవెడ ఎవరో ఈవెడను చూసొద్దాం వెళ్ళి. ఎక్కడకు వెళ్ళింది ఇప్పుడు? సొంతం విషయం దాకా వెళ్ళింది. అక్కడి దాకా వెళ్ళేటప్పటికి ఇప్పుడు

శబ్దం విషయం పోయింది, ఆవిడ పాట, ఆవెడ శబ్దం పోయింది. అది పోయి ఏమి వచ్చింది ఇప్పుడు? మనిషికి వచ్చేసింది వ్యవహారం. కన్నుకు వచ్చేసింది. దృగ్విషయానికి వచ్చేశావు. అర్థమైందా అండీ! ఇలాగ ఒకదాని తరువాత ఒకటి విషయసముదాయం పనిచేస్తూ వుంటాయి. అంటే ముందు ఏదో ఒకదానితో మొదలౌతూ వుంటుంది. మొదలైనప్పుడే దానిని నువ్వు చక్కగా పట్టుకున్నట్లయితే, దాంట్లోనుంచి రెండవది, మూడవది, నాల్గవది, ఐదవది రాకుండా వుంటాయి. కానీ ఏం జరుగుతోంది ఇప్పుడు? శబ్దం దగ్గర మొదలు పెడుతావు. తరువాత రూపం – వెళ్ళావు. తరువాత శబ్దం, రూపం అయిపోయిందిగా. శబ్ద స్పర్శ రూప రస గంధాదులు కదా! ఏం చేశావు? ఆ స్పర్శ, రూపం పనిచేశాయి. ఆ తరువాత గంధం. ఆ తరువాత రసం. దాన్ని అనుభవించాలి. ఆ విషయాన్ని అనుభవించాలి. దాన్ని ఆశ్రయించాలి. దాంట్లో మునిగిపోవాలి. సాంతం మునిగిపోయి దుఃఖం వచ్చినాక అప్పుడు కళ్ళు తెరిచి, ఎందుకు వచ్చింది ఈ దుఃఖం? అని విచారణ చేశావు. చేస్తే ఏం తేలింది? నాకు ఎందుకు వచ్చిన గోల ఇది. అనుకున్నావు. కానీ ఎప్పుడు? అంతా సాంతం పుట్టి మునిగిన తరువాత, ప్రయోజనం ఏముంది? దాని వలన నాకు ఏం ప్రయోజనం వచ్చింది? పశ్చాత్ తాపం వల్ల ప్రయోజనం లేదు. మళ్ళా మొదటికి వచ్చేశావు. కాబట్టి నీవేం చెయ్యాలయ్యా? నీవు మెలకువలో సాక్షివి అని తెలుసుకో! విశ్వుడు అని తెలుసుకో! స్వప్న సాక్షివి తైజసుడవి అని తెలుసుకో!

కల ఏదన్నా జరుగుతూ వుంది. ఇప్పుడు నేను ఎవరిని? ఈ కలని గమనించేవాడను. అంతేకదా! ఈ కల నేను కాదు కదా! కలయందు వున్నటువంటి కదులుతున్న రూపములుగానీ, ఆ మాట్లాడే మాటలు కానీ, ఆ శబ్దార్థములు గానీ, అక్కడ జరుగుతున్న సంఘటన కానీ, అవన్నీ నా కల్పితములు. నా మనసే కల్పించింది. నేను ఎవరిని? సాక్షిని కదా! ఆ స్వప్నంలో ఏం జరిగినా కానీ, అది నేను అవుతానా? అవ్వను కదా! నేను ఎవరిని? తైజసుడను కదా! తేజస్వరూపుడను కదా! ప్రకాశ స్వరూపుడను కదా! నేనే లేకపోతే ఆ కల వుందా? సాధ్యం కాదు కదా! శవానికి కల వుందా? లేదు కదా! అర్థమైందా అండీ! కాబట్టి నేను అనే చైతన్యం వుండబట్టే, ఆ కల పనిచేస్తూ వున్నది. అంతే కదా! తరువాత ఏమైంది? కారణ జగత్తు గాఢ నిద్రావస్థ. సాంతం మునిగిపోయావు. మునిగిపోకుండా వుంటే, నేను అనే తెలివి వుంటుంది. అది ఎలా వుంటుందయ్యా? నీకు

మత్తు ఇస్తారు కదా ఎప్పుడన్నా? మత్తు ఇచ్చిన అనుభవం వుంటే, ఆ మత్తు ఇచ్చినప్పుడు నేను పనిచేస్తూనే వుంటుందండి. తెలివి వుంటుంది. అడుగుతాడు నిన్ను, మాట్లాడుతూ వుంటాడు నీతోటి. నీకు అంతా మట్లాడుతూవుంటే నీవు తెలివిలో వున్నట్లు అన్నమాట. అది కోల్పోతే పెద్ద ప్రమాదం. కోమాలోకి అటే వెళ్ళిపోతావు. అందువల్ల ఆ మత్తు ఇచ్చినప్పుడు ఎట్లా అయితే వుంటుందో, నేను పనిచేస్తూనే వుంటుంది. అన్నీ తెలుస్తూనే వుంటాయి. కానీ బాధ తెలియదు. సుఖ దుఃఖాలు తెలియవు అక్కడ. ఇప్పుడు నీ గాఢ నిద్రావస్థలో కూడా ఎలా వున్నావు నువ్వు? ఆ నేను అలాగే వున్నది. ఇంద్రియాల యొక్క ప్రభావం లేదు. మనసు బుద్ధి ప్రభావం లేదు. కానీ, అన్నీ పనిచేస్తూనే వున్నాయి. కానీ నీకు తెలియడం లేదు. నువ్వు వేరుగా వున్నావు. అర్థమైందా అండీ!

నువ్వు ఎక్కడున్నావో తెలుస్తోంది, సగం తెలివి వుంది. ఆ సగం తెలివి పనిచేస్తూనే వుంది. ఆ నేను నేనుగానే వున్నది. నిద్రపోయేది నిద్రపోతూనే వున్నది. మళ్ళా ఏమైంది? మళ్ళా కాసేపైనాక మేల్కొన్నది. కలలోకి మేల్కొన్నది, తరువాత మెలకువలోకి వచ్చేసింది. ఇది రోజూ నిద్రలో జరిగే కార్యక్రమం. ఇలాగ విశ్వ తైజస ప్రాజ్ఞ పత్యగాత్మలనే నాలుగు సాక్షులు, అలాగే వీటియొక్క సమిష్టి సాక్షులు ఎవరు? విరాట్ హిరణ్యగర్భ అవ్యాకృత పరమాత్మలు. మనం పరమాత్మ పరమాత్మ పరమాత్మ అంటాము కానీ, ఆ పరమాత్మ స్థితిలో కూడా ఆ నాలుగు విభజనలు వున్నాయన్నమాట. అంటే ఏమిటి? విరాట్ హిరణ్యగర్భ అవ్యాకృత పరమాత్మలనే నాలుగు స్థితులయొక్క అనుభవము వస్తే గానీ, పరమాత్మ అనుభవము పూర్తి అవ్వదు. అట్లాగే విశ్వ తైజస ప్రాజ్ఞ ప్రత్యగాత్మ స్థితుల యొక్క అనుభవం వస్తే కానీ ఆత్మానుభవం పూర్తి అవ్వదు. కాబట్టి ఆత్మసాక్షాత్కార జ్ఞానం కలిగినా పరమాత్మ సాక్షాత్కారం కలిగినా ఈ నాలుగు స్థితుల యొక్క అనుభవం కోసమే జరుగుతుందన్నమాట. అయితే ఇవన్నీ జరగాలి, ఇవి జరిగితే ప్రయోజనం ఏంటయ్యా అంటే, మరణం నిన్ను ఏమీ చెయ్యజాలదు. జననమరణముల జడుపు తీరెను – ఇందాక అంతా ఏం చెబుతున్నాడు? అంతా జనన మరణం మీదే మాట్లాడుతున్నాడు. మరణం మీద నీకు ఎప్పుడైతే భయం లేకుండా పోయిందో, మరణాన్ని నువ్వు ధిక్కరించగలిగే సామర్థ్యం ఎప్పుడైతే నీకు వచ్చిందో, అప్పుడేమైందంట? నీ జననం గురించిన గోలే లేదు. పుడితే పుడుతుంది శరీరం, పోతే పోతుంది. అనే స్థితిలో సహజంగా వుంటాడు. ఇంక

ఎప్పుడైతే మరణాన్ని అధిగమించేసేస్తాడో, అప్పుడు ఏంటట? శరీరమును వదలెను. చివరి స్థితిలో ఎలా వుంటాడండి? శరీరమును వదిలేశాడు. వదిలేస్తే మళ్ళారాదు. విడిస్తే మళ్ళా వస్తుంది. ఇప్పుడు మనము అందరం ఏం చేస్తున్నాము? శరీరము విడుస్తున్నామా? వదల్తున్నామా? విడుస్తున్నాము. తెలిసి అయినా, తెలియక అయినా శరీరాన్ని విడుస్తున్నాము. అర్థమైందా అండీ! శరీరాన్ని విడిస్తే ఏమైంది? మళ్ళా శరీరము వస్తుంది. అలాగే ఏ సాధనైనా గానీ, ఏ విషయమైనా కూడా, విడిచే ప్రయత్నం చేయకూడదు. వదిలే ప్రయత్నం చేయాలి. అది నిన్ను వదిలేయాలి. అది నిన్ను వదిలేసే పద్ధతిగా నువ్వు జీవించాలి. అంటే అర్థం ఏమిటి? ఆ విషయం నిన్ను వెతుక్కుంటూ వచ్చినప్పుడే, నువ్వు దాని జోలికి వెళ్ళాలి. నువ్వు విషయాన్ని వెతుక్కుంటూ వెళ్ళకూడదు. మొదటి నియమం అది.

ఇప్పుడు మనమందరము ఏమి చేస్తున్నాము? విషయాన్ని వెతుక్కుంటూ వెళ్తున్నాము. అర్థమైందా అండీ! విషయాన్ని వెతుక్కుంటూ వెళ్ళినంత కాలం, తప్పనిసరిగా దాని చేత బాధించబడక తప్పదు. ఏం చెయ్యాలట? ముందు నువ్వు ఎట్లా జీవించాలి? ఏ శబ్ద స్పర్శ రూప రస గంధాలకు సంబంధించిన ఏ విషయమైనా, నిన్ను వెదుక్కుంటూ అది వచ్చేవరకూ వేచి వుండి నిగ్రహించగలగే సామర్థ్యం వుండాలయ్యా! ఈ నిగ్రహం పేరే ఇహాముత్రార్థఫలభోగ విరాగము. సాధన చతుష్టయ సంపత్తిలో రెండవది. అర్థమైందా అండీ! విషయమే నిన్ను వెతుక్కుంటూ వచ్చేటటువంటి నిగ్రహాన్ని కలిగి వుండటం ఏమిటయ్యా అని అంటే ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము. అంటే అర్థము ఏమిటి? ఇహం అంటే ఏమిటి? లోకానికి సంబంధించినది, శరీరానికి సంబంధించినది, జగత్తుకు సంబంధించినది, జీవుడికి సంబంధించినది, ఎన్నన్నా, ఎట్లా అన్నా చెప్పుకోండి. ఇదంతా ఇహం. అంటే మార్పు చెందేది అని అర్థం. ఇహం అంటే సూటైన అర్థం ఏమిటంటే, మార్పు చెందుతూ వుండేది. పరం అంటే ఏమిటంటే, మార్పు చెందనిది. శాశ్వతం. సనాతనం. ఆద్యంతములు లేనిది అని ఇహం-పరం అంటే అర్థం ఇది. (అందుకే అంటారు ఇహం లేదు పరంలేదు) ఎప్పుడు లేదు? బృహద్వాశిష్టము ఆ చివరిది, అక్కడిదాకా పరమాత్మ కూడా లేడు, విశ్వం కూడా లేదు అనే స్థితికి మాట్లాడితే పరం లేదు. అప్పుడే ఎక్కడ పరంలేదు. అసలు పరం తెలిస్తే కదా! ఇంకా పరమే

తెలియలేదు. ఇహంలోంచి బయటపడా లేదు. కాబట్టి మనవాళ్ళు, పూర్వ వ్యక్తులు ఏంటంటే అన్నీ చెప్పారు. అవి అనుచానంగా, మాటలుగా వచ్చాయి గానీ, విషయం తెలియదు. దాని వల్ల ప్రయోజనం ఏముంది? జ్ఞానం లేకపోవడం వల్ల. అవునండీ! ఎవరు అన్నారు? ఆకాలంలో ఎవడికైతే, చిట్టచివరి వరకూ పరిపూర్ణం వరకూ తెలిసినవాడు వున్నాడో, పరమాత్మకూడా లేడు అనే స్థితి తెలిసినవాడు అన్నమాట అది. (అబ్బా! అది చివరకు వాడుకై పోయిందే తప్పితే, అర్థం కాలేదన్నమాట) ప్రయోజనం ఏముంది? మనం రోజువారీ, మీరు రోజువారీ మాటలాడుకునే మాటల్లో చాలా అంశాలు వున్నాయి. కానీ అవేమీ మీకు తెలియవు కదా! విచారణ లేదు కదా! దాని యొక్క లోతైన విచారణ వుంటే కదా అసలు మీరు ఎందుకు అంటున్నారో, ఏమంటున్నారో (అనడమే కానీ, ఎందుకంటున్నారో విచారణే లేదు) ప్రయోజనం ఏముంది? ఒకటి గుర్తు పెట్టుకోండి. విద్యమీద ఆకాంక్ష వున్నవాడు, తహ వున్నవాడు దానిని నేర్చుకునే ప్రయత్నం చేస్తూనే వుంటాడు. కాబట్టి ఇహముత్రార్థ ఫలభోగ విరాగంలో, దానిని ఏమిటి చెయ్యాలయ్యా అంటే, మనకి ఏముందంట? ఇహం అంటే ఏమని చెప్పాను? మార్పు చెందేది, ఈ మార్పు చెందే దాంట్లో, ఫలభోగం వుంటుందంట మనకి. మనం దేనిని ఆశ్రయించాము ఇప్పుడు? ఫలితాన్ని అనుభవించాలి. అనేదానిని ఆశ్రయించాము. ఇదంతా ఏమిటి? ఇహం కదా! మార్పు చెందుతూ వున్నది. ఈ మార్పు చెందే దాంట్లో విషయం వున్నది. ఆ విషయంలోకి నువ్వు ఎందుకు వెళ్తున్నావయ్యా! అసలు నువ్వు ఇంతకీ? ఆ మార్పు చెందే విషయంలోకి ఎందుకు వెళ్తున్నావు? ఫలబోగాన్ని అనుభవించడం కోసం, ఆ ఫలితాన్ని భోగించాలి, అనుభవించాలి. అనేటటువంటి దాని చేత వెళ్తున్నావు. ఆ భోక్త ఎవడైతే వున్నాడో, వాడు అందులోకి చేరుతున్నాడు. చేరగానే ఏమయ్యాడు? దాన్ని అనుభవిస్తున్నాడు. అనుభవిస్తే ఏమైంది? సుఖమో దుఃఖమో వచ్చింది. దాంతో వీడు కూడా మార్పు చెందుతున్నాడు. అయితే ఇప్పుడు ఏం చెయ్యాలయ్యా దాన్ని? విరాగము చెయ్యి. విరాగము ఎందుకు చెయ్యాలయ్యా? అంటే దాంట్లో అనురాగము వుంది కాబట్టి. అనురాగము అంటే అర్థము ఏమిటి? మోహం అంటున్నాడు కదా! మోహం అంటే ఏమిటి? ప్రియ మోద ప్రమోదములనే 3 భావములనీ కలిపితే మోహం అవుతుందన్నమాట. ప్రియం మోదం ప్రమోదములు అంటే అర్థం

ఏమిటి? ఇప్పుడు మీకు ఎవరైనా కాకినాడ నుంచి పూతరేకులు తెచ్చాడండి. దానిగురించి విషయం ప్రస్తావించాడు. ఎప్పుడో నువ్వు పూతరేకులు తిని వుంటావు కదా! ఆ జ్ఞాపకం స్ఫురించింది. స్ఫురించిన తరువాత ఏమైంది? అప్పుడు తిన్న రుచి ఇందులో రికార్డ్ అయ్యి వుంటుంది కదా! మైండ్‌లో జ్ఞాపకం రికార్డ్ అయ్యి వుంటుంది కదా! ఆ పూతరేకులు తింటే బాగుండు, పూతరేకులు తింటే బాగుండు అని లోపల ప్రేరణ కలుగుతూ వుంటుందన్నమాట. అది పనిచేస్తూ వుంటుంది. ఆ జ్ఞాపకం వృత్తిగా పనిచేసింది. జ్ఞాపకం జ్ఞాపకంగా వున్నంత సేపూ దానికేమీ ప్రమాదం లేదు. అది ఏమైంది ఇప్పుడు? బయటకు వచ్చింది. వృత్తిరూపంలోకి వచ్చింది. ఆ వృత్తిరూపంలోకి వచ్చినప్పుడు దాని పేరు ఏమిటి? చిత్తం. ఆ వృత్తిరూపంలో లోపలే వున్నప్పుడు దానిపేరు ఏమిటి? చిత్తం. అది ఏం చేసిందట? వృత్తి రూపంలో మొదలయ్యి, ఆ దారం అల్లటం మొదలు పెట్టింది. నువ్వు పూత రేకులు తినాలి, నువ్వు పూతరేకులు తినాలి, నువ్వు పూతరేకులు తినాలి అక్కడున్నయ్యి పెట్టుకో అని, లోపల పనిచేస్తూ వుంటుంది. పనిచేసింది ఏం చేసింది? బుద్ధికి వచ్చేసిందన్నమాట. ఆ ప్రవృత్తి ఏమైందండీ? వృత్తి కాస్తా ఏమైంది ఇప్పుడు? బలపడి ప్రవృత్తి అయ్యింది. ప్రవృత్తి అయ్యి బుద్ధిలోకి వచ్చేసింది. బుద్ధిలోకి రాగానే బుద్ధి ఏం చేసింది? నా దగ్గర దానికి సంబంధించిన వివరాలు ఏమన్నా వున్నాయేమో అందిస్తా చూడు అంది. ఈ పూత రేకులు పలానా స్వగృహా ఫుడ్స్‌లో వుంటుంది లేకపోతే పలానా బందరు రోడ్డులో వుంటుంది. పలానా చోట వుంటుంది, ఫలానా... తినమని తినద్దు అని ఏం చెప్పదు బుద్ధి. ఇదిగో నీవు ఫలానా అడుగుతున్నావు కదా! దానికి సంబంధించిన వివరాలు నా దగ్గర ఇవి వున్నాయి. అని వివరాలను అందించేస్తుంది. అందించగానే ఇదిగో ఫలానా చోట వున్నాయట కదా! ఫలానా చోట వున్నాయట గదా! ఫలానా దగ్గరకు వెళ్ళమంటోంది కదా! నువ్వు వెళ్ళాలా? మరొకడిని పంపించాలా? నువ్వు వెళ్ళాలా? మరొకడిని పంపించాలా? ఇలా లోపల తిరుగుతూ వుంటుంది. దానికి చక్కగా అవకాశం బాహ్యంలో ఏర్పడుతుందన్నమాట. లేదంటే సృజించుకుంటావు. ఏం చేస్తావు వెంటనే, దానికి ఇంకా బలపడిందన్నమాట. ఇప్పుడు ఏమిటంటే, ప్రియంగా వున్నప్పుడేమో వృత్తి రూపం అండి, ప్రియంగా వున్నప్పుడు వృత్తి, చిత్తం రూపంలో ప్రియంగా వుంటుందన్నమాట. ప్రియం అక్కడ. ఏమైంది ఇప్పుడు? బుద్ధి

రూపంలోకి వచ్చింది. కిందకు వచ్చేసింది కదా! బుద్ధి ఏం చేసింది ఇప్పుడు? మనసును అడిగింది. నువ్వు వెళితే బాగుంటుందా? మనసు ఏం చేసిందిప్పుడూ? వాడిని పంపిద్దామా? వీడిని పంపిద్దామా? వీడిని పంపిద్దామా? వాడిని పంపిద్దామా? లేక మనమే వెళదామా? ఇది మనసన్నమాట. ఐదారు రకాలుగా ఆలోచించేది మనసన్నమాట. బుద్ధి ఏం చేసింది? బుద్ధి ఏమీ ఆలోచించదండీ! దానికి సంబంధించిన జ్ఞాపకాలలో వున్న వివరాలను అందిస్తుంది అంతే. దాని పని అంతే. మనసు ఏం చేసింది? దీనిని సాధించాలి. సాధించే మార్గం అన్నమాట. మనస్సు సాధనోపాయం ఎప్పుడూ కూడా. అందుకనే మనసుని ఆపేయాలి, నిలిపేయాలి, సున్నా చెయ్యాలి ఇదంతా తరువాత విషయం. ముందు ఏం చేయాలి? మనసే సాధనోపాయం ఎప్పుడూ కూడా. అన్నిటికీ సాధనోపాయం మనసే. దానిని నువ్వు గమనించి జాగ్రత్తగా వాడుకుంటే, దానంత వుత్తమమైన పనిముట్టు ఏదీ లేదు. కానీ ఆ మనసుని మనం పనిముట్టుగా వాడుకోవడం చేతకాక ఏమైపోయాము అంటే విషయానికి లోబడుతున్నాము. చక్కగ ఈ మనసు ఏంచేసిందట ఇప్పుడు? నాలుగు రకాలుగా ఆలోచించ గలిగే సామర్థ్యం వున్నదండీ దీనికి. ఈ నాలుగు రకాలుగా ఆలోచించే మనసే లేకపోతే, మనిషివి ఎలా అయ్యావు? కాబట్టి నువ్వు మనిషివి అయ్యావంటే, ఆ మనసనే సాధనోపాయం నీ దగ్గర వుండబట్టే. ఇదే బంధానికి మోక్షానికి కారణం కూడా. దీనిని ఎటు తిప్పితే బంధం అవుతుంది? ఎటు తిప్పితే మోక్షం అవుతుందో తెలుసుకో గలిగితే అదే సాధన. సాధన అంటే వేరే ఏమీ లేదు. ఈ మనసును ఎటు తిప్పితే, నీకు బంధం ఏర్పడుతున్నది? ఎటుతిప్పితే దాంట్లోనుంచి బయట పడిపోతున్నావు? ఇది తెలుసుకోవడమే సాధన. దానికోసమే ఈ సాధన చతుష్టయ సంపత్తిని పెట్టిందండి. ఇదంతా మనస్సు, బుద్ధి, చిత్తం దీనిమీదనే మాట్లాడుతూ వుంటుంది సాధన చతుష్టయ సంపత్తి అంతా కూడా. అందుకే నిన్నేంచెప్పారు? నిత్యానిత్య వస్తు వివేకము. ఎవరు విచారణ చెయ్యాలి? అంటే చిత్తము, బుద్ధి మధ్యలో విచారణ చెయ్యాలన్నమాట. ఆ నిత్యానిత్య వస్తు వివేకం ఎక్కడ చేయాలండి? వృత్తి కలగగానే ప్రియం, చిత్తంలో వృత్తి ప్రియం రూపంలో కలుగగానే, ఈ బుద్ధి మనకు వివరణ, విచారణ అందిస్తుంది కదా! ఆ వివరణ, విచారణ అందించేటప్పుడే, వేదాంత వాక్యాలతో కూడిన విచారణ

అందించాలన్నమాట. అసలు బుద్ధి. కానీ ఏమి అందిస్తోంది? విషయాలకు సంబంధించినటువంటి వివరాలను అందించడం చేత, మనసుకూడా సాధనోపాయం ఎందులో పనిచేస్తుంది? విషయాల రూపంలో పనిచేస్తుంది. కాబట్టి ఈ ఇహమూత్రార్థ ఫలభోగ విరాగము నీకు సరిగా వుండాలంటే, ముందు ఏముండాలట? నిత్యానిత్య వస్తు వివేకము వుండాలి. అంటే అర్థం ఏమిటి?

పూతరేకులు తినాలి అని అనిపించిందండి. అనిపించగానే అది ఎక్కడుందది? చిత్త రూపంలో, వృత్తి రూపంలో, ప్రియరూపంలో వుందన్నమాట. ఆ మోహం కలుగతుందన్నమాట అప్పుడే. ఆ కలుగగానే బుద్ధి ఏం చెయ్యాలి ఇప్పుడు? స్వగృహా ఫుడ్స్‌లో వుందా లేకపోతే బందరు రోడ్ లో వుందా వివరాలు అందించకూడదు. బుద్ధుందా నీకు? ఏమైనా వుందా నీకు? ఎంత సేపు తింటావు? మహా అయితే? పోనీ ఒక డజను తింటే ఏమన్నా పనికి వస్తుందా? జీవితం ఏమన్న వెళ్ళమారుతుందా? నీకు బుద్ధి వుందా? అని వేదాంత వాక్యాలు కనుక ఎప్పుడైతే ఇది బుద్ధి రూపంలో, వున్న వివరాలని, జ్ఞపకాలని, వేదాంత వాక్యాల రూపంలో దానికి చెప్పిందో, అప్పుడేమైందట? మనసు దాకా దిగలేదుగా అసలు ఇంకా? చిత్తం వృత్తిరూపంలో వున్న ప్రియం అణగి పోయింది. వృత్తి రూపం ఏమైపోయింది అండీ? ప్రియరూపంలో వున్నప్పుడు బలహీనంగా వుంటుంది. దానికేమీ బలం లేదప్పుడు. అప్పుడు అణగిపోతుంది. ఆ చిత్త వృత్తులు అణగిపోతాయన్నమాట. అణిగిపోతే ఏమైంది? ఇక మళ్ళా కిందకి రాదు ఇక. మనసుదాకా వచ్చి, వాడిని పంపుదామా? వీడిని పంపుదామా దాకా రాదు ఇక. అది అక్కడే అణగిపోతుంది. (మరి ఆ బుద్ధి ఎప్పుడు అలా వుంటుంది) ఆఁ.. అంటే ఎందుకంటే, బుద్ధిలో మనము ఏం చేశామంటే ఇప్పటి వరకూ విషయానికి అనుకూలంగా వుండే అనురాగంతో ప్రవర్తించే విధానాన్ని ఏర్పాటు చేశాము. అందువల్ల మన దగ్గర ఏమి లేదు? ఇహముత్రార్థ ఫలభోగ విరాగము లేదు. మన దగ్గర ఈ సాధన సంపత్తి లేదు. ఎంతసేపు ఇహ విషయంలో అనురాగంతో ప్రవర్తించడమే. ఆ విషయానికి అనుకూలంగా ప్రవర్తించడమే ఎప్పుడూ కూడా. అంతేగాని, దానిని విచారణ చేసి, వెనక్కి తిప్పుదాము అనేటటువంటి విధానము మనదగ్గర లేదన్నమాట. కాబట్టి ఈ సత్వగుణం, రజోగుణం, తమో గుణం వల్ల అలా విషయాలకు అనుగుణంగా పనిచేయడమే

అలవాటు చేసుకున్నాము. ఆ అభ్యాస బలం చేత, బుద్ధిలో మన దగ్గర ఇప్పుడు ఏమున్నాయి? అన్నీ కూడాను? దానికి అనుకూలంగా చెప్పడమే. అంతేగాని దానిని తిప్పటం, నిరసించగలిగే సామర్థ్యం లేదన్నమాట మన దగ్గర. కాబట్టి గురువు దగ్గరకు వెళ్ళినప్పుడు మీరు అతను చెప్పినటువంటి వేదాంత వాక్యాలలో ఏముంటాయండీ? నిరసించడం వుంటుందన్నమాట అంతా కూడా. విరమించడం. నిరసించడం. ఆ ప్రియమనేటటువంటి స్థితిలో నుంచి విరమించడం. ఆ వృత్తిని వెనక్కి తిప్పటం. ఈ పద్ధతిలో వాక్యాలు చెబుతూ వుంటాడు. ఈ వాక్యాలను నువ్వు బుద్ధిలో నిక్షిప్తం చేసుకోవాలి నాయనా! ధారణ చేయాలి నాయనా! అందుకే చెప్పేది. నువ్వు శ్రద్ధతో వింటే తప్ప సాధ్యం కాదు. ఎందుకని? ఒకసారి చెప్పినట్టు మరోసారి చెప్పరు. ఒకసారే చెబుతాడు. మళ్ళా ఆ వాక్యం మరోసారి చెబుతాడో లేదో, ఆయనకు తెలియదు, నీకు అంతకంటే తెలియదు. కాబట్టి వేరే వేరే అన్యథా పోకుండా, గురుస్థానంలో వున్న గురువు దగ్గరకు వచ్చినప్పుడు ఆయన చెప్పేటటువంటి విషయాలను యథాతథంగా ఆ వాక్యాన్ని ధారణ చేయి. చేస్తే ఏమౌతుందట? ఆ వాక్యం నీకు, నీకు ప్రియమైన వృత్తి చిత్తంలో ఆ ప్రియమైన వృత్తి కలిగినప్పుడు, వెంటనే ఈ వాక్యం నిద్ర లేస్తుంది. లేచి ఏం చేస్తున్నావు? అక్కడ ఏం చెప్పాడు ఆయన? అక్కడ శాస్త్రం ఏం చెబుతోంది? మొన్న ఏం విన్నావు? ఏం చేసి వచ్చావు? ఏం చెప్పాడు అనుభవజ్ఞానం వున్నటువంటి వాళ్ళు. దీనివల్లే నీకు దుఃఖం కలుగుతోందని చెప్పాడు కదా ! దీన్ని మార్చుకోమని చెప్పాడు కదా! ఈ ప్రియం అనే వృత్తే కదా ప్రమాదకరమైనటువంటిది. ఇదే కదా నిన్ను శరీరం అనుట్టుగా చేస్తున్నది. ఇదే కదా నిన్ను జీవుడు అనేట్టుగా చేస్తున్నది. ఇదే కదా మూడుగుణాల్లోకి నిన్ను దించుతోంది. అన్ని దుఃఖాలకు ఇదే కదా మూలకారణం. ఈ మోహమే కదా నీకు సమస్య. దీన్ని వదిలించుకోమనే కదా ఆయన చెబుతున్నాడు. ఇలాగ బుద్ధి వేదాంత వాక్యాలనన్నింటినీ చక్కగా అందిస్తుందన్నమాట. అందించగానే ఏమైంది ఇప్పుడు? చిత్తంలో వున్న వృత్తి అణిగిపోయింది. ప్రియం అనే వృత్తి అణిగిపోయింది. అప్పుడు మోహం కాస్తా లేకుండా పోయింది. మోహక్షయమే మోక్షం. మోహం క్షయించిపోతే మోక్షమే.

మిగిలివున్న స్థితి పేరు మోక్షం. అంతేగాని కొత్తగా ఏదో ఆకాశం నుంచి వచ్చి దిగిపడేది, ఊడిపడేది ఏమీ వుండదండి. ఈ ప్రియం అనే వృత్తి దగ్గరే దానిని నిలపగలిగి, నిగ్రహించగలిగి, ఈ వేదాంత పద్ధతిలో దానిని విచారణ చేసి, శాశ్వతం ఏది, అశాశ్వతం ఏది, నిత్యం ఏది, అనిత్యం ఏది? అనే పద్ధతిలో విచారణ చేసి, ఇది అనిత్యం కదా, ఆ విషయంలో వున్నటువంటి వస్తువు అనిత్యం కదా, ఆ విషయం యెడల వున్న అనురాగం అనిత్యం కదా, నీవు శాశ్వతం కదా, నేను అనేది అక్కడ ఎలా పనిచేస్తోంది, సాక్షిగా వుండాలి కదా, నువ్వు ఆత్మస్వరూపుడివి కదా! ఎందుకు అందులో చేరుతున్నావు? ఆ పదార్థంలోకి ఎందుకు చేరుతున్నావు? ఆ పదార్థంలో వున్నటువంటి శబ్ద స్పర్శ రూప రస గంధాలు అనేటువంటి ఐదు విషయాల్లోకి ఎందుకు చేరుతున్నావు? ఈ ఐదు విషయాలు మార్పు చెందేవి కదా! అశాశ్వతం కదా! అని ఎప్పుడైతే విచారణ చేశావో, ఏమైంది అప్పుడు? ఆ ప్రియం అనే వృత్తి, అణిగిపోయింది. అది ఇలా విచారణ చేయకపోవడం మూలాన ఏమైందయ్యా? ఆ ప్రియం కాస్తా మోదం అయ్యింది. అంటే అర్థం ఏమిటి? ఒక మెట్టు దిగిందన్నమాట. బుద్ధిలోకి వచ్చి, దానికి అనుకూలమైనటువంటి జ్ఞాపకాలన్నింటినీ సమీకరించింది. సమీకరించి ఇహ నిర్ణయం చేసేసింది. మోదం దగ్గరకి వచ్చేటప్పటికి నిర్ణయం చేసేసింది. నువ్వు అనుభవించాల్సిందే ఏమైనా సరే! ఇక నిన్ను ఆపడానికి వీలుకాదు. అనుభవించాల్సిందే, నువ్వు అనుభవించాల్సిందే, నువ్వు అనుభవించాల్సిందే. దాన్ని పొందవలసిందే, దాన్ని అనుభవించవలసిందే... ఇక భోక్త వచ్చేశాడన్నమాట ఇప్పుడు. అర్థమైందా అండీ ! ఏం చెబుతున్నాడు దాంట్లో భోక్త వచ్చేశాడన్నమాట. ఇప్పుడు అదే కదా! ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము. ఫలభోగము అనుభవించేది ఎవరు? ఈ భోక్త అన్నమాట. ఈ నిర్ణయం చేసేశాడు. ఏమైనా సరే మామిడికాయి పప్పు తినాల్సిందే. ఏమైనా సరే మామిడికాయి పప్పు తినాల్సిందే. ఏం చేశాడు? మనింట్లో లేదు, ఎవరికో ఒకడికి చెప్పాడు. Urgent గా నేను ఆగ్రాకి వెళ్తున్నాను, నాకు మామిడికాయి పప్పు తినాలనిపించింది, వెంటనే ఏం చేశావు? నాకు అక్కడ ఆగ్రాలో మామిడికాయ పప్పు దొరకదు, నాకు మామిడికాయ పప్పు పెడతావా పెట్టవా? అన్నావు. ఇప్పుడు ఇంట్లో మామిడికాయ వుందో లేదో చూసుకోవాలి కదా! ఈవెడేమి చేసింది, పాపం భర్త గారు

అడిగిన వెంటనే ఫోను కొడుతుంది. ఫోను కొట్టంగానే ఆవెడేమి చేసింది పోనీ, ఇప్పుడు ఇంట్లో వుందో లేదో ఆవెడైన చెప్పవచ్చు కదా! ఆవెడ అడక్క అడక్క నన్ను అడిగింది. నేను తేకపోతే ఎలాగా అని బండివేసుకుని ఎక్కడుందో అక్కడకు వెళ్ళి ఆ మామిడికాయ తెచ్చి ఆవిడకు ఇచ్చింది. ఆవెడ మామిడికాయ పప్పు వండేసింది, తినేశాడు, ఆనందపడ్డాడు, వెళ్ళిపోయాడు. ఇంతేకదా! ఇది విషయము అన్నమాట. అంటే ఎందుకు చెబుతున్నాను అంటే, మనం సాధారణంగా మన దగ్గర జరిగేవి చెబితే (స్పష్టంగా అర్థమౌతుందని). ఏమైంది ఇప్పుడు? ఎక్కడ విచారణ చెయ్యాలి? బుర్ర, బుద్ధి వుందా? జీవితంలో ఎన్నిసార్లు మామిడికాయ పప్పు తిన్నాను? ఏమన్నా ప్రమాదం వచ్చిందా ఇప్పుడు? ఆ మామిడికాయ పప్పు లేకపోతే జీవితం వెళ్లమారలేదా? జీవితం ఏమన్నా వెళ్ళమారదా. ఏం తింటే వెళ్ళమారదు? అనేటటు వంటి స్థితిలో కనుక నువ్వు వుంటే, విరాగమన్నమాట. విరాగమంటే ఇది. చిత్తంలో వున్న వృత్తిని వెనక్కి తిప్పగలగటం. ఆ ప్రియం అనేటటువంటి వృత్తిని వెనక్కి తిప్పగలగటం. ఆ ప్రవృత్తిని నివృత్తి చేయడం అన్నమాట. ప్రవృత్తి అంటే ఏమిటి? ఈ విషయం వెంబడి పోవడం ప్రవృత్తి. వెనక్కు తిప్పితే నివృత్తి. (మోదం అన్నావు ప్రమోదం అంటే?) చెప్తా, చెప్తా.. కంగారు పడవద్దు. విషయం అంటే ఏమిటి ఇప్పుడు? ఇలా వస్తుందన్నమాట విషయం. ఈ విషయానికి సంబంధించి బుద్ధిలో వెతికితే, అనుభవం వచ్చింది ఇలాగ. ఈ అనుభవం వచ్చేప్పటికి ఏమైంది? అనుభవానికి రావాలి కదా ఇది. ముందు నిర్ణయం చేసేశావు కాదా, ఏమైనా సరే అనుభవించాలి అని నిర్ణయం చేసేశావు కదా! ఇప్పుడు ప్రమోదం అది. అంటే ఏంటంటే నిలపడానికి వీలుకాదు. ఎంతగా దిగేశావు అంటే, ఇంద్రియాలలోకి దిగేశావు ఇక. సొంతం. మనసుకూడా అయిపోయింది. సొంతం రసనేంద్రియంలోకి వచ్చేశావన్నమాట. వచ్చేసేటప్పటికి ఏమైంది? తినక ముందే నీవు పూర్వం తిన్న అనుభవం లోనుంచి, ఆ జ్ఞాపకంలోనుంచి, తిన్న అనుభవ జ్ఞాపకం లోనుంచి. మళ్ళా తినాలి, మళ్ళా తినాలి, మళ్ళా తినాలి అని బలీయమైపోయిందన్నమాట అది. ఎంతగా బలీయమైపోయింది అంటే, ఆ మళ్ళా తినాలి అనేది ఎప్పటికీ అలానే వుంటుంది ఇక అది. అర్థమైందా అండీ! (అందుకే ఇంత బలంగా వుంటుంది). అవి ప్రమోదస్థాయిలో వున్నవి అన్నమాట. మనం ఇప్పుడు అంతాకూడా ఎక్కడున్నాము అంటే, ప్రమోద స్థాయిలో వున్నాము. ప్రమోదస్థాయిలో

వుండేటప్పటికి ఏమైంది? ఇక తిప్పటానికి వీలుకాదండి. అనుభవించడమే. ఇక భోక్త అయిపోయాడు already. ఎందుకని? పైన అనుభవించు అని, అనుభవించాలని నిర్ణయించేశాడు కదా! ఆ అనుభవించాల్సింది నిర్ణయం చేసేటప్పటికి ఏమైపోయాడు? నేను అనే 'కర్త', భోక్త అయిపోయాడు. ప్రియం మోదం ప్రమోదంలో ప్రియంగా వున్నప్పుడేమో నేను కర్తగా వున్నాడు. అనుభవించాలి మోద స్థాయికి వచ్చేటప్పటికి భోక్త అయ్యాడు. ఈ భోక్త ప్రమోద స్థాయికి వచ్చేటప్పటికి సాంతం విషయంలోకి కూరుకుపోయాడు. ఇది మోహం అన్నమాట. ఇది మోహం అంటే. ఇదే జీవుడుకి వున్నటువంటి ప్రధానమైనటువంటి సమస్య. ఇదే, అన్నింటిలో ఇదేనండి. ఈ సూత్రాన్ని మీరు అన్నింటిలో వుపయోగించాలి. చక్కగా. వుపయోగించి చూడాలన్నమాట. ఇప్పుడు ఏమిటిది? ఇది ప్రియం స్థాయిలో వుందా? మోదం స్థాయిలో వుందా? ప్రమోదం స్థాయిలో వుందా? ప్రమోదం దాకా వచ్చేసింది. ఇహదానిని భూప్రపంచంలో ఎవ్వరూ, సాక్షాత్ ఈశ్వరుడు వచ్చి, నీ ఎదురుగుండా నిలబడి నిన్ను ఆపడానికి ప్రయత్నించినా వీలుకాదు ఇక. (తిప్పలేరుదానిని) దాన్ని తిప్పలేవు అంతే ఇక. (ఆ time కేనా, ఆ తరువాత ఎప్పటికైనానా?) ఎప్పటికైనా సరే! నువ్వు ప్రమోదస్థాయిలో వుంటే, నిన్ను ఎప్పటికీ, ఎవ్వరూ తిప్పలేరు. దాన్ని ఏం చెయ్యాలట? అందుకనే ఏం చెబుతున్నారు? అందుకే క్రమవిచారణ చేయిస్తారు. ఎట్లా అంటే, నిన్ను అసలు, నువ్వు భోక్తగా అవ్వకుండా వుండే పద్ధతిలో నిన్ను ఇక్కడ మాట్లాడుతూ వుంటాము. ఇప్పుడు ఇక్కడ మాట్లాడే విధానము అంతా ఎక్కడ మాట్లాడుతున్నాము? తురీయానికి సాక్షివి. నీ చిత్తానికి సాక్షివి. నేను ఎవరు? ఆత్మస్వరూపుడను. కాబట్టి ఇప్పుడు ఏం చెయ్యాలట? ప్రియాన్ని వెనక్కు తిప్పాలన్నా, మోదాన్ని వెనక్కుతిప్పాలన్నా, ప్రమోదంలో నుంచి నిన్ను వెనక్కు తేవాలన్నా, నువ్వు మొట్టమొదట ఏం చేయాలట దానిని అనుభవించేటప్పుడు నేను ఆత్మస్వరూపుడను అనే పద్ధతిలో అనుభవించు, నేను సాక్షిని అనే పద్ధతిలో అనుభవించు. అప్పుడు ఏమైందట? అనుభవించేటప్పుడైనా కొంచెం ఎడం ఏర్పడింది. సాంతం మునిగిపోకుండా కొంచెం ఎడం ఏర్పడిందన్నమాట. కొంచెం ఎడం ఏర్పడితే అసలు ఇది ఏమిటని చూసే అవకాశం వచ్చింది. అర్థమైందా అండి? పెద్ద జాడీలో ఆవకాయ కలుపుతున్నామండి. ఆవకాయ నువ్వు అవుతావా? అవ్వవు కదా! చుట్టూ

నలుగురు చూస్తూ వున్నారండీ! వాళ్ళకు వింతే. అర్థమైందా అండీ! వాళ్ళేదో మధ్యలో రకరకాల ప్రశ్నలు వేస్తూవుంటారు. అది అట్టాగ, ఇది ఇట్టాగ, అది అలా ఎందుకు చేశావు, ఇది ఇలా ఎందుకు చేశావు. వాడికేమో విషయం తెలుసుకోవడం, నీకేమిటి? విషయాన్ని అనుభవించటం. కదా! ఇప్పుడు మీరు చూడండి ఒక్కసారి. ఎప్పుడైనా నేను గమనిస్తూ వుంటా, ఆ కలిపే వాళ్ళని. మహదానందపడిపోతూ కలుపుతూ వుంటారు. ఇప్పుడు అందులో కలిసిపోయేది ఎవరు? అది ఆవకాయ పిండి, పదార్థం, ముక్కలు అనే పద్ధతిలో సాక్షిగా వుండి చేస్తున్నాడా? చేయడం లేదు. ఆ కలిసిపోయేటప్పుడు తానే కలిసిపోతున్నాడన్నమాట అందులో. మహదానందపడిపోతున్నాడు. అలా ఏమైపోయావు ఇప్పుడు? ఆవకాయను తయారు చేయడంలో, కర్త ఏమైపోయాడు ఇప్పుడు? సాక్షిగా వుండాలి. కానీ ఏమైపోయాడు? ఆవకాయలో లీనమైపోయాడు. కలిసిపోయాడు. ఆయన ఏమైపోయాడు ఇప్పుడు? భోక్త అయిపోయాడు. ఇప్పుడు ఏమైందట? ఆవకాయ తినకముందే, తయారు చేసేటప్పుడే భోక్త అనుభవించేశాడు. పూర్వం ఆవకాయ తిన్నటువంటి జ్ఞాపకం వుంది కదా! ఈ జ్ఞాపకం సూక్షరూపంలో ఆ తిన్న అనుభవమంతా నెమరవేసేస్తుంది. కలిపేటప్పటికి ఏమైపోయాడు? తిన్న స్థితికి మారిపోయాడు. భోక్త అనుభవించిన స్థితికి మారిపోయాడన్నమాట. ఎప్పుడైతే ఇట్లా అనుభవించిన స్థితికి మారిపోయాడో, ఫలితం దాటిపోయిన తరువాత, ఆ ఫలితానుభవం వచ్చేసిందన్నమాట. నిజంగా జరిగిందా తినటం? జరగలేదు. కానీ సూక్ష్మంలో ఏం జరిగింది? ప్రాణ మనో బుద్ధులలో? తిన్న అనుభవం వచ్చేసింది already. ఊహ ముందుకు వెళ్ళిపోయింది. ప్రియం మోదం ప్రమోద స్థాయిని ముందే అనుభవించేస్తుంది. వాస్తవంలో జరుగక పోయినప్పుడు కూడా ఇలాగ దీనిని వాసనాబలం అంటారు.

"ఇప్పుడు ప్రస్తుత వర్తమానంలో జరిగి అనుభవం వస్తేనేమో సంస్కారం. జరుగకుండానే అనుభవం వస్తే వాసనా బలం." రెండూ అనుభవించాల్సిందే కదా! రెండూ కూడా ప్రియం మోదం ప్రమోదములే కదా! అనుభవించాల్సిందే కాదు, అవి తిప్పవలిసినవి. అనుభవించకుండానే, (అనుభవం కాదు కర్మఫలం) కర్మఫలం ఎప్పుడైంది? కర్త అనేవాడు భోక్త అయితే కర్మఫలం అయ్యింది. (భోక్తలోకి వచ్చి

తినకపోయినా కూడా భోక్త లోకి వచ్చి) అంటే ఏం చేయాలట ఇప్పుడు? భోక్త కాకుండానే చెయ్యి. కర్మఫలం నీ మీద పనిచేయకుండా వుండాలయ్యా అంటే, నువ్వు ఏం చెయ్యాలట? ఆ వాసనాబలం నీ మీద పనిచేయకుండా, ఈ సంస్కార బలం నీ మీద పనిచేయకుండా వుండాలి. పనిచేయడం వల్ల ఏమయ్యావు? కర్త అనేవాడు భోక్త అయ్యాడు. అలా అవ్వకుండా వుండేటట్లు చూసుకోమనే కదా! ఈ ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము చెప్పేది. అంటే అర్థం ఏమిటట? విషయంలో ప్రవర్తించేటప్పుడు, నీవు ఎప్పుడూ ఎక్కడ వుండాలట? సాక్షిత్వంలో వుండు. నేను ఆత్మస్వరూపుడిని అనే స్థితిని మర్చిపోమాకు. బాహ్యాన్ని మర్చిపోమాకు. మర్చిపోకుండా ఆ స్థితిలో వుండి చేయి. ఏమైందట అప్పుడు? కర్త కర్తగానే వున్నాడు. భోక్తగా అవ్వలేదు. ఎప్పుడైతే భోక్త అవ్వలేదో, ఏమైందట ఇప్పుడు? సంస్కార బలం పనిచేసే అవకాశం లేదు. అర్థమైందా అండీ! కానీ వాసనాబలం పనిచేసే అవకాశం వుంది. ఎందుకని? కర్తగా వున్నావుగా. కర్తగా వుంటే వాసనాబలం పనిచేస్తుంది. భోక్తగా వుంటే సంస్కార బలం పనిచేస్తుంది. అంటే ఏమటి? సొంతం ఇంద్రియాల దాకా తెలివి వచ్చి పనిచేసి అనుభవాన్ని సుఖదుఃఖాలను పొందినప్పుడేమో భోక్త అయివున్నాడు. సూక్ష్మంలో మాత్రమే పనిచేస్తూ వున్నప్పుడు కర్తగా వున్నాడు. కాబట్టి ఏం చెయ్యాలట? అసలైనటువంటి స్థితి ఏమిటయ్యా అంటే, నీవు కర్త కాదయ్యా! నీవు కర్త ఎలా అయ్యావు? అనంత సృష్టికి, విశ్వానికి ఎవరయ్యా కర్తలు? విరాట్ హిరణ్యగర్భ అవ్యాకృత పరమాత్మలు అయ్యి వుండగా, మధ్యలో నేను అంటావేమిటి? ఏమన్నా బుర్ర, బుద్ధి వుందా? నీ భూమండలం మీద ఎంతమంది ఆవకాయ పెట్టడం లేదు? ఏమిటట నీ ప్రత్యేకత? హోటలు వాడు ఒకేసారి వెయ్యికాయలకి, నాలుగు సార్లు పెడుతాడు, సంవత్సరం మొత్తంమీద. ఏమిటి నీ ప్రత్యేకత? సంవత్సరంలో నాలుగు సార్లు పెడతాడండి హోటల్ వాడు. వెయ్యికాయలు పెడతాడు ఒక్కొక్కసారి. ఒక పది మంది కలిసి పెడతారు. ఏంటట అయితే? (వాడికేమీ వుండదు, వాడికది పనికదా!) ఎందుకనిట? నాది కాదు ఇది. నాది కాదు. ఈ ఆవకాయ నాది కాదు. నేను తయారు చేయడం లేదు. ఎవరికోసమో తయారు చేస్తున్నాను. ఎవరో తింటాడు. నాకెందుకు? నిమిత్తమాత్రమే నేను. అనే స్థితిలో వుండి చేస్తున్నాడు. అర్థమైందా అండీ! నీవు ఎందుకు చేయడం లేదు అలాగ. అంటే ఏమయ్యావు? అంటే

పనిని ప్రారంభించేటప్పుడే, నాకోసం చేస్తున్నాను. అనే స్థితితో మొదలు పెడుతున్నావు. అందువల్ల ఏమయ్యాడు? నాకోసమనే ప్రేరణ మనసులో ఆ ప్రియం పనిచేయగానే, కర్త అయిపోయి కూర్చున్నాడు. (నాకోసం కాక పోయినా నా పిల్లలు నాకోసం) మీరు ఒకటి గుర్తు పెట్టుకోండి. అదంతా నా కోసంలో భాగమే. నువ్వు వుంటేనే కదా! ఆ సంసారం గోల అంతా కూడా.

నీ నేను అనే కర్త వీళ్ళందరినీ భుజాన వేసుకున్నాడు. వేసుకోగానే ఏమయ్యాడు? కర్తైకూర్చున్నాడు ఇక వాడికి స్థిరంగా వచ్చేసింది కర్త. అంతకు ముందు కర్త బలహీనంగా వున్నాడు. అర్థమైందా అండీ ! నేను నేనుగానే వున్నప్పుడు కూడా కర్త వున్నాడు. కానీ బలహీనంగా వున్నాడు. వాసనాబలం అతని మీద పనిచేయటం లేదు. ఎప్పుడైతే తనతో సహా మిగిలినటువంటి సంబంధాలు వున్నటువంటి అందరినీ కలుపుకున్నాడో, ఏమయ్యాడు? స్థిరపడిపోయాడు కర్తగా ఇక. ఇప్పుడు ఏం చేయాలట చచ్చినట్టు వాళ్ళకోసం పనిచేయక తప్పదు. వాడు భోక్త అవ్వక తప్పదు. కాబట్టి నువ్వు ఈ విచారణ క్రమం చక్కగా చెయ్యి. చేస్తే ఏమౌతుందయ్యా? ఇహమిది. మారిపోయేది ఇది. పరిణామం చెందేది ఇది. మార్పు చెందేది. శాశ్వతమైనటువంటిది కాదు. ఆద్యంతములు లేనటువంటిది కాదు. సనాతనమైనది కాదు. దీని వల్ల ఎట్టి జ్ఞానము లభించే అవకాశము లేదు. మార్పు చెందే జ్ఞానమే కానీ, మార్పు చెందని స్థితి యొక్క జ్ఞానం ఇందులో లేదు. ఇది విషయానికి సంబంధించినదే. రసనేంద్రియం అనే విషయానికి సంబంధించినది. చూడండి. ఆ కలపటం తోనే మీరు ఏమంటారు? అబ్బా! ఎంత ఎర్రగా వుందో, తినక ముందే ఈవెడ చూశారు, దృశ్యరూపం. కళ్ళతో చూచాడండీ, తినలేదు. కళ్ళతో చూచి, పూర్వం కళ్ళతో చూచినప్పుడు తిన్నదానికి tally చేశాడు, సరాసరి తీసుకువెళ్ళి. ఒక పది సార్లు కలిపింది చూచింది వుంటుంది కదా! అప్పుడు ఎర్రగా వుంది, తక్కువ ఎర్రగా వుంది. ఎక్కువ ఎర్రగా వుంది. ఆ వాటికి ఏమైంది? రసనేంద్రియానికి సంబంధించిన జ్ఞాపకం జోడించబడింది. జోడించి రెండూ కలిపి ఇది పనిచేసి, ఇప్పుడు తినకముందే, కలిపినటువంటి దృశ్యవస్తువుని చూడగానే, ఇది గ్యారెంటీగా కారంగా వుంటుంది, ఇది గ్యారెంటీగా ఉప్పు ఎక్కువ వుంటుంది. ఇది గ్యారెంటీగా.... ఇలా నిర్ణయం చేసేసే స్థితి

దాకా వచ్చేశాడు. చూడండి ఒక్కసారి. ఎక్కడున్నామో ఇప్పుడు మనం. ఇదయ్యా మోహం అంటే. మోహం అంటే అందురూ అసలు ఏవో మోహాలు అనుకుంటారు. అవి మాత్రమే మోహాలు కాదండీ, ప్రతీదీ మోహమే. ఏదో ఆడవాళ్ళు మగవాళ్ళను కాంక్షించడం, మగవాళ్ళు ఆడవాళ్ళను కాంక్షించడమే మోహం అనే స్థితిలో మనమందరం మాట్లాడుతాం అండీ! దానంత తప్పు ఏదీ లేదు. అర్థమైందా అండీ! ప్రతీ విషయంలో, నీకు అసలు ప్రతీ విషయంలోనూ వున్నది మోహమే. ఎందుకని? అది పొందకుండా నీవు ఆగలేకపోతున్నావుగా. ఆగలేకపోవడం ఏదైతే వున్నదో అదే మోహము. గుర్తుపెట్టుకోండి. ఏవండీ! దీన్ని చూడకుండా నేను ఆగలేకపోతున్నానండీ! మోహం. ఈ సీరియల్ చూడకుండా నేను ఆగలేకపోతున్నానండీ, మోహం. ఏదైనా సరే! ఈ పని చేయక నేను ఆగలేకపోతున్నానండీ, ఆగలేకపోవడం అనే వేగం ఏదైతే వున్నదో, అదంతా మోహమే. ఒక్కసారి ఆ స్థితి వరకూ వచ్చింది అంటే, నిన్ను ఆపడానికి వీలుకాదు. ఎందుకని? ఆ వేగం వచ్చేస్తుంది దానికి. ఇంద్రియ వేగం వచ్చేస్తుందన్నమాట. మనసుకి వేగం వచ్చేస్తుంది. ఇంద్రియాలకు వేగం వచ్చేస్తుంది. ఇంద్రియ వేగం వచ్చేస్తుంది. నీవు ఆ విషయరూపాన్ని ధరించివేస్తావన్నమాట. ఇంకా నిన్ను ఆపడానికి వీలుకాదు. అప్పుడు అన్ని ధర్మాలను అతిక్రమిస్తావు. దాన్ని అప్పుడు పొందడమే నీ లక్ష్యం అంతే. వీడు బాధపడతాడా? బాధపడలేదా? వీడు వున్నాడా? పోయాడా? అవన్నీ ఏవీ ఆలోచించవన్నమాట ఇంకా. పరమాత్మతో ఏ నిమిత్తము వుండదు. ఇది కావాలి. చేసేశాను అంతే. నాకిది కావాలండీ, నేను చేసేశాను అంతే. అంటాడు అంతే. తమోగుణం వచ్చేస్తుందన్నమాట అప్పటికి. సాంతం మోహంలోకి వచ్చేసేటప్పటికి, తమోగుణ ప్రభావం వచ్చేస్తుందన్నమాట. ఇప్పుడు చెప్పడానికి వీలౌతుందా? వీలుకాదు. తురీయరూపంలో వున్నప్పుడు సత్వగుణం. మోద రూపంలో వున్నప్పుడు రజోగుణం. ప్రమోద రూపంలోకి వచ్చేసేటప్పటికి తమోగుణం. కాబట్టి మీలో వున్నటువంటి విషయ విచారణని చక్కగా చేస్తూ, ఆ విషయ విచారణ అంతా కూడా ఎలా చెయ్యాలయ్యా అంటే ఇలా చేయాలి.

ఏవండీ! నాకు ఎందుకు ఇన్ని సమస్యలు వస్తున్నాయి? ఎందుకు ఇంత దుఃఖం కలిగింది? నేను ఎందుకు ఇలా వున్నాను? నాకు పరమాత్మ ఎందుకు తెలియలేదు?

నాకు ఆత్మస్వరూపం ఎందుకు బోధపడలేదయ్యా అంటే, అన్నింటిలో మనం మన మానవ జీవితంలో ఇప్పటివరకూ జీవించిన జీవితంలో వున్నవన్నీ ఏమిటి? ఈ ప్రియం మోద ప్రమోదములే వున్నాయి. అన్నిటిలో. ఎక్కడెక్కడైతే మీకు ఈ ప్రియం మోద ప్రమోదములు వున్నాయో, మళ్ళా ఇప్పుడు అవే కలుగుతూ వుంటాయండి. కొత్తగా ఏమీ కలగవు. అన్నీ పాతవే. నువ్వు పుట్టి బుద్ధి ఎరిగనప్పటి నుంచి ఇప్పటి వరకూ చూచినవి, చేసినవే వుంటాయి. ఇంకా కొత్తవి ఏమీ చూసేదీ, చేసేదీ లేదు. ఎందుకని? నీ జ్ఞాపకాలలో ఎప్పటి నుంచి వున్నాయండీ? 'కల్పశతముల కన్న మిక్కిలి కాల మాయెను తిరిగి చూడగ ' - ఈ విశ్వమంతా తిరిగి చూస్తూనే వున్నావు. ఎప్పటి నుంచి కొన్ని లక్షల కోట్ల సంవత్సరాల నుంచి ఇదే పని చేస్తూ వున్నావు. అసలు నీకు కొత్తదనే అవకాశమే లేదు. నీకు ఈ సృష్టి మొత్తం మీద. ఇంటర్నెట్ అదీ ఎప్పుడో చూసేశాము. కంప్యూటర్ - అదీ అంతకంటే ముందే చూసేశాము. అన్నీ చూసేసినవే, కొత్తవి ఏమీ కాదు. ఇప్పుడు ఎలా కొత్తవి కాదు? కాసేపు ఆ పని చేసి చూడు. 10 నిమిషాలు అయ్యేటప్పటికి నీకు అది పాతదై పోతుంది. కొత్తదైతే ఎప్పుడూ కొత్తగా వుండాలి కదా! వుంటోందా? వుండడం లేదు కదా! (మరి పాతదానినే మరలా మరల కోరుకుంటున్నాము కదా!) ఎందుకని అంటే, ఆ పాతదాంట్లో కొంచెం మార్పు వచ్చిందన్నమాట. శబ్దంలోనో, స్పర్శలోనో, రూపంలోనో, రసంలోనో, గంధంలోనో ఒక పది శాతమో, ఒక శాతమో మార్పు వచ్చిందన్నమాట. దాన్ని కొత్తది అంటున్నావు. ఎందుకని? మారటం దాని సహజ లక్షణం. అంతే కదండీ! మీరు అన్నీ ఒకే రంగున్న, ఒకే రకమైన చీరలు కడతారా? ఎందుకని? ఎందుకని కట్టరండీ? కాదు. అందుకని వాళ్ళు ఏం చేశారంటే, ఆలోచించి పెట్టారు. వైధవ్యం - భర్త గతించిన తర్వాత కేవలం ఒకే రంగు తెలుపె చీరే కట్టాలని పెట్టారండి. ఎందుకని పెట్టారు? identification కాదు. పాపం. అది అంతకంటే పొరపాటు. అయ్యో! విషయవైరాగ్యం పొందమని. విషయము అంటే రంగులతో కూడుకుని వుంటుంది. కొంచెం కొంచెం మార్పులతోటి నిరంతరాయంగా పరిణామం చెందుతూ వుంటుంది. పరిణామం లేనటువంటి శాశ్వతమైన స్థితి కోసం, నేను జీవిస్తున్నాను అనే ప్రతీక. శాశ్వతత్వము, పరిణామము లేని, మార్పులేనటువంటి స్థితిని తెలుసుకునే నిమిత్తమై నేను ఇక నుంచీ జీవిస్తున్నాను అని తనకు తానే దీక్ష తీసుకోవడం అండీ అది. సన్యాసము ఎలాగో, ఇది

కూడా అంతే. తనకు తానే స్వీకరించేటటువంటి దీక్ష. కానీ ఈ వాస్తవం పోయింది. ఈ వాస్తవం పోయి ఇప్పుడు ఏమైందండి? ఒక్కసారి ఆలోచించుకోండి. అర్థమైందా అండీ!

తనకు తానే తన జీవితం మీద వెనక్కు తిరగి చూచుకుని, ఓహో! ఏముంది ఇందులో? అంతా విషయమే తప్ప, ఇక్కడేమీ లేదు. అని ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము చేత, సాధన చతుష్టయ సంపత్తిలో వున్నటువంటి, గొప్పదైనటువంటి ఈ రెండవ దీక్ష అండి. ఈ రెండవ సాధనే. ఈ రెండవ సాధన యొక్క ప్రభావన్ని అక్కడ పెట్టారన్నమాట. అర్థమైందా అండీ!

సాధారణంగా స్త్రీలకు విషయాలు ఎక్కువ వుంటాయి కదా! ఈ ప్రకృతి ధర్మంగా వారిలో ఒకింత ఎక్కువ పనిచేస్తూ వుంటుందండి. అందువల్ల, ఆ విషయ వైరాగ్యం, ఆ వైరాగ్య నిర్ణయం కోసం, శాశ్వతత్వాన్ని నేను గుర్తించే నిమిత్తమై ఇక శేషజీవితాన్ని గడపబోతున్నాను. అనే ఒక నిర్ణయాన్ని తనకు తానే దీక్షగా స్వీకరించింది కాబట్టి అలా ఏర్పాటు చేసుకుంది. ఆవెడకు ఆవెడే. మరొకరు ఏర్పాటు చేసే అవకాశము లేదు. ఎట్లా అయితే సన్యాసం తనకు తానే స్వీకరించాలో, అలాగే ఇది కూడా అంతే. అర్థమైందా అండీ? అలాగ ఎప్పేడైతే ఈ విధానంలో ఏర్పాటు చేశారో, చివరకు ఏం మిగిలింది ఇప్పుడు? అందుకే ఒక్కసారి విచారణ చేసుకోండి. అందుకే మన సంప్రదాయంలో... ఇదంతా శిష్టాచార సాంప్రదాయం. అంతా ఆత్మజ్ఞాన ప్రబోధం అందులో వున్నది. కానీ ఆత్మజ్ఞానం పోయింది. పోయి చివరకు ఏమి మిగిలింది? బాహ్యం మిగిలిపోయింది. అందువల్ల ఆ శిష్టాచార సాంప్రదాయం ఎవ్వరూ పాటించరు ఇక. ఎందుకని? లక్ష్యం పోయింది. ఇప్పుడు ఎవ్వరూ పాటించడం లేదండి. అసలు ఈ విధానమే పోయింది ఇప్పుడు. అందుకే నండి, ఆయన వుంటే వున్నాడు, లేకపోతే పోయాడు ఏమిటట ఇప్పుడు? ఆయన వుంటే, పోతే ఇప్పుడు నాకు ఏం తేడా వచ్చింది? నేను ఎప్పుడూ వున్నాను. నాకేమన్నా తేడా వచ్చిందా? పుట్టి బుద్ధి ఎరిగిన దగ్గరనుంచీ అన్నీ వున్నాయి నాకు. నేను పోతే కదా ఏకంగా. నేను పోయినప్పుడు నాతోపాటు అన్నీ పోతాయి. బోడి ఇప్పుడు ఆయన వుంటే ఏంటట? పోతే ఏంటట? అనే స్థితిదాకా వచ్చేసింది. ఎందుకని? ఆచారము, సాంప్రదాయము అని చెప్పేదాంట్లో ఈ ఆత్మజ్ఞానము లోపించింది. ఎప్పుడైతే నిజజీవితంలో ఆత్మజ్ఞానం లోపించిందో, బాహ్యమే మిగిలిపోయింది ఇప్పుడు.

అర్థమైందా అండీ! కాబట్టి ఇప్పుడు మీరు ఏం చేయాలట? మీరు ఆచరించే టప్పుడు ఆత్మజ్ఞానంతో ఆచరించు. అప్పుడు ఆ ఆచార సాంప్రదాయం బ్రతుకుతుందండి. మీరు నిజంగా ఆచార సాంప్రదాయాన్ని బ్రతికించాలి అని అన్నారనుకోండి, మీరు ఏం చేయాలి ఇప్పుడు? ఆత్మజ్ఞానంతో ఆచరించు. నువ్వు ఆత్మజ్ఞానంతో ఆచరిస్తే, నీ చుట్టుపక్కల వున్న జీవులన్నింటి మీదా దాని ప్రభావం వుంటుంది. ఆ ప్రభావం ఏం చేస్తుంది? అది బ్రతికించేట్టు చేస్తుంది, దాన్ని వాడు ఆచరించేట్టు చేస్తుంది. మీరు ఎంత చెప్పినా వాళ్ళు ఆచరించడం లేదండి, ఎందుకు ఆచరించడం లేదు? నువ్వు ఆచరించేటప్పుడు ఆత్మజ్ఞానంతో ఆచరించడం లేదు. విశాల భావంతో ఆచరించడం లేదు. పరిమితత్వ భావంతో ఆచరిస్తున్నావు. ఏమైనా సరే చేయాల్సిందే అని బలవంతముగా రుద్దుతున్నావు. ప్రపంచంలో బలవంతముగా ఏపనీ చేయించడానికి వీలుకాదు. తల్లి గర్భంలోంచి శిశువు బయట పడాలన్నా కూడా బలవంతపు బ్రాహ్మణార్థం పనికిరాదు. అసాధ్యము. కానీ మనమేమి చేస్తున్నాము? అన్నీ ఇప్పుడు బలవంతముగా చేయిస్తున్నామండీ! ఏమైంది? తప్పు కదా! ఆచరణ సాధ్యం కాదు కదా! కాబట్టి నిజజీవితంలో ఈ సాధన చతుష్టయ సంపత్తిని ప్రతినిత్యము, ప్రతి విషయములోనూ, ప్రతి క్షణము, ప్రతి మాట, ప్రతి చేత, ప్రతి ఆలోచనలో నిత్యానిత్యవస్తు వివేకము, ఇహాముత్రార్థ ఫలభోగవిరాగము అనే రెండింటి యొక్క, ఈ రెండు సాధనలు చాలా అవసరం అండి. మరణకాలంలో వెంటనే, నీకు బుద్ధి విరమించే లోపల, వుపయోగపడేటటువంటి సంపదలు వున్నాయి ఏమన్నా అంటే అవి ఇవి రెండే. బుద్ధి విరమించిన తరువాత అసలు ఈ రెండూ కూడా ఉపయోగపడవండి. అందుకనే చెప్పేది, మరణ వేదన ప్రారంభం కాకముందే, నీకు ముందే తెలుస్తుందండి, తెలివి వున్నవాడికి ఏం జరుగుతుందయ్యా అంటే, మొదటే చెప్పాను కదా! శరీరం వదిలి వేస్తాడు. తెలివితో వదిలి వేస్తాడండి. ఆ తెలివి వుంటుంది. మరణం వచ్చేస్తుంది. ఇహ సమయం ఆసన్నమైంది అని తెలియగానే ఏం చేస్తాడంటే, ఈ నిత్యానిత్య వస్తువివేకాన్ని, ఇహాముత్రార్థ ఫలభోగ విరాగాన్ని జీవితమంతా ఆచరిస్తాడు కదా! సహజమైపోతాయి అప్పుడన్నమాట. ఆ సహజమైనటువంటి స్థితిలో, తాను ఆత్మస్వరూపుడు అని స్థిరపడిపోయి, చూస్తూ వుంటాడు అంతే. ఎలా ఇంద్రియాలు ఒక్కొక్కటి ఎలా

పడిపోతున్నాయో, సహజంగా చూస్తూవుంటాడు అంతే. అలాగే పడిపోతాయి. పోతే పోనీ అని అనుకుంటాడు అంతే. ఏమీ చలించడన్నమాట. అలాగ అలా చలించని స్థితిలో వుండాలి మరణంలో కూడా అంటే, ఈ సాధన చతుష్టయ సంపత్తి ఎంతో అవసరం. ఇలా ఈ సాధన చతుష్టయ సంపత్తితో జీవించేవాడే సాధకుడు. దీంట్లో సహజత్వం పొందినవాడు శిష్యుడు. అట్టి సహజత్వం పొందినవారిలో అగ్రగణ్యుడు సచ్ఛిష్యుడు. వీరిలో భేదాలు ఇవండి. ఈ సాధన చతుష్టయ సంపత్తిని సంపాదించకుండా తిరిగేవాళ్ళు అనుసరించే వాళ్ళు. ఒకటే గుర్తు పెట్టుకోండి. మీరందరూ కూడా భవిష్యత్తులో ఏమౌతారు అనేది, దీన్ని బట్టి తెలుస్తుంది. ఎప్పటికీ మీరు మీ నిజజీవితంలో ఈ సాధన చతుష్టయ సంపత్తిని సంపాదించకుండా కూడా ఇలాగే వింటూవుండవచ్చు, వెళుతూ వుండవచ్చు, వింటూవుండవచ్చు, వెళుతూ వుండవచ్చు, వింటూవుండవచ్చు, అనేక ఆశ్రమాలకు వెళుతూ వుండవచ్చు, పురాణ శ్రవణం వింటూ వుండవచ్చు, వెళుతూ వుండవచ్చు. వీళ్ళందరూ ఎవరు? అనుసరించేవాళ్లు. అంతే. వీళ్ళకు ఏమీ ఉపయోగం వుండదండి. వీళ్ళకు ఏ సాధన చతుష్టయ సంపత్తితో పనిలేదు. తెలుసు వీళ్ళకు కాకపోతే అన్నీ కూడా. కానీ వాళ్ళ దగ్గర ఏమీ వుండదన్నమాట. వాడి దగ్గర ధనమేమీ వుండదు. కానీ ధనము అంటే ఏమిటో తెలుసు. అర్థమైందా అండీ? బ్యాంకులో క్యాషియర్ లాంటివాడన్నమాట వీడు. ఎన్ని కోట్లు అయినా వస్తూ వుంటాయి, ఇస్తూవుంటాడు, కానీ వాడిది అనేది ఏమీ అక్కడ వుండదు. కానీ, కనీసం వీడికి ఏంటంటే, విషయభోగం మీద అపేక్షపోదండి. ఎందుకంటే, వీడిదగ్గర సాధన చతుష్టయ సంపత్తి లేదు కాబట్టి. విషయం వచ్చినప్పుడు దాంట్లో మునిగిపోతూ వుంటాడన్నమాట. విషయం లేనప్పుడు మాత్రం ప్రశాంతంగానే వుంటాడన్నామాట. ఈ అనుసరించే వాళ్ళకు కూడా ఉపయోగం వుందండి. ఏంటట? విషయం లేనప్పుడు మాత్రం ప్రశాంతంగా వుంటాడు, విషయం వస్తే మాత్రం వీడంత ప్రమాదకారి మరొకడు లేడు. ఎందుకంటే అందరికంటే ముందు వీడే మునిగిపోతాడు కాబట్టి. అర్థమైందా అండీ! ఎందుకని? ఆనకట్ట కట్టీ, కట్టీ, కట్టీ వుంటాడు. విషయం రాగానే ఏమైపోతాడండి? తెంచుకుని విరుచుకు పడుతుందండి. ఈ అనుసరించే వాడికి వచ్చిన ప్రమాదం ఇది. అయితే దీంట్లోనుంచి ఒక మెట్టు పైకి ఎక్కాలి. సాధన చతుష్టయ సంపత్తిని నిజజీవితంలో మనం నిజంగా సంపాదించాలి

అండి. ఇదే నీ సూక్ష్మాన్ని బాగు చేసేటటువంటి సరైన సాధన. ఈ సాధన చతుష్టయ సంపత్తిని సంపాదించడం కోసమే, అన్ని ఉపనిషత్తులు, వేదాంతమంతా బోధించేది అంతా వీటికోసమే. ఈ సాధన చతుష్టయ సంపత్తి లేకుండా, ఏదీ సాధ్యము కాదు. అసాధ్యము. నీవు ఎన్నన్నా చదువు, ఎన్ని విను, ఎన్ని చేయి అంతా నిన్ను ఎక్కడి దాకా తీసుకెళ్ళి వదిలేస్తాయి? అనుసరించే వాడిదాకా తీసుకెళ్ళి వదిలేస్తాయి. గురువు అవసరం ఏమిటయ్యా అని అంటే, ఈ సాధన చతుష్టయ సంపత్తిని నీకు వివరించి చెప్తాడు. నన్ను మార్గదర్శకత్వం చేస్తాడు, నన్ను మార్గదర్శకత్వం చేస్తాడు, ఏం చెయ్యాలో చెప్తాడు అంటున్నావే, ఏంటయ్యా? ఆయన చెప్పేది అంటే ఇదిగో ఇదే! ఆ సాధన చతుష్టయ సంపత్తి అంటే ఏమిటి? అది ఎట్లా సంపాదించాలి అనేది వివరంగా చెప్తాడన్నమాట. నిజజీవితంలో వాటిని ఎట్లా ఆచరించాలో చెప్పడమే, గురువు చేసేటటువంటి పని. ప్రాథమికంగా గురువు చేసేటటువంటి పని. ఆయన్ని ఏమన్నారయ్యా అంటే శ్రీ గురువు అన్నారు. ఇట్లా చెప్పే ఆయన్ని ఎవరంటారు? శ్రీ గురువు అంటారండి. కాబట్టి ఆ రకంగా మీరు నిత్యానిత్య వస్తువివేకము నిన్న చూశారు. ఇవాళ ఇహాముత్రార్థ ఫలభోగవిరాగాన్ని గమనించాము. రేపు మరొకటి.

ఓం ఓం ఓం పూర్ణమదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే, పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే
ఓం పూర్ణమదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే, పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే
ఓం పూర్ణమదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే, పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే
ఓం తత్ సత్
ఓం సహనాభవతు సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై
ఓం శాంతిః శాంతిః శాంతిః
సాయిరాం.

ఎవరికి ఝుడుపు వుండునో, భయము వున్నదో వాడయ్యా జీవుడు. అంటే అర్థం ఏమిటి? రోజూ నిద్రలోకి పోతున్నాడు. మరల ఉదయం మేల్కొంటున్నాడు. దీన్ని ఏమన్నారయ్యా అంటే నిత్యప్రళయం. దీనిని ఏమంటారు? నిత్యప్రళయం. అంటే రోజూ చస్తాడు, రోజూ పుడతాడు. ఒకసారి 100 ఏళ్ళకేదో చావడం అనేది లేదు. జీవుడు అంటే అర్థం ఏమిటంటే, నిత్యప్రళమును అనుభవించేవాడు. ఉపనిషత్తులు ఏమి చెబుతున్నాయయ్యా అంటే, ఏ ఉపనిషత్తు తీసుకున్నా కూడా మొట్టమొదట జీవుడి విషయం చెబుతారు. అట్లాగే ఈశ్వరుడి విషయం చెబుతారు. జీవేశ్వరులు ఎలా కలిసి వున్నారు? రెండూ ఒకటే ఎలాగ అయివున్నాయి? ఆ ఈశ్వర లక్షణాలే, ఈ జీవుడికి ఎట్లా వున్నాయి? అట్లా గనుక ఆ ఈశ్వర లక్షణాలతో గనుక నువ్వు ఈ శరీరంలో జీవించినట్లయితే, నీవే భగవంతుడివి అని ఎట్లా తెలుసుకుంటావు? నీవే భగవంతుడివి అని ఎట్లా జీవిస్తావు? ఏ ఉపనిషత్తు అయినా ఇదే ప్రాథమిక సూత్రం మీద నడుస్తుంది. అది ఈశావాస్య మిదం సర్వం దగ్గర నుంచి మొదలు పెడితే, చివరికి ముక్తికోపనిషత్ వరకు అన్ని ఉపనిషత్తులు, 108 ఉపనిషత్తులు కూడా ఇదే ప్రాథమికంగా, మొట్టమొదటలో జీవుడు అంటే ఏమిటి? ఆ తరువాత ఈశ్వరుడు అంటే ఏమిటి? జీవేశ్వరులకు ఒకే లక్షణాలు ఎలా వున్నాయి? జీవుడు ఈశ్వర లక్షణాలతో ఎలా జీవించాలి? అలా జీవిస్తే తాను భగవంతుడని ఎట్లా తెలుసుకుంటాడు? తెలుసుకున్న తరువాత భగవంతుడిగా ఎట్లా జీవిస్తాడు. ఇంతే! ఏ ఉపనిషత్తు అయినా కూడా ఇదే ఆరు వాక్యాలమీద నడుస్తుందన్నమాట. వీటిని షడ్లింగములు అని సంస్కృతములో అంటారన్నమాట. ఆరు పద్ధతులు అన్నమాట. ఉపనిషత్తు ఆ ఆరు పద్ధతులుగా వివరిస్తూ వుంటుంది ఎప్పుడూ కూడా. దాని లక్ష్యం అదన్నమాట. ప్రతి ఉపనిషత్తుకి లక్ష్యం ఇదే. ఏ ఉపనిషత్తు మొదటినుంచి, చిన్న ఉపనిషత్తు కావచ్చు, అతి పెద్ద ఉపనిషత్తు కావచ్చు. అది ఈ ఆరు ధర్మాలను కలిగివుంటుందన్నమాట. అందులో ఏమి వివరించబడుతాయి? జీవుడంటే ఏమిటి? అంటే మీరు ఎక్కడైనా, ఏదైనా ఉపనిషత్తులు చెబుతున్నారండీ, వింటున్నామండీ, చదువుతున్నామండీ అన్నారనుకోండి. ఈ ఆరు లక్షణాలను అందులో గమనించాలన్నమాట. ఓహో! ఇందులో జీవుడు అంటే ఏమని చెప్పాడు? ఈశ్వరుడు అంటే ఏమని చెప్పాడు? జీవుడికి ఈశ్వర లక్షణాలు ఏమి వున్నాయి? ఈ ఈశ్వరుడి

లక్షణాలతో జీవుడు ఎట్లా జీవించాలి? అలా జీవిస్తే, జీవుడు ఈశ్వరుడిగా ఎలా వున్నాడు? ఇది తరువాత ఎలా గుర్తిస్తావు? ఇక అదంతా, ఆ అనుభవం ఎట్లా గుర్తిస్తావు? ఇంతే సంగతులు. ఇదే, ఇలాగే చెబుతాయన్నమాట. అన్నీ ఇలాగే చెప్తాయి. అన్ని ఉపనిషత్తులు ఈ లక్షణాలనే కలిగివుంటాయి. కాబట్టి జీవుడంటే ఏం చెబుతున్నాయి? అన్నీ కలిపి కొన్ని నిర్ణయాలు చెప్పేశాయన్నమాట. ఏ ఉపనిషత్తులు తిరగేసినా కూడా, కొన్ని కొన్ని విభేదాలు అంటే, ఆచరణ సాధనా భేదములు వున్నాయన్నమాట. అంటే కర్మమార్గాన్ని మాత్రమే చెప్పేటువంటి కొన్ని పద్ధతులు, భక్తి మార్గాన్ని, యోగ మార్గాన్ని, జ్ఞానమార్గాన్ని ఇట్లా ఆయా మార్గాలకు సంబంధించిన సాధనలు చెప్పేటప్పుడు అంటే, జీవుడు ఈశ్వరుడిగా జీవించడము ఎట్లా? అని చెప్పేదగ్గరకు వచ్చేటప్పటికి మాత్రం కొంచెం ఆయా మార్గాన్ని బట్టి భేదం వుంటుందన్నమాట. మిగిలినవి అన్నీ సమానంగానే వుంటాయి. అయితే ఏమిటంటే, ఈ ఉపనిషత్తులు అన్నీ కలిసి కొన్ని నిర్ణయాలు చేసినాయి. వాటిలో ఏమీ భేదం లేదు. ఏమిటీ అంటే, '**జీవుడు ఈశ్వరుడే**', అన్ని ఉపనిషత్తులు చెప్పినా కూడా ఒకే నిర్ణయం. జీవుడు ఈశ్వరుడే. జీవేశ్వరులు ఒక్కటే. ఎందుకయ్యా? అంటే, ఆ ఈశ్వరుడే ఈ జీవుడు అయినాడు కాబట్టి. ఎలాగ? ఈశ్వరుడు అనేవాడు మట్టి, జీవుడు అనేవాడు కుండ. మట్టి అనే ఆధారం లేకుండా కుండ అనేది తయారౌతుందా? కుండకు మట్టి లక్షణం కాకుండా ప్రత్యేక లక్షణం వచ్చే అవకాశం వుందా? లేదు కదా! ఆకారం మారినంత మాత్రాన లక్షణం మారిందా? మారలేదు కదా! కాబట్టి జీవుడికి ఏం మారుతున్నాయి? ఆకారాలు మారుతున్నాయి. లక్షణం మారడం లేదు. కాబట్టి నువ్వు ఆకారాన్ని ఆశ్రయించకుండా, లక్షణాన్ని ఆశ్రయించవయ్యా!

ఇప్పుడు మనమందరం వున్నాము. మనందరికి ఏం భేదము వుంది? ఆకార భేదం వుంది. అంతే కదా! చిన్నకుండ, పెద్దకుండా, ముంత, చట్టి, మూకుడు అంతేనా? ఆకార భేదం వుంది. కానీ మనం అందరం ఎవరం? లోపలికి తిరిగి చూస్తావా? శరీరం వరకూ చూస్తే జీవుడు. ఇంకా లోపలికి చూస్తావా? అంతరాత్మ. ఇంకా లోపలికి చూస్తావా? పరమాత్మ. అక్కడ ఏమైనా భేదం వుందా? అక్కడేమీ భేదం లేదు. జీవుడన్నా భేదం లేదు. అంతరాత్మన్నా భేదం లేదు. పరమాత్మన్నా భేదం లేదు. ఎందుకని? పోయేరోజున ఏం చెబుతున్నావు? ఎవరు పోయినా ఎవడు పోయాడు? జీవుడు పోయాడు అంటున్నారు.

(అంతేగా మరి) ఎవడు పోయినా, జీవుడు పోయాడు అంటున్నావు గానీ, ఆకారం పోయింది అంటున్నావా? చూడండి. మనం మరణ కాలంలో ఎక్కడికి... అందుకే చెబుతారు అంత్యకాలంలో తప్పనిసరిగా ఆఖరి చూపు వెళ్ళాలండి. ఎందుకు వెళ్ళాలట? ఆఖరి చూపుకి. అంటే మంచి వాక్యాలు అప్పుడే చెప్తారు. జీవితానికి పనికి వచ్చే వాక్యాలు ఎప్పుడు చెబుతారయ్యా అంటే, అనుభవజ్ఞులంతా అక్కడికి చేరుతారు కదా! వాళ్ళు జీవితానుభవం అంతా కలిపి అప్పుడు చెబుతారన్నమాట. వాక్యాలు. ఏమిటి? జీవుడు పోయాడండి. సరే జీవుడు పోవడం ఏమిటి? అనే ప్రశ్న నీకు అప్పుడు ఉదయిస్తుందన్నమాట. ఇదేమిటి? అదేమిటి? ఎదురుగుండా ఆకారం ఎదురుగుండానే వుంది. ఎవడు పోయాడు ఇప్పుడు? జీవుడు పోయాడు. నిద్రలో కూడా ఎవడు పోయాడు ఇప్పుడు? ఆకారం అక్కడే వుంది. జీవుడు లేడు అందులో. లేడా నిజంగా? ఉన్నాడు. కానీ ఇంద్రియాలను దాటి వున్నాడు. మీరి వున్నాడన్నమాట. అందువలన ఏమైంది? మనకేమీ తెలియలేదు. అర్థమైందా అండీ! మెలకువలోకి వచ్చేటప్పటికి ఏమయ్యావు? మళ్ళీ ఇంద్రియాలలోకి వచ్చావు. కాబట్టి జీవుడు అంటే ఏమిటయ్యా? నిత్యప్రళయమును అనుభవించే వాడు జీవుడయ్యా! అంటే ఏమిటి? వీడు ఏదో యాభై సంవత్సరాలకో, వంద సంవత్సరాలకో ఒకసారి పోయేవాడు కాదు ఎందుకు దుఃఖిస్తావు? నీకు జననమరణముల ఝుడుపే కదా జీవుడికి వున్నది? అందులో మరణాన్ని వివరిస్తున్నాడన్నమాట. మరణం అంటే ఏమిటి? రణము+మ అంతే కదండి. రణము అంటే ఏమిటి? యుద్ధము. జీవితం అనే యుద్ధము, పోరాటము చేస్తున్నాడు. మ పోగొట్టుకున్నాడు. ఆ స్థితితో జీవితం అనే యుద్ధము, పోరాటము ముగిసిపోయిందిరా బాబు. మంచిదే కదా! జీవితకాలం అంతా ఆ పోరాటం గురించేగా తగాదా పడ్డావు. ఎప్పుడు ముగుస్తుందా? ఎప్పుడు ముగుస్తుందా? అని ముగిసే టైం వచ్చినప్పుడు దుఃఖిస్తావు ఎందుకు మరి? నీకు ఎందుకు దుఃఖం? కాబట్టి మరణం అంటే ఏమిటయ్యా? దుఃఖించ దగినది కాదు అది. పూర్ణజ్ఞానాన్ని అందించేటటువంటిది. ఎందుకని? ఇప్పుడు అందుకోలేనటువంటి జ్ఞానాన్ని, మరల వచ్చే ఉపాధికి అందుకోవడానికి గొప్ప అవకాశాన్ని తెరుస్తోంది. ఈ ఉపాధి జ్ఞానాన్ని అందడానికి పనికి రాలేదండి. నిర్ణయం చేశాడు, లోపల వున్న అంతరాత్మ. ఇహ నీకు ఈ ఉపాధి

పనికిరాదురా బాబు. నువ్వు ఎంతకాలం తన్నుకున్నా కూడా ఈ ఉపాధిలో వుంటే ప్రయోజనము లేదు. ఇట్లాగే వుంటావు ఎంతసేపు చూసినా కాని. ఈ జంతువు బుద్ధి, ఈ కీటకము బుద్ధి పోదు నీకు. ఇహ దీంట్లోనుంచి మారితే కానీ, నీకు పరిణామం రాదు. కాబట్టి దేహాన్ని వదిలేసేయ్ అని నిర్ణయం చేయగానే జీవుడు ఏం చేశాడు? వదిలేశాడు. మరి ఇప్పుడు వదిలేసిన జీవుడు ఏమి అడిగాడు? నన్ను ఇది వదిలేయ్ మన్నావు, తరువాత సంగతి ఏమిటి? అది ఆ తరువాత సంగతి ఏమిటి అని అడిగేదే '**మరణ వేదన**'.

మరణ వేదన అంటే ఏమీ లేదు. అంతరాత్మ నిర్ణయం చేసింది. నీకు ఇది పనికిరాదురా బాబు. అని నిర్ణయం చేసిందండి. అది చేయగానే జీవుడు ఏమన్నాడు, okay ready నేను, నీ అధీనంలో వన్నవాడిని. నా అధీనం ఏమీ లేదు. స్వేచ్ఛ ఏమీ లేదు. రోజూ నిద్రలో పోతూనే వున్నాను కదా నేను. పోతున్నానా? లేదా? మళ్ళా నీ నిర్ణయం మేరకు ఎక్కడ లేస్తున్నాను? అదే ఉపాధిలో నిద్ర లేస్తున్నాను. మేల్కొంటున్నాను. రోజూ నిత్యప్రళయాన్ని అనుభవించేవాడినే. రోజూ పోయేవాడినే. ఇవాళ నేనేం కొత్తగా పోవడం లేదు. నాకేం దుఃఖం లేదు. కాబట్టి జీవుడికి దుఃఖం వుందా ఇప్పుడు? జీవుడికి దుఃఖం లేదు. ఎందుకని? శరీరానికి సాక్షివాడు. అర్థమైందా అండి. అంటే ఏమిటి? ప్రాణమనోబుద్ధులు జీవుడు. ఈ ప్రాణ మనో బుద్ధులు శరీరానికి సాక్షి. ఈ ప్రాణమనో బుద్ధులకి

సాక్షి ఎవరు? అంతరాత్మ. ప్రాణ మనో బుద్ధులకి సాక్షేమో అంతరాత్మ. శరీరానికి సాక్షి ప్రాణమనోబుద్ధులు జీవుడు. అన్నమాట. ఆ జీవుడి పేరే ఈ ప్రాణ మనో బుద్ధులు. మనం ఏమనుకుంటున్నాము ఇప్పుడు? ఈ శరీరం ప్రాణ మనో బుద్ధులు ఒకటే అనుకుంటున్నాము ఇప్పుడు జీవించేటప్పుడు. అది వచ్చిన తగాదా! నిజానికి ఏం చెయ్యాలి? ఈ రెండిటిని వేరు చెయ్యాలన్నమాట. శరీరం వేరు, ప్రాణ మనో బుద్ధులు వేరు. ఈ ప్రాణమనోబుద్ధులు అనే జీవుడు ఏం చేస్తున్నాడు? శరీరాన్ని విడిచిపెట్టేస్తున్నాడు, నిద్రలో శరీరాన్ని విడిచిపెట్టడం లేదా? ఇంద్రియాలన్నీ విడిచిపెట్టడం లేదా? నీ స్థూల ఇంద్రియాలన్నీ వదిలేయడం లేదా? వదిలేస్తున్నాడు. కలలోకి తిరగగానే నీ స్థూల ఇంద్రియాలతో పని అయిపోయింది. వాడికి ఏమీ అవసరం లేదు. తనకు తానుగా మనసులో వుండగలుగుతున్నాడు. తనకు తానుగా మనసులో

అన్నీ సృజించగలుగుతున్నాడు. తనకు తానుగా మనసులో అన్నీ అనుభవించగలుగుతున్నాడు. జీవుడు జీవుడిగానే వున్నాడు అప్పుడు. ఇంద్రియాల సంయోగం లేదు. కానీ, ఈ జీవుడు శరీరం వదిలిపెట్టాలా లేదా అని నిర్ణయం చేసేది ఎవరు? ఆ జీవుడికి స్వేచ్ఛ లేదు. ఎవరు చేయాలి నిర్ణయం? అంతరాత్మ చేయాలి. అంతరాత్మ నిర్ణయం చేసి, నీకు టైం అయిపోయిందిరా బాబు. ఇంక నీకు ఇది పనికి రాదు, ఈ ఉపాధి నీకు పనికిరాదు. అని ఈ జీవుడు ఆ అంతరాత్మకు తెలియజేయగానే, ఈ జీవుడికి ఏం చెబుతుంది? అయితే వదిలేయ్. అయితే వదిలేయ్యమన్నావు సరే! నేను ఎక్కడ లేవాలి ఇప్పుడు? ఇది వదిలెయ్యమన్నావు, ఎక్కడ లేవాలి? నీకు తగ్గది వెతు. నీకు వుందిగా శక్తి. ఈ ప్రాణ మనో బుద్ధులకు వున్న శక్తి ఏంటట? భూమండలంలో వున్నటువంటి ఏ జీవి తల్లి గర్భంలోనైనా సరే ప్రవేశించగలదు. ఎందుకని? సూక్ష్మం సర్వవ్యాపకం. కాబట్టి మరలా ఇదే రామలక్ష్మమ్మగారికి ఇదే అన్నపూర్ణమ్మగారు పుడతారా? ఏమీ అవకాశము లేదు. కానీ, ఆ తెలివితేటలు లేక మనము ఏమనుకుంటున్నాము? మా అమ్మే మళ్ళా మా అమ్మాయిగా పుట్టింది. మా అమ్మాయే వాళ్ళ అబ్బాయిగా పుట్టాడు. ఇవన్నీ వట్టి మాటలు నాయనా! ఇలా లేని పోని బంధాలన్నీ, దుఃఖాలన్నీ మనం కొని తెచ్చుకుంటున్నాము. (నిర్ణయించుకుంటే వుండరు) వాడు నిర్ణయించుకున్నది, నీకు ఎట్లా తెలుస్తుంది? అంటే ఏం చేస్తున్నావు? ఆకారంలో వున్న పోలికలను బట్టి, నిర్ణయం చేస్తున్నావు. కానీ, నేను ఏమంటున్నాను? అసలు ఆకారం ఎట్లా వచ్చింది? మట్టి యొక్క ప్రభావం చేత వచ్చింది. అంతేకదండీ! అన్ని కుండలూ తయారు చేశాడండి. కుండలన్నీ ఒక్క రీతిగానే వున్నాయి. అన్ని కుండలు ఒకటేనా? ఎట్లా అవుతాయి? ఏ కుండకు ఆ కుండే. అంతే కదా! మరి ఈ కుండా, ఆ కుండా ఒకటే కదా? అని అంటాడు. కుమ్మరి దగ్గరకి నువ్వు కుండలు కొనడానికి పోయినప్పుడు ఏమన్నాడు? ఒక్కొక్క కుండా చూసి పెడుతున్నావండి. ఏమన్నాడు? అన్ని కుండలు ఒకటే నయ్యా, తయారు చేసింది నేనే. అంటున్నాడా? లేదా? మరి ఇప్పుడు అన్ని కుండలు తయారు చేసినవాడు ఎవడు? పరమాత్మే. మరి అన్ని కుండలలో వున్న లక్షణం ఏమిటి? ఆ మట్టే. లక్షణం దృష్ట్యా చూస్తే, ఒక్కటే. ఆకర భేదంతో చూస్తే, విడివిడిగా వుంది. కాబట్టి నువ్వు ఇప్పుడు ఏమి విడిచిపెట్టాలట? ఆకార భేదాన్ని విడిచిపెట్టాలి. లక్షణాన్ని

ఆశ్రయించాలి. కానీ మనం ఇప్పటివరకూ జీవించిన జీవితంలో ఎలా జీవించాము? ఆకర భేదాన్ని పట్టుకున్నాము.

దీనికి ఇంకొక ఉదాహరణ కూడా చెబుతాను. అన్ని రకాలైనటువంటి తీపి పదార్థాలు ఒకటే కదా! కానీ మనమేమి చేశాము? దానికి రకరకాల అనుపాన భేదాల్ని, ఒకసారి శనగపిండి, ఒకసారి బియ్యపు పిండి, ఒకసారి మినప పిండి, ఒకసారి ఇంకోటి... నీ ఇష్టమొచ్చినవన్నీ దానికి కలిపావు. ప్రధాన ద్రవ్యం ఏమిటి? పంచదార. అది లేకుండా లేదు కదా! ఏది తిన్నా అదేగా. కానీ, ఈ పక్కన చేర్చినటువంటి అనుపాన భేదం చేత, అది ప్రత్యేకం అంటున్నావు. అది ప్రత్యేకం అంటున్నావు. కుండ వేరే. చట్టి వేరే. ఎలా అయ్యింది? కుండ, చట్టి ఒకటేగా. ఎక్కడా? లక్షణం దృష్ట్యా ఒక్కటే. రెండూ మట్టేరా బాబు. పగలేస్తే? రెండూ పగుల్తాయి. ఇదేగా కాటిలో చెప్పేది? ఏం చేశారండి? ఇంటి దగ్గర నుంచి ఇక్కడికి కుండ పట్టుకెళ్ళాడా? ఈ కర్త ఏం పట్టుకెళ్ళాడండి? కుండ పట్టుకెళ్ళాడా? (నిప్పు ఎందుకు?) ఆఁ.. నిత్యాగ్ని హోత్రం, రోజూ దహించబడుతున్నవాడు నిత్యాగ్ని హోత్రమని తెలుసుకో! నీకు ఏముందయ్యా? దేహం. అంతేనా అండి? ఇప్పటి వరకూ దేనిని ఆశ్రయించి వున్నావు? దేహము. దేహమంటే ఏమిటి? దహించబడునది దేహము. ఎప్పుడో చివరికి కాటి తగలబెడుతున్నది అనుకోమాకు. రోజూ దహించబడుతున్నది నాయనా! ఇది. దహించబడుతున్నది కాబట్టే దీనిపేరు దేహము. శరీరము అన్నావే అనుకోండి ఒకవేళ, శీర్యతి ఇతి శరీరః శీర్యించడం అంటే నశించిపోవడం. ఎప్పుడో ఒకసారి కాటిలోకి పోయినప్పుడు నశించిపోవడం కాదు, రోజూ నశించిపోతున్నదయ్యా! ఒకసారి నశించిపోవటం కాదు ఇది. రోజూ పుడుతూ, పోతూ వుంది. రోజూ దహించబడుతూ వున్నది. రోజూ నశించిపోతూ వున్నది. రోజూ శీర్యతి. చనిపోతూ వున్నది. రోజూ చస్తున్నది. దాని పేరు ఏమిటి అందుకనే? జీవుడు. నిత్యప్రళయమును అనుభవించేవాడు జీవుడు. ఈ బోధ చెప్పడమే అక్కడ కర్త ఉద్దేశ్యము.

ఇక్కడ అగ్నిహోత్రం చేసి, అంతా చక్కగా చేయించి నీచేత, నువ్వు బ్రహ్మ స్వరూపుడివి, ఈ సృష్టి అంతా అలా వుంది, ఆ అగ్ని ప్రభావం చేత ఈ సృష్టి ఏర్పడింది. అని అంతా చెప్పి ఇక్కడ, ఆ ఈశ్వర లక్షణాలు అన్నీ చెప్పి, ఇప్పుడు ఈ మూకుడులో

నిప్పులు పట్టుకుని పదవయ్యా! అన్నాడు. ఏమైంది ఇప్పుడు? మూకుడు లోనేనా? నిప్పులు పట్టుకునేది? కుండ. కింద ఆధారం కుండ. అంతేగా. పైన నిప్పులు వుంటాయి కదా! పైన మూకుడు. నిప్పులు వుంటాయండి. అందుకని ఎందుకని చెప్పారు? ఆ కుండా మూకుడు ఒకటేనా? ఒకటేనా కాదా? (ఒకటేగా మట్టి) కానీ నువ్వేమిటి భేదంగా చూస్తున్నావు? అలా చూడమాకు. మూకుడులో నిప్పులు వేశాను. కుండలో నిప్పులు వేయలేదు. అర్థమైందా అండీ! ఇప్పుడు ఎవరు వేడెక్కారు? కుండా వేడి ఎక్కిందా? మూకుడు వేడి ఎక్కిందా? మూకుడే వేడి ఎక్కింది కదా! కాబట్టి నీలోపల దహించబడేటటువంటి దేహం దహించిపోతోంది కదా. ఎవరి వల్ల? వైశ్వానరాగ్ని. ఆకలి. ఆ ఆకలి ప్రభావం చేత రోజూ దహించబడిపోతూ వున్నది. మృత్యువు కూడా ఈ వైశ్వానరాగ్ని ప్రభావం చేతనే వస్తున్నది. మరణం కూడా దాని ప్రభావం చేతనే వస్తున్నదని బోధిస్తున్నాడు అప్పుడు. ఏమిటట? మరణ కాలం వచ్చేప్పటికి, ఈ వైశ్వానరాగ్ని దేహమంతా ఆవరించేస్తుంది. అర్థమైందా అండి? మృత్యువు రావాలి, నువ్వు ఆ దేహాన్ని విడిచి పెట్టాలి అంటే, ఏం జరగాలట? ఆ లోపల వున్న ఆకలి అంతా కూడా మొత్తం శరీరం వ్యాపించి వేసింది. వ్యాపించగానే, ఆ అగ్ని ప్రభావం చేత సూక్ష్మం వేరైంది. ప్రాణ మనో బుద్ధులు జీవుడనే సూక్ష్మం దేహం లోనుంచి ఏమైంది? వేరైపోయింది. వేరవ్వగానే దానికి స్వేచ్ఛ కలిగింది. ఆ స్వేచ్ఛ ప్రభావం చేత, మరొక దేహంలోకి ప్రవేశించేసింది. (దీనికి తట్టుకోలేక బయటకు పోతుందా?) తట్టుకోలేక కాదు, దాని నిర్ణయమేగా, వదిలెయ్యాలి అంటే ఏం కావాలి? వదిలెయ్యాలి కదండీ! వదిలెయ్యాలి అంటే ఏం కావాలి? దీంట్లోనుంచి వేరు అవ్వాలా? వేరు అవ్వాలి అంటే, దేని చేత అందులో ప్రవేశించిందో, దాన్నే వుపయోగించాలి. వేరే మార్గంలేదు. దేని చేత అందులో ప్రవేశించిందంట? అగ్ని ద్వారా అందులోకి ప్రవేశించింది. అర్థమైందా అండీ!

తల్లికి మూడవ నెలలో ఆకలి ఎక్కువ వుంటుందా? నాల్గవనెలలో ఆకలి ఎక్కువ వుంటుందా? ఏమోనండి మాకేంగుర్తు? ఎందుకని? ఆ తెలివితేటలు లేవు. మీరందరు గర్భవాసం, అందరినీ కన్నారు గానీ, ఆ తెలివితేటలతో చూడలేదు. అర్థమైందా అండీ! మీరు చూడండి. గమనించండి. ఒకటి రెండు మూడు నెలల్లోనే ఆకలిలో భేదం వస్తుందండి. ముందు తేడా వచ్చేది ఆకలిలో భేదమే. ఏమిటి ఈవెడ? ఆహారం

తినేదాంట్లో మార్పు వచ్చేసింది? ఎక్కువ తినేస్తుంది ఈవెడ? ఆవెడకు తెలియదండి. తెలియకుండానే తినేస్తూ వుంటుంది. ఒక్కటో నెల దాటగానేనే మొదలౌతుంది. అంటే తనలో వున్నటువంటి ఆ యొక్క జీవి, మొట్టమొదట దేంట్లో నుంచి ప్రవేశించాడు? అగ్ని ప్రభావం చేత ప్రవేశించాడు. ప్రవేశించి, ఆ అగ్నిని వుపయోగించే దేహాన్ని తయారు చేశాడు. అర్థమైందా అండీ! కుండ తయారు చేయాలంటే, కాల్చాలా? వద్దా? ఆకారం స్థిరపడాలి అంటే ఏం చెయ్యాలి? (గట్టిపడాలి అంటే కాల్చాలి) కాల్చాలి కదా! అక్కడైనా ఏమి వుపయోగించావు? అగ్నినే. ఇక్కడైనా ఈ దేహం గట్టిపడాలి అంటే ఏంచేయాలి? తల్లి గర్భంలో వుపయోగించాలండి. గట్టిపడాలా? అస్థకలు పడాలా. అస్థికలు పడాలంటే ఎలా పడుతాయి? అగ్ని ప్రభావం చేతనే. కాబట్టి జీవుడు ఎలా తయారు చేశాడు దేహాన్ని? అగ్ని ప్రభావం చేతనే. మళ్ళా ఎట్లా విడగొట్టాలి? మళ్ళా అదే అగ్ని ప్రభావం చేతనే విడగొట్టాలి. చూడండి. ఎంత స్పష్టంగా వుందో, సృష్టి నిర్ణయం. ఎక్కడైనా confusion వుందా? no confusion at all. ఏమీ ఎక్కడా ఏమీ ఇసుమంత, కను రెప్పపాటు, దర్భ పోచ అంతకూడా తేడా వుండదు. అలా స్పష్టంగా ఏర్పడి వుంటుంది. ఇదంతా. ఇదంతా చక్కగా మరణ కాలంలో ఆ కర్తకి చెబుతున్నాడు. చేయిస్తున్నాడు. మళ్ళా ఏం చేశాడు? ఈ నిప్పులే పట్టుకెళ్ళి అక్కడ కాష్టంలో వేయి, అని మళ్ళా దాంతోనే మొదలు పెట్టమన్నాడు. ఏమైందట ఇప్పుడు? చివరికి ఏం పోగొట్టావు? ఆకారాన్ని పోగొట్టావు. దేనితో ఆ అగ్నితోనే. అర్థమైందా అండి? ఆకార భేదం నశించిపోయింది. మళ్ళా ఏం చేశాడు? తెచ్చిన కుండలో నీళ్ళు పట్టుకురా ఇప్పుడు వెళ్ళి. కుండ తెచ్చావుగా ఇంటినుంచి. దాంటో ఏం చెయ్యాలి? నీళ్ళు పట్టుకురా. దానిచుట్టూ తిరుగు. ఏమిటి ఇప్పుడు, దేని చుట్టూ తిరగుతున్నావు? నీ ఆకారమే. నీ ఆకారము, ఆ ఆకారము ఒకటే అని తెలుసుకో! ఇప్పుడు అదేదో పోయింది అంటున్నావు కదా, పోయింది ఏం పోయింది? ఆకారము పోయింది. జీవుడు already వేరే దేహంలోకి చేరిపోయాడు. వున్న ఆకారము పోయింది అసలు. ఇది వదిలిపెట్టగానే వెంటనే చేరిపోతాడు. నిర్ణయం అయినాకే వదిలిపెడతాడు. అర్థమైందా అండీ!

అవతల నిర్ణయం అవ్వడమే మరణ వేదన. తదుపరి దేహ నిర్ణయమే మరణ వేదన. అయిపోతుందది. రెప్పపాటులో జరిగిపోవచ్చు, ఏళ్ళకి ఏళ్ళు పట్టొచ్చు. అది వేరే అంశం.

కాబట్టి అలాగ నిర్ణయం అయినాక, ఏం చేశావు? కాటికి వెళ్ళావు. మీరు ఎవరూ కాటికి వెళ్ళరు కాబట్టి, ఇవేమీ చూడరు కాబట్టి మళ్ళా చెబుతున్నా అందుకోసమని. అందరికి ఇంటి దగ్గరనుంచి సాగనంపడం అనే విషయంలో పెట్టారు. కానీ మా అబ్బాయినినూ, శ్రీమతిగారి నేను మా అమ్మగారు చనిపోయినప్పుడు తీసుకెళ్ళాను అక్కడికి. అంతా అక్కడ ఎట్లా జరుగుతుందో చూడాలి. చక్కగా చూస్తేగాని జ్ఞానం రాదు. అందుకు చెప్పేది మీకు. ఒకప్పుడు వుండేది, ఈనాటి కాలంలో మీరందరూ కూడాను, ఆచార సాంప్రదాయాలు దేహానుసారంగా పెట్టుకున్నారు కాబట్టి, ఇలా పెట్టుకున్నారు. ఒకప్పుడు ఈ పద్ధతులు ఏమీ లేవండి. (కొడుకును కూడా తీసుకుపోయినావా?) ఆ...! అయ్యో! నాతో పాటే, నన్ను మా నాయన తీసుకెళ్ళాడు. అట్లాగే నేను వాడిని పట్టుకెళ్ళాను. ఆ.. నాకు చిన్నప్పటినుంచి అన్నీ సర్వం తెలుసండి. మాకేం ఆ భేదమేమీ లేదు. అయ్యో! తల్లితండ్రి వున్నవాడు రాకూడదే. కుండ పట్టుకోకూడదే. చట్టి పట్టుకోకూడదే. ఈ భ్రాంతులేమీ లేవు. చిన్నప్పటినుంచి, నేను చిన్నప్పటినుంచి అన్ని మరణాలని స్వయంగా కళ్ళతో చూశాను. అలాగ ఎప్పుడైతే మనం చూస్తామో, సహజజ్ఞానం ఏర్పడుతుంది. ఓహో! ఏమున్నది ఇందులో, ఆకారము వచ్చింది, కొంతకాలము ప్రవర్తించింది, ఆకారము గతించింది. ఉన్నవాడు ఎప్పుడూ వున్నవాడే. జీవుడికి మరణం లేదు. ఎందుకని? ఇంకో దేహంలో చేరిపోయాడు. అంతరాత్మ అంటావా? దానికసలు ఎప్పుడూ మరణం లేదు. ఎప్పుడూ సాక్షి స్వరూపం. పరమాత్ముడు అంటావా? అది సర్వవ్యాపకం. ఏమి వచ్చిందటా ఇప్పుడు? కుండ, ముంత, చట్టి. అంతేకదా! ఈ ఆకార భేదమే కదా! ప్రవర్తిస్తున్నది. మరి ఇందులో నిత్యమేది? అనిత్యమేది? ఒక్కసారి విచారణ చెయ్యి. ఈ ఆకార భేదము ఇప్పటి వరకూ నిత్యము అని ఆశ్రయించావు. ఈ ఆకారభేదము సత్యమేనా? ఒక్కసారి విచారణ చెయ్యి. దీనికేగా ఈ అలంకారాలన్నీ, అంతేనా అండీ! ఆ కుండకే రంగులు అద్దితివి, ఆ కుండకే డిజైన్లు వేస్తివి, ఆ కుండకే అన్నీ చేస్తివి, ఓ అద్భుతం అంటివి. తగలేసిన రోజున? కుండ పగలేశావా? దేనిని పగలేశావు? అర్థమైందా అండీ! అందుకని ఏం చెబుతున్నాడు? కుండకి చక్కగా చిల్లులు కొట్టాడు. నీళ్ళు పడిపోతూ వుంటాయి. అలా నీ ఆయుర్దాయం క్షీణించిపోతోంది నాయనా! నీరే ప్రాణాధారం అంటున్నావు కదా! నీ ఆయుర్దాయం ఎలా క్షీణించి పోయింది? ఇదుగో ఈ

కుండ చిల్లుల్లోంచి నీళ్ళు ఎట్లా పడిపోతోందో, అలా నీ ఆయుర్దాయం క్షీణించిపోతోంది నాయనా!

ఇరువదొకవెయ్యి ఆరు నూరులు జరుగు హంసలు, తరుగునాయువు హరిహరాదులువచ్చినా ఆగదీతనువు. అనే సూత్రాన్ని స్పష్టంగా బోధిస్తున్నాడు. కర్తకి. కర్తకి చెబుతున్నాడు ఇదంతా. ఏం చెప్పాడు ఇప్పుడు? అంతా కారిపోయింది. తగలేసేయినాయనా, వెనక్కితిరిగి చూడకుండా తగలేసేయి నాయనా! ఎందుకనిట? వెనక్కి తిరిగి చూస్తే, నీకు మళ్ళా తగలేసే కుండమీద కూడా భ్రాంతి కలుగుతుందని. అర్థమైందా అండీ! తిరిగి చూడకు. అందుకే మీరు మేలుకొలుపులో చూడండి. తిరిగి చూడకు, వెనక్కి తిరిగి చూడకుండా, ఓసారి మళ్ళా వెనక్కి తిరిగి చూస్తే, అమ్మో! నా ఆకారం అంటావు. అది పనికిరాదు నాయనా! ఎప్పుడూ ముందుకే ప్రయాణం నీది. పరిణామం ఎప్పుడూ జ్ఞానంలోకే. మళ్ళా అజ్ఞానంలోకి తిరిగి చూడమాకు. అయ్యో! పూర్వం నాకు చేతకాలేదే అనే బలహీన క్షణాలను స్ఫురణలోకి తెచ్చుకోమాకండి. నీది కాదు బలం. నాది బలం. పరమాత్మది బలం. ఆధారం, పరమాత్మను ఆధారంగా చేసుకో! అప్పుడు ఏమౌతావు? నీ బలహీన క్షణాలను మరచిపోతావు. నీ బలహీన క్షణాలను అధిగమించేస్తావు. నిన్ను గుర్తుపెట్టుకున్నావా? మళ్ళా జారిపడిపోతావు. అందుకని నీ పూర్వజ్ఞాపకాలలో గతంలోవున్నటువంటి బలహీనమైనటు వంటి అంశాలని గుర్తుకు తెచ్చుకోమాకు. ఇప్పుడు ఎవరి ఆధారంతో వున్నావు? నూతనమైన జీవితాన్ని ప్రారంభించావు. ఆత్మానుసార జీవితాన్ని జీవిస్తున్నావు. పరమాత్మను ఆధారంగా పెట్టుకుని జీవించు. ఎంత స్వేచ్ఛ కలుగుతుందో నీకే తెలియదు. అసలు ఈ సృష్టిలో నిన్ను ఏదీ బంధించజాలదు. ఏదీ బంధిపజాలదు. శరీరం కాదు, ప్రాణం కాదు, మనసు కాదు, బుద్ధి కాదు, ఆత్మ కాదు ఏదీ నిన్ను బంధింపజాలదు. నీ అంత స్వేచ్ఛ ఈ సృష్టిలో ఎవరికీ లేనే లేదు. ఎందుకని? తన ఇష్టం వచ్చినట్లు జీవించగలడు. తనని ఏదీ అంటజాలదు. ఎందుకని? పరమాత్మ ఆధారం. దేనికీ భయపడడు. జననమరణముల ఝుడుపు తీరెను. కాబట్టి నిత్యానిత్యవస్తువివేకం బలంగా కలిగివున్నవాడి జీవితం ఎలా వుంటుందయ్యా? స్పష్టంగా బోధిస్తున్నాడు. నిత్యము అంటే ఎల్లప్పుడు, ఎల్లకాలము, శాశ్వతము, ఏ పరిణామము లేకుండా, మార్పులేకుండా, సనాతనమై, సచ్చిదానందమై

ఏదైతే వున్నదో, అది ఎప్పుడూ ఒక్కతీరుగానే వున్నది నాయనా! దాంట్లో ఏమార్పు లేదు నాయనా! మారేదేమిటి? అంతా ఆకారభేదమే నాయనా! కాబట్టి ఆకారాన్ని ఆశ్రయించమాకు. ఆకారాన్ని ఆశ్రయించడం చేతనే, నీకంతా చికాకులు చిక్కులు వచ్చినాయి. అందువలన ఏమైంది? జీవుడివైపోయినావు? లేకపోతే నీవు ఎల్లప్పుడూ ఆత్మస్వరూపుడవే. నీవు ఎప్పుడూ పరమాత్మస్వరూపుడవే. మధ్యలో ఏం తెచ్చుకున్నావు? ఆకార భ్రాంతిని తెచ్చుకున్నావు. ఈ ఆకారభ్రాంతి ఎట్లా ఏర్పడింది? ఇదిగో ఇట్లా ఏర్పడింది. కాబట్టి జీవించేటప్పుడు ఈ సత్యాన్ని మరువమాకు. ఒక్కసారి తెలుసుకో! విచారణ చేయి. విచారణ చేసి, ఏం మేరకు చెయ్యాలో తెలుసుకో! మొట్టమొదట. నిర్ణయం చేయకుండా ఆచరించమాకు. ఇప్పటి వరకూ ఏం చేశావు? ఆచరించి ఫలితం వచ్చినాక, నిర్ణయం చేయడం మొదలు పెట్టావు. ఇప్పుడు ఏమి చేయాలి? ముందు విచారణ చేయి. ముందు విచారణ చేయి. ముందు విచారణ చేయాలి. విచారణ చేసి, నిత్యానిత్యవస్తు వివేకాన్ని వుపయోగించి, విచారణ చేసి అప్పుడు ఏం చెయ్యాలట? నిర్ణయం చేయాలి.

నిర్ణయం చేసేటప్పుడు ఏం కావాలయ్యా? నిన్న చెప్పినటువంటి ఇహాముత్రార్థ ఫలభోగవిరాగము కావాలి నాయనా! వట్టి నిత్యానిత్య వస్తువివేకము విచారణ చేసినంత మాత్రాన నిర్ణయం చేస్తావా? చెయ్యలేవుగా. ఎందుకని? పూర్వ అభ్యాసబలం వుంటుంది. పూర్వ అభ్యాస బలం ఏం చేస్తుంది? ఆ... చెప్పావులే, చాలా కాలం నుంచి చేస్తూనే వున్నావుగా. ఇదే చెయ్యి అంటుంది. అర్థమైందా అండీ! ఎంత పాఠం చెప్పినా గానీ, లోపల వున్నది ఏం చెబుతుంది? ఇప్పుడు కొత్తగా పాఠం చెబుతున్నావు, ఇంతకాలం నుంచి ఏం చేశావు నువ్వు? అట్లాగే చెయ్యి అంటుంది. ఇన్నాళ్ళు జరగలేదా? ఇప్పుడేమి కొంపమునిగింది నీకు? నువ్వు కొత్తపాఠం చెబితే నేను వింటానా? అంటుందది. అంటే అప్పుడు ఏం చేయాలట? ఇహాముత్రార్థ ఫలభోగవిరాగమనేటటువంటి సాధన చతుష్టయ సంపత్తిలో రెండవదానిని ఉపయోగించు. నీకు బుద్ధి వుందా, ఇప్పటి వరకూ ఫలభోగాన్ని అనుభవించే కదా ఇంతదూరము వచ్చావు. నువ్వు మళ్ళా చేయమనేది ఏమిటి? ఆ ఫలభోగమే కదా ! ఈ ఫలభోగం అయినాక మళ్ళా నేను విచారణ చేస్తే ఏమిటి ప్రయోజనము? నీకు బుద్ధి వుందా? కాబట్టి ఇదంతా ఇహం కదా! మారిపోయేది కదా!

సనాతనం కాదు కదా! శాశ్వతం కాదు కదా! పరిణామ పాఠం రావడం లేదు కదా! మళ్ళా నన్ను తీసుకెళ్ళి అదే పాత భ్రాంతిలో, ఊబిలో పడేస్తున్నావు. ఎందుకు ఇలా చేస్తున్నావు? నీకు బుద్ధి వుందా, ఇహాముత్రఫలభోగ విరాగము, నాకు వైరాగ్యము లేకుండా చేసింది నువ్వే కదా! అని దానిని హెచ్చరించాలట. రెండవది ఏమిటండి? హెచ్చరించాలి. మొదటిది ఏమిటి? విచారణ. నిత్యానిత్యవస్తు వివేకమనే విచారణ. రెండవది ఏమిటి? ఇహాముత్రఫలభోగవిచారమని హెచ్చరించడం అన్నమాట. హెచ్చరిస్తే ఏమైందట ఇప్పుడు అది? కాసేపు దాని వేగం తగ్గింది. నెమ్మదించిందన్నమాట. సరే! ఏమిటి ఇప్పుడు చెప్పు, అసలు విషయం ఏమిటి? అంటే, అప్పుడు మూడవది అవసరమైంది. మూడవది ఏమిటి? శమాది షట్క సంపత్తి.

శమాదిషట్కసంపత్తి అంటే, షట్క అంటే ఆరు. అంటే ఆరు వుంటాయన్న మాట ఇవి. ఏమండీ! మొత్తం నాలుగే అని చెప్పారు కదా! నాలుగే అని చెప్పినా మూడవది అయినటువంటి ఇది చాలా ప్రధానమైనటువంటిదన్నమాట. శమాది షట్క సంపత్తి. ఏమిటి? శమము, దమము, ఉపరతి, తితీక్ష, శ్రద్ధ, సమాధానము. ఈ ఆరు లక్షణాలని కలిపితే, శమాది షట్కసంపత్తి అవుతుందన్నమాట. ఈ ఆరు లక్షణాలు ఎవడైతే కలిగివుంటాడో, వాడు తప్పనిసరిగా ఆత్మ స్వరూపుడే అయ్యివుంటాడు ఇక. వాడికి ఏ పరిస్థితులలో కూడా జీవుడయ్యే అవకాశం లేదు. ఆకార భ్రాంతికి లోనవ్వడన్నమాట. అంటే ఏమిటి? కేవలం నిత్యానిత్య వస్తువివేకం మాత్రమే విచారణ చేసినంతమాత్రాన నీకు నిర్ణయం మార్చుకోవడానికి అవకాశం లేదు. ఎందుకని? కొత్తపాఠం అది. పూర్వ అభ్యాసబలం కదా! కల్పశతములనుంచి నీవు ఏం చేస్తున్నావు? ఈ పాత పద్ధతిలోనే వున్నావు. ఈ పాత పద్ధతి అంతా ఒక్కసారి కొత్త పాఠం చెబితే పోతుందా? పోదు కదా! ఏమంటుంది? అలాగే చెయ్యి అంటుంది. దానిని నిరోధించాలి, మార్పు చెయ్యాలి అంటే ఏం కావాలట? ఇహాముత్ర ఫలభోగ విరాగము కావాలట. ఆ వైరాగ్యము కావాలట. ఆ వైరాగ్య ప్రభావం చేత, దానిని హెచ్చరించి నిలబెట్టగలిగావు, దాని వేగం తగ్గింది. మనకు ఏం కావాలట ఇప్పుడు? రెండవది చాలా ఇంపార్టెంటు అండి. వైరాగ్యము లేదు మనదగ్గర. అంతా అనురాగమే వుంది. ఆ అనురాగ ప్రభావం చేత ఏమౌతున్నావు? మళ్ళా దాంట్లోకే చేరుతున్నావు. అనురాగం పోవాలి, వైరాగ్యం కావాలి. వస్తే ఏమౌతుందయ్యా?

ఇప్పుడు ఈ శమాది షట్కసంపత్తి మూడవ సంపదని సంపాదించే అర్హత వచ్చింది నీకు. ఈ మూడవ సంపదని అందరూ కూడా ఏం చేస్తారంటే, ఈ మూడవ సంపదని ముందే ప్రయత్నం చేస్తారండి. అంటే శమము, దమము, ఉపరతి, తితీక్ష, శ్రద్ధ, సమాధానములు. ఈ ఆరు లక్షణాలని ప్రతిరోజు మీరు భక్తిలో కూడా చేసేవి ఇవే. కానీ అవి నీకు ఎందుకు ఉపయోగపడలేదయ్యా అంటే, ముందు రెండు లక్షణాలు లేవు.

శమము అంటే ఏమిటి? శమము అంటే అంతరేంద్రియ నిగ్రహము. ఒకే వాక్యము అండీ! శమము అంటే అంతరేంద్రియ నిగ్రహము. అంతరేంద్రియాలు అంటే ఏమిటి? ప్రాణము, మనస్సు, బుద్ధి వీటిలో ఏమున్నాయి? అంతరేంద్రియాలు ఇవన్నీ కదా! వీటిలో అంతరేంద్రియాలని ప్రత్యేకంగా చెప్పేవి ఏమిటయ్యా అంటే, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, జ్ఞాత. అంతరేంద్రియాలు అంటే అర్థం ఏమిటండి? మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, జ్ఞాత. జ్ఞాత కలిస్తేనే అంతరేంద్రియాలు అవుతాయి. జ్ఞాతను తీసేశామనుకోండి, జ్ఞాత అంటే తెలుసుకునేవాడు, వేరే ఏమీ లేదు. జ్ఞాత అంటే ఏమిటి? తెలుసుకునేవాడు. ఎప్పుడూ గమనించేవాడు, ఆ తెలసుకునేవాడిని, గమనించేవాడిని కలిపితే అవి అంతరీంద్రియాలు అయినాయి. వాటిని వేరు చేశామనుకోండి, ఇవి పనిముట్లు అయినాయి. కరణములు అయినాయి. నీ అంతఃకరణము అంటే ఏమిటి? మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము వరకే మాట్లాడితే అంతఃకరణము. నాలుగే అవి. అంతరింద్రియము వాటికి తెలివి ఎక్కడినుంచి వచ్చింది? శక్తి ఎక్కడినుంచి వచ్చింది? ఆ జ్ఞాత కలిస్తే వచ్చింది వీటికి శక్తి. మనసుకి స్వయంగా శక్తి లేదు. ఈ జ్ఞాతయొక్క శక్తి మనసులో పనిచేస్తే మనసు ఆలోచించగలుగుతుంది. ఆ జ్ఞాతయొక్క శక్తి బుద్ధిలో పనిచేస్తే, బుద్ధి జ్ఞాపకాలను అందించ గలుగుతుంది. ఆ జ్ఞాతయొక్క శక్తి, చిత్తంలో పనిచేస్తే, ప్రియం మోదం ప్రమోదాలు అనే వృత్తులను అందిస్తుంది. ఆ జ్ఞాత యొక్క శక్తి అహంకారంలో పనిచేస్తే నేను నేను అంటోంది. కాబట్టి ఈ నాలిగిటికి స్వయంగా ఏమీ శక్తి లేదు. నీ ఓటు. నీ అనుమతి. ఆ జ్ఞాతే నువ్వు. ఆ జ్ఞాత వాడుకూడా నీకు బంధమే అయ్యివున్నాడు. ఎందుకని? వాడుకూడా పరమాత్మ స్థితిలో వుండవలసినవాడిని కిందకి తెచ్చాడు. అర్థమైందా అండీ! ఎక్కడుండాలి అసలు నువ్వు? నీవు నేనే పరమాత్మను అనే స్థితిలో వుండాలి. కానీ ఏమయ్యావు? నాకు అంతరేంద్రియాలు కావాలి అనే స్థితికి

వచ్చావు. పరిమితమయ్యావు అన్నమాట. అట్లాంటి పరిమితత్వానికి కారణమయ్యాడు కాబట్టి వాటిల్లో కూడా కొంచెం దోషముంది. కానీ వాడి కంటే మిగిలినవాటిలో ఇంకా ఎక్కువ దోషముంది. కాబట్టి ఏం చెయ్యాలట ఇప్పుడు? శమము అంటే అంతరేంద్రియ నిగ్రహము. దమము అంటే, బాహ్యేంద్రియ నిగ్రహము. సూటిగా ఒకటే వాక్యమండి. బాహ్యేంద్రియాలు ఏమిటి? కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు. అంతే కదా! ప్రాణం కూడా బాహ్యేంద్రియాలే. ఎందుకని? మనకు తెలుస్తోందిగా బయటికి. తెలుస్తోందా? తెలియడం లేదా? కాబట్టి పంచప్రాణాలు, పంచప్రాణాలు అంటే ఏమిటి? ప్రాణ, అపాన, సమాన, వ్యాన, ఉదానములు ఇవన్నీ పంచప్రాణాలు. కర్మేంద్రియాలు, కర్మేంద్రియాలు ఏమిటి? వాక్, పాణి, పాద, పాయు, ఉపస్థలు. అర్థమైందా అండీ! వాక్ మాట్లాడడం, పాణి చేతులు, పాదములు, పాయువు, ఉపస్థలు విసర్జక అవయవాలు. ఈ ఐదూ కూడా కర్మేంద్రియాలు. జ్ఞానేంద్రియాలు ఏమిటి? చక్షు శ్రోత్ర జిహ్వ ఘ్రాణములు అంతే కదండీ! రసము అది వేరే. రెండు పనులు చేస్తోందిగా మరి అది. రుచిచూస్తున్నది, మాట్లాడుతున్నది కదా! అదీ సంగతి. కాబట్టి జ్ఞానేంద్రియాలు ఐదు. కర్మేంద్రియాలు ఐదు. పంచప్రాణాలు ఐదు. ఈ మూడు ఐదులు పదిహేనూ కూడా బాహ్యేంద్రియాలు. అర్థమైందా అండీ! ఇప్పుడు లోపల ఏమున్నాయి? అంతరేంద్రియాలున్నాయి. అంతేకదండీ! అంతరేంద్రియాలు ఏమిటి? మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, జ్ఞాత. ఇవి అంతరేంద్రియాలు. మరి ప్రాణం కూడా తెలుస్తుంది కదా మనకి? బయటకు తెలిసేవన్నీ బాహ్యామే. తెలియక పోతే అంతరము. అంతేకదా! కరెక్టుగా ఇప్పుడు మనం దేనిని పట్టలేకపోతున్నాము? మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారమును పట్టలేకపోతున్నాము కదా! కాబట్టి అవి అంతరేంద్రియాలు. లోపల పనిచేస్తూ వుంటాయి. బాహ్యానికి తెలిసేవన్నీ బాహ్యేంద్రియాలు. ప్రాణం బయటకు తెలుస్తుంది కదా! ఇక పోతే ఇవి కాక ఐదు విషయాలు వున్నాయా? లేవా? ఏమిటవి? శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు. అవి ఏమిటి? జ్ఞానేంద్రియాల యొక్క శక్తి. కళ్ళు చూస్తున్నాయి, చెవులు వింటున్నాయి, ముక్కు వాసనలు చూస్తూ వుంది ఐదు జ్ఞానేంద్రియాలు ఐదు పనులు చేస్తూ వున్నాయా? చర్మం స్పర్శ. అంతే కదండీ! ఈ ఐదు జ్ఞానేంద్రియాల యొక్క శక్తులు, బాహ్యమా అంతరమా? ఇప్పుడు? బాహ్యమే కదా! కాబట్టి బాహ్యేంద్రియ

నిగ్రహము అంటే, ఇవి కూడా అందులోకి వస్తాయి కదా! కాబట్టి ఇరవై బయట వున్నాయి. ఐదు లోపల వున్నాయి. అంతేనా కాదా? ఇరవై బయట వున్నాయి. ఐదేమో లోపల వున్నాయి. కాబట్టి శమము అంటే అంతరేంద్రియ నిగ్రహము. దమము అంటే బాహ్యేంద్రియ నిగ్రహము. కాబట్టి ఇరవయ్యేమో బయట వున్నాయి. ఐదేమో లోపల వున్నాయి. ఇంతేనయ్యా నువ్వు. నీ గురించి చెప్పవయ్యా అంటే ఈ ఇరవయ్యే. నిన్ను విభజించి చూస్తే, ఇంతకు మించి ఏం కనబడుతున్నాయి చెప్పండి? ఎవరైనా సరే, అది జీవుడనండి, ఆకారమనండి, మరొకటి అనండి, ఏ పేరు అయినా పెట్టు దానికి. ఇవి ఇరవై అయిదేగా. ఏమన్నా వున్నాయా? ఈ ఇరవై అయిదు కాక. ఏ ఎవ్వరినైనా తీసుకోండి ఈ సృష్టి మొత్తం మీద ఏ జీవి అయినా తీసుకోండి. ఏ మనిషినైనా తీసుకోండి. ఈ ఇరవై అయిదు కాక ఏమైనా వున్నాయా? నీ జీవితం అంతా ఏమిటి? ఈ ఇరవై అయిదే. ఈ ఇరవై అయిదు కాక ఇంకొకటి ఏమన్నా వుందా?

నువ్వు ఎన్ని ప్రత్యేకతలు అన్నా చెప్పండి. ఆ ప్రత్యేకతలన్నీ ఈ 25లో ఒకదానికి చెందినదేనా? ఆహ్! బాగా పాడుతారండి. వాగీంద్రియము. కర్మేంద్రియమేగా. అథవా కాదు, శబ్దం విషయం. విషయం అదే బాహ్యమేగా. నువ్వు బాహ్యం కానిది ఏదో ఒకటి చెప్పు. కళలండి మనసులో, బుద్ధిలో సంగీత జ్ఞానము వున్నదండి. అదీ అంతరేంద్రయము. మరి నేను ఎవరిని? ఈ 25కి సాక్షిని కదా! నేను ఈ 25లో వాడిని కాదు కదా! నేను ఆత్మస్వరూపుడిని, నేను ఈ 25ని కాదు. ఈ ఇరవై అయిదింటిని చూస్తున్నవాడిని. గమనిస్తున్నవాడిని. నాకు ఇందులో ఏమీ ఏమి లేదు? మనందరికీ ఏముంది ఇందులో? సంగత్వ దోషం వుంది. ఇందాక చెప్పింది ఇదే. దోషమంటే ఏమిటి ఆ దోషమంటే సంగత్వ దోషం అన్నారు. సంగత్వము అంటే ఏమిటి? కలిసిపోవడం. ఈ 25లో ఏదో ఒకదానితో కలిసిపోతూ వుంటావండి, ఎప్పుడూ కూడా. కలిసిపోకుండా వుండవు. నువ్వు ఏ ఆలోచన చేసినా, ఆలోచన ప్రారంభం అవ్వగానే, ఏదో ఒకదాంట్లో కలుస్తావు. ఒకదానితోనే కలుస్తావా? విషయం రాదూ వెంటనే? ఒక ఆలోచన కలగగానే, అంతరేంద్రియం కావాలి, దానికి ఇంకేంకావాలి? విషయం కావాలి. విషయం రాగానే అదేం అడిగింది? ఆలోచన విషయం వచ్చేస్తుందండి. అంతరేంద్రియం వచ్చింది,

బాహ్యేంద్రియం వచ్చింది. ఇంకేం కావాలి ఇప్పుడు? అయితే జ్ఞానేంద్రియమో, లేకపోతే కర్మేంద్రియమో, సహాయం కావాలి దానికి. కావాలా వద్దా? జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాల సహాయం అడిగింది వెంటనే. ఎందుకని? అది అనుభవించాలి కాబట్టి. ప్రియం నుంచి మోదానికి వచ్చింది. మోదానికి రాగానే ఏం కావాలి ఇప్పుడు? ఇంద్రియాలు కావాలి. బాహ్యేంద్రియాలు, కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాల సహకారం కావాలి. అడగంగానే ఏమి అడిగింది? నన్ను అడిగితే నా దగ్గర ఎలా వుంది? నీకూ నాకూ మధ్య వారధి ఏది? ఆ మనసుకీనూ, ఈ బాహ్యేంద్రియాలకి మధ్య వారధి ఒకటి కావాలి కదా! అది ఎవరు? ప్రాణం. ప్రాణ శక్తి పనిచేసినంత సేపే, ఆ మనసు ఈ ఇంద్రియాలమీద ప్రభావం చూపెట్ట గలుగుతుంది. ప్రాణ శక్తి పనిచేయక పోతే, మనసు ఇంద్రియాలు, అంతేరేంద్రియాలు, బాహ్యేంద్రియాలు వేరు అయిపోయినాయి. అర్థమైందా అండీ!

ఇప్పుడు శవానికి ఏమి వున్నాయి? బాహ్యేంద్రియాలు వున్నాయి. జ్ఞానేంద్రియాలు అక్కడే వున్నాయా? వున్నాయి. కర్మేంద్రియాలు అక్కడే వున్నాయా? వున్నాయి. ఏం లేదు? రెండు ఎగిరి పోయినాయి, బాహ్యంలో కూడా. విషయాలు పోయినాయి. శబ్ద స్పర్శ రూప రస గంధాలను గ్రహించే శక్తి లేదు. పంచ ప్రాణాలు లేవు. అర్థమైందా అండీ! రెండు ఐదులు పది మాత్రమే అక్కడ వున్నాయి. బాహ్యేంద్రియాలలో పది పోయినాయి. ఈ బాహ్యేంద్రియాలలో వున్న, ఈ పంచప్రాణాలు, విషయాలు ఎవరి ప్రభావం వలన పనిచేస్తున్నాయి? అంతరేంద్రియ ప్రభావాల పనిచేస్తున్నాయి. ఇప్పుడు అంతరేంద్రియాలు అనేటటువంటి జీవుడు ఏమయ్యాడు? తప్పుకున్నాడు. ఆ జ్ఞాత అనే జీవుడు ఏమయ్యాడు? తప్పుకున్నాడు. తప్పుకోగా ఏమైపోయింది? ఈ బాహ్యేంద్రియాలలో వున్న రెండూ వేరైపోయినాయి. ఏం మిగిలిపోయినాయి? రెండు ఐదులు పది మిగిలిపోయినాయి. కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు మిగిలిపోయినాయి. ఇప్పుడు శవానికి ఏమున్నాయి? కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు వున్నాయి. మనకు ఏమి వున్నాయి? కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు వున్నాయి. అంతరేంద్రియాలు వున్నాయి. ఈ అంతరేంద్రియాలు, కర్మేంద్రియ జ్ఞానేంద్రియాలను ఉపయోగించాలంటే ఏం కావాలి ఇప్పుడు? పంచ ప్రాణాలు కావాలి. పంచ విషయాలు కావాలి. పంచ ప్రాణాలు, పంచ విషయాలు. ఈ రెండిటి యొక్క సంఘర్షణలో పుడుతున్నాయన్నమాట

ఈ పంచ విషయాలు. శబ్ద స్పర్శ రూప రస గంధాలు ఎక్కడ పుడుతున్నాయి? ఆ అంతరేంద్రియాలకి, ఈ కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలకి మధ్య ఒక ఘర్షణ, ఒక రాపిడి అందులో పుడుతున్నాయి ఇవి. ఆ పంచ విషయాలు కూడా. లేకపోతే పుడతాయా? ఈ చెవులు వింటున్నాయండీ! ఈ వినగలిగే శక్తి ఎక్కడిది? మనసులోది. మనసే చెవి అయ్యింది. మనసే కన్ను అయ్యింది. మనసే అన్నీ, అన్ని ఇంద్రియాల రూపాలు ఎందులో వున్నాయి? మనసులో వున్నాయి. ఆ మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము జ్ఞాతలో వున్నాయి. అసలు గట్టిగా మాట్లాడితే మనసులో వున్నాయా? జ్ఞాతలో వున్నాయా? జ్ఞాతలో వున్నాయి. మనసులో లేవు. ఆ జ్ఞాత అనే జీవుడిలో వుండబట్టి, ఈ 24లోకి వచ్చినాయి అవి. (కానీ నీకీ పని మనసుకి చేయబుద్ధి కావడం లేదు) అంటున్నావు. ఎందుకని? బాహ్యమే సత్యంగా వున్నావు కాబట్టి. జ్ఞాతదాకా విషయం తెలియదుగా అప్పుడు. ఎంతసేపు జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు వరకే వున్నావు కాబట్టి విచారణలో, ఆకార భేదాన్ని పాటిస్తున్నావు కాబట్టి. లక్షణాన్ని ఆశ్రయించలేదు కాబట్టి, అప్పుడు ఎలా వున్నావు? మనసు మనసు మనసు అంటున్నావు. కానీ మనసు, బుద్ధి జడమయ్యా బాబు. ఈ ఇంద్రియాలు ఎట్లా జడమో, అవి కూడా జడమే. ఎందుకని? ఆ జ్ఞాత పనిచేయడం లేదు కాబట్టి. ఆ జ్ఞాత ఇందులో పనిచేస్తేనే, దాని తెలివితేటలు ఏమైనా సరే. ఆ జ్ఞాత కనుక మనసులో పనిచేయక పోతే, మనసు కూడా ఈ వస్తువు లాంటిదే. నువ్వు ఉపయోగిస్తేనే ఆ వస్తువు వుపయోగపడుతుంది. అలాగే జ్ఞాత ఉపయోగిస్తున్నాడు మనసుని, బుద్ధిని, చిత్తాన్ని, అహంకారాన్ని. తన శక్తిని అందులో ప్రవేశపెడుతున్నాడు. ఆ ప్రవేశపెట్టగానే వాటికి చైతన్యం వస్తున్నది. లేకపోతే రావడం లేదు. మరి గాఢనిద్రావస్థలో ఎవరున్నారయ్యా? జ్ఞాత ఒక్కడే వున్నాడు. మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము కూడా పనిచేయడం లేదు కదా! గాఢ నిద్రావస్థలో. లేవా మరి అవి? వున్నాయి. ఎలా వున్నాయి? పనిముట్లవలె వున్నాయి. ఆ జ్ఞాత మెలకువలోకి దిగిరావడానికి, ఎందులోకి వచ్చాడు? మొట్టమొదట. అంతరేంద్రియాలలోకి దిగాడు. తన అంతఃకరణంలోనికి దిగాడు. దిగిన తరువాత ఏం చేశాడు? ఆ అంతఃకరణంలో ఏమున్నాయి? వాసనా బలం, సంస్కార బలం వున్నాయి. గుణబలం వుంది. వాటితోటి ప్రేరణ పొందాడు. ప్రేరణ పొంది ఏమడిగాడు ఇప్పుడు? నాకేంకావాలి ఇప్పుడు? విషయాలు కావాలి. విషయాలు

అనంగానే ఏమైంది? పంచప్రాణాలు కావాలి. విషయాలను ఆచరించాలి అంటే ఏం కావాలి? పంచ ప్రాణాలు కావాలి. పంచ ప్రాణాలు, విషయాలు రాగానే, కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు నిద్ర లేచినాయి. ఇదండీ బాబు. మీరు రోజూ నిద్రలోనుంచి మెలకువలోకి వచ్చే విధానము.

మళ్ళా ఇలాగే నిద్రలోకి పోతావు. ముందు ఏమి పడిపోతాయి? కర్మేంద్రియాలు పడిపోతాయి. తరువాత ఏం పడిపోతాయి? జ్ఞానేంద్రియాలు పడిపోతాయి. ఆ తరువాత ఏమి పడిపోతాయి? విషయాలు పడిపోతాయి. ఆ తరువాత ఏం పడిపోతుంది? ప్రాణం పడిపోతుంది. ఆ తరువాత ఏం పడిపోతుంది? అంతరేంద్రియాలు పడిపోతాయి. మరణం కూడా ఇంతే నాయనా! ముందు ఏం జరుగుతుంది? ముందు కర్మేంద్రియాలు పడిపోయినాయి. తరువాత ఏం పడిపోయినాయి? మాట్లాడటం లేదండి. ★ ధారకం లేదండి. జ్ఞానేంద్రియాలు పడిపోయినాయి. అంతేనా అండీ! ఇంకేం కనపడలేదండి? నాయనా మనం చెప్పేది వినపడడం లేదు, కదిపినా కానీ వున్నాడు కానీ, నువ్వు పిలిస్తే మాట్లాడటం లేదు. ఏం పోయింది ఇప్పుడు? విషయేంద్రియాలు పోయినాయి. ఇప్పుడేమి పోవాలిక next? next ఏం పోవాలి? ప్రాణం పోవాలి. అయిపోయింది నాయనా! అయిపోయింది నాయనా! అంటున్నావు గానీ, క్రింద పెట్టలేదు. నీ పంచప్రాణాలు ఒక్కొక్కటీ విరమిస్తున్నాయి. ఎక్కడికి విరమిస్తున్నాయి? అంతరేంద్రియాలలోకి విరమిస్తున్నాయి. ఇంకా సొంతం విరమించేసింది. అప్పుడేమైంది? జ్ఞాత దేహాన్ని వదిలేశాడు. ఇప్పుడు దేహాన్ని వదిలేసే జీవుడి పేరేమిటి? జ్ఞాత. ఇప్పటి వరకూ ఎలా చేశావు? ప్రాణ మనో బుద్ధులు అంటూ చెప్పుకొచ్చావు. అలాకాదు విధానంగా చెబుతున్నది. ఇది సరైన నిర్ణయం అన్నమాట. జ్ఞాత అనే జీవుడు, శరీరాన్ని విడిచిపెట్టేశాడు. ఎవరి నిర్ణయం మేరకు? ఆత్మ నిర్ణయం మేరకు. అంతరాత్మ, కూటస్థుడు ఎవరైతే మార్పు చెందకుండా వున్నాడో, ఆ కూటస్థుని నిర్ణయం మేరకు, ఈ జ్ఞాత ఏం చేశాడు? వదిలేశాడు. ఎందుకని? ఈ జ్ఞాతకు స్వయంగా శక్తి లేదు. ఈ జీవుడికి స్వయంగా శక్తిలేదు. వాడి శక్తి, ఆ పరమాత్మశక్తే ఇందులో పనిచేస్తోంది. ఎందుకని? సర్వ వ్యాపకంగా ఎవరున్నారు? పరమాత్మ వున్నాడు. ఆత్మస్వరూపం వున్నది. దానిలో వున్న శక్తే, దానిలో వున్న చైతన్యమే,

ఆ పరమాత్మ సత్తాయే ఈ జ్ఞాతలో పనిచేస్తుంది. అంతే కానీ, జ్ఞాతకు స్వయంగా శక్తి లేదు. కాబట్టి ఈ జ్ఞాత స్వయంగా శక్తి లేకపోయినా కూడా, ఈ ఐదైదులు 25 ని నడుపుతున్నాడా? లేదా? కాబట్టి నీ ఇంద్రియాలకు రాజు ఎవరు? జ్ఞాత. నీ ఇంద్రియాలకు రాజు ఎవరు? జ్ఞాత. ఇప్పటి వరకూ ఎవరు రాజు అంటున్నావు? మనసుని రాజు అంటున్నావు. అక్కడ పోయింది. అర్థమైందా? నీ ఇంద్రియాలకు రాజు ఎవరయ్యా అంటే? మనస్సు చెప్పినట్టు ఇంద్రియాలు వినవయ్యా బాబు. ఆ మనసే మరొకడి ఆధీనంలో వుంది. ఆ మనసే మరొకడి పనిముట్టుగా వుంది. అదే జడం. అర్థమైందా అండీ! మనసు పెద్ద జడం. దాంట్లో ఏమీ స్వయంగా పనిచేసే శక్తి లేదు. ఎందుకని? నేను అనుమతి ఇస్తేనే అది పనిచేస్తుంది. ఆ జ్ఞాత అనేవాడు అనుమతి ఇస్తేనే పనిచేస్తుంది. పనిచేస్తే గాఢనిద్రలో పనిచేయమను ఆ మనసుని. ఏం పనిచేయడంలేదే? అది స్వయంగా పనిచేయగలిగిన శక్తి సామర్థ్యం వున్నది అయితే, మనసుని గాఢ నిద్రలో పనిచేయమను. పనిచేయటం లేదు కదా! కాబట్టి దానికి కూడా పరిమితులు వున్నాయి కదా! అది స్వయం, స్థూల ఇంద్రియాలతో పోలిస్తే, దాంట్లో శక్తి ఎక్కువ వుంది. ఇప్పుడు కాళ్ళకి, చేతులకీనూ ప్రాణానికి పోల్చామండి, ప్రాణశక్తి ఎక్కువా? కాళ్ళల్లో, చేతుల్లో వుండే శక్తి ఎక్కువా? ప్రాణ శక్తే ఎక్కువ. ఎందుకని? ప్రాణం పోతోందిరా బాబూ అంటున్నావుగా. అర్థమైందా? ఏదైనా వస్తే ఏమౌతుంది? అనారోగ్యమే వచ్చిందండి. ఏమంటున్నావు? నా ప్రాణము పోతోందిరా బాబూ! చూడండి. అక్కడ కూడా స్పష్టంగా చెబుతున్నాడు. నా ప్రాణం పోతుంది అంటున్నావు గానీ, నేను పోతున్నాను అంటున్నావా? చూడండి. అంటే ప్రాణం కూడా నీ చేతిలో పనిముట్టే. ప్రాణం మీద ఏమీ ఆధారపడి లేవు. నీ మీద ఆధారపడి ప్రాణం వున్నది. ఈ సత్యాన్ని తెలుసుకోవాలండీ ఎప్పుడూ కూడా. జ్ఞాతమీద ఆధారపడే ఈ పంచప్రాణాలుగానీ, ఆ అంతరేంద్రియాలు గానీ, ఈ బాహ్యేంద్రియాలు గానీ, కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, విషయేంద్రియాలు (అన్నింటికీ సాక్షి అది ఒక్కడే) ఆ జ్ఞాత. సాక్షి కాదు, ఆ జ్ఞాత ఈ ఇరవై ఐదింటికి అధికారి. రాజు అన్నమాట. కానీ ఈ జ్ఞాత సాక్షిగా పనిచేస్తున్నాడా? పనిచేయడం లేదు. వచ్చిన చిక్కు వీడితో ఇది. ఈ జీవుడితో వచ్చిన చిక్కు ఇది. (చూడడం కాదు, వాడు చేస్తేనే ఇది)

వాడు చేస్తేనే ఇది కదా! మరి అసలు కర్త ఎవరు? జ్ఞాతే కర్త. అర్థమైందా అండీ! భోక్త ఎవరు? ఈ 24 ఇంద్రియాలు భోక్త. అర్థమైందా అండీ!

కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, విషయేంద్రియాలు, పంచప్రాణాలు, అంతరేంద్రియాలు ఈ 24 వున్నాయే, ఈ 24కు అధికారిగా వున్న జ్ఞాత ఏమో కర్త. ఈ 24 ఏమిటి? భోక్త. అంతేనా అండీ? తినేది ఎవరు? ఇంద్రియాలు. అనుభవం నిర్ణయించేది ఎవరు? అంతరేంద్రియాలు. అది ఎవరి ఆధీనంలో వుండి పనిచేస్తున్నాయి? జ్ఞాత అధీనములోవుండి పనిచేస్తున్నాయి. కాబట్టి కర్త ఎవరయ్యా? ఆ జ్ఞాత. భోక్త ఎవరయ్యా? ఈ 24. అర్థమైందా అండీ? ఇలాగ నిర్ణయం చెయ్యాలి మొట్టమొదట. దీన్నే ఏమన్నారు? పిండాండ పంచీకరణ. దీనిని ఏమన్నారండీ! పిండాండ పంచీకరణ. స్థూలంగా చెబుతున్నా మీకు. ఇంకా లోపలకి చెప్పకుండా కేవలం పిండాండ పంచీకరణ అంటే ఎట్లాగ? అంటే నిత్యానిత్యవస్తువివేకము ఎందుకు వుండాలయ్యా? ఇందులో ఈ 25లో నిత్యము ఏదీ? పరమాత్మ నిత్యము అసలు. ఆ పరమాత్మ సత్త మొట్టమొదట ఎవరిలో పనిచేస్తోంది? జ్ఞాతలో పనిచేస్తోంది. కాబట్టి పరమాత్మ యొక్క లక్షణం సరాసరి ఎవరిలో కనపడుతోంది నీకు పరమాత్మని ఆశ్రయించాలి అంటే? మొట్టమొదట ఆ జ్ఞాత తెలియాలయ్యా బాబూ నీకు. నేను అనే జ్ఞాతని కనుక నీవు గుర్తు పెట్టుకుంటే, వాడిలో వున్న లక్షణం ఏమిటి? ఈశ్వర లక్షణం వున్నది వాడిలో. ఆ ఈశ్వర లక్షణము వుంది కాబట్టి వీడు ఆ 24 మీద అధికారిగా వున్నాడు. ఆ ఈశ్వర లక్షణమే కనుక జ్ఞాతలో లేకపోతే, ఈ ఇరువది నాల్గింటినీ నడుపగలడా? పనిచేయించగలడా? పని చేయించలేడు. కానీ, జ్ఞాతను ఆశ్రయించకుండా, క్రింద వున్న ఇరువది నాల్గింటిలో ఆకార భేదాన్ని ఆశ్రయించడం చేత, జ్ఞాతకంటే దగ్గరగా ఒక మెట్టు క్రింద ఎవరున్నారు? అహంకారం. ఒక మెట్టు జ్ఞాతలోంచి క్రిందకు దిగగానే ఏం వచ్చిందండి? అహంకారం. అంటే ఆకార భేదం వచ్చేసి అందులో కలిసిపోయింది. నేను కాస్త ఏమైపోయాడు? నేను శరీరాన్ని అనేశాడు అంతే. ఒక్క మెట్టు దిగితే చాలు కిందకి. సాక్షిత్వంలోంచి ఒక్క మెట్టు ఆ లక్షణాన్ని, ఈశ్వర లక్షణాన్ని విడిచిపెట్టి, ఒక్క మెట్టు క్రిందకు దిగగానే ఏమయ్యాడు? నేను శరీరాన్ని అనేశాడు. అహంకారం వచ్చేసింది. కాబట్టి ఆ ఒక్క మెట్టూ దిగమాకయ్యా! ఆ మొదటి మొట్టు దిగకుండా వుండు. నువ్వు ఎక్కడున్నావు ఇప్పుడు? ఆఖరి మెట్టు దగ్గర

వున్నావు. 24వ దాని దగ్గర వున్నావు. అంతేనా కాదా? కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, మనసేంద్రియాలు, విషయేంద్రియాలు ఓ చిట్టచివరికి వచ్చేసింది సొంతం. అంతేనా కాదా? ఒక్కటి దగ్గర వుండవలసిన వాడు, ఎక్కడున్నాడు ఇప్పుడు? 24, 25వ దగ్గర వున్నాడు. సొంతం అడుగుమెట్టుకు వచ్చేశావు. ఇప్పుడు ఎలా వున్నావయ్యా? ఏం వరుసలో ఎక్కక్కర్లేదు. ఎందుకని? ఈ 24వది అయినా, ఆ 25వది అయినా, ఆ ఒక్కదాని ప్రభావమేనా కాదా? (అంతేగా మరి, జ్ఞాతదేగా) వాడు లేకపోతే మరి ఇదేం పనిచేసింది? ఒక్కసారి విచారణ చేసి చూడు. అంతేనా కాదా? ఓహో! అద్భుతం అండీ, చంద్రహారం. ఎవరికి అద్భుతం? (జ్ఞాతకి) ఎలాగా? వాడు సాక్షి కదా! వాడికి ఏ లక్షణం వుండి? ఈశ్వర లక్షణము వుంది. ఈశ్వరుడు సర్వ సాక్షి కదా! ఆయనకేమీ ఎవ్వరితో పనిలేదు కదా! ఏమయ్యాడు? ఒక మెట్టు దిగాడు ముందు. ఒక మెట్టు దిగగానే ఏమయ్యాడు? అహంకారం వచ్చేసింది. ఆకార భేదం తగిలింది దానికి. తగల గానే ఏమయ్యింది? చంద్రహారం పెడితే బాగుండు అనే జ్ఞానం బుద్ధిలో నిద్ర లేచింది. దాని మీద కాంక్ష వుందన్నమాట. ఆశ వున్నదన్నమాట. ఎప్పుడో, ఎక్కడో వాళ్ళు చంద్కహారాలు పెట్టుకోగా నువ్వు చూశావు. ఆ చూసిన అపేక్షను పొందాలనే ప్రియం లోపల వుంది. జ్ఞానంలో. ఆ బుద్ధిలో వుందన్న మాట. ఏమైంది? ఆ జ్ఞాపకం నిద్రలేచింది. చంద్రహారం పెట్టుకుంటే బాగుండూ అనేటటువంటి ప్రియం ప్రేరణ చేసింది. చేయగానే ఏమయ్యింది? చంద్రహారం ఎవరు పెట్టుకున్నారో వాడిని గుర్తించింది. లేకపోతే అసలు వాడు ఎట్లా కనపడ్డాడు నీకు? అది చంద్రహారమనీ, వాడు పెట్టుకున్నాడనీ, అది పెట్టుకుంటే బాగుంది అనీ, ఈ వివరణ అంతా ఎక్కడినుంచి వచ్చింది? ఇదీ మనస్సు. అంతే కదా! అహంకారం నుంచి ఇప్పుడు ఏమయ్యావు? మెల్లగా ఒక్కోమెట్టూ క్రిందకు దిగావు. చిత్తవృత్తిలోకి దిగేటప్పటికి, ప్రియం అయ్యింది. ఇంకో మెట్టు దిగావు. మనసు బుద్ధిలోకి దిగావు. మోదం అయ్యింది. ఇప్పుడు ఏం చేశావు? వాడెవడో అంతదూరం నుంచీ పోతున్నాడు కదా! నీకెందుకు గోల? వున్నావా? వుండలా. వాడి దగ్గరకి పోయి, ఏవండీ! ఈ చంద్రహారం ఎంతైంది? ప్రమోదంలోకి జారావు. ఎక్కడ కొన్నారు మీరు, ఎక్కడ చేయించారు? ఎంతైంది? ఓహో! కోటి రూపాయిలు అయ్యిందా? చాలా బాగుందండి. ఏమిటట ఇప్పుడు? దృశ్య జగత్తు. కన్నులోకి వచ్చేశావు సొంతం. కర్మేంద్రియంలోకి

వచ్చేశావు. దాంట్లో ఏముంది? దృశ్యం అనే విషయం వుంది. ఆ దృశ్య విషయంలోకి కూడా వచ్చేశావు. విషయేంద్రియంలోకి వచ్చేశావు. వీటికి సహకరిస్తున్నది ఏదీ? పంచప్రాణాలు. నీ ప్రాణం పనిచేస్తేనే కదా! నువ్వు అక్కడి దాకా పరుగెత్తింది. వాడిని విచారణ చేసింది. నీకెందుకండీ? వాడెక్కడో అండమాన్ నికోబార్ దీవులలో చేయించాడు చంద్రహారం నీకెందుకు? ఏమన్న ప్రయోజనముందా నీకేమైనా? ఆ విషయ సమాచారంతో నీకు ఏమన్నా ప్రయోజనం వుందా? (బంగారం మీద భ్రాంతి వుందిగా) ఆం.. అంటే మొట్టమొదట ఎక్కడుంది? నువ్వు ఒక మెట్టు కిందకు దిగావు. అహంకారంలోకి దిగి, శరీర భ్రాంతిని పొంది, ఇంకోమెట్టు దిగావు. ప్రియంలోకి దిగావు. చిత్త వృత్తిలోకి దిగావయ్యా. అర్థమైందా అండీ! శమము, దమము అని ఎందుకు చెప్పాడయ్యా అని అంటే, శమము అంటే ఏమిటి? ఇందాక చెప్పిన బాహ్యేంద్రియాలని నిగ్రహించాలి, దమము అంటే ఏమిటి? అంతరేంద్రియాలను నిగ్రహించాలి. శమము, దమము. శమము అంటే ఏమిటి? అంతరేంద్రియ నిగ్రహము. దమము అంటే బాహ్యేంద్రియ నిగ్రహము. (ఆ చంద్రహారానికి అంతరేంద్రియాలు నిగ్రహించాలి) అంతరేంద్రియాలు ముందు శమములోపే ఆచరించాలండీ! ఎప్పుడైనా సరే గుర్తుపెట్టుకోండి, ముందు శమాన్ని ఆచరించాలి గానీ, దమాన్ని ఆచరించకూడదు. మనం భక్తిలో ఎందుకు తప్పు చేశామయ్యా అంటే, ముందు దమాన్ని ఆచరించాము. ముందు ఏం చేశావు? బాహ్యేంద్రియాలను నిగ్రహించడం మొదలు పెట్టావు. ఎట్టా నిగ్రహించబడుతాయి? సాధ్యం కాదు కదా! నువ్వు అందరికీ ఏం చెబుతున్నావు? అది ఏముందిరా దాంట్లో? అంటావు. అది ఏముందిరా దాంట్లో అంటే, వాడు బాహ్యేంద్రియాలలోకి వచ్చేశాడు సొంతం. నిగ్రహించమంటున్నావు. ఎక్కడ నిగ్రహించాలి అసలు మొట్టమొదట? అంతరేంద్రియాలలో నిగ్రహించాలి నువ్వు. (అదే నేను చెప్పింది ఇప్పుడూ) అంతరేంద్రియాల ద్వారానే కదా చంద్రహారము వాళ్ళు వేసుకున్నారని, అటు వెళ్తున్నారని గుర్తించింది. (చేతులు, కాళ్ళు కాదు కదా గుర్తించింది.) వారి శరీర ఆకారాన్ని గుర్తించలేదు. వాడు ఏం ధరించాడో, దాని మీద వెళ్ళింది సరాసరి. దానికి కారణం ఏమిటంటే నీకు దాని మీద అపేక్ష వుందని. ఆ ప్రియం, ఆ లోపల వుంది. దాన్ని ఏమన్నారయ్యా? చిత్తవృత్తి. దానిని ఏమన్నారండీ? చిత్తవృత్తి. ఆ అపేక్షలు అన్నీ

చిత్తవృత్తుల రూపంలో వున్నాయి, అదే వాసనాబలం అంటే. గుర్తుపెట్టుకోండి. "**చిత్తంలో వుండేదంతా వాసనాబలం. బుద్ధిలో వుండేది అంతా సంస్కార బలం**". మనసులో ఏమీ వుండదు. ఉన్న ప్రమాదం అంతా చిత్తంలో, బుద్ధిలో, అహంకారంలో. ఆ మూడింటిలోనే. అహంకారంలోకి దిగంగానే నేను శరీరమనే భ్రాంతి కలిగింది. ఆ భ్రాంతి నుంచి ఇంకో మెట్టు దిగాడు, చిత్తంలోకి దిగగానే అన్ని అపేక్షలు, వాసనాబలంతో కూడినది అంతా నిద్ర లేచింది. ఆ వాసనా బలంలోనుంచి, సంస్కార బలం బలీయంగా మారింది. బుద్ధిలోకి వచ్చేటప్పటికి జ్ఞాపకాలన్నింటినీ సమీకరించింది, దానికి తగినవాటన్నింటినీ కూడాను. సమీకరించగానే ఏదో ఒక మార్గం ద్వారా ఇంద్రియాలలోకి రావాలి కదా! బాహ్యేంద్రియాలు, కర్మేంద్రియాలలోకి రావాలి కదా! రావడానికి ఉపయోగపడే ద్వారం మనస్సు. ఈ ద్వారం లాంటిది మనస్సు అంతే. ఆ మనస్సుకేమీ అంతకు మించి శక్తి లేదు. ఈ లోపల బలం, వాసనాబలం, సంస్కార బలం, బలీయం అవ్వగానే తలుపులు తెరుచుకున్నాయి. అర్థమైందా అండీ! అది దానంతట అదేం ఇవ్వలేదు. ఈ వాసనాబలం, సంస్కార బలం. చిత్తంలో, బుద్ధిలో బలం పెరిగిపోయింది. కావాలి. కావాలి. కావాలి. కావాలి. ఆ లోపల బలం పెరిగిపోయింది. పెరిగిపోయేటప్పటికి తలుపులు తెరుచుకున్నాయి. తెరుచుకుని వచ్చేసింది బాహ్యేంద్రియాలలోకి. రాగానే ఏమైంది? అది దానికి అనుగుణమైనటువంటి, ఇంద్రియం ఏ స్థితిలో వున్నా, టక్కుమని స్పందించింది అంతే. ఇక్కడ ఏదో, తీవ్రమైనటువంటి discussion లో వుంటాము. కానీ, తోటకూర బయట వినపడంగానే, ఏమైందండీ? (ఇది అటు పనిచేసింది.) ఇప్పుడు ఎక్కడ పనిచేస్తోంది? తెలివి ఎక్కడుండాలి అసలు ఇప్పుడు? సాక్షిత్వంలో నిలబడి వుండి, మనం విచారణ చేస్తున్నాం కదా! కానీ మధ్యలో తోటకూర ఎలా వచ్చింది? అంటే ముందే నిర్ణయం చేశావు. అట్లా కాదు, ముందే నిర్ణయం చేసి, దీంట్లోకి దిగావు, ఎట్లా దిగావు? ముందు ఒక నిర్ణయం చేశావు. 7.30-8గంటల వరకూ ఈయన వుంటారు, 8-8.30 నిమిషాల టైంలో తోటకూర వాడు వస్తాడు. తోటకూర వాడు వచ్చి వెళ్ళిపోతే నాకు ప్రమాదం వస్తుంది. అందుకనే అది కొనుక్కోవాలని ముందు నిర్ణయం చేసి ఇందులోకి దిగావు. ఏమైంది ఆ టైం వచ్చేటప్పటికి? ఆ శబ్దం వినపడగానే, నువ్వు ఎంత గొప్ప స్థితిలో వున్నా, సరాసరి రెప్పపాటులో ఎక్కడికి వచ్చావు? అమ్మో! తోటకూర సంగతి పట్టించుకో,

జ్ఞాత ఎక్కడికి పోతాడు? ఇక్కడే వుంటాడు ఎక్కడికీ పోడు వీడు. విచారణ ఎక్కడికీ పోదు అన్నావు. ముందు తోటకూర సంగతి పట్టించుకోమన్నావు. ఎందుకని? అంటే ఎంతసేపటిలో వచ్చింది కిందకి? రెప్పపాటులో వచ్చేస్తుంది. ఎలా రాగలిగాడయ్యా? అన్నీ అతని ఆధిపత్యంలో వున్నాయి కాబట్టి రాగలుగుతున్నాడు. ఆ జ్ఞాత ఆధిపత్యంలో ఈ 24 వున్నాయని చెప్పడం కోసమని ఈ ఉదాహరణ చెబుతున్నాను. నువ్వు అక్కడినుంచి ఇక్కడికి రావాలి అంటే, నిజానికి అయితే ఎంత టైం పట్టాలి అసలు లెక్కప్రకారమైతే? జ్ఞాత అహంకారంలోకి దిగాలి, అహంకారం చిత్తంలోకి దిగాలి. చిత్తం బుద్ధిలోకి దిగాలి. బుద్ధి మనసు ఓపెన్ చేయాలి. మనసు నుంచి బాహ్యేంద్రియాలలోకి రావాలి, బాహ్యేంద్రియాలు విషయాన్ని గుర్తించాలి. విషయం అప్పుడు నిర్ణయం చేయాలి, అప్పుడు దాని దగ్గరకి వెళ్ళాలి. (వాడు వెళ్ళిపోతాడు ఈలోపల) చూశారా? ఎక్కడికీ పోడు, ఎక్కడికి పోతాడు? వాడు కాకపోతే ఇంకొకడు. అని ఉపేక్షించగలగడమే. ఒకటి గుర్తుపెట్టుకోండి. ఈ ఉదాహరణ ఎందుకు చెబుతున్నానయ్యా అంటే, శమము, దమము. శమము, దమము మూడవది ఏమిటండీ? ఉపరతి, తితీక్ష. ఉపరతి, తితీక్ష.

ఈ ఉపరతి, తితీక్ష చాలా గొప్పవండి. ఎంత గొప్పవయ్యా అంటే, అంతరేంద్రియాలలో నిన్ను జ్ఞాత స్థానంలో నిలబెట్టగలిగేవి అంటూ ఏమైనా వున్నాయి అంటే, కిందకి పడిపోకుండా నిన్ను నిలబెట్ట గలిగే గొప్పసాధనలు ఏమిటయ్యా? అంటే, ఆ ఉపరతి, తితీక్ష. చాలా గొప్పవండి. ఎంతగొప్పవి అయ్యా అంటే, ప్రతిమానవుడూ కూడా, తాను ఈశ్వరుడను అని తెలుసుకోవాలంటే, ఈ రెండు సాధనలే చాలు. ఉపరతి, తితీక్ష. అందుకనే, శిష్యులు అందరికీ చెబుతారండీ! నాయనా! జీవితకాలమంతా మానవుడు ఈ ఉపరతి, తితీక్ష తెలుసుకున్న దగ్గర నుంచి, జీవిత కాలమంతా చేయదగినది ఏదైనా వున్నదంటే, ఈ ఉపరతి, తితీక్షే. (అంటే ఏంటి ఉపరతి?) చెబుతా, ఆఖరి శ్వాస వరకూ కూడా, ఆచరించదగినటువంటి, గొప్పసాధన ఏమిటయ్యా అంటే, ఈ ఉపరతి తితీక్ష. మహానుభావులు ఎవరైనా సరే, నీవు మహర్షి అని పిలవబడాలి అంటే, నీ యొక్క వ్యవహారంలో, ప్రతి చోట, ప్రతి ఆలోచనలో, ప్రతి చేతలో, మాటలో, నడకలో, నీ సర్వస్వం జీవనం అంతా కూడా ఈ ఉపరతి, తితీక్షా కనపడుతూ వుంటాయి. ఆ రెండూ

కాపాడితే చాలు నీవు మహర్షివే. అంతటి గొప్ప స్థితిని అందిస్తాయన్నమాట అవి. నీకు బ్రహ్మజ్ఞానాన్ని ప్రసాదించాలయ్యా అంటే, ఆ ఈశ్వరుని యొక్క జ్ఞానం రావాలి అంటే, ఆ పరమాత్మ సాక్షాత్కారం కావాలి అంటే, ఆత్మ సాక్షాత్కారం కావాలి అంటే, తప్పని సరిగా, 24 గంటలు, నిత్యము, ఇదే నిత్య పూజ అండి. అన్ని సాధనల కంటే ఉత్తమమైన సాధన ఏంటయ్యా అంటే, ఈ ఉపరతి, తితీక్షే. ఈ ఉపరతి,తితీక్ష లేక పోతే, ఆత్మజ్ఞానం అసాధ్యం. బ్రహ్మజ్ఞానం అసాధ్యం. ఈశ్వరీయ జ్ఞానం అసాధ్యం. ఆత్మసాక్షాత్కారం అసాధ్యం. ఆ పరమాత్మ సాక్షాత్కారం అసాధ్యం. ఏదైనా సరే, నువ్వు ఎన్నన్నా పెట్టుకో, అవన్నీ కూడా ఈ ఉపరతి తితీక్షలోనే ఇమిడి వున్నాయి. అంత గొప్పవన్నమాట ఇవి. వీటికంటే మించిన సాధన లేదు.

వీటికంటే మించినటువంటి ఆయుధం లేదు. దేనినైనా సరే జయించాలన్నా ఇవే, సాధించాలన్నా ఇవే. వీటిని మించిన సాధనలే లేవండి. మూడు గుణాలను అధిగమించాలన్నా, మూడు అవస్థలను అధిగమించాలన్నా, దేన్నైనా సరే, వాసనాబలాన్ని అధిగమించాలన్నా, నీవు జీవుడు కాకుండా ఆత్మ స్వరూపుడిగా జీవించాలన్నా, ఆత్మానుభవం పొందాలన్నా, పరమాత్మానుభవం పొందాలన్నాకూడా ఈ ఉపరతి, తితీక్షలను మించినటువంటి సాధనే లేదు. కాబట్టి వీటిని జీవితకాలం ఆచరించాలండి. ఒక రెప్పపాటు కూడా ఎడం ఇవ్వకుండా ఈ ఉపరతి, తితీక్షలలో వాడు ఆచరిస్తే వీడే సచ్ఛిష్యుడు అనబడతాడు. ఎవడైతే ఒక్కరెప్పపాటు కూడా, ఒక్క ఆలోచనలో కూడా ఈ ఉపరతి, తితీక్షలను ఎడబాయకుండా వుంటాడో, ఇదే గమనిస్తారండీ, నీవు సచ్ఛిష్యుడవు అవునా కాదా అని గమనించేది ఈ రెండింటి మీదే గమనిస్తారన్నమాట. ఉపరతి, తితీక్ష. ఉపరతి, తితీక్ష ఈ రెండు లక్షణాలు పరిపూర్ణంగా వుండాలన్నమాట. వట్టి పూర్ణంగా కాదు, పరిపూర్ణంగా వుండాలి. ఎక్కడా వడ్లమొన మోపినంత కూడా తేడా లేకుండా, ఉపరతి, తితీక్షలు ఎవరికైతే నిత్యజీవితంలో ఆచరణలో వుంటాయో, వాడికి ముక్తి సిద్ధము. ఒక్క క్షణము కూడా లేటు వుండదండి. ఈ రెండూ సాధించడమే లేట్. ఇవి రెండూ సాధించిన తరువాత ఒక్క క్షణము కూడా, అంతా '**అయ్య దయంతా అరక్షణమే**' – ఒకటి గుర్తుపెట్టుకోండి. ఈ వాక్యాన్ని. అయ్యా దయైతే అంతా అరక్షణమే. అయ్య దయ

దేనిమీద ఆధారపడి వుంటుందయ్యా? ఇదిగో ఈ రెండింటి మీదా ఆధారపడి వుంటుంది. ఉపరతి, తితీక్ష. వేదాంతంలో ఎన్నో విషయాలను చెబుతారండి. అది ఇది, ఇది అది అని విచారణగా ఎన్నో చెబుతారండి. ఇది ఇట్లా వుంది. అది అట్లా వుంది. అంతా ఏమిటంటే, నీ పూర్వం నువ్వు చేసిన అభ్యాసబలంలోంచి మార్పు చేయడం కోసం చెబుతాడన్నమాట ఇదంతాకూడా. కానీ నిజంగా ఆచరించేది, జీవితం మొత్తం నిజంగా ఆచరించేదంటూ ఏదైనా వుందంటే, అది ఉపరతి, తితీక్ష. కారణం ఏమంటాడంటే, నిత్యానిత్య వస్తు వివేకం ఎంతసేపు విచారణ చేస్తావు? అది ఎంతసేపు వుంటుంది? విచారణ చేసినంత సేపే వుంటుంది. తరువాత మళ్ళా, మళ్ళా మామూలే. మళ్ళా విచారణ మామూలే. అర్థమైందా అండీ! ఇహాముత్రార్థఫలభోగ విరాగము వైరాగ్యము ఎంతసేపు వుంటుంది? వుంటుంది. దాంట్లో బలం వుంటుందండి. తాత్కాలికంగా వున్నప్పుడు అలానే వుంటుంది. తీవ్రంగా వైరాగ్యం లభించినప్పుడు మొత్తం మారిపోతావు. ఆ తీవ్రవైరాగ్యం వచ్చినప్పుడు, ఆ తీవ్రవైరాగ్యం రావాలంటే ఏమి వుండాలి? ఉపరతి, తితీక్ష వుండాలి. నిత్యానిత్య వస్తువివేకం స్థిరంగా నువ్వు విచారణ చెయ్యాలి. ఎల్లప్పుడూ ఆ విచారణ చెయ్యాలి. ఏం కావాలి? ఆ ఉపరతి, తితీక్ష కావాలి. ఎల్లప్పుడు అంతరేంద్రియాలని, బాహ్యేంద్రియాలని నీ అధీనంలో వుంచుకోవాలి, నువ్వు జ్ఞాత స్థానంలో వుండాలయ్యా! ఎప్పుడూ కూడా. అది కదా ఇందాకడి నుంచి చెబుతున్నది. వుండాలంటే ఏం కావాలి? ఉపరతి తితీక్ష కావాలి.

ఇప్పటివరకూ చెప్పినవాటిని అన్నింటినీ సవ్యంగా చేయాలి అంటే కీలకం ఉపరతి, తితీక్ష. ఈ ఉపరతి, తితీక్ష లేకపోతే సాధకుడు ఎప్పటికీ కూడా ఈ స్థితిని అందజాలడు.

(ఇంతకీ ఉపరతి అంటే ఏమిటి?) ఉపరతి, తితీక్ష చెప్పాలంటే మళ్ళా ఒక క్లాసు పడుతుంది. అర్థమైందా అండీ? అది టైం పడుతుంది. అందుకని మీరు క్రమంగా, మీరేమీ కంగారు పడవద్దు, అందులో ఏమీ ప్రమాదము లేదు. క్రమంగా నేర్చుకోండి విద్యని. స్థిరంగా నేర్చుకోండి. ఎందుకంటానంటే, ఆచరణ సాధ్యమైనటువంటిదిగా మీరు నేర్చుకోవాలి. కేవలం పాఠంగా నేర్చుకుంటే వదిలిపోతుంది. దానివల్ల మీకు ప్రయోజనం వుండదు. అందుకని నిత్యానిత్య వస్తువివేకం అంటే ఏమిటి? నిత్యమేది, అనిత్యమేది? చాలా స్పష్టంగా తెలుసుకోవాలండి. ఎలా తెలుసుకోవాలయ్యా? ఐదు ఐదుల ఇరవై

ఐదు. ముందు దేనినైనా సరే ఐదు ఐదులు ఇరవైఐదుగా విడగొట్టాలండి. నిత్యమేదో అనిత్యమేదో తేల్చాలంటే ఏం చెయ్యాలండీ మొట్టమొదట? 1st దానిని 25గా విభజించు, దేంట్లోకి వస్తుందో విభజించు, ఆ 25లో దేంట్లోకి వచ్చింది? ఓహో! ఫలానా దాంట్లోకి వచ్చింది. నేను ఎవరిని ఇప్పుడు? నేను జ్ఞాతను. దేంట్లోకి వచ్చాను? ఇదిగో దీంట్లోకి వచ్చాను. దీంట్లోకి ఎలాగ వచ్చాను? ముందు అహంకారంలోకి దిగాను. అందువల్ల ఏమైంది? ఆకార భ్రాంతి కలిగింది. తరువాత ఏమైంది? ఆ వస్తువు మీద, ఆ పదార్థం మీద, ఆ సుఖం మీద అపేక్ష వున్నది కాబట్టి, చిత్తములోకి దిగాను. ప్రియం వచ్చింది. మళ్ళా ఇప్పుడు ఏమైంది? ఈ చిత్తంలోనుంచి ఏమి వచ్చాను? బుద్ధిలో వున్న జ్ఞాపకాలను పోగేశాను. పోగేస్తే ఏమైంది? అది అక్కడ దొరుకుతుంది, ఇది ఇక్కడ దొరుకుతుంది, అది అట్లా వుంది, ఇది ఇట్లా వుంది అనే జ్ఞానం అది అందించింది. అందించగా ఏమైంది? లోపల వున్న దేహవాసనో, లోకవాసనో, శాస్త్రవాసనో బలపడింది. ఈ జ్ఞాపకాలన్నీ పోగేసినాక ఏమైంది? ఆ లోపల వున్న వాసనాబలం, ప్రియం బలపడింది. ప్రియం బలపడేటప్పటికి మోదం అయ్యింది. మోదం అయ్యేటప్పటికి ఏమైంది? తలుపులు తెరుచుకున్నాయి. మనసు అనే తలుపు తెరుచుకుంది. తెరుచుకోగానే ఏమైంది? బాహ్యేంద్రియాలలోకి వచ్చాను. బాహ్యేంద్రియాలు అంటే ఏమిటి? ప్రాణం. పంచప్రాణాలు పనిచేసినాయి. ఆ తలుపు తెరుచుకోవాలంటే ఏం కావాలట? పంచప్రాణాలు పనిచేస్తేనే మనసు తలుపు తెరుచుకుంటుంది. పంచప్రాణాల్లోనుంచి ఐదు విషయాల్లోకి వచ్చాను. అందులో ఏముంది? అయితే శబ్దమో, లేకపోతే స్పర్శో, లేకపోతే రూపమో, లేకపోతే రసమో, లేకపోతే గంధమో. ప్రాణేంద్రియాలు తరువాత విషయేంద్రియాలలోకి వచ్చాను. ఇంకేంచేశానయ్యా? ఇప్పుడు జ్ఞానేంద్రియాలలోకి దిగాను. కన్ను రూపం, శబ్దం చెవి, ముక్కు వాసన, చర్మం స్పర్శ ఇట్లాగ ఐదు జ్ఞానేంద్రియాలలోకి దిగాను. ఇంకేంచేశానయ్యా? ఐదు జ్ఞానేంద్రియాలు అనుభవించాలి అంటే అవి ఇక్కడున్నాయి, వస్తువు అక్కడుంది. ఇప్పుడు అక్కడ ఏంచెయ్యాలి? ఈ కర్మేంద్రియాలు పనిచేసి వస్తువు దగ్గరికి పోయింది. ఇప్పుడు ఈ ఐదు ఐదులు ఇరవై ఐదు వున్నయా? లేవా? దేంట్లో అయినా సరే? వున్నాయి కదా! ఎక్కడ ఎప్పుడు విచారణ చెయ్యాలయ్యా? పని చేయకముందు. ఆలోచనని అనుమతించే ముందు విచారణ

చెయ్యాలి. (ఆలోచనకి దీనికి మధ్యలో GAP ఎక్కడుంది?) ఇంత వున్నది కదా! ఇదే పెట్టాలి. కావాలి అంటే ఇదుగో ఇదంతా పెట్టాలి. పెడుతూ వుంటే, నువ్వు అభ్యాసం చేసేటప్పటికి ఏమైపోయింది? నేను జ్ఞాతను అనే స్ఫురణ బలపడిపోతుంది. నీకు జ్ఞాతను అనే స్ఫురణ బలపడితేనే తప్ప, నువ్వు దీనిని అధిగమించలేవు. ఇప్పటి వరకూ నువ్వు ఏమనుకుంటున్నావు? నువ్వు మనసు అనుకుంటున్నావు. ఇప్పటి వరకూ ఎందుకు బలపడలేదు? ఆ తేడా, మధ్యలో ఎందుకు సమయం లేదయ్యా అంటే, నీవు ఎక్కడిదాకా వెళ్ళావు లోపలికి? మనసు అనే gate దాకా వెళ్ళావు. తన్నుకున్నావు బయటకు వచ్చేశావు. ఇంద్రియాల నుంచి మనసు వరికే, ఆ గేటు వరకే వచ్చావు. మనస్సు తలుపులు తెరుచుకోలేదు. శరీరం అంటే మనసుతో కలిపేగా. ఇప్పటి వరకూ శరీరం అంటే, శరీరం వేరే, మనసు వేరే అనే ధోరణిలో చూస్తున్నావు. అలాకాదు నీ శరీరమే ఆ మనస్సు, ఆ మనస్సే నీ శరీరం. తేడా ఏమీ లేదు. ఆ సంసారమే ఈ మనస్సు, ఈ మనస్సే సంసారం. మనస్సు అని ఎందుకు అంటున్నావయ్యా? ఆ గేటు తెరుచుకుంటే తప్ప ఇవన్నీ ఓపెన్ అవ్వడం లేదు. మనసు అనేది ఏమీ లేదు, ఒక ద్వార బంధం లాంటిది. దాని లోపల పనిచేస్తున్నటువంటిది ఏమిటి? బుద్ధి, చిత్తం. ఆ చిత్తంలో ప్రియం వుంది. ఈ బుద్ధిలో మోదం వుంది. అర్థమైందా అండీ! ఎప్పుడైనా సరే గుర్తుపెట్టుకోండి. ఈవెడకి పిల్లలకి బోధించే పని వుందనుకోండి. ఈవెడకి క్లాస్‌కి వెళ్ళి రోజూ పాఠం చెప్పడం ఆనందమేనా? ఆనందమేనా కాదా? (ఆనందమే కదా!) మరి ఆనందం అని ఎట్లా తోచింది? చిత్తంలో. ముందు చిత్తంలో బోధించడం అనే సంస్కారబలం, వాసనాబలం వుందన్నమాట. ప్రపంచాన్ని ఉద్ధరించే నిమిత్తమై నేను బోధించాలి. లోకవాసన. దానివల్ల నాకు భోజనం వస్తుంది. దేహవాసన. అర్థమైందా అండీ! నిజానికి మాట్లాడితే భోజనం వస్తుంది అని మనం ఎవరైనా పనిచేస్తామా? చెయ్యమండి. దాని వల్ల నీ ప్రత్యేకత నిలబడుతుంది. ఈ సమాజంలో అనుకో, ఈ కుటుంబంలో అనుకో, నీలో అనుకో, ఏదో ఒక ప్రత్యేకత దాంట్లో వుంటుందన్నమాట. ఆ ప్రత్యేకతయే చిత్తంలో వృత్తిరూపంలో వుంటుంది. అన్ని ప్రత్యేకతలు వాసనాబలం రూపంలో చిత్తంలో వుంటాయి. ప్రపంచంలో ఎన్ని కోట్లమంది టీచర్లు వున్నారు? అందులో మనం ఎవరం? ఎంత ప్రభావం వుంది? జగత్తులో ఆదిశంకరాచార్యుడు కూడా ఉపాధ్యాయుడే, టీచరే, బోధకుడే. ఆయనతో

పోల్చిచూడు. ఇప్పుడు మనం ఏమయ్యాము? ఏం బోధిస్తున్నాము? చావులేని విద్యను బోధిస్తున్నామా? చనిపోయే విద్యను బోధిస్తున్నామా? చనిపోవడానికి కారణం అయ్యేది? కాబట్టి అసలు 'విద్య' అంటే ఏమిటి? జ్ఞానము. అజ్ఞానాన్ని పోగొట్టేది. ఏ అజ్ఞానం పోవాలి అసలు? దేని వలన జనన మరణాలు ప్రాప్తిస్తున్నాయో, అది అజ్ఞానం. దేని వలన జనన మరణాలు తొలగుతాయో అది జ్ఞానం. ఎందుకని? ఆ జనన మరణాల మధ్యలోనే ఈ గొడవ అంతా వున్నది. వేరే ఎక్కడన్నా వుందా? లేదు కదా! ఇలా విచారణ చేసేటప్పటికి ఆ బోధించడంలో వున్న ప్రత్యేకత పోయిందా? పోలేదా? పోయేటప్పటికి ఏమైంది? సాక్షిగా చేయగలిగింది. మనం అందరం ఏమనుకుంటాం అంటే, ఆనందిస్తూ చేస్తే స్వేచ్ఛ ఎక్కువ వుందని మనందరి అభిప్రాయము. ఎందుకని? దుఃఖిస్తూ చేయడం కంటే అది ఉత్తమం కాబట్టి. ఏడుస్తూ చేయడం కంటే నవ్వుతూ, ఆనందిస్తూ చేయడం ఉత్తమం. కానీ ఆ నవ్వుతూ, ఆనందిస్తూ చేసే దాంట్లో ఏమి ఏర్పడింది? సంగత్వ దోషం ఏర్పడింది. అందులో చేరిపోతున్నావు నువ్వు. దూరిపోతున్నావు. అది మళ్ళా రాకపోతే మళ్ళా దుఃఖిస్తున్నావు. దుఃఖం అసలు ఎట్లా వచ్చింది నీకు? ఈ సంగత్వ దోషం, ఈ సుఖము, ఈ ఆనందము లోపిస్తే, దుఃఖం వచ్చింది. దుఃఖం వచ్చింది కదా అని చెప్పి ఇందులో చేరావు. కానీ అసలు దోషం అంతా ఇందులో వుంది. సుఖం ఆనందంలో వుందన్నామాట. ఏమిటి? అబ్బా! టీచర్‌గారు ఎంతబాగా చెప్తారండీ? అని పది మంది విద్యార్థులో, పది మంది మాస్టర్లో, పదిమంది కుటుంబంలో వున్నవాళ్ళో, ఎవరో అన్నారండి. ఏమైంది అప్పుడు ఈవెడకి? ఓహో! ఎంత అద్భుతము అండీ! ఇంకా బాగా ప్రయత్నము చేసింది. కాళ్ళు చేతులు నొప్పులు వచ్చినా గానీ, చేతులు కాళ్ళు కొంకర్లు పోయినా గానీ, ప్రమాదం వచ్చినా సరే, అయినా సరే, ఏమైనా సరే, బ్లాక్‌బోర్డ్ అంతా నింపేసి, రాసేసి, చేసేసేయాలని, ఇప్పుడు ఏమైందట ఇప్పుడు? తనకు మాలిన ధర్మము మొదలు చెడిన బేరము అయ్యింది. ఎందుకని ఆ మాట చెబుతున్నారు? నీవు నిర్ణయం చేసేటప్పుడు జాగ్రత్తగా నిర్ణయం చేయి. కర్తవ్యం చేయాలి. కానీ "**కర్తవ్యం ఎట్లా చేయాలి? ఆత్మజ్ఞానం వచ్చేటట్లుగా చెయ్యాలయ్యా!**". కర్తవ్యమే ఎవరు కాదన్నారు? ఎవరికి కర్తవ్యం? జ్ఞాత అనే కర్తకి కర్తవ్యం అండి. అంతేనా కాదా? ఎవరీ జ్ఞాత? ఆ ఈశ్వర లక్షణంతో, ఆత్మస్వరూపుడిగా, పరమాత్మ స్వరూపుడిగా పనిచేయాలండి. కానీ వీడు ఏ

లక్షణంతో పనిచేస్తున్నాడు? ఇంద్రియాల లక్షణంతో పనిచేస్తున్నాడండీ! బయట వున్న ప్రత్యేకతలని, భుజాన వేసుకుని, మూట కట్టుకుని దాంతో పనిచేస్తున్నాడండి. ఇప్పుడు ఏం చెయ్యాలంట కర్తవ్యం అంటే? చెయ్యాలి కర్తవ్యం. ఏమిటి కర్తవ్యం? ముందు ప్రధానం ఏది? జ్ఞానం ప్రధానమా? కర్తవ్యం ప్రధానమా? (జ్ఞానం). జ్ఞానం వచ్చినాక కర్తవ్యం చేసినప్పుడు ఏమైందట? '**కర్మసు కౌశలం**'. ఏమైందట? మంచి నైపుణ్యంతో చేయగలిగే సామర్థ్యం వచ్చిందండి ఇప్పుడు. అర్థమైందా అండీ! ఈ జ్ఞానం వుంటే ఏంటయ్యా ఉపయోగం? నీ టీచర్ పనే నువ్వు చేసుకో! నా వుద్యోగం నేను చేస్తా. ఎవరు ఏం చేసినా ఏం భేదం లేదు. కానీ ఈ జ్ఞానంతో చేస్తే ఏమౌతావయ్యా? ఈ జ్ఞానంతోనే ఆ పనిని చేస్తావు కాబట్టి, ఫలితం కూడా ఈ జ్ఞానం రూపంలోనే లభిస్తుంది. ఒకరు సంధ్యావందనం చేసినా, ఒకరు ఉద్యోగం చేసినా, ఒకరు పౌరోహిత్యం చేసినా, బయట వున్నటువంటి బాహ్యేంద్రియాల ప్రవర్తనే కదా! అది. అంతేనా కాదా? లోపల ఇంకేమన్నా వుందా? అంతరేంద్రియాలలో వున్న వాసనాబలం, సంస్కార బలం, చిత్తంలో, బుద్ధిలో పనిచేసేది ఏద్దైతే వుందో, అది ఏం చెబుతోంది? ఇప్పుడు నువ్వు సంధ్యావందనం చెయ్యి నీకు ఆనందంగా వుంది. ఇప్పుడు నీవు బోధించు నీకు ఆనందముగా వుంది. ఇప్పుడు నీవు విను నీకు ఆనందముగా వుంది. ఇలా చెబుతూ వుంటుందన్నమాట. అది ఎప్పుడూ ప్రియం మోదం ప్రమోదాలలో కొట్టుకుంటూ వుంటుంది. నీ చిత్తవృత్తి అంటే ఏం లేదు, అది ఎంత సేపూ ఏం చేస్తుంది? నీ వాసనాబలంలో వున్నటువంటి ప్రియములన్నీ, ఏకరువు పెడుతూ వుంటుంది. నువ్వు అది చేస్తే బాగుంటుంది, ఇది చేస్తే బాగుంటుంది. దాని పని ఎప్పుడూ ఇదే. ఆ చిత్త వృత్తి ఎప్పుడూ ఏం చెబుతూ వుంటుందండి? అది చేస్తే బాగుంటుంది, ఇది చేస్తే బాగుంటుంది. దాని పని ఇంతే. ఇంతకు మించి వేరే ఏమీ లేదక్కడ. అన్నీ ప్రియములు వుంటాయన్నమాట. బుద్ధిలో ఏముంటాయి? ఆ ప్రియములకు సంబంధించినటువంటి, వ్యతిరేక అనుకూలమైనటువంటి జ్ఞాపకాలు అన్నీ వుంటాయన్నమాట. ఆ Data అంతా వుంటుంది. సమాచారం అంతా వుంటుంది. ఆ ప్రియం తోచగానే ఇవన్నీ దాని ముందు ఎదురుగా పెడుతుంది. అది చేస్తే ఇలా అవుతుంది, ఇది చేస్తే అలా అవుతుంది. అది చేస్తే నీకు దుఃఖం వచ్చింది, ఇది చేస్తే నీకు సుఖం వచ్చింది. ఇట్లా డేటా అంతా దానిముందు పెడుతుందన్నమాట. పెట్టగానే

ఏమైంది? ప్రియం కాస్తా? మోదం అయ్యింది. ఈ మోదం ఏమైంది? లోపల వాసనాబలం, సంస్కార బలం గిరగిరగిరగిర తిరిగినాయి. ఎంతసేపు? ఎంత వేగంగా తిరుగుతుందంటే, దాని అంత వేగంగా ఏదీ తిరగదు అన్నమాట. అంత వేగంగా తిరిగి దాంట్లో బలం పెరిగింది. చలిస్తే వేగం పెరిగిందా? చలించకపోతే వేగం పెరిగిందా? చలించబట్టే కదా! కాబట్టి నిగ్రహించమని కదా చెబుతున్నది. (అంతేకదా మరి) అర్థమైందా ఇప్పుడు? ఏం చెబుతున్నాడు? శమము, దమము. అంటే ఏమిటి? బాహ్యేంద్రియ నిగ్రహము, అంతరేంద్రియ నిగ్రహము. బాహ్యేంద్రియ నిగ్రహము ఏమిటి? దమము. శమము అంటే ఏమిటి అంతరేంద్రియ నిగ్రహము. ముందు ఏం చెయ్యాలి? అంతరేంద్రియ నిగ్రహము చేయి. అంటే అసలు చలిస్తున్నది ఏమిటి? ముందు అంతరేంద్రియాలు విపరీత వేగముతో చలిస్తున్నాయి. ఆ విపరీతమైన వేగంతో చలించే కొంత భాగము, బాహ్యేంద్రియాలలోకి వస్తుంది. ఇప్పుడు నేను ఈ చేయి ఇలా తిప్పుతున్నానండి. ఇలా తిప్పుతున్నాను అంటే లోపల ఈ మనో బుద్ధులు ఎంత వేగంతో పనిచేస్తే, ఇట్లా తిప్పగలుగుతున్నాను? అంతే కదా! మీరు బాహ్యంలో యంత్రాలను చూడడం లేదా? విపరీతమైన వేగంతో చలించే మోటర్ వుంటే, ఆ మోటర్ అనుసంధానించబడిన కొంచెం వేగంతో, దానికంటే కొంచెం వేగంతో, ఈ మోటర్ పనిచేయాలంటే, కరెంట్ ఎంత వేగంతో తిరుగుతుంది లోపల? ఎలక్ట్రాన్‌లు ఎంత వేగంతో, దీనికంటే కొన్ని వేల రెట్లు వేగంతో అవి చలిస్తేనే, దీంట్లో కొంత భాగం వచ్చింది. కాబట్టి, మీ అంతరేంద్రియాలు ఇప్పుడు ఎంత వేగంతో చలిస్తున్నాయి? ఇలా విచారణ చేయాలి. చేస్తే ఏమైందట ఇప్పుడు? దాని యొక్క వేగం తగ్గిపోయింది. అప్పుడు నేను ఎవరిని? జ్ఞాతని. ఎక్కడికి దిగకూడదు? ప్రియం మోదం ప్రమోదాలలోకి దిగకూడదు. ఎక్కడికి దిగకూడదు? అహంకారంలోకి దిగకూడదు. చిత్తంలోకి దిగకూడదు. బుద్ధిలోకి దిగకూడదు. అథవా దిగినా కూడా, దానిని అక్కడే నిగ్రహించాలి. అంతరేంద్రియ నిగ్రహము అనే శమమును పాటించాలి. అక్కడ పాటించావు. తరువాత ఏమయ్యింది? ఎంతో కొంత భాగం చలించింది కాబట్టి, బాహ్యేంద్రియాలలోకి రాక తప్పదు. వచ్చెను పో! ఏమైంది ఇప్పుడు? బాహ్యేంద్రియ నిగ్రహము, దమమును ఆశ్రయించు. బాహ్యేంద్రియాల దగ్గరైనా నిగ్రహించు. మరలా ఇట్లా అమలులో పెట్టమాకు, అమలులో

పెడితే ఏమైంది? ఫలితం వచ్చేసింది. కర్త కాస్తా ఏమయ్యాడు ఇప్పుడు? భోక్తై కూర్చున్నాడు. "**ఈ శమము, దమము ఎవరైతే ఆచరిస్తారో, వాడికి భోక్త లేకుండా పోతాడు**". అర్థమైందా అండీ! ఈ శమము, దమము వల్ల ఉపయోగం ఏంటంటే, జ్ఞాత అనెడి కర్త భోక్త అవ్వకుండా వుంటాడు. ఎప్పటికీ మరలా ఈ విచారణ చేసి, ఈ నిగ్రహాన్ని పాటిస్తే, మళ్ళా జ్ఞాత అవుతూ వుంటావన్నమాట. కింద పడిపోతూ వుంటావు, లేస్తూవుంటావు. పర్వలేదు, కొంత సేపు అభ్యాసం చేసేటప్పటికి, మళ్ళా ఎప్పటికీ జ్ఞాతగా వుండేటటువంటి, స్థిరత్వం వస్తుందన్నమాట. ఈ శమము, దమము వల్ల ఉపయోగం ఏంటంటే అది. భోక్త లేకుండా, ఫలితాన్ని ఆశ్రయంచేటటువంటి వాడు లేకుండా పోతాడు. ఈ భోక్త లేకుండా పోయి, ఉపరతి తితీక్ష చేయగలిగే సామర్థ్యం వస్తుందండి. అర్థమైందా అండీ! ఉపరతి తితీక్ష ఏమిటంటే, కర్తను పోగొడుతాయి అవి. జ్ఞాతను పోగొడుతాయి అవి. నీవు ఆత్మస్వరూపుడవు అనే నిర్ణయంలోకి నిలబెడుతాయన్నమాట అవి. ఆ జ్ఞాతలో వున్నటువంటి కర్తృత్వభావం, కర్తవ్యభావం పోగొట్టే ప్రయత్నం చేసేది ఉపరతి, తితీక్ష. కానీ అది పోవాలి అంటే ముందు ఏం పోవాలి? ఫలితాన్ని ఆశ్రయించే భోక్త పోవాలి. మొట్టమొదట. ఎందుకని? మనం ఇప్పటి దాకా ఎందులో వున్నాము? ఆ ఫలితాన్ని ఆశ్రయిస్తున్నాము, ఆ ప్రత్యేకతని ఆశ్రయిస్తున్నాము. ఆ ప్రత్యేకతలోన, అపేక్షలో వున్న సుఖాన్ని ఆశ్రయిస్తున్నాము. అందువల్ల ఈ భోక్త బలపడిపోయి వున్నాడు. ముందు వీడిని ఎగరగొట్టాలి. ఎప్పుడూ కూడా. భోక్త ఎగిరిపోవాలి అంటే, ఒకే ఒక నియమాన్ని పాటించాలి. ఏమిటయ్యా అంటే, నిత్యవర్తమానుడవై జీవించాలి. నిత్య వర్తమానుడు అంటే ఏమిటి? ఎల్లప్పుడూ ఈ క్షణమే సత్యం. గత క్షణం ఇప్పుడు లేదు. రాబోయే క్షణం అస్సలు లేదు. కాబట్టి నేను ఎవరను? అనే వాడు ఎక్కడున్నాడు? ఈ క్షణంలోనే వున్నాడు. ఎప్పటికప్పుడు ఇదే చూసుకోవాలి. ఎప్పటికప్పుడు ఈ క్షణమే, ఎప్పటికప్పుడు ఈ క్షణమే. గతక్షణం సంగతి వదిలేయటమే. బాధ్యతలు చేయడం, చేయకపోవడం. అవ్వటం, అవ్వకపోవడం అన్నీ తీసి ఒకే మూల, ఒక కట్టగా... మీరు ఎప్పుడైనా గానీ ఒక ఉదాహరణ చూడండి. చెత్త బయట పడేసేముందు మనం విచారణ చేస్తాం కదా! ఏం బయట పడేస్తున్నాము అని (అవును). కానీ అలా విచారణ చేయకూడదు. ఎందుకని? అంతా పారేసేదే కదా! అర్థమైందా అండీ! అంతా పారేసేదే అయినప్పుడు ఏం విచారణ చేస్తావు

ఇంక? ఒక నిర్ణయం చేశావు. అంతా పారేయవలసిందేరా బాబు. ఎందుకని? జీవుడు కదా! వీడు ఎవడు? జీవుడు కదా! మొదటి నుంచి ఏం చెబుతున్నాడు? జీవుడు కదా! ఈ జీవుడు ఏం చేస్తున్నాడట? ఇందులోకి దిగి రకరకాల వ్యాపకాలని, రకరకాల వికారాలని పొంది, రోజూ నిత్యప్రళయాన్ని అనుభవిస్తున్నాడు. కాబట్టి వీడు శాశ్వతమైనటువంటి స్థితిలోకి చేరాలి అంటే, తప్పనిసరిగా ఈ సాధన చతుష్టయ సంపత్తిని సంపాదించాలి. అందులో నిత్యానిత్యవస్తు వివేకము, ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము, శమాది షట్క సంపత్తిలో శమము, దమము వరకు అయినాయి.

ఓం ఓం ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే
ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే
ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఓం తత్ సత్

ఓం సహనాభవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై తేజస్వి నావధీతమస్తు మావిద్విషావహై
ఓం శాంతిః శాంతిః శాంతిః

సాయిరాం.

మేలుకొలుపు (ఆత్మ)

1) తెల్లవారెను భ్రాంతి చీకటి | దీరిపాయెను జ్ఞానము
దయంబల్ల నాయెను| మనసు తిరమై | యెల్ల బయ లాయెన్ |
ఆత్మా మేలుకొనవే ||

2) ఉన్నదున్నట్లుండి పాయెను | విన్న కన్నది లేకపాయెను |
యెన్నగా యీ యెఱుక మూలము | యేమి లేదాయెన్ ||
ఆత్మా మేలుకొనవే ||

3) తోచు వృత్తులు దొలగి పాయెను | సూచనయు
గురువాక్య మాయెను | ఉచ్చ నీచంబనెటి పలుకులు
ఉత్తవై పాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

4) భూతపంచక శూన్యమాయెను | కూత లేమియు
లేకపాయెను | పాతకంబులు పారిపాయెను | పరమ
పదమాయెన్ ఆత్మా మేలుకొనవే ||

5) ఇల్లు బయలై తెల్లనాయెను | కల్ల బోధలు చెల్లి
పాయెను | పిల్ల లాటల పోలికాయెను | ప్రేమ
లేదాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

6) పిండ బ్రహ్మాండముల నుండెటి |
దండియహముల తెలివి బాయెను | ఖండ
ఖండములోను జూడ య | ఖండమై పాయెన్ ||
ఆత్మా మేలుకొనవే ||

7) హరిహరాదుల కందకుండెటి | గురుని
వాక్యము నమ్మికాయెను | పరమపదమే బట్ట
బయలై | భావమిక బాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

8) జనన మరణము జడుపు తీరెను | కనుల వేడుక
కాలిపాయెను | మనసు యింద్రియ చలము
లెల్లను | మాయామై పాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

9) జగతి విబుధుల స్వప్నమాయెను | పగలు రాతిరి
లేక పాయెను | ఒకటి రెంటి మూలమారెను |
ఊహ లేదాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

10) ఇంపుగా నలగండ్ల వెలిగెటి | వెంపటి నరసింహ్వా
గురువరు | పంపునను గోపాల కవిలో | బయలు
బయ లయ్యెన్ || ఆత్మా మేలుకొనవే ||

–★–★–★–

1) తెల్లవారెను మోహతిమిరం | బెల్ల బాయెను జ్ఞాన
వుదయం | బల్ల ప్రబలం బాయ | తన మనసెల్ల
స్థిరమాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

2) మూడు గుణములు | మునిగి పాయెను |
ఏడు ధాతువు | లెనుక బట్టెను | ఏడ యేమియు |
లేకపాయెను | ఎఱిగి మేల్కొనవే ||
ఆత్మా మేలుకొనవే ||

3) అష్ట తనువులు అడవి బట్టెను | అష్ట మదము లహామిక
మణగెను | కష్ట సుఖముల | కాంక్ష దీరెను |
ఘనత మేల్కొనవే || ఆత్మా మేలుకొనవే ||

4) అష్ట ప్రకృతుల ఆటలుడిగెను | అష్టపాశములపుడె
వీడెను | ఇష్ట మేమియు లేకపాయెను |
ఇపుడు మేల్కొనవే || ఆత్మా మేలుకొనవే ||

5) వాసనాత్రయ మొదలి పాయెను | ఈషణ త్ర
యమిపుడె వీడెను | విన్న దేమియు లేక పాయెను |
వేగ మేల్కొనవే || ఆత్మా మేలుకొనవే ||

6) సాగరంబుల చప్పు లుడిగెను | వాద భేదము
వదలిపాయెను | నాద మప్పుడె నశ్యమాయెను |
నయమె మేల్కొనవే || ఆత్మా మేలుకొనవే ||

7) మండలములనె మమతమానెను | కుండలస్థలి
కూలిపాయెను | పండు వెన్నెల భావమాయెను |
బరగ మేల్కొనవే || ఆత్మా మేలుకొనవే ||

8) మనసు బుద్ధియు మరల జనియెను | మాని పాయెను
జనన మరణము | మమత ఏమియు లేక పాయెను
మరియు మేల్కొనవే || ఆత్మా మేలుకొనవే ||

9) గురుడు శిష్యుండేక మాయెను | కులము గోత్ర
ము లేక పాయెను | కుడి యడమలు సమమె
ఆయెను | గురు తెఱుక బాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

10) పరశురాముని సీతరాముల | భజన నిత్యము
సేయుటాయెను | బాగుగా శేషమ్మ భావము |
బయలులో లే దాయెన్ || ఆత్మా మేలుకొనవే ||

–★–★–★–

మేలుకొలుపు (జీవ)

1) కటకట మోసమాయెను |
మోసమాయెను జీవ చూడగ | మోహపాశము
లధిక మాయెను | గాశి జెందగ, జేసె నీగతి |
కర్మ మేమందూ || జీవా మేలుకొనవే ||

2) కల్పశతముల కన్న మిక్కిలి | కాల మాయెను,
తిరిగి చూడగ | అల్ప సుఖ మని, కలలో మురి
యుచు | ఆడుచున్నావు || జీవా మేలుకొనవే ||

3) కోటి జన్మము లెత్తియును | శతకోటి దుఃఖ
ము లనుభవించుచు | నాటి మాటలు దలచు
కొంటె నాటు నీ మదికి || జీవా మేలుకొనవే ||

4) ఇరువ దొక వెయ్యి ఆరు నూరులు | జరుగు హం
సలు తరుగు నాయువు | హరిహరాదులు వచ్చి
నిలచిన | ఆగదీ తనువూ || జీవా మేలుకొనవే ||

5) లేనిపోని దుఃఖజాలము | లోనబడి చెడి
పోవు టెందుకు | మాన అవమానంబు లని | నీ మమత
విడ లేవూ || జీవా మేలుకొనవే ||

6) నిజగురుండగు సూర్యుడిప్పుడు | నిజముగా
ఉదయించె చూడుము | త్రిజగముల వారంత
మేల్కొని | తెలివి గన్నారు || జీవా మేలుకొనవే ||

7) బట్టబయలును గురుడు జూపిన | నట్టు లేకను
పుడమి అంచున | పట్టు విడువక గుట్టు మరు
వక | దిట్టమై పోవె || జీవా మేలుకొనవే ||

8) మాయ తనువై మాయతానై | మాయ పను
లను జేయుచును మరి | మాయ తన మర్మం
బుగనే | మాయమై పోవున్ || జీవా మేలుకొనవే ||

9) ద్వాదశిషోడషులనె జలధార కర్ణములందు
సోకిన | బాధలన్నియు తొలగి నీవిక | భ్రాంతి
వొదిలెదవూ || జీవా మేలుకొనవే ||

10) భాగవత శ్రీకృష్ణ దేశిక ప్రభువరుండిటు
రానె వచ్చెను | వేగ గని తను మన ధనంబులు
వీడి | శరణనవే || జీవా మేలుకొనవే ||

11) పీలుఖాన శంకరుండని పిలిచి | ప్రభువరుం
డేలినారట | మూలమూ లేనట్టి యెఱుకను |
ముంచి వేసిరటా || జీవా మేలుకొనవే ||

శ్రీ మద్రాజాధిరాజ మహారాజా యోగీంద్ర చంద్ర భాగవత కృష్ణ దేశిక ప్రభు మహారాజుకీ
జై జై జై ఓం తత్సత్ ఓం శాంతిః శాంతిః శాంతిః

గురువును ఆశ్రయించినప్పుడు ఏం తెలుసుకోవాలి అసలు? అంటే, శాస్త్రం ఏం తెలియజేస్తుంది? గురువు ఏం తెలియజేస్తాడు? అసలు గురువును ఆశ్రయిస్తే, మీరు ఏం తెలుసుకోవాలి? ఏం ప్రశ్నించాలి? ఏం తెలుసుకుంటే అది ముక్తి? మోక్షం అవుతుంది? ఎన్నో రకాలుగా, ఎంతోమంది, ఎన్నోవిషయాలుగా దీనిని చెబుతూ వుంటారు. కానీ, సూటిగా ఒకే ఒక పాటలో, ఒకే ఒక పాఠంలో మొత్తము వేదాంతాన్ని ఇమిడ్చినటువంటిది ఇప్పుడు మీరు చదువుకునేటటువంటి మేలుకొలుపు. ఈ మేలుకొలుపు యొక్క అనుభవం, ఎవరికైతే పూర్తిగా వస్తుందో, వాళ్ళకి ముక్తి మోక్షం సాధ్యమౌతాయి. అనుభవజ్ఞానంగా రావాలన్నమాట. అయితే, అసలు గురువు ఏం తెలియజెప్తాడు? శిష్యుడు ఏమి అడగాలి? ఇది కదా తెలియాల్సింది. ఇది తెలియాలి అంటే, గురువుని ఆశ్రయించితే ఏం చెప్తాడయ్యా అంటే, పూర్వకాలం నుంచి ఏం చెప్పేవాళ్ళంటే, ఆయన తరించే మార్గం చెప్తాడు. గురువు ఏం చెప్తాడయ్యా అంటే, దేనికి పనికివస్తాడు ఆయన? తరించే మార్గం చెప్పడానికి పనికి వస్తాడు. అంతకు మించి గురువు దేనికీ పనికిరాడు. ఏం తరిస్తావయ్యా? అంటే, ఏం తరించాలో తెలియదు కదా! అర్థమైందా అండీ? రామ శబ్దానికి ఏమని వుందండి? తారక రాముడు కదా! అంటే అర్థం ఏమిటి? "**రామ శబ్దాన్ని ఎవరైతే ఆశ్రయిస్తారో, వాళ్ళు తరిస్తారు**". జీవుడు అనేటటువంటి భవసాగరాన్ని తరించడానికి ఒకే ఒక మార్గం రామ శబ్దం. '**రమయతి ఇతి రామః**' – రమించేటటువంటివాడు రాముడు. అంటే జీవుడు ఆత్మ అనేటటువంటి అనుభవంలో వుండడమే రమించటం అంటే. వేరే ఇంకేమి అర్థములు లేవండి. మనలో వున్నటువంటి హంస, ఈ హంస దాని మూలము ఎందులోనుంచి వచ్చిందటా? పరమాత్మ స్థితినుంచి హంస వచ్చింది. కాబట్టి ఈ హంసని ఆధారం చేసుకుని, ఎప్పుడైతే నీవు పరమాత్మ స్థితి యందు వుండేటటువంటి జీవితాన్ని కలిగివుంటావో, మూడు అవస్థలలోనూ నేను పరమాత్మ స్వరూపుడనే అనే స్థితిలో ఎప్పుడైతే వుంటావో, అప్పుడు ఈ అనంత సృష్టిలో జరుగుతున్నవన్నీ పరమాత్మకు ఎలా కనబడుతాయో, నీవు అలా వున్నావు. అలా వుండే స్థితిని అనుభవింపజేయడానికి కావలసినటువంటి నౌక, నావ ఏమిటయ్యా అంటే రామ శబ్దం. ఆ 'రా' 'మ' అనేటటువంటి దాంట్లో 'రా' రా కు దీర్ఘం వున్నది కదండీ! రామ శబ్దంలో రమించేటప్పుడు ఆ దీర్ఘం వస్తుంది. ఆ హంస స్థితిని అధిగమించేస్తే అది

విడిపోతుంది. కాబట్టి రామ అన్నా, హంస అన్నా అందుకే రెండు రెండు అక్షరాలు వున్నటువంటి శబ్దాలన్నీ కూడాను, తరించేటటువంటి శబ్దాలు. అందుకే పెద్దావాళ్ళు అందరూ సాయి, సాయి, సాయి, సాయి అదికూడా రెండు అక్షరాల శబ్దమే. ఏసు అది కూడా రెండు అక్షరాల శబ్దమే. అల్లా రెండు అక్షరాల శబ్దమే. శివ రెండు అక్షరాల శబ్దమేనండి. రామ, కృష్ణ నువ్వు ఎన్నైనా పెట్టుకోండి, దుర్గ మీరు ఎన్నన్నా తీసుకోండి, లక్ష్మి అన్నీ రెండు అక్షరాల శబ్దాలే. దైవత్వానికి సంబంధించిన శబ్దాలన్నీ రెండు అక్షరాల శబ్దాలు వుంటాయి. కాళి రెండు అక్షరాల శబ్దమేనండి. ఇట్లాగ అన్నీ ఇంతే నండి. ఇలాగ ఈ రెండు అక్షరాల శబ్దములన్నీ కూడాను, హంసకి జోడించడానికి అనువైనటువంటి శబ్దాలన్నమాట ఇవి అన్నీ కూడాను. కారణం ఏమిటంటే దీని తరువాత ఏకాక్షరమే వుంటుంది. అది ఓంకారం. ఈ రెండు అక్షరాల శబ్దంలోనుంచి ఓంకారంలోకి మారిపోతారన్నమాట. సాధన చేసేటటువంటి వాళ్ళు. అలాగ అసలు మీరు గురువు దగ్గరకు వచ్చి ఏం తెలుసుకోవాలి? ఏమి అడగాలి? ఏం చెయ్యాలి? అని చెప్పాలి అనిఅంటే,

తారకము చూపెరుగ వలెనన్నా
సద్గురుని కృపచే తారతమ్యము తరచి కనుగొనుమా
తారకము చూపెరుగ వలెనన్నా
సద్గురుని కృపచే తారతమ్యము తరచి కనుగొనుమా

మరపు తెరపనకుండ జాగ్రత నిరతమును స్వప్నా సుషుప్తులు
అరమరలు లేకుండ ఎప్పుడు స్థిరముగను జీవాత్మ చదివెటి

తారకము చూపెరుగ వలెనన్నా
సద్గురుని కృపచే తారతమ్యము తరచి కనుగొనుమా

ధరణి లోపల మూఢ మతులకు దొరకు బహు దుర్లభంబిది

గురు కటాక్షము వలన స్థిరమగు పరమపదవికి చేరె యుక్తిని
నేర్పవలె జీవాత్మ కిపుడన్నా
నేర్పెరిగి యుంటే మరవకను జపియించు తుండన్నా
ఈ జపము నెరిగినవారు నిర్మల బ్రహ్మ జ్ఞానులన్నా
జ్ఞానులైన వెనుకను సారెకును జపస్నాన మేలన్నా
స్నానంబు తెలిసిన వారె పుడమిలో రాజయోగన్నా

నారదాది మహా మునీంద్రుల తరచి బుధులచే కనిరి మంత్రము
మర్మమెరిగి నిమిషమైనను మరువ కుండగ పరంబు చేరిరి

తారకము చూపెరుగ వలెనన్నా
సద్గురుని కృపచే తారతమ్యము తరచి కనుగొనుమా

అండ పిండ బ్రహ్మాండ మంతటా నిండినది నిజగురుని మహిమ
పండిత జ్ఞానులకు భావంబు ఖండితంబుగ తెలియు
నీలో నుండె భూతంబు లైదు కను మన్నా
వాకిళ్ళు మూసి మండలంబులు దాట వలెనన్నా
ప్రణవమ్ము విడువక కొండనెక్కి తేరి జూడన్నా
వజ్రాలు దాపిన మండపమ్ములు మహిమ కనుమన్నా
తరచంగ పిమ్మట పండు వెన్నెల ప్రబలమగునన్నా

దండిగను పెంజీకటవ్వల యుండె బయలు ప్రభావం బెరిగి
కొండవలె ముందుండు భవమది మండి భస్మమై పొయ్యేటటుల

తారకము చూపెరుగ వలెనన్నా
సద్గురుని కృపచే తారతమ్యము తరచి కనుగొనుమా

ఆత్మారాముల కాన లేకనూ మూత్ర కొంపలో మునిగి చెడుదురు
నేత్రద్వారము నందు వెళ్ళిన సూత్రధారుని కాన లేకనూ క్షేత్రములకును పోదురేమన్నా

త్రేతాయుగము వారి ప్రతిమలు కల్పింప బడెనన్నా
మూఢులకు ముఖ్యము భూత పూజలందు ప్రేమన్నా
తనలో నున్న తత్వము నెవరు తరచి కనరన్నా
పాపిష్టి జన్మము ఎత్తి నందుకు ఫలము ఏదన్నా

మోతగల రుద్రాక్ష మాలలు నీతితో ధరియించి గొణిగిన
సత్యము, జ్ఞానంబు కనకను నిత్యమోక్షము చెందజాలరు

తారకము చూపెరుగ వలెనన్నా
సద్గురుని కృపచే తారతమ్యము తరచి కనుగొనుమా

కామ క్రోధము లారు మరచీ పామరత్వము పాడు చేసి
సోమరివై చెడక ఇలలో నియమ నిష్టలు లేని
ఆత్మారాములను ధ్యానింప వలెనన్నా

ధశరథుని పుత్రుని రాముడని తలచేరు కొమ్మన్నా
యోగులను మదిలో రమించువాడే రాముడగు నన్నా
జన్మాదు లాత్మారాము డెన్నడు ఎరుగ బోడన్నా
పామరులు తెలియక యముని మాయలో చిక్కుపడెరన్నా

బొమ్మలాట ప్రపంచములు కలిగి నమ్మి చెడుదురు నాణ్యమెరుగక
కమ్మటిగ శివ రామ మంత్రము నెమ్మదిగ అనుదినము జరిగేటి

తారకము చూపెరుగ వలెనన్నా
సద్గురుని కృపచే తారతమ్యము తరచి కనుగొనుమా

ఎక్కడెక్కడ వెదకి తిరిగిన అక్కడ వేదములు కలిసెను
నిక్కముగ జ్ఞానంబు కనుకను మక్కువతో పాషాన ప్రతిమకు
మ్రొక్కుదురు ఎటువంటి తెలివన్నా

నీ భ్రమల చేతను తిక్క బుద్ధులు విడువ బోరన్నా
నూటికిని, కోటికిని అక్కడొక్కడు చేరునేమన్నా
అస్థిరము తనువులు గ్రక్కునా గురుని జేరి కనరన్నా
పరస్త్రీల జూచి కుక్కవలె వేడి తిరుగ బోకన్నా

మ్రొక్కవలె పరమాత్మ గనుగొని త్రొక్కవలె అజ్ఞాన వృత్తులు
వెక్కసము లేకుండ రాముల మిక్కిలి కొనియాడె సమయము

తారకము చూపెరుగ వలెనన్నా
సద్గురుని కృపచే తారతమ్యము తరచి కనుగొనుమా

చదువు శాస్త్రము లేల
చిత్తము నిలిపితె నిజపదవి దొరకును
మదగజము వలె పలు విధంబులు మనసు చెదరిన వారికెప్పుడు
కుదురునా యోగంబు వినరన్నా

వైరాగ్యముంచి బుధుల చెంతకు చేరవలెనన్నా
దర్పణంబు గను పదిలంబుగ సాధించ వలెనన్నా

నేత్రద్వయంబులు తుదకు రెండును ఏకమౌనన్నా
ఆ మధ్యమున ఒకటి కద్దు ఆపోజ్యోతిని కనరన్నా

పెద్దల సాంగత్యమున ప్రసిద్ధమైన బోధ కనుగొని
నీ వద్దనున్న వికార గుణములు వదలు మనెను పీరు మొహిద్ది

తారకము చూపెరుగ వలెనన్నా
సద్గురుని కృపచే తారతమ్యము తరచి కనుగొనుమా

ఈ గ్రంథము పేరు తారకామృత సారము. ఈ పుస్తకము అంతా పాటలతోనే వుంటుందండి. పూర్వము అంతా ఇలాగే నేర్పేవాళ్ళు. పూర్వ పద్ధతి అన్నమాట ఇది. ఎందుకంటే ఇలా రోజూ పాడుతూ వుంటే, ఈ పాటలే అలవాటు పడిపోయి ఈ భావంలో నిలబడిపోయి చాలా తేటతెలుగులో వుంటాయండి, ఏమీ అర్థము ఎవ్వరూ విడగొట్టి చెప్పక్కర్లేదు. సూటిగా. ఇదే స్మరణ చేసుకుంటూ, పాటలు పాడుతూ, పనిచేసుకుంటూ ప్రశాంతంగా వుండేవాళ్ళన్నమాట. ఇప్పుడేమిటంటే ఇవన్నీ పోయి, మనకు అర్థం కాని, సంస్కృతభాషలో వున్న విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామాలు పట్టుకునేటప్పటికి, ఆ భాష మనకు తెలియదు. దాని అర్థం మనకు రాదు. కాబట్టి అర్థమయ్యేటటువంటి భాషలో వున్నటువంటివి, మీరు నేర్చుకున్నట్లయితే రోజువారీ మీరు వినటానికి అనుకోవడానికి సూటిగా వుంటాయన్నమాట ఇవి. ఇవి అందరూ అనువు. దీనికి ఏం పెద్ద సంగీతం గట్రా అవసరం లేదు. వచ్చిన వాళ్ళు పాడితే అందంగా వుంటుంది. ఇప్పుడు నాకు సంగీతం రాదు కాబట్టి వూరికే చదివాను. అయితే దీన్ని బాగా పాడే వాళ్ళు కూడా వున్నారు. కాబట్టి ఎప్పటికైనా తెలుసుకోవలసింది ఏమిటయ్యా అంటే, ఈ తారకామృత సారం అంతా కలిపి, ఒక వాక్యంలో చెప్పాలయ్యా అంటే, గురువును చేరి ఏం కనుక్కోవాలయ్యా అంటే, రాను ఎటులో పోను ఎటులో, అయినది ఎటులో కానిది ఎటులో, కనియు కానని తత్వమెటులో తారకము చూపెరుగవలెనన్నా, సద్గురుని కృపచే తారతమ్యము తరచి కనుగొన్నా. రాను ఎటులో పోను ఎటులో, ఎలా వస్తున్నావు? ఎలా

పోతున్నావు? చాలా ముఖ్యమైన అంశమండి. ఎందరో ఎన్నో తెలుసుకుంటారు గానీ, ఎలా వస్తున్నావు, ఎలా పోతున్నావు అనే అంశాన్ని ఎవ్వరూ పట్టించుకోకపోవడం చేత, జీవితం వృధా అయిపోతుంది. ఈ ఒక్క అంశం తప్ప మనం జీవితంలో అన్నీ పట్టించుకొంటాం. అన్నీ ప్రధానమే మనకి. అన్నీ ముఖ్యమే. ఎవరు మనని చూసి నవ్వారు, ఎవరు మనని చూసి ఏడ్చారు? మనము ఎంత సేపు నవ్వాము, మనం ఎంతసేపు ఏడ్చాము ఈ గోల పట్టించుకోవడమే జీవితమంతా సరిపోతుందండి. ఎట్లా వచ్చావు? ఎట్లా పోతున్నావు? ఈ ప్రాథమికమైన సూత్రాన్ని పట్టించుకునే ప్రయత్నం చేయండి. ఈ మిగిలినటువంటి నవ్వులు, ఏడ్పులు ఎప్పుడూ వుండేవే. ఇవన్నీ మారిపోయేవే కదా! ఎంతకాలము ఎవరి కోసమని నవ్వుతావు, ఎంతకాలము ఎవరి కోసమని ఏడుస్తావు? ఇది సాధ్యమయ్యే పని కాదు. ఎంతకాలమైనా కానీ, దాని వలన ఉపయోగమూ లేదు. కాబట్టి సాక్షిత్వంతో నిమిత్త మాత్రంగా వుండడం జీవితంలో అలవాటు చేసుకోవాలి. ఏం తెలుసుకోవాలయ్యా? రాను ఎటులో, పోను ఎటులో, ఎలా తెలియాలట? నీవు ఎలా వస్తున్నావు? ఎలా పోతున్నావు? అంటే జీవుడు ఎలా వస్తున్నాడు? ఎలా పోతున్నాడు? పరమాత్మ నుంచి ఆత్మ ఎలా సృష్టిలోకి వస్తున్నది, ఎలా పోతున్నది? సృష్టి ఎలా వస్తున్నది? ఎలా పోతున్నది? పరమాత్మ ఎలా ఏర్పడుతున్నాడు, ఎలా పోతున్నాడు? నాలుగు స్థితులకి కూడా రాకడ, పోకడ వున్నది.

పిండము, పిండములోని సాక్షి. బ్రహ్మాండము, బ్రహ్మాండములోని సాక్షి. ఈ నాల్గింటికి వుందట ఈ జాడ్యం. ఈ అంటువ్యాధి, ఈ రావడం, పోవడం అనే అంటువ్యాధి. అంటువ్యాధి అంటే ఏమిటంటే సంగత్యదోషం అన్నమాట. అంటువ్యాధి అంటే వేరే అనుకునేరు, సంగత్య దోషం. అంటే జేరిపోవడం అన్నమాట అందులో. ఆ దేవుడికి శరీరంలో చేరగానే మిగిలినది అంతా మరచిపోయి శరీర భ్రాంతి కలిగింది. ఏర్పడనంతసేపూ బాగానే వున్నాడు. తల్లి గర్భంలోంచి విడుదలయ్యేంత వరకూ దైవం బాగా తెలుసు. బయటపడగానే దైవం మరచిపోయాడు. ఈ రకంగా ప్రతిదీ ఇంతే. రాను ఎటులో, పోను ఎటులో. ఇంకేం చేయాలండి? రానుదెటులో, పోనుదెటులో, అయినదెటులో, కానిదెటులో. ఏది ఎట్లా అయివున్నది? ఏది ఎట్లా లేకుండా వున్నది. ఈ

రెండూ తెలియాలట. ఇప్పుడు మనం లేనిదానిని ఆశ్రయించాలా? వున్నదానిని ఆశ్రయించాలా? వున్నదానిని ఆశ్రయించడానికి వీలౌతుంది. లేనిదానిని ఎట్లా ఆశ్రయిస్తావు అసలు? సాధ్యం కాదు కదా!

మనం ఇప్పటి వరకూ వున్న దానిని ఆశ్రయించామా? లేని దానిని ఆశ్రయించామా? (లేని దానిని) ఎందుకని? ఉన్నది తెలియక. కాబట్టి అయినది ఎటులో, కానిది ఎటులో, ముందు ఈ వివరం తెలియాలట. సద్గురువును ఆశ్రయించి అసలు ఏదయ్యా వున్నది? ఏది లేదయ్యా? ఇది మొట్టమొదట విచారణ చెయ్యి. ఎట్లా వచ్చావు? ఎట్లా పొయ్యావు. ఏది వున్నది? ఏది లేదు. ఇప్పుడు ఇలా విచారణ చేయడాన్ని ఏమన్నారట? కనియు, కానని తత్వ మెటులో. ఇప్పటి వరకూ చూస్తున్నది ఏమిటి? అది ఎట్లా లేకుండా పోయింది? వున్నది ఏమిటి? తత్వం. ఇదంటా ఇట్లా విచారణ చేయడాన్ని తత్వం అంటారండీ! తత్వం అంటే వేరే ఏమీ లేదు. M.A philosophy ను PhD చేస్తేనే తత్వం అవ్వదు. తత్వం అంటే ఏమిటి అంటే ఇలా విచారణ చెయ్యాలి. రాను ఎటులో, పోను ఎటులో. అయినది ఎటులో, కానిది ఎటులో. ఈ రెండు విచారణలు కనుక చేస్తే, అది తత్వ విచారణ అవుతుంది. అర్థమౌతుందా అండీ!

సత్సంగత్వము అంటే ఈ విచారణే సత్సంగము. మిగిలినది అంతా సత్సంగత్వము అవ్వదన్నమాట. అవన్నీ సత్కర్మలు. అంటే అర్థము ఏమిటి? మీరు భగవద్గీత వినొచ్చు, విష్ణుసహస్రనామం వినొచ్చు. లలితా సహస్రనామం వినొచ్చు. పూజలు చెయ్యొచ్చు, జపాలు చెయ్యొచ్చు. నవవిధభక్తి మార్గాలన్నీ ఆచరించవచ్చు. అవి ఏమిటవి? సత్కర్మలు. అవి ఏమిటి? సత్కర్మలు. కర్మ అంటే ఫలితం వుంటుందండి అక్కడ. ప్రేరణ వుంటుంది. ఫలితం వుంటుంది. అంటే ఆ సమయం గంట కొట్టేటప్పటికి విష్ణుసహస్రనామం చదవకపోతే ప్రమాదం వచ్చినట్టు వుంటుంది. ఇలాగ దాంట్లో అన్నీ వుంటాయన్నమాట. కర్మకు ఫలితం వుంటుందన్నమాట. నువ్వు సత్కర్మ చేసినా కూడా ఆశించి చేస్తావన్నమాట. ఆశ, అపేక్ష వుంటుందన్నమాట. అదే తత్వవిచారణలో జ్ఞానాపేక్ష తప్ప ఇంకేమీ వుండదు. ఏది అపేక్షిస్తే మిగిలినవన్నీ తొలగిపోతాయో, అది ఒక్కటే వుంటుందండి. కాబట్టి సత్సంగత్వము అంటే అర్థం ఏమిటంటే, విషయ సంగత్వమేమో కర్మ, గుర్తుపెట్టుకోండి. విషయ సంగత్వము చేరితే కర్మ. సత్సాంగత్యము ఏది సత్యము?

అంటే తత్వవిచారణ చేస్తే తెలియబడేది ఏదైతే వున్నదో, అది సత్. అర్థమైందా అండీ! తత్వం సత్యం కాదు. మళ్ళా తత్వం సత్యమనుకుంటారు చాలా మంది. తత్వాన్ని గూర్చి విచారణ చేస్తున్నాను కాబట్టి తత్వం సత్యమనుకోమాకు. ఈ తత్వ విచారణ ఒక స్థితిని అందింపచేస్తుంది. ఒకస్థితిని అనుభవజ్ఞానంలో తెలియజేస్తుంది. ఆ స్థితి సత్యం. అది సత్.

తత్వవిచారణ అంటే ఏమిటి? తత్ త్వం అనే రెండు అక్షరాలున్నాయి. తత్వంలో. తత్+త్వం. త్వం అంటే నేను, తత్ అంటే అది. రెండు వున్నాయా లేవా ఇప్పుడు? త్వం అనే నేనువున్నాను. తత్ అనే జగత్తువున్నది. అంతేకదండీ! బాహ్యంగా చూస్తే ఇద్దరము వున్నామా లేదా? జగత్తువుంది, నేనున్నాను. లోపలికి తిరిగావు. ఇప్పుడేముంది? అంతరాత్మ. త్వం. త్వం ఎవరు? అంతరాత్మ. తత్ ఎవరు? పరమాత్మ. అర్థమైందా అండీ! ఇప్పుడు ఇవి రెండు రెండూ వున్నాయి కదా! తెలుసుకోవాలి కదా! నువ్వు జీవితమంతా చేసిన ప్రయత్నం ఏమిటండీ? త్వం అనే నేను. తత్ అనే జగత్తుని తెలుసుకుని జీవించడం నేర్చుకున్నాను బాహ్యంలో. స్థూలంగా మాట్లాడితే. లోపలికి తిరగితే. నీ అంతరాత్మ పరమాత్మని ఎరగాలి. ఆ పరమాత్మ స్థితి తెలుసుకుని జీవించాలి. అంతే కదా! లోపల భాగం ఏమన్నా పనికి పూర్తైందా? కానీ దానికోసం తెచ్చుకున్న పనిముట్టు ముప్పాతిక అరిగిపోయింది, ఇంక పాతిక ఎప్పుడు అరుగుతుందో దానికే తెలియదు. ఎందుకని? మరణం ఎప్పుడో, ఎచ్చటో, ఎలా తెలుసు నీకు? ఇంటనో, నట్టనడివి యందో, బావియందో, ఎక్కడో నీకు ఎట్లా తెలుసు? పొలమందో, కాటియందో ఏమైనా తెలుసా? ఏమీ తెలియదే! మరి దేనికి సంసిద్ధుడువి అవుతున్నావు? జీవితకాలమంతా దేనికి సంసిద్ధుడవి అయినావు? (బాహ్యానికి) ఏమిటి ప్రయోజనం? ఈ బాహ్యం అసలు లేదుగా. ఉన్నదంతా ఏమిటి? ఎప్పుడూ వున్నది ఏమిటి? అంతరాత్మ, పరమాత్మే. (ఇప్పుడు దాకా వున్నది అనుకున్నది ఇదే కదా!) ఆఁ... అందుకని ఇప్పటి వరకూ దేనిని ఆశ్రయించావు? లేనిదానిని ఆశ్రయించావయ్యా బాబు. ఎప్పుడూ వున్నది ఏమిటయ్యా? అంతరాత్మ, పరమాత్మ. నువ్వు దేహాలు ఎన్ని మార్చినా, ఎప్పుడూ వుండేది ఏమిటి? అంతరాత్మ, పరమాత్మ. ★అన్ని దేహాలని ప్రశ్నించు. అందరూ ఏమి ఒప్పుకుంటున్నారు? అంతరాత్మ వుందని ఒప్పుకుంటున్నారు. ఎన్ని దేహాల అన్నింటిలో కూడా వున్నదదేగా, అంతరాత్మ

వుందని ఒప్పుకుంటున్నాడా లేదా? ఏరా నీకు అంతరాత్మ వుందా లేదా? ఉంది. పరమాత్మ వున్నాడా లేదా? ఒప్పుకుంటున్నావుగా. మరి ఎప్పుడూ వున్నది ఏమిటి? అంతరాత్మ, పరమాత్మ. అంటే అంతరాత్మ, పరమాత్మ స్థితిని ఎరగటం కోసం, దేహం వచ్చింది. కానీ, దేహాన్ని దేనికోసం వినియోగించాము? (కర్మల కోసం) ఏమైంది? ఇలాగ లేనిదానిని ఆశ్రయించేటటువంటి దాంట్లో భ్రాంతి వచ్చింది. లేనిదానిని ఆశ్రయించడమే భ్రాంతి అంటే. అందువల్ల అన్ని భయాలు వచ్చినాయన్నమాట. అర్థమైందా అండీ! ఈ లేనిదానిని ఆశ్రయించడం వల్లే, భ్రాంతి భయము ఏర్పడ్డాయి. భ్రాంతి ఎప్పుడైతే ఏర్పడిందో భయం ఏర్పడింది. ఎప్పుడైనా గుర్తు పెట్టుకోండి. ఏది చెయ్యాలన్నా అమ్మో నాకు భయం అన్నారంటే, దాని వెనుకాల భ్రాంతి వుంది. ఎప్పుడైనా ఒకటి గుర్తుపెట్టుకోండి. మీరు మనసులో, భావనలో విచారణ చేసుకోండి. ఏ పనిచేయాలన్నా, ఏ అంశాన్ని ఎదుర్కోవాలన్నా అమ్మో! నాకు భయమండి. భయం అనంగానే ఏమైంది? అప్పుడు? సహజంగానే దాని వెనుకాల భ్రాంతి వున్నది. భ్రాంతి ఎందుకు వున్నది? లేనిదానిని ఆశ్రయించావు కాబట్టి. ఇలా విచారణ తెలియాలన్నమాట మీకు మీకే. మీకు ఏదన్నా ఆలోచన స్ఫురించింది. ఆలోచన స్ఫురించగానే అమ్మో! నాకు భయం అనుకున్నావనుకో, భయం వుందనుకోగానే దాని వెనుక ఏముందని స్ఫురణకు రావాలి? ఓహో! ఎక్కడో భ్రాంతి వుంది కాబట్టి నాకు భయం వచ్చింది. దొంగ అంటే నాకు భయం అండి. ఎందుకని? సంపద మీద భ్రాంతి వుంది కాబట్టి. అర్థమైందా అండి. సంపదమీద ఎందుకు భ్రాంతి వుందండి? లేనిదానిని ఆశ్రయించావు కాబట్టి. ఎందుకని? వున్న సంపద ఏమిటి? సాధన చతుష్టయ సంపద అనేది వున్న సంపద. లేని సంపద ఏమిటి? వస్తు వాహన ధన ద్రవ్యములు అన్నీ, ధన ధాన్య ద్రవ్యములన్నీ లేని సంపద. అర్థమైందా అండీ! మనం అందరం కూడా మహాలక్ష్మినే కదా అందరం సంపద కోసం ప్రార్థించేది? అవునా అండీ! ఏముందండీ? మహాలక్ష్మి స్తోత్రంలో మొట్టమొదటి శ్లోకం? **"నమస్తేస్తు మహామాయే శ్రీ పీఠే సుర పూజితే శంఖ చక్ర గదా హస్తే మహాలక్ష్మీ నమోస్తుతే"** ఆ మహాలక్ష్మి స్తోత్రం అంతా చదివి చూడండి. ఎక్కడైనా ఆవెడ ధనం ఇస్తుందని కానీ, ధాన్యం ఇస్తుందని కానీ, ఐశ్వర్యం ఇస్తుందని కానీ ఎక్కడన్నా వుందా? ఎక్కడా వుండదండీ! ఎందుకంటే ఆవిడే మహామాయా స్వరూపిణి. స్పష్టంగా

చెబుతున్నారు. నమస్తేస్తు మహామాయే. ఎత్తుకుంటూనే మొదటి వాక్యంలోనే ఏమున్నదండీ? నమస్తేస్తు మహామాయే, అసలు దీనికి మించిన మాయే లేదు నాయనా! ఈ మహాలక్ష్మీ స్వరూపము కంటే మించిన మాయే లేదు. ఎందుకని? అదే మహామాయా స్వరూపము. ఇప్పుడు దేనిని ఆశ్రయించావు? మాయని. అయ్యో! మరి మాయ అంటే లేనిది కదా! మహామాయ అట. మళ్ళా అట్లా కాదు. అనంత సృష్టి ఎట్లా లేకుండా పోతుందో, చెప్పేటటువంటి మాయా స్వరూపిణి. మాయ అంటే ఊరికే పోతుందని అనుకోమాకండి. జ్ఞానాన్ని తెలియజెప్పడం కోసం అది ఏర్పడిందండి. వున్నదానిని తెలియజెప్పడం కోసమే లేనిది ఏర్పడింది. అందరు అంటారు ఇంతా అంటున్నారు కదండీ, అసలు ఈ సృష్టి అంతా ఎందుకు ఏర్పడాలండీ? ఈ లేనివన్నీ ఎందుకు ఏర్పడాలండీ? లేనిది అంతా వున్నది తెలియజెప్పడం కోసమే ఏర్పడింది. ఎందుకని? నీకు ఆ లేనిది అంటే ఏమిటో తెలిస్తేనే కదా! వున్నది గుర్తెరిగేది? అంటే ఆ లేనిది వదిలేస్తేనే కదా! లేనిది తెలియాలి, వదిలేయాలి. లేనిది తెలిసి వదిలేయాలి అంటే, అది ఉన్నదనే భ్రాంతి, నీ భ్రాంతి అది. దానికే సమస్యా లేదు. మహాలక్ష్మీ స్వరూపానికి ఎప్పుడూ ఇబ్బంది లేదు. ఎందుకని? దానికి నారాయణ స్వరూపము ఎప్పుడూ తెలుసు. నారాయణ హృదయమందే మహామాయ వున్నది. లక్ష్మికి నివాస స్థానం ఎక్కడ? నారాయణ హృదయం. నారాయణుడు అంటే ఎవరు? సర్వ జీవుల హృదయమందు వ్యాపించి స్థిరమై వున్నవాడు ఎవడో, వాడు నారాయణుడు. అంతే కానీ వైకుంఠంలో వున్నవాడు కాదు నారాయణుడు. అంటే ఇప్పుడు సర్వ జీవుల హృదయమందు మహాలక్ష్మి వున్నదా లేదా? సర్వ జీవుల పక్కన లేదు పొరపాటు పడుతున్నారు, సర్వజీవుల హృదయమందు నారాయణుడు వున్నాడు, నారాయణ హృదయమందు మహామాయ వున్నది. ఏమిటండి ఇవి? ఒక్కసారి విచారణ చేయండి.

ఆ నారాయణుడు పరమాత్మ. ఈ మహామాయ అంతరాత్మ. నీ అంతరాత్మగా ఆ మహామాయ వున్నది. ఆ అంతరాత్మ ఎవరి హృదయంలో వున్నది? పరమాత్మ హృదయంలో వున్నది. సర్వవ్యాపకమైనటువంటి పరమాత్మ యందు వున్నది. నీవు సర్వవ్యాపకత్వాన్ని తెలుసుకుంటే ఏమైంది ఇప్పుడు? మాయ ఎగిరిపోయింది. మహత్తు మిగిలిపోయింది. మహామాయలో రెండు శబ్దాలున్నాయండి. మహత్తు మాయ.

నారాయణుడిని తెలుసుకుంటావా? పరమాత్మని తెలుసుకుంటావా? సర్వవ్యాపకత్వాన్ని పొందావా? మాయ పోయింది. సర్వవ్యాపకత్వాన్ని పొందగానే మాయ విడిచింది. అంతే కదా! ఏం మిగిలింది? మహత్తు మిగిలింది. ఇక పరమాత్మవే. అర్థమైందా అండీ! కాబట్టి నమస్తేస్తు మహామాయే, శ్రీ పీతే – శ్రీ పీఠం అంటే ఏమిటండి? నారాయణ హృదయమే శ్రీ పీఠం. ఎందుకని? ఆయన శ్రీమన్నారాయణుడు. అందుకని శ్రీ చేరిందండి. లేకపోతే ఆయనకి శ్రీ శబ్దం లేదు. శ్రీమన్నారాయణుడు అనే శబ్దం లేదండి. నారాయణ శబ్దమే వుంది. శ్రీ పీఠం. ఈ మహామాయా శబ్దం అంతరాత్మగా వున్నప్పుడు ఈయన శ్రీమన్నారాయణుడు. ప్రకృతి వాచ్యం కూడా కలిసింది. లేకపోతే ఆయన పరమాత్మ వాచ్యుడు. నారాయణుడే. శ్రీ శబ్దం లేదు. ఎప్పుడైనా గుర్తు పెట్టుకోండి. ఎన్ని శ్రీ లు చేరితే, అంత ప్రకృతి బాగా చేరినట్టే. మనం అందరికీ ఏం రాస్తామండి? శ్రీశ్రీశ్రీశ్రీ అంటే బాగా ప్రకృతిలో బంధించబడ్డాడు అని అర్థం. అర్థమైందా అండీ? ఆ రకంగా ఎప్పుడైనా గుర్తుపెట్టుకోండి. శ్రీ ని ఆశ్రయించాలా? శ్రీ ఎవరి హృదయంలో వుందో, వాళ్ళని ఆశ్రయించాలా? (శ్రీ ఎవరి హృదయంలో వుందో వారిని ఆశ్రయించాలి) ఎందుకని? వాడిని ఆశ్రయిస్తే, ఈవెడ అందులోనే వున్నది కదా! అర్థమైందా అండీ! వాడిని ఆశ్రయిస్తే, ఈవెడ అందులోనే వుంది. అందుకని ఏం చెప్పారట? సర్వమును హరియించువాడు హరి. అంటే మాయతో సహా హరించెడి వాడు హరి. అని అర్థము. అంటే అప్పుడు ఏమి మిగిలింది? పరమాత్మానుభవము మిగిలింది. ఇప్పుడు మనం ఏం మిగిల్చుకోవాలని ప్రయత్నిస్తున్నాము? (లేనిదానిని మిగిల్చుకోవాలని) ఏమైంది ఇప్పుడు? చూడండి. ఎంతగా లేనిదానిని మిగిల్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నామో! జీవితమంతా దీని కోసమే కదా! ఒక్కసారి విచారణ చేసి చూడండి. నీ భయాలు, నీ భ్రాంతులు అన్నీ దేని కోసము? ఆ శ్రీ పీఠమేగా. అంతేనా అండీ! శ్రీ పీతే సుర పూజితే! స్పష్టంగా చెబుతున్నాడండి. సురపూజితే – దేవతలు పూజిస్తున్నారు. ఎవరా దేవతలు? నీ ఇంద్రియ అధిష్టాన దేవతలు అన్నీ దానినే పూజిస్తున్నాయి. ఎందుకని? దాని చేతే ఏర్పడ్డాయి కాబట్టి. నీ ఇంద్రియాల అధిష్టాన దేవతలు అంటే ఎక్కడ వున్నారు? ఎవరున్నారు? ఉన్నారా వాళ్ళంతా? లేరు కదా! ఎందుకని? సర్వవ్యాపక పరమాత్మయందు వాళ్ళందరూ అంశీభూతములు. అంతేనా అండీ! సూర్యప్రకాశములో

కిరణములు ఏమిటి? అంశీభూతం. అందులో భాగాలు. అలాగే నీ ఇంద్రియ అధిష్టాన దేవతలు అన్నీ ఎందులో భాగం? ఆ పరమాత్మ యందు భాగం. ఇంద్రుడు, వరుణుడు, యముడు ఇలా ఎంతమందినని పట్టుకుంటావు? సరాసరి సూటిగా ఒక్కటే పట్టుకో. పరమాత్మని పట్టుకో. పట్టుకుంటే, వీళ్ళు అంతా అందులో అంశీభూతమే కదా! ఇన్ని విడిభాగాలు లేవుగా అక్కడ. పరమాత్మను పట్టుకోవడం అంటే ఏమిటట? లేనిదానిని విడిచిపెట్టవయ్యా! ఉన్నదే వున్నది. ఇప్పటి వరకూ ఏం ప్రయత్నం చేశామంటే, పట్టుకోవడం అంటే ఎక్కడికో వెళ్ళి పట్టుకోవాలని అనుకుంటున్నావు. వైకుంఠం వెళ్ళి పట్టకోవాలా? కైలాసం వెళ్ళి పట్టుకోవాలా? అనుకుంటున్నావు. వైకుంఠ కైలాసాలలో దొరికేది కాదది. సర్వవ్యాపక స్థితి అది. అందుకే ఇందాక "**తారకము చూపెరుగవలెనన్నా**" లో ఏం చెబుతున్నారు? ఎందుకు క్షేత్రాలకు తిరుగుతారు? నీలోపల అంతరాత్మ వున్నది. అది పరమాత్మ స్థితి నుంచి ఏర్పడింది. ఆ పరమాత్మ యొక్క మెస్సెంజర్. భగవంతుడి యొక్క దైవ దూత. ఎవరు? ఆ అంతరాత్మ. ఈ అంతరాత్మ ఎప్పటికైనా, ఏ స్థితిని పొందాలి? ఆ దైవీ స్థితినే అనుభవించాలి. ఆ పరమాత్మ స్థితిని అనుభవించాలి. అందుకోసమే ఈ దేహం వచ్చింది. ఈ ఒక్క సత్యాన్ని గుర్తెరుగు. ఇప్పుడు ఏ క్షేత్రానికి పోతావు? ఏ రుద్రాక్ష మాలను, ఎన్ని రుద్రాక్ష మాలలు వేస్తే ఇది తెలుస్తుంది? ఎన్ని మణుగుల విభూతి పైనుంచి కిందకి రాస్తే తెలుస్తుంది? (బాహ్యానికి ఎంత చేస్తే మాత్రం ఏం ప్రయోజనం) ఈ గుర్తులో వుండు. జీవించేటప్పుడు ఈ గుర్తులో వుండు. కాబట్టి నమస్తేస్తు మహామాయే... శ్రీ పీఠే సుర పూజితే... శంఖ చక్ర గాదా హస్తే... మహాలక్ష్మీ నమోస్తుతే....!

శంఖము చక్రము గదా ధరించి వున్నదట కదండీ! దేనికి అండీ ఇవి? ఎప్పుడూ మనం విచారణ చేయలేదండి. అందుకోసమే చెబుతున్నాను. చక్రము పేరు సుదర్శన చక్రము. సు+దర్శనము ఆత్మ సాక్షాత్కారమే సుదర్శనము. వేరే ఇంకేమీ లేదండి. ఆ సుదర్శనము వలన అన్ని పాతకములు తొలగిపోయినాయట. అంధకారము నిర్మూలనే సుదర్శనము. అర్థమైందా? మీరు భాగవతము చదవండి చక్కగా.

ప్రాగ్ జ్యోతిష పురము అనే ఒక పురము వుంది. దానికి బాణాసురుడు దాని యొక్క అధిష్టానముగా వున్నాడు. అదంతా ఎప్పుడూ చీకటిలో వుంటుంది. ఆ చీకటిలో వుంటే

ఎప్పుడూ ఎవరికీ కనపడదు కదా! అసుర రాజ్యం అన్నమాట అది. శ్రీకృష్ణుడు అక్కడికి వెళ్ళాడు. వెళ్ళి ఏం చేశాడట? సుదర్శన చక్రాన్ని ప్రయోగించాడు. వెంటనే వెలుతురు వచ్చింది. ఎవరు ఎక్కడున్నారో కనపడింది. బాణాసురుడిని చంపేశాడు. ఇలాగ పౌరాణిక కథ. ఈ కథ ఇలా ఎందుకు చెప్పారు?

ఎవరు ఆ బాణాసురుడు? మనమే. మనలో వున్నటువంటి ఆ ఆసురీ సంపద అవునా అండీ! కఠినముగా మాట్లాడుట ఆసురీసంపద. దైవాసుర సంపద్విభాగ యోగం భగవద్గీతలో చదవండి. కఠినముగా మాట్లాడుట. ఆసురీ సంపద. రాక్షసుల లక్షణము అది. ఇతరులను బాధించుట ఆసురీ లక్షణము. అర్థమైందా అండీ! ఇవన్నీ మనలో వున్నాయా లేవా చూసుకోండి. అవే. కాబట్టి ఏం చెయ్యాలట ఇప్పుడు? సుదర్శన చక్రాన్ని ప్రయోగించు. ఆత్మసాక్షాత్కార జ్ఞానం కలుగగానే ఇవన్నీ తొలగిపోతాయి. దానికోసం ప్రయత్నం చేయి. ఇవి అవే పోతాయి. అందుకని ఏం చెప్పారట?

దుర్గుణాలను విడవాలి అంటే, నువ్వు సద్గుణాలను అవలంబించవయ్యా! ఏ జ్ఞానాన్ని అవలంబిస్తే ఇది తొలగిపోతుందో, ఆ జ్ఞానాన్ని అవలంబించు. ఈ గుణాల గురించి ఎప్పుడైతే నువ్వు చింతించావో, ఇవే వస్తాయి కదా! మళ్ళా. **'దేనిని మననం చేస్తే అదే వస్తుంది'**. నువ్వు వదిలెయ్యాలి అనుకుంటున్నావా? పోవాలి అనుకుంటున్నావా? మళ్ళా దీన్నే గుర్తులో పెట్టుకుని జీవిస్తే ఏమౌతావు? మళ్ళా అదే వస్తుంది. ఏది వదిలేయాలనుకుంటున్నావో, దానిని వదిలేసి జీవిస్తే, అది లేకుండా పోయింది. అంతేకదా! బాల్యం వదిలేయాలండి. వదిలేయాలంటే ఏం చేశావు? పై స్థితి, రావలసిన స్థితిని స్మరణ చేస్తూ వున్నావు. కీటకము వున్నదండి. తన చుట్టూ గూడు కట్టిందండి. సీతాకోక చిలుక ఎలా అయ్యింది? సీతాకోక చిలుక స్థితిని స్మరిస్తూ వుంటే, సీతాకోక చిలుక అయ్యిందా? గొంగళి పురుగు స్థితినే స్మరిస్తే, సీతాకోక చిలుక అయ్యిందా? గొంగళి పురుగుకూడా పాఠం బోధిస్తుంది చక్కగా. ఏమని బోధిస్తోంది? భవిష్యత్తు. నీ యొక్క యథార్థ జ్ఞానం ఏమిటి? నేను ఎవరిని అసలు? సీతాకోక చిలుకని. కానీ నేను ఎలా వున్నాను ఇప్పుడు? గొంగళిపురుగుగా వున్నాను. ఇది వదిలిపోవాలంటే దేనిని స్మరించాలి ఇప్పుడు? కాబట్టి. పరమాత్మని స్మరించవయ్యా! అనిత్యమైనటువంటివి లేనటువంటి వాటిని స్మరించడం చేత, వాటిని ఆశ్రయంచి జీవించడం చేత,

ఇలాగయ్యావు. కాబట్టి మీరందరూ కూడా రోజు వారీ చేసేవాటిని అన్నింటినీ ఇలా చక్కగా విచారణ చేసుకోండి. ఎందుకంటే తరించడం అంటే ఇది ఎవరో ఎత్తి తీసుకుని వెళ్ళి పడేసేది కాదు. '**నీ అంతట నీవు, స్వప్రయత్నము సాధనతో తరించవలసిందే, వేరే మార్గమే లేదు**'. అభ్యాస బలంతో, సాధనాబలంతో సాధించవలసిందే. ఈనాటికి పదేళ్ళ తరువాత మళ్ళా వచ్చింది అవకాశం. మాకు చెప్పడం పోయి, నాలుగేళ్ళు అయ్యింది. అంటే నేను చెప్పడం మానేసి, నాలుగేళ్ళు అయ్యిందండి. నాలుగేళ్ళ నుంచి ఎప్పుడూ చెప్పడం లేదు ఇంక. ఎందుకని అంటే చెప్పడం పోయింది. అదే వదిలేసిందండి. మళ్ళా ఎందుకు వచ్చిందో ఇప్పుడు వచ్చింది. మళ్ళా మీరు వచ్చేటప్పకి చెప్పటం అనే స్థితి వుండచ్చు, వుండకపోవచ్చు. ఇలాగ గురువుకు కూడా స్థితులు మారిపోతూవుంటాయి, ఎప్పుడూ కూడా. చెప్పేవాడికి కూడా స్థితులు మారిపోతూ వుంటాయి. వాడూ ప్రయాణం చేస్తూ వుంటాడు కదా! వాడూ సాధకుడే. వాడి జీవనం కూడా అలానే వుంది. కాబట్టి ఎప్పటికప్పుడు మీరు ఎప్పుడూ కూడా అందుబాటులోకి వచ్చినటువంటి, సువర్ణ అవకాశాలని వినియోగించుకున్నవాడే సాధకుడు. ఎందుకంటే మాకు కూడా ఇలానే చెప్పారు. మేము మా గురువు దగ్గరకు చేరినప్పుడు వారికి వాక్కులేదండి. వారు మౌనస్థితిలో వున్నారు, ఆ మౌనం నుంచి సొంతం బయటకి రాలేదు అప్పటికి ఇంకా. చివరి స్థితిలో వున్నారన్నమాట. ఆ ఈశ్వరీయ మౌనం చివరి స్థితిలో వుండగా వారి దగ్గరికి చేరాము. అప్పుడు ఆయనేమీ చెప్పేవారు కాదు. అంతా మౌనమే. ఏం చెప్పినా మౌనంలోనే. కాబట్టి మౌనంలో చెబితే, మౌనంలో తెలుసుకోగలిగే సామర్థ్యం నీకు వుంటే వుండమన్నారు, లేకపోతే పొమ్మన్నారు అంతే. నువ్వు నన్ను అడిగేదీ లేదు, నేను నీకు చెప్పేదీ లేదు. (మౌనంలో ఎలా వస్తుంది) వస్తుంది అదే మరి, నీవు సిద్ధపడితే వుండు లేకపోతే పో. దానికి తగ్గవాడివి అయితే వుండు లేకపోతే పో. నేను నా స్థితి ఇది. నేను అయితే ఏం చెప్పేవాడిని కాదు. నువ్వు అడిగినా నేనేమి చెప్పలేను. నేను మౌనంగా వుంటాను అంతవరకే. నేనేం చెప్పను. నువ్వు మౌనంలో, నీకు ఆ స్థితి వుండి, ప్రశ్నిస్తే నీకు సమాధానం వస్తుందని నీకు విశ్వాసం వుంటే వుండు. అంతే రోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వెళ్ళడం, కూర్చోవడం, గంటల తరబడి కూర్చోవడం రావడం. గంటల తరబడి కూర్చోవడం రావడం. అలా మౌనంగానే తెలుసుకోవడం వల్ల,

కొన్ని వందల మెట్లు ఒకేసారి నన్ను దాటించారు. వందల స్థితులు, మామూలుగా నడవాలి అంటే చాలా టైం పడుతుందండి. అలాంటిది ఇదే కఠిన పరీక్ష. ఈ కఠిన పరీక్షకు నీవు నిలబడు. తక్కువ అని అనుకోమాకు. ఇదేదో. ఈ పని, ఈ మౌనవ్యాఖ్యను తెలుసుకోవడమే అసలు అంతాకూడా. వేదాంతము అంతా ఈ మౌనవ్యాఖ్యను తెలుసుకోవడమే. (మౌనంగా వచ్చేవాటికి, నిజమా, అవునా కాదా? అనే doubt....) అసలు అందుకే చెప్పేది, నీవు విడిగా వుంటే ఇది విడిగా... అందుకనే ఏం చెప్పారు? రోజూ రా. నువ్వురోజూ వుదయం, మధ్యాహ్నం, సాయంత్రం నాలుగు పూటలా వచ్చి పో! మేము ఎలా వున్నామో, నువ్వు అలా వుండు. నీకు చెప్పేది ఏమీ లేదు. మేము ఎలా వున్నామో, నువ్వు అలా వుండు. నీకు ఏమన్నా ప్రశ్నలు, సమాధానలు అన్నీ ఇక్కడ వుంటే, ఏమన్నా పుస్తకాలు తెచ్చుకో, చదువుకో. నీకు చెప్పేది ఏమీ లేదు. ఆ పుస్తకం చదివినా కూడా నువ్వు అదేమిటి, ఇదేమిటి? అన్ని ప్రశ్నించినా నీకు చెప్పేది ఏమీ లేదు. మాట్లాడేదీ ఏమీ లేదు. నువ్వు కూర్చో ఇక్కడ, పో. అలాగే జరిగింది. కూర్చున్నాము వెళ్ళాము అలాగే సమాధానాలు వచ్చేసినాయి. ప్రశ్న సమాధానము అన్నీ అక్కడే పూర్తి అయిపోయినాయి.

అలాగ మహానుభావులు అయినటువంటి గురువులు ఏం చెప్తారయ్యా అంటే, వాళ్ళు ఎప్పుడూ ఇదే చెప్పేది. "**సమయం మించిపోతోంది. శరీరం ఎప్పుడు రాలిపోతుందో తెలియదు. శరీరం రాలిపోయి, స్థితి మారిపోయిన తరువాత నువ్వు వచ్చినా ప్రయోజనం లేదు**". కాబట్టి ఎప్పుడైనా సరే, దొరికిన సదవకాశాన్ని, జీవితంలో ఇహం కోసం ఎన్నో అవకాశాలనీ జారవిడుచుకున్నాం అండీ ఇప్పటి వరకూ. ఇప్పుడు కూడా ఏమంటున్నావు మళ్ళా? మళ్ళా గురువు దగ్గరకు వచ్చినాక కూడా, ఆ పాత అభ్యాసబలం విడవలేక, అయ్యో! అక్కడేదో ప్రమాదం వచ్చేస్తుంది, నిన్ను విడిచిపెడుతా నాయనా! మళ్ళా దానికి టైం వస్తుంది, టైం వచ్చినప్పుడు వస్తాను అన్నావు. నువ్వు టైం వచ్చినప్పుడు వస్తే, ఇక్కడ సిద్ధంగా వుండద్దూ? చెప్పడానికి?

కాబట్టి, గురువు అంటే ఏమిటంటే, అందుకే సశరీరులైన గురువులతో ఇదే ఇబ్బంది. అందుకని సశరీరులైన గురువులు కూడా అశరీర స్థితిలో వుండే చెబుతారు. శరీరంలో వుంటే చెప్పలేడు. అందుకని అశరీర స్థితిలో వుండి ఎప్పుడూ చెప్పేటటువంటి

వాడు, వాడు ఎప్పుడూ చెప్పేది ఒక్కటే, "**నాయనా! ప్రతి రెప్పపాటు విలువైనదే.**" ఎందుకని? ఏ రెప్పపాటులో శరీరం వదిలేస్తుందో నాకే తెలియదు. ఎందుకని? నా చేతిలో వుండదిక. ఎందుకని? ప్రకృతి అధీనమైపోయింది. దేన్ని దానికి అప్పజెప్పేసినవాడే ముక్తుడండి. నువ్వు మరణించిన తరువాత అప్పజెప్పే ప్రయత్నం చేస్తావు, అప్పజెప్పే అవకాశం లేక మరలా దేహంలోకి వస్తావు. వాళ్ళు జీవించి వుండగానే దేనిని దానికి అప్పజెప్పేస్తారండి. ఏ శక్తికి ఆ శక్తి, ఈ దేహాన్ని ఎప్పుడైనా కూడా అవి స్వీకరించవచ్చు. పంచభూతాలు, పాంచభౌతిక దేహాన్ని ఎప్పుడైనా కూడా స్వీకరించడానికి సిద్ధంగా వుంటాడు. ఎలావుంటాడయ్యా అంటే దానికి ఒక ఉదాహరణ చెప్తాను.

భగవాన్ రమణులు చాలా గొప్ప ఉపమానం జీవితంలో బాగా గుర్తుపెట్టుకోండి. ఎలాగయ్యా అంటే, "**పిచ్చివాని వంటిపై తుండుగుడ్డ ఎప్పుడు జారిపోయిందో అతనికి ఎట్లు తెలియదో, అట్లు దేహము జారిపోవును ముక్తునకు**". వీడయ్యా ముక్తుడు. నిర్ణయవాక్యం అన్నమాట ఇది. ఆ జ్ఞానానికి నిర్ణయవాక్యం ఇది. దేహం జారిపోయిందట. ఎట్లా జారిపోయిందట? పిచ్చివాని వంటిమీద తుండుగుడ్డవలె జారిపోయిందట. కాబట్టి ఇతను ఎందులో ఉన్మత్తుడై వున్నాడు? పరమాత్మ స్థితియందు ఉన్మత్తుడై వున్నాడు. దేహభావన లేదు. జగత్భావన లేదు. బాహ్యస్ఫురణ లేదు. ఆ దేహము ఎలా వుందట? ఒంటి మీద తుండుగుడ్డవలె వుందట. ఎప్పుడు జారిపోయినా అతనికి ఏమీ పనిలేదు. అలా వుంటాడయ్యా ముక్తుడు. ఎందుకని? భావంలో, అంతరాత్మలో దానిని వదిలేశాడు దానిని. కాబట్టి అలాగ ఎవడైతే వుంటాడో, ఈ వాక్యం నాకు 1996 లో తెలుసండి. అప్పటికి మా గురువుగారికి, బాహ్యస్ఫురణ లేదు. ఆయన ఏక వస్త్రధారి అప్పుడు. ఒక్క ఉత్తరీయము మాత్రమే చుట్టుకునేవారు అంతే. అలా వెళ్ళిపోతూ వుండేవారు. అంతే! ఒంటిమీద ఇంకా వస్త్రము వుండేది కాదు. (పుస్తకము చూసి చెప్పేది ఏమీలేదా? అంతా వాక్కేనా) ఏమీ లేదండి. అంతా సహజసిద్ధ జ్ఞానమే. (వారు పుస్తకము చూడందే...) ఏమీ అట్లాంటిది ఏమీ లేదండి. వట్టిదేనండి. అదే ఇప్పుడు ఇందాక చదివింది. మీకు అందుకే. తారకము చూపెరుగవలెనన్నా... చదువమన్నది. అందులో మీకన్నీ చక్కగా వుంటాయండి. శాస్త్రజ్ఞానం, పండిత జ్ఞానం ఇదంతా కేవలం (కవిత్వము

ఎట్లా అయితే వస్తున్నదో, వాక్కు కూడా అట్లే వస్తున్నది) అయ్యో! ఒక్కటి గుర్తు పెట్టుకోండి. సర్వము ప్రణవనాదంలో వున్నాయని వారే ఒప్పుకుంటున్నారు కదా! శాస్త్రజ్ఞానులు, పండితులు అంతా కూడా. ఆ ప్రణవ నాదం నీలో కూడా వున్నదండి. అదే హంసస్వరూపమండి. ఎవరికైతే ఈ హంస జ్ఞానము సహజసిద్ధముగా వున్నదో, వారిలో జ్ఞానము సహజసిద్ధముగా వుంటుందండి. మరి మేము ఎవరం పుస్తకాలు చదివి నేర్చుకోలేదండి. మేం నేర్చిన విధానం కూడా ఏమీ పుస్తకాలు చదివి నేర్చుకోలేదండి. మా చేత పుస్తకాలు చదివించలేదు అసలు. ఏ పుస్తకము చదివించలేదండి. ఒకవేళ అథవా ఎప్పుడైనా కానీ మాట్లాడాలంటే ఇప్పుడు మీతో మాట్లాడాలి అంటే ముందు ఏదన్నా చదివించడం లేదా? ఒక వాక్యమో, అర వాక్యమో, ఇట్లా ఏదన్నా, ఎవరన్నా పక్కన ఇట్లా కూర్చుండే వాళ్ళు. వస్తారు కదా ఎవరో ఒకళ్ళు. వాళ్ళు ఏదో పుస్తకము తెస్తే, ఆ పుస్తకములో ఏదన్నా ఒక వాక్యము చదవండి అనే వాళ్ళు. ఒక వాక్యం చదవగానే, ఆ చదివిందంతా అది పోయే, పుస్తకం పోయే, ఆ వాక్యం పోయే, అంతా పోయే, ఇటు తిరిగిపోతుందన్నమాట ఇక. ఇట్లా తిరిగి చెప్పేసెయ్యడమే. ఇట్లా చెప్పడమే ఇంతే. ఆ చెప్పేటప్పటికి పుస్తకము పూర్తైపోతుంది. (అంతే గానీ ఆయనకేమీ పుస్తక జ్ఞానమేమీ లేదు) అబ్బే! అసలు పుస్తకంతో ఏం పని లేదండి. అందుకే మొన్న మీరంత వచ్చినప్పుడు వారిని ఒక ప్రశ్న అడిగారు. దీనికి భగవద్గీతలో ఎక్కడ సమన్వయమండి? ఉపనిషత్తుల్లో ఎక్కడ సమన్వయమండి? అని ఒక ప్రశ్న అడిగారు. అందుకే మేము అప్పుడు సూటిగా చెప్పింది.

“**అనుభవజ్ఞుడైనటువంటి గురువు దగ్గరకు వచ్చి, శాస్త్రవిషయమును అడుగువాని కంటే మూఢుడు మరొకడు లేడు.**” ఎందుకని? పుస్తకం అనుభవాన్ని ఇవ్వదు నాయనా! జీవితం అనుభవాన్ని ఇస్తుంది. నిన్ను కడతేర్చాలంటే అనుభవజ్ఞానం వున్న గురువుకి సాధ్యం కాని, పుస్తకానికి సాధ్యం కాదు. పుస్తకం వల్లే సాధ్యం అయితే, గ్రంథాలయాలు ఎన్ని వున్నాయి? పుస్తకాలు అమ్మే షాపులు ఎన్ని వున్నాయి? ఎంతమంది పుస్తకాలు చదవడం లేదు. చదివినంతమాత్రాన ముక్తుడు అవుతాడా? అసాధ్యం. బుద్ధికి పదనుపెడతావు. అంతకు మించి వేరే ఏమీ లేదు నాయనా! నీ బుద్ధే నీకు అడ్డమని

తెలుసుకోలేవు. ఏ బుద్ధి అయితే నీకు అడ్డమో, దానిని అధిగమించేటటువంటి తెలివివున్నవాడు కావాలి. దానిని అధిగమించినటువంటి జ్ఞానము వున్నవాడు కావాలి. వాడిని ఆశ్రయిస్తే, ఎందుకు చెబుతున్నాను అంటే, నీవు ఏ ఇంద్రియాన్ని ఆశ్రయించినా కూడా అహం బలపడుతుంది. బలపడుతుందా? బలపడదా? ఉదాహరణ చెబుతాను చూడండి.

ఇప్పుడు మీ పిల్లలు అందరూ బాగా చదువుకున్నారు. వాళ్ళల్లో ఏమి వుంటుంది? అహం. వుంటుందా వుండదా? నేను M.Sc B.Ed, నేను double గ్యాడ్యుయేట్, నేను పోస్టు గ్రాడ్యుయేట్ ఎప్పుడైతే వాడు కష్టపడి చదివాడు కదా మరి అందులో, ఆ కష్టపడి చదివినప్పుడు వాడిలో వుంటుందా? వుండదా? వుంటుందా? వుండదా? ఎందుకని? కష్టపడితే, అహం ఏర్పడుతుంది. ఎందుకని? అది గుణం. దాని ధర్మం సహజంగా చూపెడుతుంది. మాకేమి వుందయ్యా అందుకని? మాకు చదువు లేదు నాయనా! వాడికి చదువు లేదు, ఇప్పుడేమి పోయింది? మాకేమీ ఇహలోక విద్యలు లేవు. నేనేమీ పెద్ద డిగ్రీలు చదువుకోలేదు. పెద్ద విద్యలేమీ చదువుకోలేదు. కానీ చావులేనివిద్య ఒక్కటే నా దగ్గర వుంది. నీ దగ్గర వున్న డిగ్రీలు నా దగ్గర లేవు. కానీ సర్వ జీవులకు, ఏది వుపయోగమో, ఆ విద్య వున్నది. అది ఎలా వచ్చిందయ్యా? సహజంగా వచ్చింది. అంతేగానీ సహజజ్ఞానమే కానీ, తెచ్చిపెట్టుకున్న జ్ఞానము కాదు. అంటే ఏమిటి మరి? వీడికి శృతిజ్ఞానము వుండదా? నీలోపల నుంచే శృతులు వచ్చినాయయ్యా! ఉపనిషత్తులు ఎలా వచ్చినాయి? మహర్షులు అసలు ఉపనిషత్తులు ఎలా చెప్పారు? ఏ పుస్తకము చూసి చెప్పారు? ఏ పాండత్యము చూసి చెప్పారు? ఇప్పుడంటే పుస్తకాలు అంటున్నారండి. ఆనాడు ఉపనిషత్తులు ఎలా చెప్పారు? ఆ సహజజ్ఞాన స్థితిలో వుండి చెబుతూ వుంటే, గ్రంథస్తం అయినాయి. ఆ గ్రంథస్తం అయినవి ఎవరి పరంపరలో వాళ్ళు, తరువాత ఎన్ని మార్పులు చేశారో ఎవరికి తెలుసు? కానీ, సహజజ్ఞానము ఎప్పుడూ సహజజ్ఞానమే. దాంట్లో ఏ మార్పు వుండదండి. నువ్వు శృతి స్మృతి పురాణములు ఎన్ని చదివినా, ఆ సహజజ్ఞానము వున్నవాడికి అవన్నీ ఎట్లా కనబడుతాయంటే, పిల్లలాటలవలె కనపడుతాయి. ఎందుకనంటే, నువ్వున్న స్థితిని బట్టి అర్థం తీస్తూ వుంటే, దానిలో రకరకాల అర్థాలు వస్తాయి. మహాభారతము ఒక రాజకీయనాయకుడు

చదివాడనుకోండి, వాడికి రాజకీయం లాగా కనబడుతుంది. అర్థమైందా అండీ! ఒక సామాజికుడు చదివాడనుకోండి, సంఘసంస్కర్తగా కనపడుతాడు శ్రీకృష్ణుడు. ఒక భక్తుడు చదివాడనుకోండి, భగవంతుడిలాగా కనపడుతాడు. ఒక జ్ఞాని చదివాడు అనుకోండి, నేను శ్రీకృష్ణుడినే అనే స్థితిలో వుండి చూస్తాడు దానిని. మరి ఇప్పుడు ఎలా ఎవరి ధోరణికి ఎట్లా తోచింది అది. అలా రాయటమే శాస్త్ర సమ్మతం. పుస్తకం అంటే ఏమిటంటే, ఎవరు ఏ భావంలో చూస్తే, అది అలా కనపడాలి. అట్లా రాస్తేనే అది శాస్త్రం. అందుకే ఇంతకాలం ఇన్ని యుగాలైనా కూడా అది అట్లా నిలబడి వున్నాయి. ఎవరు దానికి గురుడు శిష్యుడు లేకపోయినా ఎందుకు నిలబడి వున్నాయి? ఎవరు ఏ భావంతో చూస్తే, అలా అవి కనబడుతాయి. ఆ భావాన్ని బోధిస్తాయి అవి. మరి నీకు నీవున్న స్థితికి బోధించేవాడు ఎవడు? అందుకు అవసరం వచ్చింది నాయనా గురువు.

ఒకటి గుర్తుపెట్టుకోండి. '**న శాస్త్రం వినా జ్ఞానం**' అంటే శాస్త్రం చదువక పోతే జ్ఞానం లేదు. అనేది సూత్రం. అయితే '**న గురుర్వినా ముక్తిః**' (అది జ్ఞానం వస్తుంది కానీ ముక్తి రాదు) అర్థమైందా అండీ! న శాస్త్రం వినా జ్ఞానం శాస్త్రం లేకుండా జ్ఞానం రాదు. కానీ, న గురు వినా ముక్తిః ముక్తి రావాలంటే మాత్రం నువ్వు శాస్త్రం పట్టుకుంటే ప్రయోజనం లేదు నాయనా! శాస్త్రం చదువుకోవాలి, మీతో చదివించడం లేదా? కావలసినంత మేరకు చదివితే చాలు. ఎందుకయ్యా అంటే, ఒకటి గుర్తు పెట్టుకోండి, ఇది జీవితకాలం గుర్తుపెట్టుకోవాలండి. ఎంతోమంది కొన్ని లక్షల కోట్ల మంది, ఈ శాస్త్ర అరణ్యములో చిక్కుకుని వుంటారండి. ప్రాథమిక సాధన దగ్గరే ఈ శాస్త్రారణ్యములో చిక్కుకుని వుంటారండి. కొన్ని జన్మల పాటు ప్రయత్నించాలండి, దీనిలోనుంచి బయటకు రావాలంటే, కొన్ని జన్మలు అని చెబుతున్నాను, స్పష్టంగా. కొన్ని జన్మలు, ఎంతోమందిని చూశాము మేము.

ఉదాహరణ చెబుతాను వినండి దానికి. భగవాన్ రమణుల దగ్గరకి కావ్యకంఠ గణపతి ముని అని ఒక మహానుభావుడు చేరాడండి. ఆయన 108 ఉపనిషత్తులు తెలిసినవాడు. శృతి స్మృతి పురాణములు చక్కగా తెలిసినటువంటి వాడు, ఆ దినం ఏంచేశాడయ్యా అంటే, ఆ మహానుభావుని దగ్గరకి చేరాడు. ఏవండి అన్నీ శృతి స్మృతి పురాణములు అన్నీ నేను చదివాను. వేదములు చదివాను. వేద భాగములు చదివాను. 18

పురాణములు చదివాను. సంస్కృత భాషలో దిట్ట. అంతటి దిట్ట ఎవరూ లేడన్నమాట. అలాంటి కావ్యకంఠ గణపతి ముని భగవాన్ రమణులను ఆశ్రయించగా, భగవాన్ రమణులు వారిని, ఒక సంవత్సరం పాటు వున్నాడండి, భగవాన్ రమణుల దగ్గర. ఆయనేమీ చెప్పలేదు. ఈ మహాపండితుడు ఆయన దగ్గర చేరితే, ఆయనేమీ చెప్పలేదండి, ఒక సంవత్సరం పాటు. మౌనం. ఆయనెప్పుడూ మౌన స్వామి భగవాన్ రమణులు. అంతా మౌనమే బోధ. అలాగ ఎప్పుడైతే ఆయన చేరిన తరువాత ఆయన ఒక్కటే మాట చెప్పాడండి. సంవత్సరం తరువాత ఒక్కటే వాక్యం. అదే ఉపదేశం. "**ఇప్పటి వరకూ తెలుసుకున్నదంతా విడిస్తే, ముక్తి సాధ్యం**" అన్నారు. ఏమనలేదండీ. ఇంతే ఒకటే మాట అన్నారు. ఇప్పటి వరకూ నువ్వు తెలుసుకున్నదంతా విడిస్తే, ముక్తి సాధ్యం అన్నారండి. ఇక అంతే. ఆయన వెంటనే తాను చదివిన విద్యా జ్ఞానం శృతి స్మృతి పురాణ ఇతిహాసములను మొత్తం ఒక్క క్షణంలో నేను విడిచి పెడుతున్నాను అన్నాడండి. ఎందుకని? సంవత్సరం పాటు ఆయన దగ్గర వున్నాడు. సంవత్సరం పాటు వేచి చూస్తే, ఈ ఒక్క వాక్యం చెప్పాడండి. కాబట్టి గురువు ఒక వాక్యం చెప్పాడు, ఒక మాట చెప్పాడు అనుకోమాకండి. అందులో అనంతమైనటువంటి శక్తి వుంటుంది. నిన్ను జన్మ జన్మల పాటు దాటించ గలిగేటటువంటి, ఇవాళ పనికొస్తుంది అనుకుంటున్నావేమో, గురుసత్తాని ఆశ్రయించి గనుక నీవు జీవిస్తే, ఈ జన్మకు కాదయ్యా నిన్ను ఎన్ని జన్మల పాటైనా తరించగలిగేంత శక్తి, సామర్థ్యం అందులో వుంటుంది. అందుకే సద్గురువు యొక్క గొప్పతనం. ఆ సద్గురువు యొక్క అద్భుతం ఏంటయ్యా అని అంటే, ఇదేనయ్యా! ఈ సద్గురువు యొక్క మహత్యం ఏమిటయ్యా అంటే, అదే! సద్గురు మహత్యం వల్ల, ఎవడైతే సద్గురువుని ఆశ్రయించి జీవిస్తున్నాడో, అతని ప్రభావం చేత, ఈతనికి కొన్ని జన్మల పాటు, అవతలికి జారిపోతాడు. ఆ జన్మలన్నీ కూడాను దాటించగలిగే సామర్థ్యం అతని చేతిలో వుంటుంది. అందుకే చెప్పేదండి. బ్రహ్మరాతను మార్చగలిగినటువంటి వాడు ఎవరైనా వున్నారా అంటే వాడు సద్గురువు. ఎందుకని? బ్రహ్మరాత అంటే నీ జీవితం. అంతే కదా!

నీ జీవితాన్ని మార్పు చేసేస్తాడు. ఎందుకని? నువ్వు సద్గురుని ఆశ్రయిస్తే, సద్గురువు సృష్టిని అధిగమించి వుంటాడు కాబట్టి.

నువ్వు ఏ సృష్టి కర్త అంటావో, ఆ సృష్టి కర్త స్థితిని అధిగమించి వుంటాడు సద్గురువు ఎప్పుడూ కూడా. కాబట్టి అట్టి సద్గురువును ఆశ్రయించవయ్యా ! తరించాలంటే సద్గురువును ఆశ్రయించు. ఇందాక ఏంచెప్తున్నాడు? '**తారకము చూపెరుగవలెనన్నా, సద్గురుని కృపచే**' వేరే మార్గము లేదు నాయనా! సద్గురువు కృప తప్ప వేరే మార్గము లేదు ముక్తి కావాలంటే. అందుకే ఇందాక చెప్పింది. న శాస్త్రం వినా జ్ఞానం. న గురు వినా ముక్తిః. చాలామంది మొదటి వాక్యం వరకే పట్టుకుంటారండి. శాస్త్రం వినా జ్ఞానం వరకే చెప్తారండి. ఎందుకని? జ్ఞానం వస్తే కదా నీకు ముక్తి సంగతి. ముక్తికి జ్ఞానంతో పని లేదయ్యా! సద్గురువే అంతా. గురుసేవ, గురునిష్ఠ, గురుభక్తి, గురువాక్యం ఈ నాలుగండి. ఎప్పుడైనా గుర్తుపెట్టుకోండి. గురుసేవ, గురునిష్ఠ, గురుభక్తి, గురువాక్యము. ఈ నాలుగు పాటించిన వాడికి ముక్తి సహజము. జ్ఞానము సహజము. సహజజ్ఞానము వుంటుందండి వాడికి. ఏం నేర్చుకుని అతుకులు, బొతుకులు వేసినటువంటి అతుకులబొంతేమీ వుండదు వాడి దగ్గర. వాడిలో సహజజ్ఞానము వుంటుంది. ఆ సహజజ్ఞానమే నీకు మరణంలో పనికి వచ్చేది. ఈ అతుకుల బొంత వేసునటువంటి శాస్త్రజ్ఞానం అంతాకూడా బుద్ధి జారగనే పడిపోతుంది. అక్కడ అడుగుతాడండి ఆయన, కావ్యకంఠ గణపతిముని ఈ ప్రశ్న అడుగగానే ఒకమాట అడుగుతాడండి. మౌనంలోనే వాళ్ళిద్దరూ మాట్లాడుకున్నారన్నమాట. అదే తరువాత మీరు ఎక్కడైనా కానీ, భగవాన్ రమణమహర్షి యొక్క సంవాదము, కావ్యకంఠముని భగవాన్ రమణలకి జరిగిన సంవాదం గ్రంథస్తం చేశారండి. అది ఎప్పుడైనా చదివి చూడండి. అందులో వుంటాయన్నమాట. ఎన్నో రహస్యాలు వున్నాయండి అందులో. ఏమిటంటే, ఏమండి మీరంతా కష్టపడి జీవితమంతా సంస్కృత పాండిత్యం నేర్చుకుని వచ్చాం కదా! ఇవన్నీ వదిలేయమన్నారు ముక్తి కోసం అంటే, నాయనా! ఈ సృష్టిమొత్తం మీద వెలుగు చొరవడిని అడవి ఎక్కడైనా వుందా? సూర్యకిరణాలు సోకనటువంటి అడవి ఎక్కడైనా వుందా? అని అడిగారు. అదేమిటండీ? సూర్యుని వెలుగు సోకకుండా భూమి మీద ఏముంటుంది? మా శాస్త్రంలో ఎక్కడా లేదండి అన్నారు. ఆ శాస్త్రారణ్యమే సూర్యుడ సోకని అడవి నాయనా! నీవు

అనుకునే జ్ఞానం అంతా కూడా, నీ బుద్ధి చిన్న నిద్రలోకి పోగానే ఎక్కడుంది? భగవద్గీత కంఠోపాఠమే, 780 శ్లోకాలు బాగా వచ్చినాయి. నిద్రపోయేటప్పుడు, వెళ్తున్నావా? రోజూ నిద్రలోకి వెళ్తున్నావా? చూడు ఒక్కసారి. నీ భగవద్గీత జ్ఞానము ఎక్కడుంది? ఎంతసేపు వుంది? ఏమైందిప్పుడు మరి? ఉండాలిగా మరి ఎప్పుడూ నీతోటి? కాబట్టి శాస్త్రజ్ఞానము అసహజం. అది అతుకుల బొంత. ఇప్పుడు ఈ శాస్త్రాన్ని నమ్మావు. ఇంతకు ముందు ఇంకో శాస్త్రాన్ని నమ్మలేదా? అప్పుడూ నమ్మావుగా. ఇది అయిపోయినాక ఇంకో శాస్త్రాన్ని నమ్మవా? స్థితి మారిపోతే ఇంకో శాస్త్రాన్ని నమ్ముతావుగా. ఏమైంది ఇప్పుడు? కాబట్టి నీవు సహజజ్ఞానాన్ని పొందే ప్రయత్నం చేయినాయనా. గురువు అంటే ఏమిటంటే, గురువుని నమ్మమని ఏ గురువు చెప్పడండి. నన్ను నమ్మమని ప్రపంచంలో ఏ గురువు చెప్పినా ఆయన గురువు కాదు. ఒక్కటే గుర్తు పెట్టుకోండి. నీకు గురువు ఎందుకు కావాలయ్యా? సహజజ్ఞానం కోసం కావాలి. నీలో వున్నటువంటి సహజజ్ఞానాన్ని నిద్రలేపేవాడన్నమాట అతను. శాస్త్రజ్ఞానాన్ని బోధించేవాడు కాదండి. నీవు సహజంగా జ్ఞానస్వరూపుడివి అయివున్నావు. నీవు సహజంగా ఆత్మస్వరూపుడివై వున్నావు. నిన్ను ఆ స్థితిలో మేలుకొల్పేవాడు. అది అతను చేసేటటువంటి పని. ఒకటే పని చేస్తాడు. తన సత్తాని, శక్తిని ఉపయోగించి, తాను ఏది అనుభవిస్తున్నాడో, ఆ స్థితిలో వుండి, ఆ స్థితిలో వుండే వాక్యం చెబుతూ, నీకు అనుభవం వచ్చేటట్టుగా చేస్తూ, మార్పుచేస్తూ, నిన్ను సహజజ్ఞానస్వరూపుడిగా చేస్తాడు. అప్పుడేమైంది? చిన్న నిద్రలో అది పోదు. పెద్దనిద్రలోకూడా అదిపోదు. అది సహజంగా ఆ జ్ఞానం అలానే వుంటుంది. ఎందుకని? నీవు ఆత్మస్వరూపంలో జ్ఞానస్వరూపుడివే అయివున్నావు. నీవు జ్ఞానస్వరూపుడివే అయివుండగా, మళ్ళా ఇప్పుడు ఆత్మకు ఏం చేస్తున్నావు? నీకు ఈశావాశ్యోపనిషత్తు బోధిస్తానండి, నీకు కఠోపనిషత్తు బోధిస్తానండి, నీకు భగవద్గీత బోధిస్తానండి, అవన్నీ ఎందులోనుంచి వచ్చినాయి? నీ స్వరూపజ్ఞానంలోనుంచేనా? నీ స్వరూప జ్ఞానాన్ని పుస్తకంలో, అక్షరరూపంలో వ్యక్తీకరించ పూనుకుంటే, అది అయ్యింది. అంతేనా అండి. వ్యక్తీ కరణ సత్యమౌతుందా, నువ్వు సత్యమౌతావా? నువ్వే కదా సత్యం. అర్థమైందా అండీ!

కాబట్టి నీవు ఇట్లా విచారణ చేసుకో నాయనా! ఇలా విచారణ చేసుకుని అనుభవజ్ఞానాన్ని పొందు. కాబట్టి మరణకాలంలో కూడా నీకు ఉపయోగపడేది

ఏమిటి? సహజజ్ఞానమే ఉపయోగపడుతుంది. అదే తరించడానికి అవకాశం. ఆ సహజజ్ఞానం నీకు సాధన చతుష్టయ సంపత్తిని అభ్యాసం చేసి జీవిస్తేనే సాధ్యమౌతుంది. ఆ సాధన చతుష్టయ సంపత్తిని ఎల్లకాలము మరువకూడదు. అలాగే, చతుర్విధ శుశ్రూషలు. గురువుకు చేసేటటువంటి నాలుగు శుశ్రూషలు, అంగ, స్థాన, భావ, ఆత్మ శుశ్రూషలు. ఈ నాలుగు, ఆ సాధనచతుష్టయ సంపత్తి, చతుర్విధ శుశ్రూషలు. ఆ నాలుగు ఈ నాలుగు నిజజీవితంలో ఎవడైతే త్రికరణ శుద్ధిగా పాటిస్తాడో, వాడికి ముక్తి సిద్ధము. వాడు ఏమీ చదవక్కర్లేదు. ఏమీ వాడికి పాండిత్యము అవసరం లేదు. సంస్కృత భాష అవసరం లేదు. తెలుగు భాషకూడా రాని వాళ్ళు వున్నారండి. భూసం వెంకయ్యగారని, కావాలంటే చూపెడుతాం. చల్లపల్లికి దగ్గర భూసం వెంకయ్యగారు వుండేవాళ్లు. ఆయన నిరక్షరకుక్షి. ఆయన సద్గురువు. మహానుభావుడన్నమాట. ఆయన ఫోటో అక్కడ ఆశ్రమంలోవుంటుంది. బళ్ళా సుబ్బనాగన్నగారి ఆశ్రమంలో వుంటుంది. ఆయనకు ఏమీ రాదండి. అక్షరజ్ఞానం లేదు. అంతా వేలి ముద్రే. సాలి పని చేసుకునేవారు. బూసం వెంకయ్యగారు. ఏమీ లేదు. అలా సహజజ్ఞానం సిద్ధించింది. వాళ్ళు పాటించేవి ఇవి నాలుగేనండి. నాయనా సాధన చతుష్టయ సంపత్తి అంటే ఇదిగో ఇది. ఇలా ఈ నాలుగు సంపదలని జాగ్రత్తగా గుర్తుపెట్టుకుని సాధించు నిజజీవితంలో. నాలుగు శుశ్రూషలు, గురువుకి నాలుగు శుశ్రూషలు చెయ్యి. ఏమిటవి? అంగ, స్థాన, భావ, ఆత్మ శుశ్రూషలు. అంగ శుశ్రూష అంటే ఇందులో బాహ్యార్థాలు, అంతరార్థాలు రెండూ వున్నాయి. అంగశుశ్రూష అంటే గురువుగారి శరీరానికి సేవచేయమని, కానీ అది కాదండి. గురువు శరీరము, నా శరీరము వేరుగా లేవండి. రెండూ ఒకటే. అనే భావనలో నిలిపివుండు. నీ శరీరం మీద నీళ్ళు పోసుకున్నావు. ఇప్పుడు ఎవరికి అభిషేకం చేస్తున్నావు? గురువుగారికి. నువ్వు భోంచేస్తున్నావు, ఎవరికి ఆహారము పెడుతున్నావు? గురువుగారికి. ప్రతిదీ. ఈ శరీరంతో చేసే ప్రతి పని, ప్రతి భావాన్ని, ప్రతి ఆలోచనని, ఈ గురువు యొక్క దృష్టిలో వుండి చేయి. అప్పుడు అంగ శుశ్రూష అవుతుంది. అదే శుశ్రూష. అంతేగాని నీ కాళ్ళు నొక్కడాని, నీ చేతులు నొక్కడాలు, నీ కంఠం నొక్కడాలు ఆయనకు ఏమీ అవసరం లేదు. అర్థమైందా అండీ! ఇవన్నీ అధిగమించేసిన వాడు ఆయన. అంతేగాని నువ్వు ఆయన కాళ్ళమీద పడినంతమాత్రాన ఆయనకు ఒరిగేది ఏమీ లేదు.

ఆయన కాళ్ళ మట్టి నీకు అంటటం తప్ప ప్రయోజనం లేదు. అది అవసరమైన వాళ్ళకి చెబుతాం. ఎందుకంటే బాగా అహంకారం వున్నటువంటి వాళ్ళు, పడితేనే గాని, ఆకాళ్ళమీద పడితేనే గాని, తల బాదుకుంటేనే కాని పోనప్పుడు చెబుతాం. అయినా కూడా మా పద్ధతి అది కాదు. మాది సహజజ్ఞానపద్ధతి. కేవలం ఇహంతో పని లేకుండా, నీవు సహజంగా జ్ఞాన స్వరూపుడవని, నీతో కలిసివుండి, నీతో సమంగా వుండి బోధించడమే మా పద్ధతి. ఎందుకనిట? ఒకటి గుర్తు పెట్టుకోండి. గోష్టి. మనం ఇప్పుడు మాట్లాడుకున్నదంతా కూడా గోష్టి. అంటే పూర్తి స్వేచ్ఛ వున్నది ఎవరికైనా సరే. నాకే కాదు మీకు కూడా మాట్లాడడానికి పూర్తి స్వేచ్ఛ వున్నది. ఎప్పుడైనా గుర్తుపెట్టుకోండి, శ్రీ కృష్ణుడు ఉద్ధవుడికి ఏమౌతాడు? గురువా శిష్యుడా? మిత్రుడా? మిత్రుడు కదా! ★ మిత్రుడు, ప్రాణ మిత్రుండి. కాబట్టి పరమాత్మ... గోపికలు ఎలా వున్నారు? ఏమన్నా ఎడం వుందా వాళ్ళకి? లేదు కదా! అలాగ గురుశిష్యులు కలిసివుండాలి నాయనా! నేను గురువుని అనే అహం అతనికి పనికిరాదు. నేను శిష్యుడను అనే న్యూనతాభావం నీకు పనికి రాదు. అమ్మో! నేను శిష్యుడని, నేను దూరంగా వుండాలి, నేను భయం... అనుకోమాకు. గురువుతో మమేకంగా కలిసి జీవించు. '**ఉన్నతమైన వాటితో కలిసి జీవిస్తే నీకు ఉన్నతమైన జీవితమే లభిస్తుంది**.' నీచమైన జీవితం లభించే అవకాశం లేదు. ఎందుకని? వాళ్ళ దగ్గర వున్న లక్షణమే అది. అర్థమైందా అండి?

వాళ్ళు పతనం చెందరు, మరొకరిని పతనం చెందనివ్వరు. ఎందుకని? జన్మజన్మల యొక్క సంస్కార బలం, వాసనాబలం మొత్తాన్ని అధ్యయనం చేసినటువంటి సామర్థ్యం వున్నటువంటి వ్యక్తులు వాళ్ళు. నీవు ఏం చేస్తే బాగుపడుతావో నీకు తెలియకపోవచ్చు కానీ, వాళ్ళకు తెలుసు. అర్థమైందా అండి? నీకు ఎంత కష్టమైనా సరే! నీకు దుఃఖం వచ్చినా సరే, వాళ్ళు చెబుతూనే వుంటారు. ఎందుకని? ఆ దుఃఖం పోవాలి కదా! మరి. కాబట్టి వాళ్ళని ఆశ్రయించాలి అని అంటే, నీవు ఈ అంగ, స్థాన, భావ, ఆత్మ శుశ్రూషలు చేయాలి నాయనా! స్థాన శుశ్రూష అంటే ఏమిటి? స్థాన శుశ్రూష అంటే, గురువు గారు కూర్చునే ధ్యాన మందిరం, పూజా మందిరం, ఆ గురువుగారి ఇల్లు అవి బాహ్యార్థం. అంతరార్థం ఏమిటంటే, గురువు సర్వవ్యాపి కదా! మరి ఎక్కడుంటాడు? సర్వవ్యాపకం అయినటువంటి వాడు నీ హృదయంలో వున్నాడు. కాబట్టి నీ హృదయం అంటే ఏమిటి?

ప్రాణ మనో బద్ధులు ఎక్కడైతే లీనమౌతున్నాయో అదే నీ హృదయం. ఎప్పుడైనా గుర్తు పెట్టుకోండి. నీ హృదయ స్థానం ఎక్కడా? అని ఎవరైనా అని ప్రశ్నిస్తే, మిమ్మల్ని మీరు అడిగితే, నా హృదయం ఎక్కడా? ఎక్కడైతే ప్రాణ మనస్సులు లీనమౌతున్నాయో, ఆగిపోతున్నాయో, అది నీ హృదయస్థానం. ఇప్పుడు గాఢనిద్రావస్థలో నీకు నీ మనస్సు ఆగిపోతుందా లేదా? ఎక్కడదాకా వచ్చావు? అప్పుడు ఎక్కుడున్నావు? కంఠం వరకూ వచ్చావు. అందుకే తల వాలిపోతుందండి. నిద్రలోకి పోగానే ఏం వాలిపోయింది? తల వాలిపోయింది. అంటే కంఠస్థానం వరకే వచ్చావు. గుర్తుపెట్టుకోండి. కాబట్టి ప్రాణం, ఈ ప్రాణం కూడా హృదయస్థానంలో లీనమైపోతుంది. నువ్వు దేనినో ఒకదానిని ఆశ్రయించు, ప్రాణాన్నో, మనస్సునో. నీకు ఏది చేతనైతే దానిని ఆశ్రయించు. ఈ మనస్సును వెంబడిస్తూ పో. గమనిస్తూ పో. కొంతసేపటికి మనసు లేకుండా పోతుంది. కదలకుండా ఆగిపోతుంది. ఆ కదలకుండా, ఆలోచనలు లేకుండా, ఆగిపోయిన స్థానమే హృదయస్థానం. అలాగే ప్రాణం మీద ఆధారపడి చేస్తానంటావా? ఆ ప్రాణాన్ని గమనిస్తూ పో. కొంతసేపు అయ్యేప్పటికి ప్రాణ చలనం ఆగిపోతుంది. ఆగిపోయిన స్థితి ఎక్కడైతే వుందో అదే నీ హృదయస్థానం. అని భగవాన్ రమణులు హృదయస్థానం గురించి అందరికీ అర్థమయ్యే భాషలో చెప్పారు. ఆయన ఒకటి రెండు వాక్యాలే చెప్పారండి చక్కగా. ఆయన ఉన్నది నలుబది అని నలభై శ్లోకాలు చెప్పారండి. (ఆగి పోయిన స్థితి పోదా) పోలా ఇట్లా తెలుసుకో, నీకు అదే తెలుస్తుంది. ప్రాణాన్ని గాని, మనస్సుని గాని, ఏదో ఒకదానిని గమనించు, అది కొంతదూరం అయ్యేటప్పటికి చలనం ఆగిపోతుంది. నువ్వేమి, నీ ప్రయత్నం అవసరం లేదు, నువ్వు గమనిస్తూ వుంటే చాలు. వాటి చలనం ఆగిపోతూ వుంటుంది. ఆ ఆగిపోయిన స్థానంలో నీకు తెలివి వుంటుంది. ఆగిపోయిన స్థితిలో తెలివి వుండాలి మళ్ళా. మళ్ళా నిద్రలో కూడా, తెలివి లేకుండా పోతే, నిద్రలోకి పోతే ప్రయోజనం లేదు. నీకు తెలివి వుండాలి. వాటి చలనం ఆగిపోతుంది. సహజంగా ఏ ప్రయత్నం లేకుండా. (ఆగిపోయింది తెలియటం లేదు ఇప్పుడు) తెలుస్తుంది, తెలుస్తుంది. నిద్రయొక్క ప్రభావం తగ్గిపోతే తెలుస్తుంది. తమోగుణ ప్రభావం తగ్గిపోతే తెలుస్తుంది. తగ్గిపోతుంది. అన్నీ తగ్గిపోతాయి. ఒకటి గుర్తుపెట్టుకోండి. నీ స్వప్రయత్నం వున్నప్పుడు ఎప్పటికీ తెలియదండి. నిన్ను నువ్వు

బయటే సరిగ్గా తెలుసుకోలేకపోతున్నావు, లోపల ఎట్లా తెలుసుకుంటావు? ఈ శాస్త్రజ్ఞానంలో వున్నంత సేపు, ఈ మిడిమిడి జ్ఞానం వున్నంత సేపు, ఇలాగే ప్రయత్నం చేస్తారు. నిన్ను మర్చిపో కాసేపు. భారం భగవంతుడి మీద వెయ్యి. గురువు మీద వెయ్యి. చక్కగా ఆ గురువును ధ్యానించు. గురువు రూపాన్ని ఉపాసించు. అదే దైవం. ఆ రూపాన్నే పట్టుకో. దాని మీదే దృష్టి నిలబెట్టు. మనసు, ప్రాణాన్ని అట్లా గమనిస్తూ వుండు. చివరకు ఆ రూపం మిగిలి పోతుంది. ఈ ప్రాణ మనస్సుల చలనం ఆగిపోతుంది. ఆ రూపం అట్లా మిగిలిపోతుంది అంతే. ఏ కదలిక లేకుండా రూపం అట్లా మిగిలిపోతుంది. ప్రాణ మనస్సుల యొక్క చలనం ఆగిపోతుంది. కొంతకాలం అయ్యేటప్పటికి ఆ రూపం ఎగిరిపోతుంది. ఆ స్థానంలో ఆత్మ సాక్షాత్కరిస్తుంది. అంతే. నీ హృదయంలోకి చేరితే నీకు ఆత్మసాక్షాత్కార జ్ఞానం కలుగుతుంది. అంతే. వేరే ఏమీ లేదు. నీకు ఎందుకు కలగడం లేదయ్యా? నీ హృదయంలోకి నీవు చేరడం లేదయ్యా బాబు. ఎంతసేపూ బయటే వుంటున్నావు. ఎంతసేపు బయట వున్న ఇంద్రియాలలోనే ప్రవర్తిస్తున్నావు. కాబట్టి, స్థాన శుశ్రూష అంటే ఏమిటంటే, ఈ హృదయస్థానం దీనిని చక్కగా తెలుసుకుని, దీనిని చక్కగా బాగుచెయ్యి. దీనిని చక్కగా హృదయాన్ని బాగచేయి, చిత్తశుద్ధిని కలిగివుండు. ఆ వృత్తి కలిగినప్పుడల్లా, అయ్యో! నాకు మళ్ళా ప్రియం కలిగిందే, మోహానికి దారితీస్తుందే, అని గుర్తెరుగు, వైరాగ్యభావాన్ని కలిగివుండు. అర్థమైందా అండీ! మీరు ఒక్కటి గుర్తు పెట్టుకోండి. మీకు అనుకూలమైనవే ప్రియం కాదు. మీకు వ్యతిరేకమైనవి కూడా ప్రియమే. అదికూడా అందులో భాగమే. అర్థమైందా అండీ! అలాగ ఈ సత్యాన్ని తెలుసుకో, ఇదేమిటిది స్థాన శుశ్రూష. అంగ, స్థాన. భావ శుశ్రూష – భావం అంటే ఏమిటి ఇప్పుడు? నేను ఎవరిని? నేను ఫలానా అన్నపూర్ణగారిని, నేను ఫలానా ... కాదు మీరెవ్వరు. నేను ఎవరిని? నేను సచ్ఛిష్యుడను. నేనెవరిని భావంలో? నేను సచ్ఛిష్యుడను. ఆ సత్ అనేటటువంటి జ్ఞానానికి శిష్యుడను. ఆ సత్ అనే స్థితికి శిష్యుడను. సత్‌శిష్యుడను నేను. అర్థమైందా అండీ !

ఇప్పుడు నేనెవరిని, నేను సచ్ఛిష్యుడను అని ఎవరైతే భావన చేస్తారో, వాడయ్యా భావ శుశ్రూష. గురువు కోరేది ఇదన్నమాట. అంతేకానీ నీ పండ్లు, ఫలాలు, నీ అరటి గెలలు ఏం చేసుకుంటాడాయన అవన్నీ? నీ దొంతరలు, దొంతరలు వస్త్రాలు, ఏం

ప్రయోజనము లేదు, హంస తూలికా తల్పాలు, ఎందుకు అవన్నీ? ఆయనకు ఏం ప్రయోజనము లేదు. అర్థమైందా అండీ! ఓ మామిడి పండ్ల బుట్ట ఇస్తే సంతోషించే వాడు కాదు. అర్థమైందా అండీ? ఎలాంటి వాడట? హృదయమును మీరి వున్నాడయ్యా! నీవు హృదయానికి చేరటమే తెలియని వాడివి. ఆయన హృదయ స్థితిని మీరి వున్నటువంటి వాడు. అర్థమైందా అండీ! కాబట్టి భావ శుశ్రూష అంటే ఏమిటి? నేను సచ్ఛిష్యుడను, ఆ సచ్ఛిష్య స్థితిని కాపాడుకుంటాను. సచ్ఛిష్య స్థితిని పోషించాలి. ఇప్పుడు ఎట్లా అయితే భార్యస్థితిని, భర్త స్థితిని, ఈ రకరకాల స్థితులను పోషిస్తున్నావే, ఉపాధ్యాయ స్థితిని, పాఠం చదువుకునే విద్యార్థి స్థితిని, పోషిస్తున్నావు కదా ఇవన్నీ పాత్రలే కదా! అట్లా ఏ పాత్రలను పోషించాలంట జీవితం మొత్తం మీద? సచ్ఛిష్యుడను అనే స్థితిని పోషించే ప్రయత్నము చెయ్యి. అప్పుడు నీవు భావ శుశ్రూష చేసినటువంటివాడవు. ఇక ఆత్మ శుశ్రూష. ఆత్మ శుశ్రూష అంటే ఏమిటి? ఇదే ఆఖరి ఉన్నతమైన శుశ్రూష అండి. ఇదే నవవిధ భక్తి మార్గాలలో వున్నటువంటి చివరి సాధన ఆత్మనివేదన. అక్కడ కూడా చెబుతారండి ఆత్మ నివేదన. తొమ్మిదవది అన్నమాట అది. అట్లాగే గురువుకి చేసేటటువంటి ఉత్తమమైనటువంటి శుశ్రూష ఏమిటంటే, ఆత్మ శుశ్రూష. అంటే నా అంతరాత్మ, ఆ పరమాత్మ, ఆ గురు స్వరూపము రెండూ ఒక్కటే. నేను గురువు ఒక్కటే. అనే స్థితిలో నిలచి వుండటమే, ఆత్మ శుశ్రూష. ఇలా ఎవడైతే తెలుసుకుంటాడో, వాడికి ముక్తి సిద్ధము. వాడికి ఏ రకమైనటువంటి భేదము వుండదు. కాబట్టి ఈ రకంగా ఎవరైతే, ఆ సాధన చతుష్టయ సంపత్తి, నిత్యానిత్యవస్తు వివేకము, ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము, శమాది షట్క సంపత్తి, ముముక్షుత్వము ఈ నాలుగూ వుండాలి. ఈ నాలుగు శుశ్రూషలు చేయాలి. ఆ నాలుగు సంపాదించాలన్నా, ఈ నాలుగూ చేయాలన్నా, కీలకము ఎందులో వుందయ్యా అంటే, నిన్నకూడా చెప్పా. ఉపరతి, తితీక్ష జీవితంలో జీవించాలి. అవి చెయ్యాలి అంటే, నీకు ఏమి వుండాలి అంటే, తీవ్రమోక్షేచ్ఛ వుండాలి. ముముక్షుత్వము తీవ్రంగా వుండాలండి. ఆ నాల్గవ సాధన అయినటువంటి ముముక్షుత్వము తీవ్రంగా వుండాలి. నేనే ముక్తి ఈ జన్మలో చెందవలసిందే. ఎందుకని? ఈ జన్మకు కుదిరినట్లుగా వచ్చే జన్మలో కుదురుతుందో లేదో నాకు తెలియదు. ఆ వచ్చే జన్మకు రూపం లేదు కదా! గతించిన జన్మలేమో జ్ఞాపకాల రూపంలో వున్నాయి కదా! కాబట్టి దేనిని పట్టుకుంటావు

ఇప్పుడు? ఇప్పుడున్న వర్తమానాన్నే పట్టుకో. ఈ జన్మలో నేను ఏమైనా సరే ముక్తిని సాధించవలసిందే. అని ఎవడైతే నిర్ణయంతో జీవిస్తాడో, ఆ తీవ్ర మోక్షేచ్ఛ చేత, ఆ నాలుగు సాధన చతుష్టయ సంపత్తి ఏర్పడుతాయి, ఈ నాలుగు శుశ్రూషలు చేయగలుగుతావు. ఈ నాలిగిటికి, ఆ నాలిగిటికి ఆధారం ఏమిటయ్యా అంటే, ఆ తీవ్రమైనటువంటి మోక్షేచ్ఛ. ఆ మోక్షంలో కోరిక వుండాలి. మోక్ష ఇచ్ఛ. ఆ కోరిక వుంటే తప్ప సాధ్యం కాదు. (ఇది కూడా ఒక కోరికే కదా!) ఎవ్వరికి? మోక్షసన్యాస యోగం, మోక్షం కూడా త్యజించగలిగే అనుభవం వచ్చినప్పుడు, నీకు పరమాత్మ... అందుకే మీకు ఇందాక చెప్పలేదా? పరమాత్మ స్థితి అనుభవం వచ్చేసిందండి. ఇంకా జ్ఞానం ఎవరికి కావాలి? అక్కర్లేదు కదా! అనుభవజ్ఞానం వచ్చి సహజంగా ముక్తుడిగా వున్నప్పుడు అతను ఏ పాఠం చదవాలి? ఏదీ చదువక్కర్లేదు. ఏ సాధన చెయ్యాలి? ఏం చెయ్యక్కర్లేదు, ఎందుకని? అన్ని సాధనలు అతనిలోనే వున్నాయి. ఏదైనా రెప్పపాటులో చేయగలడు. ఆ సామర్థ్యము వున్నటువంటి వాడు. అర్థమైందా అండీ! అంత సామర్థ్యం వుంటేనే కదా! ఆ స్థితిలో వున్నాడు. అర్థమైందా అండీ? ఇప్పుడు నేను పిరమిడ్ ధ్యానానికి వెళ్ళానండి. అందరూ ధ్యానం చేస్తున్నారండి. నేను కూడా వాళ్ళతో పాటు కూర్చున్నానండి, ఆ పిరమిడ్ మాస్టర్ గారన్నారు, ఏమండి? ఏమిటి మీకు ధ్యానం కుదరడం లేదు అన్నారు. ఏమిటోనండి మరి కుదరటం లేదు అన్నాను. అర్థమైందా అండి? మరి మీరు రోజూ రండి, చక్కగా మాతో పాటు సాయంత్రం వచ్చి శ్వాస మీద ధ్యాస నిలపండి చక్కగా ధ్యానం కుదురుతుంది అన్నారు. సరే నండి, అలాగే చూద్దాం పరిస్థితిని బట్టి చేద్దాం అన్నాను, ఇప్పుడు మనకు ఎందుకు ఆయనతో తగాదా? మీరు ఏం చేస్తున్నారు అయినా కానీ ఇంత మంది ధ్యానం చేస్తుంటే అన్నారు. ధ్యానం చేసేవాళ్ళ అంతరంగాలను గమనిస్తున్నానండి అన్నాను. ఇప్పుడు ఏం చేస్తున్నాము? ఇప్పుడు అది ధ్యానమా అది ఏమిటంటావు ఇప్పుడు? నువ్వు చేసే ధ్యానం ఏమిటి? నీ అంతరంగాన్ని గమనించే ప్రయత్నము చేస్తున్నావు. అక్కడున్న అంతమంది అంతరంగాలను కళ్ళు మూసుకుని గమనిస్తున్నానండి. నేను చేసే ధ్యానమిది. కాబట్టి నేను కళ్ళు మూసుకోవటం లేదండి, వాళ్ళలాగా నేను లేను, అంతే తేడా అంతకు మించి ఏమీ లేదు. ఈ గోల అంతా ఆయనకు అర్థం కాలేదు. అదంతా నాకెందుకు కానీ, మీరు రేపటి నుంచి వస్తారా? రారా? చెప్పండి అన్నాడు. సరేలేండి

అలాగే, వీలుకుదిరితే అలాగే వద్దాము, ఇప్పుడు ఏమి పోయింది? నష్టమేముంది? తరువాత ఆయన ఈ వాక్యము వెళ్ళి వాళ్ళ వాళ్ళను అడిగాడు. వాళ్ళ మాస్టర్స్, పై మాస్టర్స్ వుంటారు కదా! వాళ్ళని అడిగాడు. వాళ్ళు చెప్పారు. ఒరేయ్ నాయనా వాళ్ళు ధ్యానం నేర్పటటువంటి వాళ్ళు కాదు, వాళ్ళు already ధ్యానం దాటినటువంటి వాళ్ళు. నువ్వు వాళ్ళకు నేర్పడం కాదు, వాళ్ళ దగ్గర నువ్వు నేర్చుకోవలసినవాళ్ళు అని చెప్పారు. తరువాత ఆయన వచ్చాడు, అయ్యో! పొకపాటు పడ్డానండి, మీకు ధ్యానం నేర్పుతానని నేనన్నాను పొరపాటు పడ్డాను. కాబట్టి సహజజ్ఞానము వున్నవాడిలో అంత సామర్థ్యము వుంటుందండి. ఏమీ చేయడు. మీరందకూ అన్నీ చేస్తే వుంటే చక్కగా చూస్తూ వుంటాడు. అన్నీ చేయగలిగిన సామర్థ్యము వున్నటువంటి వాడు. అన్నీ విప్పి తెలుసుకున్నవాడు. అన్నీ దాటేసిన వాడు, వాడికేమిటి? అన్నీ సహజంగా వుంటాయి. ఆ సహజత్వంలో వుంటాడన్నమాట ఎప్పుడూ కూడా. నువ్వు ఎప్పుడైనా గుర్తు పెట్టుకోండి. మీరంతా కూడా ఏ పనిచేసినా కూడా, సాత్వికం, రాజసికం, తామసికం తప్పనిసరిగా వుంటాయి. అంటే శక్యానుసారమే చెయ్యాలని పెద్దల నిర్ణయము. అంటే అర్థము ఏమిటి? శక్తికి లోబడి తక్కువగా చేస్తావనుకో, నీకు దానం చేయగలిగే సామర్థ్యానికి తక్కువ చేశావనుకో, అది తామసిక దానం అవుతుంది. అర్థమైందా అండీ! శక్తికి మించి చేస్తే రజోగుణం అవుతుందండి. ఎప్పుడైనా ఒక్కటి గుర్తుపెట్టుకోండి. మీ శక్తికి మించి ఏ పని చేసినా సరే అది రజోగుణమే అవుతుంది. యథాశక్తి చేస్తే అది సత్వగుణం అవుతుంది. ఎప్పుడూ కూడా ఆచరణ యథా శక్తి చెయ్యాలి. ఆ శక్తిని నిర్ణయం చెయ్యాలి అంటే ఒక విధానం వుందండి. ఇక్కడే అందరూ తప్పుదారి పడతారన్నమాట. యథాశక్తి అంటే ఏమిటంటే, అప్పటికప్పుడు చూసుకుంటాం అన్నమాట. అప్పటికప్పుడు చూసుకోవడం కాదు, జ్ఞాన లక్ష్యంతో చూడాలి. నీ శక్తిని అంతా ఆ జ్ఞాన లక్ష్యంతో చూస్తే, సరిపోయి వుండాలి. అది సరిపడటం అంటే. జ్ఞాన లక్ష్యం కంటే మించి చేశావనుకోండి, శరీర భ్రాంతిలో పడిపోతావు. అర్థమైందా అండీ! జ్ఞానలక్ష్యం కంటే మించి చేసినప్పుడు ఏం చేస్తావు? శక్తికి మించి చేస్తావు. నీ ప్రత్యేకత నిలుపుకోవాలని చేస్తావు. అప్పుడు రజోగుణంతో చేస్తావు. అప్పుడు శరీర భ్రాంతిలో పడిపోతావు. కాదయ్యా! జ్ఞాన లక్ష్యం కంటే మించి, తగ్గించుకున్నావు ఇప్పుడు. మించవద్దని చెప్పాను కదా! తగ్గించుకున్నావు, తగ్గించి,

లోపించి చేశావు జ్ఞానం. జ్ఞానలక్ష్యంతో కాకుండా చేశావు. అజ్ఞానలక్ష్యంతోనే చేశావు అసలు. లక్ష్యమే పోయింది. అప్పుడేమైంది? తమోగుణం, జగద్భ్రాంతి లోకి వచ్చేశావు. అది ఇంకా ప్రమాదము. శరీర భ్రాంతియైన పర్వాలేదు కొంతవరకు, ఎందుకని రజోగుణం, తగ్గించవచ్చు దానిని. ఎలాగోలా పరిణామం చెందవచ్చు. ఇప్పుడు జగద్భ్రాంతి. మొదటికే మోసం అన్నమాట. జగద్భ్రాంతి వంకాయే సత్యమన్నమాట ఇప్పుడిక. దానిని మార్చడానికి వీలుకాదు. అది తమోగుణం. పదార్థభ్రాంతిలో వుంటావన్నమాట. కాబట్టి నీవు ఏదైనా ఆచరించేటప్పుడు ఈ మూడింటిని దృష్టిలో పెట్టుకోవాలి. వీటిని ఆచరణ చేసేటప్పుడు, ఆ సాధన చతుష్టయ సంపత్తిని, ఈ చతుర్విధ శుశ్రూషలని, నీ శక్త్యాను సారం చేయడం అనే జ్ఞాన లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని చేయడాన్ని, మనమందరం ఆచరణ సిద్ధంగా నిజజీవితంలో వాడుకుని, ఉపయోగించి జీవించేటట్లయితే, మనం ముక్తిని చెందడానికి ప్రతి ఒక్కరూ అర్హులే. ఇది సద్గురు కృప వల్లనే సాధ్యమౌతుంది. ఇదంతా. ఎప్పుడైనా గుర్తుపెట్టుకోండి. గురు కరుణాకటాక్షము లేక, ముక్తి అసాధ్యము. ఒకటే గుర్తుపెట్టుకోండి. ఇది అనుభవ వాక్యం అన్నమాట. ఎంతమంది, ఎంతోమంది మహానుభావులు, ఆఖరికి వేదవ్యాసుడు సర్వమూ, అన్ని వేదాలను విభజించినటువంటివాడు, అష్టాదశ పురాణాలను విరచించినటువంటివాడు, ఇదే అందుకే చివరికి చెప్తారండి. అందరికీ ఈ మాటలు చెప్పరు. ఏం చేశారంటే చిట్టచివరికి దేహ అవసాన దశ వచ్చేస్తుందండి, వచ్చేసినా కూడా ఆయనకు దుఃఖం విడువలేదండి, ఏమిటట? ఒక అరణ్యములో తలక్రింద చేయిపెట్టుకుని పడుకుని వున్నాడు. ఒక వట వృక్షం కింద. పడుకుని వుంటే, ఆ దారి వెంబడి ఎవరో ముని కన్యలు వెళుతూ వున్నారు. ఓహో! ఎవరో మహానుభావుడు, మహర్షి, ఈయన అన్నీ గడ్డం పెంచుకున్నాడు, చూడబోతే ఈయన చాలా కాలం నుంచి, ఈయనకు వేల సంవత్సరాల వయస్సు వున్నట్టుంది. చాలా తపస్వి లాగా వున్నాడే. కానీ తలకింద చేయిపెట్టుకుని నిదురపోతున్నాడే, ఇంకా తలకింద చేయపెట్టుకోవాలి, ఆ సుఖం మీద అపేక్ష వుందే ఈయనకి. అని అన్నారట ముని కన్యలు. ఇది ఆయన విన్నాడు. విని ఏం చేశాడట? మళ్ళా మునికన్యలు ఎప్పుడు వస్తారో చూసి, ఈ తలకింద చేయి తీసివేశాడట. తీసేయగానే వాళ్ళు, అయ్యో! ఈయనకి సుఖాపేక్షే వుందనుకున్నాను, ఈయనకు అహం

కూడా వుందే! మనం అన్నామని చెప్పి తీసేశాడు కానీ, సుఖం మీద అపేక్షపోయి కాదు కదా! మనకి చూపెట్టడం కోసమని తీసేశాడు కదా! అన్నారట.

అప్పుడు ఆయనకు జ్ఞానోదయం అయ్యిందట. కాబట్టి శాస్త్ర జ్ఞానమైనా, మరొకటైనా, మరొకటైనా ప్రతి అనుభవజ్ఞాని... నేను చెప్పేది అదే నండి,

నీ నిజజీవిత జ్ఞానంలో ప్రతి మాట, చేతలో సహజజ్ఞానం ఎప్పుడూ వుండాలి. అదే శాశ్వతం. అంతే కాని, మరొకరి కోసం చేస్తున్నావంటే అదంతా అహం యొక్క ప్రతిపాదన.

ఓం ఓం ఓం

ఓం పూర్ణ మదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే
ఓం పూర్ణ మదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే
ఓం పూర్ణ మదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే

ఓం తత్ సత్

ఓం సహనా భవతు సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై తేజస్వి నావధీతవస్తు మావిద్విషావహై

ఓం శాంతిః శాంతిః శాంతిః

సాయిరాం.

శరీరం ఎక్కడెక్కడైతే వుందో, ఒక శరీరమే వుందనుకుంటున్నావు కదా! రకరకాల శరీరాలు వున్నాయి. దుఃఖము వుంటుంది. శరీర భావన వుంటే దుఃఖము వుండక తప్పదండి.
అయ్యా! దుఃఖం కలుగుతోంది కదా! దుఃఖం కలగడానికి కారణం ఏమిటి? ఎక్కడ శరీర భావన వుంటే, శరీరం కాదు, శరీర భావన. నేను శరీరం అనే భావన గనుక వుంటే, దుఃఖం తప్పడం లేదు. మరి ఏం చెయ్యాలయ్యా? దుఃఖం వుండకూడదు నాకు. వుండకూడదు అంటే ఏం చెయ్యాలి? శరీర భావన లేకుండా వుండాలి. అది ఎలాగ? అది ప్రశ్న. అందరికి అదే కదా కావల్సింది. జీవులందరికీ ఏముంది? దుఃఖానుభవం వుంది. అది లేకుండా వుండాలి. వేరే ఇంకేమీ లేదు. అసలు ఈ వేదాంతము అంతా ఎక్కడి నుంచి పుట్టింది? ఇదుగో ఈ ప్రశ్న దగ్గర నుంచే పుట్టింది. నీకు అసలు శరీరం ఎందుకు కావలసి వచ్చింది? సుఖపేక్ష వల్లనే శరీరం కావలసి వచ్చింది. దుఃఖ నివృత్తి, సుఖ అపేక్ష. దుఃఖ లేకుండా పోవాలి, సుఖం రావాలి. అనేటటువంటి ఆశ చేత, శరీరం కలిగింది. కలిగినాక ఏమైంది? శరీరం పనిముట్టుగా వుండకుండా, శరీరమే నువ్వు అయిపోయావు. కాబట్టి శరీరమే నేను అనే భావన ఎక్కడుంటే అక్కడ దుఃఖం తప్పదు. మరి ఏం చెయ్యాలయ్యా? శరీరం లేని స్థితి ఏమైనా ఒకటి వుందా? అదేదో చెప్పమంటున్నారు. ఏం చెబుతున్నారు?

నువ్వు ఏం తెలుసుకోవాలయ్యా? నువ్వు ఏదైతే అయివున్నావో, యథార్థం – యత్ అర్థం. ఏదైతే అయివున్నావో స్వరూపం. నీ రూపం ఏదైతే అయివున్నదో, ఆ రెండూ నీ స్థితి ఏదైతే వున్నదో, అది నువ్వు తెలిసి, అలా వుండటమే, విదేహము. అంటే దేహము లేనటువంటిది. కాబట్టి నువ్వు ఇప్పుడు ఎందుకు దుఃఖపడుతున్నావయ్యా? శరీరం నేనుగా వున్నావు కాబట్టి దుఃఖపడుతున్నావు. శరీరం నువ్వు కాదని తెలుసుకుని, ఆ స్థితిలో గనుక వున్నట్లయితే, నీకు దుఃఖం లేదు. అర్థమైందా అండీ? శరీరం నువ్వు కాదు అని గనుక తెలుసుకుని వున్నట్లయితే, నీకు దుఃఖము లేదు. కాబట్టి దుఃఖం కలిగినప్పుడల్లా ఏం విచారణ చేయాలట ముందు? నేను శరీరం కాదు, మరి నేను ఎవరిని? నేను ఆత్మస్వరూపమును. అని వెంటనే సమాధానం రావాలి అక్కడ. రాకపోతే ఊరుకోదు. అది. ఈ answer వచ్చిందనుకోండి, అప్పుడది బలహీనపడిపోతుంది. నేను

ఆత్మస్వరూపుడను అనే ఆశ్రయం స్వీకరించినప్పుడు దేహానికి సంబంధించినటువంటి విషయాలన్నీ, క్షీణించి పోతాయి. అలా క్షీణించి, క్షీణించి, క్షీణించి కొంతకాలం అయ్యేటప్పటికి నేను దేహం కాదు అనే దాంట్లో స్థిర పడి పోతావు. స్థిరపడిపోతావు. భావనే ఇది. లేకపోతే ఏమౌతుందంటే. ప్రతివిషయంలో కూడాను, నేను దేహంగా ప్రవర్తించడమే అలవాటు పడిపోయావు. నేను దేహము కాదు అనే పద్ధతిలో కొత్తగా జీవించాలి. ఏ పనైనా సరే, నిద్ర లేవడం దగ్గర నుంచి నిద్రపోవడం దాకా, పుట్టడం దగ్గరి నుంచి చనిపోవడం దాకా, భోజనం చేయడం దగ్గరి నుంచి మానేయడం దాకా. ఏదైనా కావచ్చు. ప్రాణం తీసుకోవడం, గాలి తీసుకోవడం, విడిచి పెట్టడంతో సహా! నేను శరీరం కాదు. నేను ఆత్మ స్వరూపుడను. నీవు ఆత్మ స్వరూపుడవు అని ఏది నిర్ణయిస్తున్నది అంటే, నీ ప్రాణమే నిర్ణయిస్తున్నది. ఎలా నిర్ణయిస్తున్నదయ్యా? అంటే, అది హంస కదా! కాబట్టి సోహం. గాలి తీసుకునేప్పుడు 'సో....' విడిచి పెట్టేటప్పుడు 'హం'. ఆ రకంగా సోహం సోహం సోహం సోహం సోహం సోహం సోహం అని జరుగుతూ వుంది. జరుగుతూ వున్నప్పుడు నువ్వు వరుసగా చూస్తే ఏమైంది అప్పుడు? సోహం సోహం సోహం..... హంసో హంసో హంసో హంసోహం అని జరుగుతోంది. ఎందుకని గాలి తీసుకోవాలి అంటే మొట్టమొదట నీవు గాలి విడిచిపెట్టాలి కదా! కాబట్టి 'సో'లో మొదలు పెడుతావా? 'హం'తో మొదలు పెడుతావా? 'హం'తోనే మొదలు పెడుతాం మనం. గాలి పూర్తిగా విడిచిపెట్టేస్తేనే కానీ గాలి పీల్చుకోలేవు. కాబట్టి 'హంసోహం' ఇదే నాయనా! మంత్రము. ఇంక ఏమీ మంత్రం లేదు. సర్వ జీవులను తరింప చేసే మంత్రం ఏమిటయ్యా అంటే, ఈ హంస మంత్రమే తరింప చేసే మంత్రం. ఈ సత్యం తెలియనటువంటి వాళ్ళు ఎవరైనా సరే, వారు శరీర భావనలోనే వుంటారు. కాబట్టి నీవు శరీరం కాదు అని నిర్ణయం తెలియాలి అంటే, నువ్వు ఎక్కడికో పోవక్కర్లేదు, ఏం చెయ్యక్కరలేదు. నీ యొక్క ప్రాణాన్నే నువ్వు అర్థం చేసుకునే ప్రయత్నం చేసుకున్నా కూడా, హంసోహం హంసోహం హంసోహం హంసోహం హంసోహం అని జరుగుతోంది. కాబట్టి గాలి విడుస్తున్నప్పుడు 'హం', గాలి తీసుకున్నప్పుడు 'సో' అని నిదానంగా మనస్సుతో ఈ జపం చేస్తూ, "**సోహం భావేన పూజయేత్**" – అంటారు. అంటే అర్థం ఏమిటి? ఈ సోహం భావనలో కనుక నిలకడ చెందిన వాడికి, బ్రహ్మజ్ఞానం లభిస్తుంది. వేరే ఇంకేం ప్రయత్నం చేసినా లాభం లేదు.

మరి ఆత్మస్వరూపుడను అని ఎందుకు అనుకోవడం?

ఎందుకు అనుకోమంటున్నామంటే, నువ్వు సరాసరి ప్రాణాన్ని గుర్తుపట్టలేవుగా. నువ్వు ప్రాణం గుర్తుపట్టుకోమ్మా! అంటే, నువ్వు ప్రాణం గుర్తుపట్టలేని స్థితిలో వున్నావుగా. బుద్ధి సూక్ష్మత అంతదూరం పోలేదుగా. కాబట్టి ఇంకా విషయాలలోనే తిరగుతోందిగా. విషయాలలోనుంచి ఎవరికైతే, వెనక్కు వచ్చేసిందో, తనను తాను గుర్తించుకోగలిగే సాధన ఎవడైతే చేయగలుగుతున్నాడో, ఇప్పుడు అనుసరించే వాళ్ళు వేరు, సాధకులు వేరు అన్నమాట. అనుసరించే వాళ్ళ పద్ధతి ఏమిటంటే, ఇప్పుడు చెబుతున్న పద్ధతి. ఏదీ 'నేను ఆత్మ స్వరూపుడను' అనుకోవడం. విషయసమత్వాన్ని సాధించి, విషయంలో నుంచి వెనక్కి రావడం. అక్కడిదాకా అది ఉపయోగపడుతుంది. ఈ ఆత్మ విచారణ చెయ్యి, అవగాహనతో జీవించు. విషయాల్లోనుంచి వెనక్కి రా ముందు. ఎందుకని విషయాలతో పాటు పోతూ వుంటే, నువ్వు ప్రాణాన్ని ఎట్లా గుర్తిస్తావు? ప్రాణాన్నే గుర్తించలేని వాడివి, మనసును ఎట్లా గుర్తిస్తావు? మనసునే గుర్తించ లేని వాడివి బుద్ధిని ఎట్లా గుర్తిస్తావు? కానీ మనం అందరము ఏమి చేస్తున్నాము? సరాసరి మనసునో, బుద్ధినో, ఏదో చేసేస్తాను అంటావు. ఏమిటి చేసేది? ఏమీ చేయలేవు దానిని. ఎందుకని? నువ్వు తయారు చేస్తే తయారు అవ్వలేదు. సృష్టిలో సహజంగా వచ్చినాయి అవి. అవి సృష్టి ఏర్పడినప్పుడు ఎట్లా ఏర్పడినాయో తెలిస్తే తప్ప, అసలు అది ఎట్లా ఏర్పడిందో తెలిస్తే తప్ప, నువ్వు దానిని అసలు అవగాహన చేసుకునేది ఎట్లా? దానిని ఉపయోగించేది ఎట్లా? అది నీ పనిముట్టు అయ్యేది ఎట్లాగ? ఎక్కడున్నావు నువ్వు? దాని అధీనంలో బానిసలవలె వున్నదానికి బానిసవై వున్నావు. మనసు అధీనంలో ఇంద్రియాలు వున్నాయి. ఇంద్రియాలకు విషయాలు కావాలి. విషయాలకు పనులు కావాలి. పనులకు ఫలితాలు కావాలి. ఎక్కడుంటివి ఇప్పుడు? ఫలితాల దగ్గర వున్నావు. మరి ఎక్కడున్నాయి అవి. మనసుకి ఇంద్రియాలు బానిసలు. ఇంద్రియాలకు విషయాలు బానిసలు. విషయాలకి పనులు బానిసలు. పనులకు ఫలితాలు బానిసలు. వాటికి స్వేచ్ఛ లేదు. పనికి ఫలితం రాకుండా చేయి చూద్దాము. అసాధ్యం. ఏ పని కైనా ఫలితం వచ్చేస్తుంది. ఫలితం దగ్గర వున్నావు. ఎక్కడున్నావు ఇప్పుడు? బానిసలుకు బానిసలకు బానిసలకు బానిస దగ్గర వున్నావు. ఇప్పడు నువ్వు దేనిని ఆశ్రయించావు? మనసును పట్టాలి అంటే, మనసుకంటే

పైనున్న దానిని పట్టుకుంటే మనసు పనిముట్టు అవుతుంది. అంతే గాని, ఫలితాన్ని ఆశ్రయించి జీవిస్తూ, మనసును నేను సాధించాలి, మనసును control చెయ్యాలి, మనసును control చెయ్యాలి. ఎట్లా చేస్తావు? ఎట్లా సాధ్యం? ఎక్కడున్నావు అసలు? ఒకసారి విచారణ చేసుకో! అందుకని నాయనా! ఫలిత స్థానంలో ఆలోచిస్తున్నావు. ఫలితస్థానంలో దుఃఖమో, సుఖమో వచ్చినాక విచారణ చేస్తే ఏమిటి ప్రయోజనము? అంతా వచ్చేసినాక చేస్తే ఏమిటి ప్రయోజనము? మా అబ్బాయి నన్ను కొట్టాడండి, తిట్టాడండి. ఓహో! అలాగా? తరువాత ఏం చేశావు? దుఃఖించానండి. ఏమిటి ప్రయోజనము? దుఃఖించినాక విచారణ చేశానండి. అది దాని వలన ఇంకా ప్రయోజనం ఏమిటి? విచారణ చేస్తివి పో! పోనీ ఈ సారి ఏమైనా కానీ, ఇంకోసారి చేసేటప్పుడు ముందు చేశావా విచారణ? ముందు చేయలేదండి. అయిపోయినాకే చేశానండీ విచారణ. ఏమిటట ప్రయోజనం? ప్రయోజన శూన్యం కదా! ఎందువల్ల అంటే, నువ్వు ఫలితం చేత లాగ బడుతున్నావు. ఆకర్షించబడుతున్నావు. ఆ ఫలితం మీద అపేక్ష చాలా వుంది. ఎందువల్ల? నేను చేస్తున్నాను, ఫలితం బాగుండాలి. దానికి కారణం ఇది. శరీర భావనతో చేయడంలో, వున్నటువంటి పెద్ద దుర అలవాటు ఏమిటంటే, ఈ సృష్టి అంతా పరమాత్ముడే నియమించి, ఆధారంగా వుంటే, మధ్యలో నేను ఒకడిని వచ్చాను. నేను ఒకడిని వచ్చి, నేను చేశా కాబట్టి ఏమైనా సరే ఇది బాగుండాల్సిందే. అర్థం వుందా? నువ్వు చేయడం ఏమిటి మధ్యలో, రైలంతా బండిలో ప్రయాణం చేస్తున్నారండీ! ప్రయాణీకులంతా, రైలు ప్రయాణం వెళ్ళిపోతోంది. (నేను) ప్రతివాడు ఎవడికి వాడు ఏమనుకుంటున్నాడు? నేను ప్రయాణం చేస్తున్నానండి. వాడే రైలును నడుపుతున్నాడు అనుకుంటున్నాడు. అర్థం వుందటండీ! రైలు వెళ్ళి పోతోంది. వెళ్ళిపోయే రైలులో నువ్వు వున్నావు. ప్రవాహ వేగంతో పరిణామం చెందుతున్నటువంటి, సృష్టిలో నీవు వున్నావు. సృష్టి పరిణామం చెందుతూ వుంది. అందులో భాగంగా నువ్వు పరిణామం చెందుతూ వున్నావు. నేను జీవించాను అంటావేమిటి మధ్యలో? అర్థముందా ఏమైనా?

సృష్టిలో భాగంగా నీ శరీరం వచ్చింది. సృష్టితో సమానంగా అది పరిణామం చెందుతూ వుంది. మరి మధ్యలో నేను పుట్టాను. నేను అది చేశాను. నేను ఇది చేశాను.

నేను పోయాను. అంటావేమిటి? అది అంతా ఎందులో భాగం? సృష్టిలో భాగం కదా! మరి సృష్టి దృష్ట్యానే కదా! చూడాల్సింది. ఎందులో వున్నావు ఇప్పుడు? సృష్టిలోనే కదా వున్నావు. మరి సృష్టి దృష్ట్యా ఒకసారి విచారణ చేసి చూడు. నేను ముప్పై యేళ్ళు ఉద్యోగం చేశాను, నేను ఏదో మూడు బిల్డింగులు కట్టాను. ఏదో ముప్పై బిల్డింగులు కూల్చాను. లేకపోతే మూడు పెళ్ళిళ్ళు చేశాను. లేదా ముప్పై పెళ్ళిళ్ళకు వెళ్ళాను. ఇదేగా నువ్వు చెప్పేది, ఎంతసేపు చెప్పినా? జీవితం అంతా చేసింది ఏమిటి? ఈ పనే కదా! ఏమిటట దాని వల్ల, దేహ భావంతోనే కదా చేశావు. చేసిన పని అంతా ఏ భావనతో చేశావు? దేహ భావనతోనే చేశావు. మరి అటువంటప్పుడు ఇంక సమస్యేమి వుంది? అదే పెద్ద సమస్య అసలు. కాబట్టి అన్నిటికీ మూలం, అన్ని పరిణామాలకి, అన్ని దుఃఖాలకి, అన్ని పాతాలకి మూలమైనటువంటి సమస్యను పరిష్కరింప జేస్తేనే కానీ, ఇది ఈ సమస్య పరిష్కారం అవ్వదు నాయనా! నువ్వు ఏదో ఒక్కొక్కటి పట్టుకుని, ఒక్కొక్కటి పట్టుకుని, దీనికి కారణం ఏమిటి? దీనికి కారణం ఏమిటి? అని అడిగితే, ఇన్ని కారణాలు లేవు. అసలు ఏమి చేస్తున్నాము? పుట్టి బుద్ధి ఎరిగిన దగ్గరనుంచి, సొంత బుద్ధి వచ్చినప్పటినుంచి, ఇది ఎందుకు చెయ్యాలి? దీనికి కారణం ఏమిటి? అన్నిటికీ కారణం ఒకటే. నువ్వు శరీరం అనుకోవడమే పెద్దకారణం. అసలు ఆ కారణాన్ని పరిష్కరించు. అది పరిష్కరిస్తే అన్నీ పరిష్కారం అయిపోతాయి. కాబట్టి, నీలో జరుగుతున్నటువంటి ప్రాణం ఏదైతే వున్నదో, అదే అజపా గాయత్రి. ఆఁ.. ఈ సోహం జపమే, అజపా గాయత్రి. ఈ జపం చేయకుండా, జపమాలతో పని లేకుండా చేసేటటువంటి అజపాగాయత్రి ఏదైతే వున్నదో, ఈ అజపాగాయత్రి తెలిసినవాడే నిజమైన బ్రాహ్మణుడు. అర్థమైందా అండీ! ఈ అజపా గాయత్రిని తెలుసుకోవడం కోసమే, సంధ్యావందనం చేసేది. కారణం ఏమిటంటే, ఈ అజపా గాయత్రి ఇడా, పింగళ, సుషుమ్నా అనే నాడుల ద్వారా పనిచేస్తూ వుంటుంది. అది సంధ్యాకాలంలో అంటే, అటు ఉదయం, ఇటు రాత్రి మధ్యలో, సూర్యోదయం, సూర్యాస్తమయం. అపరాహ్నం, మధ్యలో. మళ్ళా నిశి రాత్రి. అంటే 6 - 12, 6 -12 అన్నమాట. ఉజ్జాయింపుగా. ఒక పావుగంట అటు ఇటుగా. ఇది సంధ్యాకాలం. ఈ సంధ్యాకాలంలో, ఈ హంస సుషుమ్నానాడిలో ఒక క్షణం పాటు కొట్టుకుంటుంది. ఆ క్షణంలో, కరెక్టుగా ఉదయ సంధ్య సమయంలో, మధ్యాహ్నం సంధ్య, సాయంత్రం సంధ్య,

నిశిరాత్రి సంధ్య. ఇట్లా నాలుగు వున్నాయి. ఈ నాలుగు కాలాలలో, ఒక రెప్పపాటు కాలంలో, ఈ హంస సుషుమ్నా నాడిలో కొట్టుకుంటుంది. ఇది ప్రతి జీవికి కొట్టుకుంటుంది. నాలుగు సంధ్యలలో కొట్టుకుంటుంది. శ్వాసించే ప్రతి జీవికి కూడా, ఇది సుషుమ్నానాడిలో కొట్టుకుంటుంది. మనిషికి బుద్ధి వుంది కాబట్టి, దీనిని తెలుసుకోగలిగే అవకాశం వుంది. మిగిలిన జీవులకు ఆ అవకాశం లేదు. కాబట్టి, మనిషి గొప్పతనం ఏమిటయ్యా అని అంటే, శరీరం నేను కాదు అని జీవించగలిగే సామర్థ్యము మానవ ఉపాధికి వుంది. కానీ జంతువులకు ఆ శక్తి లేదు. జంతువుకి శరీరమే సత్యంగా జీవించ వలసిందే అది. మానవ ఉపాధికి ఒక్కదానికే, ఆ అర్హత వుంది. ఇది తెలుసుకుంటే ఏమిటయ్యా ఉపయోగం అంటే, సృష్టి రహస్యం తెలుస్తుంది నాయనా! నీకు. ఈ సృష్టి ఎట్లా ఏర్పడింది? అందులో భాగంగా నీ శరీరం ఎట్లా ఏర్పడింది? అందులో భాగంగా నీకు ఇంద్రియాలు ఎట్లా ఏర్పడ్డాయి? అందులో భాగంగా నీకు ప్రాణం ఎట్లా వచ్చింది? అందులో భాగంగా నీకు మనసు ఎట్లా వచ్చింది? అందులో భాగంగా నీకు బుద్ధి ఎట్లా వచ్చింది? అందులో భాగంగా నువ్వు ఎట్లా వచ్చావు? నువ్వు లేకుండా ఎట్లా పోతావు? ఆ శరీర భావం లేకుండా ఎట్లా పోతుంది? అంటే, శరీరంలో వుండి, శరీరం నేను కాదు అనే స్థితిలో ఎట్లా వుండాలో తెలుస్తుంది. ఇదే నాయనా! ముక్తి అంటే. ఇంతకు మించి వేరే ఏమీ లేదు. ఇక నువ్వు ఎన్ని వేదాలు తిరగేసినా, ఎన్ని ఉపనిషత్తులు తిరగేసినా... అందుకే ఆ ప్రశ్న దగ్గర మొదలు పెట్టింది. నాయనా! వేదములలో చెప్పబడినట్లుగా.. నువ్వు అన్నీ వేదములలో చెప్పబడినట్టే చేస్తున్నానంటున్నావుగా, మేం వైదికుల మండీ. ఏం చేసినా, ఏమిటి? షోడశకర్మలు చేశావు. నామకరణం నుంచి జాతాశౌచం నుంచి మృతా శౌచం దాకా. ఏమిటట ఇప్పుడంతా ఎవరిని పిలిచావు? ఆ వేదం చదువకున్నవాడిని, మంత్రాలు చదువుకున్నవాడినే కదా పిలిచావు. ఇవన్నీ చేసేవాళ్ళు అందరూ వేదాన్ని ఆశ్రయించే జీవిస్తున్నారు అంటున్నావు కదా! ఆ వేదం అంతా ఏమి చెబుతోంది? శరీరంలో వుండి, శరీరంలో వుంటూ 'నేను శరీరం కాదు' అనే స్థితిలో జీవించమని చెబుతోంది ఆ వేదం. కానీ నాకు ఏం చేతకావడం లేదు? శరీరం నేనుగానే వుండటం అలవాటు అయిపోయింది. అర్థమైందా అండీ! కాబట్టి ఏం చెప్పారు ఆయన ఇప్పుడు? నాయనా!

ఇందులోనుంచి ముక్తి ఎట్లాగా? అంటే, నీ యథార్థ స్థితి ఏమిటో నీకు తెలియాలి. నీ స్వరూపం అంటే ఏమిటో నీకు తెలియాలి నాయనా! తెలిస్తే తప్ప... నీకు తెలిసిందేమిటి? నీకు శరీరం ఒకటే తెలుసు. నీ యథార్థ స్థితి తెలియదు. అది తెలిస్తే కానీ, ఇది వదలదు. ఇది వదిలితే గాని, అది తెలియదు అంటున్నావు. అంటే అర్థం ఏమిటి ఇప్పుడు? ఆటలు మరిస్తే కానీ, చదువు రాదు. చదువు వస్తేనే గాని, ఆటలు మరువవు. మరి ఏం చెయ్యాలి ఇప్పుడు? ఏం చేశావు నీ పిల్లాడిని? (ముందు ఆటలు మరువాలి) ఆటలు ఎట్లా మరుస్తాడు, మరువడుగా. (చదువే అలవాటు చేయాలి) ఆఁ.. అంటే రోజంతా ఆటలు ఆడేటప్పుడు, ఒక గంట చదువు. మళ్ళా ఏం చేశావు? రెండు గంటలు చదువు. అట్లా చదువుని పెంచుతూ, ఆటలు తగ్గిస్తూ వచ్చావు. కొంతకాలం అయ్యేటప్పటికి స్కూల్ లో చదువుతూ వున్నాడు. ఆటలు కూడా ఆడాడు. కాలేజికి వెళ్ళాడు ఇప్పుడు. కాలేజీకి వెళ్ళాక ఏమైంది? ఆటలు పూర్తిగా తగ్గినాయి. పోలేదు. పూర్తిగా తగ్గినాయి. చదువు పూర్తిగా ధ్యాస నిలబడింది. యూనివర్సిటీకి వెళ్ళాడండి. అప్పుడేమయ్యింది? పూర్వం ఆటంతా పోయింది. పోయి ఏమి వచ్చింది ఇప్పుడు? చదువులానే ఆట వచ్చేసింది. చదువునే ఆటగా మలచుకోగలిగే సామర్థ్యం వచ్చేసింది. Ph.D. చేశాడండి. ఇప్పుడేమయ్యింది? ఆ చదువులో వున్నా ఆట నైపుణ్యం అంతా కూడా, ప్రపంచానికి ఉపయోగపడే సామర్థ్యంలోకి మారాడు. అది కదా! Ph.D. అంటే అర్థం. మన విజ్ఞానాన్ని వెళ్ళడి చేసి, ప్రపంచానికి కూడా ఉపయోగపడే సామర్థ్యము. Ph.D. కూడా అయిపోయిందండి, scientist అయ్యాడండి. ఏం చేశాడు ఇప్పుడు? ఆ.. ఆఁ.. ఎంతసేపు పాతదేనా? ఈ సృష్టిలో ఇంకేమీ కొత్తది లేదా? అని కొత్తది కనుకున్నప్పుడు scientist అయ్యాడు. అయితే ఏమిటట ఉపయోగం? ఆ కొత్తదానిని కనుకున్న తరువాత అదిమానవాళి మొత్తానికి ఎట్లా ఉపయోగపడుతుంది? ఈ ప్రపంచం మొత్తానికి ఎట్లా వుపయోగపడుతుంది? సమస్త మానవాళికి ఉపయోగపడేది ఎట్లాగో, నూతనమైనదానిని ఆవిష్కరింపజేశాడు. ఆ సిద్ధాంతం ద్వారా. అప్పుడు ఏమైంది? మొత్తం మానవాళికి ఉపయోగపడింది. అయితే ఏమైందట? మరి ఇప్పుడిలా వెడుతున్నాడా లేదా? మరి ఇప్పుడు ఇలా వెళ్ళినవాడిని నువ్వు, గొప్పవాడు అని అంటున్నావుగా. నీకు తెలిసిన చదువుకున్న వాళ్ళందరిలోకెల్లా గొప్పవాడు ఎవడు?

వీడు. Scientist. ఏదైతే, నూతనమైన ఆవిష్కరణలు చేసి, సమస్త మానవాళికి ఉపయోగపడే సామర్థ్యాన్ని పొందాడో, వాడయ్యా గొప్పవాడు అంటున్నావుగా. మరి ఇప్పుడు వాడు దేహ భావనతోనే చేశాడా ఆ పని అంతా? చెయ్యలేదుగా. దేహభావనతో చేస్తే చదువు వస్తోందా? రావడం లేదుగా. ఏం చేస్తున్నాడు? ఆటలు ఆడుతున్నాడు. (మరి దేహభావన లేకపోతే ఆత్మ భావన వున్నవా వాడికి) ఆత్మభావన సంగతి పక్కన పెట్టు. వాడు ముందు దేనిని మరిచాడు? ఆటలని మరిచాడు. కదా! ఆటలే కదా! మనం ఆడుతోంది, జీవితాంతం మనం ఏం ఆడాము? ఆటేగా. ఇప్పుడు ఏమి మరువమంటున్నాడు? ఈ ఆట మరుస్తూ, ఆ చదువు నేర్చుకో! వాడిని ఎట్లా చదువు నేర్చుకుని సైంటిస్ట్ అవ్వమంటున్నావో, నువ్వు ఏం చెయ్యాలి? "పిల్లలాటల పోలికాయెను" – ఇంద్రియాలతో, విషయాలతో ఆటలు ఆడడం మొదలు పెట్టావండి, మనో వికాసం, బుద్ధి వికాసం కోసం. కానీ, మనో వికాసం, బుద్ధి వికాసం రావడం మొదలవ్వగానే, ఏం చేశావు? ఆ ఆటలే సత్యంగా వున్నావు. ఆ ఇంద్రియాలు, విషయాలే సత్యంగా వున్నావు. ఆ సత్యంగా వున్నప్పుడు ఆ పనులే చేస్తూ వున్నావు. ఆ ఫలితాలే వస్తూ వున్నాయి. కొత్త ఫలితము ఏమీ లేదు. అయితే సుఖమో, లేకపోతే దుఃఖమో. ఆ ఫలితంలో రెండే వున్నాయి. అయితే సుఖం, లేకపోతే దుఃఖం. ఫలితం ఏమన్నా మారిందా? ఆట మారినా ఫలితం ఏమన్నా మారిందా? మారలేదు. ఆలోచన మారినా ఫలితం ఏమన్నా మారిందా? మారలేదు. ప్రయత్నం ఏమన్నా మారినా ఫలితం ఏమన్నా మారిందా? మారలేదు. కాబట్టి దీనిని బట్టి ఏం తేలింది? మూల కారణం మారడం లేదు. ఫలితం మారడం లేదు. ఎందుకని? మూలకారణంలో శరీరం నేనుగా వున్నాను. ఫలితంలో సుఖమో, దుఃఖమో వుంది. ఈ మధ్యలో వున్నదాంట్లోనే, ఆటలోనే, ప్రయత్నంలోనే తేడా వుంది. మరి ఇప్పుడు మనం అంతా ఏం చెయ్యాలి అసలు? ఎక్కడున్నాము మనం? ఫలితం దగ్గర వున్నాము. దేనిని ఆశ్రయించాలట ఇప్పుడు? మధ్యలో వున్నవాటిని ఎందుకు ఆశ్రయిస్తావు? ఇప్పటి వరకూ ఏం చేశావు? ఈ ఆట కాక పోతే, ఆ ఆట ఆడి చూద్దాము. ఈ ప్రయత్నము కాకపోతే, ఆ ప్రయత్నము చేసి చూద్దాము. ఇది కాకపోతే అది చేద్దాము. దుర్గమ్మ గుడికి కాకపోతే, వెంకటేశ్వర స్వామి గుడికి వెళ్ళివద్దాము. కొబ్బరి కాయ ఒక కొబ్బరి కాయ కాకపోతే 108 కొబ్బరి కాయలు

కొడదాం. మెట్ల పూజ కాకపోతే, నవావరణ పూజ చేద్దాము. ఇవన్నీ ఏమిటి? మధ్యలో వున్నవి ఇవి. మూలకారణం కాదు. అవన్నీ చేసేటప్పుడు, మూలకారణ అయినటువంటి నువ్వు శరీరంగా వున్నావా? నువ్వు ఆత్మగా వున్నావా? అది చూసుకో మొట్టమొదట. చేసేటప్పటికి ఏమయ్యావు? మెట్ల పూజ. ఎందుకు చేశావు? మా అబ్బాయికి IIT వస్తే నేను మెట్ల పూజ చేస్తాను. IIT కి మెట్ల పూజకు ఏమన్నా సంబంధం వున్నదా? వాళ్ళు సరిగ్గా చదివితే, సరిగ్గా పరీక్షరాస్తే, వాడికి సరిగ్గా తెలివి వుంటే, వాడికి సరిగ్గా అజ్ఞానం లేకుండా వుంటే, వాడు చదువుకోవాల్సిన పరిస్థితే గనుక వుంటే, వాడికి అంత వికాసం వస్తే, (ఆ మెట్లపూజ మహిమ వీడి మైండ్‌లో చొరబడి) .... ఏమిటి చొరబడేది? ఇదంతా భ్రాంతేగా. నీ brainలోకి ఏం చొరబడిందేమిటి? ఇంత చేశాను అంటున్నావు కదా! నీలోకి ఏం చొరబడింది? నీలోకి చొరబడడం కుదరని విధానాన్ని, వాడిలోకి ఎట్లా చొరబడుతుంది? ఒకసారి ఆలోచించండి. అర్థం వుందా ఏమైనా? నువ్వు ఇంతకాలం చేశానంటున్నావే, నీలో ఏం చొరబడిందని నువ్వు గుర్తించగలిగావు? నీలోకి చొరబడిందా? ఏదీ చూపెట్టు? ఆ చొరబడడమే కనుక సత్యమే అయితే, నీకు ఎప్పుడో ఈ శరీర భావం పోవాలిగా. పోలేదుగా. (ఆ ఫలితం రావాలని చేశాము) అవునమ్మా! రాలేదు కదా! నువ్వు అన్నది అక్కడ ఎప్పుడూ రాలేదుగా. వచ్చిందని ఒక్కశాతంతోటే వచ్చిందని సంతృప్తి పడ్డావు. అది 100 శాతము ఎప్పుడూ రాలేదు. ఒక శాతం మాత్రమే వస్తుంది, ఎప్పుడు వచ్చినా. ఆ ఒక శాతం ఎట్లా వచ్చింది? ప్రకృతి ధర్మంగా సృష్టి పరిణామంలో ఎలా రావాలో, అలా వచ్చింది. (అట్లా అనుకోవడం లేదు, ఆ దైవమే వచ్చింది అనుకుంటున్నాము) ఏమయ్యావు అప్పుడు? భ్రాంతికి లోనైపోయావు. ఎందువల్ల? అసలు మూలకారణంలోనే భ్రాంతి వుందిరా బాబు. నువ్వు ఆ పని మొదలు పెట్టేటప్పుడే శరీర భావంతో మొదలు పెట్టావయ్యా బాబు. అర్థమైందా అండీ!

నా మనవడికి ఆరోగ్యం రావాలి అంటే, నేను ఇప్పుడు అమ్మవారికి అట్లుపోయాలి. అర్థం వుందా ఏమన్నా? అమ్మవారికి అట్లు పోయడానకినూ మనవడికి సంబంధం ఏమన్నా వుందా? ఇలా రకారకాల వాళ్ళున్నారు. రకరకాల అనేక అంశాలు వున్నాయి. ఇవన్నీ నువ్వు చేశావు, ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే ఏముంది? ఇదేగా, ఈ గోలే కదా! ఇంతకు

మించి ఏమన్నా వుందా? కాబట్టి ఒక్కసారి విచారణ చెయ్యి. మూల కారణాన్ని విచారణ చెయ్యి. ఫలితం మీద అపేక్షను విడిచిపెట్టు. అంటే నువ్వు ఇప్పుడు రెండు పనులు చేయాలన్నమాట. ఏమిటి? "మూలకారణం ఏమిటి? శరీరమే నేను అనే భ్రాంతితో చేస్తున్నాను. అసలు అజ్ఞానానికి అంతటికీ మూల కారణం ఇది". దుఃఖానికి కాని, సుఖానికి కానీ మూలకారణం ఇది. పోతే రెండూ పోతాయి. ఒకటి పోయి ఒకటి వుండదు. అంటే అర్థం ఏమిటి? దుఃఖం పోతే, దుఃఖంతో పాటు, సుఖం కూడా పోతుంది. ఏముంటుందయ్యా? కదలకుండా వుండే స్థితి వుంటుంది. ఆనందం వుంటుంది. మనం ఇప్పటి వరకూ ఆనందం అంటే, ఎగడపు, దిగడపు పడిపోయి నవ్వుకోవడమే ఆనందము అని అందరి అభిప్రాయము. అబ్బే! అసలు ఆనందం అంటే అది కాదు. కదలకుండా వుండడం. గాఢ నిద్రావస్థలో నువ్వు ఏ స్థితిలో వున్నావు? కదలకుండా వున్నావు. నీలో వున్నటువంటి నేను, ఏ స్థితిలో వున్నాడప్పుడు? ఆనందంగా వున్నాడు. కారణం ఏమిటి? ఆనందమయ కోశ పరిధిలో వున్నాడు కాబట్టి, ఆనందంగా వున్నాడు. అతన్ని ఏదైనా గానీ కదల్చగలదా అప్పుడు? ఏదీ కదల్చలేదు. మనసు గాని, బుద్ధిగాని, ఇంద్రియాలు గాని, విషయాలు గాని, నీ అప్పులు గాని, నీ పోలీసు కేసులుగాని, నీ అనారోగ్యం కానీ, నీ వికలాంగత్వం కూడా నిన్ను ఏమీ చేయజాలదు. (నిద్రలో ఏదో ఊరికే ఆనందమే కానీ, ఇంత వివరణ కూడా తెలియదు) అది వేరే విషయం. కానీ గాఢ నిద్రావస్థలో నువ్వు ఏ స్థితిలో వున్నావు? వీటి వలన ఏ రకమైనటువంటి చలనము లేకుండా వున్నావు. కాబట్టి ఆనందం అంటే నిర్ణయం ఏమిటంటే, సుఖ దుఃఖ చలనము లేని స్థితే ఆనందము. సుఖ దుఃఖములనే కదలిక లేకుండా వుండడమే ఆనందము. సుఖ దుఃఖములు అనే కదలిక వుందీ... (అప్పుడు ఆనంద స్థితి కాదు).

ఉదాహరణ చెప్తా. ఇప్పుడు గుడ్డివాడు వున్నాడండి. వాడికి కళ్ళు లేవు కదా! నిద్రపోతున్నాడు. గాఢ నిద్రవస్థలో వాడు కళ్ళు వున్నవాడా? కళ్ళు లేని వాడా? (నిద్రపోతున్నప్పుడు మనకు ఎంతో వాడికీ అంతే!) కాదు. నీకు వాడికీ కూడా కొంచెం తేడా వుంది. నువ్వు మామూలుగా మెలకువలో కళ్ళు ఉపయోగిస్తున్నావు. కళ్ళు మూసేసుకుని నిద్రపోయాను అనే స్థితిలో వున్నావు. వాడు కళ్ళు తెరచినా,

తెరువకపోయినా, చూసినా, చూడక పోయినా మెలకువలో కూడా ఒకటే కదా! కానీ నిద్రావస్థలో... అసలు కళ్ళుగా పనిచేస్తున్నది ఏది? మనస్సు కదా! అంతేనా? ఇప్పుడు మనసు ఏం చేస్తోంది? మనసు నిద్రపోతోంది. నిద్రపోయే ముందు మరి కల కంటోంది కదా! ఆ కల కన్నప్పుడు, ఆ కళ్ళు వున్నవాడు ఎలా వుంటాడో, వాడు అలానే వుంటాడు. కాబట్టి మనసు స్థితిలో అన్ని ఇంద్రియాలు వున్నాయి. మనసు స్థితిలో అన్ని ఇంద్రియాలు వున్నాయి. స్థూలంలో, శరీరంలో కొన్ని ఇంద్రియాలు లేకపోయినా, మనస్సు స్థితిలో, అన్ని ఇంద్రియాలు వున్నాయి. మనస్సుకి వాడి కలలో.. కలలు కనపడుతాయా? (ఆ..). నువ్వు ఎలా కలగంటావో, వాడు అలాగే కలగంటాడు. ఏ భేదం లేదు అక్కడ. నువ్వు ఎలా చూస్తున్నావో, వాడు అలానే చూస్తాడు. నువ్వు ఎలా అనుభవిస్తావో వాడు అలానే అనుభవిస్తాడు. ఏ భేదమూ లేదు. నీకు ఎట్లా కల వస్తుందో, వాడికి అట్లాగే వస్తుంది. (బయటకు వచ్చిన తరువాత మళ్ళీ వాడికి కనబడదు) అంతే! అంతే తేడా. అట్లాగే, ఒక కాళ్ళు లేని వాడు వున్నాడండి. కల కనేటప్పుడు ఎలా వున్నాడు? పరుగెడుతూనే వుంటాడు మామూలుగానే. అయ్యో! నాకు కాళ్ళు లేవే, నేను పరుగెత్తలేనే అనే తెలివి వుండదు అక్కడ. ఇప్పుడు మనసులో అన్ని ఇంద్రియాలు వున్నాయా లేవా? అన్ని ఇంద్రియాలు వున్నాయి. అర్థమైందా అండీ ఇప్పుడు? కాబట్టి, అసలు నువ్వు ఈ శరీరాన్ని ఏమని పట్టుకున్నావు ఇప్పుడు? నీకు సుగర్ వ్యాధే వచ్చింది అనుకోండి, లేదూ బీపీ నే వుంది అనుకోండి. మనసు లోపలికి వెళ్ళేటప్పటికి ఏమైంది? మనసుకి, సుగర్ వ్యాధి, బీపీ వ్యాధి వుందా? లేదుగా. ఏం చేసింది? ఒక్క స్థితి అవతలకు దాటగానే, నీ వ్యాధులన్నీ ఇక్కడే వదిలేసింది. నీ వ్యాధులన్నీ ఎవరివి? ఇంద్రియాలవి. అక్కడే వదిలేసింది అంతే. ఎందుకని? నాకు నీ వ్యాధులతో పని ఏముంది? మనసే చెప్తోంది స్పష్టంగా. నీ వ్యాధులతో నాకు ఏమీ పని లేదు. నేను సహజంగా స్వేచ్ఛగా వున్నాను. నీకు కాళ్ళు నొప్పులు అయితే, దేహానికి కాళ్ళు నొప్పులు, మనసు కలలో పరుగెత్తడం లేదా? పరుగెడుతున్నావు. ఇలలో పరుగెట్టు... పరుగెత్తలేవు. అర్థమైందా అండీ!

కలలో పరుగెత్తలేదా? పరుగెత్తకలుగుతోంది. ఎందుకు పరుగెత్తగలుగుతోంది? నీకు ఈ ఇలలో దేహంతో వున్న ఏ లక్షణాలు కూడా అక్కడ, మనసు స్థితిలోనే లేవు. మనసు స్థితిలోనే లేకపోతే, దాని అవతల వున్న స్థితిలో ఎక్కడ వున్నాయి? కాబట్టి ఇప్పటి

వరకూ నువ్వు దేనిని ఆశ్రయించావు? మనసుని కూడా ఆశ్రయించలేదు. నువ్వు సరిగ్గా తెలుసుకోలేదు నాయనా! ఆ ప్రాణాన్ని సరిగ్గా తెలుసుకోలేదు. ఎందుకని? ప్రాణాన్ని తెలుసుకుంటే హంస స్వరూపం అన్నా తెలిసేది. సోహం భావేన పూజయేత్. ఆ సోహం సోహం అంటే ఏమిటో తెలిసేది. అదీ తెలియలేదు. పోనీ మనసు తెలిసిందా? అదీ తెలియలేదు. పూజలు చేశావు, తపాలు చేశావు, యజ్ఞాలు చేశావు, యాగాలు చేశావు, ధ్యానాలు చేశావు, అయిపోయింది ధ్యానం కూడా చేసేశావు. ఆఖరి ప్రయత్నం అదే ఇక. ఇక తరువాత ఏం లేదండి. ఎంతమంది మహానుభావులు చెప్పినా, ఆఖరి ప్రయత్నం ధ్యానమే. ధ్యానం కూడా చేసేశానండి. ఏం తెలిసింది ఇప్పుడు? ఆఁ... ఇది కరెక్టుగా చెప్పారు. అంటే మెలకువలో కూడా కొంచెం సేపు నిద్రపోయే అవకాశం వచ్చింది. అర్థమైందా అండీ! మామూలుగా నిద్ర ఎలాగూ పోతున్నాము. కానీ మెలకువలో కూడా, మళ్ళా కాసేపు కల్పిత నిద్ర, (అది నిద్రలాగా కూడా వుండదు కదా!) కల్పిత నిద్ర కదా మరి. మామూలు నిద్ర అయితే, మునిగిపోతావు. ఇది కల్పిత నిద్ర కదా! నీకు నువ్వే కల్పించుకున్నావు. కాబట్టి కల్పిత నిద్రగా వున్నావు. ఒక నూలుపోగె తెరంత మెలకువ వుంటుంది. మిగిలినవన్నీ మునిగిపోతాయి. (బానే తెలుస్తుంటాయి ధ్యానంలో) అది వేరే అంశం. ఇంకా సొంతం బయిటే వున్నప్పుడు. గాఢ ధ్యాన స్థితిలో వున్నప్పుడు, బయట సంగతి వినపడుతుంది గానీ, స్పందించవు. తెలుస్తుంది కానీ స్పందించవు. ఎందుకని? ఒక నూలు పోగు అంత తెలివే బయటకు వుంటుంది కాబట్టి. అది కూడా లేకపోతే, పూర్తిగా సమాధి నిష్ఠ. అయితే ఎన్ని పేర్లు పెట్టుకున్నా, ఏం అవుదామని ఇప్పుడు? నేను శరీరం కాదు అనే పద్ధతిలో చేయడం నేర్చుకో. ఈ పనులన్నింటిలో. ధ్యానం చేశావు, నేను శరీరం కాదు. శరీరం నేను కాదయ్యా బాబు. అప్పుడు నువ్వు ధ్యానంలోకి వెళ్ళే ముందు వస్తున్నటువంటి అన్ని ఆలోచనలకి, ఈ సమాధానం చెబుతూ వుండు. ప్రతీ ఆలోచనకి ఈ సమాధానం చెప్పుముందు. నేను శరీరం కాదు, అనంగానే ఏమడుగుతుంది? మరి నువ్వు ఎవరవు అని అడుగుతుంది వెంటనే. ఆ మనసు వూరుకోదండి. వెంటనే ఏమంటుంది? నేను శరీరం కాదు అని నువ్వు అనంగానే ప్రయత్నం చేసి, నువ్వు ఎవరివి? అని అడుగుతుందండి. నేను ఆత్మస్వరూపుడిని. అయితే ఇది Tally అవ్వడం లేదు పో అంటుంది. నువ్వు ఆత్మస్వరూపుడివి అయితే, నువ్వు చేసే, ఈ ఆలోచన, ఈ విధానం tally

అవ్వడం లేదు, నువ్వు చేయడానికి వీలుకాదు పో అంటుంది బుద్ధి వెంటనే. (ఈ ఆత్మతో మాట్లాడినప్పుడు లోతుగా వుంది, మనసు పైపైనగా వుంది) అంతేగా మరి. ఇది విషయాలు కదా! నీకు ఇక్కడ ఏమున్నాయి? బుద్ధిలోనే అన్నీ, ఇవన్నీ! నీ బుద్ధి ఏం చెప్పింది వెంటనే? నేను ఆత్మస్వరూపుడు అని చెప్పగానే, ఏమంటుంది వెంటనే, నువ్వు చేయబోయే పని దానికి సరిపోవడం లేదు, చేసే విధానం భావన సరిపోలేదు అంటుంది. ఎందుకని? నీ దగ్గర వున్న జ్ఞాపకాలన్నీ, శరీర పద్ధతిగానే వున్నాయి జ్ఞాపకాలన్నీ. ఆత్మపద్ధతిగా ఏమైనా జ్ఞాపకాలు వున్నాయా? లేవు. ఇప్పుడేగా పోగేస్తున్నావు. కాబట్టి, ఆత్మానుసార జీవితం జీవించడం ప్రారంభించాలి. ఇట్లా జీవించడం మొదలుపెడితే ఏమైంది? అప్పుడు? దేనినైనా తోసిరాజు అనగలిగావు. దానికి అడ్డం ఏదీ లేదు. ఎందుకని? నేను ఈ శరీరంలోకి వచ్చిందే దాని కోసం. అర్థమైందా అండీ! నువ్వు ఆత్మజ్ఞానం తెలుసుకోవడానికి, వీలు లేదు. ఒక ఆన్సర్ వెతికించామండి. ఎవరినైనా ఆపు చూద్దాం. ఆపగలవా? అసాధ్యమే. అరచేతి అడ్డం పెట్టి సూర్యోదయాన్ని ఎట్లా ఆపుతావు? అది అసాధ్యం కదా! అది ఎంత అసాధ్యమో, ఇది అంత అసాధ్యం నాయనా! ఎందుకని? ఇప్పుడు అనుకుంటున్నావు, ఆత్మదృష్ట్యా చూస్తే, నువ్వు ఈ శరీరానివి, ఇప్పుడు జన్మించావు, ఇప్పుడు జీవించావు, ఇప్పుడు వదిలేశావు. ఆత్మ దృష్ట్యా అవి అన్నీ నామమాత్రం. ఎన్ని శరీరాలు తీసుకున్నా, ఎన్ని శరీరాలలో జీవించినా, ఎన్ని శరీరాలు విడిచిపెట్టినా, నీ గమ్యం ఎప్పటికైనా ఆత్మజ్ఞానమే. కుండబద్ధలు కొట్టినట్టు చెబుతోంది అందుకే. వేదాంతం. కాబట్టి నువ్వు నిజజీవితంలో జీవించేటప్పుడు, శరీరంలో జీవించేటప్పుడు, నేను శరీరం కాదని జీవించవయ్యా!

అప్పుడే ముక్తి సాధ్యం అవుతుంది. తరువాత చదవండి.

"తన యథార్థ స్వరూపమును విచారించి... " అది, ఆన్సర్‌లోనే ప్రశ్న వేశాడు మళ్ళా. ముందు ఏం చేశాడు? నాయనా! ముక్తి అంటే ఏమిటో నాకు తెలియాలి అన్నాడు. ముక్తి అంటే ఏమి చెప్పాడు? నువ్వు శరీరం అనుకుంటున్నావు నాయనా! నువ్వు శరీరంలో వుండి శరీరం కాకుండా, యథార్థ స్థితి అంటే ఏమిటి? నీ స్వరూప స్థితిలో వుంటే నువ్వు ముక్తుడవే. వెంటనే మళ్ళా ఆన్సర్‌లోనే ప్రశ్న వేశాడు. యథార్థ స్థితి అంటే ఏమిటి?

స్వరూప స్థితిలో వుండడం అంటే ఏమిటి? దానిని తెలుసుకోవడం ఎట్లాగ? తెలిస్తే కదా! వుండడానికి. ఇప్పటి వరకూ మనకు ఏమి తెలియదు? అది ఎట్లా వుందో తెలియదు కాబట్టి, వుండలేక పోతున్నాను అండీ! తెలిస్తే వుంటాను. అన్నారు.

"ఎల్లవారికి ఇత్యాది అనుభవముల నుండియే అయ్యనుభవములకు... తగిన క్రియలకు మూలమైన నేను అను ఒక.. అంటే తెలివి, ఆ తెలివి యొక్క నిజస్వరూపమును, నేను ఎవడను? విచారణ చేసి.... వుండటయే.... యథార్థ స్వరూపమును... "

అదండీ సంగతి. మీ ఇంటినుంచి ఇక్కడికి వచ్చాడా లేదా? వచ్చారా? నేను వచ్చితిని. వచ్చితిని ఏమిటి? పని. ఎవరు చేశారు? ఇంద్రియాలు చేశాయి. దానికి ప్రేరణ ఏమిటి? ఏదో నేర్చుకోవాలి. ఏదో తెలుసుకోవాలి. అది కూడా ఇంద్రియమే కదా! మరి దాని అవతల వుండే నేను? కాబట్టి వచ్చితిని, పోయితిని, చేసితిని, తింటిని అని నువ్వు ఎన్నైతే చెబుతున్నావో, వాటి అన్నింటి వెనుకాల వున్నది ఎవరు? నేను. కాబట్టి ఆ పనులు చేసేముందు ఏం ప్రశ్నించాలట ఇప్పుడు? నేను ఎవడను? ఈ చేసే వాడు ఎవడు? పోయేవాడు ఎవడు? వచ్చేవాడు ఎవడు? తినే వాడు ఎవడు? (అసలు ఈ ప్రశ్న వస్తుందా అని నా డౌటు, మేం ఏం పని చేసినా ఈ ప్రశ్నలు రావడం లేదు, మామూలుగా చేసుకుంటూ పోతున్నాము) ఆఁ... అంటే అందుకే కదా! మీకు ఏం చెప్పాను ఇందాక? శరీర పద్ధతిగా చెయ్యడమే నువ్వు అభ్యాసం చేశావు. అభ్యాసం చేయడం వల్ల ఈ ప్రశ్న రావడం లేదు. ఈ ప్రశ్న వస్తే గానీ, నువ్వు శరీరమా? ఆత్మ స్వరూపమా అని నిర్ణయం చేయలేవు. అర్థమైందా అండీ!

ఇప్పుడు ఉదాహరణ చెబుతా చూడండి. మీరు బ్యాంకులో డబ్బులు తీసుకోవడానికి వెళ్ళారండి. ఏమడిగారు మిమ్మల్ని? మీరు ఎవరు? మీరు ఎవరు అని అడుగుతున్నాడా లేదా? మీరు ఎవరు అంటే మీరు ఏం చెప్పారు? మీ ఖాతాదారుడిని అండీ నేను. అంటున్నావా? వాళ్ళ ఖాతాదారుడు కాకపోతే నీకు డబ్బు ఇస్తాడా? నీ ఖాతా పుస్తకం, సంతకం, కాగితం అన్నీ వుండాలిగా. అన్నీ వుండాలా? కాబట్టి నువ్వు ఎవరివి అని తెలియాలి మొట్టమొదట? నా వాడివి అని తెలియాలి మొట్టమొదట. అంతేనా? కాబట్టి ప్రశ్న దేనితో మొదలు పెట్టాడు? నువ్వు ఎవరు? నువ్వు కూడా దేనితో మొదలు పెట్టాలి? నేను ఎవరు? ముందు దానితో మొదలు పెట్టు. ఏ పనైనా, ఏ మాటైనా సరే, నేను

ఎవడను? నేను ఎవడను అని ప్రశ్నించంగానే నువ్వుదానికి సమాధానం చెప్పాలి. ముందు ఆ ప్రశ్న వేయడం నేర్చుకో! ప్రతినిత్యం నేను ఎవడను అనంగానే, నేను ఆత్మస్వరూపుడను అని సమాధానం చెప్పు. నేను ఆత్మ స్వరూపుడు అనే సమాధానం చెప్పగానే, (రెండూ మనమే చెప్పాలా?) ఆ.. రెండూ మనమే చెప్పాలి. చెప్పుకోగానే ఏమైంది? నిద్ర లేస్తున్నామండి. నిద్రలేస్తూనే నేను ఎవడను? నేను ఆత్మస్వరూపుడను. ఇంతకు ముందు నిద్రపోయింది ఎవరు? ఇంతకు ముందు చేసిన పని ఏమిటి? నిద్రపోవడం. ఎవరు నిద్రపోయారు? నిద్రపోతిని. ఏం చెప్పాడు అక్కడ? నిద్రపోతిని అన్నాడు కదా! నిద్రపోతిని. ఎవరు నిద్రపోయింది? నేను నిద్రపోయానా? ఇంద్రియాలు నిద్రపోయినాయా? (మనసు) మనసుకూడా ఇంద్రియమే కదా! నిద్రపోయింది ఏమిటి? ఇంద్రియాలు. పని చేసింది ఏమిటి? ఇప్పుడు మేలుకున్నది ఏమిటి? అదీ ఇంద్రియాలే. (ఇవన్నిటికీ కారణం మనస్సే కదా!) మనస్సుకూడా ఇంద్రియమే. (అది పనిచేస్తేనే ఇంద్రియాలు పని చేస్తాయి కదా!) అవును. అది కూడా నిద్రపోతుంది కదా! అది నిద్రపోతేనే వీటన్నిటికి. అవునండి ఏదైనా సరే ఇప్పుడు ఏమైంది? ఇప్పుడు ఇంద్రియాలు నిద్రపోయినాయి. ఇంద్రియాలు మేల్కొన్నాయి. అంతేనా? వేరే ఏమన్నా వుందా? మరి దానికో పెద్ద ప్రాధాన్యత ఇస్తావే? ఏదో ప్రపంచం బద్దలు అయిపోయినట్టు. ఏమైంది? ఇంద్రియాలు పని చేశాయి. ఇంద్రియాలు విశ్రాంతి తీసుకున్నాయి. నేను ఎవడను? నేను గమనించేవాడను. నేను సాక్షిని. నేను ఆత్మ స్వరూపుడను. నేను నిద్రపోవడం లేదు. నేను మేల్కోవడం లేదు. నేను ఎప్పుడూ ఒక్క తీరుగానే వున్నాను. ఎలా వున్నా నాకు దానితో ఏమీ పనిలేదు. ఇప్పుడు నా దగ్గర పనిముట్లు వున్నాయండి. ఆ పనిముట్లు పనిచేస్తున్నాయి. నేను ఏం చేస్తున్నాను? చూస్తూ వున్నాను. అవసరమైతే ఒక పనిముట్టును వాడాలి, వాడాను. పక్కన పెట్టాను. పనిముట్టును వాడినంతమాత్రాన, నేను పనిముట్టును అవుతానా? (సాక్షిత్వం రావాలి కదా!) రావాలి అంటే నువ్వు ప్రయత్నం చెయ్యాలి కదా! నువ్వు వున్నది ఆ తీరుగానే వున్నావు. కానీ పనిముట్టును ఉపయోగించేటప్పుడు పనిముట్టు అవుతున్నావు. అర్థమైందా అండీ!

శరీర భావన అంటే అర్థం ఏమిటంటే ఇప్పుడు, పనిముట్టును ఉపయోగించే టప్పుడు పనిముట్టువు అయ్యావు. అంటే అర్థం ఏమిటి? Cell phone వాడుతున్నావండి,

మాట్లాడుతున్నావండి. ఆ కాసేపు నువ్వు ఏమయ్యావు? Cell phone అయిపోయావు. అయ్యావా లేదా? అవ్వకూడదు కదా మరి! TV చూశావండి. TV చూస్తే ఏమయ్యావు? అందులో వచ్చే ఏ కార్యక్రమం అయితే వుందో, ఏ పాత్ర అయితే వుందో, దేనిమీద అయితే నీకు ఆకర్షణ వుందో, అది నువ్వు అవుతున్నావు. గుర్తుపెట్టుకోండి. Cell phone నువ్వు అయ్యావా? అవ్వలేదు. అవతల వున్నటువంటి ఏ వ్యక్తి చేతైతే నువ్వు మాట్లాడుతున్నావో, ఆ వ్యక్తివి నువ్వు అయ్యావు. అర్థమైందా? కానీ ఉపయోగించిన Cell phone వి అయ్యావా? అవ్వడం లేదుగా. మరి అట్లాగే, ఇంద్రియాలను ఉపయోగించి ఇంద్రియార్థములు సాధించబడుతున్నాయండి. ఇంద్రియాలు నువ్వు ఎట్లా అయ్యావు? ఇంద్రియాలు కూడా cell phone లాంటిదే కదా! మీట నొక్కితే పనిచేస్తున్నాయి, మీట కట్టేస్తే పని చేయడం లేదు. మరి ఆ ఇంద్రియాలు పనిముట్లు కదా నీకు. పట్టుకో మంటే పట్టుకుంది. వదిలెయ్యమంటే వదిలేసింది. మరి నీకు ఇది ఇంద్రియాలు పనిముట్లు కదా! మరి ఇంద్రియార్థములు? ఇంద్రియాల ద్వారా చేయబడేటటువంటి పనులు? అవీ అంతే! పనుల వల్ల వచ్చిన ఫలితాలు? అవీ అంతే! మరి ఫలితాలలో ఇన్ని Rating ఎందుకు పెట్టావు? ఇది గొప్ప, ఇది దిబ్బ. ఇది మధ్యలో. అది వెనకాల. ఇది ముందుకి. ఇది సామాన్యం. ఇది ప్రత్యేకం. అవన్నీ ఫలిత స్థాయిలో పెట్టినవి కదా! నీ ఇంట్లో అన్ని పనిముట్లు ఒకటేనా కాదా? ఒకటేనా? ఒకటే అయివున్నప్పుడు ఏం చేస్తున్నావు? వజ్రం గొప్పది, రాయి దిబ్బ. రెండూ రాళ్ళే కదండీ! అవసరం కాదు. రెండూ రాళ్ళే కదా! (రెండూ రాళ్ళే, కాకపోతే తెలుసుకోలేక వజ్రానికి విలువ ఇస్తాం, మామూలు రాయికి ఇవ్వం) ఏం చేశావు ఇప్పుడు? అయ్యో! అర్థం వుందా? రెండూ భూమిలో దొరికేవే కదా! రెండూ భూమిలో దొరికేవేనా? ఇది అరుదైనదండి. ఏమిటి అరుదైనది? (దృష్టి దానిమీద వుంది, దాని విలువ పెరిగింది). ఏం చేశావు? దానికి ఇప్పుడు ప్రత్యేకతను ఆపాదించావు. లేని ప్రత్యేకతని ఆపాదించావు. అర్థమైందా? ఈ వజ్రాలను పట్టుకుపోయి, నల్లని రాయి, శివలింగం మీద పోశావు. ఇప్పుడు ఏమంటివి? అబ్బా! ఇంకా గొప్పదండి. అన్నావు. ఏంటంట? ఈ రాయిని పట్టుకెళ్ళి, మరో రాయి మీద పెట్టావండి అంతేనా? వజ్రాలు పొదిగిన కిరీటం పట్టుకెళ్ళి, శివలింగం మీదో, వేంకటేశ్వరుని మీదో పెట్టావండీ. ఏమిటట ఇప్పుడు? ఆ బంగారము భూమిలోదే. ఆ వేంకటేశ్వరస్వామి విగ్రహము

వున్నటువంటి శిలా భూమిలోదే. అంతా రాయేగా. వజ్రాలు? అదీ రాయే. రాయిమీద రాయి పెట్టి, చాలా గొప్పపనిచేశాను అంటావేమిటి? (అదేమో దేవుడని, ఇదేమో వజ్రాల కిరీటమని) దేవుడికి కిరీటం పెట్టే స్థితి నాకు వచ్చిందని? అర్థముందా ఏమైనా? బుర్ర వుందా నీకేమైనా అసలు. అదేమన్నా శరీరమా? దేవుడు? కాదు కదా! నువ్వు పెట్టుకున్నట్టు ఏమన్నా ఊరేగుతున్నాడా ఆయనేమన్నా? ఏం ఊరేగడం లేదే? అర్థమైందా? ఇప్పుడు ఊరేగింపు వస్తుంది అమ్మా! అయ్య గారి ఊరేగింపు వస్తుందండి? అందరూ వాకిళ్ళో నిలబడి హారతులు ఇస్తున్నారా? ఏమిటి అసలు ఊరేగింపు అంటే? ఏమిటి? (పక్కనుంచోని హడావుడి) దేవుడు వస్తున్నాడండి, దేవుడు వస్తున్నాడండి, దేవుడు వస్తున్నాడండి! ఏమిటి వస్తున్నాడు? అది కాదు. లోక సహజం అండి. ఆ ఊరేగింపే లేకపోతే, దేవుడికి ఆభరణాలు ఎందుకు? (మనకు తెలీదు, కానీ వాళ్ళు వస్తున్నారు) ఇప్పుడు వేంకటేశ్వర స్వామి ఇప్పుడు నీకు తిరువీధులలో ఊరేగింపబడుతారండి రోజూ ఊరేగింపబడుతారు. చంద్రప్రభ వాహనం, సూర్యప్రభవాహనం, ఏనుగు వాహనం... (మన దగ్గరికి కూడా వస్తాడుగా) నువ్వు ఎట్లా అన్నా చేసుకో! ఇదంతా ఏమిటిది? అర్చామూర్తులకు ఊరేగింపు వుంటుంది. అర్థమైందా అండీ!

మూల విరాట్‌కు ఏమీ లేదు. అవునా కాదా? ఉత్సవ విగ్రహాలు కదా! ఊరేగింపు అంటే ఊరు + ఏగటం. ఏగటం అంటే ఏమిటి? పోవడం. అర్థమైందా అండీ! ఆయన ఊరు వెళ్ళాడు, ఏ ఊరు వెళ్ళాడు? ఊరు అంటే దేశం, ఈ దేశము నుంచి మరొక దేశానికి వెళ్ళాడు. (ఇంతింత వాటికి ఖర్చు పెడుతుంటారు కదా! అదే మరి అందరిలోనూ ఆత్మను చూడమని ఆ పేదవాళ్ళకు, బీదవాళ్ళకు ఇవ్వవచ్చు కదా! ఆ వేంకటేశ్వర స్వామికి ఎన్ని లక్షలు వచ్చుంటాయో కదా!) మనమేం చేశాం పిడకలు. మనం అంటే తెలియదు కనుక, తెలియక చేశాము. సరే! నువ్వు దేహభావనతో చేస్తున్నావు. నేను ఒకటే చెబుతా వినమ్మా! అందుకే చెప్పేది వినండి. భారత దేశంలో, బొమ్మల పెళ్ళిళ్ళ మేరకు ఎన్నో చేస్తాము. ఆ ఒక్కటి కాదు. బొమ్మల పెళ్ళిళ్ళ పేరు మీద, మనం ఎన్ని చేస్తాము? అన్ని నవరాత్రులు చేస్తాము. వినాయక నవరాత్రులు చేశాం, అమ్మవారికి నవరాత్రులు చేశాం, శ్రీరామ నవమి నవరాత్రులు చేశాము, వసంత నవరాత్రులు చేశాము. ఇవన్నీ ఏమిటివి?

బొమ్మల పెళ్ళిళ్ళే కదా! బొమ్మల పెళ్ళిల్లకు కోట్లు ఖర్చుపెట్టడానికైనా సిద్ధమే. “అన్నమో రామచంద్ర! అనువాడికి పిడికెడు అన్నము బెట్టు అన్నపూర్ణ లేదు కదా! ఈ భారతావనిలో” ఏమండి మానవుడికి వున్న భ్రాంతిని తీసుకెళ్ళి అక్కడ కూడా పెట్టాము. నీకు వున్న అహాన్ని, నీకు వున్న భ్రాంతిని, నీకు వున్న అజ్ఞానాన్ని కూడా ఆయనకి, దేవుడికి తగిలిస్తే కానీ, సంతృప్తి చెందలేదు మనం. మూలవిరాట్ ఒకప్పుడు వేంకటేశ్వర స్వామి, ఇవాళ ఉన్న పరిస్థితి కాకుండా, మూలవిరాట్ వున్న విడియోలు వున్నాయండి. అప్పుడు ఏమి వున్నాయి? ఆయన విగ్రహము మీద కేవలము ఒక ఉత్తరీయము వుంది. ఓ ఉత్తరీయము వుంది అంతే. అంతకు మించి ఏమీ లేవు. ఇవాళ కాదు. ఒక రెండున్నర సంవత్సరాల క్రితం, అక్కడ ఏమీ లేవు. ఇప్పుడున్న ఆలయము లేదు, ఇప్పుడున్న బంగారు తాపడమూ లేదు, ఏమీ లేదు. మామూలుగా బయట ఎట్లా అయితే ఆంజనేయ స్వామి గుడి వుంటుందో, ఆంజనేయ స్వామికి ఒక ఉత్తరీయము కప్పి వుంటుందో, అట్లాగ ఒక ఉత్తరీయము కప్పివుంది దానికి అంతే! (ఇది కూడా 40, 50 యేళ్ళనాడు ఎట్లా వుందో..) నాచిన్నప్పుడు ఎలా వుందేమిటి? మరి అప్పుడు ఏముంది? (ఆ గుడి చుట్టూ ప్రదక్షిణాలు చేసేవాళ్ళం) అవును, సరాసరి వెళ్ళి పోయేవాళ్ళము. ఏముంది? అవునండీ! ఇప్పుడు దానికి ఆ స్థితి ఎట్లా వచ్చింది ఇప్పుడు? (డబ్బులు) డబ్బుకాదు. భ్రాంతి. నీవు నీ దగ్గర వున్న అజ్ఞానాన్ని, నీ దగ్గర వున్న భ్రాంతిని కూడా తీసుకుపోయి, దాని మీద పెట్టేటప్పటికి, దేవుడినికూడా అజ్ఞానంలో ముంచితే కానీ మనకు నచ్చలేదు. అర్థమైందా అండీ!

ఇప్పుడు నీ ప్రతిబింబాన్ని చూసి నువ్వు ఆనందపడుతున్నావా? పడుతున్నావా లేదా? అట్లాగే, నువ్వు చంద్ర వంకీలు పెట్టుకుంటే, అమ్మవారు చంద్రవంకీలు పెట్టుకోవాలి. (అమ్మవారికి పెడితే అది ఆనందం) అహా! మనం పెట్టుకున్నాము ముందు. ఆనందించాం. ఇప్పుడు మనం పెట్టుకుని ఆనందిస్తున్నాము కదా! కాబట్టి ఆవెడకు కూడా పెట్టావు. అలంకరణ అంతా ఎట్లా వచ్చింది ఇప్పుడు? ఇట్లా వచ్చింది. అర్థమైందా అండీ!

నీకు నువ్వు చేసుకుంటున్నావండీ! షోడశోపచారపూజతో భాగంగా వచ్చిందండి ఇది. గుర్తుపెట్టుకోండి. ఈ షోడశోపచారాలు ఏమిటి? నీవు చేసుకునేవి. ఎందుకు చేసుకోమన్నారు? నువ్వు దేహం కాదు అని తెలుసుకోవడం కోసం చేసుకోమన్నారు.

దేహంలో వుంటూ, దేహానివి నువ్వు కాదు అని తెలుసుకోవడం కోసం, రోజూ ఈ షోడశోపచారాలు చేయినాయన. నిత్య పూజ అంటే అర్థం ఇదే! అని చెప్పారు. కానీ ఏం చేశావు? నీకు నీవు చేసుకోరా బాబు షోడశోపచారాలు అంటే, నువ్వు ఏం చేశావు? ఒక చిన్న టిక్కి కట్టి, ఆ టిక్కీలో ఒక రెండు అంగుళాల విగ్రహాలు పెట్టి, ఈ రెండు అంగుళాల విగ్రహానికి ఆ ఫలహారం చేసి, అది నిత్యపూజ అంటున్నావు. అర్థముందా ఏమైనా? అది నిత్యపూజ ఎట్లా అవుతుంది? నీకు నువ్వు చేసుకోరా బాబు, నీలో వున్నటువంటి దైవత్వం నీకు తెలుస్తుంది. నీ దివ్యజ్ఞానం నీకు తెలుస్తుంది. నీలో భగవంతుడు ఎట్లా వున్నాడో తెలుస్తుంది. కాబట్టి నీకు నువ్వు చేసుకోరా బాబు. అని పెట్టాము. అది పోయి చివరికి ఏమైంది? ఇప్పుడు దేవుడు అంటే ఎక్కడ వున్నాడు? గూటిలో వున్నాడు. మీ ఇంట్లో దేవుడు ఎక్కడున్నాడండీ? చాలా భ్రాంతికరమైనటువంటి, ఎంతో ఆశ్చర్యకరమైనటువంటి, అజ్ఞానపూరితమైనటువంటి భావన. కొత్తిల్లు కడతారండి. మీ ఇంట్లో దేవుడిని ఎక్కడ పెడతారండి? ఎక్కడ వున్నాడండి మీ ఇంట్లో దేవుడు? అదిగో ఆ మూల వున్నాడండి. అర్థం వుందా ఏమైనా? ఎంత భ్రాంతి కరమైన అంశం? ఆలోచన వుందా? అంటే అర్థం ఏమిటి? దాంతో కూడా పనిలేకుండా పూర్తిగా మునిగిపోయే స్థితి నుంచి ఇక్కడకు వచ్చానని చెప్పడం. అర్థమైందా?

బాల్యంలో ఉయ్యాలలో వున్నావండి. ఉయ్యాలలో వున్నప్పుడు దేవుడితో నీకు ఏం పని? దేవుడి గుడితో నీకేమన్నా పని వుందా అప్పుడు? ఏం పని లేదుగా. ఆటలు ఆడుకునేప్పుడు దేవుడితో ఏమన్నా పనివుందా? ఏం పని లేదుగా. అంటే మనో వికాసం, బుద్ధి వికాసం పొందేటప్పుడు అవసరం వచ్చింది. అంతేనా కాదా? అంటే మనో వికాసం వచ్చిందని చెప్పడం కోసమని ఆ దేవుడికి పూలు పెట్టావు. ఏమిటట? So what? ఏమిటట? ఏమైందట? ఇప్పుడు? ఏమైంది? మరింతగా బిగుసుకుపోయావు. అంతే తప్ప ప్రయోజనం సాధించింది ఏమీ లేదు. కాబట్టి ఇలా తెలుసుకో! దేహంలో వుండి, దేహం నేను కాదు అని తెలుసుకో! తెలుసుకోవాలంటే నీకు ఏం తెలియాలయ్యా? యథార్థ స్థితి. నీవు ఏదైతే అయివున్నావో, అది నీకు తెలియాలయ్యా! ఎలా తెలుస్తుందయ్యా? అంటే ఈ దేహంతో చేసే అన్ని పనులు చేసేటప్పుడు, అన్ని పనులు అంటే ఆలోచన కూడా పనే. గాలి తీసుకుని విడిచిపెట్టడం కూడా పనే. పని అంటే నేను

ఏదో, బ్రహ్మాండం బ్రద్దలు కొడితేనే పని కాదు. (శ్వాసించేటప్పుడు కూడా చెయ్యాలి) అంటే, శ్వాసతో సమంగా నేను ఆత్మస్వరూపుడను అనే భావంతో వుండు. ప్రతి ఆలోచనని మొదలు పెట్టేటప్పుడే నేను ఆత్మస్వరూపుడను అనే భావనతో ప్రారంభించు. అప్పుడు ఏమైంది? నేను ఎవడను అని ప్రశ్నించమన్నారు అదే. ఆ ఆలోచన ప్రారంభించేటప్పుడే నేను ఎవడను? నిదానంగా. ఫెళ్ళుమని అడిగితే అది సమాధానం చెప్పదు. అర్థమైందా అండీ! నిదానం. ఎందుకంటే, సూక్ష్మం అది. స్థూలం కాదు అది. కాబట్టి బుద్ధి సూక్ష్మతను పొందాలి మొట్టమొదట. ప్రశ్నించాలి అంటే ఏముండాలి? బుద్ధి సూక్ష్మత పొందాలి. అంటే బుద్ధి వికాసము పూర్తి అవ్వాలి నాయనా! బుద్ధి వికాసము పూర్తి అయ్యిందా మనకి? అవ్వలేదు కాబట్టే ఈ చిక్కులన్నీ! మనో వికాసము అయితే పూర్తి అయ్యింది కానీ, బుద్ధి వికాసము పూర్తి అవ్వలేదు నాయనా! పూర్తి అయితే నీకు తెలిసేది. అందుకని ఇప్పుడు ఏమి చెయ్యాలట ఇప్పుడు మనం? ఆ చదువు ద్వారా బుద్ధి వికాసము పూర్తి చెయ్యి. ఏ చదువు ద్వారా? నేను ఎవడను అనే చదువు ద్వారా. ప్రతినిత్యం ప్రశ్నించుకో. ప్రతి నిత్యం నిన్ను నువ్వే ప్రశ్నించుకో! ఈ చేస్తున్నవాడు ఎవడు? కారణమైన వాడు ఎవ్వడు? ఉనికి ఎవ్వడు? అనే ప్రశ్నలు వేస్తే ఏమైంది? నీ పరిమితత్వం పోయింది! నేను శరీరం అనే భావన పోయింది. తద్వారా నీవు ఉద్ధరించబడుతావు. ఏమిటి వుద్ధరించబడడం? ఉద్ధరేత్ ఆత్మ నాత్మానం ఆత్మానమవసాధయేత్ నీ ఆత్మయే, నీవు ఆత్మస్వరూపుడవు అని నీకు తెలియజేస్తుంది. ఏదో ఆత్మ స్వరూపం వున్నది. అది నువ్వే అని నీకు తెలియజెప్తున్నది. ఒరేయ్! తెలివితక్కువగా ఇప్పటిదాకా చేశావు. అలా చేయమాక. నేను ఏదైతే వున్నానో, నువ్వు కూడా అలా వుండరాబాబు. నేను పరమాత్మలో అంశీభూతాన్ని. నీ శరీరం? ప్రకృతిలో అంశీభూతం. ఆత్మస్వరూపమేమో పరమాత్మ అంశ. శరీరమేమో ప్రకృతిలోని అంశ. నువ్వు పనిముట్టువలే ఉపయోగించుకోరా బాబు అంటే, ఆ గిన్నె నువ్వు అయ్యి కూర్చున్నావు. నిన్ను ఎవడు కూర్చోమన్నాడు. కాబట్టి ఈ సత్యాన్ని తెలుసుకో.

కుమ్మరివాడు కుండ ఎప్పటికన్నా అవుతాడా? అవుతాడా? చేస్తాడు కానీ, కుమ్మరి వాడు కుండ అవ్వడు ఎప్పటికి. కదా! కానీ ఇప్పుడు ఏమయ్యావు? (వాడు దానిలో

లీనమైపోతే అదే అవుతాడు అంటున్నారుగా?) ఓరినీ! ఎవ్వడు అవ్వమన్నాడు నిన్ను? (అవ్వమనలేదులే కానీ,)

అసలు 'లీనం' అంటే ఏమిటి? 'లయం' అంటే ఏమిటి?

ఈ రెండు పదాలు వాడుతున్నాము మనం, కాఫీలో పంచదార కలిపాము అండీ! లీనం అయ్యిందా? లయం అయ్యిందా? (లయం అయిపోయింది, కలిసిపోయింది) లీనం అంటే ఇప్పుడు? దాంట్లో నుంచి మరలా తిరిగి దానినే వుత్పత్తి చేయగలగాలి. లీనం అంటే అర్థం అది.

నేను భగవంతుడిలో లీనం అయిపోయానండి. లయం అయ్యానా? లీనం అయ్యానా?

సృష్టి అంతా భగవంతుడిలో లయం అవుతుందండి. మళ్ళా తిరిగి ఉత్పత్తి అవుతుందా? అవ్వడం లేదా?

అవుతోంది కదా !

లీనం అయితే? ఇక అవ్వదు.

ఇది లయానికి లీనానికి తేడా. తిరిగి మళ్ళా వస్తుందయ్యా అంటే లయం.

లీనం అంటే రాదు.

లీనం అంటే అర్థం ఏమిటి? (ఆగు, తొందర పడకు, నిదానం, నేర్చుకునేదే ఇప్పుడు అంత కంగారు)

లీయతే గమయతే ఇతి లింగః

మనం అందరం శివలింగాన్ని ఎందుకు పూజిస్తున్నామయ్యా అంటే, 'లీయతే గమయతే ఇతి లింగః' ఆ లింగ శబ్దానికి అర్థం ఇది. సంస్కృతంలోది. అంటే అర్థం ఏమిటి?

లీయతే – ఆది అంతము లేకుండా.

గమయతే – వ్యాపించి వున్నది.

ఇక్కడా అక్కడా అని చెప్పడానికి వీలు లేకుండా అంతటా వ్యాపించి వున్నది ఏదైతే వున్నదో, అది నాయనా లింగము అంటే.

ఇప్పుడు నీ సూక్ష్మం వున్నదండి. ఇక్కడా అక్కడ ఎక్కడ వుంది?

సూక్ష్మం అంటేనే వ్యాపించేది అని కదా అర్థం. ఎలాగా?

వాయువు స్థూలమా? సూక్ష్మమా?

వాయువు సూక్ష్మమే.

వ్యాపించి వుందా?

వాపించి వుంది.

ఆకాశము స్థూలమా సూక్ష్మమా?

అది కూడా సూక్ష్మమే.

వ్యాపించి వుందా?

ఆఁ..

కాబట్టి సూక్ష్మమైన దానికి అర్థం ఏమిటి?

వ్యాపించి వుండడం దాని ధర్మం.

ఎంతదూరం వ్యాపించి వుందండి?

ఆద్యంతములు లేకుండా. మొదలు చివర అనేది లేకుండా వ్యాపించి వున్నది. కాబట్టి, లింగము అంటే సూక్ష్మము అని అర్థము. అర్థమైందా అండీ!

శివుడు నాయనా! శివుడు, శివుడు. విభూతి పెట్టుకో! ఆ శివుడిని ఆశ్రయిస్తే అంతా మంగళకరమే.

ఏమిటి ఆ శివుడు ఇప్పుడు?

ఆ లింగము ఏమని చెబుతోంది?

నీలోపల వున్న సూక్ష్మాన్ని తెలుసుకో!

ఈ స్థూల భ్రాంతి పోతుంది. అదే నాయనా! మంగళకరము.

ఇక ఇంతకు మించిన మంగళకరము ఏదీ లేదు.

ఇంతకు మించిన శుభం ఏదీ లేదు.

అర్థమైందా అండీ! మనం ప్రతీదానికి చెబుతూ వుంటాము.

బొట్టు పెట్టుకోక పోతే అశుభమండి, తాళి పక్కన పెడితే అశుభమండి, తెల్ల చీర కడితే అశుభమండి. ఇలా రకరకాల అశుభాలన్నీ పెట్టాము. ఇవేవీ ప్రయోజనం లేదు. ఇవన్నీ శరీరానికి పెట్టిన వాతలు. దీనివల్ల ఏమీ ప్రయోజనము లేదు.

ఈ శరీరాన్ని ఆధారం చేసుకుని, ఈ శరీరంలో వున్నటువంటిదే కాక, సృష్టి అంతా వ్యాపించి వున్నటువంటిది ఏదైతే వున్నదో, దాన్ని తెలుసుకో!

తెలుసుకుంటే ఏమైంది?

అది కదలడం లేదు అని తెలుస్తుంది. కదలని దానిని కనుక నువ్వు ఆశ్రయిస్తే, నీవు దేని కోసమైతే ఈ శరీరంలోకి వచ్చావో, అది సాఫల్యము అవుతుంది.

కాబట్టి మొదటి ప్రశ్న ఏమిటి?

నాయనా! నేను ముక్తి ఎలా చెందాలి?

నీవు యథార్థ స్థితిని తెలుసుకోవాలి నాయనా! నీ స్వరూప జ్ఞానాన్ని తెలుసుకోవాలి నాయనా!

అది ఎట్లాగ?

అది ఎట్లాగ అంటే, నువ్వు ఈశరీరంతో చేసే ప్రతి పనికి, ప్రతి ఆలోచనకి, ఆలోచనలు కూడా వస్తున్నాయా? పోతున్నాయా లేదా? నేను వచ్చితిని, నేను పోతిని. వుందా లేదా?

ఆ ఆలోచన కూడా మొదట ఎక్కడ మొదలు పెట్టాలట?

నేను ఎవడను?

ఈ ఆలోచన చేసేముందు నేను ఎవడను?

మీ అబ్బాయి నిన్ను ఒక 10 లక్షలు అడిగాడండి. ఇప్పుడు ఏం చెయ్యాలి?

ముందు ఏం చెయ్యాలి?

నేను ఎవడను అని ప్రశ్న వేయాలి.

నేను ఎవడను?

ఇవ్వడం, ఇవ్వకపోవడం అనే ఫలితంతో నాకు పనిలేదు.

నేను ఎవడను?

నేను ఆత్మస్వరూపుడను.

నేను ఆత్మ స్వరూపుడవై వుండగా నీవు ఎవరవు?

(నువ్వు ఆత్మ స్వరూపుడివే)

నేను దేని కోసం ప్రయత్నం చెయ్యాలి?

జ్ఞానం కోసం ప్రయత్నం చేయాలి.

నీకు కూడా నేను ఏం కలిగేటట్లు చేయాలి?

జ్ఞానం కలిగేటట్లు చేయాలి.

అంతే, నీకు జ్ఞానం కలిగేటట్లుగా జీవించు.

ఎదుటివాడికి ఏం చేస్తే జ్ఞానం కలుగుతుందో ఆలోచించి చెయ్యి.

నువ్వు 10 లక్షలు ఇచ్చావా? ఇవ్వలేదా అనేదాంతో అక్కడ పని లేదు.

ఆ పని చేయడం ద్వారా, అతనికి జ్ఞానం కలుగుతోందా?

జ్ఞానం కలుగుతోంది, అయితే చేయ్.

జ్ఞానం కలగడం లేదు, చేయమాకు.

వాడు కోపించాడు, క్రోధించాడు, మరొకటి చేశాడు, మరొకటి చేశాడు. ఏమిటట అయితే?

అజ్ఞానం కదా!

ఇప్పుడు ఇచ్చి అజ్ఞానాన్ని పెంచామా? ఇవ్వకుండా అజ్ఞానాన్ని పెంచామా?

ఇవ్వడమూ, ఇవ్వకపోవడమూ అనేదాని వల్ల కాదు అక్కడ సమస్య. అతనిలోని జ్ఞానం వృద్ధి చెందేట్టు అయితే, చెయ్యవచ్చు. ఇవ్వడం ఇవ్వకపోవడం రెండూ పనులే. అర్థమైందా? ఇవ్వడమైనా, ఇవ్వకపోవడమైనా రెండూ పనులే. కానీ, దాని వల్ల అతనికి జ్ఞానం వృద్ధి చెందుతోందనుకోండి. ఇవ్వకపోవడం కూడా చెయ్యొచ్చు. ఇవ్వకపోవడం వలన జ్ఞానం వృద్ధి చెందుతోంది. ఇవ్వమాకు. ఇవ్వడం ద్వారా జ్ఞానం వృద్ధి చెందుతుంది, ఇవ్వచ్చు.

ఆ 10 లక్షలు ఎప్పుడు ఇవ్వాలట?

(పరిస్థితిని బట్టా)

జ్ఞానం వృద్ధి చెందుతుందా?

పరిస్థితి కాదు.

వాడిలో జ్ఞానం వృద్ధి చెందుతుందా?

జ్ఞానం వృద్ధి చెందుతోంది అంటే చేయవచ్చు.

చెయ్యడం అనేది ఏమిటి?

ఇవ్వడము చేయడమే, ఇవ్వకపోవడమూ చేయడమే,

అర్థమైందా?

మన దృష్టిలో ఏమిటి?

ఇవ్వడము చేయడం లేదా ఇవ్వకపోవడమే చేయడం.

ఈ రెండిటిలో ఏదో ఒకటే,

కానీ, నేను ఎవడను అనే ప్రశ్నతో మొదలు పెడితే ఏమయ్యింది?

రెండూ ఒక్క తీరుగా అయిపోయినాయి. ఇది చెయ్యడం ద్వారా ఇవ్వడం గానీ, ఇవ్వక పోవడం గానీ, నాకు జ్ఞానం వృద్ధి చెందుతోందా? ముందు నిన్ను చూసుకోవాలి. నేను ఆత్మస్థితిలో స్థిరంగా వున్నానా? నేను ఆత్మస్వరూప జ్ఞానంలో స్థిరంగా వున్నానా? ఏమన్నా మార్పు చెందానా? ఏమన్నా వేదన కలుగుతోందా నాకు? వేదన కలిగింది అంటే ఏమైంది ఇప్పుడు నాకు? (శరీరమైపోయావు) కిందకు వచ్చేశావు. కాబట్టి, ఇలా విచారణ చేయమని చెబుతున్నారు.

(note: Proof reading not yet done)

కాబట్టి వేరే మార్గంలేదు. స్వరూప జ్ఞానాన్ని సాధించవల్సిందే. ముక్తి కావాలి అంటే నువ్వు ఏదై వున్నావో, నీకు తెలియ వల్సిందే. అదే తెలిస్తేనే కానీ విదేహముక్తి వరకూ కూడా సాధ్యమౌతుంది. అది లేకపోతే ముక్తి అనేది సాధ్యం కాదు. ఎందువల్ల? ఎక్కడెక్కడైతే శరీర భావన కలుగుతోందో, అక్కడ దుఃఖం కలుగుతోంది కాబట్టి, దుఃఖం పోవాలి అంటే, నువ్వు ఏదై వున్నావో తెలుసుకుని వుండాలి. నువ్వు ఈ శరీరంలో తాత్కాలికంగా వుండడానికి, నువ్వు ఈ శరీరాన్ని పనిముట్టుగా ఉపయోగించడానికి, వచ్చావు గాని, శరీరం నువ్వు కాదు, అనే సత్యాన్ని తెలుసుకుని, శరీరంలో ప్రవర్తించాలి. కాబట్టి అప్పుడు నీకు, శరీరం పనిముట్టు అవుతుంది, ఇంద్రియాలు పనిముట్లు అవుతాయి, ఇంద్రియ విషయాలు పనిముట్లు అవుతాయి. ఇప్పుడు ఏవైతే అన్నీ ప్రత్యేకం అని అనుకుంటున్నావో, ఆ ప్రత్యేకం అన్నీ కూడాను, సామన్యమే కానీ ఇంద్రియాలే చేస్తున్నాయి కానీ, నేను చేయడం లేదు. మాట్లాడుతున్నది. నోరు మాట్లాడుతున్నది. నేను మాట్లాడడం లేదు. నేను మౌనంగానే వున్నాను. నోరు మాట్లాడుతున్నది.

స్వరూపస్థితి తెలిసినవాడికి ఏమౌతుందంటే, మాట్లాడుతున్నప్పుడు నేను మౌనంగా వున్నది అని తెలుస్తుంది. అంటే ఏక కాలంలో ఇప్పుడు ఏమైంది? లోపల వున్న సాక్షి మౌనంగా వున్నది. బయట వున్నటువంటి పనిముట్టు పనిచేస్తూ వున్నది. కాబట్టి ఈ రెండు భావములే వుంటాయి అక్కడిక. భోజనం చేసింది, నేను సాక్షిని అనేది ఎప్పుడూ మౌనమే, ఏం చేయదు. భోజనం చేసిందా? సాక్షి ఏమీ భోజనం చేయలేదు. సాక్షి కేవలం సాక్షిగానే వున్నది. బయట వున్నటువంటి ఇంద్రియాలు భోజనం చేసినాయి. లేదూ ఒక పెద్ద బిల్డింగ్ కట్టారు, ఎవరు కట్టారు? ఎవరు కట్టిచ్చారు? ఇంద్రియాలు కట్టినాయి. ఇంద్రియాలు కట్టించినాయి. సాక్షి కట్టనూ లేదు, కట్టించనూ లేదు. కాబట్టి సాక్షి అనేది దేనికి కర్తగా లేదు. నేను అనే సాక్షి ఏదైతే స్వరూపంలో వున్నదో, అది దేనికీ కర్తగా లేదు. నేను కర్తగా లేనప్పుడు నేను అనుభవించేవాడిగా వున్నానా? భోక్తగావుంటానా? వుండే అవకాశం లేదు. ఎలాగ ఇది సాధ్యం. ఎలా సాధ్యం అంటే, ఈ అనంత సృష్టికి కూడా పరమాత్మ కర్త అని అనుకున్నారు అనుకోండి. కాబట్టి, ఈ సృష్టిలో వున్నటువంటి అన్ని దుఃఖాలు పరమాత్మ అనుభవిస్తున్నాడా మరి? అనుభవించడం లేదుగా. ఈ దుఃఖాలు

ఆయనకు చెందడం లేదు కదా! ఎవరివి వాళ్ళే అనుభవిస్తున్నారు కదా! మనం కర్మలు అనుభవిస్తున్నాము కదా! పరమాత్మ దుఃఖాలను అనుభవిస్తూ వుంటే, నీవు ఎందుకు దుఃఖపడుతున్నావు? కాబట్టి పరమాత్మ కర్తగా వున్నాడా? లేడు కదా! మరి ఎలా వున్నాడు? సృష్టికి సాక్షిగా వున్నాడు కదా! మరి. సాక్షిగా వుండబట్టే కదా, ఈ సృష్టి అంతా కూడా వ్యాపించ గలిగాడు. నీలాగ కర్తగా కనుక వుంటే ఆయన కూడా పరిమితంగానే వుండే వాడు కదా! కాబట్టి దివ్యత్వము అంటే ఏమిటి? వ్యాపకత్వమే దివ్యత్వము. ఎందుకని? సర్వవ్యాపకంగా వుంటేనే తప్ప, సాక్షిత్వము సాధ్యం కాదు. కాబట్టి, సర్వవ్యాపకత్వము, సర్వాధారంగా వుంటుంది. సాక్షిత్వము కూడా సర్వాధారంగా వుంటుంది. కానీ, ఏక కాలంలో అది ఎట్లా వున్నది? నిరాధారంగా కూడా వున్నది. అంటే, శరీరము వున్నంత వరికే సాక్షి వున్నది అని చెపుదామా? సాక్షి ఎప్పుడూ వుంటుంది కదా! ఎందుకని? ఒక ఇంద్రియము పని చేసినా, ఒక ఇంద్రియము పనిచేయకపోయినా, ఇంద్రియాలు అన్నీ కట్టకట్టుకుని, మూటకట్టుకుని నిద్రలో మూలనపడ్డా, సాక్షి ఎప్పుడూ వుంటాడు. మరి మూడు అవస్థలలోనూ సాక్షి ఎప్పుడూ వుంటోంది. కానీ కొన్ని మాత్రం పని చేస్తున్నాయి, కొన్ని విశ్రాంతి తీసుకుంటున్నాయి. కొన్ని అసలు పనిచేయడం లేదు. ఇంద్రియాలలో తర తమ భేదంగా వున్నాయి. మరి ఇంద్రియాలలోనే తరతమ భేదంగా వున్నప్పుడు, విషయాలలో కూడా తరతమభేదంగా వుంటావు కదా! విషయాలలో తరతమ భేదంగా వున్నప్పుడు, పనులలో కూడా తరతమ భేదంగా వుంటావు కదా! పనులలో తరతమ భేదంగా వున్నప్పుడు, ఫలితాలలో కూడా తరతమ భేదంగా వుంటావు కదా! మరి ఫలితాలను అనుభవించేటప్పుడు ఏమయ్యావు? ఇంకా తరతమభేదంగా అయ్యావు. ఇలా ఎప్పుడైతే, నీ స్వరూపస్థితిని మరచిపోయావో, ఒక్కడుగా సాక్షిగా వుండవలసినటువంటి వాడవు, అనేకం అయిపోయావు. కాబట్టి నీకు ఏ ఆలోచన కలిగినా, ఏ భావన కలిగినా, ఇది చెయ్యాలా? ఇది చెయ్యొద్దా? రెండూ ఆలోచనలేగా. వెళ్ళాలా వెళ్ళొద్దా? రెండూ ఆలోచనలే కదా! ఏమన్నా ప్రత్యేకత వుందా? ఒక్కొక్కప్పుడు వెళ్తే ప్రత్యేకత అంటున్నావు, ఒక్కొక్కప్పుడు వెళ్ళకపోతే ప్రత్యేకత అంటున్నావు. సత్యనారాయణ వ్రతం వెళితే ప్రత్యేకత. అంతే కదండీ! మళ్ళా అలాగే ఇంటికి తిరిగి వచ్చావా లేదా? తిరిగి వచ్చావు. ప్రసాదము పట్టుకొచ్చావు, పదిమందికి పంచిపెట్టావు.

అంతేనా కాదా? అదే ఒకరి ఇంట్లో చనిపోయారు, చనిపోతే వెళ్ళావు, వెళితే ఏమిటట? మళ్ళా వెళితే సరాసరి మీ ఇంటికే వెళ్ళాలట కానీ, ఇంకొకళ్ళ ఇంటికి పోకూడదు. అర్థముందా ఏమైనా? అక్కడా పెట్టేది ప్రసాదమేగా. అక్కడా నువ్వు ఏం చెబుతున్నావు? పితృదేవతలు అనే అంటున్నావుగా. దివ్యత్వమే అని అంటున్నావుగా. స్థితి భేదమే కదా మార్పు. ఏమన్నా తేడా వుందా? ఏమీ తేడా లేదు కదా! (కానీ అవతలి వాళ్ళకు అది ఇష్టం వుండదు కాబట్టి..) అంటే ఏమైంది ఇప్పుడు? పరిమితం అయిపోయావుగా. అంటే ఏం చేస్తున్నావు? నీ యొక్క అనేకత్వం అంతా కూడా, తరతమ భేదం అంతా ఎందులో వున్నదట ఇప్పుడు? ఏదో ఒక వాసన చేత ముడిపడినప్పుడు, అది తరతమ భేదంగా మారిపోయింది. లోకవాసనకి ముడిపడింది. ముడిపడేప్పటికి ఏమైంది? తరతమ భేదం వచ్చేసింది. ఇది శుభం, అది అశుభం.

సాక్షిత్వ స్థితిలోనుంచి చూస్తే, ఏది శుభం? ఏది అశుభం? అజ్ఞానం అశుభం, జ్ఞానం శుభం. ఇంక అంతకు మించి అక్కడ ఏమీ లేదు. వాళ్ళు పెట్టినప్పుడు కూడా, సాంప్రదాయాన్ని, ఆచారాన్ని, ఇట్లా ఆలోచించే పెట్టారు. కానీ, కాలక్రమేణా బుద్ధి మాంద్యం ఆవరించి, అంతదూరం విచారణ చేసే సామర్థ్యం లేక, దానిని తెలుసుకోగలిగే సామర్థ్యం లేక, బుద్ధి వికాసము లేక, బాహ్యమైనటువంటి, సాంప్రదాయకంగా దానిని... సాంప్రదాయకం అనే దాంట్లోనే వుంది అసలు. 'దాయకము' అంటే ఇచ్చేది. 'సంప్రత' అనేది వుంది కదా! 'సంప్రత' అంటే అర్థం ఏమిటి? 'సంప్రతతేనామా...' అంటున్నావు కదా! 'ప్రతి' లేకుండా, అంటే వ్యతిరేకం లేకుండా, 'సం'– పూర్తిగా, వేదం ఏదైతే చెబుతోందో దానిని అనుసరించి, పూర్తిగా దాని ఆశ్రయం పొందితే నీకు అనుగ్రహం కలిగేది అని అర్థం. సాంప్రదాయం అంటే అర్థం అది.

మరి దానిని ఇప్పుడు ఏం చేశాము మనం? సొంతం దేహం స్థితిలోకి వచ్చి కూర్చొని మనం, దేహం ద్వారా దానిని చూడడం మొదలుపెట్టి, దేహాభిమానంతో దానిని మనం పరిశీలించి, ఆ దేహాభిమానంతోనే ఆచరించి, ఈ దేహాభిమానాన్ని వెళ్లి దానికి తగిలించి, వున్న కొంచెం జ్ఞానాన్ని కూడా మరచిపోయి, అజ్ఞానమే సత్యంగా

జీవిస్తున్నావు. అందువల్ల ఏమైంది? అన్ని అశుభాలు, శుభాలు అయినాయి. అన్ని శుభాలు కాస్తా మరచిపోయావు. అసలు శుభం అంటే ఏమిటది? మరుపుకు వెళ్ళిపోయింది. అశుభాలలోనే మళ్ళా శుభాశుభాలు పెరిగిపోయినాయి. రెండూ అజ్ఞానమే. దేహభ్రాంతితో చూస్తే, రెండూ అజ్ఞానమే. ఏం తేడా వుంది? రెండిట్లో ఏనుగుబొమ్మతో ఆడితేనేమో ఆట, పిల్లిబొమ్మతో ఆడితేనేమో ఆట కాకుండా పోయిందా? రెండూ బొమ్మలేగా. కాదా! రెండూ బొమ్మలే. రెండూ ఆటలే. రెండిట్లో ఆనందిస్తున్నావుగా. రెండిట్లో అజ్ఞానమే. కాబట్టి, లౌకికం లోకం చెప్పింది, లోకం ఇట్లా చెబుతోంది కదా! లోకం అలా చెబుతోంది కదా! అన్నావే అనుకో! ఏమైయ్యావు అప్పుడు? లోకవాసన చేత బంధితుడవి అయినావు. అప్పుడు స్వరూప స్థితిలో లేవుగా. అర్థమైందా! కాబట్టి, లోకం ఏం చెబుతోంది? ఒక రెండు డజన్లు, మూడు డజన్లు, నాలుగు డజన్లు, ఐదు డజన్లు నువ్వు వస్త్రాలను అన్నీ కలిగి వుండాలి. బీరువాలను కలిగి వుండాలి. మరీ బండమీద బట్ట, ఒంటి మీద బట్ట వుంటే ఎలా కుదురుతుంది? లోకం ఒప్పుకుంటుందా? లోకం నన్ను చూసి ఏమనుకుంటుంది? అన్నావే అనుకో! అప్పుడు దేని చేత బంధితుడవి అయినావు? లోకవాసన చేత. అవును కదా! కాబట్టి ఎవరైతే, నేను ఎవరని ప్రశ్నించుకోమని చెబుతున్న భగవాన్ రమణులు, ఆయన ఏక వస్త్రధారి, కేవలం అంగవస్త్రం, ఆ గోచి ఒక్కటే ధరించేవారు. ఆయన ఆయన వస్త్రాలు ఆయనే ఉతుక్కునే వారు. ఇంక సమస్యేముంది? బరువేముంది? ఇబ్బంది ఏమీ లేదు. మరి ఇప్పుడు ఆయన ఎందువల్ల అనుకున్నాడు అట్లాగ? అసలు దేహమే మొదటి వస్త్రము. స్వరూప స్థితి నుంచి చూస్తే, సాక్షి ధరించినటువంటి మొదటి వస్త్రం ఏమిటి? దేహం. అందులోనే అనేకం ఏడ్చినాయి. అవన్నీ వస్త్రాలేగా. ఇప్పుడు ఏం చేయాలట మనం? వస్త్రం మీద వస్త్రం, వస్త్రం మీద వస్త్రం, వస్త్రం మీద వస్త్రం పంచకోశాలు వస్త్రాలు కావా? అప్పటికే ఐదు వస్త్రాలు అయినాయా? ఒక కోశం మీద మరొక కోశం, ముందు ఆనందమయ కోశంలోకి దిగావు కదా! స్వరూప స్థితినుంచి, ఒక కోశం కప్పింది. దాని నుంచి ఏం చేశావు? విజ్ఞానమయ కోశంలోకి దిగావు. అది ఇంకొక వస్త్రం కప్పింది. ఇంకొక కోశం లోకి దిగావు. ప్రాణమయం. అదీ కప్పింది. మనోమయం. ప్రాణమయం. అన్నమయం. ఐదు వస్త్రాలు అక్కడ కప్పావుగా. ఒక్క శరీరం పేరుతో, ఇప్పుడు దాని మీద ఏం చేశావు మళ్ళా?

మళ్ళా ఒకటి కప్పావు. ఏమంటివి? చాలా గొప్ప అంటివి. అర్థం వుందా? గొప్పకి అశుభానికి ఏమైనా? ఈ పైన కప్పిన ఐదు పీకేసి, అశుభం అంటివి. అర్థం వుందా ఏమైనా? కాబట్టి దేహభ్రాంతితో, పరిమితత్వభావంతో చూసి నిర్ణయం చేసేటటువంటివి అన్నీ కూడాను, ఎప్పటికీ సత్యం కావు. అవన్నీ అశాశ్వతములు. తాత్కాలికములు. లోకము అంటున్నావా? ఆ లోకంలో అట్లా లేదు అది. నువ్వే నీ దేహాభిమానం అనేటటువంటి అజ్ఞానంతో దానిని అట్లా తయారు చేశావు. దానికి పేరు లోకము, లౌకికము అని పేరు పెట్టావు. కాబట్టి నీవు ధర్మం నిమిత్తము జీవిస్తున్నావా? జ్ఞానం నిమిత్తము జీవిస్తున్నావా? లోకం నిమిత్తము జీవిస్తున్నావా? లోకం అడిగింది అని శరీరంలోకి వచ్చావా? రాలేదుగా. లోకం అడిగింది అని శరీరం విడిచిపెడుతున్నావా? లేదు కదా! మరి, లోక నిమిత్తము ఏమిటి చేస్తున్నావు?

అజ్ఞానావృతమైనటువంటివి అన్నీ, నీ అజ్ఞానమంతా, తీసుకెళ్ళి, లోక నిమిత్తము అని పెట్టావు. మన చుట్టూ ప్రపంచము వుంది కదండీ! ఆ ప్రపంచము ఒప్పుకోవాలి కదండి? ఈ సమాజం ఒప్పుకోవాలి కదండీ! అంటున్నావే, నీ మూలంలో ఒక్కసారి విచారణ చేసి చూడు, నీ నిద్రలో ఎక్కడుంది ఆ లోకం? లేదు. నీ కలలో ఎక్కడుంది ఆ లోకం? లేదు. రెండు అవస్థలలో లేనే లేదు. దాని అవతల సాక్షి అంటావా? దాని దగ్గర అస్సలు లేదు. మరి ఎప్పుడు వుందయ్యా? నువ్వు మెలకువలో కాసేపు ఆ ఇంద్రియంతో, గుర్తు చేసుకున్నప్పుడు మాత్రమే వున్నది. ఈ అనంత సృష్టిలో, 84 లక్షల జీవరాశులలో, ఏది నీ లోకం? మానవులే అందాము. 643 కోట్ల మానవులలో, నీవు నీలోకం ఇప్పుడు ఎంత? నువ్వు గుర్తించే లోకం ఎంత? ఒక గుప్పెడు వుంటుందా? ఒక పది మంది వుంటారా? ఓ యాభైమంది వుంటారా? అంటే ఏమిటి? నువ్వు గుర్తించేవాళ్ళు, నిన్ను గుర్తించేవాళ్ళు, ఇదేగా నీ లోకం? ఈ గుర్తింపు అసలు ఎంతసేపు వుంది? ఒక దిక్కుకు చూస్తే, ఒక దిక్కు లేదు. ఒకడిని చూస్తే, ఒకడు లేడు. అంటే, నీవు కొంత మందిని tick పెట్టుకున్నావు. నీ అజ్ఞానం మేరకు ఎవడు సరిపడతాడో, ఆ అజ్ఞానాన్ని ఎవడు మెచ్చుకుంటాడో, అబ్బా! నువ్వు చాలా గొప్ప అండీ! అనే వాడు ఎవడైతే వున్నాడో, వాడి దృష్ట్యా, ఈ అజ్ఞానాన్ని తీసుకు వెళ్ళి వాడికి పెట్టి, వాడి అజ్ఞానం, నీ అజ్ఞానం రెండూ జోగి,

జోగి రాసుకుంటే బూడిద రాలిందనట్టుగా, చివరకి అజ్ఞానమే మిగిలిందని, ఏం చేశాము? దానినే ఒప్పుకుని దానినే జీవితమంతా దాన్ని పుచ్చుకుని తిరిగాం. అర్థముందా ఏమైనా? కొంచెం వివేకంతో ఆలోచించి చూస్తే, ఎంత అజ్ఞానంగా కనబడుతుంది అది? జీవితం అసలు మనం దేనికోసం జీవిస్తున్నాము? మనం అనే ఆలోకం ఎంతమంది వున్నారు? మహా అయితే ఐదుగురు వుంటారు, పది మంది వుంటారు. నీ జీవితం మొత్తం మీద ఎంతమంది వ్యక్తులతోటి ప్రవర్తించి వుంటావు? కొన్ని వందలు, వేల మంది. మరి ఈ వందలు, వేల మంది నిన్ను ఎవడూ పట్టించుకోలేదే? ఎందుకని? వాళ్ళకు తెలుసు, సాక్షిగా వుండడం ఎట్లాగో, నీతో నిమిత్తంగా ఎంతమేరకో, అంతమేరకే, బ్రాహ్మణుడు వచ్చాడండీ! ఏవండీ వీళ్ళకు వస్త్రాలు పెట్టాలండి అన్నారు. నువ్వు పట్టు వస్త్రం తెచ్చినా, అదే మంత్రమే. తుండు గుడ్డ పెట్టినా అదే మంత్రమే. ఏమన్నా తేడా వుందా? ఏమి వేరే మంత్రం చెప్పలేదుగా. కాబట్టి భావంలో ఏమన్నా భేదం వుందా? లేదు. కానీ పెట్టే వారు మాత్రం ఏ దృష్టితో పెట్టారు? వారు లక్ష్మీనారయణులు, పెట్టేవాడు లక్ష్మీ నారాయణుడు, పుచ్చుకునే వాళ్ళు లక్ష్మీ నారాయణులు, అనే భావంతో చూచినప్పుడు, అసలు నువ్వు ఏం పెట్టావు అనే దానికి ఏమన్నా ప్రాధాన్యత వచ్చిందా? రాలేదు కదా! కానీ ప్రతి సంఘటనలో చూడండి. ఏం కనబడుతాయి? ఇలాగ, తరతమ భేదంతో అజ్ఞానంగా జీవించడానికి అభ్యాసంచేసి, అలవాటు పడి, ఆ తరతమ భేదాన్ని గుర్తించే వారిలో, మరలా నీ అజ్ఞానాన్ని పొగిడేవాడిని దృష్టిలో పెట్టుకుని, ఈ లోకం హర్షిందు కదా! అంటున్నావు. ఎప్పుడు హర్షిందు? ధర్మానికి గ్లాని కలిగినప్పుడు హర్షించదు. నువ్వు అధర్మాన్ని కనుక ఆచరిస్తే, అప్పుడు వీడు వాడు అని లేదు, నిన్ను గుర్తించేవాడు, నన్ను గుర్తించేవాడుతో పని లేదు. ప్రపంచం అంతా నిరసిస్తుంది అప్పుడు. ఆ సమాచారం ఎవరికి తెలిస్తే, వాళ్ళు అందరూ నిరసిస్తారు. ఎందుకని? అది అధర్మం కాబట్టి. కానీ మనం చెప్పేది ఈ లౌకికం ఏదైతే వుందో, ఈ లౌకికం అసలు ఎంతమందికి సంబంధించింది? నీ కుటుంబంలోనే కాసేపు ఒప్పుకుంటే, కాసేపు ఒప్పుకోడు. నువ్వే కాసేపు ఒప్పుకుంటే, కాసేపు ఒప్పుకోవు. మరి ఇప్పుడు ఏమైంది? ఇంతకంటే గాఢ తమోగుణం అయిన అజ్ఞానము వుందా? లేదు కదా! మరి ఇప్పుడు మన జీవితం అంతా దేనిని ఆధారం చేసుకుని జీవించాము? ఈ లౌకికాన్నేనా? బుద్ధి వికాసం

అంతా ఈ లౌకికం కోసమే కదా! మెచ్చించడం అంతా? వాడేమి అంటాడో, వీడేమి అంటాడో, వాడు లేడు, వీడు లేడని సత్యం తెలుసుకున్నప్పుడు, స్వరూప స్థితినుంచి చూసినప్పుడు, వాడున్నాడా? వీడున్నాడా? వాడు లేడు, వీడు లేడు. ఎవరున్నారు? సాక్షి ఒక్కడే వున్నాడు. వుంటే వాడే వున్నాడు. ఇంకెవ్వరూ లేరు. ఎందుకని? మూడు అవస్థలకి లొంగకుండా, మూడుగుణాలకి లొంగుకుండా, పంచకోశాలకి లొంగకుండా, ఇవన్నీ పైపైన మెరుగులు, పైపైన ఆవరణలు, పైపైన వస్త్రములు లాంటివి అనే సత్యము ఎవడైతే తెలుసుకున్నాడో, అప్పుడు ఏమైంది వాడికి? అప్పుడు వాడిని బాధించే వాడు ఎవడు? మాటలు అంటున్నామండి. ఆ మాటలు అంటున్నది దేనిని? అయితే అన్నమయ్యకోశాన్ని, కాదు ప్రాణమయకోశాన్ని, అదీ కాదు, మనోమయ కోశాన్ని. అంతకు మించి అవతల ఏమన్నా అనగలడా? లేదు కదా! మరి, ఆ కోశములు ఈ కోశములను విమర్శించినాయట. ఈ కోశములు దాని గురించి బాధపడ్డాయట. అర్థం వుందటండీ! ఏమైనా?

నువ్వు ధరించిన వస్త్రం, నేను ధరించిన వస్త్రాన్ని విమర్శించిదట. వస్త్రం వస్త్రాన్ని విమర్శిస్తే, వస్త్రానికి దుఃఖం కలిగిందట. అర్థం వుందా ఏమైనా? స్వరూప స్థితినుంచి చూచినప్పుడు ఇట్లా చూస్తాడన్నమాట. ఇప్పుడు ఏమైంది? ఓహో! అలాగా? అంటాడు అంతే! ఎందుకని? వస్త్రం వస్త్రాన్ని విమర్శించడం ఏమిటి? పెద్ద భ్రాంతి కదా! అది. నువ్వు ధరించిందే శరీరం ఒక పెద్ద వస్త్రం. నేను ధరించిన శరీరం, అంతకంటే పెద్ద వస్త్రం. ఇప్పుడు ఆ శరీరం ఈ శరీరాన్ని విమర్శించింది అంతేనా జరిగింది? ఏమిటట అయితే ఇప్పుడు? ఆ జడవస్తువు, ఈ జడవస్తువును విమర్శించే శక్తిని కలిగివుందా? అథవా అజ్ఞానం చేత ఆ పని అది చేసిందే అనుకో, నీ జ్ఞానం ఏమైంది? నీవు ఎట్లా ఆలోచించాలి? నువ్వు స్వరూప స్థితిలో వుండి కదా! చూడవలసింది. నువ్వు సాక్షిత్వంలో వుండి కదా! చూడవలసింది. అప్పుడేమయ్యింది? ఓహో! జడ చేతన విమర్శ తెలియక అజ్ఞానంచేత మాట్లాడుతున్నావు. చైతన్యం దేనినైనా విమర్శిస్తోందా? లేదు. మరి ఆ చైతన్యానికి మూల స్థానం అయినటువంటి స్వరూప స్థానం నేను కదా! స్వరూపజ్ఞానం నేను కదా! నేనే ఆ చైతన్యానికి మూలం కదా! మరి నేను కర్తను కాదు, భోక్తనూ కాదు కదా!

నేను ఆత్మస్వరూపుడను కదా! ఇంద్రియాలే కర్తలు. ఇంద్రియాలే భోక్తలు. ఎందుకని? ఇంద్రియాలే ప్రేరేపణలకి లొంగుతున్నాయి. ఇంద్రియాలే పనులు చేస్తున్నాయి. ఇంద్రియాలే ఫలితాలను అనుభవిస్తున్నాయి. అంతేకదా!

.

వేడివేడిగా మిరపకాయ బజ్జీలు తినాలి అని కోరిక ఎవరికి కలిగింది? సాక్షికి కలిగిందా? ఇంద్రియాలకా? ఇంద్రియాలకు. తిన్నాయా లేదా? తిన్నాయి. సుఖం ఎవరికి కలిగింది? ఇంద్రియాలకే. నేను ఎవరిని? నేను సాక్షిని.

ఎప్పుడైతే సాక్షిత్వ స్థితిలో వున్నావో, అప్పుడు నీ ఇంద్రియాలు కోరిన కోర్కెలను నువ్వు ఇప్పుడు ఎలా చూశావు? నిమిత్రమాత్రంగా చూడలేదా? అప్పుడు ఆ కదలికను అసలు ఎవడు గుర్తించాడు? (కదలిక వున్నది కదా) కదిలిందండి. కదలికను మాత్రం ఎట్లా చూస్తాడు? ఓహో! దారి వెంబడి పోయే ఒక మనిషి ఎవడో వెళ్ళాడండి, దారి వెంబట. నువ్వు ఇప్పుడు ఆయన సమాచారం కనుక్కున్నావా? కనుక్కోలేదుగా. ఎందుకని? నాకు అవసరం లేదు కాబట్టి. ఇంద్రియాలలో ఏవో కదలికలు కదులుతూ వుంటాయి. కదలటం దాని ధర్మం. కదిలింది. ఇప్పుడు నాకు ఏమైంది? నాకు ఏమీ అవ్వలేదుగా. నేను ఏమీ పట్టించుకోలేదుగా. అవి కోరుతూ వుంటాయి. అందుకోసమే వచ్చాయి అవి. కోరని. నాకేం పని? అని ఉపేక్షించి చూడగలుగుతాడు. ఎప్పుడైతే ఉపేక్షించి చూశావో, అప్పుడు నీ ఇంద్రియాలు ఎంతసేపు పోరాడుతాయి నీతో? ఎందుకని? నీ అనుమతి లేకుండా వాటికి జీవితం లేదు. నీ అనుమతి లేకుండా వాటిలో కదలికలు ఏమీ ఫలించవు. నీ అనుమతి లేకుండా వాటిలో కలిగే చలనములకు ఏమీ ఫలితాలు రావు. (అనుమతి అంటే ఏది అనుమతి ఇస్తుంది? మనసా?) అంటే ఏమిటి అసలు ఆ స్థితిలో నువ్వు వున్నావు. కానీ, ఇప్పడు అసలు సాక్షి అసలు దేనినైనా అనుమతి ఇస్తున్నాదా? అనుమతించడం లేదు కదా! ఎందుకని? అనుమతిస్తే అది స్వీకరించాలి కదా! కర్తగా వుంటేనే అనుమతిస్తుంది. కర్తగా వుంటే అది స్వీకరించాలి కదా! ఎప్పుడైతే, సాక్షిత్వము కర్త కాదో, అప్పుడది అనుమతించే పని వుందా దానికి? అనుమతించే పనికూడా లేదు. అనుమతించే పనిలేనప్పుడు స్వీకరించే పని వుందా? అదీ లేదు. మరి ఏమైంది ఇప్పుడు?

నేను నేనుగా వున్నాను అంతే! స్వరూప స్థితిలో. ఇప్పుడు దుఃఖం వుందా? లేదు కదా! ఇంద్రియాల స్థితిలోనూ లేదు. ఇది లక్ష్యం. ముక్తి అంటే, ఇదిగో ముక్తిని వర్ణిస్తున్నాడు. ముక్తి అంటే ఎలా వుంటుంది? నీకు అంతరంగంలో ఆ ముక్తి స్థితిని ఎట్లా అనుభవిస్తావు? అంటే ఇట్లా అనుభవిస్తావు నాయనా! జనన మరణాలు కూడా విషయాలే. జనన మరణాలు కూడా ఇంద్రియాలకు సంబంధించినవే. జనన మరణాలు కూడా ప్రకృతిలో ఏర్పడుతున్న కదలికలే. కాబట్టి సాక్షి ఏ కదలికా లేని వాడు కదా! మరి జనన మరణాలు వున్నాయా? లేవు కదా! జనన మరణాలే లేనప్పుడు, ఈ మధ్యలో వచ్చిపోయేటటువంటి కనురెప్పపాటు మాత్రమే వుండేటటువంటి, ఇంద్రియాల యొక్క కదలికలు, వాటి యొక్క ప్రేరేపణలు, ఇంతదూరం ఎవడు చూశాడు ఇప్పుడు? ఏమన్నా అవసరమా?

ఆకాశంలో ప్రకాశమానంగా వెలుగుతున్న సూర్యుడికి, ఒకపొలంలో పంట పండింది, ఒక పొలంలో కరువు వచ్చింది అనే దానితో ఏమైనా పని వుందా? ఆ సూర్యుడు లేకుండా ఈయన పంటపండించాడా? ఆ సూర్యుడు లేకుండా ఈ కరువు వచ్చిందా?

కానీ, ఈ కరువు వచ్చినా ఆ పంట పండినా, సూర్యుడు ఏమైనా పట్టించుకున్నాడా? (స్పందించలేదు) ఎందుకని? సాక్షి కాబట్టి. నీవు కూడా అలా వుండమనే కదా చెబుతున్నాడు, రోజూ వుదయిస్తూనే నీకు బోధిస్తున్నాడు, నా వలె వుండవయ్యా బాబు. అదేగా సంధ్యావందనం అంటే మరి. మరి రోజూ సంధ్యావందనం, జపం తిప్పుతావు, మంత్రం తిప్పుతావు, నీళ్ళు పోస్తావు, ఈ నీళ్ళు అందులో పోస్తావు, ఆ నీళ్ళు ఇందులో పోస్తావు, పైకీ కిందకి తిప్పుతావు, ఏదో ఆకాశంలోకి చూస్తావు, భూమిమీదకు చూస్తావు. నిజంగా సూర్యుడు బోధిస్తున్నది ఏమిటి? ఆ తిప్పే దాని యొక్క సారంశము ఏమిటి? తన వలె నిన్ను వుండమని చెబుతున్నాడు. నాతో పాటు లెగువు. నేను ఎలా వస్తున్నానో తెలుసుకో, ఈ సృష్టిలో నేను ఎట్లా వున్నాను? నీ శరీరంలో నువ్వు అట్లా వుండు. ఎప్పుడైతే

శరీరంలో సాక్షిగా వున్నావో, అప్పుడు ఈ సృష్టి నిన్ను ఏం చేసింది? చేసే అవకాశం వుందా? లేదు కదా! ఎందుకని? సృష్టి పంచభూతాలతో ఏర్పడింది. శరీరం పంచభూతాలతో ఏర్పడింది. ఏమైనా జరిగితే, ఈ పంచభూతాల మధ్య, ఆ పాంచభౌతిక దేహం మధ్య, అనుకూల వ్యతిరేకాలు జరుగుతూ వున్నాయి కదలికలు. మార్పులు, చేర్పులు జరుగుతూ వున్నాయి. అది సృష్టి ధర్మం. పుట్టింది, పెరిగింది, వున్నది కొంతకాలం, కొంతకాలం తరువాత లేకుండా పోయింది. ఇవన్నీ మార్పులే కదా! ఈ మార్పులకి నువ్వు ఒక పేరు పెట్టుకున్నావు. ఏర్పడడాన్ని జననము అన్నావు. పెరగడాన్ని స్థితి అన్నావు. సృష్టి అన్నావు, స్థితి అన్నావు. మళ్ళా లేకుండా పోవడాన్ని లయం అన్నావు. ఈ పేరులన్నీ ఎవడు పెట్టుకున్నాడు? నువ్వే పెట్టుకున్నావు. దేని దృష్ట్యా పెట్టుకున్నావు? దేహం దృష్ట్యా పెట్టుకున్నావు. సాక్షి దృష్ట్యా? సృష్టి లేదు, స్థితి లేదు, లయం లేదు. మరి ఏమి వుంది? ఎల్లప్పుడూ అదే వుందయ్యా బాబు. సృష్టికి ముందు అదే వుంది. సృష్టి వచ్చినాక అదే వుంది. సృష్టి పోయినాక కూడా అదే వుంది.

మరి ఇప్పుడు ఈ సాక్షి ఎవడయ్యా? ఆ పరమాత్మే ఈ సాక్షి. కాబట్టి సాక్షిత్వాన్ని కనుక అనుభవానికి, నువ్వు నీ శరీరంలో తెచ్చుకోగలిగితే, అప్పుడు నీకు ఆత్మానుభవం కలిగింది. ఆ నేను ఎవడను అంటే? నేను ఆత్మస్వరూపుడను అని సహజంగా వుండగలుగుతున్నావు. అదే ఆత్మ స్వరూపభావనతో, సమిష్టిలో కూడా వున్నావు. అప్పుడు ఏమైంది? బ్రహ్మానుభవం కలిగింది. వ్యష్టి సాక్షిపేరు ఆత్మ అయితే, సమిష్టి సాక్షి పేరు బ్రహ్మ. పేరులో భేదమే కానీ, స్థితి భేదమే కానీ, సాధనా భేదం లేదు. కాబట్టి ఆ రకంగా, నీవు వుండే ప్రయత్నం చేయి. అప్పుడు ఏమైంది? వ్యష్టి దుఃఖము లేదు, సమిష్టి దుఃఖము లేదు. ఇక్కడైనా ఇంద్రియాలు, అక్కడ ఇంద్రియ అధిష్టాన దేవతలు. తేడా ఏముంది? ఇక్కడ ఇంద్రియాలు వున్నాయి. సమిష్టిలో ఇంద్రియ అధిష్టాన దేవతలు వున్నాయి. ఆ ఇంద్రియ అధిష్టాన దేవతల అనుగ్రహబలం చేత ఈ ఇంద్రియాలు పనిచేస్తున్నాయి. మరి నేను ఎవరిని? నేను సాక్షిని. అక్కడ ఇంద్రియ అధిష్టాన దేవతలను నియమిస్తున్నాను సృష్టి నిమిత్తమై. ఇక్కడ ఇంద్రియాలను నియమిస్తున్నాను. పని నిమిత్తమై. జ్ఞానం నిమిత్తం. ఆ పని ఏమిటి? జ్ఞానం. నేను ఎవడను అని తెలుసుకునే పని నిమిత్తమై, ఈ

ఇంద్రియాలను నియమిస్తూ వున్నాను. అక్కడా అంతే! సమిష్టిలో కూడా అంతే! మరి ఈ వ్యష్టికైనా, ఆ సమిష్టికైనా, ఎల్లప్పుడూ వండే ఆ స్థితిపేరు ఏమిటి? సాక్షి. అది దానికి శరీరం వుందా? లేదు. ఆశరీరం. మరి శరీరంలో వుంటూ, అశరీరిగా వుండాలి కదా! నువ్వు. అప్పుడు కదా! నీకు ఈ సాక్షిత్వము అవగాహన అయ్యేది? అనుభవం అయ్యేది? కాబట్టి నీ స్వరూప స్థితి ఏమిటయ్యా? శరీరంలో వుంటూ అశరీరగా వుండాలి. చేస్తూ చేయనివాడివి అవ్వాలి. వింటూ విననివాడివి అవ్వాలి. చూస్తూ చూడని వాడివి అవ్వాలి. తింటూ తినని వాడివి అవ్వాలి. కర్త లేకుండా పోవాలి. భోక్త లేకుండా పోవాలి. అదయ్యా బాబు! ఇది స్వరూప స్థితి అంటే. ఇది ముక్తి అంటే.

ఇట్లా ఎవడైతే సహజంగా వున్నాడో, వాడికి విదేహముక్తి సాధ్యం అయ్యింది. ఎందుకని? శరీరంలో వుండగా ముక్తుడు. జీవన్ముక్తుడు. వీడికి కొంతకాలం తరువాత సమిష్ట్యానుభవం కలిగి, ఆ బ్రహ్మానుభవంతో, ఆ సమిష్టిని, ఈ వ్యష్టిని, రెండింటిలోనూ ముక్తుడు అయిపోయాడు. అది విదేహ ముక్తి. కాబట్టి ఆ విదేహ ముక్తి పర్యంతమూ కూడా, నీకు తోడుగా వున్నది ఏది ఇప్పుడు? నువ్వు ఏదైతే అయివున్నావో, ఆ స్వరూప స్థితే నీవు అయివున్నావు. మధ్యలో తెచ్చుకున్నవన్నీ, మధ్యలోనే పోయినాయి. మధ్యలో తెచ్చుకున్న వాటిలో మళ్ళా ఏం చేశావు? మళ్ళా ఆ తెచ్చుకున్నదానిని మళ్ళా అనేకం చేశావు. అనేకంలో ఏం చేశావు మళ్ళా? ఇంకా లెక్కలు, జమలు పెంచేశావు. ఇంకా ఏం చేశావు? పరిమితులు పెంచేశావు. మరింతగా పెంచేకొద్దీ ఏమైపోయావు? మరింత కుంచించుకు పోయావు. ఎంతగా పరిమితం అయిపోయావంటే ఇప్పుడు ఇక, ఇహ నిన్ను బయటకు లాగాలంటే సాధ్యం కానంతగా కూరుకుపోయావు.

ఎందుకు కూరుకు పోయావని అంటున్నాడు?

నువ్వు ఏదైతే అయివున్నావో, ఆ స్వరూప స్థితి అనే సాక్షిత్వాన్ని, ఎంతగా మరచిపోయావు అంటే, నిరంతరాయంగా గుర్తు చేసినా, గుర్తుకురానంతగా మరచిపోయావు. ఎందువల్ల? నువ్వు ఆ సింహమై వుండి కూడా, మేకలతో సహవాసం చేశావు. చేసి, చేసి, చేసి, చేసి, చేసి చివరకు సింహగర్జననే, నేను గర్జించాలనే స్థితి కూడా,

సహజత్వాన్ని కోల్పోయావు. (అందరూ సింహాలే కదా! మేకలని ప్రత్యేకంగా లేవు కదా) ఆఁ.. ఏమిటంటే, ఎందుకని అలా పెట్టారంటే, ఇంద్రియాలతే కలిసి ప్రవర్తించేటప్పుడు నువ్వు సింహం అని గుర్తుంచుకుని ప్రవర్తించాలి. కానీ మనం ఏం చేస్తున్నాము? ఇంద్రియాలలోకి దిగంగానే, నువ్వు సింహం అనే గుర్తింపు పోయింది. సింహం గర్జిస్తే మేకలు వుంటాయా? వుండవు కదా! పారిపోతాయి. అలా అంత సామర్థ్యం వుంది నీ దగ్గర. కానీ, నీవు సింహం అని మరచిపోయేటప్పటికి ఏమయ్యావు? మేకలతో పాటు చేరి మే, మే, మే అంటున్నావు. నువ్వు గర్జిస్తేనే... నువ్వు ఏం చెయ్యక్కర్లేదు వాటిని. ఒక్క హుంకరిస్తే, ఒక్క గర్జింపు చేస్తే పారిపోతాయి. అంతటి పిరికిపందలు ఆ ఇంద్రియాలు. ఆ విషయాలు. ఈ ప్రకృతికి సంబంధించినటువంటివి అన్నీ! కానీ, నీవు పరమాత్మవు అయివుండి కూడా, ప్రకృతికి లొంగిపోయినట్లుగా జీవిస్తున్నావు. నువ్వు ప్రకృతిని నియమించేవాడవు కదా! ఈ సృష్టిని ఏర్పరచే వాడవు కదా! సృష్టికే సాక్షీ భూతుడవు కదా! కానీ అటువంటి జ్ఞానం ఎందువల్ల పోయింది? అంటే ఇంద్రియాలలో చేరి జీవించేటప్పుడు నువ్వు ఏం చేశావు? ఇంద్రియాలే సత్యంగా, విషయాలే సత్యంగా, గుణాలే సత్యంగా, అవస్థలే సత్యంగా, కట్టుకున్న వస్త్రమే నీవుగా, కుమ్మరి – కుండ ఒకటి అయ్యిపోయే పద్ధతిలో, నేను కుండను తయారు చేసేవాడిని అయినా గానీ, కుమ్మరి కుండ అవుతాడా? ఎప్పటికైనా? అవ్వడు కదా! ఇలాంటి ఉపమానాలు ఎందుకు చెబుతున్నాడు అంటే, నువ్వు శరీరం కాదు అని ధృవ పరచడం కోసం. ఒక్కసారి నీకిది బలమైన జ్ఞాపకం గనుక నీలో పడింది అంటే, అన్ని జ్ఞాపకాలు తుడిచిపెట్టుకుపోతాయి. అన్ని సంకల్పాలు తుడిచిపెట్టుకుపోతాయి. అన్ని ఆలోచనలు తుడిచిపెట్టుకుపోతాయి. అన్ని వాసనలు తుడిచి పెట్టుకు పోతాయి. అంతబలంగా నాటుకోవాలన్నమాట ఇది. ఎందుకనిట?

ఒక వస్త్రంలో ముల్లు చిక్కుకున్నాయి అండి. ఏం చెయ్యాలట ఇప్పుడు? ఒక పెద్ద ముల్లు తీసుకో. ఈ ముల్లులన్నీ దానితో ఏరి పారేయి. అప్పుడు వస్త్రం చిరగలేదు, ముల్లు తీసేశావు. ముల్లు తీసేసినాక, ఈ పెద్ద ముల్లుతో నీకేమిటి పని? అవసరం లేదు, అప్పుడు అది కూడా పారేయి. అర్థమైందా? చిన్న ముళ్ళులన్నీ పారేస్తే జీవన్ముక్తి, పెద్ద ముల్లు కూడా

పారేస్తే విదేహముక్తి. కానీ స్వరూప స్థితి? అక్కడైనా ఇక్కడైనా ఒక్కటే. కాబట్టి నీ స్వరూపస్థితికి ఇంత ప్రభావం వుంది నాయనా! జన్మ జన్మలుగా నువ్వు తెచ్చుకున్నటువంటి 84 లక్షల జీవరాశుల శరీరాలు అన్నింటిలో, ఏది ఆధారంగా వున్నది? ఈ సాక్షి ఆధారంగా వున్నది. ఏది (ఆధేయము) దాని మీద ఆధారపడి వున్నది? శరీరము ఆధారపడి వున్నది. మరి ఆధారపడి వున్నది నువ్వు అవుతావా? ఎప్పటికైనా గానీ? ఎట్లా అయినా కానీ? ఎట్లా అవుతావు?

(ముందు ముల్లులు తీయాలిగా...) ఆఁ... అంటే ఏం చేయాలట? నువ్వు మొట్టమొదట నీలో నువ్వు విచారణ చెయ్యాలి. నీలో నువ్వు విచారణ చేసి, ఇందులో శరీరభావముతో నేను ఎట్లా ప్రవర్తిస్తున్నాను? ఒకసారి గమనించాలి. గమనించి ఏం చెయ్యాలి? మాట్లాడక ముందే గమనించుకోవాలి ఇవన్నీ. మాట్లాడేసినాక గమనిస్తే ప్రయోజనం లేదు. అప్పుడు పని అయిపోతుంది. ఎందుకని? ఆ మాటలు ఎదుటివాడు వినేస్తాడు. వీడికి వాడిలో గుణాల ప్రభావం పనిచేస్తుంది. వాడికి అవే కదా వున్నాయి. నీకు ఏ దుర్లక్షణాలు వున్నాయో వాడికీ అవే వున్నాయి. నీకు ఏ దురభ్యాసాలు వున్నాయో, వాడికీ అవే దురభ్యాసాలు వున్నాయి. నీ ఏ అజ్ఞాన ప్రభావము వుందో వాడికీ అదే వుంది. నీకు ఏ దేహాభిమానం వుందో వాడికి అదే వుంది. ఇద్దరికీ జబ్బు ఒక్కటే. అంతే కదా! నీకు రియాక్షన్ వస్తే వాడికి రాదా? వాడికీ వస్తుంది. నువ్వు విచారణ చేసేవాడికే అంత రియాక్షన్ వస్తే, చెయ్యని వాడికి? వాడికి అసలు తెలియదుగా. విచారణ చెయ్యని వాడికి అస్సలు తెలియదు. పోనీ విచారణ చేసేవాడికి ఎందుకు తెలియడం లేదట? విచారణకు తగిన సాధన లేదు కాబట్టి. అంటే ఏం కావాలట ఇప్పుడు? విచారణ వుండాలి. సాధన కూడా వుండాలి. అంటే ఏం చెయ్యాలి? అర్థమైందా అండీ! కాబట్టి ముందు ఏం చేయమంటున్నారు? నువ్వు ఆత్మ విచారణలో స్థిరంగా విచారణ చెయ్యడం నేర్చుకో! స్వరూప స్థితి సత్యమని తెలుసుకో! స్వరూపస్థితి మీద నిలబడే ప్రయత్నం చేయి. స్వరూపస్థితి యొక్క గొప్పతనం అంతా తెలుసుకో! సాక్షిత్వంలో వున్నటువంటి ఆ శక్తి యేదో నీకు అవగాహన అయితే, దానికోసం నువ్వు ప్రయత్నం చేసేది అంతా సాధన అవుతుంది.

ఆ సాధనలో బలపడే కొద్దీ, నీకు విచారణ బలపడితేనే కానీ, సాధన బలపడదు. అంతే కదా! మనం ఏం చేస్తున్నాము? విచారణ చేయలేదు ఇంతకు ముందు. అన్ని పనులు చేసుకొచ్చావు. నవవిధ భక్తి మార్గాలలో వున్న అన్ని పనులు, అన్ని సాధనలు చేసేశావు. ఏమి లేదు? ఆత్మ విచారణ లేదు. అందువలన ఏమైంది? ఒక రెక్కతో ఎట్లా ఎగురుతావు? ఎగరలేవు. ఇప్పుడేమయ్యింది? ఆత్మ విచారణ నేర్చుకున్నావు, కానీ పూర్వ సాధనలు అన్నీ కూడా నేను చేసేశాను కదా! నాకెందుకు ఇంకా? అని నీవు విడిచిపెట్టావు. విడిచిపెడితే ఏమయ్యింది? అవి పోయినాయా పూర్తిగా? పోలేదుగా. ఎవడైనా ఆ పని చేసినప్పుడు, నీకు ఆ స్ఫురణ కలుగుతోందిగా, కలిగినప్పుడు దాని అర్థం ఏమిటి? ఇంకా నీలో అది మిగిలి వుందనే కదా! మిగిలివుందా లేదా? కాబట్టి ఏం చెయ్యాలట ఇప్పుడు? ఆత్మ విచారణ జ్ఞానం ప్రారంభించిన తరువాత, ఈ ఆత్మ విచారణ జ్ఞానంతో, నీలో బలీయంగా ఏదైనా, ఒక పూజ చెయ్యాలనో, ఒక జపం చెయ్యాలనో, ఆ నవ విధ భక్తి మార్గాలకు సంబంధించినది కనుక స్ఫురణకు వస్తే, ఈ ఆత్మ విచారణా జ్ఞానంలోనుంచి బయటకు రాకుండా, స్వరూపస్థితి అనేటువంటి స్థితిలోనుంచి బయటకు రాకుండా, దానిని ఆచరించు. అప్పుడు ఏమైంది? పూర్వము ఆచరించినప్పుడు ఏ అనుభవము మిగలలేదు. ఫలితము మీద తాపత్రయం తప్ప. ఇప్పుడు ఏమైంది? ఫలితం మీద తాపత్రయం లేదుగా. స్వరూపస్థితి నుంచి ఒక లక్ష్యములోనే నిలబడి చేస్తున్నావుగా. అప్పుడు ఈ సాధన అంతా ఏమైపోయింది? జ్ఞానమైన జ్ఞానానుభవాన్ని ఇచ్చినాయి. ఈ నవవిధ భక్తి మార్గాలే, ఈ సంస్కారాలే, ఈ వాసనలే, ఈ శరీరమే, ఈ ప్రపంచమే. (మీరు చెబుతున్నప్పుడేమో తేలికగా వుంటుంది కానీ, అది ఆచరణలో పెట్టేటప్పుడు?) అంటే అర్థం ఏమిటి? అట్లా కాదమ్మా! ఈ కొండను పగులగొట్టు అని చెప్పాను నేను. పగలగొట్టడం ఎట్లాగో చెప్పాను. చెప్పినంతమాత్రాన నువ్వు కొండను పగుల గొడతావా? పగలుగొట్టే ప్రయత్నం మొదలు పెట్టావు. అబ్బో! మీరు చెప్పినంత తేలికగా లేదండి, కొండ పగులగొట్టడం. ఇప్పుడు నేను తేలికగా వుంటుందని చెప్పానా నీకు? ఎప్పుడు తేలికగా వుంటుంది? దాని యొక్క రహస్యం తెలిస్తే నీకు తెలివి వస్తుంది. తేలికగా వుంటుంది. నువ్వు ఇప్పుడు రహస్యం తెలుసుకుని చేస్తున్నావా? చేయడం లేదు. మొద్దుగా చేస్తున్నావు. తమోగుణంతో చేస్తున్నావు. అంటే అర్థం ఏమిటి?

ఏదన్నా ఎదురు వచ్చింది, ఎదైనా ఎదురు రాగానే అసలు ఏం చెయ్యాలి మొట్టమొదట? మొదట ఏం చెయ్యాలి? మొదట ఏం చెయ్యాలి అంటే, నువ్వు ఇప్పుడు ఏం చేస్తున్నావు? మొదట ఏం చెయ్యాలి అనేదాక నువ్వు ఆగడం లేదుగా. వెంటనే మాట్లాడేస్తున్నావు, రియాక్షన్ వచ్చేస్తుంది. ముందు ఏం చెయ్యమన్నారు? ఏం మాట్లాడవద్దు. ఏదన్నా జరగనీ, అనుకూలం జరగనీ, వ్యతిరేకం జరగనీ. అనుకూలంలోనూ మాట్లాడమాక, వ్యతిరేకంలోనూ మాట్లాడమాక. (మాట్లాడకపోతే మనసు ఊరుకోదుగా) ఆగు, అప్పుడు ఏం చెయ్యాలి? మనసుని విచారణ చెయ్యాలి మొట్టమొదట. (వచ్చిన చిక్కు అంతా అదేగా) ఆఁ.. ఆగాలి. నువ్వు ఏదన్నా ప్రయత్నం చేయి, అక్కడ ఆపాలి. అక్కడ ఆపాలి అంటే, నువ్వు ముందుగా గుర్తించాలి. నువ్వు ముందుగా గుర్తించాలి అంటే, రెండు పనులు ఏకకాలంలో చెయ్యాలి. ఏమిటి? నీ శ్వాస మీద ధ్యాస పెట్టాలి. నీ మనసు మీద కూడా ధ్యాస పెట్టాలి. ఇప్పటి వరకూ ఏం చేశావు? ఒక్కటే చేశావు. ఒక్కటి చేస్తే, ఒకటి పోయింది. శ్వాసను గుర్తిస్తే, మనసు పోయింది. మనసుని గుర్తిస్తే, శ్వాస పోయింది. అంతే కదా! కాబట్టి ఇప్పుడు ఏం చెయ్యాలట? అట్టా కాదమ్మా! నువ్వు శ్వాస మీద ధ్యాస పెట్టాలి. నీకు ఉపదేశ మంత్రము ఏదైతే వుందో, ఆ మంత్రజపం మనసుతో చేయాలి. రెండు పనులు ఏక కాలంలో చెయ్యాలి.

మనసు రెండు పనులు చేయగలుగుతుంది. ఎప్పుడైనా గుర్తుపెట్టుకోండి. దానికి రెండు వున్నాయి, సామర్థ్యాలు. (రెండూ ఒకేసారి చేయగలుగుతుందా?) చేస్తుంది. ప్రయత్నం చెయ్యి. ఎట్లా ప్రయత్నం చెయ్యాలి అంటే, నేను ఇప్పుడు ఏకకాలంలో, ముందు ఏమి చేయాలి? మొదటి రెండు మూడు నిమిషాలు, ఐదు నిమిషాలు శ్వాసను గమనించాలి, గమనిస్తూ వుండంగానే మనసు ఏం చేస్తుంది? అది రెండవ పని చేయగలుగుతుందిగా. రెండవ పని ఏం చేసింది? జ్ఞాపకాలను తవ్వడం మొదలు పెట్టింది. అంతే కదా! ఆ జ్ఞాపకాలను త్రవ్వటం మొదలు పెట్టకముందే, నువ్వు ఏం చెయ్యాలట ఇప్పడు? నీ ఉపదేశ మంత్రం ఏదైతే వుందో, ఆ మంత్రజపం మానసికంగా చేయడం మొదలుపెట్టు. ఇప్పుడు మనసు శక్తి ఎంత? రెండు పనులు. ఒకపని ఏం చేస్తోంది? శ్వాసమీద ధ్యాస. రెండవపని ఏం చేస్తోంది? మంత్ర జపం. అర్థమైందా? ఇవి రెండూ ఎప్పుడైతే చేసేసిందో, మూడవపని చేసేటంత శక్తి సామర్థ్యాలు, దాంట్లో అప్పుడే

వుండవు. నువ్వు ఈ పని చేసేకొద్దీ, ఏమైపోతుందంటే, శ్వాస మీద ధ్యాస వెంటనే వచ్చేస్తుంది కాదా! నిలకడ వచ్చేస్తుంది. ఒక దాంట్లో నిలకడ రాగానే, ఇప్పుడు అదేం చెబుతుంది? అది నేను ఇప్పుడు గమనించనక్కర్లేదు అది సహజమై పోయింది. ఇప్పుడు నేను ఏం చేస్తున్నాను? మంత్రజపం ఒక్కటే చేస్తున్నాను. ఇప్పుడు రెండోపని సామర్థ్యం వచ్చింది. మిగిలింది. అప్పుడేమీ చేశావు? మళ్ళా జ్ఞాపకాలు రావడం మొదలు పెడుతుంది. ఇప్పుడేమి చెయ్యాలి? ఆ జపం చేసేటప్పుడు, జపానికి సంబంధించినటువంటి సద్గురు మూర్తో, దేవాతామూర్తో వుంటుంది. దానిని జోడించాలన్నమాట. ఇప్పుడు మనసు ఏం చేసింది? సహజంగా శ్వాస మీద ధ్యాసను కలిగివుంది. రెండవ పని మొదటి పని కింద జపాన్ని చేసింది. రెండవపని కింద భావ రూపాన్ని ఎదురుగుండా పెట్టుకుంది. బాహ్యరూపంతో పనిలేదు అప్పుడు ఇక. ఏ గురువునైతే నువ్వు విశ్వసించావో, ఏ పరమాత్మనైతే నువ్వు విశ్వసించావో, ఆ పరమాత్మ యొక్క, నీవు అనుకున్నటువంటి, భౌతిక రూపాన్ని, మనసులో ముద్రించి, జపం రూపం, జపం రూపం, మెట్టు దిగింది రూపం చెడిండి. వెంటనే ఏమి వస్తుంది? దీనికింద ఏముంది? శ్వాస మీద ధ్యాస. శ్వాస మీద ధ్యాస, జపం, రూపం. శ్వాస మీద ధ్యాస, జపం, రూపం. ఈ మూడిటి మీదా తిరగుతూ వుంటుంది. కొంతకాలం అయ్యేప్పటికి ఏమైపోయింది? శ్వాస మీద ధ్యాస సహజమైపోతే, జపం రూపం, చెడింది, ఒక వేళ పైన రూపం చెడింది, ఏదో ఆలోచన వచ్చి ముందు ఏం చెడుతుంది? భావ రూపం చెడుతుంది. చెడగానే వెంటనే కిందకి చూడాలి. కిందకి చూస్తే ఏమైంది? మళ్ళా ధ్యాసలోకి వచ్చేస్తావు. మళ్ళా పైకి చూడు ఇప్పుడు. మళ్ళా రూపం వస్తుంది. ఇలాగ అభ్యాసం చెయ్యగా చేయగా, ఈ సాధన చేయగా, చేయగా కొంతకాలానికి ఏమైపోతావు? ఈ శ్వాసమీదధ్యాస సహజమైపోయింది. మనసు జపము, రూపము కలిగివుంది. ఇంకా నువ్వు స్థిరపడేటప్పటికి, జపంతో పనిలేకుండా పోతుంది. వట్టి రూపం కళ్ళముందు వుంది. ఇంకా కొంతకాలం అయ్యేప్పటికి, ఆ ఎదురుగుండా ఏ రూపమైతే పెట్టావో, ఆ రూపమే నేను అయిపోతావు. ఇప్పుడు ఇక్కడుంది కదా రూపం, భావ రూపం, ఇటు అయిపోయింది. దానికి నాకు భేదం లేదు. ఇహ నిర్ణయం వచ్చేసింది. నిర్ణయం రాగానే ఇప్పుడు ఏమైంది? మనసు బుద్ధిలోకి మారిపోయింది. అర్థమైందా?

బుద్ధి ఎన్ని పనులు చేస్తుంది? ఒకే పని చేస్తుంది. నిర్ణయం చెబుతుంది అంతే. ఆ గురు రూపానికి నాకు భేదం లేదు. ఆ పరమాత్మకి నాకు భేదం లేదు. నిర్ణయం చేసెయ్యగానే, ఇక మనసులో ఏ ఆలోచన ప్రారంభం అయినా, ముందు ఈ ఆలోచనతో మనసులో ఆలోచన ప్రారంభం అవుతుంది. కాబట్టి సాధన యొక్క ఫలితం ఇదన్నమాట. విచారణ చేస్తేనేమో అవగాహన వచ్చింది. విచారణ చేస్తే ఏం కలిగింది? అవగాహన కలిగింది. కానీ వట్టి అవగాహనతో నీకు బలం వుందా మరి ఇప్పుడు? లేదు. అర్థమైందా?

నీ ఇంట్లో అన్నం వుంది, పప్పువుంది, కూర వుంది, అది వుంది, ఇది వుంది. పేర్లు చదివినంతమాత్రాన నీకు శక్తి కలుగుతుందా? కలుగదు కదా! ఏం చెయ్యాలి? వాటిని స్వీకరించాలి. అంతేనా కాదా? నీకు స్వరూప స్థితి వుంది అని తెలిసింది. పంచకోశాలు వున్నాయి అని తెలిసింది. మూడు అవస్థలు వున్నాయి అని తెలిసింది. మూడు గుణాలు వున్నాయి అని తెలిసింది. సాక్షిత్వం ఎలా చెడిపోతున్నదో తెలిసింది. ఎలా దుఃఖం వస్తుందో తెలిసింది. ఎలా దుఃఖం నివృత్తి పొందుతుందో తెలిసింది. ఇవన్నీ ఎట్లా తెలిసినాయి? వాటి address లు తెలిసినాయి. వాటి స్థితులు తెలిసినాయి. పేర్లు తెలిసినాయి. దానిమీద అవగాహన వచ్చింది. కానీ ఏమి రాలేదు? అనుభవం రాలేదు. అనుభవం రావాలి అంటే ఏమి చెయ్యాలి? సాధన చెయ్యాలి. ఆ విచారణ అవగాహన వుండాలి. ఆత్మ విచారణతో కూడిన అవగాహన వుండాలి. సాధన చెయ్యాలి. ఈ రెండిటితో కలిసినటువంటి జీవితాన్ని జీవించాలి. ఇప్పుడు మనం మన జీవితంలో ఈ రెండూ వున్నాయా? ఒకటి వుంటే, ఒకటి లేదు. ఏమైంది దాని వల్ల? ఒక రెక్కతో ఎట్లా ఎగురుతావు? ఎగరలేవు. కాబట్టి నీవు ఆత్మవిచారణను అభ్యాసం చెయ్యాలి మొట్టమొదట. ఆత్మ విచారణను అభ్యాసం చేస్తూ, నీ వాసనాబలం మేరకు, నీ సంస్కార బలం మేరకు ఏ ఏ సాధనలు నీకు అనుకూలము అని తోస్తే, ఈ విచారణని కొనసాగిస్తూ, ఈ విచారణా దృష్టితో, ఆ సాధనలను చేయాలి. ఏమైంది అప్పుడు? అప్పుడు సాధన, అవగాహన రెండూ వున్నాయి. రెండింటి వల్ల నిర్ణయం కలుగుతుంది. ఒక్కదాని వల్ల నిర్ణయం కలుగదు. ఒక్కసారి ఆ నిర్ణయం కలిగితే ఆ బుద్ధిలో, ఆ నిర్ణయం ప్రభావంతో ఆలోచించడం మొదలు పెడుతావు. తద్వారా ప్రతి ఆలోచనలోనూ, ఆ నిర్ణయమే ప్రతి ఫలిస్తుంది. అట్లా కొంతకాలం ఆ నిర్ణయంతో జీవించేటప్పటికి, నీలో

సమూలమైనటువంటి మార్పులు వస్తాయి. అప్పుడు నీ జీవితం అంతా మారిపోయినటువంటి, నూతనమైనటువంటి జీవితం, ఆత్మానుసార జీవితంగా పరిణామం చెందుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ ఏం చేయాలండీ సాధన? ఏమండి, నన్ను సహస్రనామం చేయమంటారా? అష్టోత్తరం చేయమంటారా? ఎదో ఒకటి చెయ్యి. ఏం చేస్తే ఏం తేడా వుంది? అది నీకే కదా లేక్క. ఆయనకు ఏమన్నా లెక్క వుందా? సహస్రం అయినా, అష్టోత్తరం అయినా, ఏకనామమైనా ఆ దేవతకు ఏమైనా తేడా వుందా? పరమాత్మకు ఏమన్నా తేడా వుందా? ఏమీ లేదు. ఎందుకని? అవి స్వరూప స్థితులు కదా! నీ స్వరూపస్థితిలో ఏముందో, అక్కడా అదే వుంది కదా! కాబట్టి నీవు మొట్టమొదట ఏం చెయ్యాలి? ఆత్మ విచారణ చెయ్యి. ఈ విచారణతో ఒకే ఒక్క సాధన చెయ్యగలుగుతాడు. ఏమిటది? ఇందాక చెప్పింది. ముందు ఏం చెయ్యాలి? విచారణ చేయి. రెండవది ఏం చేయాలి? శ్వాసమీద ధ్యాస పెట్టు. మూడవది ఏం చెయ్యాలి? మంత్ర జపం చేయి. నాల్గవది ఏం చెయ్యాలి? దానికి తగ్గ గురువు యొక్క రూపాన్ని కానీ, పరమాత్మ యొక్క రూపాన్ని కానీ అనుసంధానించు. నీవు ఎప్పుడైతే ఈ క్రమంలో చేశావో, ఏమైంది అప్పుడు? నీకు మానసికంగా బలం లభించింది. మానసికంగా అనుసరించగలిగే సామర్థ్యం వచ్చింది. బుద్ధికి సామర్థ్యం వచ్చింది. బుద్ధి వికాసం పూర్తి అయ్యింది. ఆ బుద్ధి వికాసం పూర్తి అయినప్పుడు, ఏ నిర్ణయంతో అయితే స్వరూప స్థితికి సంబంధించిన నిర్ణయము వున్నదో, ఆ నిర్ణయంతోటే మనసులోకి దిగుతూ వుంటావు ఇక. కాబట్టి అప్పుడు మనసు యొక్క పూర్ణమైనటువంటి రూపాంతరం చెందింది. సంస్కార బలం అంతా రూపాంతరం చెందింది. కొత్త సంస్కారాలు, జ్ఞానపరమైనటువంటివి ఏర్పడ్డాయి. అజ్ఞాన పరమైనవి తోచినప్పుడల్లా అభ్యాసబలం చేత, వాటిని నిరసించేసుకోవాలి. అది లోకంలో కాని, వ్యక్తిగా నీకు కాని. నిరసించేసేస్తాడు అంతే! ఎందుకని? తను ఆచరించడు ఇక వాటిని. అజ్ఞాన పద్ధతిలో ఆచరించడు ఇక అంతే! ఆచరిస్తే జ్ఞానపద్ధతిలోనే ఆచరిస్తాడు. ఎప్పుడు? అది నిమిత్త కర్మ, ధర్మం అనుకున్నప్పుడే ఆచరిస్తాడు. ప్రత్యేకత కోసం ఆచరించడు.

జీవితం మొత్తం మీద సత్యనారాయణ స్వామి వ్రతం ఎన్ని సార్లు చెయ్యాలి? నీకు శక్తి వుంటే రోజూ చేసుకో! లేకపోతే సంవత్సరానికి ఒక్కసారైనా చెయ్యి. లేకపోతే

నామకరణం, వివాహం, ఇంకా వగైరా ఏవో నాలుగైదు చెప్తావు. అప్పుడు చేయి. మరణకాలంలో ఎందుకు చెయ్యొద్దు? మరణకాలం కూడా గొప్పదే కదా! కాదా? మరి ఎందుకు అప్పుడు చేయడం లేదు? ఒకసారి విచారణ చెయ్యి. మరణం అశుభంగా చూశావు. సత్యనారాయణ వ్రతం? శుభంగా చూశావు. అర్థముందా ఏమైనా? ఎందుకని? నిజమైన జ్ఞానం అసలు అప్పుడే బోధిస్తున్నాడు నీకు. సరియైన జ్ఞానం అప్పుడే తెలుస్తోంది. ఉత్తమోత్తమ జ్ఞానం లభించిన తరువాత దేహభ్రాంతితో కూడిన వ్రతం చేయమని చెబుతాడా ఎవడైనా? కానీ, వింతైనా విషయం ఏమిటో చూడండి. 13వ రోజు తరువాత, పుణ్యాహ వచనం తరువాత, ఇవాళ అందరూ ఏం చేస్తున్నారండీ? ... అర్థం వుందా ఏమైనా? ఉత్తమోత్తమమైన జ్ఞానం 13 రోజులు బోధించాడు నీకు నిత్య కర్మద్వారా. నీవు ఆత్మస్వరూపుడవు నాయనా! నీవు జీవుడవు కాదు. నీవు శరీరము కాదు. నీవు ఇంద్రియాలు కాదు. ఇవన్నీ ఎట్లా వస్తున్నాయి? ఇదిగో సృష్టి ఇట్లా ఏర్పడుతోంది. పోతోంది అని 13 రోజులు ఏకరువు పెట్టి నిత్య కర్మ చేయించారు. 13వ రోజున మళ్ళీ ఏం చేశాడు? ఇప్పుడు ఇది మన సంప్రదాయమని ఒప్పుకుందామా? ఏ సాంప్రదాయం అందాము ఇప్పుడు? అజ్ఞాన సాంప్రదాయమా? జ్ఞాన సాంప్రదాయమా?

ఆః.. అంటే అర్థం ఏమిటి? (ఏదో అందరూ చేస్తున్నారు, మనము చేస్తున్నాము) అంటే అర్థం ఏమిటి? (తెలియకుండా చేస్తున్నాము) అజ్ఞానంలో ఇంకా గాఢ తమోగుణం. నిద్రపోతూ చేయడమే. ఎందుకని? నిద్రపోయేవాడికి ఏం చేశాడు, ఏం చేయలేదు అని ఏం తేడా తెలుసు? (ఈ తమోగుణాన్ని ఎట్లా అధిగమించాలి?) ఆః.. విచారణ. అందుకే మొట్టమొదట విచారణ అని చెప్పేది. ఎంతగా నువ్వు విచారణలో బలపడితే, అంతగా నీకు సత్వగుణం అభివృద్ధి చెందుతుంది. సత్వగుణం అభివృద్ధి చెందితేగానీ, నీ శ్వాసమీద ధ్యాసగానీ, మనసు చేత పనిచేయడం గానీ, ఆ రూపం నిలపడం గానీ, అవేవీ సాధ్యం కావు. అర్థమైందా? ఎందుకని వాళ్ళు అందరూ ఒక్కటై చేయమంటున్నారంటే, అందరూ తమోగుణం వాళ్ళేగా. ఆ ఒక్కడు చేయడమే కష్టసాధ్యం. నువ్వు ఒక్కసారి నాలుగు చేయమంటే? సాధ్యం కాదు. అందుకని ఏం చేశారు ఇప్పుడు వాళ్ళు? సరేలే! ఈ గోల అంతా నీకు ఎందుకు గానీ, ఆ శ్వాస మీద ధ్యాస ఏదో ముంది అది చేయి, అది వచ్చినాక చూద్దాము. అది వచ్చినాక ఆత్మ విచారణ

చెబుతారన్నమాట. అక్కడ వుద్దేశ్యం అది. ఆత్మవిచారణ అప్పుడు చెబుతాడు. అప్పుడు చెప్పి మళ్ళా ఈ శ్వాసమీద ధ్యాసను చేయిస్తాడు. రెండూ చేతనైన వాడు, మీకు బోధించేవాడు ఇప్పుడు అక్కడ. ఒకడు కూర్చొని ధ్యానం బోధిస్తున్నాడు కదా! వాడు ఎవడు? వాడికది తెలుసు. ఆత్మ విచారణ తెలుసు, శ్వాసమీద ధ్యాస తెలుసు. కానీ ఏం తెలియదు? పై స్థితులు తెలియదు ఇంకా! పై సాధనలు తెలియవు. అది కూడా తెలిసిన వాడు ఏం చేస్తాడు? అది చెప్తాడు. ఇట్లా ఎవరికి వాళ్ళు, వాళ్ళు ఏ సాధన ద్వారా పరిణామం చెందుతూ వచ్చారో, ఆ స్వరూప స్థితిని తెలుసుకోగలిగారో, ఆ పద్ధతిలో వాళ్ళు చెబుతూ వుంటారు. నీ సంస్కార బలానికి ఏది అనుకూలంగా వుంటుందో, ఆ మార్గాన్ని ఎంపిక చేసుకో! ఈ మార్గం, ఆ మార్గం, ఇది గొప్పది, అది తక్కువది అని నేను చెప్పడము లేదు. నీ సంస్కార బలానికి ఏది అనుకూలమో, అది ఎంపిక చేసుకో! ఆయా సాధనలను ఆత్మవిచారణతో చేయి. అంతే కానీ, ఆత్మ విచారణ విడిచిపెట్టి చేస్తే ప్రయోజనము లేదు. కాబట్టి ముందు నీకీ తమోగుణ ప్రభావం తగ్గిపోవాలన్నా, రజోగుణ ప్రభావం తగ్గిపోవాలన్నా, ఆత్మవిచారణ చెయ్యాలి. ఎంతగా ఆత్మవిచారణ చెయ్యాలి అంటే, సత్వగుణం వృద్ధి చెంది, ఎప్పుడూ ఆత్మవిచారణతో, జీవితం గడుస్తూ వున్నది అనుకుని స్థిరపడేంత వరకూ ఆత్మవిచారణ చెయ్యాలి. మరి రెండోపని చెయ్యొచ్చు కదండీ! చెయ్యి, ఎవరు చేయద్దన్నారు? ఏ సాధనైనా చేయి, ఆత్మవిచారణ తోటి. కానీ, అంతర్ముఖ ప్రయాణము అంటున్నావే, అంతర్ముఖ ప్రయాణం మాత్రం ఎలా సాధ్యమయ్యా అంటే, ఈ ఆత్మవిచారణ తరువాత, మొదటి స్థితిలో ఏమి తెలుసుకోవాలి? ప్రాణమయకోశాన్ని తెలుసుకోవాలి. కాబట్టి శ్వాస మీద ధ్యాస. ప్రాణమయాన్ని దాటావు, ఇప్పుడేమి తెలియాలి? మనోమయం తెలియాలి. కాబట్టి మనస్సుతో జపం చేయి. అప్పుడు మనోమయం తెలిసింది. అర్థమైందా? దానిపైన ఏమి తెలియాలి? విజ్ఞానమయం తెలియాలి. దానికేం చేయాలి? ఆ గురుమూర్తి యొక్క రూపాన్ని పెట్టు భద్రంగా. ఈ జపం, ఆ రూపం, ఈ కింద ధ్యాస బయటకు వస్తే ఆత్మవిచారణ. ఇహ నిన్ను చెడగొట్టమనండి ఇప్పుడు? రక్షణ కవచాలు ఎన్ని ఏర్పరచావు? పంచకోశాలు కదా! పంచకోశాలకి ఐదు కోటలు ఏర్పాటు చేశావు. ఇప్పుడు నీ మీద దాడి చేయమను. ఎలా చేస్తాయి? ఎందుకని? బయటకి అన్నమయ్య కోశ పరిధిలోకి వచ్చావా? ఆత్మ విచారణ.

నోరు తెరిస్తే ఆత్మవిచారణే ఇక. ఇంద్రియాలు ఓపెన్ చేస్తే, ఇంద్రియాలను మొదలు పెట్టాలంటే ఆత్మవిచారణతోనే మొదలు పెడుతాడు ఇక. ఇలా బహిరంగం. లోపలికి తిరిగావు శ్వాస మీద ధ్యాస. ఇంకా లోపలికి తిరిగావు, మనస్సుతో జపం, ఇంకా లోపలికి తిరిగావు, గురుమూర్తి యొక్క రూపం, పరమాత్మ యొక్క రూపం, ఇంకా లోపలికి తిరిగావు, స్వరూపస్థితి అనే నిర్ణయం. Finish. ఎందుకని? అదేనయ్యా బాబు సాక్షి. ఆ సాక్షిత్వ స్థితిలో వుంటాడు అంతే. చూడాలి క్రిందకి, ఇంద్రియాలలోకి పైనుంచి, కొండమీదనుంచి ప్రపంచాన్ని ఎట్లా చూస్తాడో, అప్పుడు ఎట్లా కనబడుతుంది ప్రపంచం? కొండ మీద వున్న దేవుడిని, కింద వున్న ప్రపంచం ఏమన్నా చేయగలదా? ఏమీ చేయలేదు కదా! అంతా చిన్నదిగా కనపడలేదా? ప్రపంచం అంతా. కిందనుంచి పైకి చూస్తే, ఇవి పెద్ద ప్రమాదకరంగా కనపడ్డాయి. అంత భేదం వుంటుందన్నమాట. (స్వరూప స్థితి.....) అంతేకదా మరి! ఎప్పుడైతే ఈ క్రమంలో వెళ్ళావో, ఆ ఆధారంగా పెట్టుకున్న రూపమే నేను అయిపోతానో ఎప్పుడైతే, వెంటనే ఆత్మసాక్షాత్కార జ్ఞానం కలుగుతుంది. అర్థమైందా అండీ!

ఈ సాధనా క్రమంలో వెళ్ళేవాడికి, ఎప్పుడైతే ఆ బుద్ధి స్థితిని దాటి పోతాడో, వెంటనే ఆత్మసాక్షాత్కార జ్ఞానం కలుగుతుంది. అప్పుడేమైంది ఇక? బుద్ధిలో ఏ జ్ఞాపకం పని చేయాలన్నా, నేను ఆత్మస్వరూపుడను అనే నిర్ణయంతో మొదలైతేనే, ఆ జ్ఞాపకాలు పని చేస్తాయి. దానికి సరిపడని జ్ఞాపకాలని బుద్ధి ఏం చేస్తుందంటే, చెరిపివేస్తేస్తుంది. దానికి ఆ సామర్థ్యం వచ్చేస్తుందన్నమాట అప్పుడు. ఆ బుద్ధి వికాసం పూర్తి అయ్యేటప్పటికి, దీనికి సరిపడే వాటినే వుంచుతుంది. మిగిలినవాటిని అన్నింటినీ చెరిపివేసేస్తుంది. ఎందుకని? వీడేమీ అమలు చేయడుగా వాటిని. అమలు చేయనివి నీ దగ్గర ఏమన్నా వున్నాయా ఇప్పుడు? ఏమీ లేవు. చిన్నప్పుడు కొన్ని పనులు చేశామండి. పెద్ద అయినాక అవేమీ ఇప్పుడు చేయలేదండి, వాటికి సంబంధించిన జ్ఞాపకాలు ఇప్పుడు నీ దగ్గర ఏమన్నా వున్నాయా? లేవు. ఎందుకని? బుద్ధి స్పష్టంగా చెరిపివేసింది. ఆ... కొన్ని మిగిలినవి ఏమిటి? అదే ప్రారబ్ధం. ఇప్పుడు ప్రారబ్ధం తెలిసి, వాటిని రద్దు చేయాలి అంటే, ఇంత దూరం రావాలన్నమాట.

ఆత్మసాక్షాత్కార జ్ఞానం కలిగితే గానీ, ప్రారబ్ధం రద్దు అవ్వదు. ఎట్లాగ? ఆ జ్ఞానంతో అప్పుడు కర్మకాండను చూస్తాడు. ఆ కర్మ ప్రభావాన్ని చూస్తాడు. ఆ జ్ఞానంలో ఈ కర్మ బీజాలు దగ్ధం అయిపోయినాయి. (మనకు తెలియకుండా జరిగినవి కూడానా?) అన్నీ అప్పుడు తెలుస్తాయి. నీ బుద్ధి యొక్క అంతరాంతరాళలోకి వెళ్ళగలిగే సామర్థ్యము ఇప్పుడు లేదు. అర్థమైందా? ఈ క్రమంలో సాధన చేస్తూ, నేను ఎవడను అని ప్రశ్నించుకుంటూ, నేను ఆత్మ స్వరూపడను అనే నిర్ణయాన్ని నువ్వు, చివరివరకూ ఎప్పుడైతే నిలబెట్టుకోగలిగావో, అప్పుడు ఆ ఆత్మసాక్షాత్కారజ్ఞాన ప్రభావంతో నీ బుద్ధిలోకి చూస్తే, నీ బాల్యం కాదు, నీ జన్మజన్మాది క్రమంలో నీకు వచ్చినవన్నీ కూడా అప్పుడు తెలియబడిపోతాయి. అన్నీ దగ్ధమైపోతాయి. ఎందుకని? గుణాతీతంగా వుంటావు కాబట్టి. గుణాలకు లొంగావా? మళ్ళా దగ్ధం కావు. అలాగే వుండిపోతాయి, ఆ బీజాలు. మళ్ళా మొలకెత్తుతూ వుంటాయి. కాబట్టి ఎంతజ్ఞానం వచ్చినా కూడా వీడు మళ్ళా అజ్ఞానానికి సంబంధించిన పనే చేస్తూవున్నాడని అనుకుంటావనుకో! ఎందువల్ల కలుగుతోంది? అంటే, అవి ఇంకా సాంతం పోలేదు. వాటిలోంచి విడుదల పొందలేదు. అవి రద్దవలేదు. ఎప్పటికైనా అవి రద్దు అవ్వాల్సిందే. ఎందుకని? అప్పుడే నీకు ముక్తి సాధ్యం. కాబట్టి ఏం చెబుతున్నాడు అక్కడ? నేనెవడను? అనేటటువంటి స్వరూపస్థితి సంబంధించినటువంటి విచారణని బలపరుచుకో! ఇది మొదటి సాధన. ఆ క్రమంలో పంచకోశాల క్రమం ఎట్లా వుందో, అదే క్రమంలో సాధన చేస్తూ పో! ఎప్పుడైతే నువ్వు విజ్ఞానమయ కోశ పరిధిని దాటి, ఆనందమయ కోశ పరిధిని దాటి, నేను అనే స్వరూప స్థితిని తెలుసుకో గలిగావో, ఆత్మ సాక్షాత్కార జ్ఞానం కలిగిందో, అప్పుడు ఆ స్థితినుంచి కిందకి చూస్తావు. ఆ స్థితినుంచి పంచకోశాలని చూస్తావు. అప్పుడు నీవు పంచకోశ వ్యతిరిక్తుడవు, గుణత్రయాతీతుడవు, అవస్థాత్రయాతీతుడవు, అని నీకు నీకే అనుభవానికి వస్తుంది. అది సాక్షియొక్క అనుభవం. ఇటువంటిది వున్నవాడికే ముక్తి సాధ్యమౌతుంది.

చదవండి! కింద స్పష్టంగా చెబుతాడు ఇదంతా...

(తన యదార్థ స్వరూపము విచారించి తెలుసుకొనుటయనగా నేమి?)

ఎల్లవారికీ స్వభావముగా గలుగు పోతిని, వచ్చితిని, వుంటిని, చేసితిని ఇత్యాది అనుభవములకు తగిన క్రియలకు మూలమైన నేను యొక్క బోధ, తెలివి కలుగుచున్నది.) అది.

ఏం చేస్తున్నామంటే? ఇప్పుడు మనం? పోయితిని, వచ్చితిని, తింటిని, వుంటిని అంటున్నావు కదా! వాటి అన్నిటికీ మూలం ఎవరు? నేను. ఆ నేను అనే గుర్తు. నేను అనే ఎఱుక. నేను అనే బోధ. ఆ నేను అనే నిర్ణయం. నువ్వు ఎప్పుడైతే దానిని ఆశ్రయించావో, అప్పుడు ఇచ్చితిని, వచ్చితిని, పోతిని అనేది నీకు ఏమన్నా ప్రాధాన్యత వుందా? లేదు కదా! అట్లా చెయ్యి వాటిని. ఇప్పటి వరకూ దేనికి ప్రాధన్యత ఇచ్చావు? ఇచ్చితిని, వచ్చితిని, పోతినికీ ప్రాధన్యత ఇచ్చావు. అందువల్ల ఏమయ్యావు? దుఃఖభారం పొందుతున్నావు. దుఃఖానికి లొంగిపోయావు. దుఃఖానుభవం కలుగుతోంది నీకు. అజ్ఞానానుభవం కలుగుతోంది. దేహాభిమానం కలుగుతోంది. దీంట్లోనుంచి బయటపడు. ఎలాగ? వీటన్నింటికీ మూలం ఎవరు? నేను. ఆ నేనును ఆశ్రయించు, ఆ స్వరూప స్థితిని ఆశ్రయించు, ముక్తిని పొందు. (తరువాత చదవండి)

(ఆ తెలివి యొక్క నిజస్వరూపము, నేను ఎవడను? అను విచారణముచే విచారించి తాను తానుగా మిగులుటయే తన యథార్థ స్వరూపమును విచారించి తెలుసుకొనుట).

తాను తానెవడనో తెలుసుకొనీ, 'తాను'గా వుండుటయే, తెలుసుకున్న తరువాత మళ్ళా కిందకు వచ్చేయకూడదు. ఇప్పుడు మనం ఏం చేస్తున్నాము? తెలుసుకున్నాను అంటున్నావు. కానీ పాతపద్ధతిలోనే చేస్తామంటున్నాము, ఏమైందప్పుడు? అజ్ఞానానుభవమే కలుగుతుంది కానీ, జ్ఞానానుభవం వస్తుందా? రాదు కదా! కాబట్టి తాను ఎవడినో తెలుసుకుని, తానుగా జీవించవలయును.

(నేను ఎవడను అని విచారించి తెలుసుకుని,)

ఊఁ... ఇది ముఖ్యం.

(పోవుట, వచ్చుట ఆదిగా కల కార్యములు దేహసంబంధమైనవే గానీ, ఇతరములు కావనుటయే దేహమే నేను అని చెప్పినట్లు కదా!)

నేను హైదరాబాదు నుంచి ఇక్కడికి వచ్చాను. దేహం వచ్చిందా? నేను వచ్చానా? దేహం వచ్చింది. కానీ నేను వచ్చాను అని అంటున్నావు. నువ్వు రాలేదు, దేహం వచ్చింది. ఈ సత్యం తెలుసుకున్నవాడు ఏమంటాడు ఇప్పుడు? రావడం జరిగింది. విజయవాడ రావడం జరిగింది. ఎవరు? శరీరం. నేను? అక్కడా నేనే, ఇక్కడా నేనే. తమరితో మాట్లడడం జరిగింది. గురువుగారిని ఆశ్రయించడం జరిగింది. పెళ్ళి బాగా జరిగింది. వ్రతం బాగా జరిగింది. ఎందుకని? బాహ్యం అదంతా. జరుగుతూ వుంటుంది అది. నేను? ఏమీ జరగను. కదలను. సాక్షిని. పూర్వం పెద్దవాళ్ళు ఏం మాట్లాడే వాళ్ళు? నాయనా! ప్రయాణం బాగా జరిగిందా? ప్రయాణం బాగా చేశావా? అని అడిగారా? ఎవ్వరూ అడగరండి. ఇప్పుడు ఏమి అడుగుతున్నారు? చూసుకోండి ఎంత భేదం వుందో, మాటలో. అనుభవ వాక్యం అన్నమాట అది. నాయనా! ప్రయాణం బాగా జరిగిందా? క్షేమంగా రాగలిగారా? ఇట్లాగ పూర్వం పెద్దలు ఆ అనుభవజ్ఞానంతో మాట్లాడేవారు. మనం కూడా ఇప్పుడు ఎట్లా మాట్లాడుతున్నాం ఇప్పుడిక? ఆ జ్ఞానం వచ్చినప్పుడు అట్లా మాట్లాడుతాం. జ్ఞానం లేనప్పుడు ఏమైపోయింది? అజ్ఞానంగానే మాట్లాడాము. ఏసీ బాగుందా? సీటు కుషన్ బాగుందా? ఇలా అడుగుతామన్నమాట. ఇప్పుడు ఏమైందప్పుడు? పూర్తిగా దేహ భ్రాంతిలో మునిగిపోలేదా? అర్థమైందా? కాబట్టి నువ్వు మాట్లాడుదామనుకున్న మాటల్లోనే అజ్ఞానం వుందిరా బాబు. దాని వలనే అసలు బలపడుతోంది. నువ్వు మాట్లాడకుండా ముందు విచారణ చెయ్యి. దేహంగా మాట్లాడుతున్నావా? ఆ దేహమనే తెలివితో మాట్లాడితే, అదే బలపడిపోతోంది. కాబట్టి దేహమనే తెలివిలో మాట్లాడమాకు. నేను దేహం కాదు. నేను ఆత్మస్వరూపుడను. ఆ స్వరూపస్థితిని గుర్తుంచుకుని మాట్లాడు. ఆ స్వరూపస్థితిని గుర్తుంచుకుని ఆలోచన చేయి. ఆ స్వరూపస్థితిని గుర్తుంచుకునే ఏ పనిలోకైనా దిగు. ఆత్మవిచారణ లేకుండా దేంట్లోకి అనుమతించమాకు. దేంట్లోకీ దిగమాకు. ఇది అభ్యాసము చేయి. ఈ అభ్యాసము బలపడవలసిందే. (తరువాత)

(................ దేహము పుట్టుక ముందు... పంచభూతాత్మకముల చేతను... తగునా?) అదే నేను అని అందామా? అదే నేను అని అంటే ఏమైంది? నిద్రలో వుండడం లేదు. జననమరణాలకు లోనౌతోంది. కొద్దికాలమే వుంటోంది, కొంతకాలం తరువాత

వుండడం లేదు. శాశ్వతంగా లేదు. సర్వవ్యాపకముగా లేదు. పరిమితముగా వున్నది. మరి ఇదే నేను అని చెబుదామా? ఎట్లా అంటావు? అనడానికి వీలుకాదు కదా! నేను శాశ్వతుడను కదా! నేను సాక్షిని కదా! నేను ఆధారం కదా ! మరి నామీద ఆధారపడ్డది కదా దేహమనేది? అది శవం వలె వున్నది కదా! నేనుంటేనే కదా అది కదులుతోంది? మరి దేహం నేను అని బోధించవచ్చా? బోధించరాదు కదా! కాబట్టి మనం ఇతరులకు ఏమైనా చెప్పేటప్పుడు, దేహభ్రాంతితో చెబుతున్నామా? దేహభ్రాంతి లేకుండా చెబుతున్నామా చూసుకో! మామూలు మాటలైనా సరే! అప్పుడు ఏమైంది? జ్ఞానపద్ధతిగా బలపడతావు.

(కట్టె మొదలగువానిని పోలిన జడపదార్థము శరీరము, నేను అని స్ఫురించి వ్యవహించునా?)

ఆగండి, ఇక్కడ ఏమడుగుతున్నాడు సూటిగా? శరీరం జడపదార్థం, ఈ జడపదార్థం, ఇది నేను అనే తెలివి దానికి వుందా? లేదు కదా! ఎలా లేదు? నీ ఎదురుగుండా ఒక కట్టె వుంది. ఆ కట్టె నేను అంటోందా? అనేక జడపదార్థాలు వున్నాయి ఈ సృష్టిలో, అవి ఏమైనా నేను అంటున్నాయా? నేను అనే తెలివి దానికి వుందా? లేదు కదా! కాబట్టి మరి ఈ శరీరం కూడా జడపదార్థం కదా! మరి శరీరం నేను అనే అవకాశం దానికి వుందా? అసలు. లేదు కదా! నీవు కూడా మాట్లాడేప్పుడు ఏమంటున్నావు? నా శరీరం అంటున్నావు కదా ! కాబట్టి నేను వేరే, శరీరం వేరే కదా! శరీరానికి ఎప్పటికీ నేను అనే తెలివి రాదుకదా! మరి శరీరం నేను అని అంటావే? అది ఎప్పటికీ సాధ్యం కాదు కదా! ఇలా తెలుసుకో! (తరువాత)

(...... దేహము... దేహములేదను బోధయే...బోధయని,.... అహంకారమని....)

ఇట్లా ఎప్పుడైతే ఈ నేను శరీరాన్ని అనేదాన్ని కనుక నీవు ఆశ్రయించి ఏది చేసినా కూడా, అది అహంకారమై కూర్చుంటుంది. దీనిని నిరసిస్తే, అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయి.

(అవిద్యయని, మాయయని, ... పలువిధములుగా చెప్పబడుచున్నది)

ఎన్ని పేర్లు పెట్టనీ వేదాంతములో, నువ్వు జీవుడు అను, మలిన మాలిన్యమను, మలం అను, మలము అంటే ఆణవ మలము, మాయయేమలము, మాయిక మలము అని మూడు రకాల మలములన్నమాట. (పంచ మలాలు అంటే ఏమిటి?) అది వేరే! ఇది త్రివిధ

మలములు, ఇంకో రెండు add చేస్తే, అవి పంచమలములు. నీ బ్రహ్మవిద్యలో అన్నీ వుంటాయి అవన్నీ! మీకు ఇచ్చాం కదా! బ్రహ్మవిద్య అనే పుస్తకం, అందులో అన్నీ వుంటాయి. అలాగే తాపత్రయాలు అను, గుణ త్రయాలు అను, నువ్వు ఎన్నన్నా చెప్పుకో, అవన్నీ ఏమిటి? అహంకారం బాబు. దేహాభిమానం నాయనా! ఆ ఒక్కటే ఇన్ని అయ్యింది. ఏ పేరుతో చెప్పినా, ఆ దేహాభిమానమే. అది స్థూల దేహాభిమానం అను, సూక్ష్మదేహాభిమానం అను, కారణ దేహాభిమానం అను, మహాకారణ దేహాభిమానం అను. ఏదైనా దేహమే కదా! కాబట్టి దానికే అనేక పేర్లు. అనేక స్థితులు. కానీ అదంతా కలిపితే ఏమిటి? దేహాభిమానమే. అజ్ఞానమే. మాయ అన్నా అజ్ఞానమే. మిథ్య అన్నా అజ్ఞానమే. ఇన్ని రూపాలలో వుంది ఆ దేహాభిమానం. అర్థమైందా? అందుకనే ఏమంటున్నాడు? నువ్వు ఎటుచూసినా అదే కనబడుతోందిరా బాబు. చూచినప్పుడల్లా నువ్వు ఏం చెయ్యాలట ఇప్పుడు? కనబడుతున్న దేహాభిమానంలో, నువ్వు అది ఎట్లా కావో చూడు. అర్థమైందా?

నువ్వు అది కావు కదా! అది ఎట్లా కావు అనే దృష్టితో దానిని చూడడం నేర్చుకో. ఎలాగయ్యా? ఇది సాధ్యం? ఒక వ్యక్తి వచ్చాడండి. ఇవాళే మొదటిసారి చూస్తున్నావు. అతన్ని ఎలా చూశావు? ఇతనికి నాకు ఏమిటి సంబంధం? ఏ సంబంధమూ లేదు. అంటున్నావా? లేదా? అవునా కాదా? అలా చూడు. వీటిని కూడా. అలా చూడాలనే దృఢమైన నిర్ణయం వుండాలి నీకు. అప్పుడు ఏమి చేస్తావు? అలా చూస్తావు. అప్పుడు ఏమయ్యావు? పూర్వం గతానికి సంబంధించినటువంటి దేహాభిమానము, నేను దేహాత్మ స్వరూపుడను, శరీరమే నేను, ఆ అభిమానంతో చేసిన విధానము, ఆ జ్ఞాపకాలు అవేమీ నీమీద పనిచేయ జాలవు. ఎప్పటికప్పుడు కొత్తవాళ్ళే. (బాగున్నావా?) నువ్వు కొత్తవాడివి కాదు నాయనా సనాతనుడవు. ఎవరు వాడు? సాక్షి. ఆ ఆత్మ స్వరూపము. అది పాతది. అది ఎప్పుడూ కొత్తది కాదు. మరి కొత్తది ఏమిటి? దేహం ఎప్పుడూ కొత్తదే. పనిముట్టు ఎప్పుడూ కొత్తదే. ఈ పనిముట్టుతో పని అయిపోయింది విసిరి అవతల పారేశావు, కొత్త పనిముట్టు తెచ్చుకున్నావు. ఇంతే జనన మరణాలు అంటే. దేనికి భయపడతావు? పనిముట్టు పారేసినందుకు ఆనందిస్తావా? కొత్తపనిముట్టు తెచ్చుకున్నందుకు

ఆనందిస్తావా? ఇదీ కాదు, అదీ కాదు. (ఇది కొత్తది అని తెలిసినప్పుడు భ్రాంతి వుండదు కదా!) భ్రాంతి వుండదు కదా! ఆఁ... దీనికీ నాకు ఏమిటయ్యా సంబంధము. నాకేమీ సంబంధము లేదు దీనితోటి. ఈ పనిముట్టు తెచ్చుకున్నాను, ఒక పని నిమిత్తమై. ఆ జ్ఞానం నిమిత్తమై ఈ పనిముట్టును తెచ్చుకున్నాను. అజ్ఞానం పోగొట్టుకోవాలి. జ్ఞానం పొందాలి. ఆ పని నిమిత్తం ఈ పనిముట్టు తెచ్చాను. వాడాను, పారేశాను. ఎక్కడ పారేస్తే ఏమిటి? వల్లకాటిలో పారేస్తే ఏమిటి? నీళ్ళల్లో పారేస్తే ఏమిటి? అడవిలో పారేస్తే ఏమిటి?

అంటే ఏమిటి ఇట్లా చూడాలయ్యా! నువ్వు రోజువారీ జీవితంలో, జనన మరణాలకు సంబంధించినవి గానీ, జనన మరణాల మధ్యలో వున్న జీవితానికి సంబంధించినవి కానీ, ఇట్లా చూడడం అలవాటు చేసుకుని, నిరసించాలి వాటిని. అజ్ఞానాన్ని నిరసించాలి. ఆ లోకవాసన, శాస్త్ర వాసన, దేహవాసనని నిరసించాలి. మూడు గుణాలను నిరసించాలి. ఈ నిరసించే పద్ధతిలోకి నువ్వు రానంత వరకూ కూడా, నీవు ఆత్మ అనేటటువంటి స్థితిలో నిలబడలేవు. దేహాభిమానాన్ని నిరసించమని చెబుతున్నాడు అందుకోసమే. ఇప్పటి వరకూ ఏం చేశావు? దేహాభిమానాన్ని బాగా బలపరిచావు. అర్థమైందా అండీ! ఎందుకని? దానికి అదేగా బోధించావు. వాటికి పుట్టి, బుద్ధి ఎరిగినప్పటినుంచి మనం బోధించింది ఏమిటి చెప్పండి. ఎంతసేపు నాయనా! జాగ్రత్తగా వుండు. వాడికి ఏమీ పెట్టమాకు. అన్నీ నువ్వే శుభ్రంగా తిను. ఇదేగా మనం చెప్పేది చిన్నపిల్లలకి. మొదటి నుంచి. ఈ వస్తువు నీదేనా? ఈ పెన్సిల్ ఎవడిదిరా. నాదే. వాడు నాదే అనంగానే, మనం మహదానంద పడిపోతూ వుంటాము. ఈ చొక్క ఎవడిది? నాదే. ఇదేగా పిల్లలకి చిన్నప్పటినుంచి నేర్పించింది. ఎందుకని? బాగా మనం దాంట్లో బలపడి వున్నాము. వాడుకూడా బలపడితే మహదానందం. అంతా పరమాత్ముడు ఇచ్చిందే కదా! ఈ సృష్టి. అనే దివ్యత్వ భావనలో చూస్తే, నీదేది? నాదేది? వున్నదా ఇక్కడ? నువ్వు తెచ్చుకున్న పనిముట్టే నీది కాదు. అది ప్రకృతిలో భాగం. నీవు అంటావా? నీవు సాక్షివి. అది పరమాత్మలో భాగం. నువ్వే లేనివాడవు. ఈ ప్రకృతి అంతకంటే లేనిది. మరి ఆ లేనిదానిని పట్టుకుని, బలపడిపోయాను అంటావేమిటి? అర్థముందా ఏమైనా? కాబట్టి నీవు ఇలా విచారణ చేయడం నేర్చుకో! దేహాభిమానాన్ని నిరసించాలి. ఆ దృష్ట్యా

వున్నటువంటి లోకవాసనా, శాస్త్రవాసనా, దేహవాసనా నిరసించాలి. మూడుగుణాలని నిరసించాలి. మూడు అవస్థలని నిరసించాలి. ఇదంతా ఎందులో భాగం? అదంతా దేహాభిమానమేరా బాబు. ఇలా ఎప్పుడైతే నువ్వు నిజజీవితంలో జీవిస్తావో, అప్పుడు నీకు ఆత్మానుభవం సాధ్యం అవుతుంది. ఇవి నిరసించకుండా ఎప్పటికీ సాధ్యంకాదు. నిరసించినప్పుడు ప్రపంచం ఎవరూ ఒప్పుకోరు కదండీ!

నువ్వు పనిముట్టు ప్రపంచం కోసం తెచ్చుకున్నావా? జ్ఞానం కోసం తెచ్చుకున్నావా? ప్రపంచం కోసం తెచ్చుకోలేదుగా. వీళ్ళల్లో ఎవరు చెబితే తెచ్చుకున్నావు? ఈ పనిముట్టుని? పోనీ వీళ్ళల్లో ఎవరు చెబితే రేపొద్దిన వదిలేస్తావు? నీ జనన మరణాలకు వీళ్ళా కారణం? కాదు కదా!

మరి నెపం వాళ్ళ మీద పెడుతావెందుకు? తప్పించుకోజూస్తున్నావు. ఎవరినుంచి తప్పించుకుంటావు? నువ్వు జన్మజన్మలు ఎత్తినా నీ అజ్ఞానం నీవెంటే వస్తుంది. నువ్వు జన్మజన్మలు ఎత్తినా నీ జ్ఞానము నీవెంటే వస్తుంది. అది ఎక్కడికీ పోదు కదా! ఆ అజ్ఞానము పోయేది కాదు, ఈ జ్ఞానమూ పోయేది కాదు. సృష్టిలో వున్నటువంటి అందరిలో వుంది ఇది. ఎందుకు వుంది? దానిని తెలుసుకుని, ప్రయత్నం చేసి, "మారే దాంట్లో మారని దానిని గుర్తించాలి". అజ్ఞానావృతంగా కనబతున్నదాంట్లోనే జ్ఞానం వుంది. ఆ జ్ఞాన దృష్టితో చూడడం నీకు రావాలి అంటే, నువ్వు ఇట్లా వుండాలి కాబట్టి పరమాత్మ అట్లా ఏర్పాటు చేశాడు. అప్పుడు ఏమైంది? ఈ సృష్టి అంతా గురువు అయ్యింది. ఈ సృష్టి అంతా బోధించేదే. అది చక్కగా చెబుతోంది, దేహాభిమానాన్ని నిరసించమంటోంది. దుఃఖాన్ని వదిలెయ్యమంటోంది. ప్రపంచంలో ఎవడైనా మనదగ్గరకు వచ్చి, నువ్వు బాగా దుఃఖిస్తావా? అంటే మనం ఏం చెబుతాం? వీడెవడురా బాబు, నన్ను దుఃఖిస్తావా అని అడుగుతాడు ఏమిటి? అంటామా లేదా? ఈ సృష్టి ఎప్పుడైనా నిన్ను దుఃఖించమని కోరిందా? కోరలేదు కదా! మరి నువ్వు ఎందుకు దుఃఖిస్తున్నావు? ఈ సృష్టి ఏదో బోధించింది అంటావేమిటి? సృష్టి ఎప్పుడూ జ్ఞానాన్నే బోధిస్తున్నది. నీవు అజ్ఞాన దృష్టితో చూడడం చేత, ఈ సృష్టి అంతా అజ్ఞానంలా, మాయలాగా కనబడుతోంది. జ్ఞాన దృష్టితో చూస్తే, అంతా పరమాత్మయే. అసలు

మాయకు వునికి యేది? మిథ్యకు ఉనికి యేది? లేదు కదా అది. లేనివి కదా! మాయ అంటేనే అర్థం లేనిది అని. మిథ్య అంటే అర్థం లేనిది అని. మరి ఈ ప్రపంచం అంతా ఏమిటి? అంతా పరమాత్మే. నేను పరమాత్మను అయితే, ఈ సృష్టి పరమాత్మ కాదా? అది కూడా పరమాత్మే. ఇది సమిష్ట్యానుభవం. ఇది బ్రహ్మానుభవం. వ్యష్టిగా చూస్తే ఆత్మానుభవం. సమిష్టిగా చూస్తే బ్రహ్మానుభవం. ఈ రకంగా జీవన్ముక్తిని, విదేహముక్తిని పొందుతారు. అట్లా పొందాలి అంటే, క్రమం ఎలాగ? దేహాభిమానాన్ని నిరసించాలి. మూడుగుణాలని నిరసించాలి. మూడు వాసనలని నిరసించాలి. మూడు అవస్థలని నిరసించాలి. ఎంతటి కష్టమైనా సరే! ఆ కష్టం అంతా ఏమిటి? నీ అజ్ఞానాన్ని నువ్వు పోగొట్టుకుంటున్నావు, అంతకు మించి ఏమీ చేయటం లేదు. ఏం ప్రపంచాన్ని ఉద్ధరించే కార్యక్రమం ఏమీ చేయడం లేదు. నీవు స్తంభానికి కట్టివేయబడి వున్నావు. ఎవరు కట్టేశారు? నిన్నునువ్వే కట్టేసుకున్నావు. ఎవరు విముక్తి చేయాలి? నువ్వే చేసుకోవాలి. మరి గురువు పరమాత్మ ఏం చేస్తారు? నీకు ఆ శక్తి వచ్చేట్టుగా చేస్తారు. నువ్వు ఎట్లా విప్పుకుంటే, విప్పుకోగలవో మార్గదర్శనం చేస్తారు. నీకు ఆ సామర్థ్యం వచ్చేట్టు చేస్తారు. ఎలా నువ్వు మారితే, నిరసించుకోగలవో నీకు ఆ తెలివి వచ్చేట్టు చేస్తారు. అంతేగాని, తాను వచ్చి స్వయంగా నీ కట్లు విప్పే అవకాశం లేదు. ఎందుకని? అట్లా విప్పితే ఏం చేస్తావు? నాకు మళ్ళా బంధమే బాగుంది అని, మళ్ళా చుట్టేసుకుంటావు. నీవు స్వానుభవజ్ఞానంతో ముక్తిని పొందాలి కానీ, నిన్నేదో తీసుకెళ్ళి ఆ అటక మీద కూర్చోపెడితే ఎంతసేపు వుంటావు? కిందే బాగుంది అని ఢాం అని పడుతావు. కాబట్టి ఈ ప్రపంచంలో అనుభవజ్ఞానం వున్న ఎవ్వరూ కూడా అలా చెయ్యరు. నీకు ఆ సామర్థ్యం వచ్చేట్టు చేస్తాము. అందుకని ఏం చేయమంటున్నాడు? నేను ఎవడను అని విచారణ చేయి మొట్టమొదట. ఆ ప్రశ్నతో, ఆ నిర్ణయంతో మొదలుపెట్టు. అప్పుడు స్వరూపస్థితిని పొందగలుగుతావు. సాయిరాం.

ఆయా ఆలోచనలు కలిగినప్పుడు, ఆ ఆలోచన వెనుకాల వున్నటువంటి నేను అనే స్ఫురణని గుర్తించాలి. నేను అనే స్ఫురణను ఆశ్రయిస్తే, ఆలోచనలో వున్నటువంటి దేహాభిమానం తనకు తానుగా నశించిపోతుంది. అలాకాకుండా ఆలోచన వెంబడే కనుక మనం ఆచరణలోనికి దిగితే, అప్పుడు వాక్కు అయినా కూడా ఆచరణే. మాట్లాడడం కూడా ఆచరణే. ఆ మాట్లాడడం అనే దానికి ముందే విచారణ చేసి, నేను అనేటటువంటి స్ఫురణను ఆశ్రయించాలి. ఆ తెలివిని, ఆ ఎఱుకని, ఆ బుద్ధిని కనుక ఆశ్రయించినట్లయితే, ఆ ఆలోచనలో వున్నటువంటి దేహాభిమానం తనకు తానే నశించిపోతుంది. ఎట్లా అయితే హారతి కర్పూరం తనకు తాను నశించిపోతుందో, అట్లా అది కూడా నశించిపోతుంది. ఇది మార్గం. ఇది సాధన. ఇలా విచారణ చేయండి అని చెబుతున్నారు. (తరువాత)

(అహంకారము యొక్క మూలమును విచారించిన అచ్చట ఏవేవో వేర్వేరు భావములు ... నేనుకు ప్రత్యేక తలంపు తోచుట లేదే)

సందేహం అడిగాడు ఇప్పుడు. ఏమండీ! మీరు చెప్పారు. ఆలోచనలని గమనించమన్నారు. ఎన్ని ఆలోచనలని గమనించినా, ఆలోచనల వెంబడి ఆలోచనలే వస్తున్నాయి గానీ, నేను అనేటటువంటి తలంపుగానీ, స్ఫురణగానీ, నాకు తెలియడం లేదు. అవి వస్తున్నాయి, పోతూవున్నాయి ఆలోచనలు, పుడుతూ వున్నాయి, అసంఖ్యాకంగా అవుతున్నాయి, అనేకం అవుతున్నాయి. నేను ఆలోచనల నుంచి పనులు చేస్తున్నాను. పనులకు ఫలితాలు వస్తున్నాయి. కానీ వీటిని ఎంతసేపు చూసినా, 'నేను' అనే స్ఫురణ నాకు తెలియడం లేదు. ఇప్పుడు ఏం చేయమంటారు? అని అడిగాడు. మన సమస్య అదే కదా! (ఊం... సమాధానం ఏం చెప్పాడు?)

(...........తోచిననూ తోచకపోయిననూ ఇతర.... లనుగూర్చిన వాక్యములన్నియూ..హృదయము నందలి.... దేహోహం అన్న....నేను అను .... అహంకారము లేకుండటయే, ఇతర తలంపులు లేకుండుటకు కారణం అగును. మూలస్థానము నుండుట చేతనూ, ...)

(ఆగు ఆగు చాలా దూరం చదివేశావు.)

ఏం చేయమంటున్నాడు? ఆలోచనలన్నీ వస్తున్నాయి. ఈ ఆలోచనలన్నింటికీ మూలంలో ఏముంది? అహంకారం వుంది. ఆ అహంకారమనే వేరు వున్నంత వరకూ, ఈ ఆలోచనలు పుంఖాను పుంఖాలుగా ఇలా అనేకంగా వస్తూనే వుంటాయి. ఇవి రాకూడదు అంటే ఆ మూలంలో వున్నటువంటి వేరుని తెగ్గొట్టాలి. అహంకార నిరసన అనేది అభ్యాసం చెయ్యాలి. (అహంకారం అంటే?) అహంకారం అంటే దేహాభిమానము. శరీరమే నేను అనే భావనే అహంకారము. దానిని నిరసించే ప్రయత్నం చెయ్యాలి అంటే, మూడు గుణాలని నిరసించాలి, మూడు అవస్థలని నిరసించాలి, మూడు వాసలని నిరసించాలి, ప్రతి ఆలోచనలో తాపత్రయంకాని, ఈషణత్రయం కాని, వాసనాత్రయం గాని, అవస్థాత్రయం గాని ఇవేమీ లేకుండా వుండేటట్లు చూసుకోవాలి. ఆ ఆకర్షణ లేకుండా వుండేటట్లు చూసుకోవాలి. లోకవాసనచేత గాని, శాస్త్రవాసనచేత గాని, దేహవాసనచేత గాని, సత్వగుణం రజోగుణం తమోగుణం చేతగాని, మెలకువ కల నిద్ర మూడింటిచేత గాని, ధనేషణ, ధారేషణ, పుత్రేషణ అనే ఈషణత్రయంచేత గాని, వీటివల్ల ఆకర్షించబడకుండా నీ ఆలోచనలు వున్నయా లేవా? చూసుకోవాలి. ఆలోచన అట్లా లేదు. అప్పుడు ఆ ఆలోచనలో వున్నటువంటిది వీటికి సంబంధించినది ఏముందో గుర్తించి దానిని నిరసించాలి. అప్పుడు నిరసిస్తే ఏమైంది? అహంకారం అనే వేరు తెగిపోయిందట. వేరు తెగిపోయిన వృక్షం ఎట్లా అయితే తనకు తానే కూలిపోతుందో, అట్లా నీ అహంకారం కూలిపోతుంది, నీ దేహాభిమానం కూలిపోతుంది. అప్పుడు ఏది మిగిలివుందో, అదే నేను అనే స్ఫురణ. ఇది పోతే ఏది మిగిలివుంది? ఆ స్ఫురణ పేరు నేను. కాబట్టి ఈ ఆలోచన వెనుకాల వున్నటువంటి నేను అనే స్ఫురణను గమనించవయ్యా అంటే, ఆలోచనలు వస్తూవున్నంతవరకూ నేను అనే స్ఫురణ తెలుస్తుందా? తెలియడం లేదు. ఆలోచనలు రావడం ఆగిపోతే, నేను అనే స్ఫురణ తెలిసింది. ఆలోచనలు రావడం ఆగిపోవాలి అంటే దానికి ఆధారం ఎక్కడుంది? అహంకారం అనే వేరులో వుంది. కాబట్టి నువ్వు ఏం చేయాలయ్యా? భావంలో ఆ దేహాభిమానాన్ని, అహంకారాన్ని నిరసించాలి. అంటే ఏం చెయ్యాలి? ఈ మూడు గుణాల ప్రభావాన్ని నిరసించాలి. మూడు అవస్థల ప్రభావాన్ని నిరసించాలి. ఈషణ త్రయాన్ని

నిరసించాలి. ఇట్లాగ చెబుతున్నాడు అన్నీ. ఇవి నీ ఆలోచనలో ఎట్లా వున్నాయో గమనించుకో! వాటిని నిరసించు. అప్పుడు అహంకార నిరసన జరిగి, వేరు తెగిన వృక్షం ఎట్లా అయితే కూలిపోతుందో అట్లా కూలిపోతుంది. అర్థమైందా! ఇది చేయవలసిన సాధన.

(ప్రతినిత్యం....తలంపులు...మనసు ఆ దారిన పోలేక...శాస్త్రస్వరూపమైన తనయందే నిలచి...తనయెదుట...జరగుచున్న... జరుగునది జరుగనిమ్ము అని సాక్షివలె ... అభ్యాసమే.. అనగా ...)

ఏమి జరుగునో జరుగనిమ్ము అని చూచు సాక్షి అను అభ్యాసమే చాలా ముఖ్యం. ఇందాక మీకు నేను చూపెట్టాను. సమయం అయ్యింది, దాటిపోతోంది, భోజనం పెట్టలేదు, రోజూ విధానం ఎట్లాగ? వారే భోజనం పెట్టి పిలుస్తారు. సమయమైంది భోజనం పెట్టాను రండి అని. మనం పిలిచి వెళ్ళి అడగడం కానీ, వగైరాలు లేవు. కాబట్టి ఏం జరుగుతుందో చూడడమే గాని మనం, ఇది చెయ్యి, అది చెయ్యి అని చెప్పడం లేదు. కాబట్టి ఏం చెయ్యాలి ఇప్పుడు? పెట్టే వరకూ వేచి చూడవలెయును. నువ్వు అడగందే నాకు ఎట్లా తెలుస్తుంది? అడిగితే ఏమౌతావు? సాక్షిత్వము పోతుంది, కాబట్టి ఏం చెయ్యాలి? ఏమి జరుగునో చూచెదము అని, గమనిస్తూ సాక్షిగా వుండుము. వుంటే ఏమైంది? వారిప్పుడు రెండు మూడు అంశాలు ప్రతిపాదించారు. ప్రతిపాదించినప్పుడు అందులోవున్న భావాన్ని స్వీకరిస్తే ఏమైంది? నీకు కూడా దేహాత్మభావన కలుగుతుంది. వ్యతిరేకతలు వస్తాయి. సమాధానం చెప్పాల్సివస్తుంది. అదే సాక్షిగా వుంటే ఏమైంది? ఏమీ సమాధానం చెప్పలేదు. దాని అంతట అదే సమసిపోయింది. ఎంతసేపు వుంటుంది. ఇప్పుడు ఎవరివి ఎవరి దగ్గర వున్నాయి? ఇప్పుడు వారివి వారి దగ్గరే వున్నాయి, నా సాక్షిత్వము నా దగ్గరే వుంది. స్వీకరిస్తే... అంతే కదా! కాబట్టి ఏమి చెయ్యాలట ఇప్పుడు? ఏమి జరుగునో చూతము అని ఉపేక్షించి సాక్షివలె వుండుము. ఏమీ జరగదు అనేదే తెలిసిపోతుంది. జీవితకాలం జననం నుంచి మరణం దాకా, ఇంకా అంతే. ఇదే దీనికి మందు. ఆ అహంకారాన్ని నిరసించాలి అంటే, అది ప్రతిదీ ఏదో ఒక రూపంలో, ఒక సంఘటన ద్వారానో, నీలోపల నుంచో, నీ బయట నుంచో, ఏదో ఒక రకంగా నిన్ను దేహాత్మభావనలోకి నెట్టాలని చూస్తూ వుంటుంది. అప్పుడు ఏం చెయ్యాలి?

నిరసించాలి దానిని. నిరసించాలి అంటే ఏమి చెయ్యాలి? ఏమి జరుగునో చూతము అని గమనిస్తూ వుండు మౌనంగా. అంతే. (మనం చెయ్యాలని వుంది కూడా చూస్తూ వుంటామా?) మౌనంగా వుండి చేయి. (మాట్లాడకుండానా?) మానసిక మౌనంతో చేయి. అనేకమంది అనేకం ప్రసంగిస్తూ వుంటారు. ఆ సమయంలో. ఎవరు ఏం మాట్లాడుకుంటే మనకు ఏం పని? సాక్షిత్వంలో వుండు. ఇంద్రియాలు ప్రవర్తిస్తాయి. అప్పుడేమీ స్వీకరించలేదుగా. అప్పుడేమయ్యింది? దేహాభిమానము ఏర్పడలేదు. అహంకారం వేరు తెగిపోయింది. అర్థమైందా? ఇలా ఆచరించాలి. అర్థమైందా అండీ! ఎప్పుడూ కూడా నీవు తప్ప మిగిలినది అంతా ప్రకృతే కదా! సాక్షిత్వములో వున్నప్పుడు నీ శరీరం కూడా ప్రకృతిలో భాగమే. అంతేనా కాదా? కాబట్టి ప్రకృతి ఎంతసేపు నిన్ను ఏం చేస్తుంది? తనవైపు లాక్కుపోవడానికి ప్రయత్నిస్తుంది. దానివల్ల నీకు దేహాభిమానము కలుగుతుంది. నువ్వు ఏం చెయ్యాలి? ప్రకృతి చేత ఆకర్షణ కలిగినప్పుడల్లా, దాన్ని నిరసించాలి. నిరసించాలి అంటే ఏం చేయాలి? ఉపేక్షించి ఊరుకుని వుండాలి. ఉపేక్షించి ఊరక వుండాలి అంటే ఏం చెయ్యాలి? ఏమి జరుగునో చూతము అని గమనిస్తూ వుండు. మాట్లాడమాకు. ఆలోచించమాకు. ఏం చేయమాకు. ఏమీ చేయకుండా, గమనిస్తూ వుండు. ఆ ప్రకృతి ఏం చేస్తుంది? గమనిస్తూ వున్నవాడిని ఏమీ చేయదు. ఆకర్షించబడేవాడిని లాక్కుంటుంది లోపలికి. అర్థమైందా అండీ! మంచినీళ్ళు కావాలా? అక్కర్లేదు. ఎండలోంచి వచ్చారు కదా! మంచినీళ్ళు తాగండి. అక్కర్లేదు. ఎండాకాలం కూడా తాగకపోతే ఎలాగ? మౌనమే సమాధానం. ఇలా నేను 10 సార్లు ఇస్తే, తీసుకోకపోతే నాకు ఇవ్వాలని అనిపించదు. మౌనమే సమాధానం. మీరు ఎందుకు తీసుకోరు? మౌనమే సమాధానం. ఎందుకని? శరీరం ప్రకృతి. ఇక్కడ ఎవరు అడిగారు అన్నది కాదు సమస్య. (అప్పుడిక ఏ ఆలోచనా వుండదా? మనసులో...) ఏమీ వుండదు. ఊరక వుంటుంది అంతే! (అది నెరవేర్చడమే కదా...) ఔనమ్మా! నువ్వు అభ్యాసము చేయి. ఇప్పుడు నీ ఎదురుగుండానే ఇప్పుడు చూస్తున్నావు కదా! ఇప్పుడు ఇదే చిన్న సంఘటన తీసుకో! ఈ చిన్న సంఘటనలో మామూలుగా అందరూ ఎలా స్పందిస్తారు? మంచినీళ్ళు తీసుకుంటావు, తాగేస్తావు. ఆ ఇచ్చినవాడి యెడల కృతజ్ఞతాభావంతో చూస్తావు. ఆప్యాయతతో చూస్తావు. అనురాగంతో చూస్తావు. నా సమస్యను పరిష్కరించారు కదా!

అని చూస్తావు. అంతేనా? దాన్ని ఎక్కడ తెగ్గొట్టాలట ఇప్పుడు? ఇది అంతా దేహాభిమానముతో కూడుకుని వున్నది. ఎక్కడ తెగ్గొట్టాలి? ఓహో! శరీరం దాహం. ఇది ప్రకృతి ధర్మం. నేను ఎవరిని? సాక్షిని. దాహాన్ని చూస్తూ వుంటే ఏమౌతుంది? కొంత సేపటికి? దాహం లేదు. నీళ్ళతో అవసరం లేదు. శరీరం అడిగింది మనం ఎందుకు ఇవ్వాలి? శరీరమే ప్రకృతి అయినప్పుడు శరీరం బయటిది? అది ప్రకృతే. అది ఇంకా మరింత దగ్గరగా వచ్చి, నన్ను ఆశ్రయించమని అడుగుతోంది. ఇప్పుడు ఏం చెయ్యాలి? ఏం చెబుతున్నాడు అక్కడ స్పష్టంగా సాధన? ఊరక వుండు. దాంట్లో చేరమాకు. గమనిస్తూ వుండు. సాక్షిగా వుండు. అహంకారం తగ్గిపోతుంది. నిరసించబడుతుంది. వుంటామా? మనం అలాగ? ఇట్లాగ... ఇలా అభ్యాసం చేయాలి, ఇది సాధన అంటే. అంతేగాని, ఎదో ముక్కు మూసుకుని ఏదో జపం చేశాను, ఓ పక్కన కూర్చున్నాను. ఆ సాధనలు అవి బాల్యం అన్నమాట. అక్షరాభ్యాస సాధనలు. అవన్నీ కూడా తాత్కాలికమైన సాధనలు. అవి అహంకారాన్ని మరింత పెంచుతాయి. ఈ సాధన చేయి. అప్పుడు ఏమైంది? ప్రతి రెప్పపాటు మేల్కొనే వుంటావు. ప్రతి రెప్పపాటు జాగ్రత్తగానే వుంటావు. శరీరం వదిలిపోయే వరకూ కూడా ఇదే స్థితిలోనే వుంటావు. అప్పుడు ఏమైంది? అహంకారం కూకటి వ్రేళ్ళతో తెగిపోయింది. దేహాభిమానం ఏర్పడలేదు. ఎందుకని? శరీరంతో సహా ప్రకృతే. నేను ఒక్కడినే పరమాత్మను. దాని పని ఏమిటి? దాని ధర్మం అది చేస్తూ వుంటుంది. నా దగ్గర అవి వున్నాయి, ఇవి వున్నాయి, అది చెయ్యి, ఇది చెయ్యి అంటుంది. అది అనుభవించు, ఇది అనుభవించు, అది విమర్శించు, ఇది విమర్శించు ఇలా చెబుతూ వుంటుంది. ప్రకృతి. నువ్వు ఏం చెయ్యాలి? అంతా ప్రకృతిగా గమనించి, ఊరక వుండు. ఉపేక్షించి వుండు. (దాహం వేస్తూనే వుందిగా?) ఇప్పుడు ఒకరు అడిగితే ఏమైంది? (మరొకటి మరొకరు...) అంతే! నిజంగా అంత అత్యవసరమే అయ్యిందండి. ఏమౌతుంది అప్పుడు? అత్యవసర స్థితి వరకూ వచ్చినప్పుడు నిన్ను అది బంధించదు. అర్థమైందా? నిమిత్తకర్మ అయిపోతుంది అప్పుడు. అలా కాకుండా మామూలుగా తీసుకుంటే ఏమైంది? ప్రత్యేక కర్మ అయ్యింది. ప్రత్యేకత ఎప్పుడైతే వస్తుందో అది బంధిస్తుంది కదా మరి నిన్ను. బంధిస్తుందా? బంధించదా? ఎప్పుడు వుండదు? ఇచ్చేవాడికి ఇచ్చేవాడుగా వుండకూడదు. పుచ్చుకునే వాడు పుచ్చుకునే వాడుగా

వుండకూడదు. (అందరూ అట్లా వుండరు కదా !) సాధ్యమే, అయ్యో! ఇచ్చిన వారు కూడా అట్లాంటి వారు అయ్యుంటే అప్పుడు ఏమౌతుంది? వెంటనే స్వీకరిస్తాము. అక్కడ సమస్య ఏమిటంటే, ఇచ్చేవాడు కూడా ఆ స్థితిలో వుంటే, వెంటనే స్వీకరిస్తాము. అర్థమైందా?

మీకు చాగంటి కోటేశ్వరరావు చెబుతున్నారుగా... రామాయణం చెబుతున్నాడు టీ.వీలో 9 గంటలకు. రామాయణం చెబుతూ అనేకం చెబుతూ వుంటారు ఇట్లాగ. ఎవరైనా దారేపోయే మహానుభావుడు జీవన్ముక్తుడు మీ ఇంటి ముందు ఆగి ఒక్కగ్లాసుడు మంచి నీళ్ళు అడిగి త్రాగాడంటే చాలు, నీ జీవితం ఉద్ధరించబడిపోతుంది అంటాడు. ఎందుకనిట? వాడు అడగడు. నిన్ను ఉద్ధరించడానికే అడుగుతాడు. అక్కడ విషయం అది. అర్థమైందా? అందుకని వాడు కదలనే కదలడు. కదిలాడా, దానిని ఆపడము అశక్యము. ఆ ఉద్ధరించడాన్ని ఆపడము ఎవరి వల్ల అవ్వదు. అందువల్ల సద్గురు కృప కలగడమే లేట్. సద్గురు కృప కలిగినాక అంతా అర క్షణమే. (ఎప్పుడు)

ఎప్పుడో చూస్తాడు, ఎట్లా చూస్తాడు అంటే, వీడు ఆత్మవిచారణతో కూడిన ఈ అశరీర పద్ధతికి సంబంధించిన సాధనలో వున్నాడా లేదా? అనే దాని చేత ఆకర్షించబడుతాడు. అర్థమైందా అండి! మామూలుగా ఆకర్షించబడడు. ఆయన మామూలు తెలివిలో వుండడు కదా! ఆ తెలివిని ఆకర్షించే ప్రజ్ఞ నీలో వుండాలి. ఆ సంబంధించిన జీవితం వుండాలి నీ దగ్గర. (ఇంకా మేము ఈ మూడు గుణాలు, మూడు అవస్థలు..... మాకు అటువంటి స్థితి) ఆఁ.. అందుకనే కదా! మరి. అందుకనే, ఏమీ, ఊరక ఉపేక్షించి వుంటారు అందుకే. ఏం మాట్లాడరు. ఏం చేయరు. ఏం తీసుకోరు. ఏం చెయ్యరు. ఎప్పుడంటే, నిన్ను గమనిస్తూ వుంటాడు అంతా, నిన్ను నీవు కూడా గమనించుకోలేవు. అంత దగ్గరగా గమనిస్తూ వుంటాడు నిన్ను. నీ ప్రజ్ఞని, నీ చైతన్యాన్ని, నీ వికాసాన్ని అంతా ఎంతో దగ్గరగా గమనిస్తూ వుంటాడు. గమనిస్తూ ఆ మార్పు వచ్చేస్థితి రాగానే, వెంటనే సంకల్పిస్తాడు. నువ్వు నిద్రపోతూ వుంటావు. కానీ ఆయన మేల్కొని వుంటాడు. నీ హృదయస్థానంలో వుంటాడు. ఎప్పుడూ నిన్ను గమనిస్తూ వుంటాడు పరమాత్మ. అందుకని పరమాత్మకు అంతటి విశిష్ఠత వచ్చింది. ఆ సాక్షికి అంతటి విశిష్ఠత ఎందుకు? నీ తెలివి నిద్రపోతూ వుంటుంది. తెలివికి తెలివైనటువంటి పరమాత్మ మేల్కొని వుంటాడు. కాబట్టి అతని లక్షణం ఏమిటి? గమనించటం. అతని లక్షణం ఏమిటి?

సాక్షిగా వుండటం. అతని లక్షణం ఏమిటి? ఉపేక్షించి వుండటం. అతని లక్షణం ఏమిటి? దేనికీ స్పందించక పోవడం. అతని లక్షణం ఏమిటి? ఊరక వుండటం. ఇది నీ హృదయంలో వున్న పరమాత్మ లక్షణాలు. అదే సాధనగా పెట్టుకోవయ్యా బాబు. ఆ లక్షణాలనే నిజజీవితంలో సాధనగా పెట్టుకో. అప్పుడు అహంకారం నిరసించబడుతుంది. నువ్వు సాక్షివి అని తెలుసుకుంటావు. ఆ పరమాత్మానుభవం కలుగుతుంది. నీ హృదయంలోనే వున్నాడు, పరమాత్మ రూపంలో వున్నాడు. ఈ లక్షణాలతో వున్నాడు. ఈ లక్షణాలని నిత్యజీవితంలో అమలు పరుచు. చెయ్యి. ఆచరణలో చెయ్యి ఈ లక్షణాలతో. ఏమౌతావు అప్పుడు? అదే అవుతావు నువ్వు. అప్పుడు నీ అంతరాత్మ పరమాత్మలో లీనమయ్యి వుంటుంది. ఆ పరమాత్మ స్థితి అనుభవిస్తూ వుంటుంది. ఈ లక్షణాలతో జీవించేటప్పుడు.

బయటకు రావాల్సిన అవసరం లేదుగా దానికి.

ఎందుకని?

ఉపేక్షించి వుంది కాబట్టి. ఊరకవుంది కాబట్టి.

నువ్వు బయటకు ఎందుకు వస్తున్నావు?

ఇంద్రియాల అనుభవం కోసం.

ఇంద్రియాల అనుభవం అవసరం లేదన్నవాడికి ఎటుపోయింది అంతరాత్మ?

పరమాత్మలోకి వెళ్ళిపోయింది.

ఇంతే తేడా! బయటకు వచ్చి ఇంద్రియాల ద్వారా పదార్థాన్ని అనుభవించాలి అంటావా?

దేహాభిమానము కలిగింది. అహంకారం కలిగింది.

ఇది నిరసించేశావు. అది ఇటుకాకపోతే అటు కలవాల్సిందే. అటుపోయి కలుస్తుంది. కాబట్టి నువ్వు ఏం చేయాలి? ఏం చేయాలని ఎంతమందిని కలిసి అడిగినా ఇదే. ఇదే ఆఖరి సాధన. ఏమిటి? ఆత్మవిచారణ చెయ్యి. ఊరకవుండు. ఎందుకని? నీలో హృదయంలో వున్న పరమాత్మస్థితి అదే కాబట్టి.

ఇప్పుడు ఆ నాలుగు వాక్యాలు మళ్ళా చదవండి. చాలా గొప్పవాక్యాలు అండీ అవి.

(మన ఎదుట ఏమేమి జరుగుచున్నవో, జరుగగలవో, జరుగనివ్వుము. సాక్షివలె విలక్షణముగా ఉపేక్షించు అభ్యాసమే ... అనగా దృశ్యములవూ ... విడుదల పొందుటే... ముందు చెప్పిన ప్రతి బంధములన్నిటికి మూలమైన దేహాత్మ బుద్ధి. రూప మనో నాశములకు ఉపాయమును, అహంకారమును, ఈ మార్గమునే భక్తి అనియు, ధ్యానమనియు, యోగమనియు, జ్ఞానమనియు చెప్పబడినది.)

ఈ మొత్తము ఆ ఊరక వుండడం, గమనించడానికే మూడు పేర్లు. ధ్యానమని, యోగమని, జ్ఞానమని. హాహా! చూశారా? దీనిని ఇప్పుడు ఎంతమంది, ఎన్ని వేల రకాలుగా చెబుతున్నారు? నువ్వు ఎన్ని లక్షల రకాలుగా దానిని బోధించినా, వాటి అన్నింటిలో చేసేది ఏమిటి? నీ హృదయంలో వున్న పరమాత్మ యొక్క లక్షణాలు ఏవైతే వున్నాయో, ఆ లక్షణాలని నిజజీవితంలో ఆచరించు నాయనా! ఆయనేం చేస్తున్నాడు? ఏం చేయడం లేదు. ఏం జరుగునో చూతమని ఊరక చూస్తూ వున్నాడు. గమనిస్తూ వున్నాడు. స్పందించకుండా వున్నాడు. కదలకుండా వున్నాడు. మార్పులేకుండా వున్నాడు. ఇది ఆయన లక్షణాలు. అదే లక్షణాలతో నువ్వు రోజువారీ జీవించు. ఆ రోజువారీ జీవిస్తే, నీవు చేసే సాధనలకు పేర్లు పెట్టవలసివస్తే వాటి పేర్లు ఏమిటి? మొదటి స్థితిలో ధ్యానం, అంటే మనసు పరిధిలో చేస్తే ధ్యానం. బుద్ధి పరిధిలో చేస్తే యోగం, దాని అవతల పరిధిలో చేస్తే, సాక్షి పరిధిలో చేస్తే జ్ఞానం. అర్థమైందా? ఆ ఊరక వుండడం అనేది, మనోపరిధి వరకూ వుండగలిగాము అనుకో అప్పుడు ధ్యానం, బుద్ధి పరిధిలో కూడా వుండగలిగాము అనుకో యోగం, సాక్షిగా వున్నావనుకో జ్ఞానం. ఆ స్థితి పేర్లే అవి. అంతే కాని అవి సాధనల పేర్లు కావు. ఆయా స్థితుల పేర్లు. దీనినే ధ్యానమనీ, యోగమని, జ్ఞానమని బోధించుచున్నారు. చేసే చేత ఇది. అర్థమైందా?

ధ్యానం అంటే కాళ్ళు చేతులు కట్టేసుకుని, కళ్ళు ముక్కు కట్టేసుకుని, ఒక మూలన కూర్చుని చేసేది కాదు ధ్యానం అంటే. అన్ని ఇంద్రియాలని ఉపయోగించేటప్పుడు నేను ఎవరిని? సాక్షిని. గమనించేవాడిని. అనంతమైనటువంటి విశ్వానికి ప్రకృతికి సాక్షిని. నేను పరమాత్మను. ఏమిజరుగునో... ఇప్పుడు ఇదంతా దృశ్యం కదా నాకు. ఈ

దృశ్యప్రపంచం అంతా కూడా, శరీరంతో సహా, ఇంద్రియాలతో సహా, ఇదంతా దృశ్యప్రపంచం సాక్షికి. ఏమి జరుగునో, జరుగనిమ్ము. అని చూచెదము. అంటున్నాడు చూడండి. ఆ వాక్యం మళ్ళా చదవండి. చక్కగా.

(మన ఎదుటనే ఏఏ చిత్రములు జరుగుచున్నవో) మన ఎదుటనే ఏఏ చిత్రములు జరుగుచున్నవో, అంటే ఎదుటనే అంటే ఏమిటి? బయటకి కాదు, నీ ఇంద్రియాలలో జరిగేవి కూడా చిత్రములే. అవి కూడా దృశ్యములే. ఎక్కడికి సాక్షికి. సాక్షి స్థితి నుంచి చూస్తున్నప్పుడు, కన్నుతో పలానా దానిని చూడాలి అను మనసుకు కలిగిందండి. మనసుకు సాక్షివి కదా! అప్పుడు మనసులో ఏమిటి? దృశ్యరూపంగానేగా కదిలింది. చిత్రరూపంగానేగా కదిలింది. బుద్ధిలో పలానా మామిడిపండు తీయగా వుంటుంది అనే జ్ఞాపకం కలిగిందండి. అది ఏ రూపాన్ని ధరించింది వెంటనే? మామిడి పండు దృశ్యాన్ని ధరించిందిగా. కాబట్టి నీ ఇంద్రియాలలో కదిలే కదలికలు అన్నీ ఎలా కదులుతున్నాయి? చిత్రరూపంలోనే కదులుతున్నాయి. అర్థమైందా? ఈ చిత్రరూపంలో కదిలేవాటికి అన్నింటికీ, నీలోపల నీ బయిటా కూడా, ఏమి జరుగునో చూతము. (ఇప్పుడు చదువు)

(సాక్షివలె విలక్షణంగా చూచు అభ్యాసమే, అనగా దృశ్యముల మయముగాక, దృక్ రూపమును విడువక,.... అన్నిటికి, మూలమైన దేహాత్మబుద్ధి)

ఇంతకు ముందు చెబుతున్నావే, నాకు అది కుదరడం లేదు, ఇది కుదరడంలేదు, అవి అడ్డం వస్తున్నాయి, ఇవి అడ్డం వస్తున్నాయి అది ప్రతిబంధకము అంటే. నువ్వు చెయ్యాలనుకున్నదానికి అడ్డం వస్తుందని చెప్పడం ప్రతిబంధకము. అవన్నీ నివర్తించాలి అంటే ఏం చెయ్యాలి? ఇలా వుండు. అది అడ్డము వచ్చింది. నిన్ను ఎవడు వెళ్ళమన్నాడు దానికి అడ్డము? (అసలు ముందు ఈ దేహ భ్రాంతి పోతేనే గాని సాక్షిగా చూడలేము) కదా! దేహభ్రాంతి పోవాలి అంటే నువ్వు సాక్షిగా చూడాలి అంటున్నాడు. దేహభ్రాంతి పోయినాక సాక్షిగా చూడడం కాదు.

(పోకముందే చూడడానికి ఇదే పెద్ద ప్రతిబంధకము)

ఆ ప్రతిబంధకాలు పోవాలి అంటే, వాటిని ఎలా చూడలట నువ్వు? దృశ్యము వలె. గోడమీద చిత్రము వలె. ఒక గోడమీద పటము వుందండి. దానిని ఎలా చూస్తున్నావు? ఆ ప్రతిబంధకాన్ని అలా చూడు. ఆ పటము ఏమన్నా స్పందించిందా? ఏం స్పందించలేదు. ఏమన్నా మాట్లాడిందా? మాట్లాడలేదు. నువ్వు ఎలా వుండాలట? నువ్వు కూడా దాని వలెనే వుండు. ఆ ప్రతిబంధకాన్ని నిన్ను ఎవడు స్మరించమన్నాడు? ఆ ప్రతిబంధకాన్ని నిన్ను ఎవడు దాంట్లో చేరమన్నాడు? ఆ ప్రతిబంధకాన్ని దేహాత్మ భావంగా ఎవడు స్వీకరించమన్నాడు? ఊరక వుండవచ్చు కదా! చిత్రములు చూచెడివాడు, ఏమన్నా స్పందిస్తున్నాడా? ఏం స్పందించడం లేదు కదా! అలా నువ్వు కూడా స్పందించకుండా వుండు. ఉపేక్షించివుండు, ఊరకవుండు. అప్పుడేమైంది? ఆ ప్రతిబంధకానికి మూలమైనటువంటి అహంకారం అనే వేరు ఎక్కడుందో, నీకు తెలిసిపోయింది. ఇప్పుడు ఏం చేశావు? దాన్ని నిరసించావు. గురువాక్యంతో కాని, వేదాంత వాక్యాలతో కాని, దాని వ్యతిరేక వాక్యాలు వుంటాయి కదా! ఆ నిరసనభావంతో దానిని త్యజించావు. ఎక్కడ? భావంలో. ఎప్పుడైతే దానిని నిరసించగానే ఏమైపోయింది? ప్రతిబంధకం లేకుండా పోయింది. ఇదీ ప్రతిబంధకాన్ని తొలగించే విధానం. అంతేగాని ఎదురు వెళ్ళి డిష్యుం అంటే డిష్యుం అన్నావనుకో ఏమైంది? ప్రతిబంధకము పెరిగిందా? తగ్గిందా?

(ఇప్పటివరకూ ఊరికనే స్పందిస్తున్నది ఇట్లా) మనస్సు. (ఆ మాట అంటే ఊరుకున్నా మనస్సు స్పందిస్తుంది) కాబట్టి ఇప్పుడు మనస్సుకి సాక్షిగా వుండాలి. బయటికి సాక్షిగా వుంటున్నావు. నీ అంతరంగానికి నువ్వు సాక్షిగా వుండాలి. అంటే నీ అంతరంగంలో స్పందన కలుగుతోంది కదా! దానిని గమనించు. దానికి వేదాంత వాక్యం చెప్పు. ఋర్ర, బుద్ధి వుందా నీకేమైనా? ఎందుకు స్పందిస్తున్నావు? మళ్ళా దేహాత్మభావంలోకి ఎందుకు పోతున్నావు? అహంకారంలోకి ఎందుకుపోతున్నావు? నేను ఆత్మస్వరూపుడినై వుండగా మళ్ళా నువ్వు పాత పద్ధతిలో ఎందుకు స్పందిస్తున్నావు? అని మనసుకి బుద్ధి చెప్పావా? ఎప్పుడైనా? చెప్పాలన్నమాట. ఎప్పుడు చెప్తావు? గమనిస్తే చెప్తావు. ముందు గమనింపు వుండాలి. తరువాత ఆత్మ విచారణలో బలం వుండాలి. గురువు మీద

విశ్వాసము వుండాలి. ఈ మూడూ కలిస్తేనే గాని, నీ అంతరంగానికి చెప్పలేవు. అర్థమైందా? (తరువాత)

(హృదయము నందుగల అహం స్వరూపానుసంధానం .... భగవంతుడుండుట చేతను...సంకల్ప మాత్ర... తలంపు మాత్రమే బంధమని మొదల... తలంపు రూపమనస్సులతని యందే నిలిపి, ఎప్పుడూ అతనిని మరువక ... సాధనము. ఇదే... సిద్ధాంతము)

అదీ సంగతి. శ్రేష్ఠమైన సాధన ఏమిటయ్యా? అంటే, నేను అనే తలంపు, అహం వుంది కదా! అహం వృత్తి. అది ఆకార భావం ధరించకముందు దైవంగా వుంది. ఆకార భావం ధరించగానే జీవుడు అయ్యింది. కాబట్టి నీ అంతరంగ రూపంలోకి మారక ముందు, నీ జ్ఞాపకాల రూపంలోకి మారక ముందు, ఆలోచనల రూపంలోకి మారక ముందు, దానిని ఆశ్రయించి, గమనించి, ఆ స్థితిలో వుండే ప్రయత్నం చేస్తే, అది జీవితం మొత్తానికి ఉపయోగపడి, జ్ఞానానుభవాన్ని కలిగించి, నీకు ఉత్తమమైన సాధనగా పరిణమించి, సరైనటువంటి జ్ఞానానుభవాన్ని ఇస్తుంది. కాబట్టి ఇట్టి శ్రేష్ఠమైనటువంటి సాధనని చేయి. మిగిలినటువంటి సాధనలు ఏమిటి? అవి కూడా సాధనలే. కానీ, ఇట్లాంటి ఫలితాన్ని ఇవ్వవు.

(ప్రశ్న. విచారణము స్థూల దేహము నందుగల ఆత్మభావము మాత్రం ... సాక్షిత్వ సాధనమా...)

అంటే అర్థం ఏమిటి? ఈ ఆత్మవిచారణ చేశాము, కేవలము స్థూలంగా వున్నటువంటిదే పోతుందా? నాకు స్థూలం మీద ఆకర్షణా, భావన వుందండి, అది మాత్రమే పోతుందా? ఇంకేమన్నా ప్రయోజనం వుందా అని అడుగుతున్నారు.

(సూక్ష్మ, కారణ దేహమునందు గల ఆత్మభావము కూడా నిరసించ సాధ్యమా?....)

కేవలము స్థూల దేహము వరకే పరిమితమా ఈ ఆత్మవిచారణ? దీనిపై అవతల సూక్ష్మదేహం, కారణ దేహం కూడా వున్నాయి కదా! ఈ ఆత్మవిచారణ అక్కడ కూడా పనికి వస్తుందా? సందేహం అన్నమాట. (సమాధానం)

(స్థూలదేహమును బట్టియే ఇతర దేహములు జీవించి యుండుట ...) ఆగు సరిగ్గా చదువు. (స్థూల దేహమును బట్టియే...) ఆ..
ఈ స్థూల దేహాన్ని ఆశ్రయించే, ఆ సూక్ష్మ దేహము వుంది. ఆ సూక్ష్మదేహాన్ని ఆశ్రయించే కారణ దేహము వుంది. కాబట్టి అవి దేని వలన ఉనికిని కలిగి వున్నాయి? దీనిని (స్థూలదేహన్ని) బట్టే ఉనికిని కలిగివున్నాయి. కదా! కాబట్టి దీనికి పనికి వచ్చింది, వాటికి పనికిరాదా? ఇప్పుడు? పనికి వస్తుంది అని కదా! చెబుతున్నాడు. చూడండి. ఎట్లా చెబుతున్నాడో.

(నేను... పంచకోశరూప శరీర త్రయమయ్యి... స్థూల దేహమందుగల ఆత్మభావ నాశమే...ఇతర దేహములనందు ఆత్మభావ నాశము అగుట చేతను, విచారణ మూడు శరీరములలో గల ఆత్మభావమును పోగొట్టుటకు..కారణమగుచున్నది)

కాబట్టి ఆత్మవిచారణ అనేది మూడు దేహముల యొక్క ఉనికిని తెలుసుకోవడానికి, సాక్షిత్వాన్ని తెలుసుకోవడానికి, వాటని పోగొట్టడానికి ఉపయోగపడుతోంది. కాబట్టి ఇప్పుడు చేసేది, ఇక్కడి వరకే అనుకోమాకు. ఇది కలలో ఉపయోగపడుతుంది. గాఢనిద్రావస్థలోకూడా ఉపయోగపడుతుంది. (అయిపోయిందా అక్కడికి ఆ సమాధానం?)

ఓం ఓం ఓం
ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే

ఓం తత్ సత్

ఓం సహనాభవతు సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై తేజస్వి నావధీతమస్తు మావిద్వషావహై

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఓం ఓం ఓం

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఓం తత్ సత్

ఓం సహనావవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై

ఓం శాంతిఃశాంతిఃశాంతిః

బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగన సదృశం తత్వమస్యాది లక్ష్యం
ఏకం నిత్యం విమలమచలం సర్వధీ సాక్షిభూతం
భావాతీతం త్రిగుణ రహితం సద్గురుం తం నమామి.

ఓం నమో బ్రహ్మాదిభ్యో బ్రహ్మావిద్యా సాంప్రదాయ కర్తృభ్యో
వంశ ఋషిభ్యో మహద్భ్యో నమోగురుభ్యః

సర్వోపప్లవ రహిత ప్రజ్ఞానఘన ప్రత్యగర్థో
బ్రహ్మైవాహమస్మి అహం పదార్థ రహితః

అస్మాద్గురు సమారంభాం కృష్ణసాందీప మధ్యమాం
ఓంకార పీఠ పర్యంతం వందే గురు పరంపరాం.

సాయిరాం.

(అహంకారరూప మూలమును విచారించక ...)

అంతకుముందు ప్రశ్నలో ఏమన్నాడు? అంతకుముందు ప్రశ్నచదవండి. (నేను అనే విచారించుట ఎట్లా?) ఎట్లా?

ఇప్పుడు ఒక్కొక్క ప్రశ్నకి, ఒక్కొక్క ప్రశ్నకి అక్కడ వరుస వున్నదన్నమాట. క్రమం వున్నది. మొదట ఏం చెప్పాడు? ముక్తి ఎట్లాగ? అని అడిగాడు. దాని విషయం చెప్పాడు. తరువాత ఏం చేశారు? యథార్థ స్వరూపాన్ని తెలుసుకోవడం ఎట్లా ? అన్నారు. నాయనా! నువ్వు యథార్థ స్వరూపం తెలుసుకుంటే ముక్తి వస్తుంది. యథార్థస్వరూపం తెలుసుకోవడం ఎట్లా? సరే బాబూ! నువ్వు అన్ని పనులు చేస్తుంటావు కదా! ఆ చేసేటప్పుడు వచ్చేటప్పుడు పోయేటప్పుడు తిన్నాను, చేశాను అంటున్నావు కదా! దాని వెనుక 'నేను' అని వుంటుంది. ఆ 'నేను'ని పట్టుకో! ఆ 'నేను'ని పట్టుకుంటే, నీకు తెలుస్తుంది. ఆ 'నేను'ని పట్టుకోవడం ఎట్లా? అన్నారు. మూడవ ప్రశ్న ఏమిటి? 'నేను ఎవడను' అని ఎట్లా విచారించాలి? నాకు తెలియడం లేదు కదా! వచ్చితిని, పోతిని, తింటిని, చేసితిని అని తెలుస్తుంది కాని, నేను ఎవడనో తెలియడం లేదు కదా! ఎందుకు తెలియడం లేదు నాయనా! నీకు అంటే, నువ్వు పనిలో మునిగిపోతున్నావు. ఆలోచనలో... ఆలోచనకూడా పనే. అవి వచ్చినప్పుడు అందులో, వాటిల్లో మునిగిపోతున్నావు. మూడవదాంట్లో ఏం చెబుతున్నాడు అంటే, నాయనా! నీవు ఎంతో కాలంగా, దేహాభిమానంతో జీవించడం అలవాటు చేసుకున్నావు. ఈ శరీరంలోకి వచ్చావు. శరీరంలోకి ఎట్లా వచ్చావు? వస్త్రాన్ని ఎట్లా ధరించావో, అట్లా ఈ శరీరాన్ని ధరించావు. కానీ, లోకవాసన చేత, శాస్త్రవాసన చేత, దేహ వాసన చేత, మూడు గుణాల చేత, నీవు కప్పబడి, ఆ పంచకోశాల చేత కప్పబడి, నీవు దేహాభిమానాన్ని పొందావు. నీ దేహం ఎట్లా తయారైంది? వీటి ద్వారా తయారైంది. కాబట్టి వాటితో జీవించేటప్పుడు, అది నీ చేతిలో పనిముట్టు అనే జ్ఞానాన్ని మరచిపోయావు. ప్రతి ఆలోచన వెనుకాకూడా నేను అనే స్ఫురణ వుంటేనే, నేను అనే ఉనికి వుంటేనే, నీకు ఆలోచన వస్తోంది. లేకపోతే ఆలోచన వస్తుందా? శవానికి ఆలోచన వుందా? లేదు కదా! శరీరం జడపదార్థం కదా! దానికి ఆలోచన వుందా? లేదు కదా! మరి అట్టి జడపదార్థం వెనుక వున్న చైతన్యం నువ్వు కదా! ఆ నేను ఎవరు? చైతన్యస్ఫురణ. అదే అహం యొక్క స్ఫురణ. అయితే ఏమైంది? ఈ

అహానికి ఆకార భ్రాంతి వచ్చిచేరింది. చేరడం వల్ల ఏమయ్యావు? ఆ నేను అనే స్ఫురణని మరచిపోయావు. మరిచిపోయి, అహంకారం పద్ధతిలో కలుగుతున్నటువంటి, ఏ ఆలోచనలు వున్నాయో, ఏ పనులు వున్నాయో, అవి నువ్వు అనుకోవడం మొదలు పెట్టావు. అసలు నేను పోయి, మిథ్యానేను వచ్చేసింది అన్నమాట. అంటే లేని నేను వచ్చేసింది. ఎట్లాగ? నేను స్త్రీని, నేను ఫలానా వారి భార్యను, నేను ఫలానా వారికి అమ్మను, నేను ఫలానా వారికి అమ్మమ్మను... ఇవన్నీ ఏమిటి? మిథ్యా నేనులు. నీ మీద కల్పించబడ్డాయి. నీ మీద కల్పించబడ్డాయి. ఆయా సంఘటనల ఆధారంగా, ఆయా పరిస్థితుల ఆధారంగా, శరీర భావంతో కల్పించబడినటువంటివే కానీ, నీవు యథార్థంగా వున్నదానికి కల్పించడబడ్డాయా? యథార్థంగా వున్నదానికి కల్పించడానికి వీలుకాదు కదా!

ఎలాగంటే, ఆకాశంలో సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. ఈ భూమండలం మీదు వున్నటువంటి అనేక మంది, ఆ సూర్యుడిని ఉపయోగించుకుని, అనేక పనులు చేస్తున్నారు. ఏదైనా సూర్యుడికి చెందినాయా? చెందలేదు కదా! మరి సాక్షి స్వరూపము కదా! అట్లాగే, నీలో వున్న 'నేను'కూడా స్వరూప స్థితిలో, స్వప్రకాశ స్థితిలో, జ్ఞాన స్థితిలో సాక్షిగా వున్నది. కానీ, ఆ సాక్షి మరుపుకు వచ్చేసింది. ఎంతగా మరుపుకు వచ్చేసింది అంటే, ఇక అది తిరిగి గుర్తుకు రానంతగా మరుపుకు వచ్చేసింది. కారణం ఏమిటి? నీవు రోజువారీ అభ్యాసం చేసేటప్పుడు, ఏముండాలి నీకు? విచారణ వుండాలి, సాధనా వుండాలి. అంటే ఏమిటి? దానిని (సాక్షిని) గుర్తు తెచ్చుకునే సాధన వుండాలి. దానిని గుర్తు చేసే విచారణ కూడా వుండాలి. కానీ ఈ రెండూ వున్నాయా? మన దగ్గర ఇప్పుడు? రెండూ లేవు. రెండూ లేకపోవడం వల్ల ఏమైంది? శరీరమే వుంది. శరీర భావంతో జీవించడమే సత్యమైంది. కాబట్టి ఏం చేయాలట? ముందు సాక్షికి సంబంధించిన విచారణను అభ్యాసము చేయి. తరువాత ఏం చేయాలి? దానికి తగ్గ సాధన చేయి. అయితే విచారణ, సాధన ఏం చేయాలండీ? ఏం చేస్తే ఇది సాధ్యం అవుతుంది? అంటే, బాబూ! నువ్వు మొట్టమొదట ఏం చేయ్యాలి? అన్నీ వచ్చిపోతున్నాయి కదా! నీవు రోడ్డుమీద బాటసారులు అందరూ వచ్చిపోతున్నారు కదా! వాళ్ళ వివరము, వాళ్ళు ఎవరని ఎప్పుడైనా కనుక్కున్నావా? కనుక్కోలేదు కదా! మరి నీ మనస్సులో తొంగిచూసిన

ప్రతి ఆలోచనని ఎందుకు పట్టించుకుంటున్నావు? నువ్వు అది ఏం చేస్తున్నావు? ఆలోచన రాగానే దాని వెంబడే పోతుంటువి. నీవు ఏం చేయాలట ఇప్పుడు? ఓహో! బాటసారిగారు వచ్చారు. ఆలోచన కలగగానే నువ్వు ఏం చేయాలి? దానిని ఎట్లా చూడాలట? ఓహో! రోడ్డు మీద బాటసారిగారు వచ్చారండీ! ఇప్పుడు వీడు ఎవడో నాకు ఎందుకు? నేను ఎవరిని? సాక్షిని, నేను ఎవరిని? ఆత్మస్వరూపాన్ని. నీ ఆలోచనకంటే ముందున్న వాడను. ఆలోచన తరువాత వున్నవాడను కాదు నేను. నేను ఆలోచన కంటే ముందు వున్న వాడను. ఇప్పుడు ఈ ఆలోచనని గమనిస్తున్నాను. ఎవరు వచ్చారు ఇప్పుడు ఆలోచన గారు? ఓహో! బాటసారి గారు వచ్చారు. పోనీ. ఎంత సేపు వుంటారు? ఆలోచనలో బలం ఎంత సేపు వుంటుంది? నిన్ను అడుగుతుంది అది. అట్లా చూచినప్పుడు ఏమౌతుంది? నిన్ను అనుమతించమని అడుగుతుందండి. ఇప్పుడు నన్ను ఏం చేయమంటావు? నన్ను ఏం చేయమంటావు? అంటూ వుంటుందది. ఏమిటి నువ్వు చేసేది? ఊరుకో కాసేపు అట్లాగు. ఏం చేయమన్నాడట దానికి? దానికి ఉపమానం చెప్పాడు. చిత్రముల వలె చూడు. ఇవన్నీ చిత్రాలు కదా! ఆ చిత్రములని ఎట్లా చూస్తున్నావో, దానిని కూడా అట్లా చూడు. ఊరక వుండు. ఇది చేయలట. ఆ సాక్షి తెలియాలి, నేను తెలియాలి అని అంటే, నువ్వు.. నేను ఏంచెయ్యాలయ్యా? చిత్రాన్ని ఎట్లా చూస్తున్నావో, గోడమీద చిత్రాన్ని ఎట్లా చూస్తున్నావో, దృశ్యాన్ని ఎట్లా చూస్తున్నావో, ఆ దృశ్యంలోకి చేరమాకు. ఊరక వుండు. స్పందించమాకు. ఊరక వుండు. గమనిస్తూ వుండు. గమనిస్తూ వుండు. ఊరక వుండు. అవన్నీ ఎవరి లక్షణాలు? నీ హృదయంలో వున్న పరమాత్మ లక్షణాలు. ఆ లక్షణాలతోటి జీవించడం మొదలుపెట్టు. ఇప్పటి వరకూ శరీరంతో కూడిన లక్షణాలతోనే జీవిస్తున్నావు. ఇప్పుడు పరమాత్మ లక్షణాలనే నిత్యం స్మరిస్తూ, పరమాత్మ లక్షణాలు అంటే విష్ణుసహస్రనామం చదవడం కాదు, అర్థమైందీ? నీ హృదయంలో పరమాత్ముడు ఈ లక్షణాలతో వున్నాడు. ఎలా వున్నాడు? ఏం కదలకుండా వున్నాడు. శాశ్వతంగా వున్నాడు. ఎలా? స్పందించకుండా వున్నాడు. గమనిస్తూ వున్నాడు. ఊరక వున్నాడు. ఇవన్నీ పరమాత్మ లక్షణాలు. ఈ పరమాత్మ లక్షణాలు ఎక్కడ వున్నాయి? నీలోనే వున్నాయి. నీ హృదయస్థానంలోనే వున్నాయి. అక్కడ ఎవరున్నారు? నువ్వే వున్నావు. వేరేవాడు ఎవడూ లేడు. ఆ నేను అనే పరమాత్ముడు వున్నాడు. ఆ నేను అనే పరమాత్ముడు ఈ లక్షణాలతో

వున్నాడు కాబట్టే, ఈ శరీరం నిలబడి వుంది. ఇది తప్పుకుంటే, ఏదీ నీ శరీరానికి విలువ? అందరూ ఇంత గొప్పగా, నిన్ను రోజువారీ పొద్దున లేచింది మొదలు, నువ్వు ఇంద్రుడివి, నువ్వు చంద్రుడివి, నువ్వు లేకపోతే ఈ కుటుంబము లేదు, నువ్వు లేకపోతే అది లేదు, ఇది లేదు అన్నవాళ్ళు, ఈ నేను తప్పుకోగానే దీనిని ఏం చేశారు? (బయిట పారేశారు) ఎందుకని? దీనికి ఏం విలువ లేదు. దీనికి విలువ లేదు. విలువ ఎట్లా వచ్చింది? 'నేను' వల్ల వచ్చింది. అర్థమైందా అండీ? కాబట్టి దీంట్లో వున్నప్పుడు 'నేను'ను పట్టించుకోవయ్యా! అంటే ఏమిటి? సశరీరుడవై అశరీరిగా జీవించు. శరీరంలో వుండగానే, దీంట్లో వున్న అశరీరి ఒకడు వున్నాడు. శరీరంతో సంబంధం లేకుండా ఒకడు వున్నాడు ఇందులో. వాడిని ఆశ్రయించు, వాడిని గుర్తించు, ఆ లక్షణాలతో జీవించు. ఏమౌతావు అప్పుడు? శరీరంలో వుండి ముక్తుడవు అవుతావు. అంటే అర్థం ఏమిటి? జీవన్ముక్తుడవు అవుతావు. బ్రతికి వుండి కూడా, జీవుడు కాని వాడవు అవుతావు. బ్రతికి వుండేది ఏమిటి? శరీరం. నా ఆధారంతో శరీరం వస్తోంది. నా ఆధారంతోనే ఈ శరీరం కూడా పోతోంది. కాబట్టి పుడుతున్నది శరీరమే, పోతున్నది శరీరమే. ఇప్పుడు జాతా శౌచం, మృతా శౌచం శరీరానికా? నాకా? నాకేమి వున్నాయి? నేను ఎల్లప్పుడూ పతిత పావనుడను. ఎటువంటి పాపాత్ములనైనా కూడా పవిత్రీకరింప చేయగలిగే సామర్థ్యము వున్నటువంటి వాడను. నేను సాక్షిని. నాకు అపవిత్రత, పవిత్రత ఎక్కడ వుంటుంది? లేదు కదా! ఏ ద్వంద్వాలు లేవు కదా నాకు. అటువంటి వాడను నేను. కాబట్టి ఆ 'నేను' అనేటువంటి, హృదయస్థానంలో వున్నటువంటి పరమాత్మను ఆశ్రయించు. ఏమౌతావు అప్పుడు? నువ్వు ఆ పరమాత్మ లక్షణాలతో జీవిస్తే, పరమాత్మవే అవుతావు. శరీర లక్షణాలతో జీవించావు కాబట్టి ఏమయ్యావు? శరీరం అయ్యావు. కాబట్టి నీలో వున్న పరమాత్మ లక్షణాలను గుర్తించి, అట్టి పరమాత్మ లక్షణాలతో జీవించడం ప్రయత్నం చేయి. అని చెప్పారు. చెబితే ఈయన ఏమంటాడు మళ్ళా? నాల్గవ ప్రశ్నలో?

(అహంకార రూప ... మూలమును విచారింపగా, అక్కడ ఏవేవో ... జరుగుతున్నది గానీ, ...) నువ్వు ఏం చెబుతున్నావు? ఆ 'నేను' అనే తలంపును పట్టుకోవయ్యా! అది పట్టుకుంటే, ఆ లక్షణాన్ని పట్టుకుంటే అంతా సమస్య పరిష్కారం అవుతుంది అంటున్నావు. కానీ, నేను లోపలికి తొంగి చూస్తే, బయటికి కాదు, లోపలికి తొంగి చూస్తే,

ఏం కనబడుతున్నాయట? ఎంత సేపూ అహంకారానికి సంబంధించినవే కనబడుతున్నాయి కానీ, ఈ నేను అనే తలంపు ఎక్కడా కనబడడం లేదయ్యా బాబు! ఏదో దాని సంగతులే ఇదంతా! చిలవలు, పలువలుగా, కథలు, కథలుగా, ఆ అహంకారానికి సంబంధించిన ఆలోచనలు కనపడుతున్నవే గానీ, నేను అనే తలంపు కనబడడం లేదయ్యా బాబు. (ప్రతీ ఆలోచనా అహంకారమేనా?) ఆ... అందులో, ఆ ఆలోచనలో వున్నటువంటి అహంకారాన్ని గుర్తించాలి నువ్వు ఇప్పుడు. గుర్తిస్తే తప్ప నిరసించలేవు. సమస్య ఏమిటంటే, ఇప్పుడు ఒక ఆలోచన వచ్చిందండి. దాంట్లో అహంకారం ఎట్లా వుందో ముందు గుర్తించాలి. గుర్తించి అహంకారాన్ని నిరసించాలి. నిరసిస్తే కానీ, దాని వెనకున్న 'నేను' కనపడదు. ఎందుకనిట? ఈ ముందు దట్టమైనటువంటి అడ్డుగోడగా ఇది వుందండి. దీనిని నిరసిస్తే కానీ, దీని వెనుక వున్నది కనపడదు. అర్థమైందా అండీ?

గర్భగుడి తలుపులు మూసేసి వున్నాయండీ! దైవం ఎట్లా కనపడుతుంది? తలుపులు తెరిస్తే కదా! ఆ మందిరంలో తలుపు, అందుకే, గర్భగుడి ఎందుకు పెట్టారంటే, ఇదే విషయం. ఆ లోపలికి తొంగి చూస్తే, ఏం కనబడుతున్నాయట ఇప్పుడు? అంతా అహంకారానికి సంబంధించినవే కనబడుతున్నాయట. ఎందుకని? అట్లాగే వున్నాయి కాబట్టి అవి. ఇప్పటివరకూ అభ్యాసం ఎలా చేశావు? అలాగే చేశావు. ఆ మనసుని ఏ దారిలో పెట్టావు? అహంకారం అనే దారిలోనే పెట్టావు. బుద్ధిని ఏ దారిలో పెట్టావు? దానిని అహంకారం అనే దారిలోనే పెట్టావు. పెట్టి ప్రాణాన్ని కూడా దేనివైపు ఉపయోగించావు? అటే శరీరం పద్ధతిలోనే ఉపయోగించావు. మరి వచ్చిన పనిముట్లు అన్నింటినీ అహంకార పద్ధతిగా వుపయోగించి, ఇప్పుడు అర్జెంటుగా నేనును చూడాలంటే, అంటే ఏం చెయ్యాలంట? తీసి పారేయడానికి వీలౌతుందా? అట్లా కుదరదు. దానిని ఏం చేయాలట? గమనించు. మొట్టమొదట ఏం గమనించాలట? చెబుతున్నాడు సమాధానం. ఎట్లా దానిని తెలుసుకోవాలి. ఈ అహంకారపు ఆలోచనల వెనుక వున్న 'నేను'ను తెలుసుకోవడం ఎట్లా? అదే ప్రశ్న. (అదే తలంపు రావడం లేదే అని..) అంటే కనబడడం లేదుగా. నీవు ఎంత లోపలికి తిరిగి చూసినా, నీ అహంకార సదృశమైనటువంటివే వున్నాయి గానీ, 'నేను' తలంపు అక్కడ కనబడడం లేదు. ఎట్లా చేయాలి మరి? అంటున్నాడు. సమాధానం చూడండి భగవానులు ఏం చెబుతున్నారో.

(కర్త ... పాత్రలన్నియూ ప్రథమావిభక్తిని ఆశ్రయించియే... అన్నియూ దేహరూపమును... బుద్ధి రూప నేను అను మొదటి వృత్తియు అగు, అహంకారమును ఆశ్రయించియే ... చేతను, అహంకారం లేకుండుటయే... ఇతర తలంపులన్నియూ లేకుండు నప్పుడు కారణముగను, మూల స్థానము గనూ, సంసారము అను మాయా వృక్షము యొక్క వేరు అగు, అహంకార .... ఇతర తలంపు లన్నియూ.... మూలము తెగిన వృక్షము వలె, ... పడిపోవును. తన నిష్టకు ప్రతిబంధకముగా ఎన్ని తలంపులు తోచిననూ మనస్సును ఆ దారిన పోనీయక, ఆత్మ స్వరూపమైన తన యందే నిలిపి తన యెదుట వేరే .... తెలుసుకున్నచో, జరుగగలవో, జరుగని చూతము అని సాక్షివలె విలక్షణముగా ... అభ్యాసము రూప మనో నాశములకు అను అహంకార నాశనము చేయు ఈ మార్గమునే భక్తి అనియు, ధ్యానమనియు, యోగమనియు, జ్ఞానమనియు అనేక పేర్లతోటి ....) ఆగు ఆగు పెద్దగా చదివేశావు.

చూడండి. ఏం చెబుతున్నాడో ఆయన, ఎంత చక్కగా చెబుతున్నాడో!

నాయనా! నువ్వు లోపలికి తొంగి చూస్తే, ప్రథమా విభక్తితోటి అంటే, నేను ప్రథమావిభక్తి. ద్వితీయా, తృతీయా నీవు కాక ఇంకా మిగిలినవి. అంటే అర్థం ఏమిటి? నా భార్య. నా భార్య అనంగానే ఏమైంది? రెండవ వాడు వచ్చేశాడు కదా! అర్థమైందా అండీ! ఇట్లాగ నేను అనే ప్రథమస్థానం నుంచే మిగిలినవి అన్నీ వున్నాయి. అసలు వుండడమే ఇలా వుంది. ఈ సత్యం నీవు జీవితం మొత్తం మీదా ప్రతీ ఆలోచనలోనూ వుంది. ప్రతి పాత్రలోనూ వుంది. ప్రతి సంబంధం లోనూ వుంది. ప్రతి వాక్కులోనూ వుంది. ప్రతి ఆలోచనలోనూ వున్నది. కాబట్టి ఏమిటి చేయాలట ఇప్పుడు? నువ్వు ఆలోచన చేయడాన్ని, పనులు చేయడాన్ని, మాట్లాడడాన్ని, (మాట్లాడడం కూడా పనే!) ఇప్పుడు ఎక్కడ పెట్టాలట దీనిని? అసలు. ఈ మాట్లాడడం ఆలోచన దగ్గర పెట్టాలట అసలు దీనిని మొట్టమొదట. పెట్టి ఏం చేయమంటున్నాడు? నువ్వు ఏం చేసినా ఇది పోదు నాయనా! ఒక్కటే చేయాలి. ఏమిటట? దానికి ఒక స్థానంలో వేరు, మూలంగా వేరు వుంది. ఆ వేరుని తెంచే ప్రయత్నం చేయాలి. నువ్వు ఏదన్నా చెయ్యి. నువ్వు ఇంతమటుకూ ఏం చేశావు? పైపైన చూసుకొచ్చావు. ఆకులు చూశావు, కొమ్మలు చూశావు, రెమ్మలు చూశావు, దాన్నేదో పళ్ళు చూశావు, పూలు చూశావు, దాన్ని కాసేపు ఈ ఫలం అన్నావు, కాసేపు ఆ

కొమ్మ అన్నావు. ఏదో చేస్తూ వచ్చావు గానీ, ఎక్కడ వేరు తొలగిస్తే, ఈ వృక్షం పడిపోతుందో, ఆ వేరుని పట్టుకో! పట్టుకోవాలంటే ఏం చెయ్యాలట? ముందు ప్రథమా విభక్తిని పట్టుకోవాలట. అంటే అర్థం ఏమిటి? ఏదైనా ఒక పనిని తీసుకోండి.

ఉదాహరణకు తీసుకుందాం. ఈ వెడ పిన్నిగారు అన్నాను అనుకోండి. ఎవరికి పిన్నిగారు? ఎవరికో ఒక శరీరానికి పిన్నిగారు. కూతురు అనుకోకూడదు, కూతురు అనుకుంటే మళ్ళా ఏమైంది అక్కడ? మళ్ళా అహంకారం వచ్చేసింది. ఇప్పుడు ఏం చెయ్యాలి? ఒక శరీరానికి ఈవెడ పిన్నిగారండి. అంతేకదా! ఈ పిన్నిగారు అనేది, శరీర గత సంబంధమా? నేనుతో వచ్చిన సంబంధమా? (శరీరానికే) శరీర గత సంబంధం. అంతే కదా! ఈ పిన్ని గారికి నేను డజను మామిడిపళ్ళు ఇస్తే బావుండు. ఆలోచనేగా. అంతేనా? ఈవెడ పిన్ని గారు కాకపోతే నేను ఇస్తానా? వ్యతిరేకం ఆలోచించాలండి. ఈవెడ పిన్నిగారు కాకపోతే నేను ఇస్తానా? అంటే శరీర గత సంబంధానికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడే నేను ఇది ఇద్దామని అనుకుంటున్నాను. ఇవ్వడానికి పిన్నిగారే కావాలా? ఇప్పుడు ఎట్లా రావాలి ఆలోచన? ఇవ్వడానికి పిన్ని గారే అయ్యుండాలా? అక్కర్లేదు. ఏ జీవి ఏ జీవికి అయినా ఇవ్వచ్చు. ఇచ్చే నీకు మనసు వుండాలే కానీ, పుచ్చుకునేవాడు ఎవడైనా పుచ్చుకోవచ్చు. ఇచ్చే నేను అని మళ్ళా నేను అనుకోవాలా? నేను ఎవరిని ఇవ్వడానికి? పరమాత్మ కదా సృజించింది! సృష్టి యందు పరమాత్మ సృజించింది, ఎవరిని ఆశ్రయించాలో, వారిని ఆశ్రయిస్తోంది కదా! మధ్యలో నేను ఎవరిని? కాబట్టి ఇవ్వడం సమంజసమా? ఇవ్వకపోవడం సమంజసమా? ఇవ్వడమే సమంజసము. పరమాత్మ పద్ధతిగా ఇవ్వడం అత్యంత సమంజసము. అప్పుడు ఏమైంది? ఇచ్చిన వాడూ లేడు. పుచ్చుకున్న పిన్నీ లేదు. అర్థమైందా? పరమాత్మ ఇచ్చాడు. పరమాత్మ పుచ్చుకున్నాడు. ఇద్దరికీ నష్టం లేదు. ఎవరికి అహంకారం ఏర్పడలేదు. అదే పిన్నిగారికే ఇచ్చానండి. ఏమైంది అప్పుడు? పుచ్చుకున్న వాడు ఏమైయ్యాడు? (జీవుడు అయిపోయాడు) అదీ సంగతి! అర్థమైందా!

ఇప్పుడు ఏమైంది? ఇట్లా అహంకారం యొక్క వేరుని నువ్వు మొట్టమొదట పట్టుకో! ప్రతి ఆలోచనలో ఈ వేరు వుంటుందండి. దీనికి వ్యతిరేకంగా ఆలోచించాలన్నమాట మనం ఇప్పుడు. ఇప్పటి వరకూ ఏం చేశావు? అనుకూలంగా

ఆలోచించావు. అనుకూలంగా ఆలోచించడం వల్ల ఏమైంది? అదే బలపడిపోయింది. ఇప్పుడు మీ ఇంటికి (పెళ్ళిచేసామండి) అల్లడు గారు వచ్చారండీ! అల్లుడు గారు వస్తే, who is అల్లుడు? అల్లుడు ఎవడవయ్యా? నువ్వు పో అవతలికి? బాహ్యంలో ప్రవర్తించడం కాదు, ముందు నువ్వు అంతరంలో ప్రశ్నించుకో? వచ్చిన వాడు ఎవడు? పరమాత్మ. మన పెద్దల సాంప్రదాయంలో ఏం చెప్పారు? ఇన్ని సంబంధాలు అక్కడ లేవు. ఎవడైనా సరే, నీ ఇంటికి వచ్చిన ప్రతివాడూ 'అతిథి దేవో భవ'. వచ్చిన వాళ్ళు అంతా అతిథులే. నాయనా! వాడికి ఇన్ని పేర్లు, ఇన్ని సంబంధాలు, ఇన్ని బాంధవ్యాలు లేవు అక్కడ. అర్థమైందా అండి? వాళ్ళు ఏం చెప్పారు అందుకని? నాలుగే బాంధవ్యాలు. ఈ సృష్టి మొత్తం మీద మానవులకు నాలుగే బాంధవ్యాలు. ఏమిటి? మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవో భవ. ఈ నాలుగే. నువ్వు జీవితం మొత్తం మీదా ఈ నాలుగు సంబంధాలను మాత్రమే పెట్టుకుంటే, నువ్వు దీనిని తెలుసుకోగలుగుతావు. ఈ అహంకారం వృక్షం యొక్క కూకటి వేళ్ళు తెలియాలి అంటే, ఇక్కడికి పరిమితం పెట్టుకోవాలి నువ్వు. ఇక్కడికి పరిమితం పెట్టుకుని ఈ నాలుగు సంబంధాలలోకే విచారణ చేసి, అహంకార సంబంధాన్ని లేకుండా చేస్తే, ఏమైంది అప్పుడు నీకు? 'నేను' అనే స్ఫురణ తెలుస్తుంది. ఇప్పుడు మనం ఈ నాల్గింటి వరకే వున్నామా? నాలుగు నాలుగు వేలు అయ్యింది. ఇదీ అని దాని లెక్కేముంది? అది ఎంత అవుతుందో, నలభై వేలు అవుతుందో కూడా మనకు తెలియదు. అందుకని, ఆత్మీయతాబంధం ఒక్కటే వుండాలి. నేను మీరు ఎవరండీ? మీరు ఆత్మీయులండీ! ఆత్మీయులు అంటే దానికి ఏమీ సంబంధం లేదుగా. ఎందుకని? ఆత్మసంబంధీకుడు. నా యొక్క 'నేను'ని స్ఫురణ చేసేవాడు. నాలో వున్న పరమాత్మను స్ఫురణకు తెచ్చేవాడు. ఏమయ్యాడు అప్పుడు వాడు? వాడు ఆత్మీయుడు. కాబట్టి ఆత్మీయుడు కంటే దగ్గరవాడు ఉన్నాడా? లేడు. అర్థమైందా అండీ! కాబట్టి ఎవడితో అయినా కూడా నీ గొప్ప సంబంధం ఏమిటి? దగ్గర సంబంధం ఏమిటి? ఆత్మీయుడే అత్యంత దగ్గర సంబంధం. చూడండి. పూర్వం పెద్దలు అనేవారండి, ఇప్పుడు ఎవరూ అనడం లేదండి. పూర్వం పెద్దలు చక్కగా వారు ఇదే మాట అనేవారు. వీరంతా మా ఆత్మీయులండి. అంటే ఏమిటి? వారికీ మాకు అరమరికలు లేవు. అందుకని నాకు అత్యంత దగ్గర వాడు. నేనే వాడు. అప్పుడు నాకు ఆత్మీయుడు. వాడికీ

నాకు భేదం లేదు. ఎందుకని? 'నేను'గా చూసినప్పుడు ఎక్కడుంది? అర్థమైందా అండీ? నేను నేనుగా చూశాను. వాడిని నేనుగా చూస్తున్నాను. నేను పరమాత్మను. వాడూ పరమాత్మే. నేను ఆత్మస్వరూపుడను, వాడూ ఆత్మస్వరూపుడే. అంటే దేహసంబంధంగా చూడడం లేదు నేను. దేహసంబంధంగా ప్రవర్తించడం లేదు. అప్పుడు కదా నీకు అసలు నిజమైన సంబంధం అంటే ఏమిటో తెలిసేది? అప్పుడు కదా ఎవరూ ఎవరికీ ఏం చెప్పాల్సిన అవసరం లేదు. వాడు చూస్తేనే నువ్వు అవగాహన చేసుకోగలవు ఏం చెయ్యాలో? నిన్ను చూస్తేనే వాడు అవగాహన చేసుకోగలడు ఏం చెయ్యాలో! ఇప్పుడు భార్యా భర్తలు ఆత్మీయులా? లేకపోతే? శరీర సంబంధీకులా? (ఆత్మీయులు) వుండాలి. కానీ ఎలా వున్నారు? దేహసంబంధీకులుగా వున్నాము. ఏమైంది అందువల్ల? చెబితే అర్థం కాదు. చెప్పకపోయినా అసలు అర్థం కాదు. అర్థమైందా అండీ! ఇప్పుడు ఏమయ్యారు? అందువల్ల ఒక దగ్గర వుంటున్నారే తప్ప ప్రయోజన శూన్యం. ఎందుకని? ఒకరి సమస్యను ఒకరు అర్థం చేసుకోరు. అర్థం చేసుకోవాలి అంటే ఏముండాలి? ఇదిగో అహంకార నిరసనతో కూడినటువంటి ఆత్మీయతా బంధం వుండాలి. ఆత్మీయతా బంధం అనేది బంధమా ఇప్పుడు? అది బంధము కాదు. ఎందువల్ల? అది పెద్దముల్లు. మిగిలిన వంటినన్నింటినీ తొలగించేటటువంటి పెద్ద ముల్లు. చిక్కుపడిపోయింది నీ వస్త్రం వెళ్ళి ముల్ల మీద పడిందండి. ఆ ముల్లు అన్నీ ఈ వస్త్రంలో చేరినాయి. ఇప్పుడు ఆ చిన్న చిన్న ముల్లు అన్నీ తీసేయాలి. తీసేయాలంటే ఏం చేయాలి? ఒక పెద్ద ముల్లు కావాలి. తరువాత ఈ పెద్ద ముల్లును కూడా పారేస్తాము. దాన్ని ఉపయోగించుకుని. కాబట్టి నేను ఆత్మస్వరూపుడు అనే భావనతో నీవు గనుక, అన్ని అహంకార మూలాలని కనుక విచారణ చేసినట్లయితే, నీలో కలుగుతున్న ఆలోచనలన్నింటినీ, అవి దృశ్యరూపమని, చిత్రరూపమని, ఆ దృశ్యములు, చిత్రములు నేను కాదని, వాటిలో చేరకుండా, ఆ దారిన పోకుండా, ఆ దృశ్యంలో పోకుండా, ఆ చిత్రాన్ని ఎట్లా చూస్తున్నావో, గోడమీద చిత్రం వుందండి, ఎట్లా చూస్తున్నావు? ఏమన్నా చేరిపోతున్నావా? అందులోకి? ఆ చిత్రంలో పెద్ద తుఫాను వచ్చినట్లు ఒక చిత్రం గీసారండీ! ఆ తుఫానులో నువ్వు కొట్టుకు పోతున్నట్లు భావన చేశావా? చేయలేదుగా. ఆ చిత్రాన్నే ఎట్లా చూస్తున్నావు? విడిగా వుండడం లేదా? సాక్షిగా చూడడం లేదా? అలాగ నీ ఆలోచనలని చూడవయ్యా!

(ఆత్మస్వరూపుడిని అనే స్థితిలోనుంచి చూచి...) గమనించు. ఊరక వుండు. సాక్షివలె చూస్తూ వుంటే, ఈ ఒక్క సాధనే చేయాలట, ఇంకెన్ని చేసినా, సాధ్యం కాదు. అందుకే ఇంతమంది ఇన్ని రకాలుగా చెబుతున్నారు కదండీ! మరీ! ఏం చేయమంటారండీ? అన్నీ ఇదేనయ్యా బాబు. ఇదే భక్తి. ఇదే ధ్యానం. ఇదే యోగం. ఇదే జ్ఞానం. ఈ పని చేయకపోతే, నువ్వు ఎన్ని చేసినా ఆపేరు మీద, అది సాధ్యమేనా? ఉదాహరణ చెబుతా చూడండి. ఇప్పుడు నేను భక్తిలో చాలా చేశానండి. ఎక్కడ చేశావు? ఆ అహంకారం అనే వృక్షం కొమ్మల మీద, ఇటూ అటూ ఊగిసలాడావు. ఒక సారి విష్ణు సహస్రనామం అన్నావు, ఒక సారి లలితా సహస్రనామం అన్నావు, ఒక సారి శివ సహస్రనామం అన్నావు. ఒకసారి సంధ్యావందనం అన్నావు, ఒక సారి ఇంకోటి అన్నావు, ఒకసారి ఇంకోటి.... ఇప్పుడు ఏంటట? ఆ కొమ్మల మీద ఎగురుతున్నావు, ఈ కొమ్మ ఆ కొమ్మ. అసలు ఆ అహంకార వృక్షానికి మూలం ఎక్కడుంది? ఆ మూలమైన వేరును తెంచే ప్రయత్నం చేస్తే, వృక్షం అదే కూలిపోయింది. కాబట్టి వృక్షాన్ని పైన కొట్టేస్తే ప్రయోజనం లేదు బాబు. ఆ మూలమైన వేరుని తెంచే సాధన చేయి. ఆ సాధనలోనే భక్తి, ధ్యానం, యోగం, జ్ఞానం అన్నీ అందులోనే వున్నాయి. ఎందుకని? అన్ని సాధనలకి అంత్యసాధన, చివరి సాధన ఏమిటయ్యా అంటే ఇదే. నువ్వు ఎన్ని అన్నా చేసిరా, అవన్నీ నవవిధ భక్తి మార్గాలలోవి. చివరిదైన ఆత్మ నివేదన చెయ్యాలి అంటే, నీకు అసలు అది తెలియాలి. ఆ నవవిధభక్తి మార్గాలలో ఆఖరిది ఏమిటి? ఆత్మనివేదన. అర్చనం, వందనం, విష్ణోః స్మరణం, పాద సేవనం అని వరుసగా చెప్పే తొమ్మిది మార్గాలలో, నవవిధ మార్గాలలో ఆఖరిది ఏమిటి? ఆత్మనివేదన. మరి ఆత్మస్వరూపం తెలిస్తే కదా! నివేదన చేసేది. నువ్వు రోజూ నైవేద్యం పెడుతున్నది నైవేద్యం కాదది. ఆత్మనివేదన అనే స్థితి కోసం పెడుతున్నావు అది. కానీ ఏమైపోయింది? పూర్ణం బూరెలు సత్యం, గారెలు సత్యం, పిండి వంటలు సత్యం అయిపోయింది నైవేద్యంలో. దానికోసం భగవంతుడు అక్కడ లేడు. వాటి వల్ల ప్రయోజనం లేదు. ఆ నివేదన అనేది చివరకు ఎందుకు పెట్టారు? అంతకు ముందు తొమ్మిది, నవవిధ భక్తి మార్గాలు చేస్తూ వచ్చావు, అర్చనం, వందనం, విష్ణోఃస్మరణం, పాదసేవనం అన్నీవరుసగా తీసుకొచ్చి చివరికి నివేదన పెట్టాడు. నివేదన అంటే ఏమిటి? అర్పించేశావు. ఇక తిరిగి రాదు. నిన్ను నువ్వు అర్పించేశావు. నేను అనే

ఆత్మ స్వరూపాన్ని పరమాత్మకు అర్పించేశావు. ఏమైంది అప్పుడు? ఆత్మనివేదన అయ్యింది. ఇలా పెట్టారు బాబు. దీనిని అర్థం చేసుకో! ప్రతీదాంట్లో పెట్టే విధానం అదే! కానీ ఆచరణలో ఏమైంది? ఈ అహంకార వృక్షాన్ని ఆశ్రయించడం చేత అంతా పోయింది. తూర్పు తిరిగే ఎందుకు చేయాలి? (రాత్రి కూడా చెప్పా అదే!) తూర్పున సూర్యుడనే సాక్షి వున్నాడు. సాక్షి స్మరణతో. ఆ సాక్షిని నేనని, ఆ సాక్షివలె వుంటానని, ఆయన ఎదురుగుండా కూర్చొని, ఆయన్ని ఆశ్రయించి ఆ స్థితిలో వుండి, నేను ఈ పని చేస్తున్నాను అని. అందుకు తూర్పు తిరిగి కూర్చొని చేయవయ్యా అన్నారు, ప్రతిదానికి కూడా. అసలు ఎందుకు తూర్పు అంటే వాడికి తెలియదు. చెప్పేవాడికి తెలియదు, చేసేవాడికి అంతకంటే తెలియదు. అదేంటి అంటే పెద్దలు చెప్పారు అంటాడు. కానీ పెద్దలు ఎందుకు చెబుతారు? నీ ఉన్నతి కోసమే చెప్తారు. నీ ఔన్నత్యం, నీలో వున్నటువంటి స్థితిని తెలుసుకోవడం కోసమే చెప్పారు. కానీ విచారణ చేయకపోవడం వల్ల ఏమైంది? బాహ్యమే సత్యమై, అహంకార వృక్షాన్ని ఆశ్రయించావు. దేనిని ఆశ్రయించాలి నువ్వు? ఆత్మని ఆశ్రయించాలి. నేనుని ఆశ్రయించాలి. కానిని దేనిని ఆశ్రయించావు? అహంకార వృక్షాన్ని ఆశ్రయించావు.

ఇదే బైబిల్ కూడా చెప్పేది. ఎవరు చెప్పినా ఇదే. నాయనా! యెహోవాని, ప్రభువుని ఆశ్రయించు. సాతానుని ఆశ్రయించమాకు. ఆ ఆపిల్ చెట్టును ఆశ్రయించమాకు. ఆ ఆపిల్ పండు తినమాకు. అది తింటే నీకు దేహ భ్రాంతి కలిగింది. అహంకారం కలిగింది. నువ్వు పాపాత్ముడివి అయినావు. చూడండి స్పష్టంగా బైబిల్ కూడా అదే చెప్తున్నది. వేరే ఏం లేదు.

ఇక్కడా అదే చెబుతున్నాడు. అహంకార వృక్షము దాని ఫలాన్ని స్వీకరించమాకు. దాని ఫలాన్ని స్వీకరిస్తే పాపాత్ముడివి అయినావు. ప్రభువుని ఆశ్రయించు. ఆత్మను ఆశ్రయించు. పరమాత్మను ఆశ్రయించు. అప్పుడు ఏమైంది? పుణ్యాత్ముడవు. కాబట్టి పాప, పుణ్యాలకు ఇప్పుడు అర్థమేమిటి? అహంకారాన్ని ఆశ్రయిస్తే అంతా పాపమే. దేహాభిమానమంతా పాపమే. పుణ్యం అంటే ఏమిటి? 'నేను'ని ఆశ్రయించడమే పుణ్యము. నీ యొక్క స్వరూపస్థితి. ఆ స్వరూప జ్ఞానము. స్వప్రకాశ జ్ఞానాన్ని పొందడమే పుణ్యము. ఇంతకు మించిన పుణ్యము ఏదీ లేదు నాయనా! ఎందుకని? అన్ని పుణ్యాల ఫలితమే

అది. ఆ భక్తి యోగం ధ్యానం జ్ఞానం నువ్వు ఎన్నైతే చెబుతున్నావో, ఆ పుణ్యాల ఫలితమనే సాధనంతా ఏమిటి? ఆ అహంకార వృక్షం కూలిపోవడమే. కానీ, ఇప్పటి వరకూ ఏం చేశావు? వీటిని కూడా పట్టుకుని పోయి అహంకార వృక్షాన్ని బలపరిచావు. ఏం చేస్తే ఆ అహంకార వృక్షం కూలిపోవాలో, ఆ సాధన తప్ప, ఏం చేస్తే ఇది బలపడుతుందో, అట్లా చేశావు. కాబట్టి ఇప్పుడు ఏం చేయమంటున్నాడు? తద్ వ్యతిరేకంగా ఆలోచించు. ఆ ఆలోచన వచ్చినప్పుడు, ఆలోచనకి వ్యతిరేకం, అందులో వున్న అహంకారాన్ని పట్టుకోవాలి నువ్వు. అర్థమైందా అండీ!

ఒకటి చెబుతాను విను. ఇప్పుడు వెళ్తావు. ఇంటికి వెళ్ళంగానే ఏం చేసి వచ్చావమ్మా? అంటారు అనుకోండి మీ కుటుంబ సభ్యులు. ఇప్పుడు నిన్ను వాళ్ళు దేనిని అన్నారు? (శరీరాన్ని) నిన్ను ఏ మన్నా అన్నారా? ఆత్మ స్వరూపంలో నువ్వు వాడు ఒక్కటే కదా!

ఆ స్వరూప స్థితి గురించి తెలుసుకుని వచ్చానండి. బాగా తెలిసింది స్వరూపస్థితి గురించి అన్నారనుకోండి. అప్పుడు మీకు సమాధానం ఏం చెబుతారు? అంటే అర్థం ఏమిటి? ఎలా సాధ్యం అవుతుందయ్యా ఇది అంటే, ఎప్పుడు సాధ్యమౌతుందటా? నీవు నిజజీవితంలో కూడా, మాటలు మాట్లాడేవి, ఈ వేదాంత వాక్యలతో మాట్లాడడం అలవాటు చేసుకో! ఇప్పటి వరకూ మాట్లాడావా? మాట్లాడ లేదు కదా! ఏమైంది అప్పుడు? ఎప్పుడైతే ఈ వేదాంత వాక్య స్ఫురణతో నువ్వు ఎప్పుడైతే మాట్లాడుతున్నావో, అప్పుడు నీకు return ఏం చెప్పాలి? మళ్ళా ఇప్పటి వరకూ ఏమిటి? ప్రశ్నకు ప్రశ్న కదా! నీవు ఒకటి చెబితే, వాళ్ళు రెండు అంటారు కదా! ఎప్పుడు అన్నారు? అహంకారం వృక్షాన్ని నువ్వు ఆశ్రయించి చెప్పినప్పుడు, ఒకటికి రెండు అయ్యింది అది. అదే ఇప్పుడు మరి నువ్వు ఎలా మాట్లాడాలట? వేదాంత వాక్యాలతో మాట్లాడు. ఇప్పుడు మాట్లాడమను. మాట్లాడితే ఏమౌతుంది ఇప్పుడు? నీకు దుఃఖం కలుగలేదు. అదే నీవు అహంకార వృక్షాన్ని కనుక ఆశ్రయించి మాట్లాడినప్పుడు, దుఃఖం కలిగింది. ఎప్పుడైతే నువ్వు వేదాంత వాక్యాన్ని ఆశ్రయించి, ఈ వేదాంత వాక్యాలనే సమాధానాలుగా చెప్పావో, అప్పుడు ఏమైంది? దుఃఖం వుండదు. అవును అన్నాడు, ఓహో! అజ్ఞానంతో అన్నాడు. మంచిదే! ఇప్పుడు మనకేమి పోయింది? నేను అట్లాగే అన్నానుగా నిన్నటి దాకా నేను ఇట్లా అన్నవాడినే

కదా! తెలిసినప్పుడు వాడు కూడా అనకుండా పోతాడు. అంతే కదా! కాబట్టి ఎప్పటికైనా ఈ అహంకార వృక్షం కూలిపోవలసిందే. ఎంతకాలం దీనిని కాపాడుతావు? ఎందుకని? ఈ శరీరం ఎందుకు తెచ్చుకున్నావు నువ్వు అసలు? ఈ అహంకార వృక్షం కూల్చడం కోసమే, ఈ శరీరం తెచ్చుకున్నావు. కానీ శరీరంలోకి రాగానే మర్చిపోయావు ఆ సంగతి. మరచి పోయి, అహంకార వృక్షాన్ని బాగా నారు పోసి, నీరు పోసి బాగా పెంచి పోషించావు. ఏమిటా నారు పోసి, నీరు పోసి? విషయాలు అనే నారు, నీరు. ఫలితాలు అనే నారు, నీరు. అపేక్ష. ఫలితం మీద అపేక్ష. అది నువ్వైపోవడం. అందుకనే ఏమంటున్నాడు అక్కడ? దృశ్యమయము కాకుండా. ఆ దృశ్యమయము. ఆ దృశ్యము నువ్వైపోతున్నావు. ఆ ఆలోచన కూడా దృశ్యమే. బుద్ధిలో వున్న జ్ఞాపకము కూడా దృశ్యమే. (అందులో లీనమైపోతున్నాము కదా!) ఆఁ... అది రాగానే, అది నువ్వైపోయావు. (అలా లీనమైపోయి, బాహ్యకూడా పట్టించుకోనంత స్థితిలోకి వెళ్ళిపోతున్నాము, నేను చెయ్యాలి, ఆ తలంపు లేకుండా చెయ్యాలి)

అందుకని చాలా స్పష్టంగా, ఎందుకని స్వరూపము తనయందే నిలపాలి అంటే ఇప్పుడు ఏం చేయాలట?

అందుకని చాలా స్పష్టంగా, ఎందుకని స్వరూపము తనయందే నిలపాలి అంటే ఇప్పుడు ఏం చేయాలట? ఇలాంటి వేదాంత వాక్యాలని స్ఫురణలో మననం చేయాలి. ఆఁ.. ఈ వేదాంత వాక్యాలని మననం చేయాలి. ఆ బోధించేటటువంటి స్థితిని మననం చేయాలి. చేస్తే ఏమైందట? అప్పుడు తద్ వ్యతిరేకం ఆ అహంకారానికి వ్యతిరేకం ఏమిటో బోధపడింది. ఆ నేను అంటే స్ఫురణ అంటే ఏమిటో, సాక్షి అంటే ఏమిటో బోధపడింది. ఈ సాధన తప్ప వేరే ఏ సాధన చేసినా, నీకు ఇది సాధ్యం కాదు. అని స్పష్టంగా చెబుతున్నారు, భగవాన్ రమణులు.

అసలు బంధం ఏమిటయ్యా? సంకల్పమే బంధము, నిస్సంకల్పమే ముక్తి. ఇది నాయనా దీనికి ఆధారము. వేదాంతంలో వున్నటు వంటి వాక్యం, ఆ వేదంలో

చెప్పినటువంటి శృతి వాక్యం ఏమిటంటే, సంకల్పమే బంధము, నిస్సంకల్పమే ముక్తి. మరి నీప్పుడు నిస్సంకల్పంగా వున్నావా? ఎప్పుడైనా అసలు. లేవుగా. అసలు నిరంతరాయంగా సంకల్పాలు, అది ఊరుకున్నా నువ్వు ఊరుకోవడం లేదు. నేను ఊరుకుంటే సంకల్పాలు పోతాయండి. ఎందుకనంటే, అన్నింటికీ మూలం అదే. ఆ నేను అనే చోటనుంచే, అన్ని సంకల్పాలు ప్రారంభం అవుతున్నాయి. ఈ నేను అనే చోటనే అన్ని సంకల్పాలు అణిగిపోతున్నాయి. అర్థమైందా అండీ! కాబట్టి మనసును ఆశ్రయించి గాని, ప్రాణాన్ని ఆశ్రయించి గాని, నీవు నీ హృదయ స్థానాన్ని గనుక చేరినట్లయితే, నీవు ఆ హృదయస్థానంలో వున్న నేనును తెలుసుకోగలుగుతావు. తెలుసుకుంటే ఉపయోగం ఏమిటి? అంటే ఇదే. సంకల్పమే బంధము, నిస్సంకల్పమే ముక్తి. అని తెలుస్తుంది. ఆ నేనును ఆశ్రయిస్తే ఇది తెలుస్తుందన్నమాట. ఎట్లాగో చెబుతున్నారు.

శృతులు మొర పెడుతున్నాయట! ఏమని? సంకల్పమే బంధము అని. తలంపే బంధము అని. వేరే ఇంకేమీ లేదు నాయనా! అసలు నీకు బంధము అంటూ ఒకటి వుందంటే, నువ్వు ఎన్నో పేర్లు చెబుతున్నావు, నన్ను నా కొడుకు ఇబ్బంది పెట్టాడండి, నా భార్య ఇబ్బంది పెట్టిందండి. భర్త ఇబ్బంది పెట్టాడండి. వాడు ఇబ్బంది పెట్టాడండి, పక్కవాడు పెట్టాడండి, కూరగాయల వాడు పెట్టాడండి... మనం రోజూ ఏకరువు పెట్టే దుఃఖాలలో ఎవడో ఒకడు వున్నాడు కదా! వీళ్ళందరూ ఎక్కడున్నారయ్యా? నీ తలంపులోనే కదా వుంది. కాబట్టి తలంపు బంధమని తెలుసుకో! తలంపును త్యజిస్తే, బంధమే లేదు. ఆ తలంపుకు మూలమైన అహంకారాన్ని త్యజించు. తలంపు అదే పోతుంది. ఇప్పుడు మనమేమి చేస్తున్నాము? తలంపులను ఆపే ప్రయత్నము చేస్తున్నాము. తలంపులను ఆపే ప్రయత్నం చేస్తే అది మరింత అయిపోతుంది. తలంపులను ఆపే ప్రయత్నం చేయకూడదు. ఆ తలంపులని, రోడ్డు మీద వెళ్తున్న బాటసారులను గమనించినట్లు గమనించు. నీ ఇంటిముందు రోడ్డు మీద వెళ్తున్నారు కదా! ఎంతమందిని ఆపి వారి వివరం కనుక్కున్నావు? ఎవ్వరినీ ఆపలేదు. వాడి పని మీద వాడు వస్తున్నాడు పోతున్నాడు. నీ తలంపులు కూడా అంతే! అలా గమనిస్తూ వుండు, చిత్రం వలె గమనిస్తూ వుండు, దృశ్యం వలె గమనిస్తూ వుండు. గమనించి దాంట్లో వున్న

అహంకారాన్ని పట్టుకో! ఆ మూలం ఎట్లా వుందో పట్టుకో! నీలో వున్నటువంటి అహంకారాన్ని ఆ తలంపు ఎలా పోషింప జేస్తుందో పట్టుకో! ఏమైంది? ప్రతి పనిలో, ప్రతి చేతలో, ప్రతి మాటలో, ప్రతి ఆలోచనలో కూడా నీ అహం ప్రతిపాద్యమే వున్నది అక్కడ. ఆ అహం ప్రతిపాద్యాన్ని నిరసించాలి. అది నిరసిస్తే తప్ప, నీకు 'నేను' అనే స్ఫురణ కలుగదు. 'నేను' అనే స్ఫురణ కలిగితేనే కానీ బంధము తొలగదు. ఆ 'నేను'అనే స్ఫురణను పట్టుకోవడం చాలా అవసరం. అందుకని అహంకార నిరసన చేయమంటున్నాడు. దానిని తొలగించాలంటే, తీసివేయడానికి పదార్థం కాదు అది. నువ్వు దాంట్లో ఏం చేయాలి? నేను 'రామ లక్ష్మి'ని కాదు. అని బలంగా వినపడాలి. ఇప్పటి వరకూ ఏం చేశావు? 'నేను రామ లక్ష్మీ'నే అంటూ చేశావు. 'నేను రామ లక్ష్మీ'నే అంటూ చేస్తే ఏమైంది? బలపడి పోలేదా? పూజలు చేసినా, జపాలు చేసినా, తపాలు చేసినా, నీవు ఎట్లా చేశావు? నీ శరీరాన్ని దృష్టిలో పెట్టుకునే చేశావు. అన్నీ ఇంట్లో చేసే అన్నీ. నిత్య నైమిత్తిక కార్యక్రమాలు అన్నీ కూడా ఆ నేను అనేది బలపడుతూనే చేశావు. ఆ నేను అనేది ఎట్లా బలపడుతూ చేశావు? అహంకార పద్ధతిగా బలపడుతూ చేశావు. కాబట్టి తద్ వ్యతిరేకంగా చేయి. చేస్తే గానీ నిరసించడానికి వీలుకాదు.

(నేను అను తలంపు, చూపు...... అతని యందే నిలిపి,)

ఇది. అన్ని ఉపనిషత్తులూ కలిసి, 108 ఉపనిషత్తులూ కలిసి చెబుతున్న ఆఖరి సాధన ఏమిటయ్యా? కడపటి సిద్ధాంతము. ఏమండీ! నేను అది విన్నానండీ, ఇది విన్నానండీ! త్రిపురా రహస్యము విన్నానండీ! లేకపోతే యోగవాశిష్టము విన్నానండి. లేకపోతే ఇంకోటి విన్నానండి. నీ ఇష్టం ఎన్నైనా ఏకరువు పెట్టు. రామాయణం విన్నానండీ, భాగవతం విన్నానండి, అది విన్నానండి, ఉపనిషత్తులు విన్నానండి, బృహదారణ్యకోపనిషత్తు విన్నానండి, కేనోపనిషత్తు విన్నానండి, కఠోపనిషత్తు విన్నానండి, నువ్వు ఎన్నన్నా చెప్పవయ్యా బాబు. అవన్నీ కలిసి ఆఖరి సిద్ధాంతము ఒక్కదానిని చెబుతున్నాయి. ఇవన్నీ కట్టకట్టి ఒక్కదాంటో పోస్తే, సారమంతా వడగడితే, నాయనా! ఇదంతా ఒకే ఒక సిద్ధాంతము. ఏమిటి? అహంకార నిరసన చేయమంటున్నాయి. తలంపే బంధమని తెలుసుకోమంటున్నాయి. నీకు తలంపు వచ్చినప్పుడల్లా, ఆలోచనే బంధము తో మొదలుపెట్టు. ఆ మననం అంటే అర్థం

ఏమిటంటేనండి, ఒక దగ్గర కూర్చొని చెవులో పెట్టుకుని వినడం కాదు. నువ్వు నిత్యజీవితంలో చేసేటప్పుడు, ఆ మాటలతో, ఆ వాక్యాలతో జీవించాలి. ఎవరైనా ఏదైనా అన్నారనుకోండి, వెంటనే 'తలంపే బంధము కదా!' అన్నారనుకోండి, ఏమైంది అప్పుడు? ఇంకేముంది? ఇక సమస్య లేదుగా. తలంపే బంధము కదా! అన్నారనుకోండి, ఎదుటి వాడు విని, అర్థం చేసుకుంటే, వాడికీ ఉపయోగమే. వాడు వినలేదు, అర్థం చేసుకోలేదు, నీకు వుపయోగమేగా! నీవైనా 'నేను' అనే స్ఫురణలో వుంటావుగా. అహంకార నిరసన జరిగిపోతుంది కదా! అది నీకు ఉపయోగమే కదా! నువ్వు ముందు జ్ఞానంలో వుండు. వాడి సంగతి తర్వాత చూద్దాము. నువ్వు బంధ విముక్తిడివికా. నీవు స్తంభానికి కట్టివేయబడి వుండి, వాడు నన్ను కొడుతున్నాడు అని అంటే? నిన్ను ఎవడు కట్టివేయబడమన్నాడు? నువ్వు స్వేచ్ఛను పొందితే వాడు కొట్టే అవకాశం వుందా? లేదు కదా! మరి ఏమంటావు ఎంతసేపూ కూడా? నన్ను వాడు వుండనివ్వడం లేదండీ! నన్ను అసలు పోనివ్వడం లేదండి. అర్థం వుందా? ఏమైనా? నువ్వు వేదాంత వాక్యాలను ఆశ్రయించు. వేదాంత వాక్యాలతో జీవించు. నిన్ను ఎవరు ఆపగలరో చూద్దాము. నీ శరీరాన్ని ఏదైనా చేయగలరు గాని, దాని లోపలదాన్ని ఏం చేస్తావు? ఎవ్వడూ ఏమీ చేయలేడు బాబు. ఎందుకని? ఏదైనా చెయ్యగలిగితే పోయేరోజున ఏం చేశారు? ఏం చేశాడేమిటి? ఆ పోయేదానిని ఎవడైనా పట్టుకోగలిగాడా? ఏమీ లేదు. వట్టిదే. ఈ సత్యం తెలుసుకో! వాడు నన్ను నియమించేశాడండీ! నన్ను కదలనివ్వడం లేదండీ! దేని కదలనివ్వడం లేదు? శరీరాన్ని. అర్థముందా? నువ్వు మనసుతో చేసేపనిని ఎవడు ఆపగలడు? అసాధ్యం. ఎవ్వడూ ఆపలేడు కదా! కాబట్టి పరమాత్మను ఎట్లా ఆశ్రయించాలి? శరీరంతో ఎట్లా ఆశ్రయిస్తావు? మనసుతో ఆశ్రయించు. నువ్వు ఆపు దీనిని చూద్దాము. ఆపలేవు కదా! ప్రహ్లాదుడిని హిరణ్యకశిపుడు శిక్షించ పూనుకున్నాడండి. దేనిని శిక్షించాడు? శరీరాన్ని శిక్షించాడు. ఏమి ఆపగలిగాడు? కాబట్టి నీవు నిరంతరాయంగా, నా చుట్టుపక్కల వున్న ప్రపంచం నిర్బంధించేస్తుందండి. ఈ ప్రపంచం అటు నన్ను తొయ్యనివ్వడం లేదండి. నాకు అడ్డంగా వుందండి. ఇదే కదా! మనం చెప్పే వన్నీ! దేనికి ఇవన్నీ? నీ శరీర సంబంధీకులు ఇదంతా కూడా. ఆత్మ సంబంధీకులు కావు ఇవి. (మనం కూడా దానిలోనే వున్నాం కదా!) ఆఁ.. నువ్వు ముందు

మారాలి. నువ్వు ఆత్మానుసార పద్ధతిలోకి మనసుని మారిస్తే తప్ప, ఇందాక ఏం చెబుతున్నాడు? దాని వెంబడి పోక... ఆ దేహ సంబంధీకమైన విధానంలో, ఆ సిద్ధాంతం వెంబడి మనసు పోతోంది, పోనివ్వక ఆ చిత్రాన్ని ఎట్లా గమనిస్తూ వున్నావో, ఆ బాటసారులను ఎట్లా గమనిస్తూ వున్నావో, దృశ్యాన్ని ఎట్లా గమనిస్తూ వున్నావో, అట్లా నీవు వుండు. అప్పుడే అది సాధ్యమౌతుంది.

(ఆకారము స్థూల శరీరము నందు మాత్రమే.......... అభిమానము.... సాధ్యమా)
ఈ విచారణ చేస్తే, కేవలము స్థూల దేహానికి సంబంధించినవి వున్న ఆత్మ విచారణే అవుతుందా? లేదంటే సూక్ష్మం, కారణం వగైరాలు ఇంకా వున్నాయి కదా! ఈ ఆత్మవిచారణ అక్కడ కూడా ఉపయోగపడుతుందా?

(సూక్ష్మ కారణ దేహాదుల యందలి ఆత్మ భావము కూడా.... నివర్తింప సాధ్యమా?)
అక్కడ కూడా ఇది ఉపయోగపడుతుందా? ఎందుకని? మనం ఒప్పుకుంటున్నాము కదా! స్థూలం ఎదురుగుండా వున్నటువంటి జడపదార్థమైన శరీరం. దీని లోపల పనిచేస్తున్న ప్రాణ మనో బుద్ధులు సూక్ష్మం. వేరే ఏమీ లేదు. ఆ ప్రాణ మనో బుద్ధులే సూక్ష్మం. దానికంటే అవతల వున్న స్థితి కారణం. ఆ నిద్రాస్థితే కారణం. ఆనందమయ కోశమే కారణం. మరి ఈ మూడు చోట్లా వుపయోగపడుతుందా ఈ ఆత్మ విచారణ? లేకపోతే వట్టి జడపదార్థమైన స్థూలదేహం వరకే ఉపయోగపడుతుందా? ఇది ఒక్కటే నివర్తింప జేస్తుందా? ఈ మందు వేసుకుంటే జ్వరం ఒక్కటే తగ్గుతుందా? ఇంకా మిగిలినవి కూడా ఏమన్నా తగ్గుతాయా? అని అడుగుతున్నావు కదా! అట్లాగే నాయనా! ఈ సాధనని ఇదే కడపటి సాధన అని అంటున్నావు కదా! మరి కడపటి సాధన చేస్తే మరి అన్నిటికీ ఉపయోగపడాలి కదా! దీన్ని మించిన మందు లేదండి అన్నాడండి డాక్టరు. దీన్ని మించిన మందు లేదండి అంటే అర్థం ఏమిటి? నువ్వు చెప్పిన అన్ని లక్షణాలకి మందు ఇదేరా బాబు. అంతేగాని లక్షణానికి ఒక మందు కాదు. కాబట్టి నువ్వు స్థూల దేహం వల్ల అహంకారం కలిగిందన్నా అదే మందు. సూక్ష్మ దేహం వల్ల కలిగిందన్నా ఇదే మందు. ఇదే

సాధన. కారణ దేహం వల్ల కలిగిందన్నా ఇదే సాధన. అట్లా ఇది వుపయోగపడుతుందా? అని అడుగుతున్నాడు.

(స్థూల దేహమును బట్టియే ఇతర దేహములు జీవించి యుండుట చేతను, దేహము నేను అనుటలో పంచకోశ రూప శరీరత్రయ మడగి వుండుట చేతను, స్థూలదేహము నందుగల ఆత్మభావ నాశమే, ఇతర దేహములయందుగల ఆత్మభావనాశమును, మూడు శరీరములయందు గల ఆత్మభావమునాశమును .... బోధించుచున్నది.)

ఈ స్థూల దేహాన్ని ఆశ్రయించే మిగిలిన రెండూ పనిచేస్తున్నాయి. అసలు ఈ స్థూల దేహం ఆ రెండింటి నుంచి ఏర్పడింది. ముందు ఏమి ఏర్పడింది? కారణ దేహం. దానినుంచి సూక్ష్మం. దానినుంచి స్థూలం ఏర్పడింది. స్థూలం ఏర్పడ్డాక ఆ రెండూ ఇందులో కూర్చున్నాయి. నువ్వు సరాసరి సూక్ష్మాన్ని, కారణాన్ని పట్టుకోవడానికి వీలౌతుందా? అది వీలు కాదు. ఈ స్థూల దేహం దగ్గరే మొదలు పెట్టి ఆ రెండింటిని పట్టుకోవాలి. మూడింటినీ నివర్తింపజేయాలి. కాబట్టి దీనిని ఆ రెండూ వున్నాయి. వాటిని ఆశ్రయించి ఇది వున్నది కాబట్టి ఈ వరుసలో మూడింటికీ ఉపయోగపడుతుంది. ఒక్కొక్క దానిని నిరసిస్తూ పోతే, స్థూల దేహం నేను కాదు, సూక్ష్మదేహం నేను కాదు, కారణ దేహం కూడా నేను కాదు, శరీర త్రయ సాక్షిని. ఆ శరీరత్రయ సాక్షిని నేను అనే దానితో మొదలుపెట్టు. ఏమంటున్నాడు? అయితేగానీ, నువ్వు సాక్షివైతే ఇవి వదిలిపెడుతాను అంటే, నువ్వు ఎప్పటికీ అవ్వవూ, ఇవి ఎప్పటికీ విడువవు. నువ్వు ఏం చెయ్యాలంట ఇప్పుడు? నేను ఎవరిని? శరీర త్రయ సాక్షిని. నువ్వు ఏదైనా ఒక అంశాన్ని ప్రతిపాదించావనుకో, అయితే స్థూలదేహంలోదో, లేకపోతే సూక్ష్మదేహం లోదో, లేకపోతే కారణదేహం లోదో అయ్యి వుంటుంది. నేను అవుతుందా? అవ్వదు. ఎందుకని? ఒక్కసారి విచారణ చేసుకో, ఏ సంఘటనైనా సరే, ఏ పనైనా సరే, ఏ ఆలోచనైనా సరే, అయితే స్థూల దేహానికి సంబంధించినది లేకపోతే ప్రాణ మనో బుద్ధులకు సంబంధించినది. లేదంటే ఆనందమయ కోశానికి సంబంధించినది. ఇంతకు మించి ఏదైనా కానిది వుందా? మరి అది నేను కాదు కదా! అని మొదలు పెట్టాలి.

ఈ స్థూల దేహమూ నేను కాదు, సూక్ష్మదేహము నేను కాదు, కారణ దేహము నేను కాదు. "నేను ఎవరిని? నేను ఆత్మస్వరూపుడను". అనే ఈ వేదాంత వాక్య విచారణతో, ఆ ఆలోచనని విమర్శించాలి. అప్పుడేమైంది? అందులో వున్న అహంకారం నిరసించబడింది. అలా చేయమంటున్నాడు. అలా చేస్తే అవి మూడిటికి ఉపయోగమే.

(స్థితి బేధములతో మనస్సు బుద్ధి చిత్తము అహంకారము అని పలు విధములుగా అనగా మనోనాశ్ అగుటయే ముక్తియనుట.....)

చాలా పై విషయము.

(......) అర్థమైందా అండీ! అదంతా. ముందు ముఖ్యంగా దేనిమీద ఆధారపడి వున్నాడు? రూపం. ఎందుకని? చిన్నప్పటి నుంచి నువ్వు బాగా పట్టుకుంది దేనిని? ఆ రూపాన్ని. రెండవది ఏమిటి? మనస్సు. ఈ రూపం మనస్సులోనుంచి వచ్చిందా? మనస్సు రూపం అయ్యిందా? రూపం మనస్సు అయ్యిందా? ఈ రెండిటిలో ఏది సత్యం? ముందు మనస్సు ఏర్పడ్డాకనే రూపం ఏర్పడింది. కానీ రూపం ఆధారంగా మనసుని గుర్తిస్తున్నాము మనము. అంతే కదా! బుద్ధి వచ్చినాక ఏం చేశాము? రూపం ద్వారా మనసుని గుర్తిస్తున్నాము. ఇప్పుడు ఏమంటున్నాడు? ఏమండీ ఇదంతా చెబుతున్నారు మీరు, ఇదంతా మనోనాశంతోనే సాధ్యమౌతుందా? ఆ మనోనాశం అయితే తప్ప, ఇదంతా సాధ్యం అయ్యేటట్లు కనబడటం లేదు కదా! సత్యమే! మరి అసలు మనోనాశం ఎట్లా అవుతుంది? అంతే కదా! ఏదో చెబుతున్నారు? ఆ మనస్సు అనేది నశించిపోతేనే గానీ, ఈ 'నేను'అనేది స్ఫురణకు గుర్తురాదని, అసలు మనోనాశం అంత అవసరమా? అది సాధ్యమయ్యేటట్లుగా కనబడడం లేదే నాకు ఎక్కడా కూడాను. మనసు నశిస్తుందా? ఏప్పటికైనా గాని? నశించదు గదా! ఇవన్నీ నా సందేహాలన్నమాట. దానికోసం ఏం చెబుతున్నాడు? అక్కడేమో రెండు పద్ధతులు వున్నాయి ఇప్పుడు ఇందులో. ఎప్పటికైనా ఈ మనసు లేకుండానే పోతుందనే సత్యము నీకు తెలియాలి. అది తెలిస్తేనే గాని, ఈ 'నేను' అనే దానిని ఆశ్రయించవు. నిద్రావస్థలో మనసు పనిచేస్తుందా? పనిచేయడం లేదు కదా! మరణకాలంలో మనసు పనిచేస్తుందా? పనిచేయడం లేదు కదా! మూర్ఛరోగంలో వున్నప్పుడు మనసు పనిచేస్తుందా? పని చేయడం లేదు కదా! అట్లాగే పిచ్చివాడికి మనసు పనిచేస్తుందా? పనిచేయడం లేదు.

"మరపు, మరణము, మూర్ఛ, సుషుప్తిలు సమములు" కదా! మరచిపోయావు. అప్పుడు మనసు పనిచేసిందా? పనిచేయలేదు. అర్థమైందా అండీ! కాబట్టి ఏం చెబుతున్నాడు? మరపు, మరణము, సుషుప్తి, మూర్ఛ ఈ నాలుగు సమములు. సమస్థితిలో వున్నాయి. అర్థమైందా అండీ! మరణం గురించి ఎందుకు భయపడుతావు? అది మరపు వంటిది. మరపు ఎటువంటిది? మరణము వంటిది. మరపు, మరణములు ఎటువంటివి? సుషుప్తి వంటివి. మరపు మరణము సుషుప్తిలు ఎటువంటివి? పిచ్చివాని వంటివి. ఉన్మత్తుడికి

ఏం తెలిసింది? ఏమీ తెలియలేదు. కాబట్టి నీవు నీ స్వస్థితి యందు ఉన్మత్తుడివికా. అర్థమైందా అండీ! నీవు ఏం చేయలట ఇప్పుడు? నీ స్వరూపజ్ఞానంలో, నీ ఆత్మజ్ఞానంలో, నీ యొక్క స్వరూప స్వప్రకాశ స్థితిలో, ఆ అనుభవంలో ఉన్మత్తుడివై వుండు, పిచ్చివానివలె వుండవయ్యా బాబు. ప్రపంచాన్ని దేహాభిమానాన్ని గుర్తించకుండా, నీ స్వరూపస్థితిలో ఉన్మత్తుడవై వుండు. ఇప్పుడు ఏమైందట అందులో వుంటే? ఏమన్నా ప్రమాదం వచ్చిందా? బాహ్యంలో ఎవరైనా, ఏమన్నా అన్నారండి. పిచ్చివాడిని ఎవరైనా, ఏమైనా అంటే వాడికేమైనా తెలిసిందా? తెలియలేదుగా. ఎందుకు తెలియలేదు? (వాడికి మనసు పనిచేయడం లేదు) మనసు లేదు కాబట్టి. నీవు కూడా అట్లా పరమాత్మస్థితియందు ఉన్మత్తుడవై వుండు. ఆత్మస్థితియందు ఉన్మత్తుడవై వుండు. 'నేను' అనే స్ఫురణలో ఉన్మత్తుడవై వుండవయ్యా! ఆ పిచ్చిపట్టినందువల్ల నష్టం లేదు. ఎందుకని? నీకు ప్రమాదం ఏముంది? నీకు అడ్డమైనవన్నీ ఆ ఒక్కదానితో తొలగిపోయినాయి. ఇప్పుడు మనం దేనిని ఒప్పుకోవడం లేదు? దీనిని ఒప్పుకోవడం లేదు. అమ్మో! పిచ్చి వచ్చేస్తుందేమోనండీ! ఏమిటది? రాదమ్మా! ఏం భయపడమాకు. ఎందుకని? వీటి అన్నిటి వెనుకాల వున్నది అదే! సర్వవ్యాపకమై, సర్వే సర్వత్రా వున్నది ఏది? ఆ పరమాత్మ స్థితియే! ఆ పరమాత్మ స్థితియే. దాని యొక్క స్ఫురణవల్ల ఏమైపోయింది? ఈ బాహ్యం అంతా నశించిపోయింది. ఈ రూప మనస్సులు బాహ్యమే కదా! నశించి పోయినాయి. లేకుండా పోయినాయి. నిజంగా లేకుండా పోయినాయా? వున్నా లేకుండా పోయినాయి. నిజంగానే లేకుండా పోయినా నాకు ఏమీ అవ్వలేదు. ఎందుకని? ఎప్పటికైనా పోయేవే కాబట్టి. 'ఇవి ఎప్పటికైనా పోయేవే' అనే సత్యం నాకు తెలిసిందండి, ఇప్పుడు దాని గురించి ఏమి చింతపడుతావు? అర్థమైందా! ఇప్పుడు ఎందుకు చింతపడుతున్నావు? అవి పోతాయేమో, అవి పోతాయేమో, అని నీ గోలంతా పుట్టింది మొదలు పోయేదాకా, ఈ రూపం ఎక్కడకి పోతుందో, ఆ మనసు ఎక్కడికి పోతుందో అనే గోలే కదా! పట్టుకుంటే ఆగినాయా? పోనీ చూపెట్టు. నీ కళ్ళముందే ఎంతో, ఎన్నో రూపాలు నశించిపోయినాయి. ఈ నశించిపోయిన రూపంతో పాటు, ఆ మనసు నశించిపోలేదా? పోయింది కదా! పోయిందిగా. పోతోందిగా అది. ఎందుకని? మరి అర్థమైందా ఏమైనా? ఇప్పుడైనా గానీ!

నాయనా! కడసారి చూపుకు తప్పనిసరిగా వెళ్ళాలి. ఎందుకు వెళ్ళాలి? పోతోందని తెలుసుకోవడానికి నాయనా! ఈ రూపం పోతోంది. ఆ మనసు పోతోంది. ఈ అహంకారంతో చేసిన జీవితమంతా పోతోంది. ఇది పోతోంది అని తెలుసుకోవడం కోసం, తప్పనిసరిగా వెళ్ళాలి నాయనా! అని నీకు పోను అంటూ తెలిస్తే వెళ్ళాలి నాయనా! ఏమిటి తెలిస్తే వెళ్ళాలి? రూపం పోతోంది అని నీకు అక్కడికి వెళితే తెలుస్తోంది. అశాశ్వతమని. ఆ అశాశ్వతం అనే సత్యం నీకు దృఢపడే అవకాశం వుంది అప్పుడు. మళ్ళా తిరిగి వచ్చినాక నీవు ఆ సత్యంతో జీవిస్తావు. ఆ బోధ, ఆ అవకాశం నీకు అప్పుడు ఆ క్షణంలో వుంది. అదేగాక అతడు తన జీవితసారమంతా కలిపి అప్పుడు నీకు చెబుతాడు, ఓమాట. అర్థమైందా అండీ! లేదూ.. కనీసం ఆ మరణం ఎట్లా ప్రాప్తిస్తోందో, కనీసం కళ్ళతో చూడవచ్చు. ఓహో! ఈ రూప మనస్సులు కూడా ఒక నాటికి ఇదే కదా! మరి ఇప్పుడు నేను దేనిని ఆశ్రయించాను? ఈ రూపమే కదా! అత్యంత అందమైనదని, దీనిని బాగా అలంకరించావు. ఏమండి? అవునాకాదా? చెవికి వంకీలు పెట్టకపోతే, చెవులు ఎక్కడ బోసిపోతాయో? మెడలో ఆభరణాలు లేకపోతే, దానికి ఎక్కడ ప్రమాదం వస్తుందో, మెడపైకి లేవకూడదు, ఎప్పుడూ క్రిందకు దించే వుండాలని బాగా ఒక కేజీ ఆభరణాలు వేశావు దానికి. ఇదే కదా మన పద్ధతి అంతా కూడా! అర్థముందా ఏమైనా? ఏమండీ? ఇవి (వీటిని) ఎంతసేపు ఆశ్రయిస్తావు? కాసేపు ఆగితే ఇది ఎక్కడుందో, దీనికే తెలియలేదే. కాసేపు ఆగితే దీనికి విలువలేదే. దీన్ని ఎంతో వున్నతంగా చూశాను అనుకుంటున్నావే, నెత్తిన మీద పెట్టుకుని చూసినవారంతా, కాసేపు ఆగాక దీనిని ఎక్కడ పెట్టారు? వుంచుకోమను? ఏమీ ఈ రూపానికి... బ్రతికి వున్నప్పుడే నీకు విలువ లేకుండా చూస్తుంటిరి కదా! ఎందుకని? అక్కరలేదండీ! ఇప్పుడు బ్రతికి వున్నప్పుడు దీనికేమన్నా విలువ వుందనా? ఏమీ లేదండి! ఎందుకని? నీవు శరీరాన్ని ఆశ్రయించి వున్నావు కదా! ఎందుకు విలువ లేదయ్యా? నువ్వు శరీరాన్ని ఆశ్రయించి వున్నావు. అంతే! ఆ శరీరంతో చేసిన విలువని, కాసేపు ఆ సంబంధాన్ని పక్కకు పెట్టి చూడు, నీ విలువ ఎంతో, ఏపాటిదో? ఆత్మీయతా సంబంధం ఎక్కడైనా వుందా? లేదు కదా! అమ్మా... బొమ్మా! ఏమి అమ్మా? బొమ్మా? అక్కడ ఏమైనా ఆత్మీయత వుందా? లేదు కదా! ఎందుకని? శరీరగత సంబంధం కదా! అర్థమైందా? ఏది నీకిప్పుడు పనిచేస్తుంది? 'నేను

ఆత్మస్వరూపుడను'అనే స్థితిలో వుండి, నువ్వు చూసినప్పుడు అందరూ ఆత్మస్వరూపులుగా కనపడినప్పుడు, అందరూ ఆత్మీయులే. ఇంక అంతకంటే దగ్గర వాళ్ళు లేరు. అహంకార నిరసనకు గొప్పమార్గం లేదు. అందువల్ల ఎప్పుడైనా కూడా ప్రతివాడిని ఎలా చూడమంటున్నాడు? ఆత్మసంబంధీకుడిగా చూడు. ఆత్మానుసార జీవితంతో చూడు. అంతటి విశాల భావంతో చూడు. తన పరాయి అనే భేదాలు వుండవు అప్పుడు అక్కడ. తన పర భేదములు లేవు. తర తమ భేదములు లేవు. అంతా ఆత్మస్వరూపమే. ఎవరికి ఎవరు ఉపయోగం? ఎవరికి ఎవ్వరు ఉపయోగం లేదు. ఎవరికి వారే. నాయనా! నేను నా జీవితమంతా నీకోసమే ధారపోశాను. అర్థం లేదు ఆ మాటల్లో. బుర్ర వుందా ఏమైనా? నాకోసం నువ్వు ధారపోయడం ఏమిటి? మనం అంతా ఏమనుకుంటున్నామండీ? చేస్తున్నాను వీడికి, యాభై ఏళ్ళు రెక్కలు, ముక్కలు కష్టపడి చేశాను వీడికి, ఏమిటి చేశావు? ఏమిటి చేశావు? నీ కోసం చేసుకున్నావు. నీ రూప మనస్సులు అహంకారాన్ని బలపరచుకోవడం కోసం చేసుకున్నావు. అంతేగానీ వాడికి చేశాను అంటావేమిటి? ఒకడు చేసేవాడు లేడు, ఒకడు చేయించుకునే వాడు అంతకంటే లేడు. అర్థమైందా అండీ? మరి అట్లా అయితే ఈ ప్రపంచం ఎలాగండీ? ఆ ప్రపంచమే లేనిది. ఇప్పుడు వున్నదీ? దాని వెంబడి పడిపోతే వుంది. నీ అహంకారం ఎట్లా వుంది? దాని వెంబడి పడి పోతే వుంది. ఇప్పటి వరకూ ఏం చెబుతున్నాడు? అదేగా చెబుతోంది. దాని వెంబడి పడి పోతే, దృశ్యం వెంబడి పడి పోతే, అదే బలపడింది. దృశ్యం వెంబడి పడి పోమాకు. నిలబడి చూస్తూ వుండు. సాక్షిగా గమనించు. ఏమయ్యావు అప్పుడు? ఏది చూపెట్టు ఇప్పుడు? లేదే. నిన్ను కిందకు లాగమను. లాగలేదే. అసాధ్యం కదా! ఎందుకని? నువ్వు శాశ్వతం కదా! ఆ రూప మనస్సులు పోయినా ఇది నిలబడి వుంటుంది కదా! ఈ నేనే లేకపోతే ఆ రూప మనస్సులు ఎట్లా ఏర్పాడ్డాయి? ఏర్పడవు కదా! కాబట్టి 'మనోనాశనం' అనేటువంటి ఒకే ఒక్క పని నిమిత్తమే నువ్వు ఇందులోకి వచ్చావు. ఏవండి ఇంతకీ నేను జన్మ ఎందుకు ఎత్తానాండీ? ఎందుకు పుట్టామో తెలుసుకో నాయానా! విచారణ చేయి నాయనా! అంటూ వుంటావు కదా! మరి పుట్టింది ఎందుకో, తెలిసేది ఎందరికి? అంటే నేను ఎందుకు జన్మనెత్తాను? ఎందుకు శరీరంలోకి వచ్చానయ్యా? అంటే, ఈ మనోనాశ స్థితి కొరకే వచ్చాను. ఇదే ఈ జన్మ లక్ష్యం. అర్థమైందా అండీ! ఎంతకాలం వస్తావు? ఇది

అయ్యేదాకా వస్తావు. ఇహ గుర్తు పెట్టుకోండి. నేను ఎన్ని సార్లు పుడతానండి? ఇంక ఎంత కాలం వుంటానండీ? అని ఎవ్వరినీ అడగక్కర్లేదు. నువ్వు ఇంకా ఎంతకాలం వున్నా, లేదూ ఎన్నిసార్లు పుట్టినా, ఏ పని కోసం పుడతావు? ఈ మనోనాశ స్థితి కలిగే వరకూ జన్మ తప్పదు. కాబట్టి స్పష్టంగా చెబుతున్నాడు. నాయనా! నువ్వు ఎంత ఏ పనైనా చేయి, చెయ్యకపో! నీవు ఏ లక్ష్యంతో చేయాలి? రూప మనోనాశములు అవుతున్నాయా? లేదా? ఆ ఆలోచన చేసినప్పుడు, ఆ పని చేసినప్పుడు, ఆ ఫలితం జరుగుతూ వున్నప్పుడు, ఫలితం నీకు అనుభవ జ్ఞానంలో వచ్చినప్పుడు, దానిని ఎట్లా విచారణ చేయాలంట ఇప్పుడు? రూప మనో నాశములు అవుతున్నాయో, లేదో చూడు. ఆ లక్ష్యంతో చూడడం అలవాటు చేసుకో! దృష్టిని మార్చుకో! రూపమనోనాశములను బలపరచవలిసింది పోయి, నువ్వు ఏం చేశావు? రూప మనస్సులను బాగా బలపరిచావు. నశింప జేయాలి. కానీ మనమేమి చేశాము? బలపరిచాము. ఇప్పుడు ఏం చేయాలంట? ఇక్కడి నుంచి ఆత్మానుసారంగా జీవించడం అంటే, ప్రతి ఆలోచనలో, ప్రతి చేతలో, ప్రతి మాటలో ఆ అహంకార వృక్షం ఈ రూప మనస్సులతో ముడిపడి వున్నది. నిరసించాలి దానిని. నిరసిస్తే ఏమైంది? నశించి పోయింది. కొంతకాలం అయ్యేటప్పటికి, బలహీనపడి నశించిపోయింది. కాబట్టి మనోనాశనం అత్యావశ్యకం. చాలా అవసరం అది. ఆ మనోనాశం ఒక్క మానవుడికే సాధ్యం. మిగిలిన జంతువులకి సాధ్యం కాదు. ఎందుకని? .... పై స్థితులైన బుద్ధి, చిత్తము, అహంకారము తెలుసుకోగలిగే సామర్థ్యం ఒక్క మనిషికే వుంది. అందువల్ల నీవు ఈ జన్మలోకి వచ్చావు. ఈ మానవ ఉపాధి లభించింది. బోధించేవారు లభించారు. తెలుసుకోగలిగే శాస్త్రాలు వున్నాయి. చదువగలిగే సామర్థ్యము వున్నది. మాట్లాడగలిగే సామర్థ్యము వున్నది. ఇన్ని ఆశీర్వచనాలు ఒక్కమానవ ఉపాధికి భగవంతుడు ఇచ్చాడు. హృదయస్థానంలో వున్నటువంటి, పరమాత్మ యొక్క అంశని సరాసరి తెలుసుకోగలిగే సామర్థ్యం ఒక్క మానవ ఉపాధికే వున్నది. ఇక ఇంతకు మించి ఏం కావాలి? భగవంతుడు ఇవ్వవలిసినవన్నీ ఒకే సారి ఇచ్చేశాడు. నువ్వు ప్రతి రోజు వెళ్ళి ఒక కొబ్బరి ముక్క పెట్టో, లేకపోతే ఒక అరటిపండు ముక్క పెట్టో, ప్రతి సారి చెప్పక్కర్లేదు నాకు అది ఇవ్వు నాయనా! నాకు ఇది ఇవ్వు నాయనా! అని. ఆయన ఇవ్వదలచుకున్నది ఒకసారే ఇచ్చాడు. మా అబ్బాయికి రిజల్ట్ వస్తుందా రాదా? మావాడికి ఇంజినీరింగు సీటు

వస్తుందా రాదా? వాడు నెలకు లక్షాయాభై వేలు సంపాదిస్తాడా? లేదా? ఇవన్నీ దేనితో ముడిపడి వున్నాయి? రూపమనస్సులతో ముడిపడి వున్నాయి నాయనా! దాన్ని నిరసించు. ఏమైంది అప్పుడు? కర్తవ్యం. వరకే చేస్తావు. నిమిత్తమాత్రంగా చేస్తావు. ప్రత్యేకంగా చెయ్యవు. అర్థమైందా అండీ!

అయ్యో! వాడు అలా అనుకున్నానే, వీడు ఇలా అనుకున్నానే, నువ్వు ఏం చెప్పినా దాని వెనుకాల ఏమివుంది? రూప మనస్సులు వున్నాయని తెలుసుకో! మాట వెనుకాల ఏముంది? రూప మనస్సులను దృష్టిలో పెట్టుకుని మాట్లాడుతున్నావు. మరి రూపమనస్సులను దృష్టిలో పెట్టుకుని మాట్లాడవచ్చా? మాట్లాడకూడదు కదా! నీ ఆత్మ స్వరూపాన్ని దృష్టిలో పెట్టుకుని, వాడిలో వున్న ఆత్మస్వరూపాన్ని దృష్టిలో పెట్టుకుని మాట్లాడు. ఏమైంది అప్పుడు? ఇరువురికీ క్షేమమే. క్షేమమేనా కాదా? కానీ మనం నిరాశా నిస్పృహలతో మాట్లాడుతాం ఈ వేదాంత వాక్యాలని. గుర్తు పెట్టుకోండి. అక్కడ పోయిందన్నమాట. అందరూ మాట్లాడుతారు కానీ, వేదాంత వాక్యాలని నిరాశ నిస్పృహలను జోడించి మాట్లాడుతున్నారు. ఏమైంది అప్పుడు? రూప మనస్సులను నశింపజేయవలిసింది పోయి, అప్పుడు కూడా బలపడిపోయింది. అర్థమైందా అండీ!

ఆ అంతా వాడి కర్మ నాయనా! 100 కి 100 రావలసిన వాడికి 60 మాత్రమే వచ్చినాయి. అర్థము వుందా ఏమైనా? చూడండి, ఎంత నిరాశా నిస్పృహలు వున్నాయో, ఆ భావంలో. మాట్లాడుతున్నది సత్యమే. కానీ దాని వెనుక గుణంలో దోషం వుంది. అర్థమైందా? ఆ రజోగుణం, తమోగుణం, సత్వగుణంతో మాట్లాడుతున్నావు. అర్థమైందా అండీ! ఈ గుణదోషాల వల్ల, ఎప్పుడైతే నీవు మాట్లాడుతున్నావో, అప్పుడు అన్ని సమస్యలు వచ్చాయి. కాబట్టి ఆ గుణదోషాలను ఆశ్రయించకుండా, నీవు జాగ్రత్తగా వుండు. ఇవన్నీ రూప, మనస్సులతో కూడుకున్నటువంటివి. ఈ రూప మనస్సులు లేకుండా పోవాలి అంటే, ఒక క్రమమైన సాధన వుండాలి. ఒక క్రమమైన విచారణ వుండాలి. క్రమ విచారణ చాలా అవసరం. క్రమ విచారణ ఎందుకండీ? మూలం నుంచి విచారణ ప్రారంభించాలి. కింద నుంచీ ప్రారంభించకూడదు. ఇప్పుడు మనం చేసింది ఏమిటి? కింద నుంచీ చేశాము. అలా చేయకూడదు. మూలం నుంచి, నేనే ఎవడను? అనే మూలం నుంచీ ప్రారంభించు. నేను ఆత్మస్వరూపుడను అనే సమాధానంతో మొదలు పెట్టి కిందకు రా.

ఎట్లా రావాలట? రూప మనస్సులకు ప్రాధాన్యతను తగ్గిస్తూ. రూప మనస్సులను నిరసిస్తూ. అహంకారాన్ని నిరసిస్తూ. ప్రత్యేకతలని నిరసిస్తూ. వేదాంత వాక్యాలనే సమాధానాలుగా మలిచి జీవించు. ఏమయ్యావు అప్పుడు? 'నేను' అనే స్ఫురణను తెలుసుకోగలుగుతావు. ఇది విచారణ. ఇది క్రమ విచారణ.

అట్లాగే క్రమసాధన. రెండు రెక్కలు కావాలి, పైకి ఎగరాలి కదా మనమిప్పుడు. పైకి ఉన్నతమైన స్థితికి ఎగరాలి అంటే, రెండు రెక్కలు కావాలి. ఒకటి ఏమిటి? విచారణ. రెండు సాధన. సాధన అంటే ఏమిటి? అదే చెబుతున్నాడుగా. ఆఖరి సాధన ఇదే నాయన! నువ్వు ఎన్ని చెప్పినా అవన్నీ సాధనలు అంటావేమో? అవన్నీ రూప, మనస్సులను బలపరిచేసాధనలు. వాటన్నింటిలో ఇది వుంది. అవి చేసేటప్పుడు ఈ దృష్టితో చేయి. అప్పుడు మాత్రమే వాటిలో వున్నటువంటి రూపమనో భావములు నిరసించబడుతాయి. కాబట్టి నీవు (గాలి) శ్వాస మీద ధ్యాస పెట్టినా, మనస్సుతో మంత్రజపం చేసినా లేదూ ఒక పరమాత్మ రూపాన్నో, భావాన్నో బుద్ధిలో నిలుపుకున్నా... ఇవన్నీ సాధనలే. ఈ సాధనలు క్రమసాధనలుగా చేయి. చేస్తే ఏమౌతుంది? ఈ రూపమనస్సుల యొక్క ప్రభావం తగ్గిపోతుంది. ఎప్పుడు? ఈ లక్ష్యంలో వుండి చేస్తే. ఈ లక్ష్యంలో లేకుండా చేశావు వీటిని, మళ్ళా అవే బలపడుతాయి. కాబట్టి లక్ష్యంలో తేడా రాకూడదు. లక్ష్యం ఎప్పడూ స్థిరంగా వుండాలి. ఈ సాధనలు చేయాలి. కాబట్టి రోజూ నేను ఏం చేయాలండి? శ్వాస మీద ధ్యాస పెట్టు. తీరిక దొరికితే ఏం చేయాలి? ఎడమ నుంచి కుడికి, కుడి నుంచి ఎడమకి, మళ్ళా కుడి నుంచి ఎడమకి, ఎడమ నుంచి కుడికి తిరుగుతుందో లేదో గమనిస్తూ వుండు. మనస్సులో ఏదో ఒక మంత్రజపం చేయి. అదే సమయంలో. ఖాళీ సమయం బోల్డువుంది. ఎందుకని? ఎదుటివాడు బాగా విమర్శిస్తున్నాడండీ! ఏం చేయవచ్చునువ్వు? ఈ పని చేయి. దీని మీద దృష్టిపెట్టు. వినపడితే నీకు ఎందుకు? వినపడకపోతే నీకు ఎందుకు? నీ పని నువ్వు చేయి. ఎందుకని? ఆ విమర్శకోసం వచ్చావా? ఈ సాధన కోసం వచ్చావా? ఏది ఉన్నతమైనది? (సాధన చేయడం వున్నతమైనది). మరి అప్పుడు ఏం చేశావు? ఓహో! అలాగా మంచిది. చివరి సమాధానం అది. అంతా అయిపోయింది. సాధన అంతా

అయిపోయింది. ఏమిటి మాట్లాడవు? ఓహో! అలాగా మంచిది. బయటకి వచ్చినప్పుడు ఏం చెప్పాము? ఓహో! అలాగా? మంచిది. అంటే అర్థం ఏమైంది? ఏమిటి మంచిది? ఏం చెప్పినా మంచిదే నాయన. ఎందుకని? ఆ వేదాంత వాక్య స్ఫురణతోనే మాట్లాడుతావు. ఆ వేదాంత వాక్యాలనే సమాధానాలుగా మలిచి చెబుతావు కాబట్టి. అంతా మంచే నాయనా! పరమాత్మ ఏది చేసినా అంతా మంచి కొరకే. ఏమిటి మంచి? నువ్వు చేసినా, నేను చేసినా, ఎవ్వరు ఏం చేసినా, పరమాత్మ పద్ధతిలో ఏది జరిగినా అంతా మంచే నాయనా! ఇప్పుడు వాడు చెప్పే విషయానికి ప్రాధాన్యత వుందా? ప్రాధాన్యత లేదు. ఎప్పుడైతే నువ్వు ఈ వాక్యాలని చెబుతున్నావో, అప్పుడేమైంది? వాడికేది ప్రధానం? విషయం ప్రధానం. నీకు ఏం ప్రధానం? లక్ష్యం ప్రధానం. గుర్తుపెట్టుకోండి. ఆ తేడా స్పష్టంగా వుండాలండి.

నువ్వు రూప మనస్సులని, అహంకారాన్ని ఆశ్రయించినప్పుడు విషయప్రధానంగా వున్నావు. సాధనలో... విచారణలో, సాధనలో వున్నప్పుడు, లక్ష్యప్రధానంగా వున్నావు. ఎందుకని? లక్ష్యం పోతే ఈ విషయం ఏం చేసుకోను? తల తెగిన పక్షికి విలువ ఏముంది? ఏమన్నా వుందా? లేదు కదా! కాబట్టి నీవు ఏం చేయాలయ్యా? చక్కగా విచారణ, క్రమ విచారణ, క్రమ సాధన. విచారణ చేయదలచుకున్నావు, సాక్షీ స్వరూపము నుంచి మొదలుపెట్టు విచారణ. అలాగే సాధన చేయదలచుకున్నావు... చక్కగా అన్నమయకోశం దాటగానే కనపడే ప్రాణమయకోశం, గాలి కుడి నుంచి ఎడమకి, ఎడమ నుంచి కుడికి తిప్పుకోవడం ఒక సాధన. ఇంకా మనస్సులో మంత్రజపం చేయడం, ఇంకా ఒక పరమాత్మ రూపాన్ని ప్రతిష్ఠించడం. ఈ మూడు చేస్తూవుండు నువ్వు క్రమసాధనలుగా. కొంతకాలం అయ్యేటప్పటికి ఏమైపోయింది? ఈ సాధనలోను శక్తి వచ్చింది. ఆ లక్ష్యం వల్ల బలం కలిగింది. ఆ క్రమ విచారణ వల్లా బలం వచ్చింది. ఈ సాధన వల్లా బలం వచ్చింది. ఇప్పుడు 24గంటలూ పనే. ఎందుకని? ఇంకొకడితో నాకు పని ఏముంది? కావాల్సినంత పని వచ్చింది ఇప్పుడు నాకు. ఇప్పటివరకూ పని లేదని, బయటపనులు పెట్టుకున్నాను. ఇప్పటి వరకూ బయటపనులు ఎందుకు పెట్టుకున్నావు? ఈ పనులు లేవు కాబట్టి, ఈ పనులు పెట్టుకోలేదు కాబట్టి. మనసుకి ఏం పనిలేక. దానికి ఈ సాధన లేదు కదండీ! ఈ సాధన లేకపోయేప్పటికి ఏం చేశావు? ఆవాల పిండి

కొడుదామా? ఇంకో పిండి కొడుదామా? నిమ్మకాయలు తెద్దామా? ఆవకాయలు తెద్దామా? అది తెద్దామా? ఇది తెద్దామా? 10 చేద్దామా? 16 చేద్దామా? ఏమైంది ఇప్పుడు? ఆ 10, 16 చేయకపోతే వూరుకున్నాడా ఇప్పుడు వాడు? వూరుకోడు. ఎంతకాలం చేస్తావు? సాధ్యమయ్యే పనేనా? కాబట్టి ఎంతసేపూ బహిరంగానికి వెళ్ళకుండా, నీ లోపలికి అంతర్ముఖుడవుకా. నీ లోపలికి వెళ్ళడం నేర్చుకో! నీలోపల వున్న యథార్థ నేనును గుర్తించడానికి ప్రయత్నం చేయి. ఆ స్థితిలో వుండడానికి నిలబడు. ఎందుకని? మానవ ఉపాధి తెచ్చుకున్నదే దానికోసం నాయన! ఇది, ఈ పని చేయకపోతే నీవు ఎన్ని పనులు చేసినా వృధానే. ఇప్పటి వరకూ బోల్డుపనులు చేశానంటున్నావుగా, అవన్నీ waste అయ్యా బాబు. ఎందుకని? కాసేపు ఆగితే ఈ రూపం తొలగితే, నీ గురించి ఎవ్వడూ తలవడు నాయన! నువ్వు ఏ తలచావు గనుక, గతించిన వాళ్ళని? నీ తరువాత వాడూ అంతే! అర్థమైందా అండీ!

ఒక వేళ అథవా తలంచినా కూడా, ఏమని తలుస్తాడు? మా అమ్మ వుంటే అబ్బ! మా కుటుంబము మొత్తానికి ఆవకాయ పెట్టేదండి. ఇప్పుడు ఆవకాయ పెట్టేదే అనే స్ఫురణతో తలుస్తాడే గానీ, దేనిని అభిమానిస్తావు? దేహాన్ని అభిమానిస్తావు. అంతే కదా! ఆత్మాభిమానం వుందా? అసలు ఆత్మకు అభిమానం లేదు కదా! కాబట్టి అభిమానం వుంటే ఏమైపోయావు? ఇప్పుడు. దేహంలోకి వచ్చేశావు. ఆప్యాయత వుంటే ఎక్కడికి వచ్చేశావు? దేహంలోకి వచ్చేశావు. అనురాగం వుంటే ఎక్కడికి వచ్చేశావు? దేహంలోకే వచ్చేశావు. ఆత్మకి ఇవి ఏమీ లేవుగా. కాబట్టి అసలైన పద్ధతి ఏమిటి? ఆత్మానుసార జీవితం. ఆత్మీయతే ప్రధానం. వాడికేమైంది? వాడికి ఏమీ లేదు. వాడు నీ రూప మనస్సులని పట్టించుకోలేదు. కేవలము స్వస్థితి, స్వరూప స్థితిని మాత్రమే ఆశ్రయంగా తీసుకున్నాడు. ఆ లక్ష్యంలో వుండి చూస్తాడు నిన్ను. ఆ లక్ష్యపద్ధతిగానే నీతో ప్రవర్తిస్తాడు. నువ్వు ఏం చేసినా ఆ లక్ష్యస్థితి నుంచే మాట్లాడుతాడు. అతను ఏదైనా విమర్శించినా, చెప్పినా కూడా ఆ స్థితినుంచే విమర్శిస్తాడు. నీ ఉద్ధరణకే అది వుపయోగపడుతుంది. నీకు నష్టం కలగదండీ, ఎప్పుడూ కూడా! చాలామంది అంటారు. ఇవాళ గురువుగారు చాలా కోపంగా వున్నారండి. ఆయనకు ఏం పని కోపం తోటి? ఆయనకు ఏమన్నా పని వుందా? ఏం పని లేదు కదా! ఆయనకి. ఎందుకని? స్వస్థితిలో వున్నవాడికి కోపంతో ఏం

పని అంటే, స్వస్థితిలో వున్నటువంటి వాడు, ఈ కోపమనే పనిముట్టుని భావాన్ని రమ్మనాలి. ఆ పనిముట్టుని ఒక నిమిత్తమే రమ్మనాలి. దానిని ఆశ్రయించమనాలి. ఆవేశించమనాలి. దాని పనంతా జరిగి ఇంద్రియాలలో కోపం ఆవేశించబడాలి. పడటానికి ఎంతో సమయం తీసుకుంటుంది. నీకు రెప్పపాటులో వస్తే, వాడికి ఎంతో సమయం పడుతుంది. ఎంతో దిగి రావాలి కిందకు వాడు. ఎందుకని? ఒక పని నిమిత్తమై, ఒక పెద్ద లక్ష్యం పెట్టుకుంటాడు, దాని నిమిత్తం, ఒక పెద్ద లక్ష్యాన్ని పెట్టుకుని కిందకు దిగి వస్తాడు. వచ్చినవాడు ఎంతసేపు వుంటాడు? రెప్పపాటులో మళ్ళా వెళ్ళిపోతాడు, స్వరూపస్థితికి. నువ్వు? వస్తే వెళ్ళలేవు. అర్థమైందా అండీ! ఇలాగ, నీకు అతనికి ఎంతో భేదం వుంది. కాబట్టి అతడు చేసినట్లు చేయమాకు. అతను చెప్పినట్లు చేయి. అర్థమైందా అండీ! అతను చెప్తాడు నీకు చక్కగా ప్రతి ఒక్క స్థితి గురించి వివరించి చెబుతాడు, ఇదిగో ఇది ఇలా వుంటుంది, ఇలా వుంటుంది. ఇక్కడ ఈ అడ్డంకి వుంటుంది. ఇప్పుడు ఇది ఇట్లా తప్పించుకోవాలి. ఇదిగో ఈ మార్గం ఇట్లా చేయాలి. దీని ఉపాయం ఇట్లాగ. ఇలా ప్రతీది చెబుతున్నాడుగా. అలా చెప్పినట్లు చేయి. రోజంతా ఖాళీయే కదా! ఆ నాలుగు క్రమసాధనలు చేయి. ఆ క్రమవిచారణ చేయి. ఈ రెండూ చేయకుండా, మిగిలినవన్నీ ఏదో చేశావనుకుంటున్నావేంటి? అర్థమైందా అండీ!

మీరు త్రిపురా రహస్యమే సీడీ విన్నారండి. వింటే ఏమైంది? (విన్న కాసేపే) విన్నకాసేపు కూడా ఏమైంది? క్రమవిచారణ వుందా? లేదు. క్రమసాధన వుందా? లేదు. కానీ బోల్డు తెలుసుకున్నావు. శాస్త్రజ్ఞానానికి సంబంధించినది బోల్డు తెలుసుకున్నావు. దాంట్లో నుంచి ఒక్కటి ఉపయోగించు నిత్యజీవితంలో. ఉపయోగిస్తున్నావా? అంటే అర్థం ఏమిటి? నీకు ఎంతగా అనుభవజ్ఞానం వుంటే, అంత సామర్థ్యం వుంటుంది అవగాహన చేసుకోవడానికి. ఓహో! ఈ లక్ష్యంతో, ఇంత గొప్ప, అంత ఉన్నతమైన స్థితిని వుద్దేశ్యించి, ఆ పదం వేస్తున్నాడు. (పది నిమిషాల్లో చదివేదానిని మీరు ఇప్పుడు రెండు మూడు గంటల సేపు చెప్పారు) ఎట్లా తెలుస్తుందది? నీకు అనుభవజ్ఞానం వుండాలి. వుంటే తెలుస్తుంది. అనుభవజ్ఞానం లేకపోతే చదువుకుంటూ పోతావు అంతే. ఎందుకని? అక్కడ కూడా అలా దేహభావనతోనే చూస్తున్నావు. అహంకారంతోటే చూస్తున్నావు. (ఆ అర్థం కూడా మాకు ఇంకో రకంగానే స్ఫురిస్తుంటుంది) నువ్వు ఏ స్థితిలో

వుంటే అలా స్ఫురిస్తుంది. కాబట్టి ఈ స్థితి నీకు ఎందుకు స్ఫురించడం లేదు? ఇట్లా ఎందుకు నీకు రావడం లేదు? అంటే, నువ్వు నిజజీవితంలో అట్లా ఆచరించి లేవయ్యా బాబు. నువ్వు నిజజీవితంలో ఎట్లా వున్నావో, అట్లాగే వస్తుంది నాయానా ఇది. ఆయన అట్లాగే చెబుతాడు లేండి. అందులోనుంచి ఆయన బయటకు వస్తే మళ్ళా మామూలే! అన్నావే అనుకో? ఏది నువ్వు వుండు చూద్దాం అట్లాగ? వుండలేవు అట్లాగ. కాబట్టి నువ్వు ఏం చేయాలి? ఆయన ఎట్లా చెబుతున్నాడో చక్కగా విచారణ చేసుకో! ఆ క్రమ విచారణ చేయి, క్రమ సాధన చేయి. బాగా గుర్తుపెట్టుకోవాలండి ఇది. జీవితం మొత్తం మీద ఇంకెప్పుడూ ఎవరినీ ఏం చేయాలని అడుగకూడదు. ఒకటే గుర్తుపెట్టుకోండి.

నేను ఎవడను? అనే ప్రథమ తలంపుతోటి మొదలు పెట్టాలి. ప్రతి ఆలోచన ముందుకూడా నేను ఎవడను? 'నేను ఆత్మ
స్వరూపుడను', నేను పరమాత్మ యొక్క అంశను. నేనే శాశ్వతుడను. నేను సనాతనుడను. నేను సచ్చిదానంద స్వరూపుడను. నేను అప్రమేయుడను. అనేటటువంటి ఏ వాక్యాలైతే వున్నాయో, వాటితో ఆరంభించాలి ప్రతి ఆలోచనని. అట్లా ప్రారంభించి, వచ్చిన ప్రతి ఆలోచనలో రూపానికి సంబంధించినవి ఏమున్నాయి? మనసుకు సంబంధించినవి ఏమున్నాయి? పంచకోశాలకు సంబంధించినవి ఏమున్నాయి? స్థూల దేహానికి, సూక్ష్మదేహానికి, కారణ దేహానికి సంబంధించినది ఏముంది? అని వీటికి సంబంధించినది ఏమున్నా సరే, అదంతా కూడా అహంకారమే. వేరే ఏమీ కాదు. అర్థమైందా అండీ! ఏమన్నా తేడా వచ్చింది, తేడా వస్తే దేనికి తేడా వచ్చింది? వెంటనే విచారణ చేయాలండి. ఆ తేడా రాగానే దేంట్లో వచ్చింది? స్థూలంలోనా, సూక్ష్మంలోనా, కారణంలోనా? నాకేం తేడా వుంది? నాకు ఏ తేడా లేదు కదా! నేనెవరిని? నేను ఆత్మస్వరూపుడను. ఇలా క్రమవిచారణ చేయాలి. ఇంకా సమయం దొరికింది, ఏం చెయ్యాలి ఇప్పుడు? క్రమసాధన చేయి. ఎడమ నుంచి కుడికి, కుడి నుంచి ఎడమకి శ్వాసను తిప్పుకో! మనసుతో జపం చేయి. మూడవది ఏమిటి? పరమాత్మరూపాన్ని హృదయంలో ప్రతిష్ఠించు. ప్రతిష్ఠించి ఈ మూడూ ఎప్పుడైతే చేశావో, ఈ మూడు శక్తులు ఒక్కటైపోతాయి. అర్థమైందా అండీ? ఈ ప్రాణము, మనస్సు బుద్ధి ఏకమైపోయి, నీకు ఆ లోపల వున్నటువంటి 'నేను' అనేటటువంటి స్ఫురణ ఆత్మసాక్షాత్కార జ్ఞానాన్ని

కలిగిస్తుంది. ఈ మూడు ఇప్పుడు విడివిడిగా వున్నాయి. అర్థమైందా అండీ? ప్రాణం చేతిలో ప్రాణం కొట్టుకుంటుంది, మనసు చేతిలో మనసు పనిచేస్తుంది, బుద్ధి చేతిలో బుద్ధి పనిచేస్తుంది. కాబట్టి క్రమసాధన అంటే అర్థం ఏమిటి? ఈ మూడింటినీ ఒక లక్ష్యంలోకి తెచ్చి, ఒకే తీరుగా నడపడం అన్నమాట. అది క్రమసాధన. అందుకే దీని పేరు ఏంటి? క్రమసాధన. విచక్షణతో ఒక క్రమంలోకి రావాలి. వేరువేరుగా వున్నవి ఒక క్రమంలోకి రావాలి. ఒక లక్ష్యం దిశగా పనిచేయాలి. ఎప్పుడైతే ఇలా చేశావో ఏమైందట? ఈ మూడు ఏక త్రితం అవ్వగానే, త్రితం అంటే మూడు అన్నమాట. ఈ మూడు ఏకమైనాయి. అవ్వగానే నీకు ఆత్మసాక్షాత్కార జ్ఞానం కలుగుతుంది. ఆత్మసాక్షాత్కార జ్ఞానం అంటే ఏమిటి? అదిగో ఆ నేను అనేటటువంటి స్ఫురణ తెలుస్తుంది. నేను నేను నేను అంటోంది కదా! ఆ నేను అనేది తెలియబడుతోంది నాయనా! ఇదే అన్నిటికంటే ఉన్నతమైన సాధన. ఇహ ఇంతకు మించింది లేదు. ఎన్ని ఉపనిషత్తులు చదివినా, ఎన్ని తిరగేసినా, ఎన్ని యజ్ఞాలు, యాగాలు, హోమాలు ఎన్ని వైదిక కర్మలు చేసినా, చెయ్యకపోయినా, ఈ సాధన చెయ్యకపోతే... ఎందుకని? మరణకాలంలో ఏ యజ్ఞం చేద్దాము? చండీ యాగం చేద్దామా? శతరుద్రచండీయాగం చేద్దామా? ఎలా సాధ్యం? సాధ్యమా? కాబట్టి యజ్ఞభావంతో చేయి. నిరంతరం యజ్ఞం జరుగుతుంది ఇప్పుడు. ఇలా చేస్తే ఏమైంది? ఎప్పుడూ యజ్ఞమే. ఎందుకని? నీ ప్రాణమే శ్రోతస్సులు, హవిస్సులు, ఆ యజ్ఞంలో వేసేవి. నీ మనస్సు, నీ బుద్ధి అవి అన్నీ ఏమిటి? యజ్ఞంలో పడిపోతున్నాయి. ఆత్మయజ్ఞం అర్థమైందా అండీ! సాధనాయజ్ఞం, స్వాధ్యాయం అంటారు. దీనిని ఏమంటారు? స్వ+అధ్యాయం. నిన్ను నువ్వు అధ్యయనం చేయడం. ఇంతకు మించిన యజ్ఞం లేదు. స్వాధ్యాయమును మించిన తపస్సు లేదు. స్వాధ్యాయమును మించిన యజ్ఞము లేదు. స్వాధ్యాయమును మించిన సాధన లేదు. ఈ స్వాధ్యాయము తప్ప మిగిలినవన్నీ చేశాము మనమిప్పుడు. అర్థమైందా అండీ? ఈ ఉన్నతమైన సాధనని స్వీకరించలేదు. ఎందుకట? ఇది స్వీకరిస్తే జీవితకాలం చెయ్యాలి. మన గోల అది. మిగిలినవన్నీ ఏమిటంటే ఆ కాసేపూ చేసి వచ్చేస్తే పని అయిపోతుంది. మళ్ళా మన పనిలో, మన గోలలో మనం వుండవచ్చు. సంధ్యావందనం ఎందుకు చేస్తున్నావయ్యా? ఆ కాసేపూ సంధ్యావందనం చేస్తే, నా పని నేను చేసుకుంటా తరువాత.

ఆ పూజలు చేస్తే ఏమిటట ఉపయోగం? ఆ పూజలు అయిపోయినాక నా పని నేను చేసుకోవచ్చు. ఇది 24 గంటలు చేయాలిగా మరిప్పుడు. 24 గంటలు చేయాలి, కొస ప్రాణం దాకా చేయాలి, మరణ కాలంలో కూడా చేయాలి.

ఎప్పుడైనా ఒక్కటి గుర్తుపెట్టుకో! పిల్లాడు స్కూల్ కి వెళ్తున్నాడండి. వాడికి Doubt వచ్చింది. ఏమండీ! బండెడు పుస్తకాలు ఇచ్చారు, ఇవి చదువుతున్నాను. ఇంతకాలం చదివేసి నాకు విరక్తి వచ్చేసింది ఇకపైన నేను చదవను అంటున్నాడు. అప్పుడు వాడితో నాయనా! నువ్వు జీవితకాలం చదవాలి నాయన అన్నావనుకో, ఏమౌతుంది? కొంతకాలమే చేద్దామనే వుద్దేశ్యంతో అందులోకి ప్రవేశించాడు. ఇప్పడు వాడంతట వాడు నేను జీవితకాలం విద్యార్థిని అని తెలుసుకుంటే ఏ సమస్యా లేదు. మనం చెబితే ఏమైంది? ప్రమాదం వచ్చింది. కాబట్టి ఏం చేస్తే వాడంతటవాడు తెలుసుకోగలుగుతాడో అది చేయి. అట్లాగే నువ్వు కూడా అంతే. నీకు నువ్వు తెలియాలి. నీకు నువ్వు తెలియకుండా వున్నావిప్పుడు. ఏ సాధన చేస్తే నీకు నువ్వు తెలుస్తావో, అది చేయి. ఇప్పటి వరకూ ఏ సాధన చేశావు? నిన్ను నువ్వు ఏ మార్చడానికి చేశావు అంతే. తప్పుదారిలో పడడానికి చేశావు అంతే. నీకు నీవు తెలియడానికి చేయలేదు. కాబట్టి ఇక నుంచి క్రమ విచారణ, క్రమ సాధన ఈ రెండు పనులు చెయ్యాలి. ఆత్మ విచారణ, ఇప్పుడు చెబుతున్నటువంటి క్రమసాధన. అంటే ఏమిటి? సమయం దొరికింది. ఎవ్వరితో నీకేం పనిలేదు నాయనా! సమయం దొరకలేదు, పని చేస్తూ కూడా ఇదే పని. అర్థమైందా అండీ! మనసులో జపం చేస్తూ పని చేసుకో! ఏమౌతుంది? ఏమి అవ్వదు. పప్పు మాడిపోతుందేమో? పోనీ! నిజంగా నీకు స్థితి కుదిరిందండి, బయటకు వచ్చే బాహ్య స్ఫురణ లేదండి. అప్పుడు పప్పు వుందా? పప్పుకింద మంట వుందా? మాడిందా అప్పుడు? ఏమవ్వదు. బాహ్యస్ఫురణలో వుండి నువ్వు పట్టించుకోలేదనుకోండి. నీకే తప్పు వస్తుంది. అర్థమైందా? కాబట్టి నువ్వు ముందు ఏం చెయ్యాలి? పని చేస్తూ కూడా, శ్వాస మీద ధ్యాస పెట్టాలి. పని చేస్తూ కూడా మనసుతో జపం చేయాలి. పని చేస్తూ కూడా బుద్ధియందు పరమాత్మను ప్రతిష్ఠించాలి. (చేసే పని కూడా అప్పుడు తెలుస్తూనే వుంటుంది కదా!) స్పష్టంగా తెలుస్తుంది. ఇప్పుడు అస్పష్టంగా తెలుస్తుంది. ముందే తెలుస్తుంది. ఈ పని చేస్తే ఏమిటయ్యా ఉపయోగం అంటే, ఏదో పరిస్థితి

జరగబోతోందని నీకు ముందే తెలుస్తుంది. దానికి వ్యతిరేకంగా అహంకారం బలపడటానికి అవకాశాలు ఏర్పడుతున్నాయని ముందే తెలిసిపోతోంది. (ఆ పప్పు పెట్టింది ఉడికిందని) ఆ సమయానికి తెలిసిపోతుంది. ఏమీ ఎవరూ వచ్చి చెప్పనక్కరలేదు. అన్నీ స్పష్టంగా వుంటాయండి. దీనిని మించినటువంటి శక్తి ఏదీ లేదండి. ఈ క్రమసాధన చేసిన వాడికి అన్నీ పూర్ణవికాసము చెందుతాయి. ప్రక్కనే కూర్చొని, దానినే నిలబడి చూసేవాడికి కూడా దానిని గుర్తించడం తెలియదు. ఇహ లోకానికి సంబంధించిన పని కూడా, ఇక్కడ కూర్చొని దేనినైనా చెప్పగలుగుతావు. ఎలాగ? ఆ సూక్ష్మపరిజ్ఞానం, బుద్ధి వికాసం వచ్చేస్తుంది. పూర్ణంగా వికసించేస్తుంది. దేనినైనా తెలుసుకోగలిగే సామర్థ్యం వచ్చేస్తుంది. అక్కడినుంచి చెబుతూ వుంటారు అంతే! ఫోనులో చెబుతూ వున్నా తెలిసిపోతుంది. నాయనా! ఇది నాయన, అది నాయన, అలా చేసుకో, ఇలా చేసుకో, ఇలా మార్చుకో, అలా మార్చుకో... చెప్పేస్తాడు. ఆ రకంగా పరిణామం చెందుతావు. ఈ సత్యాన్ని తెలుసుకో! ఈ క్రమసాధన వలన ఇహం చెడిపోతుంది అనుకుంటున్నావేమో? ఇహం సమర్థవంతముగా చేయబడుతుంది. కానీ, ఇప్పుడు చేస్తున్న పద్ధతిగా కాదు. చేసి చేయనివాడను అనే పద్ధతిలో చేయబడుతావు. ఇంకోటి ఏమిటి? తక్కువ పనులు చేస్తావు. ఇప్పుడు ఏం చేస్తున్నావు? దేశంలో వున్న చెత్త అంతా నీదే! (ఇది వరకూ అనవసరమైన పనులన్నీ నెత్తిన వేసుకున్నాం) ఇప్పుడు నిలబడుతావు, స్థిరత్వం పొందుతావు. నీ స్వరూప జ్ఞానంలో స్థిరంగా వుంటావు. ఏది సరైన విధానం? రోజుకో 1000 పనులు చేసి, చెత్తంతా నెత్తిన పోసుకోవడం సరైన విధానమా? ఎంతవరకు? ఈ రెండు పనులే నా పనులండి, మిగితావన్నీ నావి కాదు. (తప్పించుకోవడం) తప్పించుకోవడం కాదు, మళ్ళా అదిగో...! తప్పించుకోవడం కాదు, అది అనవసరం. అర్థమైందా అండీ? అది అనవసరం. ఎందుకని? దీని వల్ల ఏమిటి ప్రయోజనం? అహంకారం బలపడడం తప్ప ప్రయోజనం ఏమీ లేదు నాయనా! నీ వెంబడి వచ్చాను, నువ్వు బట్టలు కొన్నావు, నేను కూడా నీ వెంబడి తోక లాగా వచ్చాను, ఏమిటట ప్రయోజనం? నాకేమిటి ప్రయోజనం? పని ఎవరిది? నీది. అంతేనా? నా మీద ప్రేమ కొద్దీ, వల్లమాలిన అభిమానం కొద్దీ నన్ను పిలిచావని అనుకుంటున్నానండి. ఆహా! నీకు బాగా తెలుసుకదా, నువ్వు నాతో పాటు రా అన్నాను.

ఎందుకమ్మా? నాకు. శరీరమే వస్త్రం కదా! అన్నావనుకోండి, ఇప్పుడు నిన్ను ఎవడైనా వస్త్రాల షాపుకి పట్టుకెళతాడా? ఎప్పుడైతే నీ స్వాధ్యాయము, నీ స్వ+అధ్యయనము అనేటటువంటి పని ఎప్పుడైతే వున్నదో, ఈ వేదాంత వాక్యాలను ఎప్పుడైతే సమాధానంగా చెప్పావో, ఏమైంది అప్పుడు? ఇప్పుడు ఎప్పుడూ సమయమే. సాధన చేయడానికి ఎప్పుడూ సమయమే కదా! ఇంతకు ముందు ఏమన్నావు? ఎక్కడండీ? సాధన చేయడానికి సమయం లేదండి! ఏది? ఇప్పుడు చూపెట్టు? (సాధన చేయడానికి సమయము) ఎప్పుడూ వుంటుంది కదా అది. ప్రాణము, మనస్సు, బుద్ధి ఎప్పుడూ వున్నాయి నీ దగ్గర. నువ్వు ఈ పని చెయ్యి. (అంటే ఏం చేయాలట) ఈ పని చేస్తూ.... ముందు దీనికి (సాధనకి) ప్రాధాన్యతను ఇవ్వు. అంటే ఏమిటి? ఈ పని... ఉదాహరణ చెబుతానండి.

పూర్వీకులు మీకు ఏం నేర్పారు? వంట వండటం మొదలు పెట్టేముందు కృష్ణార్పణం, రామార్పణం... అంటూ మొదలుపెట్టమన్నారు. అర్థమైందా? అయిపోయింది. అప్పుడు కూడా అలాగే పూర్తి చేయమన్నారు. ఎందుకని అట్లా చేయమంటున్నాడు? ఇదే స్వాధ్యాయము. నువ్వు ముందు సాధన చేయి. (అట్లాకాదు). ఈ క్రమసాధన కొంతసేపు నిలకడ పొందేవరకూ చేసి, అప్పుడు పనిలోకి దిగు. మీరు చూడండి. ఏ పనైనా చేసేటప్పుడు... ఓం భూః భువః... అనమంటాడు. అదే శ్వాస మీద ధ్యాస. చెప్పేటప్పుడు నీ పూజలో లేదా? ఉత్తిష్ఠంతు భూత ప్రేత పిశాచాః... ఎట్లా పోతాయి అవి? నీ శ్వాస మీద ధ్యాస పెడితే, అవి నిన్నేమీ చేయలేవు. ఎప్పుడైతే శరీర భావనలోనికి వచ్చేశావో, ఆ భూత ప్రేత పిశాచములు అన్నీ నీ లోపలనే వున్నాయి. ఎక్కడో వున్నాయి అనుకుంటున్నావేమో, అవి వేరే ఎక్కడా లేవు. దేహాభిమానమే అది. నువ్వు రోజూ పూజలో చెబుతున్నావు కానీ ఎందుకు చేస్తున్నావో, ఏమి చేస్తున్నావో నీకు తెలియదు. అర్థమైందా అండీ! ఆ రకంగా చక్కగా శ్వాస మీద ధ్యాస పెట్టండి. మనస్సుతో జపం చేయండి. అలాగే బుద్ధిలో పరమాత్మ రూపాన్ని ప్రతిష్ఠించండి. ఈ మూడు చేసినాకే దేహంతో పనిలోకి దిగండి. ఈ మూడు చేసినాకే, నిద్రలోకి ఉపక్రమించండి. ఆ స్థితినుంచే నిద్రలోకి ఉపక్రమించండి. లేస్తూ కూడా ఈ మూడింటితోనే లేవండి. క్రమ విచారణ చేయండి. ఏదన్నా తలంపు కలిగింది, వెంటనే ఆహా తలంపు కలిగింది. ఎందుకని అంటే, ఈ సాధన

చేసేటప్పుడు, ఈ క్రమసాధన చేసేటప్పుడు, తలంపు కలుగగానే నీకు ముందు తెలిసిపోతుంది. ఓహో! మనసు పని చేస్తుంది. వేరే పని చేస్తోంది. మనసు ఏం చేయాలి అసలు? జపం చేయాలి. బుద్ధి ఏం చేయాలి? పరమాత్మ రూపం మీద నిలబడి వుండాలి. కానీ ఏం చేసింది? పక్కనుంచి ఇంకో వైపు చూపెడుతోంది. చూపెడుతోంది అనంగానే లక్ష్యం మారుతున్నప్పుడు మనకు వెంటనే తెలిసిపోతుందండి. ఓహో! ఏమిటి ఇప్పుడు వచ్చింది? దీంట్లో నేను ఇప్పటి వరకూ ఎలా చేశాను? ఇప్పుడు ఎలా చేయాలి? ఆత్మవిచారణతో చేయడం అంటే ఎలాగు ఇది? నేను ఎవడను? నేను ఆత్మస్వరూపుడను. మరి నేను జయపిన్నిని కాను కదా! నేను ఫలానా వారి భార్యను కాదు కదా! నేను ఫలానా వారికి అమ్మని కాదు కదా! వీటిలో నేను ఎలా ఆలోచిస్తున్నాను? నేను ఆత్మస్వరూపుడిగా చూస్తున్నానా? దేహసంబంధంతో చూస్తున్నానా? ముందు రెండు నిమిషాలు చెయ్యాలి ఈ పని. చేస్తే ఏమైంది? అటు క్రమ సాధన, ఇటు క్రమ విచారణ. క్రమ విచారణ చేస్తే, క్రమ సాధనలో కుదురుకుంటావు. క్రమ సాధన చేస్తే, క్రమ విచారణ బలపడుతుంది. దీంట్లో వున్న గొప్ప విషయం ఇదేనండి. ఈ సాధన వల్ల ఉపయోగం ఏమిటి? ఈ సాధన చేస్తే, దీనికి అన్యం అయినది చక్కగా తెలిసిపోతోంది. తెలియంగానే క్రమవిచారణ చేస్తావు. ఒక్కటి చేస్తే ఒక్కటి తప్పనిసరిగా వచ్చేస్తుందండి. విచారణ చేశావా ఈ సాధన చేయక తప్పదు. సాధన చేశావా విచారణ చేయక తప్పదు. ఈ ఆత్మవిచారణ ఈ సాధన రెండూ అతి దగ్గరగా వున్నాయి అన్నమాట. అందుకే ఏం చెప్పాడు? ఆత్మ విచారణ చేసేవాడు సాధకుడు స్వ+అధ్యయనం చేయాలి. స్వాధ్యాయ యజ్ఞమును మించిన యజ్ఞము లేదు నాయానా, స్వాధ్యాయమును మించిన తపస్సు లేదు నాయన. ఎన్నో వేల జన్మలనుంచి మహానుభావులు చెట్టుకు వేలాడి చేసినటువంటి వాళ్ళు చేసిన ఘోర తపస్సులతో నీకు ఏం పని లేదు నాయనా. ఎందుకని? జ్ఞాన యజ్ఞము చేయి నాయన. స్వాధ్యాయ యజ్ఞం చేయి. స్వాధ్యాయ యజ్ఞంలో నీవే, నీ ప్రాణ మనో బుద్ధులే యజ్ఞంలో వేసేటటువంటి సమిధలు. ఏమైంది అప్పుడు? సహజంగా వుంది. ఏం ప్రమాదం లేదు. ఎందుకని? ఆత్మస్వరూపంలో సహజంగా స్థిరమై వున్నావు కనుక. మానవ దేహం వచ్చినందుకు, ఏ నిమిత్తమైతే వచ్చిందో ఆ నిమత్తం నెరవేరుతుందన్నమాట.

సాయిరాం.

ఓం ఓం ఓం

ఓం పూర్ణ మదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఓం పూర్ణ మదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఓం పూర్ణ మదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఓం తత్ సత్

ఓం సహనావవతు సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై తేజస్వి నావధీతమస్తు మావిద్విషావహై

ఓం శాంతిః శాంతిః శాంతిః

సాయిరాం.

ఉత్తములకీ మనకీ తేడా !

.

మనలో చాలామందిమి అనుకుంటాం " నేను అతడికి సహాయం చేస్తే నాకేమిటి ప్రయోజనం ?"

అతడు అనుకున్నాడు " నేను సహాయ పడకపోతే వాళ్ళకి ఎవరు సహాయ పడతారు ? అని

.

.

జరిగిన కథ !

స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ లో 1892 లో జరిగిన వాస్తవం .

.

18 సంవత్సరాల ఆ యువకుడు ఫీజులు కట్టలేక ఏమి చెయ్యాలో తెలీని స్థితిలో ఉన్నాడు . అతడు తల్లి తండ్రులు లేని అనాథ !

.

అతడూ అతడి స్నేహితుడూ కలిసి ఒక పథకం ఆలోచించారు . వాళ్ళ యూనివర్సిటీ లో ఒక సంగీత కచేరీ ఏర్పాటు చేద్దామనీ , అందులో ఖర్చులు పోను మిగీన దానితో తమ ఫీజులు కట్టెయ్యవచ్చు అనీ నిర్ణయించుకున్నారు .

.

అప్పట్లో గొప్ప పియానో వాద్య కారుడు Ignace J. Paderewski. వద్దకు వెళ్ళారు . ఆయన మేనేజరు ఫీజు రూపం లో 2000 డాలర్లు కనీస మొత్తం గా ఇవ్వాలనీ , ఆ పైన ఇతర ఖర్చులు అనీ ఒప్పదం చేసుకున్నారు . వీళ్ళు అంగీకరించారు . టికెట్లు అమ్మడం సాగించారు . అనుకున్న రోజు వచ్చింది . ప్రోగ్రాం అద్భుతం గా జరిగింది . అయితే వీళ్ళు అనుకున్నట్టు వసూళ్లు రాలేదు . మొత్తం 1600 డాలర్లు మాత్రమె వచ్చింది .

.

వాళ్ళు Paderewski. దగ్గరకు వెళ్ళారు . వసూలు అయిన మొత్తమూ , 400 డాలర్లకు చేక్కూ పట్టుకు వెళ్లి జరిగిన మొత్తం విషయం చెప్పారు . సాధ్యమయినంత త్వందరలో ఆ మిగిలిన సొమ్ము చెల్లిస్తాము అనీ , క్షమించమనీ అన్నారు .

.

వాళ్ళ గురించి Paderewski. కి తెలీదు . ఆయన వాళ్ళని అతకు ముందు చూడలేదు . ఆయన ఆ చెక్కును చింపేశాడు . . 1600 డాలర్లూ వాళ్ళ చేతిలో పెడుతూ వాళ్ళతో ఆయన ఇలా అన్నాడు

.

" మీకు అయిన ఖర్చులు ఎంతో లెక్క పెట్టుకోండి . మీ ఫీజులకు ఎంతో అవుతోందో అది కూడా ఇందులో నుండి మినహాయించుకోండి . ఏమైనా మిగిలితే ఆ మిగిలిన సొమ్ము నాకు ఇవ్వండి "

.

ఈ సంఘటన Paderewski మానవతను చాటి చెబుతుంది . తనకు తెలీని , తనకు ఏమీకాని , వారి వలన ఎటువంటి ప్రయోజనమూ ఆశించకుండా తన శ్రమనూ , తన ఆదాయాన్నీ ఇవ్వడం Paderewski హృదయం గురించి చెబుతోంది కదూ !
మనలో చాలామందిమి అనుకుంటాం " నేను అతడికి సహాయం చేస్తే నాకేమిటి ప్రయోజనం ?"
అతడు అనుకున్నాడు " నేను సహాయ పడకపోతే వాళ్ళకి ఎవరు సహాయ పడతారు ? అని
అదే ఉత్తములకీ మనకీ తేడా !

.

ఇది ఇక్కడితో ఆగిపోలేదు

.

Paderewski తర్వాతి కాలం లో పోలాండ్ ప్రధాని అయ్యారు .

.

రెండో ప్రపంచ యుద్ధం లో పోలాండ్ సర్వ నాశనం అయిపోయింది . 15 లక్షల మంది ఆకలితో అలమటించే స్థితికి చేరారు .
.Paderewski కి ఏమి చెయ్యాలో తోచలేదు . ఎవరిని అడగాలో తోచలేదు . చివరికి అమెరకా ఆహార , పునరావాస విభాగాన్ని సంప్రదించాడు . దానికి అధిపతి Herbert Hoover . ఇతడే తర్వాత అమెరికా అధ్యక్షుడు కూడా అయ్యాడు . అతడు వెంటనే

ప్రతిస్పందించాడు . టన్నులకొద్దీ ఆహార పదార్థాలు పోలాండ్ కు సరపరా జరిగింది . పోలాండ్ లో ఆహార సంక్షోభం నివారించబడింది .

.

Herbert Hoover చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పడానికి Paderewski అమెరికా వెళ్లి హూవర్ ను కలిశాడు . కృతజ్ఞతలు చెబుతూ ఉండగా హోవర్ అన్నాడు

.

" కొన్ని సంవత్సరాల క్రితం మీరు కాలేజీ ఫీజులు కట్టలేని ఇద్దరు యువకులకు సహాయం చేశారు . వారిలో నేను ఒకడిని "

.

ఈ ప్రపంచం ఒక అద్భుతమైన ప్రదేశం . నీవు ఏది ఇస్తావో అది నీవు అనేక రెట్లు పొందుతావు అనే గీతా సారం ఇది .

.

The world is a wonderful place. What goes around usually comes around.

క్షమత

జీవితంలో ఎవరినైనా, ఎప్పుడైనా క్షమించారా?

ఆ అవకాశం వచ్చిందా?

క్షమించినటువంటి అవకాశం వచ్చిందా?

క్షమించాలంటే ఏం చెయ్యాలి మొట్టమొదట?

క్షమించాలంటే ఏం చెయ్యాలండి?

పోనీ, రివర్స్ ప్రశ్నిద్దాము.

ఎవరి చేతనైనా క్షమింపబడాలంటే ఏం చెయ్యాలి? మనం.

మనం ఒకళ్ళ చేత క్షమింపబడి వుండాలి అంటే, మనం ఏం చేసి వుండాలి వాళ్ళకి?

మీరు ఎవరూ ఆన్సర్లు చెప్పకపోతే నేనేమీ పాఠం చెప్పనండి. నా పద్ధతి తెలిసిందే కదా! మీకు, ఉపన్యాసం చెప్పుకునేపోయేవాడిని కాదు. అట్లా అయితే, మిమ్మల్ని అందరినీ ప్రార్థన చేయమని, ఏదో మామూలుగా కూర్చోమని, ఆ పద్ధతి కాదు మనదంతా. మీ అవగాహనా సామర్థ్యాన్ని పెంచడమే నాపని. అది. అది పెరగలేదనుకోండి, అలాగే గానుగ ఎద్దులానే తిరుగుతూ వుంటావు అంతే. మార్పురాదు. అట్లా ఆ తెలివి అందులోనే వుంటే ప్రయోజనమేమీ లేదు. నువ్వు ఎదగాలంటే, పై స్థాయి తెలివి తేటలు రావాలి. పై స్థాయి తెలివితేటలు వస్తేనే, ఈ తత్త్వజ్ఞానం అర్థం అవుతుంది. లేకపోతే మీరు ఎంతకాలం బుర్రబద్ధలు కొట్టుకున్నా, ఆ పంచీకరణ ఐదు ఐదుల ఇరువై ఐదు అంతే వుంటుంది. అర్థమైందా?

లక్షల సంవత్సరాల నుంచి బోధించినప్పుడు వేదవ్యాసుడు చెప్పినప్పటి నుంచి, ఐదు ఐదుల ఇరువై ఐదు అంతే వుంది. ఆ పాఠాల్లో ఏ మార్పు రాలేదు. వేదాంత పాఠాలలో ఏ మార్పు వుండదు. అవే వుంటాయి. ఉపనిషత్తులు చెప్పినకాలం నుంచి ఇప్పటి వరకూ అవే వున్నాయి. ఏం మార్పులు చేయలేదు. అర్థమైందా?

కాకపోతే తెలివితేటలు ఎవరివి మారాలి?

మనవే మారాలి. మారాలి అంటే ఇలా ప్రశ్నలు వేసుకోవాలి.

నేను ఎప్పుడైనా జీవితంలో ఎవరినైనా క్షమించానా?

లేదూ ఎవరి చేతైనా క్షమించబడ్డానా?

ఈ రెండు కాన్‌సీక్వెన్సెస్ జీవితంలో అనుభూతిలో వుండాలి.

ఎందుకని? ఎందుకు వుండాలండి?

రోజూ భగవంతుడిని ఏం వేడుకుంటున్నావు? ఏం వేడుకుంటున్నామండీ?

క్షమించమనే కదా! వేడుకుంటున్నావు. రోజూ మీరు పూజలు, ఆలయాల్లో చేయండి, మీరు ఎక్కడైనా చేయండి. పూజలు చేయండి, వ్రతాలు చేయండి, జపాలు చేయండి, అన్నీ చేయండి. అన్నిట్లో అది వుంటుంది.

'నాయనా! నేను తెలిసో, తెలియకో చేసినవాటిని అన్నింటినీ దయతో క్షమించేసి, నన్ను గట్టున వేసేయి' అని అడుగుతావుంటావు.

భాషవేరే కాకపోతే. తెలుగు కాదది. సంస్కృతము. అర్థమైందా?

ఎందుకు క్షమించాలి ఈశ్వరుడు?

మనం ఈశ్వరుడికి ఏం చేశామండి?

నువ్వు ఈశ్వరుడి చేత క్షమించబడాలి అంటే, రెండు లక్షణాలు మనకు అనుభూతం అయ్యి వుండాలి అని చెప్పాకదా! నువ్వు క్షమించడం నీకు తెలిసి వుండాలి. లేదంటే, క్షమించబడినటువంటి సంఘటన అయినా కానీ నీకు అనుభూతం అయివుండాలి.

ఈ రెండూ మనకు అనుభూతమై వున్నాయా?

వున్నవాళ్ళు ఎవరన్నా కళ్ళల్లో ఎక్కడా కనపడడం లేదు. కళ్ళల్లో మెరుపులు కనపడడం లేదు. మెరుపులు లేకపోతే లేకపోయినట్లే. అలాంటి సందర్భం మీలో రానట్లే. అది.

వుండాలా? అక్కర్లేదా? అసలది?

వుంటేనే కదా! మనకు...

ఒక్కటి గుర్తుపెట్టుకోండి! అనుష్టాన వేదాంతమే నీతో మిగిలేది. మిగిలిందంతా వట్టిదే. మిగిలినది అంతా వాచా వేదాంతము. అర్థమైందా అండీ! వాచా వేదాంతము అంటే, రోజూ నేను ఆత్మస్వరూపుడిని అనుకోవడము, నేను ఈశ్వరుడిని అనుకోవడం, నేను బ్రహ్మస్వరూపుడిని అనుకోవడం, పుస్తకాలు చదువుకోవడం, స్తోత్రపాఠాలు వల్లె వేయడం ఇవన్నీ అవసరమే. నేనేమీ కాదనడం లేదు. అదంతా ప్రాథమిక విద్య. ఆ విద్య లేకుండా తరువాత నేను చెప్పిన మాటలు నేర్చుకోవాలంటే, అసలు ఆ బేసిక్ అవగాహన లేకుండా నువ్వు నా దాంట్లోకి రాలేవు. అవి నేర్చుకున్నావు గానీ, అక్కడే ఆగిపోతే, ఎల్.కే.జీ తోటే నీ చదువు అయిపోయినట్టే. అది కేవలం ప్రాథమిక విద్య అంతవరకే. దానిని నిజజీవితంలోకి అనువదించుకోవడం రావాలి. ఇప్పుడు మనం రోజువారి జీవితంలో జీవిస్తున్నామండి.

రోజూ ఎవరినైనా క్షమిస్తున్నామా?
రోజూ ఎవరిచేతైనా క్షమించబడుతున్నామా?
లేదూ సంవత్సరానికి ఒకసారి క్షమిస్తున్నామా?
సంవత్సరానికి ఒకసారి క్షమించబడుతున్నామా?
అసలు ఈ సందర్భం ఎప్పుడు వస్తుంది?
(మనం ఎదిగితే అవతలి వాళ్ళను క్షమిస్తామండీ!)
మనం ఎదిగితే క్షమిస్తాము.
ఎప్పుడు క్షమిస్తాము? ఎందుకు క్షమించాలి అసలు వాడిని?

"**క్షమత**" అంటే ఏమిటి అసలు?
అందులోనుంచి వచ్చిందే కదా! క్షమత అనే శబ్దంలోనుంచే క్షమించడం, క్షమించబడటం అనే రెండు క్రియలు పుట్టినాయి.
క్షమత అంటే ఏమిటి?
'త' కూడా తీసేయి.

'**క్షమ**' అంటే ఏమిటి అసలు? తెలుగు శబ్దమా? సంస్కృత శబ్దమా అది?

అంటే భాషాజ్ఞానం బాగా తగ్గిపోయింది ఒక తరం మారేటప్పటికి. కొద్దిగా.. మన బాబూరావు గారి తరానికి అయితే కొద్దిగా భాషాజ్ఞానం వుంది. తరువాత తరం వాళ్ళు అంతా కనబడుతున్నారు ఇప్పుడు. ప్రస్తుతం భాషాజ్ఞానం అడుగవలసిన పరిస్థితి వచ్చేసింది.

'క్షమ' అనేది తెలుగు శబ్దమా? సంస్కృత శబ్దమా?
(సంస్కృత శబ్దం అండీ!)
ఆ.. తెలుగు శబ్దం కాదు, సంస్కృత శబ్దమే అది.
'క్షమ' అంటే ఏమిటి?
('క్షామము' అంటే కరువు. 'క్షమ' అంటే...) (క్షేమము...)
ఆ.. క్షేమము, క్షామము, క్షమ బానేవుంది. క్షకారము మీద పదాలు బానే వచ్చాయి. కానీ, 'క్షమ' అంటే ఏమిటి?
(క్షమించడం అంటే ఏమిటి? ఫర్ గివ్ నెస్ కదా? ఆ.. ఫర్‌గివ్‌నెస్)

'క్ష' అంటే బాధించుట. 'క్ష' అంటే బాధించుట. బాగా గుర్తుపెట్టుకోండి. ఆ 'క్ష'కారము మీదనే వాళ్ళు అన్నీ ఎందుకు వేశారంటే, 'క్ష' అంటే బాధించుట. లేక వేదన పడుట. 'మ' అంటే ఆ బాధ లేకుండా చేయుట. ఆ వేదనని లేకుండా చేయుట. బాధపడకుండా చేయుట. వేదన పడకుండా చేయుట. లేదూ బాధను లేకుండా చేయుట. వేదనని లేకుండా చేయుట. 'మ' అంటే అర్థం అది. ఎక్కడైనా 'మ'కారం యొక్క వుద్దేశ్యము అది. అంటే ఏకాక్షరము కూడా సంస్కృతములో శబ్దమై... వాళ్ళు ఆ భాషని పొందికగా ఏర్పాటు చేశారు. తెలుగులో అట్లా వుండవు. తెలుగులో అన్నీ రెండు మూడు అక్షరాలు కలిస్తేనే పదాలు తయారౌతాయి. కానీ సంస్కృతములో అట్లా కాదు. 'క్ష' అంటే బాధించుట. లేక వేదన పడుట. లేదా బాధించబడుట. అది ఏ రకమైన క్రియగా ఉపయోగపడ్డా కూడా. వేదన అన్న దృష్టిని ఉద్దేశ్యించి, 'క్ష'కారాన్ని వాడారు అక్కడ. అర్థమైందా అండి?

'క్ష్మాపాలుడు' అని కూడా అంటాము. అది తెలుసా మీకు ఎవరికైనా?
క్ష్మాపాలుడు. రాజుని 'క్ష్మాపాలుడు' అంటారన్నమాట.
ఎందుకని అట్లా ఆ శబ్దం వేశారు?

ప్రజలందరి యొక్క వేదననీ తొలగించువాడు క్ష్మాపాలుడు. అర్థమైందా అండీ! చాలా అర్థవంతమైనటు వంటి శబ్దాలు వుంటాయండి. అంటే మీ అందరకీ కొద్దిగా ఆ రకమైనటువంటి భాష ఆనందించే లక్షణం వుంటే, మీరు చదివే పుస్తకాలని, ఇట్లా ఆనందిస్తూ చదువుతారు. ఆహా! ఇవాళ నేను చాలా గొప్ప విషయాన్ని తెలుసుకున్నాను. అద్భుతమైన విషయాన్ని తెలుసుకున్నాను.

నిజజీవితంలో ఎప్పుడన్నా వాడుతారా? ఈ 'క్ష'కారముతో వున్నటువంటివి?
నోరు తిరగని పదాలు మనకు ఎందుకండీ?
అతడు ఆమె పోయే వచ్చే... అనుకుంటే జీవితము అయిపోయే.
కానీ తెలివితేటలు ఎట్లా వస్తాయి?
రావు. అర్థమైందా అండీ!
కాబట్టి క్ష్మాపాలుడు అంటే అర్థం అది. క్షకారము చాలా.. జీవితంలో అందుకే..
మనకు అక్షరాలు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు అండీ?
('అ' నుంచి 'ఱ' వరకు)
'అ' నుంచి 'ఱ'నా? 56 అక్షరాలు ఎక్కడి నుంచి ఎక్కడికి?
'అ'కారము నుంచి 'క్ష'కారము వరకే. 'ఱ'లు లేవు. అర్థమైందా అండీ!
అంటే ఇప్పుడు ఎవరికీ... అక్షరాలు కూడా మరచిపోయారు అంతా!

అది 'అ'కారము నుంచి 'క్ష'కారాంతము. 'అ'కారము ఆది, 'క్ష'కారము అంతము. 'అ'కారము నుంచి 'క్ష'కారము వరకు వున్న ఏ అక్షరమైననూ మంత్రమై భాసిస్తుందన్న మాట. వాటికి మూలం సంస్కృతములో వుంది. అర్థమైందా అండీ! సంస్కృతం అక్షరాలు వాళ్ళు నియమం చేసి, అక్షరమాలను నిర్ణయం చేసి, దాని నుంచి తెలుగును తీసుకొచ్చినప్పుడు కూడా, ఆ రకమైనటువంటి దైవీశక్తిని పోనివ్వకుండా చేశారన్నమాట దానిని. అర్థమైందా అండీ!

ఏ ఒక్క అక్షరాన్ని నిరంతరాయంగా జపం చేసినా, అది మంత్రమై భాసిస్తుందన్నమాట. వాటిలో ఆ శక్తి వుంది. 'అ'కారము నుంచి 'క్ష'కారము వరకు. నీకు భావమే వుండాలే గాని, ప్రత్యక్షరము మంత్రమై భాసిస్తుంది. అంత శక్తి కలిగినటువంటి, అక్షరాలు అన్నమాట అవి. అందుకే అవి 'అక్షరములు'. అర్థమైందా అండీ! అక్కడ కూడా 'క్ష'కారమే పెట్టాము.

అక్షరము అంటే ఏమిటి?
క్షరము అంటే?
నాశనము.
ఎలా? వ్యుత్పత్తి చెప్పండి చూద్దాము? ఎలా నశిస్తుంది?
క్షరము అంటే నశించునది అని మీ అందరికి బాగా మనసులో పడిపోయింది. ఎలా?
అక్షరము అంటే నశించనిది. 'క్ష'కారానికి ఇప్పుడే చెప్పా. 'క్ష'కారము అంటే ఏమిటి?
వేదన. క్షరము అంటే బాధిస్తూ పోతుంది. వేదన కల్గిస్తూ పోతుంది. నశించిపోతుంది.
అర్థమైందా అండీ?
ఎవరైనా బాధ కలిగేవి పోవాలనుకుంటారా? ఆనందక్షణాలు పోవాలనుకుంటారా?
క్షణము – అక్కడ ఇంకో 'క్ష'కారము వేశా మీకు.
క్ష – అంటే మళ్లా క్షణము అన్నాము అందుకే.
ఎందుకని 'క్షణము' అన్నామండీ?

మీరెవ్వరూ మీకు మీరు చదువుకున్న పుస్తకాలలో, 'క్ష'కారము మీద ఎన్ని శబ్దాలు వచ్చో, ఇంటిదగ్గర హోం వర్క్ రాయండి. అప్పుడు మీకు తెలుస్తుంది అది. అంటే మనలో ఒకటి గుర్తుపెట్టుకోండి. ప్రతీది సమర్థతే అయ్యి వున్నది. అది గుర్తుపెట్టుకోండి. నీవు ఎంత సమర్థుడవై వుండాలి అంటే, నీ తరువాత తరాలు, తరాలు, తరాలు, తరాలు నిన్ను ఆశ్రయించి, ఈయన దగ్గర ఎంత నేర్చుకున్నా ఇంకా మిగిలిపోయిందిరా బాబు! అనే స్థితిలో మనం వుండాలి.
ఇప్పుడు అలా వున్నామా?

ఎవరన్నా ఏమన్నా చెప్పండి అంటే మన దగ్గర ఏమన్నా వున్నాయా?
సైలెన్సేనా? అంతా మౌనవ్యాఖ్యయేనా?
అది అర్థం కాదుగా పిల్లాడికి. ఏమండి? ఇట్లా అసలు మనం ఎదుటివాడికి ఏం నేర్పగలిగే సమర్థత మనలో ఏరోజు కారోజు ఏం నేర్చుకున్నాము, ఏం పెంపొందించుకున్నాం? మన తరువాత తరాల వారికి ఏం నేర్పగలిగే సమర్థత మనలో వుంది?
ఎంత సేపు వంకాయ కూర ఎలా వుండాలి? బీరకాయ కూర ఎలా వుండాలి అదేనా?

అది వాడు ఎట్లాగు నేర్చుకుంటాడు. వాడికి ఆకలి వేస్తుంది. వాడికి ఆకలి వేసినప్పుడు వాడు ఎట్లాగు ఆహారం వండుకోవడం వాడికి చేతనౌతుంది. నువ్వు తిన్న వంకాయ కూర, బీరకాయ కూర వాడు ఎట్లాగు తినడు. పిజ్జాలు, బర్గర్లే తింటాడు వాడు. అర్థమైందా అండీ! వాడి జీవన శైలిని బట్టి వుంటుంది అది.

కానీ మనం అసలు వాళ్ళకి ఏం నేర్పాలి?
ఏం నేర్పితే అసలు వాడు మనల్ని ఆశ్రయిస్తాడు?
అంతేనా కాదా? అండీ!
పెద్దవాళ్ళందరికీ ఇంట్లో నుంచి బయటకు వెళ్ళేటప్పుడు, పుట్టినరోజు ఏదైనా అంశాలు వచ్చినప్పుడు పెద్దలకి నమస్కరించాలా వద్దా? పిల్లలందరూ కూడా ఎందుకు నమస్కరించాలి?
(ఆశీర్వాదం కోసం)
ఏ? ఏమని ఆశీర్వదిస్తావు?
(దీర్ఘాయుష్మాన్ భవ)

భార్యగారు, భర్త గారి ఆశీర్వచనము తీసుకోవాలా వద్దా? తీసుకోవాలా?
భార్యగారు, భర్త గారి ఆశీర్వచనము తీసుకోవాలా తీసుకోనక్కరలేదా?
భర్తగారు, భార్య గారి ఆశీర్వచనము తీసుకోనక్కరలేదా? లేదా అలాగ?
(తీసుకోవచ్చు కానీ ప్రస్తుతం అమలులో లేదు.)
ఎందుకని? ఇది అమలులోవుందా? ఇదీ లేదుగా!

భార్యగారు భర్తగారి కాళ్ళకి దండం పెట్టమనే మంచి సంప్రదాయం, ఆ తరంలో వుండేది అదిగో. పైతరాలలో. ఈ తరంలో లేవు. ఇప్పుడంతా ఏరా పోరా నే. అర్థమైందా అండీ!

పైగా అది ఏమంటున్నారు పైగా?

సాన్నిహిత్యము అని అనుకుంటున్నారండి. దోషం అన్నమాట అది. ఒకటి గుర్తు పెట్టుకోండి. ఎవరినైనా పూర్వకాలంలో వాళ్ళయొక్క బాధని వ్యక్తం చేయాలనుకుంటే, అప్పుడు మాత్రమే ఏకవచన ప్రయోగం చేసేవాళ్ళు. చాలామందికి తెలియదండి ఈ విషయం. ఇప్పుడు ఎప్పటి మాటలు మాట్లాడుతున్నానంటే, రామాయణ కాలం, త్రేతాయుగ కాలం నుంచే మనకు అన్నీ వారసత్వ సాంప్రదాయాలు వచ్చినాయి. కృతయుగ కాలం నాటి వారసత్వ సాంప్రదాయాలు ఇప్పుడు మనం చెప్పుకోవడానికి అనువుగా మనం అసలు జీవించడం లేదు. కాబట్టి వాటిని వదిలేశాము. శ్రీరామచంద్రమూర్తి కాలం నుంచి కూడా ఒకరినొకరు పరస్పరం గౌరవించుకుని మాట్లాడుకునే ధోరణిని రామాయణం మనకి నేర్పిందన్నమాట. ఏరా పోరా లేదు.

తండ్రి అయినా, కొడుకు అయినా, ఏ సంబంధాలైనా సరే, ఒకరినొకరు ఏకవచన ప్రయోగంలో ప్రయోగించకూడదు. ఎందుకని? ఎందుకనో చెప్పండి చూద్దాం?

(ద్వైవీభావన పోతుంది)

ఎందుకు పోతుంది?

మనమందరం దివ్యత్వానుభూతిలో వుండాలి అంటే, ఏ స్థానంలో వుండాలి?

(మనమందరం దివ్యత్వానుభూతిలో వుండాలి అంటే) హృదయస్థానంలో వుండాలి. **హృదయస్థానంలో వున్నప్పుడు, నువ్వు ఏకవచన ప్రయోగం చేయలేవు**. అర్థమైందా అండీ! తర్వాత కాలంలో నిందాస్తుతులతో కూడినటువంటి కావ్యాలు వచ్చినాయి. కలియుగ కాలంలో. అదికూడా కలియుగంలో మధ్యయుగకాలల్లో వచ్చినాయన్నమాట. ఆ నిందాస్తుతులతో, నా బాధలన్నిటికీ నీవే కారణము అని ఈశ్వరుడిని తిట్టడం. ఆ తరువాత అయ్యో! నిన్ను తిట్టానే అని మళ్ళా ఏడ్వడము. ఈ రకమైన 'వైక్లబ్యం', ఇది కూడా సంస్కృత శబ్దమేనండి. 'వైక్లబ్యం' అనేది కూడా.

అంటే మనసు వికలత్వం చెందడాన్ని వైక్లబ్యం అని అంటారు. పరి పరి విధాలుగా మనసు ఆలోచించడం అన్నమాట. ఆ రకమైన లక్షణం అప్పుడు లేదు. ఇప్పుడు మనం ఏ లక్షణంలో వున్నాము ఇప్పుడు?

మనసు పరిపరి విధాలుగా పోతోంది కాబట్టి మనం కూడా ఇప్పుడు ఏం చేస్తున్నాం? రాత్రిపూట పడుకునేటప్పుడేమో ఈశ్వరుని నిందాస్తుతులతో నిందిచటం, పొద్దున్నే లేవగానే అయ్యయ్యో! తప్పైపోయింది బాబూ అని చెంపలు వేసుకోవడం. మళ్ళా పూజలు చేయడం.

ఎందుకని? రాత్రి భోగిగా నిద్రపోతున్నావు. రోజంతా పగలంతా ఏం చేశావు?

ఆ దేహ వ్యాపారాలన్నీ చేశాం. ప్రారబ్ద కర్మానుసారం జీవించాము. వాడిని మనం తిట్టడమో, మనని వాడు తిట్టడమో, ఏదో ఒకటి జరుగుతోంది అక్కడ. అంటే మనం ఇతరులకు వేదన కల్గించడమో, లేదా ఇతరుల చేత మనం వేధించబడడమో, అర్థమైందా అండీ? అందుకనే 'క్ష'కారానికి అంత విలువ ఇచ్చి, ఇవాళ దాని మీదనే మాట్లాడుతున్నాము. ఈ వేదన కలుగజేయడం 'క్ష'కారము అన్నమాట. అర్థమైందా అండీ?

ఈ **'క్షమ' అంటే ఆ వేదన లేకుండా చేయడం**. అర్థమైందా అండీ? కాబట్టి రోజువారీ జీవితంలో మనవల్ల ఎవరికైనా వేదన కలుగుతోందనుకోండి...

అప్పుడు మనం ఏ స్థితిలో వున్నాం?

వాళ్ళ చేత క్షమించబడేటటువంటి స్థితిలో వున్నాము. అర్థమైందా?

మనకే ఎవరి వల్లన్నా వేదన కలిగిందనుకోండి, అప్పుడు మనం ఏ స్థితిలో వుండాలి?

వాళ్ళను క్షమించే స్థితిలో వుంటాము.

ఈ రెండిటిలో ఏది పై చేయి? ఏది కింద చేయి?

(క్షమించగలగడం పైచేయి, క్షమించబడడం కింది చేయి)

ఏమండి, క్షమించగలగడం పైచేయి అని అందరూ ఒప్పుకుంటారా? అంతేనా లేకపోతే వాడి చేతే మనం క్షమించబడితే బెటరా? (better)

అలా కుదరదుగా. అంతేనా కాదా? ఎందుకని?

ఎందుకనో చెప్పండి చూద్దాం?

ఏకగ్రీవం, మీరు చిన్నపిల్లల్ని అడగండి, క్షమించడమే గొప్ప. సమస్య లేదు అందులో. ఎందుకని అని అడిగితే సమాధానం చెప్పలేకపోవచ్చుగాని, ఏరా నువ్వు వాడి దగ్గరకు వెళ్ళి తీసుకుంటావా? నువ్వు వాడికి ఇస్తావా? అని అడుగు. ఏం చెప్తాడు?

ఇస్తాను అంటాడు. అంతేగాని తీసుకుంటాను అని అనడు. అంటే మనిషిలో మానవత్వం అనేటువంటి రూపధారణ చేయగానే, నీలో ఈ క్షమాగుణం, నీలో సహజలక్షణం అయివున్నదన్నమాట. అది నీలోపల ఇన్నేట్‌బిహేవియర్ innate behaviour అంటాము దీనినే. సహజ స్వభావం అన్నమాట. నీ చేయి ఎప్పుడూ ఆ పై చేయిగా వుండేటట్టుగానే జీవించడానికి ప్రయత్నిస్తావు గాని, చెయి కిందకి జీవించడానికి నీ మనసు అంగీకరించదు. ఎప్పుడెప్పుడైతే చేయి కిందైన సందర్భం వచ్చినప్పుడల్లా ఏమౌతావు? బాగా వేదనకు గురౌతావు. నా చేయి కింద అయ్యిందని లోపలది బాధపడిపోతూ వుంటుదన్నమాట. మళ్ళా నీ చేయి పై చేయి అయ్యేంత వరకూ పోరాడుతావు. అర్థమైందా? ఇది మనిషిలో వున్నటువంటి పురోగమన కారణం. ఇది లేకపోతే మనిషి పురోగమించడండి. అర్థమైందా అండి!

ఇక వేదాంత విషయానికి వస్తే, తత్వజ్ఞానం నేర్చుకోవాలి అంటే, '**క్షమ సర్వస్వమై బరగు**' అసలు అన్ని దైవీ లక్షణాలకి, ఆధారభూతమైనటువంటి దైవీ లక్షణము అంటూ ఏదైనా వుందంటే అది క్షమయే. అసలు క్షమించడం అనేటటువంటి లక్షణం రానటువంటి వారికి,

మనసా వాచా కర్మణా ఈ 'క్షమ' అన్నటు వంటి లక్షణం మనసులో నిరంతరాయంగా, రాశీభూతమైనటువంటి క్షమా స్వరూపంగా ఏ మనిషైతే వుంటాడో వాడే సాధు స్వరూపుడు. వాడికి ఈశ్వరుడికి భేదం లేదు.

ఎందుకని?

సకల జీవులు మనుషులే కాదు, సకల జీవులూ కూడా భగవంతుని వేడుకొంటూ వుంటాయి. అయ్యా! నాకు తెలియక, తెలిసీ చేసినటువంటి పొరపాట్లు, దోషాలు, నన్ను దయతో క్షమించు. నువ్వు ఎప్పుడైతే ఈ క్షమాగుణాన్ని నువ్వు నిలబెట్టుకున్నావో, సర్వకాల సర్వ అవస్థల యందు ఈ క్షమ అనే లక్షణాన్ని ఎప్పుడైతే పునాదిగా పెట్టుకున్నావో, అప్పుడు నువ్వు ఏమౌతావు?

ఈశ్వరుడవే.

ఆ ఈశ్వర లక్షణం నిన్ను ఎక్కడికి నడుపుతుందయ్యా?

నీవు ఈశ్వరుడివి అని తెలుసుకునే దాకా నడుపుతుంది.

ఇప్పుడు ఈ క్షమ, ఎంత దాని విలువ అంటే?

అందుకే నేను మొదట అడిగింది. నీకు జీవితంలో ఎంత మందికి క్షమించినటువంటి అనుభూతి వున్నది? లేదూ క్షమించబడిన అనుభూతి, అది కూడా ఒకరకంగా మంచిదే. అంటే మనం రజోగుణ, తమోగుణ ధర్మాలతో ఒక్కొక్క కాలంలో మనం, అజ్ఞాన యుతంగా ప్రవర్తించినప్పుడు ఏమౌతుంది? మరొక జీవులకు, ఇతర జీవులకు బాధ కలుగుతుంది. వేదన కలుగుతుంది. కలిగినప్పుడు వాళ్ళు ఏం చేస్తారు? నీకంటే ఉన్నతతరమైన సంస్కారం కలిగివున్నవాళ్ళు, నీకంటే ఉన్నతతరమైన స్వభావం కలిగివున్నవాళ్ళు, సత్వగుణ నిష్ఠ కలిగివున్న వాళ్ళు... వాళ్ళు ఏం చేస్తారు అప్పుడు?

(క్షమిస్తారు)

సరేలే! నేను కూడా ఒకప్పుడు ఇలాగే వున్నాను కదా! అని పిల్లవాడి చేష్టలాగా భావించి, క్షమిస్తారన్నమాట.

ఆ క్షమించినటువంటి బలం ఎంత?

అసలు ఈ క్షమకి బలం ఎంత? వుందా లేదా దీనికి?

అసలు క్షమించాలంటే ఎక్కువ శక్తి కావాలా?

క్షమించబడాలి అంటే ఎక్కువ శక్తి కావాలా?

(క్షమించాలంటేనే ఎక్కువ శక్తి కావాలి.)

అంతేనా అండి?

క్షమించాలంటేనే కావాలా వద్దా? ఔనా? ఏకగ్రీవంగా ఒప్పుకుంటారా? మీరు ఏమన్నా వీటో చేయదలచుకుంటే శుభ్రంగా వీటో చేయవచ్చండి. మీరందరూ ఒక పక్షం, నేను ఒక్కడినే ఒక పక్షం. అర్థమైందా అండీ!

క్షమించాలి అంటే మనకు ఎక్కువ సమర్థత వుండాలి.

అంతేనా కాదా?

ఇతరులకు వేదన కలిగించాలి అంటే?

తక్కువ సమర్థత, దానికేం కావాలి?

దోమ కూడా కుట్టి, చక్కగా వేధిస్తుంది మనల్ని. ఔనా కాదా?

ఎప్పుడైనా, ఎవరినైనా మనం వేధించాం అనుకోండి, మనల్ని వాడు ఎలా చూస్తాడు అంటే, ఈ దోమవలె చూస్తాడు. అప్పుడు నువ్వు మనిషిస్థితి కోల్పోతావు వాడి దృష్టిలో. ఏమైపోతావు?

ఓహ్! వీడికి మానవత్వం లేదు, మానవ ఉపాధిలో వున్నాడు కానీ, ఏ లక్షణం పోలేదు? (జంతువు లక్షణం) ఆ దోమ లక్షణం పోలేదు.

ఎందుకని?

కుట్టడమే దాని పని. అర్థమైందా అండీ?

దానికి ఎంత రక్తమైతే అవసరమో....చాలా... కొన్ని విషయాలు చెబుతాను. క్రిమి కీటకాదులలో, ఈ దోమకు ఒక్కదానికి ఒక ప్రత్యేకత వుంది. దానికి కడుపు నిండినా సరే కుడుతుంది. అంటే ఈ ప్రపంచములో ఎవ్వరూ కూడా, ఒక జీవి మరొక జీవిని, ఆహారం కొరకే బాధించేటటువంటి అనుగ్రహాన్ని ఇచ్చాడు భగవంతుడు. అర్థమైందా అండి. ఇంకేం.... పొట్ట నిండింది అనుకోండి. అది దేనిని హింసించదు. సింహం వుందనుకోండి, ఒక దానిని ఆహారం తిందనుకోండి, మరొకదానిని చంపదు. ఏ జీవి అయినా సరే అంతే. కప్పైనా సరే అంతే. పామైనా సరే. పొట్ట నిండిన తరువాత మాత్రం, ఆకలి తీరిన తరువాత మరొక జీవిని అవి బాధించవు. కానీ ఒక్క దోమకే ఒక్క లక్షణం ఇచ్చాడు, ఏమిటది? కుట్టడమే దాని పని. అంటే దానిలోపల వున్న ప్రేరణ ఎలా వుంటుందంటే, ఆ ఆ సందర్భం వచ్చినప్పుడు అది కుట్టుకుండా వుండలేదన్నమాట.

మనలో కూడా ఇప్పుడు ఈ లక్షణం వుందా? లేదా?

ఆ సందర్భం వచ్చినప్పుడు ఎదుటివారిని కుట్టకుండా వుండము మనము. మాటల ద్వారా కానీ, చేతల ద్వారా కానీ, హావభావముల చేత కానీ (body language also), వాడిని ఏమీ అనం. కానీ ఏం చేస్తాము? ఎదో అత్తమీద కోపం దుత్త మీద చూపెట్టినట్టు చెంబు పగలేస్తావు. అప్పుడు ఏమైంది? హావభావాల ద్వారా చెప్పినట్టేనా కాదా?

కాబట్టి ఈ వేదన కలిగించే లక్షణము సత్వగుణంలో వుందా?

లేదు.

అది (వేదన కలిగించే లక్షణము) ఎందులో వుంటుంది?

రజోగుణ, తమోగుణ ధర్మలలోనే (వేదన కలిగించే లక్షణము) వుంటుంది.

సాక్షిత్వం లో వుందా?

సత్వగుణంలోనే లేకపోతే, సాక్షిత్వంలో ఎలా వుంటుంది?

కాబట్టి, ఎప్పుడైతే మనం ఇతరులకు వేదన కలిగిస్తామో, వాళ్ళల్లో మనం ఏరకమైన భావాన్ని కలిగించాము ఇప్పుడు?

ఓహో! వీడు మనిషిరూపంలో వున్నటువంటి (జంతువు) దోమ. జంతువుకాదు. దోమ. సో.. దోమ కుడితే ఏం చేస్తారు మీరు?

(చంపేస్తాము) ఫట్టుమని కొడతావు దానిని. అవునా కాదా? చంపాలని కాదు నీ వుద్దేశ్యము. ఛస్తుందా బ్రతుకుతుందా (is not your criteria) ఈస్ నాటు యువర్ క్రీటీరియా. అవునా? కాదా?

ముందు కుట్టిన చోట ఏం చేస్తావు?

దెబ్బవేస్తావు.

ఆ దెబ్బకు అది ఏమౌతుంది?

వుంటే వుండచ్చు, పోతే పోవచ్చు.

అప్పుడు మనలో కూడా ఏ రకమైన భావ ప్రకంపనలు కలిగినాయి?

(రజస్సు, తమస్సు) Same సేమ్, అర్థమైందా అండీ!

అంటే మనలో ఇది (innate) ఇన్నేట్‌గా వుందా? లేదా?

(Natural) నాచ్యురల్‌గా వుంది. కాబట్టి అంటే ఈ సృష్టిలో..

మనమందరం విజ్ఞాన శాస్త్రంలో ఏం చదువుకున్నాము?

(Action is equals to Reaction) యాక్షన్ ఈజ్ ఈక్వల్స్‌టు రియాక్షన్. అని చదువుకున్నామా? లేదా? అది ఏ దృష్టితో చెప్పారు అసలు?

భౌతికమైనటువంటి పదార్థ దృష్టితో చెప్పలేదు. ఇదిగో ఈ సూక్ష్మ శరీరంలో వున్నటువంటి గుణప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని చెప్పారు.

అన్ని యాక్షన్లు ఎక్కడి నుంచి పుడుతున్నాయి ఇప్పుడు?
ఆ మూడు గుణాలనుంచే పుడుతున్నాయి.
కాబట్టి రియాక్షన్ కూడా ఏ గుణ ధర్మంతో వస్తుంది?
ఆ గుణ ధర్మంతోనే వస్తుంది. అర్థమైందా అండీ!
ఇప్పుడు ఎదుటివారు నన్ను విమర్శించారు అంటే రజోగుణ ధర్మంతో కాబట్టి యాక్షన్ ఈజ్ ఇక్వల్ టు రియాక్షన్ కాబట్టి నేను కూడా వాడిని... వాడు నాకు వేదన కలిగించాడు, నేను కూడా వాడికి వేదన కలిగించాను అన్నావనకుకోండి. అప్పుడు మనం ఏ స్వరూపం అయ్యాము?
(దోమ.) సేం ప్రాబ్లం (same problem).
నువ్వు వాడిని అలా చూస్తే, దోమగా చూస్తే, వాడు నిన్ను ఎలా చూస్తాడు?
నువ్వు వేదన కలిగించనప్పుడు?
సేమ్ (same). అప్పుడు మానవదేహం అనేటటువంటి లక్షణం వుందా?
మనుష్యత్వం అనే లక్షణంతో వున్నామా? మనం అప్పుడు?
లేము కదా!
కాబట్టి మనం మనసా, వాచా, కర్మణా ఎవరినైనా ఇలా బాధించాలనే లక్షణం మనలో రాగానే... అసలు ఇప్పుడు 'క్షమత' ఎక్కడ కలివుండాలి మనం?
'క్షమత' బహిరంగమా? అంతరంగమా?
(అంతరంగం)

కానీ మనం ఇప్పుడు మనం ఎక్కడ వ్యవహరిస్తున్నాము?
వాడేదో నాకు చేశాడండీ, నేను వాడిమీద ప్రతీకారం తీర్చుకోకుండా క్షమించేశానండి. అంటున్నావా? లేదా? కానీ ఎక్కడో దోషం లేదూ?

వాడి సూక్ష్మ శరీరం అలా ప్రవర్తించడానికి, ఆ ప్రేరణ పొందడానికి కారణం ఏమిటి?
గుణ ధర్మం కదా!
మరి **మనలో ఆ గుణధర్మం బలంగా వుండబట్టే కదా! మన చుట్టు పక్కల జీవులందరూ అలాగే తయారయ్యారు**. అంతేనా?

రావణాసురిడి చుట్టూ రాక్షసులే వున్నారా? దేవతలు కూడా వున్నారా?

(రాక్షసులే వున్నారు)

ఆయన దేవతలను అందరిని జయించాడా? లేదా?

(జయించాడు)

తన సమర్థతతో, తన తపఃశక్తితో రావణాసురుడు అందరినీ జయించాడు.

జయించిన పెద్దమనషులు, దేవతలనందరినీ తన చుట్టూ పెట్టుకోవచ్చుగా?

పెట్టుకుంటే కనీసం ఏమయ్యే వాడు?

దేవతే అయ్యేవాడు. సహవాస బలం చేత అయినా గాని.

కానీ, తనలో వున్న గుణ ధర్మం చేత ఎవరిని పెట్టుకున్నాడు?

రాక్షసులనే పెట్టుకున్నాడు. దేవతలనందరిని జయించి, మీరు సేవకులు పొండి అక్కడ మీ పనులు మీరు చేసుకోండి కానీ, నా ఆజ్ఞ ప్రకారము పని చేయండి అన్నాడు. కనీసం సృష్టి ధర్మాన్ని చెడగొట్టలేదు.

కానీ ఇవాళ మనమేమి చేస్తున్నాము?

సృష్టి ధర్మాన్ని మనం చేయనివ్వము. ఎవరి పని వాడిని చెయ్యనివ్వము.

ఏం చేస్తాము?

నువ్వు అలా చేయకూడదు, ఇలా చెయ్యాలి. నువ్వు ఇలా చెయ్యకూడదు, అలా చెయ్యాలి. అంటే సృష్టి ధర్మాన్ని మానవబుద్ధికి అనుగుణంగా మార్చడం మొదలు పెట్టాము.

ఏమైంది అప్పుడు దానివల్ల?

తమోగుణ ధర్మ కూడా, గాఢమైన తమోగుణ ధర్మంగా మారిపోయి, మేలుకొనే అవకాశం లేకుండా పోయింది. ఈ '**క్షమత**' అనే అంశము మేలుకునే అవకాశం లేదు ఇప్పుడు.

ఎప్పుడు మేల్కొంటుంది, అథవా మేల్కొన్నా కూడా?

కుండ పగలేసినాక, సొంతం వాడిబుర్రో, వీడి బుర్రో బ్రద్దలైనాక, వాడికి వీడికి ఇద్దరికీ దుఃఖాలు వచ్చేసి, పెను సమస్యలు వచ్చేసి, పెను ప్రమాదాలు వచ్చేసి, చివరకి ఇద్దరు జీవితాలలో ఏదో ఒక జీవితం ఆగిపోయే దశకు వచ్చేసి, నువ్వు శుంఠ అంటే నువ్వు శుంఠ అనుకొని,

అసలు మీకు ఈ శబ్దానికి అర్థం తెలుసా? 'శుంఠ' తెలుసా ఎప్పుడన్నా?
తెలుగు శబ్దమా? సంస్కృత శబ్దమా?
సంస్కృతం.
ఎందుకు పెట్టారు అలాగ? తెలుసా మీకు? అసలు దానికి అర్థముందా?
తెలుసా లేదా? ఈ పదం మీకు?

కానీ మీరు ఎవరూ ప్రయత్నం చేయడం లేదండి. నేను మీ అందరిని అడిగేది అదే. ఎప్పుడూ, నేనెప్పుడు వచ్చినా మిమ్మల్ని అడిగేది అదే. నేను ఎప్పుడో సంవత్సరానికి ఒకసారే వస్తాను, ఆర్నెన్నకొకసారో... వచ్చినప్పుడు
మీరు ఈ ఆరు నెలలు, సంవత్సరంలో ఏం అధ్యయనం చేశారు?
ఏం కొత్త తెలివితేటలు వచ్చాయి?
మీరు ఏం ప్రశ్నలు నన్ను అడుగగలుగుతారు?

పోనీ నేను ఏం అడిగితే మీరు ఏం చెప్తారు అని చూస్తాను. కానీ మీరు ప్రతిసారీ ఒక్కతీరుగానే వుంటున్నారు. ఎదగడం లేదు మీరు. మీరు ఎప్పుడైనా నన్ను, టకటకా ప్రశ్నలతో వేయగలుగుతారేమో అని చూస్తా, అబ్బే! నేనే మిమ్మల్ని ప్రశ్నలు వేయడమే తప్పా, మీరందరూ నన్ను ప్రశ్నలు వేసే స్థాయికి ఎదగడం లేదండి. 1:20 ఇరవైమంది వున్నారు కదా! మేమూ మీలాగా సాధకులమే కదా! మీరూ మాలాగా సాధకులే. మీమీ సాధనలో, మీ అధ్యయనంలో, మీరు ఒక ఆరు నెలలో, సంవత్సరం పాటో, నన్న చూడడానికి టైం వచ్చినప్పుడు, ఈ కాలంలో మీరు ఏం అధ్యయనం చేశారు? ఏం ప్రశ్నలతో వస్తారని చూస్తాను. అంతే కదా! లేకపోతే నాతో పనుందా మీకేమన్నా? నో యూజ్ (No use). అంతేనా కాదా? కాబట్టి మీరు ఎప్పుడైనా సరే, నాతో మాట్లాడాలంటే, నా క్లాసుకి రావాలి అంటే, లేకపోతే నాతో మీకు ఏదన్నా ప్రయోజనము వుండాలి అంటే, మీరు అధ్యయనం చేసినటువంటి...

అట్లా... అలా లేరు అనుకోండి, మీరు రెడీ అయి రాలేదనుకోండి, నా వల్ల మీకు పెద్ద ప్రయోజనము ఏమీ వుండదు.
ఆ.. ఈ శుంఠ అంటే అర్థం ఏమిటంటే, 'ఠ'కార శబ్దం ఎక్కడెక్కడ వాడుతాం?
ఇప్పుడే నేనే చెబుతా పోనీ, ఈ 'ఠ'కార శబ్దంతో మాటలు చెప్పండి చూద్దాం?
(ఠక్కున, కంఠం, పీఠం)

రావులు తెలుసా?

(పేపర్లా అండీ!) రావులు అంటే పేపర్లు కాదు. ప్రాణాలు. అర్థమైందా అండీ! అంటే, తత్సమ, తద్భవ శబ్దాలు రెండు వుంటాయన్నమాట. '**రావుల్ దప్పెను తనువండశ్యెను మూర్ఛ వచ్చెను**' భాగవత పద్యం రాదు. అది వస్తే రావులు అంటే ప్రాణాలు అని తెలుస్తుంది. అర్థమైందా అండీ! మనకి ఏది బాగా స్ఫురిస్తుందో, ఎందుకు ఈ ఎక్సర్ సైజ్ (exercise) మీ చేత చేయిస్తున్నానంటే, మీ బుద్ధిలో ఏది స్ఫురిస్తుందో మీకు తెలియడానికి. ఒక నూతనమైన శబ్దం విన్నాము. మన బుద్ధి ఏం ఆన్సర్ (answer) చెప్పిందో మీరు ఇప్పుడు గమనించండి.

మీకు తెలియకపోతే ఏం చేసింది?

బ్లాంక్ (Blank).

బ్లాంక్ అన్నప్పుడు తెల్లకాగితం కనపడిందా? నల్లకాగితం కనపడిందా?

నల్లకాగితం కనపడింది. తెల్లకాగితం కనపడితే మీరు ఏమన్నా రాసే ప్రయత్నం చేస్తారు. నల్ల కాగితం కనపడితే, ఆ ప్రయత్నం కూడా చేయవు. ఇప్పుడు మీరు ఏమన్నా ప్రయత్నం చేశారా? రావులు అనంగానే, అది నాకు తెలియదు అంది అంతే...

తెలియదు అనంగానే ఏమైంది?

బ్లాక్ పేపర్ (black paper) వచ్చేసింది. బ్లాక్ పేపర్, బ్లాంక్ పేపర్ ఒక్క అక్షరమే తేడా. అర్థమైందా అండీ?

మనకు నిద్ర వచ్చినప్పుడు కూడా, ఏ పేపర్ వస్తుందండి?

(Black paper) బ్లాక్ పేపరే వస్తుంది. (Not blank paper) నాట్ బ్లాంక్ పేపర్.

అవునా కాదా?

అదే సాధకుడు అయినవాడికి?

(Black paper will become blank paper) బ్లాక్ పేపర్ విల్ బికమ్ బ్లాంక్ పేపర్. (Such that you can write something on it) అంచేత దానిమీద ఏదైనా రాయవచ్చు. అర్థమైందా అండీ?

అంటే **గాఢనిద్రావస్థను అధ్యయనం చేయగలిగేటటువంటి సమర్థత** వస్తుంది అప్పుడు అక్కడ. అదీ సాధన అంటే. అది మనకు ఏమన్నా వుపయోగ పడుతుంది.

ఎందుకని?

మరణావస్థలో కూడా ఏమి వస్తుంది?

ఈ (black paper) బ్లాక్ పేపరే వస్తుంది అప్పుడు కూడా.

కానీ అక్కడ కూడా ఏమి రావాలి?

(You should get blank paper) అర్థమైందా అండీ?

అప్పుడు ఏం చేయవచ్చు?

ఆ ఆ మరణానుభూతి సమయంలో కూడా, You can decide something.

ఎప్పుడు decide చేయగలుగుతావు?

(Blank Paper వచ్చినప్పుడు)

ఎప్పుడు వస్తుంది?

'**క్షమత**' ఆ క్షమత వుండాలయ్యా!

ఈ క్షమయే జ్ఞానానికి మూలం. నీ లోపల బుద్ధి వికాసానికి మూలం 'క్షమ'.

క్షమించడానికి ఒక ఉపమానం చెప్పండి చూద్దాము?

జీసస్ (JESUS CHRIST).

ఊఁ.. ఆయన్ని బాగా శిలువ వేశారు, కొట్టారు, అది చేశారు, ఇది చేశారు, కానీ ఆయన ఏమన్నారు?

When he was crucified అంతేకాదా? Cross మీద ఎక్కించడాన్ని crucified, when he was crucified ఆయనేం చెప్పాడు?

దేవా! వీళ్ళు ఏంచేస్తున్నారో, వీళ్లు అజ్ఞానంతో చేస్తున్నారు, వీళ్ళకు తెలియదు, వీళ్ళు తెలియక చేశారు కాబట్టి, వీళ్ళని శిక్షించవద్దు, క్షమించు. అని అడిగాడు.

అదేనా క్షమించడం అంటే? ఇంకేమన్నా వుందా? Anything else?

ఇంకేమన్నా ఉపమానాలు చెప్పండి చూద్దాము, క్షమించడానికి ఎవరైనా వుపమానం చెప్పండి చూద్దాము?

మహాత్మాగాంధీ కూడా క్షమించారు.

ఊఁ.. మహాత్మాగాంధీ కూడా క్షమించాడు, ఎలాగ?

ఒక చెంపను కొడితే, మరొక చెంపను చూపమన్నాడు ఆయన. ఎలాగ?

అది కూడా క్షమే. అంటే, ఆనాడు దేశభక్తితో జీవించేకాలంలో, అందరిని వాళ్ళు హించించేవాళ్ళు. హింసని ప్రతిఘటించాలి అంటే తక్కువ శక్తి కావాలి, సహించాలి అంటే ఎక్కువ శక్తి కావాలి. అర్థమైందా అండీ! ఈ హింసని ప్రతిఘటించాలి అంటే, తక్కువ శక్తి కావాలి. అదే సహించాలి అంటే, ఎక్కువ శక్తి కావాలి, ఎందుకు? Why?

(Pain) ఆఁ...

సత్వగుణానికి ఎక్కువ శక్తి కావాలి. సత్వగుణ అభ్యాసానికి, ఎక్కువ శక్తిని ఉపయోగించి మనం వాటిని అభ్యాసం చెయ్యాలి.

చేస్తే ఏమిటి ప్రయోజనం?

చిన్నప్పుడు... ఇప్పుడు మీరందరూ బాగా పెద్దవాళ్ళు కదా!

ఇప్పుడు ఎంత అన్నం తిన్నారో, చిన్నప్పుడు కూడా అంత అన్నం తిన్నారా?

(లేదండి)

తినలేదా? ఏ?

(Capacity లేదు కాబట్టి) ఆఁ.. అప్పుడు అంత ప్రాణశక్తి లేదు. ఇప్పుడు ప్రాణశక్తి బాగా వికాసము పొందింది. అంతే కదా! **ప్రాణశక్తిని బట్టే కదా ఆకలి**. ఆ ఆకలిని బట్టే ఆహారం స్వీకరించడము. క్రమేపీ అభ్యాసము చేసే కొద్దీ, ఈ ఇంద్రియధర్మాలు ఎలా వికాసము పొందినాయో, అట్లాగే మనలో వున్న బుద్ధికూడా వికాసము పొందాలా వద్దా?

(పొందాలండి.)

ఆఖరి వికాసము ఏమిటి మనకి?

ఆ బుద్ధి వికాసమే (ఆఖరి వికాసము).

ఇంద్రియ ధర్మాలలో ఆఖరికి వికసించేది ఏది?

బుద్ధి వికాసము.

ఇప్పుడు క్షమించడం అనే లక్షణము, శరీర వికాసములో వేద్దామా? ప్రాణ వికాసములో వేద్దామా? మనో వికాసములో వేద్దామా? విజ్ఞానమయకోశ వికాసమైనటువంటి బుద్ధి వికాసములో వేద్దామా?

(విజ్ఞానమయ కోశం) అంతేనా? కాదా?

ఏమన్నా శరీర వికాసంలో వేసి చూద్దామా? శరీరానికి అంత బుర్ర లేదుగా. క్షమించడమా, అంతశక్తి లేదు దానికి. కాబట్టి ఇట్లా గమనించి చూస్తే, సత్వగుణ అభ్యాసం చేసేటప్పుడు మనకి బాగా శక్తి ఖర్చు అయిపోతుంది. అభ్యాసకాలంలో.

అదే సత్వగుణం నీకు సిద్ధించింది. సహజమయ్యింది. నువ్వు మూడు అవస్థలలో కూడా సాత్వికంగా వుండగలుగుతున్నావు. అప్పుడేమయ్యింది?

You are the potent energy. శక్తికి నీవే కేంద్రం అవుతావు అప్పుడు. అర్థమైందా అండీ!

కాబట్టి ఈ క్షమ అనే దాని వల్ల, You will be the energy source. You will be the energy centre.

మనలో శక్తి పెరగాలంటే ఏం చెయ్యాలయ్యా?

ఈ క్షమత వుండాలి.

క్షమతకు అసలు ఉపమానం ఏమిటో తెలుసా? ఎవరైనా చెప్పండి చూద్దాం?

సరియైన ఉపమానం వుండాలండి. కరెక్టుగా కొడితే కరెక్టుగా 100కి 1000 మార్కులు పడేటట్టుగా వుండాలండి ఉపమానము. సముద్రము.

సముద్రము ఎప్పుడైన ప్రతీకారము తీర్చుకుంటుందా?

ఎప్పుడన్నా చెలియలి కట్ట దాటుతుందా?

దాటదు.

ఎన్ని నదులు వెళతాయండి?

(అన్నీ!)

ప్రపంచంలో వున్నదంతా ఎందులోకి పోతుంది?

(సముద్రంలోకి.)

ఎందుకని?

అందులోంచే వచ్చింది కాబట్టి.

సముద్రవసనే దేవీ, పర్వతస్థనమండలే, అంటున్నామా లేదా?

భూమాతకు శ్లోకం ఏమిటి?

సముద్రవశనే దేవి ఆవెడ. మొదట్లో ఒకప్పుడు సముద్రంలో వుండేది.

కానీ

విజ్ఞానం ఏం చెబుతోంది? వైజ్ఞానికంగా ఏం చెబుతోంది?

భూమి మీద సముద్రము వుంటుంది అంటున్నారు.

ఏమిటి, ఎక్కడో contra వుంటుంది, ఏది కరెక్టు?

(భారతీయులం కాబట్టి మనవాళ్ళు చెప్పిందే కరెక్టండి)

అబ్బా!

ఇక్కడొక రహస్యం వుందండి. పూర్వం వాళ్ళు ఏం చెప్పినా కూడా, అంటే మనకు ఇప్పుడు ఆ భాష అందుబాటులో లేకపోవడం వల్ల, దాని వ్యుత్పత్తి అర్థాలు తెలియక పోవడం వల్ల, దానిలో వున్న రహస్యాలను శోధించే బుద్ధి వికాసం లేకపోవడం వల్ల, ఇలా తయారయ్యాం అన్నమాట. Actual గా వాళ్ళు చెప్పడంలో వుద్దేశ్యం ఏమిటంటే, సముద్రం అంటే నీళ్ళతో వున్న సముద్రం గురించి చెప్పడం లేదు. అది నీళ్ళతో వున్న సముద్రము, మన కళ్ళతో భౌతికంగా చూసిన సముద్రము గురించి మాట్లాడడం లేదు వాళ్ళు.

పాల సముద్రము అంటే ఎక్కడ వుందండి?

(వైకుంఠము, వ్యోమము)

పాల సముద్రము అంటే ఎక్కడుంది? Where is సముద్రము?

ఎక్కడన్నా ఈ ప్రపంచంలో పాల సముద్రము వుంటుందా ఎక్కడన్నా?

నీళ్ళ సముద్రాలు వుంటాయి కానీ, పాల సముద్రాలు వుంటాయా? ఎక్కడన్నా?

మరి ఎందుకండి అలా చెప్పారు? పాల సముద్రం వుంటుంది. దాంట్లో ఆయనెవరో పడుకుని వుంటాడు (ఆది శేషుడు). అలా పొడుకుని వున్న ఆయన మీద ఇంకొకాయన పడుకుని వుంటాడు (విష్ణుమూర్తి). అని చెప్పారా? లేదా?

ఏమిటి దాని శ్లోకం?

"**శాంతాకారం, భుజగ శయనం, పద్మనాభం**" వచ్చుకదా ఈ శ్లోకం అందరికి, దరిదాపుగా అందరికి వచ్చు, అందూ వినే వుంటారు దీనిని.

(మొన్న దర్శనం జరిగినది అన్నారు ఇదే కదా స్వామీ!)

'శాంతాకారం' అంటే ఏమిటి ఇప్పుడు?

అసలు శాంతానికి గుర్తు ఎవరు అంటే సముద్రము. అర్థమైందా అండీ! అంటే ఏమిటి? **త్రివిధ తాపములు లేనటువంటిది శాంతం. క్షమత అన్నా కూడా అదే అర్థం.**

ఈ శాంతము ఆ క్షమత అనేవి దగ్గర దగ్గరి అర్థాలన్నమాట. అర్థమైందా అండీ! కాబట్టి, **ఈ త్రివిధ తాపాలకి మనం పొంగక, కుంగక, లొంగక వున్నట్లయితే, మనతో క్షమత వున్నట్టు**. అప్పుడు మనం ఎవరు?

ఆ విశ్వ చైతన్య కేంద్రంగా మారే అవకాశం వుంది మనకి. మనలో వున్నటువంటి విశ్వ చైతన్య కేంద్రం మేల్కొని, ఈ మేల్కొన్నటువంటి విశ్వచైతన్య కేంద్రం, హృదయస్థానంలో వుంది కాబట్టి, ఇది బయట వున్నటువంటి విశ్వచైతన్య కేంద్రంతో అనుసంధాన పడుతుంది. అర్థమైందా అండీ! దీన్నే మరొక మాటల్లో చెప్పాలి అంటే, బయట అంతా విశ్వప్రాణం వుంది. మనలోపల వ్యష్టిప్రాణం వుంది. ఈ వ్యష్టిప్రాణం, ఆ విశ్వప్రాణంతో అనుసంధానపడాలి. ఆ అనుసంధానపడే విద్యల పేర్లే ధ్యానం, యోగం, etc. ఎన్నిపేర్లన్నా చెప్పుకోండి. ఈ రెండూ సమన్వయ పరచడం, ఈ రెండిటిని ఒకే సూత్రం మీద సమన్వయ పరచడమే... నవవిధ భక్తి మార్గాలు అదే, ధ్యానమార్గం అదే, యోగమార్గం అదే, అన్నీ అదే!

Ultimate గా ఇవి రెండూ ఒకే సమన్వయంలోకి వచ్చినప్పుడు, మనలో ఏమి ఏర్పడింది?

శాంతకారం. అర్థమైందా అండీ!

ఇప్పుడు మన గెలాక్సీ Milky way వుందా? లేదా? పైన పాలపుంత అని చెబుతున్నామా? లేదా? ఆ గెలాక్సీ మిల్కీ వే లో ఈ త్రివిధ తాపాలు వున్నాయా? ఆదిభౌతిక, ఆధ్యాత్మిక, ఆదిదైవిక తాపాలు వున్నాయా? వున్నాయా?

(లేవు.)

ఎందుకని?

అక్కడ జీవులు లేవు. అంతా పదార్థమయము, శక్తిమయము. అయితే పదార్థమయము. లేకపోతే శక్తిమయము. రెండే వున్నాయి. అంతే. ఈ రెండిటి మిశ్రితంగా వున్న జీవులు మనం. మనలో పదార్థము వుంది, శక్తి కూడా వుంది. రెండూ ఒక proportion తో balance అయ్యింది కాబట్టి, మనం ఇట్లా ఆకారంతో కనబడుతున్నాము.

ఈ రెండిటిలో శక్తి యొక్క ప్రభావం పెరిపోయిందనుకోండి, ఏమౌతుంది?

పదార్థ విస్ఫోటనం జరుగుతుంది. అర్థమైందా అండీ!

శక్తి యొక్క బలం పెరిగితే ఏమౌతుంది?

పదార్థ విస్ఫోటనం జరుగుతుంది. ఈ body పోతుంది. అంతేనా అండీ!

శక్తి యొక్క బలం తగ్గింది. పదార్థ బలం పెరిగిపోయింది.
అప్పుడేమయ్యింది? అప్పుడు ఏమయ్యాము?
వికలాంగులం అయ్యాము.
ఉన్నాయి కానీ, పనిచెయ్యవు. అర్థమైందా అండీ!
అన్నీ వున్నాయి కానీ, అవి పనిచెయ్యవు. కారణం ఏంటి?
శక్తి యొక్క బలం తగ్గింది. పదార్థ బలం పెరిగింది.
ఈ రెండు ఒక సమతౌల్యంలో వున్నాయి ఇప్పుడు మనలో.
వున్నాయా? లేవా?
వున్నాయి కాబట్టే శుభ్రంగా తింటున్నావు, శుభ్రంగా గుండ్రాయి తిని, మరునాటికల్లా హరించుకుంటున్నావు. అవునా కాదా?
బోల్లెడు మందులు వేసుకుంటే కానీ, నాలాగా అరగని వాళ్ళు బోల్లెడు మంది లేరా?
వున్నారా? లేరా?
డాక్టరు దగ్గరకు వెళ్ళి, ఏవండి ఆ problem అండీ, ఏవండి ఈ problem అండి, ఏమండి దానికి మందండి. దీనికి మందండి. అంటే అట్లా వేసుకునే వాళ్ళు వున్నారా లేరా? మరి ఇవేమీ లేకుండా, శుభ్రంగా భోంచేసుకుని, మర్నాటికి శుభ్రంగా అరిగించేసుకునే శక్తి మనలో వుందంటే, అది శక్తేనా కాదా?
(శక్తియేనండి)
లేకపోతే, డాక్టరు దగ్గరకు వెళ్తే ఏం చెబుతాడు?
అరుగుదల శక్తి తగ్గిందండి, పదార్థమా? శక్తియా ఇప్పుడు అది?
శక్తి.
కాబట్టి మనలో ఇప్పుడు ఏమున్నాయి?
శక్తి వున్నది, పదార్థము వున్నది. ఈ రెండు స్పష్టమయినటువంటి సమన్వయంలో వున్నాయి. ఈ సమన్వయపరుస్తున్నది ఎవరు అసలు?
(చైతన్యము) అది. ఆ చైతన్య కేంద్రమే నీ హృదయం.
ఈ రెండింటిని ఎవరు సమన్వయ పరుస్తున్నారయ్యా?
మీ అమ్మా? మీ నాయనా? లేకపోతే వైకుంఠంలో వున్న విష్ణుమూర్తియా?
లేకపోతే కైలాసంలో వున్న శివుడా? అంటే కాదు.

నీ హృదయస్థానంలో వాళ్ళయొక్క సరాసరి కేంద్రం ఒకటి వుంది.

అదే చైతన్యము. అర్ధమైందా అండి?

అది మనల్ని ఏం చేస్తోంది?

Balance create చేస్తోంది. ఇది కూడా 'క్షమత'యే. ఈ రెండూ balanced గా, సమంగా వుండడం కూడా 'క్షమత'యే. ఎప్పుడైతే ఇది అటూ ఇటూ అయ్యిందో, అన్ని తేడాలు వచ్చేస్తాయి. రావా? వెంటనే వచ్చేస్తాయి. అట్లా ఈ 'క్షమత' అన్న అంశం, నువ్వు తల్లి గర్భస్థానంలో, స్థానం సంపాదించిన దగ్గరనుంచి మొదలుపెడితే, మృత్యుస్థానము వరకూ కూడా, జీవితం అంతా పరుచుకుని వుంటుంది. అందుకని ఆ 'క్ష'కారముతో ఎన్నో పదాలు వేశారు. అర్ధమైందా అండీ!

కాబట్టి ఆ శాంతాకారం అన్నటువంటి స్థితిని మనం, విష్ణుమూర్తి యొక్క ప్రాథమిక, మొదటి స్థితి ఏమిటి? శాంతాకారం. అంటే ఆ విశ్వం ఎట్లా అయితే, తనంతట తాను భ్రమిస్తూ, తనచుట్టూ తాను భ్రమిస్తూ, ఆది దైవిక, ఆధ్యాత్మిక, ఆది భౌతిక తాపాలకు లొంగక, పొంగక, కుంగక ఎలా వున్నదో,

అదే విశ్వచైతన్యం నీలోకూడా వుందా లేదా?

వుంది కదా!

మరి ఈ రెండూ నీకు ఎందుకు సమన్వయ పడడం లేదు?

Something is wrong. దానిని, దీనిని balance చేసుకోవడం మనకు రావడం లేదు. ఏమండి ఆయనే బ్యాలెన్స్ చేసి ఇచ్చేసేయచ్చుకదా! మాకు ఈ గొడవంతా ఎందుకు? ఆయనే ఆ పని ఏదో చేసేస్తే, మా పని మా సమస్య పరిష్కారం అయిపోతుంది కదా! ఇది మీరు రోజూ కోరుకునే, లెంపలు వేసుకోవడం, నన్ను క్షమించేసేయి నాయనా! నన్ను క్షమించేసేయి. ఈ లెంపలు వేసుకునే business ఎందుకు వచ్చిందయ్యా అంటే, ఇది అది సమన్వయం చేసుకోవడం రావడం లేదు. దీనని దానికి ట్యూన్ చేయాలి. దానిని దీనికి ట్యూన్ చేయాలి. అరవిందులు ఏమంటారంటే, దానిని ఇక్కడికి ఆహ్వానించవయ్యా.

సముద్రములోంచి ఉప్పు వచ్చిందా? ఉప్పులోంచి సముద్రము వచ్చిందా?

(సముద్రము లోనుంచే ఉప్పు వచ్చింది)

అంతేనా?

Ultimate గా ఉప్పు వెళ్ళి ఎందులో కలిసిపోవాలి?
(సముద్రంలో కలిసిపోవాలి) కలవాలి కదా!
సముద్రం వచ్చి టీ గ్లాసులో పడాలి అంటే?
అది సాధ్యపడదు. అవునా కాదా?
మీ ఇంట్లో వంటిట్లోకి, సముద్రం వచ్చి వంటల్లోకి పడాలండి? కుదురుతుందా? అదే ఉప్పు అయితే?
(ఉప్పు అయితే కుదురుతుంది) అది.

అనంత విశ్వచైతన్యంగా వున్నదేమో సముద్రం,
ఆ అనంత లక్షణాన్ని సూచించటం సముద్రం.
అంతేగాని నీళ్ళతో వున్నది కాదు సముద్రం.

సముద్ర వసనే దేవీ, 'దేవి' అంటే ఏమిటి? దివ్యత్వం అనేనా?
మరి దివ్యత్వాన్ని సూచిస్తూ ఇక్కడ మట్టి అంటావేమిటి?
'సముద్ర వసనే దేవీ' అనంగానే మనకు ఏం స్ఫురించిందండి?
నీళ్ళల్లోంచి మట్టి వచ్చిందనుకున్నాము.
నీళ్ళల్లోనుంచి మట్టి వచ్చిందని చెప్పాడా? అక్కడెక్కడన్నా?
చెప్పలేదు కదా!

అనంతంగా వున్న విశ్వచైతన్యములో, ఒక దైవీ ప్రణాళికతో కూడినటువంటి స్ఫురణ కలిగింది. ఈ దివ్యత్వము స్ఫురించింది. అదేగా నువ్వు ఓంకారం అంటున్నావు. దాన్నే ఓంకారం అంటున్నావు. ఆ దైవీ స్ఫురణ, ఆ దివ్యత్వ స్ఫురణయొక్క ప్రాథమికమైనటు వంటి స్థితిలో, బిందు స్థితిలో, అది ఓంకారమై వున్నది. అదే ప్రణవమై వున్నది. అది సముద్ర వసనే దేవీ, ఇప్పుడు మనకు ఏమి అర్థమైనాయి, మనము రోజూ చదువుకునే శ్లోకాలు? అర్థమైందా అండి. ఇప్పుడు?

అందుకనే చెప్పేది నేను, అర్థం కాకుండా చేసే ప్రయత్నమంతా వాచా వేదాంతంగా మిగిలిపోతుంది. మనలో ఆ భావన వుండదు. అదే ఇట్లా చూడండి, ఇప్పుడు. శాంతాకారం, భుజగ శయనం ఇప్పుడు అర్థమౌతుంది.

భుజగశయనం అంటే ఏమిటి? మామూలుగా వాచ్యార్థం ఏమిటి?
పాము మీద పడుకున్నాడు.
అలాగ అక్కడ చెప్పాడా?
భుజగ శయనం – అనంతంగా వున్నటువంటి సర్పాకృతిలో ఆ విశ్వచైతన్యం అంతా తనచుట్టూ తాను తిరుగుతోంది. Double helix అదేగా జీన్ థియరీకి అనుకున్నాం. Double helical theory. ఆ డుబుల్ హెలిక్స్ ఒకదానితో ఒకదానితో ఒకటి మెలికలు కలసి తిరిగి, ఆ అనంతుడి యొక్క తోక ఎక్కడో, తల ఎక్కడో తెలుసుకోవాలంటే వీలు కాదట.
ఈ భుజగ శయనం అంటున్నామే, ఈ భజగం ఎవరు?
అనంతుడు.
ఆ అనంతం అనే సర్పం యొక్క తోక ఎక్కడో, తల ఎక్కడో తెలుసుకోవాలంటే వీలు కావక్కర్లేదట. అంత అనంతంగా వున్నదట. అంటే దాని అర్థం ఏమిటి? ఈ డబుల్ హెలిక్స్ ఇట్లా మెలితిరిగిపోయి వున్నాయి. స్పేస్ అండ్ ఎనర్జీ అని అక్కడ అట్లా రెండూ కలిసిపోయి వున్నాయి. ఆ రెండూ ఏమిటవి? Space & Energy. అవి రెండూ అట్లా కలిసిపోయివున్నాయి అక్కడ. కలిసిపోయి వున్నదాంట్లో భుజగ శయనం,
శయనం ఏమిటండీ మళ్లా?
లేచాడు, పరుగెట్టాడు అనవచ్చుగా.
శయించుట, మీరు అందరూ ఎక్కడ శయనిస్తారు రోజూ?
(మంచం మీద)
మంచం మీద శయనిస్తావా? ఎక్కడ శయనిస్తారు?
మీ ఇంట్లో... నువ్వు ఎక్కడ వుంటే అదే కదమ్మా నీ ఇళ్ళు.
నువ్వు ఎక్కడ పడుకుంటావు?
నీ ఇంట్లో.

ఆఁ.. ఈ double helical theory మధ్యలో ఒక energy వుంది. మళ్ళా. ఆ energy శయించుట అంటే ఆశ్రయము. ఆ ఆశ్రయంగా ఒకాయన వున్నాడట.

ఎవరాయన? తరువాత ఏంటి?

శాంతాకారం, భుజగ శయనం, పద్మానాభం. ఇదేమిటయ్యా?

Comedian పద్మనాభం కాదు. పద్మనాభము అంటే ఏమిటి?

పద్మము అంటే,

(అంటనిది, దేనికి అంటనిది) పద్మము అంటే ఏమిటి?

పద్మనాభి అని ఎందుకు అన్నారు?

ఎందుకని? ఎలా? దానిని ఎలా అన్వయిస్తారు?

ఎప్పడూ గుర్తుపెట్టుకోండి, ఇవన్నీ ప్రతీకాత్మకమైన బోధన అంటారు దీనిని.

అంటే అర్థం ఏంటి? ఇందాక నుంచి ఏం చెబుతున్నాను మీకు?

ఒక ఉపమానం వుండాలి మీ చేతిలో. ఈ ఉపమానంలోనుంచి ఒక లక్షణాన్ని ఏరాలి మనం. ఏరినప్పుడు ఏమౌతుంది?

ఈ లక్షణము దృష్ట్యా ప్రపంచాన్ని చూడటం వస్తుంది.

ఈ లక్షణము దృష్ట్యా సృష్టిని అధ్యయనం చేయడం వస్తుంది.

ఈ లక్షణము దృష్ట్యా నీ జనన మరణాలను అధ్యయనం చేయడం వస్తుంది.

అప్పుడు నీలో ఏమైంది?

ఆ లక్షణం స్థిరపడింది.

లక్షణం ఎప్పుడైతే స్థిరపడిందో అప్పుడు నీకు జ్ఞానం వస్తుంది.

అంతే గాని, మిగిలిన అంశాలను పట్టుకుంటే రాదు. అర్థమైందా అండీ!

ఇప్పుడు 'క్షమ' అనేది పదార్థమా? లక్షణమా? శక్తా?

లక్షణము అది, అది పదార్థము కాదు, శక్తి కాదు. అర్థమైందా?

'సాక్షిత్వము' లక్షణమా? పదార్థమా? శక్తా?

లక్షణము.

అలాగే, మనం చేయగా చేయగా ప్రయత్నం చేయగా, నువ్వు భక్తి మార్గంలో ప్రయత్నం చేయి, కర్మమార్గంలో ప్రయత్నం చేయి, యోగ మార్గంలో ప్రయత్నం చేయి ultimate result ఎక్కడికి రావాలి నువ్వు?

ఈ 'క్షమత' అన్న స్థితికి రావాలి. ఆ సాక్షిత్వం అనే స్థితికి రావాలి. అప్పుడు మాత్రమే నువ్వు ఆ విశ్వచైతన్యం అంటే ఏమిటో, ఈ వ్యష్టి చైతన్యం అంటే ఏమిటో, అనుభూతమై ఈ రెండూ ఒక్కటే అన్న స్ఫురణ కలగడమే ఆత్మసాక్షాత్కార జ్ఞానం అంటే. వేరే ఏమీ లేదు.

ఈ రెండూ synchronize అయ్యి ఒక్కసారి touch అయినప్పుడు ఏమౌతుంది?
రెండు మేఘాలు ఇట్లా కొట్టుకున్నాయండి. ఏమౌతుంది?
మెరుపు వస్తుంది. అర్థమైందా అండి!

అట్లాగే, మన చుట్టూ వున్నటువంటి అనంతమైనటువంటి చైతన్యము, మనలో వున్న వ్యష్టి చైతన్యము, ఒకే సూత్రం మీదకు ఎప్పుడైతే వచ్చేసినాయో, ఈ రెండూ ఒకే సారి నీకు స్ఫురిస్తుందన్నమాట. ఇది ఒక్కటే అన్న స్ఫురణ కలుగుతుంది. ఆ స్ఫురణ కలగడమే ఆత్మసాక్షాత్కార జ్ఞానమంటే. ఆ దృష్టి వచ్చేస్తుంది అప్పుడు నీకు. అరె! ఇంకెప్పుడు అదే కనబడుతుంది నీకు. అర్థమైందా అండీ! ఔనా కాదా?

నీకు రోజువారి ఇప్పుడు జీవితంలో, బజారులో వెళ్తున్నావండి. నీలోపల ఒకటి ఆసక్తి పనిచేస్తూ వుంటుంది. ఏం చేస్తావు?

ఎన్నన్నా కనబడని అదే వెతుకుతూ వుంటావు. అవునా కాదా? అక్కడ కూడా అంతే. ఈ ఆత్మసాక్షాత్కార జ్ఞానం అనే వికాసము వచ్చేసేప్పటికి, బుద్ధి అటుతిరిగిపోతుంది. అటు తిరిగిపోయి, ఆ దృష్టితోనే చూస్తుంది. ఎక్కడైనా సరే, ఈ సాక్షిత్వం వుందా లేదా?

ఆ సాక్షిత్వ దృష్టితోనే చూస్తుంది అంతే. అన్యాన్ని ఏం చేస్తుందంటే, నాకు అవసరం లేదు, ఇప్పుడు మీరు ఏం చేస్తున్నారు?

ఏదో ఒక ఆసక్తి కలిగిన అంశాన్ని పట్టుకున్నావు. మిగిలిన వాటిని ఏం చేశావు?

ఇదే అభ్యాసాన్ని అక్కడ కూడా చేస్తావు. కానీ, నేను ఆత్మ స్వరూపుడనే స్పృహతో చేస్తావు. ఇందాకడి నుంచి నేను అనుభూతి, అనుభూతి అని ఎందుకు అంటున్నానంటే ఇందుకు.

క్షమించ బడిన అనుభూతి వుందా మనకి? క్షమించిన అనుభూతి వుందా?
ఈ రెండిట్లో మనలో ఏది బలంగా పనిచేస్తుందండి?
క్షమించబడటమా? క్షమించడమా?
(క్షమించడం)

క్షమించినప్పుడు నీలో సాత్విక అతిశయం వస్తుందన్నమాట. ఆ సత్వగుణాధిక్యం కలుగుతుంది. తద్వారా నీకొక వికాసము వస్తుంది. బుద్ధికి. అంతకంటే తక్కువ స్థాయి వేదనలు ఏమి వచ్చినా సరే, నిన్నిక ఏమీ చేయలేవు. అర్థమైందా అండీ!

భక్తులందరికీ బాగా కఠిన పరీక్షలు వచ్చినట్లు మనకు పురాణాలు, కథలు చెబుతున్నాయి కదా! ఎందుకు?

ఇదే, ఈ సత్వగుణాధిక్యాన్ని పెంచాలనే, ఆ జీవనం అంతా అట్లా ఈశ్వర కృపగా, ప్రకృతి వరప్రసాదంగా, అమ్మ దయ అంటే ఇదే. చాలా మందికి తెలియదు. అమ్మ దయ వుంటే అంతా అయిపోతుంది. అమ్మ దయ వుంటే అంతా అయిపోతుంది.

అమ్మదయ వుంటే ఏమౌతుంది?
మనలో 'క్షమత' పెరుగుతుందన్నమాట. (కష్టం కాదు అది) ఆ క్షమా శీలత పెరుగుతుంది. (క్షమాశీలత) ఎంతగా పెరుగుతుందయ్యా? అంటే,
దానిముందు మరణం చిన్నది అయిపోతుంది. అది ఎంతగా పెరగాలి అంటే, మరణం, మరణ వేదన అనేది అతి చిన్నది అయిపోతుందన్నమాట. అర్థమైందా అండీ!
మీరందరు ఇక్కడ చాలా మంది తల్లులు వున్నారు. సీజేరియన్ అయిన తల్లులు వున్నారు. ఆ ప్రసవ వేదన, వేదనాభరితమేనా? కాదా? అవునా? కాదా?
మీ పిల్లలు మిమ్మల్ని బాధిస్తుంటారా? లేదా? చిన్నప్పుడు. పెద్దవాళ్ళు అయినాక బాధించడం వేరే విషయం.

చిన్నప్పుడు బాధిస్తుంటారా? లేదా?

వాడు బాధించినప్పుడల్లా ఏం చెబుతూ వుంటావు?

ఓహ్! నిన్ను కన్నప్పుడే బోల్లెడు వేదన పడ్డానురా బాబు, ఇప్పుడేముంది?

కానీ, సరేలే కాని! ఇవన్నీ చిన్న చిన్నవి వాటి ముందు అంటాం.

అవునా కాదా? ఎందుకని?

ఆ 'క్షమాశీలత' వచ్చేసింది నీకు అక్కడ, అందువల్ల నీవు మాతృదేవతవు అయ్యావు.

వేదనా భరితమై వున్నప్పటికీ కూడా, నువ్వు మరొక జీవికి ఆధారభూతమవ్వాలనే క్షమత, నీలో పనిచేసింది. తద్వారా నీవు మాతృదేవతవు అయ్యావు. అప్పుడు నిన్ను 64,000 మాతృకా గణాలు నిన్ను ఆశ్రయించినాయి. తద్వారా నీలో ఆ దివ్యత్వము ఆవిష్కారమయ్యింది. తద్వారా ఆ జీవికి నువ్వు జన్మనిచ్చావు. ఈ సత్యాన్ని మనం అనుభూతిలో ఆనాడే మనం తెలుసుకుని వున్నట్లయితే, మీ అందరిలో కూడా ఇచ్ఛా, క్రియా, జ్ఞాన శక్తులన్నీ పనిచేసి, ఆది శక్తి స్వరూపాలుగా మీకు దివ్యత్వం అనుభూతి అయ్యుండేది. నిజానికి వివాహ వ్యవస్థ అందుకోసం ఏర్పాటు చేయబడింది. అర్థమైందా అండీ! ఆడవాళ్ళకు మాతృత్వం మించిన వరం లేదని చెబుతుంది ఎప్పుడూ కూడా. అమ్మ అనిపించుకొనుట కంటే, స్త్రీ మూర్తికి గౌరవం లేదు,

ఎందుకు గౌరవం లేదు? ఎందుకని అలా చెప్పారు?

అంటే, ఆ దైవీ లక్షణాలని నువ్వు అప్పుడు గమనించ గలిగేటటువంటి, ఆ వేదన వల్ల నీలో ఒక వికాసం వస్తుంది. ఒక బుద్ధి వికాసము ఏర్పడుతుంది.

ఎంత వికాసము ఏర్పడుతుంది అంటే?

తరువాత జీవితంలో ఏర్పడే ఏ వేదనైనా కానీ దానిముందు తక్కువే అయిపోతుంది. ఇక నిన్ను అవి బాధించవు. అరె! అంత పెద్ద కష్టమే పడి వాడిని కన్నానే, ఇంత చిన్న విషయము, పెద్ద విషయమేమి వుంది? అని తల్లిగా క్షమించేస్తావు. క్షమాశీలత నీకు సహజమై పోయింది. అప్పుడు దివ్యత్వము నీలో సహజమై వున్నది కదా! అది మాతృదేవత అంటే మరి.

ఇప్పుడు మనం అలాగే వున్నామా? ఆలోచించి చూడండి!

(మరి పురుషుల కండీ?)

ఈశ్వరత్వము వుంది వీడిలో, అర్థమైందా అండీ? సాక్షిత్వం వుంది ఇందులో. నీవేమో (స్త్రీ మూర్తులు) క్షమాశీలత వల్ల దివ్యత్వాన్ని సాధిస్తే, సాక్షిత్వము వల్ల పురుషుడు సాధిస్తాడు. పురుషుడిలో సహజలక్షణము సాక్షిత్వము.

ఇప్పుడు ఇద్దరిలోనూ వైక్లబ్యము వచ్చేసింది.

మనసెప్పుడూ విషయాల చుట్టూ పరుగెడుతూ వుంటే, మనం ఏదైనా అధ్యయనం చేస్తే, దానిమీద బుర్ర పనిచేస్తుందా?

(ఎక్కువ సేపు వుండదు)

ప్రయోజనమేమి వుంది?

కాసేపు వుంటే అర్థమయ్యేవి కావుగా?

ఇప్పుడు మనం ఒక అంశాన్నే, ఎంత సేపటి నుంచి అధ్యయనం చేస్తున్నాము?

రెండు అక్షరాల శబ్దాన్ని తీసుకున్నాము ఇవాళ.

'క్షమ' అన్న అంశాన్ని. దాన్ని చాలా జాగ్రత్తగా అధ్యయనం చేయాలి.

అనేక గ్రంథాలలో దానికి సంబంధించినటువంటి, లక్షణాలను ఎలా చెప్పారు?

ఆయా మహనీయుడు దానిని ఎట్లా జీవించాడు?

ఆ జీవితాన్ని నా జీవితంలోకి ఎట్లా తెచ్చుకోవాలి?

అప్పుడు కదా నేను సాధుపురుషుడిని అయ్యేది! అంతేనా? కాదా?

ఆ జీవించిక పోతే, సాధుత్వం ఎట్లా వస్తుంది? మనకి? వస్తుందా?

కథలు చదివితేనే వచ్చేసేటట్లు అయితే చిన్నప్పటి నుంచి బోల్లెడు చదివాం కదా! రాలేదుగా!

కాబట్టి జీవితంలో అవకాశం ఎప్పుడు వచ్చింది?

నిజజీవితంలో జీవిస్తూ, ఆయా లక్షణాలు మన జీవితంలో ప్రతిబింబించినప్పుడు, ఆ సందర్భం వచ్చినప్పుడు, వాడిని క్షమించగలిగేటటువంటి ఉదారమైన స్వభావము వుండాలి. ఉదాత్తమైన స్వభావము వుండాలి. ఉదాసీనంగా వుండే సాక్షిత్వము ఏర్పడుతుంది అప్పుడు. ఒక్క క్షమ చూడండి, మనలో ఎన్ని లక్షణాలను తెచ్చిందో ఇప్పుడు. ఉదార స్వభావం తెచ్చింది, ఉదాత్తమైనటువంటి వ్యక్తిత్వాన్ని తెచ్చింది. ఉదాసీనమైనటువంటి సాక్షిత్వాన్ని తెచ్చింది.

మరి అది (క్షమ) అవసరం కాదా?

"క్షమ సర్వస్వమై పరగు అఖిల దైవీ గుణంబులకెల్ల"

అన్నీ ఎన్నన్నా చెప్పనివ్వండి శాస్త్రం దైవీగుణాలు, ఆ దైవీ గుణాలు అన్నింటికీ కూడా, క్షమయే.

ఎందుకు గురువుగారు దైవంతో సమానమండి?

(క్షమ వల్ల) ఆఁ... అది. తల్లికి ఎట్లా క్షమాగుణం వుంటుందో, గురువుకు కూడా, రాశీభూతమైనటువంటి క్షమాగుణం అది. శిష్యుడు ఎన్ని తప్పులైనా చెయ్యని, ఎన్నిసార్లన్నా వాడు తప్పుగా రాయని, ఎన్ని సార్లైనా తప్పు పలకని, ఎన్నిసార్లైనా తప్పుగా చేయని ఏం చేస్తూ వుంటాడు?

అపారమైన కరుణా స్వభావి. అర్థమైందా అండీ! దాని వల్ల ఆయనకి ఎదో ఒరుగుతుందని ఆయనేం చేయడు. ఇక్కడ తల్లైనా ఇంకేమయినా అపేక్ష కలిగి చేయవచ్చేమో గానీ, గురువుకి అపేక్షా శూన్యం. వాడికి అపేక్ష లేదు. అపేక్ష వున్నవాడు గురువుగా పనికి రాడు. ఇది గుర్తు పెట్టుకోండి. బోధించే వాళ్ళు అందరు, మీలో ఏమూల అయినా సరే, ఏ కోశంలో అయినా సరే, అపేక్ష కనుక మిగిలి వుందంటే, మీరు ఆ సద్గురు స్ఫూర్తిని అందుకోలేరు. **అపేక్షా శూన్యంగా వుండాలన్నమాట గురువు ఎప్పుడూ కూడా! అప్పుడు మాత్రమే నువ్వు ఆ స్ఫూర్తిలో నిలబడగలుగుతావు. అప్పుడు మాత్రమే నీలో నుంచి ఆ గురు సత్తా ధారా ప్రవాహంగా పనిచేస్తుంది. నీకు గనుక అపేక్ష గనుక వుందంటే, అది అట్లా అడ్డు వచ్చేస్తుంది. నువ్వు ఆ సద్గురు స్థితిలో వుండలేవు. ఆ సత్తా నీనుంచి ప్రవహింపచేయలేవు**. ఎట్లా అయితే ఒక విద్యుద్వాహకం పని చేయాలి అంటే, ఏ అడ్డంకులూ లేకుండా విద్యుత్ ప్రసారం జరగాలో, ఇది కూడా అంతే. ఆ విశ్వ చైతన్య ప్రసారం, నీ వ్యష్టి చైతన్యం ద్వారా బహిర్గతం అవ్వాలి. వ్యక్తిగా వ్యక్తం అవ్వాలి. అలాంటి మురళి వలె అవ్వాలి. అందుకే సాధకుడికి ఎప్పుడూ 'మురళి' (పిల్లన గ్రోవి) ఆదర్శం. తొమ్మిది రంధ్రాలు వుంటాయి దానికి కూడా. పైనుంచి కిందకి అంతా బోలు. గొట్టాం. ఏమి అడ్డం వుండదు. అప్పుడే ఇటుపక్క ఊదింది ఆ చివరికి మురళీ నాదంగా వ్యక్తమౌతుంది. అట్లాగే ఆ అనంత విశ్వ చైతన్యాన్ని, ఈ తొమ్మిది తొర్రల బుర్రలోనుంచి వ్యక్తం చేయాలి. ఈ దేహమే మురళి. అది ఖాళీగా వుంటేనే, అపేక్షా శూన్యంగా వుంటేనే, శ్రీ కృష్ణ పరమాత్మ చేతిలో పనిముట్టుగా పనిచేసేది అది.

ఆయన ఆ మురళిని ఉపయోగించే, అందరిని సమ్మోహనం చేశాడు. ఆ మురళీ గానం వల్లనే సమస్త జీవులు, ఆయన వశం అయిపోయినాయి.

మరి అట్లా పనిముట్టుగా వున్నామా మనం?

అట్లా వున్నప్పుడు మనం ఏమై వున్నాము?

ఆయనకి మనకి భేదం ఎక్కడుంది?

అభేద స్థితికి దగ్గరగా వున్నట్లుగా లేదా?

కృష్ణుడు దేనినైనా విడిచిపెట్టాడు కానీ, చక్రాయుధాన్ని, ఆయన విష్ణుమూర్తిగా వున్నప్పుడు ధరించిన ఆయుధాలని కూడా వదిలేశాడు.

శ్రీకృష్ణుని అవతారంలో వున్నంత కాలం దేనిని పక్కన పెట్టుకున్నాడు?

(మురళి – పిల్లనగ్రోవినే)

కాబట్టి పరమాత్మకు అతి దగ్గర కావాలంటే మనం ఏ సాధనను స్వీకరించాలి? ఇప్పుడు. ఆ విశ్వ చైతన్యం నా నుంచి పూర్ణంగా వ్యక్తమయ్యేటటువంటి స్థితిలో నేను జీవిస్తున్నానా? నా చేష్ట, నా కనురెప్పల కదలికలు సైతం ఆ చైతన్య కేంద్రాలుగా వుండాలి. సద్గురు మూర్తి యొక్క కృపా కటాక్ష వీక్షణం, వారి యొక్క దర్శనం పుణ్యం, స్పర్శనం పాప నాశనం అంటున్నామా? లేదా? ఎలా?

అవి ఎలా చేయగలుగుతాయి?

అంటే ఆయన ఇలా వున్నాడు కాబట్టి. ఆ అనంత విశ్వ చైతన్యము, ఆయన యందు మూర్తీ భవించి, ఆయన యొక్క నవద్వారముల ద్వారా అవి బహిర్గతం అవుతున్నాయి. అవి వ్యక్తమౌతున్నాయి. ఆ విశ్వ చైతన్య ప్రభావం చేత, ఎవరెవరైతే దాంట్లోకి లోబడ్డారో, ఆశ్రయించారో, వాళ్ళల్లో అంతా అది పరిణామాన్ని తీసుకు వచ్చేస్తుంది. 'ఒక్కసారి ఆయన అలా చూశారండి. నేను మారిపోయానండి' అన్నవాళ్ళు కోకొల్లలు వున్నారు. మహానుభావుల యొక్క దర్శనానికి వెళ్ళి, ఆయన అలా నఖశిఖపర్యంతము ఒకసారి చూశారండి అంతే. అంతటితో నేను మారిపోయాను. అంతటి మహానుభావులు, సద్గురువులు అంటే.

మరి వాళ్ళు ఎటువంటి వారు?

ఎంతటి క్షమత కలిగినటువంటి వారు?

ఎటువంటి synchronisation వుంది వారికీను, విశ్వచైతన్యాన్నికి?

వారు కూడా మనలాంటి, ఈ సప్త ధాతువులతో కూడిన దేహాన్నే కదా ధరించింది. మరి అలాంటి మహానుభావులు ఎంతోమంది ఈ భారతదేశంలో వున్నారు.

మనం ఇప్పుడు వారిని ఆశ్రయించి ఏ రకమైన జీవితాన్ని గడుపుతున్నాము?
ప్రతిరోజు మనం గాఢ నిద్రావస్థలోకి వెళ్లేలోపల, ఈ మూడు అవస్థలలో, ఈ రోజులో నేను ఈ విశ్వ చైతన్యానికి ఏ రకంగా నేను ట్యూన్ అయ్యాను?
దానిని ఏ రకంగా నేను ఆహ్వానించాను నాలోకి?
దానిని ఆహ్వానిస్తే ఏమైయ్యాను?
నేను అదే అయ్యాను. అర్థమైందా అండి!
నేను వెళ్ళి అందులో పడాలి అంటే, అది ఎక్కడుందో ఎట్లా తెలుస్తుంది?
ముందు దానిని ఏం చెయ్యాలి?
ఆహ్వానించాలి.
దానిని ఆహ్వానిస్తే?
ఏనుగు వచ్చి గుడారంలో దూరింది అప్పుడేమయ్యింది?
(గుడారం మొత్తం ఏనుగయ్యింది) అయిపోయే!
అది సులభం కదా!
గుడారం ఏనుగును వెతుక్కుంటూ వెళ్ళింది. ఎప్పటికి అవుతుంది ఇది? అవుతుందా?
ఇప్పుడు మనం ఏం చేస్తున్నాము?
గుడారము ఏనుగును వెతుకుతుంది.
కాశీలో విశ్వేశ్వరుడున్నాడా? రామేశ్వరంలో వున్నాడా... కృష్ణాలయంలో వున్నాడా?
అమ్మవారిలో వుందా? అయ్యవారిలో వుందా?
రామేశ్వరం వెళ్దామా? వివేకానందుడి దగ్గరకు వెళ్దామా?
పరమహంస మార్గంలో వెళ్దామా? అరవిందుడి మార్గంలో వెళ్దామా?
సత్యసాయి మార్గంలోనా...
ఏదీ వద్దు, ఒక నమస్కారం పెట్టి తిని పడుకుందామా?

ఇట్లా గుడారం ఏనుగును వెతుకుందన్నమాట. దీని వల్ల ప్రయోజనం లేదు. అవునా కాదా?

ఎందుకని ఈ పద్మనాభం అన్నటువంటి పదాన్ని అక్కడ వేశారయ్యా అని అంటే,

పద్మములు కుసుమ కోమలమైనటువంటివి. అవునా కాదా?

వాటి యొక్క లక్షణం ఏమిటి?

(ముట్టుకుంటే మాసిపోతాయి) "**లలితం**" ముట్టుకుంటే పడిపోవడం కాదు.

అదే గ్రామ్యభాష పనికి రాదు.

లలితం. ఎందుకని లలితం?

చాలామంది లలిత అన్న పేరు పెట్టుకున్నవాళ్ళను చూడండి, చాలా సాత్విక స్వభావులై వుంటారండి.

అప్పుడప్పుడు Reverse కూడా వుండవచ్చు. అది వేరే విషయం.

లలితం – ఆ లలితం అన్న లక్షణం సత్వగుణాధిక్యం.

మనిషి ఎప్పుడూ కూడా, ఈ లలితం అనే లక్షణాన్ని పోషించుకోవాలి.

సాధ్యమైనంతవరకూ నీలో '**విషయ ప్రకోపం**' రాగానే చాలా వరకూ పోయేది ఈ లాలిత్యం అండి. అవునా కాదా?

ఒక్క రోజు (వయసున్న) పిల్లవాడిని పెంచాలి అంటే, ఎలా పెంచాలండి?

One day age ఎలా పెంచాలండీ?

లాగీ, పీకి, పక్కకు పడేసి, ఏయ్ పాలుతాగవేంటి అని ఒక్కటిచ్చి?

కుదరదు కదా! ఎలా Deal చేయాలండి ఇప్పుడు?

లలితం. అంతేనా? కాదా?

కాబట్టి, జీవన ధర్మాలలో, మొదటి నుంచి చివరి వరకూ, నీ జీవకకు ఆధారభూతమైనది '**లలితం**' అన్నమాట.

ఆ లలిత అన్న శబ్దమే ఆదిశక్తి స్వరూపము.

ఈ లలిత అన్న శబ్దమేమిటి?

ఆవెడ భువనేశ్వరీ పీఠానికి గుర్తు అన్నమాట. అక్కడే బిందుత్రయం పుట్టింది.

అక్కడే మండల త్రయం కూడా పుట్టింది. అది పద్మనాభం అంటే. అంతేగాని, తామర పువ్వు, తామర పువ్వులో మధ్యలో వున్న దుద్దు, అనే పోలిక ప్రతీకాత్మకం. అంటే ఉపమానంతో చెప్పినదన్నమాట.

కానీ అసలు వాస్తవానికి ఏం చెబుతున్నారు?

అంతకు ముందు ఏం చెప్పారు?

శాంతాకారం, భుజగ శయనం, పద్మనాభం... దివ్యత్వం ఉత్పన్నమైనది.

ఆ దివ్యత్వం ఏమైందట ఇప్పుడు?

బిందుత్రయముగా, మండల త్రయముగా మార్పుచెందుతుంది.

సృష్టి ఆరంభ స్థితిని బోధిస్తున్నారన్నమాట, ఆ పద్మనాభ స్థితిలో.

ప్రతీకాత్మకం కూడా ఏం చెప్పారు?

విష్ణువు నాభిలోనుంచి ఇలా తామర పువ్వు వచ్చింది, ఆ తామర పువ్వు ఇలా ఇలా వుంది, దాని మీద బ్రహ్మగారు కూర్చొని వున్నారు. ఆ బ్రహ్మగారు సృష్టి చేశారు. అంతేనా? నిజానికి ఇలా వుందా?

అలా లేదు. ఎక్కడినుంచి అయితే, సోమ సూర్య అగ్ని మండలములు ఉత్పన్నమైనాయో...

సోమ సూర్య అగ్ని మండలములు అంటే?

చంద్రుడు, సూర్యుడు, అగ్ని ఈ మూడు మండలాలు ఉత్పన్నమైనాయి.

ఈ మూడు మండలాలు ఎక్కడ ఉత్పన్నమైనాయి?

శుక్ల, రక్త, ఇంకోకటి ఏమిటి? బిందు త్రయంలో...

మీకు ఆ బోధ లేదు, శుక్ల బిందువు, రక్త బిందువు, సంయుక్త బిందువు అని మూడు ఏర్పడ్డాయి. అర్థమైందా అండి?

ఈ మూడు బిందు త్రయము, మండల త్రయము ఈ రెండూ ఏర్పడిన స్థానం పేరు పద్మనాభి. ఆ పద్మనాభి. దానిపేరు.

మనలో ఒక పద్మం వుంది. ఏ పద్మమయ్యా అంటే?

సహస్రార దళ కమలము అవతల అష్టదళ పద్మము వుంది, దానినే 'భూమా కేంద్రము' అని కూడా అంటారు. ఆ అష్టదళ పద్మస్థానమే పద్మనాభి.

అదే హృదయ నాభి. అదే మండల త్రయస్థానం. అదే బిందు త్రయ స్థానం. అక్కడ నుంచి సృష్టి ఆరంభమైంది అని చెప్పడం కోసమని, నిజానికి ఇప్పుడు విజ్ఞాన శాస్త్రం కూడా అదే చెప్తున్నది. ఎలా చెప్పింది అంటే?

Whited Warf అనేటటువంటి star వుంటుంది. ప్రతీ విశ్వానికి కూడా ఒక Galaxy కి, ఒక black star, death అయితే నేమో black star, death కాకపోతే white dwarf, whited giant (వైటడ్‌జైంట్) అనేక పేర్లతో పిలుస్తున్నాము. అంటే ప్రకాశాన్ని అది వెదజల్లుతూ వుంటుందన్నమాట. ఆ ప్రకాశము వెదజల్లేదే, బిందువులై, నక్షత్రాలుగా మారిపోయినాయి. బిందువులై సౌరమండలాలు అయినాయి. బిందువులై చంద్రమండలాలు అయినాయి. బిందువులై కోటాను కోట్ల విశ్వంగా వ్యాపించింది.

మళ్ళా అదంతా వెనక్కి తీసుకుంటే?

(Black Hole) బ్లాక్‌హోల్ అవుతుంది. కృష్ణబిలం అవుతుంది. అర్థమైందా అండీ!

ఇలా విశ్వ ఆవిర్భావ, తిరోధానములను బోధించేటటువంటి శ్లోకమే ఆ 'శాంతకారం...' శ్లోకం.

ఇప్పుడు మన వాళ్ళు విజ్ఞానాన్ని బోధించలేదా? అంతరిక్ష విజ్ఞానాన్ని?

శ్లోకం రూపంలో ప్రతీకాత్మకంగా బోధించారు.

కానీ మనకు ఎట్లా ఆనందం అనిపిస్తుంది?

ఇట్లా చెబితే ఆనందంగా అనిపిస్తుందా?

విష్ణమూర్తి ఒక పాము మీద పడుకున్నాడు. ఆయన నుంచి ఇట్లా కమలం వచ్చింది. అక్కడ చతుర్ముఖ బ్రహ్మగారు వచ్చారు. ఆ చతుర్ముఖ బ్రహ్మగారి నుంచి, ఆయననుంచి సంకల్ప సృష్టి అంతా వచ్చింది. ఆయనకి వచ్చిందంతా విష్ణుమూర్తిగారు పోషించాడు. మళ్ళా కాసేపు ఆగిన తరువాత బ్రహ్మగారికి, విష్ణువుగారికి పోటీ పెట్టాం. అంటే మనుషుల మధ్య ఏ రకమైన పాత్రోచిత కల్పితాలు వున్నాయో, దీనినే దివ్యత్వానికి కూడా apply చేసి, సగుణ సాకార పద్ధతిలో, నామ రూపాల పద్ధతిలో, ఆవేశకావేశాలు మనకు ఎట్లా వున్నాయో, వాళ్ళకు కూడా అవే ముడివేసి చెప్తే తప్ప ఆనంద పడే లక్షణం లేదన్నమాట.

ఇది ఎటువంటి లక్షణం ఇది?

చిన్న పిల్లలు ఐదేళ్ల పిల్లలకి, ఆ పంచతంత్ర కథలు ఎలా చెప్పారు?

అంటే, రాజ్య పరిపాలన ఎలా చెయ్యాలి అని బోధించ దలచుకున్నాడు, ఆ రాజ కుమారులకి. రాజ్య పరిపాలన ఎట్లా చెయ్యాలో, ఎట్లా చెప్తాడండి మరిప్పుడు?

జంతువులు ఉదాహరణగా తీసుకుని, అడవి జంతువులు ఉదాహరణగా తీసుకుని అలా వేటకు తీసుకువెళ్ళి అలా అడవికి తీసుకువెళ్ళి, జంతువులను చూపెట్టి, ఆ జంతువుల యొక్క ప్రతీకాత్మకంగా ఇదిగో ఈ జంతువు వీడితో ఇట్లా మాట్లాడింది. ఈ జంతువు వీడిని ఇట్లా మోసం చేసింది, ఈ జంతువు వీడితో ఇట్లా యుద్ధం చేసింది. ఇట్లా జంతువులను అడ్డం పెట్టుకుని చెప్పినటువంటి కథలు పంచతంత్ర కథలు. మరి ఇప్పుడు ఏమి బోధించాడంటే ఆయన, రాజ్యాన్ని ఎట్లా పరిపాలించాలని ఉత్తీర్ణులను చేయడానికి ఇది వాడాడు. మనవాళ్ళు కూడా పౌరాణిక కథల్ని, ఆ విజ్ఞాన శాస్త్ర భాండాగారాన్ని అందించే ఉద్దేశ్యముతో పౌరాణిక కల్పనగా చెప్పారు.

ఎవరికి చెప్పారు?

(చిన్న పిల్లలకి) ఎనిమిదేళ్ళ లోపల వున్న పిల్లలకి చెప్పారు.

కానీ, మనకు వచ్చిన బుద్ధి వికాసము కూడా 80 ఏళ్ళు వచ్చినా 8 ఏళ్ళ దగ్గరే వుండడం వల్ల, మనం ఆ పౌరాణిక కల్పనలలోనుంచి, విజ్ఞాన భాండాగారాన్ని వెతికి పట్టలేకపోతున్నాము. ఎవరైతే మథిస్తారో దీనిని ఇట్లా, మనలోపల ఇట్లా మథనం జరగాలి. ఒకటి చదివాము, ఈ చదివినది ఏం చెప్పాడు? ఏం చెప్పాడు? ఏం చెప్పాడు? అని మనలో తిరగుతూ వుంటే ఏమౌతుంది?

ఒక దశకు వచ్చేసేటప్పటికి నువ్వు, ఆ మథనే జీవితం అయిపోతుంది.

అప్పుడు ఏమైపోతావు?

నీకు ఆ క్షీరసాధన మథనానికి భేదం లేదు. ఇదే క్షీర సాగర మథనం అంటే. నీలోపల వున్న దైవీ లక్షణాలు, నీలోపల వున్న ఆసురీ లక్షణాల మధ్య యుద్ధం జరిగింది. ఆ మథనం జరిగింది. అప్పుడు ఏవి గెలిచినాయి?

దివ్యత్వము ఆవిర్భవిస్తుంది నీలో అప్పుడు. అలా అనుభూతం అవ్వాలి మనలో.

ఇలా అనుభూతం అయ్యింది నువ్వు మరచిపో చూద్దాము?

కష్టపడి సంపాదించావా లేదా? ఇప్పుడు?

వచ్చే వరకూ విడవకుండా పట్టుదలతో సంపాదించావా లేదా ఇప్పుడు?

సాధన చేశావా లేదా?

ఇప్పుడు అందరూ ఏమంటున్నారు?

సంవత్సరం నుంచి ధ్యానం చేస్తున్నానండి. ఏం మార్పు రాలేదండి.

ప్రయోజనం ఏమన్నా వుందా?

అసలు క్షీర సాగర మథనం ఎన్ని సంవత్సరాలు జరిగిందండి?

తెలుసా మీకు ఎవరికైనా?

పురాణం చదివారా? బ్రహ్మాండ పురాణం చదివారా?

సహస్ర దివ్య సంవత్సరాలపాటు మథించారు.

సహస్ర దివ్య సంవత్సరాలు అంటే ఎంత?

దైవీ సంవత్సరాలు అంటే ఎంత?

మనకు సంవత్సరం ఆయనకు (బ్రహ్మ)కు ఏంటి?

ఒక పగలు. మళ్ళా ఒక రాత్రి అంటే ఇంకొక సంవత్సరం.

అట్లా ఎన్ని రోజులు అవ్వాలి?

అట్లా 365 రోజులు అవ్వాలి. ఆయనకు సంవత్సరం అవ్వాలి అంటే.

ఆయనకు సంవత్సరం అవ్వాలి అంటే ఎంత అవ్వాలి?

మన 365 ఒక పగలు అండి. మన సంవత్సరం ఆయనకు ఒక పగలు. మన సంవత్సరం ఇంకో సంవత్సరం రాత్రి. అర్థమైందా అండీ! ఇట్లా ఏమవ్వాలి?

అట్లా మళ్ళా 365 అవ్వాలి ఆయనకి. అంటే ఎంత అవ్వాలి?

(365 x 2 వేస్తే ఒకరోజు) x 365 వేయాలి. ఇది ఒక దివ్య సంవత్సరం.

ఇటువంటి దివ్యసంవత్సరాలు, వెయ్యి సంవత్సరాలు మథించారు. సృష్టి వ్యక్తం కావడానికి అంత కష్టపడ్డారు. అది ఏదో, ఇవాల తలచుకుంటే, రేపొద్దున కల్లా ఉద్భవించలేదు. ఆ వచ్చిన విధానాన్ని explain చేయడమే ఆ సృష్టి ఎలా వచ్చిందని చెప్పడము. అదేమీ మనం అధ్యయనం చేయమన్నమాట. ఇవేమి కూడా. ఏదో వాళ్ళు ఏదో రాసుకున్నారులే. మనకు ఎందుకు అనవసరమైన గోల?

దాని గురించి ఆలోచించడం, ఊరికే బుర్ర బద్ధలు కొట్టుకోవడం, తలనొప్పి తెచ్చుకోవడం ఎందుకు మనం అని, మన ఫీలింగ్ అన్నమాట.

కాబట్టి మనం ఏదైతే బాగా అధ్యయనం చేసి, మనం దానిని జీర్ణింప చేసుకుని, ఆ సాధనగా దానిని దర్శించి, దర్శించాలి అంటే ఎప్పుడైనా గుర్తు పెట్టుకోండి. ఏం కావాలి మీకు, దర్శించాలి అంటే?

ఆ విశ్వ చైతన్యానికి, ఈ వ్యష్టి చైతన్యం, అదీ ఇదీ ఒకే సూత్రం మీదకు రావాలి. అవునా కాదా?

–★–

మనలో వున్న ప్రాణ మనో బుద్ధులు ఒక సూత్రం మీద పని చేస్తున్నాయా?

త్రికరణములు ఒక సూత్రం మీద పని చేయాలా వద్దా? ఇప్పుడు?

(చెయ్యాలి) ఇది ఒక సూత్రం మీద పని చేస్తే, ఈ సూత్రాన్ని పట్టుకెళ్ళి దానికి తగిలించ వచ్చు. అంతేనా కాదా?

మనం దగ్గర ఆ సూత్రం వుందా? ఇప్పుడు.

(లేదండి) ఇది ముందు ఒకే సూత్రం మీద వున్నాయో, లేవో చూసుకోవాలన్నమాట.

ఒకే సూత్రం మీద వున్నాయో, లేవో చూడాలి అంటే ఎట్లాగు? ఎట్లా చూస్తారు?

'ప్రాణ మనో బుద్ధులు' ఒకే సూత్రంపై వున్నాయి అని ఎలా తెలుసుకుంటారు?

ఒకే తీరుగా వున్నాయా? విడివిడిగా వున్నాయా?

(ఇప్పుడు విడివిడిగా వున్నాయండి)

ఎలా చెప్పగలరు?

(ఆలోచిస్తున్నాం కాబట్టి)

(జ్ఞాపకం ఏర్పడితే... ప్రాణ మనో బుద్ధులు separate గా వుంటే జ్ఞాపకాలు ఏర్పడుతాయండి, జ్ఞాపకాలు ఏర్పడడం లేదూ అంటే కనుక)

అదిగో ఆయన ఏదో చెబుతున్నాడు. అది ఒక కొలమానం.

అంటే ప్రాణ మనో బుద్ధులు విడివిడిగా పనిచేసినప్పుడు, బలమైన జ్ఞాపకాలు ఏర్పడుతాయి, వట్టి జ్ఞాపకాలు కావు అవి. విషయవాసనా బలంతో కూడినటువంటి, సంగత్వ దోషంతో కూడినటువంటి జ్ఞాపకాలు ఏర్పడుతాయి. అంటే అర్థం ఏమిటి?

మనలో కొన్ని పనులు చెయ్యొద్దు, చెయ్యొద్దు అని అనిపిస్తూ వుంటుంది. కానీ చేస్తూ వుంటాము. అవునా కాదా? ఎవరికివాళ్ళు ఆలోచించుకోండి. నేను అన్నీ లక్షణాలే చెబుతాను. ఎవరికి వాళ్ళు apply చేసుకోవడం మీ పాత్ర. Apply చేసుకుని సందేహాలు వస్తే మీరు వ్యక్తిగతంగా నాతో మాట్లాడి నివృత్తి చేసుకోవడం కూడా మీ బాధ్యతే. మాట్లాడక పోతే నేను చేయగలిగినది ఏమీ లేదు. అర్థమైందా? కాబట్టి ఇప్పుడు ఏం చెయ్యాలి?

అసలు సంగత్య దోషం ఎక్కడ ఏర్పడుతుందంటే, ఈ మూడు విడివిడిగా పనిచేయడంలోనే, విషయ సంగత్యం ఏర్పడుతుందన్నమాట. ఆ సంగత్య దోషం వలనే జీవుడు ఏర్పడుతున్నాడు. ఏమిటయ్యా దీనికి గుర్తు అంటే, మనలోపల ఇది చెయొద్దు, ఇది అధర్మం, ఇది పనికి రాదు, ఇది మంచిది కాదు అని మనకు తెలుసు. అర్థమైందా అండి.

కానీ, బలవత్తరమై చేస్తాం.

ఏం చేస్తాం అండీ? బలహీనం, ఏం చేస్తాం?

పట్టుకోలేక పోయాము, ఇంద్రియ నిగ్రహము లేదు. అని చేస్తాము అన్నమాట. అదొక భాగం. కొన్ని compulsory గా ఇవి మంచి పనులు, చేసి తీరాలి, సాధించాలి, అని కూడా తెలుసు. కానీ అవి చెయ్యము.

మన బుద్ధికి రెండు లక్షణాలు వున్నాయి. ఏమిటి?

చేయకూడదు.చేయకూడదు.చేయకూడదు.చేయకూడదు. అని తెలుసు. కానీ బలవత్తరమై చేస్తాము. అదొక భాగము.

రెండవ పద్ధతి ఏమిటి?

చెయ్యాల్సినవి కూడా తెలుసు మనకి, పొందాల్సినవి కూడా తెలుసు. ఏవి సాధించాలో కూడా తెలుసు. కానీ (అవి చెయ్యము) బుద్ధివల్ల కాదనమాట అవి. అట్లా చేయడానికి ఒప్పుకోదు అది. అహా! అది కష్టం, నేను చేయను అంటుంది.

పిల్లాడిని చూడండి. ఎక్కాలు కిందనుంచి పైకి చదవమంటే ఏమంటాడు?

(నాకు కుదరదు అంటాడు) కిందనుంచి పైకి చదవడం, మా టీచర్ ఒప్పుకోదు అసలు, నేను పైనుంచే కిందకి చదువుతా. అవునా కాదా?
ఒరేయ్! కిందనుంచి పైకి నేర్చుకోరా! నీకు తెలివి తేటలు పెరుగుతాయి అని చెబితే, వాడు ఏమంటాడు?
అసలు ఎక్కాలు ఎందుకు? ఒకటో క్లాస్ తరువాత ఎక్కాలు ఎవడూ అడగడు. అంటే ఎప్పటికప్పుడు ఏం జరుగుతోంది ఇప్పుడు?
ఆఁ... Easy way of living. Easy going nature అంటాము దీనినే. మామూలుగా చెబితే, కప్పదాటు పద్ధతి.
సాధ్యమైనంత వరకూ ఎలా తప్పించుకుందాము?
ఎక్కడ తప్పించుకుంటావు?
ప్రసవ వేదనలో తప్పించుకున్నావా? మరణ వేదనలో తప్పించుకుంటావా?
సృష్టి ధర్మంలో తప్పించుకోవడం అన్న business లేదు. (No escape button in life)
దాట వేయడం కూడా అస్సలు లేదు. ఎందుకని?
అవి రెండు తమో గుణ ధర్మాలు.
అవి సాధ్యపడవు. తాత్కాలికమైనటువంటి ఉపశాంతిని కలుగజేసినట్లు కనబడుతాయి కానీ, శాశ్వతమైన సమస్యను తీసుకువచ్చి ఎదురుగుండా పెడుతాయి. అప్పుడేమి చేస్తావు?
అప్పుడు బోన్ లో పడుతావు. అర్థమైందా అండీ!

ఏవైతే మనం జీవితంలో, దాట వేస్తూ వచ్చామో, అవన్నీ ఏమౌతాయి?
ఎక్కడికీ పోవు, నీలోనే నిక్షిప్తం అయివుంటాయి. ఒక బలహీన క్షణంలో అవే నీ ఎదురుగుండా వచ్చి కూర్చుంటాయి. అన్నీ ఒకేసారి పరిష్కరించాలి అప్పుడు. ఇప్పుడు ఒక్కొక్కటీ పరిష్కరించవలసింది పోయి, ఆ సమయం కూడి వచ్చేసినప్పుడు ఏమౌతాయి?
అన్నీ ఒకసారి వచ్చేస్తాయి.
చాలా మంది ఏమంటారు?
అన్ని సమస్యలు ఒక్కసారే వచ్చేసినాయండి అంటారు.

ఎక్కడినుంచి వచ్చాయేమిటి అవి?
ఏమన్నా ఆకాశం నుంచి ఊడిపడ్డాయా?
ఏమీ ఊడిపడలేదు.
మనమే ఏం చేశాము వాటిల్ని?
(Post pone) దాట వేశామన్నమాట వాటిని. తగినట్టుగా మారలేదు. తగిన సాధనను పెంచుకోలేదు. తగిన కష్టం చేయడానికి ఒప్పుకోలేదు. తగినటువంటి వికాసాన్ని పొందలేదు. తగిన అధ్యయనం చేయలేదు. తగిన గురువుని వెతక లేదు. తగిన ఆశ్రయాన్ని పొందలేదు. తగినటువంటి ఏకీకృతమైన సమన్వయ విధానాన్ని క్షమతని సంపాదించలేదు.
తద్వారా ఏమైంది?
ఒక సందర్భం వచ్చేసేటప్పటికి, అన్నీ ఎదురుగుండా వచ్చేసినాయి.
ఏం చేయమంటారండీ, ఏం చేయమంటారండి?
ఏం చేస్తావు అప్పుడు నువ్వు?
అప్పుడు బోన్ లో చిక్కకున్నట్టు చిక్కకుంటావు.
Way out లేదు అంటావు.
అప్పుడు ఏం చేయమన్నారు?
ఒక్కటే way out అప్పుడు. ఉదాసీనంగా వుండగలగడమే.
ఎందుకనిట?
ఆ ఉదాసీనం సాక్షిత్వ లక్షణం.

"సాక్షిగా వున్న వాడిని ఈ భూప్రపంచంలో ఏదీ ఏమీ చేయజాలదు. వాడిని ఏదీ, ఈ మూడు అవస్థలుకాదు కదా, మరణం కూడా వాడిని ఏమీ చేయలేదు."

అటువంటి సాక్షిత్వం అనెడి రాజౌషధాన్ని వాడితే తప్ప, దాంట్లోనుంచి బయటకు రాలేవు.
అది వాడితే?
(వస్తాం బయటికి)

దాని రిపర్కషన్స్ వుండవా?

రాజ ఔషధం వేశామండి. అప్పుడు శరీర ప్రాణ మనో బుద్ధులు వేదన పొందవా?

పొందుతాయి.

తీవ్రమైన ఔషధాలు వాడితే ఏమౌతుంది?

తీవ్రమైన జబ్బువచ్చిందండి. తీవ్రమైనటువంటి ఔషధాలు వాడాలా వద్దా?

వాడకపోతే ఎట్లా మరి బాగుపడుతావు?

వాడితే ఏమౌతుంది?

(Side effects వుంటాయి)

అది Side Effect లేకపోతే actual గా నీలో వికాసాన్ని పూర్తి చేయడమా?

నీలో వికాసాన్ని పూర్తి చేయడం.

ఆ Transformation complete అవ్వాలి ఎప్పటికైనా.

నువ్వు అప్పుడే ఒక్కొక్క సమస్యని పరిష్కరించుకొస్తే, ఆ transformation easy అయిపోయేది.

ఎప్పుడైతే అలా అవ్వలేదు నువ్వు. ఏమౌతుంది?

రాజ ఔషధాలు వాడక తప్పదు.

వాడితే ఏమౌతుంది?

తగినటువంటి వికాసం అంతా ఆ సమయంలో ఒకే క్షణంలో పొందవలసి రావచ్చు, ఒక సంవత్సరంలో పొందవలసి రావచ్చు, ఒక జీవితకాలంలో పొందవలసి రావచ్చు. కొంతమందికి జీవిత కాలం కష్టం వుంటుంది. నన్నడిగితే అలాంటి వాళ్ళు నాకు తెలిసి ఇక్కడ ఎవ్వరూ లేరు. అలాంటి వాళ్ళు నాకు తెలుసు. అనుదినము సమస్యలు వున్నటువంటి వాళ్ళు. ప్రతిక్షణము సమస్య వున్నటువంటి వాళ్ళు. దానికి out లేదు, way out లేదు. ఉదాసీనంగా వుండడం తప్ప. వేరే way out లేనే లేదన్నమాట. ఆ ఉదాసీన లక్షణాలను నేర్పడానికి సంవత్సరాలు పడుతుంది. అది నేర్చుకోవడానికి సంవత్సరాలు పడుతుంది. అది ఎప్పుడు నేర్చుకోగలుగుతావంటే, ఈ మూడు ఏకసూత్రం మీద వుంటేనే వీలౌతుంది. లేకపోతే వీలుకాదు.

(ఏక సూత్రం మీదకు తేవడం ఎట్లా అండీ?)

శరీర ప్రాణ మనో బుద్ధులు నాలుగూ కూడా ఏక సూత్రం మీద వుండాలి. ఉంటేనే ఉదాసీనుడవై వుంటావు. వుంటేనే సాక్షిగా వుంటావు. ఈ నాల్గిటిలో ఏ ఒక్కటి పక్కకు తప్పుకున్నా, మళ్ళా అది ఆ బోన్ లో చిక్కుకుంటుంది. మళ్ళా దానిచేత బాధించ బడుతుంది. మళ్ళీ సంస్కారం ఏర్పడుతుంది. మళ్ళా వాసనాబలం ఏర్పడుతుంది. అట్లా ఇలా జన్మ పరంపర పుడుతూ పోతూ, పుడుతూ పోతూ, వస్తూ పోతూ, వస్తూ పోతూ వుంటుంది. కాబట్టి ఈ జన్మలో తల్లి గర్భాన్ని ఆశ్రయించాను. తల్లిపాలు తాగవలసిన అవసరం ఏర్పడింది. దాని చేత పోషించబడలవలసినటువంటి సందర్భం వచ్చింది. ఇక మరల మరుజన్మలో అటువంటి సందర్భం రాకుండా చేసుకోగలిగేటట్టువంటి జీవన విధానాన్ని నేను ఆశ్రయించాలి అన్నవాడే, ముముక్షువు.

అటువంటి మోక్షేచ్ఛ, తీవ్రమైనటువంటి మోక్షేచ్ఛ కలగాలి అంటే, ప్రాథమిక మైనటువంటి plat form ఏమిటి?

ఈ నాలుగూ ఏక సూత్రం మీద వుండాలి. ఆ క్షమతని సంపాదించాలి. ఎంత కష్టపడైనా సంపాదించాలి. చెడిపోవడానికి ఒక్క జన్మచాలు. ఈ ఏకసూత్రంగా వున్నది చెడగొట్టుకోవడానికి, ఒక జన్మచాలు. గట్టిగా మాట్లాడితే ఒక సంవత్సరం కూడా చాలు. చెడిపోయిన దాన్ని బాగుచేయాలంటే మళ్ళా 101 జన్మలు పడుతుంది అంటాడు వశిష్టుడు యోగ వాశిష్టంలో. ఈ త్రికరణ శుద్ధిని గనుక ఎవరైతే కోరి చెడగొట్టుకునే వాళ్ళందరూ ఎక్కువ మంది వున్నచోట కలియుగం. కలియుగం అంటే వేరే ఏమీ లేదు. ఎంత ఎక్కవ జనాభా కోరి, ఈ త్రికరణ శుద్ధిని మానవులు... అంటే మానవుడు సహజంగా త్రికరణ శుద్ధితో పుట్టాడు. ఈ మానవ ఉపాధిలో సహజంగా వుంది అది.
కానీ, మనం ఏం చేశాము?

"విషయ సంగత్వ దోషం చేత, ఆ ఆకర్షణ బలం చేత, ఈ ఏకసూత్రమై వున్నటువంటి శరీర ప్రాణ మనో బుద్ధులు పక్కకు పోయినాయి. ఒకటి గుర్తుపెట్టుకోండి, విషయ సంగత్వంలో ప్రియ, అప్రియాలు రెండు వున్నాయి. ఒక్క ప్రియమే కాదు, అప్రియము కూడా వున్నది".

నాకు ఇది నచ్చదండి. కరువుగా చెప్తావు.
ఏం లలితంగా చెప్పలేవా ఆ మాట?
(చెప్పవచ్చు కానీ చెప్పము)
ఎందుకని?
(స్వభావం అది)
గుణ ధర్మం. అంతేనా కాదా? వేరే ఇంకేమైనా వుందా?
అట్లా ఎప్పుడైతే నువ్వు, ఆ ప్రియ అప్రియాలకు ఎప్పుడైతే నువ్వు సంగత్వ దోషానికి లోనయ్యావో, ఏమౌతావు?
ఈ ఏక సూత్రం కాస్తా...
మీరందరూ ధ్యానం చేసేటప్పుడు, నిద్రపోయేటప్పుడు, కలలు గానీ, ఇతరత్రా etc. లుగానీ, ఎక్కడినుంచి ఉత్పన్నం అవుతున్నాయి?
(శరీర ప్రాణ మనో బుద్ధులు ఏక సూత్రం మీద లేక పోవడం వలన)

సూత్రబద్ధం కానటువంటి మనో బుద్ధుల యొక్క వ్యవహార శైలిని, గాఢ నిద్రావస్థలో నువ్వు మునగాలి అంటే, అది సూత్ర బద్ధం అయితేనే మునుగుతుంది. లేకపోతే మునగదు. నువ్వు గాఢ నిద్రావస్థలో పడిపోయే ముందు, ఈ శరీర ప్రాణ మనో బుద్ధులన్నీ, ఆ కలల రూపంలో వ్యవహరించి, అనుభూతమై, అక్కడ నువ్వు పొందవలసినటువంటి ప్రియ అప్రియాలను పొంది, మళ్ళా సూత్రబద్ధం అయిపోతుంది. అప్పుడు మునిగిపోతావు. సుషుప్త్యావస్థలో. అర్థమైందా అండీ?

అందువల్లే నీకు సుషుప్త్యావస్థ సుఖంగావుంది.
మొన్న ఎవరో నన్ను ప్రశ్న అడిగారు.
అక్కడ సుషుప్త్యావస్థలో వుంటే ఇక్కడ మెలకువలో ఎలా వుంటామండి అని?
ఇప్పుడు ఆ సుషుప్త్యావస్థలో ఎలా వున్నావు?
ఈ నాలుగు (శరీర ప్రాణ మనో బుద్ధులు) ఏకసూత్రమై వున్నాయి.
కాబట్టే సర్వజీవులు సుషుప్త్యావస్థలో ఆనందమయ కోశంలో వున్నాయి.
సహజంగా ఆనందాన్ని అనుభవిస్తున్నాయి. ఏ అసహజత్వము లేదు అక్కడ.

జ్ఞాతగా సహజంగా ఆనందమయకోశంలో ఆనందాన్ని అనుభవిస్తున్నాయి.

అదే ఏక సూత్రబద్ధం మెలకువలో చేస్తే?

(ఎలా అండీ?)

అసలు నీకు ముందు ఆ లక్ష్యం పొందాలనే బలం (కాంక్ష) వుంటే అదే వస్తుంది.

పలక, బలపం పట్టుకుని అక్షరాలు నేర్చుకోవాలండి.

ఎలా ఎలా అంటే వస్తుందా?

ఏం చెయ్యాలి?

(దిద్దాలి)

పలక, బలపం దగ్గర పెట్టుకుని, ఒక గురువును వెతుక్కుని, వాడి దగ్గర వుండి, వాడు చెయ్యి పట్టుకుని దిద్దిస్తే, ఆ దిద్దే వంకరలు అన్నీ, వస్తాయి. A, B, C, D లలో అన్ని వంకర్లు వుండవు. మన అకారము నుంచి క్షకారము వరకు వున్న వంకర్లు.

అవునా కాదా?

ఎందుకు అలా పెట్టారు?

వాళ్ళ లాగా ఫ్రీగా రాయవచ్చు కదా!

(శబ్దానికి ఒక shape వస్తుందనీ...)

కష్టపడకుండా నేర్చుకున్న విద్య, సరియైన కాలంలో అక్కరకు రాదు.

(కర్ణుడి శస్త్రాస్త్ర విద్యలాగానా అండి)

అర్థమైందా అండి? అవన్నీ మన కోసం సృష్టించబడిన పాత్రలు అవి.

అర్థమైందా అండి!

కాబట్టి కష్టపడి నేర్చుకున్న విద్య?

(ఎప్పటికీ గుర్తు వుంటుంది) మీ సొంతం అది.

అర్థమైందా అండీ!

అయాచితంగా వచ్చింది, అప్పుడేమి చేస్తావు?

దానికి విలువ తెలియదుగా నీకు. ఎక్కడో పారేసుకుంటావు. అర్థమైందా అండీ?

కోహినూర్ డైమండ్‌ని paper wait గా వాడుకుంటావు.

ఎందుకని?

విలువ తెలియదుగా.

కాబట్టి అందరు ఈ శరీర ప్రాణ మనో బుద్ధులు అనే ఈ సూత్ర వ్యవస్థని, సక్రమమైనటువంటి పద్ధతిలో మీరు ‘క్షమత’...
ఇది ‘క్షమత’ అంటే అసలు. నిజానికి క్షమత అంటే అర్థం ఇది. అర్థమైందా అండీ!

అంటే ఎప్పుడూ ఒకే లక్ష్యం మీద పని చెయ్యాలి. ఎప్పుడూ ఒకే తీరుగా వుండాలి. పక్కకు పోకూడదు ఇది. ఆ సంగత్య దోషంలోకి పోకూడదు. ఎక్కడ వుండమంటే అక్కడ వుండాలి అది. ఎక్కడ పని చేయమంటే అక్కడే పనిచేయాలి. అంతేనా కదా?

అలా కట్టివేసేటటువంటి సాధనలు చేయాలన్నమాట. ఏక సూత్రమయ్యేటటువంటి పద్ధతిగా చెయ్యాలి ధ్యానం. ధ్యానం అంటే అర్థం అదే. ధ్యానం అంటే ఏదో కాదు. ఆకాశం అవతల ఆలోచించడానికి ఏమీ లేదు. ఈ నాల్గింటిని ఒకే లైన్‌లో వుంచగలగడమే ధ్యానం. ఇది ధ్యానానికి సరియైనటువంటి సూత్రం. ఎవరైతే ఇలా వుంచారో, ఇప్పుడు నీ చేతిలో ఒక అస్త్రం సిద్ధంగా వుంది. ఈ నాలుగూ కూడా ఏ రూపాన్ని పొందినాయి? ఇవి ఇలా వుండడం వల్ల. ఒక సాధనంగా మారినాయి, ఒక పనిముట్టుగా మారినాయి, ఒక అస్త్రంగా మారినాయి, ఈ అస్త్రానికి మంత్ర శక్తిని జోడిస్తే దివ్యత్వాన్ని పొందుతుంది.

త్రిపురాసుర సంహారం చెయ్యాలి అని అంటే, ఆయన అస్త్రాన్ని ప్రయోగించాడా లేదా? ఏమిటది? ఎవరు ఆ త్రిపురాసురులు?

మనమే. మూడు అవస్థలలో, వాళ్ళు సూర్యుడికి అడ్డం వచ్చేవాళ్ళు. సూర్యగమనానికి అడ్డం వచ్చిన వాళ్ళు త్రిసురులు. త్రిపురాసురులు. ఇద్దరు వున్నారు. ★ వీళ్ళందరూ పాపం ఆ ప్రాతీకాత్మక బోధ మనకు అర్థం అవుతుందని అలా చెప్పారు. మనకేమో ఆ తెలివి లేదు. అది అర్థం కావడం లేదు. ఆ మెలకువా, కల, నిద్రలలో ఈ సూత్ర బద్ధత చెడిపోతుంది అని అర్థం. అవే త్రిపురాలు అంటే. వేరే ఇంకేమీ లేదు. ఈ మెలకువ కల నిద్రలలో ఈ సూత్ర బద్ధత చెడిపోకుండా కనుక మనం నిలబెట్టుకోగలిగినట్లయితే, ఏమైంది అప్పుడు?

“ఆ సుషుప్త్యావస్థలో ఏ ఆనందమయ కోశ పరిధిలో ఆనందాన్ని పరిమితంగా, జ్ఞాతను తెలుసుకోవడానికి అవకాశం లేకుండా, చైతన్యం పొందడమనే ఎఱుకను తెలుసుకోవడానికి అవకాశం లేకుండా, వాటిని అనుభవస్తున్నావో, అదే చైతన్యస్ఫూర్తిని మెలకువలో ఎఱుకతో అనుభవిస్తావు”. ఇది దీని ప్రయోజనము. అర్థమైందా అండీ!

ఈ మూడు అవస్థలు అనేటటువంటి త్రిపురాసుర సంహారము గనుక జరిగినట్లయితే, ఈ త్రిపుటిని గనుక కలిపేసినట్లయితే, సంహారం అంటే తల తరగడం కాదు, మూడింటిని ఏకం చేయడం అని అర్థం. హారము, సంహారము. ఎక్కడి నుంచి మొదలయ్యిందో అక్కడికి తీసుకువచ్చి కలపడం అని అర్థం.

కాబట్టి మనకి ప్రాథమికంగా మన లక్షణము ఏమిటి?
ఆనంద లక్షణము. నువ్వు ఆనంద స్వరూపుడివి.
ఈ ఆనంద లక్షణాన్ని ఎప్పుడు అనుభవిస్తున్నావు?
కేవల సుషుప్త్యావస్థలో, ఎఱుక లేకుండా అనుభవిస్తున్నావు. దాన్ని సాక్షిత్వంతో మూడు అవస్థలలోనూ అనుభవించే స్థితికి కనుక నీవు తేగలిగితే,
అప్పుడు నీవు ఎవరివి?
నీవే శివుడవు. అది శివ స్వరూపము అంటే అర్థం.
అప్పుడు నీ స్వరూపం ఏమిటి?
ఆనందమే నీ స్వరూపం.
క్రమేపీ ఆనంద లక్షణం నుంచి సచ్చిదానంద లక్షణానికి ఎదుగుతావు. ఎందుకని?
ఆనందమయ కోశ పరిధిలోనుంచి బయటకు వచ్చేశావు కాబట్టి. అర్థమైందా అండీ?!

“ఎవరికైతే ఇవి ఆ ఏక సూత్రంగా పనిచేయలేదో, ఎవరికైతే విషయవాసనా బలం చేత అవి పక్కకు పోతూ వున్నాయో, ఏవైతే కూడదు కూడదు అన్నా కూడా అది ఇచ్ఛగిస్తుందో, పొందాలి, పొందాలి అని చెప్పినా పొందకుంటుందో, ఈ వైకల్యమైనటువంటి బుద్ధిని, ఎవరైతే స్వాధీనపరచుకోగలుగుతున్నారో, వాడికి ఇంద్రియ నిగ్రహము వున్నట్లు”.

“ఎవరికైతే ఈ ప్రపంచం మీద ఇటువంటి, రాగద్వేషములు లేనటువంటి భావనలు కలిగినాయో, వాడు వైరాగ్య సంపన్నుడు”.

ప్రియాప్రియములు లేవు వాడికి. కేవల సాక్షిత్వమే. వాడికి ఇంకేమీ కనపడదు. పాత్రలు కనపడవు. పాత్రోచితములు కనపడవు. ధర్మాధర్మములు కనపడవు. సర్వద్వంద్వములు వైరాగ్యమనే అగ్నిలో దగ్ధం అయిపోయినాయి వాడికి. వాడికి కేవల సాక్షిత్వం తప్ప, కేవల శివస్వరూపం తప్ప, అన్యం కనబడదు వాడికి.

అందుకే జీవన్ముక్తులు కొందరు లలితంగాను, కొందరు కఠిన స్వరూపులుగాను, కొందరు కఠినాతి కఠిన స్వరూపులుగాను, కొందరు కోపస్వభావులు గాను, కొందరు దయా స్వభావులుగాను ఆయా జీవన్ముక్తిని పొందిన స్థితిని బట్టి, వాళ్ళు అలా వుంటారు. వాళ్ళు ఇలాగే వుండాలని నియమము లేదు. దుర్వాసుడుకూడా జీవన్ముక్తుడే. పరిపూర్ణ జ్ఞాని ఆయన.

మరి దూర్వాసుడిని మనం అందరం దేనికి వాడుకుంటాం ఉపమానంగా?
(ముక్కోపిగా)

ముక్కోపి అంటారు మీరు. నేను ఏమంటాను అంటే ఆయన పరిపూర్ణజ్ఞాని. జన్మరాహిత్యం పొందినటువంటి మహానుభావుడు దుర్వాసుడు.

మరి ఆ మహానుభావుడిని, భౌతిక జీవనంలో మనం దేనికి ఉపమానంగా వాడుతున్నాము?

ఎట్లా అయితే సముద్రంవల్ల నీకేమిటయ్యా ప్రయోజనం అంటే?
మజ్జిగలో ఉప్పు కలుపుకోవడానికి ఉప్పు పనికొచ్చిందండి అన్నట్లుగా వుంది.

ఎందుకని?
భౌతికం చేత మనం సంతృప్తి చెందుతున్నాము. ఎక్కడో దోషం లేదు?

అనంతమైనటువంటి విశ్వ చైతన్య స్థితిని దాటినటువంటి మహానుభావులు వాళ్ళంతా కూడా. విశ్వమే లేదన్న స్థితిలో వున్నటువంటి వాళ్ళు వాళ్ళు, మనం విశ్వచైతన్యానికి దారి వేసుకోవడానికే మన వల్ల కావడం లేదు. ఎక్కడో తేడా లేదు? అర్థమైందా అండి?

కాబట్టి మన భారతదేశంలో వున్నటువంటి విజ్ఞాన సంపదని, మనదేశంలో వున్నటువంటి సనాతన ధర్మాన్ని, నిజజీవితంలోకి ఆకళింపు చేసుకోవాలి. ముందు మనలో లక్ష్యం బలంగా స్థిరపడాలి. "**నేను ఏమైనా సరే వీటిని ఏకసూత్రం చేయాలి**". ఈ ఏకసూత్రం చేయడానికి ఏదైనా అడ్డురానివ్వండి, అది నాకు అవసరం లేదు, అని త్యజించగలిగేటటువంటి సమర్ధత రావాలి.

ఆ ఇంద్రియ నిగ్రహం, ఆ వైరాగ్య బలం ఏనాడైతే నీకు ఉత్పన్నమైందో, ఆ రెండు రెక్కల చేత, ఏం చెప్పాడండీ?
నీకు జ్ఞానం కావాలంటే ఏం చెప్పారు?
అభ్యాస, వైరాగ్యముల చేతనే జ్ఞానం లభిస్తుందని,
భగవద్గీతలో స్పష్టంగా చెప్పాడా? లేదా?
కర్మయోగంలోనే చెప్పాడు అది కూడా. ఎందుకని?

నువ్వు కర్మ చేసేటప్పుడు నేను కర్త, నేను కర్త, నేను కర్త అంటావు. అనంగానే అది పక్కకు పోతుంది. నాహం కర్త, నాహం కర్త, హరిః కర్త. ఈశ్వరుడే కర్త. అనే నిష్కామ కర్మ లక్షణాన్ని పూనకపోతే, నీవు ఇది ఏక సూత్రబద్ధము ఎలా చేస్తావు? కాబట్టి మనలో ఎంత బలీయంగా వుండాలయ్యా అంటే, అయ్యో! ఈ ఒక్కరోజూ పోయిందే, ఈ ఏకసూత్రం చేయడానికి ఒక్కరోజు గడిచిపోయింది.

ఇంకా ఎన్ని రోజులు వుంటావో, ఎన్ని క్షణాలు వుంటావో నీకు తెలుసా?
తెలియదు కదా!

కాబట్టి ప్రతి ఒక్కరూ కూడా, ఈ సమన్వయ స్థితిని సాధించాలి. ఈ క్షమతని సాధించాలి. ఈ క్షమ అన్న లక్షణమే, మానవ జీవితానికి ఎంతో మూలకేంద్రమై యున్నది. అటువంటి దానిని మీరు అందరూ కూడా ఎంత తొందరగా సాధిస్తే, సాధన... ఎప్పుడైనా గుర్తుపెట్టుకోండి,

"సాధన బహిరంగం కాదు, సాధన ఆంతరికం, జీవన్ముక్తి అన్నది ఆంతరికము, బహిరంగం కాదు, నీ లోపల వుండాలి ఆ అనుభూతం, ఆ ముక్తావస్థ, ఆ స్వేచ్ఛ, రెప్పపాటులో ఆ పైన (స్థితిలో) వుండకలిగే సమర్థుడవై వుండాలి".

రెప్పపాటులో ఎందుకని?

మరణం రెప్పపాటుకంటే తక్కువ కాలంలో వచ్చే అవకాశం వుంది. అర్థమైందా అండి! ఆ మరణం, ఆ మృత్యువు వచ్చి ఆవహించే లోపలే నువ్వు అవతల వుండగలగాలి. అంత సమర్థుడవై వుండాలి. వాడు మృత్యువును జయించినవాడు. (మృత్యుంజయుడు) మరి అప్పుడు శివస్వరూపుడివేగా. అట్లా నిన్ను ప్రోత్సహిస్తుంది వేదాంతము. అట్లా నిన్ను ప్రోత్సహిస్తుంది తత్త్వజ్ఞానము.

ఇప్పుడు ఏమి వదిలి పారిపొమ్మని?
ఏమీ వదిలి పారిపోమనలేదు.
ఎక్కడికి పోతావు?

ఎక్కడికి పోయినా, నువ్వు నీ సంసారం నీతో పాటే వస్తాయి. నువ్వు అడవికి పోయినా, అమెరికాకు పోయినా. మనిషివి పోయావంటే, నీ శరీర ప్రాణ మనో బుద్ధులు నీతో పాటే వచ్చినాయి కదా!

కాబట్టి **సంసారం అంటే ఎక్కడుంది?**

నువ్వే, నీ సంసారానికి ఆలవాలం నువ్వే, ఆశ్రయం నువ్వే, నీ జనన మరణాలకు ఆశ్రయం నువ్వే, నీ సుఖదుఃఖాలకు ఆశ్రయం నువ్వే, నీ ప్రియఅప్రియాలకు ఆశ్రయం నువ్వే. నీలో వున్న గుణధర్మాలే అలా ప్రతిబింబిస్తున్నాయి. ఈ సత్యాన్ని గ్రహించి వెనక్కు తీసుకుని, ఆ వెనక్కు తీసుకోవడం రావాలి.

తాబేలుని ఉపమానంగా ఎందుకు చెబుతున్నారు?

ఏదైనా తేడా రాగానే, అలా దేనిని తీసుకోవాలి ఇప్పుడు?

బుద్ధిని.

ఎందుకని?

అది ఇంద్రియాలలో కెల్లా రాజు.

ఆ బుద్ధిని ఏక సూత్ర బద్ధంలోకి వెనక్కు తీసుకోవడం వచ్చిన వాడు, ఏం చేస్తాడు అప్పుడు?

స్వాధీనం అయిపోయినాయి అన్నీ, అలా వుండు అంటే, అలా వుంటది అంతే. ఇలా పో అంటే, పోతుంది. ఇప్పుడు నువ్వు వెళ్ళు అక్కడికి, ఆ విషయాన్ని తెలుసుకో అంటే, ఇక్కడుండే తెలుసుకుంటుంది.

ఎక్కడో గురువు వున్నవాడు, ఎక్కడో వున్న శిష్యుడికి ఎలా సహాయం చేస్తాడు?

వాళ్ళ ఇద్దరి మధ్యా connection ఏమిటి?

అలా సహాయం పొందిన వారు లేరా?

వున్నారు.

అలా జ్ఞానం పొందిన వారు లేరా?

(ఏక లవ్యుడు)

ఎలా పొందారు మరి?

విశ్వ చైతన్యమే.

వాళ్ళిద్దకి మధ్యా వారధి ఎవరు?

(విశ్వ చైతన్యం) wireless.

ఈనాడు మాట్లాడుతున్నటువంటి Wi-Fi వాళ్ళకు భూమండలం అంతా వుంది వాళ్ళకి.

మన Wi-Fi కాసేపే. ఇక్కడితోనే. అవతలికి వెళ్తే కనపడదు అది మళ్ళా.

ఈనాడు మాట్లాడుతున్నటువంటి internet వ్యవస్థ వాళ్ళకు ఆనాడే వుంది.

ఎక్కడో పిలిస్తే ఎక్కడో పలుకుతాడు. వాడు అక్కడ లేడు కదా! మరి?

ఇప్పుడు వాళ్ళ శరీర, ప్రాణ, మనో, బుద్ధులు ఎటువంటి ఎలక్ట్రానిక్ టవర్స్ అవి?

ఎంతటి కెపాసిటీ వుంది వాటికి?

భూమండలం మీద ఎవరు పిలిచినా పలుకగలిగేటటువంటి, కెపాసిటీ వున్నటువంటి ఎలక్ట్రానిక్ టవర్స్ అవి. మరి ఈ ఇవేగా. మనలో లేవా? ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్‌లు? అణువులు లేవా? ఆటమ్ లేదా? మాలిక్యూల్స్ లేవా?

ఎందుకని మనం వాటిని ఐయనైజ్ చేయలేకపోయాము?
ఎందుకు మనం వాటిని ప్రిపేర్ చేయలేకపోతున్నాము?
ఆ ప్రిపేర్ చేయడం **జపం**.
ఆ ఐయోనైజ్ చేయడం **ధ్యానం**.

ఆ ఐయోనైజేషన్‌ని ఎక్సప్లోర్ అయ్యేటట్లు చేయడం, విశ్వచైతన్యంతో అనుబంధ పడేటట్లు చేయడం **యోగం**.

ఆ అనుసంధాన ప్రక్రియ యోగం. Preparative ప్రక్రియ జపం, తపం, ధ్యానం. తపింప జేయాలి నువ్వు అట్లా.

వాటిని విషయాలవైపు పోనిస్తూవుంటే, ఇంకా తపస్సు ఎక్కడ వుంటుంది?
లడ్డూ తిందామా? జాంగ్రీ తిందామా?
ఇంకా ప్రయోజనం ఏమి వుంది?

ఇట్లా అన్ని జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ఆ బుద్ధి అనేటటువంటి ఇంద్రియం చేతనే పనిచేస్తున్నాయి.

కానీ ఏనుగుని మావటివాడు ఎట్లా లొంగదీసుకున్నాడు? అంతేనా, కాదా?
దానికి ఎక్కడ బలహీనమో తెలుసుకుని, అక్కడ కొట్టాడు.
ఒక్కసారే కొట్టాడు. ఇంకోసారి కొట్టడు ఇక.

కింద నిలబడి అంకుశాన్ని చూపెట్టాడు. చూపెట్టగానే దానికి ఏం గుర్తొచ్చింది?
ఆ తీవ్రమైన తలపోటు గుర్తొచ్చింది. ఆ తీవ్రమైన తలపోటు గుర్తుకువచ్చి కూర్చోమంటే కూర్చుంది, లేవమంటే లేచింది.

ఏనుగుని లొంగదీసుకున్నటువంటి మావటివాని వలే నీవు నీ బుద్ధి అలాగ లొంగదీసుకో. దాని బలహీనత ఎక్కడ వుందో తెలుసుకో! అక్కడ కొట్టవయ్యా దానిని దెబ్బ. ఒక్కసారి దానిని ఎదురించు.

"ఒక్కసారి దానిని (బుద్ధిని) స్వాధీనపరచుకో! అది నీ చెప్పుచేతల్లోకి వస్తే, ఎంత స్వేచ్ఛవుందో అప్పుడు నీకు తెలుస్తుంది. దాని చెప్పుచేతల్లో నువ్వు వున్నావు కాబట్టి, నీకు ఇప్పుడు ఆ స్వేచ్ఛ యొక్క విలువ తెలియడం లేదు".

పైగా అది ఎట్లా ఆడమన్నప్పుడల్లా ఆడి, తగాదాలు కొని తెచ్చుకుని, సమస్యలు పెంచుకుని, వైరుధ్యాలు పెంచుకుని, ప్రియాప్రియములకు లొంగి, ద్వంద్వాలకు లొంగి, సకల జీవరాశులతో ఋణానుబంధాన్ని బాగా పెంచుకుని, ఈ జన్మలో అత్తగారో, మరుజన్మలో మొగుడో, లేకపోతే మరు జన్మలో అబ్బాయో, మనలో వున్న రాగద్వేషాలే ఆయా పాత్రోచితమైన జీవులు అవుతున్నాయి.

ఎక్కడి నుంచి వచ్చారు వీళ్ళు అంతా?
ఏం వీళ్ళతోనే ఎందుకు కలసి జీవించ వలసి వచ్చింది?

వాళ్ళు అందరూ ఈశ్వర ప్రతినిధులు. నువ్వు ఎక్కడ దారి తప్పావో చూపెట్టేటు వంటి దీపపు సమ్మెలు. వారందరూ కూడా guide post లు. ఇది విజయవాడు పోతుంది, ఇది హైదరాబాద్ పోతుంది. Guide post వుంటేనే మనకు తెలిసేది. అట్లాగే

"(ఆ ఈశ్వర ప్రతినిధులు) నువ్వు ఈ త్రికరణ శుద్ధి నుంచి, ఆ సాక్షిత్వము నుంచి, ఆ పొందవలసిన జ్ఞానం నుంచి, ఆ తీవ్ర మోక్షేచ్ఛ నుంచి, ఆ జీవన్ముక్తావస్థ అనే లక్ష్యం నుంచి ఎక్కడ పక్కకు తప్పుకు పోయావో, చెప్పేటటువంటి ఆ జీవులు వాళ్ళు".

వాళ్ళు అందరూ Guide post లు.
వాడు ఎక్కడి నుంచి వచ్చాడు?
అమ్మ పంపిచింది.

ఈశ్వరుణ్ణి చూపెట్టే మార్గం అమ్మదే!

"ప్రకృతి యొక్క కృప అంటే, గురు కృప అంటే ఏమిటి?

ఆయా వ్యతిరేక లక్షణాలు వున్న జీవులతో నువ్వు కలిసేట్టుగా చేస్తారు. జీవించేట్టుగా చేస్తారు. వ్యతిరేక పరిస్థితులలో, దుర్భరమైనటువంటి స్థితులలో, నువ్వు ఉదాసీనంగా వుండి ఎలా ఎదుగుతావో చూస్తారు. ఆ ఉదాసీన లక్షణంతోటి నువ్వు సాక్షిత్వంలోకి ఎలా వస్తావో, సహాయం చేస్తారు. అది కదా నిజమైన సాధన. అది కదా నిజమైనటువంటి తత్త్వజ్ఞానము. అది కదా నిజమైనటువంటి సాంఖ్యవిచారణ"

ఆలోచించి చూడండి. పంచీకరణలు అంతా ఇక్కడ ఇలా కదా మనం వాడవలసినది. అందుకు కదా అసలు అంతసేపు, ఆ పంచీకరణను నేర్పడానికి వాళ్ళు ప్రయత్నం చేసింది. 600 పేజీల వివేకచూడామణి ఎన్నిసార్లు చిరిగిపోయేట్టు చదివినా కూడా దానిని నిజజీవితంలో apply చేయడం రాకపోతే? ప్రయోజనం వుందా?

ఇప్పుడు వివేకచూడామణి ఎన్నిసార్లు తిరగేసేసి వుంటారు?

తిరగ మరగ... నేను ఒక్కసారి కూడా చదువలేదు. అర్థమైందా అండీ?

కాకపోతే ఒక్కటి గుర్తుపెట్టుకోవాలి. "**సారాంశాన్ని మనం గ్రహించాలి. అనుక్షణం దానికోసం వెంపర్లాడాలి. ఆ వెంపర్లాట రానంతవరకూ సాధన ముందుకు సాగదు. నిరంతరాయంగా నేను దీనిని ఎందుకు చేయలేను, నేను దీనినే చేస్తాను. ఆ పట్టుదల, ఆ సింహహృదయం మీలో రానంతవరకూ మీరు దానిని అధిగమించలేరు**".

ఎందుకని?

అది భౌతికం కాదు. ఎప్పుడు వస్తుందో తెలియదు. నీలోపలే వుంటుంది. నువ్వు ఎప్పుడు బలహీనంగా వున్నావో చూసి, మాటువేసి దెబ్బకొడుతుంది. అది వ్యాఘ్రరాజం. అది సింహం కాదు. పులి. మాటున వుండి దెబ్బకొడుతుంది. నువ్వు ఎప్పుడు ఏమరపాటుగా వుంటావో అది చూస్తుంది, చూసి టక్ మని ముందుకి వచ్చేస్తుంది. ఇక అంతే, విలవిలలాడిపోతావు అంతే! అప్పటి వరకూ ఎన్ని పాఠాలు చెప్పినా దాని ముందు, (దిగదుడుపే) ఏమీ లాభం లేదు.

తినద్దు,తినద్దు,తినద్దు,తినద్దు,తినద్దు, అంటూనే తినేస్తుంది. అయిపోయింది. గోవిందా. నారాయణా.

మళ్ళా మొదలే కథ. మళ్ళా మన పోరాటం, మన వెంపర్లాట, మళ్ళా 104 జ్వరం వచ్చేదాకా పోరాడాల్సిందే. ఆ సమయం, సందర్భం, పరీక్షా సమయం వచ్చేంత వరకూ పోరాడాల్సిందే. మళ్ళా పరీక్షా సమయం వచ్చేటప్పటికి, మన పక్కనే అది పనిచేస్తుంది.

ఇట్లా ఈ అభ్యాసాన్ని మనం గమనిస్తూ, సాక్షిగా వుండి గమనిస్తూ, ప్రయత్నం చేసే కొద్దీ మనలో ఏ బలం పెరిగింది? ఇప్పుడు.

'క్షమత' పెరిగిందన్నమాట. తద్వారా నువ్వు ఇదే మార్గంలో వస్తున్నావని నేను గ్రహించాను. ఆ గ్రహింపు శక్తి రాగానే ఏమైపోయింది ఇక. నీ విషయం నాకు అర్థమై పోయింది. ముందు నీవిక మేల్కొంటావు.
ముందు నువ్వు మేల్కోగానే ఏమైపోతావు?

ఆ సంస్కార బలం, ఆ వాసనా బలం, ఆ విషయాలు, ఆ యొక్క ఆకర్షణా బలం అవన్నీ ప్రేరేపణ పొందుతూ వుండగానే నువ్వు ముందే మేల్కొని గ్రహిస్తావు.

గ్రహించి ఆః.. ఇప్పుడు చేస్తా నా తపస్సు. నా సాధన. దీనికి ఇవతల. త్రాసులో ఇవతల పెడతాను. ఇవతలేమో ఇవి వుంటాయి. ఇవతల మన తపస్సు, మన సాధన, మన బలం, మన గురు కృప, మన ఆర్తి, మన వేడు కోలు, అన్నీ సమస్త శక్తులు వడ్డేస్తావు. అప్పుడు ఏమౌతుంది?

నీ ఓటు ఇటు పడంగానే, దాని బలం తగ్గిపోయింది.
నీ ఓటు ఇటు వైపు వుంటే, ఇది పైకి పోయింది. అర్థమైందా అండీ!
నీ ఓటుయే అక్కడ ప్రధానం. ఆఖరి ఓటు నీదే. ఏది ఎన్ని పెట్టినా?
ఇటే నువ్వు ఓటు వేశావు, అప్పుడు ఏమైపోయింది?
Finished. అలా ఒక్కసారి జయించు. జీవితంలో. ఇక నీ జోలికి రాదు అది ఇక.

ఎలా?

ఏనుగు మావటి వానికి లొంగిన రీతి, బుద్ధి నీలో వున్నటువంటి బుద్ధి, అలా నీకు లొంగిపోతుంది.

అప్పుడు నీవు ఏం చేశావు?

దానిని పదే పదే దానినేమీ దెబ్బతీయక్కరలేదు. ఇప్పుడు అంకుశాన్ని చూపెడుతే చాలు. ఇక అంతే.

అమ్మో! మళ్ళా ఆ తలపోటు వచ్చేస్తుందిరా బాబు అని, ఒళ్ళు వంచి పనిచేస్తుంది అర్థమైందా?

పిల్లవాడిని ఒక్కసారి గట్టిగా శిక్షిస్తామా లేదా చిన్నప్పుడు?

ఎందుకని? ఏదో మారాం చేసి, గట్టిగా ఏడుస్తాడు వాడు. అది అసందర్భమై వుంటుందన్నమాట. సందర్భోచితం కాదన్నమాట. అసందర్భం అన్నప్పుడు ఏం చేస్తాము?

గట్టిగా శిక్షిస్తాము.

ఎందుకని?

బలమైన జ్ఞాపకం ఏర్పడేటట్లుగా శిక్షిస్తాము.

ఈ సారి వాడికి ఏమౌతుంది?

ఏయ్ అనంగానే, అమ్మో! అమ్మ కొడుతుంది. అనేటటువంటి దృక్పథం వాడిలో ఏర్పడుతుంది. తద్వారా ఆ రకమైన ప్రవర్తనలోకి వెళ్ళకుండా వుంటాడు. అక్కడ ఎలా చేశామో, ఇక్కడ లోపల మాత్రం ... అన్నీ బయట చేయగలుగుతున్నామండీ! వచ్చిన తగాదా అది. మన లోపల మనం చేయలేకపోతున్నాము.

"నిజానికి అంతర్ముఖ ప్రయాణం అంటే, విశ్వ చైతన్యంతో ఏకీ కృత అనుసంధానం పొందినటువంటి వ్యష్టి చైతన్యం, విశ్వ చైతన్యకేంద్రంలోకి ప్రయాణం చేసి, తనను తాను పోగొట్టుకొని, విశ్వచైతన్యమూలకేంద్రం వైపు ప్రయాణం చేసి, చైతన్య రహిత స్థితిని తెలుసుకోవడం అనే దాకా చేరుతుంది. అది అంతర్ముఖ ప్రయాణం అంటే".

ఇప్పుడు మనం అంతర్ముఖ ప్రయాణంలో ఎన్ని అడుగులు వేశాము?

ఎవరికి వాళ్ళు విచారణ చేసుకోవాలి. నాలోనున్న వ్యష్టి చైతన్యాన్ని విశ్వచైతన్యంతో ఏకీ కృత పరిచి, అనుసంధానపరిచి, సదా దానిని నుంచి స్ఫురణని, స్ఫూర్తిని పొందుతూ, దైవీ ప్రణాళిక ప్రకారము జీవిస్తూ, సద్గురు స్ఫూర్తి ప్రకారం జీవిస్తూ, మూడు అవస్థలలోనూ సాక్షిగా వుండి, ఆ యొక్క గమనాన్ని తెలుసుకొంటూ, ఈ అంతర్ముఖ ప్రయాణాన్ని ఎక్కడిదాకా కొనసాగించాలి?

ఈ వ్యష్టి చైతన్యం వెళ్ళి ఆ విశ్వ చైతన్యంతో కలిసిపోవాలి. సశరీరియై వుండగా, శరీరం వదిలేసినాక కాదు, సశరీరియై వుండగా, నీ హృదయంలో ఆ విశ్వచైతన్య కేంద్రం ఉత్పన్నం అవ్వాలి, మేల్కోవాలి. ఆ విశ్వ చైతన్య కేంద్ర స్థానం నుంచి, ఈ శరీరేంద్రియ ప్రాణమనస్సులని నడపాలి. ఆ విశ్వ చైతన్య కేంద్ర స్థానం ఎరిగిన వాడివై, అనంత విశ్వము చైతన్య రహిత స్థితిలో ఎలా వుందో, తెలుసుకునేటటువంటి దాకా నీ ప్రయాణం సాగాలి. ఇది అంతర్ముఖ ప్రయాణం అంటే, మరి ఈ అంతర్ముఖ ప్రయాణం అనే లక్ష్యంతో కదా, అసలు వేదాంతము బోధించబడుతుంది. దానికొరకు కదా సాంఖ్య తారక అమనస్క పద్ధతిని ప్రవేశపెట్టింది. సాంఖ్యము అంటే పంచీకరణలు, ఆ పృథక్కరించడం, ఐదు ఐదులు ఇరవైఐదుగా విడగొట్టడం ఎలాగో తెలుసుకోవడం సాంఖ్య విచారణ. దానిని నిజజీవితంలో ఇలా వినియోగించి, తారక స్థితిలోకి ఎదగాలి. తారకం అంటే ఎక్కడో వుందని అనుకునేరు,

"**ఈ వ్యష్టి చైతన్యాన్ని ఆ విశ్వచైతన్యంతో అనుసంధానపరచడమే తారకం అంటే**".

తరించుట. ఈ భూమిక నుంచి ఆ భూమికకి, ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తరించుట. అదే యోగమంటే. ఈ తారకమే యోగం. అందుకే తారకయోగం అన్నారు దానిని. ఎవరైతే అనంతమైనటువంటి విశ్వచైతన్య కేంద్రంలో నిలబడి వుండి, దైవీ ప్రణాళికలో జీవిస్తూ, జీవన్ముక్తావస్థలో జీవిస్తూ, అనంత విశ్వచైతన్య రహిత స్థితిని ఎవరైతే తెలుసుకుంటున్నారో, వాళ్ళేమో మోక్షాన్ని పొందుతున్నారు. అర్థమైందా అండీ!

జనన మరణ రాహిత్యాన్ని పొందుతున్నారు. అలాంటి చిట్టచివరి గమ్యానికి చేరేటటువంటి మార్గాన్ని పొందడమే, ఆ చివర, ఆ చలన రహితమైనటువంటి స్థితి. ఆ బయలు అన్నటువంటి స్థితి. విశ్వమే లేనటువంటి బయలు అన్నటువంటి స్థితిలో నిలబడి, వుండగలగడం, సశరీరియై... బాగా గుర్తుపెట్టుకోండి, సశరీరియై... ఆ స్థితిని పొందగలగడం ఏదైతే వున్నదో అదేమో అమనస్క యోగమై వున్నది. అదేమో అమనస్క యోగం. ఈ అనుసంధాన పరిచే ఈ అంతర్ముఖ ప్రయాణాన్ని పూర్తి చేయడమేమో, తారక యోగం.

అదే భౌతికంగా కనబడుతున్నటు వంటి ప్రపంచాన్ని, భౌతికంగా కనబడుతున్నటు వంటి ఈ పంచకోశాలని, నీకు నీకే పృథక్కరించి, ఐదైదుల ఇరవై ఐదు తత్వాలుగా, 25 ఈ యొక్క మేలు కలయికగా, దైవీశక్తి వల్ల ఇవి నడుపబడుతున్నాయి అనేటటువంటి పాదుని మీలో నెలకొల్పడానికి, బోధించబడుతున్నది అంతా కూడా, సాంఖ్యవిచారణ దృష్టి. ఇది సాంఖ్యయోగం.

కాబట్టి **ఈ సాంఖ్య తారక అమనస్క పద్ధతిలో వున్నటువంటి ఏక సూత్రం** ఏమిటి?
Balance. **క్షమత**.

పదార్థము, శక్తి.
చైతన్యము, సృష్టి. అర్థమైందా అండీ?

భౌతికంగా చూస్తే పదార్థము శక్తి.
అవతలికి వెళ్ళావు. అక్కడేమి వుంది?
చైతన్యము, సృష్టి. అర్థమైందా అండీ!

ఇంకా అవతలికి వెళ్ళావు. అక్కడ ఏమి వుంది?
ఆత్మ – పరమాత్మ. రెండే వున్నాయి అక్కడ, వేరే ఇంకేమీ లేవు ఇక.
ఇంకా అవతలికి వెళ్ళావు. ఇవేమీ లేవు.

ఇలా అవతలికి దాటటం. ఇది వున్న స్థితినుంచి ఉన్నత స్థితికి దాటటం. ఎవరికి వాళ్ళు మిమ్మల్ని మీరు ఇట్లా గమనించుకోండి.

ఎంతవరకూ నేను విషయాతీతంగా వుండగలుగుతున్నాను?
ఎంతవరకూ నేను ఈ త్రికరణ శుద్ధిని సాధించాను?
ఎంతవరకూ నేను ఈ విశ్వచైతన్యాన్ని, ఆ విశ్వచైతన్యంతో అనుసంధాన పరచగలిగాను?
ఎంతవరకూ ఆ దైవీ శక్తిని, ఆ దైవీ చైతన్యాన్ని, ఆ ఈశ్వరీయమైన చైతన్యాన్ని నేను నాలో నింపుకోగలుగుతున్నాను?

అన్ని ఆరాధనలలో, అన్ని భక్తి మార్గాలలో, అన్నింటిలో వున్న ఈ విశ్వ చైతన్యాన్ని, నీలోకి ఆవహింపచేసుకోవడమే, ఆహ్వానం పలకడమే, నీలో వున్న ప్రతి కణము, ప్రతి అణువు, ఆ విశ్వ చైతన్యంతో (ionize) ఐయనైజ్ అవ్వడం. ఆ విద్యుదీకరణం పొందడం, ఆ విద్యుదైస్కాంత తత్వ స్థితిని నువ్వు అనుభూతం పొందడం.

అప్పుడు ఏమయ్యావు?

మనలోపల వున్నటువంటి, ఈ మెదడు అనేటటువంటి ఈ మెదడు పనిచేసేదంతా ఆ విద్యుదైస్కాంత తత్వం తోటే. కానీ ఇది పరిమితం. ఇంద్రియ పరిధిలో మాత్రమే పనిచేస్తుంది. కానీ ఇందులోనే ఒక లక్షణం వుంది. అది అనంత సృష్టికి కూడా అనుసంధాన పడగలుగుతుంది. కానీ దీనిని అట్లా మనం వాడడం లేదు. ఆ హృదయ కేంద్రాన్ని మేల్కొలపడం లేదు. ఆ విశ్వ చైతన్య కేంద్రాన్ని గుర్తించడం లేదు. ఆ ఘన సుషుప్తిలో నువ్వు ఎలా వున్నావో, ఈ మెలకువలో ఆ సాపేక్షంగా చూసుకుని వుండగలిగేటటువంటి, సాధనని చేయడం లేదు. జీవితకాలం అంతా సాంఖ్యయోగమే.

జీవితకాలం అంతా ఇంట్లో వున్న వస్తువులని గోతంలో వేయడం, మూట కట్టడం, మళ్ళా వస్తువులన్నీ తీయడం, కింద పెట్టడం. నా దృష్టిలో సాంఖ్యయోగం అంటే ఇంతే. మీ ఇంట్లో వున్న వస్తువులన్నీ తెచ్చి గోతాంలో వేసి మూట కట్టేశాము. అంతేనా కాదా?

ఇదిగో ఇది నువ్వు అన్నాము. నాకు అర్థం కాలేదండి అన్నావు. అయితే అన్నీ మళ్ళా తీసి ఒక్కొక్కటి కిందపెట్టమన్నావు. అన్నీ తీసి మళ్ళా నీ ఇల్లు అంతా పరిచాము. ఇది నువ్వు అన్నాము. అంతే. ఐదు ఐదుల ఇరవై ఐదు కలిసి నువ్వు అయ్యావు. నువ్వు ఎలా వున్నావో నీకు తెలియదు కాబట్టి, మళ్ళా ఐదు ఐదు ఇరవై ఐదు ముక్కలు తెగ్గొట్టి, విడగొట్టి చూపెట్టాము. ఏం ప్రయోజనం వచ్చింది?

ఈ తారక యోగము లేక తరించుట ఎట్లు? వట్టి మోక్షమును సాధించుట ఎట్లు?

అమనస్కం సిద్ధించాలి అంటే, ఆ స్థితికి నువ్వు ఎదగాలి కదా! అందరం ఎదగడం, ఎదగడం అని సులభంగా వాడుతున్నారు ఈ మధ్యలో. ఈ ఎదగడం అంటే ఇది. ఈ ఎదుగుదల ఎక్కడి దాకా వచ్చింది? ప్రశ్నించుకోవాలా అక్కరలేదా?

రోజూ... సంవత్సరానికి ఒకసారి వెళ్ళామండి, గురువుగారిని ఆశ్రయించామండి, పట్టుకున్నామండి, కాళ్ళా పడ్డామండీ, వేళ్ళా పడ్డామండీ లేదంటే కన్నీళ్ళు పెట్టుకున్నామండి. ప్రయోజనం ఏమివుంది? ఇవన్నీ నీక అవసరమే. నేనేమీ కాదు అనను. నీ పరిణామంలో అవన్నీ అవసరమే.

కానీ End Result ఎక్కడికి చేరాము? ఎక్కడికి తేలాము?

ఈ సంవత్సర కాలం ముగిసిపోయింది, బ్రహ్మగారికి ఒక పగలు ముగిసిపోయింది. ఇంకో సంవత్సరం గడిచిపోయింది. బ్రహ్మగారికి ఒక రాత్రి గడిచిపోయింది. ఒక రోజు అయిపోయింది ఆయనకి. ఆయన ఎప్పుడు కళ్ళు తెరుస్తాడో, ఎప్పుడు కళ్ళు మూస్తాడో, ఎప్పుడు ప్రళయం వస్తుందో, ఎప్పుడు జీవ ప్రళయం సంభవిస్తుందో మనకు తెలియదు.

మరి మన ఆయుర్దాయం ఎంత?
ఒక దివ్య సంవత్సరం వుంటుందా?

మన మానవ సంవత్సరాలు శత ఆయుర్దాయమే, అందులో సగకాలాన్ని తీసేసి, సగ కాలం అవిద్యలో, సగకాలం అజ్ఞానంలో, సగకాలం నిద్రలో అన్నీ పోగా మిగిలిన జ్ఞాన కాలం ఎంత? సాధన కాలం ఎంత?

కాబట్టి, ప్రత్యేకంగా అరగంటో, 20 నిమిషాలో, 10 నిమిషాలో రామకోటి వ్రాశానండీ లేకపోతే కాసేపు ఏదో, 10 నిమిషాలు ధ్యానం చేశానండీ, 10 నిమిషాలు మంత్రజపం చేశానండి, కాసేపటికి ఒక దీపారాధన ఇచ్చానండి, ఒక అరటిపండు నైవేద్యం పెట్టానండి, ఆ అరటిపండు కల్లా నాకు మోక్షం ఇచ్చేయాలండి. పత్రం, పుష్పం, ఫలం, తోయం యోమే భక్త్యా ప్రయచ్ఛతి తదహం భక్త్యుపహృతం బధ్నామి ప్రియతాత్మనః నేనిప్పుడు భగవంతుడి ప్రియతముడినే కదండీ! కాబట్టి నాకు భగవంతుడికి భేదం లేదండి. ఒకసారి నారాయణ అనుకుంటే చాలు కదండీ! ఇలాంటి short cut methods పనికిరావు.

ఇవన్నీ ఎవరికి?

ఎవరికైతే సాంఖ్య తారక అమనస్క యోగ విధికి పనికిరారో, సాధకులుగా పనికిరారో, సాధన చతుష్టయ సంపత్తి లేదో, వాళ్ళు a, b, c, d లు కూడా నేర్చుకోవడానికి అర్హులు కారో ... అర్థమైందా అండీ,

మూడేళ్ళ చిన్నపిల్లాడికి ఏం నేర్పుతాం? రెండున్నర ఏళ్ళ పిల్లాడు, ఏం నేర్పుతాం?

ఆ వయసులో మనం ఎట్లా అయితే వాడికి మాటలు నేర్పుతున్నామో, సాధకులుగా అలా సంతృప్తి పడడం ఆ రెండున్నర సంవత్సరాల వయస్సుకు సంబంధించిన వికాసం లాంటిది. ఇంకా నేను పొద్దిన దీపం హారతి ఇచ్చానండి, సాయంత్రం కర్పూర హారతి ఇచ్చానండి, కార్తీక మాసంలో ఉసిరికాయ హారతి ఇచ్చానండి. లేకపోతే దోసకాయ హారతి ఇచ్చానండి, లేకపోతే ఉసిరి చెట్టుకు హారతి ఇచ్చానండి... అవన్నీ చెయ్యొద్దు అని కాదు. చేయండి.

చేస్తే నువ్వు ఏ వివేకంలో వున్నావో నీకు బోధ పడాలి. నీకు సంతృప్తి అక్కడే కలుగుతున్నప్పుడు, నీ బుద్ధి వికాస స్థాయి ఏ స్థాయిలో వుంది అంటే, 3 years.

నీకు 30 ఏళ్ళ వచ్చినా, 300 ఏళ్ళు వచ్చినా, 3000 ఏళ్ళు వచ్చినా కూడా ఆ బుద్ధి వికాసానికి parameter ఎక్కడ పెట్టారు అప్పుడు?
నువ్వు సాంఖ్యయోగానికి పనికి రావు, అర్ధమైందా అండీ!

సాంఖ్యయోగానికే పనికి రాని వాడు, ఎక్కడ పనికి వస్తాడు ఇక?

కాబట్టి, జ్ఞానమార్గం అనేటటువంటిది కత్తి అంచు మీద నడవడం లాంటిది. దీనికి సిద్ధపడ్డవాళ్ళే, ఈ మార్గంలో నడువగలుగుతారు. ఇది అత్యంత కఠినమైనదే. అత్యంత... ఏమని చెప్పాలి అంటే, సరిగ్గా మాట్లాడాలి అంటే...

"**రెప్పపాటు క్షమత లోపించినా కూడా తల తెగిపోతుంది**".

కాళ్ళతో నడువవు ఇక్కడ, నడవడం అంటే అందరూ కాళ్ళతో అనుకుంటారు.
జ్ఞాన మార్గంలో కాళ్ళతో ఎట్లా నడుస్తావు?
బుద్ధితో నడుస్తావు, వివేకంతో నడుస్తావు.

రెప్పపాటు ఏమరపాటుగా వుంటే, పెద్దపాము మళ్ళా వైకుంఠపాళిలో ఒకటికి వచ్చేస్తావు అంతే. ఈ రకంగా జ్ఞానమార్గం, ఎంత విశాలమైందో, ఎంత వివేకశీలమైందో, అందులో ఏమరపాటు లేకుండా, అప్రమత్తంగా నడవవలసినటువంటిది. సాధకుడు కూడా అలానే వుండాలి. కాబట్టి నిరంతరాయంగా ప్రయత్నించాలి ముఖ్యంగా వాళ్ళు. సరే! ప్రతి క్షణము, ప్రతి శ్వాసకి ప్రయత్నం చేసే సమర్థుడై వుండాలి. నేను ఈ జన్మలోనే మోక్షం సాధించాలని మాటకి వాచా వేదాంతము చాలదు ఇక్కడ. నేను కాసేపు అది చదివానండి, కాసేపు ఇది చదివానండీ, ఈ తాత్కాలికమైనటువంటి ప్రయోజనం, తాత్కాలికమైనటువంటి ఉపశాంతికి సంబంధించినటువంటి paracetomal tablets పనికిరావు ఇక్కడ. అర్ధమైందా అండీ!

అటో ఇటో తేల్చుకోవడానికి సిద్ధపడ్డవాడే, జ్ఞానమార్గావలంబికుడు.

★ ఇకపై ఒక నియమం చేద్దాము.

నా క్లాసుకి కేవలం జ్ఞానమార్గావలంబీకులు మాత్రమే రండి. సిద్ధపడ్డవాళ్ళు రండి. మీరు మాట్లాడితేనే నేను మాట్లాడుతా. ఈ జనరల్ క్లాసులు లేవు. ఇప్పటికి చాలా సంవత్సరాలనుంచి నేను ఇట్లాగే మాట్లాడుతూ వచ్చా. దరిదాపు నాకు తెలిసి ఒక పుష్కర కాలం దాటి పొయ్యింది. ఇక నుంచి ఒక నియమం పెట్టుకుందాము.

మీరందరూ మీమీ తరగతిలకు సంబంధించినటువంటి గురువును వెతుక్కోవాలన్నమాట. మీరు నా క్లాసుకి సరిపడా రావాలి అంటే, మీరందరూ జ్ఞానమార్గావలంబీకులై వుండి, అలాంటి అంతర్ముఖ ప్రయాణానికి సిద్ధపడ్డవాళ్ళు మాత్రమే రండి. నిర్మల గారు సత్సంగం అని, నా సత్సంగం అని పిలిస్తే, ఎందుకంటే నేను అలాగ పైకే మాట్లాడుతాను, కిందకి మాట్లాడడం నాకు రాదు.

ఎందుకంటే కిందకి మాట్లాడితే ప్రయోజనం ఏముంది?
నువ్వు వున్నది అక్కడే కదా!
నువ్వు వున్న క్లాసే నీకు చెబితే ఏమిటండీ మీకు ప్రయోజనం?
నీవు అక్కడే కదా వున్నావు? ఆపనే కదా చేస్తున్నావు?
ఇక దాన్ని చెప్పి ప్రయోజనం ఏమి వుంది? అవునా కాదా?

అజ్ఞానాన్ని పొగొట్టాలి అంటే, జ్ఞాన దీపాన్ని వెలిగించాలి అంటే,
వత్తి కాలిపోవాలా అక్కర్లేదా?
వత్తి మాత్రం కాలకూడదండీ, దీపం మాత్రం వెలగాలండీ, ఎలా కుదురుతుంది?

నాకు ఏ నష్టం రాకూడదండీ, ఏ కష్టం రాకూడదండీ, ఏమీ సమస్యలు రాకూడదండీ, అంతా క్షేమంగా వుండాలి, అంతా సుఖంగా వుండాలి. జ్ఞానం మాత్రం వచ్చేయాలి.
ఇది సాధ్యమా?
అసాధ్యం కదా!
అర్థమైందా అండీ?

అనేక జన్మార్జితమైనటువంటి సంచితరాశిని దగ్ధం చేయగలిగేటటు వంటి జ్ఞానాగ్నిని, సంపాదించాలనే ఉత్తమ లక్ష్యాన్ని సాధించాలనుకున్నవాడికి, ఈ నడిమంత్రపు సిరితో వచ్చేటటువంటి, నడి మంత్రపు కష్టాలతో వచ్చేటటువంటి, సమస్యలు ఏపాటివి?

పెద్ద సముద్రాన్ని లంఘించాలనుకున్నవాడికి పిల్లకాలువ దాటడం ఏపాటి?

అలాంటి సింహ హృదయంతో, అలాంటి ధీరోదాత్తమైన లక్షణం వున్నవాడు పనికి వస్తాడు.

భీరువు అయినవాడు?

కాసేపు నక్షత్ర హారతి ఇవ్వవచ్చు, కాసేపు కుంభహారతి ఇవ్వవచ్చు, కాసేపు చంద్రహారతి ఇవ్వవచ్చు, కాసేపు కర్పూర హారతి ఇవ్వవచ్చు... వాటితో సంతృప్తి చెందవచ్చు. అర్థమైందా?

కాబట్టి ఇకపై ఎవరైతే ఇలా, ఈ మార్గంలో నడుద్దామని అనుకున్నవారు వుంటారో, మీరందరూ వచ్చేసారి మనం కలిసేటప్పటికీ, మీరు ఆ రకమైనటువంటి పరిణామాన్ని పొందాలని, ఆ రకమైనటువంటి సాధనాబలంతో ముందడుగు వేయాలని ఆశిస్తున్నాను. అందరికీ ధన్యవాదాలు.

ప్రార్థన

ఓం ఓం ఓం

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణమేవా వశిష్యతే

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణమేవా వశిష్యతే

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణమేవా వశిష్యతే

ఓం తత్ సత్

ఓం సహనాభవతు సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై తేజస్వి నావధీతమస్తు మా విద్విషావహై

ఓం శాంతిః శాంతిః శాంతిః

సాయిరాం.

మీ Tooth Paste లో ఉప్పు వుందా?

========================

మీ దృష్టిలో గండ్ర గొడ్డలి వుందా?

అదే నండి వివేక వైరాగ్య ఖడ్గం

శిష్యురాలు 1: అందమైన పాలరాతి రాధాకృష్ణుల బొమ్మ చూడగానే, What's app లో అర్జెంటుగా పంపాలి.

సాధకురాలు: పాల రాతి విగ్రహమైన నేమి, నల్లరాతి విగ్రహమైన నేమి? విగ్రహము నిగ్రహము కొరకే కదా!

శిష్యురాలు 2: అబ్బా! ఈ పూలు ఎంత బాగున్నాయో, ఈ ముగ్గులు, design అదురుపాటుగా వున్నాయి.

సాధకురాలు: యద్ధృశ్యం తన్నశ్యం.

శిష్యురాలు 3: అమ్మవారికి అలంకరణ ఎంత బాగా చేశారో! ఎంత బావుందో...

సాధకురాలు3: ఏం బావుంది?, నిజంగా అమ్మ బాహ్య అలంకారాన్ని చూస్తుందా, లోపల సద్గుణ అలంకారాన్ని చూస్తుందా?

శిష్యుడు 1: ఈ పాట, ఈ అన్నమాచార్య కృతి ఎంత వీనుల విందుగా వుందో,

సాధకుడు1: నిజానికి అన్నమయ్య! భావం విని అది నిశ్చయం చేసుకుంటే బాగుండనుకుంటాడా, కేవలం సంగీతాన్ని, గాత్రాన్ని ఆస్వాదిస్తే మెచ్చుకుంటాడా?

శిష్యుడు 2: KFC మాంసం ముక్కలో పురుగులు వచ్చాయంట, అర్జెంటుగా ఫేస్ బుక్ లో షేర్ చేయాలి, లేకుంటే ప్రపంచం ఏమైపోను?

సాధకుడు2: పురుగులు కనిపించాకనే దోషం గుర్తొంచ్చిందా, రసనేంద్రియాన్ని సంతృప్తి పరచడం కదా అసలైన దోషం.

శిష్యుడు 3: UNESCO వాళ్ళు భారత జాతీయ గీతాన్ని గొప్ప national anthem గా ప్రకటించారంట. అందరికీ చెప్పాలి.

సాధకుడు3: జగతి వార్తల యందేల కుతూహలము నీకు?

శిష్యుడు 4: మా ఇంట్లో మొన్న కార్తీక పౌర్ణమికి బ్రహ్మ కమలం పూసింది.

సాధకుడు 4: అయితే ఏంటట? నీకు బ్రహ్మ జ్ఞానం వచ్చిందా, అంతా బ్రహ్మమనే నిశ్చయజ్ఞానంలో, నిష్ఠలో స్థిరంగా వున్నావా నీవు?

శిష్యుడు 5: Good Morning

సాధకుడు 5: Good అయిననేమీ, Bad అయిననేమీ, Good, Bad లు జీవుడికి కానీ, ఏమార్పు లేనట్టి ఆత్మనైన నాకు అవి లేవు కదా!

గురువు గారు: సంధ్యా సమయాన్ని సాధన కాలంగా మార్చుకోండి.

శిష్యుడు గారు: మహ బాగా చెప్పారు సర్! అబ్బో ఎంత బాగా చెప్పారో,

సాధకుడు: నిజంగా 6 లో 4 సంధ్యలను సాధన కాలంగా మార్చుకుంటే గురువు సంతోషిస్తాడా? బాగా చెప్పారు అని కితాబు ఇస్తే గురువు సంతోషిస్తాడా?

శిష్యుడు: అబ్బో! రేపొద్దిన భక్త పోతన సినిమా అంట టీవీలో మీరు చూడండి.

సాధకుడు: చెట్టుమీద ఫలములు నీటిలో ప్రతిబింబిస్తున్నాయట, ఆ నీటియందలి ఫలములతో ఆకలి తీరుతుందా?

శిష్యుడు 6: అబ్బా! Journey boring గా వుంది, what's app లో మనం పెట్టిన పోస్టు ఎంతమంది చూశారో, మన ఫోటోకి ఎన్ని లైకులు వచ్చాయో చూద్దాం.

సాధకుడు 6: అవును మరి రేపు మరణ కాలంలో మనల్ని ఆ లైకులు, షేర్లే కదా కాపాడేది, చూడు చూడు బాగా చూడు.

చివరగా కొసమెరుపు:

శిష్యుడు: ఈ విషయాన్ని నేను అధిగమించలేకపోతున్నాను, ఎలాగరా దేవుడా?

కాబోయే సచ్ఛిష్యుడు: ఇప్పుడు నేను వున్న పరిస్థితిలో గురువు వుంటే ఏం చేస్తాడో నేను అదే చేయాలి.

ఆనందము

ఆనందము ఒక పని చెయ్యటము లేక ఒక పని చెయ్యకపోవటము వలన వచ్చేది కాదు. ఆనందము కారణ, కార్య రహితము. ఏక కాలములో నేను ఉన్నాను, ఉన్నదానిని గుర్తిస్తున్నాను అన్న స్థితి యందు ఉన్న వానికి సర్వ ప్రపంచము ఉపశమిస్తుంది. మూడు అవస్థలలోను శరీర , ఇంద్రియ, ప్రాణ, మనో బుద్ధులు, ప్రపంచము వాటంతట అవే ఉపశమిస్తాయి, లేనివే అవుతాయి. ఇంటువంటి స్థితిలో మిగిలిపోయిన భావము ఏదో దానికి ఆనందము అని పేరు. సత్ లోను, చిత్ లోను ఏక కాలములో ఆత్మ నిష్ఠ యందు ఉన్నవానికి, సాక్షిగా ఉన్నవానికి అన్ని ఉపశమించిపోగా ఏ భావమైతే మిగిలిపోయినదో ఆ భావమునకు ఆనందము అని పేరు. ఇది ఆత్మ జ్ఞాన పూర్వకముగా ఆనంద నిర్ణయమును చేయుట అంటే.

ఆనందము = పూర్ణత్వం = అనంతము

నేను ఎప్పుడు ఆనందమునే కోరుకుంటుంది.

కాని ముక్త పురుషులు అనుభవించేది కారణరహిత ఆనందము

జీవుడు అనుభవించేది కారణసహిత ఆనందము

కారణసహిత ఆనందము నిన్ను బద్ధుడను చేస్తుంది

మానవులు అందరు కోరుకొనేది ఆ శాశ్వత ఆనందమునే కాని తాత్కాలిక సుఖానుభవము కాదు. భ్రమచేత తాత్కాలిక సుఖానుభవమే ఆనందముగా భ్రమ పడుచున్నాము. అజ్ఞానముతో మానవులు సుఖము జగత్తులోని బాహ్యవస్తువుల వలన లభిస్తున్నది అని భ్రమిస్తున్నారు. నిజమునకు ఆ సుఖము మనలో జ్ఞాపకముల రూపములో లేక స్మృతి రూపములో ఉన్నది. అవి వ్యక్తమవుటకు అనుకూల వాతావరణము లభించిన వెంటనే వ్యక్తీకరించ బడుచున్నవి. మనలోని భావనల దృష్ట్యా జగత్తులోని వస్తువులను చూస్తూ, ఆ వస్తువుల ద్వారా సుఖము లభిస్తున్నది అని భ్రమిస్తున్నాము.

ఒక పిల్లవాడు ఆటబొమ్మలు కనపడకపోయిన ఏడుస్తాడు. తన మానసిక భావనలు ఆ బొమ్మలపై ఆరోపించి ఆ బొమ్మల ద్వారా ఆనందము లభిస్తున్నది అన్న భ్రాంతికి బాలుడు లోనవుచున్నాడు. కాని పెద్దవారికి ఆ భ్రాంతి లేదు కనుక , ఆ బొమ్మల వలన లభించే సుఖము ఏమి లేదు అని తెలుసు కనుక దుఃఖము ఉండదు. కాని పిల్లలు కనిపించకపోయిన పెద్దలు దుఖిస్తున్నారా? లేదా? దుఖిస్తున్నారు. కనుక ప్రతి దుఃఖము వెనుక భ్రాంతి ఉంటుంది. జ్ఞాని దుఃఖరహిరముగా, రాగరహితముగా, భ్రాంతి లేకుండా జీవిస్తాడు.

కుటుంబ సభ్యులు ఎవరైనా చనిపోయిన దు:ఖిస్తున్నామా , ఆనందిస్తున్నామా? ఏడ్చేవాడు ఏమని ఏడుస్తాడు? నువ్వు నన్ను అలా చూచేవాడివి, నాకు కావలసినవి అన్ని చేసేవాడివి అని ఆనంద సంఘటనలను ఏకరువు పెడుతూ ఆ ఆనందము లభించే అవకాశమును కోల్పోయానని దు:ఖిస్తాడు. అంటే లోపల ఆనంద క్షణములను నెమరవేస్తూ ఆనందిస్తున్నాడు బయట అది లభించే అవకాశము కోల్పోయానని దు:ఖిస్తున్నాడు. బాలడు ఆట వస్తువు కొనివ్వక పోయిన ఏడుస్తాడు. మానసికముగా బాలుడు ఆ ఆటవస్తువుతో ఆడుచూ, రమిస్తూ బాహ్యములో ఆ వస్తువు ద్వారా ఆనందము లభించలేదని ఏడుస్తున్నాడు. బాల్యములో ఏఆట బొమ్మతో కూడిన ఆనందము వస్తువు ద్వారా లభించలేదని ఏడ్చావో వృద్ధాప్యము వరకు అదే సంబంధముతో ఏడుస్తున్నావు. దుఃఖించుటకు కారణమైన వస్తువు మారుచున్నదే కాని అదే సంబంధము కొనసాగుచున్నది. జ్ఞానము ఉంటే దుఃఖము ఉండదు. దుఃఖరాహిత్యమే జ్ఞానము. వేటికోసం ఏడుస్తున్నావో వాటిలో నీకు జ్ఞానము లేదు. వేటి కొరకు నీవు దుఃఖించుట లేదో వాటిలో నీకు జ్ఞానమున్నట్లు.

మానవులు అందరు కోరుకొనేది శాశ్వత ఆనందమే కాని తాత్కాలిక సుఖమును కాదు. శాశ్వత ఆనందమును పొందవలెనన్న తాత్కాలిక సుఖము కొరకు ప్రయత్నమును, వ్యధను విడనాడవలెను. మనస్సు ఎప్పుడు తనకు అనుకూలమైనవి, సుఖమును కలిగించేవి కోరుకొంటుంది. మన ప్రయత్నము అంతా మనస్సుకు కావలసినవి ఏర్పరచుట కొరకే. మనస్సుకు కావలసినవి ఏర్పరచుచున్నావు అంటే కర్మను, ఫలితముతో ముడిపెట్టినట్లే. కామ్యక కర్మలో ఫలాసక్తత ఉంటుంది కనుక వ్యధ తప్పదు. శాశ్వత ఆనందమునకు నీకు మార్గము గోచరించవలెనన్న ప్రయత్నించి సుఖమును భోగించ రాదు, ప్రయత్నించి దుఃఖమును విడువ రాదు. కోరికలు అలజడిని, అశాంతిని సృష్టిస్తాయి. అలజడి పొందిన మనస్సు విచారభూతమవుతుంది. కోరికలను విడువ గలిగితేనే ఆలోచనల అలజడి తగ్గుతుంది. అలా శాంతించిన మనస్సే ఆనందమునకు ఆటపట్టు. ఈ విధముగా కోరికలు తగ్గినకొద్దీ అశాంతి తగ్గి ఆనందము పెరుగుతుంది. నీలోని కోరికలు అంతా ఖాళీ అయితే లభించే అఖండ అనుభూతే ఆత్మానందము.

ఆత్మానందమును పొందవలెనన్న ఆనంద నిర్ణయమును నిరసించవలెను. ఆనంద నిర్ణయమును నిరసించుట అంటే ఉదాసీనతతో జీవించుటయే. ఈశ్వరుని నిమిత్తము కర్మ చెయ్యి. అప్పుడు ఆనంద నిర్ణయము ఉండదు.

కారణరహిత ఆనంద స్థితినే నిర్వాణము అంటారు. మానవ జన్మను ఎత్తిన ప్రతి ఒక్కనికి ఈ నిర్వాణమును పొందే అర్హత ఉన్నది. సుఖము లేక దుఖము కర్మ ఫలితముగా నీ మనో పరిధిలో కలుగుతుంది. కాని ఆనందము ఒక ఆలోచన లేక కర్మ లేక క్రియ యొక్క ఫలితముగా లభించేది కాదు. ఆనందమును నీవు అనుభవించే టప్పుడు మనస్సు లయిస్తుంది. మనస్సు ఎక్కడైతే లయిస్తుందో ఆ స్థానమునకు ఆనంద నిలయము అని పేరు. అదే హృదయ

స్థానము. నిద్రలో నీవు ఏమి చేస్తున్నావని నీకు ఆనందము లభిస్తున్నది? ఏమి చేయుట లేదు కదా. కాని ఆనందము లభిస్తున్నది కదా. నిద్రా సమయమున మనస్సు ఈ హృదయ స్థానము నందే లీనమవుతుంది. నిద్రలో ఆనందము కలుగు చున్నది కాని ఆ ఆనంద నిర్ణయమును చెయ్యలేక పోవు చున్నాము. మన ప్రయత్నము జపతపాదులు మెదలగునవి అంతా ఈ ఆనందము నిర్ణయము కోసమే.

ఆనంద అనుభవము ముందు కలుగుతుందా లేక ఆనంద నిర్ణయము ముందు కలుగుతుందా?

మనస్సు పని చేస్తున్నంత సేపే ముందు తెలిసికోవటము తరువాత అనుభవమును పొందటము. మనస్సు పనిచేయటము ఆగిపోయిన తరువాత ముందు అనుభవము తరువాత నిర్ణయము ఉంటుంది. ఆనందము అనుభవించు సమయమున మనస్సు లయిస్తుంది కనుక ముందు ఆనంద అనుభవము కలుగుతుంది తరువాత ఆనంద నిర్ణయము కలుగుతుంది. కనుకనే మనము నిద్ర లేచిన తరువాత ఆనందమును నిద్రయందు అనుభవించాను అని చెబుతావు.

తత్ అంటే అది బ్రహ్మము

త్వం అంటే నేను

త్వం , తత్ ను తెలిసికోవాలి. త్వం ఇప్పుడు ఇంద్రియాభిముఖముగా ఉన్నది. దానిని అంతర్ముఖము చేసి తత్ రూప దృష్టిని పొందాలి. అంటే అది నేను అయి ఉన్నాను అన్న భావన ఉంటే తప్ప తత్ రూప దృష్టి కలుగదు. ఆత్మ స్వరూపుడుగా నీవు ఉండి నీ ఇంద్రియములను నీవు గమనించు. నీ చేష్టలలో ఉన్న వికారత్వమును నీవు ఖండించు. అప్పుడు కారణరహిత ఆనందమును నీవు పొందుతావు.

ఆనందభావము లేక నీ స్థితి యందు నీవు నిలిచియున్న అది బ్రహ్మము స్థితి. ఆనందమును అనుభవిస్తున్నప్పుడు ఉనికి ఉండదు. కేవలము అనుభూతి మాత్రమే ఉంటుంది. నీవు తాత్కాలిక సుఖములను కోరుకుంటున్నంత వరకు జీవభావనను నిలుపుకొంటున్నావు. ఉనికిని నిలుపుకొంటున్నావు. వాటిని పరిత్యజించిన నీ స్వస్వరూప ఆనందము అనుభవమునకు వస్తుంది. ఆత్మానుభూతి కలుగుతుంది.

--- X ---

గురువు

గురువు అనగా చీకటిని (అజ్ఞానమును) పారద్రోలి వెలుగును (జ్ఞానమును) ప్రసాదించువాడు.

గురువు అనగా

దారి తెలిసినవాడు దారి పోయినవాడు

దారిలో చీకటిని పారద్రోలిన వాడు

దరి అంచు కనుగొన్న వాడు

ఆ మార్గములో తనను ఆశ్రయించిన వారిని నడిపించగల శక్తి సామర్ధ్యములు కలవాడు.

సాధకులు పుస్తకములు చదివి జ్ఞానమును తెలసికొనవచ్చు, అవగాహనను పెంపొందించుకోవచ్చు. కాని ఆ జ్ఞానమును అనుభవ జ్ఞానముగా (విజ్ఞానముగా) మార్చుకోవలనంటే మాత్రము అనుభవజ్ఞుడగు గురువు నడిపింపు తప్పనిసరి. శాస్త్రము మనకు గురువు అంటే ఎవరు? గురువుకు ఉండవలసిన లక్షణములు ఏమిటి? గురువును ఆశ్రయించి దేనిని గురించి తెలిసికొనవలెను? గురువును దేనిని గురించి ప్రశ్నించ వలెను అను ప్రాధమిక విషయముల గురించిన అవగాహనను కలుగ చేస్తుంది. శాస్త్రము మనకు సిద్ధాంతమును తెలియ చేస్తుంది మరియు జ్ఞానమును జన సామాన్యముగా చెబుతుంది అనగా అందరికి అవగాహన కలిగించే విధముగా తెలియచేస్తుంది

గురువు ఆ శాస్త్ర జ్ఞానమును నీ జీవితమునకు అన్వయించు కొనుట ఎలాగో తెలియ చేస్తారు. ఏ వరుస క్రమములో చెబితే ఆ జ్ఞాన వాక్యములు నీ సంస్కార బలమును అధిగమించే శక్తినిస్తాయో ఆ వరుస క్రమములో చెబుతారు. నీ స్థితిని గుర్తెరిగి నీ స్థితికి తగిన విధముగా బోధిస్తారు. నీకు నిన్ను నీవు చూసుకోవటము, సరిచేసుకోవటము నీకు చేతకాదు కనుక నిన్ను నీవు పరిశీలించుకొనేటప్పుడు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తావు. కనుక నీవు గురువును ఆశ్రయించిన, గురువు నీలోని లోపములను చూపించి, నీ సంస్కార బలమును అనుసరించి ఏవిధమైన సాధన చేస్తే వాటిని అధిగమిస్తావో, ఆ విధానమును తెలియచేస్తారు. నీకు నీ లక్ష్యమును తెలియజేసి ఆ లక్ష్యము దిశగా ప్రయాణించుట ఎలాగో తెలియచేస్తారు.

గురువులలో కూడా వివిధ రకములైన గురువులు ఉంటారు

కర్మ, భక్తి, యోగ మార్గములో శ్రేయస్సు అందించే విధానమును ఉపదేశించేవారు శ్రిగురువులు

జ్ఞాన మార్గములో శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ కలిగి ఉన్నవారు గురువులు

ఆత్మ సాక్షాత్కార జ్ఞానముతో మానవులను సన్మార్గములో, జ్ఞాన మార్గములో నడిపించే ఆచార్యులు శ్రీ సద్గురువులు

సత్య సంకల్ప సిద్ధిచేత ఆశ్రయించిన వారిని ఉద్ధరించే వారు సద్గురువులు

కాలాతీతులై అనంత విశ్వానికి నిర్వహణ, అత్మోద్ధారణకు ప్రేరేపించి సహాయము చేసేవారు విశ్వసద్గురువులు

అనంత విశ్వానికి ఒక తోపునిచ్చే సమర్ధత కలవారు అవతారులు

గురువు శిష్యుడు ఉన్న పరిస్థితిని మరియు స్థితిని బట్టి వివిధ రకములైన వాక్యములను బోధిస్తారు. వాటిని సూచన వాక్యములు, సాధన వాక్యములు, విచారణ వాక్యములు, ఆప్త వాక్యములుగా విభజించవచ్చు.

సూచన వాక్యములు లక్ష్యమును సూచిస్తాయి.

సాధన వాక్యములు స్థిరమైన అభివృద్ధిని , స్వానుభవమును అందిస్తాయి.

విచారణ వాక్యములు వస్తు నిశ్చయ జ్ఞానాన్ని ఇస్తాయి

ఆప్త వాక్యములు సద్గురు కృపని అందిస్తాయి

స్థాయిని బట్టి స్థితిని బట్టి అన్వయ వ్యతిరేకములను అర్ధము చేసుకొనుటకు గురుమయ దృష్టితో అర్ధం చేసుకోవటం అత్యావశ్యకము. గురువు బోధించిన వాక్యములు బుద్ధికి ఆవలనున్న ప్రజ్ఞలో ముద్రితమవుతాయి. తగిన సమయమందు అవి స్పురణ రూపములో పని చేస్తాయి. గురువు తాను బోధించే వాక్యముతో పాటు శక్తిని కూడా నిక్షిప్తము చేస్తారు.

ఎవరైతే గురువు చెప్పిన వాక్యములను విని తిరిగి ప్రశ్నిస్తారో వారికే మాత్రమే గురువు విచారణా మార్గమును బోధిస్తారు. అలాగే విచారణా మార్గమునందు ప్రయాణించే వాడు తన మనస్సును, తన బుద్ధిని ప్రశ్నించుకోవాలి. ఇప్పటివరకు జీవితములో జరుగుచున్న సంఘటనలకు కారణము బయట చూస్తున్నాము, బయట వెతకుచున్నాము. విచారణా మార్గమునందు ప్రవేశించినవారు ఆ జీవి, ఈ జీవితో అలా ఎందుకు ప్రవర్తించినది అని కారణము తమలో వెదకుకుంటారు. కనుక విచారణా మార్గమునందు ప్రయాణించే వానికి ప్రతి జీవి సహాయకారియే అవుతుంది.

గురువు ప్రారంభ స్థితిలో ఉన్న శిష్యునికి అవగాహన కలిగేవరకు అన్ని విషయములు క్రమముగా బోధిస్తారు. ఒక సారి అవగాహన కలిన తరువాత శిష్యుడు వాటిని ఆచరణలో పెట్టాలి. అంటే సాధకునిగా మారాలి. గురువుని సమీపించి సాధన చేయుచున్నప్పుడు ఎదురవుచున్న ఇబ్బందులను చెప్పి వాటికి పరిష్కారము తెలిసికోవాలి. గురువు కూడా నీవు ఉన్న స్థితిని గమనించి ఏమి చేస్తే పైస్థితికి చేరుకుంటావు, ఆ స్థితిని చేరుకోవడానికి నీలో ఏవి అడ్డంకులుగా ఉన్నాయో వాటిని తెలియ చేస్తారు. అంతే కాని గంటలు గంటలు బోధించుట ఉండదు మరియు దాని వలన ప్రయోజనము కూడా ఉండదు. శిష్యుడు సాధకునిగా మారనిచో కొంత కాలమునకు గురువును మాట్లాడించ గలిగే శక్తిని కోల్పోతాడు. శిష్యుని అంతరంగములోని మధన, సాధనా బలమే గురువుని ప్రేరేపించి మాట్లడింప చేస్తుంది. శిష్యునిలోని జిజ్ఞాస, పరిప్రశ్న, సాధనా బలము వలన కలిగిన ఉదాసీనత గురువుకు ప్రేరణను కలిగిస్తాయి.

ఒకసారి గురువును ఆశ్రయించిన పిదప శిష్యుడు తన పాత జీవితమును మరచి పోవలెను. గురువు యొక్క బోధను అనుసరించి నూతన జీవితమును , అత్మానుసార జీవితమును జీవించుట ప్రారంభించవలెను. తన పూర్వ సంస్కార బలమును సాధనద్వారా అధిగమించ వలెను. గురువు, శిష్యుని పూర్వ వాసనలను , సంస్కార బలమును పరిశీలించి వేటిని అయితే విడువ వలెనో వాటిని శిష్యుని తెలియ చెప్పుచు, వాటిని అధిగమించుటకు కావలసిన జ్ఞానమును, వేదాంత వాక్యములను ఉపదేశరూపమున అందించుచుంటారు . ఆ వాక్యములను శిష్యుడు శ్రవణ, మనన, నిధి ధ్యాసములద్వారా తనలో స్థిర పరచుకొనవలెను. అప్పుడు పూర్వ వాసనలు సంస్కారముల రూపములో పనిచేయుట ప్రారంభించిన వెంటనే తద్వ్యతిరేఖ జ్ఞాన వాక్యములు స్పురణకు వచ్చును. ఆ వాక్యములను అనుసరించి జీవించుట వలన జ్ఞాన బలముతో, సంస్కార బలమును జయించ అధిగమించ గలుగును.

విచారణ చేయుటలో గురువు చేసే సహాయము కన్నా సాధన అనుభవములను భేరీజు వేసుకొనుటకు, సాధకునిలో పరివర్తన తీసికొని వచ్చుటకు గురువు చేసే సహాయము, అందించే శక్తి ఎంతో అమూల్యమైనవి.

<u>కర్మ ఫలములు</u>

జీవునకు ప్రాప్తించు కర్మ ఫలములు మూడు విధములుగా ఉండును

1.సంచితము 2.ప్రారబ్ధము 3.ఆగామి

సంచితము - జీవులు తమ పూర్వ జన్మలలో కూడబెట్టుకొనిన కర్మ ఫలములను సంచితము అంటారు

ప్రారబ్ధము - జీవుడు ఏ కర్మఫలములను అనుభవించబడు నిమిత్తము ఈ శరీరము ధరించాడో వాటిని ప్రారబ్ధము అంటారు

ప్రారబ్ధము మూడు విధములు

ఇచ్ఛాప్రారబ్ధము - మనము మనఃపూర్వకముగా కోరుట వలన ఇప్పుడు అనుభవమునకు వచ్చిన కర్మఫలములు

అనిచ్ఛాప్రారబ్ధము - తాము కోరకుండానే దైవికముగా ప్రాప్తించేవి

పరేచ్ఛాప్రారబ్ధము - ఇతరులు కోరుట వలన మనకు ప్రాప్తించిన కర్మఫలములు

ఆగామి - జీవులు ప్రారబ్ధమును అనుభవించే క్రమములో క్రొత్త కర్మలు చేస్తూ ఉంటారు. వాటిలో భాగముగా ఏర్పడిన క్రొత్త కర్మఫలములను ఆగామి అంటారు. భవిష్యత్తులో చేరే కర్మఫలములను ఆగామి కర్మలు అంటారు.

సంచితము భూతకాలము, ప్రారబ్ధము వర్తమానకాలము, ఆగామి భవిష్యత్తు

సంచితములో కొంత భాగము ప్రారబ్ధ కర్మగా వస్తుంది. దీనిని అనుభవవించే క్రమములో ఆగామి ఏర్పడుతుంది. దీనిలో మిగిలినది సంచితములో కలుస్తుంది.ఈ కర్మ సూత్రాన్ని అధ్యయనము చేసి, అర్థము చేసుకొని జ్ఞానముతో సంచితముతో సహా ఎవరైతే పోగొట్టుకొంటారో వాళ్ళు మోక్షాన్ని పొందుతారు.

ఫలితములను ఆశించకుండా కర్మలను ఆచరించుట వలన అరిషడ్వర్గములు నశించి చిత్తము పరిశుద్ధమగును. పరిశుద్ధమైన చిత్తము జ్ఞాన బోధకు సంసిద్ధమైనది. సద్గురువు ద్వారా జ్ఞానము కలుగును. జ్ఞానమును ఆచరణలో పెట్టి సాధన చేయగా చేయగా భగవదనుగ్రహము వలన జ్ఞానము అనుభవజ్ఞానముగా పరిణమించును. అట్టి స్థితిలో జ్ఞానాగ్ని వలన సంచితములోని సమస్త పుణ్య పాపకర్మలు నిశ్శేషముగా దగ్ధమైపోవును. పాప కర్మ ఫలములను పుణ్య కర్మలను ఆచరించుట వలన నశింపచేసికొన వచ్చును. కాని పుణ్య పాప కర్మలను సమూలముగా నశింప చేయగల శక్తి ఒక్క ఆత్మజ్ఞానమునకు మాత్రమే ఉన్నది.

ప్రా(ముందు) + ఆరబ్దము(వచ్చినది) - ప్రారబ్ధము అంటే పూర్వము నుండి వచ్చినది అని అర్ధము. గత జన్మ కర్మ ఫలితమును ఇపుడు మనము అనుభవిస్తున్నాము. చాలామంది ప్రస్తుతము మేము ఉన్న పరిస్థితికి కారణము నా ప్రారబ్ధము. అదే నన్ను ఈ విధముగా జీవించేటట్లు చేస్తున్నది అంటారు. కాని నీవు వర్తమానములో కర్మ చేసేటప్పుడు దానికి వ్యతిరేకమైన కర్మాచరణ చేయుట ద్వారా ఆ కర్మ ప్రభావమునుండి బయట పడవచ్చు. ప్రస్తుతం ధర్మ పద్ధతిలో ధర్మబద్ధమైన కర్మలు చేసి వాటి ప్రభావమును తగ్గించుకొనవచ్చును. ఉపాసనలు, ప్రార్ధనలు, పూజలు, శాస్త్రాధ్యయనము, తపస్సు, ధ్యానము వంటి వాటి వలన మనము గత కాలములో నిర్వర్తించిన కర్మల వలన కలిగిన ఫలిత ప్రభావమునకు లోనుకాకుండా తప్పించుకొని సక్రమమైన మార్గములో వెళ్ళేలా చేసికొనవచ్చును. గతించిన కాలం మన వశంలో లేదు. గత కాలంలో సరైన నిర్ణయము తీసుకొనక అనేక పాపకర్మలు చేసి ఉండవచ్చు. పాపము అంటే ఆత్మ ధర్మానికి వ్యతిరేఖముగా చేసేదంతా పాపమే. తిరిగి ఆత్మ ధర్మంలో నిలబడి జీవించి కర్మను అధిగమించిన స్థితిలో ఉండవచ్చు.

మనము ఈ శరీరము ధరించడానికి కారణమైన బలీయమైన సంస్కారములు మూడో , నాలుగో ఉంటాయి. అవే మన ప్రారబ్ధము. మిగిలిన సంస్కారములను కేవలము విచారణచే అధిగమించవచ్చు. కాని జన్మకు కారణమైన సంస్కారములను మాత్రము కేవలము ఆత్మజ్ఞానము చేతనే అధిగమించుటకు వీలగుతుంది. సంస్కారములు, వాసనలు ప్రాణ,మనో,బుద్ధులు అనే సూక్ష్మాన్ని ఆశ్రయించి ఉంటాయి. ఈ శరీరము ప్రాణ,మనో,బుద్ధులను ఆశ్రయించే పనిచేస్తుంది. కనుక మనము సరిచేయవలసినది అంతరంగమును, సూక్ష్మమును. అది కేవలము విచారణ ద్వారానే సాధ్యము. బుద్ధిని బుద్ధి చేతనే అధిగమించాలి. మన జీవన విధానము ఈ సంస్కార బలము మరింత బలపడే విధముగా ఉంటున్నది. విచారణ iద్వారా ఏవిధమైన జీవితమును జీవించిన ఈ సంస్కార బలము నుండి బయట పడతామో ఆ విధమైన జీవన విధానమును ఆశ్రయించాలి. అప్పుడు ప్రారబ్ధ ప్రభావమునకు లోబడక జీవించగలుగుతావు.

జీవితములో ఏవి మన వశమున ఉన్నవో అనగా ప్రయత్నముచే మార్పు చేసికొనుట అవకాశము ఉన్నదో వాటిని మార్పుచేసికోవాలి. ఏవైతే మన వశమున లేవో వాటిని ఎంతో ఓర్పుతో, అణకువతో అనుభవించి రద్దు చేసికొనవలసినదే. ప్రారబ్ధము విల్లు నుండి విడిచిన బాణం వంటిది. కాబట్టి వెనుకకు తీసుకోటం కుదరదు. శరీరము వచ్చేసింది కదా! వాటిని ఏం చేయగలం? అనుభవించి క్షయింపచేసుకోవాలి. 'నీవు' లేకుండా ఉంటే అవి క్షయం అవుతాయి. నీవుండి చేస్తే అవి ఎప్పటికి ఉంటాయి. అనుభవించేటపుడు నేను చేయటం లేదనే కర్తృత్వ భోక్తృత్వములు లేకుండా ఉండాలి, అప్పుడే అవి క్షయం అవుతాయి. లేకపోతే మిగుల్చుకొంటావు. వాటికి ఎదురు చెప్పకుండా మౌనంతో,సహనంతో, ధైర్యంతో అనుభవించవలసిందే. వాటిని ఎలా తప్పించుకోవాలి అని చూడకుండా, దానికి అన్య

కారణాలు వెతకకుండా, సర్వకారణ మీశ్వరం అని ఈశ్వర ప్రసాదంగా భావించి దానిని సంతోషంగా, సహనముతో, సాధనగా తరించడానికి మార్గంగా భావించి దివ్యమైన స్థితిలో అనుభవించడం నేర్చుకోవాలి. నేను అనే నామరూపాలు, జీవభావం స్థానంలో దైవాన్ని అక్కడ పెట్టుకొని, ఆ దైవీస్థితిలో ఉండి అనుభవించడము నేర్చుకోవాలి. మనం అనుభవిస్తున్న సుఖదుఃఖాలన్ని మనను భగవంతుడిలో చేర్చుకోవడానికి ఆయన మనకిస్తున్న అవకాశంగా చూడాలి. సాధనా మార్గంగా చూడాలి. సుఖదుఃఖాలకి ప్రభావితం కాకుండా చూసుకోవాలి. మనము బాధలననుభవిస్తున్నపుడు వాటిని నివారిచేందుకు వైద్యుడు ఇస్తున్న మాత్రల వంటివే ఈ దుఃఖానుభవమని తెలుసుకోవాలి. పాఠాన్ని ఈ రూపంలో తీసుకోవాలి. అప్పుడు నీ మీద ప్రారబ్ధ కర్మల వల్ల ఏర్పడే సుఖదుఃఖాల ప్రభావం లేకుండా ఉంటుంది.

ప్రారబ్ధమును ఓర్పుతో, అణకువతో అనుభవించాలంటే గుణాతీతంగా ఉండాలి. గుణాతీతంలో ఎప్పుడు నిలబడతారో అప్పుడు సాక్షివి అవుతావు. గుణత్రయానికి, అవస్థాత్రయానికి ఎవరైతే సాక్షిగా నిలబడిఉన్నారో వాళ్ళు ప్రారబ్ధమును సాధనగా మార్చుకొని జ్ఞానాన్ని పొందగలుగుతారు.

శరీర మనస్సులు నేను అన్న పరిమిత భావనను విడచి పెట్టి , నేను ఆత్మను అను భావనలో ఉండి కర్త లేని స్థితిలో కర్మను ఆచరించ వచ్చు. కర్తయే లేనపుడు కర్మ ఎవరిని ఆశ్రయిస్తుంది? కర్మయే లేనపుడు కర్మ ఫలము ఎలా ఉంటుంది? జ్ఞానము యొక్క ఫలము నీవు ప్రారబ్ధము చేత బాధించ బడకుండా ఉండే స్థితిలో ఉంచటమే. జీవించేటప్పుడు వచ్చిన దానిని కాదనక, పోవుచున్న దానిని వద్దనక, లేని దానిని కావాలనక సాక్షిగా జీవించటమే దీనికి పరిష్కారము. కర్మ జడము. దానికి ఉనికి లేదు. చైతన్య సహాయము ఉంటేనే సంస్కారములు పని చేస్తున్నాయి, మనస్సు రూపమును దృశ్యముగా చూపిస్తున్నది, ఇంద్రియములు పనిచేయు చున్నవి. అదే చైతన్య సహాయముతో ఈశ్వరుని చూడు. అప్పుడు ప్రారబ్ధము చేత బాధించబడని స్థితిలో ఉండగలుగుతావు. నీవు ఆత్మ ధర్మంలో నిలబడి ఉండి ఈ సాధనాలన్నీ చేసినట్లయితే స్వస్వరూపజ్ఞానము వస్తుంది. స్వస్వరూపజ్ఞాన ప్రభావం వలన ఆ కర్మ ప్రభావం నీ మీద పడకుండా ఉంటావు.

జ్ఞానమార్గం ద్వారా భవిష్యత్తులో జరిగే కర్మఫలములకు దూరంగా ఉండాలి, గతములో మనం కూడబెట్టుకొన్న కర్మఫలము నుండి (సంచితము నుండి) పరిపక్వత పొందిన కర్మ ఫలములు అంటే ఈ జన్మలో అనుభవించడానికి సిద్ధంగా ఉన్న కర్మ ఫలములు ప్రారబ్ధకర్మలు అవుతాయి. ప్రారబ్ధమును అనుభవించే క్రమములో భవిష్యత్తులో మన ఖాతాలోనికి చేరే కర్మఫలములను ఆగామి కర్మలు అంటారు. శాస్త్రాధ్యయనము చేయటము వలన నిరంతర ధ్యానాభ్యాసము వలన జ్ఞానమును పొంది అహంకారభావమును పూర్తిగా లయం చేస్తే జీవితములో మనకు కలుగు

సుఖదుఃఖానుభవమునకు అసంగంగా, సాక్షీభావముతో ఉండటము సాధ్యపడుతుంది. సాక్షి భావనతో జీవించుట ద్వారా ఆగామి కర్మను పోగొట్టుకోవచ్చును.

"నేను, నేను" అనేదాన్ని నిరసించడం నేర్చుకోవాలి. నేను సాక్షిని, నేను సాక్షిని, అని నిలబడి ఉండి, ఎన్ని వచ్చినా అన్నింటిని నిరసిస్తూ వచ్చేస్తే కేవల సాక్షి చివరకు మిగులుతుంది. ఆ కేవల సాక్షే బ్రహ్మము అని తెలుస్తుంది. బ్రహ్మమనే స్థితిలో నిలబడి ఉన్నపుడే ఇవన్నీ నిరసించడానికి వీలు అవుతుంది. ఈ ఆత్మ జ్ఞానము వలన నేను చేస్తున్నాను, నేను అనుభవిస్తున్నాను అను భావములు తొలగిపోతాయి. నేను భావించేవాడిని, నేను ఆలోచించేవాడిని అనే జీవ భావం అంతా తొలగిపోతుంది. కర్తృత్వ భోక్తృత్వాలను నిరసించాలి. నేను సాక్షిని అనేటప్పటికి ఈ ఆలోచనలు, భావాలు లేకుండా పోతాయి. దీని పర్యవసానముగా నీవు జీవ భావము లేక అసంగంగా ఉండుట సంభవిస్తుంది. కాబట్టి సాక్షీ సాధన ద్వారా ఆగామి కర్మను పోగొట్టుకోవచ్చు.

ప్రారబ్ధము భోగముతో నశిస్తుంది. సాక్షిత్వముతో అకర్తగా ఉండి అనుభవిస్తే ప్రారబ్ధము క్షయము అవుతుంది.

ఆగామి కర్మ నిత్యవర్తమానములో, నిష్కామ కర్మతో, ఈశ్వరార్పణ భావముతో జీవించుట ద్వారా ఏర్పడకుండా ఉంటుంది.

సంచితము బ్రహ్మజ్ఞానముతో పరబ్రహ్మ నిర్ణయాన్ని పొంది తనువు లేని వానిగా వున్నప్పుడు మాత్రమే రద్దు

పై విధముగా జీవించుట వలన మూడు కర్మలు నశించిన మోక్షము కలుగును.

--- X ---

కోరికలు

నేను అసంతృప్తుడను, అసంపూర్ణుడను అన్న భావనయే సమస్త కోరికలకు మూలము. అసంతృప్తుడను, అసంపూర్ణుడను అన్న భావనయే జీవుని సుషుప్తి నుండి మెలకువ లోనికి తీసుకొని వస్తుంది. ఆ అసంతృప్తతను బాహ్యములో తీర్చుకొనే ప్రయత్నములో భాగముగా కార్యోన్ముకుని చేస్తున్నది. తీర్చుకొనే క్రమములో ఏయే విషయములలో అసంతృప్తత మిగిలిఉన్నదో అవి ఆగామిగా (వాసనలుగా) తయారవుతున్నాయి. ఆగామి - సంచితమై, సంచితములో కొంత భాగము - ప్రారబ్దమై- ఈ విధముగా జనన మరణ చక్రములో తిరుగాడేటట్లు చేస్తున్నాయి.

ఆహార , నిద్ర, భయ, మైధునములు జంతువులకు కూడా ఉన్నవి. బుద్ధి జంతువులకు లేదు. బుద్ధి ఉన్నవాడు వివేక వైరాగ్యములు కలిగి ఉండాలి. ఇవి రెండు లేని మానవుడు పశువుతో సమానము. బుద్ధి బాగున్నది, బాగుండలేదు అను వాటి మద్య ఊగిసలాడుతూ ఉంటుంది. బాగున్నది అన్నవాటివలన సంతృప్తిని, బాగుండలేదు అన్నవాటివలన అసంతృప్తిని పొందుతుంది. మానవులు తమ జీవితమును గురించి తెలియచేయమన్న సాధించినవి, సాధించవలసినవి చెబుతారు. సాధించినవి సంతృప్తి పరిధిలోనికి , సాధించవలసినవి అసంతృప్తి పరిధిలోనికి వస్తాయి.

ఏయే విషయములలో బుద్ధి వికాసము పూర్తి అయినదో వాటిలో పరిపూర్ణత వస్తుంది. ఏయే విషయములలో బుద్ధి వికాసము పూర్తికాలేదో వాటిలో అపరిపూర్ణత్వం మిగిలి ఉంటుంది. ఏయే విషయములలో నీ అపరిపూర్ణత్వం మిగిలి ఉన్నదో పరిపూర్ణత్వం పొందే నిమిత్తము ప్రయత్నము జరుగుతూ ఉంటుంది. ఈ శరీరము ద్వారా సాధ్యము కానిచో మరియొక శరీరము ధరించబడుతుంది.

నేను ఆత్మను, సంపూర్ణుడను. నేను పొందవలసినది కాని, కోల్పోవునది కాని ఏమి లేదు అన్న గ్రహింపు, గుర్తింపు వలన మాత్రమే ఈ జనన మరణ చక్రము నుండి, ఈ కోరికల విష వలయము నుండి బయట పడతాము కాని కోరికలు తీర్చుకొనే క్రమములో దీనికి పరిష్కారము ఎప్పటికి లభించదు.

అందరు కోరికలు తీరుట వలన సుఖము, సంతోషము కలుగుచున్నవి. తృప్తి చెందుచున్నాము అని భావిస్తుంటారు. నిజమునకు ఆనందము ఆత్మ సహజ లక్షణము. కారణ రహితము. అది ఒక వస్తువును పొందుట వలన లభించునది కాదు. ఒక వస్తువు దూరమగుట వలన తొలగేది కాదు. మనస్సు నందు కోరిక ఆలోచనగా ఎప్పుడు అయితే వ్యక్తమైనదో , ఆ కోరిక తీరునంతవరకు వరకు అలజడికి లోనగునట్లు చేసి మనస్సు బహిర్ముఖము అగునట్లు చేస్తుంది. కోరిక తీరిన అలజడి , అశాంతి దూరమై స్వస్వరూప ఆనందమును తిరిగి అనుభవిస్తుంటాము. ఇది అలజడి తొలగుట వలన కలిగినదే కాని కోరిక తీరుట వలన కలిగినది కాదు.

వస్తువును పొందుట వలననే సుఖము కలిగిన ఒకే వస్తువు అందరికి సుఖము కలుగజేయవలెను కదా? కాని అట్లా జరుగుట లేదు. ఒకరికి సుఖకరముగా ఉన్న వస్తువు మరియొకరికి దుఃఖము కలిగించుచున్నది. కేవలము మనలోని కోరికను ఆ వస్తువుపై ఆరోపించి ఆ వస్తువు సుఖమును ఇస్తున్నది అని భ్రమించుచున్నాము. ఇది చంటిపిల్లవాడు తన బొటన వ్రేలు చీకుచూ తల్లి స్థనమునుండి పాలు త్రాగుచున్నానని భ్రమించుట వంటిది.

మానవులు అందరు కోరుకోనేది సుఖమునే. కాని సుఖము, శాంతములేక లభించదు. శాంతము సమత్వభావన వలన ప్రాప్తిస్తుంది. సమత్వభావన దైవీసమర్పణ భావనతో జీవించుట వలన అలవడుతుంది. అజ్ఞానముతో మానవులు సుఖము జగత్తులోని బాహ్యవస్తువుల వలన లభిస్తున్నది అని భ్రమిస్తున్నారు. నిజమునకు ఆ సుఖము మనలో జ్ఞాపకముల రూపములో లేక స్మ్రుతి రూపములో ఉన్నది. అవి వ్యక్తమవుటకు అనుకూల వాతావరణము లభించిన వెంటనే వ్యక్తీకరించ బడుచున్నవి. మనలోని భావనల దృష్ట్యా జగత్తులోని వస్తువులను చూస్తూ, ఆ వస్తువుల ద్వారా సుఖము లభిస్తున్నది అని భ్రమిస్తున్నాము. మన స్మృతిని పరిశీలించి, సమత్వభావనను నెలకొల్పిన ఈ భ్రాంతి నుండి బయటపడతాము.

సుఖము పదార్థముల వలన కలుగు చున్నదా? లేక ఆ పదార్థములకు సంబంధించిన జ్ఞప్తి వలన కలుగు చున్నదా? ముగ్గురు హోటల్ కు వెళ్లారు. ముగ్గురు మూడు వేరు వేరు పదార్థములు ఆర్డర్ ఇచ్చారు. ముగ్గురుకు పదార్థముల వలన కలుగు సుఖము, సంతృప్తి ఒక్కటే కాని పదార్థములు వేరు. పదార్థమును ఎలా ఎన్నుకొంటున్నావు? ఏదైనా ఒక పదార్థమును తిన్నప్పుడు ఆ పదార్థము బాగుంది అని ఒక జ్ఞాపకమును (ఆ పదార్థము వలన కలిగిన సుఖమును) నిర్ధారణగా భద్రపరచుకొంటున్నావు. మరల అనుకూల పరిస్థితి వచ్చినప్పుడు ఆ పదార్థము వలన కలిగిన సుఖమునకు సంబంధించిన జ్ఞాపకము కోరికగా వ్యక్తమై పదార్థమును ఎన్నుకొంటున్నది.

పదార్థమును తింటున్నప్పుడు పదార్థము వలన సుఖము వస్తున్నదా? జ్ఞప్తి వలన సుఖము వస్తున్నదా?

జ్ఞాపకము వలన సుఖము కలుగు చున్నది. కాఫీ త్రాగుచున్నావు, దానిలో పంచదార వెయ్యలేదు, త్రాగావు. దుఃఖము వచ్చినది. ఎందువలన? కాఫీ అంటే ఇలా ఉండాలి అనే నిర్ణయము నీలో జ్ఞాపకముగా నిర్ధారణగా ఉన్నది. దానితో పోల్చుకొని సుఖము , దుఃఖము అని నిర్ధారిస్తున్నావు. కనుక సుఖము , దుఃఖముల నిర్ణయము జ్ఞాపకముల వలననే కలుగుచున్నవి.

ఒక వస్తువుని చూసిన వెంటనే అదేమిటి అని ప్రశ్న కలుగుతుంది మనసులో. తెలుసుకోక పోతే నాకేమయ్యింది అని ఊరుకుంటామా? లేదు. మనకు తెలిసిన పరిజ్ఞానముతో దానిని విశ్లేషించే పనికి పూనుకుని, ఒక

నిర్ణయానికి వచ్చి ఆ వస్తువుని పట్టుకుని అవునాకాదా అని పరిశీలించి zandu balm అన్నావు. దాని గురించి తెలిసిన వాడు, దీన్ని 'రుమాసిల్' కీళ్ళ నొప్పులకు ఇంకా బాగా పనిచేస్తుంది అన్నాడు. ఏ నొప్పులకయినా రాయొచ్చు. Zandu balm కన్నా power full. చాలా రకాల మూలికలు దీనిలో కలుస్తాయి అని పూర్తి వివరాలు నీకు అందించాడు. ఇక నీవు రుమాసిల్ మాత్రమే కొంటావు, ఇలా కోరిక కలుగుతుంది, ఆ వస్తువు యెడల ఆ విషయము ఎడల కలిగిన పరిజ్ఞానం వల్ల కోరిక కలుగుతుంది. మనకు తెలియని విషయం యెడల మనకు కోరిక కలిగే అవకాశమే లేదు.

కాబట్టి మనసులో ఉన్న కోరికలను పరిత్యజించాలంటే మీకు ఏమేమి తెలుసో ఆ 'తెలుసు' ను పరిష్కరిస్తే తప్ప పోవు. కాని మనము తెలిసినంత వరకు ఆ పరిజ్ఞానాన్ని బల పరుస్తున్నాము ఆచరణలో, దానిని బలహీన పరచటం చేయాలి సాధకుడు. అలా చేస్తే కోరికగా మారకుండా పోతుంది. మనసు మార్చుకుని ఊరుకుంటే, తాత్కాలికమే కాని శాశ్వత పరిష్కారం రాదు. మనసులోని కోరికలు పరిత్యజించు. పరిత్యజించుట అంటే ఏమిటి? దాని పరిజ్ఞానంతో సహా విడవటం. మనసులో ఉన్న వస్తు పరిజ్ఞానం వల్ల విషయాలు అనుభవాన్ని ఇస్తున్నాయి. మనసులో ఉన్న పరిజ్ఞానం చేత వస్తువును చూడగానే ఇది బాగుంటుంది, లేక బాగోదు అనేది తోస్తుంది కదా! కాబట్టి నువ్వు దేన్ని పరిష్కరించాలి అంటే మనసులో ఉన్న ఆ వస్తు పరిజ్ఞానాన్ని పరిష్కరించాలి. ఆ వస్తువుల యడల 'బాగున్నది' అనే పరిజ్ఞానాన్ని పరిత్యజించు. దాన్ని వదిలేస్తే ఇక కోరిక కలిగే అవకాశం లేదు.

నీలో బలీయమైన జ్ఞాపకములు ఏమి ఉన్నవో చూచుకో. వాటిని అధిగమించ వలెనంటే రెండు పద్ధతులలో పరిష్కరించుకోవచ్చు

1.విచారణ చేసి వివేకముతో వాటిలోని లోటుపాట్లను, వాటివలన కలుగుచున్న నష్టమును అర్థమగునట్లు చెప్పుట ద్వారా పూర్వ అభ్యాసమును విడచి పెట్టవచ్చును

2.వేటినైతే విచారణ ద్వారా పరిష్కరించుకోలేవో, ఏవైతే నీ బలహీనతలుగా స్థిరపడినవో అటువంటి వాటిని అధిగమించ వలెనని అదే పనిని విడువక పదే పదే చెయ్యండి. దానిపై విరక్తి, విసుగు కలిగి వదిలి పెట్టేస్తారు

వివేకము దృష్ట్యా స్వభావాన్ని పరిష్కరించుకొనిన అది శాశ్వత పరిష్కారము. తాత్కాలిక పరిష్కారమును చూచిన వివేకమును కోల్పోతాము. ఇది తమోగుణ లక్షణము

భ్రూమధ్యమున ద్రుష్టి నిలుపగలిగిన వాని తెలివి ఎల్లవేళల పనిచేస్తుంది. మనోబుద్ధి పరిధిలో ఏవిధమైన ఆకర్షణ ఉన్నను ద్రుష్టి భ్రూమధ్యమున నిలువదు. సూక్ష్మ శరీరములోని(మనోబుద్ధి పరిధిలోని) ఆకర్షణలను పరిష్కరించుకొనే వరకు భ్రూమధ్యమున ద్రుష్టి నిలుపుట సాధ్య పడదు. ఒక వస్త్రములోని అడ్డ ధారములను , నిలువు ధారములను

తీసివేసిన వస్త్రము లేని విధముగా సూక్ష్మ శరీరములోని ఆకర్షణలను ఒక్కొక్క దానిని పరిష్కరించుకొని ఏమి లేకుండా చేసికోవాలి.

--- X ---

మరణము

మ + రణము

రణం = పోరాటము

మ = లేకుండా పోవుట

మరణముతో జీవితము అనే యుద్ధము (లేక) పోరాటము ముగిసిపోతున్నది.

నీ మనో , ప్రాణ , బుద్ధులే సూక్ష్మము అంటే. జనన మరణములు శరీరమునకే, సూక్ష్మమునకు కాదు. సూక్ష్మము ఈ సృష్టి ఉన్నంతవరకు ఉంటుంది. ఈ సూక్ష్మములో మూడు అవస్థలు, మూడు గుణములు, మూడు వాసనలు, వాటికి సంబంధించిన జ్ఞాపకములు ఉంటాయి. ఈ సూక్ష్మములో జ్ఞాపకరూపములో ఉన్న కోరికలు తీర్చుకొనుటకే శరీరము ధరించబడుచున్నది(జననము). ఈ శరీరము నా కోర్కెలు తీర్చు కొనుటకు పనికి రాదు అనుకొన్నప్పుడు చిరిగిన వస్త్రమును విడచినట్లు, శరీరమును సూక్ష్మము విడుస్తున్నది (మరణము).

మానవులు మరణము నిమిత్తము ఎందుకు దు:ఖిస్తున్నారు ?

ఈ శరీరము పోతుందని దు:ఖిస్తున్నారా లేక దేహము ఉన్నవారితో సంబంధము పోతున్నదని దు:ఖిస్తున్నారా? అంతరాత్మను గుర్తెరగ లేదని దు:ఖిస్తున్నారా లేక ఈ మానవ ఉపాధిలోనికి వచ్చినది పరమాత్మను తెలిసికొనుటకు. అది ఈ శరీరము ద్వారా నెరవేరుట లేదని దు:ఖిస్తున్నారా? వీటిలో వేటి నిమిత్తము దు:ఖిస్తున్నారు.

నిజమునకు మరణము అసలు దుఃఖించ వలసిన అంశమే కాదు. అది పవిత్రమైనది. దానిని అశుభముగా ఎందుకు చూస్తున్నారు? మృత్యువు దేవత. దానిని సృజించిన తరవాతనే జీవులకు జన్మ నిచ్చారు. నీకు పరిణామము కలగాలి అంటే మరణమే శరణ్యము. ఒక ఉపాధి ద్వారా పొందవలసిన పరిణామమును పొందావు. ఇంక ఆ ఉపాధి ద్వారా నీవు సాధించ వలసినది ఏమి లేదు. ఆ ఉపాధి నుండి విముక్తి పొంది కొత్త ఉపాధిని ధరించ వలసి ఉన్నది. మృత్యువు లేక మరణము ద్వారా అది జరుగు చున్నది. కనుక మృత్యువు పవిత్రమైనదా లేక అశుభమా? ఒక శరీరము శిధిలమై పోయినది. దాని ద్వారా ఇంక సాధన చేసి పరిణామము పొందుటకు సహకరించే పరిస్థితిలో లేదు. మరణము ద్వారా ఒక శరీరమును విడచి కొత్త శరీరమును ధరిస్తున్నావు. మరణము నీకు సహాయ కారియా లేక శత్రువా? సహాయకారియే కదా.

నిత్య ప్రళయమును అనుభవించేవాడు జీవుడు. ప్రతి దినము నిద్రలోనికి వెళ్ళిన వెంటనే జీవుడు లేకుండా పోతున్నాడు(ఇంద్రియములను మీరి ఉంటున్నాడు), మెలుకువ వచ్చిన వెంటనే తెలివి కలిగి ఉంటున్నాడు (ఇంద్రియములలోనికి దిగి వస్తున్నాడు కనుక). జీవుడు మరణముతో శరీరమును విడచి పెట్టుచున్నాడు.

నేను శరీరమును. నేను ఎప్పటికి పోను అనే భావనలో ఉంటున్నావు. కాని శరీరము ఏదో ఒకనాటికి పోయేదే. అందుకే మరణ భయము కలుగు చున్నది. నేను రోజు పోతున్నాను అంటే నీవు జీవుడవు. నేను పంచభూతములతో కూడిన సృష్టితో పాటు పోతున్నాను అంటే అత్మస్వరూపుడవు. నేను బ్రహ్మాండముతో పాటు పోతున్నాను అంటే బ్రహ్మస్వరూపుడవు. నేను విశ్వముతో పాటు పోతున్నాను అంటే పరమాత్మవు. నేను అనేది ఒక పరిమితి. ఆ పరిమితిని అధిగమిస్తూ క్రమముగా నేను అనేది లేని స్థితికి చేరుకోవాలి. ఏమిలేని స్థితే సత్యము. ఏదో ఒకటి ఉన్నది అంటే దాని ఉనికి చేత పరిమితించ బడతావు. బుద్ధి ఎప్పుడైతే భూత ,భవిష్యత్ కాలములను గురించిన ఉహ చేసిందో అప్పుడు బంధము మొదలైనట్లే. ఎవడు నిత్య వర్తమానములో జీవించ గలుగుతాడో వాడే నిత్య ప్రళయమును దాట గలుగుతాడు.

ఆఖరి చూపుకు తప్పకుండా వెళ్ళాలి అని పెద్దలు చెబుతారు. ఎందువలన అంటే పెద్దలందరు చేరినపుడు వారి జీవిత అనుభవమంతా తమ మాటలలో అప్పుడు తెలియజేస్తారు. ఎవరైనా చనిపోయినపుడు జీవుడు పోయాడు అని అంటారు. ప్రాణ, మనోబుద్ధులే జీవుడు. జీవుడు శరీరమునకు సాక్షి. ప్రాణ, మనోబుద్ధులకు సాక్షి అంతరాత్మ. మరణము అంటే ప్రాణ, మనోబుద్ధులు లేక జీవుడు ఈ శరీరమును విడచి పెట్టుటయే. కాని ఈ జీవుడు శరీరమును విడచి పెట్టాలి అనే నిర్ణయమును చేసేది అంతరాత్మ.

దహించ బడేది దేహము. నశించి పోయేది శరీరము.

ఎవరైనా మరణించి నపుడు చేసే కార్యక్రమములో మొదట ఈ సృష్టి ఎలా ఏర్పడినది మొదలగు విషయములను తెలియ జేస్తారు. ఈశ్వర లక్షణములు అన్ని చెప్పి నీవు బ్రహ్మ స్వరూపుడవని తెలియజేసి మూతలో నిప్పులు పట్టుకొని బయలుదేర మంటారు. కుండపై మూత పెట్టి దానిలో నిప్పులు తీసికొని వెడతారు. కుండ, మూత వేరుగా చూడమాకు. రెండు ఒక్కటే అని తెలియజేయుట ఇది. రూపము దృష్ట్యా కుండా, మూత వేరైనప్పటికి లక్షణముల దృష్ట్యా రెండు మట్టినుండి వచ్చినవే. రెండు ఒక్కటే.

వైశ్వానరాగ్నిచే రోజు నీవు తీసికొనే ఆహారము జీర్ణము చేయబడుచున్నది. నీకు ఆకలి వేయుచున్నది. ఆ వైశ్వానరాగ్నియే మరణ సమయమున శరీరమంతా వ్యాపించి సూక్ష్మమును, స్థూలంను వేరుచేస్తుంది. అప్పుడు

జీవుడు ఈ శరీరమును విడచి పెట్టుటకు అవకాశము ఏర్పడుతుంది. వైశ్వానరాగ్నిచేతనే తల్లి గర్భమునందు శిశువు యొక్క శరీరము ఏర్పడుచున్నది. వైశ్వానరాగ్ని సహాయముచేతనే జీవుడు శరీరమును విడచి పెట్టుచున్నాడు. చివరకు అగ్ని చేతనే కాటి యందు శరీరము ఆకారము కోల్పోతున్నది, కాల్చ బడుచున్నది. ఆకారము వచ్చినది. కొన్నాళ్ళు ఉంటున్నది. ఆకారము పోతున్నది. ఉన్నవాడు ఎప్పుడు ఉంటున్నాడు.

మరణ సమయ కార్యక్రమములో ఉపయోగించు కుండ నీ శరీరమునకు సాదృశ్యము. ఆ కుండలో నీరు పోసి చిల్లు చేస్తారు. ఆ కుండలోనుండి నీరు ఎలా కారు చున్నదో నీ ఆయుష్షు అలా దిన దినము క్షీణిస్తున్నది అని తెలియజేస్తున్నారు. చివరకు కుండను వెనుకకు తిరిగి చూడకుండా పగలగొట్టు అని తెలుతారు. వెనుకకు తిరిగి చూచిన పగల గొట్టే కుండపై కూడా వ్యామోహము కలుగుతుందని. అంటే శరీరమును విడచిపెట్టే సమయమున శరీరముపై ధ్రుష్టిని ఉంచిన నా శరీరముపోతున్నది అని దుఃఖము పాలవుతావు. కనుక వెనుకకు తిరిగి చూడక(శరీరముపై ధ్రుష్టిని నిలుపక) శరీరమును విడచి పెట్టు అని ఈ రూపములో మనకు పెద్దలు తెలియజేశారు.

మన పూర్వీకులు కర్తకు జ్ఞానమును అందించు నిమిత్తము ఈ విధముగా కర్మకాండల రూపములో మనకు అందించారు.

--- X ---

సాధనా చతుష్టయ సంపత్తి

నిత్యానిత్య వస్తు వివేకము, ఇహాముత్ర ఫలభోగ విరాగము లేక వైరాగ్యము, శమాది షట్కసంపత్తి, ముముక్షత్వము అను నాలిగింటిని సాధనా చతుష్టయ సంపత్తి అంటారు. ఒక విద్యార్ధి పరీక్షకు వెళ్ళుటకు ఏ విధముగా సంసిద్ధుడవుతాడో ఆ విధముగానే సాధకుడు కూడా బ్రహ్మజ్ఞానమును అధ్యయనము చేసి అనుభవమునకు తెచ్చుకొనుటకు ఈ లక్షణములను అలవరచు కొని సంసిద్ధుడు కావలెను. సాధనా చతుష్టయ సంపత్తియే సాధకునికి నిజమైన సంపద.

నిత్యానిత్య వస్తు వివేకము ద్వారా ఏది నిత్యము ఏది అనిత్యము అనే స్పష్టమైన నిర్ణయమును పొందని యెడల ఆచరణలో ప్రవేశించి నప్పుడు అనిత్యాన్నే ఆశ్రయిస్తాము. అప్పుడు బుద్ధి ఆత్మ స్థితి యందు నిలబడదు.

వైరాగ్యము లేనియెడల అనిత్యమైన వాటిపట్ల ఆసక్తిని నిరసించలేము.

శమాదిషట్కసంపత్తి లేనియెడల ఇంద్రియములను నిగ్రహించలేము

ముముక్షత్వము లేని యెడల ఆత్మభావన యందు నిలబడలేము

సాధనా చతుష్టయ సంపత్తి లేకుండా అంతఃశుద్ధి కలుగదు. అంతఃశుద్ధి లేకుండా ఆత్మ విచారణ చేసినను అది బుద్ధి యందు నిలబడదు. కనుక బ్రహ్మజ్ఞానమును శ్రవణము చేసి అనుభవమునకు తెచ్చుకొనవలెనన్న సాధనా చతుష్టయ సంపత్తి తప్పనిసరి.

సాధనా చతుష్టయ సంపత్తితో జీవించేవాడు సాధకుడు. సాధనా చతుష్టయ సంపత్తి సహజమై పోయినవాడు శిష్యుడు. అట్టి శిష్యులలో అగ్రగణ్యుడు సచ్ఛిష్యుడు. సాధనా చతుష్టయ సంపత్తి లేకుండా జీవించే వారు, సత్సంగములలో పాల్గొనే వారంతా అనుసరించే వారు. సాధనా చతుష్టయ సంపత్తి లేకుండా సత్సంగములలో పాల్గొనే వారు విషయములచే బాధించబడనంత వరకు ప్రశాంతముగానే ఉంటారు. కాని విషయములచే బాధించబడినపుడు విషయములలో మునిగి పోతారు, కనుక ఆధ్యాత్మిక మార్గమును అనుసరించే వారంతా సాధనా చతుష్టయ సంపత్తిని సంపాదించి ముందు సాధకులు కావాలి. ఈ సాధనా చతుష్టయ సంపత్తి సాధించ బడకుండా నీకు ఏ ఆత్మజ్ఞాన పరమైన ఏ అనుభవము కలుగదు. ప్రాధమికముగా గురువు చేసే పని ఈ సాధనా చతుష్టయ సంపత్తిని ఏవిధముగా పొందాలి, దానిని ఏ విధముగా అనుభవములోనికి తెచ్చుకోవాలి అనేది తెలియజేస్తారు. ఇదే గురువు మార్గదర్శకత్వము వహించడము అంటే.

నిత్యానిత్య వివేకము

వివేకము అనగా వేరు చేసి చూచుట. నిత్యానిత్య వస్తు వివేకము అంటే ఏది నిత్యమో , ఏది అనిత్యమో పరిశీలించి ఆచరణలో నిత్యమైన దానిని ఆశ్రయించుట, అనిత్యమైన దానిని నిరసించుట.

నిత్యము అంటే మార్పు చెందనిది, శాశ్వతమైనది , సర్వ కాల సర్వ అవస్థల యందు ఉండునది. అది ఎల్లప్పుడూ ఒకే తీరుగా ఉంటుంది. అనిత్యము అంటే మార్పు చెందేది, రాకడ పోకడ కలిగినది, చలించేది. మార్పు చెందేది ఆకార బేధము. కనుక నీవు ఆకారమును ఆశ్రయించక లక్షణములను ఆశ్రయించు. నీవు ఎల్లప్పుడూ ఆత్మ స్వరూపుడవే. ఆకారమును ఆశ్రయించుట వలన ఆకార భ్రాంతి ఏర్పడి జీవుడవైనావు, దుఃఖముల పాలగుచున్నావు అని నిత్యానిత్య వివేకము వలన నీకు అవగాహన కలుగుతుంది. నిత్యానిత్య వస్తు వివేకము ద్వారా నీకు స్ఫురించే వాటిని పరిశీలించి అనిత్యమైన వాటిని దానికి వ్యతిరేఖమైన భావన చేయుట ద్వారా నీ భావనలో వాటిని నిరసించ గలగాలి. ఏ వాక్యములను స్వీకరిస్తే అవి నిరసించ బడతాయో ఆ వాక్యములను, ఆ భావనలను స్వీకరించాలి.

పంచ విషయములైన శబ్ధ,స్పర్శ,రూప,రస, గంధములే మానవుల బలహీనతలు. కనుక వీటిని పరిశీలించిన నిత్యానిత్య వస్తు వివేకము ఆచరణలో ఉందో లేదో తెలిసికొన వచ్చును.

ఈ పంచ విషయములలో వేటియందు బలహీనత ఉన్నదో ఎలా పరిశీలించాలి?

ఉదాహరణకు శబ్ధ విషయమందు బలహీనత కలవాడు ఎప్పుడు మాట్లాడుతూనే ఉంటాడు. దానికి సాధన మౌనమే. మాట్లాడుట బలహీనత. మౌనము బలము. సమత్వము రావలెనన్న పరస్పర వ్యతిరేక పరిస్థితుల యందు జీవించటము అలవడాలి. పరస్పర వ్యతిరేక పరిస్థితుల యందు జీవించుచు సాధన చేయుట వలన శబ్ధ,స్పర్శ,రూప,రస, గంధములు స్వాధీనమవుతాయి. రెండు విపరీత పరిస్థితులను మనస్సు ముందు ఉంచిన మనస్సు ఓడిపోతుంది. బుద్ధి ఏ నిర్ణయము తీసికొన్నను నేను ఆత్మ స్వరూపుడను అన్న భావనతోనే నిర్ణయము తీసికోవాలి. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములలో దేని పట్ల అయినా ఆకర్షణ కలిగిన యెడల ఏ విధముగా చేస్తే దాని పట్ల మనస్సు విరిగి పోతుందో చూసి ఆ విధముగా ప్రవర్తించాలి. ఈ ఐదు విషయములలో పరిష్కార మార్గము కనుగొనాలి తప్పించి అణిచే ప్రయత్నము చేయకూడదు.

ఉదాహరణ: ఉదయము లేచిన వెంటనే కాఫీ తాగే అలవాటు ఉన్నది. నీ మనస్సుకు నీకు కావలసినది కాఫీనే కదా, కేవలము కాఫీనే పాలు ఏమీ కలపకుండా తాగు అని ఇవ్వండి. మనస్సుకు దాని పట్ల ఇష్టతను కోల్పోతుంది. రసము

బలముగా పనిచేస్తున్న యెడల వంటచేసేటప్పుడు ఏది ప్రధానముగా ఆ పదార్థమునకు రుచినిస్తుందో దానిని తగ్గించి వేయండి. అప్పుడు దాని పట్ల ఆసక్తి వికటించి వేస్తుంది.

మరియొక సాధన - దేని పట్లయితే ఇష్టత ఉన్నదో దాని పట్ల విపరీత ధోరణిలో ప్రవర్తించండి

ఉదాహరణ: స్వీట్స్ ఇష్టమైన విపరీతముగా స్వీట్స్ తినండి. అప్పుడు కుడా దాని పట్ల ఆసక్తి వికటించి వేస్తుంది.

శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములనే ఎదిరించటము చేతకాని ఎడల మూడు గుణములతో కూడిన స్వభావాన్ని ఏ విధముగా ఎదిరిస్తారు. నిత్యానిత్య వస్తు వివేకమును స్పష్టముగా పరిష్కరించుకున్నవారికి సాధనలో ఏ అడ్డంకి రాదు. నిత్యానిత్య వస్తు వివేకము కేవలము విచారణ చేస్తూ ఉంటే సరిపోదు. అచరణలోనికి రావాలి.

నిత్యానిత్యవస్తు వివేకమును ఉపయోగించి నిర్ణయములను తీసికోవాలి. నిర్ణయము చేసిన దానిని ఆచరణలో పెట్టుటకు వాసనాబలము అడ్డు తగులుతూ ఉంటుంది. పూర్వ వాసనలను అనుసరించి జీవించే విధముగా నిన్ను ప్రేరేపిస్తూ ఉంటాయి. అప్పుడు నీవు ఇహాముత్ర ఫలభోగ విరాగమును ఉపయోగించాలి. ఇప్పటి వరకు ఫలభోగమును అనుభవించుచూనే ఉన్నావు. నీకు ఏ పరిణామము కలిగినది, విషయములలో కూరుకొని పోవుట తప్పించి ఇదంతా మార్పు చెందేది. ఇహము. శాశ్వతమైనది కాదు కదా? మరల నన్ను ఎందుకు విషయముల ఉబిలో దించుతావు అని హెచ్చరించాలి. అప్పుడు విషయముల పట్ల, వస్తువుల పట్ల అనురాగము తగ్గి విరాగము కలుగుతుంది. అప్పుడు బుద్ధియందు సంస్కార ప్రభావము తగ్గి నెమ్మదిస్తుంది. ఈ విధముగా నిరసించుటకు ఇహాముత్ర ఫలభోగ విరాగము అవసరము.

<u>ఇహాముత్ర ఫల భోగ విరాగము</u>

నిత్యానిత్య వస్తువివేకములో స్పష్టత లేకుండా ఇహాముత్ర ఫల భోగ విరాగము కలుగదు. విషయములు, వస్తువుల పట్ల ఆసక్తిని విడచిపెట్టుటయే వైరాగ్యము. శరీరము మనలను విడిస్తే శరీరము మరల వస్తుంది. శరీరమును మనమే వదిలితే మరల శరీరమును ధరించ వలసిన అవసరము ఉండదు. అలానే ఏ ఆధ్యాత్మిక సాధన అయినా సరే వాటిని నీవు విడచుట కాదు, నిన్ను అవే విడచే విధముగా జీవించాలి. విషయములను నీవు వెతుకుచూ వెళ్ళినంత కాలము అవి నిన్ను బాధించ తప్పదు. కాలక్రమములో వాటంతట అవి ప్రాప్తించేవి తప్పించి మనము విషయముల వెంట పడకుండా నిగ్రహముగా ఉండే సామర్థ్యము కలిగి ఉండాలి. ఈ సాధన పేరే ఇహాముత్ర ఫల భోగ విరాగము. ఇహము అంటే ఈ లోకమునకు లేక జగత్తుకు లేక జీవుడకు సంబంధించినవి. ఇహము అంటే మార్పు చెందేది. పరము అంటే మార్పు చెందనిది. ఈ మార్పు చెందే ఇహము నందు ఫల భోగము ఉంటున్నది. అంటే ఫలితమును

అనుభవించాలి అనే దానిని ఆశ్రయిస్తున్నాము. ఇహము నందు మార్పు చెందే విషయములు ఉంటున్నాయి. ఆ విషముల వలన కలుగు ఫలితములను అనుభవించాలని భోక్త అందులో ప్రవేశిస్తున్నాడు. వాటివలన కలుగు సుఖములను , దుఃఖములను అనుభవిస్తూ ఆ మార్పు చెందేవాటితో పాటు తాను కూడా మార్పు చెందుతున్నాడు.

దీని నుండి బయట పడవలెనన్న ఏమి చేయవలెను?

విరాగామును కలిగి ఉండవలెను. అనురాగము లేక మోహమును, విరాగము చేత తొలగించు కొనవలెను. ప్రియ, మోద, ప్రమోదములు అను మూడు కలిపి మోహము అవుతుంది. మోహము అంటే స్త్రీకి పురుషుని పట్ల, పురుషునకు స్త్రీ పట్ల ఉండే కోరిక మాత్రమే కాదు, ఏవైతే పొందకుండా నేను ఉండలేను, ఈ పని చెయ్యకుండా నేను ఉండలేను అంటున్నావో వాటన్నింటి పట్ల నీవు మోహము కలిగి ఉన్నట్లే. ఆగలేక పోవుట అనే మనో వేగమే మోహము. మోహము కలిగిన ధర్మాదర్మముల విచక్షణ కోల్పోతాడు.

నీకు పూతరేకుల గురించి ఎవరన్నా ప్రస్తావనకు తెచ్చారు లేక నీకు కనపడినవి. అప్పుడు అంతకు ముందు వాటిని గురించిన జ్ఞాపకములు (పూర్వ అనుభవములు) నీ స్మృతిలో మెదులుతాయి. ఆ జ్ఞాపకము వృత్తి రూపములో బయటకు వస్తుంది. వృత్తి రూపములో ఉన్న స్థితిని ప్రియము అంటాము. దాని పేరే చిత్తము. ఆ వృత్తి అవి తింటే బాగుంటుంది అనే ప్రేరణ నీలో కలిగిస్తూ ఉంటుంది. ఆ వృత్తి బలపడి ప్రవృత్తిగా బుద్ధిలోనికి వస్తుంది. బుద్ధి అది నెరవేర్చుకొనుటకు కావలసిన సమాచారమును, వివరములను ఇస్తుంది. మనస్సు సాధనోపకరణము. దానిని కార్య రూపములో పెట్టుటకు కావలసిన మార్గములను అన్వేషిస్తుంది. మనస్సును సక్రమముగా వాడుకొనిన దానంత ఉత్తమమైన సాధనోపకరణము లేదు. దానిని వినియోగించటము చేతకాక విషయములకు లోబడి దుఃఖముల పాలగుచున్నాము. ఈ మనస్సుయే బంధ మోక్షములకు కారణము. ఈ మనస్సును ఏవిధముగా వినియోగించిన బంధము కలుగుతుంది ఏవిధముగా వినియోగించిన మోక్షము (బంధము నుండి బయట పడతాము) కలుగుతుంది అనేది తెలిసికొని ప్రవర్తించ గలుగుటయే సాధన అంటే. మనస్సును ఏవిధముగా వినియోగించిన మోక్షకారకమవుతుందో ఆ విధముగా సంసిద్ధము చేయుటకే సాధనా చతుష్టయ సంపత్తి అంతా.

నీకు పూత రేకులు తినాలి అనిపించిన వెంటనే విషయము చిత్త పరిధిలో ప్రియం రూపములో ఉన్నది. అప్పుడే మోహము కలుగు చున్నది. అప్పుడు బుద్ధి ఆ విషయము నెరవేర్చుకొనే దిశగా సమాచారము అందించ కుండా కేవలము వేదాంత పరమైన వాక్యములు, విషయముల యొక్క అశాశ్వతత్వమునకు సంబంధించిన జ్ఞాన పరమైన వాక్యములు అందించాలి. అప్పుడు బలహీనముగా చిత్త వృత్తి రూపములో ఉన్న ప్రియం అణిగి పోతుంది. మనోపరిదిలోనికి దిగిరాకుండా ఆగిపోతుంది. ఈ విధముగా చిత్త వృత్తిని వెనుకకు తిప్పుటను, ప్రవృత్తిని నివృత్తి

చేయుటను విరాగము అంటారు. ఈ ప్రక్రియనే ఇహాముత్ర ఫల భోగ విరాగము అంటారు. ఇది నిరసించే ప్రక్రియ. ఇప్పటి వరకు మనము విషయములకు అనుకూలముగా ప్రవర్తించామేకాని నిరసించే ప్రయత్నము చేయ లేదు. గురువు ఈ చిత్త పరిధిలో ప్రియం రూపములో ఉన్న విషయములు క్రియా రూపములోనికి రానివ్వకుండా నిరసించి వెనుకకు మరల్చుటకు కావలసిన వేదాంత వాక్యములను బోధిస్తూ ఉంటారు. మనము వాటిని ధారణ చేసి మనలో నిలుపుకోవాలి. అప్పుడు అవి తగిన సమయమందు స్ఫూర్తిగా పనిచేసి నిరసించే ప్రక్రియలో ఉపయోగపడతాయి. ఈ విధముగా మోహము క్షీణింప చేయాలి. మోహ క్షయమే మోక్షము.

ప్రియం రూపములో ఉన్నంత వరకు నేను కర్తగా ఉంటుంది. ప్రియంగా ఉన్నప్పుడే విషయములను నిగ్రహించ కున్న యెడల అది మోదముగా పరిణామము చెందుతుంది. చిత్త వృత్తి బలీయమైన ప్రేరణను ఇస్తుంది. ఏ విధముగానైన అనుభవించి తీర వలసినదే అనే నిర్ణయము చేస్తాము. అప్పుడు నేను భోక్తగా పనిచేస్తూ ఉంటుంది. కనుక ఆ విషయమును నెరవేర్చుకొనే మార్గమును అన్వేషించి దానిని క్రియా రూపములో పెడతాడు. మన కోరికను తీర్చే వస్తువును పొందుతాము. ప్రమోద పరిధిలో విషయము మనో పరిధి నుండి ఇంద్రియ పరిధిలోనికి దిగి వస్తుంది. విషయములో కూరుకు పోతాము. ఆ విషయమును అనుభవించి ఆనందము పొందుతాము.

నేను ఆత్మ స్వరూపుడను అన్న భావనలో ఉండి చిత్త వృత్తికి సాక్షిగా ఉండాలి. కనీసము అనుభవించే సమయమున అయినా నేను ఆత్మ స్వరూపుడను అన్న భావనలో ఉన్నప్పుడు విషయములలో కూరుకొని పోకుండా ఉంటాము. ఒక సారి విషయము ప్రమోద స్థాయికి వచ్చినది అంటే దానిని మరల్చుట కష్టము. అనుభవించుటయే మార్గము. విషయము ప్రియము స్థితిలో ఉన్నప్పుడు నేను కర్తగా ఉంటుంది. సత్వ గుణములో ఉంటాడు. విషయము మోద స్థాయిలో ఉన్నప్పుడు నేను భోక్తగా ఉంటుంది. రజో గుణములో ఉంటాడు. విషయము ప్రమోదముగా ఉన్నప్పుడు భోక్తగా ఫలితమును అనుభవిస్తాడు. తమో గుణములో ఉంటాడు.

ఇదంతా మార్పు చెందేది, అశాశ్వతమైనది. దీనివలన మార్పు చెందని దాని గురించిన జ్ఞానము కలుగదు. ప్రియ, మోద, ప్రమోదముల చేతనే జీవితము అంతా నడిపింప బడుచున్నది. వాటిని ఆశ్రయించి జీవించినంత కాలము ఆత్మ జ్ఞానము కలుగదు , పరమాత్మ జ్ఞానము బోధ పడదు. వాటి పట్ల వైరాగ్యము పూని ఆసక్తిని తొలగించుకొనవలెను.

<u>శమాది షట్క సంపత్తి</u>

శమము, దమము, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమాధానము అను ఆరింటిని శమాది షట్క సంపత్తి అంటారు. ఈ ఆరు లక్షణములు కలిగి ఉన్నవాడు తప్పనిసరిగా అత్మస్వరూపుడే అయి ఉంటాడు. ఏ పరిస్థితిలోను ఆకార భ్రాంతికి లోనవడు. మరల జీవుడుగా మారడు. నిత్యానిత్యవస్తు వివేకము, ఇహాముత్ర ఫలభోగ విరాగమును సంపాదించ కుండా శమాది షట్క సంపత్తిని ఆచరించుట వలన ప్రయోజనము ఏమి ఉండదు.

శమము, దమము

శమము అనగా అంతరింద్రియ నిగ్రహము. దమము అనగా బాహ్యేంద్రియ నిగ్రహము. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, జ్ఞాత అను ఐదింటిని అతరింద్రియములు అంటాము. వీటియందు జ్ఞాతను తొలగించిన మిగిలిన నాలిగింటిని అంతఃకరణము అంటాము. కరణము అంటే పనిముట్లు. అంటే జ్ఞాత లేకపోతే మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములు కేవలము పనిముట్లు మాత్రమే. జ్ఞాత కూడా వాటితో చేరితేనే అవి ఇంద్రియములు అవుతాయి. పంచ జ్ఞానేంద్రియములు + పంచ కర్మేంద్రియములు + పంచ ప్రాణములు + పంచ జ్ఞానేంద్రియముల యొక్క పంచ శక్తులు అయిన పంచ విషయములు - ఈ ఇరువది బహ్యేంద్రియములు.

జ్ఞాత అంటే తెలిసికొనే వాడు. అంతఃకరణమునకు స్వయముగా తెలిసికొనే శక్తి లేదు. జ్ఞాత లేక జీవుని శక్తి వలన మిగిలిన ఇరువది నాలుగు తత్వములు పని చేయుచున్నవి. జ్ఞాత లేక జీవుని శక్తి వాటి యందు ప్రవేశింపకున్న అవి జడములు. జ్ఞాతయే మిగిలిన ఇరువది నాలుగు తత్వములకు అధిష్టానము. పరమాత్మ శక్తి జ్ఞాతలో పని చేస్తున్నది. కనుక జ్ఞాతయందు ఈశ్వర లక్షణము ఉన్నది. ఈ ఈశ్వర లక్షణము ఉన్నది కనుకనే జ్ఞాత ఇరువది నాలుగు తత్వములకు అధిష్టానముగా ఉన్నది. దానియొక్క శక్తి చేతనే మిగిలినవి పని చేయుచున్నవి. జ్ఞాతయే కర్త. మిగిలిన ఇరువది నాలుగు తత్వములు భోక్త. నేను ఆత్మ స్వరూపుడను ఈ ఇరువది ఐదింటికి సాక్షిని. మానవులు వ్యవహరించే టప్పుడు ఈ ఇరువది ఐదింటితో కలిసి పోతారు. దానిసే సంగత్వ దోషము అంటారు.

ఒక పదార్ధమును తింటున్నావు. తింటున్నది ఇంద్రియములు. దానియందు ఆనందిస్తున్నది అంతఃకరణము (భోక్త) . కర్త జ్ఞాత. నిత్యానిత్య వస్తువివేకము ద్వారా పరిశీలించిన జ్ఞాత నిత్యము, మిగిలిన ఇరువది నాలుగు తత్వములు అనిత్యము. జ్ఞాతను ఆశ్రయించ కుండా క్రింద ఉన్న ఇరువది నాలుగు తత్వములను లేక ఆకార లక్షణమును ఆశ్రయించుట వలన నేను, నేను శరీరమును అంటున్నది. అంటే జ్ఞాత సాక్షిత్వము నుండి ఒక్క మెట్టు క్రిందకు దిగిన సాక్షిత్వము పోయి అహంకారము ఏర్పడుచున్నది. అహంకారము నుండి జ్ఞాత చిత్తములోనికి దిగుచున్నది. అపేక్షలన్ని నీలో చిత్త వృత్తులుగా చిత్తము నందు ఉన్నాయి అదే వాసనాబలము అంటే (ప్రియముగా) . అన్ని ప్రత్యేకతలు చిత్తములో వాసనబలముగా ఉంటాయి. తరువాత అది బలీయమై దానిని పొందాలి అనే ప్రేరణగా

సంస్కారబలముగా మారి బుద్ధిలోనికి దిగుచున్నది(మోదము). బుద్ధిలో సంస్కారబలము పనిచేస్తూ ఉంటుంది. బుద్ధి జ్ఞాపకములన్నింటిని సమీకరించి ఒక నిర్ణయమునకు వచ్చుచున్నది. దానిని ఆచరణలో పెట్టుటకు ద్వారము మనస్సు. దానిని పొంది అనుభవించ వలెను అనే నిర్ణయము జరిగిన వెంటనే ప్రమోధముగా మనస్సులోనికి వస్తుంది. దానిని క్రియా రూపములో పెట్టి అనుభమును పొందవలెనన్న జ్ఞానేంద్రియ, కర్మేంద్రియముల సహకారము కావాలి. మనస్సుకు జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములకు మధ్య వారధి ప్రాణ శక్తి. ఈ ప్రాణ శక్తి సహాయముతో అంతరింద్రియములు, జ్ఞానేంద్రియ కర్మేంద్రియములతో వ్యవహరిస్తున్నప్పుడు వాటి మధ్య ఘర్షణ వలన పంచ విషయములు పుట్టు చున్నవి. వాటిని అనుభవించి అనుభవమును పొందుట ప్రమోదము. ఈ వ్యవహారమే మానవ జీవితమంతా జరుగు వ్యవహారము.

ముందు శమమును ఆచరించాలి కాని దమమును కాదు.

ఆలోచనలోనగా వచ్చినప్పుడే దానిని కనిపెట్టి పరిష్కరించుకోవాలి. కావలసినది పూర్వ తాపము కాని పశ్చాత్తాపము కాదు. మనమందరమూ స్వేచ్ఛను ఎందుకు కోల్పోతున్నాము? అసలు దుఃఖము ఎందువలన కలుగు చున్నది? సంగత్వము వలన కలుగు చున్నది. సంగత్వము వలన మనము కోరుకున్నది లభించకపోయినా లేక దూరమైనా దుఃఖము కలుగు చున్నది. ఆ దుఃఖమును తొలగించు కొనుటకు మరల ఆ విషయములలో చేరి సంగత్వమును ఏర్పరచు కొనుచున్నావు.

ఈ సంగత్వదోషము నుండి బయట పడుట ఎట్లా?

కర్తవ్య నిర్వహణ జరగాలి. కాని దైవీ భావనతో, ఆత్మ జ్ఞానము కలిగే దిశగా చెయ్యాలి.

ఇప్పటి వరకు నేను శరీరమును అనే భావంతో ఇంద్రియములతో చేరి పని చేసావు. ఇప్పుడు నేను జ్ఞాతను అనే భావనతో కర్మ చెయ్యి. జ్ఞాత దృష్ట్యా అంటే అన్నింటికన్నా జ్ఞాతయే ప్రధానము అన్న దృష్టితో కర్మను ఆచరించాలి. జ్ఞాన దృష్ట్యా చేసిన కర్మ ఫలము కూడా జ్ఞానమే అవుతుంది. అదే కర్మ కుశలత కలుగుట అంటే.

చిత్తవృత్తులు లేక వాసనాబలముల పని ఎప్పుడు అది చేస్తే ఆనందము లభిస్తుంది లేక ఈ పనిచేస్తే ఆనందము లభిస్తుంది అని ప్రేరేపించుటయే. అదే ప్రియము అంటే. బుద్ధిలో ఆ ప్రియముకు సంబంధించిన వ్యతిరేఖ, అనుకూల జ్ఞాపకాలు అని ఉంటాయి. అంటే ఏ పని చేస్తే సుఖము కలిగినది , ఏ పని చేస్తే దుఃఖము కలిగినది అనే జ్ఞాపకాలు ఉంటాయి. అదే మోదము. ప్రియ మోదములు అంతరింద్రియములలో విపరీత వేగముతో చలిస్తూ ఉంటాయి.

దానిలో కొంత వేగము బాహ్య ఇంద్రియముల ద్వారా వ్యక్తమవుతూ ఉంటాయి. ఒక మోటారు ఎంత వేగముతో లోపల చలిస్తే బయట యంత్రమును త్రిప్పగలుగుతుందో ఇది అంతే.

కనుక మొదట నేను అనునది జ్ఞాతగా ఉండుటకు ప్రయత్నించాలి. జ్ఞాతనుండి అంతఃకరణములోనికి దిగావు. విచారణతో అంతరింద్రియ పరిధిలో దానిని నిగ్రహించాలి అదే శమము అంటే. అది అంతరింద్రియము నుండి బాహ్య ఇంద్రియములలోనికి వచ్చినది. బాహ్య ఇంద్రియములను అది క్రియారూపము ధరించకుండా నిగ్రహించాలి . అదే దమము అంటే. ఆచరించి అనుభవమును పొందావా భోక్తవు అవుతావు.

శమము, దమమును ఆచరించిన జ్ఞాత అనే కర్త ,భోక్త అవకుండా ఉంటాడు. ఈ అభ్యాసము వలన జ్ఞాతగా నిలబడ గలిగే సామర్ధ్యము, ఉపరతి, తితిక్షలను ఆచరించ గలిగే సామర్ధ్యము కలుగుతాయి. శమము, దమమును ఆచరించిన భోక్త లేకుండా పోతాడు.

ఉపరతి, తితిక్షలు

చంచలమగు మనస్సును నిశ్చలము చేసి బాహ్య విషయములనుంచి మరల్చి నిరంతరం బ్రహ్మద్యానము నందే ఉంచుట ఉపరతి. మనోవృత్తులతో తాదాత్మ్యత చెందకుండా ఉండుట ఉపరతి. అహంవృత్తి ఆధారం కోసం విషయాలను ఆసరాగా తీసుకోకపోవటము ఉపరతి. అష్టాంగ యోగము వలన ఉపరతి యందు ప్రవేశిస్తే , కలుగు అనుభవము ప్రాపంచిక విషయ వ్యాపారము నుండి విరమించుకొనుట.

తితిక్ష అనగా

- భౌతిక , ప్రాపంచిక విషయముల పట్ల చలించని మనస్సు కలిగి ఉండుట

- ప్రపంచములో సంభవించు సమస్త ద్వంద్వముల యందు ఓర్పు కలిగి ఉండుట

- ప్రారబ్ధ వశమున కలుగు భోగ భాగ్యములకు సంతోషించక, అవి తొలగిన దుఖించక సమ బుద్ధితో ఉండుట

- ఇతరుల వలన కలిగిన దు:ఖమునకు ప్రతీకారము చేయ తలంపు లేకుండుట

- దిగులు విలాపము లేక సర్వ దు:ఖములను వాస్తవిక దృష్టితో స్వీకరించుట

- చింత అంటే తానున్న పరిస్థితిని గురించి పదే పదే అలోచించుచు దిగులు చెందుట

- విలాపము అంటే తానున్న పరిస్థితిని గురించి మొరపెట్టుకోవటము, మాట్లాడటము

ఈ విధమైన జీవితము జీవించుట వలన ప్రజ్ఞా స్థితిలో స్థిరత్వము, సమస్తమును సాక్షిగా ఉదాసీనముగా చూచుట అలవడును

ఉపరతి, తితిక్షలు జ్ఞాత యందున్న కర్తృత్వమును తొలగించి, కర్తను లేకుండా చేస్తాయి. ఆత్మగా నిలబెడతాయి.సాధనలో ముందు ఫలితాన్ని ఆశ్రయించే భోక్త లేకుండా చేసుకోవాలి, తరువాత కర్తృత్వము లేకుండా చేసికోవాలి. భోక్త లేకుండా చేసికోవాలి అంటే పాటించ వలసిన ఒకే ఒక నియమము నిత్య వర్తమానుడపై జీవించాలి. ఎప్పటికప్పుడు ప్రస్తుత క్షణమే సత్యమని జీవించాలి

అంతఃకరణములోనికి దిగకుండా నిన్ను జ్ఞాత స్థానములో నిలబెట్టే సాధనలు ఉపరతి, తితిక్ష. ప్రతి మానవుడు తాను ఈశ్వరుడను అని తెలిసికొనుటకు ఈ రెండు సాధనలు చాలు. మహానుభావులు , మహర్షుల ప్రతి చేతలో, ప్రతి మాటలో ఈ ఉపరతి, తితిక్ష కనబడుచూ ఉంటాయి. ఉపరతి, తితిక్ష లేకుండా ఆత్మ సాక్షాత్కారమును , బ్రహ్మ జ్ఞానమును పొందుట అసాధ్యము. వాసనా బలమును అధిగామించాలన్నా, గుణబలమును అధిగామించాలన్నా ఈ ఉపరతి, తితిక్షలను మించిన సాధనోపాయము లేదు. నిత్యానిత్య వస్తు వివేకమును స్థిరముగా విచారణ చేయ వలెనన్న, తీవ్ర వైరాగ్యము కలుగ వలెనన్న ఉపరతి, తితిక్ష అనునవి కావలెను. ఎల్లప్పుడూ అంతరింద్రియములను , బాహ్య ఇంద్రియములను నీ ఆధీనమందు ఉంచుకొనవలెనన్న జ్ఞాత స్థానమునందు ఉండవలెను. నీవు ఎల్లప్పుడూ జ్ఞాత స్థానమునందు ఉండుటకు సహాయ పడునవి ఉపరతి, తితిక్ష. జీవతకాలమంతా ఈ రెండు సాధనలను క్షణ కాలము కూడా మరువకుండా ఆచరణలో పెట్టేవాడే సచ్ఛిష్యుడు అనబడతాడు. గురువు ఒక శిష్యుడు సచ్ఛిష్యుడా కాదా అనునది చూచుటకు అతని జీవితములో ఉపరతి, తితిక్షల సాధన ఎలా ఉన్నదో చూస్తారు. ఉపరతి, తితిక్షల యందు స్థిర పడిన వానికి ముక్తి సిద్ధము.

<u>శ్రద్ధ</u>

శ్రద్ధ అంటే వేదప్రమాణమును , గురువాక్యమును ప్రత్యక్ష ప్రమాణము వలే విశ్వసించుట

గురువు, శాస్త్రములు నీవు పరిపూర్ణుడవు , బ్రహ్మమువై ఉన్నావు అని బోధిస్తాయి. కాని నీ అనుభవములో నిన్ను నీవు పరిమితుడుగా , అసంపూర్ణుడవుగా గుర్తిస్తున్నావు. అంటే గురువు, శాస్త్రములు నీ అనుభవమునకు భిన్నమైన వాక్యములను బోధిస్తున్నాయి. అటువంటి జ్ఞానమును అనుభవములోనికి తెచ్చుకోవలెనన్న గురువు, శాస్త్ర వాక్యముల పట్ల నమ్మకము లేక విశ్వాసము తప్పనిసరి. శ్రద్ధ ఉన్నప్పుడు మాత్రమే గురువు, శాస్త్ర వాక్యములను స్వీకరించి శ్రవణ , మనన, నిధి ద్యాసముల ద్వారా విన్న జ్ఞానమును అనుభవములోనికి తెచ్చుకోగలుగుతాము.

ప్రాధమికముగా శాస్త్రవాక్యములు, గురువాక్యములు సత్యము అను విశ్వాసము కలిగి ఉండుటను శ్రద్ధ అంటారు. విన్న వాక్యములను ఆచరించి అనుభవములోనికి తెచ్చుకొనుట వలన గురి కుదిరి శాస్త్రవాక్యములు, గురువాక్యముల పట్ల అచంచలమైన భక్తి ఏర్పడుతుంది. ఇటువంటి స్థితిలో శాస్త్రవాక్యములు, గురువాక్యముల పట్ల అచంచలమైన భక్తినే శ్రద్ధ అంటారు. తదుపరి శాస్త్రవాక్యములు, గురువాక్యముల లక్ష్యార్థమైన పరబ్రహ్మమందు విశ్వాసమునే శ్రద్ధ అంటారు. బ్రహ్మనిష్ఠ యందు మునిగి ఉండుటనే శ్రద్ధ అంటారు.

<u>సమాధానము</u>

సమాధానము అనగా

- పెద్దల నుండి జ్ఞానము నేర్చుకొను సమయమున మనస్సు ఇంద్రియములు , విషయముల వైపు మరలకుండా నిలుపుట

- మోక్షము వచ్చునో లేదో అని సందేహింపక , బ్రహ్మ చింతన యందు కాలము గడపుచూ, ప్రారబ్ధ వశమున వచ్చు ప్రతిబంధములను లెక్క చేయక ఓర్పుతో పెద్దలు చెప్పెడు రహస్యములను తెలసికొన వలెననే ఆసక్తితో నుండునట్లు మనస్సును నిలుపుట

- పెద్దల వలన తెలిసికొనినవి, వేదాంత శాస్త్రమందు చెప్పిన సంగతులు ఒక్కటే అని శృతి, యుక్తి , అనుభవము చేత మనస్సును సమాధాన పరచుకొనుట

- మనస్సును ఎల్లప్పుడూ శుద్ధ స్వరూపమైన బ్రహ్మము నందు నిలుపుట

- కేవలము బ్రహ్మము నందే నిరంతరమూ మనస్సును నిలుపుట

<u>ముముక్షత్వము</u>

ముముక్షత్వము అనగా మోక్షమందు ఆపేక్ష కలిగి ఉండుట.

మోక్షమందు ఆపేక్ష ఎప్పుడు కలుగుతుంది?

సంసారము నందు కలుగు దుఃఖములచే బాధించబడినపుడు. అప్పుడు సంసారము వలన కలుగు దుఃఖములను పోగొట్టుకొను మార్గము చెప్పు సద్గురువు ఎక్కడ దొరకునా అని ప్రయత్నించును. ఇదే మోక్షమందు ఆపేక్ష కలుగుట.

మోక్షము అంటే ఏమిటి?

అష్టవిధ తనువుల యందు ఉన్న మోహము క్షయము అగుటయే మోక్షము. మోక్షము అంటే నేను అసంత్రుప్తుడను , అసంపూర్ణుడను అను భావన నుండి విముక్తి.

నేను ఆత్మ స్వరూపుడను , నేను పరిపూర్ణుడను అను జ్ఞానము కలుగుట వలన మాత్రామే ఈ విముక్తి సాధ్యము.

మోక్షమందు ఆపేక్ష లేక ముముక్షత్వము జిజ్ఞాసగా, తనను తానూ తెలుసుకోవాలి అనే కోరికగా మారినప్పుడు అది సద్గురువు దగ్గరకు నడిపిస్తుంది. సద్గురువు వలన ఆత్మ జ్ఞానము తెలసికొనుట ద్వారా అహంకారము మొదలుకొని స్థూల దేహము వరకు ప్రతి దశలోను తాధాత్మ్యత చెందుట వలన బంధము కలుగుచున్నది, ఇదే సమస్త దుఃఖములకు మూలము అని గ్రహిస్తాడు. స్వస్వరూపం గుర్తించుట ద్వారా అజ్ఞానము చేత కల్పించబడిన బంధములను తొలగించుకోవాలి అనే కోరిక కలుగుతుంది. అదే ముముక్షత్వము.

ఈ జన్మయందు అనుకూల వాతావరణము లభించినటుల తదుపరి జన్మ యందు లభిస్తుందో, లేదో ఎవరికీ తెలుసు. కనుక ఎట్టి పరిస్థితిలోను ఈ జన్మ యందే ముక్తిని సాధించ వలెను అని తీవ్రమైన పట్టుదలను కలిగి సాధన చేయండి. సాధనా చతుష్టయ సంపత్తిని అలవరచుకొని, బ్రహ్మజ్ఞానమును అధ్యయనము చేసి, అనుభవమునకు తెచ్చుకొని జన్మను తరింపచేసికోండి.

---- X ---

<u>సాధన</u>

భగవంతుడు మనకు చేసిన అతి పెద్ద సహాయము, అతి పెద్ద వరము ఈ మానవ శరీరమును ఇవ్వటమే. ఎనుబది నాలుగు లక్షల జీవరాసులలో అత్యుత్తమ ఉపాధి ఈ మానవ ఉపాధి. నేను ఆత్మ స్వరూపుడను అని గుర్తించుటకు, ఆత్మకు పరమాత్మకు బేధము లేదు అని తెలిసి కొనుటకు ఉపయోగ పడు ఏకైక ఉపాధి, ఈ మానవ ఉపాధి. భగవంతుడు మనందరికి బుద్ధిని, విచారణ చేయగలిగే శక్తిని అనుగ్రహించారు. ఈ విచారణా శక్తిని చక్కగా వినియోగించుకొని ఆత్మ జ్ఞానమును పొందే అర్హత మానవ శరీరము ధరించిన ప్రతి ఒక్కరికి ఉన్నది. ఆ లక్ష్యము దిశగా ఈ శరీర, ప్రాణ, మనోబుద్ధులను వినియోగించుకొనుటకుచేయు ప్రయత్నమే సాధన అంటే.

సామాన్యముగా ప్రతి మానవునికి కొన్ని బలహీనతలు, కొన్ని సద్గుణములు ఉంటాయి. బలము (నేను ఇది చెయ్యగలను), బలహీనత (నేను ఇది చెయ్యలేను) రెండు అహం యొక్క ప్రతిబింబములే. బలహీనతలను నిరసించుట లేక బయట పడుట, బలములోని అహమును లేక ప్రత్యేకతలను నిరసించుటయే సాధన అంటే. ఆచరణలో బలహీనతలనుండి బయట పడాలి. విచారణలో ప్రత్యేకతల నుండి బయట పడాలి. బలహీనతలనుండి బయట పడాలి అంటే మనస్సు చెప్పేదానికి వ్యతిరేక ఆచరణ చేయాలి. ఈవిధమైన సాధన చెయ్యాలి అంటే మనస్సు కన్నా సూక్ష్మమైన బుద్ధి స్థానములో ఉండాలి. నీ బుద్ధిచే నీవు ప్రయత్నము చేసి పరిష్కరించు కొనే సామర్థ్యము నీకు లేదు, ఆయా పరిస్థితులలో నీ బుద్ధి పనిచేయుట లేదు అన్నప్పుడు తద్వ్యతిరేక జీవనము జీవించు. అంటే నీ బలహీనతలకు ఆవకాశము లేని వాతావరణములో నీ బుద్ధిపై పట్టు సాధించే వరకు జీవించు. ఒకసారి పట్టు సాధించిన తరువాత, బుద్ధి నీ స్వాధీనమైన తరువాత అంటే నిగ్రహించ గల శక్తి వచ్చిన తరువాత ఏ పరిస్థితిలో నీవు ఓడిపోయావో ఆయా పరిస్థితులలో మరల పోరాడి అధిగమించు. వాతావరణము మార్చుట అనేది ఆఖరి పరిష్కారము. విషయాసక్తత లోని ఆపేక్షను, ఆనందమును వివేకముతో పరిష్కరించు కొనుట శాశ్వత పరిష్కారము. విచారణ వస్తే తప్ప విషయ సుఖముల నుండి బయటపడలేరు. విచారణ అంటే ఇది శాశ్వతమా లేక అశాశ్వతమా అని ప్రశ్నించుకోవటమే.

మనకు తెలియ కుండా జరుగునది సాధన కాదు. పరిణామశీలతను గుర్తించి అవగాహన చేసికొంటేనే అది సాధన అవుతుంది. గుర్తించి వర్తించడమే నేర్చుకోవడము అంటే. నీలోని అంతరంగిక ప్రపంచమును అధ్యనము చేస్తేనే నీ స్వభావము ఏమిటో, నీ సంస్కార బలము ఏమిటో , నీ ప్రారబ్ధము ఏమిటో నీకు అర్ధమవుతుంది. అప్పుడు దానిని అధిగమించుటకు తగిన సాధన చేయగలుగుతావు.

సాధన చేసేటప్పుడు తద్వారా ఏమి సాధించబడినది అనే ప్రశ్న వేసికోండి. ఆ సాధనల వలన ఈ క్రిందివి ఏవైనా సాధించబడినవా? లేదా? అనేది సరి చూచుకొండి.

- ముక్తి సిద్ధమైనదా ?

- కర్మ బంధము లేకుండా పోయినదా?

- కర్మ నుండి ప్రేరణలు లేకుండా పోయినవా?

- ఒక వేళ వస్తే నిలువరించ గలుగు చున్నావా?

- నీ మనో బుద్ధులను సాక్షిగా చూడ గలుగుచున్నావా?

ఈ విధముగా ప్రశ్నించు కొన్నప్పుడే, ఒక లక్ష్యము దిశగా సాధన చేసినప్పుడే ఆ సాధన ఫలవంత మవుతుంది.

సాధకులు ఎవరికి వారు ప్రతిరోజు తమ అనుదిన జీవన విధానమును పరిశీలించుకొంటూ ఉండాలి. ఒక పగలు , రాత్రి గడచి పోయింది

నేను ఏమి సాధించాను?

నేను ఏమి అధ్యయనము చేశాను?

సాక్షిత్వములో ఎంతవరకు నిలువగలుగుచున్నాను?

విషయ పరవశత్వం నుండి ఎంతవరకు బయట పడగలిగాను?

కర్తగా లేకుండా కర్తవ్య నిష్ఠను ఎంతవరకు ఆచరించగలిగాను?

అనుభవములో భోక్తగా మునిగిపోకుండా ఎంతవరకు ఉండగలుగు చున్నాను?

ఇలా పరిశీలించు కోవటము అలవడాలి.

చాలా మంది సాధకులు సాధననే లక్ష్యముగా పొరపడుతుంటారు. సాధనలో చేయు ప్రతిదాని వెనుక ఒక ఉద్దేశ్యము ఉంటుంది. ఆ ఉద్దేశ్యము దృష్ట్యా వానిని వినియోగించుకో గలిగినప్పుడే అవి ఫలవంతము అవుతాయి. శ్వాసమీద ధ్యాస , బుద్ధితో ధ్యానము ఇవన్నియు ఆత్మ సాక్షాత్కార జ్ఞానమును ఇవ్వవు. కాని దాని కొరకై నీ శరీర, ప్రాణ, మనస్సులను సిద్ధపరుస్తాయి. అటువంటి సిద్ధమైన అంతఃకరణతో ఆత్మజ్ఞానమును తెలిసికొని, దానియందు నిలిచి ఉండుట ద్వారా ఆత్మ సాక్షాత్కార జ్ఞానము కలుగుతుంది.

మానవులు అందరు ఎప్పుడు పరిస్థితులు తమకు అనుకూలముగా ఉండాలి అనుకొంటారు. కాని వ్యతిరేక పరిస్థితులతో పోరాడి గెలచుట వలననే వివేకము అభివృద్ధి చెందుతుంది, సాధనలో పురోభివృద్ధి ఉంటుంది. కనుక సమస్య అనే పరిస్థితి ప్రకృతి మనకు అందిస్తున్న చక్కటి అవకాశముగా భావించి సాధన చేసి అధిగమించాలి. అలా అధిగమించే వరకు ప్రకృతి అటువంటి పరిస్థితులను మరల మరల కల్పిస్తూనే ఉంటుంది. బుద్ధి తనకు తెలిసిన వాటిని త్వరగా చెయ్యగలుగుతుంది. కొత్త విషయములను తెలిసికొనేటప్పుడు చాలా నెమ్మదిగా పని చేస్తుంది. బుద్ధికి ఒక లక్ష్యము ఇచ్చి ఆ లక్ష్యము దిశగా బుద్ధి పని చేసేటట్లు చూడాలి. అప్పుడే పురోగాభివృద్ధి ఉంటుంది.

సాధనయందు పట్టుదల ఉంటేనే ఆచరణలోనికి వచ్చి అనుభవము నిస్తుంది. మనలోని దివ్యత్వము లేక దైవత్వమును అనుభవములోనికి తెచ్చుకొనవలెనన్న శ్వాసతో సమంగా దైవాన్ని మనం భావించగలగాలి. అంటే శ్వాస తీసికొనక ఎలా జీవించలేమో, దైవమును విడచి , మరచి నేను జీవించలేను, నా జీవనానికి ఆధారం దైవం అనేస్థాయిలో దైవాన్ని మనం స్వీకరించగలిగినప్పుడే మనలోని దివ్యత్వము అనుభవములోనికి వస్తుంది. నేను గురువుకు లేక ఈశ్వరునకు ఈవిధముగా జీవిస్తాను అని వాగ్ధానము చేసాను. పోతే ప్రాణము పోవచ్చు గాక, వాగ్ధాన భంగము కలుగనివ్వను అని సాధన చేయు వానిని సృష్టియందలి ఏ శక్తియు ఏమి చేయజాలదు. ఎట్టి పరిస్థితులలోను గురువుకు లేక ఈశ్వరునికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి అనే పట్టుదల ఉన్నవాడు తాను గురువును లేక ఈశ్వరునిని ఆవహింపచేసుకొని పనిచేస్తాడు. అటువంటి పట్టుదల కలిగినవారికే సాధన ఫలవంతము అవుతుంది.

అనుభవ జ్ఞానము కలిగిన గురువు నీకు జ్ఞానము కలిగేటట్లు చెబుతారు (అన్ని అవగాహన కలిగేటట్లు చెబుతారు) కాని ఇలా చెయ్యి అని చెప్పరు. ఆ జ్ఞానమును నిజ జీవితములో వినియోగించుట ఎట్లా అనేది నీ బుద్ధిచే నీవు పరిష్కరించుకోవాలి. ఏ వాక్యాన్ని, ఏ సాధనను స్వీకరిస్తే జీవితములో ఎదురవుచున్న సమస్యలను పరిష్కరించు కోగలవో ఆ సాధనను స్వీకరించే తెలివి నీ పోరాటము లోనుండి నీకే కలగాలి, స్ఫురించాలి. అదే వికాసము అంటే. గురువు చెప్పే వేదాంత వాక్యములన్నింటిని నీలో జాగ్రత్తగా నిక్షిప్తము చేసికోవాలి. నీవు నిజజీవితములో మాట్లాడేటప్పుడు, ఇతరులు అడిగిన దానికి సమాధానము చెప్పేటప్పుడు ఈ వేదాంత వాక్యములను మాట్లాడుట, ఉపయోగించుట అలవాటు చేసికో. దీనివలన నేను అనే స్ఫురణ ఎల్లప్పుడూ ఉంటుంది. జీవిత సంఘటనల వలన దుఃఖము కలుగదు .వేదాంత వాక్యములు మననమై వాటియందు నీవు స్థిర పడతావు.

సాధకులు మొదట కర్మ ఫలముల యందు ఆసక్తిని తొలగించుకోవాలి. బాహ్య ప్రపంచము నీ అంతరంగిక ప్రపంచము యొక్క ప్రతి బింబము. నీలోని కోరిక బలీయమై ఎట్లైనా అనుభవించాలి అన్న తీవ్ర తహ కలిగినపుడు ఆ కోరిక ఘనీభవించి పదార్థమగు చున్నది. దుఃఖము లేక పోవడమే సుఖము. రెండు దు:ఖ సంఘటనల మధ్య

విరామమే సుఖము. మానవులు ఎల్లప్పుడు సుఖమునే కాంక్షిస్తారు . దుఃఖమును కోరరు. ఈ సుఖాసక్తతయే జీవ భావము. సుఖ ఆపేక్ష నుండి బయట పడుటయే ఈశ్వరునిగా అగుట అంటే. ఈ సుఖాసక్తత నుండి బయట పడి సమత్వమును పొందుటకు సాధన చేయవలెను. ఈ సమత్వ సాధన యందు నీ చుట్టూ ఉన్న ప్రపంచములోని ప్రతి ప్రాణి సహాయకారియే. ఏదో ఒక విషయమును బోధిస్తూనే ఉంటాయి. కనుక ఈ సృష్టి యందలి ప్రతిది నీకు గురువే.

నిష్కామకర్మను శ్రద్ధా భక్తులతో చేసిన పాపకర్మలు నశించి మనో నిర్మలత్వము కలుగును. రాగ ద్వేషములు నశించి విషయ విరక్తి కలిగి వైరాగ్యము పెంపొందును. నిత్యానిత్య వివేకోదయమై అనిత్యమైన వాటి పట్ల తుచ్ఛ బుద్ధి మోక్ష మందు తీవ్రతర విచారము కలుగును. ఎవరికైతే ఆసక్తత, ఆనందము లేక ఉదాసీనముగా ఉండుట అలవడుతుందో వారే తత్వజ్ఞాన శ్రవణము చేయుటకు అర్హులు. అట్టి అర్హతను పొందినవారు బ్రహ్మజ్ఞానమును గురు ముఖత శ్రవణముచేయవలెను. శ్రవణ, మనన, నిధిధ్యాసనములు అనువాటి ద్వారానే ఆత్మ విచారణ స్థిర పడాలి. వేరే మార్గము లేదు. అనుభవ జ్ఞానము కలిగిన గురు ముఖత నేను ఆత్మ స్వరూపుడను అను నిశ్చయ జ్ఞానమును శ్రవణము చేయవలెను. విన్న వాక్యముల యొక్క అర్థము బోధపడు వరకు, ఆ జ్ఞానము బుద్ధి యందు స్థిరపడు వరకు మననము చేయవలెను. ఆ భావము స్మృతిలోని చేరి నిర్ణయమై సహజమై పోవుట నిధిధ్యాస. నీవు నియమ నిష్ఠలను ఎంత పటిష్టముగా పోషిస్తున్నావో అంత త్వరగా నీకు అనుభవ జ్ఞానము కలుగుతుంది. ఆత్మానుభవము కలుగుటకు రెప్పపాటు సమయము చాలు. సాధన అంతా దానికొరకు సిద్ధ పడుటయే. ఆత్మభావన యందు స్థిరపడిన వానికి దైవానుగ్రహము లేక గురుకృప వలన ఆత్మసాక్షాత్కార జ్ఞానము కలుగుతుంది. ఆత్మసాక్షాత్కారజ్ఞానము కలిగినవాడు మహావాక్యములను శ్రవణము చేసి అనుభవమును పొందిన బ్రహ్మానుభవమును పొందుతాడు. ఇదే సాధన చేయవలసిన క్రమము

----x----

సంసారము

వస్తువులు, విషయాలు ఈ రెంటి యెడల మనసులో కలిగే ఆలోచనలే సంసారము అంటే. అంతే కాని, పెళ్లి చేసుకోవటం, పిల్లల్ని కనటం వాళ్లకు పెళ్ళిళ్ళు చేయటం ఇదికాదు సంసారం అంటే. మనస్సు వస్తువుల యెడల, విషయాల యెడల ఆలోచనలు కలిగిస్తూ నిన్ను జీవుడిగా చేస్తున్నది. ఆ మనస్సుని కనుక లేకుండా చేసుకుంటే నీవు ముక్తుడవే.

నీలోని ఇష్టాయిష్టములు, రాగద్వేషములే నీ అంతరంగిక ప్రపంచము. నీ అంతరంగ ప్రపంచము, నీ ఇష్టాయిష్టములను బట్టి బాహ్య ప్రపంచములోని వస్తువులకు లేనిపోని విలువలను ఆపాదించి సంసారము ఏర్పరచుకొనుచున్నది. వస్తువులకు లేనిపోని విలువలను ఆపాదించుట ద్వారా ఆకర్షణకు లోనై, అదే నీవు అయినట్లుగా భ్రమ చెందుచున్నావు. దానికి ఏమైనా అయిన నీకే అయినట్లుగా భ్రాంతి చెందుచున్నావు. ఈ విధముగా ఆసక్తి, ఆకర్షణ అనునవి నీవు నీవుగా ఉండకుండా జగత్తు భావనను పొందేటట్లు చేస్తున్నాయి.

శరీరమునకు నేను భిన్నమైన వాడను, అధిష్టానమును. నేను శరీరమును ధరించిన వాడను, శరీరము నాకు ఒక పనిముట్టు అని భావించి జీవించు వానికి జగత్తు వ్యాపారము సంసారమును ఏర్పరచజాలదు. వస్తువునకు విలువ ఆకర్షణను బట్టి కాక వినియోగమును బట్టి ఇచ్చి దానిని వినియోగించుకొనిన ఆ వస్తువుతో తాదాత్మ్యత చెందే అవకాశము ఉండదు. ఆసక్తి, ఆకర్షణల నుండి నీవు బయటకు వచ్చిన జగత్తు నిన్ను ఏమి చేయజాలదు. నీపై ఏ ప్రభావమును చూపజాలదు. ఏదైనా బలీయమైన ఆకర్షణ కలిగినప్పుడు మనస్సును మరియొక దానిపై మరల్చుట, మనస్సును శ్వాసపైకి మరల్చుట మొదలగునవి తాత్కాలిక ఉపశమన పద్ధతులు. వాటిని ఆత్మలో సంయమనము చేయుట అనునది శాశ్వత పరిష్కారము. అవి మరల తలెత్తకుండా ఉండే విధముగా పరిష్కరించే పద్ధతి ఆత్మ సంయమనము.

వస్తువులకు విలువ ఆపాదించినప్పుడు ఒక భావనను ఆశ్రయించే దానికి విలువను ఆపాదిస్తావు. ఆ భావన దృష్ట్యా విలువను ఇస్తావు మరియు వ్యవహారములో తాదాత్మ్యత చెందుచున్నావు. ఆ విలువను ఎట్లా ఆపాదిస్తున్నావో చూచుకొని దానిని వివేకముతో పరిష్కరించుకోవాలి. ఆ వస్తువును నీవు ఆపాదించిన విలువ దృష్ట్యా చూచుట కాక వస్తువును వస్తువుగా చూచుట అలవరచుకోవాలి.

ఈ సృష్టిలో ఎంతో మంది స్త్రీలు ఉన్నారు. ఈవిడకే ఎందుకు విలువను ఇస్తున్నావు? భార్య కాబట్టి

భార్యగా విలువను ఇచ్చిన తరువాత ఆ దృష్టితోనే చూస్తావు. తాదాత్మ్యత చెందుతావు. రాగద్వేషాదులు ఏర్పడకుండా ఉండాలి అంటే ఉండగలుగుతావా? అలాకాక ఈశ్వర ప్రతినిధిగా చూడు. ఈశ్వరుడు తనను వెదకుటలో సహాయపడుటకు ఈ రూపములో మార్గదర్శిగా వచ్చాడు అని భావించి చూడు. అప్పుడు వ్యవహరించేటప్పుడు కూడా ఈశ్వరుడు అనే భావనతో వ్యవహరిస్తావు. చూచే దృష్టిలో మూలములోనే మార్పు వస్తుంది. తాదాత్మ్యత కలుగుటకు ప్రధానకారణము వస్తువుకు విలువను లేక ప్రత్యేకతను ఆపాదించుట. అలాకాక జగత్తుతో వ్యవహరించే టప్పుడు దైవీభావనతో సమస్తమును దర్శిస్తూ జగత్తులోని వస్తువులకు ఇచ్చే అనవసరపు విలువను తీసివెయ్యి. అప్పుడు నిర్వేదము లేక ఉదాసీనత కలుగుతుంది. సంసారము నుండి బయటపడగలుగుతావు.

త్రివిధ తాపములు

దహింపబడేది దేహము. చనిపోయిన తరువాతనే కాదు జీవించి ఉండగనే మూడు విధములైన తాపములచే దహించబడుచున్నది.

ఆధిదైవిక తాపము - పంచభూతముల వలన కలుగు తాపములు మరియు ఎవరి బాద్యత లేకుండా ఎదురుపడునవి.

ఆధిభౌతిక తాపము - ఇతర జీవరాసుల వలన కలుగు దుఃఖము

ఆధ్యాత్మిక తాపము - తనవలననే తనకు కలుగు దుఃఖము

ఒక చిన్న పిల్లను తల్లితండ్రులు ఇంటివద్ద విడచిపెట్టి బయటకు వెళ్ళారు. ఆ పిల్ల స్మృతి పదములో తల్లితండ్రులు మెదిలారు. ఏడవటము మొదలుపెడుతుంది. ఇంట్లోని వారు కొంతసేపు మైమరపించుటకు ప్రయత్నిస్తారు. ఏడుపు ఆపనియెడల స్మృతిలో తల్లితండ్రుల చిత్రములు బలీయముగా పనిచేస్తున్నట్లు. ఈ దుఃఖము ఎవరివలన కలిగినది? తన స్మృతిలోని జ్ఞాపకముల వలన, తన వలన తనకే కలిగినది. ఇదే ఆధ్యాత్మిక తాపము. అజ్ఞానావస్థలో జీవించు వారు ఎక్కువగా బాధించబడేది ఆధ్యాత్మిక తాపము వలననే.

సాధారణముగా ఇతరులతో మనము వ్యవహరిస్తున్నప్పుడు కలుగు దుఃఖములన్నియు ఆధ్యాత్మిక తాపము క్రిందకే వస్తాయి. కాని చాలామంది ఆధ్యాత్మిక తాపమును విశ్లేషించేటప్పుడు అదిభౌతిక తాపముగా చూస్తారు. ఉదాహరణకు నీపై అధికారి నిన్ను తిట్టారు. అతని వలన నాకు దుఖము కలిగినది అంటారు. సాధారణముగా పై అధికారి మనపనిని మనము సక్రమముగా నిర్వహించనప్పుడే కదా మనలను కోప్పడునది. ఈ విశ్లేషణలోనే జ్ఞానికి, అజ్ఞానికి బేధము స్పష్టముగా కనపడుతుంది. జ్ఞాని తనను కారణముగా పెట్టుకొని తనను తాను సరిదిద్దుకొంటాడు,

కారణము లేనియెడల ఉదాసీనముగా ఉంటాడు. అజ్ఞాని తన దుఃఖమునకు ఇతరులను కారణముగా చూస్తూ త్రిగుణముల ప్రభావమునకు వశుడై, ప్రతిస్పందిస్తాడు.

మనలో అంతఃసంఘర్షణ నిత్యమూ జరుగుచూనే ఉంటుంది. బుద్ధి ఒక పక్షము వహిస్తుంది, మనస్సు మరియొక పక్షమును వహిస్తుంది. నీవు దేనికి ఓటు వేయక సాక్షిగా చూస్తూ ఉరక ఉన్న యెడల ఎక్కడ నుండి అయితే సంఘర్షణ పుట్టినదో అక్కడే సమసిపోతుంది. సముద్రములో అలలు వస్తాయి, మరల సంద్రములోనే అవి సమసిపోతాయి. అలానే మనలోని సంఘర్షణలు సాక్షిగా ఉన్నయెడల అవే సమసిపోతాయి. మనోబుద్ధులలో కలిగే చలనములను అమోదింపక, తిరస్కరించక గమనిస్తూ ఉండుటయే ధ్యానము. అన్ని సమసిపోయిన స్థితినే సమాధి అంటారు. నీ మనో బుద్ధులలో మెదిలే భావములకు నీవు స్పందించక ఉన్నయెడల నీవు నీ మనోబుద్ధులకు సాక్షిగా ఉన్నట్లే. అప్పుడు నీవలన నీకు ఏర్పడే ఆధ్యాత్మిక తాపము నుండి తప్పించుకో గలుగుతావు. నేను ఆత్మస్వరూపుడను, నేను సాక్షిని అని నీ స్వరూపజ్ఞాన నిష్ఠలో నిలబడియున్న యెడల, నీవలన నీకు ఏర్పడే ఆధ్యాత్మిక తాపమును పరిష్కరించుకోగలుగుతావు.

బంధము - స్వేచ్ఛ

పదార్థ ములోనే సుఖమున్నది అని భావించి జీవించు చున్నంత కాలము నేను చైతన్యమును అనే భావనలో జీవించలేవు. వైరాగ్య భావనతో దీనిని ఖండించు. అనురాగము లేకుండా ఉండటమే వైరాగ్యము. ఎదుటి వస్తువుతో మనము సంబంధము ఏర్పరచుకొనుట వలన అనురాగము కలుగుతుంది. సంబంధములో బాధ, బాంధవ్యము, బంధము ఉంటుంది. వస్తువు పట్ల అనురాగము ఉంటే ఏదోఒకనాడు అది నిన్ను బాధించక, బంధించక తప్పదు. నీ మనస్సు ద్వారానే జగత్తుతో సంబంధము ఏర్పరచు కొనుచున్నావు. కనుక ఈ సమస్యను మనస్సు దగ్గరే తేల్చిన సమస్య పెరగదు. మనస్సు కల్పిస్తున్న అన్ని ప్రేరణల యెడల నాకు సంబంధము లేదు అని తేల్చి చెప్పండి. అనురాగము నుండి బయట పడగలుగుతావు.

అద్దము లోని ప్రతిబింబము నిన్ను ఎలా బాధించ గలుగుతుంది? ప్రతిబింబముతో నీవు సంబంధ, బాంధవ్యములు కలిగి ఉండవు కదా. బాహ్య ప్రపంచము నీ అంతరంగ ప్రపంచ ప్రతిబింబము. అలాంటప్పుడు ప్రతిబింబ సమానమైన ప్రపంచము మాత్రము నిన్ను ఎలా బాధించ కలుగుతుంది?

పిల్లలను ఈశ్వరుడు పోషిస్తున్నాడు, నేను నియమిత మాత్రుడను. నాకు ఒక జీవి పరిణామ క్రమమును అధ్యయనము చేయుటకు ఈశ్వరుడు ఇచ్చిన అవకాశము అని భావించండి. అప్పుడు అనురాగము కలుగదు. బిడ్డ

పుట్టట అంటే ఒక కుండ నుండి మరియొక కుండ తయారగుటయే. ఒక కుండ మరియొక కుండను ప్రేమించుట, ద్వేషించుట ఉండవు కదా. బ్రహ్మము కుమ్మరి వాడు. సృష్టి వ్యక్తము కాక పూర్వము కుండ కుమ్మరి వాని జ్ఞాన రూపములో, స్మృతి రూపములో ఉన్నది. ఆ జ్ఞానమును వ్యక్తము చేస్తే సృష్టి అయినది. కాని బ్రహ్మము దేని ఎడల సంబంధము కలిగి ఉండదు. బ్రహ్మము దృష్ట్యా చూచిన సమస్తము నా నుండి ఉద్భవించినది. తత్వజ్ఞాన దృష్ట్యా చూచిన ఒక కుండ నుండి మరియొక కుండ తయారగు చున్నది. ఏ ద్రుష్టితో చూచినను ఈ ప్రపంచముతో సంబంధము ఏర్పడదు. కనుక ప్రపంచము నిన్ను బాధించే అవకాశమే లేదు.

నా పిల్లలు నా సాధనకు అడ్డుగా ఉన్నారు. బంధించి వేస్తున్నారు అంటారు. నీ పిల్లలు నిన్ను ఏ విధముగా బంధిస్తున్నారు? నీకు ఆకలి కలుగకుండా , నిద్ర రాకుండా, దప్పిక కలుగకుండా, శ్వాస జరుగకుండా ఆపుచున్నారా? శారీరకముగా ఏ క్రియనైన జరగకుండా చేస్తున్నారా? లేదు కదా. కేవలము నీ మనస్సు యొక్క ఆలోచనల కదలిక వారి చుట్టూ తిరిగు చున్నది. ఇదే బంధము అంటే.

వివాహము జరిగినప్పుడు 10 నవర్సుల బంగారపు గొలుసు పెట్టారు. కొంత కాలమునకు అది కనపడ లేదు. ఏమి చేస్తావు? మొదట వెదకుతావు, తరువాత అందరితో చెప్పుకొంటావు. దుఃఖిస్తావు.

నాది కానిది నన్ను ఆశ్రయించదు ఈ సృష్టిలో అనే స్థిరమైన నిర్ణయము కలిగి జీవిస్తున్నావు. అదే సన్నివేశము నీకు దుఃఖము కలుగజేస్తున్నదా? లేదు కదా. పట్టు కోవడమైన, వదలటమైన నీ చేతిలో పని. పట్టుకోవడమే బంధము. చేతిగుడ్డను పట్టుకొన్నావు. అది నీకు అవసరమే. కాని ఎంత సేపు పట్టుకొంటావు? దానిని అవసరమైనప్పుడు తీసికోవచ్చు అని పక్కన పెడతావు.

పట్టుకోవడములో సుఖమున్నదా? వదులుటలో సుఖమున్నదా?

ఈ ప్రపంచములో దేనికి నిన్ను బంధించే శక్తి లేదు. ఇది నన్ను బంధిస్తున్నది, నేను దీనిలో మునిగి పోతున్నాను అనేది కేవలము నీ భావన మాత్రమే. అలా భావించుటకు బదులు దానికి వ్యతిరేకమైన ఆచరణ చెయ్యి. అప్పుడు స్వేచ్ఛను కలిగి జీవించ గలుగుతావు.

--- X ---

చిన్మయారణ్యం పబ్లికేషన్స్ ట్రస్ట్ వారి సౌజన్యం తో ....

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు

1. దీపారాధన ఎందుకు చేయాలి?

ప్రతి భారతీయ గృహములోను దైవపీఠము వద్ద రోజు దీపాన్ని వెలిగిస్తారు. కొన్ని ఇళ్ళలో ఈ దీపాన్ని ఉదయము, మరి కొందరు సాయంత్రం, ఇంకొందరు ఉభయ సంధ్యలలో వెలిగిస్తారు. అరుదుగా కొందరు (అఖండ దీపము) ప్రతి దినము రోజంతా ఉండేలాగ దీపాన్ని వెలిగిస్తారు.

శుభ సందర్భాలు, నిత్య పూజలు, ప్రార్ధనలు, పర్వ దినాలు మరియు సామాజిక ప్రారంభోత్సవాలు మొదలైనవి అన్నీ కూడా దీపము వెలిగించిన తర్వాతనే ప్రారంభిస్తారు. ఒక్కొక్కసారి ఆయా సందర్భాలు పూర్తయ్యేవరకు ఆ దీపాన్ని అలాగే కొనసాగిస్తారు.

అట్లా ఎందుకు చెయ్యాలి?

కాంతి జ్ఞానానికి, చీకటి అజ్ఞానానికి చిహ్నములు. భగవంతుడు జ్ఞానస్వరూపుడు. అన్ని విధములైన జ్ఞానానికీ ఆయనే ఆధారము. జ్ఞానాన్ని ఇచ్చేవాడు, పోషించే వాడు కనుక జ్యోతి రూపములో భగవంతుడిని ఆరాధిస్తాము.

కాంతి చీకటిని తొలగించినట్లుగా జ్ఞానము అజ్ఞానాన్ని తొలగిస్తుంది. జ్ఞానమనేది ఎప్పటికీ తరగని అంతరంగ సంపద. అన్ని సంపదలకన్నా గొప్ప సంపదగా జ్ఞానాన్ని భావించి దీపాన్ని వెలిగించి నమస్కరిస్తాము. మనము చేసే పనులు మంచివైనా, చెడ్డవైనా జ్ఞానాన్ని ఆధారముగా చేసికొనే చేస్తాము. అందువలననే అన్ని శుభ సందర్భాలలో మన ఆలోచనలకు సాక్షిగా దీపాన్ని వెలిగిస్తాము.

బల్బును కానీ ట్యూబ్ లైట్ను గానీ ఎందుకు వెలిగించరు? అది కూడా చీకట్లను తొలగిస్తుంది కదా! కానీ సాంప్రదాయ దీప కాంతి మనకు ఆధ్యాత్మికమైన ప్రాముఖ్యతను కూడా సూచిస్తుంది. దీపానికి వాడే నెయ్యి లేక తైలము మనలోని వాసనలు లేక స్వార్ధ పూరితమైన సంస్కారాలకు చిహ్నము. వత్తి అహంకారానికి ప్రతీక. ఎప్పుడైతే ఆధ్యాత్మిక జ్ఞానముతో వెలిగిస్తామో అప్పుడు

వాసనలు మెల్లగా కరిగి పోయి అహంకారం అంతరించిపోతుంది.
జ్యోతి ఎప్పుడూ పై వైపుకు మాత్రమే చూస్తూ ఉంటుంది. అదే విధముగా మనము ఆర్జించే జ్ఞానము మనల్ని ఎప్పుడూ ఉన్నత ఆశయాల వైపు మళ్ళిస్తుంది.
ఒక దీపము కొన్ని వందల దీపాలను వెలిగిస్తుంది. అదే విధముగా ఒక జ్ఞాని తన జ్ఞానాన్ని ఎంతో మందికి అందిస్తాడు. దీపాలను వెలిగించడము వలన వెలిగించే దీపము యొక్క కాంతి ఏమాత్రము తగ్గి పోదు.   అదే విధముగా జ్ఞాని జ్ఞానాన్ని ఇతరులకి పంచడము వలన తన జ్ఞానము తగ్గదు. పైపెచ్చు జ్ఞానము గురించిన అవగాహన పెంపొందుతుంది. ఇచ్చిన వాళ్లకు, తీసికొనే వాళ్లకు కూడా ఉపయోగ కారి అవుతుంది.

దీపం వెలిగించే టప్పుడు ఈ క్రింది ప్రార్ధన చేస్తాము.
దీపం జ్యోతీ పరబ్రహ్మ దీపం స్సర్వం తమోపహః
దీపేన సాధ్యతే సర్వం సంధ్యా దీపం నమో2స్తుతే
అజ్ఞానాన్ని హరించి, జ్ఞానాన్ని ఇచ్చి అన్నింటిని సిద్ధింప చేసికొనే శక్తినిచ్చే సంధ్యా దీపానికి ప్రణామములు.

ఈ ఆచారము జ్ఞాన సంపద, ఆధ్యాత్మిక సంపదను సూచిస్తుంది.

2. ప్రార్థనా గదిని ఎందుకు కలిగి ఉండాలి?

భారతీయులందరూ పూజకై, ప్రార్థనకై ఒక గదిని లేక కొంత స్థలాన్ని తమ గృహములలో కేటాయిస్తారు. ప్రతి రోజు దైవానికి ముందు ఒక దీపాన్ని వెలిగిస్తారు. జపము, ధ్యానము, పారాయణము, ప్రార్థనలు, భజనలు మొదలగు ఆధ్యాత్మిక సాధనాలు కూడా ఈ ప్రార్థనా స్థలమందు జరుపుతారు. పుట్టిన రోజు, వివాహాది దినములు మరియు పండుగలు మొదలైన అన్ని శుభ సందర్భాలలో ప్రత్యేకమైన పూజలు చేస్తారు. గృహములోని పెద్దలు, పిన్నలు అందరు కూడా దైవముతో సాన్నిధ్యము కలిగి పూజ చేసికొంటారు.

పూజాగది - ఎందుకు?

ఈ చరాచర సృష్టికి పరమాత్మ మాత్రమే సొంత దారుడు. కావున మనము నివసించే గృహానికి కూడా నిజమైన హక్కుదారు పరమాత్మయే. పూజా గది అనేది ఆ యజమాని ఐన పరమాత్మ గది. మనము భగవంతుని సొత్తుకు నిజమైన సొంత దారులము కాము అనే భావన వలన మాత్రమె మన దురహంకారము, మనది అనే పెత్తందారి తనమును వదిలించుకోగలము.

మనము నివసించే గృహమునకు మరియు మనకు కూడా యజమాని భగవంతుడే. మనము కేవలము ఆయన గృహానికి నియమించబడ్డ నిమిత్త మాత్రులమైన సేవకులము అన్న సరైన భావన కల్గి ఉండటము ఉత్తమము. ఈ విధముగా భావించ వీలు కానిచో భగవంతుడిని మన గృహానికి విచ్చేసిన ముఖ్య అతిధిగా భావించి ఆయన సంతోషముగా ఉండడానికి పూజ గదిని కానీ, దైవ పీఠమును గాని వసతిగా కల్పించాలి. అన్ని వేళలా ఆ ప్రదేశం శుభ్రముగా మరియు అలంకార యుక్తంగా ఉండేలా చూడాలి (ఉన్నతాధికారి మన ఇంటికి వస్తుంటే వారికి చేసే సౌకర్యాలకన్నా కొంత ఎక్కువగానే ఉండేలా చూడాలి).

పరమాత్మ సర్వ వ్యాపి . ఈ విషయము గుర్తుంచు కోవడానికి ఆయన మన ఇంట్లో మనతో ఉండడానికి మనము పూజా గదులను కల్గి ఉండాలి. భగవంతుని అనుగ్రహము లేనిదే మనము ఎ పనిని విజయవంతముగా చేయలేము, దేనిని సాధించ లేము. పూజ గదిలో భగవంతుడిని

ప్రతి రోజు ప్రార్థించటము వలన సన్నిహిత సంబంధము ఏర్పడి ఆయన అనుగ్రహాన్ని త్వరగా పొందగలము.

ఇంటిలోని ప్రతి గది ఒక ప్రత్యేకమైన పనికి నిర్దేశింపబడి ఉంటుంది. ఆయా గదులు ఆయా నిర్దేశింపబడిన పనులకు అనుకూలము కల్గి ఉండేలాగా అమర్చి ఉంటాయి. అదే విధముగా ధ్యానానికి, పూజకు, ప్రార్థనకు కూడా అనుకూలమైన వాతావరణము కల్గినటువంటి పూజాగది మనకు అవసరము . పవిత్రమైన ఆలోచనలు, శబ్దతరంగాలు ఆ ప్రదేశములో వ్యాపించి అక్కడకు వచ్చినవారి మనస్సుల్ని ప్రభావితము చేస్తాయి . మనము అలసిపోయినప్పుడు లేక కలత చెందినప్పుడు కేవలము ప్రార్థనా గదిలో కొద్దిసేపు కళ్ళు మూసుకుని కూర్చుంటే కూడా చాలు ప్రశాంతత, ఉత్సాహము, ఆధ్యాత్మిక ఎదుగుదల పొందగలము.

(అంతే కాని చేసే కొన్ని విధాలైన పనులు భగవంతుని ముందర చేయటానికి Guilty గా ఉంటుంది కదండీ అందుకు కాస్త దూరంగా ప్రత్యేక గది కట్టి అందులో భగవంతుణ్ణి బంధించేశాము అని మాత్రము దయచేసి అనకండి.)

3. 'నమస్తే' ఎందుకు చెప్పాలి?

భారతీయులు ఒకరినొకరు 'నమస్తే' అని పలకరించు కుంటారు. నమస్తే అన్నప్పుడు తల వంచి రెండు అరచేతులు హృదయం ముందర కలపడము జరుగుతుంది. మనకన్నా చిన్నవారైనా, సమ వయస్కులైనా, పెద్దవారైనా స్నేహితులైనా మరియు కొత్తవారైనా కూడా ఇదే విధముగా నమస్తే అని పలకరించాలి.

శాస్త్రాలలో సంప్రదాయ బద్ధమైన ఐదు రకాల అభివందనములు ఉన్నాయి. అందులో నమస్కారము ఒకటి. నమస్కారము అంటే సాగిలపడుట అనే అర్ధము వస్తుంది. కానీ నమస్తే అంటే ఈ రోజుల్లో మనము ఒకరిని ఒకరు కలిసినప్పుడు ఇచ్చి పుచ్చుకునే మర్యాదగా గ్రహించాలి.

నమస్తే ఎందుకు చేయాలి?

నమస్తే అనేటటువంటిది మామూలుగా అలవాటుగా చేసేటటువంటి వందనమో, సంప్రదాయబద్ధమైన ఆచారమో లేక భగవదారాధనో అయి ఉండవచ్చును. ఏది ఏమైనప్పటికీ ఈ ఆచారములో మనకు తెలియని చాలా లోతైన అర్ధము ఉంది . సంస్కృతములో నమః+తే = నమస్తే. దీని అర్ధము - నేను నీకు నమస్కరిస్తున్నాను అని. నమః అనే పదాన్ని "న", "మః" గా విడదీయవచ్చు - నాది కాదు అనే అర్ధము వస్తుంది. ఇతరుల సన్నిధిలో మన అహంకారాన్ని వదిలించుకొనే లేక తగ్గించుకొనే ఆధ్యాత్మిక సాధనను తెలియ జేసే ఆచారమిది.

వ్యక్తుల మధ్య నిజమైన కలయిక అంటే వారి మనస్సులు కలవడమే. అందుకే మనము ఇతరులను కలిసినప్పుడు నమస్తే అంటాము. అనగా 'మన మనసులు కలియుగాక' అని అర్ధము. హృదయం ముందర రెండు అరచేతులు కలపడము ఈ అర్ధాన్నే సూచిస్తుంది. తల వంచడము అనేది ప్రేమతో వినయముగా మర్యాదని, స్నేహాన్ని అందించడాన్ని తెలియచేస్తుంది.

నమస్కారమనేది ఆధ్యాత్మ పరంగా ఇంకా లోతైన అర్థాన్ని సూచిస్తుంది . ప్రాణ శక్తి, దివ్యత్వము; ఆత్మ లేక పరమాత్మ అందరిలో ఒకేలాగా ఉన్నది. ఈ ఏకత్వాన్ని గుర్తించి రెండు చేతులు కలిపి తల వంచి ఇతరులను కలిసినప్పుడు వారిలో ఉన్న దివ్యత్వానికి నమస్కరిస్తాము. మహాత్ములకు, భగవంతుడికి నమస్కారము చేసేటప్పుడు అందుకనే ఒక్కోసారి మనలోనున్న దివ్యత్వాన్ని చూసుకోవడానికా అన్నట్లు కనులు మూసుకొంటాము. దివ్యత్వాన్ని సూచించే విధముగా నమస్కారము ఒక్కోసారి భగవన్నామములతో ద్వారా కూడా చేయ బడుతుంది. ఈ ప్రాముఖ్యత తెలిసికొన్నప్పుడు నమస్కారము చేసేటప్పుడు పైపైకే నమస్తే అనడము గాక సరైనటువంటి స్నేహానికి దోహదము చేసే లాగున ప్రేమతోను గౌరవముతోను కూడిన వాతావరణాన్ని కలుగ చేయ గలము.

4. తల్లిదండ్రులకు, పెద్దలకు సాష్టాంగ నమస్కారము ఎందుకు చేయాలి?

భారతీయులు తమ తల్లిదండ్రులకు, పెద్దలకు, గురువులకు, మహాత్ములకు సాష్టాంగ నమస్కారము చేస్తారు. మనచే నమస్కరింపబడిన పెద్దలు తిరిగి వారి చేయిని మన తలమీద లేక పైన ఉంచి దీవిస్తారు. ప్రతి రోజు పెద్దలను కలిసినప్పుడు మరియు ఏదైనా క్రొత్తగా ప్రారంభించేటప్పుడు, జన్మదినములు పండుగలు మొదలగు శుభ సందర్భాలలో కూడా పెద్దలకు నమస్కరించడము జరుగుతుంది. కొన్ని సంప్రదాయ సమూహాలలో తమ కుటుంబము, సామాజిక హోదా మరియు తమ పరిచయము తెలియచేసే విధముగా (ప్రవర తో కూడి) సాష్టాంగ నమస్కారము చేయబడుతుంది.

సాష్టాంగ నమస్కారము ఎందుకు చేయాలి?

మానవుడు తన పాదాల ఆధారముగా నిలబడతాడు. సాష్టాంగ నమస్కారములో పెద్దల పాదాలకు నమస్కరించడమనేది వారి వ్యక్తిత్వానికి ఆధారమైన పెద్దరికానికి, పూర్ణత్వానికి, ఉదారతకు, దివ్యత్వానికి మనము ఇచ్చేటటువంటి గౌరవానికి చిహ్నము. ఇది వారికి మనపై గల స్వార్ధరహిత ప్రేమ మరియు మన సంక్షేమానికి వారు చేసిన త్యాగాల పట్ల మన కృతజ్ఞతని తెలియజేస్తుంది. ఇది ఇతరుల గొప్పతనాన్ని అణకువతో అంగీకరించే ఒక మార్గము. భారతదేశము యొక్క గొప్ప శక్తులలో ఒకటైన పటిష్టమైన కుటుంబ బాంధవ్య వ్యవస్థను ప్రతిబింబింప జేసే ఆచారములలో ఇది ఒకటి.

భారత దేశములో పెద్దల శుభ సంకల్పాలకు మరియు అశీర్వాదములకు ఉన్నతమైన విలువ ఇవ్వబడుతుంది. వాటిని పొందడానికి మనము నమస్కరిస్తాము. మంచి ఆలోచనలు మంచి తరంగాలను సృష్టిస్తాయి. పరిపూర్ణమైన ప్రేమ, దివ్యత్వము మరియు ఉదారత్వముతో నిండిన హృదయాలనుండి ఉద్భవించే శుభకామనలు అద్భుతమైన శక్తిని కల్గి ఉంటాయి. ఎప్పుడైతే మనము వినయముతో గౌరవముతో పెద్దలకు నమస్కరిస్తామో అప్పుడు వారి శుభకామనలు, దీవెనలు మంచి శక్తి వంతమైన తరంగ రూపంలో మనపై ప్రసరిస్తాయి. ఇందు వలనసే మనము నిలబడి కానీ, సాగిలబడి కానీ నమస్కారము చేసినప్పుడు శరీరమంతా ఈ శక్తిని స్వీకరించ

గలుగుతుంది.

గౌరవాన్ని తెలియపరచే వివిధ రీతులు:

ప్రతుత్థానము : లేచి నిలబడి స్వాగతమిచ్చుట

నమస్కారము : నమస్తే అని విధేయతను వ్యక్త పరచడము

ఉపసంగ్రహణ : పెద్దల, గురువుల పాదాలను తాకడము

సాష్టాంగము : కాళ్ళు, మోకాళ్ళు, ఉదరము, చాతి, నుదురు చేతులు అన్నీ నేలను తాకేలాగా పెద్దల ముందు సాగిలబడి నమస్కరించుట

ప్రత్యభివందనము: ప్రతి నమస్కారము చేయుట.

సంపద, వంశము, వయస్సు, నైతిక బలము మరియు ఆధ్యాత్మిక జ్ఞానము ఒకదాని కంటే ఒకటి ఎక్కువ గా వ్యక్తులకు గౌరవాన్ని పొందే అర్హతను కల్గిస్తాయి. ఇందువలననే భూమిని పరిపాలించే రాజు ఐనప్పటికీ ఆధ్యాత్మిక గురువు యొక్క పాదాలకు నమస్కరిస్తాడు. ఈ భావాన్ని ప్రత్యేకంగా స్పష్టము చేసే కధలెన్నో మనకు రామాయణం, మహా భారతము వంటి ఇతిహాసాలలో గలవు.

ఈ సంప్రదాయము వలన కుటుంబము మరియు సంఘము లోని వ్యక్తుల మధ్య పరస్పర ప్రేమ, గౌరవము, ఐకమత్యం, శాంతియుత వాతావరణము పెంపొందించ బడుతున్నాయి.

5. నుదుట బొట్టు పెట్టుకొంటాము. ఎందుకు?

దైవభక్తి గల భారతీయులు ప్రత్యేకించి వివాహితులు ఐన స్త్రీలు నుదిటి మీద తిలకము లేదా బొట్టు పెట్టుకొంటారు. ప్రతి రోజు స్నానము చేసిన తరువాత మరియు ప్రత్యేక సందర్భాలలోనూ, పూజ చేసే ముందర, తరువాత, లేక దైవ దర్శనానికి వెళ్ళేటప్పుడు తప్పక బొట్టు పెట్టుకుంటారు. చాలా తెగలలో వివాహితులైన స్త్రీలు ఎల్లా వేళలా నుదుట కుంకుమ పెట్టుకొనే కనిపించాలనే ఆదేశము ఉంది. వైదిక పద్దతులను ఆచరించే వారు మంత్ర ప్రార్ధనలతో కుంకుమ ధరిస్తారు. మహాత్ములకు మరియు దైవ ప్రతిమలకు ఆరాధనా సూచకంగా బొట్టు / తిలకం ధారణ జరుపుతాము. తిలకము వేరు వేరు రంగులలోను, రూపాలలోను ఉంటుంది.

నుదిటి పైన బొట్టు ఎందుకు?

నుదుటి పైన బొట్టు - ధరించిన వారిలోనూ, ఎదుటి వారిలోనూ పవిత్ర భావనను కలుగ చేస్తుంది. దైవ చిహ్నము గా గుర్తించ బడుతుంది.

మునుపటి కాలములో బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య, శూద్రులు వేరు వేరు చిహ్నలను ధరించేవారు. పౌరోహిత్యము లేక శాస్త్ర సంబంధమైన వృత్తిని కలిగిన బ్రాహ్మణుడు తన స్వభావమైన పవిత్రతకు చిహ్నంగా తెల్లని చందనాన్ని ధరించేవాడు. క్షత్రియ వంశానికి చెందిన క్షత్రియుడు తన వీరత్వానికి చిహ్నంగా ఎర్రని కుంకుమను నుదుట ధరించే వాడు. వర్తక వాణిజ్యాల ద్వారా సంపదను పెంపొందించే వైశ్యుడు అభ్యుదయానికి అభివృద్ధికి చిహ్నంగా పసుపు పచ్చని కేసరిని ధరించేవాడు. శూద్రుడు నల్లని భస్మాన్ని లేక కస్తూరిని ధరించెవాడు.

విష్ణు ఉపాసకులు U ఆకారముగా చందన తిలకాన్నీ, శైవ ఉపాసకులు భస్మ త్రిపున్డ్రాన్నీ, దేవీ భక్తులు ఎర్రని కుంకుమ బొట్టును ధరించేవారు.

భగవంతునికి సమర్పించిన చందనము, కుంకుమ, భస్మము ప్రసాదముగా స్వీకరించబడిన తరువాత మన నుదుట పెట్టబడుతుంది. జ్ఞాపక శక్తికి మరియు ఆలోచనా శక్తికి స్థానమైన

కనుబొమ్మల మధ్య నున్న ప్రదేశములో తిలకము పెడతాము. యోగ పరిభాషలో ఈ ప్రదేశము ఆజ్ఞా చక్రముగా చెప్పబడుతుంది. నేను భగవంతుని గుర్తున్చుకొందును గాక! ఈ భక్తీ భావన నా అన్ని కార్య కలాపాలలోనూ వ్యాపించుగాక! నేను నా అన్ని వ్యవహారాలలో ధర్మబద్ధముగా ఉందును గాక! అనే ప్రార్ధనతో తిలకము పెట్టుకోబడుతుంది. మనము ఈ ప్రార్ధనాయుతమైన వైఖరిని తాత్కాలికముగా మరచిపోయినా, ఇతరుల నుదుటి పైనున్న బొట్టు మనకు వెంటనే మన ప్రార్ధనను గుర్తుకు చేస్తుంది. అందుకే ఈ తిలకము మనకు భగవంతుని ఆశీర్వాదము మరియు అధర్మ ప్రవ్రుత్తులనుంచి, వ్యతిరేక శక్తుల నుండి రక్షణ వంటిది.

మన శరీరము మొత్తము ప్రత్యేకించి నుదురు కనుబొమ్మల మధ్యనున్న సూక్ష్మమైన స్థానము విద్యుదయస్కాంత తరంగ రూపాలలో శక్తిని వెలువరిస్తుంది. అందువలననే విచారముగా నున్నప్పుడు వేడి కలిగి తలనొప్పి వస్తుంది. తిలకము లేక బొట్టు మన నుదిటిని చల్లబరచి వేడి నుండి రక్షణ నిస్తుంది. శక్తిని కోల్పోకుండా మనల్ని కాపాడుతుంది. కొన్ని సమయాలలో చందనము లేక భస్మము నుదుట మొత్తము పూయబడుతుంది. బొట్టుకు బదులుగా వాడే ప్లాస్టిక్ బిందీ లు అలంకార ప్రాయమే కానీ నిజమైన ప్రయోజనాన్ని కలిగించవు.

భారతీయులకు ఈ ఆచారము చాలా అపూర్వమైనది. మరియు ఎక్కడ ఉన్నా సులభంగా మనల్ని గుర్తించడానికి సహాయపడుతుంది.

6. కాగితాలను పుస్తకాలను, మనుషులను కాళ్ళతో తగలకూడదు ఎందుకు?

హిందువుల ఇళ్ళల్లో, చిన్నప్పటినుంచీ కాగితాలకి, పుస్తకాలకి మరియు మనుషులకి కాళ్ళను తగలనివ్వ కూడదని నేర్పించబడుతుంది. ఒకవేళ పొరబాటున కాగితాలకి, పుస్తకాలకి, సంగీత సాధనాలకి లేదా ఏ ఇతరమైన విద్యా సంబంధమైన వస్తువులకి కాలు తగిలితే క్షమాపణకి గుర్తుగా కాలు తగిలిన వస్తువుని గౌరవపూర్వకముగా చేతితో తాకి కళ్ళకద్దుకోవాలని పిల్లలకు నేర్పబడుతుంది.

కాగితాలకు, మనుషులకు కాళ్ళు ఎందుకు తగలరాదు?

భారతీయులకు జ్ఞానము పవిత్రము, దివ్యము ఐనది. అందువలననే దానికి ఎల్లవేళలా గౌరవమివ్వాలి. ఈ రోజుల్లో పాఠ్యాంశములను ఆధ్యాత్మికము ఐహికము అని విడదీస్తున్నాము. కానీ ప్రాచీన భారతదేశములో ప్రతి విషయము శాస్త్ర సంబంధమైన లేక ఆధ్యాత్మ సంబంధమైనది అయినా సరే పవిత్రంగా పరిగణించి గురువుల చేత గురుకులాల్లో నేర్పించబడేది.

చదువుకి సంబంధించిన వస్తువులని తొక్క కూడదనే ఆచారము భారతీయ సంస్కృతి విద్యకు ఇచ్చే ఉన్నత స్థానాన్ని తరచూ గుర్తు చేస్తుంది. చిన్న తనమునుంచే ఈ విధముగా నేర్పడము వలన మనలో పుస్తకాల పట్ల, విద్య పట్ల శ్రద్ధాభక్తులు నాటుకు పోతాయి. జ్ఞానాధి దేవతకు అర్పణగా సంవత్సరానికి ఒకసారి సరస్వతీ పూజ లేదా ఆయుధపూజ రోజున మనము పుస్తకాలని వాహనాలని మరియు పనిముట్లని పూజించడానికి కూడా ఇది ఒక కారణము. మనము చదువుకునే ముందు ఈ క్రింది విధంగా ప్రార్థిస్తాము ....

సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా

వరాలనిచ్చి, కోరికలని తీర్చే ఓ సరస్వతీ దేవీ! నా చదువును ఆరంభించే ముందర నీకు నమస్కారము చేస్తున్నాను. నీవు ఎల్లప్పుడూ నా కోరికలు తీర్చుదువు గాక!

పిల్లలు పొరపాటున ఎవరికయినా కాళ్ళు తగిలినప్పుడు చాల భయపడతారు. ఒకవేళ పొరపాటున తగిలితే క్షమాపణకై మనము ఆ వ్యక్తిని చేతితో తాకి వేళ్ళను కళ్ళకు అద్దుకోవాలి. పెద్దవాళ్ళయినా చిన్నవాళ్ళని అజాగ్రత్తతో కాళ్ళతో తగిలితే, వారు వెంటనే క్షమాపణ చెప్తారు.

ఇతరులకి కాళ్ళు తాకడము చెడునడవడిగా పరిగణింప బడుతుంది - ఎందుకు?

మానవుడు ఈ భూమి మీద ప్రాణముతో, భగవంతుని యొక్క చక్కటి ఆలయముగా పరిగణింప బడుతాడు. అందువల్ల ఇతరులను పాదాలతో తాకడము అంటే వారిలో నున్న దివ్యత్వాన్ని అగౌరపరచడం వంటిదే. అందుకే పొరపాటున తగిలినా కూడా వెంటనే భక్తీ, వినయములతో కూడిన క్షమాపణను చెప్పాలి.

పై విధముగా మన ఆచారములు చాల సరళమైనవి. కానీ అవి చాలా శక్తివంతమైన పరిపూర్ణమైన ఆధ్యాత్మిక సత్యాలను గుర్తుకు తెస్తాయి. ఇటువంటి ఆచారాలు శతాబ్దాలనుండి భారతీయ సంస్కృతిని సజీవముగా నిలబెట్టడానికి కారణమయ్యాయి.

7. విభూతిని ఎందుకు పెట్టుకొంటాము?

నెయ్యి మరియు ఇతర వనమూలికలతో కలిపి ప్రత్యేకమైన సమిధలతో భగవంతునికి హోమంలో ఆహూతిగా సమర్పించినపుడు అందులోనుంచి వచ్చిన భస్మమే విభూతి. లేదా విగ్రహానికి భస్మముతో అభిషేకము చేసిన దానిని విభూతిగా పరిగణిస్తారు. అంతే కానీ కాలిన ప్రతి వస్తువు యొక్క బూడిద విభూతిగా పరిగనించబడదు.

విభూతిని సాధారణంగా నుదిటి మీద పెట్టుకొంటారు. కొందరు దానిని భుజాలు చాతీ మొదలైన ఇతర శరీర భాగాల మీద కూడా పెట్టుకుంటారు. కొందరు, ఆస్తికులు శరీరానికి అంతటికీ దీనిని రుద్దుకొంటారు. చాలా మంది భస్మాన్ని స్వీకరించినప్పుడల్లా చిటికెడు నోట్లో వేసికొంటారు.

విభూతిని ఎందుకు ధరించాలి?

భస్మము అనే మాటకు "మన పాపాలను భస్మము చేసేది, భగవంతుడిని జ్ఞాపకము చేసేది" అని అర్థము. "భ" అంటే భస్మము చేయడాన్ని; "స్మ" స్మరణమును సూచిస్తున్నాయి. అందువలన భస్మధారణ దుష్టత్వాన్ని నిర్మూలించి, దివ్యత్వాన్ని జ్ఞాపకం చేస్తుంది. భస్మము .. ధరించిన వారికి శోభనిస్తుంది గనుక "విభూతి" (శోభ) అనీ, దానిని పెట్టుకున్న వారిని పరిశుద్ధ పరచి వారిని అనారోగ్యత, దుష్టతలనుండీ రక్షిస్తుంది గనుక రక్ష అని అంటాము.
హోమము (పవిత్రమైన మంత్రాలతో అగ్ని దేవుడికి సమర్పించే నివేదన) అహంకారము స్వార్థ కామనలను జ్ఞానమనే అగ్నికి లేదా ఒక ఉన్నత నిస్స్వార్థ కారణార్థముకు ఆహుతిగా సమర్పించడానిని సూచిస్తుంది. తద్వారా వచ్చే భస్మము అటువంటి పనులు ఫలితంగా వచ్చే మానసిక పరిశుద్ధతను సూచిస్తుంది. నివేదనలను, సమిధలను అగ్నిలో దహింపజేయడమనేది జ్ఞానమనే అగ్నిలో అజ్ఞానము, సోమరి తనాన్ని వదిలించు కోవడాన్ని సూచిస్తుంది. మనము ధరించే భస్మము, ఈ శరీరములో నున్న అసత్యపు తాదాత్మ్యత మరియు జనన మరణాల పరిమితుల నుంచి విడివడి స్వతంత్రుల మవ్వాలని సూచిస్తుంది. శరీరము నశించేదని, ఒకనాడది బూడిదగా అవుతుందని కూడా మనకు భస్మ ధారణ గుర్తు చేస్తుంది. అందువలన

మనము దేహముపై మితిమీరిన మమకారం కలిగి ఉండకూడదు. మరణమనేది ఏ క్షణానైనా రావచ్చు. ఈ గ్రహింపు జీవితాన్ని ఉత్తమోత్తమముగా వినియోగించుకొని అభివృద్ధి మార్గాన పయనించే లాగున చేస్తుంది. అంతేకాని మరణాన్ని గురించి జ్ఞాపకము చేసే దుఃఖ భరితమైనదని అపార్ధము చేసికో కూడదు. కాలము ఎవరి కోసం నిలబడదని తెలియజేసే శక్తివంతమైన సూచిక ఈ భస్మము.

శరీరమంతటా భస్మాన్ని రాసుకోనేటటువంటి పరమ శివునితో ఈ భస్మము ప్రత్యేకమైన సంబంధము కలిగి ఉంది. శివ భక్తులు భస్మాన్ని త్రిపుండ్రాకారంలో ధరిస్తారు. మధ్యలో ఎర్రని బొట్టుతో కలిపి పెట్టుకున్నప్పుడు ఆ గుర్తు శివ శక్తులను సూచిస్తుంది.

కట్టెలన్నీ (పదార్ధాలు) కాలిపోయిన తరువాత మిగిలేది బూడిద. దానికి నాశనము లేదు. అదే విధముగా లెక్కలేనన్ని నామ రూపాలతో కూడిన సృష్టి అంతా నశించినప్పుడు మిగిలి ఉండేది, నాశనము లేనటువంటి శాశ్వత సత్యము ఐన భగవంతుడు మాత్రమె.

"భస్మము" ఔషధగుణాలని కలిగి ఉంది. ఇది ఎన్నో ఆయుర్వేద మందులలో వాడ బడుతుంది. ఇది శరీరములోని అధిక శీతలతను పీల్చుకొంటుంది. జలుబు, తలనొప్పులు రాకుండా కాపాడుతుంది . భస్మాన్ని నుదుట ధరించేటప్పుడు మృత్యుంజయ మంత్రము చెప్పాలని ఉపనిషత్తులు చెపుతున్నాయి

త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టి వర్ధనం
ఉర్వారుక మివ బంధనాత్ మ్రుత్యోర్ముక్షీయ మామృతాత్

మనల్ని పోషించేటటువంటి, మన జీవితాలలో పరిమళాలను వ్యాపింప చేసేటటువంటి త్రినేత్రధారుడైన శివుడిని పూజిద్దాము. అతడు మనల్ని దుఃఖము మరియు మరణాల సంకెళ్ళనుండి పండిన దోసకాయ తోడిమ నుండి విడిపోయే టంత సులభంగా విడిపించును గాక.

8. ఆహారము తీసికొనే ముందర భగవంతునికి నివేదిస్తాము ఎందుకు?

పాశ్చాత్య సాంప్రదాయములో క్రుతజ్ఞతా పరమైన ప్రార్ధన తరువాత తీసికోబడుతుంది. భారతీయులు దానిని భగవంతునికి నివేదన చేసిన తరువాత 'ప్రసాదం' గా స్వీకరిస్తారు. దేవాలయాలలో మరియు అనేకుల గృహాల్లోను ప్రతిరోజూ వండిన పదార్థాలు ముందుగా భగవంతునికి నివేదిన్చబడతాయి. ఆ నివేదింపబడిన పదార్ధము మిగతా పదార్థాలతో కలిపి ప్రసాదంగా వడ్డించ బడుతుంది. మన నిత్య పూజా కార్యక్రమంలో కూడా మనము భగవంతునికి 'నైవేద్యము' సమర్పిస్తాము.

మనము నైవేద్యము ఎందుకు సమర్పిస్తాము

భగవంతుడు సర్వ శక్తి వంతుడు మరియు సర్వజ్ఞుడు. భగవంతుడు పూర్ణుడయి ఉండగా మానవుడు అందులో అంశ మాత్రమె. మనము ఏ పనైనా భగవంతుడిచ్చిన శక్తి, జ్ఞానము వలన మాత్రమే చేయగలుగుతున్నాము. కావున జీవితములో మనం చేసే కర్మల ఫలితంగా మనము పొందేదంతా నిజానికి ఆయనదే. ఈ విషయము గ్రహించి ఆహారాన్ని ఆయనకు నైవేద్యంగా సమర్పిస్తాము. భగవంతునికి అర్పించిన తర్వాత అది ఆయన దివ్య స్పర్శ నొంది అనుగ్రహంతో మనకిచ్చిన కానుకగా మనచే స్వీకరించ బడుతుంది.

ఈ విషయం తెలిసికొన్న తరువాత ఆహారం పట్ల, ఆహారం తినే విదానంపట్ల మన వైఖరి పూర్తిగా మారుతుంది. సాధారణంగా నివేదిమ్పబడిన ఆహారము పవిత్రంగాను, ఉత్తమమైనది గాను ఉంటుంది. మనము దానిని స్వీకరించే ముందర ఇతరులతో పంచుకొంటాము. మనము ఆహారాన్ని అధికార పూర్వకముగా అడగకూడదు. అసంతృప్తి పడకూడదు లేక మనకు లభించిన ఆహారపు నాణ్యత గురించి విమర్శించ కూడదు. మనము దానిని సంతోషముగా ప్రసాద బుద్ధితో స్వీకరించాలి. ఈ విధముగా ప్రసాద భావన పెంపొందింప చేసుకొంటే కేవలము ఆహారము పట్లనే కాక మన జీవితములో లభించే అన్నింటిని కూడా ప్రసాదంగా సంతోషముగా స్వీకరించగలము.

ప్రతిరోజు భోజనాన్ని ముందర పవిత్రము చేసే చర్యగా కంచం చుట్టూ నీరు చల్లుతాము. కంచం ప్రక్కగా ఐదు ముద్దలను మనచేత చెల్లించబడే రుణాలకి ప్రతీకగా ఉంచుతాము.

1) **దేవ ఋణం** .. దేవతల దయార్ద్ర అనుగ్రహము మరియు రక్షణలకు.

2) **పిత్రు ఋణం** .. పితృ దేవతలకి వంశ పారంపర్యత్వాన్ని మరియు సంస్కృతిని ఇచ్చినందుకు.

3) **భూత ఋణం** .. ఎవరి ఆలంబన లేనిదే ఈ సంఘములో మనము జీవిన్చాలేమో ఆ సంఘాన్ని ఏర్పరిచిన వారు.

4) **రుషి ఋణం** .. మన మతమును మరియు సంస్కృతిని గుర్తింపచేసి, వృద్ధి పరచి, తద్వారా మనకందించినందుకు

5) **మనుష్య ఋణం** .. ఇతర ప్రాణులు స్వలాభాపేక్ష లేకుండా మనల్ని సేవిస్తున్నందుకు

ఆ తర్వాత పంచ ప్రాణాలుగా శరీరాన్ని నిలబెట్టే ప్రాణ శక్తిగా మనలో ఉన్న భగవంతుడికి ప్రాణాయా స్వాహా; అపానాయ స్వాహా; వ్యానాయ స్వాహా; ఉదానాయ స్వాహా; సమానాయ స్వాహా అని చెపుతూ నివేదించ బడుతుంది. పంచ ప్రాణాలు ఈ క్రింది విధముగా శారీరక విధులు నిర్వహిస్తాయి.

1) **ప్రాణము** ... శ్వాస కోశమును చైతన్య వంతము గావిస్తుంది.

2) **వ్యానము ...** నాడీ వ్యవస్థను నియంత్రింప చేస్తుంది

3) **అపానము ...** వ్యర్ధ పదార్ధాలను బయటకు త్రోస్తుంది.

4) **సమానము ...** జీర్ణ క్రియను చైతన్య వంతము చేసి శరీరానికంతటికి శక్తి సరఫరా చేస్తుంది.

5) **ఉదానము** ... ఎక్కిళ్ళు మొదలగునవి కల్గించేది, ఆలోచనా శక్తి నిచ్చేది. పై విధంగా నివేదించబడిన తరువాత ఆహారం ప్రసాదంగా తీసికోబడుతుంది. ఈ భావన గుర్తు చేసి కోవడానికి భగవద్గీత లోని ఈ శ్లోకాలను చదువుతారు.

బ్రహ్మార్పణం బ్రహ్మ హవి: బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం

బ్రహ్మైవతేన గంతవ్యం బ్రహ్మ కర్మ సమాధినా

కర్మనే బ్రహ్మమని స్థిరంగా భావించి బ్రహ్మమనే హవిస్సు బ్రహ్మమనే అగ్నిలో బ్రహ్మముచేత హోమం చేయబడేది బ్రహ్మమే. దానిద్వారా అందుకోవలసిన గమ్యం కూడా బ్రహ్మమే.

అహం వైశ్వానరోభూత్వా ప్రాణినాం దేహమాశ్రితః

ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధం

నేను వైశ్వానరుడినై ప్రాణుల దేహాలను ఆశ్రయించి ప్రాణాపానములతో కూడికొని చతుర్విధ అన్నాన్ని పచనము చేస్తున్నాను.

9. ప్రదక్షిణము చేస్తాము - ఎందుకు?

మనము దేవాలయాన్ని దర్శించినప్పుడు ప్రార్థన, పూజ అనంతరము గర్భాలయము చుట్టూ కుడి చేతి వేపుగా తిరగడమే ప్రదక్షిణ.

ప్రదక్షిణము ఎందుకు చేస్తాము?

ఒక కేంద్ర బిందువు లేనిదే మనము ఒక వృత్తాన్ని చిత్రీకరించలేము. భగవంతుడు మన జీవితాలకు కేంద్రము, ఆధారము మరియు సారము. మనము ఆయనను కేంద్రముగా చేసికొని మన జీవిత కార్య కలాపాలు సాగిస్తాము. ఈ ప్రాముఖ్యతను తెలిపేదే ప్రదక్షిణము.

ఒక వృత్తానికి దాని పరిధి లోని ప్రతి బిందువు కేంద్ర స్థానము నుంచీ సమానమైన దూరంలోనే ఉంటుంది. అనగా మనమెక్కడ ఉన్నప్పటికీ, ఎవరమయినప్పటికీ, భగవంతునికి అందరమూ సమానమైన సన్నిహితులమే. పక్షపాత రహితముగా ఆయన కరుణ అందరి వైపు ఒకేలాగా ప్రవహిస్తూ ఉంటుంది.

ప్రదక్షిణ ఎడమ నుండి కుడికి గుండ్రగానే ఎందుకు చేయబడుతుంది?

ప్రదక్షిణ చేసేటప్పుడు భగవంతుడు మనకు కుడివైపు ఉంటాడు. అందుకని కుడి వైపు నుంచి ప్రదక్షిణము చేస్తాము. భారత దేశములో కుడి వైపు అనేది శుభ ప్రదత ను తెలుపుతుంది. ఆంగ్ల భాషలో కూడా సరైన, సరికాని అని చెప్పడానికి రైట్ సైడ్ / రాంగ్ సైడ్ అనే పదాలు వాడతారు. అందువలన గర్భాలయంను కుడి వైపుగా ఉంచి ప్రదక్షిణము చేసేటప్పుడు మనకు అన్ని వేళలా సహాయము, శక్తిని ఇచ్చి, మార్గ దర్శకత్వము అయి మన జీవితాన్ని ధర్మము వైపు నడిపించే వాడయిన భగవంతునితో బాటు ఋజు వర్తనము కలిగి శుభప్రదమైన జీవితాన్ని గడపాలని గుర్తు చేసికోవాలి. మనము అత్యంత ప్రాముఖ్యం ఇచ్చే వాటిని కుడి వైపున అంత కన్నా తక్కువ ప్రాధ్యాన్యత ఇచ్చే వాటిని వెడమ వైపున ఉంచడము మన సాంప్రదాయం. ఈ విధముగా చేయడము వలన అధర్మ ప్రవృత్తుల నుంచి బయట పడి మళ్ళీ మళ్ళీ తప్పులు చేయకుండా సవ్య మార్గములో నిలబడతాము.

భారతీయ వేద గ్రంధాలు మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథి దేవో భవ అని శాసిస్తాయి. నువ్వు నీ తల్లిదండ్రులను మరియు గురువులని భగవత్స్వరూపులుగా భావించుదువు గాక! ఈ భావముతో మనము మన తల్లి దండ్రులకు మరియు మహాత్ములకి కూడా ప్రదక్షిణ చేస్తాము. తన తల్లి దండ్రులకి గణపతి దేవుడు ప్రదక్షిణ చేసినట్లు చెప్పే కధ అందరికీ తెలిసినదే.

సంప్రదాయ పద్ధతి ప్రకారము పూజ పూర్తి చేసిన తరువాత మనము విధిగా ఆత్మ ప్రదక్షిణ చేస్తాము. ఈ విధముగా చేయడము వలన బాహ్యముగా విగ్రహ రూపంలో ఉన్న భగవంతుడే మనలో ఉన్న విశిష్టమైన దివ్యత్వముగా గుర్తిస్తాము. మనము ప్రదక్షిణ చేసేటప్పుడు ఈ క్రింది విధంగా స్తుతిస్తాము.

యానికానిచ పాపాని జన్మాంతర కృతాని చ
తాని తాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదే పదే

ఎన్నో జన్మలుగా చేయబడిన పాపాలన్నీ ప్రదక్షిణలో వేసే ప్రతి అడుగులోనూ నశింపబడు గాక!

10. మొక్కలని, చెట్లని పవిత్రముగా భావిస్తాము ఎందుకు?

ప్రాచీన కాలము నుంచీ భారతీయులు మొక్కలనీ వృక్షాలనీ పవిత్ర భావన తో పూజిస్తున్నారు. ఆయా ప్రదేశము లందలి వృక్ష, జంతు స్థావరాలన్నింటినీ పవిత్ర భావనతో గౌరవిస్తున్నారు. ఇది ఒక మూఢ ఆచారము లేక అనాగరిక చర్య కాదు. ఇది భారత సంస్కృతి యొక్క జ్ఞానాన్ని, దూరదృష్టిని మరియు మంచి సంస్కారాన్ని తెలియ పరుస్తున్నది. పురాతన భారతీయులు ప్రకృతి మాతను పూజించారు. ఆధునిక మానవుడు ప్రకృతిని వశపరచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

మనము మొక్కలనీ, వృక్షాలనీ ఎందుకు పవిత్రంగా భావిస్తాము?

మనలో జీవ శక్తి గా ఉన్న భగవంతుడే మొక్కలు, జంతువులు మొదలైన అన్ని ప్రాణులలోను వ్యాపించి ఉన్నాడు. అందువలననే మొక్కలైనప్పటికీ, జంతువులైనప్పటికీ వాటి నన్నింటినీ పవిత్రమైనవి గా పరిగణిస్తాము. ఈ భూమి మీద మానవుడి జీవితము మొక్కలపై మరియు వృక్షాలపై ఆధారపడి ఉంది. అవి మన మనుగడకు అవసరమైన ఆహారము, ప్రాణ వాయువు, వస్త్రాలు, వసతి, ఔషధాలు మొదలైన ప్రాణాధార వనరులను అందిస్తున్నాయి. మన పరిసరాలకు సుందరత్వాన్ని కలిగిస్తున్నాయి. ఏమీ ఆశించకుండా మానవుడికి సేవచేస్తూ మనము జీవించడానికి వాటి జీవితాల్ని అర్పిస్తున్నాయి. త్యాగానికి ఉదాహరణగా నిలబడి ఉన్నాయి. ఫలభరితమైన చెట్టు పైకి రాయి విసిరితే ఆ చెట్టు బదులుగా ఫలాన్ని ఇస్తున్నది.

నిజానికి భూమి మీద మానవుడికన్నా ముందే వృక్ష జంతు సమూహాలు నివసించేయి. ప్రస్తుతము వాటి పట్ల మానవుని కఠిన వైఖరి వలన వన్య ప్రాంతాలు నాశనము చేయడము వలన ఎన్నో రకాల వృక్షజాతిని నశింప చేయడము వలన ప్రపంచము తీవ్రమైన భయాన్దోళనలకు గురి అగుచున్నది. మనము వేటికి విలువ ఇస్తామో వాటినే రక్షించుకొంటాము. అందుకే భారత దేశములో మొక్కలను వృక్షాలను పవిత్రమైనవిగా గౌరవించడము చిన్నప్పట్నుంచే నేర్పబడుతుంది. అప్పుడే స్వతహాగా వాటిని మనము రక్షించుకొంటాము.

ఏ కారణముచేతనైనా ఒక చెట్టును నరుక వలసివస్తే పది చెట్లను నాటాలని భారతీయ పవిత్ర గ్రంధాలు చెప్తున్నాయి. మనకు ఆహారము, వంటచెరకు వసతి మొదలైన వాటికి అవసరమైనంత వరకు మాత్రమే మొక్కల వృక్షాల భాగాలను వాడుకోవాలని చెప్పబడింది. అంతే కాకుండా చెట్టును నరికిన పాపము రాకుండా ఉండాలంటే ఒక మొక్కను లేక చెట్టును కోయబోయే ముందు క్షమాపణ అడగవలసిందిగా కూడా చెప్పబడుతున్నది. మొక్కలు, వృక్షాలు చేసే త్యాగ సేవల గురించి మరియు వాటిని పోషించవలసిన మన బాధ్యత గురించిన కథలు చిన్నతనము నుంచే చెప్ప బడతాయి. అద్భుతమైన ప్రయోజనకర గుణాలు కల్గిన తులసి, రావి మొదలైన మొక్కలు, వృక్షాలు నేటికీ పూజింప బడుతున్నాయి.

దేవతలు మొక్కలు మరియు వృక్షాల రూపములో ఉన్నారనే నమ్మకము వలన అనేకులు వారి కోరికలను తీర్చుకొనుటకు మరియు భగవంతుడిని సంతోష పరచుటకు వాటిని పూజిస్తారు.

11. ఉపవాసం ఎందుకు చేయాలి?

భక్తి శ్రద్ధలు గల అత్యధిక పక్ష భారతీయులు ఒక క్రమ పద్ధతిలో లేదా పండుగల వంటి ప్రత్యేక సందర్భాలలో ఉపవాసాన్ని పాటిస్తారు. అటువంటి రోజుల్లో వాళ్ళు ఏమీ తినకుండా లేక ఒక్కసారి తినడం లేదా పండ్లు లేక అల్పాహారమును ఆహారముగా తీసికొని ఉపవాసము ఉంటారు. కొందరు రోజంతా కనీసం మంచి నీళ్ళు అయినా త్రాగకుండా కఠిన మైన ఉపవాసము చేస్తారు. ఉపవాసం ఎన్నో కారణాల కోసం చేయబడుతుంది. భగవంతుని కోసం లేక సంయమనం కోసం, అసమ్మతిని తెలియ పరచడానికి కూడా ఉపవాసం చేస్తారు. గాంధీ గారు బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా అసమ్మతిని తెలియపరచడానికి ఉపవాసం చేసారు.

ఉపవాసం ఎందుకు చేస్తాము?

ఆహారాన్ని పొదుపు చేయడానికా లేక ఆకలిని బాగా పెంచుకుని విందు ఆరగించాదానికా? నిజానికి అందుకు కాదు. మరి మనమెందుకు ఉపవాసం చేస్తాము?

సంస్కృతంలో ఉప అంటే 'దగ్గరగా' + వాస అంటే 'ఉండడం' అని అర్ధము. కాబట్టి ఉపవాసము అంటే దగ్గరా (ఆ భగవంతుడి) ఉండడం అంటే భగవంతునితో సన్నిహిత మానసిక సామీప్యతను సంపాదించడం. మరి ఉపవాసం - ఆహారముల మధ్య ఏమిటి సంబంధము?

కొన్ని రకాల ఆహారము మన బుద్ధిని మందకొడి గాను మరియు మనసులో అలజడిని కలిగిస్తుంది. అందువలన మానవుడు కొన్ని నియమిత రోజుల్లో నిరాహారముగా లేక అల్పాహారముగా గాని ఉండి తన సమయాన్ని శక్తిని ఆదా చేసికోవాలనుకుంటాడు. తద్వారా బుద్ధి చురుకుగాను మనసు పవిత్రముగాను అవుతుంది. అది వరకు ఆహారపుటాలోచనలు కలిగిన మనస్సు ఇప్పుడు ఉన్నతమైన ఆలోచనలతో కూడి భగవంతుని వద్ద నిలుస్తుంది. తనకు తాను నియమించుకొన్న క్రమశిక్షణ కాబట్టి ఆనందంగా ఆ నియమాన్ని మనస్సు అనుసరించే ఉంటుంది.

ఏ పని తీరుకైనా కూడా అది బాగా పనిచేయాలంటే మరమ్మత్తూ మరియు పూర్తి విరామము అవసరము. ఉపవాసంలో నిరాహారముగా లేక అల్పాహారముగా ఉండుట వలన జీర్ణ మండలానికి విశ్రాంతి లభిస్తుంది.

ఇంద్రియాలతో విషయ భోగాలు అనుభవించే కొద్దీ అవి వశము కాక ఇంకా ఎక్కువ కావలెనను. ఉపవాసము మనకు ఇంద్రియ నిగ్రహము అలవరచుకోవడానికి కోర్కెలను ఉదాత్తమైన వాటిగా చేసికోవడానికి శాంతియుత మనస్సును కల్గి ఉండడానికి మార్గము చూపి సహాయ పడ్తుంది.

ఉపవాసము మనలని నీరస పరిచేదిగాను, తొందరగా కోపం కల్గిస్చేటట్లుగాను మరియు తరువాత అనుభవించ వచ్చుననే ప్రేరణ నిచ్చేదిగాను ఉండకూడదు. ఉపవాసము వెనుక ఉన్నతమైన లక్ష్యము లేనప్పుడు ఇట్లా జరుగుతుంది. కొందరు కేవలము బరువు తగ్గించుకునే నిమిత్తమే ఉపవాసం లేదా పత్యం (diet) పాటిస్తారు.   మరి కొందరు భగవంతుని మెప్పించడానికి ప్రతిజ్ఞగా లేదా తమ కోరికలను తీర్చుకొనేందుకు, మరి కొందరు సంకల్ప శక్తి వృద్ధి చేసికోవడానికి, సంయమనానికై, కొందరు ఒక విధమైన తపస్సు గాను ఉపవాసము చేస్తారు. మరీ తక్కువగా కాక ఎక్కువగా కాక యుక్త ఆహారము తీసికోవలసినదని కేవలము ఉపవాసము చేయునప్పుడే కాక మిగతా రోజుల్లో కూడా శుచి ఐన బలవర్ధకమైన సాత్విక ఆహారము తీసికోవలసినదిగా భగవద్గీత మనకు బోధిస్తుంది.

12. దేవాలయంలో గంట మ్రోగిస్తాం ఎందుకు?

చాలా దేవాలయాలలో ప్రవేశద్వారానికి దగ్గర పైకప్పు నుంచీ ఒకటి లేక ఎక్కువ గంటలు వ్రేలాడ దీయబడి ఉంటాయి. భక్తుడు ఆలయంలోకి వెళ్ళగానే గంట మ్రోగించి ఆ తరువాతనే భగవంతుని దర్శనానికి మరియు ప్రార్థనలకి ఉపక్రమిస్తాడు. పిల్లలు ఎత్తుగా ఉన్న గంటను పైకి ఎగిరి లేక ఎత్తుకోబడి మ్రోగించడానికి ఇష్టపడతారు.

మనము గంటను ఎందుకు మ్రోగిస్తాము?

భగవంతుడిని నిద్ర లేపడానికా? కానీ దేవుడు ఎప్పుడూ నిద్రపోడు.
భగవంతునికి మనము వచ్చినట్లు తెలియచేయడానికా? ఆయన సర్వజ్ఞుడు కాబట్టి తెలుపవలసిన అవసరము లేదు.
ఆయన ప్రాంగణము లోనికి రావడానికి అనుమతి కొరకా? అది స్వంత ఇంటికి వస్తున్నట్లే గనుక రావడానికి అనుమతి తీసికొన అవసరము లేదు. భగవంతుడు మనలని ఎల్లవేళలా ఆహ్వానిస్తుంటాడు.

మరి మనం గంటను ఎందుకు మ్రోగిస్తున్నట్లు?

గంట మ్రోగించడం ద్వారా వెలువడే శబ్దము మంగళకరమైన ధ్వనిగా పరిగణించ బడుతుంది. ఇది విశ్వానికంతా భగవన్నామమయిన 'ఓంకార' నాదాన్ని ఉద్భవింపజేస్తుంది. సదా శుభప్రదమైన భగవంతుని యొక్క దర్శనము పొందడానికి బాహ్య అంతరాలలో పవిత్రత ఉండాలి అందుకే గంట మ్రోగిస్తాం.
వైదిక క్రియా పరంగా 'హారతి' ఇచ్చే సమయంలో కూడా మనము గంట వాయించుతాము. ఇది కొన్ని సమయాలలో మంగళకరమైన శంఖారావములతోను మరికొన్ని ఇతర సంగీత వాయిద్యాలతోనూ కూడి ఉంటుంది. మ్రోగే గంట, శంఖము మరియు ఇతర వాయిద్యాలు భక్తులను తమ భక్తి పారవశ్యత, ఏకాగ్రత మరియు అంతరంగ శాంతి నుండి చెదరగొట్టే అమంగళ,

అసంగతమైన శబ్దాలు మరియు వ్యాఖ్యానాల నుండి బయట పడడానికి సహాయ పడతాయి. ఇది గంట మ్రోగించడము లోని అదనపు సంకేతము.

మనము చేసే నిత్య పూజ ఆరంభములో ఇలా చెపుతూ గంటను వాయిస్తాము.

ఆగమార్ధంతు దేవానాం గమనార్ధంతు రక్షసాం
కురుఘంటా రవం తత్ర దేవతాహ్వాన లాంఛనం

దైవాన్ని ప్రార్ధిస్తూ నేను ఈ ఘంటారావం చేస్తున్నాను. దాని వలన సద్గుణ దైవీ పరమయిన శక్తులు నాలో ప్రవేశించి (నా గృహము, హృదయము) అసురీ మరియు దుష్టపరమైన శక్తులు బాహ్యాభ్యంతరాలనుండి వైదొలగు గాక!

13. కలశాన్ని ఎందుకు పూజిస్తాము?

ముందుగా అసలు కలశము అంటే ఏమిటి?

నీటితో నిండిన ఇత్తడి లేక మట్టి లేక రాగి పాత్ర; పాత్ర మొదట్లో మామిడి ఆకులు; వాటి పైన కొబ్బరి కాయ ఉంచబడుతుంది. తెలుపు లేక ఎరుపు దారం దాని మెడ చుట్టూ లేక పూర్తిగా కానీ సమ చతురస్రాకారపు నమూనాలో చుట్టబడి ఉంటుంది. ఆ పాత్ర చిత్రములతో కూడా అలంకరించబడి ఉండవచ్చు. అటువంటి పాత్ర 'కలశం' అనబడుతుంది. ఆ పాత్రను నీటితో గానీ బియ్యముతో గానీ నింపినప్పుడు "పూర్ణకుంభము" అనబడుతుంది. అది దివ్యమైన ప్రాణశక్తి తో నింపబడిన జడ శరీరానికి ప్రతీక అవుతుంది. ప్రాణశక్తి వలననే అన్ని అద్భుతమైన పనులను చేసే శక్తి శరీరానికి వస్తుంది.

సంప్రదాయ బద్ధమైన గృహ ప్రవేశము, వివాహము, నిత్య పూజ మొదలైన అన్ని ప్రత్యేక సందర్భాలలో తగిన వైదిక క్రియతో 'కలశము' ఏర్పాటు చేయబడుతుంది. స్వాగతానికి చిహ్నంగా ప్రవేశ ద్వారం వద్ద ఉంచబడుతుంది. ఇది మహాత్ములను సంప్రదాయ పద్ధతిలో ఆహ్వానించేటప్పుడు కూడా వాడబడుతుంది.

మనము కలశాన్ని ఎందుకు పూజిస్తాము?

సృష్టి ఆవిర్భావానికి ముందు శ్రీ మహా విష్ణువు పాల సముద్రములో తన నాగశయ్య పై పవ్వళించి ఉన్నాడు. అతని నాభి నుండి వెలువడిన పద్మములో నుంచి బ్రహ్మదేవుడు ఉద్భవించి ఈ ప్రపంచాన్ని సృష్టించాడు . కలశములొని నీరు సర్వ సృష్టి ఆవిర్భవానికి ప్రధమ జాతమైన నీటికి ప్రతీక గా నిలుస్తుంది. ఇది అన్నింటికీ జీవన దాత. లెక్కలేనన్ని నామరూపాలకి, జడ పదార్ధముల మరియు చరించే ప్రాణుల యొక్క అంతర్గత సృష్టికర్త. ఈ ప్రపంచములో ఉన్నదంతా సృష్టికి ముందుగా నున్న శక్తి నుంచి వచ్చినది శుభప్రదమైనది. ఆకులు, కొబ్బరికాయ సృష్టికి ప్రతీక. చుట్టబడిన దారము సృష్టిలో అన్నింటినీ బంధించే 'ప్రేమ' ను సూచిస్తుంది. అందువల్లనే 'కలశం' శుభసూచకముగా పరిగణింపబడి

పూజింపబడుతున్నది.

అన్ని పుణ్య నదులలోని నీరు, అన్ని వేదాలలోని జ్ఞానము మరియు దేవతలందరి ఆశీస్సులు కలశంలోకి ఆహ్వానించ బడిన తరువాత అందులోని నీరు "అభిషేకము" తో సహా అన్ని వైదిక క్రియలకి వినియోగింప బడుతుంది. దేవాలయ కుంభాభిషేకములు ఎన్నో రకాల పూజలు కలశ జలముల అభిషేకములతో విశిష్ట పద్ధతిలో నిర్వహిస్తారు.

పాల సముద్రాన్ని రాక్షసులు, దేవతలు మధించినపుడు అమరత్వాన్ని ప్రసాదించే అమృత కలశముతో భగవంతుడు ప్రత్యక్షమయ్యాడు. కనుక 'కలశం' అమృతత్వాన్ని కూడా సూచిస్తుంది.

పూర్ణత్వాన్ని సంతరించుకున్న జ్ఞానులు ప్రేమ, ఆనందాలతో తొణికిసలాడుతూ పవిత్రతకు ప్రతీక గా ఉంటారు. వారిని ఆహ్వానించేటప్పుడు వారి గొప్పదనానికి గుర్తింపుగా మరియు వారిపట్ల గల గౌరవనీయమైన భక్తికి నిదర్శనంగా పూర్ణ కుంభము తో హృదయ పూర్వకముగా స్వాగతమిస్తాము.

14. తులసిని - పూజిస్తాము ఎందుకు?

హిందువుల గృహాలలో ముందర, వెనుక లేక పెరట్లో మధ్య స్థలంలో 'తులసి కోట నిర్మించబడి ఉంటుంది. ఈ రోజుల్లో చిన్న చిన్న వాటాల (అపార్టుమెంట్లు) లోని వారు కూడా పూల తొట్టెలలో తులసి మొక్కను పోషించుకొంటున్నారు. ఇంటి ఇల్లాలు తులసి మొక్కకు నీరు పోసి దీపం వెలిగించి ప్రదక్షిణలు చేస్తుంది. తులసి మొక్క ఆకులు, విత్తనాలు మొక్కకు ఆధారమైన మట్టితో సహా అన్ని భాగాలు పవిత్రమైనవిగా పరిగణించ బడతాయి. భగవంతునికి నివేదింపబడే నైవేద్యములో ఎప్పుడూ తులసి ఆకులు ఉంచబడతాయి. భగవంతుడికి చేసే పూజలలో, ప్రత్యేకించి శ్రీ మహావిష్ణు అవతార మూర్తుల పూజలలో తులసి సమర్పించ బడుతుంది.

మనము తులసిని ఎందుకు పూజిస్తాము?

సంస్కృతములో 'తులనా నాస్తి అథైవ తులసి' అంటే దేనితోను పోల్చలేనిది తులసి (దాని లక్షణాలలో) అని అర్ధము. భారతీయులకు గల పవిత్రమైన మొక్కలలో ఇది ఒకటి.

వాస్తవానికి ఇది స్వశుద్ధికారి కనుకనే పూజా సమయాలలో వినియోగించే వస్తువులలో ఇదొక్కటే ఒకసారి వాడిన తరువాత కడిగి మళ్ళీ పూజకు వాడదగినదిగా పరిగణించవచ్చు.

ఒక కధనం ప్రకారము తులసి ఒక దేవత. ఆమె శంఖచూడునికి భక్తి శ్రద్ధలు గల భార్య. ఆమెలోని భక్తి, ధర్మశీలత యందు గల విశ్వాసములను చూచి భగవంతుడు ఆమెను పూజార్హత గల తులసి మొక్కగాను మరియు భగవంతుని తలమీద అలంకరింప బడే యోగ్యత గలది గాను దీవించాడు. తులసి ఆకుని సమర్పించకుండా చేసిన ఏ పూజ అయినా అసంపూర్ణమే. అందువలననే తులసి పూజింప బడుతుంది (కొన్ని పూజలలో తులసి వాడకూడదు అంటారు. విష్ణు పూజ కి సంబంధించి మాత్రం తప్పక వాడ వలసినది).

ఇంకో కధనం ప్రకారము - భగవంతుడు తులసికి తన అర్ధాంగి అయ్యేలాగ వరమిచ్చాడు. అందువలన ఆమెకు భగవంతునితో చాల ఆడంబర పూరితముగా వివాహ మహోత్సవం

జరుపుతాము. ఈ విధముగా విష్ణు మూర్తి భార్య యగు లక్ష్మీ దేవికి కూడా తులసి ప్రతీక. ఎవరైతే ధర్మబద్ధమైన సంతోషకరమైన గృహస్థ జీవితాన్ని గడపాలని కోరుకుంటారో వారు తులసిని పూజిస్తారు.

ఒకసారి సత్యభామ కృష్ణ భగవానుడిని తన దగ్గరున్న విలువైన సంపదతో తులాభారము చేస్తుంది. కానీ ఆ సంపదతో పాటు రుక్మిణీ దేవి భక్తితో ఒక్క తులసీదళం వేసే వరకు ఆ తులామానం సరితూగలేదు. ఆ విధంగా తులసి ప్రపంచంలోని మొత్తము సంపద కంటే భక్తితో సమర్పించే చిన్న వస్తువైనా సరే గొప్పదిగా భగవంతుడు స్వీకరిస్తాడని ప్రపంచానికి నిరూపించడములో ప్రధాన పాత్ర పోషించినది.

తులసి ఆకు చాల విశేషమైన ఔషధ విలువలని కలిగి ఉన్నది. జలుబుతో సహా వివిధ అనారోగ్యాలను నయం చేయడానికి వాడబడుతుంది.

తులసి మాల తో జపం చేస్తే చిత్తశుద్ధి త్వరగా కలిగి తద్వారా మోక్షం లభిస్తుంది. చిత్తశుద్ధి కి తులసి మాల ఉత్తమం.

తులసిని దర్శించినప్పుడు స్మరించవలసిన శ్లోకము:

యన్మూలే సర్వ తీర్థాణి యదగ్రే సర్వ దేవతాః
యన్మధ్యే సర్వ వేదాశ్చ తులసీం తాం నమామ్యహమ్

ఎవరి మూలములో సర్వ పుణ్య తీర్థాలు ఉన్నాయో, ఎవరి అగ్రములో సర్వ దేవతలున్నారో మరియు ఎవరి మధ్య భాగంలో సర్వ వేదాలున్నాయో అట్టి తులసికి ప్రణమిల్లుతున్నాను.

15. తామర పూవుని ప్రత్యేకమైనదిగా పరిగణిస్తాము - ఎందుకు?

తామర పూవు భారత దేశ జాతీయ పుష్పముగా గుర్తింపు పొందినది. ఈ గుర్తింపు సరైనటువంటిదే. కొద్ది కాలము క్రితము వరకు కూడా భారత దేశపు చెరువులు, కొలనులు ఎన్నో రంగు రంగుల తామర పుష్పములతో నిండి ఉండేవి.

తామర పూవుని ప్రత్యేకమైనదిగా పరిగణించుట ఎందుకు?

తామర పూవు సత్యము పవిత్రత మరియు సుందరత్వానికి ప్రతీక. భగవంతుని స్వభావము కూడా సత్యం శివం సుందరమూ. కనుక అతని వివిధ భాగాలు పద్మముతో పోల్చబడతాయి. మన వేదాలు, ఇతిహాసాలు తామర పూవు అందాలని స్తుతించుతాయి. చిత్రకళ శాస్త్రములు కూడా తామర పూవుని వివిధ అలంకారయుత చిత్రాలుగా చిత్రీకరిస్తుంటాయి. చాలా మంది తామర పూవు లేదా దానికి సంబంధించిన పేర్లను కలిగి ఉంటారు. సంపదకు అధి దేవత ఐన లక్ష్మీ దేవి ఒక తామర పూవు పైన ఆసీనమై మరొక తామర పూవుని తన హస్తముతో పట్టుకొని ఉంటుంది.

తామర పూవు ఉదయించే సూర్యునితో పాటు విచ్చుకొని రాత్రికి ముడుచుకొని పోతుంది. అదే విధంగా మన బుద్ధులు జ్ఞానమనే వెలుగుతో వికాసము, వృద్ధి చెందుతాయి. తామర పూవు బురద గుంటల్లో కూడా పెరుగుతుంది. దాని పరిసరాలు ఏ విధముగా ఉన్నప్పటికీ తాను మాత్రము కళంకము లేకుండా అందంగా ఉంటుంది. మనము కూడా బాహ్య పరిస్థితులు ఏ రకముగా ఉన్నప్పటికీ అంతర్గతమైన పవిత్రత, సౌందర్యము చెదరకుండా ఉండాలని, ఉండగలగటానికి పాటుపడాలని గుర్తు చేస్తూ ఉంటుంది. ఎప్పుడూ నీళ్ళలోనే ఉన్నప్పటికీ తామర ఆకుకి తడి అంటుకోదు. జ్ఞాని దుఃఖాలతోను మార్పులతోనూ కూడుకొన్న ప్రపంచములో ఉన్నప్పటికీ వాటికి చలించకుండా ఆత్మానందములోనె లీనమై ఉంటాదనడానికి ప్రతీకగా ఈ విషయము నిలుస్తుంది. భగవద్గీత లోని ఒక శ్లోకము ద్వారా ఈ విషయము తెలియజేయ బడింది.

బ్రాహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః
లిప్యతే నసపాపేన పద్మ పాత్ర మివాంభసా
భగవంతుడికి అర్పించి ఫలాపేక్ష వదిలి, ఎవరు కర్మలు చేస్తారో, తామరాకుకి నీరు లాగ వారికి పాపము అంటుకోదు.

దీనివలన జనానికి ఏదైతే సహజ లక్షణమో అది సాధకులందరికీ ఆధ్యాత్మ అన్వేషకులకి భక్తులకి ఆచరించ వలసిన క్రమ శిక్షణ అవుతుందని మనము తెలుసుకొన్నాము.

యోగ శాస్త్ర ప్రకారము మన దేహాలు శక్తి కేంద్రాలయిన కొన్ని చక్రాలను కలిగి ఉన్నాయి. ప్రతి చక్రము నియమిత దళముల పద్మమును కల్గి ఉంటుంది. ఉదాహరణకు శిరోభాగమున గల సహస్ర చక్రము, యోగి ఆత్మ జ్ఞానాన్ని పొందినప్పుడు వికసిస్తుంది. దీనిని వెయ్యి దళములు గల పద్మముతో సూచిస్తారు. అంతే కాకుండా ధ్యానానికి కూర్చోవడానికి పద్మాసనము సిఫారసు చేయబడింది.

విష్ణు భగవానుని నాభి నుంచీ ఆవిర్భవించిన తామర పూవు నుండి బ్రహ్మదేవుడు ఈ ప్రపంచాన్ని సృష్టించడానికై ఉద్భవించాడు. ఆ విధముగా తామరపూవు సృష్టి కర్తకీ మరియు పరమాత్మకు గల సంబంధానికి చిహ్నంగా నిలుస్తున్నది. ఇది బ్రహ్మదేవుని నివాస స్థానమైన బ్రహ్మలోకానికి కూడా చిహ్నము.

శుభ సూచకమైన స్వస్తిక్ గుర్తు కూడా తామర పూవు నుంచే వెలువడినట్లు చెప్పబడుతుంది.

తామర భారత జాతీయ పుష్పముగా ఎందుకు ఎన్నుకోబడినదో, భారతీయులకి ఎందుకది అంత ప్రత్యేకమైనదో మనము పై విషయాల ద్వారా చక్కగా తెలుసుకున్నాము.

16. శంఖము ఎందుకు ఊదుతాము?

దేవాలయాలలో గానీ ఇళ్ళలో గానీ శాస్త్రోక్త పూజారంభ సమయములో ఒక్కసారి లేక అనేక సార్లు శంఖము పూరించ బడుతుంది. హారతి ఇచ్చేటప్పుడు గానీ లేక సుభసూచకమైన సందర్భాన్ని గుర్తించడానికి గానీ శంఖము ఊదబడుతుంది. యుద్ధం ఆరంభించడానికి ముందర లేక సైన్యపు విజయాన్ని ప్రకటించడానికి గానీ శంఖారావము చేయబడుతుంది. శంఖము దైవ పీఠము వద్ద కూడా పెట్టి పూజించ బడుతుంది.

శంఖము ఎందుకు ఊదుతాము.

ఎప్పుడైతే శంఖము ఊదబడుతుందో, అప్పుడు అందుండి సృష్టికి మూలభూతమైన ప్రణవ నాదము వెలువడుతుంది. ఓంకారము సృష్టికి పూర్వము భగవంతునిచే చేయబడిన మంగళకరమైన నాదము. అది ప్రపంచానికి, దానికి ఆధారమైన సత్యానికి ప్రతినిధి.

ఒక కథనం ప్రకారం శంఖాసురుడనే రాక్షసుడు దేవతలను ఓడించి వేదాలను అపహరించి సముద్రపు అడుగు భాగములోకి వెళ్ళాడు. దేవతలు సహాయము కొరకు విష్ణుమూర్తికి విన్నవించుకొన్నారు. శ్రీ మహావిష్ణు 'మత్స్యావతారము' ధరించి శంఖాసురుణ్ణి సంహరించాడు. భగవానుడు శంఖాకారములో ఉన్న అతని చెవి మరియు తల ఎముకను ఊదగా అందుండి వేదాలను ఉద్భవిమ్పచేసినట్టి నాదము వెలువడింది. వేదాలలో ఉన్న జ్ఞానమంతా ఓంకారము యొక్క వివరణయే. శంఖము 'శంఖాసురుని' మరణానంతరము 'శంఖము' గా పిలవబడుచున్నది. భగవానునిచే పూరించబడిన శంఖము 'పాంచ జన్యము' గా పిలువ బడుచున్నది. ఆయన నాలుగు చేతులలోని ఒక చేతిలో ఎల్లవేళలలో శంఖము పట్టుకొని ఉంటాడు. అది జీవితపు చతుర్విధ పురుషార్థాలలో ఒకటయిన 'ధర్మము' లేక ధర్మశీలతకుప్రతీక . అందువల్లనే శంఖారావము అధర్మముపై ధర్మము యొక్క విజయానికి సంకేతము. శంఖాన్ని మన చెవులకి దగ్గరగా పెట్టుకొంటే సముద్రపు అలల హోరు వినబడుతుంది.

భక్తుల మనసులను వాతావరణమును కలవరపెట్టే వ్యతిరేక వ్యాఖ్యానాలను మోతలను పూర్తిగా తరిమెయ్యడానికి గాను శంఖము మరియు ఇతర వాయిద్యాలను మ్రోగించి మంగళకరమైన ధ్వనులను ఉత్పన్నము చేయడము అనేది మరియొక ముఖ్య ఉద్దేశ్యము.

పురాతన భారత దేశము గ్రామాలలో నివసిస్తూ ఉండేది. ప్రతి గ్రామము ఒక ప్రధాన దేవాలయము మరియు అనేక చిన్న దేవాలయాల అధ్యక్షతలో ఉండేది. ప్రతి ముఖ్యమైన పూజ ముగింపులోను మరియు పుణ్య దినాలలోనూ హారతి తో పాటు శంఖారావము చేయబడుతుంది. సాధారణంగా గ్రామము చిన్నదిగా ఉండడం వలన ఆ శంఖనాదం ఊరంతటికీ వినిపించేది. దేవాలయానికి వెళ్ళడానికి వీలుకాని ప్రజలంతా వారు ఏ పని చేస్తున్నా ఆ పని ఆపి కొన్ని క్షణాల పాటైనా మానసికంగా భగవంతుడికి ప్రణమిల్లాలని గుర్తు చేయబడేది. ఈ శంఖ నాదం తీరిక లేని నిత్య కృత్యాల మధ్య నున్న ప్రజల మనసులని కూడా భక్తి భావాలతో నింపుతూ సేవను అందించేది.

నాద బ్రహ్మము, సత్యము, వేదాలు, ఓంకారము, ధర్మమూ, విజయము మరియు శుభసూచకాలకి ప్రతీకగా దేవాలయాల లోను, ఇళ్ళలోనూ, దైవ పీఠము వద్ద, భగవంతునికి ప్రక్కగా శంఖము ఉంచ బడుతుంది. భక్తుల మనసులు ఉన్నతమై సత్యం వైపు ఎదగడానికి ఇచ్చే తీర్థమునకు కూడా శంఖము వాడ బడుతుంది.

ఈ క్రింది శ్లోకముతో శంఖము పూజింపబడుతుంది.

త్వం పురా సాగరోత్పన్నః విష్ణునా విధ్రుతః కరే
దేవైశ్చ పూజితః సర్వైః పాంచజన్యం నమోస్తుతే

సముద్రములో పుట్టిన, విష్ణుమూర్తి చేత బట్టిన మరియు దేవతలందరిచే పూజింపబడిన పాంచజన్యమను శంఖమునకు వందనము.

17. శాంతి వచనము మూడు సార్లు చెప్తాము - ఎందుకు?

శాంతి అంటే అర్థము ప్రశాంతత, అదే జీవి యొక్క సహజమైన స్థితి. సహజ స్థితి ని భంగం కలిగించేవి అన్నీ అశాశ్వతాలే. శబ్దాలు, ఆందోళనలు మరి ఏ ఇతర అడ్డంకులు మనచే గానీ ఇతరులచే గానీ కలిగిం చబడతాయి. ఉదాహరణకి ఒక స్థలములో ఎవరైనా శబ్దము చేసే వరకు అక్కడ ఉండేది ప్రశాంతతే. కాబట్టి మన అన్ని ఆందోళనలు అంతర్లీనంగా శాంతిని కలిగే ఉన్నాయి. ఆందోళనలు ముగిసిన వెంటనే అప్పటికే అక్కడ ఉన్నందువల్ల శాంతి సహజంగానే అనుభవంలోనికి వస్తుంది. ఎక్కడైతే శాంతి ఉంటుందో అక్కడ సంతోషం ఉంటుంది. అందువలన ఏ మినహాయింపు లేకుండా ప్రతి ఒక్కరూ తన జీవితంలో శాంతిని కోరుకుంటారు. ఐనప్పటికీ మన స్వంత ఆందోళనల చేత కప్పివేయబడినందువల్ల, అంతరంగికంగా గానీ బాహ్యంగా గానీ 'శాంతి' ని పొందడము చాల కష్టమనిపిస్తుంది. చాల అరుదైన కొందరు మాత్రమే బాహ్యమైన ఆందోళనలు, కష్టాల మధ్య కూడా శాంతియుతంగా ఉండ గలుగుతారు. మనము శాంతిని పొందడానికి ప్రార్థనలు చేస్తాము. ప్రార్థనలు చేయడం వలన కష్టాలు ముగిసి బాహ్యఆందోళనలతో సంబంధం లేకుండా అంతరంగికంగా శాంతి అనుభవములోకి వస్తుంది. అటువంటి ప్రార్థనలన్నీ మూడు సార్లు శాంతి పలకడముతో ముగుస్తాయి.

మనము మూడు సార్లు శాంతి వచనము ఎందుకు చెప్తాము?

'త్రివారం సత్యం' అనబడుతుంది. ఏదైనా ఒక విషయాన్ని నొక్కి చెప్పడానికి మనము మూడు సార్లు అదే విషయాన్ని పునరావృతం చేస్తాము. న్యాయ స్థానము లో కూడా, సాక్ష్యం చెప్పడానికి నిలబడినవారు "నేను నిజమే చెప్తాను, అంతా నిజమే చెప్తాను, నిజం తప్ప మరి ఇంకేమి చెప్పను" అని మూడు సార్లు చెప్తారు. మనకు శాంతి పొందాలన్న కోరిక యొక్క తీవ్రతను నొక్కి చెప్పడానికి మనము మూడు సార్లు శాంతి వచనము వల్లిస్తాము.

అన్ని రకాల విఘ్నాలు, సమస్యలు, మరియు దుఃఖాలు మూడు విధాలుగా ఉత్పన్నమవుతాయి.

1. **అధిదైవిక:** ఏ మాత్రము మన అదుపులో లేని దైవీ శక్తుల వలన ఏర్పడే భూకంపాలు, వరదలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు మొదలగునవి.

2. **అధిభూత:** మనచుట్టూ ఉండి మనకు తెలిసిన ప్రమాదాలు, మానవ సంబంధాలు, కాలుష్యము నేరములు మొదలగునవి.

3. **ఆధ్యాత్మిక:** శారీరక వ్యాధులు, కోపము, నిరుత్సాహము వంటి మానసిక సమస్యలు.

మనమేదైనా ప్రత్యేకమైన పని చేసేటప్పుడు మరియు నిత్య జీవితములో పైన వివరించబడిన మూడు మూలకారణాల వలన ఏ సమస్యలు లేకుండగా లేక సమస్యలను తగ్గించమని "శాంతి ఒక్కటే ఉండుగాక!" అని భగవంతుని ప్రార్థిస్థాము. కాబట్టి మూడు సార్లు శాంతి వచనము చేయబడుతుంది.

మొదటి సారి దూరంగా ఉన్న అవ్యక్త శక్తులను ఉద్దేశించి శాంతి వచనము చేయబడుతుంది. మన వెనువెంట ఉన్న పరిసరాలను మరియు చుట్టుప్రక్కల ఉన్న వ్యక్తులను ఉద్దేశించి రెండవసారి కొంత మృదువు గాను; తమకు తాము ఉద్దేశించి చివరి సారి బాగా మృదువుగాను శాంతి వచనము చేయబడుతుంది.

18. కొబ్బరి కాయను నివేదిస్తాము - ఎందుకు?

భారత దేశపు దేవాలయాలలో చేసే అత్యంత సామాన్య నివేదనలలో కొబ్బరికాయ ఒకటి. వివాహములు పండుగలు, కొత్త వాహనము, వంతెన, ఇల్లు మొదలగునవి వాడేటప్పుడు మరియు అన్ని శుభ సందర్భాలలోనూ కొబ్బరికాయ నివేదింపబడుతుంది. నీటితో నిండి మామిడి ఆకులతో అలంకరింపబడి దానిపై కొబ్బరికాయ ఉన్న కలశమును ముఖ్యమైన పూజా సందర్భాలలో మరియు ప్రత్యేక అతిథులను ఆహ్వానించడానికి ఉపయోగించబడుతుంది.

హోమము చేసే సమయములో ఇది హోమాగ్నికి ఆహుతిగా అర్పించ బడుతుంది. భగవంతుని మెప్పుకై, కోరికలు తీర్చుకొనడానికి కొబ్బరికాయ పగుల గొట్టబడి స్వామికి నైవేద్యముగా పెట్టబడుతుంది. తరువాత ప్రసాదముగా పంచ బడుతుంది.

ఒకానొకప్పుడు మనలోని జంతు ప్రవృత్తులను భగవంతునికి సమర్పించడానికి గుర్తుగా జంతుబలి అమలులో ఉండేది. నెమ్మదిగా ఆ ఆచారము తగ్గిపోయి దానికి బదులుగా కొబ్బరికాయ నివేదించ బడుతున్నది. ఎండిన కొబ్బరి కాయకు పై భాగములో పిలకకోసం మాత్రము వదిలి, మిగతా పీచు అంతా తీసి వెయ బడుతుంది. పైన ఉన్న గుర్తులు మానవుని తల మాదిరిగా కనిపిస్తాయి. పగిలిన కొబ్బరికాయ అహంకారము యొక్క విరుపును ప్రతిబింబింప చేస్తుంది. మనలోని అంతరంగ ప్రవృత్తులకు (వాసనలు) ప్రతీక ఐన లోపలి నీరు, మనసుకు ప్రతీక ఐన కొబ్బరితో సహా భగవంతునికి నివేదింప బడతాయి. భగవంతుని స్పర్శతో శుద్ధి అయిన మనసు ప్రసాదం గా వినియోగించ బడుతుంది.

దేవాలయాల్లోనూ ఇళ్ళల్లోను చేసే సంప్రదాయ బద్ధమైన పంచామృత అభిషేక ప్రక్రియలో విగ్రహం పైనుంచీ పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, గంధపు మిశ్రమము, విభూతి మొదలగు వాటితో అభిషేకము చేస్తారు. ప్రతి ఒక్క పదార్థము భక్తులకి ప్రయోజనాలను కల్గించే ఒక ప్రత్యేకమైన గుర్తింపు గలిగి ఉన్నది. సాధకునికి ఆధ్యాత్మిక ఉన్నతిని కలిగిస్తుందనే నమ్మకముతో కొబ్బరినీరు అభిషేక ప్రక్రియలలో వాడబడుతుంది.

కొబ్బరికాయ ఫలాపేక్ష రహిత సేవకి కూడా ప్రతీక. చెట్టు యొక్క ప్రతి భాగము - మ్రాను, ఆకులు, కాయ, పీచు మొదలైనవి ఇంటి కప్పు, చాపలు రుచికరమైన వంటకాలు, తైలము, సబ్బులు మొదలైన వాటి తయారీ లో ఉపయోగించ బడతాయి. ఇది భూమిలోనుంచి ఉప్పు నీటిని తీసికొని బలవర్ధకమైన నీటిగా మార్చుతుంది. ఈ నీరు ప్రత్యేకముగా రోగులకు ఉపయోగ పడుతుంది. ఇది ఎన్నో ఆయుర్వేద మందుల్లోనూ ఇతర ప్రత్యామ్నాయ వైద్య విధానాలలోను వాడబడుతుంది.

కొబ్బరి కాయకు పైనున్న మూడు కళ్ళ గుర్తుల్ని బట్టి త్రినేత్రుడైన పరమశివునికి ప్రతీకగా భావిస్తారు. అందువల్లనే మన కోరికలు తీర్చడానికి అది సాధనంగా పరిగణించ బడుతుంది. కొన్ని వైదిక ప్రక్రియలలో పరమ శివునికి మరియు జ్ఞానికి ప్రతీకగా కొబ్బరి కాయ కలశం పై పెట్టబడి అలంకరింపబడి, మాలాలంకృతము చేయబడి పూజింపబడుతుంది.

19. ఓంకారము పలుకుతాము - ఎందుకు?

భారత దేశములో ఎక్కువగా పలుకబడే శబ్ద చిహ్నము ఓంకారము. ఓంకారము - ధ్వనింపచేసే వారి శరీరము, మనసులపైన మరియు పరిసరాల పైన కూడా పరిపూర్ణ ప్రభావము ఉంటుంది. చాలా మంత్రాలు, వైదిక ప్రార్ధనలు ఓంకారముతో ఆరంభమవుతాయి. **ఓంహరిఃఓం** మొదలైన అభినందనలలో కూడా అది వాడబడుతుంది. దాని ఆకారము పూజింపబడుతుంది. దానిపై భావన చేయబడుతుంది. శుభసూచకంగా వాడబడుతుంది. ఇది మంత్రము మాదిరి గానే పదే పదే జపించ బడుతుంది.

ఓంకారము ఎందుకు చేస్తాము?

ఓం అనేది భగవంతుని యొక్క ప్రధమ నామము. అది అ, ఉ, మ అనే అక్షరాల కలయిక వలన ఏర్పడినది. స్వరస్నాయువుల నుండీ వెలువడే శబ్దము గొంతు యొక్క అడుగు భాగము నుంచీ 'అ'కారముగా ఆరంభమవుతుంది. పెదిమలు మూసుకొన్నప్పుడు 'మ'కారము తో శబ్దము ఆగిపోతుంది. మూడు అక్షరాలూ, మూడు అవస్థలు (జాగ్రత్, స్వప్న, సుషుప్తి), ముగ్గురు దేవతలు (బ్రహ్మ విష్ణు, మహేశ్వర), మూడు వేదాలు (ఋగ్, యజుర్, సామ), మూడు లోకాలు (భూః, భువః, సువః) మొదలైన వాటికి ప్రతీకలు. ఇవి అన్నీ మరియు వీటన్నింటికి ఆవల ఉన్నవాడు "భగవంతుడు" రెండు ఓంకార ధ్వనుల మధ్యనున్న నిశ్శబ్దము నిర్గుణ నిరాకార పరబ్రహ్మాన్ని సూచిస్తుంది. ఓంకారం ప్రణవము అని కూడా పిలువబడుతుంది ("దేని ద్వారా అయితే భగవంతుడు స్తుతించ బడతాడో" అని అర్ధము). వేదాలలోని సారమంతా "ఓం" అనే పవిత్రాక్షరములో నిక్షిప్తమైనది.

భగవంతుడు ఓంకారము మరియు 'అథ' అని పలికిన తరువాత ప్రపంచాన్ని సృష్టించడం ఆరంభించాడని చెప్ప బడుతుంది. కాబట్టే మనం తలపెట్టే ఏ పని ఆరంభము లోనయినా ఓంకార నాదము శుభ సూచకంగా పరిగణించ బడుతుంది.

ఓంకారనాదము చేసినప్పుడు వచ్చే శబ్దము గంట యొక్క ప్రతిధ్వనిని పోలి ఉండాలి

(ఓంoooooo...మ్ మ్) అది మనసుని శాంతింపచేసి పరిపూర్ణమైన సూక్ష్మమైన శబ్దంతో సంధింప జేస్తుంది. మానవులు దాని అర్థంపైన ధ్యానం చేసి ఆత్మానుభవాన్ని పొందుతారు.

ఓంకారం వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరు విధాలుగా వ్రాయ బడుతుంది. సర్వ సాధారణమైన ఓం ఆకారము గణేశుడికి చిహ్నముగా ఉంటుంది. పైన ఉన్న వంపు తల, క్రిందగా ఉన్న పెద్ద వంపు పొట్ట ప్రక్కగా ఉన్నది తొండము మరియు చుక్కతో ఉన్న అర్థచంద్రాకారము గణేశ భగవానుడి చేతిలో ఉన్న మోదకము.

ఈ విధముగా ఓంకారము జీవనగమ్యం, సాధన, ప్రపంచము దాని వెనుక ఉన్న సత్యము భౌతికము అభౌతికము సాకార-నిర్వికారములు అన్నింటిని తెలియబరుస్తుంది.

20. హారతి ఇస్తాము - ఎందుకు?

భగవంతుని ప్రార్ధన, పూజ లేదా భజన చివర్లో లేక గౌరవనీయులైన అతిథిని లేక మహాత్ముడిని ఆహ్వానించేటప్పుడు హారతి ఇస్తాము. ఇదెప్పుడూ ఘంటా నాదం తోను కొన్ని సమయములలో పాటలు ఇతర సంగీత వాయిద్యాలతోను, మరియు చప్పట్లతోను కలిసి ఉంటుంది.

ఇది పదహారు అంచెలుగా చేసే షోడశోపచార పూజా కార్యక్రమములోని ఒక భాగము. ఇది శుభసూచకమైన మంగళ నీరాజనముగా సూచింప బడుతుంది. భగవంతుని రూపాన్ని ప్రకాశింప చేయడానికి మనము కుడిచేతిలో వెలుగుతున్న దీపాన్ని పట్టుకొని వలయాకార దిశలో హారతి ఇచ్చేటప్పుడు దీపపు వెలుగులో ప్రకాశించే భగవంతుని సుందర రూపాన్ని ప్రతిభాగము విడిగాను మరియు పూర్తి రూపము శ్రద్ధగా గమనిస్తూ మనసులో గానీ పైకి గట్టిగా గానీ స్తోత్రాలు చదవడము చేస్తాము. ఆ సమయంలో మన ప్రార్ధనలో తపన మరియు భగవంతుని రూపములో ప్రత్యేకమైన సౌందర్యము మనకు అనుభవమవుతుంది. చివరలో ఆ వెలుగు పై మన చేతులనుంచి తరువాత నెమ్మదిగా మన కళ్ళకు తల పైభాగానికి అద్దుకొంటాము.

మనము చిన్నప్పటి నుంచీ ఈ ప్రక్రియను చూస్తున్నాము. అందులో పాల్గొంటున్నాము. మనము హారతి ఎందుకు ఇస్తామో తెలుసుకుందాము.

ఇష్టపూర్వకముగా భగవంతుడిని పూజించినప్పుడు, అభిషేకం చేసినప్పుడు, అలంకరించినప్పుడు, ఫలములు మరియు మధుర పదార్థములతో నివేదించినప్పుడు వైభవోపేతమైన ఆయన సుందర రూపాన్ని చూడగలము. దీపపు వెలుగుచే ప్రకాశవంతము గా కనపడుతున్న భగవంతుని ప్రతి భాగము మీద మనస్సు సంధించబడి అతని రమ్యమైన రూపముపై మనసు మెలకువతో నిశ్శబ్ద ధ్యానం చేస్తుంది. గానం చెయ్యడం చప్పట్లు చరచడం, గంట వాయించడం మొదలైనవన్నీ భగవంతుని దర్శనముతో కల్గిన సంతోషాన్ని మరియు శుభ సూచకాన్ని తెలుపుతాయి.

హారతి సాధారణంగా కర్పూరంతో ఇవ్వబడుతుంది. కర్పూరాన్ని వెలిగించినపుడు ఏ మాత్రము చాయలు మిగల్చకుండా తనకు తాను పూర్తిగా కాలిపోతుంది. కర్పూరం మన అంతర్గత ప్రవృత్తులకు (వాసనలు) ప్రతీక. జ్ఞానమనే అగ్నిచేత వెలిగించ బడినప్పుడు ఏదైతే భగవంతుడిని ప్రకాశింప చేస్తుందో ఆ జ్ఞానాగ్నే మన వాసనలు పూర్తిగా దగ్ధము చేసి భగవంతుడి నుంచి దూరము చేసే అహంకారాన్ని నిర్మూలిస్తుంది. కర్పూరము వెలుగుతున్నప్పుడు భగవంతుని విభూతిని శోభను తెలుపడానికి అది తనను తాను ఆహుతి చేసుకొంటూ కూడా చక్కని సువాసనని వెలువరిస్తుంది. మన ఆధ్యాత్మిక పురోభివృద్ధిలో మనము మన గురువునీ సంఘాన్నీ సేవించుకుంటూ అందరికి 'ప్రేమ' అనే 'సుగంధాన్ని' వ్యాపింపచేయడానికి మనస్పూర్తిగా మనలని మనము అర్పించుకోవాలి.

తరచూ మనము ప్రకాశింపచేసే భగవంతుణ్ణి చూడడానికి చాలాసేపు వేచి ఉంటాము. కానీ మనలోపల చూసుకోవడానికా అన్నట్లు హారతి ఇచ్చే అసలు సమయానికి అయాచితంగా కళ్ళు మూత పడతాయి. మన దేహము దేవుని ఆలయమనీ, లోపల దివ్యత్వాన్ని కలిగి ఉన్నామని ఈ విధంగా కళ్ళు మూయడం సూచిస్తుంది. పూజారి హారతి వెలుగులో భగవంతుడిని స్పష్టంగా చూపించినట్లుగానే, గురువు గారు కూడా జ్ఞానమనే వెలుగు సహాయముతో ప్రతి ఒక్కరికి లోనున్న దివ్యత్వాన్ని స్పష్టంగా తెలియపరుస్తారు. హారతి చివరిలో దానిపై చేతులుంచి తరువాత కళ్ళకి, తలపైభాగానికి అద్దుకోవడమంటే అర్ధము - భగవంతుడిని ప్రకాశింపజేసిన ఈ వెలుగు నా దృష్టిని వెలిగించుగాక! నా దృష్టి పవిత్రమగు గాక నా ఆలోచనలు ఉన్నతముగాను మంచివి గాను ఉండుగాక! అని ప్రార్ధించడం.

హారతికి వేదాన్తపరమైన అర్ధము; సూర్యుడు చంద్రుడు నక్షత్రాలు విద్యుత్ మరియు అగ్ని - ఇవి వెలుగుకి సహజమైన మూల కారణములు. సృష్టిలోని అద్భుతమైన అపూర్వమైన వాటన్నింటికి భగవంతుడు ఆధారము. ఆయన కారణముగానే మిగిలినవి ఏవైనా ఉండటమూ మరియు ప్రకాశించడమూ జరుగుతుంది. హారతి వెలుగులో భగవంతుడిని ప్రకాశింప చేసినప్పుడు మన

దృష్టిని అన్ని వెలుగులకు మూల కారణము మరియు జ్ఞానాన్ని జీవితాన్ని సూచించే పరమాత్మ వైపు మళ్లిస్తాము.

సూర్యుడు బుద్ధికి, చంద్రుడు మనసుకి, అగ్ని వాక్కుకీ అధిదేవతలు. భగవంతుడు వీటన్నింటిని వెలిగించే అత్యున్నతమైన చైతన్యము. అతను లేకుండా బుద్ధి ఆలోచించలేదు. మనసు భావింపలేదు. నాలుక మాట్లాడ లేదు. మనసు బుద్ధి మరియు వాక్కులకీ వెనుక ఉన్నదీ భగవంతుడే. ఈ పరిమితమైన ఉపకరణాలు ఆ అపరిమితమైన భగవంతుడిని ఏ విధముగా ప్రకాశింపజేయగలవు. అందుకే హారతి ఇచ్చేటప్పుడు మనము ఈ క్రింది విధముగా స్తుతిస్తాము.

న తత్ర సూర్యోభాతి న చంద్ర తారకం
నేమా విద్యుతో భాంతి కుతొ2 యమగ్నిః
తమేవ భాంత మనుభాతి సర్వం
తస్యభాసా సర్వమిదం విభాతి

సూర్యుడు ప్రకాశించని చోట, చంద్రుడు, నక్షత్రాలు, విద్యుత్ ప్రకాశించని చోట, ఆయన ఉన్నాడు. మరి ఈ చిన్ని జ్యోతి (నా చేతిలో ఉన్న) ఏమి చేయగలదు? ప్రతిదీ అతని వలననే ప్రకాశిస్తాయి. అతని వెలుగు వలన మాత్రమె మనమంతా ప్రకాశింప బడుతున్నాము.